శ్రీరస్తు

విష్ణు చిత్తీయము

అను నామాంతరముగల

ఆముక్తమాల్యద

బ్రహ్మశ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులగారి

(రుచి సమానంబగు వ్యాఖ్య, ప్రతిపదటీకా తాత్పర్య సహితము)

ప్రకాశకులు

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

26, రామానుజ అయ్యర్ వీధి, చెన్నై - 600 021

ఫోన్: 25951378

*****

8, హస్తినాపురం (దక్షిణం) నాగార్జున సాగర్ రోడ్డు,

వైశాలీ నగర్ పోస్టు, హైదరాబాదు - 500 079.

ఫోన్: 040-24093427

సర్వహక్కులు ప్రకాశకులవి

Rs. 250.00

శ్రీరస్తు

విష్ణుచిత్తీయము

అను నామాంతరముగల

ఆముక్తమాల్యద

సవ్యాఖ్యానము

వావిళ్ల రామస్వామి శాస్త్రులుగారి టీకాసహితము

ప్రకాశకులు

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్

26, రామానుజ అయ్యర్ వీధి, చెన్నై - 600 021.

Phone : 044-25951378

*****

ప్రాంతీయ కార్యాలయము

8 హస్తినాపురం (దక్షిణం), నాగార్జునసాగర్ రోడ్డు

వైశాలీనగర్ పోస్టు, హైదరాబాదు - 500 079

Phone : 040-24093427

సర్వహక్కులు ప్రకాశకులవి

పూర్వ ముద్రణలు

తొలి ముద్రణ	- 1869	ఐదవ ముద్రణ	- 1930
రెండవ ముద్రణ	- 1886	ఆరవ ముద్రణ	- 1954
మూడవ ముద్రణ	- 1909	ఏడవ ముద్రణ	- 1962
నాల్గవ ముద్రణ	- 1924	ఎనిమిదవ ముద్రణ	- 1969

తొమ్మిదవ ముద్రణ - 2004

894-827132
C-25705

Printed and Published by
ALLADI SWAMINATHAN
Advocate & Managing Trustee
V.V.S. Public Trust
For V. Ramaswamy Sastrulu & Sons
26, Ramanuja Iyer Street, Chennai - 600 021.
Phone : 044-25951378

*****

A.C. No. 95832
500 044.

Regional Office :
8, Hasthinapuram South Colony
Nagarjuna Sagar Road, Vaishali Nagar P.O.
Hyderabad - 500 079.
Phone : 040-24093427

*****

శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులు
(1826-1891)

వేదపండితులు, సంస్కృతాంధ్రభాషలలో నిష్ణాతులు, సంస్కృతాంధ్ర గ్రంథ ప్రచురణ రంగంలో మార్గదర్శి, వావిళ్ల ప్రచురణ సంస్థ వ్యవస్థాపకులు యశఃకాయులైన కీ.శే. వావిళ్ల రామస్వామి శాస్త్రులుగారు 1826 సం. నెల్లూరు జిల్లా, కోవూరు తాలూకాలోని వావిళ్ల గ్రామంలో జన్మించారు. దక్షిణామూర్తి ఉపాసకులైన శాస్త్రిగారు తన పాండితీప్రకర్షతో ఆనాటి శృంగేరి పీఠాధిపతులైన జగద్గురువులు శ్రీశ్రీశ్రీ ఉగ్రనరసింహభారతీ మహాస్వాముల (పరంపరలోని 32వ వారు) వారి అనుగ్రహాశీస్సులతో "ఆదిసరస్వతీ నిలయ" ముద్రాక్షరశాలను మద్రాసులో స్థాపించి గ్రంథప్రచురణ కార్యక్రమంతో బాటు మేటికావ్యాలైన ఆముక్తమాల్యద, మనుచరిత్రలకు 'రుచి' అనుపేర వ్యాఖ్యలతోబాటు, ద్వాదశోపనిషత్తులను ఆంధ్రీకరించారు. శతాధిక తాళపత్ర సంస్కృతాంధ్ర గ్రంథాలను సేకరించి వాటిని పరిష్కరించి, శుద్ధప్రతులను తయారు చేసుకొని వాటిని తెలుగులిపిలో వ్యాఖ్యాన, అర్థతాత్పర్యాదులతో ప్రచురించారు.

'దేవనాగరి' లిపి జ్ఞానంలేకుండానే సంస్కృత కావ్యములను తెలుగులిపిలోనే పఠించి సంస్కృత భాషలో మేటి పండితులు తయారగుటకు వారు గావించిన ప్రచురణసేవ అద్వితీయము.

ముద్రణాసౌకర్యములు లేని ఆ దినాలలో వ్యయప్రయాసలకోర్చి వారు గావించిన అమోఘ సాహిత్యసేవను అభినందిస్తూ తెలుగుభాషకు వెలుగు ప్రసారించిన సి.పి. బ్రౌన్ 'చేతివ్రాత పుస్తకములు చదువుకునే దినాలలో వావిళ్ల రామస్వామి శాస్త్రులువారు ముద్రణాలయమును స్థాపించి చదువరుల కష్టముల నివర్తిచేసిరి' అని ప్రశంసించారు.

ప్రజ్ఞామూర్తియైన వావిళ్ల రామస్వామి శాస్త్రులుగారు 1891 సం.లో స్వర్గస్తులైనప్పటికీ వారు స్థాపించిన వావిళ్ల ప్రచురణ సంస్థ నేటికీ సజీవమై వారి కృషిని, సేవను కొనసాగించుచున్న ప్రస్తుత కార్యనిర్వాహకులు అభినందనీయులు.

భాషోద్ధారక కళాప్రపూర్ణ
శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులు
(1884-1956)

తండ్రిగారైన కీ.శే. వావిళ్ల రామస్వామి శాస్త్రులు 1854 సం.లో స్థాపించిన ముద్రాశాల, ప్రచురణ సంస్థల నిర్వాహక బాధ్యతలను యుక్తప్రాయంలోనే స్వీకరించి వావిళ్ల ప్రచురణ సంస్థ ఎనలేని ఖ్యాతి గడించుటకు మూలకారకులు వారి ఏకైక కుమారులైన వేంకటేశ్వర శాస్త్రులుగారే. తండ్రిచే ప్రారంభించబడి, దాదాపు నాలుగు దశాబ్దముల కాలము సాగిన వావిళ్ల ప్రచురణ సంస్థకు సుస్థిరతతోబాటు నలుదెసలా విస్తరింపజేసి, వేయింటికిపైగా వివిధ ప్రామాణిక ప్రచురణలను ప్రచురించి సంస్కృతాంధ్ర భాషలకు జీవితాంతంవరకు అమోఘమైన సేవచేసిన ధన్యజీవి వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు. దాదాపు ఆరు దశాబ్దములకు పైగా అవిరళకృషితో వెలుగుచూడని అనేక ఉద్గ్రంథాలను పఠితలకు అందజేసి పండితలోకపు అభిమానమును, కృతజ్ఞతలను చూరగొన్నారు.

విస్తృత గ్రంథప్రచురణలతోబాటు, త్రిలింగ (తెలుగు వార పత్రిక), Federated India (English Monthly), బాలవినోదిని (తమిళంలో పిల్లల మాస పత్రిక) లను కూడా తన సంపాదకత్వంలో వెలువరించారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకై ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు తదితర నాయకులందరూ తనకు సన్నిహితులైనందున వారికి చేదోడు వాదోడుగావుంటూ తనవంతు కృషిచేశారు. త్రిలింగపత్రిక రజతోత్సవ సందర్భంలో వారికి ఆత్మీయులు, అభిమానులు సమర్పించిన దాదాపు వేయిపుటల సన్మాన సంపుటమువంటి సంపుటము నేటి వరకు ఎచ్చటను కానరాదనడంలో ఏలాంటి అతిశయోక్తిలేదు. అందులోని వివిధవ్యాసాలు పండితలోకంచే నేటికీ కొనియాడబడుచున్నది. వారు గావించిన అపూర్వ భాషాసేవకు గుర్తింపుగా కడప మిత్రమండలివారిచే భాషోద్ధారక, ఆంధ్ర విశ్వవిద్యాలయంవారిచే కళాప్రపూర్ణ బిరుదులతో సత్కరింపబడ్డారు.

శ్రీకృష్ణదేవరాయలు

శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులు

శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులు

ఆముక్తమాల్యదాకర్తృత్వము

(శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి)

నియతికృత నియమరహితాం, హ్లాదైకమయీ మనన్యపరతంత్రామ్
నవరసరుచిరాం నిర్మితి, మాదధతీ భారతీ కవే ర్జయతి. (కావ్యప్రకాశిక.)

ఆముక్తమాల్యద యాంధ్రప్రబంధరత్నములలో నొకటి. ఈ పేరుగాని యీ కథగాని భారతాది ప్రసిద్ధగ్రంథములలోనిది కాదు. ద్రావిడ ప్రబంధములనుండి గ్రహింపఁబడినది. ద్రావిడదేశమున వైష్ణవమత ప్రసిద్ధులగు పన్నిద్దరాళువార్లలో నొకఁడగు విష్ణుచిత్తుని (పెరియాళ్వా రని వీరి కొకనామము గలదు.) పెంపుడు కూఁతురు గోదాదేవి యను పేరు గలది. ఆమెయుఁ బై యాళువారులలో నొకతె. ఆళ్వారులలో స్త్రీ యీమెయే. శ్రీహరి కర్పింప విష్ణుచిత్తుఁడు సిద్ధముగావించి యుంచిన పుష్పమాలికల నీమెముందు ధరించి యథాప్రకార ముంచుచుండునది. కావున ఆముక్తమాల్యద యను నామాంతరము కలిగెను. ఆముక్త=ధరించి విడిచిన, మాల్య=పూలదండలను, ద= ఇచ్చునది అని సమాసార్థము.

శ్లో. ఆముక్తమాలికా యేన విష్ణవే గోదయార్పితా
ఆముక్తమాల్యదా నామ తస్యాస్తే నాభవద్భువి.

అని ప్రపన్నామృతమున గోదాకల్యాణమందు ఈమె శ్రీరంగనాయకునిఁ బెండ్లాడిన కథ గలదు. అదియే యీ ప్రబంధమున ౧-౧౪ 'ఏ మునుదాల్చిన మాల్యమిచ్చునప్పిన్నది రంగమందయిన పెండిలి' కథ యీ ప్రబంధమందలి ప్రధాన కథ. దీనికి విష్ణుచిత్తీయ మని నామాంతరము కలదు. విష్ణుచిత్తుఁడు పాండ్యరాజు సభలో వైష్ణవమతస్థాపనము చేయుటయు, తనకూఁతు నాముక్తమాల్యదను శ్రీరంగనాయకున కిచ్చి పెండ్లిచేయుటయుఁ కలదు. కాన విష్ణుచిత్తీయ మని సుప్రసిద్ధమయ్యెను.

ఇది నవరసభరితము. నవ్య భవ్య కల్పనా పరిపూర్ణము. ఇందలి గాథలును సిద్ధాంతములును ఐహిక పారమార్థిక సుఖసాధన బోధకములు. మహాకావ్యలక్షణ లక్షితమగు నీ ప్రబంధమందలి కథయుఁ రీతియుఁ, నీతియుఁ మున్నగునవి తెలుపుటకుముందు కవినామము తెలుపుట యావశ్యకము. మంత్ర పఠనమునకు ముందు మంత్రకర్త నామ ముచ్చరించుట మన సంప్రదాయము కదా. అది కాక కవి స్వరూప స్వభావములు, స్థితిగతులు కావ్యమునఁ గొంతవఱకుఁ బ్రతిఫలించుచుండును ఆ స్థితిగతులు తెలిసినవారికి

దా కావ్యములోని యంశము సరిగా బోధపడినట్లుగా నితరులకు బోధపడుట కష్టము అవి తెలిసినవానికిఁ గలిగిన యానందము తెలియనివానికిఁ గలుగదు. కావుననేకదా కవిస్వరూప స్వభావాదులు స్పష్టముగాఁ దెలియనపుడు కావ్యమునుబట్టి యూహ చేయుదురు. భావనాప్రపంచసృష్టి చేయు ప్రతిభాశాలి తనకుఁ బ్రత్యక్షానుభవము లేని విషయములను గూడ సూక్ష్మబుద్ధి విశేషమున గ్రహించి కల్పింపఁగలఁడు. కాని స్వస్వభావానుసరణమును పరిసరవస్తు దర్శనలబ్ధ సంస్కారగ్రహణమును మానలేఁడు. కావునఁ గవి యెవరో తెలిసికొనుట ముఖ్యము.

ఈ ప్రబంధము రచించిన కవి సకలవిద్యాపారంగతుఁడయి స్వీయ మేధా సంపాదితాప్రతిహత సామర్థ్యములో, సర్వతంత్ర స్వాతంత్ర్యములో విద్యానగర సామ్రాజ్యమును, విద్వత్కవితా సామ్రాజ్యమును నేలిన శ్రీకృష్ణదేవరాయలు. కథా కల్పనమందును కవితారీతియందును రాయలరీతి యెట్లు మెఱయునో ముందు గ్రహింపఁదగును.

కవి యగుటయే గాక ఈకవి తాను మహారాజయి కవులచేఁ గృతులందినవాఁడు. సంస్కృతభాషలో భోజునివలెనే యాంధ్రమున నితఁడు కవియుఁ గవిపోషకుఁడును. ఈతని విద్యావిషయక కవితా విషయకములను గుఱించి చెప్పిన వాక్యములును, ఈ గ్రంథమందున్న వాక్యములును పరిశీలింతము.

పెద్దన మనుచరిత్రలో:—

1— 45 "కవితాస్త్రీలోలునకున్"
1— 81 "నిరంకుశప్రతికలప్రౌఢిప్రియంభావుకా"
2— 79 "నిస్తంద్రప్రతిభాసుధీమత"
2— 1 "విద్యాఖేలనభోజ, సుధీలేఖద్రుమ"
4—120 "ద్రాఘీయః ప్రతిభా విచక్షణత్రయీ ధర్మైకసంరక్షణా"
5—105 "భోజక్షమాపతి విద్యాపరిపాక"

పారిజాతాపహరణమున ముక్కుతిమ్మకవి.

— 26 "మేధావదసాధారణబోధాకరహృదయునకు"
1— 29 "వేదార్థ స్థాపన ప్రవీణునకు"
1— 33 "సరసకళా ధోరణికి"
2—103 "ధీనిబంధన విధా సంక్రందనాచార్య"
4— 1 "కవితా ప్రావీణ్య ఫణీశ"

శ్రీకృష్ణదేవరాయలవారు పట్టాభిషేకసమయమున విరూపాక్షస్వామికి సమర్పించిన భూదానమును తెలుపు శాసనమున:—

"గజపతిగజకూటపాకవేన విదిత నానావికవేన వదన విజితాంభోజేన భోజేనాపరేణ కావ్యనాటకాలంకార మర్మజ్ఞేన ధర్మజ్ఞేన."

ఇంక జాంబవతీ పరిణయ మను సంస్కృతనాటకము అముద్రిత మొకటి తంజావూరి పుస్తక భాండాగారమున నున్నది.

అందు "సకలకళా భోజరాజ విభవమూరురాయరగండ శ్రీ కృష్ణదేవ మహారాయ విరచితం జాంబవతీ కల్యాణ నాటకమ్ పంచమాంకమ్ సమాప్తమ్" అని యున్నది.

ఆము.—"సాహితీ సమరాంగణ సార్వభౌమ."

పై వానివలన మేధావి, ప్రతిభాశాలి, సర్వవిద్యలయందును నిరూఢపాండిత్యము గలవాఁడు, కావ్యాలంకారమర్మజ్ఞుఁడు, కవి, లోకప్రసిద్ధిగల భోజునంతవాఁడు అని ధ్రువపడుచున్నది.

ఇంకను ఈ గ్రంథారంభమందు—౧-౧౨. "కలఁ దదంధ్ర జలజాక్షుఁ డిట్లని యానతిచ్చె."

సీ. పలికి తుత్ప్రేక్షోపమలు జాతి పెంపెక్క, రసికు లౌ నన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్య సేవధిగాఁగఁ జె, ప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతి పురాణోపసంహిత లేర్చి కూర్చితి, సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘుచ్ఛటలు విచ్చుగ రచించితి సూక్తి, నైపుణి జ్ఞాన చింతామణి కృతి
తే. మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య
రచన మెప్పించికొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియము గాఁగ.

కలలో ఆంధ్రవిష్ణుని యానతిచ్చిన విషయము తన యాస్థానపండితులలో వచింపఁగా వారు స్వప్నఫలమును, రాయల వంశవర్ణనమును, రాయల ప్రాభవమును ప్రశంసించి,

1-44. "సాహితీ సమరాంగణ సార్వభౌమ
కృష్ణరాయేంద్ర కృతి వినిర్మింపు" మనిరి.

అనినట్లు రచింపఁబడెను. కావున విద్వదనుమతిని కృష్ణరాయలు కృతి రచించి రని స్పష్టమగుచున్నది.

ఇదిగాక ప్రత్యాశ్వాసమందును సంస్కృతభాషలో శ్రీహర్షుఁడు నైషధమందు ప్రతిసర్గాంతమందును రచించినట్లు పద్యరూపమునఁ దన పేరును, ఆశ్వాససంఖ్యయు చెప్పికొని యున్నాఁడు—

1. "కృష్ణరాయవసుధాధ్యక్షోదితాముక్తమాల్యద".

2. "కృష్ణరాయమహీభృన్నామాస్య దాముక్తమాల్యద".

3. "కృష్ణరాయనృపసంజ్ఞాస్య త్కృతాముక్తమాల్యద".

4. " " "

5. "కృష్ణరాయమహీభృత్సంజ్ఞాస్య దాముక్తమాల్యద".

6. " " "

ఇదివఱ కాఱుమారులె యనుకొన్నాము. ప్రకృతము ఏడుమాఱు లని వేదము వేంకటరాయశాస్త్రిగారు వ్రాసియున్నారు.

7. "కృష్ణరాయమహీజాన్యుత్పాదితాముక్తమాల్యద".

మా ప్రతిలో ఆఱు ఆశ్వాసములుగ ప్రకటించినను, అనుబంధముగా నాఱవ యాశ్వాసాంత పద్యములు, ఏడవ యాశ్వాసాంత పద్యము నున్నవి. వ్రాత ప్రతిలో కృష్ణరాయ రచిత మని కంఠోక్తిగాఁ జెప్పినవి యుండఁగా సందేహింపఁ బనిలేదు. ఒకచో వాక్యబద్ధమో, ఛందోబద్ధమో కనఁబడినపుడు, ఇతరమయిన బాధకప్రమాణము దొరకువఱకు నది విశ్వసింపకపోవుటకుఁ గారణము గనఁబడదు. గ్రంథములయం దీ చందమున నుండఁగా కొంద ఱుందురు గదా.

"కృష్ణదేవరాయలు విద్యాపండితుఁడును, కావ్యాలంకార మర్మజ్ఞుఁడును నని యొప్పుకొందును. కాని "కవి" యని యెక్కడను చెప్పలేదుగాన 'కవి' యని యంగీకరింప" మందురు.

'కవితాస్త్రీ లోలునకుఁ' అని పెద్దనగా రనలేదా యనఁగా, దాని కీ క్రింది రీతిని వారు సమాధానము చెప్పెదరు.

కవితాస్త్రీకి కవి తండ్రిగాని వల్లభుఁడు గాఁడు. రాయఁడు కవితారసజ్ఞుఁడు గాని కవి గాఁ డని యిదియే సూచించుచున్నది అని వారి సమాధానము.

బాగుబాగు—క. "కవితాకన్యకు నలుగురు, కవి జనకుఁడు బట్టు దాది గణుతింపంగా
నవరసరసికుఁడు పెనిమిటి, యవివేకియ తోడఁబుట్టు వనవేమనృపా."

అను నొకచాటు వున్నది. దాని ననుసరించి య ట్లని రేమో ? అది కృతిపరము. అనఁగా రచితగ్రంథపరము. కవి కర్తగాన జనకుఁడు. అది కన్యగా నిరూపింపఁబడినది. దానిని బరులకిచ్చుట అతఁడు కృతికన్యాపతి యగుటయు రూపింపఁబడినది. ఆ భావము తోనే "కావ్యకన్యకఁ గూళల కిచ్చి" అను భావము కలిగినది.

ఇట కవిత యన కవనశక్తి, సరస్వతీరూపిణి. దానిని స్త్రీగా నిరూపించినారు. అది వరించుట యనఁగా వశ్య యగుట. ఆ శక్తి యెవనిని వరించు ననఁగా కావ్యాలంకరణజ్ఞుని వరించును. వానికి వశమయి యుండును. ఇతరులను కానివానితోఁ

జూచును. ఇదియే సుప్రసిద్ధము—బిల్హణీయమున కవితాకన్య యెవరిని వరించు నను సందర్భమున—

శ్లో. నైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం నభ్రాతరం తార్కికం
దూరాత్ సంకుచితైవ గచ్ఛతి పున శ్చణ్డాలవచ్ఛాన్దసాత్
మీమాంసానిపుణం నపుంసక మితి జ్ఞాత్వా నిరస్తాదరా
కావ్యాలంకరణజ్ఞ మేత్య కవితాకన్యా వృణీతే స్వయమ్.

అని యున్నది—ఈ భావములోనే, భవభూతి యుత్తరరామచరిత్రలో 'యం బ్రహ్మాణ మియం దేవీ వాగ్వశ్యే వానువర్తతే' అని యనుట యెఱిఁగినదే కదా ?

"వాణినారాణి" యన్న పిల్లలమఱ్ఱి వాక్యములోని భావ మేమి ? వాని యెట్టిది ? కవిత యనఁగా కవనశక్తి కవికి వశ్య యగు భార్యవంటిది ? అను భావము ఆంధ్రగీర్వాణ భాషలలో సుప్రసిద్ధమేకదా. కవిత కావ్యాలంకారమర్మజ్ఞుని వరించును. కృష్ణరాయలవారు కావ్యాలంకార మర్మజ్ఞుఁ డని శాసనసిద్ధము. అది యంగీకరించినపుడు వేఱుగాఁ గవి యని చెప్పలే దనుట భావ్యముకాదు. కవితా 'స్త్రీలోలునకున్' అను చోట కవితకు తండ్రి యని సూచిత మనుట సరసము గాదు.

అది యటుండనిచ్చి తిమ్మకవిగారు 'కవితాప్రావీణ్యఫణీశ' యన్నారే అది చాలదా? యన్నవారి సమాధాన మీ క్రిందిరీతిని జెప్పుదురు. పైపెచ్చు తిమ్మకవిగారు రాయని ఏకచ్ఛత్రిత సర్వభూవలయుం డనినారు. రాయలు అంతవాఁడు కాఁడే. ఢిల్లీశతురుష్కాంగ్లేయు లుండఁగా వాని కావిశేషణము ఎట్లు చెల్లును ? అట్టిదే యిది యందురు. పోనిండు. వాదము నంగీకరింతము.

ఏకచ్ఛత్రిత సర్వభూవలయుం డన్నమాటలోఁ గొంత యతిశయోక్తి యున్నది గాని కేవలాసత్య మనఁజాలము. అది శిలాక్షరసిద్ధ మగుటచే సర్వానృతముకాదు. అట్లే కవితాప్రావీణ్యఫణీశుఁ డనుదానిలోఁ గొంత యతిశయోక్తి యున్నది. ఫణీశుఁ డంత వాఁడు కాఁడు. కవితాప్రావీణ్యము గలవాఁడే యనవచ్చు. లేదా ప్రావీణ్యముగూడ తీసివేయుఁడు. 'కవి' యనియైనఁ జెప్పనొప్పరాదా ? కవి యని యొప్పకతీఱదు.

తెనుఁగు కవిత్వమున కిదియే యాధారముగాని సంస్కృతమునఁ గవి యని జాంబవతీ పరిణయము తెలుపుచున్నది.

ఆముక్తమాల్యద పెద్దన రచితమని తెలుపు పద్యములు కొన్ని యున్నవందురు. వాని ప్రామాణ్యము పరిశీలింపుఁడు ఈ క్రింది పద్యముల విషయమును చర్చ పూర్వమే జరిగినది. శ్రీ రామమూర్తి పంతులుగారి 'కవి జీవితములు' అను గ్రంథములో నున్నది. అది భాషాదృష్టిలో చర్వితచర్వణమే యైనను నేఁటివారుగూడ దానిలో నొక పద్యము ప్రమాణముగా గ్రహించుచున్నారు గాన కొంచెము పరిశీలింపవలసినదే.

I సీ. కృష్ణరాయలపేరు నిడి నీవు రచియించి, తివి తొల్త విష్ణుచిత్తీయ మనఁగఁ
గాశిన్యమర్థంబు గ్రాహ్యంబుగాదు సాధారణుల కని భూధవుఁడు పలుకఁ
దరువాత మనుచరిత్రము నొనరించి తు,త్తమ కావ్యము మహోద్భుతముగఁ బిదపఁ
బెక్కు కావ్యములు పెంపెక్కఁగా విరచించి, మంటివి రాజసన్మానమునకు
తే. భంగమొందిన యలరామలింగముఖులు, సాటిరాఁగలవారె నీతోటి సార
యాంధ్రకవితాపితామహ యల్లసాని, పెద్దనార్య విశేష వివేకధుర్య.

II సీ. ప్రౌఢ దీర్ఘసమాసపదములుగూర్చి శ్రీ, నాథుండు గూలార్చె నైషధంబు
దాని తల్లిగ నల్లసానిపెద్దన తేల్చె, ముదిమది తప్పి యాముక్తమాల్య
దూహించి తెలియరాకుండ సూరపరాజు, భ్రమః గళాపూర్ణోదయము రచించె
నతిశ్లేషశబ్దవాగాడంబరం బొప్పఁ, బస ఘటించెను మూర్తి వసుచరిత్ర
తే. నిట్టి కవులకు నేను వాకట్టుకొలుపఁ, జెప్పినాఁడ మదీయవైచిత్రి మెఱయఁ
బాండురంగవిజయమును బటిమదనర, విష్ణువర్ధిష్ణుఁడను రామకృష్ణకవిని.

ఈ పద్యమున, ఆముక్తమాల్యదూహించి యనుచోట, ఆముక్తమాల్యమూహించి అని పఠించిరి. ఆముక్తమాల్యమన్నచోట, నామైకదేశే నామగ్రహణ మను న్యాయము పట్టించి, ఆముక్తమాల్యమన్న ఆముక్తమాల్యద యని అర్థము చెప్పిరి. లేకున్నచో, తత్సమాకార సంధిదోషము తగిలిపోవు నని భయము కాఁబోలు. అది శ్లేష యనుచో ఛందోభంగభయమున అది భిన్నపద మన్నారు ఇవియే పూర్వులకును, నవీనులకును పాఠమందుఁ గల భేదము.

కొంద ఱిది పాండురంగవిజయములోనిపద్య మన్నారు. కొందఱు పాండురంగ విజయము—కళవిహీనమువంటిది, పాండురంగ మాహాత్మ్యమునకే నామాంతర మని కొంద ఱనుచున్నారు. ఆ పాండురంగ మాహాత్మ్యములో నీ పద్యము లేనే లేదు. పాండురంగవిజయములోని దనిన యుక్తము కా దని కాఁబోలు పాండురంగకవి సీసము అందురు కొందఱు. ఏమైనను ఇదియొక చాటు వనక తప్పదు. పై చాటువులో ఆముక్తమాల్యద ముందు రచింపబడినట్లున్నది—ఏది ప్రమాణము. పై పద్య మెవరు రచించినారో తెలియదుగానఁ బ్రమాణముకాదని కొంద ఱందురు. రెండవది పాండురంగకవి కర్తృక మని ప్రమాణార్హ మనియు వారిభావ మగును.

ఇది గ్రంథమందు లేదు. ప్రమాణార్హ మె ట్లగును? వాదార్థము కొంత యవకాశమిచ్చి పద్యప్రామాణ్యము విచారింతము.

ఈ పద్యమందు శ్రీనాథుని, పెద్దనను, పింగళి సూరన్నను, మూర్తికవిని పేర్కొని వారి వాకట్టుటకై రామలింగకవి పాండురంగవిజయము చేసె నని యున్నది.

మూర్తికవి పింగళి సూరన్న తర్వాత రచించిన పద్య మనవలయును. సవిమర్శముగా కవుల చరిత్రము రచించిన వీరేశలింగము పంతులుగారు పింగళి సూరన మూర్తి కవులు పెద్దనసాటివారు కానేకా రన్నారు. ఆ విషయమంతయు నిట వ్రాయుట గ్రంథ విస్తరభీతిచే మానినాను. అది చిత్తగించినఁ జాలునుగదా? వారితర్వాత రచించిన పద్యమునకుఁ గర్త యనుకొను రామకృష్ణకవి పెద్దనకాలమువాఁడు కాఁ డని వీరేశలింగము పంతులుగారు ప్రమాణములు చూపిరి. నేటి విమర్శకులు ఒకవేళ రామకృష్ణకవిని పెద్దన కాలమువాఁ డన వీలులేదు. అప్పు డీ పద్యము రామకృష్ణ విరచితము గాదనవలయును. ఇది నమ్మినచో పెద్దన, పింగళి సూరన, వసుచరిత్రకర్త మూర్తికవి ముగ్గురును, వారి గ్రంథములు రచించినతరువాత వారి వాకట్టుటకు పాండురంగకృతి చేసినాఁ డనవలయును. కవికాల నిర్ణయకర్తల మతమునకు అది విరుద్ధము. వారందఱు నొకనాఁడే యున్నారందురేని రాజాదరణములేని రామలింగకవి యసూయతోఁ జెప్పినపద్య మిది యనవచ్చును. రాజు చేసిన మహాకార్యము పరులయం దారోపించుటకే పన్నాగము పన్నినాఁ డందురు కొందఱు. మహారాజులు చేసిన కార్యములు మహాకార్యములు లేవనుటయు, ఉన్నవని చెప్పవలసినచోఁ బరులపనియు చెప్పుట యిఁక సిద్ధము. ఏమైన నసూయాగ్రస్తునిపద్యము గ్రాహ్యము కా దందురు. పాండురంగకృతి నంతవారి వాకట్టుట కర్హమైనది కా దని తలచెదను.

మఱియొక చాటు వున్నది—

క. "కవి యల్లసానిపెద్దన, కవి తిక్కనసోమయాజి గణుతింపంగా
కవి నేను రామకృష్ణుఁడ, కవి యను శబ్దంబు నీటికాకికి లేదే."

ఈ పద్యములో రామకృష్ణుని పేరున్నదే. ఈరీతిని పెద్దనయందు గౌరవము చూపినాఁడు. పెద్దన ముది మదిదప్పి చేసినాఁడనియు వానిని వాకట్టుటకు పాండురంగ విజయము చేసినాఁడ ననియు ననువా? ఈ చాటువులు నమ్మెదమనుట చాటూక్తికాదు.

శ్రీ కృష్ణరాయల కర్వాచీనుఁడగు అప్పకవి విష్ణుచిత్తీయ మాంధ్రకవితా పితామహుఁడు రచించె నన్నాఁడు. అది చాలదా యందురు. అది పరిశీలింతము.
అప్పకవీయము—౧-౨౩౦.

గ్రామ్యమైన నాంధ్రకవులు సంకేతిత, సుప్రసిద్ధ మనుచు సూత్రమునను
గలిమిఁ బూర్వసుకవి కావ్యోక్తములు ప్రసిద్ధంబులైనఁ గూర్పఁ దలఁతురెపుడు.

వ. అది యెట్లనినఁ గనియె ననవలసిన భూతార్థక్రియాపదైకవచనమునందు వర్ణలోపముచేసి "కనెనఁట" అని గ్రామ్యపదముగా వాగనుశాసనులు ప్రయోగించిరిగాన నది సాధకము చేసికొని యాంధ్రకవితాపితామహుఁడు కొనియె ననుటకుఁ గొనె నని చెప్పె నవి యెవ్వి యనిన.

ఆదిపర్వమునందు—

క. వనకన్యక యఁట నే నఁట, వనమున గాంధర్వమున వివాహంబఁట నం

దనుఁ గనెనట మఱచితివఁట, వినఁగూడునె యిట్టిభంగి విపరీతోక్తుల్.

విష్ణుచిత్తీయమునందు—

ఉ. ఘూని ముకుందునాజ్ఞఁ గనుబొమ్మనెఁ గాంచి యజాండభాండముల్

వానను మీఁదఁబోవ నదువంగొనె.........................

పై యప్పకవి గ్రంథభాగమునందు కనియె ననుటకు కనె అను గ్రామ్యరూపము వాగనుశాసనులు ప్రయోగించి రనుట ప్రమాదము. ఆదిపర్వములోని దని యప్పకవి యుదాహరించిన పద్యము పినవీరభద్రుని శకుంతలా పరిణయములోనిది. ౪ ఆ. ౧౧౪-వ పద్యము. అప్పటి భారతము ప్రాఁతప్రతిలో నున్నదేమో. వీరభద్రుఁడు చౌర్యము చేసెనేమో యని కొందఱకుఁ దోఁచుట తప్పుగాదు. కాని భారతములో నీ రీతి పద్య ముండుట కవకాశము లేదు.

భార—ఆది. 4 - 99—

క. ఏనెట నీవెట సుతుఁడెట, ఏనెన్నడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నుఁ గా

మానిను లసత్యవచనలు, నా నిట్టు లసత్యభాషణం బుచితంబే—

అను పద్యము శకుంతలతోఁ జెప్పినట్లున్నది.

శకుంతలా పరిణయములో మునులతోఁ జెప్పినట్లున్నది.

ఇది భారతమున నిముడదు. అంతే కాదు. అఁట యను పదము వాగనుశాసనుని ప్రయోగమున నుండనే యుండదు. ఆ భాషాతత్త్వ మెఱుఁగక యట్లు భ్రాంతిపడుట సంభవించినది. అహోబలపతి అప్పకవి ననుసరించి ప్రమాదమే పలికినాఁడు.

లాక్షణికుఁ డైన తిమ్మకవి సర్వలక్షణసార సంగ్రహమున పినవీరభద్రుని పద్య ముదాహరించి యది యాదిపర్వములోని దని చెప్పి యప్పకవి ననుసరించుటయేగాక, పై పెచ్చు ఈ గ్రామ్యప్రయోగము నూత్నదండి కూడ దన్నాఁ డని వాని నాక్షేపించి నాఁడు.

నూత్నదండికి భారతమున నీ పద్యము కనఁబడుట యెట్లు సంభవించును? పిల్లల మఱ్ఱి వాని తర్వాతివాఁడాయె.

అహోబలపతియు తిమ్మకవియుఁగూడ నప్పకవియందలి యతిమాత్రవిశ్వాసమున నది నమ్మి భారతములోని దగునా కాదా యని యాలోచింపరైరి. అప్పకవి ననుసరించిన వారివలె నప్పకవియు నే లాక్షణికుననైన నవిమర్శముగా ననుసరించెనో, కథా సందర్భమేక మగుటచే నట్లు భ్రాంతిపడెనో, ఏమైననేమి పెక్కండ్రా గోతిలోఁ బడిరి. ఈ మహా

వాక్యములోని మొదటిభాగమందుం బోలె రెండవభాగమందుంగూడ ఆంధ్రకవితాపితామహుండు విష్ణుచిత్తీయమందు అనుటయుం బొరపాటే. అతం డే లాక్షణికుండైన వ్రాసియుంచినది చూచి గ్రహించినాండో, ఆముక్తమాల్యదాదిని పెద్దన పద్యములుండుటచే నటు భ్రాంతిపడినాండో నిర్ణయింప వీలులేదు. మొత్తముమీద నప్పకవి వీరభద్రుని పద్యమును భారతపద్య మని తెలిసి కని, కొని మొదలగు గ్రామ్యరూపము గ్రహింపంజేసినట్లు, విష్ణుచిత్తీయము ఆంధ్రకవితాపితామహకృత మను ప్రథ కలిగించినాం డనక తప్పదు. తగినంత విమర్శనము లేకుండగ నప్పకవి నాచనసోమనాథుని యుత్తరహరివంశములోని పద్యము (1-75).

క. అంటెదవుగాక నను చెం, తం జేరంగనీక యెంత దటిగిన మిరియా
లుం జొన్నలు సరిపోవే, లంజగనములందు కొమిరలం గెలువవటే.

నాచనసోమనాథుని వసంతవిలాసములోని దన్నాండు. అది నమ్మి వీరేశలింగము పంతులుగారు వసంతవిలాస మని పై పద్య మిచ్చినారు.

కళాపూర్ణోదయములోని పద్యము కకుత్స్థవిజయములోని దన్నాండు. ఇట్టివింకను గలవు. ఆట్టి పొరపాట్లు పడుట గొంత కలదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి భాండాగారములో ఉదాహరణముల పుస్తక మని యొకటి కలదు. అందు చిమ్మపూడి అమరేశ్వరుని "కొలందికి మీఱః బెద్దయగు కోట తనర్చున" అను పద్య మొకటి కలదు. అది నన్నెచోడుని కుమారసంభవమున. ఆ. 7. 108 పద్యముగానున్నది. అది చూచి యా పద్య మమరేశ్వరుని దనవచ్చును. అప్పకవి రాయలతర్వాత రెండువందల సంవత్సరములకుం బుట్టినవాండు. అతండు యథార్థ మెఱింగి రచించినాం డని కేవలము నమ్మినం బ్రమాదము లుండును.

అప్పకవి రాజకవిని గౌరవింప నిష్టము లేక యసూయచే నట్లు కర్తృత్వము మార్చినాం డనగూడదా యని నా మిత్రులు కొంద ఱూహింతురు; గాని అప్పకవి తిమ్మభూపాలుని, రామరాయభూషణుని, కంసాలిరుద్రయ్యను కవులనుగా గ్రహించినపుడు శ్రీ కృష్ణదేవరాయల విషయమున నట్టిభావ మున్నదనుటకు కారణము కనంబడదు.

అప్పకవి పొరపాటు పడియుండును. అప్పటినుండి నప్పకవీయములోని మాటలను విశ్వసించి యందఱు నట్లే యని యుందురు. దీని తత్త్వము గ్రహించి పెద్దలిప్పటికైన నాయపప్రథ విడిచెదరుగాక యని విన్నవించుచున్నాను.

వ్యాఖ్యాతలు ఆముక్తమాల్యద పెద్దన కృత మనుట కొక ప్రబలకారణము అప్పకవి వాక్యమే నిదానము. బ్రౌను దొరగారు, వావిళ్ల రామస్వామిశాస్త్రిగారు పెద్దన రచించినట్లు ప్రథ గల దనుట యొకటి. పై సమాధానమే దీనికిం జాలును.

పెద్దన రాయలవారి మరణానంతరము చెప్పిన పద్యములో ఆముక్తమాల్యదా కర్తృత్వము తెలుపలేకుండుట యొక్క కారణమఁట.

ఆ పద్య మి ట్లున్నది—

సీ. ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొను వేళఁ బురమేఁగఁ బల్లకి తనకేలఁ బట్టి యెత్తె
బిరుదైన కవి గండపెండేరమున కీవె తగు దని తానె పాదమునఁ దొడిగె
కోకట గ్రామాద్యనేకాగ్రహారంబు లడిగినసీమలయందు నిచ్చె

గీ. ఆంధ్రకవితాపితామహ! యల్లసాని, పెద్దన కవీంద్ర! యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక, బ్రతికియున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.

ఈ పద్యములో రాయలు తనకుఁజేయు గౌరవమును తనకు ముందు దిక్కేమి యను విచారమును తెలుపవలసియున్నదిగాని రాజుగారి కవితాశక్తిని చూపు సమయము గాదు.

రాయలవారు రచించినట్లు అనుకొనెడి రసమంజరి యొకటి కలదు. భానుసూరి రచించిన రసమంజరి యొకటి యున్నది. ఒకరు తమ గ్రంథమునకుఁ బెట్టుకొన్న పేరు మఱొకరు తమ గ్రంథమునకుఁ బెట్టుకొనెదరా? భానుసూరి రసమంజరిలోనుండి శ్లోకములు వ్యాఖ్యలోఁ బరామృష్టములు. కృష్ణరాయని రసమంజరిలోని శ్లోకములు ఎవరును బరామర్శింపలేదు అని యొక వాదము.

ఒకపేరు భిన్నకవులు తమ గ్రంథములకుఁ బెట్టుకొనుట వింత కాదే? "శకుంతలా పరిణయము" పెద్దాదనాగరాజు, కృష్ణకవి, వీరభద్రుఁడు శృంగారశాకుంతలమును శకుంతలా పరిణయ మన్నాఁడు. దానిలోఁ దప్పేమున్నది. అల్లసాని పెద్దన రసమంజరి రచించినట్లు ఒప్పుకొన్నను ఆముక్తమాల్యద రచించినమాత్రంబున నాదోషము పోవునా? పెద్దనార్య రచితమగు రసమంజరి కల దని కొంద ఱనుచున్నారే? దాని కేమి సమాధానము? పెద్దనార్యుఁడు సత్యావధూపరిణయము రచించినట్లు ప్రపంచదర్పణ మను గ్రంథములోనుదాహృత శ్లోక మున్నదఁట.

పెద్దన్నగాని తిమ్మన్నగాని రాయని కావ్యకర్త యనకపోవుట యొక్క లోపమఁట. పెద్దన కవితాస్త్రీలోలుఁ డన్నాఁడు. తిమ్మన కవితాప్రావీణ్యఫణీశుఁ డన్నాఁడు. అనేక గ్రంథములు రచించినపుడు ఏ గ్రంథమును చెప్పును? సముదాయముమీఁద వాని శక్తి ప్రకటించినారు.

ప్రగలనుబట్టి చాటువులనుబట్టి యింతదూరము వచ్చినారము. కవి కంఠోక్తిని పరిహరించు ప్రమాణములు గనఁబడలేదుగాన శ్రీ కృష్ణరాయలే యాముక్తమాల్యదా కర్త యని నమ్మెదము. గ్రంథస్థవిషయముల ననుసరించి కృష్ణరాయ కర్తృత్వమునకు భంగము గలిగింప యత్నించిన వాదము లున్నవి యవి పరిశీలింతము.

ఇందు శ్రుతివాక్యములు బ్రహ్మసూత్రములు నుదాహరింపఁబడినవి. శ్రీ కృష్ణదేవరాయలు క్షత్రియేతరస్త్రీపుత్రుఁ డని ప్రతీతి కలదుగదా? కృష్ణరాయ లీ గ్రంథ మెట్లు రచించినాఁ డన వీలుగలదు అని యొక పూర్వపక్షము. రాయలవంశము అను సందర్భమున క్షత్రియాపుత్రత్వాక్షత్రియాపుత్రత్వములును ముందు వివరింపఁబడును. ఎవరైనను క్షత్రియకన్యకలఁ బెండ్లాడిన ట్లున్నదికదా! దాని విషయమునఁగూడ రాయల వంశ మన్న వివరము గలదు. అది ప్రాభవమున నందురా! ప్రాభవమున క్షత్రియ కన్యకలనే పరిణయ మాడినవానికి బ్రహ్మసూత్రార్థమా దుర్లభ మయినది. అప్పటి రాజులు క్షత్రియేతరులైనను, క్షత్రియులైనను, వేదవేదాంతాదివిషయములు నేర్చిన వారే. పాదజుల మని చెప్పికొనిన తంజావూరి ప్రభువులలోనివాఁ డగు రఘునాథ భూపాలుని రామాయణమునందు దశరథుని యాగసందర్భము చదివినచో శ్రౌతమం దతని కెంత నిరూఢప్రజ్ఞ యున్నదో తెలియును. ఈ రఘునాథభూపాలునియొద్ద యజ్ఞనారాయణదీక్షితు లను బ్రాహ్మణుఁడు సంగీతకవిత్వములు నేర్చుకొని వానిని గురువుగా భావించినాఁడు.

అప్పటివార లంత పాండిత్యము, వేదపరిజ్ఞానము సంపాదించినవారు. బ్రహ్మసూత్రములు చెప్పువారు వారికి దుర్లభులా? విష్ణ్వంశసంభూతులగు రాజుల కానాఁటి బ్రాహ్మణులా వేదాంతము చెప్పుచుండుట. వైష్ణవశైవమత వ్యాపనమున శూద్రుల కందఱకు పరిజ్ఞానము వృద్ధి చేసినకాల మది. అంతమాత్రమున రాయలకర్తృత్వమునకు భంగములేదు. ఆము —4-27.

సీ. సౌఖశాయనిక భిషక్పూర్వకము కాల్య, వేళఁ గార్తాంతికద్విజులఁ గోష్ఠి
జాముపోవ నమాత్యసామంతపూర్వకం, బర్థార్జనస్థ కాయస్థగోష్ఠి
దినమధ్యమమున మర్దనమల్లపూర్వకం, బగు సూదసూపకృన్మృగయు గోష్ఠి
యపరాహ్ణమున దేవతార్చనాపూర్వకం, బార ధర్మాధికృద్యతుల గోష్ఠి
తే. భుక్తిమీఁద విదూషకపూర్వకము పు,రాణ కవిగోష్ఠి చారపూర్వకము సంజ,
జాము గాయకగోష్ఠి నిశన్ సుషుప్తి, పూర్వకము ప్రేయసీగోష్ఠి పొసఁగుఁ బతికి.

ఈ పద్యముఁబట్టి రాజునకు గ్రంథరచనకు నవకాశము లే దని యొక వాదము.

ఈ పద్యము రాజనీతిలోనిది. సామాన్యలక్షణముగాఁ జెప్పినాఁడు. నే నట్లు చేసినా నని చెప్పలేదు. కవిత్వము చెప్పుట సామాన్యలక్షణముగాఁ జెప్ప వీలులేదు. దానికిఁ బూర్వజన్మసంస్కార మనుఁడు, లేదు (gift) దైవదత్తశక్తి యనుఁడు-అదృష్ట మొకటి యుండవలయును. అదికాక పురాణకవిగోష్ఠి యుండవలయు నన్నాఁడు. ఆ కవిగోష్ఠి ప్రభువులు తమవిద్యానుసారముగా నుపయోగించుకొందురు.

ఎంతమంది మహారాజులు కవిత్వము చెప్పలేదు. వారి కవకాశము కలిగినదా లేదా? అభిరుచి ఆసక్తి కలుగుట ప్రధానము.

సం. భోజమహారాజు—భర్తృహరి.

చాళుక్య సోమేశ్వరుఁడు

కేలాది బసవరాజు

ఆంధ్రమున—నన్నెచోడుఁడు—(కవిరాజశిఖామణి)

తిమ్మభూపాలుఁడు—పరమయోగివిలాసము.

రఘునాథభూపాలుఁడు—

చంద్రికాపరిణయము.

వ్యాఖ్యాతలు—కాటయ వేమారెడ్డి—

ఇందు రెడ్లపరిహాస మున్నదఁట. కృష్ణరాయలవారు జనపాలనమునను న్న రెడ్లను గాని ఓడిపోయిన రెడ్లరాజులనుగాని యట్లు పరిహసింపఁడు. వానికి సంతోషము కలుగు నని యితరులే యీ పరిహాసము చేసియుందురు. ఆ సత్యముతోపాటు గ్రంథమంతయు నితరులు రచియించియుందు రని యొక యూహ.

౪—౧౩౪.

మ. గురుగుం జెంచలి తుమ్మి లేఁ దగిరిసాకుం దింత్రిణీపల్లవో
త్కరముం గూర్చి ఘొరఁటి నూనియలతోఁ గట్టావికట్టారికో
గిరము ల్మెక్కి తమిం బసు ల్గొలము వోఁ గ్రేపుల్ మెయిన్నాక మేఁ
కెరువుం గుంపటిమంచ మెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్.

అది ప్రకృతివర్ణనము. వర్షాకాలము వర్ణించుచు హాలికులస్థితి చెప్పి వారిలో ధనవంతు లగు రెడ్లస్థితి చెప్పినాఁడు. అది స్వభావవిరుద్ధము కాదు. కాఁగూడదు. పరిహాసమే యందురా! ధీరోద్ధతనాయకుఁడగు రాయని కది యుక్తమే! అది రాయకృత మని ధ్రువపఱుపఁగలదు. రాయని కిష్టములేని రెడ్లనింద పెద్దనమాత్రము చేయునా? చేసిన రాయలు హర్షించునా?

ఆ కారణమున రాయకర్తృత్వమే స్థిరపడును—

రాయనికి గోచరముకాని వర్ణనము లున్నవని కొందఱు, పెద్దనకు గోచరముకాని వున్న వని కొందఱు వాదింతురు. కొన్ని యిరువురకు గోచరముకాని వని మఱికొంద ఱనఁ దొఁచును. ఎంద ఱిది సాయముపట్టి రనవలెనో? ప్రతిభాశాలికి గోచరముగానిది యుండదు. ఆ విషయ మెటు లాగిన నటు సాగును. ఈ యూహములు కవికంఠోక్తిని నిరసింపఁజాలవు.

పరిహాసమందు లేని రాయని కిష్టములేని విషయము రాయలకు తృప్తికర మని యెవరైన ననుకొందురా? భ్రాంతిపడి యెవరైన రాజానిష్టకార్యము చేసిన సహించు మార్షించునా? పరిహాసమే యని ధ్రువము చేసినచో ధీరోద్ధతుఁడగు రాయఁడే యా పరిహాసము చేసె ననుట యుచితము. అదియే రాయకర్తృత్వమును ధ్రువపఱుచును.

రాయనికి గోచరముకాని వర్ణన లున్నవందురు. ప్రతిభావంతున కగోచరము లను నవియే యుండవు. కొన్ని పెద్దన కగోచరములయినవి కలవు. వాని గతియేమి? కావున అట్టి వర్ణనలవలన వాని ప్రతిభావిశేషము గ్రహింపవలసినదే. కవి బుద్ధి నిత్యానుభూత విషయములందే చొచ్చునని కొందఱు, మఱికొందఱు కాదు నిత్యానుభూత విషయము లందు లక్ష్య ముండదు. అప్పుడప్పుడు చూచినవానియందే బుద్ధి తగులునందురు. ఆపక్ష మున అనేక స్థలములయందుండు వర్ణనాంశములనుబట్టి రాయఁడే రచించెనని తోఁచుట కవకాశము గలదు. ఇది యేవైపునకు లాగిన నావైపుకే సాగును. వీనికంటె కంఠోక్తములే ప్రమాణములు. 4-23—సౌఖశాయనిక............ప్రకారము రాజునకు కావ్య రచన కవకాశము లేదని యొక వాదము. సర్వరాజ, అతి సామాన్యలక్షణములు, సామాన్యరాజలక్షణములు అని విశేషములు చెప్పలేదు. ఆ లక్షణములు ప్రతిరాజున కుండవలసినవి. కవిత్వ మట్టిది కాదు, ప్రతి మనుష్యునకుఁగాని, రాజునకుఁగాని సామాన్య లక్షణ మనినఁ జావవలసినదే కావున కవిత్వము విధిగా నుండవలసిన దని చెప్పఁదగినది కాదు. అందులకే చెప్పలేదు. అందులోనను కవి పండితగోష్ఠి యుండవలె నని చెప్పి నాఁడు. ఆ గోష్ఠి యుపయోగము వారివారి విద్యాకవితా సంస్కారానుసారముగా నుపయోగించుకొందురు. అతఁడు అధిగతతత్త్వుఁడే కాని సామాన్యుఁడు గాఁడని వాని వర్ణనమందు ధ్రువపడుచునే యున్నది. అట్టి పాండిత్యముగలవాఁడు రచింపఁదగినదే యీ గ్రంథము.

మనుచరిత్రపద్యము లాముక్తమాల్యదలో నుండుటవలన పెద్దనరచిత మందురఁట.

ఆముక్తమాల్యదాకృత్యారంభమున నాంధ్రవిష్ణువు కలలోఁ బ్రత్యక్ష మయి యాముక్తమాల్యద రచింపు మన్నపుడు, స్వప్నవృత్తాంతము తన యాస్థానకవి పండిత బృందములోఁ జెప్ప వారు స్వప్నఫలము వక్కాణించి, వాని వంశప్రశంసయు రాయల ప్రశంసయుఁ జేసి, 'కృష్ణరాయేంద్ర కృతి విరిచింపు' మనిరి.

అందు ఇతరు లన్నట్లు రచించినాఁడుగాన నితరుల పద్యములే ప్రత్యక్షముగ కృష్ణరాయలవారితో నన్నట్లు మార్చి చేర్చినాఁడు. ప్రత్యక్షప్రశంస కలుగునట్లు మార్చ వీలులేనివి మానివేసినాఁడు. చూ. 1 ఆ. 35-36. అందులో వానిలో నెక్కుడు భాగము పెద్దనగారి మనుచరిత్ర లోనివి. కొన్ని యితరులవి. అందొకటి పెద్దనగారి చాటు వని ప్రసిద్ధి. మిగిలినవి యితర కవులు కూర్చినవి యయి యుండును.

ప్రతి కవియు కృత్యాదిని కృతి వినిర్మింపు మని ప్రోత్సాహము గలిగించినవారు తన్నుఁ బ్రశంసించిన ప్రశంస తన పద్యములుగా రచించుట కలదు.

ఇందు కృతి వినిర్మింపుమని ప్రోత్సాహము గలిగించినవారును వానిని బ్రశంసించినవారును కవులే కావున, వారు తన్ను బ్రశంసించినమాటలు విడిమాటలు కాక పద్యము లయి యుండుటచే నా పద్యములే గ్రహించినాఁడు. అది యుచితమే కదా! ఒక పెద్దనవే కావు. ఇతర కవికృతములును గలవు.

ఇంక మనుచరిత్ర గ్రంథమున 6-99. విష్ణురూపవర్ణనము.

“నీలమేఘముడాలు డీలుసేయఁగఁజాలు” అను పద్యమందలి నాల్గు చరణములు ఎత్తుగీతి వేఱుగనే యున్నది. తన స్వప్నమునఁ గనఁబడిన యాంధ్రవిష్ణురూపవర్ణనకై గ్రహించినాఁడు.

ఆ పద్యములోని భగవత్స్వరూపవర్ణనము తనకు నచ్చియుండుటచే ఆ భావము తెలుపుట కా పద్యమే గ్రహించియుండును.

దశావతారవర్ణనములలో—

శ్రీరామబాణవర్ణనము—పవిధారా—అను పద్యము.

ఆముక్తమాల్యదలో—రామబాణవర్ణనము ‘స్యందన’ అను పద్యమందు ఝాంకారముతో నుండుటచే పవిధారాది పద్యము ప్రక్షిప్త మగు నని తోఁచెడిని.

ఇంకొకటి—

జయ......జయ......

ఇది మనుచరిత్రలోనే ప్రక్షిప్త మయి యుండును.

ఆము—విష్ణుచిత్తుఁడు గజారూఢుఁడై గజఘంటలు వాయించుచు స్తుతించినపుడు తాళానుగుణముగాఁ బద్యము రచించెను.

మూలకథలో గూడ నాయన తాళముల వాయించుచున్నట్లే యున్నది ఆ కారణమున భగవంతునికి నమస్కారముగూడఁ జేయలే దని యున్నది. మనుచరిత్రలో స్వారోచికి పరమేశ్వరుఁడు ప్రత్యక్షమయినపుడు, సాష్టాంగనమస్కారము చేసి వర్ణించిన వర్ణనములో మొదటిదిగా నున్నది. తర్వాత ‘అవ్యయానంత విశ్వేశ’ అను పద్యమున్నది. ఈ పద్యమున కాముక్తలో ఔచిత్య మెక్కుడు కలదు. పెద్దన రచించిన దని ఏ కారణమునసైన ధ్రువపడినచో తాళమునకు సరిపడియుండుటచే ఆముక్తమాల్యదలో గ్రహింపఁబడియున్నది. ఇంతకు నవి వేఱు పద్యములు.

ఇంతమాత్రమున సంశయింప వీలులేదు. కథారచనలోని మార్పులనుబట్టి రాయల కర్తృత్వమే ధ్రువపఱుచుచున్నది. గోదాకళ్యాణమందు గోదాదేవికి యౌవనాగమనానంతరము వివాహము చేయించుట.

యామునాచార్యునకు క్షత్రియకన్యకావివాహము చేయించుట, యామునమునిచే యుద్ధము చేయించుట. రాజనీతి కవకాశము కల్పించి రాజనీతి ననుభవపూర్వకముగాఁ దెలుపుట. తన కభీష్టమగు కథల గ్రంథమధ్యమునఁ జొనుపుట. గ్రంథస్థమగు వర్ణనలతో వర్ణించి యూరకొనక సామాన్యజనతిర్యగ్జంతు స్థావరవస్తుముఖ్యములలోని ప్రకృతిని బహుముఖముల వర్ణించుట.

వ్యాకరణ సంస్కారము కొన్నిచోట్ల నుండుట. అది నేటివారు తప్పందురు గాని పూర్వలాక్షణికులు పక్షాంతరములు గ్రహించినారు. ఈ గ్రంథము రచించినవాఁడు వీరవైష్ణవుఁడు గావలయును.

రాయలు శ్రీశైలాదిక్షేత్రములు సేవించినట్లున్నది. అట్టివాఁ డిది రచించి యుండఁ డని యొక వాదము—(చూ. ఆముక్తమాల్యద 3-15)

పెద్దన మనుచరిత్రలో శివస్తుతి చేసినాఁడే. అతఁ డెట్లు పనికివచ్చునన్నచో ఆతనికి మొదట శివభక్తికూడ నున్నను "ముదిమది తప్పి" అన్నాఁడుగాన వార్ధకమున వీరవైష్ణవమునకు దిగియుండునని యొక రందురు. పోనిండు. అరీతినే రాయలవారికిఁగూడ జైనులకు బ్రాహ్మణమతస్థులకువలె వైష్ణవము......కూడదా. దాని కేమి? రాజు తన క్షేమకమున నాసక్తియున్నను, తన పూర్వుల గౌరవరక్షణార్థము, ప్రజారంజనార్థము క్షేత్రములను సమముగా ఆదరింపవలయును. అట్లే రాయ లాదరించియుండును. లేదా మొదట కొంత శివభక్తియుం నుండి యుండును. ఆతని పరమసిద్ధాంతము మాత్రము వైష్ణవ మయి యుండును. కేవల విష్ణుపారమ్య మొప్పినవారుకూడ శివస్తుతి చేయవచ్చును.

కేవల శైవుఁడైన నన్నెచోడుఁడు విష్ణ్వాదిస్తుతి గావించినాఁడు. శివపార మ్యము చూపినాఁడు. అది యసంభవము కా దని నా భావము.

ఇంక కృష్ణరాయవిజయ రాయవాచకములలో చెప్పుమి యొక దోషము గాదు. అవి కేవల రాజ్యవిషయసంబంధి గ్రంథములు. అవి తర్వాతి కాలపు గ్రంథములు—

ఇంక వ్యాకరణాది విషయములనుబట్టియు ప్రయోగసరణినిబట్టియు విచారింతము.

కొంద ఱిందు ప్రాచీనలక్షణ విరుద్ధప్రయోగము లున్నవిగాన పెద్దన రచితము గానేరదు. పెద్దనమనువున నిట్టిదోషములు లేవు. కావున రాయలవారిచే రచింపఁబడె నందురు.

మఱికొంద ఱవి ప్రాచీనసమ్మతములే. పూర్వకవులు ప్రయోగించియే యున్నా రని సాధింప యత్నింతురు. అది మంచిదే. వాని ప్రామాణ్యాప్రామాణ్యములలోనికి దిగినచో నది యగాధగాధ. సాధువు లని సాధింపయత్నించినవారుగూడ ఏ లక్షణము లకును లొంగని ప్రయోగములు దిద్దిరి. అవి యితరులచే కల్పింపఁబడిన పాఠము లందురు. ఇదివరకు దొరకిన పాఠముల ననుసరించి చూచి, అందులో నేది సాధు

వనదగునో యది మనకు గ్రాహ్యముగాని మతముదిద్దివేసినచో నవి ప్రమాణము లగునా? అట్లైనచో కవిస్వభావము, కవిధోరణియు తెలిసికొన శక్యమా? ఉన్నదాని ననుసరించి యూహింపవలసినవారము మనము. వ్యాఖ్యాత యున్నదాని స్వరూపముచేతనైన సమర్థింపవలసినవాఁడు. త ప్పని స్ఫుటముగా తెలిసినపుడు మొదటి స్వరూపము చూపి తర్వాత తన యభిప్రాయము చూపవలసినవాఁడు.

సం. నైషధమున—'ఇంగాలమివాయశః పరే' అనుచోట మల్లినాథుఁడు ఇంగాల పదము దేశ్య మన్నాఁడు. అంగారమని దిద్దలేనివాఁడా? అది ధర్మవిరుద్ధముగాన దిద్దలేదు. మరియొక పూర్వపు వ్రాతప్రతిలో భిన్నపాఠము దొరకువరకు అది కవి విరచిత మనుకొనవలసినదేగదా.!

ఛందస్సునుబట్టి రాయకర్తృకతయే నిలఁబడును. చూడుఁడు. ఆముక్త 1-58 4-238, 6-75 (7-11) స్రగ్ధరావృత్తము లున్నవి.

1-58. రెండును. "దీపుల్ గాంచు నమ్మాదుపుల

యదుగం దోఁచు నుద్యద్ద్యుతిలోన్నే..."

ఇట 'అదుగ౯ డోఁగు' అని మొదటనున్న సంయుక్తాక్షరములలో రెండవ యతిస్థానమున నేది గ్రహింపఁబడినదో, మూడవస్థానమునఁగూడ నదియే గ్రహించుట సంప్రదాయము.

చూ. సులక్షణసారము—58-వ పేజి.

వ్రాఁతప్రతులలోను, వావిళ్లవారి ప్రతులలోనుగూడ 'అదుగందోఁచు' అని యున్నది. దానినిబట్టి చూచినచో మొదటనున్న బిందుపూర్వకదకారమునుండి, రెండవ యతిస్థానమున 'మాదుపు' అనుచోట, 'దకార'ము మాత్రము గ్రహించినాఁడు. మూఁడవయతిలో బిందుపూర్వక దకారమునకు యతి సరిపెట్టినాఁడు. ఇట్టిది పెద్దన దానిలో లేదు. ఇతరులలోను కనఁబడలేదు. కాని అప్పకవి క్రౌంచపదలక్షణపద్య ములో......కనఁబడుచున్నది. ఈరీతి నున్నచోఁ బెద్దన వాదమునకు భంగము వచ్చు నని కాఁబోలు దిద్దివేసినారు.

ఇట్టిదే మఱొకటి. 6.75. (7.11)

2 పాదము. ప్లవమానోత్పాత భూతప్రకరపటిమహాలాహలస్పర్థి

4 „ ప్లవబృందంబుల్ పని౯ నల్గడఁ బొదుపొదుమన్పల్కు౯.

రెండు పాదములలోను దిద్దినారు, వ్యాఖ్యమాత్రము 'భూతప్రకర' అనుదానికి మాత్రము వ్రాసినారు. దీనిలో 2 వ పాదమున అప్పకవి ప్రయోగానుసారము

సమర్థింపఁ జొచ్చినచో ర, ల యతి యగును. లేనిచో పూర్వలక్షణ విరుద్ధముగా సంయుక్తాక్షరములో దేనికైనా యతి గ్రహించినాఁ డనవలెను.

తర్వాత—4-238 లో

'చరదృష్టిర్ వైరిపక్షే క్షణమునచివము ఖ్యస్వపక్షేక్షణం ఖన్.'-మొదటిది 'చ' రెండవది 'క్ష' మూఁడవది 'ఖ్య' ఇట్టిది, ఎక్కడను కనఁబడలేదు. ఇట వస్థ అని దిద్దఁబడినది. వ్రాతప్రతి 'శస్త' అనుపాఠము గనఁబడినది. కొంతనయము. వ్రాతప్రతిని బట్టి, 'శస్త' దిద్దిన దిద్దవచ్చునుగాని వస్థకల్పన మేమి?

మొత్తముమీఁద నీకవి మూఁడుచోట్ల నట్లు ప్రయోగించుటచేత ఈతఁడు ముఖ్యముగా పెద్దనగాఁడు, రాయఁడే కావచ్చు నను టకు చక్కని సాధన మగును.

7-30 కెంపు, రాళ్లనే కలియ వాకిళ్లఁజల్లి సవరణలో—రాలఁ-ద్వారాల.

1-82. ఊరుగాయ వ్యవహారానుసారమున ఊరగాయ యనవచ్చునా?

2-19. కలువఁదావు లని సవరణ.

ఈ ప్రాసయతి పెద్దన యుపయోగింపఁడు. రాయఁ డుపయోగించెనేమో.

తత్సమ అకారసంధి

ఈసంధి ప్రాచీనులు ప్రయోగింప లే దనుట సత్యమే కాని యేతద్గ్రంథభాగోదాహరణములలోనే అహోబలపండితుఁడు ఈ సంధి గ్రహించినాఁడు. తర్వాతి లాక్షణికులు నామోదించిరి.

ఆభాగములు:—

శ్రీరంగ భర్తంచు. భర్త+అంచు.

7-44. భృత్తంచు అని దిద్దెద రఁట.

2—9 గంగనుకాసె. గంగ+అను...వ్యస్తరూపక మనవలె నఁట. ఇతర గ్రంథముల నిట్లు కలదా?

2—29 'లఘిమందు—లఘిమర్ విగిలి' అని దిద్దఁబడినది. లఘువం దకీర్తి యొకరిలో—

3—19 పతాకన...పతాకర్ అని వ్యాఖ్య. పతాకగ అని పీఠిక. రెండును సరసములు గావు.

4—16 చేష్టుడిగి—ఇట్టి పాఠమున్న మంచిదే.

వీని నిట్లు దిద్దియో క్లిష్టముగా నన్వయించియో మడిపెట్టుటకంటె అహోబిల పండితాదులు చేసినట్లు ఆసంధి నంగీకరింపవచ్చును. ఇతరులు దాని ననుసరింపకపోయి నను, ఆకవి కాయభ్యాస మున్న దనవచ్చును.

ఇట్టి వింగనుగలవు కాని స్వరూపావగాహనకివి చాలు నని విరమించుచున్నాను.

పైభావమునఁ బెద్దనకాఁ దని చెప్పవచ్చును ఆంధ్రభాష యసాధ్యంబె యను పద్యమునుబట్టి యిది రాయల యాంధ్రకృతులలో మొదటి దని యూహసేయవచ్చును. అనభ్యాసమునను, గీర్వాణకవితా సాహాయ్యమునను సాధించిన యాంధ్రకవితగావున నట్టి క్రొత్తరూపము లుండవచ్చును.

అని అర్వాచీన లాక్షణికులు తప్పు లనక సాధించి మతాంతరముగా గ్రహించినారు. అవి దిద్ది పెద్దనదనుటకంటె పెద్దనకవితకంటె భిన్నమనుటయే యుచితము

4—170 లో పాండిమమరె వ్యాఖ్యలో ఇదే పాఠము. ఇట పాండవమరె వ్యాఖ్యాంతమున పీఠికలో పాండిమంబు అన్నారు. పఱచు వ్యర్థ మన్నారు.

7—44 శ్రీరంగభర్తృంచు. భృత్తంచు అని యుండును. పీఠిక 27-వ పుటలో శోధింతునేని అనఁగా సవరించుకొని అన్నారు.

2—29 లఘువందు ... ...

లఘిమందు ... ...

లఘిమన్ వికీర్తి అని పీఠిక

3—19 పతాకన, పతాకన్+అ. అని వ్యా. వ్యస్తరూపక మిట పతాకగ అని పీఠికాపాఠము.

4—229 పరులవాడి తప్పింతురు.

2—38 కలాపులను గఱులు నివిరి.

3—80 స్థావరశ్రేణిఁ దజ్జాతికంటె. (తజ్జాతియందుకంటె) విశక్తి.

ఈరీతికవిత పెద్దనమనుచరిత్రములో లే దనఁగాఁ గొందఱు మను. 4—38 'చకితైణాహుతి' అను పద్యమున్న దందురు. ఇది అర్థావాగ్విబుధమువంటిదగునో కాదో సహృదయుల హృదయమేయెఱుంగును. కొందఱు పెద్దనపద్యములు కొన్ని యిందుఁ గలసినవి. అవియే సుబోధకములుగా నున్నవి. నారికేళపాకములో రచించిన కవి యింత ద్రాక్షాదిపాకములో రచింపఁగలఁడా యందురు. శిరీషకుసుమ పేశలము నా గ్రంథము రచింపఁబూనిన పెద్దన కొన్నిచోట్ల ముదురు నారికేళపాకమువంటి పద్యములు రచించెనే దాని కేమి చెప్పుదురు?

జాంబవతీ పరిణయమునందు రెండుశైలులమాట కేమందురో? అందందఱు కవిత్వము లున్నవి. నరసింహమూర్తి నఖములు హిరణ్యకశిపువక్షము చీల్చునపుడు వాఁడియగుట, లక్ష్మీగండపాళియందు మృదువులగునట్లు, కవివాక్కులు కొన్నిచోట్లఁ గర్కశముగాను, కొన్నిచోట్ల సుకుమారముగాను నుండు ననియెను అది సత్యము.

కథ

ఆశ్వాసము—1. పాండ్యదేశమున విల్లిబుత్తూరు నగరము గలదు. అందు విష్ణుభక్తుఁడు మాలికాకరణకైంకర్యము చేయుచుండెను. అతఁడు న్యాయార్జితవిత్తములో నతిథిపూజ సలుపుచుండెను.

ఆ. 2. మధురాపురమును పాండ్యమత్స్యధ్వజుఁడు పాలించుచుండెను. గ్రీష్మకాలమున నతఁ డొకనాటిరాత్రి వెన్నెలలో భోగినీగృహమునకుఁ బోవుచుండఁగా నొకవీథియరుగుపై నొక పరదేశిబ్రాహ్మణుఁడు సుభాషితములు లోడిబ్రాహ్మణౌఘములోఁ గలసి చదువుచు,

'నెలల్ చతుర్ద్వయిని వృష్టిదినాళికి రాత్రికై దివం
బున జరకై వయస్సునను బూని పరంబున కిప్డు దుద్యమం
బనువుగఁ జేయఁగావలయు...'

నను పద్యము పఠింప, రాజు దానిభావము గ్రహించి ప్రొద్దుపొడి, కడకుం దన మోసమునకు భయపడి,

ఎక్కడి రాజ్యవైభవ మ దెక్కడిభోగము లేటిసంభ్రమం
బక్కట! బుద్బుదప్రతిమమైన శరీరము నమ్మి మోక్షపుం
జిక్కు గణింపకుంటి,

ననుకొని "ఇంతనుండి పరలోకానందమునను యత్నమాపాదింతును" అని నిశ్చయించుకొని తనభటునిచే నాబ్రాహ్మణునికిఁ దాంబూల మిప్పించి వెనుకకుఁబోయి మఱునాఁడు పండితులఁ బిలిపించి వాదములో నెగ్గినవారికీయ ఆస్థానసభలో వ్రేలాడఁగట్టిన బంగారు నాణెములమూటచూపి వాదముసేయఁ బ్రేరేపించెను.

వారు వాదముచేయుచుండిరి. ఆసమయమున విల్లిబుత్తూరులోనున్న విష్ణుచిత్తుఁడు (మన్నారుస్వామిప్రేరణమున) భగవత్ప్రోత్సాహమున (2-88) విష్ణుమతస్థాపనకై మధుర కరిగెను.

ఆ. 3. వాదము జరుగుసమయమున వచ్చిన విష్ణుచిత్తునిఁ జూచి, వాదమాడఁగా మేము పరాయివారమా వాదము కానిం డని వారు వాదముచేయుచుండఁగా కొన్ని మాటలలోనే వారి శక్తి గనుఁగొని రాజు మాధ్యస్థ్యము నవలంబించినచోఁ దానును గొన్ని మాటలు చెప్పఁదలచినట్లు చెప్పి, రాజానుమతిని సర్వమతములు జయించి, విశిష్టాద్వైత మతంబు స్థాపించి పరమేశ్వరుని నిర్దేశించి, అట్టి పరమేశ్వరుఁ గనుటకుఁ దగిన యోగంబుఁ జెప్పెద, ఖాండిక్య కేశిధ్వజసంవాదంబు విను మని చెప్పెను.

3-89. అందునుగల కొఱఁతదెల్పి 'ఇంతకంటె సులభోపాయంబాయోధనంబున నయ్యాదోషజుండు గాండీవి కుపదేశించిన శరణాగత ధర్మంబు నిరపాయధర్మం బని, అతనికి మూలమంత్రపూర్వకముగా ద్వయంబు ప్రసాదించి భాగవతప్రధానుం గావించెను.

ఆ. 4. (ఖాండిక్యోపాఖ్యానము వేఱుగాఁ గూర్పఁబడును.)

విష్ణుచిత్తుఁడు వాదమున విజయమొంద బంగారునాణెములజాలె తెగి వానిముందటఁ బడెను. అప్పుడు దేవతాదులుగూడ నుతించిరి. కాని కొంద ఱసూయాగ్రస్తు లనేకవిధముల నాడఁజొచ్చిరి. ఆయనను గజముపై నెక్కించి యూరేగించి వారిపురంబునకుఁ బంపుఁ డని కొందఱు రాజపుత్రులను బండితులను రా జాజ్ఞాపింప వా రటూరేగించుసమయంబున విష్ణుచిత్తునకు శ్రీహరి ప్రత్యక్షమయ్యెను. అతఁడు శ్రీహరిని దశావతార వర్ణనలతో నుతించెను. శ్రీహరి దేవశిల్పి యగు విశ్వకర్మను జూచి యీ విష్ణుచిత్తుఁడు తనధనమంతయు భగవద్భాగవతార్పణము చేసి దారిద్ర్యమొందును నీవు వెంటనే వీని భవనమును మణిమయంబును సకలసామగ్రిసంపూర్ణమును జేయు మని యాజ్ఞయొసఁగెను. అతఁ డట్ల కావించెను. విష్ణుచిత్తుఁడు తన పురంబున కేఁగి తనగృహ వైభవముఁ జూచి యిదియంతయు భగవదనుగ్రహలబ్ధ మని యెంచి తొంటికంటె శతగుణంబుగా భాగవతపూజాప్రవణుండై యుండెను.

ఒకనాఁడు మాలికలు సమర్పించి యింటికిఁ బోవువానిని శ్రీహరి లక్ష్మీదేవికిఁ జూపి 'యామునాచార్యుఁ డొక్కఁడును, నీమహాత్ముఁ డొక్కఁడునుగాదె దర్శనం బుద్ధరించి రస్మత్కృపాతిశయమున', అన నతఁ డేమి యొనర్చె నని శ్రీదేవి యడుగ యామునాచార్య చరిత్రయు శ్రీహరి చెప్పెను.

ఆ. 5. విష్ణుచిత్తుఁడు తులసీవనమునఁ ద్రవ్వుచుండఁగా నొక బాలిక గనుపడెను. అనపత్యుఁడగు నాకు భగవంతుఁ డనుగ్రహించినాఁడు కాఁబోలు నని యాకన్యకను దీసికొనివచ్చి తనపత్ని కీయ నామె యా బాలికను పెంచుచుండెను. ఆపిల్లకు బాల్యము దాఁటినది యౌవనము అంకురించినది. అంకురించుటయేగాక ముదిరినది. విష్ణుచిత్తుఁ డైశ్వర్యవంతుఁడయ్యుఁ బుష్పమాలికారచన కైంకర్యము మానక చేయుచుండ నామె యామాలికలు దాను ధరించి నూతినీటిలోఁ దనయందము చూచి మరల యథాప్రకారము పూవులగూడలో నుంచును. అట్లుంచి చెలికత్తెలతో 'మీపాడిన హరిచందములే పాడిగఁ దలఁపవచ్చు, నితఁ డేసతులం గాపాడినవాఁడు?' అని శ్రీహరి కృత్యంబు నుపాలంభించురీతినిఁ బునః పునః స్మరణంబు గావించుచుండె. ఆమె చెలులు, ఆమె శ్రీహరిబద్ధానురాగ యగుటయు, విరహవేదన నొందుటయు గ్రహించి, కొంతసేపు మేలములాడి తుదకు నీవు సత్యభామవు అని యథార్థము తెలుపఁగా జాత

విజ్ఞానమై వారలు నాగకన్యక లగుట వారివలన విని, శ్రీహరిని ఈ దేహమునఁ బొంద లే నేమో యోగశక్తితో నీ దేహము విడిచి శ్రీహరినిఁ బొందెద ననఁగా 'ఆ యదువ తంసమెందుఁ జన్మాఁడు, విను రంగమంద నిల్చె వేగపా టేల? యతఁడ నీ విభుఁడగు టకు నర్చనాదుల నిప్పటి హరిభజింపు' మనిరి. క్రమక్రమముగా నామెకు శ్రీరంగ శాయిమీఁద వలపు హెచ్చెను. విరహవేదన ననుభవించి యున్మాదావస్థ నొందిన కూఁతురి చేష్టలకు దుఃఖితుఁడైన విష్ణుచిత్తుఁడు కారణంబు గ్రహింపనేరక, వటపత్రశాయి స్వామితోఁ దన కూఁతు నవస్థఁదెలిపి దానికిఁ బరిహార మేమి స్వామీ యని దైన్యముతో నడుగ, శ్రీహరి యను కంపాతిశయమునఁ దచ్ఛాందసమునకు మందస్మితంబుచేసి గోదా దేవి పూర్వవృత్తాంతముఁ జెప్పెను.

ఆ. 5. దానికి పీఠికగా మాలదాసరి వృత్తాంతము చెప్పఁదొడఁగె.

ఆ. 6. మాలదాసరియొక్క గాన ప్రభావ కథామూలమున వరాహావతారమున భూదేవి మదీయ పూజోచితోపచారంబుల విశేషఫలంబు గానంబ యని వైష్ణవియుం దాఁ గావునఁ దదాకలన కుతూహలంబునం గూఁతురై నీకొదవివిప్రలంభదంభేరితాగాధ గాథార్థ సమేత గీతరసంబునం బ్రొద్దుపుచ్చుటగాని వేఱొండు గాదనిచెప్పి శ్రీరంగంబునకు రంగేశు సేవింపఁ దోడ్కొనిపోయి రమ్మని యానతియ్య శ్రీరంగంబునకుఁ గూఁతుఁ దీసి కొనిపోయి యచటఁ గొలువులోనుండి స్తుతించిన మునిం గనుంగొని కుశలప్రశ్నంబు గావించి, కుసుమాంజలులు సమర్పించు నాముక్తమాల్యదరూపు నెలప్రాయంబు సాభిప్రా యంబుగాఁజూచి ఉవ్విళ్లూరి తమకము నాపలేక, యామెను తన యంతఃపురంబునకుం దిరస్కరిణీ విద్యచే నొరులెఱుఁగకుండఁగఁజేర్చి, మాయాకన్య నచట నుంచె. విష్ణు చిత్తునకుఁ దీర్ఘప్రసాదంబు లిప్పించి పంపఁగా నతఁడు మాయాకన్యం బాలకిలో నెక్కించుకొని యింటికి వచ్చి తెరదీయఁగా నామె యదృశ్య యగుటచే దుఃఖితుఁడై 'మొట్టో ఒక్క బ్రాహ్మణుఁడనైననన్నా మోసముచేయుట! రంగభర్త యెంత చేసి నాఁడో చూచితిరా సఖులార? యని మొఱవెట్ట భాగవతక్షోభంబునకు భువనభర్త భయపడి వానిఛాందసంబునకు గేలిసేయుచున్నవాఁ డని యతనికిఁ దోఁచునట్లు 'మది మది దప్పి మాటలాడెద వేల? మీపిల్ల మీ యింటనే యున్నది. సరిగాఁ జూచి లేనప్పు డనుము. మే మొప్పుకొనెదము. వృథాగా మమ్ము దూఱెద వేల యన నతఁ డింటి కేగి తనకూఁతుం జూచి సంతసించియుండ రంగశాయిస్వామి బ్రహ్మరుద్రాదులం బంపి కన్యను తన కిమ్మని యడిగించెను. విష్ణుచిత్తుఁ డానందమున నంగీకరించెను గాని 'ఈఁదగు సంబంధపు టెనయికఁగని మోచి తెచ్చియిచ్చెనన గే చుల్కని నరులు, గాన మాపురము నకు విజయంబుసేయఁ బుత్త్రిక నిత్తుఁ' అని వారినిఁబంప వారు శ్రీహరితో నిట్లు మనవిసేయ శ్రీహరి సమ్మతించి సపరివారముగా విల్లిపుత్తూరికిఁబోయి మహారాజ

కుమారుఁడు పెండ్లికి దరలి వెడలి యొక రాజకన్యను బెండ్లాడినరీతి నామెను బెండ్లి యాడి శ్రీరంగమునకుఁ దీసికొనివచ్చి,

తే. సహ్యకన్యా తటోద్యాన చందనద్రు
కుంజముల నీలకుంతలఁ గుస్తరించి
కంతు సామ్రాజ్య మేలించి కరుణఁ జిత్త
మొలయ జగములఁ బాలించుచున్నవాఁడు.

కథావిమర్శనము

కవి ద్రావిడప్రబంధమునుండి యీకథ గ్రహించినాఁడు. గ్రహించుటలో స్వప్న వృత్తాంతములు ఆముక్తమాల్యదా దివ్యశక్తి పరిజ్ఞానము పరిహరించి రసానుగుణముగా శృంగారప్రబంధరీతికి మార్చినాఁడు. భగవంతునికి ప్రత్యక్షముగానుండు నొకరాజు వేషము కల్పించినాఁడు. ఆముక్తమాల్యదా శ్రీరంగశాయులను నాయికా నాయ కులుగా నేర్పఱచి నాయికకు మొదట విరహము కల్పించి, తర్వాత నాయకునకు విష్ణుచిత్తుని ఛాందసపు మొఱమిషమున గొంచెము ఎడఁబాటు చూపి చివరకుఁ బెండ్లి కావించినాఁడు. విష్ణుచిత్తుని ప్రపంచజ్ఞానము లేనివానిఁగా చిత్రించుట చిత్రముగానే యున్నది. తన పెంపుడుకూఁతురు పడు విరహవ్యథ తనకు ఆమె చెలులుఁగాని లేదా యాతని భార్యగాని తెలిపియుండవచ్చును. లేదా తానే గ్రహింపవచ్చు. అట్లు కాక యది యున్మాద మనుకొని మన్నారుతో మనవిసేయుట, యాయన పరిహసించి శ్రీరంగ స్వామియొద్దకుఁ బొమ్మనుటయుఁ బ్రకృతికిఁ గొంచెము విరుద్ధమే.

ఈమె లక్ష్మీదేవ్యంశసంభూత యని పూర్వకథ. ఈప్రబంధమునఁగూడ చెలి కత్తెలు నీవు సత్యభామవు గావా (5 ఆ. 74) యని యన గ్రక్కున ప్రత్యుత్పన్న విజ్ఞానయైన దని చెప్పినాఁడు. విష్ణుచిత్తుఁడు మన్నారుస్వామితో మనవిచేసికొన్నపుడు చండాలబ్రహ్మరక్షస్సంవాదమును అందలి గానప్రభావమును, వరాహావతారమునఁ దన వలన విన్న భూదేవియే గానోపచారములోఁ దన్ను సేవింప ఆముక్తమాల్యదయై వచ్చిన దని కథ మార్చి, ఆమె భూదేవ్యవతార మని చెప్పుట కేవలము చండాల బ్రహ్మరక్షస్సం వాదమున కిందు నవకాశము కల్పించుట కని తోఁచెడిని. దానిప్రయోజన మిది. విమర్శలు చదివినవిప్రునికంటె విష్ణుభక్తి గల మాలదాసరి శ్రేష్ఠుఁ డనుటయే కాక మాలదాసరివలన బ్రాహ్మణునికి ముక్తి యిప్పించుట యనునదియుఁ బ్రయోజనము.

తనకు మాలికాకరణకైంకర్యము చేయు విష్ణుచిత్తునిచేఁ బండితులను గెలిపించు టలో భగవంతుఁడు నే నున్నాఁడ నని నిలఁబడిన ట్లుండుటచే నాదోషము పరిహృత మయినది. అఘటితఘటనాసమర్థుఁడుగదా పరమేశ్వరుఁడు !

పెండ్లిచేయుటలో విష్ణుచిత్తుఁడు ఆముక్తమాల్యదను శ్రీరంగమునకుఁ గొనిపోవ నతఁ డామెను దనలో నంతర్ధానము చేసికొన్నట్లు మూలకథ యుండఁగా, మాయాకన్యా కల్పనము, విష్ణుచిత్తుని మొఱ, మరల సత్యాముక్తమాల్యద యింట నుండ బ్రహ్మాదుల ముఖమున నక్కన్య నడుగుట, మాపిల్లను మోచితెచ్చి యీయఁజాలరు, వచ్చిన పెండ్లాడవచ్చు నని కల్పించుట లౌకికరీతిని జూపుటకు, దాని సాధనమునకు మాయాకన్యాకల్పనము. వాని యాశక్తి తెలుపుటకై వెడలుటయు రంగేశు నంతఃపురముఁ జేర్చుటయుఁ గూర్పఁబడినవి. ఆముక్తమాలికలు శ్రీహరికిఁ బ్రియము లని తెలుపుటకై కథా కల్పనమునఁ గొంతకౌటిల్య మున్నది.

మనుచరిత్రకర్త యిట్లు వర్ణింప లేదు.

యామునార్యచరిత్ర విమర్శనము

ఈ చరిత్రకీ గ్రంథమునందుఁ బ్రసక్తియే లేదు. 'విష్ణుచిత్తుఁ డొకఁడు, యామునుఁ డొకఁడు వైష్ణవసిద్ధాంతము నిలఁబెట్టినవా' రని చెప్పి యామునచరిత్రమంతయుఁ జెప్పెను. అందును గొన్ని మార్పులు గావించెను. ఈ చరిత్రప్రవేశము సంఘసంస్కార నీతిబోధనములకై ప్రవేశపెట్టఁబడినది. యామునార్యుఁడు పాండ్యరాజు సభలోఁ బ్రవేశించుటలో పూర్వకథలో నిట్లున్నది.

పాండ్యరాజునొద్ద నున్న పండితుఁడు వాదమున నితరుల జయించి వారివలనఁ బన్ను పుచ్చుకొనుచుండువాఁడు. అతఁడు పన్ను నిమిత్తము భటులను బంపఁగా యామునునిగురువు ధనము లేక దైన్యమొందె. అది యామునుఁడు తెలిసికొని, వారి యుత్తరువు లున్న పత్రము చించి పాఱవైచి మఱియొక పత్రికపై 'న వయం కవయస్తు కేవలం, న వయం కేవలమంత్రపారగాః, అపితు ప్రతివాదమస్తక ప్రకటాటోప విపాటనక్షమాః.' అని వ్రాసి పంప రాజపురోహితుఁడు రాజున కది తెలిపి వానికిఁ గోపము తెప్పించి పంపించెను. వానినిరాదరాహ్వానమును నిరాకరించి యామునుఁడు రాజదర్శనమునకుఁ బోలేదు. అతఁడు చాల సమర్థుఁ డని రాజు విని సగౌరవముగాఁ బిలిపించెను. అతఁడు రాజసభకు వచ్చెను.

ప్రబంధమందలి మార్పు

రాజు శైవమతాభిమాని. రాణి వైష్ణవమతాభిమాని. రాజునకు వ్యతిరేకముగాఁ బ్రవర్తింప నిష్టములేనిది. కాని వైష్ణవులకు రహస్యముగా దానధర్మము లాచరించునది. యామునుఁ డాపురమునకు వచ్చి, వైష్ణవుఁ డగుటచే రాజసభాప్రవేశము గనఁజాలక ద్వారపాలముఖంబునఁ దనరాక రాణి కెఱిఁగించి, 'వాది గలిగినచో వైష్ణవమతము

స్థాపింపఁ గలను. రాజు వైష్ణవవిముఖుఁడు గాన నాకు సభాప్రవేశము దొరక లేదు. నీ విభుఁడు నీకు విధేయుఁడు. నీ భర్తతోఁ జెప్పి నాకు సభాప్రవేశము గలిగించితివేని వైష్ణవమతమును స్థాపించి నీ భర్తను విష్ణుభక్తిపరాయణునిఁ గావించెద నని వార్తనంపెను. ఆమె భర్తతో నేకతమం దున్న సమయమున నెఱింగింప 'ఎట్టెట్టా తావాదముచేసి శివమతము జయింపంగా వచ్చెనే చూతముగా రావింపుము?' అన్న మఱునాఁ డామె వానిని రప్పించెను. ప్రబంధమందలిదానికంటెఁ బూర్వకథారీతియే పౌరుషసూచకముగా నున్నది. కాని విష్ణుమత విముఖున కిదియేమార్గ మని కవి యట్లు మార్చెనేమో?

యామునార్యుని రాజ్యప్రాప్తి

యామునార్యుఁడు సభలో వాదముచేయఁ బోవునపుడు రాజపురోహితుఁడును రాణియుఁ, గూడ సభలో నున్నారు. యామునుఁడు పురోహితుని జయించు నని రాణి యన, యామునుఁడు జయించెనేని యర్ధరాజ్య మామె కిచ్చెద ననియెను. అతఁ డోడి పోయినచో రాణి రాజునకు ఆఱుమాసములు దాస్యముచేయ నిర్ణయ మనియె. యామునుఁడు వాదమున జయించిన తరువాత రాజు తన ప్రతిజ్ఞాప్రకారము రాణి కర్ధరాజ్యమీయఁబోవ నామె యాయర్ధరాజ్యము యామునున కిప్పించెను. అతఁడు వివాహముచేసికొని సుఖస్థితి నొందెను.

ప్రబంధమందలి మార్పు

యామునుఁ డోడినచో వానికి లింగము కట్టి శైవ మిప్పించుట, పురోహితుఁ డోడినచో రాజు పరివారాప్తసహితముగ శైవము విడిచి వైష్ణవము గ్రహించుట, రాణి కిని శైవమిప్పించుటయే ప్రతిజ్ఞావిషయము. యామునార్యుఁడు జయించిన తరువాత రాజు విష్ణుభక్తిపరాయణుఁ డయి తనచెలియలిని యామునార్యున కిచ్చి పెండ్లిచేసెను. పాండ్యదేశంబున భాగినేయుఁడే పట్టార్హుఁడుగావున చెలియలిమగఁ డగు యామున మునికి నర్ధరాజ్య మిచ్చి, యువరాజుం జేసి, సాంగవేదాధ్యయనము చేసిన యాతనికి నథర్వవేదంబు అభ్యస్త మని యెఱింగి దివ్యాస్త్రపరిజ్ఞాత యగు నాతని నెచ్చరించి దుస్సాధయోధయూథంబుపై దండయాత్ర కనిపెను. అతఁ డట్లు దండయాత్రకేఁగి శత్రువుల జయించి రాజ్యము చేయుచుండెను. పూర్వకథావిరుద్ధమును కలియుగనిషిద్ధము నగు నసవర్ణస్త్రీవివాహము ఆపద్ధర్మముగా నంగీకరింపఁబడిన శస్త్రజీవికయు, యామునాచార్యున కారోపించుటయు ఇవి యశాస్త్రీయ మని కాని కేవలము విష్ణుమతస్థాపనకై వచ్చిన స్వామి కిది అర్హమా యని కాని యేవిధమగు సందేహమును గలిగింపక స్వాభావిక కార్యానుసరణము చేసినట్లు రచించినాఁడు.

కృష్ణదేవరాయల కాలమున నట్టి ఆచార మున్నట్లు చెప్ప వీలులేదు కాని బ్రాహ్మణులు శస్త్రజీవిక యవలంబించియున్న ట్లూహింప నవకాశము కలదు. వివాహ సాంకర్య వృత్తిసాంకర్యములను చూపించి తన సంస్కరణాభిమానము వెలిబుచ్చుటకే కవి యిట్లు రచించె ననవచ్చును. రా జీప్రబంధము రచించె ననుటకుఁగూడ నిది కొంత తోడ్పడుచున్నయది యనవచ్చును. మతవాదమున జయించిన బ్రాహ్మణునికి రాజ్యమును, చెల్లెలను ఇచ్చె నని రచించుటకు బ్రాహ్మణుఁడు సందేహింపకపోఁడు. రాజ్యమును పయివానికిఁ బోనీయక యర్హున కిచ్చుటయు, బ్రాహ్మణ క్షత్రియుల సమ్మేళనము, బ్రాహ్మణుల శస్త్రపరిజ్ఞానము, దానివలన శత్రుజయము బోధింప నిట్లు రచించియుండును. ఆట్టి సంస్కారము దేశహితము. కర్త పెద్దనయే యైనచో ఇట్టి యసవర్ణ వివాహము, వృత్తిసాంకర్యము కల్పింపవలసినచో ధర్మవిరోధ మున్నదని, బ్రాహ్మణ్యము పోవుచున్నదనియో, రాజ్యభోగము పరమార్థభయంకర మనియో మొట్టో యనిపించుచుగాని సామాన్యముగా విడిచిపెట్టునా ?

ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానము

(విష్ణుపురాణము లోనిది)

పాండ్యరాజు సభలో విష్ణుచిత్తుఁ డుపన్యసించునపుడు ఇది గ్రహింపఁబడినది. మూలకథలో లేదు. ఈ సంవాదమందలి సిద్ధాంతమును ప్రమాణముగా గ్రహింపక యందుఁగల కొఱతలు చూచి భగవద్గీతాప్రోక్తమగు శరణాగతి ధర్మమే శ్రేష్ఠమును సులభమును నని యుపపాదించినట్లు రచించినాఁడు.

ఈ కథలో ఖాండిక్యుఁడు కర్మనిష్ఠ గలవాఁడు. కేశి బ్రహ్మనిష్ఠ గలవాఁడు. ఏ ఋత్విక్కులును, ఏ ఋషులును చెప్పఁజాలని ప్రాయశ్చిత్తము క్షత్రియునకుఁ దెలియుటయు, నా విషయము శౌనకాదిఋషు లంగీకరించుటయు చూపఁబడినవి. బ్రహ్మజ్ఞానమందు కేశిధ్వజుఁడే గట్టివాఁడు. వాని గురుత్వముననే ఖాండిక్యుఁడు జ్ఞానియయ్యె. బ్రాహ్మణ నిరాదరము లేదుగాన బ్రాహ్మణులకంటె శ్రేష్ఠులు. 1. శత్రువునొద్దనైనను గ్రాహ్య మున్నపుడు అది యెట్లయినను గ్రాహ్యమే యనియు, 2. శరణాగతుఁడగు శత్రువును బాధింపక వానికార్యము నెరవేర్పఁ దగుననియు, 3. శత్రువునకు మఱల రాజ్యమిచ్చి వానిని వానిస్థానమున నిలుపుట యుక్తమనియు నను మూఁడు విషయము లిందువలన గ్రహింపఁదగును.

పై నీతులు కృష్ణదేవరాయని యాచరణములో నున్నవేయని యతని యవన రాజ్య స్థాపనాచార్య బిరుదము, గజపతి విజయము, వాని కూఁతుఁ బరిగ్రహించుట

వానికి మరల రాజ్యము నిచ్చుట తెలుపుచున్నవి. పరమార్థ విషయమున భగవద్గీతా వాక్యమే ప్రమాణ మని స్థిరపఱచినాఁడు.

రాజనీతి:—ఇందు విశేషముగా పూర్వ నీతివాక్యములతో కొన్ని నూతన విషయములు చేర్పఁబడినవి. దీనిచేఁ గృష్ణరాయని రాజనీతి పద్ధతి గ్రహింపవచ్చును.

చండాలబ్రహ్మరక్షస్సంవాదము:—ఇది వరాహపురాణములోనిది. ఈ కథాప్రవేశమునకై లక్ష్మీ దేవ్యంశసంభూత యని ప్రసిద్ధిగల యాముక్తమాల్యదను భూదేవ్యంశసంభూతగా మార్చెను. ఈ కథయందు బ్రాహ్మణుఁడు యాగమధ్యమందు శూలాది బాధచే మృతి నొందుటవలన బ్రహ్మరాక్షస జన్మ మొందె నని మూలగ్రంథము. బ్రాహ్మణుఁడు వేదవేదాంగము లభ్యసించి ధనాదాయపరుఁ డయి పరదేశముల కేఁగి దుర్దానముల మూలమున ధనము సంపాదించి, తన గృహమునకుఁ బట్టుకొనిపోవుచుండఁగా దొంగలు కొట్టినట్లు, దానివలననే యాతఁడు చచ్చుచుఁ గ్రూరుఁడగు దొంగల నాయకుని దలంచుటచే వికృతమగు బ్రహ్మరాక్షసజన్మము వచ్చినట్లు మార్చినాఁడు.

తుదికి:—వానికి విష్ణుభక్తుఁ డగు చండాలునిచే ముక్తిసాధన మగు వైష్ణవ భక్తియు విప్రత్వము నిప్పించెను. ఇది వేదజ్ఞానముకంటె విష్ణుభక్తి శ్రేష్ఠమనుటకే. ఇందు రామానుజాది దృష్టాంతములు కాలవ్యత్యాస మయినను సహించియైనఁ జూపుట తన యిష్టభావము వెలిబుచ్చుటకే కదా ! ఈ కవి తన కిష్టమగు విషయముల నేదో సందర్భము కలిగించి యిందుఁ జొనుపువాఁ డనుట స్పష్టము.

పాండ్యరాజు:—నగర శోధనార్థము రాత్రి వెడలినవాఁ డని మూలకథలో నుండ భోగినీసంయోగార్థ మనుట, భోగలంపటునకైన విరక్తికలుగు ననుటకును, ముందు దైవభక్తి హెచ్చుగాఁ జెప్పఁబోవుచున్నాఁడు గాన నిట హైన్యమును కామచారమును చూపుటకు నయియుండును. అవి సామాన్యరాజులకు సహజలక్షణము. రాజు వేశ్య యింటికిఁ బోవుట యప్పటి యాచారము. రఘునాథాభ్యుదయమున రాజు తన్ను వరించిన ప్రియను జూచుట కేఁగెను. కాని యా కాంతను పిలిపించినట్లు లేదు.

ఋ తు వ ర్ణ న ము

యామునార్యుఁడు యుద్ధయాత్రకు బయలుదేరఁబోవ వర్షాకాలము వచ్చెను. ఆ వర్షాకాలము యుద్ధాద్యనర్హ మనియు సామాన్య ప్రజలకుఁ గష్ట మనియుఁ జూప నెంతయో వివరముగాఁ బ్రకృతిని వర్ణించినాఁడు.

తర్వాత యుద్ధానుకూలముగ శరత్కాలంబు వర్ణించెను. ఆముక్తమాల్యదా పరిణయమునకు వివాహమునకు నర్హమగు వసంతము వర్ణింపఁబడియెను.

కవి వర్ణ్యమును తలఁచినపుడు తనకుఁ దోఁచిన భావము లన్నియు విడువక వర్ణించు స్వభావము కలవాఁడు గావున నవి యంత విపులముచేయుట యుక్తమే.

ఇంక మనుచరిత్ర గ్రంథమున మూలకథలో రసాభాస మన్నను నట్లె యుంచినాఁడు, మార్పు చేయనేలే దనవచ్చును. మనోరమ పెండ్లి యగునప్పుడే తన సఖియుం రోగబాధచే పీడనొందుచుండ నేను పెండ్లాడి సుఖము నొందఁగలనా యన స్వరోచి యా వృత్తాంతము తెలిసికొని, తన యాయుర్విద్యాప్రభావమున వారికి బాధ బాపినట్లున్నదానిని - వివాహానంతరము వారి ప్రథమసంగమ సమయమునఁ జెప్పినట్లు మార్చినాఁడు. ఇట్టివే మఱియొకటి రెండుమార్పు లున్నవి. ఆముక్తమాల్యదలో నట్లుగాక మార్పులు పెక్కులు కలవు.

ఇందు 1. విష్ణుచిత్తవిజయము. 2. యామునచరిత్ర. 3. చండాల బ్రహ్మరక్షస్సంవాదము, గానమహిమ. 4. గోదాకల్యాణము అను నాలుగు గ్రంథములు కలవన వచ్చును.

ఉపోద్ఘాతము

[శ్రీ మేడేపల్లి వేంకటరమణాచార్యులవారిది.]

ఈ ప్రబంధరాజము జగత్ప్రసిద్ధుఁడైన కృష్ణదేవరాయలచే రచింపఁబడినది. ఆముక్త = (తనచే) ధరింపఁబడిన, మాల్య = పూలదండను, ద = ఇచ్చునది, అని శబ్దార్థము. దీనికి సరియయిన ద్రావిడభాషాపదము "శూడి కొడుత్తాళ్" = (ధరించి యిచ్చినది) అని. ఇది విష్ణుచిత్తుని పుత్త్రికయగు గోదాదేవి పేరు. ఇందుఁ జెప్పఁబడు ముఖ్య కథాంశ మీ గ్రంథ నామమువలననే స్పష్ట మగుచున్నది. దీనిలోఁ బ్రధాన ప్రతిపాద్యము గోదావిష్ణుచిత్తులకథ లగుటచే గోదాదేవినిఁబట్టి "ఆముక్తమాల్యద" యనియు, విష్ణుచిత్తునిఁబట్టి "విష్ణుచిత్తీయ" మనియు నీ ప్రబంధము నామద్వయముచే వ్యవహరింపఁ బడుచున్నది. ప్రధాన కథాశరీరముతో విశేషసంబంధము లేనివయిన నొక రీతి సంబంధమును గల్పించి కవి యామునాచార్య వృత్తాంతమును, ఖాండిక్య కేశిధ్వజ సంవాదమును, చండాల బ్రహ్మరక్షస్సంవాదమును దన యిచ్చకు వచ్చినట్లు గొన్ని మార్పులనుజేసి వర్ణించియున్నాఁడు. ఆ మార్పుల నిఁక ముందు గనఁబఱుపఁ బోవుచున్నాఁడను. గోదావిష్ణుచిత్తుల కథయును, యామునాచార్య చరిత్రమును, వైష్ణవ ప్రాచీన గురుచరిత్రమగు గురుపరంపరాప్రభావ మను శ్రీవైష్ణవ మతాచార్య చరిత్రము నుండి తీసి, వీనిలోఁగూడఁ గొంత కథాంశమును మార్చి కవి ప్రబంధరూపముగా వ్రాసెను. కావున నీగ్రంథము శ్రీవైష్ణవ మతావలంబుల కత్యంతోపాదేయము. ఇది అలంకార శాస్త్ర విహితోత్తమకావ్య లక్షణోపేతం బయి రాజిల్లుటయేకాక, విశిష్టాద్వైత సంప్రదాయ ప్రతిపాదకం బగుటచేఁ బరమార్థజ్ఞాన సంధాయకముకూడఁ దత్త్వజిజ్ఞాసువుల కుపకరించుచున్నది. అంగముగా నాయాయిప్రకరణములయందు శృంగారాదిరసము లనుప్రవిష్టములయి యున్నను, దీనిలోఁ బ్రధానరసము భక్తిరూపాపన్నమైన శాంత రసము. విష్ణుచిత్తుఁడు శ్రీవైష్ణవుల మతగురువులగు పన్నిద్దరాళ్వారులలో నొకఁడు. ఇతనికి పెరియాళ్వా రని ద్రావిడనామము. (పెరియ = పెద్ద, ఆళ్వార్ = భక్తుఁడు), అందఱికంటె భగవద్భక్తి యధికముగాఁ గలవాఁ డగుటచే నీపే రబ్బినది.

విష్ణుచిత్తుని చరిత్రము

భరతఖండము యొక్క దక్షిణ దిగ్భాగమున నుండు పాండ్యదేశమందలి దివ్య దేశములలోఁ బ్రసిద్ధిగాంచిన శ్రీవిల్లిపుత్తూరు (ధన్వినవ్యపురము) అను నొక గ్రామము

కలదు. ఈ గ్రామ మీతని నివాసస్థలము. అచట శ్రీవటపత్త్రశాయి (శ్రీవడపెరుఁగోయి లాన్) అను అర్చావతారమూర్తి ఆలయమునఁ బరిచారకుఁ డయిన ముకుందాచార్యు లీతని తండ్రి. తల్లిపేరు పద్మ. బోధాయనసూత్త్రము గలవాఁడు. యజుశ్శాఖీయుఁడు. [1]పురశ్చూడుఁడు. తలిదండ్రు లీతని జననకాలమున జాతకర్మాది సంస్కారముల నొనరించి విష్ణుచిత్తుఁ డను నామ మిడిరి. గర్భాష్టమమం దుపనీతునిఁ జేసి వేదాదివిద్యలఁ గఱపిరి. కాని యితఁడు బాల్యమునుండి విశేష విద్యాసంపన్నుఁడు కాకపోయినను సకల జగత్కారణుఁడైన శ్రీమన్నారాయణునియందును దద్భక్తులయందును నధికభక్తి గలవాఁడగుటచే స్వగ్రామమం దున్న వటపత్త్రశాయిస్వామి నుపాసించుచుఁ దమ పూర్వులు సంపాదించిన సారతమమయిన పంటభూమిలో నానావిధ పుష్పవృక్షములతోఁ గూడిన యొక పుష్పోద్యానమును వేయించి, నిత్య మాదేవునికిఁ దులసీపుష్పమాలికలఁగట్టి మాలాకారునివలె సమర్పించుచుండెడివాఁడు.

ఇట్లు విష్ణుచిత్తుఁ డచంచలభక్తితో వటపత్త్రశాయిస్వామి కవిచ్ఛిన్నమయిన పుష్పమాలికాకైంకర్యము సలుపుచున్న కాలమందు పాండ్యదేశమునకు రాజధానియైన మధురలో రాజ్యముఁ జేయుచున్న వల్లభదేవుఁ డను పాండ్యవంశపురాజొకనాఁటిరాత్రి తన పరిపాలనమును గుఱించి ప్రజ లనుకొనుమాటలను వినఁగోరి మాఱువేషమును ధరించి పురవీథులయందు సంచరించుచుండఁగా, నొకయింటి యరుగుమీఁద నిద్రించుచున్న బ్రాహ్మణుని లేపి "నీ వెవ్వఁడవు? ఈ యర్ధరాత్త్రమం దిచట నేల యొంటిగాఁ బరుండి యున్నా"వని ప్రశ్నించెను. "అయ్యా! నేను పరదేశపుబ్రాహ్మణుఁడను. కాశికిఁ బోయి గంగాస్నానముఁ జేసికొని సేతుస్నానేచ్ఛచే రామేశ్వరమున కరుగుచు నిచటికి వచ్చునంతలోఁ బ్రొద్దుగ్రుంకి చీఁకటి పడినందునఁ బయనము మాని యిచటఁ బండుకొంటి" నని విప్రుఁడు మాఱు వల్కెను. అది విని రాజు, "విప్రోత్తమా! నీవనేక దేశములఁ జూచివచ్చిన కతమున 'దేశాటనం పణ్డిత మిత్త్రతా చ' అనునట్లు మిగుల జ్ఞానమును సంపాదించిన వాఁడవై యుందువు. నీ కనేకవిషయములు తెలిసియుండవచ్చును. నీకుఁ దెలిసినవానిలో సారవత్తరమయిన యొక విషయమును నా చెవిని వేయుం" మని ప్రార్థింపఁగా, నావిప్రుఁ డాతఁడు రాజని తెలియఁజాలకపోయినను నెవ్వఁడో వినీతుఁ డగు పెద్దమనుష్యుఁ డని తలంచి, శ్లో. "వర్షార్థమష్టౌ ప్రయతేతమాసా న్నిశార్థ మర్థం దివసే

1. నడినెత్తికి జుట్టుగల శాఖయొకటి దక్షిణదేశపువైష్ణవులలో నిప్పటికి నున్నది.

యతేత, వార్ధక్యహేతో ర్వయసా నవేన పరత్రహేతో రిహజన్మనా చ"[1] అను నీ శ్లోకము నా భూసురుఁడు చదువ విని యా రాజు ఆ శ్లోకతాత్పర్యమును గ్రహించి పరలోకప్రాప్తికై తగినధర్మము నాచరింపక ఆయువునంతయు వ్యర్థముగాఁ గడపి మోస పోయితి నని నిర్విణ్ణతనొంది తన నగరికిఁ బోయి సర్వశాస్త్రార్థవేదియు భగవద్భక్తుఁడు నగు శెల్వనంబి యను తనపురోహితునిఁ బిలిపించి యాతనితోఁ, "దనతలంపు వెల్లడిచేసి బ్రహ్మ విష్ణు శివేంద్రాదులలో నెవ్వఁడు పరుఁడో? ఎవ్వని నుపాసించిన ముక్తి సిద్ధించునో ఆసంగతి దెలిపెడు నుపాయముఁ జెప్పు" మని ప్రార్థించెను. ఆందుల కాతఁడు సమ్మతించి కొలువుకూటమున నొక స్తంభము నాటించి దాని కొనను బంగరు నాణెముల సంచి యొకటి వ్రేలఁ గట్టించి "ఈ లోకమునం దే మతస్థుఁ డైనను, పరతత్త్వ మిది యని సిద్ధాంతము చేసి నన్నొప్పించుటకు సామర్థ్యము గలవాఁ డీవరాలమూటఁ బుచ్చుకొన నర్హుఁ" డని యెల్లదేశములకుఁ బ్రకటనపత్రికల నంపు మని ఉపదేశించెను అందులకు వల్లభదేవరాజు మిక్కిలి సంతోషించి తన పురోహితుఁడు చెప్పినట్లు కావించెను.

అంతట బౌద్ధులు, శైవులు, కాపాలికులు, శాక్తేయులు, మాయావాదులు, వైశేషికులు, సాంఖ్యులు, పాశుపతులు మొదలుగాఁగల నానామతస్థులలోఁ బేరుపడ సిన సిద్ధాంత ప్రవర్తకు లగువారు తమ తమ శిష్యగణములతోడ బయలుదేరి మధురకు వచ్చి రా జాస్థానమును జేరిరి.

అట్టియెడ శ్రీవిల్లిపుత్తూరిలో (ధన్వినవ్యపురము) వటపత్త్రశాయిస్వామికి నిరంత రము మాలాకైంకర్య మొనర్చుచు భగవచ్చింతాపరాయణుఁడై యున్న విష్ణుచిత్తుని కాస్వామి యొకనాఁటి రాత్రి స్వప్నమందు సాక్షాత్కరించి "ఓయి విష్ణుచిత్తుఁడా! మధురాపురము నేలు వల్లభదేవుఁడు పరతత్త్వనిర్ణయముఁ జేయింపఁగోరి తన యాస్థాన మంటపమం దొక విద్యాశుల్కగ్రంథిని వ్రేలఁగట్టించియున్నాఁడు. మతసిద్ధాంతవేత్త లనేకులు తమ తమ మతములను స్థాపించి యా ధనగ్రంథినిఁ గొనిపోవలయు నని మధు రకుఁ బోవుచున్నారు. నీ వేకువజామున లేచి యచటికిఁ బోయి వారి కుసిద్ధాంతముల నెల్ల ఖండించి మన విశిష్టాద్వైతసిద్ధాంతమును స్థాపించి రమ్ము. విద్యావిహీనుఁడ నైన నే నెక్కడ? పండితులతో వాదమెక్కడ? నని వెనుదీయకుము. నేను నీ జిహ్వాగ్రమునుండి

---

1. ఈ శ్లోకార్థముఁ దెలుపు తెలుఁగు పద్యము :—

సీ. వానకాలమునకు వలసినయవియెల్ల నార్జింపవలయు మాసాష్టకమున
రాత్రులకొనరు నర్థములెన్ని యన్నియు ఘటియింపవలయుఁ బగళ్లయందు
అపరవయోయోగ్య మగు వస్తుజాలంబు సాధింపవలయును జవ్వనమున
పరలోకమునకు సంపాద్యమెయ్యదియది గడియింపవలయు నీ యొడలియంద.

సర్వశాస్త్రజ్ఞానమును యుక్తిపాటవమును, వక్తృత్వశక్తినిఁ గలిగించెను. ఆ మాట తెగి నీ ముందఱఁ బడును. ఆ రాజు నీకు దాసుఁడగు' నని పల్కెను. అపుడు విష్ణుచిత్తుఁడు "ధన్యోస్మి" అని నిర్మాల్యమువలె భగవదాజ్ఞను శిరమున నిడికొని మధురకుఁ బోయి వల్లభదేవుని యాస్థానమును సమీపింపఁగా నా రాజు ఇతని నెదుర్కొని సముచిత సత్కారంబులు సలిపి సింహాసనాసీనుం గావించె. విష్ణుచిత్తుఁడు భగవద్దత్త ప్రజ్ఞావిశేషంబుఁ గలవాఁడగుటచే నుత్తరోత్తరోక్తి సంతానంబునఁ బ్రతివాదుల నెదిరించి క్రమక్రమముగా వారివారి మతంబుల నుండెడు విప్రతిపత్తుల వారిచే నొప్పించి వాని నన్నింటిని ఖండించి శ్రీమన్నారాయణుఁడే పరుఁడనియు, అతఁడే ఉపాస్యుఁడనియు, మోక్షప్రదాత యనియు సిద్ధాంతీకరించెను. అంతట విద్యాశుల్కగ్రంథి స్వయముగాఁ దెగి నేలఁగూలెను. ప్రతివాదు లందఱు విస్మయావిష్టచిత్తు లయిరి. రాజు విష్ణుచిత్తుని సామర్థ్యమునకు భగవన్మహిమంబునకు సంతసిల్లి యాతని నేనుంగుపై నెక్కించి ఊరేగించి పెద్దయుత్సవమును గావించెను. ఆసమయమందుఁ దన భక్తుఁడగు విష్ణుచిత్తుని పరమాభ్యుదయము వీక్షింపఁగోరి లక్ష్మీకాంతుండు కమలాలయా ద్వితీయుఁడై యంతరిక్షమున గరుడవాహనమునుండి యాతనికి తనదర్శనమును బ్రసాదించెను. విష్ణుచిత్తుఁడు భగవంతుని సేవించి యనేక సూక్త వాక్యములతో స్తుతించి ధన్యుఁడై రాజు నానతి మరలఁ దన గ్రామమునకుఁ బోయెను.

బ్రాహ్మణుఁ డొకఁడు వృషగిరిలోనున్న స్వామిని సేవించివచ్చి మధురలో రాజు పురోహితునియింట బసచేసి వేసవిబాధచేఁ బైనిపండుకొని తోడివిప్రులతో నుఖుసుఘోకరుఁ జదువుచున్న శ్లోకములలో నొకటియైన "వర్షార్థమష్టా" అను శ్లోకమును రాజు వేశ్యాసంగతికిఁ బోవుచుండఁగా వినె ననియు, మొదటఁ దనకు లభించిన ద్రవ్యమును విష్ణుచిత్తుఁడు భాగవతార్చనముక్రిందను దేవాలయముక్రిందను వ్యయపఱచుటచే రిక్తుఁడయ్యె ననియు, భగవంతుఁడు కరుణించి యతని గృహమును మణిమయముగాను సర్వసంపత్సమృద్ధ మయినదిగాను నిర్మింపు మని దేవశిల్పి యగు విశ్వకర్మ నాజ్ఞాపించె ననియు, నీప్రబంధములో నున్నది. ఈ కథ కాకరగ్రంథ మగు గురుపరంపరాప్రభావములో నీయంశములు గానరావు. రాజసభలో విష్ణుచిత్తుఁడు పరతత్త్వవిషయకోపన్యాసమును జేయునప్పుడు శ్రీవిష్ణుపురాణషష్ఠాంశప్రతిపాదిత మగు ఖాండిక్య కేశిధ్వజసంవాదము నుపన్యసించినట్లు ప్రబంధములో నున్నది. ఇదియునుంగూడ మూలగ్రంథమం దనుక్తము.

యామునాచార్యచరిత్రము

ఈతఁడు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకాచార్యులలో ముఖ్యతముఁడగు నాథమునికిఁ బౌత్త్రుఁడు ఇతఁడును బితామహునికంటెఁగూడ నధికతరమయిన వైదుష్యము

గలవాఁడు. ఇతని నివాసస్థలము చోళదేశమందలి వీరనారాయణపురము. తండ్రిపేరు ఈశ్వరముని. ఇతనిబాల్యమునఁ జోళదేశమునేలు రాజుయొక్క పురోహితుఁడు అక్కియాళ్వా నను నతఁడు లోకాతిశాయి పాండిత్యముగలవాఁడై ఆకాలమం దాదేశమున నుండు పండితుల నందఱను వాదమం దోడించి వారివలనఁ గప్పము గొనుచు "విద్వజ్జన కోలాహలుఁడ"ను బిరుదము నొందెను. ఒకనాఁడు యామునముని తన గురువునొద్దఁ బాఠమును జదువుచుండ నారాజపురోహితుఁడు తన కీయవలసిన కరము నిమ్మని యామునార్యుని గురువున కొకజాబు నంపెను. ఆగురువు దరిద్రుఁడగుటచే ధనమీయఁ జాలక దైన్యమునొందఁ జూచి యామునార్యుఁ డాపత్రికను నూఱుముక్కలుగాఁ జింపి మఱియొక పత్రమును దీసికొని "న వయం కవయస్తు కేవలం న వయం కేవలతంత్ర పారగాః, అపితు ప్రతివాది మస్తకప్రకటాటోపవిపాటనక్షమాః" అను శ్లోకమును దానిపై వ్రాసి ఆ దూతచేతి కిచ్చి పంపెను. రాజపురోహితుఁ డగు అక్కియాళ్వానది చూచి కుపితుఁడై రాజున కెఱింగింప నారాజు తనపురోహితునితో శాస్త్రవాద మొనరించుటకు విచ్చేయు మని యామునార్యునిఁ బ్రార్థించెను.

అతఁడు రాజుప్రార్థన మంగీకరించి రాజుసభకుం బోయెను. వీరిరువురకు శాస్త్రవాదము జరుగునపుడు మాధ్యస్థ్యము వహించుటకు నానాదేశములనుండి పండితులు రావింపఁబడిరి. అత్తఱి శ్రీవైష్ణవమతమం దాసక్తిగల రాజభార్య తన వల్లభునిఁ జూచి మనపురోహితుని యీ యామునాచార్యులు జయింపఁగలడని ప్రతిజ్ఞ చేసెను. అందులకు రాజు, యామునాచార్యులు విజయము నొందినయెడల నీ కర్ధరాజ్య మొసంగెదః పురోహితుఁడు గెల్చినచో నాఱుమాసములవఱకు నీవు నా యాజ్ఞకు లోఁబడవలసినదాన" వని చెప్పెను. అందులకు రాణి సమ్మతించెను. అపుడు రాజపురోహితుఁడు యామునార్యు నాలోకించి "నీవు విద్వాంసుఁడవైనను బాలుఁడవు. నాతో వాదించుటకుఁ దగిన శక్తిలేనివాఁడవు కావున మూఁడు లౌకికవాక్యములను జెప్పుము. నేను వానిని ఖండించెదను. లేదా నేను మూఁడు లౌకికవాక్యముల నుచ్చరించెద నీవు వానిని కాదనుము. జేత, తన పాదములలోఁ బరాజితునిశిరముఁ దన్నవలయు" నని ప్రతిజ్ఞఁ జేసెను. అట్లే కా నిమ్మని యామునేయుఁడు "నీతల్లి వంధ్య కాదు, ఈరాజు సార్వభౌముఁడు, రాజమహిషి పతివ్రత" అను మూఁడువాక్యముల నుడివి వీనిని నిషేధించు మనెను. అందుల కాపురోహితుఁడు ప్రత్యుత్తరమీఁజాలక మూకీభూతుఁడై తలవంచుకొనెను. రాజు మిక్కిలి సంతసిల్లి వివాదసమయమందు యామునార్యుఁడు గెలిచినచో భార్యకిచ్చెదనని వాగ్దానము జేసిన అర్ధరాజ్యమును భార్య ప్రార్థింపఁగా యామునార్యున కిచ్చెను.

యామునార్యుఁ డిట్లు సమధిగత రాజ్యవైభవుఁ డయి ద్వితీయాశ్రమమును స్వీకరించి సకలభోగముల ననుభవించుచు సుఖముగాఁ గాలము పుచ్చుచుండ నీతని పితామహుని ప్రశిష్యుఁడగు శ్రీరామమిశ్రుఁ డను వైష్ణవోత్తముం డొకఁడు యామునార్యుఁడు పాండిత్యపుఁ గలిమిచే విష్ణుదర్శన స్థాపకుఁడుగ నుండుటకు బదులుగ నిట్లు రాజ్యభోగకాంక్షఁ దగిలి తృతీయపురుషార్థపరుఁడై యుండె నని చింతిల్లి యతనికి వైరాగ్యముఁ బుట్టింప నెంచి యాతనిఁ జూడఁబోయెను. దౌవారికులచే ద్వారమందు నివారిత ప్రవేశుఁడై రాజదర్శనోపాయము నాలోచించుచు, నెట్టకేల కాతని పాచకునితోఁ జెలిమిచేసి యాతనికిఁ బ్రీతికరమగు ముండ్లముస్తెకూర ననుదినముఁ దెచ్చి యిచ్చుచుండెను. పాచకుఁడు నాశాకమును వండి యామునార్యుని భోజనసమయమందు భోజనపాత్రమం దుంచుచుండెను. ఇట్లాఱుమాసములు గడచినపిమ్మట శ్రీరామమిశ్రుఁడు విసికి వేసారి యేనాఁటికిని యామునార్యుఁడు తన వృత్తాంతమును దెలియఁ జాలఁ డాయె నని మనస్తాపమునొంది నాలుగు దినములు శాకము నిచ్చుట మానెను. తరువాత నొకనాఁడు యామునార్యుఁడు భోజనసమయమున నాశాకము లేకపోవుటకుఁ గారణ మడిగెను. అందుపై నాపాచకుఁ, డెవ్వఁడో యొక వృద్ధవైష్ణవుఁ డాకూర నిన్నిదినములు దెచ్చి యిచ్చుచున్నాఁడు ఏమికారణముననో నాలుగయిదు దినముల నుండి తే లేదని చెప్పెను ఆమరుసటిదివసమందు శ్రీరామమిశ్రుఁ డెప్పటియట్ల శాకపాణియై యామునార్యుని పాకశాల కరుగ, నాపౌరోగవుఁడు వానిం జూచి మాప్రభువు నిన్ను నేఁడు తన మ్రోలకుఁ దీసికొని ర మ్మని నా కుత్తరు వొసంగె నతనిం జూడఁ బొమ్మని చెప్పెను. శ్రీరామమిశ్రుఁడు యామునార్యుకడ కేఁగ నాతఁడు సాష్టాంగదండప్రణామంబు లాచరించి, యథార్హసత్కారకలాపంబున రంజిల్లఁజేసి, సముచితాసనాసీనుం గావించి యాతఁ డేతెంచిన ప్రయోజనం బడిగెను. అంత శ్రీరామమిశ్రుఁడు "నేను నిస్స్పృహుఁడను. ప్రయోజనాపేక్షినై మీయొద్దకు వచ్చినవాఁడనుగాను. మీతాత యగు నాథముని మీకొఱకు నొక నిక్షేపము నాయొద్ద నుంచి మీ కిమ్మని చెప్పెను. దానిని మీ కొసంగుటకు మి మ్మిటఁ జూడవచ్చితి నన, యామునార్యుఁడు సంతోషభరితుఁడై యాతనివెంబడి శ్రీరంగమునకుం జనియె. అచట శ్రీరామమిశ్రుఁడు యామునార్యుని శ్రీరంగనాయకునిసన్నిధికిఁ గొనిపోయి "ఇదియే మీతాత మీకిమ్మనిచెప్పిననిక్షేప"మని శ్రీరంగనాథునిపాదారవింద ద్వంద్వముఁ జూపెను. యామునార్యుఁ డపు డానందపారవశ్యముచే మైమఱచి కొంతవడికిఁ దెలిసి, 'ఆహా! ఇట్టి పరమ ప్రాప్యవిషయమును విడనాడి యింతకాలము క్షుద్రభోగంబులఁ దగిలియుంటిని. బుద్ధి కెంత మోసము వాటిల్లె' నని దుఃఖించి సద్యస్సంజాత వైరాగ్యుఁ డై కుమారునికి రాజ్య మొప్పగించి తాను ప్రవ్రజించెను. ఇది గురుపరంపరాప్రభావములోనికథ.

ఈయామునార్యచరిత్రమునకు కవి యీప్రబంధమునందు విష్ణుచిత్తుని కథతో నొకరీతి సంబంధము గల్పించి యీదిగువవ్రాసినవిధమునఁ గొంతమార్చి శ్రీవిల్లిపుత్తూరు వటపత్త్రశాయిస్వామి లక్ష్మితోఁ జెప్పినట్లు చెప్పియున్నాడు.

విష్ణుచిత్తుఁ డొకనాఁడు యథాపూర్వముగా స్వామికి మాల్యముల నర్పించి యింటికిఁ జనుచుండ, నతనిఁ జూచి స్వామి లక్ష్మితో ని ట్లనియె.

తే. "యామునాచార్యుఁ డొక్కఁడు నీమహాత్ముఁ
డొక్కఁడును గాదె మన్మతం బుద్ధరించి
రస్మదీయకృపాతిశయమున ననిన
నిందిరాదేవి తనభర్త కిట్టు లనియె." 4. ఆ. 39 ప.

క. "ఇతనికథ యెఱిఁగినదికా, యతఁడేమి యొనర్చె ననిన నబ్జాక్షుండా
శతపత్త్రనిలయకిట్లను, నతివకలం డొకఁడు మత్పదాశ్రితుఁ డాదిన్." 4ఆ. 40ప.

పాండ్యదేశపు రాజొకఁడు శైవమతమం దతిగాఢభక్తిఁ గల వాఁడై విష్ణుభక్తుల నవమానించుచు నతిశ్రద్ధతో జంగమార్చనఁ జేయుచుండెను. అతనిభార్య విష్ణుమమ దభినివేశము గలది యయి లోకులకు నానావిధోపకారముల నొనర్చుచుఁ బరమ ధార్మికురా లయి తనభర్త విష్ణుభక్తి విముఖుఁడై నందులకు మిగులఁ జింతిల్లుచుండెను. ఇట్లుండ నొకనాఁ డారాజమహిషి యేకాంతమునందుఁ బ్రాణవల్లభునితో నా యామునార్య వృత్తాంతం బెఱింగింప నారాజు విని అదరిపడి "ఎట్టెట్టా? ఆబ్రహ్మచారి మాశైవ మతమును వాదమందు జయింపఁగలవాఁడా? ఏమి వింత! పిలువ నంపుము. చూత మాతనిశక్తి" యన నారాజపత్ని ప్రతీహారిచే నాతని రావించె. వచ్చిన యామునార్యునిఁ జూచి రాజు భార్యతో ని ట్లనియె. "ఈవాదమున మాశివమతస్థుఁ డోడెనేని విభూతి రుద్రాక్షములఁ బరిత్యజించి నే నీతనిచేఁ జక్రాంకితుఁడ నయ్యెద. లేక నీతఁ డపజయమును నొందెనేని నీవు నీతఁడు శైవదీక్ష వహింపవలసియుండును" అని, అందులకు రాణి సమ్మతించెను. అపుడు యామునార్యుఁ డాశైవమతస్థులతో వాదించి సప్రమాణమయిన యుక్తులచే వారి నందఱను జయించి విష్ణుదేవుండే పరతత్త్వం బనియు, విశిష్టాద్వైతంబె మతం బనియుఁ స్థాపించెను. ఇట్లయ్యామునాచార్యుఁడు సిద్ధాంత మొనర్చినసమయమున నా రాజ్యస్థాపనమున కెదుట నున్న రావిచెట్టునుండి "ఓయి రాజా! ఈబ్రహ్మచారి చెప్పినదే సత్యము. శ్రీమన్నారాయణుండే పరబ్రహ్మ యగుటం జేసి యద్దేవుని యుపాసింపు"మని యొకయశరీరవాణి యందఱు వినునట్లు బయలువెడలెను.

అంత నాపాండ్య దేశాధీశ్వరుఁడు యామునార్యుని మాహాత్మ్యంబునకు సంతోషించి సాష్టాంగమెఱఁగి సద్యస్సముత్పన్న భగవత్పదారవిందభక్తిచే ధన్యుఁ డై

పాండ్యదేశంబునకు భాగినేయుండగు రాజ్యార్హుండు గావునఁ బాత్రంబని బ్రహ్మచారి యగు వానికిఁ దనకడగొట్టు చెలియలిం బెండ్లిచేసి యరణంబుగా నమ్మహాత్మునకు ధారాపూర్వకంబుగా నర్ధరాజ్యం బొసంగి యువరాజుం జేసి దుర్జయుం బగు నిజ విరోధివర్గంబుఁ బరిమార్పు మని దండయాత్రకుం బనిచిన నయ్యామునేయుండును బ్రస్థానోన్ముఖుండు గాఁగ, నట మంత్రులు వర్షకాలము సమీపించినది గావున దీనినిఁ గడపి శరత్సమయంబునఁ బోవచ్చు ననఁ బయన మాపెను.

పిదప నీతఁడు దిగ్విజయయాత్రలో నుండు సమయంబున నాథమునిప్రశిష్యుం డగు శ్రీరామమిశ్రుండు శ్లో. "అయత్నతో యామున మాత్మదాస మలర్క పత్రార్పణ నిష్క్రయేణ, యఃక్రీతవా నాస్థిత యౌవరాజ్యం నమామి తం రామ మమేయసత్త్వమ్" అను శ్లోకోక్త ప్రకారముగాఁ దన పరమగురుపౌత్రుం డగు యామునార్యుఁ డిట్లు భగవత్ప్రపత్తి సామ్రాజ్యంబు మరచి రాజ్యభోగాసక్తుం డయ్యె నని వగచి, యాతనికి నిత్యము ముండ్లముస్తెకూర నిచ్చి జ్ఞానవైరాగ్యంబులఁ గలిగించి శ్రీరంగంబునకుఁ దోడితెచ్చి శ్రీరంగనాథుని సేవింపఁజేసెను. తరువాత నీతఁడు తన కుమారునికి నీతి నుపదేశించి రాజ్య మొప్పగించి తురీయాశ్రమమును స్వీకరించెను.

యామునార్యుఁడు శైవమతస్థుఁడగు పాండ్యరాజును వైష్ణవునిగాఁ జేయుట; తాను బ్రాహ్మణుఁడై యుండియు క్షత్రియజాత్యుత్పన్నురాలగు పాండ్యరాజు సోదరిని వివాహమాడుట; కుమారునికి రాజనీతి నుపదేశించుట; క్షత్రధర్మావలంబియై యుద్ధముఁజేసి పగఱ గెల్చుట; అను నీయంశములు గురుపరంపరాప్రభావములో నున్న యామునాచార్యచరిత్రయందుఁ జెప్పఁబడ లేదు. ఈయంశములు కవికల్పితము లని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

ఆముక్తమాల్యద (గోదాదేవి) చరిత్ర

పూర్వోక్తచరిత్రగల విష్ణుచిత్తుఁడు పాండ్యరాజుసభలో జయముఁ గొనివచ్చిన మఱికొంతకాలమునకు యథాపూర్వముగా ఖనిత్రముతోఁ దులసీకాననభూమిఁ ద్రవ్వు చుండ నొకనాఁడు "తదా ఖనిత్ర వక్త్రేణ విష్ణుచిత్తే మహాత్మని, తులసీవృక్ష మూలస్య ఖననం చ ప్రకుర్వతి, లక్ష్మ్యంశా ల్లోకరక్షార్థం గోదా భూమ్యా స్తతోఽజని" అన్నట్లొక కన్యక భూమినుండి యావిర్భవించెను. విష్ణుచిత్తుఁ డామెను జూచి ప్రమోద భరితాంతరంగుఁడై యానిసుఁగుబిడ్డనింటికిఁ గొనిపోయి పెంచు మని భార్యచేతి కిచ్చెను. ఆమెకు గోద యని నామమిడెను. గోదాదేవి చంద్రకళవలె దినదినప్రవర్ధమాన యాచు నసమానలావ్యణముఁ గలిగి లోక నేత్రాహ్లాదకారిణి యయ్యెను. చిన్ననాఁటనుండియు నీమెకు భగవద్భక్తి మెండుగ నుండెను. శ్రీమన్నారాయణునిఁదప్ప ప్రాకృతమనుష్య

నెట్టివానినైనఁ బెండ్లియాడ నని ప్రతినపట్టెను. తనతండ్రి వటపత్త్రశాయిస్వామికొఱకు నమర్చి పెట్టిన కుసుమమాలికల మొదటఁ దానొకపరి తన కొప్పుపై ధరించి, బావిలో సౌందర్యమును జూచికొని తిరుగ నాపూలదండల నెప్పటియట్ల తండ్రికిఁ దెలియకుండఁ బూలసజ్జలో నుంచునది. ఇట్లనేకదినములు జరుగఁగా నొకనాఁ డామె మాలికను గొప్పునఁ జుట్టికొనుట జనకునికంటఁ బడెను. అతఁ డామెను నోనాడవెఱచి, "తల్లీ! దేవుని కర్పింపఁదగిన మాలికల నీ విట్లు ధరించుట యుచితమగునా" యని మందలించి, యాది నమున స్వామికి మాలికాసమర్పణము మానెను. ఆనాఁటిరాత్రి స్వామి విష్ణుచిత్తునికి స్వప్నమందు సాక్షాత్కరించి మాల్యములు సమర్పింపక పోవుటకుఁ గారణ మడిగెను. అందుల కాతఁడు "స్వామీ! ముగ్ధయగు నాపుత్త్రిక బాల్యసులభచాపల్యముచే నామాలికను ధరింపఁగాఁ జూచి యవి నిర్మాల్య మయ్యె నని పరిహరించితిని; మఱియొకటిఁ గట్ట బూవులు లేకపోయెను. క్షమింపుఁ" డనెను. అది విని స్వామి సస్మితోష్ఠపుటముతో నిట్లనియె. "ఓయీ! ఆమె యెవ్వరో నీ వెఱుఁగనివాఁడ వగుటచే నిట్లొనర్చితివి. ఆమె లోకరక్షార్థమయి యీ విభూతియం దిట్టిరూపముతో నవతరించిన లక్ష్మి. నీభాగ్యవశమున నీకు లభించెను. ఇటనుండి నీవు నిర్మించుమాలికల మొదట నామెకొప్పున నలంకరించి పిమ్మట మాకుఁ దెమ్ము. ఆమె తాల్చినమాలికయే మాకు స్పృహణీయము. ఆమె కబరీసంపర్కములేని స్రజము నే నొల్లను." అప్పటినుండి విష్ణుచిత్తుఁ డామెయందు పుత్త్రిక యను ప్రాకృతాభిమానమును విడిచి పరదేవతాభావమును జూపఁదొడఁగె. ఇట్లు క్రమముగా గోదాదేవి సంప్రాప్త యౌవనయై గోపికలవలె కృష్ణునియం దత్యర్థానురాగముఁ బూని అహర్నిశములు దత్ప్రాప్తికై ధ్యానించుచుండెను. కృష్ణసంశ్లేషముకొఱకు గోపాంగనలు కాత్యాయనీవ్రతము నాచరించి రని విని, యామెయు వారి ననుకరించి ధనుర్మాసములో ముప్పదిరోజులు వేకువజామున లేచి తోడిబాలికలతో స్నానముచేసి వటపత్త్రశాయిస్వామిని సేవించుచు, దినమునకొక్కకగాథను (శ్లోకము) ద్రావిడభాషలో రచించి స్వామిసన్నిధిని విన్నవించుచు వ్రతము చేసెను. ఇట్లు భగవంతునియం దీమె అత్యంతానురక్తయై విగళితాన్యభావ యగుటఁ జూచి కింకర్తవ్యతామూఢుఁడై విష్ణుచిత్తుఁ డొకనాఁ డీమెస్థితిని వటపత్త్రశాయిలో విన్నవింప, నాశౌరి యామెను శ్రీరంగమునకుఁ గొనిపోయి రంగనాథుని కిచ్చి వివాహముఁ జేయు మని ఉపదేశించెను. విష్ణుచిత్తుఁ డట్లు గావింప నీమె రంగనాథుని సాయుజ్యపదవి నొందెను.

ఇది గురుపరంపరాప్రభావములో వక్కాణింపఁబడిన గోదాదేవి కథ. దీనికిని ఈ ప్రబంధములోఁ జెప్పఁబడిన కథకును గొంచెము భేదముఁ గలదు. ఎట్లన: ఈగోదాదేవి పూర్వభవమున భూదేవి గావున బూర్వజన్మ స్నేహమువలన మరాళికా, స్రగ్వేణీ

ఏకావళీ, మాలినీ, మనోజ్ఞ అనునామధేయములుగల నాగకన్యక లీమెతోఁగూడ నీవిల్లి పుత్తూరుగ్రామములో బ్రాహ్మణగృహములయం దవతరించి, గోదాదేవికి నెచ్చెలులయి యుండి రని కవి చెప్పుచున్నాఁడు. ఇదిగాక మఱియొక విశేషము. అనపత్యుఁడు ఛాందసుఁడు లోకానుభవహీనుఁడు నగువిష్ణుచిత్తుఁడు కృష్ణునియం దనురాగముగల గోదాదేవియొక్క మనోభవవేదన నెఱుంగఁజాలక, వటపత్త్రశాయిస్వామితో నామె యున్మాదావస్థ పొడమిన దని దైన్యముతో విన్నవింప నాస్వామి లోకస్థితి నెఱుఁగని యాతనిమౌగ్ధ్యమునకు నవ్వి "తొల్లిభూదేవికి వహనసమయమందు వరాహదేవునిచేఁ జెప్పఁబడిన చండాల బ్రహ్మరక్షస్సంవాద మను నొక పుణ్యకథ నాతనికిఁ దెల్పి, యీ నీపుత్త్రిక పూర్వజన్మంబున ధాత్రీకాంత గావున మదీయ సకల పూజోపచారంబులలో గానంబె నాకెక్కువ ప్రీతికర మనియు! విశేషఫలప్రదం బనియు నక్కథలో వినియుం డుటవలన నిపుడు వైష్ణవి యై యవతరించి ప్రత్యహంబును తనకు భగవంతునియం దుండెడు ననురాగమును బట్టఁజాలక యీరీతినిఁ బాటలఁబాడుచుఁ గీర్తించుచున్నది వేఱొండుగాదు. నీకు మేలయ్యెడు. ఈమెను రంగేశు సేవింప శ్రీరంగంబునకుఁ దోడుకొని పొమ్మని సెలవిచ్చెను.

చండాలబ్రహ్మరక్షస్సంవాదము

ఈకథ వరాహపురాణాంతర్గతము. శ్రీవరాహభూదేవీ సంవాదములో భగవద్గాన మాహాత్మ్యమును బ్రతిపాదించు నలువ నాలుగవ సర్గలో నిట్లు చెప్పఁబడినది.

"శ్రీవరాహ ఉవాచ—శ్లో. జాగరేతు విశాలాక్షి జానతోవా ప్యజానతః, యోమేప్రగాయతే గీతం మమభక్త్యా వ్యవస్థితః, యావంతి త్వక్షరాణ్యత్ర గీయమానే యశస్విని, తావ ద్వర్ష సహస్రాణి స్వర్గలోకే మహీయతే, ఏవం తు వచనం శ్రుత్వా తత్ప్రసాదాద్వసుంధరా, వరాహరూపిణం దేవం ప్రత్యువాచ శుభాననా, అహో గీత ప్రభావోవై యస్త్వయా పరికీర్తితః, కశ్చిద్గీతప్రభావేన సిద్ధిం ప్రాప్తో మహాతపాః, వదస్వ మమ దేవేశ ప్రసాదసుముఖో యది."

"శ్రీభగవానువాచ—శ్రుణు తత్త్వేన మే భూమే కథ్యమానం యశస్విని, యస్తు గీతప్రభావేన సిద్ధిం ప్రాప్తో మహాతపాః, అస్తి దక్షిణదిగ్భాగే మహేంద్రో నామ పర్వతః, తత్ర క్షీరనదీ పుణ్యా దక్షిణే సాగరంగమా, తత్రసిద్ధాశ్రమే భద్రే చండాలః కృతనిశ్చయః, దూరాజ్జాగరణే గాతి మమ భక్త్యా వ్యవస్థితః" అని యున్నది.

ఈ చండాలుఁడు పరమభక్తుఁడు తననివాసమునకుఁ గొంచెదవ్వుగా మఱియొక యూరిలో నున్న దేవాలయమునకుఁ బోయి యచట భగవత్సన్నిధియందు నిత్యము భగవత్కల్యాణ గుణప్రతిపాదకము లగు గీతములఁ బాడుచు భగవంతుని స్తోత్రము జేయుచుండును. ఇట్లు పదిసంవత్సరములు గానకైంకర్యము చేఁ గడపెను. ఒక కాలమందు

కార్తిక శుక్ల ద్వాదశినాఁటిరాత్రి యామముకాఁగా వీణనెత్తుకొని మంగళకైశికినిఁ బాడుటకు దేవాలయమునకుఁ జనుచుండెను. "కౌముదస్యతు మాసస్య ద్వాదశ్యాం శుక్లపక్షకే, సుప్తే జనే గతేయామే వీణామాదాయ నిర్యయౌ." అంతట దారిలో బలవంతుఁడు క్రూరుఁడు నైన బ్రహ్మరాక్షసుఁ డొకఁడు వీనిని బట్టుకొని "నేఁటికి పదిదినములనుండి నాకాహారము లభింపలేదు; దైవవశమున నీవు నాకంటఁబడితివి; నిన్ను భక్షించెద" నని చెప్పెను. దాని కీమాలదాసరి భయము నొందక "అట్లే నీవు నాశరీరమును భక్షింపవచ్చును. ఈశరీరము నీదియే. కాని నే నీప్రాంతమున నున్న దేవసదనమునకుం బోయి భగవత్సన్నిధిలో మంగళకైశికీగానముచే భగవంతుని రంజింపఁ జేసి సూర్యుఁ డుదయింపకమునుపు నీకడకుఁ దప్పక రాఁగలను; నామాట నమ్ము"మని చెప్పి రాక్షసునకు విశ్వాసము బుట్టించుట కనేకవిధముల శపథములఁ జేసెను. ఎంత నమ్మించినను దనుజుఁడు సరకు గొననందున నెట్టకేలకు శ్రీమన్నారాయణు నన్యదేవతలతో సమానముగాఁ జూచినవాని మహాపాతకమును బొందెద నన, నా రాక్షసుఁడు వానిని విడిచి పెట్టెను. వాఁడును ద్వరితగతి దేవళమునకుఁ జని యా రాత్రియంతయుం జాగరణ మొనరించి కైశికీగానముచే సర్వేశునిఁ గీర్తించి, తరువాత స్వప్రతిజ్ఞానుగుణముగ రక్షోనివాసభూత మగు న్యగ్రోధపాదపంబు దరిఁజేరి "ఇదె చూడు, వచ్చియున్నాఁడను, నీయిచ్చవచ్చినటుల న న్నిఁక భక్షింపు"మని ఎలుఁగెత్తి చెప్పెను. ఆమాట విని రాక్షసుఁ డీమాలదాసరిసత్యప్రతిజ్ఞకు విస్మయము నొంది, "ఆహా! వీఁ డెట్టి మహానుభావుఁడు? వీనివలన నా కీదురవస్థ నివృత్తంబగు"నని తలంచి, "ఓయి చండాలుఁడా! 'త్వమద్యరాత్రౌ చండాల విష్ణో ర్జాగరణంప్రతి, ఫలం గీతస్య మే దేహి.' నీ వీరాత్రి విష్ణు సన్నిధిలో జాగరణముచేసి పాడిన పాటయొక్క ఫలమును నా కిచ్చి తరింపఁ జేయుము. లేక తదర్థ మయిన నొసంగుము; అందులకు సమ్మతింపవేని యొక యామములోఁ బాడిన పాటయొక్క ఫలమునైన నా కిమ్ము; దానికి నంగీకారము లేనియెడఁ గొనపాట యగు కైశికియొక్క సుకృతము నయిన నాకు ధారవోయు"మని రాక్షసుఁడు దాసరి పాదములపైఁ బడి పలువిధములఁ బ్రార్థింపఁ, దుట్టతుద కాతఁడు కరుణించి కైశికీ గానఫలము నిచ్చెను. తత్క్షణంబ వానిపిశాచత్వము నివర్తించెను. ఇట్లు శ్వపాకుని కృపచే నివృత్తరక్షోజన్ముఁ డైనయాతఁడు బ్రాహ్మణుండై యెదుట నిలచి తనపూర్వజన్మవృత్తాంతము నిప్పగిదిం జెప్పె. "నేను పూర్వము చరకగోత్రోత్పన్నుఁడనైన సోమశర్మ యను విప్రుఁడ. నేను చేయఁబూనినయజ్ఞకర్మ సమాప్తి నొందకమున్ను శూలదోషముచే దీక్షాదినములలో మృతినొందితిని. దాన నీజన్మము సంభవించెను. నీదయచే నిపు డుత్తీర్ణుఁడనైతిని. పోయి వచ్చెద, సెలవిమ్ము" అని పలికి యా మాతంగుని వీడ్కొల్పి తనయిచ్చం జనెను.

పైనుపపాదింపఁబడిన మాతంగ బ్రహ్మరక్షస్సంవాదమునకు ప్రధానకథతో సంబంధము లేకపోయినను, కవి యేదో యొకవిధమున సంబంధముఁ గల్పించి కొన్ని మార్పులు చేసి దీనిలో విశిష్టాద్వైతమత సంప్రదాయంబున యుక్తి చాతుర్యంబును, జ్ఞానపూర్తియుం గనఁబఱచి మిక్కిలి సొగసుగా వ్రాసినాఁడు. ఎట్లనః

మాలదాసరి తనపల్లెనుండి తిరుక్కురుంగుడి యను దివ్యదేశమందున్న దేవాలయమునకుఁ బోవుచుండ మార్గమధ్యమున రాక్షసునిచేఁ బట్టుకొనఁబడియెను. అనేకనీతులను ధర్మములను సయుక్తికముగ బోధించినను విడువలేదు. తుద "కన్యదేవతలతో శ్రీమన్నారాయణునిఁ దుల్యముగాఁ జూచినవాని పాపము నొందినవాఁడ నగుదు" నని ఘోర ప్రమాణముఁ జేయఁగా రాక్షసుఁడు వానిని విడిచెను. దాసరి కురుంగుడినంబి కోవెలకుఁ జని కైశికగానముచే భగవంతు నానందింపఁజేసి తిరుగ బ్రహ్మరక్షస్సుకడకు వచ్చి "నా ప్రతిజ్ఞాప్రకారము వచ్చినాఁడను, న న్నింకఁ భక్షింపు" మని నుడివిన, యారక్కసుఁడు మనః పరిపాకముఁ జెంది జ్ఞానోదయముఁ గలవాఁడై "ఓయి మహానుభావా! ఇటపై నా అయోగ్యతను గణింపకుము. ఎవ్వఁ డైన నీవంటి భాగవత వతంసుఁ డొకఁడు వచ్చి నన్నెన్నఁడైనఁ దరింపఁజేయునా యని వేచియుంటి. నీ వి ట్లానతిచ్చుట న్యాయమా? న న్నీపిశాచత్వమునుండి యుద్ధరించుట కుపాయ మాలోచింపుము. ఘంటాకర్ణునికంటె నే నధికతరపాప మొనర్పలేదు. అట్టివానికే శ్రియఃపతి పరిశుద్ధునిఁజేసి మహోన్నతపదవి నొసంగెను. ఆభగవంతుని భక్తులైన భాగవతులు నట్టివారె. ఎట్టి పాపులనైన రక్షింపఁగలరు. కావున నీ విపుడు భగవత్సన్నిధిని బాడిన పాటయొక్క ఫలము నాకిచ్చి నన్ను రక్షింపు." మని యనేకవిధముల మొఱలిడ విష్ణుభక్తుఁ డైన దాసరి యొప్పుకొనలేదు. అందుపై రాక్షసుఁడు గుర్వాజ్ఞ నుల్లంఘించి గోప్యమయినమంత్రమును సకలజనుల కుద్ఘోషించి చెప్పిన శ్రీవైష్ణవసిద్ధాంత కర్తయగు శ్రీరామానుజుని పరసమృద్ధియుఁ బరోపకారబుద్ధియునుఁ గొనియాడి, నీవు నాపగిదిని నావిషయమయి యుపకరింప వలయు నని ప్రార్థించి, తిరుగ నా రామానుజమునియే మఱియొకజన్మంబున రమ్యజామాతృయోగియై యవతరించె ననియు, నతఁడె కాలాంతరమున శఠకోపుఁడై జనించి జ్ఞానహీను లయిన మనుజులకు జ్ఞాన ముపదేశించి భగవద్భక్తుల నొనరించె ననియుఁ జెప్పెను. ఇది శ్రీవైష్ణవమత సంప్రదాయగ్రంథ విరుద్ధము. శఠగోపునికంటె రామానుజముని చాలకాలమున కీవల జన్మించినవాఁడు. శఠకోపుఁడు విష్వక్సేనాంశసంభూతుఁ డనియు, రామానుజముని శేషాంశసంభూతుఁ డనియు, విశిష్టాద్వైతమతగ్రంథములు చెప్పుచున్నవి. ఇది కాక మఱి యొకవిశేషము. శఠకోపునికంటె తరువాతివాఁడైన రామానుజమునిని భూతకాలక్రియ చేతను, ప్రాచీనుఁ డైన శఠకోపుని తనకు సమకాలికుఁడై వేదాంతదేశికుని భవిష్యత్కాలక్రియచేతను గవి నిర్దేశించెను.

వరాహపురాణాంతర్గత బ్రహ్మరాక్షసుఁ డెక్కడ? వానికంటె బహుకాలము తరువాత జనించిన శఠకోప రామానుజ వేదాంతదేశి కాదు లెక్కడ? అని చదువరులకుఁ గలుగు సంశయమును, కవి "ఇట్టి యేష్యంబులు మదీయ దివ్యబోధంబున నెఱింగి యుండుదు నని" తన దివ్యజ్ఞానముతో భవిష్యత్తు నెఱింగి బ్రహ్మరక్షస్సు చెప్పినట్లు వ్రాసి చమత్కారముగాఁ దొలఁగించెను.

పిమ్మట నీపిశాచము దాసరితోఁ దనపూర్వవృత్తాంతమును జెప్పుటలోఁ, దా నొక కాలమందు పథికసామర్థ్యముతో గ్రామాంతరమునకుఁ బోవుచుండ దారిలో దొంగ లడ్డగించుకొని బాటసారులను దోఁచుకొని రనియు, ఆదస్యువులలో నొకఁడు తన పంచిని దీసికొనఁగా నెదిరించిన తనను గత్తితో నఱికె ననియు, కాకశ్మశ్రునాముఁ డగు నా చోరునిఘోరరూపము తనకట్టెదుట వ్రేలాడఁ దీసినట్లుండ వ్రణవేదనచే మృతి నొందఁ దనకీ బీభత్సరూపము కలిగె ననియుఁ జెప్పెను. ఇదియంతయు గురుపరంపరా ప్రభావములో ననుక్తము. అంత దాసరి యారక్కసునికి నైశికీగాన సుకృత మొసంగుట వలన విప్రత్వంబె కాక భాగవతశ్రీయును గలిగి పరమానందభరితుండై యావిష్ణు భక్తునిఁ బూజించెను. ముక్తసంసార సంగుండై బదరీవనాది పుణ్యక్షేత్రంబులఁ దీర్ఘ యాత్రఁ జరింపఁబోయె.

ఖాండిక్యకేశిధ్వజసంవాదము

ఇది శ్రీ పరాశర కృత శ్రీవిష్ణుపురాణషష్ఠాంశములో షష్ఠసప్తమాధ్యాయములలోఁ బరాశరునిచే మైత్రేయఋషికిఁ జెప్పఁబడియె.

ఈకథ శ్రీమద్భాగవత నవమస్కంధమందు పదమూఁడవ యధ్యాయములో నించుకంత సూచన జేయఁబడినది.

"కృతధ్వజసుతో రాజ న్నాత్మవిద్యావిశారదః,
ఖాండిక్యః కర్మతంత్రజ్ఞో భీతః కేశిధ్వజాద్గతః" (20 శ్లో.)

సీరధ్వజుఁడు
|
కుశధ్వజుఁడు
|
ధర్మధ్వజుఁడు
|
కృతధ్వజుఁడు — మితధ్వజుఁడు
|
కేశిధ్వజుఁడు — ఖాండిక్యుఁడు

ఈ ఖాండిక్యకేశిధ్వజులు పైని వ్రాయఁబడిన వృక్షమువలన నన్నదమ్ముల బిడ్డలని స్పష్టమగుచున్నవి. వీరిరువురు రాజ్యామిషలోలురై చిరకాల మొకరితో నొకరు పోరాడిరి. తుదకుఁ గేశిధ్వజుఁడు రాజ్యమును గెల్చుకొనఁగా, ఖాండిక్యుఁడు మంత్రి పురోహిత భటవర్గముతో నరణ్యమునకుఁ జని పర్ణకుటీరంబుల నివసించుచుండెను. కేశిధ్వజుఁడు రాజ్యము వశపఱచుకొని స్వర్లోకప్రాప్తికై యజ్ఞములఁ గావించుచుండ నొక కాలంబునఁ గ్రతూద్దిష్టమయి విడువఁబడిన యజ్ఞపశువు వ్యాఘ్రంబుచే భక్షితంబయ్యె. ఈ యజ్ఞపశుభంగంబున కనురూపంబగుఁ బ్రాయశ్చిత్తంబు నెవ్వరును జెప్పఁజాలక ఖాండిక్యునికడకు బోయి తెలిసికొని రమ్మని కేశిధ్వజున కుపదేశించిరి.

అపుడు కేశిధ్వజుఁడు ఖాండిక్యునియొద్దకుఁ జని వినయనమ్రుఁడై పశులోపమునకు నిష్కృతిఁ గనుఁగొని గురుదక్షిణ గ్రహింపు మని యాతని నిర్బంధించెను. అతఁడందుల కియ్యకొనక నీ వాత్మవిద్యావిశారదుఁడవు గావున నా కాత్మతత్త్వము నుపదేశించి యీ సంసారబంధమునుండి తొలఁగింపుము. నా కింతకంటె నెద్దియుఁ బ్రార్థ్యతరము గా దని వేఁడుకొనెను. కేశిధ్వజుఁడు ఖాండిక్యునికి యథాప్రార్థితముగా నాత్మవిద్య నుపదేశించి యాతని కుమారునిఁ దోడితెచ్చి తా నపహరించిన రాజ్య మా బాలునికిచ్చి పట్టాభిషేకముఁ జేసెను.

కవి యీ కథను లేశమును మార్చలేదు. శ్రీవిష్ణుపురాణమం దెట్లున్నదో అట్లే వ్రాసియున్నాఁడు.

పాండ్యరాజుల చరిత్రము

ఈ ప్రబంధములో వర్ణింపఁబడిన మత్స్యధ్వజుఁ డను దక్షిణ మధురాపట్టణపు రాజు పాండ్యవంశజుఁడు. విష్ణుచిత్తుని సమకాలికుఁడు గావున నీతని కాలమును నిర్ణయించుటయు, నీ ప్రకరణములోఁ బాండ్యుల చరిత్రమును గొంత వివరించుటయుఁ బ్రస్తావసరమని యెంచి యీ వృత్తాంతము నిచటఁ బొందుపఱచుచున్నాఁడను.

ఈ పాండ్యవంశపు రాజులు మిక్కిలి ప్రాచీనులు. దక్షిణ హిందూదేశపు చరిత్రముఁబట్టి చూడఁగా వీరు క్రీస్తుశకమునకు ముందు నాల్గవశతాబ్ది మొదలుకొని పదునాఱవ శతాబ్ది కొసవఱకు రాజ్యముఁ బాలించినట్లు కానవచ్చుచున్నవి. వీరిరాజ్యమొకప్పుడు తూర్పుసముద్రతీరము మొదలుకొని పశ్చిమసముద్రతీరమువఱకును, దక్షిణమందు కన్యాకుమార్యగ్రమువఱకును వ్యాపించియుండెననియు, నిప్పుడు మధుర తిరునెల్వేలి కోయంబత్తూరు తిరువాన్కూరు లనునవి యీ రాజ్యములోనివనియు, గ్రీకు భూగోళజ్ఞుఁ డగు టాలమీ యనువాఁడు చరిత్రములో వ్రాసియున్నాఁడు. ఈ పాండ్యుల రాజ్యమునకు మధుర రాజధాని. యుధిష్ఠిర సోదరుఁడైన అర్జునుఁడు మలయ

ధ్వజుడను రాజుయొక్క పుత్త్రికయగు చిత్రకాంత యనెడు కన్యకను బెండ్లియాడె ననియు, వా రుభయులకు జనించిన సంతానమువలన నా వంశమునకు పాండ్యవంశ మని పేరొదవెననియు నొక ఐతిహ్యముగలదు. కాని, యిట్టి పురాణగాథల సత్యాసత్యత్వములను నిశ్చయించుట మనకు శక్యము గాదు. వీనివలన వాస్తవచరిత్రాంశ మేమియుఁ దెలదు ఏల యన, మనపూర్వులు తాము రచించిన గ్రంథములయందుఁ దమ భాషాపరిశ్రమమును దమ కవితాచాతుర్యమును గనఁబఱచుటయందును, వర్ణ్యులయిన నాయకులకు లేని మహిమల నారోపించి వ్రాయుటయందు నెక్కువ శ్రద్ధను వహించిరి గాని, వాస్తవచరిత్రమును దెలుపుటయం దుత్సాహముఁ జూపరైరి. అందుచే మన ప్రాచీనగ్రంథములవలన నీ పాండ్యుల వాస్తవచరిత్రమును మనము దెలిసికొనఁ జాలము.

Vincent Smith's "Ancient History of India", Dr. S. Krishnaswamy Aiyangar's "Ancient History of India", Dr. Bhandarkar's History of the Deccan", Kanakasabai Pillai's "Tamils 1800 Years ago" అను గ్రంథములవలనను, సింహళద్వీప బౌద్ధుల మహావంశమను గ్రంథమువలనను, ప్రాచీనద్రావిడ వాఙ్మయమువలనను (Ancient Tamil Literature) ప్రథమపరాంతకుఁడు మొదలుకొని తృతీయ కులోత్తుంగునివరకు రాజ్యమేలిన చోళ దేశపు రాజుల శాసనములవలనను పాండ్యుల చరిత్రము సవిస్తరముగాఁ దెలియనగు.

తాను పాలించుచుండెడి భరతఖండమునందె కాక ఐరోపా మొదలగు విదేశములయందుఁ గూడఁ బరధార్మికుఁ డని ప్రసిద్ధిగాంచిన అశోక మహారాజు సుమారు రెండువేల నూటడెబ్బది సంవత్సరముల క్రిందట రాజ్యము చేయుచున్న సమయమం దీతని రాజ్య మీ భరతఖండములోఁ బెద్దభాగమై యుండుటయేకాక, దక్షిణమున మైసూరు రాజ్యమం దున్న సిద్ధపురమువఱకు వ్యాపించి యుండెను. అపు డీ హిందూ ద్వీపకల్పముయొక్క దక్షిణాగ్రభాగము కొన్ని స్వతంత్ర రాజ కుటుంబములచేఁ బరిపాలింపఁబడుచుండెను. వానిలోఁ బ్రధానమయినది పాండ్యరాజ కుటుంబము. చిర కాలము క్రిందటినుండియు నీ పాండ్యు లుత్తమ నాగరకులయి యుండిరనుటకు శ్రీరామాయణము మహాభారతము వాయు మత్స్య మార్కండేయాది పురాణములు ప్రబలప్రమాణములు. శ్రీరామాయణములోఁ గిష్కింధాకాండము నలువదియవసర్గలో సుగ్రీవుఁడు సీతాన్వేషణార్థమయి దక్షిణదిక్కునకుఁ బంపఁబడిన హనుమదాది వానర పుంగవులతో "తతో హేమమయం దివ్యం ముక్తామణి విభూషితమ్, యుక్తం కవాటం పాండ్యానాం గతా ద్రక్ష్యథ వానరాః" అని చెప్పియున్నాఁడు. మహాభారతమందును పాండవ కనిష్ఠుఁడగు సహదేవుఁడు సభాపర్వములో ముప్పదియవ యధ్యాయమందు "యయౌ ధే పాండ్యరాజేన దివసం నకులానుజః, తం జిత్వా సమహాబాహుః ప్రయయౌ

దక్షిణాం దిశమ్” అను శ్లోకములో పాండ్యరాజులతో యుద్ధముచేసి వానిని జయించి నట్లు చెప్పఁబడియున్నది. పూర్వోక్తవచన ప్రామాణ్యముంబట్టి యీ పాండ్యులు చిర కాలపువా రనియు బలపరాక్రమైశ్వర్య సంపన్ను లనియుఁ దెలియవచ్చుచున్నది.

పతంజలి క్రీస్తుశకమునకు ముందు నూటయేఁబది సంవత్సరముల నాఁటివాఁ డనియు, కాత్యాయనుఁడు మున్నూటయేఁబది సంవత్సరములనాఁటివాఁ డనియు, పాణిని యేడవశతాబ్దము నాఁటివాఁ డనియు పండిత భండారుకారు వ్రాసియున్నాఁడు. ఈ పాణినికి సమకాలమునందె భరతఖండముయొక్క దక్షిణాగ్రభాగమునం దార్యులు పైనుండి వచ్చి స్థిరపడినట్లు గ్రంథ నిదర్శనమువలనఁ గానవచ్చుచున్నది. ఏలయన: పాండ్యశబ్ద నిర్వచనము పాణిని సూత్రములలోఁ గానరాకుండుటచేతను, కాత్యాయనుని వార్తికములలో గానవచ్చుటచేతను దక్షిణహిందూస్థానముయొక్క వృత్తాంతము పాణిని కంటెఁ గాత్యాయనుని కెక్కువగాఁ దెలిసియుండవచ్చు నని యూహింపవలసియున్నది. జనపదశబ్దాత్ క్షత్రియాదఞ్. 4-1-168 దీనిపై వార్తికములు. క్షత్రియసమాన శబ్దా జ్జనపదాత్తస్య రాజస్య పత్యవత్; పూరోరణ్వక్తవ్యః, పాండోర్డ్యణ్ — తే తద్రాజాః (4-1-174.)

“Katyayana, however, the object of whose aphorisms called Vartikas is to explain and supplement Panini, shows an acquaintance with southern nations. Panini gives rules for the formation of derivatives from the names of tribes of warriors which are at the same time the names of the countries inhabited by them in the sense of “one sprung from an individual belonging to that tribe,” and also, it must be understood, in the sense of “King of the country.” Thus a man sprung from an individual of the tribe of the Panchalas or the king of the country of Panchalas, is to be called Panchala; a descendant of a Salva or the king of the country of the Salvas, is to be called Salvaya. Katyayana notices here an omission; the name Pandya is not explained by Panini; Katyayana therefore adds, “one sprung from an individual of the tribe of the Pandus or the King of their country should be called a Pandya.”

Dr. Bhandarkar's Early History of the Deccan, vi Page.

ఆర్యు లీ దేశమునకు వచ్చుకాలమునకే వీ రిచట స్థిరనివాసులై యుండుటచేఁ గొందఱు వీరి ననార్య (Non-Aryans) సంతతివా రని వ్యవహరించుచున్నారు. అట్లు వ్యవహరించువారు “పండు = పూర్వము అను నర్థమిచ్చు ద్రావిడభాషాపదమునుండి యీ పాండ్యశబ్ద ముత్పన్నమయిన దని వక్కాణించెదరు. ద్రావిడభాషలో నీ పాండ్యులకు “పంచవర్, కారియర్” అని పే ర్లుండుటచేఁ గాత్యాయనుని యభి

ప్రాయము సమర్థింపఁబడె నని వేఱుగాఁ జెప్ప నవసరములేదు. ఈ వ్యుత్పత్తివలన నే వీ రార్యు లని ఋజువుచేయుటకుఁ బుష్కలసాక్ష్య ముండఁగాఁ బండితు లయినవారెవ్వరును వీ రార్యేతరు లని చెప్పఁ జాలరు.

సింహళ ద్వీపమునకు మొదటి రాజైన విజయుఁ డనువాఁడు క్రీస్తుశకమునకు ముందు 478-వ సంవత్సరమందు, బుద్ధుఁడు నిర్వాణమునొందిన దినమందె సింహళద్వీపమున నోడ దిగి వచ్చెను. ప్రతిసంవత్సరము తా నుపాయనముల నిచ్చుచున్న పాండ్య నృపాలుని పుత్త్రికను బెండ్లియాడె నని మహావంశ మను బౌద్ధగ్రంథమందుఁ జెప్పఁబడి యున్నది ఈ కథలో నిజ మేమైన నున్నయెడల పాండ్యరాజ్యము సింహళమునకంటె ప్రాచీనతర మయినదని యిందువలన గ్రహింపనగు. క్రీస్తునకు ముందు మూఁడవ శతాబ్దిలో గ్రీకు రాయబారియగు మెగాస్తనీసనువాఁడు పాండ్యరాజోత్పత్తిని గుఱించి యొక చిత్రమయిన కథఁ జెప్పెను. వాఁడిట్లు వ్రాయుచున్నాఁడు: "తరువాత పాండో వచ్చెను. హిందూదేశములోని దొకటియే స్త్రీచే నేలఁబడుచుండెడిదాని. హెరకిల్సను వానికిఁ బుత్త్రసంతతి లేదు. ఒక కూఁతు రుండెను. అతఁడు దానియం దధిక ప్రేమగలవాఁడై దానికొక గొప్పరాజ్య మొసంగెను. ఆమె సంతతివారు మున్నూరు గ్రామములకు నొకలక్ష యేఁబదివేల పదాతి సైన్యమునకు నయిదువందల యేనుఁగులకు నధిపతులయి యుండిరి." పాండ్యరాజ్య స్థాపనమును గురించిన కథకే గ్రీకుదేశపు రాయబారి వికృతమయిన మఱియొక పాఠాంతరమును గల్పించె ననుటకు సందియములేదు.

క్రీస్తువునకు ముందు రెండవ శతాబ్దియందలి బౌద్ధమతస్థుల చిహ్నము లిప్పటికి నీ పాండ్యదేశమం దచ్చటచ్చటఁ గానవచ్చుచున్నవి. బౌద్ధభిక్షువు లిష్టదేవతా ధ్యానాసక్తులై సుఖముగ నివసించెడు గుహలు, వానిలో శిలాశయ్యలు నా దేశమం దిప్పటికిని ప్రతి పర్వతమందును గానవచ్చుచున్నవి. సింహళదేశపు బౌద్ధమతబోధకుల బోధనదార్ఢ్యముచే నీ పాండ్యదేశస్థు లందఱు నా కాలమందు బౌద్ధమతము నవలంబించిరి. క్రీస్తుశకమునకు ముందు నాల్గవ శతాబ్దినుండియు వీరికి సింహళద్వీపవాసులతో సంబంధ ముండుటచే నా నూతన మతసిద్ధాంతముల నెఱుంగినవారయి యుండిరని సంభావించుటకుఁ దగిన హేతుసామగ్రి కానవచ్చుచున్నది.

ఈ పాండ్యదేశస్థులు క్రీస్తుశకమునకు ముందు మొదటి శతాబ్దినుండి క్రీస్తువునకు వెనుక నాఱవ శతాబ్దివఱకును నాగరికతా సంపన్నులైన పడమటి జాతులవారితో ముఖ్యముగా రోమకపురీవాసులతో వాణిజ్యసంబంధము గలిగియుండిరి. గ్రీసు, ఈజిప్టు, రోము, పారసీకము, అరేబియా, చైనా మొదలగుదేశముల నావలు వర్తకము కొఱకు దక్షిణ హిందూస్థానమునందు రేవులకుఁ దఱుచుగ వచ్చుచుండెను. తామ్రపర్ణీనదీగతము లయిన మౌక్తికములు రోమక నగరములో శతగుణిత మూల్యమునకు విక్రయింపఁబడుచుండె నని ప్లినీ (Pliny) యను భూగోళశాస్త్రజ్ఞుఁడు వ్రాసి

యున్నాఁడు. ముత్యములు, సుగంధిద్రవ్యములు, ఆభరణములు మొదలగువస్తువులను రోమకపురీవణిజులు పాండ్యదేశమునుండి కొనిపోయినట్లు ప్రాచీన ద్రావిడ గ్రంథముల యందువ్రాయఁబడి యున్నది.

ఈ పాండ్యులచరిత్ర మింతవఱకును విదేశీయులుచెప్పెడి వృత్తాంతమువలనను, బౌద్ధగ్రంథముల వలనను మనకుఁ దెలియవచ్చినది. ఇటుపైని వీరిచరిత్రమును దెలియుటకు ముఖ్యాధారములయిన ప్రాచీనద్రావిడగ్రంథంబులఁ గొన్నిటిని పరిశీలింతము. అవి యెవ్వి యన: 1. ఇఱైయనా రగప్పొరుళ్. 2. పత్తుప్పాట్టు 3. పురనానూర్. 4. శిలప్పది కారం. 5. మణిమేకలై మొదలగునవి. వీనిని వ్రాసిన ప్రాచీనకవు లిప్పటివారివలెఁ దమకవితాచాతురిని, కల్పనలను, శబ్దచిత్రిని గనఁబఱచుటమాని కేవలము తాము ప్రతిపాదింపఁబూనుకొనిన యంశములయొక్క సత్యతనే వెల్లడిచేయఁగోరి, తమకు సమకాలికులు పోషకులు నయిన ప్రాచీనరాజ పుంగవుల వాస్తవచరిత్రమును లోకమందుఁ ప్రకాశింపఁ జేసిరి. ఇట్లు వ్రాసిన ప్రాచీనద్రావిడ గ్రంథకర్తలలో పురుంబనరుప్పద మనుగ్రంథమును వ్రాసిన కడియలూరు రుద్రంగన్ననారు గ్రంథకర్త సర్వాధికుఁడు. కాని యీగ్రంథము లేకాలమందు వ్రాయఁబడెనో ఆకాలమును నిశ్చయించుటకుఁ దగిన సాధనము లెవ్వియుఁ గానరావు. ఈ యంశమును నిర్ణయించుటకు మనము పై ప్రమాణములనే (External Authorities) సాధనముగాఁ జేసికొనవలయును. ఈవిషయమందు మొన్న మొన్నటివఱకు మనకు సహాయ మొనర్పఁదగిన పరికర మేమియు లేకయుండెను. కాని యిటీవల కొలఁదిదినములక్రిందటఁ గ్రొత్తగాఁ గనుఁగొనఁబడిన చిన్నమనూరుశాసనములవలనను, వేళ్విక్కుడి శాసనములవలనను పాండ్యదేశాధిపతుల యొక్క వృత్తాంతమును సాకల్యముగాను తృప్తిగాను దెలిసికొనుటకు సమర్థులమయితిమి.

Mr. K. U. Subrahmnia Iyer, B.A., M.R.A.S., Christian College Magazine, 1914.

ఇంతియుకాక ద్రావిడ మహాభారతమును రచించిన పెరుందేవనా రనునతఁడు పైనిచెప్పఁబడిన ప్రాచీనద్రావిడ గ్రంథముల నన్నింటిని సంగ్రహించి యొకచోటఁ జేర్చి వాని కన్నిటికిని వ్యాఖ్యానము నుపోద్ఘాతమును రచించెను. తనపోషకుఁ డగు నందిపోత వర్మ యను పల్లవవంశపురాజు నీతఁడు గ్రంథాదినిఁ జేర్కొనుటచే నీతని కాలము నిష్కృష్టముగాఁ దెలియవచ్చుచున్నది. ఈ పల్లవరాజు నవమశతక ప్రారంభమందు రాజ్యమేలిన ట్లితర ప్రమాణములవలనఁ గానవచ్చుచున్నది. కావున నీయాధారమునుబట్టి పైనుదాహరింపఁబడిన ప్రాచీన ద్రావిడగ్రంథములకు నాయకు లయిన పాండ్యరాజులలోఁ గొందఱ వృత్తాంతము స్పష్టముగా మనకుఁ దెలియుచున్నది. చిన్నమనూరు వేళ్విక్కుడి శాసనములయందుఁ జెప్పఁబడినవారును, ప్రాచీనద్రావిడ గ్రంథములయందు వర్ణింపఁబడిన వారు నొక్కరే కావున, వీరి వంశానుక్రమణికను వంశవృక్షరూపముగా నిచటఁ జూపుచున్నాఁడను.

చిన్నమనూరుశాసనమునందలి రాజులు

1. అరికేసరిపరాంకుశమారవర్మ
   - 2. జటిలవర్మ
     - 3. రాజసింహుఁడు
       - 4. వరగుణమహారాజు
         - 5. శ్రీమారశ్రీవల్లభపరచక్రకోలాహలుఁడు
           - 6. వరగుణవర్మ (A D. 362.) సింహాసన మెక్కెను.
           - 7. పరాంతకవీరనారాయణశడయన్
             - 8. ద్వితీయ రాజసింహమారవర్మ.

వేల్విక్కుడిశాసనము

1. పాల్యాగసవై ముదుకుడుమికాలాభ్ర
   - 2. కడంగన్
     - 3. మారవర్మన్
       - 4. సెలియన్ శేందన్
         - 5. అరికేసరి అసమసమన్ మారవర్మ
           - 6. శడయన్ రణధీర
             - 7. తేర్మారన్
               - 8. నెడుంజడయన్
                 - 9. రాజసింహ
                   - 10. వరగుణమహారాజ
                     - 11. శ్రీమారశ్రీవల్లభ
                       - 12. వరగుణవర్మన్
                       - 13. పరాంతకవీరనారాయణ శడయన్
                         - 14. రాజసింహ

ఒక పట్టికలోనున్న జటిలుఁడు మొదలుగాఁగల రాజులే రెండవ పట్టికలలోఁ గూడ గానవచ్చుచున్నారు. ఈ చిన్నమనూరు శాసనము రెండవపట్టికలో పదు నాల్గవవాఁ డయిన రాజసింహునికాలములోఁ బుట్టినది. క్రీస్తువెనుక 907-953 సంవ త్సరములలో రాజ్యము చేసిన ప్రథమపరాంతకుఁ డొక పాండ్యదేశపురాజును జయించి నట్లు చోళదేశపు శాసనమువలనఁ దెలియఁబడుచున్నది. కావున చిన్నమనూరు శాసన ములు పదియవ వత్సరశతకమందు వ్రాయఁబడె నని చెప్పవచ్చును. ఈరాజసింహుని పిన తండ్రియయిన వరగుణవర్మ యనువాఁడు క్రీస్తుశకమునకు వెనుక 862-వ సంవత్సరమున పట్టాభిషిక్తుఁడయ్యె నను నంశము 'వరగుణవర్మయొక్క తమ్మునికుమారుఁడైన రాజసిం హుఁడు ప్రథమపరాంతకునిచే జయింపఁబడిన రాజసింహుఁడు నొక్కఁడే యని స్థిర పఱుచుటకు సహకారిగా నున్నది. ఈవరగుణవర్మయొక్క పట్టాభిషేకపు సంవత్సరము మనకుఁ దెలియుటవలనఁ బ్రథమపట్టికలో రెండవవాఁడును, ద్వితీయపట్టికలో నెనిమిదవ వాఁడు నైనట్టియు, జటిలవర్మ యను సంస్కృతనామమును, నెడుంజడయన్ (దీర్ఘ మయిన జడలుగలవాఁడు) అను ద్రావిడనామమును గలిగినవాఁడైనట్టిరాజు యెనిమిదవ శతాబ్దము యొక్క మూఁడవ భాగమం దున్నట్లు మన మూహించుకొనవచ్చును. మధుర జిల్లాలోనున్న ఆనైమలై (గజగిరి) అను కొండమీదఁ గట్టఁబడిన నృసింహాలయములో దొరికినదియు, 770 వ సంవత్సరమున వ్రాయఁబడినదియు నైన యొకశాసనమువలన నీ జటిలవర్మయనువాఁడు నెడుంజడైయ ననువాఁడు నొక్కఁడేయని మనము స్థిరపఱుచుటకు సమర్థులమగుచున్నాము వైష్ణవమతగురువు లయిన పన్నిద్దరాళ్వార్లలో నొకఁ డయిన మధురకవి యీజటిలవర్మకు మంత్రిగా నుండె ననియు, నాతని యధికారమం దీ దేవా లయము కట్టఁబడె ననియు నాశాసనము వలన స్పష్ట మగుచున్నది. వేళ్విక్కుడి దాన శాసనములలోఁ గూడ నీ యంశములే చెప్పఁబడుచున్నవి.

ప్రథమపట్టికలో శ్రీమారశ్రీవల్లభ పరచక్రకోలాహలుఁ డనియు, ద్వితీయ పట్టి కలో శ్రీమారశ్రీవల్లభుఁ డనియుఁ జెప్పఁబడిన రాజు క్రీస్తువెనుక 962-వ సంవత్సర మున సింహాసనము నధిష్ఠించిన వరగుణవర్మయొక్క తండ్రి. ఇందువలన నితఁడు తొమ్మి దవ శతాబ్దియందున్న వాఁడని మనము నిశ్చయముగాఁ జెప్పఁగలము. గురుపరంపరా ప్రభావము ప్రపన్నామృతము, దివ్యసూరిచరిత్రము మొదలగు శ్రీవైష్ణవ మతగురు చరిత్రములలో నితఁడే శ్రీవల్లభదేవుఁ డని చెప్పఁబడుచున్నాఁడు. ఇతఁడే విష్ణుచిత్తుని (పెరియాళ్వారు) రావించి పరతత్త్వనిర్ణయము జేయించి విద్యాశుల్క గ్రంథి నొసంగినవాఁడు.

ఇతని నీ ప్రబంధకర్త "తత్పూర్వం దేలు పాండ్యమత్స్యధ్వజుండు" అని నిర్దేశించి యున్నాఁడు. మత్స్యధ్వజుఁ డనఁగా మత్స్యమును ధ్వజమందు చిహ్నముగాఁ గల

వాఁడని యర్థము. జనకునికి సీరధ్వజుఁ డనియు, అర్జునునికి కపిధ్వజుఁ డనియు ధ్వజచిహ్నములచే బిరుదములు గలిగిన ట్లీతనికిఁ గూడ ధ్వజమందు మత్స్యచిహ్న ముండుటచే నితఁడు మత్స్యధ్వజుఁ డని వ్యవహరింపఁబడెను. ఇది ప్రకృతమునకు విరోధింపదు. ఈరాజుపేరు వల్లభదేవుఁడు కాదని సమర్థించుట కిది యుపపత్తి కానేరదు. ఈవిష్ణుచిత్తుఁ డాళ్వార్లలో నాల్గవవాఁడు.

"భూతం, సరస్య, మహదాహ్వయ, భట్టనాథ, శ్రీభక్తిసార, కులశేఖర, యోగివాహాన్, భక్తాంఘ్రిరేణు, పరకాల, యతీంద్ర మిశ్రాన్, శ్రీమత్పరాంకుశమునిం, ప్రణతోస్మి నిత్యమ్" ఇది శ్రీవైష్ణవుల గురుపరమ్పరానుసంధాన శ్లోకము. మొదటి మువ్వురాళ్వార్లయొక్క కాలమును నిర్ణయించుటకుఁ దగిన చరిత్రాంశములుగాని శాసనములుగాని యెచటను దొరకనందున వారికాలము మనకుఁ దెలియదు. వారు పురాణకథిత పురుషులవంటివారు కాని (Mythical Personages) చరిత్రతో సంబంధించినవారు కారు. కలియుగము నలువదియాఱుసంవత్సరము లయిన తరువాత నీవిష్ణుచిత్తుఁడు జనన మొందినట్లు మతగ్రంథములలో వ్రాయఁబడియున్నది. ఈకాలమును మన మొప్పుకొన్నయెడల నీవిష్ణుచిత్తుఁడు క్రీస్తుశకమునకుముందు మూడువేలయేఁబదియాఱుసంవత్సరముల క్రిందట నున్నవాఁడు కావలయును. అట్లయినచోఁ బాండ్యు లెక్కడ? వీరి చరిత్ర మెక్కడ? పాణినిసయితము క్రీస్తునకుముందు ఏడవశతాబ్దినాఁటివాఁ డనియు, ఆసమయమందే ఆర్యులు దక్షిణ హిందూస్థానమందు స్థిరపడి రనియు, క్రీస్తువునకుముందు నూటయేఁబది సంవత్సరముల క్రిందటి వాఁడైన కాత్యాయనునిచేఁ బాండ్యశబ్ద నిర్వచనార్థక మయినవార్త్తికము వ్రాయఁబడెను గాన, నీపాండ్యులప్రారంభము పాణిని కాత్యాయనులకాలమునకు మధ్య నయియుండవలయు ననియు, డాక్టరు భండారుకారుగారు తన గ్రంథమందు వ్రాసె నని యిదివఱకే చెప్పియున్నాఁడను. మనపూర్వులకుఁగాలగణన విద్యయందు (Chronology) శ్రద్ధ మంద మని లోఁగడ వ్రాసియుంటిని.

కావున సమకాలికు లగు విష్ణుచిత్త వల్లభదేవు లుభయులు తొమ్మిదవ శతాబ్దము వా రని పై చర్చవలనఁ దేలిన సారాంశమైయున్నది.

ఈ ప్రబంధమును రచించిన కవికిఁ గలిగిన చిత్రమయిన కాలవిషయక భ్రాంతిని (Anachronism) గనఁబఱచుట కిట్టి కాలనిర్ణయ చర్చాప్రకరణమే సముచిత స్థలమని యెంచి యాయంశమునుగూడ నిచట వివరించుచున్నాను.

చతుర్థాశ్వాసములో విష్ణుచిత్తునికథ ముగిసిన తరువాత "ఒక్కనాఁడు మధ్యాహ్న సమయ మాలికారోపణానంతరంబున మందిరంబునకుఁ బోవు నతనిం బ్రసాదమందస్మిత విశేషం బగు కటాక్షంబున వీక్షించి పక్షిపుంగవకేతనుండు పుండరీకనికేతన కిట్లనియె."

తే. యామునాచార్యుఁ డొక్కఁడు నీమహాత్ముఁ, డొక్కఁడునుగాదె మన్మతం బుద్ధరించి
రస్మదీయ కృపాతిశయమున ననిన, నిందిరాదేవి తనభర్త కిట్టు లనియె.

క. ఇతనికథ యెఱిఁగినదికా, యతఁ డేమి యొనర్చె ననిన నబ్జాక్షుం డా
శతపత్త్రనిలయ కిట్లను, నతివ కలం డొకఁడు మత్పదాశ్రితుఁ డెలమిన్.

ఆ. అతఁడు చిఱునాఁడె యాచార్య కులమున, వేడ్క వేదశాస్త్ర విద్య లభ్య
సించుచుండనపుడు చెలువ యిప్పటిపాండ్య, నృపతి పూర్వవంశ్యుఁడే యొకండు.

ఈ మొదలగుపద్యములను విచారింపఁగాఁ దేలినయంశ మే మన: విష్ణుచిత్తుని వలన నుపదేశమునొంది వైష్ణవమతావలంబి యయిన పాండ్యవల్లభ దేవుని వంశమందుఁ బుట్టిన పూర్వపు రాజొకఁడు శైవమతమందుఁ బట్టుదలగలవాఁడై యుండ నీ యామునాచార్యుఁ డతని కడకేఁగి తనయుక్తులచే నాశైవమతమును ఖండించి వైష్ణవమత స్థాపనచేసి యారాజును స్వమతమందుఁ గలిపె నని చెప్పుట.

"ఇప్పటి పాండ్యనృపతి" యగువాఁడు వల్లభదేవుఁడు. ఇతఁడును, విష్ణుచిత్తుఁడును సమకాలికు లనియు, తొమ్మిదవశతాబ్దియం దున్నవా రనియు పైనిచెప్పఁబడినది. ప్రథమకులోత్తుంగుఁడు (1070-1118), విక్రమచోళుఁడు (1118-1135), ద్వితీయకులోత్తుంగుఁడు (1123-1146) అను మువ్వురు పాండ్యరాజుల రాజ్యపాలన కాలమం దున్నవాఁడును, 1017-వ సంవత్సరములోఁ బుట్టి 1137-వ సంవత్సరమువఱకు (120 సంవత్సరములు) జీవించి వైష్ణవమతమును స్థాపించి దానిని వ్యాపింపఁజేసినవాఁడు నైన శ్రీరామానుజమునికి సమకాలికుఁడైన (K. V. Rangaswamy Aiyangar's Ancient History of India) యామునాచార్యుఁడు తొమ్మిదవ శతాబ్దములో జీవించిన వల్లభదేవునికంటెఁ బూర్వుఁడైనయొకరాజు కాలమునం దున్నవాఁ డనుట యెట్లు పొసఁగును? అట్లయినచో యామునార్యుఁడు విష్ణుచిత్తునికంటె మిక్కిలిప్రాచీనుఁడై యుండవలయును. చరిత్రములవలనను, మతగ్రంథములవలన నట్లు కానరాదు. ఇదియునుగాక రామానుజముని ముప్పదిసంవత్సరములప్రాయము గలవాఁడై యుండ యామునార్యుఁడు పరమపదము నలంకరించె నని గురుపరంపరాప్రభావము మొదలుగాఁగల గ్రంథములు చెప్పుచున్నవి కావున, యామునార్యుఁడు విష్ణుచిత్తుని కంటెఁ బ్రాచీనుఁ డని చెప్పుట కవికృత ప్రమాదము. యామునార్యుఁడు చోళదేశమున నుండు వీరనారాయణపురనివాసి యని లోఁగడఁ జెప్పియుంటిని. ఇతనిని వాదమునకుఁ బిలిపించిన రాజుగూడ చోళదేశపురాజు; ప్రబంధకర్త పాండ్యవంశజుఁ డని చెప్పుట మరియొక తప్పు.

విష్ణుచిత్తుఁ డుపన్యసించిన వేదాంతము

విశిష్టాద్వైతమతము రెండుభాగములుగా విభజింపఁబడియున్నది. వానిలో మొదటిది సభలో వాదక్షమ మయి ప్రతివాదులను జయించుటకు సాధనమయి బ్రహ్మసూత్ర భాష్యము, గీతాభాష్యము, ఉపనిషద్భాష్యము, సహస్రనామభాష్యము, సిద్ధిత్రయము మొదలగు ననేక సంస్కృతగ్రంథములచేఁ బ్రతిపాదింపఁబడుచున్నది. రెండవభాగము పూర్వోక్త సంస్కృత గ్రంథంబుల యర్థంబును సాకల్యముగఁ బ్రతిపాదించు నవియు, స్వగోష్ఠీనిష్ఠములయి కేవల గురుపరంపరా సంప్రదాయ ప్రాప్తంబు లయిన యర్థవిశేషంబులఁ దెల్పు నవియు, భక్తిప్రపత్తిజ్ఞాన వైరాగ్యాదులను వృద్ధిఁ బొందించు నవియు నగు ద్రావిడగ్రంథములచే బోధింపఁబడుచున్నది. ఈవిష్ణుచిత్తుఁ డుపన్యసించిన యుపన్యాసమును బట్టి విమర్శింపఁగా నీ ప్రబంధ కర్తకు సాంఖ్యయోగ మీమాంసాద్వయాది తంత్రంబులయందె కాక, పూర్వోక్తోభయవిధ విశిష్టాద్వైతమతగ్రంథములయందుఁ గూడ నిరుపమాన మయిన పాండిత్య మున్న దని నిశ్సంశయముగాఁ జెప్పనగు. ప్రధాన కథతో సంబంధము లేకపోయినను ఖాండిక్య కేశిధ్వజ సంవాదముఁ దీసికొని వచ్చి, యొక రీతి సంగతిఁ గల్పించి వ్రాసినది కవి కనకు యోగ శాస్త్రమం దున్న ప్రవేశమును వెల్లడి చేయుటకే యని యూహింపవచ్చును. అట్లే యామునాచార్య చరిత్రమును, మాతంగ బ్రహ్మరక్షస్సంవాదమును ప్రధానప్రతిపాద్య మగు గోదాచరిత్రముతో సంబంధము లేకపోయినను సంబంధముఁ గల్పించియే సంస్కృత గ్రంథములయందును గానరాని విశిష్టాద్వైత ద్రావిడమత సంప్రదాయ రహస్యములను బ్రకాశింపఁజేసి యున్నాఁడు. ఇందువలన నీకవి కీమతమందుఁ గల భక్తి విశేషము, నమ్మకము, శ్రద్ధ, పట్టుదల మొదలగునవి స్పష్ట మగుచున్నది.

ఇఁక, విష్ణుచిత్తుఁ డుపన్యసించిన వేదాంతాంశములను గొంతమట్టునకు విమర్శింతము.

"సీ. జగదుద్గతికిని బీజము ప్రధాన మన నీక్షత్యాదివీకు నశబ్దవాది
బొరినీశుఁడే నన భోగమాత్రేత్యాదుదాహృతిస్ఫూర్తి మాయావివాది
ఫలియించుఁ గ్రియయనా ఫలమతయిత్యాది సర్వేశుఁగొనని యపూర్వవాది
శాస్త్రయోనిత్వాదిసరణి నీశ్వరునిఁ దెల్పెదు ననుమాన మన్వీలువాది
తే. నిత్యులందెల్ల నిత్యుఁడ న్నృత్యురూక్తి, క్షణికసర్వజ్ఞ తేశ సౌగతవివాది
ననుపపత్తేర్న యను సూత్రమాదియైన, వాని నృపతిశుఁ బ్రత్యక్షవాది గెలిచె."

ఈ సీసపద్యములో మొదటిపాదమున సాంఖ్యమతము ఖండింపఁబడినది.

ప్రకృతి (సకలమునకు కారణము) సత్త్వరజస్తమస్సులయొక్క సామ్యావస్థ (Primordial matter) దీనికే ప్రధానము, అవిద్య, అజ్ఞానము, మాయ అనిపేర్లు. దీనినుండి మహత్తత్త్వము (బుద్ధి) దీనివలన నహంకారము (Ego), అహంకారమువలన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ తన్మాత్రల (Primary Elements), (తన్మాత్రలనఁగా భూతపంచకముయొక్క సూక్ష్మావస్థ.) పంచతన్మాత్రల వలన పంచభూతములు, కర్మేంద్రియపంచకము, జ్ఞానేంద్రియపంచకము, మనస్సు ఇవి యిరువదినాలుగు తత్త్వములు కలిగెను. ఆత్మపురుషాది శబ్దవాచ్యుఁడగు జీవుఁ డిరువదియయిదవవాఁడు. నిత్యబుద్ధశుద్ధస్వభావుఁడు. బంధమోక్షములు లేనివాఁడు. రక్తవస్త్రసంపర్కమువలన శుద్ధస్ఫటికమునకు రక్తిమ కలిగినట్లు, ప్రకృతి సంసర్గమువలన నాత్మ సుఖ దుఃఖాదుల ననుభవించుచున్నట్లు కానవచ్చుచున్నది. ఆత్మకుఁ గర్తృత్వము లేదు. తామరాకునకు జల మంటనట్లు ఆత్మకుఁ గర్మ లేప మంటదు. ప్రకృతి జగత్సర్గముఁ జేయునది; కాని జడము. పంగ్వంధసంయోగమువలన గమనాది వ్యాపారములు సిద్ధించునట్లు, ప్రకృతి పురుష సంయోగముచే సృష్ట్యాది వ్యాపారము లుపపన్న మగుచున్నవి. కావున, అచేతనమయిన ప్రకృతియే జగత్కారణము. దీనికి శబ్దము ప్రమాణము కాకపోవుటచే నానుమానికము కావున నశబ్దమని సాంఖ్యుల సంకేతము. ఇదియే పురుషునికి భోగమోక్షముల నిచ్చునది. ఇది సాంఖ్యమతము.

దీని ఖండన మిట్లు చేయఁబడినది.

ఛాందోగ్యములో "సదేవ సోమ్యేదమగ్ర ఆసీ దేకమే వాద్వితీయమ్, తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" ఓయి శ్వేతకేతువా! యీసృష్టికంటె ముందు సచ్ఛబ్దవాచ్యమయిన వస్తు వొక్కటియే యుండెను. ఆవస్తువు "నేను బహుత్వావస్థ నొందుదును గాక" అని చూచెను (సంకల్పించెను.) ఈశ్రుతిలోఁ బ్రయోగింపఁబడిన 'ఈక్షతి' అను ధాతువు అచేతనమయిన ప్రధానమునకుఁ గుదురకపోవుటచేతను, లేక యీయీక్షణము అముఖ్య మనుకొన్నయెడల శ్రుతిలోఁబైన నాత్మశబ్దముండుటచేతను, "తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్" 7. 1. 1. అని, తరువాతిసూత్రములో సదాత్మకత్వానుసంధాననిష్ఠునికి మోక్ష ముపదేశించుటచేతను బ్రధానము జగత్కారణము కానేరదు.

రెండవపాగములో నద్వైతమతఖండనము

బ్రహ్మపదార్థం బొక్కటియే సత్యము. జగమంతయు మిథ్య. శుక్తియందు రజతమువలె బ్రహ్మ యను నధిష్ఠానమందు ప్రపంచము మాయచేఁ గల్పింపఁబడినది. జీవత్వముకూడఁ గల్పితమే. జీవబ్రహ్మల కభేదము.

95832

దీని ఖండనము

బ్ర. సూ. "భోగమాత్రసామ్యలింగాచ్చ 21-4-4. జగద్వ్యాపారవర్జం ప్రకరణాదసన్నిహితత్వాచ్చ 4-4-19. సోశ్నుతే సర్వాన్కామాన్సహ బ్రహ్మణా విపశ్చితా" ఇత్యాది శ్రుతిసూత్ర వాక్యములచే ముక్తునకు బ్రహ్మయాథాత్మ్యానుభవ రూప భోగమునందే బ్రహ్మసామ్యము ప్రతిపాదింపఁబడుట వలనను, జగత్సృష్ట్యాది వ్యాపారములలో ముక్తుని కెంతమాత్రను బాధ్యత లే దని శ్రుతి వక్కాణించుట వలనను, బ్రహ్మకంటె జీవునికి భేదము సిద్ధించుచున్నది.

మూఁడవపాదములోఁ బూర్వమీమాంసమతఖండనము

ఈమతమందుఁ బ్రపంచకము సత్యము. జీవులు నిత్యులు. అనంతములు. వేదము లపౌరుషేయములు. వేదవిహితమయిన యాగాదికర్మల నొనరించుటచేఁ గలిగిన అపూర్వము (సుకృతఫలము) ఆత్మలకు స్వర్గము నిచ్చును. చిరకాలార్జిత పుణ్యవిశేషముగల జీవులే యీజగత్తును సృజించుచున్నారు. ఇంద్రాయస్వాహా, వరుణాయస్వాహా ఇత్యాదులయందుండు చతుర్థ్యంత ప్రతిపాదితమైన దేవతయే బ్రహ్మము. వేఱే యీశ్వరు నొప్పరు.

దీనిఖండనము

ఫలమత ఉపపత్తేః, 3. 2. 37. యాగ దాన హోమాదులచేతను, ఉపాసన చేతను ఆరాధితుఁడైన పరమపురుషుఁడే ఐహికాముష్మిక భోగములను స్వస్వరూపావాప్తిరూపమైన మోక్షము నిచ్చువాఁడుకాని యచేతనమయిన అపూర్వమున కట్టిశక్తి లేదు. "అహం హి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ", "యాంతి మద్యాజినోపి మామ్" అని భగవద్గీతావాక్యము.

నాల్గవపాదమందు తార్కిక మతఖండనము

తార్కికుఁ డీజగమునకుఁ బరమాణువు లుపాదానకారణ మనియు అనుమానికమైన ఈశ్వరుఁడు నిమిత్తకారణ మనియు, సంసార మనాది యనియు, ఈశ్వరోపాసనచే సుఖదుఃఖప్రయత్నజ్ఞానేచ్ఛాదులు పూర్ణముగా నశించుటయే ఆత్మకు మోక్ష మనియు వక్కాణించెను. తార్కికులముక్తి పాషాణముక్తి; అనఁగా నాత్మ మోక్షదశయందు జ్ఞానాది రహితమయి పాషాణమువలె నుండు ననుట.

దీని ఖండనము

శాస్త్రయోనిత్వాత్, 1. 1. 3. (తెలిసికొనుటకు శాస్త్రము కారణముగాఁ గలవాఁడై యుండుటవలన) భగవంతునిఁ దెలియుటకు శాస్త్రమే కారణము. ఇతర

ప్రమాణములవలనఁ బరబ్రహ్మము తెలియఁ బడఁడు. అనుమానమువలన నొకరీతియైనకర్త తేలునుగాని, అట్టివాఁడు నిత్యుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వశక్తి, అకర్మవశ్యుఁడునైయుండక పోవచ్చును. కావున సకలేతరప్రమాణాసాధ్య సమస్తవస్తు విజాతీయుఁడు, సార్వజ్ఞ్య సత్యసంకల్పత్వా ద్యనవధికోదార గుణసాగరుఁడు, నిఖిల హేయ ప్రత్యనీకుఁడు నగు పరబ్రహ్మ శాస్త్రమువలననే సిద్ధించును గాని, యితర ప్రమాణములవలన సిద్ధింపఁడు.

బౌద్ధమతఖండనము

బౌద్ధుఁ డీ జగము పరమాణుసంఘాతమయి ప్రత్యక్షసిద్ధ మయిన దనియు, ప్రతి క్షణము జ్ఞానము మాఱుచుండు ననియు, వేఱొక ఆత్మలే దనియు, స్థిరత్వబుద్ధి సంసార మనియు, క్షణికత్వబుద్ధి మోక్ష మనియుఁ బార్థివతైజసాప్యవాయవీయపరమాణువులు పరస్పరము మిళితములయి పృథివ్యప్తేజోవాయువులను సృజించుచున్న వనియు, ఆపృథి వ్యాదులనుండి శరీరేంద్రియ విషయరూపసంఘాతము లుద్భవిల్లు చున్నవనియు, సర్వ సంస్కారములు క్షణికము లను జ్ఞానమువలన మోక్షము సిద్ధించు ననియు చెప్పు చున్నాఁడు.

దీని ఖండనము

ఉత్తరకాలిక ఘటము పుట్టినప్పుడు పూర్వకాలిక ఘటము నష్టమయినందున నభావ మన్నిటికి హేతు వగుటచే, సర్వఘటములు సర్వకాలములయందు నుత్పన్నములు కావలసివచ్చును. నిన్నటిదినమందు మన మవలోకించిన గోవ్యక్తిని మరల నీదినమందుఁ జూచి నిన్నటిగో వని యానవాలు పట్టుచున్నాము. జగత్తులో నుండు సర్వపదార్థములు క్షణికములే అయిన యెడల నిట్టి ప్రత్యభిజ్ఞానశక్తి లోకులకు లేకపోవలసి వచ్చును. అందువలన లోకప్రవృత్తి జరుగదు. కావున బౌద్ధమతమందు క్షణికత్వము కుదురదు.

సీ. "ఆదినారాయణుం డాయె నొక్కఁడ బ్రహ్మ లేఁడు మహేశుండు లేఁడు లేదు
రోదసి లేఁడు సూర్యుఁడు లేఁడు చంద్రుఁడు లేవు నక్షత్రము ల్లేవు నీళ్ల
లే దగ్ని యట్లుండ లీల నేకాకిత చనదు పెక్కయ్యెద ననుచు నయ్యెఁ
జిదచిద్ద్వయంబు సొచ్చి యని ఛాందోగ్యంబు దెలిపెదునంతరాదిత్యవిద్య

తే. నర్కలోఁ బుండరీకాక్షుఁ డకఁడ యగుట, కక్షిణీ యని యష్టదృక్త్ర్యక్షదళశ
తాక్షవిధిరుద్రశక్రాదులందు నొకఁడు, కామి కాశ్రులియే విలక్షణతఁ దెలిపె."

ఈపద్యమందు "ఏకోహవై నారాయణ ఆసీత్ న బ్రహ్మా నేశానః", "నతత్ర సూర్యోభాతి నచన్ద్రతారకం,నేమావిద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః" (సృష్టికంటె ముందు బ్రహ్మ, రుద్రుఁడు, సూర్యచంద్రాదిగ్రహములు, తారకలు మొదలగునవి లేవ నియు, శ్రీమన్నారాయణుఁ డొక్కఁడేయుండె ననియు, "స ఏకాకీ న రమేత" (ఆపర

బ్రహ్మ యగు నారాయణుఁ డొంటిగా నుండలేఁ డనియు) "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ" (నేను పెక్కుఁడ నయ్యెద నని అతఁడు సంకల్పించె ననియు) "తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్" (దానిని ఆప్రపంచకమును సృజించి దానిలోఁ జొచ్చె ననియు) నర్థ మిచ్చు శ్రుతులు మొదటి నాలుగు పాదములయందు వివరింపఁబడినవి.

పద్య శేషముచే "అంతరాదిత్యవిద్య" తెలుపఁబడియె. 1. 121 సూ. "అంతస్తద్ధర్మోపదేశాత్" సూర్యమండలాంతర్వర్తియై యుండెడువాఁడు పుణ్యవిశేషము గల గరుడోరగ యక్షగంధర్వాదులలో నొకఁడా? లేక రుద్రుఁడా? యని వెనుక సూత్రములయందు శంకించి యీసూత్రమునకు విషయవాక్యమయిన శ్రుతి "ఆదిత్య మణ్డలాన్తర్వర్తిని" అపహతపాప్మత్వాదివిశిష్టుఁ డనియు,గంభీరాంభస్సముద్భూతసుమృష్ట నాళరవికర వికసిత పుండరీకదళామలాయతేక్షణుఁ డనియుఁ జెప్పుటచే నధికాక్షిత్వ విరూపాక్షత్వవిశిష్టు లయిన బ్రహ్మ రుద్రేంద్రాదులకు వెల్ల దని నిషేధించెను.

"మ. తులలేకుండు స్వరూపరూపగుణభూతుల్ దోఁచె నేతచ్ఛ్రుతిన్
దలమై లోవెలిఁ దానె యుండ్కి దెలిపె న్నారాయణాం కారుణాం
బుల సామాన్యవిశేషరీతి నిఖిలంబు న్శబ్దకాలంబు ని
ర్మలనారాయణశబ్దమందునె తుద న్పర్యాప్తమయ్యెన్ శ్రుతిన్.

ఈ పద్యములో "యచ్చకించి జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽపివా. అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్స్థితః" అను తైత్తిరీయోపనిషచ్ఛ్రుతి వివరింపఁబడెను.

రామానుజ బ్రహ్మసూత్రభాష్యనిర్వాహము మఱియొకటి పద్యశేషంబునఁ బ్రతిపాదింపఁబడియె. ఎట్లన:

"పశునా యజేత" (పశువుచే యజ్ఞముఁ జేయవలయును) అను దానిలోనే పశువు యజ్ఞమందు వినియోగింపవలయు నని సంశయ మొదవఁగా, "ఛాగస్యవపాయా మేదసః", "ఛాగోవా మన్త్రవర్ణాత్" అను పూర్వమీమాంసాన్యాయము ననుసరించి సామాన్యవాచకమయిన పశుశబ్దమునకు విశేషవాచకమైన ఛాగము(మేఁక)అర్థమయినట్లు ఉపనిషత్తులలోఁ గారణవాక్య ప్రతిపాదితము లయిన "సద్బ్రహ్మాత్మాది" సామాన్య శబ్దములకు దేవతాంతరభ్రాంతి జనకము లగు "శివశంభు హిరణ్యగర్భాది" శబ్దములకును, 'అపహతపాప్మా దివ్యో దేవ ఏకో'నారాయణః" అను శ్రుత్యుక్త విశేషవాచకమగు "నారాయణ" పదమందు పర్యవసానము.

"తొల్లి జామదగ్నిభయంబునఁ బరిత్యక్తరాజ్యుండై" ఇత్యాది వచనమందు రామానుజసూత్ర భాష్యాంశములు పెక్కులు వివరింపఁబడినవి. అవి విశిష్టాద్వైత సిద్ధాంతమున కాధారభూతములు.

బృహదారణ్యకోపనిషత్తులో పంచమాధ్యాయ సప్తమ బ్రాహ్మణమందు:—
"యః పృథివ్యాం తిష్ఠన్...యస్య పృథ్వీశరీరమ్"
"యోఽప్సుతిష్ఠన్...యస్యాపశ్శరీరమ్"
"యోఽగ్నౌతిష్ఠన్...యస్యాగ్నిశ్శరీరమ్"
"య ఆదిత్యేతిష్ఠన్...యస్యాదిత్యశ్శరీరమ్"
"య ఆత్మని తిష్ఠన్...యస్యాత్మాశరీరమ్"

ఇత్యాది వాక్యము లనేకములు గలవు. పరబ్రహ్మ సర్వచిదచిద్వస్తువుల కంత ర్యామిగా నుండుటచే "సర్వం ఖల్విదం బ్రహ్మ, ఐతదాత్మ్యమిదం సర్వం, అన్తః ప్రవిష్ట శ్శాస్తా జనానాం సర్వాత్మా, జగత్సర్వం శరీరం తే, తత్సర్వం వై హారే స్తనుః" ఇత్యాది శ్రుతిస్మృతిప్రామాణ్యములంబట్టి చేతనాత్మక సర్వజగము పరబ్రహ్మకు శరీరము. భగవంతుఁడు శరీరి. శరీర వాచక శబ్దములు లోకములో శరీరిని బోధించుట మన మెఱుఁగుదుము. ఎట్లనిన: దేవదత్తుఁడు పరుగిడుచున్నాఁ డనుచో దేవదత్త శబ్దము శరీర మునకుఁ బేరుగాని ఆత్మకుఁగాదు ఆత్మ రహితముగా దేవదత్త శరీరమునకు ధావన ముప పన్నము గాదు. కావున దేవదత్తుని యాత్మకుఁగూడ చెల్లును. అట్లే కౌషీతకీబ్రాహ్మణోక్త ప్రతర్దనవిద్యయందు దివోదాసాత్మజుఁడైన ప్రతర్దనుఁ డనువాఁ డింద్రుని యొద్దకుఁబోయి "త్వమేవ మే వరం వృణీష్వ, యం త్వం మనుష్యాయ హితతమం మన్యసే" (ఏది నీవు మనుష్యునికి మిక్కిలి హితమయినదని తలంచెదవో, దానిని నీవే నాకుఁ గోరి పెట్టుము.) అని ప్రార్థింపఁగా "ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా", "తం మా మాయు రమృత మిత్యుపాస్స్వ" (నాజీవుని అమృతమాని యుపాసించుము) అని ఇంద్రుఁ డుపదేశించెను. ఇచట నింద్ర జీవశబ్దనిర్దిష్టుఁడు కేవలజీవుఁడా? లేక పరబ్రహ్మమా? యని చర్చ రాఁగా నీశ్రుతియొక్క ఉత్తరవాక్యమునందు "ఆనందోఽమృతోఽజరః" అని జీవుని కసంభావితము లయిన అజరత్వామృతత్వాదు లుపన్యసింపఁబడుటచే నింద్రజీవి నిర్దిష్టుఁడు "ఇంద్రజీవశరీరకుఁ డైన పరమాత్మగాని కేవలజీవుఁడు గా దని తాత్పర్యము. ఇది యనుభవ విరుద్ధము గాదా? ఎక్కడనైన నిట్టి యుపదేశ ముండునా యనఁగా:—

"శాస్త్రదృష్ట్యా తూపదేశో వామదేవవత్" సూ. 31. 1. 1. ఇట్టి యుప దేశము నింద్రుఁడు తొంటి వామదేవునివలె శాస్త్రదృష్టిచేఁ జేసెను. "మా ముపాస్స్వ" అని స్వాత్మ శబ్దముచే బరమాత్మోపదేశము నిషిద్ధము కాదు. ఎట్లన: తొల్లి పరమాత్మ జ్ఞానసంపన్నుఁ డైన వామదేవుఁ డను నొక ఋషి స్వాత్మశరీరకుండైన పరమాత్మను జూచుచు "నేను మనువను, సూర్యుఁడను, కక్షీవంతుఁడను, విప్రర్షి నయితి" ననెను.

విధి శివ పావక వ్యాస భాను భార్గ వార్జున విత్తేశాది దేవతలు భగవచ్ఛరీర భూతు లయిన సహంకారయుక్తజీవుల నధిష్ఠించి యుండుటచే ముముక్షువుల కను పాస్యులు.

"పితాచ రక్షక శ్శేషీ భర్తా జ్ఞేయో రమాపతిః, స్వామ్యాధారోయమాత్మాచ భోక్తాచాద్యమనూదితః" అని జీవునికి ఈశ్వరునకు నవవిధ సంబంధము లున్న వని విశిష్టాద్వైతసంప్రదాయము.

ఖాండిక్య కేశిధ్వజ సంవాద విమర్శనము

ఆ. ఆత్మగాని మేన నాత్మబుద్ధియును న,స్వంబునందు మిగుల స్వత్వమతియుం
నవనివర యవిద్య యను మహాతరవు ను,త్పత్తికీద్వయంబు విత్తుమొదలు. 3. 65.

విష్ణుపురాణము 6 అంశము. 7 అధ్యాయము.

అనాత్మన్యాత్మబుద్ధిర్యా అస్వే స్వ మితియామతిః,
అవిద్యాతరుసంభూతి బీజమేతద్ద్విధాస్థితమ్.

ఆ. ప్రాణికోటికెల్ల బంధంబు మోక్షంబు, చేరుటకును మనసు కారణంబు
విషయసంగియైన విను బంధకారి ని,ర్విషయమైన ముక్తి విభవకారి.

మనఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః,
బన్ధాయ విషయాసంగి ముక్త్యై నిర్విషయం మనః. వి. పురా.

దిగువ వ్రాయఁబడిన శ్లోకములకుఁ బైపద్యములు సరియైన యనువాదము.

యోగము

యోగ మనఁగాఁ జిత్తముయొక్క రజస్తమోవృత్తులను నిరోధించుట. దీనికి యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అని యెనిమిది అంగములు. వీనిలో ధారణాదులు సమాధికి సాక్షా దుపకారములు; అహింసా స్తేయ సత్యాదులు ప్రతిపక్ష భూత హింసాద్యున్మూలన ద్వారముగా సమాధి కుపకారకములు.

యమములు:—అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము.

పరుల కెవ్విధమునను హింసింపకుండుట అహింస; యథార్థకథనము సత్యము; ఒరు లెఱిఁగినఁగాని యెఱుఁగకుండినఁగాని పరద్రవ్యమును హరింపకుండుట అస్తేయము; జితేంద్రియత్వము బ్రహ్మచర్యము; దేహధారణ కపేక్షితమైనదానికంటె నెక్కుడుగ స్వభోగమునకొఱకు స్వీకరింపక పోవుట అపరిగ్రహము.

నియమములు:—శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము.

శౌచము బాహ్యమని అభ్యంతరమని రెండువిధములు. మృజ్జలాదులచే శరీర క్షాళనము బాహ్యశౌచము, మైత్రీ, ముదిత, కరుణ, ఉపేక్ష అను నాల్గుభావనలచే చిత్తమలమును బోనడచుట ఆంతరశౌచము; ప్రాణధారణమాత్రముచేఁ దుష్టినొందుట సంతోషము, శీతోష్ణ సుఖదుఃఖాదుల సహించుట తపస్సు; ప్రణవాభ్యాసము స్వాధ్యాయము. సర్వకర్మల నీశ్వరునియందు సమర్పించుట ఈశ్వరప్రణిధానము.

స్థిరసుఖముఁ గలుగఁజేయునది ఆసనము.

శ్వాసప్రశ్వాసముల గతినిరోధము ప్రాణయామము.

ఇంద్రియములను బాహ్యవిషయములనుండి మరలించుట ప్రత్యాహారము.

హృదయకమలమందు ధ్యానింపఁబడు శుభాశ్రయమును దీర్ఘకాలము నిలుపుట ధారణము.

తైలధారావదవిచ్ఛిన్నస్మృతి సంతానములో శుభాశ్రయమును జింతించుట ధ్యానము.

అతిస్వచ్ఛమయిన చిత్తవృత్తియొక్క ప్రవాహరూపమయిన ధ్యానమే అర్థస్వరూపముగా నిర్భాసించుట సమాధి యనంబడును.

ఇట్టి అష్టాంగయోగం బభ్యసించు యోగికి, భావనాత్రయ వియుక్తం బయిన బ్రహ్మస్వరూపంబె ధ్యేయంబు.

భావనాత్రయ మనఁగఁ గర్మభావన, బ్రహ్మభావన, ఉభయభావన అనునవి. కర్మభావన యనఁగాఁ గర్మల నాచరింపవలయునను యుద్దేశము. బ్రహ్మభావన యనఁగాఁ బ్రహ్మము నుపాసించుట కుద్దేశము. ఉభయభావన యనఁగాఁ బూర్వోక్తోభయమందు నుద్దేశముఁ గలిగియుండుట సనందనాదులు బ్రహ్మభావనాపరులయ్యును బ్రాక్కల్పంబుల సంచరించినవారగుటచే భావనాబద్ధులే గాన యోగికి ధ్యేయులు గారు. హిరణ్యగర్భాదు లుభయభావనాబద్ధులు గావున వారును సేవ్యులు గారు.

"ద్వేరూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ,
క్షరాక్షరస్వరూపేతే సర్వభూతేషు చ స్థితే.
విష్ణుశక్తిః పరా ప్రోక్తా క్షేత్రజ్ఞాఖ్యా తథాపరా,
అవిద్యా కర్మసఙ్జ్ఞాన్యా తృతీయా శక్తి రిష్యతే.
యయా క్షేత్రజ్ఞ శక్తిస్సా వేష్టితా నృప సర్వగా,
సంసారతాపానఖిలానవాప్నోత్యతి సంతతాన్."

శ్రీవిష్ణుపురాణము ఖాండిక్యకేశిధ్వజసంవాదము 6 అం.

ధారణ సిద్ధించుటకై శుభాశ్రయమును జెప్పుటకు పరబ్రహ్మమగు విష్ణువుయొక్క

శక్తి యని చెప్పఁబడెడి రెండు రూపములను మూర్తామూర్త విభాగములోఁ దెలియఁ జేసి, మూఁడవ శక్తికర్మమనెడి యవిద్యచేత నావరింపఁబడిన యచేతనములోఁ గూడిన క్షేత్రజ్ఞుఁ డనెడి మూర్తవిభాగము భావనాత్రయములోఁ జేరియుండుటచే నశుభమని చెప్పి కర్మ మనెడి యవిద్య లేనిది యయి అచేతనములోఁ జేరకయుండి జ్ఞానమాత్ర స్వరూప మైన అమూర్త మనెడి రెండవ విభాగము యోగము సిద్ధించినవారలచే ధ్యానింపఁబడఁదగినది కాదని విషేధించి ప్రధానాది విశేషాంతచేతనాత్మక ప్రపంచ భావం బగు స్థూలరూపం బుపక్రాంత యోగునకుఁ జింతింపశక్యం బని చెప్పఁబడినది.

సీ. "శ్రీవిష్ణు నీగతి జింతింపవలయు" నను నీ పద్యమందు యోగాభ్యాసముఁ జేయుపురుషుఁడు భగవంతుని ఈ విధమున ధ్యానింపవలయు నని యుపదేశింపఁబడి యున్నది.

మొదట నొక అవయవమును ధ్యానింపఁదొడఁగి. అది ధారణలో స్థిరపడిన పిదప, మఱియొక అవయవమును ధ్యానింపవలయును. అది వశమయిన వెనుక నింకొక టియు నిట్లే క్రమక్రమముగా ధ్యేయమూర్తి అంతయుఁ దా నే యవస్థలో నున్నను చిత్తమందు స్థిరముగా నిలుచున ట్లభ్యాస మొనర్పవలయును. ఈ యంశము శ్రీమద్భాగవతమున ద్వితీయస్కంధములో ద్వితీయాధ్యాయమునందుఁ జెప్పఁబడినది.

8. శ్లో. "కేచిత్స్వదేహాన్తర్హృదయావకాశే ప్రాదేశమాత్రం పురుషం వసంతం,
చతుర్భుజం కంజ రథాంగ శంఖ గదాధరం ధారణయా స్మరంతి.

9. శ్లో. ప్రసన్నవక్త్రం నలినాయతేక్షణం కదంబకింజల్కపిశంగవాససమ్,
లసన్మహారత్నహిరణ్మయాంగదం స్ఫురన్మహారత్నకిరీటకుండలమ్,
ఈక్షేత చింతామయమేవ మీశ్వరం యావన్మనోధారణయావతిష్ఠతే.

13. శ్లో. ఏకైకశోఽంగాని ధియానుభావయే త్పాదాది యావద్ధసితంగదాభృతః,
జితం జితం స్థానమపోహ్యధారయే త్పరంపరం శుద్ధ్యతి ధీర్యథాయథా.

శ్లో. విభేదజనకే జ్ఞానే నాశ మాత్యంతికం గతే,
ఆత్మనో బ్రహ్మణోభేద మసంతం కః కరిష్యతి."

విష్ణుపురాణము. 6-7 అ.

(భేదముఁ గలిగించు జ్ఞానము బొత్తిగా నశింపఁగా నాత్మకును బ్రహ్మకును లేని భేదము నెవ్వఁడు గల్పించును.) పై నుదాహరింపఁబడిన సీసపద్యముయొక్క తేట గీతియం దీ శ్లోకార్థ మీరీతిగ వివరించియున్నాఁడు.

"...సురాతి, భేదసంజనకాజ్ఞానమేదఁ బిదప, నలమ కల్యాణగుణముల వారికిఁ దనకు, లేని భేద మెవ్వాఁడు కల్పింపఁగలఁడు."

విశిష్టాద్వైతమతసంగ్రహము

ఈమతమందు చిత్తు (జీవుఁడు), అచిత్తు (ప్రకృతి), ఈశ్వరుఁడు అని తత్త్వములు మూఁడు.

చిత్తు :—అనఁగా జీవస్వరూపము శరీరేంద్రియాదులకంటె విలక్షణము. జ్ఞానానంద మయ మయినది నిత్యము. అణు పరిమాణము. ఈశ్వరునికి నియామ్యము. శేషము నయినది. మోక్షదశయం దీశ్వరసాధర్మ్యము నొందునది.

అచిత్తు :—దీనికిఁ బ్రకృతి యనియుఁ, మాయ యనియు, అవిద్య యనియు నామాంతరములు గలవు. ఇది జడము. వికారాస్పదము. భగవదిచ్ఛచే నానావిధముగాఁ బరిణమించును. భగవంతునికిఁ గ్రీడాపరికరభూతము సంసారమున కిదియ మూలము.

ఈశ్వరుఁడు:—ఇతఁడు నిత్యుఁడు, నిఖిలహేయప్రత్యనీకుఁడు, సకలకల్యాణ గుణాకరుఁడు. జగత్సర్గస్థితి సంహారకర్త. చేతనాచేతనముల కంతర్యామి. పైని చెప్పఁబడిన చిదచిత్తు లతని కపృథక్సిద్ధ విశేషములు (వేఱుగాని విశేషణములు); కారణావస్థయందు (సృష్టిలేని కాలమందు) పరమాత్మ సూక్ష్మావస్థ నొందిన యీ చిదచిత్తులచే విశిష్టుఁడై యుండును. కార్యావస్థయందు (సృష్టికాలమందు) స్థూలావస్థనొందిన చిదచిత్తులచే విశిష్టుఁడై యుండును. కావున నిట్టి ఉభయవిధమయిన పరమాత్మల కైక్యము బోధించుటచే నీ సిద్ధాంతమునకు విశిష్టాద్వైత మని పేరు.

ఈశ్వరుఁ డఖిల పదార్థములకు నంతర్యామియై యుండుటచేఁ బైని వ్రాయఁబడిన ప్రకారముగా శరీర శరీరి భావ నిబంధన సామానాధికరణ్యముచే సర్వశబ్దవాచ్యమతనికి సిద్ధించుచున్నది. పరము, వ్యూహము, విభవము, అంతర్యామి, అర్చ యని ఈశ్వర స్వరూప మయిదు విధములు. జ్ఞానము, భక్తి, ప్రపత్తి, ఆచార్యోపపత్తి అనునివి మోక్షసాధనములు. "శ్వపచోపి మహీపాల విష్ణుభక్తోన్వజాధికః, "విప్రాద్ద్విషడ్గుణయుతా దరవిందనాభ పాదారవింద విముఖాచ్ఛ్వపచం వరిష్ఠం, మన్యే తదర్పిత మనోవచనేహితార్థ ప్రాణః పునాతి సకులం నతు భూరిమానః"ఇత్యాది ప్రమాణ వచనములచే జ్ఞానభక్తివైరాగ్యములు గలవాఁడెట్టివాఁడైన నాదరణీయుఁ డను నంశముఁ గవి చండాల బ్రహ్మరక్షస్సంవాదమందుఁ గనఁబఱచెను. ముఖ్యముగా నీయంశము నుదాహరించుటకే యీ కథ యీ ప్రబంధ మందు వక్కాణింపఁబడిన దని యూహించెద. పైని వ్రాయఁబడిన విశేషాంశము లన్నియు నీప్రబంధమున నచ్చటచ్చటఁ బూర్ణముగాఁ జూపింపఁబడినవి.

ఇందువలన నీ గ్రంథకర్తకు విశిష్టాద్వైత మతమందుఁ గల భక్తివిశ్వాసములు నిరుపమానమయిన జ్ఞానము, పాండిత్యము మొదలగునవి వెల్లడి యగుచున్నవి.

ప్రబంధకథాపురుషుల శీలవర్ణనము

(CHARACTER-DELINEATION)

తాము రచించిన నాటకములయం దాయాయిప్రకరణముల కనుగుణములయిన రసములతోఁ బాత్రలయొక్క లక్షణములను గుణదోషములను శీలమును లోకస్వభావమునకు సరిపడునట్లు వర్ణించి సామాజి కాంతఃకరణవృత్తులను శోకభయాది రసవీచికలలో ముంచుట కాంగ్లేయ కవులు సమర్థులు. వారిలో ముఖ్యముగా షేక్స్పియర్ (Shakespeare) మహాకవి యుత్సాహమును శ్రమను చాతుర్యమును బూనినట్లు మనవారిలో నాంధ్రకవులె కాక, ప్రసిద్ధులయిన సంస్కృత కవులు గూడ నిట్టిపనికి బ్రయత్నించినవారుకారు. కావ్యనాటకాదులయందు వర్ణింపఁబడు స్త్రీపురుష పాత్రలు నిజముగా నెట్టివారైనను వారితలయం దలంకార శాస్త్రములో నేర్పరుపఁబడిన లక్షణములు గల ఖండితాది నాయికత్వమును ధీరోదాత్తాది నాయకత్వము నారోపించి గతానుగతికముగా వారినిఁ జూచి వీరు, వీరినిఁ జూచి వారు వర్ణించుచు తమకుఁ గవిత్వమందు గల శక్తిని జూపుటతప్ప, నాయికలకును నాయకులకును దక్కిన పాత్రలకును వారి చర్యను బట్టి విలక్షణస్థితి నీయఁజాలరు. కవితా మాధుర్యచాతుర్యములకుఁ బ్రసిద్ధికెక్కిన వని వ్యవహరింపఁబడు సంస్కృతనాటకములు నాటికలు నొక తీరుననే వ్రాయఁబడినవి. రాజశేఖరుఁడు వ్రాసిన విద్ధసాలభంజిక, శ్రీహర్ష కృతములయిన రత్నావళీ ప్రియదర్శికలు, రాజచూడామణి దీక్షితుని కమలినీకలహంసయుఁ, గాళిదాసుని మాళవికాగ్నిమిత్రము బోలియున్నవి. వీనిలో వీని కే విషయమందును లేశమయిన వైలక్ష్యము గానరాదు. ఇరుగుపదండి మల్లికామారుతము భవభూతి విరచితమాలతీమాధవమునకును, మురారి అనర్ఘరాఘవము మహావీరచరిత్రమునకును పాఠాంతరము లని నమ్మఁదు. ఒకటి చదివినచో నింకొకటి నిస్సారముగా నగపడును. అట్లే మన తెలుఁగు ప్రబంధములుగూడఁ జాలమట్టుకు నీతిని ధర్మమును బోధించు కథాసందర్భముగాని, వర్ణ్యనాయకుల శీలవర్ణనగాని లేనివి యయి యున్నవి. వానిఁగూర్చిన కవులందఱు నేకరీతిగాఁ దమకు స్వప్నమందు సాక్షాత్కరించిన పరదేవతయొక్క ఆజ్ఞచేఁ గావ్యరచనకుఁ దొడఁగితిమని ప్రతిజ్ఞచేసి తమ కిచ్చవచ్చిన వర్ణనల కెడమిచ్చునేదో యొకగుణీభూతమయిన కథను దీసికొని దానియందు పురమును, చాతుర్వర్ణ్యమును, పుష్పలావికాజనమును, పురాధిపతిని, ఋతువులను, నాయకుని, ఆనాయకుఁడుచూచి మోహించిన స్త్రీరత్నమును, వారి పరస్పరానురాగమును, తుదకు వారి వివాహమును వర్ణించి కావ్యమును ముగింతురు. దీని కుదాహరణముగాఁ గూచిమంచి తిమ్మకవి రచించిన రసికజనమనోభి

రామము, రెంటూరి రంగరాజు భానుమతీ పరిణయము, కాకమాని మూర్తి రాజవాహన విజయము మొదలగునవి పై యాక్షేపణకు లోఁబడిన వనుటకు సందియము లేదు. ఈ కవుల వ్రాతలలో సంవాదము (Harmony) పరస్పరానుగుణ్యమును (Proportion) మృగ్యములు. దీని కుదాహరణముగా నొకదానిం జెప్పెద వినుఁడు. కూచిమంచి తిమ్మకవి రచించిన రుక్మిణీపరిణయములోఁ గథానాయకి యగు రుక్మిణి కృష్ణసంప్రాప్తి కొఱ కత్యంతార్తి గలదై యయి కృష్ణుని శీఘ్రముగాఁ దోడి తెమ్మని పంపిన విప్రకుమారుఁడు ద్వారకకుఁ బోవు మధ్యమార్గంబున నొక శివాలయముం బొడగాంచి యందుండు శివుని దండకాదులతో దీర్ఘముగ స్తుతించినటుల వర్ణింపఁబడి యున్నది. గ్రంథకర్త తానెంత శివభక్తుఁడైనను శివస్తుతిచేసి తనభక్తి ప్రకర్షను గనఁబఱచుట కిదియా సమయము? ఇది ఔచిత్యసంపాదక మగునా? నాయక ప్రాణవల్లభుని సంశ్లేషముకొఱకుఁ బరమోత్కంఠిత యయి యొక త్రుటికాలము నొక యుగముగాఁ గడుపుచు వెతల గుందుచున్నతఱిని బ్రియుని సందేశము నతిత్వరలోఁ దెచ్చి యామె విరహబాధను శమింపఁజేయుట సమయోచితముగాను రసోచితము గాను గన్పట్టును. విచారించిన నిట్టి వెన్నియో ప్రబంధములయందుఁ గలవు. గ్రంథవిస్తర భీతిచే వ్రాయ నుడిగితిని.

ఏది యెట్లున్నను బూర్వోక్తదూషణగ్రంథవర్జితము లయిన గ్రంథములు మనలోఁ గొన్ని లేకపోలేదు. మితముగా నున్నవి. ఆంధ్రకవులకందఱకు ననుకార్యము నుదాహరణభూతము నగు నాంధ్రభారతములో మనుష్యుల నిజమయిన జీవనము, స్వభావము, వారి తలంపులు చక్కఁగా వర్ణింపఁబడినవి. దానిమార్గము ననుసరించిన కొందఱు మహాకవులు నటులే వ్రాసిరి. శ్రీనాథుఁడు, పెద్దనార్యుఁడు నకలంకమయిన చరిత్రము, దృఢవ్రతము, యోగ్యతయుఁగల మహాపురుషులను (Characters) పాత్రములుగా సృజించిరి. శ్రీనాథుఁడు హరవిలాసములో శివుఁడు జంగమవేషము ధరించి చిఱుతొండరాజునొద్దకుఁ బోయి వాని నిశ్చల భక్తిని పరీక్షించుటకు "నీకుమారునిఁ జంపి వానిమాంసమును భక్షించుటకు నాకి"మ్మని యడుగఁగా, నారాజు దృఢవ్రతము నవలంబించి వెనుదీయక పుత్త్రునిఁ జంపి యాజంగమున కిచ్చెను. ఆహా! యీ రా జెట్టి మహానుభావుఁ డనవచ్చును! ఎంతదైవభక్తియున్నను నిట్టిపనిఁ జేయుట దుష్కరముకదా?

పెద్దనార్యుని స్వారోచిషమనుసంభవమందు వర్ణింపఁబడిన ప్రవరాఖ్యుఁడు నట్టి సచ్చరిత్రుఁడే. తపస్స్వాధ్యాయనిరతుఁడు, నిత్యాగ్నిహోత్రి, దేవాతిథిపూజాపరాయణుఁడు, ఏకపత్నీవ్రతుఁడు. ఇట్టి సద్గుణకదంబమునకు శిరశ్శేఖరం బగు నింద్రియ సమయమును గలవాఁడు "జాతాస్వాదో వివృతజఘనాం కో విహాతుం సమర్థః" అను నట్లు లోకోత్తరసౌందర్యముగల దివ్యాప్సరస మోహించి మీఁదఁ బడఁగా మనస్సునందు

కామవికారమునకు లేశము నెడమీయక చిత్తదార్ఢ్యముగలవాఁడై పరాఙ్ముఖత నొంది మీఁదు మిక్కిలి స్వగాత్రము తచ్ఛరీర సంస్పర్శచే దూషితమయ్యె నని దిగులొంది శుద్ధజల స్నానపూతుఁడై యింటికిఁ జనెను. అతఁడు "తాసు తే ష్వప్యనా సక్తస్సాసత్ష దృర్గోనరాశృతిః" అను శ్లోకమున కుదాహరణభూతుఁడు.

ఏతత్ప్రబంధకర్తయుఁ బూర్వోక్తమహాకవుల మార్గమునే యవలంబించి విశిష్టాద్వైతమతగురు చరిత్రమునుండి కొందఱ మహాశయులను దీసికొని వారిగుణగణమును, సచ్చరిత్రమును జక్కఁగాఁ జిత్రించి యున్నారు.

అట్టివారిలో నగ్రగణ్యుఁడు విష్ణుచిత్తుఁడు. ఇతని భగవద్భక్తి, కైంకర్యధురంధరత్వము, భాగవతజనసపర్యాశ్రద్ధయు మిక్కిలి శ్లాఘనీయములు. "శాస్త్రజ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలనకారణం, ఉపదేశాద్ధరిం బుద్ధ్వా విరమేత్సర్వకర్మసు" అనునట్లు శాస్త్రవాదంబులను మాని తొల్లి రహూగణుం డను సౌవీరదేశపు రాజున కాత్మజ్ఞానం బుపదేశించిన జడభరతునిభంగి, పరులచే దుర్విభావ్యం బయిన జ్ఞానసంపత్తి గలవాఁడై పరమపదంబునందు సయితము ముక్తుఁ డనేక దేహంబులఁ బరిగ్రహించి భగవత్కైంకర్యమే సలుపుచుండుం గావున, భగవత్పరిచర్య సేయుటయ పరమ పురుషార్థం బని నిశ్చయించి, శ్రీవిల్లిపుత్తూరు (నవ్యధన్విపురము) వటపత్రశాయిస్వామికి మాలాకారునివలె మాలికా కైంకర్యంబు సేయఁ దొడంగె.

"క. న్యాయార్జితవిత్తంబున, నాయోగీశ్వరుఁడు పెట్టు నన్నం బాప్రా
లేయపటీరాచలప, ద్యాయాతాయాతవైష్ణవావలికెల్లన్." 1. ఆ. 79.

ఆవిష్ణుచిత్తుఁ డుత్తరము మొదలుకొని దక్షిణమువరకు వచ్చుచుఁ బోవుచుండెడి శ్రీవైష్ణవులకుఁ దాను న్యాయముతో నార్జించిన ధనమును వ్యయపఱచి ఆతిథ్య మిచ్చువాఁడు.

శా. "ఆనిష్ఠానిధి గేహసీమ నడురే యాలించినన్ శ్రీయుం నెం
తే నాగేంద్రశయానుపుణ్యకథలుం దివ్యప్రబంధానుసం
ధానధ్వానము నాస్తిశాకబహుతా నాస్త్యుష్ణతా నాస్త్యపూ
పో నాస్త్యోదనసౌష్ఠవం చ కృపయా భోక్తవ్యమస్మాటలున్." 1. ఆ. 84.

ఆవిష్ణుచిత్తునిగృహమం దర్ధరాత్రివేళ చని వినినను భగవద్గుణానుసంధానము, దివ్య ప్రబంధానుసంధానము, కూరలులేవు, భక్ష్యములు లేవు, అన్నసౌకర్యములేదు, అన్నము వేడిగాలేదు, భాగవతులారా! మీరు నాయందుఁ గృపచే నారగింపుఁ డని అతిథులతో నావిష్ణుచిత్తుఁడు చెప్పెడు నుపచారవాక్యములు వినవచ్చెడివి.

వటపత్త్రశాయి యీతనిఁ బిలిచి "నీవు పాండ్యరాజు సభకుఁ జని పండితులతో వాదించి మనవిశిష్టాద్వైతసిద్ధాంతమును స్థాపించి ర"మ్మని యాజ్ఞాపింపఁగా, నీతఁడొసంగిన సవినయప్రత్యుత్తరము వేనోళ్లఁ బొగడఁదగి యున్నది.

శా. "స్వామీ నన్ను నిత్రగపురాపఠితశాస్త్రగ్రంథజాత్యంధు సా
రామక్ష్మాఖననక్రియాకరఖనిత్రగ్రాహితోద్యత్కిణ
స్తోమాస్నిగ్ధకరు న్భవద్భవనదాసు న్వాదిగాఁ బంపుచోఁ
భూమీభృత్సభ నోటమైన నయశంబు న్నీకు రాకుండునే. 2. ఆ. 81.

మ. గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదము లేల లేరె యితరు ల్నీలీలకుం బాత్రముల్." 2. ఆ. 82.

మొదట విష్ణుచిత్తుఁ డింత వినయమును, స్వాజ్ఞతను, స్వదైన్యమును గనఁబఱచి మాటలాడినప్పటికిని, కొనకు రాజసభలో నీతఁడు గొప్ప వక్తృత్వముతో సకలశాస్త్రముల నుపన్యసించి వాదములోఁ బండితులఁ గెలిచి స్వమతమును స్థాపించెనని చెప్పుటలో సంభవించిన స్వవచనవ్యాఘాతమును (Inconsistency) కవి "దేవుఁ డనుగ్రహించి యితని కింత శాస్త్రజ్ఞానముఁ గలిగించె" నని చెప్పుటచేఁ దొలఁగించుకొనెను.

తన పుత్త్రికయైన ఆముక్తమాల్యద రంగనాథునియం దనురాగము గలది యయి విరహవేదనచే బాధనొందుచున్నపు డీమెయవస్థను వటపత్త్రశాయితో వర్ణించి చెప్పిన మాటలవలన నితఁడు కేవలము భగవత్కైంకర్యనిమగ్నమానసుం డనియు, నవిదిత విషయాంతరుం డనియు స్పష్ట మగుచున్నది.

ఈమె జన్మకథారహస్యము మనకుఁ దెలియదు. కవి ఈమె శీలమునంత పరిణమింపఁ జేయలేదు. తక్కిన కవులు తమతమ ప్రబంధములయందు వర్ణ్యలైనస్త్రీల యౌవనము వర్ణించిన ట్లీతఁడు నీమె యౌవనమును వర్ణించెనుగాని, యీమె చిన్ననాటి యాటపాటలను ముద్దు పల్కులను వర్ణింపలేదు. క్రమముగా నీమె ప్రాప్తయౌవన యయి విష్ణువునం దనురాగము గలది యయి తన యుత్కంఠాతిశయమును చెలులతోఁ జెప్పుటను, తనవలె నతనియం దనురక్త లయిన స్త్రీల నందఱ నాశౌరి యవతారముల యందుఁ బూర్ణమనోరథలం జేయలేదని యాతని దూఱుటను, కవి మిక్కిలి సొగసుగా వర్ణించియున్నాఁడు. కొన కీమె మనోరథానుగుణముగా శ్రీరంగనాథునిం బెండ్లియాడెను. రంగనాథుఁ డీమెను హఠాత్తుగాఁ దనలోనికిఁ దీసికొనినపుడు తండ్రి యేడువసాగెను. ఈమె భగవంతునియం దాసక్తచిత్తురా లయినను జిన్ననాటనుండి

పెంచి సకల విధముల సంరక్షించిన తండ్రి విషయమయి తగినవిశ్వాసమును జూపించినట్లు కానరాదు. ఇది యొక్కటియె యీమెయం దుండు లోపము. ఈమె భూదేవి యొక్క యవతారమని చెప్పఁబడుచున్నది. అట్టి దేవతోచితమయినశీలము కవి యీమెయం దున్నట్లు వర్ణింపలేదు.

ఖాండిక్యుఁడు

ఖాండిక్యుఁడు తనరాజ్య మపహరించి తన్నరణ్యమున కంపిన పరమశత్రు వగు కేశిధ్వజుఁడు, పశులోపమునకుఁ బ్రాయశ్చిత్త మడుగ నిల్లు జొచ్చుకొనిరాఁగాఁ దన మంత్రిపురోహితాద్యాప్తజనులు,

"క. పాలుగలవాఁడు మన కొక, జాలియిడక తానె తారసానకు వచ్చెన్
వేళయిదె లెమ్మునృప కృప, చాలు న్గారాకు మేపి చంపకు ప్రజలన్." 3 ఆ. 32.

"క. అతనిపనిఁదీర్చి రాజ్య, ద్వితయము నిచుఁ జేరు నెట్టి వెఱవున నైనన్
క్షితిపులకరిజయముధనో, న్నతియుఁ బ్రజానీతిరక్షణము ధర్మంబుల్." 3.ఆ.35.

"క. అన్యాయంబున దుస్సహ, మన్యుం డగుప్రబలరిపుని మడియించిన ధ
ర్మన్యక్కృతి కగునిష్కృతి, సన్యాయంబుగఁ బ్రజాళి సంరక్షింపన్." 3.ఆ.36.

అని వానిని జంపవలయు నని బోధించినను వినక,

"క. పరలోకసుఖము శాశ్వత, మరయ మహీరాజ్యసౌఖ్య మల్పానేహః
పరిభోగ్యంబిందులకై, దురితము కావించి లోఁగుదునె పరమునకున్." 3.ఆ.49.

"క. బద్ధాంజలిపుటుఁడీనున్, శ్రద్ధతఁ దన మఱుఁగు సొరఁగఁ గూల్చుట కడుకీ
డుద్ధతి పరలోకార్జన, బుద్ధికి దను కణ్వవాక్యములు దలఁపరొకో." 3. ఆ. 50.

తనమంత్రుల కీరీతిని బ్రత్యుత్తర మిచ్చి కేశిధ్వజునికి దర్శన మిచ్చి యాతఁ డడిగిన దానికి ననుకూలముగా సదుత్తర మొసంగి పంపెను. ఇట్లు శత్రువు దనచేతఁ జిక్కినపుడు వానిని క్షమతోఁ జూచుటయేగాక మఱింత వాని కుపకార మొనర్చుట సామాన్యుని లక్షణమా? ఇతఁడు మహానుభావుఁడు; వీతరాగుఁడు; ఐహికమం దపేక్ష లేనివాఁడు; మహాజ్ఞాని. ఇతని శీలసంపద మిక్కిలి స్తవనీయము.

కేశిధ్వజుఁడు

కేశిధ్వజుఁడు ఖాండిక్యునిపట్ల నుపకారస్మృతి గలవాఁ డై తా నపహరించిన యాతనిరాజ్య మాతని కుమారున కిచ్చి నిఋణుఁ డయ్యెను. ఇదియును స్తోత్రార్హమే.

మాలదాసరి

మాలదాసరి, మున్ను వామనుఁడు నివసించిన సిద్ధాశ్రమమున కామడ దూరమం దున్న యొక పల్లెటూరిలో జీవించువాఁడు. ఇతఁడు, జాతిచే జండాలుఁ డైనను శీల

సంపదచే నధికుఁడు, పరిశుద్ధాంతఃకరణుఁడు, పరమభాగవతోత్తముఁడు, నిరంతర భగవద్గుణానుసంధానపరుఁడు. తనను బ్రహ్మరాక్షసుఁడు మ్రింగుట కుద్యమించినపుడు నిర్భయుఁడై స్వప్రాణవ్యయముఁగూడ సరకుగొనక,

"ఆ. హీన జన్మమఱుట యెవ్వఁడే నొక ప్రాణి, సంతసిలుట ముక్తి పొందఁగనుట
మేలెకాదె శిబియమేల్పంతిగాఁడె న,శ్వరపుదేహమిమ్మి పరముఁగొనుట." 6.ఆ.29.

అని జవాబు చెప్పెను. తాను రాక్షసునితోఁజేసిన ప్రతిజ్ఞాప్రకారము మరలి వచ్చి భక్షింపు మని తనశరీరమును రక్కసుని కొసంగెను. పరులకొఱకుఁ దమదేహ మర్పించిన శిబి, నాగానందనాటక నాయకుఁ డైన జీమూతవాహనుఁడు, కపోతము మొదలగు మహనీయులలో నితనిఁగూడఁ జేర్పవలదా? ఇతఁడు తనకుఁ బ్రాణాపాయముఁ దలంచినవానికే స్వార్జిత పుణ్యఫలముఁ గొంత ధారవోసి యుత్తీర్ణునిఁ జేసె. ఇది మఱింత ప్రశంసనీయము.

పాండ్యరాజు

వేశ్యాగృహంబునకుఁ జనుచున్న పాండ్యరాజు పరదేశబ్రాహ్మణుఁడు చదివిన "వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్" అను శ్లోకమును విన్నతోడనే, జాతవైరాగ్యుఁడై పరమార్థచింత లేక యూరక కాఁముగడపుచున్న తనస్థితిని దలంచుకొని నిర్వేదము నొంది వెంటనే పరతత్త్వనిర్ణయముకొఱకు సభగావింపఁ బ్రయత్నించె నని కవి వ్రాసియున్నాఁడు. ఇంత మహా విభవ సంపత్తితోఁ దులఁదూఁగుచు నైహికభోగలంపటుఁడై యున్నవానికి శ్లోకశ్రవణ మాత్రమున విరక్తి జనించి భగవదుపాసనయం దాభిముఖ్యము కలిగె నని చెప్పుట యాశ్చర్యకరముగాఁ గానవచ్చును. కాని, భగవత్కటాక్షమూలముగాఁ గల్గినచోఁ గల్గవచ్చును.

యామునాచార్యుఁడు వైష్ణవునిగా నొనర్చిన శైవపాండ్యరాజు భార్య మఱియొక సుశీల. ఈమె చాతుర్యము మిక్కిలి కొనియాడఁ దగినది. లోకములో దంపతులిరువురు విరుద్ధమతావలంబులు, విరుద్ధ మనోవృత్తులు నయినచోఁ బరస్పరానురాగ ముండుట దుర్ఘటము. ఈమె యటువలెఁగాక తన భర్త అపమార్గమం దుండె నని చింతిల్లుచు,

సీ. "వింగడంబైనట్టి ముంగిట నెలకొన్న బృందావనికి ముగ్గుఁ బెట్టుదాన
దశమినాఁ డేకభుక్తముఁజేసి యవలినాఁ డోర్చి జాగరముతో నుండునిట్టు
బారసి పోనీదుపైనిద్రఁబాఱుటక్కలువాడు మతుపుణ్యకథలఁ బ్రోయు
నేమంపుమూనాళ్ల కామింప దధినాథు మఱునాఁడు కన్నును మనసుఁ దనియ

తే. సారజపువన్నెఁ బ్రతిసెజ్జకరుగుఁ గూర్మి, నరుగుచో శాఖిఁ దుడిచి కప్పురపుశాఖి
బెట్టు నిట్టులుమద్భక్తి పుట్టియుండు ని,జేశునెడభక్తి చెడదుమదిష్టమగుట." 4. ఆ. 50.

అను పద్యమునందుఁ జెప్పఁబడినట్లు తన నియమములను నెఱవేర్చుకొనుచు భర్త్రను ప్రతురా లయి మెలఁగుచు, రహస్యమందు యామునాచార్యుని వృత్తాంతం బాతని కెఱిఁగించి యతని రప్పించి మెల్లగ రామానుజమతమునకుఁ ద్రిప్పెను. కవి యీయామె పాతివ్రత్యమును బాగుగ వర్ణించెను.

కథ

ఈ ప్రబంధములోఁ బ్రధాన ప్రతిపాద్యము గోదా విష్ణుచిత్తుల కథ. గోదా దేవికథనుబట్టి "ఆముక్తమాల్యద" అనియు, విష్ణుచిత్తునికథనుబట్టి "విష్ణుచిత్తీయ" మనియు నీగ్రంథమునకు నామద్వయ మబ్బినది. తక్కిన ప్రబంధములయందు వలెఁ బూర్వోత్తర సందర్భములతో ననుస్యూత మయి యవిచ్ఛిన్నమగు నొక కథ కాదు. శ్రీ విష్ణు పురాణాంతర్గత ఖాండిక్య కేశిధ్వజ సంవాదము, వరాహపురాణస్థమాతంగ బ్రహ్మరక్షస్సంవాదము, గురుపరంపరాప్రభావ (శ్రీవైష్ణవుల ద్రావిడమతగ్రంథము) గత మయిన యామునాచార్యచరిత్రము నను నీమూఁడు కథలకుఁ బ్రధాన కథతో నెంత మాత్రము సంబంధము లేకపోయినను గవి యొకరీతి సందర్భమును గల్పించి ప్రబంధ ప్రతిపాద్యమగు ముఖ్యకథతో నతికెను. వీనిలో మొదటికథ యగు ఖాండిక్యకేశిధ్వజ సంవాదమందుఁ గవి మార్పు లొనర్పకపోయినను కొస రెండు కథలలోఁ దనయిచ్చకు వచ్చినటులు మార్చి యేయే ప్రకరణములయం దెట్లు వ్రాయవలయునో అట్లాయాయి ప్రకరణములందు రసౌచిత్యమును, భావౌచిత్యమును గనఁబఱచి తనకు సర్వతంత్రముల యం దున్న నిరంకుశ జ్ఞానమును బ్రకాశింపఁజేసినాఁడు. ఆయాయికథలయొక్క మార్పులను నే నీవ్యాసముయొక్క మొదటనే చూపితిని. కవి ప్రబంధీకరించిన యిక్కథ కేవలము మతవిషయక మయినది. వేదాంతమత సిద్ధాంతమునందుఁ బరిచయము లేని వారి కీకథాసందర్భ మంతగా రుచింప దని నాయభిప్రాయము. చదువురాని విష్ణుచిత్తుని పండితసభలో గెలిపించుట, అమనుష్యసంభూత యయిన కన్యకను బెండ్లియాడుట మొదలగునవి లోకాతిగము లయిన దైవకర్మలు. ఇట్టివానిలో విశ్వాసము లేనివారికి ప్రబంధ ప్రతిపాద్యాంశముయొక్క మర్మములను గ్రహింపఁజాలరు.

ప్రబంధశైలి, గుణములు, దోషములు

ఆంధ్రవాఙ్మయములో నింతప్రౌఢప్రబంధ మిదియ కాని మఱేదియు లేదు. వ్యంగ్యప్రధాన మయిన ఉత్తమకావ్యము. దీనిలో నంగముగా శృంగారాదిరసము లనుప్రవిష్టము లయియున్నను ప్రధానరసము శాంతరసాంతర్భూత భక్తిరసము. కవన

పాకము ప్రచురముగా నారికేళపాకము. అచ్చటచ్చట ద్రాక్షాపాకస్ఫురణము గల పద్యములును విరళముగాఁ గనుపట్టుచున్నవి. ఇందలికల్పనలు వర్ణనలు నత్యద్భుతములు, నపూర్వములు. అన్యకవిసజాతీయకల్పనలు వెదకినను గాన రావు. శైలి ఓజోగుణ భూయిష్ఠము. ఓజస్సనఁగా దీర్ఘసమాసములను గలిగియుండుట. ఓజోగుణలక్షణమును గుఱించి ఆచార్యదండి కావ్యాదర్శమం దిట్లని చెప్పియున్నాఁడు.

"ఓజస్సమాసభూయస్త్వ మేతద్గద్యస్య జీవితమ్, పద్యే ఉప్యదాక్షిణాత్యానా మిదమేకం పరాయణమ్. తద్గురూణాం లఘూనాం చ బాహుళ్యాల్పత్వమిశ్రణైః, ఉచ్చావచప్రకారం తద్దృశ్యమాఖ్యాయికాదిషు, ఇతి పద్యేఽపి పౌరస్త్యా బధ్నంత్యోజస్వినీర్గిరః, అన్యేత్వనాకులం హృద్య మిచ్ఛంత్యోజోగిరాం యథా." 1 - 80 81, 83.

(ఓజ స్సనఁగా సమాసప్రాచుర్యము. ఇదిగద్యమునకుఁ బ్రధానము. గౌడరీతి నవలంబించుకవులు పద్యమునందుఁగూడఁ దీని నుపయోగింతురు. హర్షచరిత్రాద్యాఖ్యాయికలయం దిది బాహుళ్యాల్పత్వ విశిష్టములయిన గురు లఘు వర్ణములయొక్క పరస్పర సమ్మేళనమువలన ననేకప్రకారములుగా వ్రాయఁబడుచున్నది. కాని, మఱికొందఱు దీర్ఘసమాస మెప్పుడును శీఘ్రార్థప్రతీతికి భంజకము కావున, తాము రచించు సమాసములను నాతిదీర్ఘములుగాను, అనుద్ధతవర్ణోపేతములుగాను, సహృదయ మనోరంజకముగాను వ్రాయుదురు.)

మొదటఁ జెప్పఁబడిన ఓజోలక్షణ మీ కవిపద్యములయందుఁ బూర్ణముగాఁ బట్టినది.

ఉదాహరణము:—

శా. "కాంచె న్వైష్ణవుఁ డర్ధయోజనజటాఘాటోత్థశాఖోపశా
ఖాంచద్ఝాటచరన్మరుత్త్రయ దవీయఃప్రేషితోద్యచ్ఛదో
దంచత్కోటకృతప్రణచ్ఛలన లిప్యాపాదితా ధ్వన్యని
స్సంచారార్తమహాఫలోపమఫలస్ఫాయద్వటక్ష్మాజమున్," 6. ఆ. 15.

కవిత్వసరణి వైదర్భీమార్గము, గౌడీమార్గ మని రెండు విధములు. వానిలో ప్రసాదము, సుకుమారత, అర్థవ్యక్తి, ఉదారత్వము మొదలగు గుణములతోఁ గూడినది వైదర్భీమార్గము. దీనికి విపర్యయ మయినది గౌడమార్గము.

"ఏషాం విపర్యయః ప్రయోగే దృశ్యతే గౌడీవర్త్మని, శ్లిష్ట మస్పృష్ట శైథిల్య మల్పప్రాణాక్షరోత్తరమ్, అనుప్రాసధియా గౌడై స్తదిష్టం బంధగౌరవాత్" అనుప్రాసము మొదలగు శబ్దాలంకారములు దీనిలోఁ గాన రాకున్న, బంధగాఢత్వమును బట్టిచూడఁగా

పైని వ్రాసిన లక్షణముగల గౌడీరీతి నవలంబించె నని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. ప్రసాదమాధుర్యాది గుణములతోఁ గూడిన పద్యములును కాదాచిత్కముగాఁ గానవచ్చుచున్నవి.

ఉ. "ఎక్కడి రాజ్యవైభవ మెక్కడి భోగము లేటిసంభ్రమం
బక్కట బుద్బుదప్రతిమ మైన శరీరము నమ్మి మోక్షపుం
జక్కి గణింపకుంటి యుగసంధుల నిల్వియుఁ గాలుచేతి బల్
ద్రొక్కుల నమ్మనుప్రభృతులుం దుద రూపఱకుండ నేర్చిరే." 2. ఆ. 78.

వసుచరిత్రకారునికివలె శ్లేషయమకానుప్రాసాది శబ్దాలంకారములయం దీకవి కిష్ట మున్నట్లు కానరాదు. అర్థాలంకారము లగునుపమ, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, అపహ్నుతి, అర్థాంతరన్యాసము, పరిసంఖ్య మొదలగువానిని విశేషముగా వ్రాసియున్నాఁడు.

అనేక నిఘంటువ్యాకరణసహకారముచే నిరూఢ మగుసంస్కృతభాషా పాండిత్యముగలవారికిఁ గాని, సామాన్యజ్ఞానముఁ గలవారికిఁ గాని వర్ణనలతోను గల్పనలతోను గూడుకొన్న పద్యములు దుర్జ్ఞేయములు. కథాభాగమును దెలుపు పద్యములు కొన్ని సామాన్య జ్ఞానముగలవారి కర్థమగును. మహాకావ్యమున కపేక్షితము లయిన పుర చాతుర్వర్ణ్య రాజ ఋతు వివాహాదివర్ణన లిందులో నున్నవి. గ్రీష్మవర్షాశరద్వసంతము లిందులో వర్ణింపఁబడినవి. ఇన్ని ఋతువులు మఱి యేప్రబంధమందును వర్ణింపఁబడి యుండలేదు. చంద్రసూర్యోదయాదివర్ణనలు లేవు. అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయమందును, పింగళిసూరన రాఘవపాండవీయమందును, పుష్పగిరి తిమ్మన సమీరకుమారవిజయమందును, తక్క కవులు తక్కప్రబంధములందును ఋతు వర్ణన చేసిరిగాని, యిట్టి యత్యద్భుతకల్పన లెందును గానరావు. కల్పనలయందును సంస్కృతభాషాప్రాచుర్యమందును దాదాపుగా దీనికి సరివచ్చునది చంద్రికాపరిణయ మొక్కటియే యని యూహించెద.

దీనిలో ద్వివిధ మగు శైలి కానవచ్చుచున్నది (i) వర్ణనలో నుపయోగింపఁబడిన బంధకార్కశ్యముగల శైలియొకటి - ఉదాహరణము.

శా. "తారుణ్యాతిగచూత నూత్నఫలయుక్తైలాభిఘారస్వన
ద్ధారాధూపితశుష్యదంబుపృతమాత్స్యచ్ఛేదపాకోద్గతో
ద్గారంపుంగన రార్చు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతరవాలుకాస్థితహిమాంతర్నారికేళాంబువుల్."
2. ఆ. 68. ఇత్యాదికము.

(ii) ప్రకరణానుకూలసౌలభ్యము గలది యయి రసవంత మయి కథాభాగమును దెల్పునపుడు కవిచే నుపయోగింపఁబడునది మఱియొకటి.

దీని కీ దిగువవ్రాసిన పద్యములే సాక్షి.

చ. "గగనము నీరుఁబుగ్గ కెనగా జడిపట్టిననాఁడు భార్యక
న్పొగసొరకుండ నారికెడపుంబొఱియల్దవులించి వండ న
య్యగపల ముంచి పెట్టఁ గలమాన్నము నొల్చినప్రప్పునాలుగే
న్పొగివిననూరలు న్వడియము ల్వరుగు ల్పెరుగున్ ఘృతప్లుతిన్." 1. ఆ. 80.

మ. "గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదము లేల లేరె యితరుల్ నీలీలకుం బాత్రముల్." 2. ఆ. 91.

రామరాజభూషణుఁడు, కాకమానిమూర్తి, పుష్పగిరితిమ్మన, కంకంటిపాపరాజు మొదలగువారి కవనము సంస్కృతశబ్దబహుళముగా నున్నదిగాని యాగ్రంథకర్తవలె నింత గాఢసంస్కృతము నెవ్వరును వాడుక చేయలేదు. ఈయంశమున కీ ప్రబంధమంతయు నుదాహరణమయి యుండినను నొకటి రెండు పద్యముల నిచటఁ గనఁబఱచుచున్నాఁడను.

"సీ. స్యందనస్థితబిడౌజఃక్షిప్తభుజాద్యక్షుజ్ఝంఝామరుద్గరుద్ఘాతకృతములు
క్రవ్యాశిరాడ్గాత్రకసదసృగ్గాహనస్ఫుటశల్యహావ్యభుక్ఛ్యాతకృతములు
యోధవర్మితహృత్పుటోత్క్రాంతనిజపాతసాలాశ్మకృతముహుస్థాతకృతములు
పతితోగ్రరక్షఃకబంధభారభృశార్తిభుగ్నభోగఫణీంద్ర ఫూత్కృతములు
"తే. శ్రాంతరథ్యనిరంతరచ్ఛాయదములు, దివ్యతావకకార్ముకోత్ప్రేరితములు
కలుషము లడంచుఁ గాత లంకాపురాంగణాంబరచరత్కలంబకదంబకములు."

"శా. అద్ధావాగ్మిబుధ స్మహోవచన కవ్యాహార మాహోవచ
స్సిద్ధమ్మాఃకృతతాంగణః కలిరితి శ్రీసూక్తి విద్యాధర
మ్మిద్ధౌద్ధత్య మగా ల్లయం హి కుధియామిత్థంవదత్కిన్నర
మ్మద్ధీరాగ్రణి గెల్పుటుత్సవమునందయ్యె న్నభమ్మంతయున్." 4. ఆ. 6.

"మ. చని కాంచె న్విరజాభిధాంతరవపుస్సహ్యోద్భవాతీరనం
దనవాటీవలయద్రుమావళి దళాంతర్దృశ్యపాపాళిభం
జనచాంపేయ సుమాయమాన విషమస్వర్ణావృతిప్రాత ర
శ్మి నభస్పృక్శిఖరాళి దీపకళికాశృంగంబు శ్రీరంగమున్." 6. ఆ. 91.

ఈ ప్రబంధకర్త న్యాయవైశేషికములందును, పూర్వోత్తర మీమాంసల యందును, సాంఖ్యయోగ తంత్రములయందును, నిరంకుశపాండిత్యము గలవాఁ డని ఋజువుచేయుట కీప్రబంధమే నిదర్శన మని యిదివఱకే వ్రాసియున్నాఁడను.

"తే. ......ఎండ్రి రవిఁజేర మూఁడవయెదకుఁజేరు
తరణిధరణిం బ్రమోదసంధాయి గాఁడె. 4. ఆ. 77.

"మ. మునుపే చంద్రబలంబుగల్గి మలయంపుంగమ్మతేగాడ్పుఁదే
రున నేతెంచు లతాంతబాణునకు సూర్యుండు న్సహింం గ్రొత్తగా
ననుకూలించె......" 5. ఆ. 101.

ఈపైనివ్రాసిన వాక్యములబట్టి యాలోచింపఁగా నితనికి జ్యోతిశ్శాస్త్రమందుఁ గూడఁ బ్రావీణ్య మున్నట్లు కనఁబట్టుచున్నది.

ఈకవి యిట్టిసర్వతంత్రస్వతంత్రుఁ డైనను గ్రంథమం దచ్చ టచ్చటఁ గొన్ని స్ఖలితముల నొనరించుట కెద్దియు నుపపత్తి కానరాదు. "ప్రమాదో ధీమతా మపి" అను న్యాయ మున్నదికదా? ఇందుకిరణ సందోహమందు డిందుకందువలె గుణ బాహుళ్యమందు దోషలేశమున్న నడఁగిపోవును. ఏతాదృశాల్పదోషము లిట్టి యుత్తమ కావ్యశోభకు భంజకములు గానేరవు.

పాండ్యరాజు సభలో విష్ణుచిత్తుఁడు విపక్షులను జయించుటకుఁ జేసిన ఉపన్యాస ములో,

"సీ. జగదుద్గతికిని బీజము ప్రధాన మన నీకుత్యాదివీకు నశబ్దవాది
బొరి నీకుఁ డేనన భోగమాత్రేత్యాద్యుతావ్యాతి స్ఫూర్తి మాయావివాది
... ... "

ఇచట రెండవపాదములో "భోగమాత్ర సామ్యలింగాచ్చ" (4 ఆ. 4 పా. 21 సూ.) అను సూత్రముచేత, మాయావాది యనఁగా నద్వైతుని ఖండించె నని కవి చెప్పుచున్నాఁడు. ఈసూత్రము రామానుజ బ్రహ్మసూత్రభాష్యములో జగద్వ్యాపార వర్జాధికరణములోనిది. ఆ యధికరణముయొక్క తాత్పర్య మే మనఁగా ముక్తినొందిన జీవుని కీశ్వరునికివలె జగత్సృష్ట్యాది వ్యాపారముల నొనరించుటకు శక్తి కలదా లేదా యని శంకించుకొని "ఈశ్వరుని కొక్కనికే జగత్సృష్ట్యాదులను జేయుటకు శక్తి కలదు గాని, ఆట్టిపనులలో ముక్తజీవుని కెంతమాత్రము వంతు లేదని సిద్ధాంతీకరించిరి. "భోగ మాత్ర సామ్యలింగాచ్చ" అను సూత్రముచే పైనిచెప్పఁబడిన యర్థమే బలపఱుపఁబడి నది. ఎట్లన: ముక్తునికి బ్రహ్మయాథాత్మ్యానుభవరూప భోగమందె బ్రహ్మసామ్యముగాని ఇతరమందు బ్రహ్మసామ్యము లేదు. కావున, జగత్సృష్ట్యాదులతో ముక్తుని కవసరము లేదని

యర్థము. కావున నీయధికరణము జగత్సృష్ట్యాది వ్యాపారములయందు ముక్తుని కెంత మాత్రము సంబంధము లే దని తెలియఁజేయుటకుఁ బుట్టినదిగాని "జీవుఁ డీశ్వరునికంటె భిన్నుఁడు" అను సంశయమును సాధించుటకై ప్రవర్తిల్లినదికాదు. జీవబ్రహ్మలకైక్యము సిద్ధింపదు. "జీవుఁడు వేఱు, బ్రహ్మ వేఱు" అనుసంగతిని సమర్థించు సూత్ర కదంబము ప్రథమాధ్యాయ ప్రథమపాద ద్వితీయపాదములలోఁ బ్రతిపాదింపఁబడెను. ఎట్లన; ఆనందమయోఽభ్యాసాత్. 1. 11. 3.

1. తైత్తిరీయక శ్రుతియందు శతగుణితోత్తరముగా నావృత్తిఁ జేయఁబడిన నిరతిశయానందము జీవునికి సంభవింపదు గావున శ్రుతిలో నానందమయశబ్దముచేఁ జెప్పఁబడిన వాఁడు జీవునికంటె భిన్నుఁ డైన ఈశ్వరుఁడు.

2. తద్ధేతువ్యపదేశాచ్చ. 1. 11. 15.

ఈశ్వరుఁ డానందహేతు వని శ్రుతి చెప్పుటచే జీవునికంటె భిన్నుఁడు.

3. నేతరోఽనుపపత్తేః. 1. 1. 17. బహుభవనసంకల్ప సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదులు జీవుని కుపపన్నములు కావు గనుక జీవునికంటె నీశ్వరుఁడు వేఱు.

4. కర్మకర్తృ వ్యపదేశాచ్చ. 1. 2. 4.

ఈశ్వరుఁ డుపాస్యుఁ డగుటచేఁ గర్మయనియు, జీవుఁ డుపాసించు వాఁడగుటచేఁ గర్త యనియు శ్రుతి చెప్పుటచే జీవేశ్వరులు భిన్నులు.

ఇత్యాది జీవేశ్వర భేదసాధన సూత్రగణను మాయావాది మతఖండనమందుఁ గవి వ్రాసినచో బాగుగ నుండు నని యూహించెద.

ఈవిష్ణుచిత్తుఁడు శ్రీవిష్ణుపురాణమునకు వ్యాఖ్యానము చేసి నట్లు కవి వ్రాసి యున్నాఁడు. ఇదియు భ్రాంతిమూలకమే. విష్ణుపురాణవ్యాఖ్యాత యగు విష్ణుచిత్తుఁడు వేఱు. ఇతఁడు రామానుజుల వారి శిష్యుఁడు. ఆచార్యాజ్ఞ చే నీపురాణమునకు వ్యాఖ్యానము వ్రాయుచున్నా నని వ్యాఖ్యానప్రథమశ్లోకమందె ప్రతిజ్ఞ చేసియున్నాఁడు.

"తే. అలసతఁ బరున్నమనుజుండు గలియుగంబు
ద్వాపరం బెన్నఁగూర్చున్నవాఁడు త్రేత
యుత్థితుఁడు యాయి మరి కృతయుగ మటన్న
నముచిదమనోక్తి బుగ్బ్రాహ్మణమున వినవె.

[7 పంచిక. 3 అధ్యాయము.]

"కలిశ్శయానో భవతి సంజిహానస్తు ద్వాపరః, ఉత్తిష్ఠం స్త్రేతా భవతి కృతం సమ్పద్యతే చరమ్" ఐతరేయ బ్రాహ్మణము. 7 పంచికా. 3 అధ్యాయః.

ఈ కవిమార్గము తక్కిన కవులమార్గమువలెఁ గాక కొన్ని విషయములయందు కేవల విజాతీయముగఁ గానవచ్చుచున్నది.

1. కొన్ని చోట్ల సంస్కృతమునందువలె విశేషణములకు లింగ వచనాదుల యందు విశేష్యనిఘ్నత కానంబడుచున్నది.

“ఉ. ఆయత యుష్మదాకృతి కరాగ్రనగాంచలవాంతవారిధా
రాయుతచంద్రకాంతఫలకావళి బింబితమై...” 4. ఆ. 29.

ఇచట “ఆకృతిశబ్దము” (క్తిన్నంత మగుటచే స్త్రీలింగము గావున దాని విశేషణ మగు “బింబిత” యనునది గూడ స్త్రీలింగ రూపములో నుంపఁబడెను.

“సాత్త్వికపు మనోగతి యెయ్యది గలదు దాని
బ్రహ్మసంబంధినిగఁ జేయు ప్రాధిసూవె...” 3. ఆ. 74.
కవచిత సుధాకర్బురలగు కరివర కరేణుకంధరలన్.”

ఇట్టివి మఱికొన్ని పైవిషయమున కుదాహరణములు.

2. కొన్ని స్థలములయందు సంస్కృతజాతీయమును(Sanskrit idiom)కలదు.

“ఉ...ఉరువిద్యుద్దీపకళికలుమిసిన ధూమస్ఫురణ......” 4. ఆ. 138.

ఇచట “నిష్ఠ్యూతోద్గీర్ణ వాంతాదిగౌణవృత్తి వ్యపాశ్రయమ్, అతిసుందర మన్యత్ర గ్రామ్యకక్ష్యాం విగాహతే” అను ఆచార్యదండి వచనానురోధముగాఁ గవి “ఉమిసిన” అను శబ్దమును, నిష్ఠ్యూతశబ్దార్థ మందు గౌణవృత్తిలోఁ (Metaphorical sense) బ్రయోగించెను

3. మఱికొన్ని తావులయందు ద్రావిడజాతీయము. (Tamil idiom).

“క...మీరు నాకనురక్తు ల్వరికించి పదింబదిగా నరయుండు మది నెద్దిమేలు ప్రార్థించుటకున్.” 3. ఆ. 55.

ఇందులో “పదింబదిగా” అనునది ద్రావిడములో “పత్తుం పత్తాగ” అనఁగా, పది-పదిగా పదిలోనొక్కటియుఁ దక్కువ గాకుండ-సరిగా అని తాత్పర్యము.

4. కొన్నిచోట్ల ద్రావిడశబ్దప్రయోగము.

(1) “...ఎండ గాలి పసితాఁకుం జూడఁగా ప్రాప్తమున్.” 6. ఆ. 7.

ఇచట “పసి” = ఆఁకలి.

(2) “...వెండి యేజంగమెత్తిన వెఱగుపడును” 4. ఆ. 43.

ఎత్తిన = స్తుతించిన. ద్రావిడము “ఎత్తు = స్తుతించు.

(3) భక్తిద్రోవకు సాధ్వి పరికరంబులువెట్టి కట్టిన పారివిళంగాయగములు...”
ఇచట విళంగాయ = వెలగకాయ. 2. ఆ. 97.

(4) "...కడుమ్రోఁతపెన్దిరువడిం గని రాఖగరాజుమూపునన్." 4. ఆ. 10.

పెన్దిరువడి=పెరియ తిరువడి, పెద్దశ్రీపాద మని యర్థము. ఇది గరుడునికి ద్రావిడవైష్ణమత పరిభాషానామము గరుడుఁడు భగవంతునికి పాదస్థానీయుఁడు.

"...ఉద్దామపితృప్రసూప్లవగిద్రైన్యరులోత్థ రథాంగపోతచిం
తామయనిద్రలంబొలసి తాపముసేయఁదొడంగె నింతికిన్. 5. ఆ. 87.

ఇచట సంధ్యాసమయము విరహిణుల కుద్దీపక మను నంశము చెప్పఁబడినది. ఇది ద్రావిడ కవిసమయ సిద్ధముగాని సంస్కృతకవిసమయసిద్ధము కాదు.

ఈకవిపుంగవుఁడు గూర్చినసంధులును, బ్రయోగించిన ప్రయోగములును, కొంతమట్టుకు లక్షణాపేతములయి గానవచ్చు చున్నవి.

1. తే. "నింగిటుత్రిశంకుకతన మాతంగవాటి యయ్యెనిఁకనుండఁదగదని..." 2.ఆ.53.
నింగి+ఇటు - ఇకారమునకు సంధి.

2. చ. "...నిట్టతాడువంటతివరమించెఁ దా ముసలియయ్యు రహిన్..." 5. ఆ. 53.
తాడువంటి+అతివ.

తత్సమము లం దకాసంధులు

3. "...ప్రోల్చెదని కడంక దంచనపుజేతులు గంగనుకాసె దూరగా..."
గంగ+అనుకాసె. 2. ఆ. 9.

4. "...వడఁకుటెకాక చేష్టుడిగె వక్షము పక్షులుఁజాపుల్ చోరన్." 4.ఆ.118.
చేష్ట+ఉడిగె.

5. "...ఈబ్రక్కం ద్విజుఁ జూడరయ్య సభవా రీరంగభర్తంచు దుఃఖాబ్రాళిం బడి..." 6. ఆ. 108.
శ్రీరంగభర్త+అంచు.

క్త్వార్థకసంధి

6. సీ. "తమసేగిఁజెప్ప లో దయమీరవిని చీరఁ జించిచ్చువారి దీవించువారు."
చించి+ఇచ్చు క్త్వార్థకసంధి.

7. "...నీదుకఱకుట్లందీవదస్త్రాలకాంతారాంతర్నృకపాలకుండ..." 6. ఆ. 25.
అంది+ఈన్ - క్త్వార్థత్తునకు సంధి.

8. "కొంగవాల్నరుకు లంగుళుల బట్టుక జబ్బలంటగుట్టిడ వెజ్జు నరయువారు..."
పట్టుకొని యనుటకు పట్టుక. 6. ఆ. 85. [వారు..." 6. ఆ. 85.

9. "...తలఁబడ్డ గుదియ దెబ్బలఁ బొతమసియిడి యంబలి గంజిండ్ల నడుగు
గంజి+ఇండ్లన్.

10. "...పుట్టునీ్నగెద దీని సానొదవి యోపుణ్యాత్మ యెట్లంటివే." 6. ఆ. 54.

పుట్టున్ + ఈగెద = పుట్టునీగెద అని యుండవలయును.

మఱికొన్ని చిత్రమయిన ప్రయోగములు గలవు.

1. "ఇంక రెణ్ణాళ్లు చూచి..." 3. ఆ. 39.
2. "...కళిందజాతటకుటి ద్దున నేటికి..." 4. ఆ. 28.
3. "కల్లాన ఘూర్వవాత ఘట్టనలఁ బాయి." 4. ఆ. 13.

ఈకవికి ఝూటశబ్దమును (సమూహవాచి) దఱుచుగా వాడుక చేయునలవాటు గలిగియున్నది.

మ. "అళు లేతద్వదనేందు రాగమిళనాప్రాదుర్భవత్కోరకంబుల తేనెల్పుధలంచు..."
5. ఆ. 132.

ఈపద్యముయొక్క ప్రథమపాదమందలి యతి విచారణీయము, వ్యాఖ్యాత "ప్రా" అనుచోట "ఆఙ్" ఉపశ్లేషముచేసి యతి నిర్వహింప వలయు నని వ్రాసి యున్నాఁడు. ఉపసర్గ లనియు గతులనియు నుపసర్గలకు రెండు పేర్లు. "ఉపసర్గాః క్రియాయోగే" 1. 4. 59. 'గతిశ్చ' 1. 4. 60. ప్ర, పరా, ఆఙ్, అపి, అధి మొదలగునవి ఉపసర్గలనియు; ఊరీ, ఉరరీ, అంగీ, ప్రాదుః, ఆవిః, తిరః మొదలగునవి గతు లనియు వాడుక. ఇచట "ప్రాదుః" అనునది వ్యస్తపదముగాని సమస్తపదము కాదు. అందుచే 'ప్ర' అను వానిపై "ఆఙ్" నుపశ్లేషముచేయుట కవకాశము లేదు. ఇందులకు అప్పకవి తే. గీ. ఆంధ్రమునకుఁ జేరని పరాఙపులు (పరా + ఆఙ్ + అపి) మూఁడు, గాక తక్కిన యుపసర్గకముల తలల, స్వరము లతికినవాని కవ్వలన నిలుచు, నచ్చయిన హల్ల యినఁ బ్రాదియతి యనంగ." 134 పుట. 132 ప.

యామునాచార్యుఁడు కుమారుని కుపదేశించిన నీతి

ఈనీతినిఁబట్టి విమర్శింపఁగా రాజ్యపాలనానుభవమందుఁబండిన బుద్ధిగల రాజన్యుఁ డిట్లు వ్రాయఁగలుగునుగాని, కేవలగ్రంథాధ్యయనమువలన నీతిశాస్త్రమందుఁ బాండిత్యము సంపాదించిన బ్రాహ్మణపండితుఁ డిట్లు వ్రాయఁజాలఁ డనియు, దీనిచే నీగ్రంథకర్త రాజ్యపాలనమం దారి తేరిన క్షత్రియుఁ డనియు నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

అలంకార విమర్శ

ఈ ప్రబంధమందుఁ గవి ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకము, అతిశయోక్తి సహోక్తి, అర్థాన్తరన్యాసము, స్వభావోక్తి, పరిసంఖ్య మొదలగు నలంకారములను వాడుకచేసియున్నాఁడు.

ఉపమ

"తే. సామరదిదృక్షుఖస్థరక్షఃపిశాచ, పురజమహిభుక్ప్రతత్రప్రభంజనములు
సోఁక వెలిఁబాఱెఁగల్లానశూర్పవాత, ఘట్టనలఁబాఱుపెనుపొలకట్లుపోలె."

కళ్లములోఁ బోసిన ధాన్యరాశిఁ జేటలచే విసరఁగాఁ గట్టిగింజ నిలిచి ధాన్యపు పొల్లు పైకెగిరి పోయినట్లు, స్వామిని సేవించుటచే వచ్చిన దేవతలతోఁ గలసిన రక్షః పిశాచసంఘములు గరుడునిపక్షానిలముచేఁ దూలిపోయి రని తాత్పర్యము. కాళిదాసుని యుపమవలె నీయుపమ యెంత సౌష్ఠవము గలిగియున్నదో ఎంతసమయోచితముగా నున్నదో చిత్తగింపుఁడు. ఇట్టి వనేకములు గలవు. గ్రంథవిస్తరభీతిచే వ్రాయఁజాలను.

చ. ముదువనసీమ చేసికొని మల్లిడి గ్రుద్దట వెండిచేని మె
త్తనకయి వేరువెల్లకియుఁ ద్రవ్వెడుకర్షకునట్లు శత్రుతో
నెనసియమైన దుర్గబలమేకొనియైన నిజాత్మచింతలే
క నెగడఁజేసి లోనమరి కంటకశోధనజేయు టొప్పుగున్. 4 ఆ. 219.

ఇదియు నట్టిదియే.

స్వభావోక్తి

మనపూర్వకవులు గోరంతను కొండంతచేసి యుత్ప్రేక్షాతిశయోక్త్యత్యుక్తులచే వర్ణించుట తప్ప యథావస్థిత వస్తువర్ణనచే వాస్తవమును దెల్పి జనమనోరంజన మొనర్చుట కలవాటుపడినవారు కారని యిప్పటి యిరువదియవ శతాబ్దమునందలి యాంగ్లేయకావ్య రసభావనాపరిపక్వహృదయు లగు మనవారు కొంద ఱాక్షేపించుచున్నారు. ఇట్టి యాక్షేపణకుఁ బాత్రు లయినవా రస్మత్ప్రాచీన కవులలోఁ గొందఱు లేకపోలేదు. ఉన్నారు కాని, తిక్కన, శ్రీనాథుఁడు, సూరనార్యుఁడు మొదలగు కతిపయ కవిశిరోమణులు సకలజనమనోహ్లాదకరములయిన స్వభావోక్త్యలంకృత సూక్తులను మెండుగ వ్రాసియున్నారు. ఈకవికూడ నట్టివాఁడె. ఇందుల కుదాహరణముగా "ద్రావిడాంగనలు కొలఁకులలో స్నానముచేసి దివ్యప్రబంధము నను సంధించుచు నభిషేకజలపూర్ణఘటములఁ గటిప్రదేశములయందు ఘటించి తోఁటలలో నడచెన" రని వర్ణించినపద్య మెంత సొగసైన స్వభావోక్తియో చూడుఁడు.

"మ. శయపూజాంబుజముల్ఘటిం దడబడన్ జన్దోయి లేఁగౌనుపై
దయదప్ప న్బసపాడి పాగడపు పాదం బొప్పఁ జెంగల్వడి
గ్గియ నీరచ్యుత మజ్జనార్థము గటిన్ గీలించి దివ్యప్రబం
ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతు రుద్యానంబులోఁ ద్రోవలన్." 1.ఆ.56

ఉత్ప్రేక్ష

"మ. కలయన్ నీలమయంపుఁ దల్లియొఱ దాఁకం దేటనీరొప్పప్ర
ఖ్యలకూపంబుల మీలఁ జూచి వలభీవ్యాసంగితుంగద్రుశా
ఖలలోఁ డాఁగి గబాలున్ లకుముకు ల్క్రిందై పడున్ లేచు ము
చ్చిలి గేహేందిర ద్రావిడీపరిచితిం జెండాడు చందంబునన్." 1. ఆ. 57.

వీథులయందలి నూతులలోఁ గనఁబడు మత్స్యములఁ జూచి యిండ్లచూరుల యందు వ్యాపించియున్న తరుశాఖలలో ఱెక్కలాడించి యాబావులలో దుముకుచు లేచుచున్న లకుముకిపిట్టలు గృహలక్ష్మికి పరులకుఁ గనఁబడకుండనుండి ఆడుచున్న బంతుల వలె నున్న వనియుత్ప్రేక్ష.

భ్రాంతిమదలంకారము

"మ. తలఁబక్షచ్ఛట గ్రుక్కి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుషస్స్నాత ప్రయాతద్విజా
వలి పిండీకృతశాటుల న్సవిఁ దదావాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గ న్వెస బారువానిఁ గని నవ్వున్ శాలిగోప్యోఘముల్."1. ఆ. 65.

ఆపట్టణ సమీపమందున్న వరిమళ్లకుఁ బాఱు కాలువలయందు బాతులు వాని స్వభావగుణముచేతఁ దలలు ఱెక్కలలోఁ బెట్టుకొని నిద్రించుచుండఁగా గ్రామముఁ గాపాడువారు వానిని జూచి ప్రాతః కాలమందు స్నానార్థమై యాకాలువలకు వచ్చిన బ్రాహ్మణోత్తములు తమ ధౌతవస్త్రముల నచట మఱచినా రని తలంచి మరల వారిగృహములలో వాని నొప్పగించుటకై రేవులలో దిగఁగా నాపక్షులు పఱచుటఁ జూచి యచ్చటఁ బైరుగాపాడుచున్నస్త్రీ లాతలవరులను హసింతురు. ఱెక్కలలోఁ దలవెట్టుకొని నిద్రించుబాతులు తెల్లగా నుతికి పెట్టినవస్త్రము లనుకొనుట భ్రాంతి.

పరిసంఖ్యాలంకారము

"సున్నమెత్తుటయుఁ బట్టుకారుల బట్టుటయు సౌధసౌవర్ణ భూషాది నిర్మాణంబుల యంద, కాసెచుట్టుటయుఁ గత్తిగట్టుటయుఁ గృకవాకుకలహంబులయంద, ధాతువాదంబులు తఱచగుట శాబ్దికుల యంద" ఇత్యాదులు.

గ్రంథకర్తృనిరూపణము

ఈ ప్రబంధ ప్రామాణ్యముం బట్టియు, ప్రబంధశైలిని బట్టియు విచారింపఁగాఁ గృష్ణదేవరాయలే దీనిని రచించినట్లు నిష్కృష్టముగాఁ జెప్ప వచ్చును. ఈతఁడు చంద్రవంశోత్పన్నుఁ డగు నరసింహరాయని కుమారుఁడు. తుంగభద్రానదీతీరముననుండు ఆనె

గొండె యను నామాంతరము గల విజయనగర మీతని రాజధాని. పూర్వకాలమునందు మాలవదేశాధీశ్వరుఁ డగు భోజరాజు సంస్కృత భాష నెట్లాదరించెనో, అట్లే యీకృష్ణదేవరాయ లాంధ్రభాష నాదరించి కవుల సన్మానించి గ్రంథరచనము చేయించుటచేత నీతఁ డాంధ్రభోజుఁ డని ప్రఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు తన యాస్థానమం దనేక విద్వత్కవుల నునిచి వారిచేఁ గావ్యములను జేయించుట మాత్రమే కాక, సంస్కృతాంధ్రభాషలయం దసాధారణ ప్రజ్ఞావిశేషముఁ గలవాఁ డగుటచేఁ దాను స్వయముగా నుభయభాషలయందును గావ్యముల రచించుటకుఁ దగిన దక్షత యుండెను. ఇతఁడు, కవులను బ్రోత్సాహ పఱచి కావ్యములు చేయించియుఁ, దాను స్వయముగాఁ జేసియు, నాంధ్ర భాషకు మహోపకారము నొనరించి యున్నాఁడు. దక్షిణ హిందూ దేశమును బాలించినరాజులలో నింతదేశమును జయించి యేలిన వాఁడును, ఇంత ప్రసిద్ధి నొందినవాఁడును మఱెవ్వఁడును లేఁడు.

ఇతఁడు, తెలుఁగున రచించిన గ్రంథము విష్ణుచిత్తీయ మను నామాంతరముగల ఆముక్తమాల్యద. ఇతఁడు సంస్కృత భాషయందుఁ గూడ గొన్ని గ్రంథములను రచించినట్లు విష్ణుచిత్తీయమునందలి యీ పద్యము వలనఁ దెలియ వచ్చుచున్నది.

సీ. "పలికి తుత్ప్రేక్షోపమలజాతిపెంపెక్క సరసు లౌనన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్య సేవధిగాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘచ్ఛటలు విచ్చఁగరచించితి సూక్తినైపుణి జ్ఞానచింతామణికృతి
తే. మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య, రచనమెప్పించుకొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందునొక్క, కృతి వినిర్మింపు మిఁకమాకుఁ బ్రియ
[ముఁగాఁగ." 1. ఆ. 13.

ఈ పద్యమునం దుదాహరింపఁ బడిన సంస్కృతగ్రంథము లెవ్వియు నిప్పుడు గానరావు.

ఈతని కాలమునను క్రొత్తగాఁ బ్రబంధరచన మారబ్ధ మయ్యెను. అవఱకుండెడు నాంధ్రకవులు, పురాణము మొదలగు సంస్కృత గ్రంథములను మృదు మధుర శైలిని నాంధ్రీకరించియున్నారు గాని, నూతనముగా స్వాతంత్ర్యము నవలంబించి క్రొత్త ప్రబంధము లను రచించినవా రెవ్వరును గాన రారు. ప్రథమమందుఁ బ్రబంధరచనకు మార్గమును జూపించినవాఁడు కృష్ణరాయల యాస్థానకవులలో సుప్రసిద్ధుఁ డగు నల్లసాని పెద్దనార్యుఁడు.

అల్లసాని పెద్దన, నందితిమ్మన, మాదయ్యగారి మల్లన, అయ్యలరాజు రామభద్రకవి పింగళిసూరనామాత్యుఁడు, రామరాజ భూషణుఁడు, తెనాలి రామకృష్ణుఁడు, ధూర్జటి కవి అని యెనమండ్రు కవులు కృష్ణరాయల యాస్థానమం దుండి రనియు, వారి కష్టదిగ్గజము లని పేరనియు, లోకములో వాడుక కలదు గాని కడపటఁ జేర్కొనఁబడిన మువ్వురును కృష్ణరాయని యాస్థానమున నున్నవా రని ధారాళముగాఁ జెప్పుటకుఁ దగిన ప్రమాణములు గానరావు. ఒకవేళ నాతని కాలమం దున్నను మిక్కిలి బాల్యదశలో నున్నవారు గావలయును గాని, యాతని యాస్థానకవులు మాత్రము గాఁ జాలరు. అందును గురించి తెలిపెడు కథలు నమ్మఁదగినవి కావు.

ఈదిగువ వ్రాయఁబడిన హేత్వాభాసములఁ బట్టి కొంద ఱాముక్తమాల్యద పెద్దనార్యకృత మని వాదించెదరు. కాని యది విచారవిధుర మయిన యంశము.

1. కృష్ణరాయవిరచిత మగు నాముక్తమాల్యదలోని పీఠిక యందు మనుచరిత్రములో నుదాహరింపఁ బడిన పద్యములు కొన్ని కానవచ్చుచున్నవి. అందుచే నిది పెద్దనార్యకృతముగాని కృష్ణరాయ విరచితము గాదు.

కృష్ణరాయఁడు భగవదాజ్ఞచే నీయాముక్తమాల్యద యను మహాకావ్యమును రచింప సమకట్టి కృత్యాదియందు గ్రంథకర్తృవంశమును వర్ణించుట పరమావశ్యకము, నాచారము గావున నాప్రకారము తన వంశమును వర్ణింపఁ బూనును. రాయలు "అవికత్థనః క్షమావా నతిగంభీరో మహాసత్త్వః, స్థేయాన్నిగూఢమానో ధీరోదాత్తో దృఢవ్రతః కథితః" అను కారికలోఁ జెప్పఁబడిన ధీరోదాత్తలక్షణములు గలవాఁడు గావునఁ, దన్నుఁ దన వంశస్థులను శ్లాఘించుకొనుట కిష్టములేక, తన యాస్థాన కవీశ్వరుఁడు తన కాంతరంగికుఁడైన పెద్దనార్యుఁ డింతకు మున్ను రచించిన మనుచరిత్రములోని స్వవంశవర్ణనాపరము లయిన పద్యములనే యిచట దిరుగ వాడినచో నేమి దోషము? ఇంతమాత్రముచేఁ గృష్ణరాయని పాండిత్యమునకు లోపమా? ఇందు వలనఁ బెద్దనార్యుఁడే యీకృతిని రచించె నని సమర్థించుట కది సాధన మగునా?

2. కృష్ణదేవరాయ లల్లసాని పెద్దనను రామరాజభూషణునిఁ బ్రబంధముల రచించి తెమ్మని యాజ్ఞాపించె ననియుఁ, దదాజ్ఞానుసారముగా నాయిద్దఱు కవులు గ్రంథములను రచించి రాయల కడకుఁ దేగా రాయలు చూచి వసుచరిత్రముకంటె మనుచరిత్రము కొంచెము లేఁతపాకముగా నున్న దని చెప్పఁగా నందుపైఁ బెద్దన కుపితుఁడై అతికాఠిన్యముతో నాముక్తమాల్యదను రచించె ననియుఁ జెప్పుదురు.

ఇది కేవల మసంగతము. మనుచరిత్రము రచింపఁబడిన తరువాత, మఱికొంత కాలమునకు వసుచరిత్రముత్పన్నమయిన దనియు, రామరాజభూషణుఁ డను గ్రంథ

కర్తయే కృష్ణరాయని యాస్థానమందు లేఁ డనియు, ఋజువుచేయుటకుఁ బ్రబల ప్రమాణములు గలవు. మనుచరిత్రము కృష్ణరాయల దిగ్విజయ యాత్రకుఁ దరువాతను రాచూరి ముట్టడికిఁ బూర్వమందును రచింపఁబడి యుండుట స్పష్టము. అనఁగా క్రీస్తు శకము 1516-వ సంవత్సరమునకును 1520-వ సంవత్సరమునకును మధ్యకాలమున రచింపఁబడినది. వసుచరిత్రము క్రీస్తుశకము 1577-వ సంవత్సరమునకుఁ దరువాతనే రచింపఁబడిన దని మనము నిర్ధారణజేయఁ గలము. వసుచరిత్రమును గృతినందిన తిరుమలదేవరాయలు 1567-వ సంవత్సరమునఁ దన రాజధానిని బెనుగొండకు మార్చుకొనెను. ఈతడు పెనుగొండను రాజధానిగాఁ జేసికొనిన తరువాత మహమ్మదీయులతో జేసిన యుద్ధమును గుఱించి వసుచరిత్రములోఁ గవి యీవిధముగఁ జెప్పియున్నాఁడు.

"చ. తిరుమలరాయ శేఖరుని ధీరచమూభట రాజియాజి భీ
కర యవనేశ్వర ప్రహిత ఖానబలంబులఁ జక్కసేయ ని
ద్ధరఁ బెనుగొండ కొండలును దద్విపచర్మకపాలమాలికా
పరికర భూషితంబు లయి బల్విడి గాంచె గిరీశభావమున్."

క్రీస్తుశకము 1577-వ సంవత్సరమునందుఁ దురుష్కులు తిరుమలదేవరాయని పెనుగొండనుండి చంద్రగిరికిఁ దరిమినట్లుగా మహమ్మదీయచరిత్రకారులు వ్రాసియున్నారు. ఇంతియకాక; వసుచరిత్రమును గృతినందిన తిరుమలరాయఁడు శ్రీరంగరాజు కుమారుఁడు. ఈ శ్రీరంగరాజునకు తిరుమలరాజు గాక కోనరాజు, తిమ్మరాజు, రామరాజు, వెంకటరాజు నని మఱి నలుగురు పుత్త్రులు గలరు. వీరిలో రామరాజు కృష్ణరాయని యల్లుఁడు. ఇతని కళియరామరా జనిపేరు.

"క. శ్రీరంగరాజసుతులుధ,రారంగత్కర్తులళియరామాధిపుడున్..."

అయ్యలరాజు రామభద్రకవి రామాభ్యుదయము.

కృష్ణరాయనియనంతర మీతఁడు 1547-వ సంవత్సరమున విజయనగర రాజ్యము నాక్రమించుకొని యేలె నని నరపతివిజయమందును జెప్పఁబడియున్నది.

"గీ. సలకవిభుతిమ్మరాజుసేనలను ద్రుంచి, గుత్తి పెనుగొండ మఱి గండికోట కంద
నోలిపురమాద లేనవలీలగెలిచి, తొలఁదొలుత రామనృపతి దోర్బలము మెరసె.

ఉ. ఆపటుకీర్తిరామ వసుధాధిప చంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతిసార్వభౌమ దుహితృప్రియుఁడై వితతప్రతాపసం
తాపితశత్రుఁడై యల సదాశివరాయనిరంతరాయ వి
ద్యాపుర రాజ్యలక్ష్మికి నిదానము దానయి మించె నెంతయున్."

కాఁబట్టి, వసుచరిత్రము 1570-వ సంవత్సరమునకుఁ దరువాతనే ప్రారంభమయినది. ఇందువలన వసుచరిత్రమును రచించిన రామరాజ భూషణుఁ డనునామాంతరముగల భట్టుమూర్తి కృష్ణరాయల ఆస్థానమం దుండెడు కవికాఁ డనియు, మనుచరిత్రము రచింపఁబడిన కొంతకాలమునకుఁ గాని వసుచరిత్ర ముత్పాదితము కాలేదనియుఁ, గృష్ణరాయల కాలమునకుఁ గృతిపతి యగు దిరుమలరాయఁడు బాల్యదశలో నుండె ననియు స్పష్ట మగుచున్నది. కావునఁ బైనిచెప్పఁబడిన ఆముక్తమాల్య దోత్పత్తి అసద్ధేతుకముగాని సద్ధేతుకము కాదు.

"సీ. కృష్ణరాయలపేరు నిడి నీవు రచియించితివి తొల్లి విష్ణుచిత్తీయ మనఁగ
గాతిన్యమర్థంబు గ్రాహ్యంబు గాదు సాధారణుల కని భూధవుఁడు పలుకఁ
దరువాత మనుచరిత్రము నొనరించి యుత్తమకావ్యము మహాద్భుతముగఁ బిదపఁ
బెక్కుకావ్యములను బెం పెక్కవిరచించి మంటివి రాజసన్మానమునను
భంగమొందిన యలరామలింగముఖులు, సాటి రాఁగల వారె నీతోటినార
యాంధ్రకవితాపితామహ యల్లసాని, పెద్దనార్యవిశేష వివేకధుర్య."

3. ఈపద్య మెవరు రచించియున్నారో, ఏగ్రంథములోనిదో ఎవ్వరికిం దెలియదు. ఇట్టి యప్రమాణమయిన పద్యముఁబట్టి మన వారు కొందఱు విష్ణుచిత్తీయము పెద్దనార్యకృత మని వాదించెదరు.

దీనిప్రామాణ్యమును గొంచ మరయుదము. ఇందులో నీకవి మొదట నాముక్తమాల్యదయుఁ బిదప మనుచరిత్రమును వ్రాయఁబడి నట్లు చెప్పియున్నాఁడు. కాని పూర్వమందు మనుచరిత్రము, తరువాత నాముక్తమాల్యదయు రచింపఁబడె నని యా గ్రంథద్వయ సాక్ష్యమువలననే మనము నిర్ణయింపవచ్చును. కృష్ణరాయలు రాచూరు ముట్టడించి ఎడిల్‌షాను జయించె ననియు, బీజపూరుసుల్తానుదేశముమీఁదికి దండెత్తిపోయి కలుబర్గ సాగరు మొదలగుపట్టణములను గైకొని తురుష్కులఁ బాఱఁదోలె ననియు మనుచరిత్రములోఁ జెప్పియుండకపోవుటను, పై యుద్ధవృత్తాంతముల నాముక్తమాల్యదలో నుదాహరించి యుండుటను జూడఁగా నాయుద్ధములకుఁ బూర్వమునందు మనుచరిత్రమును, దరువాత నాముక్తమాల్యదయు రచింపఁబడినట్లు స్పష్ట మగు చున్నది. పద్యశేషమందు "భంగమొందిన యల రామలింగముఖులు, సాటి రాఁగలవారె నీతోటినార" అని పెద్దనార్యునిసంబోధించుటచూడఁగా నీపద్యమును విమర్శజ్ఞానము లేనివాఁడెవఁడో రచించినట్లుగానవచ్చుచున్నది. రామలింగకవి కృష్ణరాయల యాస్థానమందలివాఁ డనుట మృషోద్యమ మని నే నిదివఱకే వ్రాసియున్నాను. విభిన్న కాలికుఁ డైన రామలింగకవి యీతనిచేఁ బరాభవము నొందుట యెట్లు సంభవించును? కావున, నీచాటుధారపద్యము విశ్వసనీయము కాదు.

4. ఆముక్తమాల్యద కవిత్వము మిక్కిలి కఠినముగా నుండుటకును, అచ్చటచ్చట కొన్నిస్ఖాలిత్యంబులు గలిగి యుండుటకును గారణంబుఁజూడ నీగ్రంథంబు పెద్దనకృతంబు గాదనియు, రాయలు రచించె ననియు లోకులకుఁ దోఁచుటకై పెద్దన బుద్ధిపూర్వకంబుగాఁ గొన్ని తప్పులును వ్రాసి యంతకఠినముగా నాముక్తమాల్యదను రచించె ననియు లేదా, పైని వ్రాసినపద్యప్రకారము విష్ణుచిత్తీయము మనుచరిత్రకంటె మొదట వ్రాయఁబడినయెడలఁ బ్రథమరచిత గ్రంథంబు గావున తప్పు లుండుట సహజంబనియుఁ గొందఱయభిప్రాయము.

ఇది విచారసహము కాదు. సామాన్యముగా పండితుఁ డైనవాఁ డెవ్వఁ డైన పరులకొఱకు స్వగౌరవమును బోఁగొట్టుకొని యిట్లు తప్పులు వ్రాయునా? దానిలో విశేషించి పెద్దనవంటి మహాపండితుఁడు లక్షణవేత్త, మఱియొకఁడు దీనిని రచించినాఁ డని లోకులను నమ్మించుటకు వ్యాకరణదోష దుష్టముగా నీగ్రంథమును రచించె ననుట పండితులయినవారు విశ్వసింతురా ?

ఈప్రబంధమును రచించినవాఁడు క్షత్త్రియుఁ డై యుండవలయుఁ గాని బ్రాహ్మణుఁడు గాఁ డనుట కీ గ్రంథమందె కొన్నిసాక్ష్యము లున్నవి.

“శా. తారుణ్యాలిగ చూతనూత్న ఫలయుక్తైలాభిఘారస్వన
ద్ధారాధూపిత శుష్యదంబు హృతమాత్స్యచ్ఛేదపాకోద్గతో
ద్గారంపుం గనరార్చు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతర వాలుకాస్థిత హిమాంతర్నారికేళాంబువుల్.” 2. ఆ. 68.

ఈపద్యముంబట్టి విచారింపఁగాఁ గేవలము మత్స్యములను దినువాఁడును,అందులోఁ గూడ రాజభోగ్యముగా దానిని పచనము చేయు విధముం దెలిసినవాఁడు గాని యిట్టి వర్ణనము చేయంజాలఁడు. కావున నీయాముక్తమాల్యద మత్స్యమాంస భోజి యగు క్షత్త్రియునిచేఁగాని లేక, అతనికి సమానుఁడగు మఱియొక వర్ణమువానిచేఁగాని రచియింపఁ బడియుండవలెను గాని, మత్స్యభుక్కులు కాని బ్రాహ్మణు లగు పెద్దనాదులవలన రచియింపఁబడదలే దని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

5. కృష్ణరాయనితండ్రి యగు నరసింహరాజు ప్రకృతమందు ‘కనరా’ యని వ్యవహరింపఁబడు తుళువదేశమునుండి బయలు వెడలి కావేరినదిని దాఁటివెళ్ళి శ్రీరంగపట్టణమును ముట్టడించె నని మైసూరు శాసనములలో నున్నది. దీనికిఁ దార్కాణముగా నాముక్తమాల్యదలో “వాని వంశంబు తుళువాన్వవాయమయ్యె” నని చెప్పబడియున్నది. ఇంతియ కాక “కన్నడరాయ యక్కొదువ గప్పప్రియాపరిభుక్త భాక్కథన్” అను పద్యములో నీతఁడు కన్నడరాయఁ డని సంబోధింపఁబడెను. ఈ తులుభాష కన్నడ భాషలో నొక శాఖ. అందుచే నీతఁడు కన్కసరు (4-175) = నేత్రరక్తిమ;

హీంఁడితములు. (5. 93) -కలుపఁబడినవి; మొదలగు కన్నడ శబ్దములను ప్రయోగించి యున్నాఁడు.

ఇవి కాక మఱియొక విశేషము. పాండ్యరాజు తన కనిష్ఠసోదరిని యామునాచార్యున కిచ్చి వివాహముచేసె నని ప్రబంధములో వ్రాయఁబడినది.

ఈ యంశము కేవలము కవి కల్పితము. మూలగ్రంథమందు లే దని మున్నే చెప్పియున్నాఁడను. బ్రాహ్మణునితో యానసంబంధముఁ జేయుట క్షత్రియుని కుత్కర్ష హేతువు. బ్రాహ్మణుఁడు తనపిల్లను క్షత్రియుని కిచ్చుట తన కపకర్ష మని తలంచును. ఈ గ్రంథమును రచించినవాఁడు క్షత్రియుఁడు గాని యెడల నిట్లు వ్రాయఁడు. మేనల్లునికి రాజ్యమిచ్చుట (మరుమక్కళ్ దాయమ్), (మరుమగన్). అనఁగా ద్రావిడములో మేనల్లునికిఁ పేరు. ఈయాచారము మలయాళదేశమం దిప్పటికి నున్నది. యామునాచార్యుఁడు కుమారునికిఁ జేసిన నీత్యుపదేశము మొదలగు నంశములు విమర్శింపఁగా నీగ్రంథకర్త క్షత్రియుఁడై యుండక తీరదు.

వేయేల; ప్రతిరసికుఁడును స్వానుభూతిచేఁ బరికించిన బోధమగును. మనుచరిత్ర నొకచేతిలోను, ఆముక్తమాల్యద మఱియొక చేతిలోను, బట్టుకొని వరుసగాఁ బద్యములఁ జదివిన, మనుచరిత్ర పద్యముల కున్నశ్రావ్యత, (Music) మాధుర్యము, ప్రసాదము, సరళత మొదలగు గుణములు ఆముక్తమాల్యదా పద్యముల కున్నవా? ఈ తారతమ్య జ్ఞానమును గలిగియుండుట కెవ్వనికిని విశేష పాండిత్య మక్కఱ లేదు. మనుచరిత్ర పద్యములు చదువువారికి వినువారికిని హృదయమునం దమృతము జిలికిన ట్లుండును. ఈ స్వర్ణపరీక్షకు శ్రవణేంద్రియమే నికషోపలము. ఆముక్తమాల్యద యన్ననో పాషాణ కల్పము. పాకమా నారికేళపాకము శబ్దగ్రథనమా దీర్ఘసమాస జటిలము. ఇందుఁ బ్రయోగింపఁబడిన "తృణతా" (ధనువు) మొదలగు సంస్కృత పదములుగాని, "తెండి," (శయనించి) మొదలగు నాంధ్రపదములు గాని మాఱుమూలవి. ఏనిఘంటువులయందును గానరానివి. సామాన్యముగాఁ గవులెవ్వరును వాఙ్మయమం దిట్టిపదముల నుపయోగించుట గానరాదు. "కపి రపిచ కాపిశాయన మదమత్తో వృశ్చికేన సందష్టః" అనున ట్లందుపైఁ బ్రతిపాద్యము విశిష్టాద్వైత మతసంప్రదాయైక సమధిగమ్యము. ఇందలి వేదాంత ఘట్టములు రామానుజ బ్రహ్మసూత్ర భాష్యమును గూలంకషముగా వ్యాసంగముచేసిన శ్రీవైష్ణవ పండితునికిఁ దక్క యాసంప్రదాయ మెఱుంగని యద్వైతపండితులలో విశిష్టాద్వైత పండితులలో గొప్ప వారైనవారికిఁ గూడ దుర్జ్ఞేయము. ప్రబంధమంతయు విశిష్టాద్వైత సంప్రదాయములో నిండియున్నది.

పెద్దనార్యుని ప్రజ్ఞయు సర్వతోముఖ మయినది. పాండిత్యమందును గవిత్వమందు నీతని కీతండె సాటి. ఇది నిర్వివాద మయిన యంశము. మనుచరిత్రములోఁ గృత్యాదియందు,

క. "కొలుతు న్మద్గురువిద్యా, నిలయు న్గరుణాకటాక్ష నిబిడజ్యోత్స్నా
దళితాశ్రితజనదురిత, చ్ఛలగాఢధ్వాంతసమితి శఠగోప యతిన్."

అని యితఁ డొనర్చిన గురువందనము వలన నితఁడును విశిష్టాద్వైతసంప్రదాయవేత్తయనియు, రామానుజ మతావలంబి యనియు, శ్రీవైష్ణవశిష్యుఁ డనియు స్పష్టమగుచున్నది. కావున, పెద్దన యిట్టి శ్రీవైష్ణవమత సంప్రదాయ విశిష్టంబగు గ్రంథంబును వ్రాయుట కసమర్థుఁ డని యెవ్వ రనలేదు. కాని, యితఁ డొరులకుఁ దెలియకుండ మిక్కిలి కాఠిన్యముతో గ్రంథమును రచింపవలయు నని సంకల్పించి పూనిక వహించినను, దా నిదివఱకు రచించియున్న గ్రంథములలోఁ దనకు సహజముగాఁ బట్టువడిన శైలి, అభిప్రాయసాంకర్యము, పదప్రయోగసరణి, కవితయొక్క స్నిగ్ధత్వము మొదలగునవి లేశము గానరాకుండ నొక్కపండితుఁడె తా జన్మాంతరము నొందినవానిపగిది, కేవల విజాతీయముగాఁ గవనము జెప్పఁగల్గె ననుట స్వభావవిరుద్ధమును, అనుభవాసంవేద్యముగను గానవచ్చును. సంస్కృతకవులలో శిఖామణు లనఁదగు కాళిదాస భవభూతులును, తక్కు సంస్కృత కవీశ్వరులును గఠినశైలితోను శుభశైలితోను కావ్యములను నాటకములను చంపూప్రబంధములును రచించియున్నారు. వారివారి కవిత్వములలోఁ గన్పట్టు నభిప్రాయములంబట్టియుఁ, బదప్రయోగములంబట్టియు, నాగ్రంథము నీగ్రంథమును రచించినవాఁ డొక్కఁడే యని సులభముగా నూహింపవచ్చును. అందులకుదాహరణము బాణకవి, కాదంబరీ హర్షచరిత్రలను వ్రాసెను. వీనిలో హర్షచరిత్ర మొదట వ్రాయఁబడినది. కావున కఠిన పాకముగలది. కవిత్వ పాండిత్యములు పరిపాకావస్థ నొందినపిదప విరచితమగుటచేఁ గాదంబరి మిక్కిలి రసవంతముగాను సులభముగాను నుండెను. అయిన, నీగ్రంథద్వయమందు నభిప్రాయైక్య మెట్లు కానవచ్చుచున్నదో చూడుఁడు.

హర్షచరిత్రము

ప్రథమోచ్ఛ్వాసము, నలువదియవపుట (Bombay Edition), చ్యవనముని దౌహిత్రుఁ డైన దధీచి యనువానిని జూచి మోహించిన సరస్వతితో, వాని దూతి యగు మాలతి యిట్లు చెప్పుచున్నది.

"దేవి కిం వా విజ్ఞాపయామి, అనురూపో దేవ్యా ఇత్యాత్మసంభావనా, శీలవానితి ప్రక్రమవిరుద్ధం, ధీర ఇత్యవస్థావిపరీతం, సుభగ ఇతి త్వదాయత్తం, జానాతి సేవితు

మిత్యస్వామిభావోచితం, త్వం తస్య మృత్యురిత్యప్రియం, స్వప్నేఽస్యబహుశః కృత ప్రసాదాసీత్య సాక్షికం, వారితోఽపి బలా దాగచ్ఛతీతి పరిభవః, తదేవ మగోచరే గిరామసీతి, "శ్రుత్వా దేవీ ప్రమాణమ్."

కాదంబరి

కాదంబరి పూర్వభాగముయొక్క చివరిపంక్తులు చూడుఁడు. కాదంబరి చంద్రాపీడునికిఁ బంపిన సందేశములో "బాలాజిహ్రేమి కింవా సందిశామి అతిప్రియోఽసీతి పౌనరుక్త్యం, త్వయి గరీయా ననురాగ ఇతి వేశ్యాలాపః, త్వయా వినా నజీవామీత్యనుభవ విరోధః, అవశ్య మాగంతవ్య మితి సౌభాగ్యగర్వః, స్వయ మాగచ్ఛామీతి స్త్రీచాపలం, అనన్యరక్తోఽయం పరిజన ఇతి స్వభక్తినివేదనలాఘవం, జ్ఞాస్యసి మరణేన ప్రీతి మిత్యసంభావ్యమేవ."

తెలుఁగు ప్రబంధమునుండి మరియొక యుదాహరణము.

కూచిమంచి తిమ్మకవి, రాజశేఖరవిలాసమును రుక్మిణీ పరిణయమునుగూడ రచించెను.

రాజశేఖరవిలాసము (వావిళ్లవారిప్రతి) ప్రథమాశ్వాసము, 17-వ పుట 55 పద్యము, పురీవాజి వర్ణనము.

"చ. గుఱుతుగ నప్పురిం గలుగు ఘోటకసంఘముతోడ నెంతయుఁ
బరువిడనోడి వేగ హరిణంబులు వాయునిశాధినాథశం
కరులను జేరి యైన నధికం బగు వైరము దీర్పలేక యా
కరణిన యుండెఁ దథ్య మిది కాదన వానికి నట్టులేటికిన్."

రుక్మిణీపరిణయము ప్రథమాశ్వాసము 46-వ పద్యము. పురాశ్వవర్ణనములోఁ బై పద్యమందున్న కల్పనయే యిందులో నున్నది. వృత్తముమాత్రము భిన్నము.

క. "హరిణము లప్పురమునఁగల, తురగంబులతోడఁ బోరి తుది నోడి మహా
త్వరితమునఁ బవనహిమకర, గిరిజేశుల శరణు నొందె కేవలభీతిన్."

ఇ ట్లేకకర్తృకము లగు ననేకసంస్కృతాంధ్రకావ్యములయందు గ్రంథకర్త్రైక్య సాధకలింగములు బహుళముగాఁ గానవచ్చుచున్నవి. అయినను, స్థాలీపులాకన్యాయాను సారముగ నొకటి రెండిటినిమాత్రమే కనఁబఱచితి. ఏతాదృశగ్రంథకర్త్రైక్యసాధకలింగములు (పీఠికలోని పద్యములు దప్ప) పైనికనఁబఱచిన ట్లుభయసాధారణముగా మనుచరిత్రాముక్తమాల్యదలలోఁ గానవచ్చునా? లేదు సరియే కదా, మీఁదు మిక్కిలి పెద్దనార్యుఁడు మఱచి తప్పినను స్వప్నమందైనను పరిహాసమునకైనను జేసి యెఱుఁగని నియమోల్లంఘనములోఁ గూడిన ప్రయోగములు మెండుగా నాముక్తమాల్యదలోఁ గాన

వచ్చుటం జేసి, ఆముక్తమాల్యద కృష్ణరాయకృతముగాని, పెద్దనార్యవిరచితము కా దని ఘంటాఘోషములోఁ జెప్పవచ్చును. దీనియందు మను చరిత్రములోని పదవిన్యాస లాలిత్యముకాని, రసపుష్టిగాని యంతగా లేదు. ఏల యన: కృష్ణరాయఁడు మహారాజగు టచే పెద్దన మొదలగువారివలె గురూపదేశ పూర్వకముగా విద్యల నభ్యసించినవాఁడు కాకపోవచ్చును. అయినను, నిరంతరము పండితగోష్ఠి నుండువాఁ డగుటచే ముందు శ్రుతి పాండిత్యంబు విశేషంబుగ సంపాదించి యావల శాస్త్రసంప్రదాయంబులు నేర్చిన యసాధారణ శేముషీ సంపన్నుండు గావునఁ గవిత్వంబుఁ జెప్పఁ దొడఁగె. విద్యలఁ గ్రమశిక్షితుండుగాఁ డనుట కీతని పదబంధౌజ్జ్వల్యమే మనకు నిదర్శనము. భావము గంభీర మయి దానికి సదృశ మయిన పదములఁ బ్రయోగింపనియెడల నా భావము సులభముగాఁ బ్రకాశింపదు. ఇష్టానుసారంబుగఁ బ్రయోగించిన పదంబు లగుటంజేసి శీఘ్రంబుగా భావనివేదకములు గావు. కావునఁ బైనిచెప్పిన యుపపత్తులచే నీగ్రంథము పెద్దనార్యకృతము గాదనియుఁ గృష్ణరాయకృత మనియు స్పష్టముగాఁ జెప్ప నగు.

ఇదికాక మరియొక విశేషము. రాయల కాలములో గొప్ప కవులలో నొక్కఁ డగు ముక్కు తిమ్మనార్యుఁడు, తాను రచించి కృతియిచ్చిన పారిజాతాపహరణములో నీ కృష్ణరాయని గుఱించి,

క. "శ్రీవేంకటగిరివల్లభ, సేవాపరతంత్రహృదయ చిన్నమదేవీ
జీవితనాయక కవితా, ప్రావీణ్యఫణీశ కృష్ణరాయమహీశా."

అని వ్రాసియున్నాఁడు. "కవితాప్రావీణ్యఫణీశ" అను విశేషణమునుబట్టి కృష్ణరాయఁడు కవిత్వమం దతి సమర్థుఁ డని యూహింపవచ్చును. ఇతఁడును ప్రత్యాశ్వాసాంతమందును నైషధకారకుఁ డగు శ్రీహర్షునివలెఁ దాను రచించిన ట్లొక్కొక పద్యమును వ్రాసియున్నాఁడు. "స్థితస్య గతి శ్చింతనీయా" అను న్యాయము ననుసరించి శబ్దప్రమాణసిద్ధుఁ డైన కర్తను బరిత్యజించి అనుమానాదులచేఁ గర్త్రంతరమును సాధింప నుద్యమించుట సత్తర్కలక్షణముగాదు. అట్లయినచో భోజకృత మగు చంపూరామాయణము, కులశేఖరవర్మ విరచితమగు తపతీసంవరణము, హాలాపరనామక శాలివాహనప్రణీత గాథాసప్తశతి, శూద్రకవి రచిత మృచ్ఛకటికము మొదలగువాని గతి యేమగును? మహీపాలకు లైనవారిలో నెవ్వనికి గ్రంథకరణ సామర్థ్యము లే దనినచో నీ పూర్వోక్త గ్రంథము లన్నియుఁ దమ తమ యాస్థానపండితులు రచించి యాయాయి రాజులపేరు పెట్టినా రనవలయును. ఇట్టివాదుక మనవారిలో లేకపోలేదు. కాని, పైని చెప్పిన రాజులందఱు గ్రంథరచనా సామర్థ్యము గలవా రని ప్రమాణాంతరములచే సత్యముగాఁ దెలియవచ్చుచున్నది. అంత ప్రాచీను లైనవారి గ్రంథ కర్తృత్వము తథ్య

మని మన మొప్పుకొనినచోఁ బ్రబలతరలేఖన ప్రమాణవిదిత సర్వవృత్తాంతుఁడు నవీనుఁడు వాస్తవచరిత్రాంశములచేఁ బూర్ణముగఁ దెలియఁబడినవాఁడైన కృష్ణరాయని గ్రంథకర్తృత్వమును మన మేల యొప్పుకొనఁ గూడదు ? ఇట్టి వాదివిప్రతిపన్నాంశ ములు కేవలము "విద్యావివాదాయ" అనునట్లు వివాదాధ్యాసితములుగావున తుపావహా ననల్పం బగు నీ ప్రసంగముసుండి విరమించుచున్నాఁడను.

బుధవరుల కొక విజ్ఞప్తి

పాఠకమహాశయులారా ! చెన్నపురీ నివాసులును మా ప్రియ మిత్రులు నగు భాషోద్ధారక శ్రీవావిళ్ల వేంకటేశ్వరులుగారు నే నేమో విశేషజ్ఞుఁడ నసుకొని యీ యాముక్తమాల్యద కుపోద్ఘాతము వ్రాయునట్లు నన్నుఁ బురికొల్పిరి. ఇంతవఱకు నముద్రి తము లైన సంస్కృతాంధ్ర గ్రంథములను ముద్రించి, వారు లోకమున కొనరించు చున్న మహోపకారమును దలంచి యిట్టి లోకోపకర్తల కొక పాటి తోడ్పాటుగావించు టకు దైవవశమున నిన్నాళ్లకు నాకు లభించిన యీ మంచి యవకాశమును బోగొట్టు కొనుట కిష్టములేక సేతురచనోద్యత చిక్రోడన్యాయము నవలంబించి తగిన యధికా రము లేనివాఁడ నైనను నీపనికిఁ బూనుకొంటిని. దినమంతయుఁ గళాశాలాధ్యాపన కర్మ వ్యగ్రుఁడనై యుండుటఁజేసి చాలినంత యవకాశము లేకపోవుటచే రాత్రులయందుఁ గొంతమట్టునకు శనైశ్చరాదిత్యవారములయందు మఱికొంతమట్టునకు వ్రాసి యెట్టెట్లో రెండు మాసములకు ముగించఁగలిగితి. నాచే నైనంతమట్టుకు కొన్ని కొన్ని యంశము లను విమర్శించి వ్రాసితిని; కాలము చాలదు. స్ఖలితములు మెండుగ నుండు నని నా భయము. నాయందు దయయుంచి నా తప్పులను క్షమించి యొప్పులను గ్రహించుటకు మిమ్ము వేఁడుకొనుచున్నాఁడను.

ఈ వ్యాసలేఖనమందు శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాసిన గ్రంథములు నా కనల్పమయిన సహాయము నాచరించినవి గావున వారికిని, నన్ని విషయములను బ్రోత్సాహపఱచిన మా ప్రియమిత్రులగు శ్రీ గురు జాడ అప్పారావుపంతులు బి. ఏ., యఫ్. యం. యూ., గారికిని నా నతులు.

ఇట్లు,

మేడేపల్లి వేంకటరమణాచార్యులు,
విజయనగర మహారాజ సంస్థాపితాంగ్లేయ పాఠశాలా
సంస్కృతోపాధ్యాయులు.

విజయనగరము,
4 నవంబరు, 1914

ఆముక్తమాల్యద, వ్యాఖ్యానములు

శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులుగారి రుచి వ్యాఖ్యకుఁ బూర్వము ఆముక్తమాల్యదపై ముప్పదికిమించి సమగ్రములు అసమగ్రములునైన వ్యాఖ్యానములు కలవు. అవి యన్నియు క్రీ. శ. 1800-కు ఇటీవలివే. మనకు లభించు వ్యాఖ్యలలో తొలుదొల్తటిది..సుమారు 1800-వ సం॥ ప్రాంతమున గట్టుపల్లి శ్రీనివాసకవి రచించిన "మహాటీక". ఈ శ్రీనివాసకవి ఆముక్త పెద్దనార్యకృత మనియు నిం దేడాశ్వాసములు కలవనియు వ్రాసెను. "ఇది నైరామన..." అను పద్య మీతని ప్రతిలోనే ఆఱవ యాశ్వాసాంత పద్యముగాఁ గలదు. శ్రీనివాసకవి ఆముక్త సప్తాశ్వాసముల కావ్య మనుట తానే యూహించి సృష్టించెనో లేక యాధారము లేవైనగలవో తెలియదు గాని అన్ని యాశ్వాసాంతపద్యములకు టీక వ్రాసిన యా కవి ఆఱవ యాశ్వాసాంత పద్యములకు టీక వ్రాయకుండుటమాత్రము గమనింపఁదగిన విషయము. దీనినిబట్టి యీ కవియే యీ పద్యమును సృష్టించినందున టీక వ్రాయుట మానెనని కొందఱు పండితుల యభిప్రాయము.

ఈ కవి తిరుపతి వేంకటాచలపతి భక్తుఁడ నని చెప్పుకొని తన టీకకు తొలుతనే వేంకటేశస్తోత్రము చేసెను. ప్రసిద్ధిగొన్న గట్టుపల్లి వంశజుఁడ ననియు, గురూపదిష్ట శాస్త్రజ్ఞానము కలవాఁడ ననియు, లోక సంగ్రహార్థమే ఆముక్తమాల్యదకు మహాటీక వ్రాయుచున్నా ననియు నీతఁడు చెప్పుకొనెను. ఈ వ్యాఖ్య ననుసరించియే యీ గ్రంథ మెన్ని యాశ్వాసములది యను వాదము బయలుదేఱినది. ఆఱవ యాశ్వాసమునే రెం డాశ్వాసములుగ నీతఁడు విభజించెనా ? ఏడాశ్వాసము లున్నవనుకొన్న పక్షమున ఈ యాశ్వాసాంత పద్యము లెట్లు నిర్ణయింపవలె నన్నది గడ్డు సమస్య. ఉన్న యాశ్వాసాంత పద్యములి ట్లున్నవి.

1. ఇది కర్ణాటధరాధృతి...
2. ఇది భూమండన...
3. ఇది పాత్రప్రహరేశ్వర...
4. ఇది సింహాచలదంభకేసరి...
5. ఇది యంధ్రోక్తి యథార్థనామ...
6. ఇది సింహాచల...అని వావిళ్ల ప్రతిలోను

   ఇది నైరామన...అని శ్రీనివాసకవి టీకలోను

7. ఇది నీలాచల నీలచేలక...అనునది 1813-లో ఉప్పులపాటి జగన్నాథ రాజు వ్రాసినదియు 1834-లో జూలూరి అప్పయ్య పరిష్కరించినదియు నగు మాతృకలోనిది.

‘సై రామన’ అన్న పదము నగరముగాని రాజు పేరుగాని సూచింప దని కొందఱు. అది యొక తురుష్కప్రభువు రాజధాని యని యొకరు. ఇది న్యూనిజు పేర్కొనిన “మేదర్ మెల్గో” (Mader Melgo) అను తురుష్కసేనాని - 1520-లో సాళువ తిమ్మనిచే నోటువడ్డ యతఁడేమో! లేదా బీజపురవాసి తురుష్కసేనాని కొండపల్లికడఁ బట్టువడ్డ గోల్కొండనవాబు బిజ్లీఖానా? ఏమైనను కృష్ణరాయ లాముక్తలో తన విజయములను రెండు పర్యాయములు పేర్కొన్న స్థలములు లేవు. ఒకపరి పేర్కొన్నది మఱొకపరి పేర్కొనలేదు. అందుచే 6, 7 ఆశ్వాసములు కలవనుకొన్న మొదటి యైదాశ్వాసములలోను చేర్కొనని క్రొత్తవిజయములను చేర్కొనవలయును గదా. మఱియు పూర్వ పద్యము లన్నిటిలో కృష్ణరాయలచే నోడి పోయిన రాజులపేళ్లు గలవు. అట్లే ఆఱవ యాశ్వాసాంతమున బీజాపురసేనాని ఇస్మాయిల్ ఆదిల్షాయు, ఏడవ యాశ్వాసాంతమున నీలాచలాధిపుఁ డగు గజపతియుఁ చేర్కొనఁబడియుండవచ్చును. లభ్యములైన వాఖ్యలన్నియు 18, 19 శతాబ్దముల మధ్య వనుట నిస్సంశయము. వ్యాఖ్యాతలనామములు కాలము లన్నియు జాగ్రత్తగా పరిశీలింపవలసిన విషయము. కృష్ణదేవరాయల కాలమును గూర్చిన చరిత్రమును సమగ్రముగ సేకరించుట కీ యాముక్తమాల్యద అత్యంతోపయోగకారి యనుట సత్యము.

[శ్రీ పి. హయవదనరావుగారి వ్యాసమునుండి యుద్ధృతము.]

A C No. 17648

శ్రీ ర స్తు

ఆ ము క్త మా ల్య ద

స వ్యా ఖ్యా న ము

పీ ఠి క

ఉ. శ్రీకమనీయహారమణిఁ జెన్నుగఁ దానును, గౌస్తుభంబునం
దాకమలావధూటియు నుదారతఁ దోఁపఁ, బరస్పరాత్మలం
దాకలితంబు లైన తమయాకృతు లచ్ఛతఁ బైకిఁ *దోఁప, న
స్తోకత నందుఁ దోఁచె నన, శోభిలు వేంకటభర్తఁ గొల్చెదన్. 1

టీక. శ్రీకమనీయ హారమణిన్ - శ్రీ=లక్ష్మియొక్క, కమనీయ = మనోహరం బగు, హార=హారమందలి, మణిన్=రత్నమునందు (నాయకమణియందనుట), చెన్నుగన్= ఒప్పునట్లు, తానును = వేంకటభర్తయును, కౌస్తుభంబునందున్ = కౌస్తుభమణియందు, ఆకమలావధూటియును=ఆలక్ష్మీదేవియును, ఉదారతన్ = అతిశయమౌటచేత, తోఁపన్= ప్రతిబింబింపఁగా, పరస్పరాత్మలందున్ = ఒకరొకరిమనంబులందు, ఆకలితంబులైన= (ప్రేమాతిశయముచే) నిలిచిన, తమ = తమయిద్దఱియొక్క, ఆకృతులు = ఆకారములు, అచ్ఛతన్=శరీరస్వచ్ఛతచేత, పైకిన్ తోఁపన్ = ప్రకాశములుకాఁగా, అస్తోకతన్= ఆధిక్యముచేత, అందున్ = ఆరత్నములందు, తోఁచెన్ = కానవచ్చెను, అనన్ = అనునట్లుగ, శోభిలు = (లక్ష్మితోఁ) ప్రకాశించుచున్న, వేంకటభర్తన్ = వేంకటేశ్వర స్వామిని, కొల్చెదన్ = సేవించెదను.

తాత్పర్యము. లక్ష్మీదేవియొక్క సుందర మగు హారమణియందు వేంకటేశుండును, నతని కౌస్తుభమం దాలక్ష్మియుం బ్రతిబింబింపఁగాఁ బరస్పరమనంబులందుఁ బ్రేమాతిశయముచేత నిలిచియున్న తమయిద్దఱి యాకారములును శరీరము స్వచ్ఛమౌటచేత బహిః ప్రకాశములై యారత్నములందుఁ గానవచ్చె నన్నట్లు విలసిల్లుచున్న వేంకటేశ్వరుని సేవించెద ననుట.

---

* దోఁచి య.

ఇందు శ్రీమహావిష్ణువును లక్ష్మియు నొండొరులవక్షస్స్థలమునందలి నాయకరత్న ములందుఁ బ్రతిఫలించినట్లు వర్ణించుటవలన నీ ప్రబంధమందు వక్ష్యమాణ మైన యాముక్తమాల్యదా రంగనాయకపరిణయసముచిత పరస్పరాభిముఖావస్థితి వ్యంగ్య మర్యాదచేతఁ దోఁచుచున్నది.

ఈపద్యమందు శ్రీపతిలక్ష్మీదేవుల నిద్దఱను వర్ణించి పద్యాంతమందు వేంకటేశ్వ రునిమాత్రమే గ్రహించుటకు నభిప్రాయము, 'యతో హరి స్తతో లక్ష్మీ' అనియు, 'విష్ణో రేషానపాయినీ' యనియును, 'వాగర్థా విప సంపృక్తౌ' అనియు, 'శ్రియం దేవీం నిత్యానపాయినీ' మనియు, 'అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభాయథా, యనియు, 'అర్థో వా ఏష ఆత్మనో యత్పత్నీ' యను శ్రుతియు నివి మొదలగు ప్రమాణముల యర్థమును బర్యాలోచింపఁగా భగవంతునిదేహమును విడిచి లక్ష్మియుండ దని తెలియవచ్చుచున్నది. అలం. ఉత్ప్రేక్ష.

ప్రబంధము మొదటఁ దఱుచుగా మగణసిద్ధ్యర్థము శార్దూలవిక్రీడితవృత్తము ప్రయోగించుట గలిగియున్నను నీగ్రంథకర్త యుత్పలమాలావృత్తము ప్రయోగించుట వలన నాముక్తమాల్యద యుత్పలమాలా సమర్పణము చేయుటచేత భగవన్ముఖోల్లాసము కలిగినకథ రచింపఁ గలవాఁడై తానును నుత్పలమాలికావృత్త రూపమైన వాక్కుసుమ దామమును సమర్పించె నని తోఁచుచున్నది. మఱియు,

తే-గీ. 'వేదములకెల్ల నోంకార మాదియైన, కరణిఁ గృతులకునెల్ల శ్రీకారమాది, గానఁ గవివరు లెల్లను దానిఁ దక్క, నితరవర్ణంబు లిడరు సత్కృతులమొదల' నన్నట్లు మహాకవి యగు నీ గ్రంథకర్తచే శ్రీశబ్ద మీసత్కృతిమొదలం బ్రయోగింపఁబడినది. కాన వర్ణగణాదిశుద్ధులును గలవు. 'దేవతావాచకాశ్శబ్దా యే చ భద్రాదివాచకాః, తే సర్వే నైవ నిన్ద్యాస్స్యుర్లిపితో గణతోఽపివా' యనునది ప్రమాణము. ఇదియునుం గాక దీనియందు విశిష్టేష్టదేవతానమస్కారరూప మంగళమును జేయంబడినది. 'ఆశీ ర్నమస్క్రియా వస్తునిర్దేశో వాపి తన్ముఖ' మనునది ప్రమాణము.

మ. సిరి నొక్కప్పుడు కన్గొనంగి, హరి తత్స్వైర న్బ్రిహార్షించును
ర్వరకు * న్వంచనఁ గూడఁ గాఁ గలుగు భాస్వచ్చంద్రశాలాపరం
పర లయ్యు న్బఱ పైన యెవ్వనిఫణాపఙ్క్తుల్ భజింతు న్నిరం
తరముం దాంతుని నయ్యనంతుని నతీతబ్రహ్మకల్పాంతునిన్.

టీ. పఱపైనయెవ్వనిఫణాపఙ్క్తుల్ - పఱపు ఐన = విశాలములగు, ఎవ్వని = ఏ శేషునియొక్క, ఫణాపఙ్క్తుల్ = పడగలవరుసలు, హరి = విష్ణుమూర్తి, ఒకప్పుడు =

* వేడుకఁ గూడఁ గాఁ.

ఒకసమయమున, సిరిన్=లక్ష్మిని, కన్ మొఱఁగి = కిమరించి, తన్ = తన్ను, చేరన్ = కదియఁగా, ప్రహర్షించు=కడుఁబ్రీతినొందుచున్న, ఉర్వరకున్=భూమికి, (ని. 'ఉర్వరా సర్వసస్యాఢ్యా' యని యమరము.) వంచనన్=వంచనచేత, కూడఁగాన్ = పొందఁగా (గుప్తక్రీడఁ జేయుటనిమిత్తమనుట), కలుగు=సిద్ధించినట్టి, భాస్వ...పరలు - భాస్వత్=ప్రకాశించుచున్న, చంద్రశాలా=ఉప్పరిగలయొక్క, పరంపరలు=గుంపులు, అయ్యెన్=ఆయెనో, దాంతునిన్=ఇంద్రియనిగ్రహముగలయట్టియు, అతీత...తునిన్ - అతీత = అతిక్రమింపఁబడిన, బ్రహ్మకల్పాంతునిన్=బ్రహ్మప్రళయములు గల, అయ్యనంతునిన్=ఆశేషుని, నిరంతరమున్=ఎల్లప్పుడును, భజింతున్=కొల్చెదను. (ని. 'చన్ద్రశాలా శిరోగృహమ్' అనియు, 'శేషోఽనన్తః' అనియు నమరము.) అలం. ఉత్ప్రేక్ష.

తా. ఎల్లప్పుడును, దన్నెడఁబాయకుండెడి లక్ష్మిని స్వామి యొక సమయమున మఱుఁగుపఱిచి కదియఁగా నా శ్రీహరితో గుప్తక్రీడ సేయఁదలఁచిన భూదేవికి నెవ్వని యొక్క విశాలంబులైన పడగలు మేడలచాళ్లాయెనో, నిత్యుఁడై యింద్రియనిగ్రహము గలవాఁడైన యాశేషుని నిరంతరము సేవించెద ననుట.

సీ. ఖ నట త్పయోబ్ధివీక్ష్య రసాతలానోన్య
పిండీకృతాంగ భీతాండజములు,
ధృత కులాయార్థ ఖండిత సమిల్లవ రూప
చరణాంతికభ్రమత్తరువరములు,
ఘన గుహా ఘటిత ఝాంకరణ లోకైక ద్వి
దుందుభీకృత మేరుమందరములు,
చటుల ఝంపాతరస్స్వ నగరీ విపరీత
పాతితాశాశోణపరిబృఢములు,
తే. ప్రబలతర బాడబీకృతేరమ్మదములు,
భాస్వరేరమ్మదీకృతబాడబములు,
పతగ సమ్రాట్పతత్త్ర ప్రభంజనములు,
వృజినతూలౌఘములఁ దూలవిసరుఁగాత. 3

టీ. ఖనటత్...జములు-ఖ=ఆకసమందు, నటత్ = ఆడుచున్న, పయః=ఉదకముగల, అబ్ధి=సముద్రమునందు, వీక్ష్య = చూడఁదగిన, రసాతల = పాతాళమందు, అన్యోన్య=ఒకటితోనొకటి, పిండీకృత=ముద్దలుగాఁ జేయఁబడిన, అంగ=అవయవములు గలవై, భీత=భయపెట్టఁబడిన, అండజములు=సర్పములు గలవియు (అనఁగా గరుడని

తెక్కులగాలిసోఁకుటచేత సముద్రమునందలి నీళ్లాకాశమున కెగసిపోఁగాఁ బాతాళ ద్వారము బట్టబయలై కనుపడఁగా నచట పాములు తమకుఁ బక్షిరాజగు గరుత్మంతుఁడు నిత్యశత్రుఁ డౌటచేత భయపడి యొండొరులఁ గఱచికొని ముద్దలుగా నణఁగియుండె ననుట). స్వభావోక్తి.

ధృత...వరములు-ధృత = ధరింపఁబడిన, కులాయార్థ = గూఁటికొఱకు, (ని. 'కులాయో నీడ మస్త్రియామ్' అని యమరము) ఖండిత=విఱువఁబడిన, సమిత్=సమిధలయొక్క, లవ=తుంటలయొక్క, రూప=ఆకారములుగల, చరణ = (గరుడుని) పాదములకు, అంతిక=సమీపమందు, భ్రమత్=తిరుగుచున్న, తరువరములు = పెనుమ్రాఁకులు గలవియును, (అనఁగా తెక్కులగాలిచేత గొప్పమ్రాఁకులు పెల్లగిలి యతని పాదముల వెంబడి నాసుడి కొనిపోఁగా గరుత్మంతుఁడు పక్షి యగుటంజేసి గూఁటినిమిత్తమై కాళ్ల నిఱికికొనిపోవు సన్నకట్టియలవలెఁ గన్పట్టె ననుట.) ఉత్ప్రేక్షాను ప్రాణితాతిశయోక్తి.

ఘన...రములు-ఘన=గొప్పవైన, గుహా=గుహలయందు, ఘటిత = చేర్పఁబడిన, ఝాంకరణ = ఝాంకారముచేత, లోక=లోకములకు, ఏక=ముఖ్యముగా, ద్విదుందుభీకృత=రెండు భేరులుగాఁజేయఁబడిన, మేరుమందరములు=మేరుమందరపర్వతములు గలవియును, (అనఁగా తెక్కులవాయువులు పర్వతగుహలలోఁ బ్రవేశింపఁగా నప్పు డా పర్వతములు, మాఱు మొరయ లోకములకెల్ల వినఁబడునట్లు శబ్దించు రెండు దుందుభులో యని తోఁచుచున్న వనుట.) రూపకము.

చటుల...ధములు-చటుల=చంచలమగు, ఝంపా=సుడియుటయొక్క, తరః= వేగముచేతను, స్వ=తమయొక్క, నగరీ=పట్టణములనుండి, విపరీత=వ్యత్యస్తమగునట్లు, పాలిత=త్రోయఁబడిన, ఆశాకోణ=దిక్కోణములయొక్క, పరిబృఢములు = ప్రభువులు గలవియు, (గాడ్పులు వేగముగా విసరుటచేతను దిక్కులయొక్కయు మూలలయొక్కయుఁ బాలకులు తమతమ పట్టణములయందు నిలుచుటకు వలనుగాక త్రోపువడి మఱియొకదిక్కునకు వేఱువేఱ బఱచి రనుట). అత్యుక్త్యలంకారము.

ప్రబల...ములు-ప్రబలతర = మిక్కిలి ప్రబలములగు, బాడబీకృత=బడబాగ్నులుగాఁ జేయఁబడిన, ఇరమ్మదములు=మెఱుపులు గలవియు, (మేఘములతోడ మెఱుపులను మింటినుండి సముద్రములలోనఁ గూలఁద్రోయు ననుట.), భాస్వర...బములు-భాస్వర=ప్రజ్వలించుచున్న, ఇరమ్మదీకృత=మెఱుపులుగాఁజేయఁబడిన, బాడబములు = బడబాగ్నులు గలవియు, (సముద్రములయందలి బడబాగ్నులను మింటి కెగయఁజిమ్ము ననుట.)

ఇట్టిదైన, పతగసమ్రాట్ - పతగ=పక్షులకు, సమ్రాట్=ప్రభు వగుగరుత్మంతుని యొక్క, పతత్త్ర=ఱెక్కలవలని, ప్రభంజనములు = వాయువులు, వృజిన=పాపము లని యెడి, తూల=దూదిపింజెలయొక్క, ఓఘముల్ =గుంపులను, తూల్ =తూలిపోవునట్లు, విసరుఁగాక=వీచుఁగావుత. అట్టిమహాబలముగల గరుత్మంతుని ఱెక్కల వలని గాడ్పులు నాపాపము లనియెడు దూదిపింజెలను చెదరిపోవునట్లు వీచుఁగాక యని గ్రంథకర్త ప్రార్థన సేయుచున్నాఁడు.

ఉ. పూని ముకుందునాజ్ఞఁ గనుబొమ్మనె కాంచి యజాండభాండముల్
వానను మీఁదఁ బోవ నదువ న్గొనెఁ ద న్నన నగ్రనిశ్చల
[1]త్వానుచలత్వనిష్ఠలె సమస్తజగంబుల జాడ్యచేతనల్
గా నుతికెక్కు సైన్యపతి కాంచనవేత్రము నాశ్రయించెదన్. 4

టీ. ముకుందునాజ్ఞన్ = నారాయణునియాజ్ఞను, కనుబొమ్మనె = భ్రూసంజ్ఞ చేతనే, కాంచి=గ్రహించి, పూని = ప్రయత్నపడి, అజాండభాండముల్ - అజాండ = బ్రహ్మాండము లనియెడు, భాండముల్ = కుండలను, వానను = రూపుగలవిగాఁ జేయు కొఱకును, మీఁదన్ = ప్రళయమందు, పోవనదువన్ = పోవున ట్లదుచుకొఱకును, తన్నన్=తన్ను (అనఁగా వేత్రము ననుట), కొనెను అనన్=గ్రహించె ననఁగా, అగ్ర నిశ్చలత్వానుచలత్వనిష్ఠలె - అగ్ర = తనచివరయొక్క, నిశ్చలత్వ = కదలకుండుట యొక్కయు, అనుచలత్వ=కదలుటయొక్కయు, నిష్ఠలె=నియమములే, సమ...నల్ - సమస్తజగంబుల = ఎల్లజగత్తులయొక్క, జాడ్యచేతనల్-జాడ్య = లయ మొందుటయు, చేతనల్ = తెలివొందుటయును, కాన్ = కాఁగా, నుతికెక్కు = స్తుతింపఁబడుచున్న, సైన్యపతి=సేనానాయకుని (విష్వక్సేనుని) యొక్క, కాంచనవేత్రమున్ = బంగారు బెత్తమును, ఆశ్రయించెదన్=భజించెదను. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తా. విష్వక్సేనుఁడు భగవత్కార్య ధూర్వహుఁడు గనుక భగవదభిప్రాయాను గుణముగ లీలావిభూతి యగు ప్రపంచమునకు స్థితిసంహారములఁ గావింపఁ బూనఁగాఁ గులాలదండము ఘటాదులకుఁ గారణ మైనట్లే విష్వక్సేనునివేత్రము బ్రహ్మాండములకుఁ గారణ మైన దనియు నా వేత్రాగ్రము గదలనియపుడు లోకవ్యాపారము లేదనియుఁ గదలినప్పుడు లోకవ్యాపారము గల దనియును భావము.

చ. అదరుగ శాస్త్రధారలు మహాముఖవాంతసుధాంబుధారలున్
బొడ వగువహ్నికీలములు పొంగునుగాఁ బెఱదైత్యకోటికిన్
బెడిదపుఁగిన్కతో నెసరు వెట్టినపెద్ద [2]పనంటివోలె నె
క్కుడు వెస రాహుమస్తకముఁ గొన్నసుదర్శనదేవుఁ గొల్చెదన్. 5

---

1. త్వానచలత్వ. 2. పరంజి.

టీ. అధ...రలున్ - అధరు = ప్రస్ఫుటమగుచున్న, గళ = కంఠముయొక్క, అస్రధారలున్ = రక్తధారలును, మహా...రలున్ - మహాముఖ = వెడఁదనోరివలన, వాంత = వెడలఁగ్రక్కఁబడిన, సుధాంబుధారలున్ = అమృతోదకధారలును, పొడవగు = దీర్ఘములగు, వహ్నికీలములు=అగ్నిజ్వాలలు, పొంగునుగాన్ = ఎసటిపొంగును కాఁగా (రూపకము), పెఱ=ఇతరమయిన, దైత్యకోటికిన్ = రాక్షససమూహమునకు, బెడిదపుఁగినుకతోన్ = తీక్ష్ణకోపముతో, ఎసరువెట్టినపెద్దపనంటివోలెన్ = ఎసరెక్కించినపెద్దకుండవలె (ఉత్ప్రేక్ష), ఎక్కుడువెసన్ = అధిక వేగముచేతను, రాహుమస్తకమున్ = రాహు వనురాక్షసుని శిరమును, కొన్న = గ్రహించిన, సుదర్శనదేవున్ = విష్ణుచక్ర మనుదేవుని, కొల్చెదన్ = సేవించెదను.

తా. తొల్లి రాహు వనురాక్షసుఁడు మాయచేత దేవతావేషధారి యై యమృతము త్రాగునప్పుడు విష్ణుదేవుం డెఱింగి తనసుదర్శనముచే వానిశిరంబుఁ ద్రుంచినప్పుడు కంఠమునుండి వెడలెడు రక్తధార లడుగున మండెడుమంటలుగాను నమృతము మ్రింగకమునుపే తునిసెను గావున నాయమృతము మఱల నోటఁ గ్రక్కుచుండ నదియె కుండపయిపొంగుగాఁ గానంబడుచుండెను గాన నప్పు డాశిరస్సు పొయ్యిమీఁద నెసరు పెట్టిన పెద్దపంటివలె నుండె నని భావము.

మ. హరిపూరింపఁ దదాస్యమారుతసుగంధాకృష్టమై నాభిపం
కరుహక్రోడమిళిందబృంద మెదు రెక్కం దుష్క్రియాపంకసం
కరదైత్యాసుపరంపరం గముచు రేఖం[1]బొల్చురాకానిశా
కరగౌరద్యుతి పాంచజన్య మొసఁగుం గల్యాణసాకల్యమున్. 6

టీ. హరి = నారాయణుఁడు, పూరింపన్ = ఊఁదఁగా, తదాస్యమారుతసుగంధాకృష్టమై - తత్ = ఆహరియొక్క, ఆస్య = ముఖమందలి, మారుత=వాయువుయొక్క, సుగంధ = పరిమళముచేతను, ఆకృష్టము ఐ = ఆకర్షింపఁబడినదై, నాభిపంకరుహక్రోడమిళిందబృందము-నాభి = పొక్కిలియందలి, పంకరుహ = పద్మముయొక్క, క్రోడ = మధ్యమందలి, మిళింద = తుమ్మెదలయొక్క, బృందము = సమూహము, ఎదురు ఎక్కన్ = ముఖమారుతమున కెదురు రాఁగా, దుష్క్రియాపంక సంకరదైత్యాసుపరంపరన్ - దుష్క్రియా = దుష్కార్యములవలని, పంక = పాపములతోడ, సంకర = కూడుకొన్న, దైత్య = రాక్షసులయొక్క, అసు = ప్రాణములయొక్క, పరంపరన్ = పంక్తిని, కముచు = ఆకర్షించెడు, రేఖన్ = రీతిచేతను, పొల్చు =

1. బొల్చు.

ఒప్పుచున్న, రాకానిశాకరగౌరద్యుతి - రాకా=పున్నమనాఁటి, నిశాకర = చందురునివలె, గౌర = ధవళ మగు, ద్యుతి = కాంతి గలది (ఉపమ), పాంచజన్యము=హరిశంఖము, కల్యాణసాకల్యమున్ - కల్యాణ = మంగళములయొక్క, సాకల్యమున్ = సమృద్ధిని, ఒసఁగున్ = ఇచ్చును. ఉత్ప్రేక్ష. వృత్త్యనుప్రాసము.

తా. శ్రీహరి పాంచజన్యమును బూరించు నప్పు డాహరిముఖవాయువు దివ్యసుగంధము గలిగి వాసించుటవలన నాభీకమలమం దున్న తుమ్మెదల గుంపు లచ్చోటు వదలి యక్కమలవాసనకంటె మిగుల సొగయఁజేయుమొగముతావి కెగయుచున్న ప్పుడు శత్రుజనంబుల హృదయ విదారణం బగు నాదంబునకుం బా దగు శంఖంబు దుష్టు లగు రక్కసుల మలీమసంబు లగునసువులఁ బీల్చుచున్నదో యన్న ట్లుండె నని భావము. అట్టి శ్రీవిష్ణునిచేతిలో నుండెడిపాంచజన్య మనుశంఖము మాకు సంపూర్ణము లగుమంగళముల నిచ్చుచుండును గాక.

ఉ. యాదవసార్వభౌమభయదాయతబాహునియుక్తిఁ జేసి యెం
దే దనుజేంద్రసాళ్వపురహేమమణీవరణంబు సంగతం
బై దివి నాత్మకంకణములం దొకకంకణ మయ్యె నట్టి కౌ
మోదకి మోదకీలితసముజ్జ్వలకల్పకమాల్యఁ గొల్చెదన్. 7

టీ. యాదవ...జేసి - యాదవ = యదువంశజులకు, సార్వభౌమ - రాజైన కృష్ణునియొక్క, భయద = భయంకరమైన, ఆయత = పొడవైన, బాహు = భుజము యొక్క, నియుక్తిఁజేసి = పనుచుటచేత (బాహువుచేఁ బ్రయోగింపఁబడుటవలన నని యర్థము), ఎందేని=ఏయాకాశమందు సంచరించుచున్నగదయందు (ఇచట నపిశబ్దార్థకం బగు నేని శబ్దమునికారమునకు వైకల్పికలోపం బని యెఱుఁగునది.) దను...ణంబు - దనుజేంద్ర=రాక్షసవరుండైన, సాళ్వ = సాళ్వుఁ డనువానియొక్క, పుర = పట్టణము యొక్క, హేమ = స్వర్ణమయమును, మణీ = రత్నమయమును నగు, వరణంబు=కోట, (ని. 'ప్రాకారో వరణ స్సాల' యని యమరము.) సంగతంబు ఐ = కలిసికొన్నదై, దివిన్ = అంతరిక్షమందు, ఆత్మకంకణములందున్ - ఆత్మ = తనయొక్క (కౌమోదకి యొక్క), కంకణములందున్ = వలయములయందు, ఒకకంకణము అయ్యెన్=తాను నొక కంకణ మాయెనో, మోదకీలితసముజ్జ్వలకల్పకమాల్యన్ - మోద = సంతోషము చేతను, కీలిత = కూర్పఁబడిన, సముజ్జ్వల = ప్రకాశించెడు, కల్పక = కల్పవృక్షముల యందలి పూలయొక్క, మాల్యన్ = దండగల, అట్టి కౌమోదకిన్ = అట్టివిష్ణుగదను, కొల్చెదన్ = భజించెదను. ఉత్ప్రేక్ష. వృత్త్యనుప్రాసము.

తా. తొలుత సాల్వుఁ డను రక్కసుఁడు కామగమన మైనతన పట్టణములోఁ గూడ మథురానగరమందు వ్రాలి ప్రజాహింస గావింతు నని రాఁగాఁ గృష్ణుఁడు కౌమోదకి యనుతనగద నాపట్టణముపైఁ బ్రయోగింపఁగాఁ గనకరత్నమయమైన యా నగరికోట యాకౌమోదకియందుఁ దొడిగిన కంకణములలోఁ దాను నొకకంకణమై కను పట్టినది గాని బాధకము కా దాయెను. అట్టి సర్వశత్రునిరాసకం బగునాకౌమోదకి మదీయశత్రునిరాసమునుం గావింపఁ గల దని యభిప్రాయము.

చ. పిడికెఁడుకొనుఁ గొప్పుఁ గని ప్రేమఁ ద్రివక్ర సమాంగిఁ జేసి తేఁ
బిడికెఁడుకొనుఁ గొప్పుఁ బయిఁ [1]బెచ్చుగుణంబును గంటి నంచు నే
[2]ర్పడఁగ నిజత్రివక్రతయఁ బాపఁగ మ్రొక్కెడు నా సుమాలిపైఁ
జడిగొన నమ్ము లీనుహరి శార్ఙ్గధనుర్లత కాచుఁ గావుతన్. 8

టీ. పిడికెఁడుకొనున్ - పిడికెఁడు = పిడికిటిలో నడఁగెడు, కొనున్ = నడుమును, కొప్పున్ = ధమ్మిల్లమును, కని = చూచి, ప్రేమన్=ప్రేమచేతను, త్రివక్రన్= (మూడువంకరలు గల) కుబ్జను, సమాంగిన్ = చక్కనిదానినిగా, చేసితి = చేసితివి. ఏన్ = నేను, పిడికెఁడుకొనున్ = పిడికిటి కడఁకువ యగు లస్తకమును, కొప్పున్ = ధనురగ్రమును, పయిఁబెచ్చు = అంతకన్న నధికముగా, గుణంబును = అల్లెత్రాటిని (శబ్దచ్ఛలమువలన మంచిగుణ మనియు లభించుచున్నది.) కంటి నంచున్=పొందితి ననుచు, ఏర్పడఁగన్ = స్ఫుటమగునట్లు, నిజ = తనయొక్క, త్రివక్రతయున్ = మూఁడు వంకరలు గలుగుటను, పాపఁగన్ = పోఁగొట్టుకొఱకు, మ్రొక్కెడు నాన్=మ్రొక్కుచున్నదియో యనునట్లు, సుమాలిపైన్=సుమాలి యనురాక్షసునిమీఁద, జడిగొనన్ = సంతతధారగా వర్షించునట్లు, అమ్ములీను=బాణముల నీనెడు, హరిశార్ఙ్గధనుర్లత - హరి = నారాయణునియొక్క, శార్ఙ్గ = శార్ఙ్గ మను పేరుగల, ధనుర్లత = తీఁగవంటివిల్లు, కాచుఁగావుతన్ = రక్షించుఁగాత. మ్రొక్కెడునాన్-అనుచో ఉత్ప్రేక్ష.

తా. శ్రీపతి సుమాలి యనునాదిమరాక్షసునితో యుద్ధము సేయునప్పుడు శార్ఙ్గకోదండముయొక్క, రెండుకొనలు నొకచోటికిఁ జేరునట్టు నారి కదియం దివ్వఁగాఁ గృష్ణావతారమందుఁ గుబ్జను జూచి దీనికిఁ బిడికెఁడుకొను గొప్పు నున్నదని దానిఁ జక్కనిదానిం జేసితివి. నాకును బిడికెఁడుకొను గొప్పును విశేషించి గుణము నున్నది. కాఁబట్టి నన్నును జక్కనిదానిం జేసి రక్షింపు మని శరప్రయోగసమయమందు నమ్రమై యావిల్లు మ్రొక్కుచున్నదో యన్న ట్లుండెను.

1. జేర్చు; దేర్చు. 2. ర్పడర.

మ. ప్రతతోర్ధ్వాధరభాగపీఠయుగళీ భాస్వత్త్సరు స్తంభ [1]సం
స్థితిఁ దీండ్రించెడుజాళువా మొసలివా దీప్తార్చిగాఁ గజ్జలా
న్వితధూమాసితరేఖ పైయలుఁగుగా విజ్ఞానదీపాంకురా
కృతి నందం బగునందకం బఘలతా శ్రేణిచ్ఛిదం జేయుతన్. 9

టీ. ప్రతత = విస్తీర్ణములగు, ఊర్ధ్వ అధరభాగ = మీఁదిక్రిందిప్రదేశముల యందలి, పీఠ=పీఠములయొక్క, యుగళీ=ద్వంద్వమునందు, భాస్వత్ = ప్రకాశించెడి, త్సరు = పిడికిటిపట్టనియెడు, స్తంభ = కంబమందు, సంస్థితిన్ = ఉనికిచేతను, దీండ్రించెడు = వెలుంగుచున్న, జాళువా = స్వర్ణమయమైన, మొసలివా = మకరవక్త్ర మను ఖడ్గాంగవిశేషము, దీప్తార్చిగాన్ - దీప్త=ప్రజ్వరిల్లుచున్న, అర్చిగాన్ = జ్వాల గాఁగా, ('ని. అర్చిర్హ్వేతి శ్శిఖా స్త్రియా' మని యమరము.) పైయలుఁగు = మొన, కజ్జలాన్వితధూమాసితరేఖగాన్ - కజ్జల=కాటుకతో, అన్విత = కూడికొనిన, ధూమ = పొగయొక్క, అసిత = నల్లనైన, రేఖగాన్ = గీటు గాఁగా, (ఇచ్చట నర్థక్రమంబున నన్వయము.) విజ్ఞానదీపాంకురాకృతిన్-విజ్ఞానదీప = జ్ఞానదీపముయొక్క, అంకుర = మొలకయొక్క, ఆకృతిన్ = ఆకారముచేతను, అందంబు అగు = సుందరమైన, నంద కంబు = విష్ణుఖడ్గము, అఘలతాశ్రేణిచ్ఛిదన్ - అఘ = పాపము లనియెడు, లతా = తీఁగలయొక్క, శ్రేణి=పంక్తులయొక్క, ఛిదన్=ఛేదనమును, చేయుఁతన్=చేయుఁగాత, ఉత్ప్రేక్ష - రూపకము.

తా. నందక మనువిజ్ఞానదీపమునకుఁ బరుఁజు దీపస్తంభ మనియును, బంగారు మొసలివాయి దీపకళిక యనియును, నలుఁగు దీపపుఁగొడి యనియును భావము.

మ. అలపన్నిద్దఱుసూరులందును సముద్యల్లీలఁ గాపున్న వె
గ్గలపుందాపముఁ[2]బాప నా నిజమనఃకంజాతసంజాతపు
ష్కలమాధ్వీకఝరి స్మురారి సొగియంగాఁ జొక్కి ధన్యాత్ము లౌ
నిలపన్నిద్దఱుసూరులం[3]దలఁతు మోక్షేచ్ఛామతిం[4]దివ్యులన్. 10

టీ. అల పన్నిద్దఱు సూరులందును=ఆ ప్రసిద్ధు లగు ద్వాదశాదిత్యులయందును, (సూర్యమండలము నారాయణస్థాన మని శ్రుతిప్రసిద్ధము.) సముద్యల్లీలన్=ఒప్పుచున్న విలాసముచేతను, కాపున్న వెగ్గలపుందాపమున్ = నివసించుటచే నైనయధికతాపమును, పాపన్ నాన్=పోఁగొట్టుటకొఱ కనునట్లుగా, నిజ...ఝరిన్-నిజ = స్వకీయములగు, మనః=మనస్సులనియెడు, కంజాత=కమలములయందు, సంజాత=పుట్టినట్టియు, పుష్కల=

1. క, స్థితిఁ. 2. మాన్ప. 3. గొలఁతు. 4. నిత్యులన్.

సమృద్ధమగు, మాధ్వీక=మకరందముయొక్క, ఝరిన్ = ప్రవాహముచేతను, మురారి= హరి, సొరియంగాన్ = సుఖింపఁగా, చొక్కి=ఆనందించి, ధన్య ఆత్ములు = కృతార్థులయిన, ఇల పన్నిద్దఱు సూరులన్ = భూమియందలి పన్నిద్దఱైన యాళువారులను, దివ్యులన్=దేవతామూర్తులగువారిని, మోక్షఇచ్ఛామతిన్ = మోక్షాభిలాష గల మనస్సుతో, తలఁతున్ = సంస్మరించెదను. ఫలోత్ప్రేక్ష.

తా. నారాయణుఁడు సూర్యమండలమధ్యవర్తి యగుటంజేసి యాసూర్యసంబంధ మగుతాపమును బోఁగొట్టుకొనుటకై భూమియందుఁ బన్నిద్దఱాళువారులై యవతరించినమహాత్ముల మనఃపద్మములయందుఁ జేరి వసించి సుఖించె ననియును, పన్నిద్దఱాళువారులు ద్వాదశాదిత్యులకంటెను బరిశుద్ధు లయి తమయంతరంగములయందు నారాయణుని నిలుపుకొని యాస్వామిశరీరతాపము నడఁచి సుఖపఱిచి తా మానందించువా రనియును భావము. అలం. ఫలోత్ప్రేక్ష.

వ. అని యిష్టదేవతా[1]ప్రార్థనంబుఁ జేసి మున్నేఁ గళింగదేశవిజిగీషా మనీషన్ దండెత్తిపోయి [2]విజయవాటిం గొన్నివాసరంబు లుండి శ్రీకాకుళనికేతనుం డగు [3]నాంధ్రమధుమథను సేవింపం బోయి హరివాసరోపవాసం బచ్చటఁ గావింప నప్పుణ్యరాత్రచతుర్థయామంబున.

టీ. అని=ఇట్లు (ప్రియదేవతాప్రార్థనముఁజేసి), మున్ను=పూర్వము, ఏన్=ఏను, కళిం...నీషన్-కళింగదేశ=కళింగ మనుదేశముయొక్క, విజిగీషా = విజయము పొందవలయుననునిచ్ఛగల, మనీషన్ = బుద్ధిచేతను, దండెత్తి పోయి = దండయాత్ర దరలి, విజయవాటిన్ = బెజవాడయందు, కొన్నివాసరంబులు ఉండి=కతిపయదినంబులు నివసించి, శ్రీకాకుళనికేతనుండు అగు=శ్రీకాకుళ మనియెడుపుణ్యక్షేత్రము గృహముగాఁగల, ఆంధ్రమధుమథనుని = తెలుఁగువల్లభరాయఁ డనుపేరుఁగల హరిని, సేవింపన్ పోయి=భజింప నేఁగి, హరివాసర ఉపవాసంబు=ఏకాదశీవ్రతోపవాసము, అచ్చటన్ = ఆ శ్రీకాకుళమందు, కావింపన్ = చేయఁగా, అప్పుణ్యరాత్రచతుర్థయామంబునన్ = ఆపుణ్యమైన రాత్రియొక్క నాలుగవజామునందు.

సీ. నీలమేఘముడాలు సడీలు సేయఁగఁ జాలు
మెఱుఁగుఁజామనచాయమేనితోడ
నరవిందముల[4]కచ్చు సలడఁగించుడిగి హెచ్చు
నాయతం బగుకన్నుదోయితోడఁ

1. వందనంబు. 2. విజయవాటికం. 3. నంధ్ర. 4. గచ్చు.

బులుఁగురాయనిచట్టుపలవన్నె నొరఁబట్టు
హొంబట్టుజిలుగు రెంటెంబుతోడ
నుదయార్కబింబంబునొఱపు విడంబంబు
[1]దొరలంగ నాడుకౌస్తుభముతోడఁ
తే. దమ్మికే లుండఁ బెఱకేల దండ యిచ్చు
లేము లుడిపెడు లేఁజూపు లేమతోడఁ
దొలఁకుదయఁ దెల్పుచిఱునవ్వుతోడఁ గలఁ ద
దంధ్రజలజాక్షుఁ డిట్లని యానతిచ్చె. 12

టీ. నీలమేఘము డాలు=నల్లని మేఘములకాంతిని, డీలు సేయఁగన్ = బలహీనముగాఁ జేయుటకు, చాలు = సమర్థ మగు, మెఱుఁగు చామనచాయ=నిద్దమై నిగనిగలాడుచామనచాయగల, మేనితోడన్ = శరీరముతోడను, అరవిందముల = తామర పువ్వులయొక్క, కచ్చులు = గర్వములను, అడఁగించు=తక్కువసేయు, జిగిన్=కాంతి చేతను, హెచ్చు = అతిశయించుచున్న, ఆయతంబు అగు = నిడువాలిక యగు, కన్ను దోయితోడన్=నేత్రయుగళముతోడను, పులుఁగురాయనిచట్టుపలవన్నెన్=పక్షీంద్రుఁ డగుగరుత్మంతునిఱెక్కలవర్ణమును, ఒరఁబట్టు=ఒరయఁగఁ జేసెడు, హొంబట్టు = బంగారు పట్టు గలిగిన, జిలుఁగు=సన్నపునేఁతగల, రెంటెంబుతోడన్ = వస్త్రముతోడను, ఉదయార్కబింబంబు = బాలసూర్యబింబముయొక్క, ఒఱపు = ఒప్పిదముయొక్క, విడంబంబు = సామ్యమును, తొరలంగన్ ఆడు=తూలనాడెడు, కౌస్తుభముతోడన్=కౌస్తుభమనియెడు రత్నముతోడను, తమ్మికేలు ఉండన్ = పద్మములఁబట్టినహస్త మటుండఁగా, పెఱకేలన్ = ఇతరహస్తముచేతను, దండ ఇచ్చు = కైదండ యిచ్చెడు, లేము లుడిపెడు = దారిద్ర్యధ్వంసక మగు, లేఁజూపు=లేఁతచూపు గల, లేమతోడన్ = తరుణి యగులక్ష్మీదేవితోడను, తొలఁకు=తరంగితమగు, దయన్=కృపను, తెల్పు=ఎఱిఁగించెడు, చిఱునవ్వుతోడన్ = మందస్మితముతోడను, కలన్ = స్వప్నమందు, తదంధ్రజలజాక్షుఁడు = ఆల్లతెలుఁగువల్లభరాయఁడు, ఇట్లు అని=వక్ష్యమాణప్రకారముగా, ఆనతిచ్చెన్=సెలవొసంగెను. పెద్దపాదములందు ఉపమ; లేము...లేమ-పర్యాయోక్తము.

తా. గ్రంథకర్త నిద్రించుచుండఁగా స్వప్నమందు నల్లనిశరీరచ్ఛాయ గలిగి, తామరఱేకులం దిరస్కరించెడుకన్నులు గలిగి, యురంబునం గౌస్తుభమాణిక్యంబు గలిగి, తనపార్శ్వమందు నిలిచి లక్ష్మీదేవి యొకచేతఁ గమలంబును, రెండవచేతఁ దన

1. దొలకంగ.

హస్తంబునుం గీలించి యుండఁ జిఱునగవులయందే తనకుం గలదయ తెలియుచుండ నాయాంధ్రవల్లభస్వామి కనుపడి ముందు చెప్పఁబోవురీతిని పలికె నని భావము.

సీ. పలికి తుత్ప్రేక్షోపమల జాతిఁ బెం పెక్క
రసికు లౌ నన మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్యసేవధి కాఁగఁ జె
ప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతిపురాణోపసంహిత లేర్చి కూర్చితి
సకలకథాసారసంగ్రహంబు
శ్రోత్రఘచ్ఛటలు [1]విచ్చుగ రచించితి సూక్తి
నైపుణి జ్ఞానచింతామణికృతి
తే. మఱియు రసమంజరీముఖ్యమధురకావ్య
రచన మెప్పించికొంటి గీర్వాణభాష
నంధ్రభాష[2]యసాధ్యంబె యందు నొక్క
కృతి వినిర్మింపు మిఁక మాకుఁ బ్రియము కాఁగ. 13

టీ. ఉత్ప్రేక్షోపమలన్ = ఉత్ప్రేక్షాలంకారముచేతను ఉపమాలంకారముచేతను, జాతిన్=స్వభావోక్తిచేతను, పెంపెక్కన్=అతిశయించునట్లు, రసికులు = రసజ్ఞులు, ఔను అనన్=ఒప్పుకొనునట్లుగా, మదాలసచరిత్రన్ = మదాలసచరిత్ర యను ప్రబంధమును, పలికితివి=రచించితివి. భావ...కాఁగన్ - భావ = అభిప్రాయములకును, ధ్వని=ధ్వనులకును, వ్యంగ్య=వ్యంజనావృత్తికిని, సేవధి కాఁగన్=నిక్షేపము అగునట్టుల, సత్యావధూప్రీణనంబున్=సత్యభామాపరిణయ మను ప్రబంధమును, చెప్పితివి = వచించితివి. శ్రుతి...తలు-శ్రుతి=వేదములు, పురాణ = పురాణములును, ఉపసంహితలు = పాంచరాత్రాగమాదులలో విష్వక్సేనసంహిత మొదలగువానిని, ఏర్చి = శోధించి, సకలకథాసారసంగ్రహంబున్ = సకలకథాసారసంగ్రహ మను గ్రంథమును, కూర్చితి = అనుకూలపఱిచితివి. శ్రోత్రఘచ్ఛటలు-శ్రోతృ=వినియెడువారియొక్క, అఘ = పాపములయొక్క, ఛటలు=సమూహము, విచ్చుగన్ =విచ్చిపోవునట్లు, సూక్తినైపుణిన్ = భాషాచాతుర్యముచేత, జ్ఞానచింతామణికృతిన్=జ్ఞానచింతామణి యనియెడు ప్రబంధమును, రచించితి = చేసితివి. మఱియున్ = ఇంకను, రసమంజరీ = రసమంజరి యను గ్రంథము, ముఖ్య=మొదలగు, మధుర=మనోహరము లగు, కావ్య=కావ్యములయొక్క, రచనన్ = కూర్చుటచేతను, గీర్వాణభాషన్ = సంస్కృతభాషయందు, మెప్పించుకొంటి=మెప్పు

1. మంచుగ. 2. నసాధ్యంబె.

పడసితివి. ఆంధ్రభాష=తెలుఁగుబాస, అసాధ్యంబె = (నీకు) సాధింపరానియదియా, అందున్=ఆయాంధ్రభాషయందును, మాకున్, ప్రియముగాఁగన్ = ఆనందమగునట్లు, ఇఁకన్ ఒకకృతి వినిర్మింపుము = ఇంక నొక్క గ్రంథము రచింపుము.

తా. ఎల్లభాషలకును తల్లి యగుసంస్కృతభాషయందు మదాలసచరిత్ర, సత్యభామాపరిణయము, సకలకథాసారసంగ్రహము, జ్ఞానచింతామణికృతియును, రసమంజరి మొదలగుశృంగారకావ్యములును రచించిన నీకు నాంధ్రభాష యసాధ్యము కాదు గావున నాయాంధ్రభాషయందును మాకుఁ బ్రియ మగున ట్లొక్కప్రబంధంబు రచియింపు మని తెలుఁగువల్లభరాయఁడు పలికె నని భావము. అలం. అర్థాపత్తి.

ఉ. ఎన్నినుఁ గూర్తు నన్న వినుమే మును దాల్చినమాల్య మిచ్చున
ప్పిన్నది రంగమం దయిన [1]పెండిలి సెప్పుము మున్ను గొంటి నే
వ న్ననదండ యొక్కమగవాఁ డిడ నేను దెలుంగురాయఁడన్
గన్నడరాయ యక్కొడువఁ గప్పు ప్రియాపరిభుక్తభాక్కథన్. 14

టీ. ఎన్నినున్=ఏనిన్ను, కూర్తున్ అన్నన్ = కూర్తు నంటివేని, వినుము. ఏన్= నేను, మును=(తాను) ముందుగా, తాల్చిన = ధరించిన, మాల్యము ఇచ్చు = దండను సమర్పించిన, అప్పిన్నది=ఆ చిన్నదియు, (తాను చూడికుడుత్తనాంచా రనుట- అలం. పర్యాయోక్తము.), రంగమందున్ = శ్రీరంగమందు, అయిన = చేసికొనిన, పెండిలి= వివాహమును, చెప్పుము=రచింపుము. మున్ను=పూర్వమందు, ననదండ=పుష్పమాలికను, ఒక్కమగవాఁడు ఇడన్=ఒక్కపురుషుఁ డీయఁగా, ఏవన్=అసహ్యతచేతను, కొంటిని= గ్రహించితిని. నేను, తెలుంగురాయఁడన్=తెలుఁగువల్లభరాయఁడను, కన్నడరాయ = ఓకర్ణాటరాజా ! ప్రియాపరిభుక్తభాక్కథన్ - ప్రియా=ప్రియురాలిచేతను, పరిభుక్త= లెస్సగా ననుభవింపఁబడినమాల్యమును, భాక్ = పొందినరంగమన్నారుస్వామియొక్క, కథన్ = కథచేతను, అక్కొడువన్ = అట్టితక్కువను, కప్పుము = ఆచ్ఛాదింపుము.

తా. శ్రీరంగనాయకాద్యర్చావతారములలో నేయర్చావతారము వహించిన నిన్ను నాగ్రంథమునందుఁ గూర్తు నంటివేని వినుము. నేను, పూలదండలను దొలుతఁ దానే ధరించి పిమ్మట నవి నాకు సమర్పించినచిన్నది యగుచూడికుడుత్తనాంచా రని యొదుపాలఁతియు శ్రీరంగమందుఁ బెండ్లాడినకథను జెప్పుము. పూర్వము కృష్ణావతారమందు నొకపురుషుఁ డగు సుదాముఁడను మాలాకారుఁ డొసఁగిన పుష్పమాలికను మే మిష్టము లేక గ్రహించియున్నాము; గావున నట్టికొఱఁత దీఱునట్లు ప్రియురాలుమున్ను తా ననుభవించి పిదప నొసంగఁగాఁ బ్రీతిచేత గ్రహించి యాదండను బూనుకొన్నవాఁ

1. పెండ్లియ చెప్పుము.

దగు రంగమన్నారులకథఁ జెప్పుము. దానివలనఁగాని పురుషదత్తమాల్యధారణ మను పొచ్చెము వదల దని భావము.

మతాంతరమందు మగవాఁ డన్న యెడ విష్ణుచిత్తుం డని యన్వయించి తత్సమర్పిత మాల్య మిష్టములేక గ్రహింపఁబడినట్లును, అట్టి యాతను బ్రియాపరిభుక్తభాక్కృత చేత నాచ్ఛాదింపు మనినట్లును నూహించినవిధంబునఁ గానఁబడుచున్నది.

ఆ. తెలుఁగ దేల యన్న దేశంబు తెలుఁ గేను
దెలుఁగువల్లభుండఁ దెలుఁ గొకండ
యెల్లనృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స. 15

టీ. తెలుఁగు అది ఏల అన్నన్ = తెనుఁగుకావ్య మేలయంటివేని, దేశంబు = నే నివసించియున్న దేశము, తెలుఁగు = తెలుఁగుది, ఏను = నేను, తెలుఁగువల్లభుండన్ = తెలుఁగు రాయఁడను, తెలుఁగు = తెలుఁగుబాస, ఒకండ = ఒక్కటియే, (అనఁగా నది వింత గా దనుట). ఎల్లనృపులు కొలువన్ = సకలరాజన్యులు సేవింపఁగా, బాసాడి = నీవు సంభాషించి, ఎఱుఁగవే = కార్యార్థమువలన సకలదేశభాషల నెఱుఁగుదు వనుట. దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

తా. ఇన్ని సంస్కృతగ్రంథంబుల వ్రాసిన నన్నుఁ దెలుఁగున నేల ప్రబంధము వ్రాయు మని సెలవిచ్చుచున్నా వనవలదు. ఏ మనఁగా నేను నివసించియున్న దేశము తెలుఁగుదేశము. నేను దెలుఁగువల్లభుఁడను. తెలుఁగు క్రొత్తది గాదు. సకలసామంత రాజులును గొలుచుచుండఁగా నీవు సకలదేశభాషలను మాటలాడుచుండుట లేదా? సమస్తమైన దేశభాషలలోను దెలుఁగే కదా చక్కని బాస.

క. అంకితమో యన నీ కల, వేంకటపతి యిష్ట మైన వే ల్పగుటఁ దదీ
[1]యాంకితము సేయు మొక్కొక, సంకేతమ కాకతఁడరసన్నేఁగానే.

టీ. అంకితమో అనన్ = ఎవ్వరిపేర నంకిత మొనర్తు నంటివేని, నీకున్, అల వేంకటపతి = ఆవేంకటరమణుఁడు, ఇష్టమైనవేల్పు అగుటన్ = ఇష్టదేవత గావున, తదీయ అంకితము = ఆవేంకటరమణసంబంధి యగునంకితమే, చేయుము = ఒనర్పుము. (అట్లు చేసిన నీ కేమిలాభ మని శంకింపఁగా నాశంకను బరిహరించుచున్నాఁడు.) ఒక్కొక సంకేతమ కాక = ప్రత్యేకనామ భేదమే కాక, రసన్ = భూమియందు, అతఁడ = ఆవేంకటేశ్వరుఁడే, నేన్ కానే = నేను గానా.

1. యాంకితమె సేయు మొక్కొక, సంకేతముగాక యతఁడ సరి నేఁగానా?

తా. నేను వ్రాయు ప్రబంధ మెవరి కంకితము చేయుదు నందువేమో వినుము. నీ కల్ల వేంకటేశ్వరస్వామి యిష్టదైవమే కనుక నతనిపేర నంకితముచేయుము. నాకును నతనికిని బేరుమాత్రమే భేదముగాని నేనే యతఁడు, అతఁడే నేను.

తే. పొత్త మిటు సేయ నీ కుత్తరోత్తరాభి
వృద్ధి యని పోవ మేల్కని వెఱఁగుతోడి
భక్తిఁ దద్గృహాగోపుర ప్రణతిఁ జేసి
వేగుటయుఁ గల్యకరణీయ [1]విధులు దీర్చి. 17

టీ. పొత్తము = పుస్తకము (ప్రబంధ మనుట.) ఇటు = ఉక్తక్రమముగా, చేయన్ = చేయఁగా, నీకున్, ఉత్తర ఉత్తర అభివృద్ధి = ఒకనాటికంటె నొకనాటి కభివృద్ధి (అగును), అని, పోవన్ = వెంచేయఁగా, మేల్కని = (నేను) నిదురలేచి, వెఱఁగుతోడి = ఆశ్చర్యముతోఁగూడిన, భక్తిన్ = భక్తిచేతను, తద్గృహాగోపురప్రణతిన్ = ఆయాంధ్రనాయకస్వామియొక్క యాలయగోపురప్రణామ మాచరించి, వేగుటయున్ = ప్రభాతము కాఁగానే, కల్య...ధులు - కల్య = ప్రత్యూషకాలమందు, కరణీయ = చేయఁదగిన, విధులు = సంధ్యావందనాదివిధులను, తీర్చి = నెఱవేర్చికొని.

తా. నేను చెప్పినచొప్పునఁ బ్రబంధము వ్రాసితివేని నీ కుత్తరోత్తరము నభివృద్ధి యగు నని చెప్పి స్వామి యంతర్ధానము కాఁగా నేను మేలుకొని యాశ్చర్యపడుచు భక్తితో నాస్వామియాలయగోపురమునకు నమస్కారము చేసి తెల్లవాఱఁగానే నిత్యకృత్యములు నెఱవేర్చికొని.

వ. నిండోలగంబుండి దండనాథసామంతసందోహంబులం బిలిపించి పెంద లకడన మందిరంబులకనిపి(చి) వివిధవేదాగమవిదు లగు విద్వజ్జనంబులఁ గాన్పించికొని నమస్కరించి యాశుభస్వప్నంబు వినిపించిన హర్షించి వారును సవిస్మయస్వాంతు లయి, దేవా! దేవదేవుండు విజయంబు చేసిన యాస్వప్నం బనేకశోభనపరంపరలం దెలుపుచున్న యది, యె ట్లనినఁ బ్రథమ మప్పద్మేక్షణ స్వప్నసాక్షాత్కారం బితోధిక భక్తియు, నతండు ప్రబంధనిబంధనంబుఁ గావింపుమనుట యితోధిక గాఢ సారస్వతోద్బోధనంబును, నతనిదేవీసమాగమంబితోధికాఖండ భాండాగారసమృద్ధియు, నతని యాసలితచేలిపిశదశతచ్ఛదం బితోధికాద్వితీయసితచ్ఛత్రతయు, నతం డశేషనృపసేవం దత్తద్భాష

1. విరతి.

తెలుఁగవే యనుట యితోధికసమస్తసామంతసమాజసమాకర్షణం
బును, బ్రియోపభోగపరిశిష్టభోగం బిం పనుట యితోధికబహు
ప్రేయసీప్రాప్తియు, నీకుఁ గృతి సెప్ప నుత్తరోత్తరాభివృద్ధి యగు
ననుట యితోధికాపత్యపరమాయురవాప్తియు నగు నఖర్వమహి
మాతిధూర్వహుం డగుతుర్వసువంశంబునం బుట్టినట్టి నీ కిట్టిశోభ
నంబు లే మద్భుతంబు లవధరింపుము. 18

టీ. నిండు=పరిపూర్ణమగు, ఓలగంబుండి=సభయందుండి, దండ...లన్ - దండనాథ=సేనానాయకులయొక్కయు, సామంత = సామంతరాజన్యులయొక్కయు, సందోహంబులన్=సమూహములను, పెందలకడన=వేపకదనే, మందిరంబులకున్ అనిపి=ఉనికిపట్లకుం జన సెల వొసంగి, వివి...లు-వివిధ=పలుతెఱఁగు లగు, వేద=వేదములను, ఆగమ=పాంచరాత్రాద్యాగమములను, విదులగు=ఎఱింగిన, విద్వజ్జనంబులన్ = విద్వాంసులను, కాన్పించికొని = దర్శనముచేయించుకొని, నమస్కరించి = (వారికి) మ్రొక్కి, ఆశుభస్వప్నంబు=తాఁగన్నకలను, వినిపించినన్, వారును=ఆవిద్వాంసులును, హర్షించి=సంతోషించి, సవిస్మయ=ఆశ్చర్యముతోఁగూడిన, స్వాంతులై = చిత్తముకలవారై, దేవా = ఓరాజా, దేవదేవుండు=దేవతలకు దేవుఁ డయిననారాయణుఁడు, విజయంబుచేసిన=విచ్చేసిన, ఆస్వప్నంబు అనేక శోభనపరంపరలన్ తెలుపుచున్నయది = ఆకల పెక్కుశుభపరంపరల కాస్పదంబై యున్నది. ఎట్లనిన, ప్రథమము=మొదట, అప్పద్మేక్షణ=ఆ కమలాక్షునియొక్క, స్వప్నసాక్షాత్కారము = కలలోఁ బ్రత్యక్షదర్శనము, ఇతోధిక భక్తియున్ = ఇంతకంటె నధికభక్తియును, 'దృశ్యతే భగవాన్ యస్య స్వప్నే సర్వశుభావహః, తస్మిన్నేవ దృఢాభక్తి ర్జాయతే తస్య సంతతమ్' సకలమంగళములను గలిగించు విష్ణు వనఁగా నెవనికలలో భగవానుఁడు కనుపడునో, వాని కెప్పుడును నాభగవానునియందె దృఢమైన భక్తిగలుగును. (అని యుండుటచే స్వప్నమందు భగవత్సాక్షాత్కారము భక్తిసాంతత్యకారకము), అతండు = ఆదేవుఁడు, ప్రబంధనిబంధనంబున్ = గ్రంథరచనమును, కావింపు మనుట = చేయు మనుట, ఇతో...ను - ఇతోధిక=ఇంతకతిశయ మగు, అగాధ=గంభీరమగు, సారస్వత=విద్యయొక్క, ఉద్బోధనంబును=జ్ఞానమును, అతనిదేవీసమాగమంబు = ఆవిష్ణుపత్నిరాక, ఇతో...యున్ - ఇతోధిక = ఇంతకు మిక్కిలియగు, అఖండ = ఎడతెగని, భాండాగార=ధనమునిలువచేయు నిండ్లయొక్క, సమృద్ధియున్=సంపూర్ణత్వమును, అత...బు-అతని=ఆవిష్ణునియొక్క, అసలిచేలి=ఆలక్ష్మిచేతనున్న, విశదశతచ్ఛదంబు-విశద=శుభ్రమగు, శతచ్ఛదంబు=శతపత్త్రము, (తామరపువ్వు) ఇతో...యున్-ఇతోధిక = ఇంతకంటె నెక్కుడగు, అద్వితీయ=ఏక

మైన, సితచ్ఛత్రతయున్ = శ్వేతచ్ఛత్రము గలుగుటయును, అతఁడు=ఆదేవుఁడు, అశేష నృప=సకలరాజులయొక్క, సేవన్=భజించుటచేతను, తత్తద్భాషలు = ఆయాదేశభాషలను, ఎఱుంగవే అనుట=తెలిసికొనవా యనుట, ఇతో...బును - ఇతోధిక=ఇంతకంటె నధికులగు, సమస్తసామంత = ఎల్లసమానరాజులయొక్క, సమాజ=సమూహముయొక్క, సమాకర్షణంబును=రాఁబట్టుటయును, ప్రియో...బు - ప్రియా = ప్రియురాలియొక్క, ఉపభోగ = అనుభవమునుండి, పరిశిష్ట = శేషించిన (మాల్య మను) వస్తువుయొక్క, భోగంబు=అనుభవము, ఇంపు అనుట=ఇష్ట మనుట. ఇతో...యున్ - ఇతోధిక=ఇంతకంటె నధికమగు, బహు=పలువురగు, ప్రేయసీ=ప్రియురాండ్రయొక్క, ప్రాప్తియున్ = లాభమును, కృతి చెప్పన్ ఉత్తర ఉత్తర అభివృద్ధ అగును అనుట=ప్రబంధనిర్మాణము జేసినచో నీకు నొకనాఁటికంటె నొకనాఁటికి శ్రేయ స్సగు ననుట, ఇతోధికాపత్య పరమాయురవాప్తియున్=ఇంతకంటె నధిక మగుసంతానమును సంపూర్ణ మగునాయువును లభించుటయు, అగున్ = కలుగును. అని శోభనపరంపరలన్ తెలుపుచున్న దని పూర్వములో నన్వయము. అఖ...డు-అఖర్వ=కుఱుచగాని, (అధికమైన) ('ఖర్వోహ్రస్వశ్చ వామనః' అని అమరము.) మహిమ = మహత్త్వముచేతను, అతిధూర్వహుండు అగు = మిక్కిలి ధురంధరుఁడైన, తుర్వసు = తుర్వసుఁడను పురుషునియొక్క, వంశంబునన్ = కులమునందు, పుట్టినట్టి=జనించినయట్టి, నీకున్=నీకు, ఇట్టిశోభనంబులు=ఇటువంటిశుభంబులు, ఏమి అద్భుతంబులు = ఏమాశ్చర్యకరములు, (అద్భుతంబులు కా వనుట.) అవధరింపుము=చిత్తగింపుము.

సీ. కలశపాథోరాశిగర్భవీచిమతల్లి
        కడుపార నెవ్వానిఁ గన్నతల్లి
    యనలాక్షుఘనజటావనవాటి కెవ్వాఁడు
        వన్నె పెట్టునార్తవంపుఁబువ్వు
    సకలదైవతబుభుక్షాపూర్తి కెవ్వాని
        [1]పుట్టు కామని లేనిమెట్టపంట
    కటికిచీఁకటితిండికరములగిలిగింత
        నెవ్వాఁడు తొగకన్నె నవ్వం[2]జేయు
తే. నతఁడు పొగ డొందు మధుకైటభారిమఱఁది
    కళల నెలవగువాఁడు చుక్కలకు ఱేఁడు

1. పుట్టఁగా నని. 2. జేయు.

మిసిమిపరసీమ వలరాజుమేనమామ
వేవెలుంగులదొరజోడు రేవెలుంగు. 19

టీ. కల...ల్లి - కలశపాథోరాశి = క్షీరసముద్రముయొక్క, (అమృతప్రాప్తికై దేవాసురులు మథించునెడఁ గలశప్రాయ మగుటఁజేసి సముద్రము కలశపాథోరాశి యనఁబడినది.) గర్భ=లోపలి, వీచిమతల్లి = తరంగశ్రేష్ఠము, కడుపారన్=గర్భము పరిపూర్ణమగునట్లు, ఎవ్వానిన్ = ఏచంద్రుని, కన్నతల్లి = ప్రసవించిన జననియో (అనఁగాఁ జంద్రుఁడు క్షీరసముద్రమందుఁ బుట్టినవాఁడు గనుక నిచ్చటితరంగమునకు మాతృత్వము తోఁచుచున్న దనుట), ఎవ్వాఁడు=ఏచంద్రుఁడు. అన...టికిన్-అనలాక్షు = ఫాలాక్షుఁడగు శివునియొక్క, ఘన=దట్టమైన, జటా=జడ యనెడు, వనవాటికిన్ = వనప్రదేశమునకు, వన్నెపెట్టు = శృంగారించెడు, అనా...వ్వు-అనార్తవంపు = ఋతుసంబంధికాని, పువ్వు = పువ్వుమో (అనఁగా శివుఁడు శిరస్సునధరించినాఁ డనుట.) ఎవ్వానిపుట్టుక = ఏచంద్రునిజన్మము, సక...కిన్-సకలదైవత = ఎల్లవేల్పులయొక్క, బుభుక్షా=పేరాఁకటియొక్క, పూర్తికిన్=తీఱుటకు,ఆమనిలేని=నుఱిపిడికాలములేని, మెట్టపంట=దేవమాతృకభూఫలమో, ('ప్రథమాం పిబతే వహ్నిః' అను మొదలయినప్రమాణము ననుసరించి యనుట.) ఎవ్వాఁడు = ఏచంద్రుఁడు, కటిక = కఠినమగు, చీఁకటి = అంధతమసము, తిండి = భక్షణముగాఁగల, కరముల = కిరణములయొక్క, గిలిగింతన్ = చక్కిలిగింతచేతను, తొగకన్నెన్ = కలువ తీఁగ యనియెడు కన్యకను, నవ్వన్ = నవ్వునట్లు, చెనకున్ = స్పృశించునో, మధుకైటభారిమఱంది = మధుకైటభు లనురాక్షసులకు శత్రు వగు విష్ణునకు మఱఁదియు, కళల = షోడశకళలయొక్క, నెలవగువాఁడు=స్థానమైనవాఁడు, చుక్కలకున్ ఱేఁడు = నక్షత్రములకు నాథుఁడు, మిసిమిపరసీమ - మిసిమి=కాంతికి, పరసీమ = ఎక్కుడగు పొలిమేరయైనవాఁడు, వలరాజుమేనమామ = మన్మథునికిఁ దల్లితోఁబుట్టినవాఁడు, వేవెలుంగులదొర = సహస్రకిరణములు గల దొరయగు సూర్యునియొక్క, జోడు = ఉద్దియగువాఁడు, రే వెలుంగు=రాత్రియందుఁ బ్రకాశించెడువాఁడు నగు, అతఁడు = ఆచంద్రుఁడు, పొగడొందున్=నుతింపఁబడును. 1, 3 పా. పరిణామము. 2, 4 పా. రూపకము.

తా. కృష్ణదేవరాయలవంశంబునకు మూలంబగు చంద్రుఁడు పాలసముద్రంబునం బుట్టినాఁ డనియును, శివునిజటాజూట మలంకరించినాఁ డనియు, సమస్తదేవతలకును దున్నక, చల్లక, కోయక, నుఱువక, కాలనిర్ణయములేక, ఆఁకటి కొదిగెడుసుకరమగు నాహార మైనవాఁ డనియుఁ (మహోపకారి యనుట) దనకిరణములచేతఁ గలువతీఁగ యనుకన్యకను నవ్వఁజేయు ననుటవలన మహారసికుఁ డనియును, విష్ణునకు మఱఁది యనుట

వలన మిక్కిలి యాభిజాత్యము గలవాఁ డనియును, కళానిధి యనుటవలనఁ గాంతిమంతుఁ డనియును, చుక్కలఱేఁ డనుటవలన రాజ్యపరిపాలనశీలుఁ డనియును, మిసిమిపరిసీమ, వలరాజు మేనమామ యనుటవలన లావణ్యసౌందర్యాదిగుణములు గలవాఁ డనియును, సూర్యసఖుఁ డనుటవలనఁ బ్రతాపగుణముగలవాఁ డనియును, రేవెలుంగనుటవలన స్వయంప్రకాశుం డనియును భావము.

తే. ఆసుధాధామవిభవమహాంబురాశి
కుబ్బు మీఱంగ నందనుం డుదయ మయ్యె
వేదవేదాంగశాస్త్రార్థవిశదవాస
నాత్తధిషణాధురంధరుం డైనబుధుఁడు. 20

టీ. ఆసుధా...కిన్ - ఆసుధాధామ = అల్లచంద్రునియొక్క, విభవ=సంపద యనెడు, మహాంబురాశికిన్ = మహాసముద్రమునకు, ఉబ్బుమీఱంగన్ = సంతోష మతిశయించునట్లుగా, నందనుండు = కుమారుఁ డగు, వేద...రుండు - వేద = వేదములయొక్కయు, వేదాంగ = వేదముల కవయవము లగు శిక్షాదులయొక్కయు, శాస్త్ర = మీమాంసాదిశాస్త్రములయొక్కయు, అర్థ = అర్థములయొక్క, విశద = స్వచ్ఛమగు, వాసనా = సంస్కారముచేతను, ఆత్త = పొందఁబడిన, ధిషణా = బుద్ధియొక్క, ధురంధరుండు = భారవాహి, ఐన = అగు, బుధుఁడు = బుధగ్రహము, ఉదయమయ్యెన్ = జనించెను.

తా. బుధుఁడు చంద్రునకుఁ దనయుఁ డై సమస్త వేదశాస్త్రముల యర్థంబులు లెస్సగాఁ దెలిసికొనియె ననుట.

క. వానికిఁ బురూరవుఁడు ప్ర
జ్ఞానిధి జనియించె[1]సింహసదృశుఁడు తద్భా
జానికి నాయువు తనయుం
[2]డానృపతికిఁ దనయుఁడై యయాతి జనించెన్. 21

టీ. వానికిన్=ఆబుధునకు, ప్రజ్ఞానిధి = మతిమంతుఁడును, సింహసదృశుఁడు = సింహసమానవిక్రముఁడును అగు, పురూరవుఁడు = పురూరవుఁ డనుచక్రవర్తి, జనియించెన్ = పుట్టెను. తద్భాజానికిన్ = ఆపురూరవచక్రవర్తికి, ఆయువు=ఆయు వనుపేరు గలరాజు, తనయుండు=కుమారుఁడు, ఆనృపతికిన్=ఆయాయువనురాజునకు, యయాతి= యయాతి యనుమహారాజు, తనయుఁ డై=నందనుఁ డై, జనించెన్ = జన్మమొందెను.

1. శక్ర. 2. డై నెగడె నతండు కనె యయాతినరేంద్రున్.

తా. బుధునకుఁ బురూరవుండును, బురూరవునకు నాయువును, నాయువునకు యయాతియుఁ సుతులై పొడమి రని భావము.

క. అతనికి యదుతుర్వసులను, సుతు లుద్భవమందిరహితసూదనులుకళా
న్వితమతులు వారిలోఁ వి, శ్రుతకీర్తివహించెఁదుర్వసుఁడు గుణనిధియై.

టీ. అతనికిన్ = ఆయయాతిమహారాజునకు, యదు తుర్వసు లనుసుతులు = యదువు, తుర్వసుఁడు ననుతనయులు, అహితసూదనులు - అహిత=శత్రువులను, సూదనులు=మర్దించువారును, కళాన్వితమతులు - కళా=విద్యలతోడను, అన్విత=కూడుకొన్న, మతులు=బుద్ధిగలవారు, ఉద్భవము అందిరి=పుట్టిరి వారిలోన్ = ఆయదు తుర్వసులలో, తుర్వసుఁడు, గుణనిధి యై = సుగుణనిధానమై, విశ్రుతకీర్తి వహించెన్=ప్రశస్తమైన యశస్సును బొందెను.

తా. ఆయయాతికి యదుతుర్వసులను నిర్వురు తనయులు గలిగి రనియును, వారిలోఁ దుర్వసుఁడు కీర్తిమంతుఁ డాయె ననియును భావము.

తే వానివంశంబు తుళువాన్వవాయ మయ్యె
నందుఁ బెక్కండ్రు నృపు లుదయంబు నొంది
నిఖిలభువ[1]నాభిపూర్ణనిర్ణిద్రకీర్తి
నధికు లైరి తదీయాన్వయమునఁ బుట్టి. 23

టీ. వాని = ఆతుర్వసునియొక్క, వంశంబు = కులము, తుళువాన్వవాయము అయ్యెన్=తుళువకుల మయ్యెను. అందున్=ఆకులమందు, పెక్కండ్రు = అనేకులగు, నృపులు=రాజులు, ఉదయంబునొంది = జనించి, నిఖి... ర్తిన్ - నిఖిల=సమస్తములగు, భువన=లోకములందు, అభిపూర్ణ=నిండింపఁబడిన, నిర్ణిద్ర=ప్రకాశించెడు, కీర్తిన్=కీర్తి చేతను, అధికులైరి = ఆధిక్యమును వహించిరి. తదీయాన్వయమునన్ - తదీయ = ఆరాజులసంబంధియగు, అన్వయమునన్ = వంశంబునందు, పుట్టి = జననమంది. ఇది ముందఱిపద్యముతో నన్వయము.

తా. ఆతుర్వసుని వంశము తుళువవంశ మని పేర్పడినది. ఆవంశమందు పెక్కుమందిరాజులు పుట్టి సకలలోకములయందును నిండిన కీర్తిచేఁ గొప్పవా రయిరి. అటువంటి రాజుల వంశమునం దుద్భవించి;

మహాస్రగ్ధర. ఘనుఁడై తిమ్మక్షితీశాగ్రణిశరకరుదగ్రావసంఘాతవాతా
శనరాడాశాంతవంతిస్థవిర కిసల జంఝూటము ల్మాన్చి యిమ్మై

1. నప్రపూర్ణ.

దిని దోర్దండైక పీఠి౯ దిరము పఱిచి కీర్తిద్యుతుల్ రోదసిం బ
ర్వ నరాతుల్నమ్రులై పార్శ్వములఁ గొలువఁ దీవ్ర ప్రతాపంబుఁ జూపెన్.

టీ. తిమ్మక్షితీశాగ్రణి = తిమ్మభూపాలశ్రేష్ఠుఁడు, ఘనుఁడై = అధికుఁడై, శఠ... ఝాటముల్ - శఠ = గూఢవిప్రియకారి యగు, కమఠ = కూర్మముయొక్కయు, గ్రావ = పర్వతములయొక్క, సంఘాత = సమూహముయొక్కయు, వాతాశనరాట్ - వాత = వాయువే, అశన = ఆహారముగాఁగలసర్పములయొక్క, రాట్ = రాజైన శేషునియొక్కయు, ఆశాంతదంతి - ఆశాంత = దిగంతములయందలి, దంతి = గజములయొక్కయు, స్థవిర = వృద్ధయిన, కిరి = ఆదివరాహముయొక్కయు, (శఠశబ్దము మొదలుగాఁ గిరి శబ్దమువఱకు ద్వంద్వసమాస మగుటవలన నంతమందలి కిరిశబ్దము బహువచనాంతమైనది), జంఝాటముల్ = జంజాట (ఆటోప) ములను, మాన్చి = వదలించి, ఇమ్మేదినిన్ = ఈ భూమిని, దోర్దండైక పీఠిన్ - దోర్దండ = తనభుజాదండ మనియెడు, ఏక = ముఖ్యమగు, పీఠిన్ = పీఠమందు, తిరముపఱిచి = స్థిరముగా నిలిపి, కీర్తిద్యుతుల్ = యశఃకాంతులు, రోదసిన్ = భూమ్యాకాశములందు, పర్వన్ = వ్యాపింపఁగా, అరాతులు = శత్రువులు, నమ్రులై = తగ్గినవారై, పార్శ్వములన్ కొలువన్ = చెంతలఁ జేరి సేవింపఁగా, తీవ్ర ప్రతాపంబున్ = తీక్ష్ణ మగుశౌర్యమును, చూపెన్ = కనఁబఱిచెను.

తా. ఆవంశమునందుఁ బుట్టి ఘనుఁ డయిన తిమ్మదేవరాయఁడు మున్ను భూమిని భరించుచున్న యాదికూర్మ, సప్తకులపర్వత, శేష, దిగ్గజాదివరాహములయందు వరుసగాఁ గలిగిన శఠత్వకాఠిన్యవాతాశనత్వదూరనివాసిత్వవృద్ధత్వము లనుదోషములఁ జూచి యట్టి కమఠాదులతోడితోడును భూమికి లేకుండఁ దానే తనభుజంబున భరియించి శత్రువులు నమ్రులై తన్ను సేవించుచుండఁ, దన కీర్తి ప్రతాపములు భూమ్యాంతరిక్షంబులయందు వ్యాపింపఁజేసి భూమి కధికసౌఖ్యమును గలుగఁజేసె నని భావము.
అలం. పర్యాయోక్తము.

క. వితరణఖని[1]యాతిమ్మక్షితిపతిగ్రామణికి దేవకీదేవికి నం
చితమూర్తియీశ్వరప్రభుఁ, డతిపుణ్యుఁడు పుట్టె సజ్జనావనపరుఁడై.

టీ. వితరణఖని = దాననిధి యగు, ఆతిమ్మక్షితిపతిగ్రామణికిన్ = అల్లతిమ్మ భూపాలశ్రేష్ఠునకును, దేవకీదేవికిన్ = దేవకీదేవి యనునతని భార్యకును, అంచితమూర్తి- అంచిత = ఒప్పుచుండెడి, మూర్తి = ఆకారముగల, అతిపుణ్యుఁడు = మిక్కిలిపుణ్యముగల, ఈశ్వరప్రభుఁడు = ఈశ్వరదేవరాయఁడు, సజ్జనావనపరుఁడై = సాధుజనసంరక్షణశ్రద్ధ గల వాఁడై, పుట్టెన్ = జనించెను.

---

1. యత్తిమ్మ.

తా. తిమ్మభూపాలునకును దేవకీదేవమ్మకును నీశ్వరదేవరాయలు పుట్టె నని భావము.

చ. బలమద మత్తదుష్టపుర భంజనుఁడై పరిపాలితార్యుఁడై
యిలఁ బయిఁ దొంటియీశ్వరుఁడె యీశ్వరుఁడై జనియింప రూపఱెన్
జలరుహనేత్రలం దొఱఁగి శైలవనంబుల భీతచిత్తులై
మెలఁగెడుశత్రుభూవరులు మేనులఁ దాల్చినమన్మథాంకముల్. 26

టీ. బల...జనుఁడై - బల=బలముచేతను, మద = గర్వముచేతను, మత్త=మదించిన, దుష్ట=దురాత్ములైనశత్రువులయొక్కయు (రాక్షసులయొక్కయు), పుర = పట్టణములను (త్రిపురములను), భంజనుఁడై=భంగపఱుచువాఁడై. పరి...ర్యుఁడై, పరిపాలిత = సంరక్షణముచేయఁబడిన, ఆర్యుఁడై = పెద్దలుగలవాఁడై, (పార్వతిగలవాఁడై), తొంటియీశ్వరుఁడె=మొదటి యీశ్వరుఁడే (అనఁగా శివుఁడే), ఇలపయిన్ = భూమిమీఁదను, ఈశ్వరుఁడై = ఈశ్వరరాజై, జనియింపన్=పుట్టఁగా, జలరుహనేత్రలన్ = స్త్రీలను, తొఱఁగి=విడిచి, శైలవనంబులన్ = పర్వతారణ్యములయందు, భీతచిత్తులై = భయపడిన మనస్సుగలవారై, మెల...రులు - మెలఁగెడు = సంచరించెడు, శత్రుభూవరులు = శత్రురాజులు, మేనులన్ = దేహములందు, తాల్చి...కముల్ - తాల్చిన= ధరించిన, మన్మథాంకముల్=మదనలాంఛనములు, రూపఱెన్=రూపుమాసెను.

తా. అనఁగా నాయీశ్వరరాజుశత్రువు లకనిదాడికి నిలువం జాలక ప్రియురాండ్రను విడిచి కొండలయందు నడవులయందును భయపడుచుఁ దిరుగు నపుడు, వారి దేహములందలి మన్మథచిహ్నములు మాసె ననియు, నీశ్వరసందర్శనముచే మన్మథచిహ్నములు మాయుట యుక్త మనియు భావము.

ఇందలి విశేషణములు, శివపరముగాను, రాజపరముగాను నన్వయించుటవలన శ్లేషాలంకారముచే ననుప్రాణితమైనరూపకము.

సీ. నిజభుజాశ్రితధారుణీవజ్రకవచంబు, దుష్టభుజంగాహితుండికుండు
వనజేక్షణామనోధనపశ్యతోహరుం, డరిహంసనంసదభ్రాగమంబు
మార్గణగణపికమధుమాసదివసంబు, గుణరత్నరోహణక్షోణిధరము
బాంధవసందోహపద్మవనీహేళి, కారుణ్యరసనిమ్నగాకళత్రుఁ
తే. డన జగంబుల మిగులఁ బ్రఖ్యాతిఁ గాంచె
ధరణిధవదత్తవివిధోపదావిధాన
మార్జితశ్రీవినిర్జితనిర్జరాల
యేశ్వరుఁడు తిమ్మభూపతియీశ్వరుండు. 27

టీ. నిజ...చంబు - నిజ = స్వకీయమగు, భుజ = బాహువును, ఆశ్రిత=ఆశ్రయించిన, ధారుణీ=భూమికి, వజ్రకవచంబు=మగటాలమైమఱువయినవాఁడును, దుష్ట...కుండు, దుష్ట=దుర్మార్గు లనియెడు, భుజంగ=సర్పములకు, అహితుండికుండు = పాములం బట్టెడువాఁడును, వన...హారుండు - వనజేక్షణా = కమలలోచనలగుస్త్రీలయొక్క, మనః=మనస్సు లనియెడు, ధన=ధనములకు, పశ్యతోహారుఁడు=ప్రత్యక్షచోరుఁడును, అరి...మంబు - అరి=శత్రువు లనియెడు, హంస=అంచలయొక్క, సంసత్=సమూహమునకు, అభ్రాగమంబు - అభ్ర=మేఘములయొక్క, ఆగమంబు=కాలమును, (వర్షర్తువనుట), మార్గ...సంబు - మార్గణ=యాచకులయొక్క, గణ = గుంపులనియెడు, పిక = కోయిలలకు, మధుమాస=వసంతమాసముయొక్క, దివసంబు=దినమువంటివాఁడును, గుణరత్నరోహణక్షోణిధరము-గుణ = గుణములనియెడు, రత్న = మణులకు, రోహణక్షోణిధరము=రోహణపర్వతమైనవాఁడును, బాంధ...హేళి - బాంధవసందోహ = బంధుసమూహ మనెడి, పద్మవనీ = కమలవనమునకు, హేళి = సూర్యుఁడును, కారు...కళత్రుఁడు - కారుణ్యరస=కరుణయనునుదకమునకు, నిమ్నగా కళత్రుఁడు=నదీభర్తయగు సముద్రుఁడును, అనన్ = అనఁగా, ధర...రుఁడు - ధరణిధవ=రాజులచేత, దత్త=ఈఁబడిన, వివిధ=పలుతెగలగు, ఉపదా=కానుకలయొక్క, విధా=ప్రకారముచేత, సమార్జిత=సంపాదింపఁబడిన, శ్రీ=సంపదచేత, వినిర్జిత=జయింపఁబడిన, నిర్జరాలయ = స్వర్గమునకు, ఈశ్వరుఁడు = ప్రభువగునింద్రుఁడు గల, తిమ్మభూపతియీశ్వరుండు = తిమ్మభూపాలపుత్రుఁ డగునీశ్వరదేవరాయఁడు, జగంబులన్ = జగత్తులయందు, మిగులన్ = అతిశయించునట్లు, ప్రఖ్యాతిఁగాంచెన్ = కీర్తిఁబొందెను.

ఆలం. సీసపాదములలో మాలారూపకము. గీతమున ఉపమ.

తా. తిరుమలదేవరాయలకుమారుఁడగు నీశ్వరదేవరాయఁడు రాజులవలని కప్పంబులచే నధికసంపద గలవాఁడయి తనయైశ్వర్యముచే నింద్రుని జయించుచుఁ, దనభుజము నాశ్రయించినభూమికి వజ్రకవచం బన దుష్టజను లనుపాములను పాములవానివలెఁ జెండాడుచును, మిగుల సొగసగువాఁడు గావున మగువలమనంబులఁ దనచక్కఁదనంబుచే నాకర్షించుచు, వానకాలము హంసలను దఱిమినట్లు శత్రువులను దఱుముచుఁ, గోయిలలకు వసంతర్తువట్ల యాచకులకుఁ దాను సంతోషకరుండై రత్నంబులు రోహణపర్వతంబునందుంబలె గుణంబులు దనయందు వెలుఁగొంద సూర్యునిఁ గాంచినపద్మవనంబుచందంబునఁ దన్నుం గాంచి చుట్టంబులు ముదంబునం బొదల, సముద్రంబున నెడఁ బడనిజలంబట్ల తనహృదయంబునఁ గారుణ్యరసం బూరుచుండ నేలుచున్నాఁ డని లోకంబులందు విఖ్యాతి వహించెను.

క. ఆయీశ్వరనృపతికిఁ బుణ్యాయతమతి యైనబుక్కమాంబకుఁ దేజ
స్తోయజహితు లుదయించిరి, ధీయుతు[1]లగునారసింహతిమ్మనరేంద్రుల్.

టీ. ఆయీశ్వరనృపతికిన్ = ఆయీశ్వరదేవరాయలకును, పుణ్యాయతమతి యైన = పుణ్యములయందు విశాలమగు మనస్సుగల, బుక్కమాంబకున్ = బుక్కమ్మకును, తేజ...తులు - తేజః = తేజముచేతను, తోయజహితులు = సూర్యులును, ధీయుతులు = బుద్ధిమంతులును, అగు = అయిన, నారసింహతిమ్మనరేంద్రుల్ = నరసింహదేవరాయలును తిరుమలదేవరాయలును, ఉదయించిరి = జననమందిరి. ఈపద్యమున రెండవచరణమందు బుక్కమాంబ యనుచోట నంబాశబ్దభవమైనయమ్మ యనునది తేలఁబలికిన నమయైనది గనుక బుక్కమ యని యుండఁగా దానిపైని మరల నంబాశబ్దము ప్రయోగించినందునఁ బౌనరుక్త్యముగాఁ గానఁబడుచున్నది. ఇందుకు 'ఆర్యాంబాదికశబ్దా స్స్వార్థేత్ర శ్శేషార్థ గోచరాః, తత స్తదంతశబ్దేభ్యో నైవశ్శేషార్థగోచరాః' అని యథర్వణవచనము. ఈ తీరున నున్నను నీప్రకారముగాఁ బ్రయోగించుటకుఁ బూర్వకవిప్రయోగములుగూడఁ గలవు.

తా. ఆటువంటి యీశ్వరరాజునకును, బుణ్యాత్మురాలైన బుక్కమ్మకును, సూర్యునివంటి తేజశ్శాలురును, బుద్ధిమంతులును నగు నరసింహరాజును, తిమ్మరాజును బుట్టిరి.

క. అందు నరసప్రభుఁడు హారి
చందనమందారకుంద చంద్రాంశునిభా
స్పందయశస్తుందిలది
క్కందరుఁడై ధాత్రి యేలెఁ గలుషము లడఁగన్. 29

టీ. అందున్ = వారిరువురందును, నరసప్రభుఁడు = నరసింహదేవరాయఁడు, హారి...రుఁడై - హారిచందన = శ్రీగంధముతోడను, మందార = పారిజాతపుష్పములతోడను, కుంద = మల్లెపువ్వులతోడను, చంద్రాంశు = చంద్రకిరణములతోడను, నిభ = సమానమైనట్టి, అస్పంద = చలింపని, యశః = కీర్తిచేతను, తుందిల = పెద్దకడుపుగల, దిక్ = దిక్కులయొక్క, కందరుఁడై = గుహలుగలవాఁడై, కలుషములు = పాపములు, అడఁగన్ = నశించునట్లు, ధాత్రి = భూమిని, ఏలెన్ = పాలించెను.

తా. వారిద్దఱిలో నరసభూపాలుఁడు హారిచందనాదులతో సమానమైన శుభ్రమైన తన కీర్తి దిగంతములయందు వ్యాపించుచుండఁగాఁ బాపము లడఁగిపోవునట్లు భూమిని బాలించెను. అలం. ఉపమ; వృత్త్యనుప్రాసము.

---

1. లై.

సీ. అంభోధివసనవి । శ్వంభరావలయంబు
ఘనబాహుపురి మర । కతముఁ జేసెఁ
గకుబంతనిఖిలరా । ణ్ణికరంబుఁ జరణమం
జీరంబుసాలభం । జికలఁ జేసె
మహనీయనిజవిని । ర్మలయశస్సరసికి
గగనంబుఁ గలహంస । కంబుఁ జేసె
నశ్రాంతవిశ్రాణ । నాసారలక్ష్మికిఁ
గవికదంబముఁ జాత । కములఁ జేసె
తే. నతిశితకృపాణకృత్తమ । త్తారివీర
మండలేశసకుండల । మకుటనూత్న
మస్తమాల్యపరంపరా । మండనార్చి
తేశ్వరుం డగునారసిం । హేశ్వరుండు. ౬౦

టీ. అతి...రుండు - అతిశిత = మిక్కిలివాఁడి యగు, కృపాణ = ఖడ్గము చేతను, కృత్త = నఱుకఁబడిన, మత్త = మదించిన, అరివీర = శత్రులందువీరులగు, మండలేశ=రాజులయొక్క, సకుండలమకుట = కుండలకిరీటములతోఁగూడిన, నూత్న = నూతనములయిన, మస్త=శిరస్సు లనియెదు, మాల్య = విరిసరములయొక్క, పరంపరా = సమూహముచేతను గలిగిన, మండన = అలంకారముచేతను, అర్చిత = పూజింపఁబడిన, ఈశ్వరుండు=సర్వేశ్వరుఁడు గలిగినవాఁడు, అగు = అయినట్టి, నారసింహేశ్వరుండు = నరసింహదేవరాయఁడు, అంభో...యంబున్ - అంభోధి = సముద్రము, వసన = వస్త్రముగాఁగల, విశ్వంభరా = భూమియొక్క, వలయంబున్ = వలయమును, ఘన...కమున్ - ఘన=గొప్పదైన, బాహుపురి = కేయూరమందలి, మరకతమున్ చేసెన్ = మరకతమణినిఁ జేసెను. (రూపకాలంకారము). కకు...రంబున్-కకుప్=దిక్కులయొక్క, అంత = చెఱంగులయందలి, నిఖిల = సమస్తమయిన, రాట్ = రాజులయొక్క, నికరంబున్ = సమూహమును, చర...కలన్ - చరణమంజీరంబు-చరణ = పాదము యొక్క, మంజీరంబు = గండపెండేరముయొక్క, సాలభంజికలన్ చేసెన్=ప్రతిమలఁ జేసెను, మహ...సికిన్ - మహనీయ = అధికమైయున్న, నిజ = స్వకీయమయిన, నిర్మల=మిక్కిలి శుభ్ర మగు, యశః = కీర్తి యనియెదు, సరసికిన్ = సరస్సునకు, గగనంబున్ = ఆకాశమును, కలహంసకంబున్ చేసెన్ = హంసవిశేషమును జేసెను. (రూపకము. అధికాలంకారము.) అశ్రా...లక్ష్మికిన్ = అశ్రాంత=ఎడతెగని, విశ్రాణన= వితరణ మనియెదు, ఆసార = ధారాసంపాతముయొక్క, లక్ష్మికిన్ = సమృద్ధికి, కవి

కదంబమున్ = కవీశ్వరసమూహమును, చాతకములన్ చేసెన్ = చాతకపక్షులను జేసెను. (రూపకము.)

తా. నరసింహరాయలు యుద్ధరంగమందు బహిరంగముగా నెదిరించిన శత్రువీరుల తలలు మకుటకుండలంబులతోడం గూడఁ దన ఖడ్గంబున ఖండించి, అట్టి శిరంబులనువిరుల సరములచేఁ గఱకంఠుఁడు కపాలమాలాధరుఁడు గనుక నతని నలంకరించుచుఁ, జతుస్సముద్రముద్రితభూవలయంబు ననాయాసంబుగ వహించి పాలించుచు, సమస్త దేశాధీశ్వరులచే మ్రొక్కులు గైకొనుచు, భూమ్యంతరిక్షంబులయందుఁ దన యశంబు నించి యెల్లప్పు డెడతెగని దానంబులచేతఁ గవీశ్వరులకుఁ దృప్తిసేయుచుండె నని భావము.

తే. ఆనృసింహప్రభుండు తిప్పాంబవలన
నాగమాంబికవలన నందనులఁ గాంచె
వీరనరసింహరాయభూవిభుని నచ్యు
తాయతాంశజు శ్రీకృష్ణరాయ నిన్ను. 31

టీ. శ్రీకృష్ణరాయ = కృష్ణదేవరాయా! ఆనృసింహప్రభుఁడు = ఆనరసింహదేవరాయఁడు, తిప్పాంబవలనన్ = తిప్పమ్మాదేవివలన, వీరనరసింహరాయ భూవిభునిన్ = వీరనరసింహరాయలను, నాగమాంబికవలనన్ = నాగమ్మవలన, అచ్యుతాయతాంశజున్ - అచ్యుత = శ్రీకృష్ణునియొక్క, ఆయత = పూర్ణమగు, అంశజున్ = కళచేతను పుట్టినట్టి, నిన్నున్ = నిన్నును, నందనులన్ = పుత్త్రులనుగా, గాంచెన్ = పడసెను.

తా. ఆ నరసింహరాయలకు భార్యలగు తిప్పమ్మ, నాగమ్మ యనువారిలోఁ దిప్పమ్మకు వీరనరసింహరాయలును, నాగమ్మకు కృష్ణాంశసంభూతుఁ డగు కృష్ణదేవరాయలును సుతులైరి.

క. వీరనృసింహుఁడు నిజభుజ,దారుణకరవాలపరుషధారాహతవీ
రారి యగుచు నేకాతప,వారణముగ నేలె ధరనవారణమహిమన్.

టీ. వీరనృసింహుఁడు = వీరనరసింహరాయఁడు, నిజ...రారి - నిజ = స్వకీయమగు, భుజ = భుజమందలి, దారుణ = భయంకరమైన, కరవాల = ఖడ్గముయొక్క, పరుష = కఠినమగు, ధారా = అంచుచేతను, హత = సంహరింపఁబడిన, వీర = వీరులైన, అరి = శత్రువులుగలవాఁడు, అగుచున్, అవారణమహిమన్ - అవారణ = అప్రతిహతమైన, మహిమన్ = మహత్త్వముచేతను, ధరన్ = భూమిని, ఏకాతపవారణముగన్ = ఏకచ్ఛత్త్రము గలుగునట్లుగా, ఏలెన్ = పాలించెను.

తా. వీరనృసింహరాయఁడు తన ఖడ్గముచేత నెదురించిన వీరులగు శత్రువుల నటికి యడ్డములేని విజృంభణముచేత నేకచ్ఛత్రాధిపతియై భూమినిఁ బాలించెను.

క. ఆవిభునంతరంబ ధ
రావలయముఁ బూని తీవు రహిమైఁ దిరుమ
ల్దేవియును నన్నపూర్ణా
దేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులుగాన్. 33

టీ. ఆవి...రంబ - ఆవిభు = ఆవీరనృసింహరాయలయొక్క, అనంతరంబ = తరువాతనే, ఈవు = నీవు, తిరుమల్దేవియున్ = తిరుమలయమయు, అన్నపూర్ణాదేవియున్=అన్నపూర్ణయుం నను, కమలాబ్జముఖులు = కమలములవంటియు, చంద్రునివంటియుం ముఖముగలవారు, దేవేరులు కాన్=పట్టపుదేవులు కాఁగా, ధరావలయమున్= భూవలయమును, రహిమైన్ = సంతోషముచేతను, పూనితివి = వహించితివి.

తా. జ్యేష్ఠుఁ డగు నారసింహరాయలపిమ్మటఁ గృష్ణదేవరాయలు భూభారమును వహించె ననియును, దిరుమల్దేవి, యన్నపూర్ణాదేవి యతనికిఁ బట్టపుదేవు లనియును భావము.

సీ. తొలఁగెను ధూమకేతుక్షోభ జనులకు
నతివృష్టిదోషభయంబు వాసెఁ
గంటకాగమభీతి గడచె నుద్ధతభూమి
భృత్కటకం బెల్ల నెత్తువడియె
మాసె నఘస్ఫూర్తి మరుభూములందును
నెల మూఁడువానలు నిండఁ గురిసె
నాబాలగోపాల మఖిలసద్ద్విజమును
నానంద మగుమన్కి నతిశయిల్లెఁ
తే. బ్రజలకెల్లను గడు రామరాజ్య మయ్యెఁ
జారుసత్త్వాఢ్య! యీశ్వరనారసింహ
భూవిభునికృష్ణరాయ! యభ్యుదయ మొంది
పెంపుతో నీవు ధాత్రిఁ బాలింపఁగాను. 34

టీ. చారుసత్త్వాఢ్య - చారు = ఒప్పిదమగు, సత్త్వ = సాత్త్వికగుణముచేతను, బలముచేతను, ఆఢ్య = ఘనుఁడవైనవాఁడా! ఈశ్వ...రాయ - ఈశ్వరనారసింహభూవిభుని=ఈశ్వరరాయలపుత్త్రుఁ డగునారసింహరాయల తనయుఁడవగు, కృష్ణరాయ=కృష్ణదేవరాయా! నీవు, అభ్యుదయమొంది = శ్రేయస్సునుజెంది, ధాత్రిన్ =

భూమిని, పాలింపఁగాను = పాలించుచుండఁగా, జనులకున్ = ప్రజలకు, ధూమ...క్షోభ - ధూమకేతు = తోఁకచుక్కవలని, క్షోభ = దుర్భిక్షము, తొలఁగెను = లేదాయెను. అతివృష్టిదోషభయంబు = అధికవర్షదోషమువలని వెఱపు, పాసెన్=వదలెను. కంట...భీతి - కంటక = క్షుద్రవైరిరాజులయొక్క, ఆగమ = రాకవలని, భీతి = భయము, కడచెన్ = అతిక్రమించెను. ఉద్ధత...బెల్లన్ - ఉద్ధత = గర్వించిన, భూమిభృత్ = రాజులయొక్క, కటకంబు ఎల్లన్ = రాజ్యమెల్లను, ఎత్తువడియెన్ = బలహీనమయ్యెను. అఘస్ఫూర్తి - అఘ=పాపములయొక్క, స్ఫూర్తి = అతిశయము, మాసెన్ = రూపుసెడియెను. మరుభూములందును = నిర్జలభూములయందును, నెల మూఁడువానలు = నెలకు మూఁడేసివానలు, నిండన్ = పరిపూర్ణమగునట్లు, కురిసెన్= వర్షించెను ('మరుభూములందును' అను సముచ్చాయకద్రుతసారస్యమువలన ఫలవద్భూములందు సైతము పది దినముల కొక్క వర్షము గురియుం ననుట). ఆబాలగోపాలము = బాలురు గోపాలురు మొదలుగా, అఖి...మును-అఖిల = సమస్తములగు, సత్=సజ్జనుల యొక్క, ప్రజమును=సమూహమును, ఆనంద మగు=సంతోషముగల, మన్కిన్=బ్రదుకు చేతను, అతిశయిల్లెన్ = అధికమయ్యెను. ప్రజలకెల్లను = సమస్తజనులకును, కడున్ = మిక్కిలి, రామరాజ్యము అయ్యెన్ = బాలమరణాదిపీడలులేని శ్రీరామరాజ్యమువలె నయ్యెను.

తా. కృష్ణదేవరాయలు శ్రేయస్సు గలిగి రాజ్య మేలుచుండఁగా, భూమిపై జనులకు దుర్భిక్షభయమును, అతివృష్టిభయంబు ననావృష్టిభయంబు మొదలగునీతిబాధలు లేవనియును, తగిన కాలములయందుఁ గావలసినంత వానలు గురియుచుండె ననియును, పరరాజులు దాడి సేయ రనియును, బాలురు వృద్ధులు గోపకులు మొదలుగా నెల్ల వారలును నిరంతర సంతోషంబుఁ గాంతు రనియును, బాలమరణాదిదోషంబులు లేక శ్రీరామరాజ్యమై యుండె ననియును భావము.

క. తునియలు తొమ్మిదియఁట పదు
నెనమండ్రఁట మోచువా ర నేకపకిటికూ
ర్మనగాహు [1]లేటిలావరు
లని తావక బాహు[2]వొకఁడ యవని భరించెన్. 35

టీ. తునియలు = భూఖండములు, తొమ్మిది అఁట = నవసంఖ్యాకంబులఁట, మోఁచువారు=వహించెడువారు, పదునెనమండ్రఁట=అష్టాదశసంఖ్యాకులఁట. అనే...

1. లెంతలావరు. 2. వొకటి.

హులు - అనేకప = (రెంటఁబానము చేసెడి) దిగ్గజము లెనిమిదియును, కిటి=వరాహ మొక్కండును, కూర్మ = ఆదికూర్మ మొక్కండును, నగ = కదలనికుల పర్వతంబు లేడును, అహులు=శేషుఁడొక్కండును, (ద్వంద్వాంతమున బహువచనము) వీరు, ఏటి లావరులు = ఏపాటిబలవంతులు అని, తావక=నీసంబంధ మగు, బాహువు ఒకఁడ=భుజ మొక్కఁడే, అవనిన్ = భూమిని, ధరించెన్ = పూనెను.

తా. కృష్ణదేవరాయలభుజము మున్ను భూభారమును వహించియున్నవారగు గజ, వరాహ, కమఠ, కులపర్వత, శేషులను లెక్కించి పదునెనమండ్రని యెఱింగి, భూభాగములు లెక్కించి భరతఖండాదినవఖండంబు లని తెలిసి, యొక్కొక్క ఖండం బిద్దఱిద్దఱు వహించుచున్న ట్లూహించి వార లెట్టిబలవంతు లని యెగ్గించి యట్టితొమ్మిది ఖండంబులు గలభూమండలం బొంటియుఁ దానే వహించె నని భావము. ఈ పద్యంబు నందలి 'యఁట' శబ్దద్వయం బనంగీకారార్థకం బై యున్నది.

సీ. తొలుదొల్త నుదయాద్రి ♦ శిలఁ దాఁకి [1]తీండ్రించు
నసిలోహమున వెచ్చ ♦ నై జనించె
మఱి కొండవీఁ డెక్కి ♦ మార్కొని నలియైన
యలకసవాపాత్రు ♦ నంటి రాఁజె
నట సాఁగి జమ్మిలో ♦ యఁ బడి[2]వేఁగి దహించెఁ
గోనఁ బిట్టేర్చెఁ ♦ గొట్టానఁ దగిలెఁ
గనకగిరిస్ఫూర్తిఁ ♦ గరఁచె గౌతమిఁ గ్రాఁచె
నవల నాపొట్నూర ♦ రవులుకొనియె
తే. [3]మాఁడెములు వ్రేల్చె [4]నొడ్డాది ♦ మసి యొనర్చెఁ
గటకపురిఁ గాల్చె గజరాజు ♦ గలఁగి పఱవఁ
దోఁక చిచ్చన నౌర నీ ♦ దురవగాహ
ఖేలదుగ్రప్రతాపాగ్ని ♦ కృష్ణరాయ. 36

టీ. కృష్ణరాయ=కృష్ణరాయభూపాలా, నీదు...పాగ్ని - నీ=యొక్క, దురవగాహ = ప్రవేశింపశక్యముగానియట్లు, ఖేలత్ = క్రీడించుచున్న, ఉగ్ర=తీక్ష్ణమగు, ప్రతాప=ప్రతాపమనియెడు, అగ్ని=నిప్పు, తోఁకచిచ్చుఅనన్=దీర్ఘవహ్నిజ్వాలయో యన్నట్లు, తొలుదొల్తన్ = ప్రప్రథమమందు, ఉదయాద్రిశిలన్ = ఉదయగిరిదుర్గ

1. కెరలునీ, యసిలోహ. 2. వేగ. 3. మాడుగులవ్రేల్చె నొడ్డాది మసి యొనర్చె. 4. నొడ్డాణి.

మనియెడు చెకుముకిఱాతిని, తాఁకి=స్పృశించి, తీండ్రి...నన్ - తీండ్రించు = జ్వలించెను, అసి=ఖడ్గ మనియెడు, లోహమునన్=అగ్నిజననకారణ మగునయఃపత్త్రికయందు, వెచ్చనై=వేడిమిగలదియై, జనించెన్ = అంకురించెను, (శిఖిముఖాశిలయును లోహపత్త్రికయుం నొరసినప్పుడు నిప్పుపుట్టు ననుట), మఱి = పిమ్మట, కొండవీడు = కొండవీటిదుర్గమును, ఎక్కి=ఆరోహించి, మార్కొని=ప్రతిఘటించి, నలిరైన = నలఁగియున్న, అల=అప్రసిద్ధుండగు, కసవాపాత్రున్=కసవాపాత్రుఁ డనువానిని, (నలిరైన=నలఁగిన, కసవాపాత్రున్ = కసవాపాత్రుఁ(డనుకసవును), అంటి=తాఁకి, రాఁజెన్=పొగసెను. (ఆనిప్పు నలఁగిన కసవుపైఁ బడినప్పుడు రాఁజు ననుట). అటన్ = అచ్చట, సాఁగి=వెడలి, జమ్మిలోయన్ పడి = జమ్మిలోయ యనుప్రదేశము ప్రవేశించి, (జమ్మిచెట్లు గల బొటియలోఁ బడియును), వేఁగిన్ = వేఁగినాడును, దహించెన్ = కాల్చెను. (వేఁగి=ప్రకాశించి, కాల్చె ననుట), కోనన్ = కోనసీమను, బిట్టు = కఠినముగా, ఏర్చి = కాల్చి, కొట్టానన్ తగిలెన్ = ఘోట్టాణ మనుదేశమం దంటుకొనియెను. (జమ్మిచెట్లు గాల్చి యాయగ్ని కొట్ట మనఁగా శాల గావున దాని నంటికొనె ననుట), కనకగిరి = కనకదుర్గముయొక్క, స్ఫూర్తిన్ = ఆధిక్యమును, కరఁచెన్ = కరఁగఁజేసెను. (అగ్ని వలన బంగారము గరఁగు ననుట), గౌతమిన్ క్రాఁచెన్ = గోదావరిని దపింపఁజేసెను, (అగ్నివలన జలంబులు తప్తము లగు ననుట), అవలన్ = అనంతరమందు, ఆపొట్టునూరన్ = పొట్టునూరు అనుప్రదేశమందు, రవులుకొనియెన్ = ప్రజ్వలించెను. (అగ్ని పొట్టుమీఁదఁ బడినప్పుడు రగులుకొను నమట). మాఁడెములు ప్రేల్చెన్ = మాఁడెములనియెడుమన్నెపుదేశములు కాల్చెను, ఒడ్డాది = ఓఢ్రదేశమును, మసియొనర్చెన్ = భస్మసాత్కృతముఁగావించెను. (అనఁగా బుగ్గిచేసె ననుట), కటకపురిన్ = కటకమను పట్టణమున, గజరాజు = గజపతి, కలఁగి = కలఁతపడి, పఱవన్ = పలాయితుఁడు కాఁగా, కాల్చెన్ = దహించెను. కటకపురిన్ = పురివంటిగిరినితంబమును, గజరాజు= పర్వతమందలి గజశ్రేష్ఠము, పఱవన్ = మంటఁ జూచి పఱుగులిడునట్లు, కాల్చెన్ = తగులఁబెట్టెను.

తా. కృష్ణదేవరాయలప్రతాపము ప్రథమమం దుదయగిరిదుర్గ మాక్రమించి, పిమ్మటఁ గొండవీటిదుర్గముమీఁది కేఁగి కసవాపాత్రుని సంహరించి, యచ్చటనుండి వెడలి జమ్మిలోయమీఁద నేఁగి వేఁగిదేశము నాక్రమించి, కోనసీమఁ గైకొని కొట్టము గ్రహించి, కనకదుర్గమును బాడుఁజేసి గోదావరిని దపింపఁజేసి పొట్టునూర వ్యాపించి మన్నెపు దేశము లాక్రమించి యోఢ్రదేశమును జయించి గజపతి భయంపడి పఱచునట్లు కటకపురి నాక్రమించె ననియును, ఆప్రతాప మగ్నివలె నుండె ననుటవలన

నయ్యగ్ని యుదయగిరి యనుచెకుముకిశిలఁ దాఁకి కత్తియనెడుచెకుముకి కత్తియందుఁ దొలుతఁ బుట్టి కొండవీఁ డనుకొండ యెక్కి నలియైనకసవాపాత్రుఁ డనుకసవు నంటి రాఁజుకొని జమ్మిచెట్లమీఁద వేఁగిచెట్లమీఁదఁ బడి దహించి కొట్ట మంటుకొని కనకదుర్గ మనుకనకమును కరఁగఁజేసి గోదావరిలోనియుదకములుఁ గ్రాఁగఁజేసి పొట్టునూ రను పొట్టుమీఁదఁ బ్రజ్వరిల్లి యావలఁ గటకపురి యనుకొండదరియందుఁ జేరి యచ్చట నివసించుచున్నయేనుఁగు పాఱిపోవున ట్లాప్రదేశమును దహించె నని యచ్చటచ్చట నుండెడు శబ్దములవలన రూపకాలంకారమును, ధ్వన్యలంకారమును దోఁచుచున్నవి.

ఉ. చిత్రము కృష్ణరాయనృపశేఖర నీదగుధాటి కోడి స
ర్వత్ర నిలింపకామినులవాడకుఁ గాఁపులు వోదు రుత్కల
క్షత్త్రియపాత్రు లెల్లఁ గసుగందని[1] మేనులఁ దొంటిపెద్ద లే
సూత్రముఁ బన్నినారొ బలసూదనువీఁటికిఁ గొండవీఁటికిన్. 37

టీ. కృష్ణరాయనృపశేఖర = ఓకృష్ణరాయభూపాలశ్రేష్ఠుఁడా! నీదగు = నీ సంబంధమగు, ధాటికిన్ = ఔద్ధత్యముచేత, (ఇది విభక్తివ్యత్యయము), ఓడి = హతులై, సర్వత్ర = అన్నిదేశములరాజులు నిలింపకామినులవాడకున్ = అప్సరస్త్రీలవాడకు, (అనఁగా స్వర్గమన కనుట. యుద్ధములోఁ జచ్చినవారు స్వర్గమందలి యచ్చరల యిండ్లకుఁ బోవుదు రని వర్ణించుట కవిసంప్రదాయము,) కాఁపులు వోదురు = కాఁపురముగాఁ బోవుదురు. నీదగు=నీసంబంధియగు, ధాటికిన్=దాడివెట్టుటకు, ఓడి = భయంపడి, ఉత్క...లెల్లన్ - ఉత్కల = ఓఢ్రదేశమందలి, క్షత్రియపాత్రులెల్లన్ = పాత్రనామధేయు లగురాజు లందఱును, కసుగందని=లేఁతదనముసెడనియట్టి, (కసువు చేతఁ గందని యని మఱియొక యర్థము). మేనులన్ = శరీరములచేతను, నిలింప కామినుల=దేవతాస్త్రీలయొక్క, వాడకున్ = పట్టణమునకు, కాఁపులువోదురు=కాఁపురము లేఁగుదురు. తొంటిపెద్దలు=పూర్వపుఁబెద్దలు, బలసూదనువీఁటికిన్ = ఇంద్రపట్టణమగు స్వర్గమునకును, కొండవీఁటికిన్=కొండవీఁడనుపట్టణమునకు, ఏసూత్రమున్=ఎట్టి సూత్రమును, పన్నినారొ = కల్పించినారో, చిత్రము = ఆశ్చర్యము.

తా. కృష్ణరాయనృపశేఖరా! నీవు దాడి వెడలినప్పు డుత్కలదేశపు రాజులు భయపడి గఱిచిట్లనిశరీరములతోడన దేవతాస్త్రీ లున్నపట్టణమునకుఁ గాఁపురములు వోయెదరు; స్వర్గమునకును, గొండవీటికిని బూర్వపుఁ బెద్ద లేమిసూత్రముఁ బన్నిరో కదా! ఇది చిత్రము - అనఁగా లోకములో రణరంగమం దెదిరించి శత్రుశరముల

---

1. లాగుల.

ఫలనిట్లొమ్ముగాయములతోడిశరీరము లిచ్చుట విడిచినవారికే వీరస్వర్గము గలుగుఁ గాక! పిఱికితనంబునఁ బఱచినవారికి స్వర్గ సౌఖ్య మె ట్లబ్బును? సశరీరస్వర్గ మెట్లు గల్గు నని శంక రాఁగాఁ గృష్ణదేవరాయలదాడి విన్నమాత్రముననే ఉత్కలదేశస్థు లగు రాజులు భూరి గఱచి గాయ పడని దేహముతోఁ గొండవీఁడు వదలి రాజమహేంద్ర వరమునకు సమీపమందలికిరాతస్త్రీలపల్లెకుఁ గాఁపులుగాఁ బోదు రని భావము. కసువు గఱచినవారిని గొట్టఁగూడ దని యుద్ధధర్మము. నిలింపశబ్దము - 'స్యా న్నిలిమ్పః కిరాతశ్చ' యనియు, 'నిలిమ్పా దేవశబరా' అనియు నున్న నిఘంటువులవలన దేవతార్థకము, గిరాతార్థకము నవుటంజేసి యాశబ్దముమీఁదను బలసూదనువీఁ డనుశబ్దము మీఁదను శ్లేష కలిగి యిట్టి యర్థము వచ్చునట్లు చమత్కరింపఁబడియెను. ఇట బల సూదనువీఁ డనఁగా నమరారామ మని కొంద ఱందురు.

ఉ. కూరిమిఁ గృష్ణరాయనృపకుంజర చేరెఁ గళింగరాజ్యల
క్ష్మీరమణీలలామ నిను ౹ మిన్నులు ముట్టినమోహనాలతోఁ
గారణ మట్ల లక్ష్మి కసు ౹ గందనివేడుకఁ గృష్ణరాయనిం
జేరనకాక వావి [1]సెడఁ ౹ జెందునె సోదరుఁ డైనరుద్రునిన్. 33

టీ. కృష్ణరాయనృపకుంజర = కృష్ణరాయభూపాలశ్రేష్ఠుఁడా! కళింగరాజ్య లక్ష్మీరమణీలలామ = కళింగదేశరాజ్యలక్ష్మియనెడుపొలఁతిమిన్న, కూరిమిన్ = ప్రేమ చేతను, మిన్నులుముట్టిన=ఆకాశమంటిన, మోహనాలతోన్=ఏనుఁగులతో, (కళింగపతి గజపతి గనుక నని భావము. మోహనా లనఁగాఁ గోటయందలిశత్రునిరసనసాధనము లని కొంద ఱందురు. ఆపక్షమున వానిఁ బెఱికి తెచ్చినాఁ డని భావము.) మోహనాల తోన్ = మోహములతో, నినున్ చేరెన్ = నిన్నుఁ బొందెను, (హేతూత్ప్రేక్ష.) కారణమట్ల = ఆక్రమముననే హేతువు, లక్ష్మి = శ్రీదేవి, కృష్ణరాయనిన్ = శ్రీకృష్ణ దేవుని, కసుగందని=వాడిపోవని, వేడుకన్=ప్రీతిచేతను, చేరనకాక = పొందునేకాని, సోదరుఁ డైన=సహోదరుఁడగు, రుద్రునిన్=రుద్రదేవుని, వావిసెడన్ = వరుస చెడి పోవునట్లు, చెందునె = చెందునా, చెంద దనుట. (రూపకము.)

తా. కృష్ణరాయా! కళింగరాజ్యలక్ష్మి యతిప్రేమచేతను నిన్నే చేరెను గాని ప్రతాపరుద్రునిఁ జేరకపోయెను. ఏల యనఁగా నాకళింగరాజ్యలక్ష్మి లక్ష్మి యనునామ మును వహించుటంజేసి తనకుఁ బ్రియుఁ డగుకృష్ణనామము వహించిన నిన్నే చేరును గాని తనకు సోదరుఁ డగురుద్రునినామము వహించినప్రతాపరుద్రునిఁ బొంద దని భావము. లక్ష్మీదేవికి రుద్రదేవుఁడు సోదరుఁ డౌట యాగమప్రసిద్ధము.

---

1. చెడి.

సీ. కచసక్తఫణికంచుకము మౌళి వీరకే
దారంపుఁబాగ చందంబు నొందఁ
గలయ నంగమున మర్కటకీటకృత మైన
మగ్గంబు నేత్రసంపద వహింప
ధ్వాంతగహ్వరశిలాతాడితాళికచిక్క
ణాస్రపంకము చంద్రమై పొసంగఁ
దనుభృశశ్రాంతవేష్టనలగ్నబర్హిబ
ర్హాంబు మువ్వన్నెచుంగై చెలంగ
తే. నిద్రమేల్కాంచి సెలయేట నీడఁ గాంచి
గోపవేషంబు చెడి తొంటి భూపవేష
మగుట యవ్వనమహిమఁగా నలికి యచటు
విడుచు గజరాజు నీథాటి [1]వింధ్యవాటి. 39

టీ. కచ=జుట్టునందు, సక్త = తగులుకొన్న, ఫణికంచుకము = పాఁపకుబుసము, మౌళిన్=శిరస్సునందు, వీరకేదారంపు=వీరకేదార మనియెడిపేరుగల, పాగ=ఉష్ణీషము యొక్క, చందంబున్ = రీతిని, ఒందన్ = పొందఁగా, కలయన్ = కలియునట్లు, (అంతట ననుట), అంగమునన్ = శరీరమునందు, మర్కటకీట = సాలెపుర్వుచేతను, (ని. 'లూతాస్త్రీతన్తువాయోర్ణనాభమర్కటకాస్సమాః' అమ.), కృత = చేయఁబడిన, మగ్గంబు=తంతురచన, నేత్రసంపదన్ - నేత్ర = వలిపెంపువలువయొక్క, సంపదన్= సంపత్తును, వహింపన్ = తాల్పఁగాను, (ని. 'స్యాజ్జటాంశుకయోర్నేత్రమ్' అమ.), ధ్వాంత...కము-ధ్వాంతగహ్వర = చీఁకటిగుహయందలి, శిలా=ఱాతిచేతను, తాడిత = పొడువఁబడిన, అళిక = నొసటియందలి, (ని. 'లలాటమళికంగోధిః' అమ.), చిక్కణ= దట్టమయిన, అస్ర = రక్తముయొక్క, పంకము = బురద, చంద్రమై = చెందిరమై, (సిందూరమై యనుట), పొసంగన్=ఒప్పుచుండఁగా, తను...ర్హాంబు-తను = శరీరము యొక్క, భృశ=అధికమగు, శ్రాంత=బడలికచేతనైన, వేష్టన=పొర్లాడుటచేతను, లగ్న= కలిచుకొన్న, బర్హిబర్హాంబు = నెమ్మిపురి, మువ్వన్నెచుంగై = మూఁడువర్ణము లనఁగా, నీల రక్త పీతవర్ణములు గల యుత్తరీయపుఁజెఱఁగై, చెలంగన్=ప్రకాశించుచుండఁగా, నిద్రమేల్కాంచి=నిద్దురమేల్కని, సెలయేటన్=కొండవాఁకయందు, నీడన్ కాంచి = నీడఁజూచుకొని, గోపవేషంబు=తాను ధరించిన గొల్లనివేషము, చెడి=పోయి, తొంటి =

1. వింధ్యశిఖరి.

పూర్వము తనకున్న, భూపవేషము = రాజవేషము, అగుట = సంభవించుట, అవ్వన మహిమంగాన్ = ఆవనసంబంధియయిన మహిమచేత నని, (శంకించి యనుట), అలికి = భయపడి, గజరాజు = గజపతి, నీధాటికిన్ = నీదాడిచేతను, వింధ్యవాటిన్ = వింధ్య పర్వతప్రాంతమందు, అచటు = తా నున్నయాప్రదేశమును, విడుచున్ = వదలును. అలం. భ్రాంతిమంతము.

తా. నీవు దాడి వెడలినప్పుడు గజపతి భయపడి కళింగదేశము విడిచి వింధ్య పర్వతమునకు వలస పోయి, యచ్చటం బసులం గాచువానిరూపముతో నొకయరణ్యము లోని చీంకటిగుహలోం బ్రవేశించి వడివడిగాం బోవుచుండ, నాగుహలో నున్న యొక్కతాయి నొసలు దాంకెను. దానివలనం గ్రొత్తనెత్తు రొలికి పేరుకొనియెను. తత్ప్రదేశంబుననే యాయాసముచేత నిదురించి మేలుకొని యాసమీపమందుం బ్రవహించెడుసెలయేటినీడలో నీడం జూచుకొని తాను నిద్రవోవుచుండంగా నాగుహలో నుండెను పాంపకుబుసము జుట్టునకుం గఱచుకొనెను గావున, నది యతండు గానక భయభ్రాంతిచేత నుష్ణీష మనియును, దాను నిద్రించునప్పుడు తద్గుహలో నొక్కసాలెపురుగు తనమీంద మగ్గంపునేత నేయంగా నది రవసెల్లా యనియును, మున్ను చెప్పంబడిన నొసటిగాయము సిందూరపుందిలక మనియును, ఆగుహలోం దాను మిక్కిలి బడలికచేతం బొర్లాడుటంజేసి చెమర్చి యున్నతనశరీర మెల్ల నంటికొన్ననెమలిపింఛము చిత్రవస్త్ర మనియును, భ్రమాత్మికజ్ఞానమును బొంది తాను గుహలోం బ్రవేశించునప్పుడు వహించి యున్నగోపాలవేషము రూపుచెడి తొల్లిడిభూపాలవేషము వచ్చెనే యిది యీవన మాహాత్మ్యముచేతం గాంబోలు ననియు వగచి, యావేషముతో, నచ్చట నివసించుటకు నీవలనిభయముచే నిచ్చగింపక యావలం గదలు నని భావము.

చ. అభిరతిం గృష్ణరాయ విజ ౹ యాంకము లీవు లిఖించి తాళస
న్నిభముగం బొట్టునూరికడ ౹ నిల్పినకంబము సింహభూధర
ప్రభుతిరునాళ్లకుం డిగుసుర ప్రకరంబు కళింగమేదినీ
విభునపకీర్తికజ్జలము ౹ వేమఱుం బెట్టి పఠించు నిచ్చలున్. 40

టీ. కృష్ణరాయ = కృష్ణదేవరాయా, విజయాంకములు - విజయ = గెలుపునకు సంబంధించిన, అంకములు = బిరుదములను, ఈవు = నీవు, లిఖించి = వ్రాసి, పొట్టునూరికడన్ = పొట్నూరిసమీపమునందు, తాళసన్నిభముగన్ = తాటిచెట్టుపొడవునకు సమానమగు నట్లు, నిల్పిన = నాటించిన, కంబము = స్తంభము, సింహ...ళ్ళకున్ - సింహభూధర ప్రభు=సింహాచలస్వామియొక్క, తిరునాళ్ళకున్ = బ్రహ్మోత్సవమునకు. డిగు=దిగివచ్చెడు, సురప్రకరంబు=దేవసమూహము, కళిం...లము-కళింగమేదినీవిభు =

కళింగదేశాధీశ్వరుం డగుగజపతియొక్క, అపకీర్తి=అపయశస్సనెడు, కజ్జలము=కాటుక నీరు, వేమఱున్ = పలుమాఱును, పెట్టి = కప్పువేసి, నిచ్చలున్ = నిత్యమును, అభిరతిన్ = ఆసక్తిచేతను, పఠించున్ = చదువును.

తా. నీవు విజయశాసనములు వ్రాయించి పొట్నూరియొద్ద నాటించినజయస్తంభమునందలి యక్షరములు తెన్నుగా నగపడమిం జేసి గజపతియపకీర్తి యనెడునల్లని కప్పువేసి దేవతలు సింహాచలస్వామితిరునాళ్ళకు వచ్చినప్పుడెల్ల మిక్కిలి యాసక్తిచేతఁ జదువుదు రని భావము. (తాటియాకులమీఁద వ్రాయఁబడిన యక్షరములు స్పష్టముగా నగపడనిచో నల్లని రంగుఁబూసి చదువుచుండుట ప్రసిద్ధము.) అట్లే శాసనములను గూడఁ బఠింతు రని భావము. అలం. అతిశయోక్తి - రూపకము అంగము.

సీ. సనకాదిదివిజమ § స్కరిఫాలగోపిచం
దనపుండ్రవల్లిక § ల్నాకి నాకి
సెలసి హాహాహూహూవు § వులచంపియలతంత్రి
త్రెవ్వ సింగిణులుగాఁ § దివిచి తివిచి
సప్తర్షికృతవియ § ఝ్ఝరవాలుకాలింగ
సమితి ముచ్చెలకాళ్లఁ § జమరి చమరి
రంభాప్రధానాప్స § రగపృథూరోజకుం
భంబు లెచ్చటఁ గన్నఁ § బట్టి పట్టి
తే. తిరుగు హరిపురిసురతరు § సురల మరగి
బహుళహళహళి[2]భరితక § ల్బరిగనగర
సగరపురవరపరిబృఢ§జవనయవన
పృతన భవదసి ననిఁ దెగి § కృష్ణరాయ. [1]1

టీ. కృష్ణరాయ = కృష్ణదేవరాయా! బహు...తన-బహుళ = దట్టమైన, హళహళి=హాలాహాలిచేతను, భరిత=నింపఁబడిన, కల్బరిగనగర=కల్బరిగపట్టణముయొక్కయు, సగరపురవర - సగర = సగరునియొక్క, పురవర = పట్టణశ్రేష్ఠ మగు నయోధ్యయొక్కయు, పరిబృఢ = దొరలయిన, జవన = వేగముగల, యవన=తురకలయొక్క, పృతన=సైన్యము, అనిన్ = యుద్ధమునందు, భవదసిన్-భవత్ = నీయొక్క, అసిన్= ఖడ్గముచేతను, తెగి = ఖండింపఁబడి మృతినొంది, హరి...రలన్ - హరి=దేవేంద్రుని యొక్క, పురి = పట్టణమగు నమరావతియందలి, సురతరు = కల్పవృక్షములయందలి,

1. నుతి. 2. భృతకలబ.

సురలన్=మద్యములను, మరగి=అలవాటు చేసికొని, సన...వల్లికల్-సనకాది = సనకస నందసాదులగు, దివిజమస్కరి = దేవమునులయొక్క, (ని. 'భిక్షుః పరివ్రా ట్కర్మన్దీ పారాశర్యపి మస్కరీ', అమ.)-ఫాల=లలాటములయందలి, గోపిచందన=మృద్విశేషము యొక్క, పుండ్రవల్లికల్ = తీఁగెలవంటి యూర్ధ్వపుండ్రములను, నాకినాకి = మాటి మాటికిని నాలుకలతో నాకివైచి, హాహా...తంత్రి - హాహాహూహూవుల = హాహా హూహూవు లనెడు దేవగాయకులయొక్క, దండియల = వీణలయొక్క, తంత్రి=తంతు వులు, త్రెవ్వన్ = తెగిపోవునట్లు, నెలసి=గుంజుకొని, సింగిణిలుగాన్ = ధనుస్సులగు నట్లు, తివిచి తివిచి = ఆకర్షించి యాకర్షించి, సప్త...సమితిన్ - సప్తర్షి = సప్త మహర్షులచేతను, కృత = చేయఁబడిన, వియత్ఝర = ఆకాశగంగయందలి, వాలుకా లింగ = సైకతలింగములయొక్క, సమితిన్ = సమూహమును, ముచ్చెలకాళ్లన్ = ముచ్చెలుదొడిగియున్న కాళ్ళచేతను, చమరిచమరి = తాచితాచి, రంభా...భంబుల్ - రంభాప్రధాన = రంభమొదలుగాఁగల, అప్సరః = అచ్చరలయొక్క, పృథు = పెద్దవి యగు, ఉరోజకుంభంబులు = కుండలవంటి స్తనములను, ఎచ్చటన్ కన్నన్=ఎక్కడఁ జూచినను, పట్టిపట్టి = పట్టుకొని పట్టుకొని, తిరుగున్ = సంచరించును.

తా. కృష్ణరాయా! అధిక కోలాహలధ్వని గల కల్బరిగపట్టణముయొక్కయు, నయోధ్యయొక్కయు నాథులగు తురకల సేనాజనులు యుద్ధమునందు నీఖడ్గప్రహారము చేత మృతులై స్వర్గమందుఁ జేరియును దొల్లి వారు భూమిపై నున్నప్పటివలెనే యచ్చటను గల్పవృక్షమద్యములు పానము సేయుచును, దేవమునుల గోపిచందనపుండ్ర ముల నాకుచును, మొఱకుఁదనము చేత గంధర్వుల వీణలు తాము లాఁగికొని విండ్లువంచి నట్ల వంచుచును, సప్తమహాముని లాకాశగంగాతీరములఁ జేయుచున్న సైకతలింగముల రూపుమాపుచును, రంభ మొదలగు నచ్చరగబ్బిగుబ్బలఁ బట్టుకొనుచుఁ బూర్వప్రకృతి వాసన వదలక తిరుగుచున్నా రని భావము. అలం. స్వభావోక్త్యతిశయోక్తులకు సంకరము.

మ. అలుక న్ఘోటకధట్టికాఖురపుటీహల్యన్ ఖురాసానిపు
చ్చలు వో దున్ని చలచ్చమూగజమదాసారప్లుతి న్గీర్తి పు
ష్కలసస్యం బిడి యేకధాటి భళిరా కట్టించి తౌ దృష్టి కే
దులఖా నోగ్రకపాల మర్థపహరిద్యూభాంగలశ్రేణికిన్. 42

టీ. అలుకన్ = కోపముచేతను, ఘోట...హల్యన్ - ఘోటక = గుఱ్ఱముల యొక్క, ధట్టికా=దండుయొక్క, ఖురపుటీ=దొప్పలవంటి గిట్ట లనియెడు, హల్యన్= నాగళ్లగుంపుచేతను, ఖురా...చ్చలు - ఖురాసాని = ఖురాసానిదేశస్థులగు మ్లేచ్ఛ లని

యెదు, పుచ్చలు=పుచ్చచెట్లు (ఖురాసానిపుచ్చ లనఁగాఁ దురకల కభీష్టము లైనయా దేశపుఁ బుచ్చచెట్లనియును జెప్పవచ్చును), పోదున్ని = చెదఁదున్ని, చల...ప్లుతిక్ - చలత్=నడుచుచున్న, చమూ = సేనయందలి, గజ = ఏనుంగులయొక్క, మదాసార= మదధారాసంపాత మనియెద్దు ధారావర్షముచేత, ప్లుతిక్=తమపుటచేత నయిన పదను చేతను, కీర్తి...స్యంబు - కీర్తి=యశ స్సనియెదు, పుష్కల=సమృద్ధమగు, సస్యంబుక్= పైరును, ఇడి=ఉనిచి, ఏకధాటిక్ - ఏక=ముఖ్యమగు, ధాటిక్ = దాడిచేతను, దృష్టి కిక్ = వెఱబొమ్మకొఱకు, ఏదు...లమూక్ - ఏదులఖాన = ఏదులషా అను మ్లేచ్ఛుని యొక్క, ఉగ్ర = భయంకర మగు, కపాలమూక్=పుఱకను, అర్థ...ణికిక్ - అర్థప = కుబేరునియొక్క, హరిత్=దిక్కుయొక్క, భూ=భూమియందలి, జాంగల = మెట్టచేల యొక్క, శ్రేణికిక్ = పంక్తియందు, కట్టించితి = కట్టించితివి, ఔర్ భళిరా = ఔరా ఆశ్చర్యము.

తా. కృష్ణదేవరాయా! నీ వుత్తరదేశమందు గుఱ్ఱపు దండుతో వెడలి ఖురా సాను లను మ్లేచ్ఛుల నశింపఁజేసి యచ్చట నీకీర్తి నిలిపి, యేదులషా అను పేరు గల మ్లేచ్ఛునితల నటికి ప్రేలఁ గట్టించితివి గావున నది యాదేశమందు మొలవవేయఁబడిన నీకీర్తి యనెడు పైరుగల మెట్టచేలకు దృష్టిపరిహారార్థముగా నెత్తించిన తలపుట్టియవలె నుండెను. ఏమాశ్చర్యము! అలం. రూపకము.

చ. సుమతిఁ బునఃపునారచితషోడశదానపరంపరావసం
తముల ననంతవిత్తము[1]న ననంత ననంతమహాగ్రహారబృం
దమును నొసంగుని న్నొఱసితా రెన రాక కదా నిలింపభూ
జములు వహించు దుర్యశము షట్పదకోకిలకైతవంబునన్. 43

టీ. సుమతిక్ = మంచిమనస్సుచేతను, పునః...లక్ - పునఃపునః=మాటిమాటి కిని, రచిత = చేయఁబడిన, షోడశదాన = పదియాఱుదానములయొక్క, పరంపరా = సమూహ మనియెదు, వసంతములక్=వసంతకాలములయందు, (రూపకము.) అనం... ముక్-అనంత=కడలేని, విత్తముక్=ధనమును, అనంతక్=భూమిని, అనంత...దమును- అనంత = నశింపని, మహత్ = గొప్పవగు, అగ్రహార = విప్రవృత్తులయొక్క, బృంద మును = సమూహమును, ఒసంగు = ఇచ్చునట్టి, నిన్నుక్, ఒఱసి = కలహించి, తారు= తాము, ఎనరాకకదా = సరిరాకకదా, (అది హేతువుగా నగుట ప్రతీపాలంకారము) నిలింపభూజములు=కల్పవృక్షములు, షట్ప...బునక్ - షట్పద = తుమ్మెద లనియెదు,

1. లనంత.

కోకిల=కోయిల లనియెడు, కైతవంబునన్ = నెపముచేతను, దుర్యశమున్ = అపకీర్తిని, వహించున్ = మోయుచుండును. అలం. హేతూత్ప్రేక్ష.

తా. కృష్ణదేవరాయలు సేయు షోడశదానపఙ్క్తి యను వసంతకాలములయందు మిక్కిలి ద్రవ్యమును ఖడమియు మహాగ్రహారము లొసంగఁగా, వసంతకాలములయందు దాతృత్వమును వహించెడు కల్పవృక్షము లంతములేని విత్తాదు లీయలేక తుమ్మెదలు కోయిలలు అను మిషచేత దుష్కీర్తి వహించెను. వృక్షములయావి శాఖాంతములు లతాంతములు మొదలయినవి కావున ననంతములుగా నియ్యంజాల వనియును, వసంతకాలములయందుఁ దుమ్మెదలు గోయిలలు వృక్షములమీఁదఁ జేరి యుండుట స్వభావసిద్ధం బగుటంజేసి యవి యపయశస్సూచకంబులై యున్న వనియును భావము.

తే. ప్రబలరాజాధిరాజ వీరప్రతాప
రాజపరమేశ్వరార్థదుర్గానటేశ
సాహితీసమరాంగణసార్వభౌమ
కృష్ణరాయేంద్ర కృతి వినిర్మింపు మనిరి. 44

టీ. ప్రబల...నటేశ - ప్రబలరాజాధిరాజవీరప్రతాప, రాజపరమేశ్వరార్థదుర్గానటేశ, (ఇవి బిరుదాంకములు), సాహితీసమరాంగణసార్వభౌమ - సాహితీ = సాహిత్యమందును, సమరాంగణ=యుద్ధరంగమందును, సార్వభౌమ = చక్రవర్తి వైన, కృష్ణరాయేంద్ర = కృష్ణరాయ భూపాలా, కృతి = ప్రబంధమును, వినిర్మింపుము = రచింపుము, అనిరి = అని చెప్పిరి.

దీనికర్త 18-వ వచనములో 'విద్వజ్జనంబుల'ను దెల్పు'వారును' అనునది.

వ. అని విన్నవించినఁ బ్రహృష్టాంతరంగుండ నై. 45

టీ. అని=ఈవిధంబున, విన్నవించినన్=మనవిచేయఁగా, (మహాప్రభు వగుటంజేసి పండితులును విన్నవించి రనుట), ప్రహృ...డనై - ప్రహృష్ట = సంతసించిన, అంతరంగుండ నై = మనస్సు గలవాఁడ నై యని ముందటి కన్వయము.

షష్ఠ్యంతములు

క. అంభోధికన్యకాకుచ, కుంభోంభితఘుసృణమసృణగురువక్షునకున్
జంభారిముఖాధ్యక్షున, కంభోజాక్షునకు సామిహార్యక్షునకున్. 46

టీ. అంభోధి...నకున్ - అంభోధి=సముద్రునికి, కన్యకా = పుత్త్రికయగు లక్ష్మి యొక్క, కుచకుంభ = కలశములవంటి కుచములయందు, ఉంభిత = పూయఁబడిన,

ఘుసృణ=కుంకుమముచేత, మసృణ = స్నిగ్ధమగు, గురు = విశాలమగు, వక్షునకున్=వక్షస్థలముగలవానికి, జంభారి...నకున్ - జంభారి=దేవేంద్రుఁడు, ముఖ= మొదలగువారికి, అధ్యక్షునకున్ = నాథుఁడగువానికిని, అంభోజాక్షునకున్ - అంభోజ = కమలములవంటి, అక్షునకున్=నేత్రములుగలవానికి, సామిహర్యక్షునకున్ - సామి = అర్థభాగము, హర్యక్షునకున్=సింహమగువానికి, 'సామిత్వర్ధే' యని యమరము (నరసింహాకృతి కలిగినవాఁ డనుట.)

తా. సులభము. అలం. అంత్యానుప్రాసము; వృత్త్యనుప్రాసము.

క. మర్దితకాళియఫణికిఁ గ, పర్దభృదజబింబితాచ్ఛపదనఖఘృణికిన్
దోర్దండశార్ఙ్గకిణికి నఘ, కర్దమదినమణికి దనుజకరివరసృణికిన్. 47

టీ. మర్ది...ణికిన్ - మర్దిత=మర్దింపఁబడిన, కాళియ=కాళియుఁ డను పేరుగల, ఫణికిన్=సర్పముగలవానికి, (కాళియుఁడను నాగేంద్రునిశిరస్సుమీఁదఁగృష్ణుఁడు తాండవము సలిపె ననుట), కపర్ద...ణికిన్ - కపర్ద = జటాజూటమును, భృత్ = ధరించిన శివునిచేతను, అజ = బ్రహ్మదేవునిచేతను, బింబిత = ప్రతిఫలింపఁబడిన, అచ్ఛ = పరిశుద్ధములగు, పద=పాదములయొక్క, నఖ=గోళ్లయొక్క, ఘృణికిన్=కాంతులుగలవానికి, (పంచాస్యచతురాస్యులు విష్ణునిపాదములకు నమస్కరింతు రనుట), దోర్దండ...ణికిన్ - దోర్దండ = దండమువంటి భుజమందలి, శార్ఙ్గ = శార్ఙ్గ మనుపేరు గల ధనుస్సుయొక్క, కిణికిన్ = కాయలుగలవానికి (శార్ఙ్గకోదండము ఒఱయుటవలనఁ గాయలు గాచిన బాహువు గలవాఁ డనుట), అఘ...మణికిన్ - అఘ=పాపము లనెడు, కర్దమ= బురదకు, దినమణికిన్=సూర్యుఁడగువానికి, (అనఁగా సూర్యుఁడు బురద నెండించినట్లు పాపములను శోషింపఁ జేయువాని కనుట), దనుజ...సృణికిన్ - దనుజ=రక్కసు లనియెడు, కరివర = గజశ్రేష్ఠములకు, సృణికిన్ = అంకుశమగువానికిని.

తా. సులభము. అలం. రూపకము; అంత్యానుప్రాసము.

క. గుహపుష్కరిణీతటఘన, గహనగుహాఖేటవంచకపులిందునకున్
ద్రుహిణాండతుందునకయా, వహదీర్ఘాపాంగకరుణావాస్స్యందునకున్.

టీ. గుహ...నకున్ - గుహపుష్కరిణీ = కుమార పుష్కరిణియొక్క, తట = దరియందు, ఘన=దట్టమగు, గహనగుహా=గుహవంటివనమందు, ఆఖేట = వేఁటయందు, వంచకపులిందునకున్ = మాయచెంచువాఁడగువానికిని, ద్రుహి...నకున్ - ద్రుహి

ణాండ = బ్రహ్మాండములు, తుందునకున్ = కడుపునందుఁగలవానికి, అయా...నకున్ - అయ=శుభములను, ఆవహా = ఆవహింపఁజేసెడు, దీర్ఘ = వాలికలగు, అపాంగ = కడ గన్నులయందు, కరుణవాః = దయారసముయొక్క, స్యందునకున్ = జాఱుటగలవానికిని, (నేత్రాంతములయందుఁ గరుణారసము దొరఁగుచున్న దనుట). అంత్యానుప్రాసము.

తా. సులభము.

క. బంధురరథాంగధారా, గంధవహోత్తజ్వలచ్ఛిఖాపటలపున
స్సంధుక్షణఘృతరాహుప, లాంధోఽసృక్స్రుతికి వేంకటాచలపతికిన్.

టీ. బంధుర...తికిన్ - బంధుర = ఘనమైన, రథాంగ = చక్రముయొక్క, ధారా = అంచుయొక్క, గంధవహోత్త = వాయుసఖుఁడగు నగ్నిహోత్రముయొక్క, జ్వలత్=మండుచున్న, శిఖా=జ్వాలలయొక్క. పటల = సమూహముయొక్క, పునస్సంధుక్షణ = పునస్సంధానకర్మయందు, ఘృత = ఆజ్యమైన, రాహు=రాహు వనెడు, పలాంధః-పల=మాంసమే, అంధః=అశనముగాఁ గల రాక్షసునియొక్క, అసృక్=రక్తముయొక్క, స్రుతికిన్=స్రావముగల, వేంకటాచలపతికిన్=వేంకటాచలరమణునకు (ఈ వేంకటాచలపతికి నను విశేష్యమునకుఁ బూర్వోక్తములగు షష్ఠ్యంతశబ్దములు విశేషణములు.)

అలం. రూపకము, అంత్యానుప్రాసము.

తా. సుదర్శన చక్ర ధారాగ్నియందు రాక్షసులను హోమము చేయుట కా యగ్నియొక్క పునస్సంధాన కర్మమునందు రాహువుయొక్క కంఠరక్త స్రావమాజ్యమై యుండెను.

కథాప్రారంభము

వ. నా విన్నవింపం బూను నాముక్తమాల్యదా మహాప్రబంధంబునకుఁ
గథాక్రమం బెట్టి దనిన. ౬౦

టీ. నావిన్న...నకున్ - నావిన్నవింపన్ బూను = నేను రచించి మీకు విన్నవించుకొనఁదలఁచిన, ఆముక్త...నకున్ - ఆముక్త = అనుభవించి విడువఁబడిన, మాల్య= విరులసరాలను, దా=ఇచ్చిన చూడికుడుత్తనాంచారను నామె కథ కలిగిన యీ ప్రబంధమునకు, కథాక్రమంబు, ఎట్టిది అనినన్=ఎటువంటి దనఁగా.

తా. సులభము.

విలుబుత్తూరి వర్ణన

మ. లలితోద్యానపరంపరాపికశుకాలాపప్రతిధ్వానము
[1]ల్వలభీనీలహరిన్మణీపికశుకస్వానభ్రమం బూన్ప మి
న్నులతో రాయుసువర్ణసౌధముల నెందుం జూడఁ జెన్నొంది శ్రీ
విలుబుత్తూరు చెలంగుఁ బాండ్యనగరోర్వీరత్నసీమంత మై. 51

టీ. శ్రీవిలుబుత్తూరు = శ్రీవిల్లిపుత్తూరను పట్టణము, పాండ్య...సీమంతమై - పాండ్య=పాండ్యదేశమందలి, నగర=పట్టణమగు మధురయొక్క, ఉర్వీ=భూమికి, రత్నసీమంతము = మానికపుఁబాపటబొట్టు, ఐ=అయి, లలితో...ముల్-లలిత=ఒప్పుచున్న, ఉద్యాన = ఎలదోఁటలయొక్క, పరంపరా = గుంపులయందలి, పిక = కోయిలలయొక్కయు, శుక = చిలుకలయొక్కయు, ఆలాప = పలుకులయొక్క, ప్రతిధ్వానముల్ = ప్రతిధ్వనులు, వలభీ...భ్రమంబు-వలభీ = ముంజూరులయందలి, నీల = నీలములయొక్కయు, హరిత్ మణీ=గరుడపచ్చలయొక్కయు, పిక=కోయిలలయొక్కయు, శుక = చిలుకలయొక్కయు, స్వాన = పలుకులయొక్క, భ్రమంబు = భ్రాంతినిఁ ఊన్పన్ = వహింపఁజేయఁగా, మిన్నులతోన్ = ఆకాశముతో, రాయు = ఒఱయుచుండెడు, సువర్ణసౌధముల్ = బంగరుమేడలచేతను, ఎందున్ చూడన్=ఏదిక్కునఁ జూచినను, చెన్నొంది = శృంగారమై, చెలంగున్ = ప్రకాశించును. (విల్లిపుత్తూరు అనుటయే సాధువు.) అలం. ఉదాత్తము. దానికి భ్రాంతిమంతమును యథాసంఖ్యమును అంగములు.

తా. పాండ్యదేశమందలి భూమి యనెడు నాతికిఁ బాపట బొట్టువలె నొప్పుచున్న శ్రీవిల్లిపుత్తూరుసమీపమునం దుండు నుద్యానములలోని కోయిలలు చిలుకలు కూయుచుండఁగా వాని కామేడలు ప్రతిధ్వనులు చేయ నప్పట్టణ వీథులలోనేఁగెడు మార్గస్థులు తల లెత్తి చూడఁగా, నత్యున్నతము లగు మేడలయొక్క వాచూరులయందు నీలములతోఁ జెక్కఁబడియున్న కోయిలలును మరకతంబులచేఁ జెక్కఁబడిన చిలుకలును గానరాఁగా, నీపక్షులే యాధ్వనులు సేయుచున్న వన్న ట్లుండు నని యును నావిల్లిపుత్తూరిలోని బంగారుమేడలు మిన్నంటి యున్న వనియును భావము.

చ. మఱఁచి పయోజకోశములమాడ్కి నొనర్చినపద్మరాగపుం
గలశపుబొట్టడాల్పొమిసికంబులతో నపరంజిమోడుబ

1. బలభిన్నీల.

ల్లల నలవైజయంతముఁ జలంబునఁ గెల్వఁగ దంశితంబులై
నిలిచినయట్లు మాడువు లనేకము లుల్లసిల్లుఁ బురంబునన్. 53

టీ. మలఁచి = తొలిచి, పయోజ...మాడ్కిన్ - పయోజ = కమలముల యొక్క, కోశములమాడ్కిన్ = మొగ్గలవలెను, ఒనర్చిన=చేసినట్టి, పద్మ...లతోన్ - పద్మరాగపు=కెంపులయొక్క, కలశపు=కలశము లనియెడు, ఎట్టడాల్ = రక్తకాంతిగల, బొమిడికంబులతోన్=శిరస్త్రాణములతో, (రూపకాలంకారము. ఇచ్చటఁ బద్మరాగపుం గలశపు టెట్టడా లనుచోటను, 'నుమ్మోచతః' అనుసూత్రమువలనం బవర్ణగతంబగు నుకారంబునకంటెఁ బరంబున నుమాగమరూప మగుపూర్ణబిందువును, 'సామానాధికరణ్యే షూదంతానాం టుగాగమోఽచిస్యాత్' అనుసూత్రమువలనఁ గలశశబ్దసంబంధి యగు పువర్ణమునకుఁ బరమందు టుగాగమంబును వచ్చినది) అపరంజియోడుబిల్లలన్ = మేలి వన్నెబంగారు కప్పుబిళ్ళలచేతను, అల = అప్రసిద్ధమగు, వైజయంతమున్=ఇంద్రసౌధమును, చలంబునన్=చలముచేతను (ఇచ్చటఁ దృతీయార్థమున సప్తమి.) గెల్వఁగన్ = గెల్చుటకు, దంశితంబులై = మైమఱువులు దొడగినవై, ('దంశితో వ్యూఢకంకట' యని యమరుఁడు,) నిలిచినయట్లు=నిలిచియున్న వనఁగా, మాడువులు = గృహములు, అనేకములు = పెక్కులు, పురంబునన్ = శ్రీవిల్లిపుత్తూరియందు, ఉల్లసిల్లున్=ప్రకాశించును.

తా. శ్రీవిల్లిపుత్తూరియందలి గృహములు తమపైనఁ దామరమొగ్గలవలె మలఁచి యున్న కెంపుల కలశము లనెడు నెట్టమంటి శిరస్త్రాణములు గలిగి, బంగారుచేతఁ జేయఁబడిన యోడుబిళ్ళ లనెడు కవచముఁ దొడిగి, స్వర్గమందలి ఇంద్రుని మేడయగు వైజయంతముతో యుద్ధము చేయుటకు సిద్ధపడి నిలిచి యున్న ట్లుండు నని భావము. యుద్ధసన్నద్ధు లెట్టమట్టివస్త్రములు తలలకుఁ గట్టుకొని కవచములు దొడిగికొనుట ప్రసిద్ధము. అలం. ఉదాత్తము. ఉత్ప్రేక్ష. కలశపు...బొమిడికంబు-రూపకము.

సీ. పాథోధిజలయుక్తిఁ బ్రాఁచివట్టిన దిశా
    కరులు నాఁ దగు మరకతపుఁ గరులఁ
గరులతొండము సిక్కఁ గబళించి మ్రింగిన
    హరులు నాఁ దొండ మొఱప్పగుతదశ్మ
హరులఁ దాపినతాప లమర నేనికదోయి
    నీరార్చు నపరంజికనీటి వ్రాఁత
శ్రీలుఁ దత్పార్శ్వచిత్రితశంఖచక్రముల్
    రత్నపుఁదిన్నెలఁ బ్రతిఫలింపఁ

తే. పెఱపురాళి గృహశ్రీలఁ ◊ బెండ్లియాడ
భవనరాజులు గట్టిన ◊ బాసిక మనఁ
దనరు మణితోరణములతో ◊ ద్వారవితతిఁ
బరఁగు వీథులు పురి సూత్ర ◊ పట్టినట్లు. 53

టీ. పాథోధిజలయుక్తిన్ - పాథోధి = సముద్రముయొక్క, జల = జలము యొక్క, యుక్తిన్ = సంయోగముచేతను, ప్రాఁచిపట్టిన = పాఁకుఁడువట్టిన, దిశాకరులు నాన్ = దిగ్గజము లనఁగా, తగు = తగునట్టి, మరకతపుఁగరులన్ = పచ్చలయేనుంగులను, కరులతొండముసిక్కన్ = ఏనుఁగులతుండముమాత్రము మిగులునట్లు, కబళించి = ఆహారించి, మ్రింగిన = మ్రింగినట్టి, హరులు నాన్ = సింహము లనునట్లు, తొండము ఒప్ప అగు = తొండముచేఁ బ్రకాశించుచున్న, తల్ అశ్మ = అమరకతవికారములగు, హరులన్ = సింహములను, తాపిన = చెక్కిన, తాపలు = సోపానములు, అమరన్ = అమరుచుండఁగా, ఏనికదోయి = గజద్వంద్వము, నీరార్చు...శ్రీలు - నీరార్చు = స్నానము చేయించెడు, అపరంజినీటి = బంగారునీటియొక్క, వ్రాఁత = చిత్తరువుయొక్క, శ్రీలు = లక్ష్మీప్రతిమలును, తత్పార్శ్వ...ముల్ - తత్పార్శ్వ = ఆప్రతిమలయుభయపార్శ్వములయందు, చిత్రిత = చిత్రింపఁబడిన, శంఖచక్రముల్ = శంఖచక్రములును, రత్నంపు తిన్నెలన్ = రత్నమయములగు వేదులయందు, ప్రతిఫలింపన్ = ప్రతిబింబింపఁగా, పెఱ...శ్రీలన్ - పెఱ = ఇతరములగు, పుర అళి = పట్టణసమూహముయొక్క, గృహశ్రీలన్ = గృహసంపద లనియెడుస్త్రీలను, పెండ్లియాడన్ = వివాహమగుటకు, భవనరాజులు = తత్పురగృహము లనురాజులు, కట్టిన = కట్టుకొన్న, బాసికము అనన్ = పట్టబంధ మనునట్లుగా, తనరు = ప్రకాశించుచున్న, మణితోరణములతోన్ = మాణిక్యతోరణములతోఁగూడిన, ద్వారవితతిన్ = ద్వారసమూహముచేతను, వీథులు, పురిన్ = శ్రీవిల్లిపుత్తూరియందు, సూత్రపట్టినట్లు = దారముపట్టి తీర్చినట్లుగా, పరఁగున్ = ఒప్పును. సూత్రపట్టినట్లన్నచోట, శ్లో. 'అదంతపాది శబ్దేచ పత్యర్థే బిందులోపకా, వర్ణకస్యాత్రకథితౌ క్వచి త్సుకవి సమ్మతేః' అని యథర్వణాచార్యసూత్రముప్రమాణము.

తా. అష్టదిగ్గజము లెల్లప్పుడు సముద్రోదకములయందే యుండుటవలనఁ బ్రాచిపట్టిన వన్నట్లు తోఁచెడు పచ్చతాలియేనుంగులను, ఆయేనుంగులతుండము మాత్రము గనఁబడుచుఁ దక్కినశరీరము గానరాకుండుటం జేసియును, నల్లతుండంబులు పచ్చతాలిసింహముల నోళ్లలోనుండి వెడలినట్లుండుటం జేసియును, ఏనుంగుల శరీరమెల్లను మ్రింగి తుండంబుల మిగిలించినట్లు కనుపడు సింహంబులను జెక్కిన పలుకతాలు వెనుకదిక్కునఁ బ్రకాశించునవియును, ఇట్టి సోపానములకుఁ బైగా గోడలయందు లక్ష్మీదేవి కభిషేకముఁ

జేయుచున్న ట్లపరంజినీటితోఁ జిత్రింపఁబడిన యాలక్ష్మీప్రతిమలును గజంబులును లక్ష్మీప్రతిమల యుభయపార్శ్వములయందలి శంఖచక్రములును, దిగువను రత్నమయవేదికలయందు నీడలు తోఁచుచుండఁగాఁ బ్రతిగృహద్వారమున మణితోరణములు ప్రకాశింపఁగా, నాగృహరాజంబు లితర పట్టణగృహశ్రీలను వివాహముఁ జేసికొనుటకుం గట్టికొన్న బాసికము లనునట్లొప్పు ననియును, వీథులు వంకరలు లేక సూత్రముపట్టి కట్టినట్లు ప్రకాశించుచుండును. అలం. ఉత్ప్రేక్ష. ఉదాత్తము.

చ. పగడపుఁజాయచెందిరముఁ బ్రామినపాండ్య వధూకుచంబులన్
నగునరుణంపుబొండ్లముల నారికెడంబులు వజ్రకుట్టిమం
బగుపథముం జెలంగు భవ నాహృతశేషితరత్న[1]రక్షక
భ్రగతరుసంతతిం బ్రథమభార్యఁ బురిన్ గిఱవుంచె వార్ధి నాన్. 54

టీ. పగడ...మున్ - పగడపుఁజాయ = విద్రుమకాంతిగల, చెందిరమున్ = కుంకుమమును, ప్రామిన...బులన్ ప్రామిన = అలఁదినట్టి, పాండ్యవధూకుచంబులన్ = పాండ్యదేశస్త్రీలగుబ్బలను, నగు...బులు - నగు = పరిహసించుచున్న, అరుణంపు = ఎఱ్ఱనగు, బొండ్లముల = పైపీఁచు ఒలువనికాయలుగల, నారికెడంబులు = నారికేళపు మ్రాఁకులును, వజ్ర = వజ్రములచేతను, కుట్టిమంబు అగు = కట్టింపఁబడిన, పథమున్ = మార్గమును (ప్రథమాంతముమీఁద ద్రుతము సముచ్చయార్థకము.) భవనా...కున్ - భవన = గృహములకొఱకు, ఆహృత = వ్యయము జేయఁబడినవానినుండి, శేషిత = మిగిలింపఁబడిన, రత్న = రత్నములయొక్క, రక్షకున్ = కాపాడుటకు, వార్ధి = సముద్రుండు, అభ్రగ = ఆకాశగతములగు, తరు = వృక్షములగు మందారాదు లనియెడు, సంతతిన్ = సంతానమును, ప్రథమభార్యన్ = మొదలి పెండ్లమగు గంగానదిని, పురిన్ = శ్రీవిల్లిపుత్తూరియందు, గిఱవు ఉంచెన్ నాన్ = కుదువయుంచె ననునట్లు, చెలంగున్ = ప్రకాశించును.

తా. శ్రీవిల్లిపుత్తూరిలో నుండెడు గృహములు రత్నమయములైనవి గావున నాగృహములకు వినియోగము కాఁగా మిగిలినరత్నములను గాపాడెద నని రత్నాకరుం డగుసముద్రుండు పూఁటపడి యారత్నములు తీసికొని యందులకై తనసంతాన మగు కల్పవృక్షములను, పెద్దభార్య యగుగంగను దత్పట్టణమునందుఁ గుదువ యుంచెనో యన్నట్లు సంతత మెడతెగని యెఱ్ఱనిబొండ్లములతోడి నారికేళపుమ్రాఁకులును, వజ్రములచేతఁ గట్టింపఁబడిన రాజమార్గమును బ్రకాశించును. నారికేళములు కల్పవృక్షములవలెను మార్గము తెల్లనికాంతి గలిగి యుండుటంజేసి గంగానదియుంబోలె వెలుంగు

1. రక్షకున.

చున్నకతంబున నట్లుత్ప్రేక్షింపఁబడియెను. అలం. ఉత్ప్రేక్ష. వజ్రకుట్టిమము. ఉదాత్తము.

క. కోరకితనారికేళ
 క్ష్మారుహములు రత్నకుట్టిమంబులఁ [1]దోఁచున్
 ద్వారము లయత్నకృత[2]శృం
 గారంబుగ నలికి ముగ్గు ఘటియించి రనన్. 55

టీ. ద్వారములు = వాకిళ్లు, కోరకిత = సంజాతకోరకములు గల, నారికేళక్ష్మారుహములు = టెంకాయచెట్లు, రత్నకుట్టిమంబులన్ = రత్నములచేఁగట్టింపఁబడిన భూములయందు, అయత్న...బుగన్ - అయత్నకృత = యత్నముచేతఁ జేయఁబడని, శృంగారంబుగన్ = శృంగారము గలుగునట్లు, అలికి = గోమయలిప్తముఁజేసి, ముగ్గుఘటియించిరి అనన్ = రంగవల్లిక యుంచి రనునట్లు, తోఁచున్ = ప్రతిబింబించును.

తా. శ్రీవిల్లిపుత్తూరిలో వాకిళ్ల ముందటి రత్నమయము లైనభూములయందు మొగ్గలు పచ్చనియాకులు గల నారికేళములు ప్రతిఫలింపఁగా, నాయిండ్లవారు యత్నముచేత సింగారింపకయే శృంగారము గలుగునట్లు ఆకులనీడ యలికినట్లును మొగ్గలనీడ ముగ్గులు పెట్టినట్లు నుండె నని భావము. అలం. ఉత్ప్రేక్ష.

మ. కరపూజాంబుజముల్ ఘటిం దడఁబడన్ జన్దోయి లేఁగౌనుపై
 దయఁ దప్పన్ బసపాడి పాగడపుఁబాదం బొప్పం జెంగల్వడి
 గ్గియ నీ రచ్యుతమజ్జనార్థము కటిం గీలించి దివ్యప్రబం
 ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతు రుద్యానంపులోత్రోవలన్.

టీ. చెంగల్వడిగ్గియన్ = ఎఱ్ఱకలువపూలు గలకొలనియందు, పసపుఆడి=హారిద్రాలేపపూర్వకముగా స్నానముఁజేసి, అచ్యు...ర్థము - అచ్యుత = శ్రీపతియొక్క, మజ్జనార్థము = అభిషేకముకొఱకు, నీరు=తీర్థము, కటిన్ = రొండియందు, కీలించి=ఉనిచికొని, కర = హస్తమందలి, పూజాంబుజముల్=పూజకొఱకైన కమలములు, ఘటిన్ = తీర్థపుబిందెయందు, తడఁబడన్ = తొట్రుపడుచుండఁగా, చన్దోయి=కుచద్వంద్వము, లేఁగౌనుపైన్ = లేఁతనడుముమీఁద, దయతప్పన్ = కృపాహీనమగుచుండఁగా, దివ్య...స్యల్ - దివ్యప్రబంధ = ద్రావిడప్రబంధములోఁద, యుక్ = కూడుకొన్న, ఆస్యల్ = వక్త్రములు గల, ద్రవిడాంగనల్ = ద్రావిడస్త్రీలు, ఉద్యా...లన్-ఉద్యానంపు = ఎలదోఁటయొక్క, లోత్రోవలన్ = అంతర్మార్గములయందు, పాగడపుఁ

---

1. దోఁపన్. 2. శృంగారము గను.

బాదంబు = పాదకటకములనియెడు భూషణము ధరించిన పాదము, ఒప్పన్ = ఒప్పి చుండఁగా, నడుతురు = పోవుచుందురు.

తా. విల్లిపుత్తూరియందలి ద్రవిడస్త్రీ లుద్యానంబులలోని చెంగలువలుగలకొలఁకులలోఁ బసుపుతో స్నానముఁజేసి, స్వామి తిరుమజ్జనము నిమిత్తము తీర్థంపుబిందె యాదేశాచారరీతిగా రొండియందు ధరించి, తమహస్తములయందు నాళములు గలిగి పూజార్థము లైనకమలములు తద్ఘటములయందుఁ దొట్రిల్లుచుండఁ, గుచభారముచే లేఁత నడుము లసియాడుచుండ దివ్యప్రబంధానుసంధానముఁ జేయుచు నుద్యానంబుల లోపలిత్రోవలయందుఁ బావడలు ధరించినపాదములు గదల నడుచుచుందు రని భావము.

మ. కలయన్ నీలమయంపుఁదల్లియొఱదాఁకం దేటనీరొప్పు ర
థ్యలకూపంబుల మీలఁ జూచి వలభీవ్యాసంగితుంగద్రుశా
ఖలలో [1]డాఁగి గుభాలనన్ లకుముకుల్ క్రందై పడున్ లేచు ము
చ్చిలి గేహేందిర ద్రావిడీపరిచితిన్ జెండాడుచందంబునన్. 57

టీ. గేహేందిర = గృహలక్ష్మి, ద్రావి...తిన్ - ద్రావిడీ=ద్రవిడస్త్రీలయొక్క, పరిచితిన్ = పరిచయముచేతను, ముచ్చిలి=వంచించి (ఎవ్వరికిని గనుపింపక యనుట), చెండా...నన్-చెండాడు = కందుకక్రీడ సలిపెడు, చందంబునన్ = రీతిచేతను, లకుముకుల్=పక్షివిశేషములు (లకుముకిపిట్టలు), కలయన్ = నిండునట్లుగా, నీలమయంపు= నీలమణివికారమగు, తల్లియొఱదాఁకన్ = బొద్దుటొఱదనుకను (పైనుండెడు పెద్దయొఱ యనుట), తేటనీరు=నిర్మలోదకము, ఒప్పు=ఒప్పుచున్న, రథ్యలకూపంబుల=వీథుల బావుల యందలి, మీలన్=మీనములను, చూచి=ఈక్షించి, వలభి...లోన్ - వలభి=చూరుల యందు, వ్యాసంగి = కూడియున్న, తుంగ=పొడవులగు, ద్రు = వృక్షములయొక్క, శాఖలలోన్ = కొమ్మలలో, డాఁగి = పొంచి, గుభాలనన్=గుభా లను శబ్దము గలుగు నట్లు, క్రందై=సందడించి, పడున్ = దుముకును, లేచున్ = మరల నుద్గమించును.

తా. వీథులలోని యొఱలబావులలోఁ దల్లియొఱవఱకుఁ బై కుబికి యున్న తేట నీటిలోఁ గనఁబడుచున్నచేఁపలను జూచి, యిండ్లచూరులవెంబడి వ్యాపించియున్న పెద్ద పెద్ద తరుశాఖలయందుఁ బొంచియుండి యాబావులలో దుముకుచు లేచుచున్నలకుముకి పిట్టలు ద్రవిడస్త్రీపరిచయము గలిగిన గృహలక్ష్మి తనశరీరము గానఁబడకుండరహస్య ముగాఁ జెండు గొట్టుచుండఁగా నట్టి పుట్టచెండ్లవలె నుండె నని తాత్పర్యము. ద్రవిడ

1. డాఁడి గబా; నుండి గుబాలునన్.

స్త్రీలు చెండ్లాడుటయు, లకుముకులు చేఁపల బట్టి కొనుటకు నీట దుముకుటయు ప్రసిద్ధము. ఉత్ప్రేక్ష.

మహాస్రగ్ధర. స్వనిలింపావాసదత్త్వాశనదతలమిథస్తారతమ్యంబు లీరెం
డును దీను ల్గాంచునమ్మాడువులనడుగం డోఁగునుద్యద్రతోత్స్నే
ళనసిద్ధద్వంద్వబృందాలయ తటబిల కల్యాణమంథాద్రులో నా
వనజాక్షస్యందనద్వంద్వము లిఖితనరావాప్త దాంపత్య మొప్పున్.

టీ. లిఖిత...త్యము - లిఖిత = చిత్రింపఁబడిన, నర = మనుష్యప్రతిమలచేత, అవాప్త=పొందఁబడిన, దాంపత్యము = మిథునములుగల, వనజాక్షస్యందనద్వంద్వము-(వనజాక్షీచ - వనజాక్షశ్చ - వనజాక్షౌ - వనజాక్షయోస్స్యందనేతయోర్ద్వంద్వం - 'పుమాన్ స్త్రియా' యను సూత్రమువలన స్త్రీవాచకమగు వనజాక్షీశబ్దము లుప్తమై పురుషవాచకమగు వనజాక్షశబ్దముమాత్రము శేషించుటంజేసి యట్టిరూపంబు వచ్చెం గావున), వనజాక్ష=శ్రీ శ్రీపతులయొక్క, స్యందన=తేరులయొక్క, ద్వంద్వము=జోడు, స్వనిలింపా...బులు - స్వ = తమయొక్క, నిలింప = దేవతలకు, ఆవాస = నివాసము యొక్క, దత్వ = ఇచ్చుటయొక్కయు, అశన = ఆహారముయొక్క, దతల=ఇచ్చుట యొక్కయు (ద్వంద్వాంతమునబహుత్వము), మిథః = ఒండొంటియొక్క, తారతమ్యంబులు=ఎచ్చుతగ్గులు, ఈరెండును=ఈయశనవాసములు, దీనుల్ కాంచు=రిక్తులుపొందుచున్న, అమ్మాడువులన = ఆమాడుగులనే (ఆమాడుగులయందు నివాసభుక్తి దానములు విస్తరించి కలవనుట). (మఱియు 'క్వచి ద్గకారో వ' యనుసూత్రము కలిమిం జేసిమాడుగులు మాడువులనియునుం గలదు). అడుగన్=వేఁడుకొనుటకు, డోఁగు...ద్రులో నాన్-డోఁగు=వినయ పూర్వకముగా మోఁకాళ్లమీఁద నడచివచ్చిన, ఉద్యత్=ఒప్పుచున్న, రత=సురత మందలి, ఉత్స్నేళన = కూటములుగల, సిద్ధ=సిద్ధు లను దేవయోనులయొక్క, ద్వంద్వ=మిథునములయొక్క, బృంద = సమూహములకు, ఆలయ=నివాసస్థానములగు, తట = దరులును, బిల = గుహలునుగల, కల్యాణమంథాద్రులో = హేమాద్రి మందరాద్రులో, (మేరుమందరపర్వతములో యనుట. కల్యాణ మన బంగారము, మంథ మనఁ గవ్వము గాన నాకల్యాణమంథశబ్దము లద్రిశబ్దములోడ సంబంధించి ద్వంద్వాంతమందు బహువచనమగుచున్నది). నాన్ = అనునట్లు, ఒప్పున్ = ప్రకాశించును.

తా. మానవ దంపతులరూపములుగాఁ జెక్కఁబడిన బొమ్మలు గల శ్రీ శ్రీపతుల రెండుతేరులు దేవతలకు నివాస మిచ్చినమేరుపర్వతమును, నాహార మగు నమృతమిచ్చిన మందరపర్వతమును, దమతమ పుణ్యతారతమ్యముల నడిగి తెలిసికొనవలయు నని వచ్చి శ్రీవిల్లిపుత్తూరిలో దీనులకు నివాసంబులును నాహారంబు లిచ్చెడు నాగృహములదగ్గఱ

శేరి తమ దరులయందును గుహలయందును సురతములయందు ననురక్తులగు సిద్ధ మిథునములతోఁడ నున్నవో యన్నట్లు ప్రకాశించుచున్న వని భావము. లేరులమీఁది బొమ్మలు సిద్ధదంపతులంబోలె నున్నవి. ఈపద్యమునందు 'దీముల్గాంచు' ననుచోట 'మిన్నుల్గాంచు' ననియుఁ గొందఱు చదువుచు నచ్చట నాకాశమునొరయుచున్న యమ్మాడువు లని యన్వయింతురు. అలం. ఉత్ప్రేక్ష.

సీ. సవలయధ్వని గాఁగ ǂ [1]సాలిప్రేయు నదల్పు
యతి నైన గుండె ఝ ǂ ల్లనఁ గలంపఁ
సుడిసిన మొగ మెత్తి ǂ చూడకుండు పరాకు
కుసుమబాణుని నైనఁ ǂ గువిటుఁ జేయ
శ్రీకార్యపరులఁ గాం ǂ చిన లేచిమ్రొక్క నం
[2]జలికి నింద్రుండు న ǂ క్కొలుపుఁ గోర
హరి గృహావసరశం ǂ ఖాకర్ణనకుఁ ద్రిప్పు
కడగంటిజిగిప్రజఁ ǂ గాఁడి పాఱఁ
తే. గవఱ లుంకించిప్రేయఁ గొ ǂ ప్పవియ నవలి
కరమున నమర్పఁ బైఁటలో ǂ మరుని బటువు
బిల్లక్రియఁ బట్టుకంచెల ǂ బిగువుఁ జన్ను
నిక్కఁ దిన్నెలఁ [3]బాత్రముల్ ǂ నెత్తమాడు. 59

టీ. సవలయధ్వని కాఁగన్ = కంకణధ్వనికలుగునట్లుగా, సాలి ప్రేయుం=పాచిక ప్రేసెడు, అదల్పు = అదలించుట, (ఇచ్చట సారెప్రేయునదల్పని కొంద అందురు. అది ఎకారయుతరేఫాంతశబ్ద మయ్యేనేని దానిబహువచనముఁదు సారె లని నిల్వ వలయు. నట్లుగాక మహాభారతంబున నర్ధసాళ్ళనియు నర్ధసాళులనియుఁ బ్రయోగంబు కలిమిం జేసి యిచ్చట నికారయుత లకారాంతశబ్దముగా నుండుటయే సమీచీనంబు.) యతినైనన్ = సన్న్యాసినైనను, గుండెఝల్లనన్ = హృదయము జలదరించునట్లుగా, కలంపన్ = కలుషముఁజేయుచుండఁగా, సుడిసినన్ = ఎదురైనప్పుడు, మొగమెత్తి = ముఖముపైకెత్తి, చూడకుండు = ఈక్షింపకుండెడు, పరాకు = గరువచందము, కుసుమబాణునినైనన్ = పూవిలుతునైనను, కువిటున్ చేయన్ =నీచవిటునిఁజేయుచుఁగా, శ్రీకార్యపరులన్ =భగవత్కైంకర్యపరులను, కాంచినన్ =చూడఁగానే, లేచి=ప్రత్యుత్థానముఁజేసి, మ్రొక్క=మ్రొక్కెడు, అంజలికిన్ = దోసిలికై, ఇంద్రుండున్ = దేవేంద్రుఁ

1. సారెవేయు. 2. బలికింద్రుఁడైన. 3. బాత్రాళి.

దును, అక్కొలువున్ = ఆభగవత్కైంకర్యమును, కోరన్ = అపేక్షింపఁగా, హరి... నకున్-హరి...కున్-హరి = స్వామియొక్క, గృహ=ఆలయమునందలి, అవసర=ఆయా సమయములయొక్క, శంఖ = శంఖనాదముయొక్క, ఆకర్ణనకున్ = వినుటకు, త్రిప్పు= మరల్చెడు, కడగంటి = నేత్రాంతములయొక్క, జిగి = బెళుకు, ప్రజన్ = చూచెడు వారిని, గాఁడిపాఱన్=ఉచ్చిపోవఁగా, (అంత వాఁడి యనుట.) కవఱులు = అడ్డసాళ్లు, ఉంకించి = కుప్పించి, వ్రేయన్ = వ్రేయఁగా, కొప్పు+అవియన్ = తుఱుము వదలఁగా, అవలికరమునన్ = రెండవహస్తముచేతను, అమర్పన్ = సవరింపఁగా, పైఁట లోన్=పయ్యెదలోపలను,మరు...యన్-మరుని=స్మరునియొక్క, బటువుబిల్లక్రియన్= తొడక్రింద నునిచికొను చుట్టుదిండువలెను, కట్టుకంచెలన్=పట్టురవికయందు, బిగువుఁ జన్ను = బటువుగుబ్బ, నిక్కన్ = నిట్టవొడవఁగా, పాత్రముల్ = వేశ్యాంగనలు, తిన్నెలన్ = వేదికలయందు, నెత్తము = ద్యూతమును, ఆడున్ = క్రీడింతురు.

తా. ఆశ్రీవిల్లిపుత్తూరియందు నరుఁగులమీఁద వేశ్యకాంతలు యతీశ్వరుని హృదయమైనఁ గలంగునట్లు విలాసము గలిగి యదలించి కంకణములు కదలి ధ్వనిసేయు నట్లు పాచికలు వ్రేయుచును, మఱియు నెట్టివా రెదుటికి వచ్చినను మొగమెత్తి చూడక పరాకుఁ జేయుచు గరువము గలిగియును, స్వామి యాలయము కైంకర్యముఁ జేసెడువారిఁ జూచినమాత్రముననే లేచి మ్రొక్కుచుండఁగా నట్టి మ్రొక్కు తనకుఁ గలుగ వలయు నని దేవేంద్రుఁడును స్వర్గమందలి యప్సరోగణములు కొల్వ గలప్రభుత్వము నైన మాని యాదేవాలయమందుఁ దా నొక్కసేవకుఁ డైయుండవలయు నని కోరుచుండఁగా, నట్టి సౌందర్యము గలిగి యప్పుడప్పుడు స్వామి యాలయమందలి కొలువుల సమయములలోని శంఖనాదములు వినఁగానే బెదరిబెదరి చూచుచు బాచిక లూనికఁజేసి దొరలింపఁగాఁ గొప్పు వీడఁగా, నాటయందలి త్వరపాటుచేతను రెండవచేత నాకొప్పు సవరించుటకుఁ జేయెత్తినప్పుడు పైటలోని పట్టురవికలో నిక్కవొడిచెడు బటువుగుబ్బ కానరాఁగా, నిట్టివిలాసములు గలిగి పగడసాల లాడుదు రని భావము. అలం. స్వభావోక్తి.

సీ. వీడెంపుఁ [1]బలుకెంపు ౹ విరిసి వెన్నెల గాయ
వరిగింజ నొకటఁ బకల్వరుసఁ దోమ
నొరసి యొత్తినమణుం ౹ గొందక మేన ని
గ్గులు దేరఁ [2]బసపిడి ౹ జలక మాడ

1. నునుగెంపు. 2. పసపాడి.

ముదుక గాకుండఁ బయ్యెదలోనఁ గే లార్చి
కలయ [1]నొంటను జంటఁ గలప మలఁద
రతిరయచ్ఛిన్న సూత్రమునఁ జిక్కక ముత్తె
ములు రాల [2]గళగళికలు వహింప
తే. [3]నొలసినను నెట్టినరునైనఁ గులముఁ దెలియఁ
బ్రభుత సెడి పల్లవుఁడు [4]పేదవడిన నేద
నృపతి వెలియంతిపురముగా నెన్న మెలఁగ
బాసఁ గృతిఁ జెప్పవలఁతు లప్పద్మముఖులు. ౧౦

టీ. వీడెంపుఁబలుకెంపు - వీడెంపు=తాంబూలసంబంధియగు, పలుకెంపు=అరుణకాంతి, విరిసి = విచ్చిపోయి, వెన్నెల కాయన్ = శుభ్రవర్ణమేర్పడునట్లుగా, వరిగింజన్ ఒకటన్ = ఒక్క శాలిబీజముచేతనే, పల్వరుసన్ = దంతపంక్తిని, తోమన్ = ధావనము చేయుటకును, ఒరసియొత్తినన్ = రాచియద్దినను, మణుంగు ఒందక = తెలివలువ నంటక, మేనన్ = శరీరమందే, నిగ్గులుదేరన్ = మిసిమిగనుపించునట్లు, పసపిడి=పసుపుఁబూసికొని, జలకమాడన్ = స్నానముఁజేయుటకును, ముదుక కాక ఉండన్ = ముడుగుఁదనములేకుండ (పలుచగానే), పయ్యెదలోనన్ = పైఁటలోనే, కేలార్చి = హస్తమాడించి, కలయన్ = వ్యాపించునట్లు, ఒంటన్ = ఒడలియందును, చంటన్ = కుచములయందును, కలపము అలఁదన్ = పరిమళద్రవ్యమిశ్రితచందనమును పూయుటకును, రతి...మునన్ - రతిరయ = పురుషాయితసురతవేగముచే, ఛిన్న = త్రెస్సిన, సూత్రమునన్ = త్రాటియందు, చిక్కక = చిక్కుపడక, ముత్తెములు రాలఁగన్ = మౌక్తికములు రాలుచుండఁగా, గళగళికలు=సొగసులను, వహింపన్ = తాల్చుటకును, ఒలసినను=సమీపించినను, ఎట్టినరునైనన్=ఎంతధనరూపాదులు గలవానినైనను, కులముఁన్ తెలియన్=వర్ణమడిగి తెలిసికొనుటకును, ప్రభుతసెడి=ప్రాభవములేక సంపదగోలుపోయి, పల్లవుఁడు=తనముపటివిటకాఁడు, పేదవడినన్=దరిద్రుఁడైనను, ఏదన్=పోషించుటకును, నృపతివెలియంతిపురమునాన్ = నరపాలునియొక్క బహిర్గతమైన మఱియొక్క యంతఃపుర మనఁగా, ఎన్నన్=గణింపఁగాను, మెలఁగన్=సంచరించుటకును, బాసన్ = ప్రతిభాషయందును, కృతిన్ చెప్పన్ = ప్రబంధనిర్మాణముఁ జేయుటకును, అప్పద్మముఖులు = ఆవారవనితలు, వలఁతులు = సామర్థ్యముగలవారు, వలఁతు లను పదము

1. కలయజంటను నొట్ట; (జంటను నొంట.) 2. గళగళిక - ఈరూపము చింత్యము. (ప.) 3. బొలసిననె. 4. పేదవడిన నేల.

పల్వరుసఁదోఁచ ననునది మొదలుగాఁ గృతిఁ జెప్పు ననుదానివఱకు నెనిమిది పనులకు నన్వయించుచున్నది.

తా. విడియము పెక్కుమాఱులు నమలుటం జేసి మిక్కిలి కెంపెక్కిన తమ దంతములయందలి యరుణిమ విరిసి తెల్లనగున ట్లావారవనిత లొక్క వరిగింజచేతనే దంతధావనముఁ జేయుదు రనియును, స్నానముఁ జేయునప్పుడు పూసికొన్న పసుపు పరిశుద్ధమైనను దెల్లని వస్త్రములో రాచినను వస్త్రము నంటక వారి నెమ్మేనులందే నిగనిగ లాడు ననియును, వారు చనుఁగవ బయల్పడనీక పైటలోనే కాశ్మీర కస్తూరి కర్పూర ములు మొదలగు వాసనలు గల కదంబము మిక్కిలి పలుచనగాఁ బూసి కొనుదు రనియును, సురతమందు తమ హారముల ముత్తియంబులు తెగిన సూత్రంబున నుండక పరువెత్తు నంత వడిగా నుపరతి చేయుదు రనియును, ఎట్టివాఁడుగుఁడైన నెట్టిధనికుఁడైనఁ దమ్ము వలచెనేని యతని కులము దెలియక కేవల ద్రవ్యాపేక్షచేతనే యతనితోఁ గూడ రనియును, మున్ను తమతోడఁ జెలిమిచేసిన విటుఁడు ధనహీనుఁ డయ్యెనేని యతని నాదరింతు రనియును, రాజాంతఃపుర స్త్రీజనమునకుఁ గలిగినంతపరువు గలిగి సంచరింతు రనియును, మిగుల విద్యావతులు గావున బహుభాషలలోఁ గావ్యరచనఁ జేయుటకైనను నేర్పు గలవా రనియును భావము. అలం. స్వభావోక్తి.

ఉ. అంచితహారవల్లివలయాభరణంబుల తక్కఁ ద్రోయుఁజి
ల్కంచుఁ బసిండి యేణమద యంగముఁ జేర్చుట తక్క రోయు జి
డ్డంచు జవాది ధూపితము యందుట తక్క విదుర్చుఁ బూవుఁ జె
మ్మంచు జిలుంగ తక్క నగు యావత మొత్తు నటంచు నన్యముక్.

టీ. యావతము = యువతీసమూహము, అంచిత...బుల - అంచిత=సొగసగు, హారవల్లి=వల్లికలవంటి ముక్తాహారములచేతఁజేసిన, వలయాభరణంబుల = వలయభూషణ ములే, తక్కక్ = తప్పు, పసిండి = బంగారము, చిల్కుఅంచుక్ = చిలుముపట్టు ననుచు, త్రోయుక్=పరిహరించును. ఏణమదము=కస్తూరిని, అంగముక్ చేర్చుటతక్కక్=శరీర మందు నలఁదుటయే తప్పు, జవాది=సంకుమదమును, జిడ్డు అంచుక్=చమురుతోడిమలిన మని, రోయుక్ = ఏవగించును, ధూపితము యందుటతక్కక్ = శిరోజముల కగరు సాంబ్రాణి మొదలగు వస్తువులధూమధూపముఁ బొందుటయే తప్పు, పూవుక్=పుష్పమును, చెమ్మఅంచుక్=తడి యనుచు, విదుర్చుక్ = విసర్జించును. జిలుంగ తక్క=సన్నపుఁజీర యే తప్పు, అన్యముక్ = పెరపరిగచీరనైనను, ఒత్తును అటంచుక్=ఒత్తుకొను ననుచును, నగుక్ = పరిహసించును.

తా. ఆపురిజవరాంద్రు మిగుల సుకుమార శరీరములు గలవా రగుటం జేసి రంగగుబంగర్ఘకన్న మిన్న యగు వన్నియగల తమ నెమ్మేనుల ముత్తియంబుల సొమ్ములు ధరింతురే కాని పసిఁడి సొమ్ములు చిలుము పట్టు నని త్రోసి వేయుదురు. పునుంగు జిడ్డు గల దని దానిఁ బూసికొనుట వదలి కస్తూరియే పూయుదు రనియును, తుఱుములయందు విరులఁ దురిమిన నవి చెమ్మగిల్లు నని వాని విడిచి ధూమధూపములచేతనే వెండ్రుకలకు వాసన లెక్కింతు రనియును, సరిగ మొదలగు వానిచే నెక్కుడు వెలగల వలువల నేని యవి కఱకుగ నొఱయు నని వానిఁ బరిహరించి జిలుంగు వలువలే కట్టుదు రని యును నిట్టి నాగరకంబు గలవా రని భావము. అలం. పరిసంఖ్య, అతిశయోక్తి.

ఉ. వేవిన మేడపై వలభి వేణికఁ జంట వహించి విప్పఁగాఁ
బూవులు గోటమీటుతఱిఁ బోయెడు తేఁటులమ్రోఁత గామిశం
కావహ మౌఁ గృతాభ్యసన లౌటను దంతపుమెట్లవెంబడిం
జేవడి వీణ మీటుటలుఁ జిక్కుఁడలించుటలు న్సరింబడన్. 62

టీ. వేవినన్ = ప్రభాతముకాఁగానే, ('క్వచిద్గకారో వః' అనుసూత్రమునుబట్టి వేగిన యనుశబ్దము వేవిన యనియుండుం గలదు.) మేడపైన్ = సౌధాగ్రముమీఁదను, వలభిన్ = లోవయందు, వేణికన్ = జడను, చంటన్ = కుచమందును, వహించి = ధరించి, విప్పఁగాన్ = ఉద్గ్రథనముఁ జేయుటకొఱకు, పూవులు=పుష్పములను, గోటన్ మీఁటుతఱిన్=నఖముచేత విదుర్చుసమయమునందు, పోయెడు... మ్రోఁత-పోయెడు= విచ్చిచనుచున్న, తేఁటులమ్రోఁత = భ్రమరములధ్వని, కృతాభ్యసనలౌటను - కృత = చేయఁబడిన, అభ్యసనలు = అభ్యాసముగలవారు, ఔటను=అగుటచేతను, దంతపుమెట్ల వెంబడిన్=వీణకు వేసియున్న దంతపుమెట్లవెంబడిగా, చేవడిన్=హస్తలాఘవముచేతను, వీణమీఁటుటలున్ = వీణవాయించుటలు, చిక్కుఁడలించుటలున్ = శిరోజములచిక్కుఁ దీయుటలును, సరింబడన్ = సదృశము లగుచుండఁగా, కామి...మౌన్-కామి=కాముకులకు, శంకావహము = సంశయాస్పదము, ఔన్=అగును. (ఈపద్యమునందు వార స్త్రీలని యధ్యాహారముఁ (ఊహ) జేసికొనవలయును.)

తా. ఆపట్టణమందు వారస్త్రీలు తెల్లవాఱఁగానే మేడమీఁదఁ జూరువెంబడిఁ గూర్చుండి తమ వేణి కుచోపరిభాగము మీఁద ధరించి యాజడ విప్పుచు నందలి పుష్పములు గోట విదిలించునప్పుడు పరిమళార్థమయి ముసరికొని మరల విచ్చి పోవు తుమ్మెదలు రొదఁజేయుచుండఁగా నా ఝుంకారము విని వీథిఁ బడిపోవుచున్న కాముకులు నిలిచి యాస్త్రీలు చేతులు వడివడిగా నాడించుట వీణవాయించినట్లుండఁగాఁ బుష్పములు దంతపుమెట్లవలె నుండఁగా జడ వీణవలె నుండఁగా నాస్త్రీలు వీణా

భ్యాసము గలవా రగుట వలన నప్పుడు జడ విప్పుట పీణవాయించుటకా యని సంశ యింతు రని భావము. సందేహాలంకారము.

క. ఆలివచగకార్పణ్యం, బా లేమల చెవులు సోఁక ◊ దధమాన్వయ జీ
ర్ణాలావణ్యులపిలుపున, కై లాభముఁ దెలిపెనేని ◊ యవి శ్రీలగుటన్.

టీ. ఆళిర...ణ్యంబు - ఆళి = చెలికత్తెలయొక్క, వచః = వాక్కులయొక్క, కార్పణ్యంబు = లుబ్ధత్వము, అధమా...కై-అధమాన్వయ=తక్కువజాతియొక్కయు, జీర్ణ = ముసలివాండ్ర యొక్కయు, అలావణ్యుల = సౌందర్యహీనులయొక్కయు, (ద్వంద్వాంతమున బహువచనము) పిలుపునకై = పిలుపుకొఱకు, లాభముఁ దెలిపె నేని = ఆదాయ మెఱింగించెనేనియు, అవి = ఆస్త్రీలచెవులు, శ్రీలగుటన్ = లక్ష్మీ స్వరూపములగుటచేతను (శ్రీకారములఁబోలిన వనుట), ఆలేమల = ఆసొగసుకత్తెల యొక్క, చెవులు సోఁకదు = చెవిఁజొరదు.

తా. జవ్వనముగల యావారకాంతల దాఁపున నుండు చెలులు కొందఱఁ బురుషులఁ దార్చు వారై యాపురుషులు మిక్కిలి ధన మిచ్చెద రని చెప్పినను, నవ్వారకాంతలు పురుషులు తక్కువకులము వారయినను, ముసలి వారైనను, సొగసు లేని వారైనను వారిని దెలియఁజేయు చెలుల పలుకులు విన రనియును, సామాన్యలు కేవల విత్తాపేక్ష గలవా రైన నచ్చటి వార లుత్తమ కులీనులై యౌవనము గలిగి సుందరులైన పురుషులనేకాని కూడ రనియు భావము. అలం. హేతూత్ప్రేక్ష.

చ. ద్రవిడ కుటుంబిను ల్పసపు ◊ రాచిన రత్నపుఁదాపక్రింద నం
బువు దెరవాఱఁగా నిదుర ◊ వోయి గరుత్తతి పచ్చఁబాఱినన్
భవనసరోమరాళములు ◊ భర్మమయచ్ఛద గుచ్ఛవిస్ఫుర
ద్దివిజధునీమరాళవితతిభ్రమఁ [1]బూన్చుఁ బురి న్భ్రమించుచున్. 64

టీ. భవన...ళములు - భవన = గృహసంబంధులగు, సరః = కొలఁకుల యందలి, మరాళములు = హంసలు, ద్రవిడకుటుంబినుల్ = ద్రావిడస్త్రీలు, పస...క్రిందన్-పసపురాచిన = పసపుఁబూఁదినట్టి, రత్నపుఁదాపక్రిందన్ = రత్నసోపానము క్రింద, అంబువు తెరవాఱఁగాన్ = ఉదకము తరంగితమగుచుండఁగా, నిదురవోయి = నిద్రించి, గరుత్తతి - గరుత్ = ఱెక్కలయొక్క, తతి = గుంపు, పచ్చఁబాఱినన్ = హారిద్రావర్ణము గలదికాఁగా, పురిన్ = శ్రీవిల్లిపుత్తూరను, భ్రమించుచున్ = తిరుగుచును, భర్మమయ...భ్రమన్ - భర్మమయ = స్వర్ణమయములగు, ఛద = ఱెక్కల

1. మాన్చు.

యొక్క, గుచ్ఛ=గుత్తులచేతను, విస్ఫురత్=ప్రకాశించుచున్న, దివిజధునీ=ఆకాశగంగ యందలి, మరాళ = హంసలయొక్క, వితతి = సమూహము, భ్రమన్ = భ్రాంతిని, పూన్చున్ = వహింపఁజేయును.

తా. ద్రావిడస్త్రీలు గృహముల వెనుక నుండెడుకొలనిలో రత్నసోపానముల మీఁదఁ బసుపుఁగొమ్ము నరుగఁదీసికొని పసుపాడి స్నానము సేయఁగా, నారత్నసోపానము క్రింద నిద్రఁబోవుచుండిన హంసలఱెక్కల కా పసుపు నీ రంటుకొని పచ్చబడియెఁ గావున నా హంసలే పట్టణమందుఁ దిరుగఁగా బంగారుఱెక్కలుగల స్వర్గమందలి హంసలని చూపఱ భ్రమింపఁజేయు ననియు, నచ్చటికొలఁకుల సోపానములు మణిమయము లనియును భావము. అలం. భ్రాంతిమంతము.

మ. తలఁ బక్షచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకు లుషస్స్నాతప్రయాతద్విజా
వలిపిండీకృత[1]శాటుల న్సవిఁ దదావాసంబుఁ జేర్పంగ రే
వుల డిగ్గ న్వెసఁ బాఱు వానిఁ గని నవ్వు న్శాలిగోప్యోఘముల్.

టీ. బాతువులు = బాతు లనియెడుజలపక్షులు, తలన్ = తమతలను, (జాత్యేక వచనము), పక్షచ్ఛటన్ = ఱెక్కచాలునందు, గ్రుక్కి = గ్రుచ్చి, (గ్రుచ్చి-యను పాఠముంగలదు) కేదారంపు...స్థలిన్ - కేదారంపు = వరిమళ్లసంబంధులగు, కుల్యా= కాలువలయొక్క, అంతరస్థలిన్ = మధ్యప్రదేశమందు, నిద్రింపఁగన్ = నిద్ర పోవుచుండఁగను, చూచి = కాంచి, ఆరెకులు = ఊరికాపరులు, ఉషస్స్నాత...లు- ఉషస్స్నాత = ప్రాతస్స్నానముఁజేసినట్టియు, ప్రయాత=చనినట్టి, ద్విజావళి=బ్రాహ్మణ సమూహముచేతను, పిండీకృత = పిడుచలుగాఁజేయఁబడిన, శాటులు = వస్త్రములు, అన్ సవిన్ = అను భ్రమచేతను, తదావాసంబు - తత్ = ఆ బ్రాహ్మణులయొక్క, ఆవాసంబున్=గృహములను, చేర్పంగన్=చేర్చుటకొఱకు, రేవులన్ = రేవులయందు, డిగ్గన్=దిగఁగా, వెసన్=వేగముచేతను, పాఱు = పరుగెత్తెడు, వానిన్=ఆబాతులను, కని=చూచి, శాలిగోప్యోఘముల్ - శాలిగోపీ = పైరుకాఁపరులగుస్త్రీలయొక్క, ఓఘముల్ = సమూహములు, నవ్వున్ = హసించును.

తా. ఆ పట్టణసమీపమందు వరిమళ్లకు దిద్దినకాలువలయందు బాతులు వాని స్వభావగుణముచేతఁ దలలు ఱెక్కలలోఁ దూర్చికొని నిద్రించుచుండఁగా దలవరులు వానిఁ జూచి యుషఃకాలమందు స్నానార్థమై యాకాలువలకు వచ్చినబ్రాహ్మణులు

1. శాటికల్సవిఁ; శాటికామతి. సవి - భ్రమార్థమున ప్రయోగము మృగ్యము. (ప).

కమవస్త్రములను బిండి యచ్చట నుంచి మఱచి పోయి రని తలంచి వాని మరల వారి వారి గృహములలో నొప్పగించుటకై రేవులలో దిగఁగానే యాపక్షులు పఱచుటఁ జూచి యచ్చటఁ బైరులను గాపాడుచున్న కరితలు తలవరులను బరిహాసింతు రని భావము. భ్రాంతిమదలంకారము. స్వభావోక్తియు.

మ. సొరిదిం బేర్చినలేఁగెమల్లియలు ఖర్జూరంబులు న్బుష్పమం
జరులు న్మామిడిగుత్తులు న్గుసుమముల్సంపెంగలు న్బచ్చగ
న్నెరు[1]లు న్బాళలు గల్గి రాజనముకాంతిం దారు ముల్సూపి చే
లరుదార న్నగుఁ బువ్వుఁదోఁటల బలాకానీకదంభంబునన్. 66

టీ. చేలు = కేదారములు, ('బహువచనే కుత్ర చిన్నులోపశ్చ' యను నన్నయ భట్టీయసూత్రమువలనఁ జేనుశబ్దబహువచన మారూప మయ్యెను.) సొరిదిన్=వరుసగాఁగ, పేర్చిన, లేఁగెమల్లియలున్=అల్లుమల్లెలును, ఖర్జూరంబులున్ = ఖర్జూరపుఁబూవులును (వర్ధిల్లినట్టి),పుష్పమంజరులున్=పువ్వులగుత్తులును, మామిడిగుత్తులున్=రసాలగుచ్ఛము లును, కుసుమముల్=(ఇతర) పుష్పములును, సంపెంగలున్=చంపకములును, పచ్చగన్నె రులున్ = పచ్చపూలకరవీరములును, పాళలు = పాళలనుపువ్వువిశేషములు, పువ్వుఁదోఁటలన్ = పుష్పోద్యానములను, (లేఁగెమల్లియలు, ఖర్జూరంబులు, పుష్పమం జరులు, మామిడిగుత్తులు, కుసుమములు, సంపెంగలు, పచ్చగన్నెరులు, పాళలు అను పేరుగలధాన్యవిశేషములు), కల్గి = కమకుం గలిగి, రాజనము=రాజన మను పేరుగల శాలివిశేషముయొక్క, కాంతిన్ = ప్రకాశముచేతను, తారు=ఆత్మన్ శబ్ద బహువచ నము (చే లనుట), ముల్సూపి = ముల్లుసూపి, (రాజనములకు ముల్లు గలిగియుండుట సహజము. త్రాసునఁ దూఁచునప్పుడు భారమగువస్తువు దిక్కునఁ ద్రాసుముల్లువ్రాలును గాన దమతమసామ్యవిమర్శయందుఁ దామే హెచ్చయ్యె ననుట), బలాకా...నన్- బలాకా=బెగ్గురుపిట్టలయొక్క, అనీక = సమూహ మనియెడు, దంభంబునన్ = నెపము చేతను, అరుదారన్ = ఆశ్చర్యమగునట్లు, నవ్వున్ = ప్రహసించును. (మూల్సూపి యనుచోట 'ప్రథమైక వచనమాత్రే వికృతానాంతాదయోవికల్పం తే' యను సూత్రమా కరము).

తా. అచ్చటి వరిచేలు పువ్వుఁదోఁటలయందుఁ గలలేఁగెమల్లియలు మొదలుగాఁ బాళె లను పదమువఱకుఁ జెప్పఁబడిన పేరులు గలధాన్యవిశేషములు తమయందుఁగలిగి తోఁటలయందుఁ గలుగనిరాజనము విశేషముగాఁ గలిగి యారాజనమునకుఁ గలముల్లని యెడు త్రాసుముల్లుఁ జూపి తాము హెచ్చగుటవలన నాపువ్వుఁదోఁటలను దమమీఁదఁ

1. పూఁబాళెలు.

దిరిగెడు బెగ్గురుపులుఁగుల తెలిచాయ లనియెడి నెపమున నవ్వుచున్న వని భావము. అనఁగాఁ బువ్వుఁదోఁటలకంటె నధికతరశృంగారములై వరిచేలు ప్రకాశించు నని తాత్పర్యము. అలం. సౌరదిక్...ముల్యాపి - వ్యతిరేకము; నగున్...దంభంబునన్-సాపహ్నవోత్ప్రేక్ష. హాసము...లాకలుగా నుత్ప్రేక్షితము.

చ. బలిసినహల్లకచ్ఛటలపైఁ దమ జుంజురుముండ్లు రాయఁగాఁ
గలమము లుండుఁ బండి యొఱగంబడి నీ రెడలింపఁ దృష్ణ లోఁ
దలకొన వంగి మున్ జలముఁ ద్రావెడు క్రిందటివేళ్లు మీఁదటన్
నిలిపి మరంద మానుకరణి న్నికటోపవనానిలాహతిన్. 67

టీ. కలమములు = వరిపైరులు, పండి = పక్వములై, నీ రెడలింపన్ = కట్టియున్ననీరు పరిపాకార్థమై (కోఁతకై) వెడలఁజేయఁగా, తృష్ణ = నీరువట్టు, లోన్ తల కొనన్ = అంతర్వ్యాపకము కాఁగా, వంగి=నమ్రములై (బడలికచేత ననుట), మున్ = పూర్వమందు, జలముఁద్రావెడు = ఉదకపానముఁజేసెడు, క్రిందటివేళ్లు = క్రిందనున్న మూలములను, మీఁదటన్ = ఉపరిభాగమందు, నిలిపి=ఉనిచి, బలిసిన=పుష్టిగల, హల్లకచ్ఛటలపైన్ - హల్లక = చెంగలువపువ్వులయొక్క, ఛటలపైన్ = గుంపులమీఁద, మరందము=మకరందమును, ఆనుకరణిన్ = పానముసేయురీతిగా, నిక...తిన్-నికట = సమీపమందలి, ఉపవన = ఉద్యానవనములవలని, అనిల = గాలియొక్క, ఆహతిన్ = వీఁచుటచేతను, తమజుంజురుముండ్లు = తమయొక్క ధాన్యమంజరీకంటకములు, రాయఁగాన్ = ఒఱసికొనుచుండఁగా, ఒఱగంబడి = కైవ్రాలి, ఉండున్=ఉండును.

తా. వరిపైరులు పక్వము కాఁగానే కోఁత నిమిత్తమై మళ్లలో నీ రుండనీక కర్షకు లెడలించిన నెల్లప్పు డుదకపానము సేయుచున్నయవి గావున నప్పుడు నీరు లేమిం జేసి దప్పిచేత సామళ్ళలోఁ బుష్పించి యున్న చెంగలువ పువ్వులమీఁద వ్రాలి మున్ను నీరు ద్రావెడు వేళ్ళవలె నున్న ముండ్లు రాచుకొనుచుండఁగాఁ బువ్వులఁదేనె యానిన ట్లుండె ననియును, వాయువశముచేతఁ గదలుచుండఁగాఁ దృష్ణాభరమువలని బడలికచేత సోలుచున్న వన్నట్లుండె ననియు భావము. కేదారములయందుఁ బైరులు పండి యొఱగియుండు నని ముఖ్యతాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

చ. అసుగునఁ బండి ప్రీలి యసలై మధు[1]వుట్టఁగఁ ద్రావఁ దేంట్లు మ
ల్లడిఁ గొనిచుట్టి రాఁ బనసల న్బొలుచు న్గలుగుండ్లతోడ నీ
డ్వడు పెనుఁబండ్లు భిన్నకటపాంసుల భూరిమదాంబుసేచనా
జడదృఢశృంఖలాయుతవసంత [2]మదద్విరదాధిపాకృతిన్. 68

1. పుట్టఁగఁద్రావి. 2. నృప.

టీ. కలుగుండ్లతోడన్ = బొలిగుండ్లతోడ, ఈడ్వడు = సమానములగు, పెనుఁ బండ్లు = పెద్దఫలములు, అడుగునన్ = భూమిలోనే, పండి=ఫలించి, వ్రీలి = బ్రద్దలై, ఆసలై=బురదయై, పనసలన్=(వేరు) పనసచెట్లయందు, మధువు = రసము, ఉట్టఁగన్= కాఱఁగా, త్రావన్ = పానముసేయుకొఱకు, తేంట్లు = భృంగములు, (ఇచ్చటఁ దేఁటి శబ్దమునకు బహువచనమందు లువర్ణము పరముకాఁగాఁ దేఁటు లని రూపము వచ్చెం గావున 'రోలోడలటాముదితాంతస్య చవాలుక్సలోలోశ్చ' యనునాంధ్రశబ్దచింతామణి సూత్రమునుబట్టి యలతేఁటి శబ్దాంతమందలి టివర్ణేకారము వికల్పముగా లుప్తం బగుటంజేసి తేఁట్లనినిలుపవలసియుండినను తేంట్లని పూర్ణబిందుయుతముగా బహుప్రయోగముల కలిమింజేసియును, 'శాస్త్రప్రయోగవచసోః శ్శాస్త్రం బలవదుచ్యతే, అనిష్పన్నే పదే తేన ప్రయోగాశ్రయణం హితమ్' అను వికృతి వివేకసూత్రము కలిమిబలిమిం జేసియును, నిట్టే బోఁట్లుమొదలగు శబ్దములు కానంబడు చుండుటంజేసియును దేంట్లని యుండుటే సాధువుగాఁ దోఁచుచున్నది.) మల్లడిఁగొని = పెనఁగొని, చుట్టిరాన్ = చుట్టికొనిరాఁగా, భిన్న=పగిలినట్టి, కట = చెక్కిళ్ల యందలి, పాంసుల = పరాగితమైన, భూరి...కృతిన్-భూరిమదఅంబు=అధిక మదజలముయొక్క, సేచన=తడుపుగలట్టియు, ఆజద=కదలుచున్న, దృఢ=గట్టియైన, శృంఖలా = సంకెలతోడను, యుత=కూడికొన్న, వసంత...కృతిన్ - వసంత = వసంతునియొక్క, మదద్విరదాధిప = మదపుటేనుఁగు మిన్నలయొక్క, ఆకృతిన్=ఆకారముచేతను, పొలుచున్ = ప్రకాశించును.

తా. వేరుపనస పండ్లు భూమిలోనే పండి పగులఁగా నారసము పగిలినభూమిలో నుండి పైకివచ్చి బురదకాఁగా, నవ్వాసనకుఁ దుమ్మెదలు పెనఁగొని చుట్టుకొనఁగా నాపండ్లే వసంతుని మదపుటేనుఁగులవలె నున్న వనియును, మదాతిశయమువలన భిన్నములైన చెక్కిళ్లవలనఁ దొఱఁగెడు మదధారలతోఁ గలసిన దుమ్ముతోడి బురదవలె నాఫలరస మున్న దనియును, గదలుచున్న యినుపసంకెలవలెఁ జుట్టుకొన్న తుమ్మెద లున్న వనియు భావము. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. చాల దళంబుగాఁ బృథులకచంపకకీలనఁ బొల్చు బొం[1]దుఁ దో
మాలె లనంగఁ బండి మహిమండలిఁ జీఱుచు వ్రాలి గంధమూ
ర్ఛాలసయైన భృంగతతికానాఁ దుద కప్పమర న్ఫలావళు
[2]ల్వ్రీలి గెల ల్సుగంధి కదళీవనపఙ్క్తుల నొప్పు నప్పురిన్. 69

టీ. అప్పురిన్=అపట్టణమందు, సుగంధి...పఙ్క్తులన్-సుగంధికదళీ = సుగంధులను పేరుగల యరఁటిచెట్లయొక్క, వన = తోఁటలయొక్క, పఙ్క్తులన్ = గుంపుల

---

1. దుతో. 2. వ్రీలిగెల.

యందు, గెలల్ = గుళుచ్ఛములు, చాలన్ = మిక్కిలియు, దళంబుగాన్ = దట్టమగునట్లు, పృథుల...లనన్-పృథుల=గొప్పలగు, చంపక=సంపంగిపూలయొక్క, కీలనన్ = కూర్పుటచేతను, పొల్చు = ఒప్పుచున్న, బొండుఁదోమాలెలుఅనంగన్ = లావుగల తోమాలె లనునట్లు, పండి = ఫలించి, ఫలావళులు = పండ్లవరుసలు, వ్రీలి=పగిలి, మహిమండలిన్ = భూమండలమందు, చీఱుచున్ = రాచికొనుచు, వ్రాలి = సంపంగిపూలమీఁదవ్రాలి, గంధ...లస-గంధ=పరిమళమువలని, మూర్ఛా=శోషచేతను, అలస ఐన = వివశమైన, భృంగతతి నాన్=భృంగసమూహ మనఁగా, తుదకప్పు - తుద=తమ కొనలయందలి, కప్పు = నీలిమము, అమరన్ = కనుపడఁగా, ఒప్పున్ = ప్రకాశించును, (ఈపద్యము మూఁడవపాదమందుఁ బ్లుతయతి.) అలం. ఉత్ప్రేక్ష.

తా. ఆపట్టణమం దరఁటితోఁటలయందు సుగంధు లనియెడు నరఁటిపండ్లు గెలలయందు లెస్స పండి విరిసి కొనలయందు నలుపు గలిగి భూమిపర్యంతము జీరాడుచుండఁగా, ఆపండ్లగెలలు సంపెంగపూల బొండుతోమాలెలవలె నున్న వనియును, బండ్లు వికసించిన సంపెంగ పువ్వులవలె నున్న వనియును, బండ్లకొనల నున్న నీలకాంతి యాసంపెంగ పువ్వులమీఁద వ్రాలి మూర్ఛవోయిన తుమ్మెదలవలె నున్న వనియును, నట్టిగెలలు తోమాలెలవలెఁ బొడవు గలిగి యాఁదోఁకపాటుగా నున్న వనియును భావము.

చ. మన కనురక్తి హెచ్చు నిదె । మం దని కంఠముఁ గౌఁగిలించి ని
క్కిన ఫణిరాజవల్లి యెఱిఁ । గింపఁగనో యనఁ బూగము ల్భరం
బునఁ బడుమట్టచేఁ జెఱకు । ముత్తియము ల్చిటిలించి తద్రసం
బనిశము వండు నంతికత । లాంతికఁ జూర్ణముఁ జేయు నప్పురిన్. 70

టీ. కంఠమున్=మెడను, కౌఁగిలించి = ఆలింగనముఁజేసి, నిక్కి...ల్లి-నిక్కిన=(ఎగఁబ్రాకి) నిగిడినట్టి, ఫణిరాజవల్లి=తమలపుఁదీఁగె యను లతకూన, మనకున్ = మన యిద్దఱకును, (తమలపాకునకును బోఁకచెట్టునకు ననుట.)అనురక్తి=(అరుణిమ), హెచ్చన్ = అతిశయించుటకు, ఇదె=ఈచూర్ణమే, మందుఅని = ఔషధ మని, ఎఱిఁగింపఁగనో = తెలియఁజేయఁగానో, అనన్=అనునట్లుగా, పూగముల్ = పోఁకచెట్లు, భరంబునన్ = పోఁకలభారముచేత, పడు=పతనమగు, మట్టచేన్ = పోఁకగెలలచేతను, చెఱకుముత్తియముల్ = సమీపమందున్న చెఱకులలోని ముత్తెములను, చిటిలించి=రాల్చి, తత్ రసంబు= ఆచెఱకురసమును, అనిశము=నిరంతరము, వండు...కన్-వండు=పాకముఁ జేయుచున్న, అంతికతల=సమీపస్థలమందలి, అంతికన్ = ప్రొయ్యియందు, చూర్ణమున్ చేయున్ = సున్నమును చేయును, అప్పురిన్ అని మొదటికన్వయము క. 'జలధర ఫణిఫణకీచక.

జలచర కరిమస్తకేషు శంఖవరాహాః, జ్వలదంష్ట్ర శుక్తిజాశం, బులుముత్తెము లొప్పు వర్ణముల వివిధములై.' అని చెప్పఁబడిన రత్నశాస్త్రపద్ధతిచేతఁ జెఱకులయందును ముత్యము లుండుట ప్రసిద్ధము.

తా. ఆపట్టణమందుఁ జెఱకు తోఁటలలోనే తమలపాకు తీఁగెలును పోఁకమ్రాఁకులును నాటఁబడి యున్న వనియును, ఆచెఱకుపా లచ్చటనే వండు చున్నా రనియును, పోఁకలమట్ట లప్పటప్పటికిఁ బరిపక్వములై చెఱకులమీఁదఁ బడఁగా నందలి ముత్తెములు చెదరి ప్రొయ్యిలోఁ బడి సున్న మగుచున్న దనియును, నట్లు సున్న మగుటకుఁ బోఁకచెట్లనియెడు పురుషులకంఠములను దమలపుఁదీగె యనుపొలఁతి యల్లుకొనుట యనియెడు కవుఁగిలింతఁజేసి మన కిద్దఱకు ననురాగము కల్గుటకు నీసున్నము మం దని తెలుపఁగా, దాని వలన నాపోఁకచెట్లే సున్నముఁ జేయుచున్న వనియును, ఆసుపోఁకలకు సున్న మెఱుపు తెచ్చునది యనియును భావము. హేతూత్ప్రేక్ష. తమలపుతీఁగయందును పోఁకమ్రాఁకునను నాయికా నాయకస్ఫురణ సమాసోక్తి. ఉత్ప్రేక్షకు అంగము.

చ. అలరుఁ బురంబునం దొగల నంతరదామరఁ బ్రాఁచిఁ గప్రపుర్
వలపులు [1]మీఱ లో వలుద వాలుగమొత్తము పోర నీరుకో
[2]ళ్లొ కొళకొళ యంచుఁ గ్రుంకుమెడగుంపులవంపులుతోఁప మావితోఁ
పుల విరుల న్బయి న్నడుపఁ బొల్చుపురాతనతీర్థకుండముల్. 71

టీ. పురంబునన్ = ఆపట్టణమందు, తొగల=కలువలచేతను, అంతరదామరన్= జలవల్లిచేతను, ప్రాఁచిన్ = శైవాలముచేతను, కప్రపుర్వలపులు = కర్పూరవాసనలు, మీఱన్=అతిశయింపఁగా, లోన్=లోపలను, వలుద = పెద్దవగు, వాలుగమొత్తము = వాలుగచేఁపలగుంపు, పోరన్=కలహింపఁగా, నీరుకోళ్లు=జలకుక్కుటములు, ('సలోళ్ళ' యనుసూత్రమునుబట్టినీరుకోడి యనుశబ్దమునకును బహువచనమందు నీరూపమువచ్చును.) కొళకొళఅంచున్ = కొళకొళధ్వనిఁజేయుచు, క్రుంకు = మునుఁగునట్టి, మెడగుంపుల = కంఠసమూహములయొక్క, వంపులు = నమ్రీకరణములు, తోఁపన్ = కానరాఁగా, మావితోఁపులన్ = మామిడితోఁపులయందు, విరులన్ = పువ్వులచేతను, పయిన్ = ఉపరిభాగమందు, నడువన్పొల్చు = నడుచుటకు వలనగు, పురాతనతీర్థ కుండముల్= ప్రాఁతనీటిగుండములు, అలరున్ = ఒప్పును.

తా. ఆపట్టణమందు మామిడితోఁపులలోనఁ బ్రాఁతబావు లుండు ననియును, నాబావులయందుఁ గలువలు మొదలయిన వానివాసనలు కర్పూర వాసనలవలె నుండు

1. మీఱఁగా. 2. కొలకొల.

ననియును, లోపల వాలుగ చేఁపలు చెఱలాడు ననియును, నీరుకోళ్లు మునుఁగుచు లేచు చుండు ననియును, బైని నిండిన పూలచేత నవి బావు లని తెలియరాక నడిచి పోవచ్చు ననిపించు ననియును భావము. అలం. స్వభావోక్తి.

శా. సాయంకాలములం దదీశమురజి[1]త్సద్మస్వనద్దుందుభి
స్ఫాయత్కాహళికాప్రతిస్వనత తోఁపన్గుంజగర్భంబుల
న్మ్రోయుం గేళివనిం గులాయగమన ప్రోత్తిష్ఠ దంతస్సర
స్స్థాయి శ్వేతగరుద్గరుత్పటపటా త్కారంబుఁ గ్రేంకారమున్ 72

టీ. (ఆపురమందు) సాయంకాలములన్ = సూర్యాస్తమయకాలములయందు, కేళివనిన్=లీలోద్యానమందు, కులాయ...ఖున్-కులాయ=గూండ్లనుగూర్చి, గమన = పోవుట కొఱకు, ప్రోత్తిష్ఠత్=లేచుచున్న, అంతస్సరః=కొలఁకులలోన, స్థాయి=ఉన్నట్టి, శ్వేతగరుత్=హంసలయొక్క, గరుత్ =ఱెక్కలవలనఁబుట్టిన, పటపటాత్కారంబున్= పటపటాకృతియును, క్రేంకారమున్ = కంఠక్రేంకృతియును, తదీశ...త్-తత్ = ఆశ్రీవిల్లిపుత్తూరికి, ఈశ=స్వామియగు, మురజిత్ = మన్నారుకృష్ణునియొక్క, పద్మ = కోవెలయందు, స్వనత్=మ్రోయుచున్న, దుందుభి = భేరులయొక్కయు, స్ఫాయత్= వృద్ధియగు, కాహళికా = బూరుగులయొక్కయు, ప్రతిస్వనత = ప్రతిధ్వను లగుట, తోఁపన్=తోఁచునట్లు, కుంజగర్భంబులన్ = పొదరిండ్లలోపలను, మ్రోయున్=ధ్వనిఁ జేయును.

తా. సాయంకాలములయందు విల్లిపుత్తూరియం దుండు నుద్యానవనములోని సరస్సులయందు హంసలు విహరించుట చాలించి గూండ్లకుఁ బోవుటకు లేచునప్పుడు వాని ఱెక్కలవలనఁ బుట్టిన ధ్వనులును గంఠధ్వనులును వినఁబడఁగా, నప్పుడే యాపట్టణమందు స్వామి యగు మన్నారుకృష్ణునికోవెల సంధ్యాకొలువులోఁ మ్రోసెడు భేరుల ధ్వనులును గాహళముల ధ్వనులును వ్యాపించి పొదరిండ్లలోఁ బ్రతిధ్వను లిచ్చుచున్నట్లు తోఁచు ననియు, నప్పుడు పటపటాత్కారము భేరీ ప్రతిధ్వనిగాను క్రేంకారము కాహళ ప్రతిధ్వనిగాను దోఁచు ననియు భావము. అలం. ఉత్ప్రేక్షా భ్రాంతిమంతములకు సందేహముతో సంకరము.

మ. పొలయుం గాడ్పు లుదజ్మహాలయవదంభోజాతషువత్స్థల
స్యలఘుప్రజ్మకరందబిందువులఁ బశ్ఛాయరంపుఁబుణ్యాంపుఁగం

1. త్సద్మధ్వనద్దుందుభి.

పులఁ దాపత్రయి మీఁటి వీట నటనప్రోద్యోగసజ్జీభవ
ల్లలనావర్జితకైశికక్షురితకహ్లారాళి నల్లార్చుచున్ 73

టీ. వీటన్ = అప్పట్టణమందు, ఉద...లన్ - ఉదక్ = ఉత్తరదిశయందు, మహత్ = గొప్పదియగు, ఆలయవత్ = కోవెల గలిగిన, అంభోజాక్ష = మన్నారు కృష్ణునియొక్క, వక్షః = అక్కునందలి, తులసీ = తులసీదళములయొక్క, అలఘు = గొప్పలగు, స్రక్=మాలికలయందలి, మకరందబిందువులన్ = మకరందకణములచేతను, పణ్యారంపు=అపూపసంబంధులగు, పుణ్యంపు=పవిత్రములగు, కంపులన్=వాసనలచేతను, తాపత్రయిన్ = ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవికము లనుతాప (దుఃఖ) త్రయమును, మీఁటి=పొడిచి, నటన...శిన్ - నటన = నాగవాస మనెడు, ప్రోద్యోగ = ఉద్యోగమునకు, సజ్జీభవత్=ఆయితమగుచున్న, లలనా = వారకాంతలచేతను, ఆవర్జిత = చెరువఁబడిన, కైశిక = కొప్పులవలన, క్షురిత = జాఱిన, కహ్లారాళిన్=చెంగలువ పూలచాలును, అల్లార్చుచున్ = మెల్లనఁ గదలించుచు, గాడ్పులు = వాయువులు, పొలయున్ = వీచును. ఈపద్యమం దుదఙ్మహాలయవదంభోజాక్షశబ్దము ద్రవిడభాషయందు—వడపెరుంగోయి లుడయ రని యీ మన్నారు కృష్ణుని కేర్పడి యున్నదానికి సంస్కృత రూపము.

తా. ఆపట్టణమందు వాయువులు మన్నారుకృష్ణునివక్షస్థ్సలమందలి తులసీవనమాలికల మకరంద బిందువుల మీఁద వీఁచుటంజేసి యాశైత్యంబును, బరిమళంబును స్వామి కోవెలయందలి యపూపములపైఁగా వీఁచుటంజేసి పుణ్యసౌరభంబును, అందలి యాటకత్తెల కొప్పుల చెంగలువల నల్లనల్లనఁ గదల్చుచు మాంద్యంబును నందలి సౌరభంబును గలిగి సంచరించు నని భావము. అలం. స్వభావోక్తి.

చ. మలయపుగాలి రేలు వనమాలి విమానపతాక ఘల్లుమం
చులియఁ బసిండిమువ్వగమి నొక్కొకమాటు కదల్ప నుల్కి మి
న్నలము తదీయ హేమవరణాంచలచంపకశాఖలందుఁ బ
క్షులు రొద సేయ వేగె నని కూడుదు రల్కలు [1]దేఱి దంపతుల్.

టీ. (ఆపురమందు) మలయపుగాలి=మలయమారుతము, రేలు=రాత్రులయందు, వన...తాకన్ - వనమాలి = స్వామియొక్క, విమాన = కోవెలయందలి, పతాకన్ = ధ్వజమందు, పసిండిమువ్వగమిన్ = బంగారుచిఱుగంటలగుంపును, ఘల్లుమంచున్ ఉలియన్=ఘల్లుమని ధ్వనిసేయునట్లు, ఒక్కొకమాటు = ఒక్కొకసారి, కదల్పన్=కద

1. దీఱి; మాని.

పఁగా, మిన్న...దున్ - మిన్ను అలము = ఆకసము నంటెడు, తదీయ = ఆకోవెల ంబంధియగు, హేమవరణ=బంగారు ప్రాకారముయొక్క, అంచల = అంచుల నున్న, చంపక శాఖలందున్ = సంపెంగకొమ్మలయందు; పక్షులు = పులుఁగులు, ఉలికి=అదరు పాటుఁజెంది, రొదసేయన్ = కలకలఁబలుకఁగా, దంపతులు = ఆపట్టణమందలి స్త్రీ పురుషులు, వేగెను అని=తెల్లవాఱె ననుకొని, అల్కలుదేఱి=ప్రణయకోపములను మాని, కూడుదురు = సంభోగింతురు.

తా. ఆపట్టణమందు స్వామికోవెలధ్వజస్తంభమం దున్న బంగారుమువ్వలు రాత్రులయందు మలయమారుతము సోఁకి కదలి ఘల్లు మని యొకొక్కసారి చప్పుడు కాఁగా, నాకోవెలబంగారుప్రాకారమువెంబడి నున్న సంపెంగ కొమ్మలయందు నిద్రించుచున్న పక్షు లదరి ధ్వనిఁ జేయఁగా, విని పక్షులు కూయుచున్నవి. తెల్లవాఱ వచ్చె నని భ్రమించి ప్రణయ కలహములు వహించియున్న దంపతులు కోపములు మాని యప్పుడ రమింతు రని భావము. అలం. భ్రాంతిమంతము.

చ. కలమపుటెండుగు ల్ద్రవిడకన్యలు ముంగిటఁ గాచి యుండి త
జ్జలరుహనాభగేహరురుశాబము సారెకు బొక్కులాడఁ గొం
డెలపయి కమ్మ గ్రామ్యతరుణీతతి డించిన పేఁపగంపలం
[1]దల మగుచున్న చెంగలువదండలఁ దోలుదు రప్పురంబునన్. 75

టీ. అప్పురంబునన్=ఆవిల్లిపుత్తూరను, ద్రవిడకన్యలు = ద్రావిడకన్యకలు, కలమపు టెండుగుల్=రాజనపువడ్లుపోసినయెండుగులను, (ఎండఁబోసినధాన్యమును) ముంగిటన్= గృహపురోభాగమందు, కాచియుండి = కనిపెట్టియుండి, తజ్జ...ము - తత్ = ఆపట్టణ మందలి, జలరుహనాభ=స్వామియొక్క, గేహ=కోవెలయొక్క, రురుశాబము=ఇఱ్ఱిపిల్ల, సారెకున్ = మాటిమాటికిని, బొక్కులాడన్ = ఆయెండఁబోసినవడ్లు దినుచుండఁగా, కొండెలపైకన్=తమకొండె సిగలమీఁదికిఁగా, అమ్మన్=విక్రయించుటకై, గ్రామ్యతరుణీ తతి=పల్లెలస్త్రీలసమూహము, డించిన = అక్కడ దించుకొనియున్న, పేఁపగంపలన్= పేములచే నల్లినగంపలయందు, దలముఅగుచున్న=నిండియున్న, చెంగలువదండలన్ = ఎఱ్ఱకలువదండలచేత, తోలుదురు=పోఁజోపుదురు. అలం. స్వభావోక్తి.

తా. ఆవిల్లిపుత్తూరియందు ద్రవిడకన్యకలు ముంగిళ్ల నెండఁబోసియున్న వడ్లకుఁ గావలియుండఁగా, నచ్చటి స్వామికోవెలలోని పెంపుడు జింకపిల్ల యావడ్లు మాటి మాటికి బొక్కుచుండఁగా, నావిల్లను వేఱ మఱియొకదానిచేఁ గొట్టిన నొచ్చు ననియెదు

1. తలముగ నున్న.

సానృశంస్యముచేతను, దమకొండెసిగలపైకెఁగాఁదెచ్చి విక్రయార్థ మచ్చట దించుకొని యున్న గ్రామ్యస్త్రీల పేఁపగంపలలోని కలువదండల చేతనే తేలుదు రని భావము.

భాగవతులు

సీ. ఎదు రేఁగి సాష్టాంగ మెరఁగి పాద్యం బిచ్చి
నారికేళకటాసనముల నునిచి
నునుఁ బోఁకపొత్తిఁ గుట్టిన దొప్ప గమితోడ
రంభవిశాలపర్ణములు పఱచి
శాల్యన్నసూపాజ్య కుల్యాబహువ్యంజ
నక్షీర దధుల[1]ర్పణంబుఁ జేసి
వార్చినపిదప సంవాహన మంఘ్రుల
గొనరిచి తాంబూల మొసఁగి కుశల
తే. మడిగి పోయెద మన్న దవ్వనిచి సిరికిఁ
దగినసత్కృతిఁ జేసి ఖేదమున [2]మగిడి
యర్చఁ గావింతు రెపుడు నిట్లతిథు లైన
భాగవతులకు [3]నప్పురిభాగవతులు. 76

టీ. అప్పురిన్ = ఆపట్టణమందలి, భాగవతులు=భగవత్సంబంధులు, అతిథులైన = అభ్యాగతులైన, భాగవతులకున్ = భగవద్భక్తులకు, ఎదురేఁగి = ఎదురుగాఁబోయి, సాష్టాంగము = కరపాదఫాలవక్షోభుజము లనియెడి యష్టావయవములతోఁ గూడునట్లు, ఎరఁగి=ప్రణమిల్లి (శ్లో. 'వైష్ణవంవైష్ణవోదృష్ట్వా దణ్డవత్ప్రణమేద్భువి' యన్నట్లు దండ ప్రణామముఁ జేసి యనుట), పాద్యం బిచ్చి = పాదప్రక్షాళనముఁజేసి, నారికేళకటాస నములన్ = నారికేదపుటాకులచే నల్లినచాఁపలయందు, ఉనిచి = కూర్చుండఁబెట్టి, (స్నానాద్యనుష్ఠానములు మున్నే తీర్చికొనివచ్చినారుగాన,) నునుఁబోఁకపొత్తిన్-నును= మృదువగు, పోఁకపొత్తిన్ = పోఁకమట్టచేత, కుట్టిన=కూర్చిన, దొప్పగమితోడన్ = దొన్నెలగుంపుతోఁగూడ, రంభా విశాల పర్ణములు=వెడందయరఁటియాకులు, పఱచి = ఆస్తీర్ణముఁజేసి, శాల్యన్న...లు - శాల్యన్న=వరియన్నమును, సూప = పప్పును, ఆజ్య కుల్యా = నేతికాలువలును, బహువ్యంజన = పెక్కుపరికరములును, క్షీరదధులు = పాలుపెరుఁగులును, అర్పణంబుఁజేసి = వారికి సమర్పించి, భోజనానంతరము, వార్చిన

1. క్షీణనము. 2. మగుడి. 3. నవీ్వటి.

పిదపన్=హస్తప్రక్షాళన పాదప్రక్షాళనములవెనుక ఆచమనముఁజేసిన యనంతరమందు, అంఘ్రులకున్ = వారిపాదములకు, సంవాహనము = మర్దనము, ఒనరించి=చేసి (పాదములఁ బిసికి యనుట), తాంబూలము ఒసఁగి=విడెమిచ్చి, కుశలము అడిగి = వారప్పటికి సేదదేరియుండఁగాఁ గుశలప్రశ్నఁజేసి, పోయెదము అన్నన్=వారే పోయెద మని చెప్పిరేని, (వీరు బలాత్కారముగా నిల్పుటకు స్వాతంత్ర్యములేనివారుగావున వెంబడించి) దవ్వు=దూరముగ, అనిచి=సాగనంపి, సిరికిన్ తగిన=తమ కలిమికిఁ దగిన, సత్కృతిఁజేసి=సత్కారముఁజేసి (సంభావన యిచ్చి యనుట), ఖేదమునన్=ఎడఁబాసిన దుఃఖముచేతను, మగిడి=తిరిగి, ఎపుడును=ప్రతిదినమును, ఇట్లు=ఈచెప్పినట్లు, అర్చన్ కావింతురు=పూజ సేయుదురు.

తా. సులభము. ఇచట భాగవతు లతిథులం బూజించి రనుట విష్ణుచిత్తుఁ డీరీతిని భాగవతులం బూజించు నని సూచించుచున్నది. అలం. ఆజ్యకుల్యా-అతిశయోక్తి. పద్యమంతట స్వభావోక్తి.

విష్ణుచిత్తుడు

శా. అం దుండుం ద్వయసద్మపద్మవదనుం డద్వంద్వుఁ డశ్రాంతయో
గాందూబద్ధమధుద్విషద్ద్విరదుఁ డన్వర్థాభిధానుం డురు
చ్ఛందోబృందతదంతవాగపఠనాసంజాతతజ్జన్య ని
ష్పందద్వైతసుసంవిదాలయుఁడు నిష్ఠ న్విష్ణుచిత్తుం డనన్. 77

టీ. ద్వయ...నుండు - ద్వయ = ద్వయమను శ్రీవైష్ణవమంత్రమునకు, సద్మ = గృహమైనట్టియు, పద్మ = కమలమువంటి, వదనుండు = ముఖముగలయట్టియు, అద్వంద్వుఁడు = శీతోష్ణ సుఖదుఃఖాదులు లేనియట్టియు, అశ్రాం...డు-అశ్రాంత=ఎడతెగని, యోగ = న్యాసయోగ మనెడు, అందూ = సంకిళ్లచేత, బద్ధ = కట్టఁబడిన, మధుద్విషత్=మధుసూదనుఁ డనియెడు, ద్విరదుఁడు=ఏనుఁగు గలయట్టియు, ఉరు...డు-ఉరు = బహువిధము లయిన, ఛందః = వేదములయొక్క, బృంద = సమూహము యొక్కయు, తదంత-తత్ = ఆవేదములయొక్క, అంత = అంతములగు నుపనిషత్తుల యొక్క, వాక్=వాక్యములయొక్క, అపఠనా=చదువమిచేతనే, సంజాత=పుట్టినట్టియు, తజ్జన్య = ఆవేదవేదాంతజన్య మగునట్టియు, నిష్పంద = చలింపనియట్టి, ద్వైత = చిదచిదీశ్వర భేదకమైన, సుసంవిత్=మంచిజ్ఞానమునకు, ఆలయుఁడు=గృహమగునట్టి, విష్ణుచిత్తుండు అనన్ = విష్ణునందుఁ జిత్తము గలవాఁ డనఁగా, అన్వర్థాభిధానుండు =

సార్థకనామధేయుఁ డగు పరమయోగి, నిష్ఠన్ = సదాచార సంపత్తిచేతను, అందున్ = ఆ శ్రీవిల్లిపుత్తూరియందు, ఉండున్ = నివసించును.

తా. ఆ శ్రీవిల్లిపుత్తూరియందు నిరంతరము ద్వయానుసంధానముఁ జేయుచు, సుఖదుఃఖములు శీతోష్ణములు సరిగాఁ దలంచుచుఁ, దన నిరంతర యోగముచేత శ్రీపతిని వశపఱచుకొని వేదవేదాంతములు చదువకయే వాటివలనఁ గలుగవలసిన నిశ్చల దైవతజ్ఞానమునకుఁ దాను నివాసభూమి యై విష్ణుచిత్తుం డనుసార్థకనామధేయముగల యొకమహాయోగి నిష్ఠఁ గలిగియుండు నని భావము. (ద్వయ తిరుమంత్ర చరమ శ్లోకములు వైష్ణవ సాంప్రదాయకములు).

వ. అమ్మహీసురవరుండు ప్రకృతికంటెఁ బరుం డగు తన్నును, దనకంటెఁ బరుం డగు పరమేశ్వరుం, బరమేశ్వర ప్రసాద బహుజననకృత సుకృత ఫలరూప యగు నాచార్యకృప గుప్తదానంబు నిధానంబుఁ దెలిపిన గతిం దెలుపఁగా, నాత్మీయతదీయ శేషశేషిత్వసంబంధం బనాద్యంబుగాఁ దెలిసి "యీ తెలివి గలిగి యఖర్వనిర్వృతిం గాంచి సుఖించు పరమయోగికి బహుక్లేశదంబు లగు చదువులం బనియేమి, యీవివేకంబు లేనివాని హేతువాదంబు ధాతువాదంబు, కాణాదంబు ప్రాణాదంబు, కాపిలంబు చాపలంబు, మీమాంస హింస, వ్యాకరణం బశరణం, బటుగాక చదువ దొరకొనిన నరునకుఁ గాలంబు నాలంబు, విఘ్నంబు లఖిలోద్యమఘ్నంబు, లందులకు సామగ్రి గిటగిటన, గొంతెఱుంగ నగు మదంబు పుటపుటన, దుదముట్టం జదివెనేనియు సముత్పన్న విజ్ఞానుం డై త్రైగుణ్యవిషయంబులగువాని నానీతధాన్యుండు నిష్ఫలం బైన పలాలంబును నాలబ్ధమధుండు సిక్థకంబును విడుచువడువున విడువవలయుఁ, గావున శాంతిదాంతిపరతం[1]బరమైకాంతి నైననాకు మొదలనివి యధిగమింపం దుద విసర్జింప నేమిప్రయోజనంబు; వాదిభంజనంబు రాజరంజనంబును జేయుచుఁ బునర్జననంబులకు విసువనిజనంబులకుఁ గానిమ్ము మాదృశులకుఁ దదీయఖ్యాతి యీతి, లాభంబు క్షోభంబు, పూజనం బుద్వేజనం" బని వితర్కించి యుర్వరఁ బూర్వంబున సౌవీరభూరమణునకు గౌరవం బంగీకరించి బోధించి ముక్తి కనిచిన భరతభూమిసురవతంసంబునుబోలె దుర్విభావ్యబోధుండై పరమ

1. పరమైకాంతికునకు; పరమైకాంగి నైన నాకు.

పదంబునను భాగవతుల కప్రాకృతంబు లగు బహుభద్రమూర్తులు
భరియించి భగవత్పరిచర్య సేయుట[1]యుఁ బరమపురుషార్థం బగుట
యెఱిఁగి యచటి రథచరణపాణిమాలికాకరణకైంకర్యంబున కంకు
రితకౌతూహలుం డై చేయుచుండె, మఱియును. 78

టీ. అమ్మహీసురవరుండు = ఆబ్రాహ్మణోత్తముఁడు (విష్ణుచిత్తుఁడు), ప్రకృతి
కంటెన్=ఇరువదినాల్గు తత్త్వములుగల యచిత్తుకంటె, పరుండుఅగు=వేఱైన, తన్నును=
జీవు ననుట, తనకంటెన్ పరుండుఅగు పరమేశ్వరున్=బ్రహ్మమును, అనఁగా శ్లో. ఈశ్వర
స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి, భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని
మాయయా.' అను తెఱఁగునఁ దనకంతర్యామి యగు పరమేశ్వరు ననుట. పరమే...
రూప-పరమేశ్వరప్రసాద = భగవదనుగ్రహమువలన నైన, బహుజనన=పెక్కుజన్మముల
యందు, కృత = చేయఁబడిన, సుకృత = పుణ్యములకు, ఫలరూప = ఫలస్వరూపము
అగు, ఆచార్యకృప = గురుకారుణ్యము (ఇది కర్తృపదము), గుప్తదానంబు = పూర్వ
జన్మమందుఁజేసిన యేకాంతదానము, నిధానంబున్ తెలివినగలిగెన్ = సద్యోజన్మమందు
నిక్షేపమును దెలిపిన తెఱంగున, తెలుపఁగాన్=తెలుపఁగా, అనఁగా సకలవేదశాస్త్రపురా
ణేతిహాసములకు సారభూతమైన చిదచిదీశ్వర తత్త్వత్రయజ్ఞానమును బహుజన్మకృత
సుకృతలబ్ధమైన యాచార్యకృప తేటపఱిచిన దనుట. శ్రు. 'ఆచార్యదేవోభవ' యని తైత్తి
రీయశ్రుతియందును, 'ఆచార్యవాన్ పురుషోవేద' యని ఛాందోగ్యమందును, 'యస్యదేవే
పరాభక్తి ర్యథాదేవే తథాగురౌ, తస్యైతేకథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః.' అని
కఠవల్లియందును, 'దేవతాయాగురోశ్చైవ మంత్రస్యాపి ప్రకీర్తనాత్, ఐహికాముష్మి
కాసిద్ధి ర్ద్విజస్యోస్తి నసంశయః' అని పురాణసముచ్చయమందును, 'యస్మా ద్దేవోజగ
న్నాథః కృత్వా మర్త్య మయీం తనుమ్, మగ్నా నుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్ర
పాణినా, తస్మా ద్భక్తి ర్గురౌ కార్యా సంసారభయభీరుభిః.' అని పాంచరాత్రమందలి
జయాఖ్యసంహితయందు, 'చక్షుర్గమ్యం గురుం త్యక్త్వా శాస్త్రగమ్యం తు యస్స్మరేత్'
హస్తస్థ ముదకం త్యక్త్వా ఘనస్థం సోఽభివాంఛతి. సులభంతు గురుం త్యక్త్వా దుర్లభం
యఉపాసతే, ఖద్ధం త్యక్త్వా ధనం మూఢో గుప్త మన్వేషతి క్షితౌ' అను నీమొదలగు
ప్రమాణములచేత నాచార్యకృపయే ప్రధాన మని యెఱుఁగఁదగినది. ఆత్మీయ...బు-
ఆత్మీయ = తనసంబంధమగు, తదీయ = ఆపరమేశ్వరసంబంధ మగు, శేష = భృత్యత్వ
సంబంధము, శేషిత్వసంబంధము=స్వామిత్వసంబంధము, అనాద్యంబుగాన్ తెలిసి=అనాది
సిద్ధ మని యెఱిఁగి, ఈతెలివిగలిగి = ఈజ్ఞానము గలిగి, అఖర్వ=అఖండమగు, నిర్వృతిం

---

1. (య) పరమ.

గాంచి = సుఖమునుజెంది, సుఖించు=సొగిసెను, పరమయోగికిన్=మహాయోగీశ్వరునకు, శ్లో. 'శాస్త్రజ్ఞానంబహుక్లేశం బుద్ధేశ్చలనకారణ'మ్మన్నట్లు, బహుక్లేశదంబులుఅగు=బహు ప్రయాసకరము లగు, చదువులన్ పనియేమి=చదువులచేనేమిపని, ఈవివేకంబులేనివాని= ఈజ్ఞానములేనివానియొక్క, హేతువాదంబు = కారణవాదము, ధాతువాదంబు = లోహాదిమారణక్రియ, కాణాదంబు = తర్కశాస్త్రము, ప్రాణాదంబు = ప్రాణహరము, కాపిలంబు = సాంఖ్యమతము, చాపలంబు = సేశ్వర నిరీశ్వరభావభేదములచేత బుద్ధిచాంచల్యకరము, మీమాంస = అగ్నిష్టోమాది కర్మకాండవిషయము, హింస = పరప్రాణాపహారిణి, వ్యాకరణంబు = శబ్దశాస్త్రము, అశరణంబు = రక్షించునదిగాదు, చదువన్ దొరకొనినన్ = పఠించుట కుపక్రమించెనేని, కాలంబు నాలంబు=కాలము చాల దనియు అననుకూల మనియును, విఘ్నంబులు = అంతరాయములు, సకలోద్య మఘ్నంబులు = సర్వకార్యనాశకంబులు, అందులకున్=శాస్త్రాభ్యాసమునకు, సామగ్రి= సాధనసంపత్తి, గిటగిటన=మిక్కిలి కొంచెము, కొంత ఎఱుంగన్ అగుమదంబు పుటపుటన= కొంతదెలియఁగానే గర్వంబు పుటపుటన పొడమును, సము...డు-సముత్పన్న=కలిగిన, విజ్ఞానుండు = శాస్త్రజ్ఞానము కలవాఁడు, ఐ, త్రైగుణ్యవిషయంబులు=సత్త్వరజస్తమో గుణసంబంధమైన విషయములను, ఆనీతధాన్యుండు = ధాన్యమును కైకొన్నవాఁడు, నిష్ఫలంబుఐన=గింజలేని, పలాలంబును=ఊకపొట్టును, ఆలబ్ధమధుండు = తేనెనుతీసి కొన్నవాఁడు, సిక్థకంబును=మైనమును, శాంతి...తన్-శాంతి=బహిరింద్రియ నిగ్రహము యొక్కయు, దాంతి=అంతరింద్రియ నిగ్రహము యొక్కయు, పరతన్ = ఆసక్తిచేత, వశపడుటచేత, ఈతి = ఈతిబాధ, ఉద్వేజనంబు = భయంకరము, గౌరవంబు=గురుత్వ మును, భరత భూమిసురవతంసంబునుంబోలెన్=జడభరతుఁ డనెడు బ్రాహ్మణశ్రేష్ఠునివలె, దుర్విభావ్యబోధుండు=ఊహింపరాని జ్ఞానముకలవాఁడు, ఐ, పరమ పదంబునను=వైకుంఠ మందుఁగూడ, అప్రాకృతంబులు=ప్రకృతి పరిణామములుకానట్టివి, బహుభద్రమూర్తులు= అనేకమంగళదేహములను, భరియించి = ధరించి, పరమపురుషార్థంబు=ఉత్తమోత్తమైన పురుషప్రయోజనము, రథచరణపాణి = చక్రపాణి యగు మన్నారుకృష్ణుని. కడమది సులభము.

తా. సులభము.

క. న్యాయార్జితవిత్తంబున
నా యోగీశ్వరుఁడు పెట్టు ౯ నన్నం బొప్రా
లేయఘటీరాచలప
ద్యాయాతాయాత వైష్ణవావలి కెల్లన్. 79

టీ. ఆయోగీశ్వరుఁడు=ఆవిష్టచిత్తుఁడు, న్యాయార్జితవిత్తంబునన్ = న్యాయార్జిత ధనముచేతను, ఆప్రాలేయ పటీరాచల పద్యాయాతాయాతవైష్ణవావలికిన్ ఎల్లన్ = హిమాచల మలయాచలముల మధ్యమార్గస్థులై వచ్చుచుం బోవుచుండెడు వైష్ణవసముదాయమున కెల్లను, అన్నంబు పెట్టున్. ('సరణిః పద్ధతిః పద్యా' యని యమరుఁడు.)

తా. సులభము.

చ. గగనము నీరుబుగ్గ కెనఁగా జడిపట్టిననాళ్లు భార్య క
న్బొగ సొరకుండ నారికెడఁపుంబొఱియ [1]ల్దవులించి [2]వండ న
య్యగపల ముంచిపెట్టుఁ గలమాన్నము నొల్చినప్రప్పు నాలుగే
న్బొగిపినకూరలు న్వడియము ల్వరుగు ల్పెరుఁగు న్ఘృతప్లుతిన్. 80

టీ. కర్తృపద మధ్యాహార్యము. ఆయోగీశ్వరుండు, గగనము = ఆకాశము, నీరుబుగ్గకున్=పర్వతాదులయందుండి సంతతధారగా నీరు పైకుబికి వచ్చెడియూటకు, ఎన కాన్=సదృశముకాఁగా, జడిపట్టిననాళ్లు=వర్షముపట్టిన దినములయందు, భార్య=తనయిల్లాలు, కన్=నేత్రములోనికి, పొగసొరకుండన్ = ధూమము ప్రవేశింపకుండ, నారికెడపుంబొఱియలు=నీరు వెడలించి యెండించిన యెడనీటిటెంకాయబొండ్లములు, తవులించి=ప్రొయ్యిలో నంటించి, వండన్=పాకముఁ జేయఁగా, అయ్యగపలన్ = ఆటెంకాయ చిప్ప యబకలచేతనే, కలమాన్నమున్=వరియన్నమును, ఒల్చినప్రప్పు = ఒల్చుప్రప్పును, నాలుగు ఏన్ పొగిపినకూరలున్=నాలుగైదుపొఱటిన కూరలును, వడియములు = వడియాలును, వరుగులు = శుష్కశాకములును, పెరుఁగున్ = దధియును, ఘృతప్లుతిన్ = ఆజ్యసిక్తమగునట్లుగా, ముంచిపెట్టును = ఘృతప్లుతిదధికిఁ బూర్వ మన్వయించునది. అలం. ఉత్ప్రేక్ష.

చ. తెలినులివెచ్చయోగిరముఁ దియ్యని చారులుఁ దిమ్మనంబులుం
బలుచనియంబళు ల్చెఱకుపా లెడనీళ్లు రసావళు ల్ఫలం
బులును సుగంధిశీతజలము ల్వడపిందెలు నీరుఁజల్లయు
న్వెలయఁగఁ బెట్టు భోజనము వేసవిఁ జందనచర్చ మున్నుగన్. 81

టీ. వేసవిన్=గ్రీష్మర్తువందు, చందనచర్చ=చందనాలంకారము, మున్నుగన్ = మొదలుగాఁగా, (ముందఱ చందన మిచ్చి యనుట). తెలినులివెచ్చయోగిరమున్ = తెల్లనై మందోష్ణమగు నన్నంబును, తియ్యనిచారులున్ = తియ్యఁజారులును, తిమ్మనంబులున్ = మజ్జిగపులుసులును, పలుచని యంబళుల్ (అంబలిశబ్దబహువచన మంబళు లని

1. ల్దగిలించి. 2. వండియ.

యుఁను గలదు), చెఱకుపాలు=ఇక్షురసములు, ఎడనీళ్లు=లేఁతటెంకాయనీళ్లును, రసావళుల్ = భక్ష్యవిశేషములును, ఫలంబులును = కదళీరసాలాదిఫలములును, సుగంధిశీతజలములు=వట్టివేళ్లు మొదలగువానివలనఁ బరిమళించు చల్లనగు నుదకములును, వడపిందెలున్=వడను బోఁగొట్టునట్టి ఊరవేసిన లేఁతమామిడి పిందియలును, నీరుఁజల్లయున్=నీరుమజ్జిగయును, వెలయంగన్ = ప్రసిద్ధమగునట్లు, భోజనము పెట్టున్=ఆహార మొసంగును. రసావళులు భక్ష్యవిశేషము లనుటకు బొ్రిడురోరగా రిచ్చిన యుదాహరణము:—

క. "తనయింట కప్పు డాయిత, మొనరించిన కమ్మఁదావు లొలుకురసావ, ళ్లను మిసిమి వడలను జాఁప, ట్లును గోధుమపిండివంటలున్ గలవనినన్" (విష్ణు. 3. ఆ. 377 ప) అతిరసములు గావలయు. తా. సుగమము

మ. పునుఁగుందావి నవోదనంబు మిరియంపుంబొళ్లతోఁ జట్టి చు
య్యను నా దాఱనికూరగుంపు ముకుమందై యేర్చునావం జిగు
రొ్కను పచ్చళ్లును బాయసాన్నములు నూరుంగాయలున్ జేసుఱు
క్కనునేయుం జిఱుపాలు వెల్లువగ నాహారం బిడు న్సీతునన్. 82

టీ. సీతునన్ = శీతకాలమందు, పును...బు - పునుఁగుందావి = పునుఁగుదావులను పేరుగల కలమ విశేష సంబంధియగు, నవ=నూతన మగు, ఓదనంబు=ఓగిరమును, (వేఁడివేఁడి యన్న మనుట - పునుఁగు రాజనము లుష్ణప్రధానము లని వైద్య శాస్త్రమందుఁ బ్రసిద్ధము గనుక నాశీతకాలమున కుచితములు), మిరియంపుంబొళ్లతోన్ = మిరియముల పొడులతోడ, చట్టి = భాండ విశేషము, చుయ్యనునాదు = చుయ్యనుచు మ్రోసెడు నాదము, అఱని = నశింపని, కూరగుంపు = శాకసమూహము, (మిరియాల పొడితోఁగూడఁ దిరుగఁ బోసిన నాదము వదలకమున్నె యనుట), ముకుమందై = ముక్కులోని జబ్బును మాన్పు నౌషధమై, ఏర్చు = చుఱచుఱ మనియెడు, ఆవన్ = ఆవాలపిండి చేతను, చిగురొ్కను = క్రచ్చియెత్తిన, పచ్చళ్లును, ఊరుంగాయలును = ఊరుగాయలును, చేసుఱుక్కనునేయున్=చేలిమీఁదఁబడఁగానే యుష్ణత గనుపించెడు ఘృతమును, చిఱుపాలున్ = నగ మిపురఁ గాచినపాలును, వెల్లువగన్ = సమృద్ధి యగునట్లుగా, ఆహారంబు ఇడున్=భోజనముపెట్టును. ఈపద్యంబునందు, 'నుమ్యోచః' అను సూత్రబలమువలనఁ బునుఁగుందావి యనునెడఁ బూర్ణబిందువును 'సంస్కృతపదేన పరిమిత మాంధ్రపదం కర్మధారయో భవతి' యను సూత్రమువలనను, 'ఆంధ్రం షడ్వర్ణ పర్యంతం సంస్కృతేన సమస్యతే' యను నధర్వణోక్తివలనను, పునుఁగుందావినవోదనంబని కర్మధారయసమాసఁబును బ్రయుక్తంబు లయ్యెను. తా. సుగమము.

చ. కదళిగభీరపుష్పపుటికాచ్ఛటఁ జేతుల నిప్పపిండిపైఁ
గుదురుగ నిల్పి యోపుగతి గూనల నూనియ నించి త్రాట ము
న్నుదికినకాటి వ్రేల నది నొక్కటఁ గ్రుంకిడి వత్తు రెందతే
వదలక యాతనింట శనివారమున న్బరదేశివైష్ణవుల్. 33

టీ. ఆతనింటన్ = ఆవిష్ణుచిత్తునింటను, (ఇచ్చట షష్ఠ్యర్థమున నిత్యసంధి), పరదేశివైష్ణవుల్=అభ్యాగతు లగువైష్ణవులు, శనివారమునన్ = మందవాసరమునాఁడు, కదళి...టన్-కదళి = అరఁటియొక్క, గభీర=లోఁతగు, పుష్పపుటికా = పూదొన్నెల యొక్క, ఛటన్=సమూహమును, చేతులన్=హస్తములయందు, ఇప్పపిండిపైన్=తలఁ బులిమికొనుటకు నూఁటిన మధూకపిష్టముమీఁదను, కుదురుగన్ = తొలఁగకుండునట్లు, నిల్పి=పాదుకొల్పి, ఓపుగతిన్=చాలినరీతిగ, గూనలనూనియ-గూనల=మహాభాండముల లోని, నూనియ=తిలతైలమును నించి = నిండించి, త్రాటన్ = దారమందు, మున్నుదికిన=పూర్వధౌత మగు, కాటి = వస్త్రము, వ్రేలన్ = వ్రేలుచుండఁగా, నదిన్ = ఏటియందు, ఒక్కటన్ = ఒక్కసారిగా, క్రుంకిడి = స్నానముచేసి, ఎందతేన్ = అనేకులనుట, వదలక వత్తురు = విడువక తిరిగి వత్తురు.

తా. ఆవిష్ణుచిత్తునియింట శనివారమునాఁ డనేకు లగు పరదేశివైష్ణవులు తమ తమ యభ్యంగన స్నానములకొఱకు నిప్పపిండి నూఁటి యాముద్ద చేతిలోఁ బెట్టుకొని దానిమీఁద నరఁటిపూవు దొన్నెలు పెట్టుకొని వానిలోఁ దమకుఁ గావలసినంతవఱ కావిష్ణుచిత్తుని యింటిలో గూనలకుఁ బోసి యున్ననూనె తామే పోసికొని స్నానానంతరము ధరించుకొనుటకై ధౌతవస్త్రములు త్రాడునకుఁ గట్టి తాఁకక యొకచేతఁ బట్టుకొని నదికిం బోయి యచ్చట నభ్యంగన స్నానముఁ జేసి వత్తు రని భావము.

శా. ఆసిష్ఠానిధిగేహసీమ నడురే యాలించి న న్ఛ్రోత్రియు నెం
తే నాగేంద్రశయాన(ను) పుణ్యకథలుం దివ్యప్రబంధానుసం
ధానధ్వానము నాస్తి శాకబహుతా నా స్త్యుష్ణతా నాస్త్యపూ
పో నా స్త్యోదనసౌష్ఠవం చ కృపయా భోక్తవ్య మన్నాఁటలున్. 34

టీ. ఆని...మన్ - ఆసిష్ఠానిధి = సదాచారమునకు నిక్షేప మయిన యావిష్ణుచిత్తునియొక్క, గేహసీమన్ = గృహసీమయందు, నడురేయి = అర్ధరాత్రమందు, ఆలించినన్ = విన్నను, ఎంతేన్ = మిక్కిలి, నాగేం...లున్-నాగేంద్రశయాన = శేషశాయియగు స్వామియొక్క, పుణ్యకథలున్=పవిత్రకథలును, దివ్య...ము - దివ్యప్రబంధ = ద్రావిడప్రబంధములయొక్క, అనుసంధాన = పారాయణముయొక్క, ధ్వానము=ధ్వనియును, శాకబహుతా=కూరలబాహుళ్యము, నాస్తి = లేదు, ఉష్ణతా=

పదార్థములందు వేఁడిమి, నాస్తి = లేదు, అపూపః = పణ్యారము, నాస్తి=లేదు, ఓదన సౌష్ఠవం చ - ఓదన=ఓగిరముయొక్క, సౌష్ఠవంచ = చక్కఁదనము, నాస్తి = లేదు, కృపయా=దయచేతను, భోక్తవ్యం = ఆరగింపఁదగినది, అన్నాటలున్=అనియెడు వాక్యములును, మ్రోయన్=ధ్వనిసేయుచు. ఈపద్యమందు, కేవలసంస్కృతవాక్యములుండి నను ననియెడు ననుకరణము గలిగినది గావున, 'అనుకృతేఽస్తివాక్యంతు' అనుసూత్ర బలమువలనఁ జెల్లును. భోక్తవ్య మనుచోట 'అహమాదీనాం ద్విత్వ' మను సూత్రముం బట్టి ద్విత్వంబు రావలయును, ఐనను, శ్లో. 'శబ్దానా మన్యభాగేషు యోఽనుస్వారః ప్రదృశ్యతే, తస్యాచిపరతోమస్స్యా త్సర్వత్ర కవిసమ్మతేః' 'పదేతు తద్య దాద్యంతే వాద్విత్వం హారిసమ్మతేః' అను నథర్వణోక్తులవలన ద్విత్వాభావమై యనుస్వారమునకు మకారము వచ్చెను. మూఁడవపాదమందు నిత్యసమాసపదములఁ జేరిన నాస్తిపదమున కనునాసికయతి.

తా. ఆవిష్ణుచిత్తుని గృహమందుఁ బగటిపూటలయందే కాక అర్ధరాత్రమందు వినఁబోయినను శేషశాయిపుణ్యకథలఁ జెప్పుకొనువారి కంఠనాదములును, దివ్యప్రబంధముల రవములును, భోక్తలతో నావిష్ణుచిత్తుఁడు కూరలు లేవు సాదము వేఁడిగా లేదు భక్ష్యములే దన్నముకూడ నొప్పిదముగా లేదు, కృపచేతనే యారగింపవలయు నని చెప్పెడి యుపచారవాక్యములును వినంబడు నని భావము.

తే. ఇత్తెఱంగున నవ్వైష్ణవోత్తముండు
జాగరూకతఁ దైర్థికభాగవతుల
కితర మెఱుఁగక యెవ్వ రేమేమి వేఁడి
రలయ కవి పెట్టి సంతుష్టిఁ సలుపు చుండె. ౨౮

టీ. అవ్వైష్ణవోత్తముండు = వైష్ణవశ్రేష్ఠుఁ డగునా విష్ణుచిత్తుఁడు, జాగరూకతన్ = హెచ్చరికచేత, తైర్థికభాగవతులకున్ = తీర్థయాత్రాపరులగు భగవద్భక్తులకు, అలయక = ఆయాసము నొందక, ఎవ్వ రేమి వేఁడిరి=ఎవ్వ రేమేమి యడిగిరో, వారికి. కడమ సులభము.

తా. సుగమము.

ఆశ్వాసాంతపద్యములు

శా. బాలార్కాంశువిజృంభితామలశరస్స్పద్మాక్షు పద్మాక్షుమా
నీళాజాంబవతీశ. యీశబలభిన్ని రేరుహోద్భూతది

క్ష్వాలామూల్యశిరోమణిద్యుతికనత్పాదాబ్జ పాదాబ్జఫా
లాలంకారకచావలీమకరదీవ్యత్కుండలాంచన్ముఖా. 86

టీ. బాలా...క్ష = బాలార్క = లేఁతసూర్యునియొక్క, అంశు = కిరణములచేత, విజృంభిత = వికసింపఁజేయఁబడిన, అమల = నిర్మలములైన, శరత్ = శరత్కాలమందలి, పద్మ = కమలములవంటి, అక్ష = నేత్రములు గల్గినట్టివాఁడా, (ఇదిమొదలుగా శ్రీవేంకటేశ్వరునకు విశేషణములు). పద్మా...శ - పద్మా = లక్ష్మీదేవికి, క్షమా = భూదేవికి, నీళా=నీళాదేవికి, జాంబవతీ = జాంబవతీదేవికి, ఈశ = నాథుఁడా, ఈశ...బ్జ-ఈశ = శివునియొక్కయు, బలభిత్=ఇంద్రునియొక్కయు, నీరేరుహోద్భూత-నీరేరుహ=కమలమందు, ఉద్భూత=పుట్టిన బ్రహ్మయొక్కయు, అమూల్య = వెలఁబెట్టరాని, శిరోమణి = శిరోరత్నములచేత, కనత్=ప్రకాశించుచున్న, పాదాబ్జ = పాదపద్మములుగలవాఁడా, (శివుఁడు మొదలగు దేవతలచే నమస్కరింపఁ బడియెడువాఁడనుట), పాదా...ఖా = పాదాబ్జ=చవితినాఁటి చంద్రునివంటి (ని. 'పాదారశ్మ్యఙ్ఘ్రితుర్యాంశాః' అని యమరుఁడు,) ఫాల=లలాటమునకు, అలంకార = అలంకార మగు, కచావలీ = ముంగురులచేతను, మకర = మకరాకారములచేత, దీవ్యత్ = ప్రకాశించుచున్న, కుండల = కర్ణభూషణములచేతను, అంచత్=ఒప్పుచున్న, ముఖా=నెమ్మొగము గలస్వామీ. తా. సుగమము. అలం. ముక్తపదగ్రస్తము.

క. జలచరకిటిహరివటుభృగు,కులరఘుకులసీరిబుద్ధఘోటిప్రముఖో
జ్జ్వలజనికృతజనరక్షా, యలమేల్మంగాభిధేందిరాలయవక్షా. 87

టీ. జల...క్షా - జలచర = మీనకూర్మములును, కిటి = వరాహమును, హరి= సింహమును, వటు = బ్రహ్మచారి యగువామనుండును, భృగుకుల = పరశురాముండును, రఘుకుల=శ్రీరాముఁడును, సీరి = బలరాముఁడును, బుద్ధ=బుద్ధుఁడును, ఘోటి = గుఱ్ఱముగలిగిన కల్కియు, ప్రముఖ = మొదలయిన, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, జని= అవతారములచేత, కృత = చేయఁబడిన, జనరక్షా = ప్రజాసంరక్షణము గలవాఁడా, అలమే...క్షా - అలమేల్మంగా=అలమేలుమంగ యనెడు, అభిధా=పేరుగల, ఇందిరా= లక్ష్మీదేవికి, ఆలయ=నివాస మగు, వక్షా=వక్షఃస్థలముగలవాఁడా. తా. సుగమము. అలం. అంత్యానుప్రాసము.

భుజంగప్రయాతము—

బలద్విడ్ద్వినిర్దిష్టపాథోధరోరూ
పలాసారధారాతపత్రీకృతాద్రీ

ఫలన్మూర్ధచాణూరశిభంగోగ్ర[1]బాహా
కళాకృత్తకంసా శిఖండావతంసా. 83

టీ. బల...ద్రీ - బలద్విట్ = దేవేంద్రునిచేత, వినిర్దిష్ట = నియోగింపఁబడిన, పాథోధర = మేఘములయొక్క, ఉరు = గొప్పలగు, ఉపల = పాషాణములయొక్క, ఆసారధారా = ధారావర్షమునకు, ఆతపత్రీకృత = గొడుగుగాఁ జేయఁబడిన, అద్రీ = గోవర్ధన గిరిగలవాఁడా, ఫలత్ = పగులుచున్న, మూర్ధ = శిరస్సుగల, చాణూర = చాణూర మల్లునియొక్క, భంగ = సంహారమందు, ఉగ్ర = వాఁడిమి గల, బాహా = బాహువులు గలవాఁడా, కళాకృత్తకంసా - కళా = కళాసంజ్ఞగల యల్పతమకాలమందు, కృత్త = నఱుకఁబడిన, కంసా = కంసుఁడు గలవాఁడా, శిఖం...సా - శిఖండ = నెమిలిపింఛము, అవతంసా = శిరోభూషణముగాఁ గలవాఁడా, బాహార్గళా యనుపాఠమున గడియ మ్రానులవంటి భుజములచేత నని అర్థము. (ని. 'తద్విష్కంభేఽర్గళం న నా' యని యమరుఁడు; అపక్షమునఁ గృత్తకంసా యనియే పైపదము.) తా. సుగమము.

మ. ఇది కర్ణాటధరాధృతిస్థిరభుజాహేవాకలబ్ధేభరా
డుదయోర్వీధర తత్పితృవ్యకృతనవ్యోపాయనోష్ణీషర
త్నదృగంచత్పద కృష్ణరాయ వసుధాధ్యక్షోదితాముక్తమా
ల్యదనాశ్వాసము హృద్యపద్యములనాద్యంబై మహిం బొల్పగున్.

టీ. ఇది = ఈసందర్భము, కర్ణాట...ల్యదన్ - కర్ణాటధరా = కర్ణాటభూమి యొక్క, ధృతి = ధరించుటయందు, స్థిర = నిశ్చలమైన, భుజ = బాహులయొక్క, హేవాక = విలాసముగలయట్టియు, లబ్ధ = పొందఁబడిన, ఇభరాట్ = గజపతియగు రుద్రునియొక్క, ఉదయోర్వీధర=ఉదయగిరియందలి, తత్పితృవ్య - తత్ =ఆరుద్రుని యొక్క, పితృవ్య = పినతండ్రియగు ప్రహరేశ్వరునిచేత, కృత=చేయఁబడిన, నవ్య = నూతనమగు, ఉపాయన = కానుకయగు, ఉష్ణీష = కిరీటముయొక్క, రత్న=రత్నముల యందలి, దృక్ = దృష్టిచేతను, అంచత్ = ఒప్పుచున్న, పద=పాదములుగల, కృష్ణ రాయవసుధాధ్యక్ష = భూమీశ్వరుఁడగు కృష్ణరాయలచేత, ఉదిత = చెప్పఁబడిన, ఆముక్తమాల్యదన్=ఆముక్తమాల్యద యనుగ్రంథమునందు, హృద్య = మనోజ్ఞములగు, పద్యములన్ = పద్యములచేత, ఆశ్వాసము, ఆద్యంబై = ప్రథమమై, మహిన్=భూమి యందు, పొల్పగున్=ఒప్పును.

తా. కృష్ణరాయలు గజపతిపినతండ్రి యగుప్రహరేశ్వరుఁ డుదయగిరిదుర్గములో నుండఁగా దానిని ముట్టడింపఁగా నెన్నాళ్లకును దుర్గము లోఁబడనందున నొక

1. బాహార్గళా.

నాఁడు రాయలు అతనితలఁ ద్రొక్కక నాఁడు స్నానము సేయ నని ప్రతిజ్ఞ చేసెఁ గావున, సేనలు లగ్గలు పట్టఁగా నాప్రహరేశ్వరుఁడు భయపడి తనతలకు బదులుగాఁ గిరీటము రాయలకుఁ గానికఁ జేయుటవలన నది చూచి త్రొక్కె నని భావము.

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తి మంత్రోపాసనాసమాసాదితాఖండ సాహితీ ధురీణుండు నాత్రేయగోత్రపవిత్రుండును వావిళ్లవంశపయోరాశిరాకాసుధాకరుండు నగు రామస్వామిశాస్త్రి చేత ననేకపూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యాలోచించి రచింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యదావ్యాఖ్యానంబునఁ బ్రథమాశ్వాసము.

శ్రీ ర స్తు

ఆ ము క్త మా ల్య ద

స వ్యా ఖ్యా న ము

ద్వి తీ యా శ్వా స ము

క. శ్రీనయన కువలయుగళా
నూనజ్యోత్స్నాయితస్మితోజ్జ్వలముఖ! దై
త్యానీతసురశ్రీపున
రానయనక్రమణ! వేంకటాచలరమణా! 1

టీ. శ్రీ...ఖ - శ్రీ = లక్ష్మీదేవియొక్క, నయనకువల = కలువలవంటికన్నుల యొక్క, ('కువలంచాసితాంబుజే' అని వైజయంతి) యుగళ=రెంటికి, అనూన = అధికమైన, జ్యోత్స్నాయిత = వెన్నెలయైన, స్మిత = చిఱునవ్వుచేత, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, ముఖ=వదనముగలయట్టివాఁడా! (అనఁగా స్వామియొక్క చిఱునగవు మహాలక్ష్మి కన్నులకు సంతత వికాసహేతువై యున్న దనుట), దై త్య...ణ-దైత్య=రాక్షసులచేత, ఆనీత=అపహరింపఁబడిన, సుర=దేవతలయొక్క, శ్రీ = సంపదయొక్క, పునరానయన= మరలఁ దెచ్చునట్టి (అయనశబ్దమిచట ధర్మిపరము), క్రమణ=పాదవిక్షేపముగలయట్టి వాఁడా! వేంకటాచలరమణా = వేంకటేశ్వరుఁడా యని సంబోధనము.

తా. గ్రంథకర్త యాశ్వాసాది యగుటంజేసి, 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతా' నీత్యాదిప్రమాణవచనములను బట్టి యిష్టదేవతా స్మరణాత్మక మంగళాచరణ పూర్వకముగా శ్రీవేంకటాచలపతి నవధరింపు మని వచించుచున్నాఁ డనుట.

వ. అవధరింపు మాసమయంబునఁ బాండ్యమండలంబున. 2

సీ. ఏవీట (టకి) సతులపాలిండ్లపై గంబూర
నవహారములచిప్పకవుచు మూస్సు
మఱియజం బేవీటఁ గొఁ దోలుచెక్కు డులిచి మే
డలకిడ్డ మిగుల భూకములకు డిగ్గుఁ

గలఁచు నేవీట (టి)సిం హళగజంబులగాలి
చైత్రవేళ నుదగ్ది శాగజంబుఁ
దాల్తు రేవీటిప్రా క్తనభూపనిర్మాల్య
మరకతంబులు పెఱ ధరణిపతులు
తే. కపివరనియుక్తగిరిసదృ గ్గహననిలయ
గాత్రగాహితకనకము క్తాకవాట
గోపురావేదితోచ్ఛ్రితా క్షోభ్యవప్ర
గనరు దక్షిణమధుర సాం ద్రద్రుమధుర. ౩

టీ. ఏవీటన్ = ఏపట్టణమందు, సతుల = స్త్రీలయొక్క, పాలిండ్లపైన్ = స్తనములమీఁది, గంబూర = (అలఁదిన) కర్పూరము, నవ...చు - నవ = నూతనములైన, హారముల = ముక్తాహారములయొక్క, చిప్పకవుచు = శుక్తిదుర్గంధమును, మాన్చున్ = పోఁగొట్టుచున్నదో (అనఁగా ముత్యపుఁజిప్ప లుత్పత్తి యయ్యెడి తామ్రపర్ణీనదికిసమీపమున నుండువారుగాన నప్పటికప్పుడు తెచ్చినకౌచు వదలని ముత్యాలహారములు ధరించుచున్నా రని భావము), ఏవీటన్, మలయజంబు = శ్రీగంధవృక్షములు, తోలుచెక్కడులిచి=మొదటిచెక్కఁదీసి, మేడలకున్ ఇడన్=మేడలకుఁబెట్టఁగా, మిగులు = మిగిలినవి, భూములకున్ డిగ్గున్=ఇతరదేశములకు దిగుమతి యగునో (అనఁగా నాపట్టణమందలి మేడలన్నియు నుత్తమ శ్రీగంధములచేఁ గట్టఁబడియున్న వనుట), ఏవీటన్, సింహళగజంబులగాలి = సింహళద్వీపమునందుఁ బుట్టినయేనుఁగులయొక్కవాయువు, చైత్రవేళన్ = వసంతకాలములయందు, ఉదగ్ విశాగజంబున్=ఉత్తరపుదిక్కునం దున్న యేనుఁగును, కలఁచున్= చెదరఁజేయునో, (అనఁగా నాపట్టణమందలి గజంబులు సింహళద్వీపంబునఁ బుట్టిన వౌటంజేసి సింహశరీరవాసనవంటి వాసన గలవి యనుట), ఏవీటి...లు-ఏవీటి, ప్రాక్తన = పూర్వికులగు, భూప = రాజులయొక్క, నిర్మాల్య = ధరించికడవేసిన, మరకతంబులు=పచ్చలను, పెఱధరణీపతులు=ఇతరరాజులు, తాల్తురు = ధరియించుచుందురో (అనఁగా నుత్తమరత్నంబుల కాపట్టణ మునికిపట్టుగా నుండె ననుట), కపి...వప్ర-కపివర=సుగ్రీవునిచే, నియుక్త = నియోగింపఁబడినట్టి, గిరి = పర్వతములతో, సదృక్ = సరిపోలునట్టి, గహననిలయ = కపులయొక్క, గాత్ర = శరీరములచేత, గాహిత=ప్రవేశింపఁబడిన, కనకముక్తాకవాట = స్వర్ణయుతమైన ముత్యాల తలుపులుగల, గోపుర = పురద్వారములచేత, ఆవేదిత = తెలియఁజేయఁబడిన, ఉచ్ఛ్రిత = పొడవుచేత, అక్షోభ్య కోలుపుచ్చనశక్యంబైన, వప్ర=కోటగలట్టియు (అనఁగా సుగ్రీవుఁడు సీతాన్వేషణార్థము గ హనుమదాదులను దక్షిణపుదిక్కునకు నంపుచుఁ తొలుతఁ దాను దెలిసినవాఁడు

గనుక నాయాదిక్కులఁ గల తావులఁ దెల్పుచును, శ్లో. 'ముక్తాకవాటం పాణ్డ్యానాం తత్ర ద్రక్ష్యథ వానరాః' అని పల్కరించిన తెఱంగున, నావానరులు కొండలంగలేసి తమ శరీరములతో నాపట్టణము వాకిళ్ళలోఁ జొచ్చి రనుటవలన నావాకిళ్ళ కత్యున్నతత్వ మును గోటకు నక్షోభ్యత్వమును దెలిపినట్లాయెను). సాంద్ర = దట్టములైన, ద్రు=వృక్షములచేతను, మధుర=మనోహరమైనట్టి, దక్షిణమధుర = మధురాపట్టణము, తనరున్ = ఒప్పును. దక్షిణమధుర యనుటవలన నుత్తరమునఁగూడ నొకమధుర యున్న దని తెలియునది. అలం సంబంధాతిశయోక్తి.

క. శమనరిపుత్రిపురభిదో, ద్యమవద్దోర్వర్జ్యవలయి । తస్వర్ణగిరి
భ్రమదంబై కాంచనవప్రము దీప్రం బగుచు నప్పురంబున నొప్పున్.

టీ. శమన...బై-శమనరిపు = శివునియొక్క, త్రిపురభిదా = త్రిపురములను భేదించుట యనియెడు, ఉద్యమవత్ = ఉద్యోగముగల, దోః = భుజమువలన, వర్జ్య= విడువఁదగినట్టియు, వలయిత = వలయముగాఁజేయఁబడిన, స్వర్ణగిరి = మేరుపర్వత మనియెడు, భ్రమదంబః=భ్రాంతినిచ్చునది యై, కాంచనవప్రము=బంగారుకోట, దీప్రంబు అగుచున్ = ప్రకాశమగుచు, అప్పురంబునన్ = ఆమధురాపట్టణమందు, ఒప్పున్ = తగియుండును.

తా. త్రిపురములు గెలిచి యీశ్వరుఁడు కదవేసిన మేరుగిరి ధను స్సనుటుల నామధురాపట్టణపుబంగారుఁకోట వలయాకార మై యుండె ననుట. అలం. ఉత్ప్రేక్ష.

తే. సౌరిదిఁ గనుపట్టి (ట్టు) హేమర । శ్ములు సెలంగఁ
బొడవుకతమున సూక్ష్మమై । పొల్చుఁ జూడఁ
బట్టణము కోటకొమ్మల । పంక్తి గగన
మండలశ్రీ (స్త్రీ)కి సంపంగి । దండవోలె. 5

టీ. పట్టణము కోటకొమ్మలపంక్తి=ఆపురికోట బురుజులవరుస, సౌరిదిన్ = బాగుగాను, హేమరశ్ములు=సువర్ణప్రభలు, కనుపట్టి=కానుపించి, చెలంగన్ = విజృంభింపఁగా, పొడవుకతమునన్ = కోటపొడవైనందున, సూక్ష్మమై = కొమ్మలచాలు కొంచెముగా నున్నది యై, చూడన్=చూడఁగా, గగనమండలశ్రీకిన్ = ఆకాశలక్ష్మికి, సంపంగిదండవోలెన్ = సంపంగిదండవలెనే, పొల్చున్ = ప్రకాశించును.

తా. మధురాపట్టణపుఁ గోట మిగులఁ బొడవైనందున నతి సూక్ష్మముగఁ గనుపడుచున్నదై సువర్ణకాంతులు విజృంభించువేళఁ జూడఁగాఁ గోటకొమ్మలపంక్తి యాకాశలక్ష్మి ధరించిన సంపంగిదండవలెఁ బ్రకాశించె ననుట. అలం. ఉత్ప్రేక్ష.

మ. పరిఖం దత్పురకామినీజనము లంభఃకేళి సల్పంగఁ ద
ద్గురువక్షోరుహలిప్తసంకుమదక స్తూరీమిళచ్చందనా
గురుపంకంబుల సౌరభంబులఁ జుమీ కుంభీనసావాసని
ర్జరకల్లోలిని కందు భోగవతి నాఁ జన్సంజ్ఞ గల్గెన్దగన్. 6

టీ. పరిఖన్ = అగడ్తలో, తత్పురకామినీజనములు = ఆమధురాపురస్త్రీలు, అంభఃకేళిన్=జలక్రీడను, సల్పంగన్=చేయఁగా, తద్గురు...చుమీ - తత్=ఆస్త్రీల యొక్క, గురు = గొప్పవైన, వక్షోరుహ = స్తనములయందు, లిప్త = పూయఁబడిన, సంకుమద = జవ్వాజితోడను, కస్తూరీ = కస్తూరితోడను, మిళత్ = కూడుకొనియున్న, చందన=శ్రీగంధముయొక్కయు, అగురు = అగరుగందముయొక్కయు, పంకంబుల = బురదలయొక్క, సౌరభంబులన్ చుమీ = వాసనచేతనే, కుంభీనసా...కిన్. కుంభీనస= సర్పములకు, ఆవాస = ఉనికిపట్టగు నాగలోకమం దున్న, నిర్జరకల్లోలినికిన్ = దేవ గంగకు, అందున్=ఆపాతాళలోకమందు, భోగవతి నాన్=భోగవతి యనఁగా, చన్= ఒప్పునట్టి, సంజ్ఞ = అన్వర్థనామము, తగన్ = తగునటుల, కల్గెన్ = కలిగెను. (ని. 'నది నగర్యో ర్నాగానాం భోగవతీ' యని యమరుఁడు.)

తా. ఆమధురాపురస్త్రీలు కుచకుంభములకు నలఁదిన పరిమళములు పాతాళము వఱకు వ్యాపించి యున్న యగడ్తనీళ్ళ జలక్రీడ లాడుతఱి నందు నిండింపఁబడినదిగాన నాగంధానుభవముగల నాగలోకమందలి గంగకు నక్కారణంబునంజేసి భోగవతి యను నామము గల్గె నమట. ఇచట నిరుక్త్యలంకారము. 'శ్లో. నిరుక్తి ర్యోగతో నామ్నా మన్యార్థత్వ ప్రకల్పనమ్' అని లక్షణము.

తే. కాద్రవేయులు భూమియుఁ గైకొనంగ
నురగలోకంబు వెడలి తత్పరిఖనీట
నెగసి తోడనె క్రుంకుదు ర్నిలువ లేక
తత్తటాబద్ధగారుత్మతముల కులికి. 7

టీ. కాద్రవేయులు=సర్పములు, భూమియున్ = ధరిత్రియును, కైకొనంగన్= ఆక్రమించుటకు, ఉరగలోకంబున్ = పాతాళలోకమునుండి, వెడలి = తరలి, తత్పరిఖనీటన్-తత్ = ఆపురముయొక్క, పరిఖనీటన్ = అగడ్తనీటను, నెగసి = లంఘించి, తత్తటా...లకున్-తత్తట=ఆపరిఖదరులయందు, ఆబద్ధ = అంతటం జెక్కఁబడిన, గారుత్మతములకున్ = గరుడపచ్చలకు, ఉలికి = భయపడి, తోడనె=వెంటనే, నిలువలేక = ఉండఁజాలక, క్రుంకుదురు=మునుఁగుదురు (నెగసి యనుచోట 'నీటిలో నుండి భీముండు నెగయుదెంచె' నని భారతప్రయోగ మాధారముగా పాలాదిగాఁ గలది).

తా. సర్పములు భూమినిఁగూడ నాక్రమించుటకై నాగలోకమును వదలి యాయగడ్తనీట నెగసివచ్చి యందుఁ గట్టఁబడియున్న గరుడపచ్చలకు వెఱచి నిలువం జాలక వెంటనే మునుంగు ననఁగాఁ బాతాళమువఱకు నాయగడ్త వ్యాపించియున్న దనియు, సర్పములు గరుడున కాహారము గానఁ దన్మణిదర్శనమాత్రజన్యభయముచే వెఱచిన వనియును, పరిఖములుగూడ రత్నఖచితమై యున్న వనియును దాత్పర్యము. అలం. అతిశయోక్తి.

తే. తరుణశైవాలజలజపత్త్రములు పొదువ
మరకతచ్ఛాయఁ బొల్చుఁ దత్పరిఖజలము
కోట బంగరు సేయుటకొఱకు మున్ను
బ్రహ్మ పిడిచిన మందాకుపస రనంగ. 8

టీ. తరుణ...ములు - తరుణశైవాల = లేఁతనాఁచుతీఁగలును, జలజపత్త్రములు = తామరాకులును, పొదువన్ = క్రమ్ముకొనఁగా, మరకతచ్ఛాయన్ = పచ్చరాలవన్నెచేత, తత్పరిఖజలము = ఆయగడ్తనీళ్లు, మున్ను = ఆపురనిర్మాణకాలమునందు, కోటన్ = ప్రాకారమును, బంగరుసేయుటకొఱకున్ = కనకమయముగాఁజేయుటకై, బ్రహ్మ = చతుర్ముఖుఁడు, పిడిచినమందాకుపసరు అనంగాన్=పిండిన మందాకుపసరో యనునటుల, పొల్చున్=ఒప్పును.

తా. అనఁగా మథురాపట్టణపుకోట బ్రహ్మనిర్మితంబై స్వర్ణమయముగా నున్నదని తాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష - మరకతచ్ఛాయన్ పొల్చున్ - పదార్థవృత్తి నిదర్శన; అగడ్త జలమునకు శైవాలజలజపత్త్రచ్ఛాయగల్గుట - తద్గుణాలంకారము.

చ. అడుగుననుండియుం బదిలమై చదలంటెడుకోట నొప్పు ప్రో
ల్చెడనికడంక దంచనపుఁజేతుల గంగను కాసెఁ దూఱఁగా
నడుమన యున్కిఁ జేసి యలనాకపురిన్ [1]సరికై పెనంగి లా
వెడలఁగఁ బట్టవ్రేయుటకునై నెత్తె ననఁగను [2]మల్లుపోరునన్. 9

టీ. అడుగుననుండియున్ = దిగువనుండియును, పదిలమై = దృఢమైనదై, చదలు = ఆకసమును, అంటెడు = తాఁకుచున్నట్టి, కోటన్ = ప్రాకారముచేత, ఒప్పు= ప్రకాశించుచున్న, ప్రోలు = పట్టణము, చెడనికడంకన్ = పాలివోనిబలిమిచేతను, దంచనపుఁజేతులన్ = ఫిరంగు లనియెడి చేతులచేతను, గంగను = గంగ యనియెడు, కాసెన్=దట్టికోకను, తూఱఁగాన్=ప్రవేశింపఁగా, నడుమన=మధ్యముననే, ఉన్కిన్

1. సరియై పెనంగ. 2. మల్లుపోరిలోన్.

చేసి = ఉండుటచేతను, అలవాకపురిన్ = ఆస్వర్గమును, సరికై = దీక్షితైయుండుటకై, పెనంగి=పెనఁగులాడి, లావు=బలిమి, ఎడలఁగన్ = పోవునట్లుగా, మల్లుపోరునన్ = మల్లయుద్ధమునందు, పట్టివ్రేయుటకున్ = చేతఁబట్టి క్రిందవైచుటకు, ఎత్తెన్ = ఎత్తెను, అనన్=అనఁగా, చనున్=ఒప్పును. (గంగను కాసె ననుచోట సంస్కృత శబ్దాంతమగు నచ్చునకు వైకృతాచ్చుపరముకాఁగా - శ్లో. 'క్వచిత్సంస్కృతీయోఽపి ప్రాణోఽప్యత్ర చ్యుతో భవే' త్తను నథర్వణోక్తి ప్రమాణము.) [ఇట్లు సమర్థింపఁజాలుటకంటె 'కాసెను' అను ద్వితీయాంతమునకు 'గంగను' - విశేషణముగాఁ గొన్న నేదోషము కలుగదు. వ.]

తా. ఆకాశగంగ స్వర్గమును వలయాకారమై చుట్టికొని యుండునుగాన స్వర్గమనుజెట్టికి గంగ కాసెవలె నుండె ననియు, శత్రుభంజనార్థముగ వప్రాగ్రమం దుంచిన దంచనము[1] లనఁగా నినుప గొలుసులతోఁగూడిన పాషాణవిశేషములు చేతులవలె నిడుపుగానఁ బురమనుజెట్టికి దంచనములు హస్తములవలె నుండె ననియు, నామధురాపురమను జెట్టి తనతో సాదృశ్యమునకు బెనఁగుచును నాయాకాశగంగ మధ్యప్రదేశమందే యుండుటవలన మల్ల యుద్ధమునందుఁ గోటకొమ్మ లనియెడి హస్తములచేత గంగయను కాసెకొక దూఱునటులఁ బట్టి బలిమిచెడునట్లుగాఁ గ్రింద వైచుటకు నెత్తెనో యను నటుల నొప్పుచుండె ననఁగా నాకాశగంగవఱకు గోటకొమ్మ లున్న వనియు, నప్పట్టణము స్వర్గముకంటె విశేషవస్తు సమృద్ధం బై నిఖిలసుఖప్రదమై యుండె ననియు నభిప్రాయము.

అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తే. ఉదుటుగుబ్బలు గలతల్పుటురము సూచి
గందపట్టెలు సూచి బంగారు సూచి
వీటివాకిటిచోటనే విడువ కెపుడు
సుట్లు వెట్టుచు నుందురు సోమరవులు.

టీ. సోమరవులు = చంద్రసూర్యులు - ఉదుటుగుబ్బలు - ఉదుటు = నిక్కఁబొడిచియున్న, గుబ్బలు=గుబ్బలను పేరంబరగిన ములుకు లనియెడు స్తనములు, కల=కలిగినట్టి, తల్పుటురము = కవాటమనియెడు నురస్థ్సలము, చూచి=కనియుచు, గందపట్టెలు సూచి=కవాటతిర్యగ్దారువిశేషము (అడ్డపట్ట) లనియెడు గంధపుగీఱలను జూచి, బంగారు సూచి=కవాటఖచితస్వర్ణ మనుస్వర్ణభూషణముఁ జూచి, వీటివాకిటిచోటనే=ఊరివాకిటి

1. దంచనము - ఫిరంగు లని టీకయందు వ్రాసి, తాత్పర్యమున ఇనుపగొలుసులతోఁ గూడిన పాషాణవిశేషములని వ్రాయుట చింతనీయము.

దగ్గఱనే, విడువక = వదలక, ఎపుడున్ = ఎల్లప్పుడు, చుట్టువెట్టుచున్ ఉందురు = చుట్టుకొనియుందురు.

తా. సోమరవు లను విటులు గొప్పలైన గుబ్బగోళ్లను స్తనములచేతను, గండపట్టె లనియెడు మైఱుఁగులచేతను, కవాటమందలి బంగారపుఁదగుళ్లను స్వర్ణభూషణముల చేతను నామథురాపట్టణ మొక స్త్రీవలె. నుండఁగా, వానిఁ జూచి దానివాకిళ్లు విడువక చుట్టిచుట్టి తిరుగుచుందు రని భావము. దీనియందు శ్లేష.

మ. స్థిరసౌధాగ్రవిహార[1]రయావతరతిచ్ఛిన్నాచ్ఛహారస్ఫుర
ద్గురుముక్తావలిఁ జేటిక ల్విరులతోఁ గూడంగఁ ద్రోయ న్నిజో
దరలగ్నం బగుదాని నెమ్మొగు లధస్థంబై తటిన్ రాల్ప నా
కర మభ్రం బని యండ్రుగా కుదధిఁ దక్క న్పుట్టునే ముత్తెముల్.

టీ. నెమ్మొగులు = మేఘము, అధస్థంబై = క్రిందనున్నదై, స్థిర...లిన్-స్థిర= నిశ్చలమైన, సౌధాగ్ర = మేడకొపురులయందు, విహార=సంచరించుచున్న, యావత = యువతిసమూహముయొక్క, రతి = సురతమునందు, ఛిన్న = తెగినట్టియు, అచ్ఛ = స్వచ్ఛమైనట్టియు, హార=దండలయందు, స్ఫురత్=ప్రకాశించునట్టి, గురు=స్థూలములగు, ముక్తా=ముత్తెములయొక్క, ఆవలిన్ = పంక్తిని, చేటికల్ = పరిచారికలు, విరులతోన్ కూడంగన్ = పువ్వులతోఁగూడ, త్రోయన్=పాఱఁజల్లఁగా, నిజోదర...గు - నిజ = మొగులుయొక్క, ఉదర=గర్భమునందు, లగ్నంబగు=తగిలికొనినట్టి, దానిన్=అమౌక్తిక పంక్తిని, తటిన్ = వానఁగురియువేళ, రాల్పన్ = వర్షింపఁగా, అభ్రంబు=మేఘము, ఆకర మని=ముత్యములకు జన్మస్థాన మని, అండ్రు గాక=వచింపుదురేకాని, ఉదధిన్=సముద్రమున, తక్కన్=కాక, ముత్తెములు = మౌక్తికంబులు, పుట్టునే = జనియించునే, జనియింప వనుట.

తా. మేఘమండలాతీతంబులగు నప్పట్టణపుమేడలయందు యౌవనస్త్రీలు సురత క్రీడ సలుపుతఱి త్రెస్సి రాలినముత్తియములఁ బరిచారికలు కసవుఁద్రోయువేళఁ బువ్వు ములతోఁగూడఁ జిమ్మి త్రోయఁగా, మేఘములయందుఁ బడునుగాన వర్షాకాలమున భూమియందు నాముత్యము లుండుటంజేసి మేఘములనుగూడ మణ్యాకరంబు లని చెప్పుదురే కాని సముద్రభిన్నం బొకటియును మణిజన్మస్థానము గాదు. దీనియం దత్యుక్తి.

మ. ఘనసౌధాళి వియద్ధునీజలధి వీఁకక న్నావ లై నీడ దోఁ
ప నెలంత ల్వణిగాకృతి న్సరకు మాఁకర్ప న్గోలల న్గట్టి యి

---

1. రిదంపతి.

చ్చునిజద్వీపవిచిత్రపట్టవసన । స్తోమంబు నాఁ బొల్చుఁ బె
ల్లనిలాన్యోన్య[1]మర్శితన్నగరనా । కానేకకేతుచ్ఛటల్. 12

టీ. ఘనసౌధాళి - ఘన=గొప్పలైన, సౌధాళి=మేడలసముదాయము, వియద్ధునీజలధిన్ - వియద్ధునీ=ఆకాశగంగ యనెడు, జలధిన్ = సముద్రమునందు, వీఁకన్ = స్పష్టముగాను, నావలై=ఓడలై, నీడ = మేడలనీడ, తోఁపన్ = కనుపింపఁగా, వెలంతల్ = ఆమేడలమీఁదనుండు వనితలు, వణిగాకృతిన్=వర్తకులవలె, సరకుమార్పన్ = భాండప్రతిభాండముఁజేయుటకై, కోలలన్=గడలచేత, కట్టి=బంధించి, ఇచ్చు...బు- ఇచ్చు=ఇచ్చునట్టి, నిజ = తమయొక్క, ద్వీప = దీవియందలి, విచిత్ర = వన్నెవన్నెలైన, పట్టవసన=పట్టువస్త్రములయొక్క, స్తోమంబు=సమూహము, నాన్ = అనునటుల, అనిలా...టల్-అనిల=వాయువుచేత, అన్యోన్య = ఒకటితో నొకటి, విమర్శి=ఒరయుచున్నట్టి, తన్నగర=ఆపురమునందలియు, నాక = స్వర్గమందలియు, అనేక=అసంఖ్యాకములైన, కేతు = టెక్కెములయొక్క, ఛటల్ = గుంపులు, పెల్లు = తఱుచుగా, పొల్చున్ = ప్రకాశించును.

తా. ఆకాశగంగ యను సముద్రములో మేడలనీడ గనుపింపఁగా నోడలవలె నుండె ననియును, అప్పుడామేడలమీఁద నుండు స్త్రీలు బేరగాండ్రుంబలె నుండి రనియు, గడలయందున్న టెక్కెములకుఁ గట్టిన వసనంబులు గాలిచేఁ గదలుటంజేసి యాస్త్రీల చేతఁ దమ దీవియందలి పట్టుపటావళులు ద్వీపాంతరవాసులకు భాండప్రతిభాండరీతిచే విక్రయింపఁబడుచున్నవో యనునటులఁ బ్రకాశించె ననియుఁ దాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. సోరణగండ్ల రాఁ గొదమ । చుక్కలు పట్ట సతు ల్కవాటముల్
చేరుప మౌక్తికంబు లని । చిల్లులు పుత్తురు ద మ్మటంచుఁ బొ
ల్పారువితానహారముల । యందొగిహారత ప్రేలి ప్రొద్దు పోఁ
గా రతి డస్సి గాడ్పులకుఁ । గాఁ దెఱవ న్జను విచ్చి మేడలన్. 13

టీ. కొదమచుక్కలు=పిన్ననక్షత్రములు, సోరణగండ్లన్ = గవాక్షములవలన, రాన్ = రాఁగా, పట్టన్ = ఆనక్షత్రములను బట్టుటకొఱకు, సతులు = యువతులు, కవాటములు=తలుపులను, చేరుపన్=మూయఁగాను, తమ్ము=ఆనక్షత్రములను, మౌక్తికంబులని=ముత్తెము లని, చిల్లులు పుత్తురు=రంధ్రములు వేయుదురు, అటంచున్=అట్లనుచు, పొల్పారు...దున్-పొల్పారు = సుందరమైన, వితాన = మేలుకట్లయొక్క, హారముల

1. మర్ది.

యందుఁ = సరములయందు, ఒగిఁ = క్రమముగా, హారశ్రీఁ = హారరూపమున, ప్రేలి=ప్రేలాడి, ప్రొద్దు = విశేషకాలము, పోఁగాఁ = గతింపఁగా, రతిఁ = క్రీడ చేత, డస్సి = అలసి, గాడ్పులకుఁ దాఁ = వాయుసంచారముకొఱకు, తెఱవఁ = తల్పుఁదెఱవఁగా, మేడలఁ = సౌధములనుండి, విచ్చి = విడచి, చనుఁ = వెడలి పోవును. అలం. అత్యుక్తి.

తా. అనఁగా మేడలు నక్షత్రమండలమును ముట్టిపోయిన వని భావము.

ఉ. ఆపుర (రి) సౌధవీథి నధ । రాధరభూముల గర్జ ముష్నుగా
నాపయికి న్వినంబడని । యట్లుగఁ గ్రా(వ్రా)లుఘనాళిఁ దార్చి లీ
లాపరతఁ ఘటింపుదురు । లాస్యము సేయఁగ మేఘరంజనా
లాపము సేసి పోషితక । లాపిఁ గలాపికలాపకుంతలల్. 14

టీ. కలాపి...లల్-కలాపి=నెమలియొక్క, కలాప = బర్హమువంటి, కుంతలల్= కురులుగల స్త్రీలు, ఆపురసౌధవీథిఁ - ఆపుర = ఆపట్టణముయొక్క, సౌధ = మేడల యొక్క, వీథిఁ=పంక్తియందు, అధరా...లఁ - అధరఅధర = క్రిందటి క్రిందటి, భూములఁ = ప్రదేశములయందు, గర్జ ముష్నగాఁ = ఉఱుములు మొదలుగా, ఆప యికిఁ = ఆమేడలమీఁదికి, వినంబడనియట్లుగఁ = వినరానియటుల, క్రాలుఘనా లిఁ - క్రాలు = ఒప్పుచున్నట్టి, ఘన = మొగులుయొక్క, ఆలిఁ=సమూహమును, మేఘరంజిఁ ఆలాపముసేసి = మేఘరంజి యనురాగము నాలాపముఁ జేసి, తార్చి = క్రింద నున్న మేఘములను మేడలపైకి రప్పించి, పోషితకలాపిఁ-పోషిత=పెంపఁబడి నట్టి, కలాపిఁ = నెమలిని, లీలాపరతఁ = విలాసాసక్తిచేతను, లాస్యముసేయఁగఁ= నృత్య మొనర్చునటుల, ఘటింపుదురు = సంఘటనచేయుదురు. అనఁగా నాపురమందలి యువతులు గాననృత్యాదులయందు నిపుణలగుటంజేసి యామేడలు మేఘమండలాతీతం బులై యున్నను దదనుగుణరాగాలాపములచే మొగిళులఁ బైకి రప్పించుచున్నా రని యభిప్రాయము. అలం. అతిశయోక్తి.

చ. అనిమిషపట్టణంబు పుర । హర్మ్యపతాకలు మువ్వమ్రోఁతతోఁ
దనగృహపంక్తిపైఁ గలశ । తామరసంబులఁ గప్పఁ గ్రింద నుం
డును నిజలక్ష్మి చేసరిప । ణుల్ మొఱయంగఁ దదీయలక్ష్మి శం
కను మొగ మెత్తిచూచుతఱిఁ । గన్నులు కేలికి మూయఁగా బలెన్.

టీ. నిజలక్ష్మి=మధురాపురలక్ష్మి, చేసరిపణుల్ = తనచేతనున్న సరిపణగొలుసులు, మొఱయంగఁ=మ్రోయఁగా, తదీయలక్ష్మి = అమరావతీపురలక్ష్మి, శంకను=ఈచప్పు

దేమనుశంకచేతను, మొగమెత్తి = ముఖమునుపైకెత్తి, చూచుతఱిన్ = వీక్షించుసమయమున, కన్నులు = నేత్రములను, కేళికిన్ = వినోదమునకు, మూయఁగాన్ బలెన్ = మూయుచున్నట్లువలె, అనిమిషపట్టణంబు = అమరావతీపట్టణము, పురహర్మ్యపతాకలు- పుర = మధురయొక్క, హర్మ్య = మేడలయందలి, పతాకలు = టెక్కెములు, మువ్వమ్రోఁతతోన్ = చిఱుగజ్జెలధ్వనితోఁగూడ, తనగృహపంక్తిపైన్=అమరావతి గృహపంక్తియందలి, కలశతామరసంబులన్ = తామరమొగ్గలవంటి కలశములను, కప్పన్ = మూయఁగా, క్రిందనుండును = మధురాపట్టణపుఁ డెక్కెములకు దిగువ నుండును.

తా. మధురాలక్ష్మి చేసరిపణగొలుసులయొక్క మ్రోఁతను విని యిదే మనుశంకచే నమరావతీలక్ష్మి తనమొగమును పైకెత్తి చూచుసమయమున, మధురాలక్ష్మి యాయమరావతీపురలక్ష్మియొక్క కన్నులను వేడుకకై మూసెనో యనురీతి మధురాపురపు మేడల యందలి పతాకలు గజ్జెలమ్రోఁతతోఁ గూడవచ్చి తనగృహపంక్తిపై నున్న తామర మొగ్గలవంటి కలశములఁ గప్పుచుండఁగా నమరావతీపురము మధురానగరపుఁ డెక్కెములకుఁ గ్రింద నుండు నని తాత్పర్యము.

చ. ఘనగతశంపఁ గంచ మిడి కాటుకఁ దీర్చి, పునుం గినోష్మఁ ద
ట్టినది యలంది, కైశికము రేవఁ బ్రభాతశశాంకుమోప వి
చ్చిననవహల్లకాళిఁ గయి సేసి సతు ల్పతితో రమింతు, ర
మ్మునిజరతాంగన ల్కలహము ల్కృప నేడ్వురుఁ దీర్ప మేడలన్.16

టీ. మేడలన్ = అప్పట్టణపు మేడలయందు, సతులు = స్త్రీలు, అమ్మునిజరతాంగనలు-అమ్ముని = ప్రసిద్ధులగుసప్తర్షులయొక్క, జరతాంగనలు=వృద్ధభార్యలు, (వృద్ధలు గావుననే దంపతులకలహములం దీర్చుచున్నా రని చెప్పంబడియె.) కృపన్ = దయచేతను, కలహములు = సతీపతులప్రణయకలహంబులను, తీర్పన్ = పోఁగొట్టఁగా, ఘనగతశంపన్ - ఘన=మేఘములను, గత=పొందినట్టి, శంపన్ = మెఱుపనెడిదీపమందు, కంచము=పళ్లెమును, ఇడి=ఉంచి, కాటుకన్ తీర్చి = ఆపళ్లెమునందుఁ గలిగినకాటుకను గన్నులఁబెట్టుకొని, ఇనోష్మఁదట్టినది - ఇన ఊష్మన్=సూర్యునివేఁడిమిచేతను, తట్టినది= కరిగినట్టి, పునుంగు = తట్టుపునుఁగును, అలంది = పూసికొని, కైశికమున్ = కొప్పులను, రేవన్=తీవిచేత, ప్రభాత=ప్రాతఃకాలమునందలి, శశాంకున్ = చంద్రుని, మోపన్= మోపఁగా; తగిలింపఁగా, (ఇచట రాత్రియందుఁ బ్రణయకలహంబుననే ప్రొద్దుపుచ్చఁబడినది గావునఁ దెల్లవాఱవచ్చెనని సూచింపఁబడియె.) విచ్చిన=వికసించినట్టి, నవ...లిన్ నవ=క్రొత్తలగు, హల్లకాళిన్=చెంగల్వలను, కైసేసి = శృంగారించుకొని, పతితోన్=

పెనిమిటిలోఁదను, జాత్యేకవచనము. రమింతురు = క్రీడింతురు - అనఁగా సప్తర్షి మండల పర్యంత మామేడలు గట్టంబడియున్న వని భావము. అలం. అతిశయోక్తి.

చ. రవి యనుదివ్వెఁ గేతువుచెఱఁగున మూసి[1]ధృతోర్ధ్వయంత్రవా
రవిరళఘర్మ్మలై కలరవాల్పరవోక్తుల వాంతధూపరా
జివరనిశ న్గనన్మదన[2]చేతులచాతురి నెయ్యపుంగురుం
జువిదలు దార్పవిష్ణుపద మొత్తుఁ[3]బురిన్ గృహలక్ష్మి[4]నూత్నతన్. 7

టీ. పురిన్ = పట్టణమందు, గృహలక్ష్మి = గృహలక్ష్మియనెడిస్త్రీ, నూత్నతన్ = నవోఢాత్వముచేతను, కనన్ = చూడఁగా, మదనచేతులన్ = మదనచేతు లనియెడి చేతుల యొక్క, (మదనచేతు లనఁగా గృహమున కురుఁజులమీఁద నమర్చిన యంగదారువు) చాతురిన్ = నైపుణ్యముచేతను, నెయ్యపుం...లు-నెయ్యపున్ = ప్రేమగలిగినట్టి, కురుంజువిదలు = కురుఁజులనియెడిచెలులు, తార్పన్ = పెనిమిటి యగువిష్ణునికడకు చేర్పఁగాను, రవి యనుదివ్వెన్ = సూర్యుఁ డనుదీపమును, కేతువుచెఱఁగునన్ మూసి = టెక్కెపుగుడ్డ యనెడు పైఁటచెఱఁగునఁగప్పి, ధృతోర్ధ్వ...లై-ధృత = ధరింపఁబడిన, ఊర్ధ్వ = ఉపరి ప్రదేశమందున్న, యంత్ర = జలయంత్రములయొక్క, వాః = ఉదకములనియెడి, అవిరళ = ఎడతెగని, ఘర్మ్మ ఐ = చెమటగలదై, (సాత్త్వికోదయ మాయె ననుట) కలరవాల్పరవోక్తులన్ - కలరవ = పావురములయొక్క, అల్పరవ = కొంచెపుధ్వనులనియెడు, ఉక్తులన్ = పలుకులచేత, వాంత...నిశన్ - వాంత = గవాక్షములనుండి వెడలెడు, ధూప = అగరుశ్రీగంధాదిధూపములయొక్క, రాజి = సమూహ మనియెడు, వర = శ్రేష్ఠమైన, నిశన్ = రాత్రియందు, విష్ణుపదమున్ = ఆకాశ మనియెడు విష్ణుపాదమును, ఒత్తున్ = సంవాహనము చేయును. కనన్మదన - కనత్ = ప్రకాశించుచున్న, మదన = కామము కలదై (ఉదయత్కామ యై), చేతులన్ = హస్తములతో (అని శ్లేష). ఒత్తున్ = పట్టుచున్నది. (ఆకాశమును ద్రోయుచున్న దని శ్లేష)

తా. ఆపట్టణమందు ధ్వజపటములు సూర్యునిం గప్పఁగా, మదనచేతులతోఁ గురుఁజులు మిన్ను ముట్టఁగా జలయంత్రములు స్రవింప ధూపధూమములు మెఱయఁ బురలక్ష్మి యాకాశమును స్పృశించెను. మఱియు, పురలక్ష్మి విష్ణుపద మనియెడి పదద్వయ స్వారస్యముచేత నర్థాంతరముఁ దోఁచుచున్నది. నూతనస్త్రీకిఁ జెలుల ప్రేరణముచేతఁ బెనిమిటినిఁ బొందుటయు, దీపము మఱుగుపఱుచుటయు, స్వల్పధ్వనితో సంభాషించుటయు, భోగగృహమందు ధూపవాసనలు నిండఁ బతిచరణము లొత్తుటయు,

1. ధృత. 2. చేతులఁ జాతురి. 3. పురీగృహలక్ష్మి. 4. నూత్నగాన్.

స్వభావముగానఁ బురలక్ష్మి యను స్త్రీ ధూపధూమము లనియెడి రాత్రియందు రత్యనుకూల సంభారముగలది యై విష్ణుపదము నొత్తు ననుట. సమాసోక్త్యలంకారము. శ్లో. 'సమాసోక్తిః పరిస్ఫూర్తిః ప్రస్తుతే ప్రస్తుతస్యచేత్' అని దానిలక్షణము. [ఇందు ప్రథమ పాదమున ర, ఱ-లకు యతి. చెఱఁగు శబ్దమును ఉభయరేఫయుక్తముగాఁ గొన్న నీ దోషము తొలఁగును.]

చ. గిఱికొనుగోపురాగ్రపరికీలితపంకజరాగరశ్మిఁ గ
ట్టెఱ యగుచాయఁ బొల్చు దివసేంద్రుఁడు చక్కనమింటఁ బోవుచో
మఱచి విధాత పాటలిమ మధ్యమసంధ్యకుఁ జేయ లేనియా
కొఱఁతయుఁ దీర్చుకోఁ దొగరు గొల్పినకైవడిఁ బట్టణంబునన్. 18

టీ. పట్టణంబునన్ = మధురయందు, దివసేంద్రుఁడు = సూర్యుఁడు, చక్కనమింటన్ పోవుచోన్=చక్కఁగానాయూర నాకాశమధ్యమునఁ బోవునపుడు, విధాత= చతుర్ముఖుఁడు, మఱచి=మఱచిపోయి, పాటలిమ = రక్తిమను, మధ్యమసంధ్యకున్ = మధ్యాహ్నమునకు, చేయలేని = నిర్మింపఁజాలని, ఆకొఱఁతయున్ = ఆకొదువను, తీర్చుకోన్=తీర్చుకొనుటకు, తొగరు = రక్తిమను, గొల్పిన = చేసిన, కైవడిన్=రీతిగా, గిఱి...శ్మిన్-గిఱికొను=నిబిడమైన, గోపురాగ్ర = మేడలమీఁద, పరికీలిత = చెక్కఁబడిన, పంకజరాగ = పద్మరాగమణులయొక్క, రశ్మిన్ = కాంతులచేత, కట్టెఱ యగు చాయన్ = మిగుల నెఱ్ఱనైనకాంతిచేత, పొల్చున్ = ఒప్పును.

తా. మధురాపురగోపురములకు సరిగా నంతరిక్షమునఁ బోవుసూర్యుఁడు సృష్టికాలమున బ్రహ్మ ప్రాతస్సాయంకాలములకే రక్తిమ గలుగఁజేసి మధ్యాహ్నమునకుఁ జేయనేఱ కున్న కొఱఁత దీర్చికొనుటకు రక్తిమను గలుగఁజేసిన విధమునఁ బురద్వారములయందుఁ జెక్కఁబడిన పద్మరాగమణుల ప్రభలచే మిగుల నెఱ్ఱనైన చాయచేత నొప్పె నని తాత్పర్యము. అలం. తద్గుణాలంకారము. ఉత్ప్రేక్ష.

పుష్పలావికలు

సీ. వెలఁది యీనీదండ వెల యెంత నాదండ
కును వెలఁ బెట్ట నెవ్వనితరంబు
కలువతావులు గాన మలికదంబకవేణి
కలువతావులు వాడకయ కలుగునె
కడివోదు నా కిమ్ము పడఁతి యీఁగేదంగి
సన కడివోమి ముంగపజెక్కిఁ జూడు

జాతు లే వంబుజేక్షణ పద్మినులు సైత
    మును నున్నయెడ జాతులునికి యరుదె
తే. యనుచుఁ దొలి నుడి నభిలాషలెనయ మూఁగి
పలుకుతోడనె నర్మగర్భంబు గాఁగ
నుత్తరము పల్లవశ్రేణికొపఁగు చలరు
లమ్ముదురు పుష్పలావికలప్పురమున. 19

టీ. వెలఁది=ఓయింతీ, ఈనీదండ = ఈనీయొక్క పుష్పమాలికకు (బాహువునకు అనియు) వెల = క్రయము, ఎంత = ఏమాత్రము, అని విటుఁ డడుగ నావెలఁది చెప్పు నుత్తరము, నాదండకును = నామాలికకు (నాబాహువునకు-లేక నాసమీపమున నిలుచు టకు), వెలఁబెట్టఁగ ఎవ్వనితరంబు = మూల్యమింత యని నిర్ణయింప నెంతవానికైనను వశంబే, (వశము గా దనుట), అలికదంబకవేణి=భ్రమర సమూహమువంటి జడగలయోయింతీ, కలువ తావులు గానము (తావు లనఁగా వాసనలకును స్థలములకును పే రగుటంజేసి) మనకు సంగమించుటకు తా వెక్కడ అనియు, కలువదండవాసనలు గాన మేమి యని యును ప్రశ్న, కలువతావులు=కలువవాసనలు, (కలువస్థాన సాదృశ్యముగల నాభులును), వాడకయె = వాడుఁజూపకయె, (పరిచయములేకయే), కలుగునె = సిద్ధింప వనుట, పడంతి = ఓస్త్రీ, కడివోదు=వాడఁబాఱదు, ఈగేదంగి నన = ఈమొగలిఱేకు, దాని వంటి రహస్యప్రదేశమును, నా కిమ్ము, కడివోమిఁగ ముందటికిఁగ చూడు=వాసన చెడ కుండుట ముందు ధరించిచూడుము, (తనతోఁ గలసి యెడబాసినప్పుడు కబళము నోటికిఁ బోకయుండునది ముందఱఁ జూచెద వనుట), అంబుజేక్షణ = ఓపద్మాక్షీ, జాతులు ఏవి = జాజిపువ్వులేవి, (జాతి యే మని ప్రశ్న), పద్మినులు సైతమును = తామరపువ్వ లును, (పద్మినీజాతిస్త్రీలును), [రతిరహస్యమందుఁ బద్మినీజాతిలక్షణము. శ్లో. 'కమల ముకుళమృద్వీఫుల్లరాజీవగంధి స్సురతపయసి యస్యా స్సౌరభం దివ్యమఙ్గే, చకితమృగ దృగాభే ప్రాంతరక్తేచ నేత్రే స్తనయుగళమనర్ఘం శ్రీఫలశ్రీవిడంబి, వ్రజతి మృదు సలీలం రాజహంసీవ తన్వీ, త్రివళిలలితమధ్యా హంసవాణీసువేషా, మృదుశుచిలఘు భుఙ్క్తే మానినీగాఢలజ్జా ధవళకుసుమవాసో వల్లభా పద్మినీస్యాత్.' అని.] ఉన్న యెడఁగ=ఉన్నచోటను, జాతులు ఉనికి = జాజిపూవులు (హస్తినీ శంఖినీచిత్రిణీ జాతులు) ఉండుట, అరుదే=ఆశ్చర్యమా, (ఆశ్చర్యము కా దనుట), అనుచుఁగ=ఇట్లని వచించుచు, తొలిసుడిఁగ = మొదటిమాటచేతను, అభిలాషలు = పుష్పములమీఁది (పుష్పలావికలమీఁది యనియు) కోరికలు, ఎనయఁగ=స్ఫుటమగునటుల, మూఁగి=క్రమ్ము కొని, పలుకుతోడనే = విటులు వచింపఁగానే, నర్మగర్భంబు కాఁగఁగ - నర్మ=శృంగార

చేష్ట, గర్భంబుకాఁగన్=అంతస్థమై యుండఁగా, ఉత్తరము = ప్రతివాక్యమును, పల్లవ శ్రేణికిన్ = విటుల సమూహమునకు, ఒసఁగుచున్ = ఇచ్చుచును, పుష్పలావికలు = పువ్వులఁగోసి విక్రయించెడి స్త్రీలు, అలరులు = పుష్పములను, అప్పురమునన్=ఆపట్టణమందు, అమ్ముదురు=విక్రయింతురు. అలం. వ్యాజోక్తి.

తా. ఆమధురయందు విలాసవంతులగు విటులు విహరించువేళ నీపద్య పాద చతుష్టయమున మొదటఁ జెప్పంబడియున్న తెఱఁగునఁ దమయభిలాషలు స్ఫుట మగు నటులఁ బ్రశ్న లడుగుచుఁ జుట్టుకొని పలుకఁగా, వెంటనే నర్మగర్భంబుగ నావిటులఁ గూర్చి ప్రత్యుత్తరము లిచ్చుచు రసికశిఖామణు లగుపుష్పలావికలు పువ్వు లమ్ముదు రని భావము.

చ. సరసులనర్మ మింపుల నొ । సంగఁ గదంబపుదండఁ గట్టుచోఁ
గరఁగుటఁ దెల్పుదృక్తరళ । కాంతులు నుత్తర మిచ్చునంతరాం
తరముల నవ్వులు న్గలువ । తండము మొల్లలు నంచు మిన్నగ్రు
చ్చి రహిని రత్తనూ లొసఁగి । సిగ్గు వహింతురు పుష్పలావికల్. 20

టీ. సర...ము - సరసుల = రసికు లగువిటులయొక్క, నర్మము = శృంగారము, ఇంపులన్ = ఇష్టములను, ఒసంగన్ = కలుగఁజేయుచుండఁగా, కదంబపుదండన్ కట్టుచోన్ = కదంబపు సరముఁగట్టెడు వేళ, కరఁగుటన్ = ఆవిటుల సరసంపుబలుకులకు దమ మనములు గరఁగుటను, తెల్పు...లున్ - తెల్పు=తెలియఁజేయుచున్నట్టి, దృక్=నేత్రములయొక్క, తరళ=చంచలములగు, కాంతులున్=ప్రభలును, ఉత్త...లన్-ఉత్తరము= ప్రత్యుత్తరమును, ఇచ్చు = ఒసఁగుచున్నట్టి, అంతరాంతరములన్ = నడుమనడుమను, నవ్వులున్ = నవ్వేదునవ్వులును, కలువతండము = ఉత్పలములు, మొల్లలు=మొల్లలును, అంచున్=నిశ్చయించుకొని, మిన్నగ్రుచ్చి = బయలుగూర్చి, రహిని = విలాసమునన్, రత్తనూలు ఒసఁగి = పట్టినూలుచేతికిచ్చి, పుష్పలావికలు = పుష్పములమ్మువారలు, సిగ్గు వహింతురు = లజ్జపడుదురు. ఆ మధురాపురమందుఁ బుష్పముల విక్రయించు స్త్రీలు మిగులఁ జమత్కారిణు లై యున్నను రసికశిఖామణు లగు విటులు సరసోక్తులచేత నట్టి చాతుర్యయుక్తస్త్రీలనుగూడ మోహింపఁజేయుదు రని ముఖ్యాభిప్రాయము.

అలం. భ్రాంతిమంతము, యథాసంఖ్యము.

సీ. పద్మాప్య పుర నను । [1]భవితకు నీవ యె
త్తులు వెట్టు దనఁగ రా । వలసె నిటకుఁ

1. భవమును.

దెలుపుమా జాముండు నలరింపా ఘటికాద్వ
యం బుండు నలరింపా కంబుకంఠి
యే వేఁడుటకు నీవు ఋతు వేల చెప్పెద
వువిద మే మందాఁక నోర్వఁగలమె
చేరఁగా రాదె బాసికము గేలు సోఁకిన
యంతనే చెడునె యేణాయతాక్షి
తే. యనుచుఁ బరిభాషవోలెఁ దమ్మాస నోరల
నాడ మోవిఁ జెఱంగిడి యాఁగు నవ్వు
కంట నిగుడ విరుల్నాన్చు కరణిఁ జల్లు
సరసపుజలంబె జాణల మరులుకొల్పు. 21

టీ. పద్మాస్య=ఓపద్మముఖి, పురిన్=ఈమధురలో, అనుభవిత(వము)కున్=అనుభవించువానికి, నీవ = నీవే, ఎత్తులు వెట్టుదు = పుష్పముల యెత్తులు పెట్టుదువు (క్రీడకొఱకు నెదురు వెచ్చము పెట్టుదు వనియును) (ఎత్తు లనఁగాఁ బ్రయత్నము లని కొందఱందురు), అనఁగన్=వచింపఁగా, ఇటకున్=ఇచ్చటికి, రావలసెన్=వచ్చుటకుఁ గారణం బాయెను, కంబుకంఠీ=శంఖమువంటి మెడగలయోవనితా, జాము ఉండు=యామమువఱకు వాసనచెడకుండు, అలరు = పుష్పము, (సంతోష మనియు) ఇంపా=బాగైనదో, ఘటికాద్వయంబు ఉండు=రెండుగడియలు వాసనచెడకుండు, అలరు = పుష్పము, ఇంపా=బాగైనదో, (అది యానందమునకును నామ మగుటవలన) యామపు సురతానంద మిష్టమో లేక రెండుగడియల సురతానందమిష్టమో, తెలుపుమా=తేటపఱుపుమా, ఉవిద=ఓయింతీ, ఏన్ వేఁడుటకున్=నేను వలయు నని కోరినపుష్ప మిచ్చుటకు (నేను నిన్నుఁ గోరినందుల కనియు) ఋతువు = ఋతుకాలము రావలయు నని, ఏల=ఎందుకు, నీవు=నీవు, చెప్పెదవు=నుడివెదవు, మేము అందాఁకన్=మే మదివఱకు, ఓర్వఁగలమె=ఓర్వఁగలమా. (ఏము నీతోడిసంసర్గమును గోరిన ఋతుస్నానముఁ జేసిన దివసమున నయ్యెదు మని చెప్పెదవు. మే మందాక నోర్వలే మనుట), ఏణాయతాక్షి-ఏణ = ఇఱ్ఱియొక్క, ఆయత=దీర్ఘములైన, అక్షి = కన్నులవంటి కన్నులుగల యోలలనా, చేరఁగా రాదె = దగ్గఱఁ జేరఁగూడదా, బాసిక మనఁగాఁ బుష్పమాలిక రచనావిశేషమునకును, ఊరుమాలమునకును నామముగావున, బాసికము=పుష్పమాలికయు, నీయూరుమూలమును, కేలు సోఁకినయంతనె=నాచేసోఁకిన మాత్రమునను, చెడునే=చెడి పోవునా, అనుచున్=ఏల స్పృశింపనియ్యవనుచు, పరిభాషవోలెన్=సంకేతపుమాటలాడినటుల, తమ్మిన్=తమ్ము, ఆసద్రోలెన్=అభిలాష వెడలునటుల, ఆడన్=పలుకఁగా, మోవిన్=అధరోష్ఠమున,

చెఱంగిడి=పైటకొంగు మూసికొని, ఆఁగునవ్వు-ఆఁగు=నిలిపిన, నవ్వు=హాసము, కంటన్ = నేత్రములయందు, నిగుడన్=వెడలి రాఁగా, విరులు=పుష్పములను, నాన్చు=తడుపునట్టి, కరణిన్=రీతిచేత, (అలం. కైతవాపహ్నుతి.) చల్లుసరసపు జలంబె - చల్లు=చల్లెడు, సరసపు జలంబె=రసయుక్తంబగు నుదకమే, జాణలన్=విటులను, మరులు కొల్పున్=మోహపడఁజేయును. అలం. శేష.

సీ. ఇంద మన్ తఱి దంతకుంద ధాభఁ గూడి ని
            శ్చలపుఁజూపులు మున్ను సంభ్రమింప
  వెల యొప్ప కవలఁ బోవిఱుచుమోవియుఁ గోప
            మొదవెడుచూపు మోమోటఁ ద్రిప్పఁ
  దిరిగిన సస్మితోక్తియుఁ జూపుటొయ్యార
            ములు నగుఁ గాదను పలుకు లుడుప
  నవి గాని కావో నీకను పరాసాపత్న్య
            సంపాదనంబుల (బుబ్బు) నింపుఁ బెనుపఁ
తే. జతురవచనవిలాసాంగసౌష్ఠవములఁ
  బసిఁడిఁ దా నిచ్చినట్టియప్పణఁతి మఱవఁ
  బలికిఁ గైదువ లందిచ్చు రతివిధమున
  విటుల కిత్తురు మఱి వారు విరులు పురిని. 29

టీ. ఇందము = ఇదిగో, అన్ తఱిన్=అనువేళ, దంత కుంద ఆభన్ = మొల్లల వంటిదంతములకాంతిని, కూడి = చేరికొని, నిశ్చలపుఁజూపులు-నిశ్చలపు = కదలకుండునట్టి, చూపులు=చూడ్కులు, మున్ను = తొలుతనే, సంభ్రమింపన్ = తొట్రుపడఁగా, వెల=క్రయము, ఒప్పక = సమ్మతింపక, అవలన్ పోన్ = ఆవల మఱియొకయంగడికిఁ బోఁగా, విఱుచుమోవియున్=మడవఁబడినయధరోష్ఠమును, కోపము ఒదవెడుచూపున్= కోపమును గనుపఱుచుచున్నదృష్టియును, మోమోటన్ త్రిప్పన్ = మొగమోటమిచే నాతఁడు వెనుకకు వచ్చునట్లు చేయఁగా, తిరిగినన్ = ఆవిటుఁడు మరల రాఁగా, సస్మిత ఉక్తియున్=చిఱునవ్వుతోఁగూడినమాటయును, చూపుటొయ్యారములును = గర్వపుఁజూపులును, అగున్ కాదు అనుపలుకులు = ఔనుకాదన్నవాక్యములను, ఉడుపన్ = మాన్పఁగా, అవిగాని=ఆమాలికలేగాని, ఆస్త్రీలేగాని, కావో నీకున్=నీ కిష్టములుగావా, అను = అనునట్టి, పరాసాపత్న్యసంపాదనంబులు - పరా = ఇతరస్త్రీలకు, సాపత్న్య = తమలో సపత్నీభావమును, సంపాదనంబులు = సంపాదించుచున్న పలుకులు, ఇంపున్=

ఇష్టమును, పెనుపన్ = వృద్ధిఁజేయఁగా, (ఆబిడపువ్వేగాని నాపువ్వు పనికిరాదా యని భావార్థము.) చతురవచన...లన్ - చతురవచన = చాతుర్యపుమాటలచేతను, విలాస= చేష్టలచేతను, అంగసౌష్ఠవములన్=సౌందర్యముచేతను, పసిఁడి=పైకము, తా నిచ్చినట్టి యప్పణఁలిన్=తా నిచ్చిన యాస్త్రీని, మఱపన్=మఱచిపోఁగా, పలికిన్=పెనిమిటికి, కైదువలు = ఆయుధములు, అందిచ్చురలివిధమునన్ = చేలికందిచ్చునట్టి రతీదేవివలె, పురిని = మథురయందు, వారు = పుష్పము లమ్ము యువతులు, విరులు=పుష్పములను, ఇత్తురు=ఒసఁగుదురు. మన్మథునికి రతీదేవి యాయుధములఁ జేలి కందిచ్చునటుల మథురాపట్టణమందలి పుష్పలావికలు విలాసచాతుర్య సౌందర్యములచే మోహింపఁజేయుచు విటులకుఁ బుష్పము లమ్ముదు రని యభిప్రాయము.

అలం. స్వభావోక్తి. ఎ. గీ. చివరిరెండుపాదములలో ఉపమ.

చ. దల మగుచంద్రఖండములు ౕ దారలు సాంకవ మొప్పుపాణిపా
టల మగుదంతపుంగరవటంబు ౕ శశాంకుఁడు గుంకుమైనచీ
రలజిగి కెంపు గా బయటిరథ్యల నొప్పుదు రిందుకాంతవే
దులఁపయి సంధ్యయే బహుతఁదోఁచె నన న్పురి గట్టివా ల్సతుల్.

టీ. దల...ఖండములు - దలమగు = సాంద్రమైన, చంద్రఖండములు = కర్పూరంపుఁదునుకలు, తారలు = చుక్కలు, సాంకవము = పునుఁగుచేతను, ఇచటఁ దృతీయార్థమందు ప్రథమ. ఒప్పు = ప్రకాశించుచున్న, పాణి = హస్తముచేతను, పాటల మగు = తెలుపు ఎఱుపువర్ణము గల, దంతపుంగరవటంబు-దంతము+కరవటము= దంతపుబరణి, శశాంకుఁడు = చంద్రుఁడు, కుంకుమ ఐనచీరలజిగి=చెందిరమంటిన కోకల కాంలి, కెంపుగాన్ = ఎఱుపు కాఁగా, ఇందుకాంతవేదులపయిన్ =చంద్రకాంతపుఁ దిన్నెలమీఁదను, సంధ్యయే = సంధ్యాకాలమే, బహుతన్ = బహుత్వముచేతను, తోఁచెను అనన్ = కానఁబడియె ననునటుల, పురిన్=పట్టణమందలి, బయటిరథ్యలన్= వెలుపటివీథుల యందు, గట్టివాల్సతులు=పరిమళద్రవ్యములమ్మెడు స్త్రీలు, ఒప్పుదురు= ప్రకాశించు చుందురు.

తా. ఆపట్టణమందుఁ బరిమళద్రవ్యము లమ్ముచున్న స్త్రీలు, బైటివీథులయందున్న చంద్రకాంతమణిమయమగు వేదికలపైఁ దమచేతనుండు పునుఁగుచే నిండింపఁబడి హస్తకాంతిచే నెఱ్ఱనైన దంతపుబరణి చంద్రుఁడుగాను, ఆకరాటమందున్న కప్రపుఁ దునుకలు చుక్కలుగాను, కుంకుమచేఁ దుడువఁబడిన చీరలకాంలి ఎఱ్ఱనగుచుండఁగా సంధ్యాకాలలక్షణ మొప్పుచుండెను గాన, నసేకరూపంబులఁ బొందిన సంధ్యయో యను

నటులఁ బ్రకాశించుచు నుందు రని తాత్పర్యము. (గట్టివాల్సతులు అనుపదము భారత ప్రసిద్ధము). అలం. రూప కానుప్రాణితోత్ప్రేక్ష.

సీ. ఉపరిస్థజనవారణోత్తికిఁ జెవిఁ దార్చి
యమ్మొగంబై బయ ల్చిమ్మి చిమ్మి
గవనివె న్నొరయ మిన్నవియ దట్టించుతో
త్త్రధరు బందపుదాంట్లఁ దటిమి దటిమి
చలువచే ద్వారవేదు లెఱింగి నిల్చి త
జ్జనజిఘృక్షులఁ గేలు సాఁచి సాఁచి
డిండిమంబుల నుబ్బి గండాల్పదాన మే
ఱులుగఁ దద్వహు ఱాల నుఱ్వి నుఱ్వి
తే. వేణుకాహతులకు వీడు వెడలి వెడలి
పరపథగజధ్వనికిఁ బోక తిరిగి తిరిగి
[1]దృక్పుటలు వైరులకుఁ బంపుకృత్యలన వ
శానుగతిఁ జేరు వెలిఁ గరు లగ్గలికల. 21

టీ. కరులు = ఏనుఁగులు, ఉప...కిన్ - ఉపరిస్థ = పైనుండెడు, జన = మావటీలయొక్క, వారణోత్తికిన్ - వారణ = వారణార్థమైన, ఉత్తికిన్ = అదలింపునకు, చెవిన్ తార్చి = చెవియొగ్గి, అమ్మొగంబై - ఆదిక్కుముఖమై, బయలు = ఆకాశమును, చిమ్మి చిమ్మి, మిన్ను అవియన్=ఆకాశము బ్రద్దలయ్యెడునట్లు, దట్టించుతోత్త్రధరున్ - దట్టించు = ధ్వనిఁజేయుచున్న, తోత్త్రధరున్ = ఈఁటెధరించినవానిని, గవనివెన్ను ఒరయన్=ఊరివాకిలివీఁపుఁదాకఁగా, బందపుదాంట్లన్=కుప్పిగంతులచేతను, దటిమిదటిమి, చలువచేన్=చల్లగా నుండుటచేత, ద్వారవేదులు=వాకిట నున్న తిన్నెలను, ఎఱింగి=తెలిసికొని, నిల్చి, తజ్జనజిఘృక్షులన్ - తత్ = ఆవేదికలయందలి, జన = జనములయొక్క, జిఘృక్షలన్ = పట్టవలయు నను నిచ్ఛచేత, కేలు = తొండము, సాఁచిసాఁచి, డిండిమంబులన్ = ముందఱఁబోవువాఁడు వాయించెడు డిండిమవాద్యధ్వనులకు, ఉబ్బి = ఎక్కుడై, గండాల్పదానము-గండ=గండస్థలమందలి, అల్ప=కొంచెమగు, దానము = మదోదకము, ఏఱులు కన్ = ఏఱులైపాఱఁగా, తద్వహున్ = ఆడిండిమవాద్యములఁ జేతఁబట్టియున్నవానిని, ఱాలన్ = శిలలచేతను, ఉఱ్వి ఉఱ్వి, వేణుకాహతులన్ = పెద్దవెదురుకోలల పెట్లకు, వీడు=పురమును, వెడలి వెడలి, పరపథగజధ్వనికిన్ - పరపథ=

1. దృక్ఛటలవైరులకుఁ బంపుకృత్తులన వ.

ఇతరమార్గములయందలి, గజధ్వనికిన్ = ఏనుఁగులబృంహితములకు, పోక తిరిగి తిరిగి, దృక్పుటలు=దొప్పలవంటికన్నులు, వైరులకున్=శత్రువులకు, పంపు=పంపునట్టి, కృత్యలు అనన్ = శక్తులో యనునట్లు (ఉత్ప్రేక్ష) వెలిన్ = వెలుపటను, వశానుగతిన్-వశా= ఆఁడేనుఁగులయొక్క, అనుగతిన్=అనుసరించు మార్గమున, (ని. 'కరిణీ ధేనుకా వశా' యని యమరుఁడు.) అగ్గలికలన్=ఉత్సాహముచేత, చేరున్=పట్టణమును ప్రవేశించును. (గజస్వభావోక్తి.)

తా. ఆపురమందలి మదపుటేనుఁగులు మావటీలయదలింపులు విని యాముఖముగ బయలు చిమ్ముచు, ఊరివాకిటయొద్ద నుండెడి యరుఁగులమీఁద నున్న జనులఁ బట్టుటకుఁ దొండములు సాఁచుచుఁ, దమ్ముఁ గట్టిగ దండించుచు నీఁటెఁ బట్టి క్రింద నున్నవానిఁ దఱుముచుఁ, దమముందఱ డిండిమవాద్యధ్వనిఁ జేయుచున్నవానిని మదోదకము హెచ్చుటం జేసి తాల ఉవ్వుచును, బెద్దవెదురుపెట్లనుఁ బురంబు వెడలి వచ్చి యావ లావల వినంబడు గజబృంహితముల లక్ష్యపెట్టక శత్రురాజులమీఁదికిఁ బ్రయోగించిన శక్తులో యనునటుల నుండెడు దొన్నెలవంటి కన్నులు గలవై ఆఁడేనుఁగులు పోవు మార్గముఁ బట్టి యతి ప్రయాసచేత మరలఁ బట్టణముఁ జేరు నని తాత్పర్యము.

ఉ పైననిశంబుఁ జల్లుకొను ౹ పాంసువుపై ఖగతుండఖండితా
లానమహామహీరుహాఫ ౹ లచ్యుతబీజము లుత్తిపత్కరాం
భోనిబిడాప్లుతి న్మొలవఁ ౹ బొల్చు నగమ్యతఁ దూలుచు న్పురో
ద్యానముల న్మదేభములు ౹ ప్రాణముతోడినగంబులో యనన్. 25

టీ. పైన్=దేహముమీఁదను, అనిశంబు=నిత్యమును, చల్లుకొనుపాంసువుపైన్ - చల్లుకొను = చల్లుకొనునట్టి, పాంసువుపై = దుమ్ముమీఁదను, ఖగ...లు - ఖగ = పక్షులయొక్క, తుండ = చంచూపుటములచేతను, ఖండిత = పగుల్పఁబడిన, ఆలాన = కట్టుకంబములైన, మహాత్ = పొడవులైన, మహీరుహ = వృక్షములయొక్క, ఫల = పండ్లనుండి, చ్యుత=జాఱిన, బీజములు=విత్తనములు, ఉత్తి...తిన్-ఉత్తిపత్=పైఁజిమ్ము కొనియెడి, కర = తొండములయందలి, అంభః = జలములయొక్క, నిబిడ = దట్టమగు, ఆప్లుతిన్=తడుపుటచేత, మొలవన్ = చెట్లు పుట్టఁగా, అగమ్యతన్ = పట్టనశక్యంబగు నటుల, తూలుచున్=ఊఁగుచును, మదేభములు=మదపుటేనుఁగులు, పురోద్యానములన్- పుర = పట్టణమందలి, ఉద్యానములన్ = శృంగారవనములయందు, ప్రాణముతోడి నగంబులో అనన్ = ప్రాణములుగల పర్వతములో యనునటుల, పొల్చున్ = ఒప్పును.

తా. ఏనుఁగులకు దుమ్ము పైఁజల్లుకొనుట నైజముగాన నట్లు నిండింపఁబడియున్న మంటిపై గజములఁగట్టు వృక్షములమీఁద నున్న పక్షులు ఫలములఁ బగిల్చి రాల్పఁగాఁ బడిన బీజములు తొండముచేఁ బైఁజల్లుకొను నుదకమువలన మిగుల నాన్పఁబడి యంకురింపఁగాఁ బట్టనశక్యంబులై యూఁగుచు బురోద్యానములయందుఁ జైతన్యయుక్తంబులగు పర్వతములో యనునటుల సంచరించుచుండు నని తాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

శా. మౌనిక్రోధవిధూతపత్త్రముల మా మాతో సపత్త్రుల్గదా
[1]కానిం డంచును గేక రాక్షిరుచిమొక్కల్ప్రక్కల న్శార్ఙ్గతూ
ణానల్పాహిపకల్పకాండతతులం దారం బురిం బొల్చు నా
జానేయంబులు ఫేనహాస మిడి కై జామోర లల్లార్చుచున్. 26

టీ. మౌని...లము-మౌని = శాలిహోత్రమునియొక్క, క్రోధ=కోపముచేతను విధూత = పోఁగొట్టఁబడిన, పత్త్రములము = ఱెక్కలుగలవారము, ఔ = అయినట్టి యనఁగా (ఱెక్కలు లేనివార మనుట. ని. 'గరుత్పక్షచ్ఛదాః పత్త్ర'మని యమరుఁడు), మాతోన్ = ఇట్టిమాతోడను, సపత్త్రుల్గదా = మీరు ఱెక్కలు గలవారుగదా, కానిం డంచును = తలయూఁచినట్లు, కే...లు - కేకరాక్షి = కడకన్నులయొక్క, రుచి = కాంతులయొక్క, మొక్కల్ = అంకురములు, ప్రక్కలన్ = పార్శ్వములయందు, శా...లన్-శార్ఙ్గ=విండ్లతోఁ గూడిన, తూణ=పొదులయందు, అనల్ప = విస్తారమైన, అహిప = సర్పరాజములతో, కల్ప = తుల్యమగు, కాండ = బాణములయొక్క, తతులన్ = సమూహములయందు, తారన్ = ప్రసరింపఁగా, ఫేనహాస మిడి-నురుఁగను నవ్వుగలదై, కైజామోరలల్లార్చుచున్=కైజాచేసినముఖముల నూఁచికొనుచు, (కైజా అనఁగా గళ్లెము పైకెత్తి బిగియఁగట్టుట). ఆజానేయంబులు = జాతిగుఱ్ఱములు, ('ఆజానేయాః కులీనాస్స్యుః' అని యమరుఁడు), పురిన్=మధురాపట్టణమందు, పొల్చున్ = ఒప్పును.

తా. ఆపట్టణమందలి వేగశీలంబులగు జాతిగుఱ్ఱములు కళ్లెములచే బిగింపఁబడిన ముఖము లల్లార్చుచుఁ బ్రక్కలఁ జూచుచుండ, మాకు మునిశాపంబున ఱెక్కలుపోయినవి మీకు ఱెక్కలున్నవి; ఉండిన నుండనిండు త్రొక్కుకొని తరలుదము రండని ప్రక్కలఁ గట్టియున్న పొదులలో నుండెడి సర్పతుల్యంబులగు బాణములఁ బిలుచుచున్నవో యను నటుల నొప్పుచుండు నని తాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష; ఫేనహాసము - రూపకము. అహిపకల్ప - ఉపమ.

1. కానీ రండని.

చ. చలమున సింగిణీతరక § సంబులు గట్టక మాన, రంపసె
న్నెలగతి మాగతి న్వెనుకఁ § జిక్కక మానదు, తప్పి దారి వె
న్నొలసినఁ దాయ వెన్నెఱుఁగ § కుండుట నొచ్చెము సాదికోటి కం
చలమినచింతఁ ద్రవ్వికొను § నంఘ్రి తుద న్పురిలోనివాహముల్.27

టీ. పురిలోనివాహముల్ = ఆపట్టణమందలి యుత్తమాశ్వములు, చలమునన్ = ఈసుచేత, సింగిణీతరకసంబులు = శార్ఙ్గతూణీరకంబులను, కట్టకమానరు = బంధింపక విడువరు, అంపసెన్నెలగతి - అంప=బాణములయొక్క, సెను = పెద్దదైన, సెల = అలుగుయొక్క, గతి = గమనము, మాగతిన్ = మావేగమునందు, వెనుకన్ చిక్కక మానదు = వెనుకఁజిక్కకయుండదు (ఆబాణంబు లెదిగి రాలే వనుట), తప్పిదారి=ఒక వేళను, వెన్నుఒలసినన్ = వీపుదాఁకినను, తారు వెన్నుఎఱుఁగక ఉండుటన్ = తాము వెన్నెఱుంగకయుండుటచేత, మాఱువీపనియొకపాఠము. సాదికోటికిన్ = రౌతులకు, (ని. 'అశ్వారోహాస్తు సాదిన' యని నిఘంటువు.) ఒచ్చెము = తక్కువ, అంచున్=అను చును, అలమినచింతన్ = తప్పకొన్నచింతచేతను, అంఘ్రితుదన్ = కాలిగొరిసెచేత, త్రవ్వికొనున్ = భూమినిఁ ద్రవ్వుచుండును.

తా. గుఱ్ఱములకుఁ గాలిగొరిసెలచేత నేలఁద్రవ్వుట స్వభావముగావున నాపట్టణ మందలి యశ్వము లాక్రియ లొనర్చుచుండ రోషంబులు గల రౌతులు శార్ఙ్గతూణీ రంబులఁగట్టి శత్రువులపై శరములఁ బ్రయోగింప, నాశరములగమనము తమవేగమునకు వెనుకఁ జిక్కును గాన వీపెఱుఁగని సాదులకు వెన్నునఁ దగులుననియెడి యొచ్చెము వచ్చె గదా యనుచింతలో నేలను త్రవ్వుచున్న వనునటుల నుండునని తాత్పర్యము. లోక మునం దొకానొకచింత గలిగినయెడ మనుజులలో నేలఁ ద్రవ్వుట ప్రసిద్ధము. అలం. హేతూత్ప్రేక్ష.

ఉ. అంజ సమానవాయుగణ § మంతయు ఖంజతఁ జిక్క, నజ్జవో
ష్మం [1]జనియించుచిక్కనిప § మానపువాయువులో నొకండు క
ల్మ్షం జనియించు దుర్యశము § మేల్కని లేహనవేళ వాజు లూ
ర్పం జెమమాణిబంధముకు § రంబుఁగాలిమపేరఁ గార్కొనున్. 28

టీ. అంజన్=ఒక యంగలొపలనే, సమాన=సరియైన, వాయుగణమంతయున్= వాయుసమూహంబెల్లను, ఖంజతన్=వేగములేమిచేత, చిక్కన్ = పట్టుపడఁగా, అజ్జవ

1. జని యుబ్బి.

ఊష్మన్=ఆవేగపువేఁడిమివలన, జని...లోన్ - జనియించు=పుట్టుచున్నట్టి, చిక్కని=స్వాధీనముగానియట్టియు, సమానపు=సమానంబనియెడి, వాయువు=గాడ్పు, (తమకుసాటియైనగాలి) లోన్ = దేహములోపల, ఒకండు = ఒక్కఁడు, కల్మిన్=ఉండుటవలన, జనియించు=సరియైనదియొకటియుండె ననిపుట్టిన, దుర్యశము=అపకీర్తి, మేల్కని=తెలిసి, లేహనవేళన్=గుఱ్ఱములు కవణముదినుసమయమున, వాజులు=గుఱ్ఱములు,('వాజివాహార్వగంధర్వహయసైంధవసప్తయ' యని యమరుఁడు.) ఊర్వన్=ఆఘ్రాణింపఁగా, చెడు=చెడిపోవుచున్నట్టి, మాణిబంధముకురంబులన్ = అద్దములవంటి సైంధవలవణపుఁబిళ్లలయందు, కాళిమ=నైల్య మనియెడి, పేరన్=వ్యాజముచేత, కార్కొనున్=నల్లనగును.

తా. అచట నుండు నశ్వముల లేహనవేళలయం దుంపఁబడిన సైంధవ లవణపుఁ జెక్కల నాగుఱ్ఱము లాఘ్రాణింపఁగా, దానియం దేర్పడిన నైల్యము సమానవాయువుల నెల్ల గెలిచి సమాన మనుపేరు గలిగి తమనాభిస్థానమం దున్నవాయువును గెలువమైలి మను నపకీర్తి జనియించెనో యనునటుల నుండె ననఁగా వాయువేగముల నతిక్రమించెడి వేగముగల యశ్వము లని తాత్పర్యము. అలం. కైతవాపహ్నుతి.

మ. ఇలఁ బాదద్వయి రాయ నళ్కొసఁగు నెం దేఁ బాఱుచో నంకవ
న్నెలు రెండై[1]లఘిమం దకీర్తి యిడు మున్నే యెక్కుచో నిందు నెం
దుల కే మాదు మటంచు సాదు లల[2]యన్ రూపోచ్చము ల్వాజు లం
దలరున్ బాహ్లికపారసీకశక[3]ధారారట్టఘోట్టాణముల్. 29

టీ. ఎందేన్=ఎక్కడనైనను, పాఱుచోన్ = పరుగిడునపుడు, పాదద్వయి = తమమీఁద నారోహణముఁ జేసి యున్నవారియొక్క రెండుపాదములును, ఇలన్=భూమియందు, రాయన్ = ఒఱయఁగా, అళ్కు = భయమును, ఒసఁగున్ = ఆ యారోహకులకు నిచ్చును, మున్నే = తొలుతనే, ఎక్కుచోన్ = ఎక్కునపుడు, అంకవన్నెలు రెండై = రెండంకవన్నెలచేతఁగాని యెక్కుట కసాధ్యంబై, లఘిమందు = లఘుత్వమందు, అకీర్తి యిడున్ = అపకీర్తి నిచ్చును, ఇందున్=ఈరెంటియందు, ఎందులకున్ ఏమాదుము = దేనికి నెటులఁ జేయుదుము, అటంచున్ = అట్లని, సాదులు = గుఱ్ఱపు రౌతులు, అలయన్=వేసటపడఁగా, రూపోచ్చముల్=రూపములచేఁ గొప్పను వహించి యున్నట్టి, బాహ్లిక పారసీక శకధారా ఆరట్ట ఘోట్టాణములు = ఈదేశములయందు జనించిన, వాజులు=జాత్యశ్వములు, అందున్ = ఆపట్టణమందు, అలరున్ = ఒప్పును.

తా. పట్టణమందున్న యశ్వములు బాహ్లికాదిదేశసంభవము లగుటం జేసి మిగులఁ బొడవైనవిగాన రెండంకవన్నెలతోఁగాని యెక్కఁగూడకపోవుటయు, పరుగిడెడి

---

1. లఘువం. 2. యన్ దూర్ణో; యన్ వేగో. 3. ధట్టా.

సమయమున సాఁగి నేలకు వంగునపుడు కుఱుచలౌటవలన రౌతులపాదము నేల రాచుకొనుచుండఁగా నీయపకీర్తుల కేమి సేయువార మని గుఱ్ఱపురౌతులు నిత్యము చింతాపరులై యుండ నట్టియశ్వములచే నాపట్టణము ప్రకాశించు నని తాత్పర్యము. వేగవంతంబులగు నుత్తమాశ్వంబులు పరుగిడునపుడెల్లను నేలకు వంగుటయు, మరల హెచ్చుటయు, గొప్పగుఱ్ఱములకు రెండేసి యంకవన్నెలు వేయుటయును లోకప్రసిద్ధము. అలం. అతిశయోక్తి.

పణ్యయువతులు

సీ. ముడివిప్ప నడుగఁ [1]దమ్ములనె వ్రాలుటఁ దేంట్లు
    నెఱికురు లగుటసం ॥ దియము గలదె
కన నెంతవాని లోఁ ॥ గొనుట నాదర్శంబు
    నెమ్మొగం బగుట సం ॥ దియము గలదె
ఇఱిగొను మింటిపై ॥ మెఱయుటఁ [2]జక్రద్వ
    తయి చన్ను లగుట సం ॥ దియము గలదె
పొలసు దోర్లఁగఁ జూచు ॥ కలికిచూపులమీలు
    దెలిగన్ను లగుట సం ॥ దియము గలదె
తే. పొలసినవె తావి బుగులుకొనలఁదీఁగ
తిన్ననిశరీర మగుట సం॥దియము గలదె
యనఁగఁ జెలువొంది సురతవై ॥ భవాత్యనిధులు
పణ్యయువతులు పొలుతు రప్పట్టణమున. 30

టీ. ముడివిప్పన్ = కొప్పు విప్పఁగా, అడుగుఁదమ్ములని = పాదము లను కమలములపైననే, వ్రాలుటన్ = పడుటచేత, తేంట్లు=తుమ్మెదలు, నెఱికురులు = (తీయంగనల) యందమైన వెండ్రుకలు, అగుటన్ = అగుటయందు, సందియము గలదె = సందేహము గలదె = సందేహము గలదా (నిస్సందేహ మనుట, తఱచుగాఁ గమలముల మీఁద వ్రాలు నవి తుమ్మెదలు గాన నిట్లు వర్ణింపఁబడియె), కనన్ =చూడఁగానే, ఎంతవానిన్ = ఎట్టిగొప్పమనుష్యునైనను, లోఁగొనుటన్ = వశపఱచుకొనుటచేత, తనలో నిమిడిచికొనుటవలన, నెమ్మొగంబు = ముఖము, ఆదర్శంబు = అద్దము, అగుటన్ = అగుటయందు, సందియము కలదె, (ఎంతటి ధీరుఁడైనను పురుషుం డాస్త్రీలముఖసౌందర్యముఁ జూచిన వారికివశ్యుఁ డగు ననుట), ఇఱిగొను = సూక్ష్మమైన నడుమనియెడి,

1. దమ్ములపై నెవ్రాలుపె న్నెఱులు దేం ట్లగుట. 2. చక్రకద్వయి.

మింటిపైన్ = ఆకాశముపై, మెఱయుటన్ = ప్రకాశించుటచేత. చన్నులు= స్తనములు, చక్రద్వితయి = జక్కవదోయి, ఔటన్ = ఔటయందు, సందియముగలదె, (మధ్య ప్రదేశమాకాశమువలె శూన్యముగనుండుటవలన నందుపైనుండునది చక్రద్వితయి యని యూహింపఁబడియె), పొలసు దొర్లఁగన్ = మత్స్యగంధముకౌటిల్యమును పొర్లునటుల, (పొలసన మత్స్యగంధమునకు, కౌటిల్యమునకును పేరు), చూచుకలికిచూపులన్ = చూచునటువంటిసొగసైన దృష్టులచేతను - సొగసుగాఁ గనఁబడుటచేతను, మీలు = మీనములు, కన్నులౌటన్ = నేత్రములౌటయందు, సందియముగలదె, (తమయందుఁ బొలసుండుటవలన మీనములు గన్నులౌటకు సందేహము లేదనుట). పొలసినసే = సుడిసినప్పుడే, తావి=సుగంధము, బుగులుకొన్ = గమ్మనఁగా, తిన్ననిశరీరము, అలరుఁదీఁగ = పూఁదీఁగ అగుటయందు సందియము గలదె, (పరిమళించునది పూఁదీఁగ గాన సుగంధ ముండుటవలన నది యని యుత్ప్రేక్షింపఁబడియె), అనఁగన్ = అనునట్లు, చెలువొంది = ఒప్పి, సురత = రతియందు, వైయాత్య = ప్రౌఢత్వమునకు, నిధులు = స్థానములగు, పణ్యయువతులు = వెలజవరాండ్రు, అప్పట్టణమునన్=ఆమధురయందు, పొలుతురు = ఒప్పుచుందురు.

తా. సుగమము. పెద్దపాదములు నాల్గింటను, గీతము మొదటి రెండు పాదము లందును ఉత్ప్రేక్షాలంకారము.

మ. ప్రతతప్రాంతపిశంగకుంకుమజటాపాళీకురంగీమదా
సితవీణాళికలస్వనంబు లెసఁగం జెన్నారుకర్పూరపుం
జతతు ల్కంటికి నారదత్వమున మించ న్గామినీకామిసం
తతి కేలా యెడ ద్రెచ్చుఁ గంతుకలహోన్మాదంబు లాప్రోలునన్. 31

టీ. ప్రతత...లు-ప్రతత = విస్తారమైనట్టియు, ప్రాంత = సమీపమున (కాంతి ప్రసరించుటచేత ననుట), పిశంగ = పచ్చనైన, కుంకుమజటాపాళీ = కుంకుమపూవు రాసులను జడల సమూహములును, కురంగీమదాసితవీణా = కస్తూరియనునల్లనైన వీణె యందలి, అళి కలస్వనంబులు=తుమ్మెదల ఝంకారములవలె నవ్యక్తమధురము లైన వీణా వాదములు, ఎసఁగన్ = ఒప్పుచుండఁగా, చెన్నారు = మనోహరము లయిన, కర్పూర పుంజతతులు = కప్పురపురాసులు, కంటికిన్ = కన్నులకు, నారదత్వమునన్ = నారద భావముచేతను, మించన్ = అతిశయింపఁగా, కామినీ కామిసంతతికిన్ = కాముకులగు స్త్రీపురుషులసమూహమునకు, కంతుకలహఉన్మాదంబుల్ = మన్మథయుద్ధ మనియెడి యున్మాదములు (సురతము లనుట), ఆప్రోలునన్ = ఆపురమున, ఏలా = ఏమిటికి, ఎడద్రెచ్చున్ = ఎడఁబడును,

తా. ఆమథురయందుఁ దమ సమీపమునఁ గర్పూరకాంతులు ప్రసరించుటవలనఁ గొంచెము పచ్చనై జడలకాంతివలె నున్న కుంకుమరాసులును, వీనివలె నల్లనైయున్న కస్తూరియు, అవ్యక్తమధుర మైనతుమ్మెదలఝుంకారములును గూడియుండఁ బ్రకాశించుచున్నట్టి కప్పురపురాసులు నారదభావముచేతఁ గంటి కగపడఁగా నారదుఁడు కలహప్రియుఁడు గానఁ దద్ధర్మముగల కర్పూరపురాసు లడఁగ నాకాముకులగు స్త్రీపురుషులకు మన్మథయుద్ధమేల మాకు ననఁగాఁ దాదృశకర్పూరపురాసులఁజూడఁగాఁ గామోద్రేకమున మోహితులై నిత్యము సురతక్రీడలయం దాసక్తులైయుందు రని తాత్పర్యము.
అలం. ఉత్ప్రేక్ష. అందుకంగము రూపకము.

తే. నిం గిటు త్రిశంకుకతన మాతంగవాటి
యయ్యె నిఁక నుండఁదగ దని యవని [1]కెఱఁగి
నట్టినక్షత్రతారాగ్రహాలి యనఁగఁ
గాంతనవరత్నరాసు లంగళ్లఁ బొలుచు. 32

టీ. ఇటు = ఈప్రకారము, నింగి = ఆకసము, త్రిశంకుకతనన్ = త్రిశంకుఁడు ప్రవేశించుటచేతను, మాతంగవాటి అయ్యెన్ = వెలివాడయాయెను. (వి. 'మాతఙ్గో గజనీచయోః' అని వైజయంతి.) ఇఁక నుండఁదగ దని = ఇఁకమీఁద నుండఁగూడ దనుచు, అవనికిన్ = భూమికి, ఎఱఁగినట్టి = వ్రాలినట్టి, నక్ష...హాలి-నక్షత్ర=నక్షత్రములు, తారా = అశ్విన్యాదీతరతారలు, గ్రహ = సూర్యాదిగ్రహములు, వీనియొక్క, అలి = సమూహము, అనన్ = అనునట్లు, కాంత = రమ్యములైన, నవరత్నరాసులు, అంగళ్ళన్ = పణ్యగృహములయందు, పొలుచున్ = ఒప్పును.

తా. ఆమథురాపట్టణమందలి యంగళ్ళయం దున్న నవరత్నరాసులు ఆకాశము త్రిశంకువుచే నాక్రమింపఁ బడినదిగానఁ జండాలవాటి యయ్యెను. ఇంక నుండఁ గూడ దని యభిప్రాయముగలవై భూమికి వచ్చియున్న సూర్యాదిగ్రహాశ్విన్యాది నక్షత్రములును విజ్ఞాతనామములగు జ్యోతులునో యనునట్లు వెలుంగుచుండు నని తాత్పర్యము. నక్షత్రతారలకు భేదము రఘువంశమందు, 'శ్లో. నక్షత్రతారాగ్రహసంకులాః' అని యున్నది. అశ్విన్యాది 27-ను తారలు, తక్కిన జ్యోతిర్గణము నక్షత్రములు.

అలం. ఉత్ప్రేక్ష.

చ. చిరసముపాత్రితాగ్ని తడిఁ జెంది నశించునటంచునో, కృతా
ధ్వరతఁ దదగ్ని మైనునికి దాన నొకంగము దాఁచుచేతనో

1. కరిఁగి.

పురధరణీసురు ల్నిగమ భూధరము ల్జపయజ్ఞశీలు రా
హారిధనదేశులైన వల హస్తము సాఁపరు [1]వారిధారకున్. 33

టీ. చిరసముపాశ్రితాగ్ని - చిర = బహుకాలమునుండి, సముపాశ్రిత = ఆశ్రయించియున్న, అగ్ని = వైశ్వానరుఁడు, తడిఁజెందిన = తేమదాఁకి, నశించును = చల్లారును, అటంచునో = అనియో, కృతాధ్వరతన్ - కృత = చేయఁబడిన, అధ్వరతన్ = జన్నము గలవారౌటచేత, తత్ అగ్ని = ఆయజ్ఞాగ్ని, మైన్ = దేహమందు, ఉనికిన్ = ఉండుట చేతను, దానన్ = దానియందు, ఒకంగము = ఒక్కయవయవమును, దాఁచుచేతనో = ఇముడ్చుకొనియున్నందుచేతనో, పురధరణీసురులు - పుర = పట్టణమందలి, ధరణీసురులు = బ్రాహ్మణులు, నిగమభూధరములు = వేదపర్వతములు, జపయజ్ఞశీలురు = జపయజ్ఞపరులై, ఆ హారిధనదేశులైనన్ = ఆయింద్రకుబేరాదులైనను, వారిచ్చెద మన్నప్పటికిని, వారిధారకున్ = దానార్థమగునుదకధారకు, వలహస్తము = దక్షిణహస్తము, చాఁపరు = చాఁచెడువారు గారు.

తా. బ్రాహ్మణుల దక్షిణహస్తంబున నగ్ని యుండుట నిగమసిద్ధంబు గావున నాయగ్ని దానోదకముచేతఁ జల్లారు ననియో, లేక, యెల్లరు సోమయాజులగుటచేఁ దమయం దగ్నియుండును గాన దానియొక యంగమును దాఁచవలయు ననియో, యాపట్టణమున వసించుచున్న బ్రాహ్మణులు దేవేంద్రాదులవంటి వారి దానోదకమునైనను గ్రహింపకయుందు రనఁగాఁ బ్రతిగ్రహపరాఙ్ముఖులై వేదాధ్యయన జపయజ్ఞపరులగుచు నొప్పుచుందు రని తాత్పర్యము. అలం. హేతూత్ప్రేక్ష.

చ. ఉరవడిఁ బోరికై కవచ మొల్లరు [2]మంత్రములందుఁ దక్క సు
స్థిరనిజశక్తి నైదుపది సేయరు దత్తినతక్క, మంటికై
పొరల రధీశుఁ డీ కమలబుద్ధి ఖళూరికఁ దక్క, వజ్రదో
ఃపరిఘవశీకృతాన్యనరపాలకు లప్పురి రాకుమారకుల్. 34

టీ. అప్పురిన్ = ఆమధురాపురమునందు, వజ్రదోఃపరిఘవశీకృతాన్యనరపాలకులు - వజ్ర = వజ్రాయుధతుల్యమైన, దోః = భుజమందలి, పరిఘ = పరిఘ యనునాయుధవిశేషముచేత, వశీకృత = స్వాధీనులుగాఁ జేయఁబడిన, అన్య = ఇతరులైన, నరపాలకులు = మనుజపతులు గల, రాకుమారకులు = రాచకొమరులు, మంత్రములందున్ = జపకాలంబున నుచ్చరించెడు మహామంత్రములయందు, తక్కన్ = తప్ప, ఉరవడిన్ = బలముగా, పోరికై = యుద్ధముఁ జేయుటకై, కవచము ఒల్లరు = కవచముఁ దొడుగరు,

1. దానధారకున్. 2. మంత్రములందె తక్క.

సుస్థిరభుజశక్తిన్ - సుస్థిర = దృఢ మగు, భుజశక్తిన్ = బాహుబలముచేతను, దత్తిన తక్కన్=దానకాలమందుఁదక్క, ఐమువడి సేయరు = వెనుకంజవేయరు (అయిదు పది సేసె వెనుక ముం దయ్యె, జుణిగె నని ఆంధ్రనామశేషము.) ఖళూరికన్ తక్కన్=గర డీలయందు వినాగా, (ని. 'ఖళూరీఖురళీసమే' యని గరడీపర్యాయము.) అమలబుద్ధిన్= సద్బుద్ధిగలవారు గాన, అధీశుఁడు=ఏలుచున్న ప్రభువు, ఈక=ఇయ్యకయే, మాటికై = ఎల్లమంటికై - భూజీవనముకొఱకు, పొరలరు = వేలఁబడి పొర్లాడరు.

తా. మిగుల బలశాలు రగు నప్పట్టణమందలి రాచకొమరులు కవచము దొడుగ కయే యుద్ధముఁజేయుదు రనియు, మంత్రజపానుష్ఠానపరులుగాన నుపాసనా కాలమందే కవచాదులు పఠింతు రనియు, దృఢమైన నిజశక్తిగలవారుగాన దానకాలమున నై దిచ్చుచోఁ బదిగా నిచ్చునట్టి దానశీలు రనియు, యుద్ధమునందు వెనుకంజవేయ రనియు, సాముఁజేయుటయం దలిసమరు లనియు, విమలమతులు గాన రాజు పిలిపించియిచ్చు వఱకు భూముల నపేక్షింపక యుందు రనియును దాత్పర్యము. అలం. పరిసంఖ్య.

శా. దంభాపేతవితీర్ణితోయములు రథ్యం దొట్టి హట్టస్థిత
స్తంభంబు ల్చిగురించుచున్నవి యనన్ ధర్మైకనిత్యార్జనన్
సంభూతం బగుపైఁడి కోటి కొకటై నానాఁటికి న్హెచ్చు చ
య్యంభోదావళిఁ గప్పుకేతువుల వైశ్యశ్రేణి పొల్చున్ బురిన్. 35

టీ. దంభా...ములు - దంభ = దంభమువలన, అపేత = తొలఁగినట్టి (అనఁగా దంభము లేనట్టి), వితీర్ణి = దానసంబంధులగు, తోయములు = ఉదకములు, రథ్యన్ = నగరమధ్యమార్గమందు, తొట్టి = ప్రవహించి, హట్ట...బుల్ - హట్ట = అంగళ్ల యందు, స్థిత = ఉన్నట్టి, స్తంభంబులు = కంబములు, చిగురించుచున్నవి - సంజాత పల్లవము లగుచున్నవి, అనన్=అనునటుల, ధర్మైకనిత్యార్జనన్ - ధర్మ=ధర్మముచేతనే, ఏక = ముఖ్యముగాను, నిత్య=ఎల్లప్పుడును, ఆర్జనన్ = సంపాదించుటచేత, సంభూతం బగుపైఁడి = లభ్యపడినట్టి ద్రవ్యముయొక్క, కోటికిన్ ఒకటై = కోటి కొక్క పడగయై యనుట, నానాఁటికిన్ = దినదినమునకు, హెచ్చుచున్=వృద్ధిఁబొందుచు, అయ్యంభోదావళిన్ = ఆమేఘపంక్తిని, కప్పు = కప్పుచున్నట్టి, కేతువులన్=టెక్కె ములచేత, వైశ్యశ్రేణి=కోమటులగుంపు, పురిన్ = పట్టణమందు, పొల్చున్ = ఒప్పును.

తా. ఆపట్టణమందుఁ దాము పారమార్థికముగ నిచ్చు దానజలంబులు వీథుల యందుఁ బెగఁదట్టఁగా, దానిచేత నంగళ్లకంబములు చిగురించుచున్నవి యనునటుల ధర్మము వదలక యార్జించిన ద్రవ్యము కోటికిఁ బడగెత్తి నానాఁటికి హెచ్చుచుండ

మేఘబృందములఁ గప్పునట్టి టెక్కెములచేతఁ గోటమట్లగుంపు నొప్పుచుండు నని తాత్పర్యము. అలం. అతిశయోక్తి.

తే. నృపులపదహాలరేఖలకెల్ల మాఘు
జాగ్రహాలరేఖలే మూల యనుచుఁ గోటి
కొండలుగ ధాన్యరాసులు పండ(దు) వీట
సుజనభజనైకవిఖ్యాతి శూద్రజాతి. 36

టీ. నృపుల...కెల్లన్ - నృపుల = భూపతులయొక్క, పద=పాదములయందలి, హాలరేఖలకెల్లన్=హాలాకారరేఖలకెల్లను, మాఘుజాగ్రహాలరేఖలే = మాఘుజములమీఁద నున్న నాఁగేళ్లరేఖలే, మూలము అనుచున్ = మొదలనుచు, కోటికొండలుగన్ = కొండలుగాను కోట్లకొలఁది ధాన్యరాసులు, పండన్ = ఫలింపఁగా (పండించుకొనుచు ననుట), వీటన్=పట్టణమునందు, సుజన = సత్పురుషులయొక్క, భజన = సేవ, ఏక = ముఖ్యమైన, విఖ్యాతి = కీర్తిగాఁగల, శూద్రజాతి=శూద్రకులము, పొలుచున్=ఒప్పును ఈపొలుచు నను పదము పూర్వపద్యమునుండి యధ్యాహార్యము.

తా. ఆపురమున నున్న కాఁపులు తాము నాఁగేలుపట్టి దున్నుటచేత నేగదా రాచవారిరాచతికపుసాగ యని యెంచుకొనుచు దున్ని, కొండలుగ కోట్లుగ నానావిధధాన్యములఁ బండించికొని, సత్పురుషులకు సేవఁజేయుచు సుఖంబున నుండుదురు.

అలం. అసంబంధమున సంబంధాతిశయోక్తి.

చ. ఉమియఁగఁ దన్ను నవ్వ ననఁ నొచ్చెము గాంచినకొన్ని మ్రాఁకు లా
ప్రమదల నప్పగింపుఁ డని రంజిలునేతలు గన్నచెట్లకున్
దమ శలిశృంఖల న్పెనఁచి నమ్మక [1]చుట్టెఁ బురంబుఁ గఁతున్నై
న్యముఁ గొని నా వెలిఁ [2]శుకపికాకుల కేళివనాళి పొల్పగున్. 37

టీ. పుష్పింపఁజేసెడి పరిక్రియలు దోహద మనంబడును. అందు-ఉమియఁగన్ = ఉమియఁగాను, తన్నన్ = తన్నఁగాను, నవ్వన్ = నవ్వఁగాను, అనన్=పల్కరింపఁగాను, ఒచ్చెము కాంచిన = అవమానముఁబొందిన, కొన్ని మ్రాఁకులు=కొన్నివృక్షములు, ఆప్రమదలన్=ఆయవమానపఱిచిన స్త్రీలను, అప్పగింపుఁడు అని=తమకు నొప్పింపుఁడని, రంజిలుచేఁతలుగన్నచెట్లకున్=తగిన చేష్టలుగల వృక్షములకు, (తక్కిన యాలింగనాది కమనీయ దోహదములు గల మ్రాఁకులకు ననుట), తమకున్=తమకును, అలిశృంఖలన్= తుమ్మెద లను సంకెలను, పెనఁచి=తగిలించి, నమ్మక = అప్పటికిని నమ్మకము చాలక,

1. ముట్టెఁ. 2. శుకపికాదుల.

కంతుసైన్యము = మన్మథబలము, కొని = తీసికొనివచ్చి, పట్టణంబు = పురమును, చుట్టెన్ = ముట్టడివేసెను. నాన్ = అనఁగా, వెలిన్ = వెలుపటను, శుకపిక = చిలకలు కోయిలలు మొదలగుపక్షిజాతులచేత, ఆమల = సందడించుచున్నట్టి, కేళివనాళి = శృంగారవనములపంక్తి, పొల్పగున్ = సుందరమౌను, శ్లో. 'తరుగుల్మలతాదీనా మకాలే కుశలైః కృతమ్, పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదం స్యాత్తు తత్క్రియా. అశోక శ్చరణాహత్యా వకుళో ముఖసీధునా, ఆలిఙ్గనాత్కురవక స్తిలకో వీక్షణేనచ, కర స్పర్శేన మాకన్దో మఃఖరాగేణ చమ్పకః. సల్లాపతః కర్ణికార స్సిన్ధువారో ముఖానిలాత్, గీత్యా ప్రియాళుర్నితరాం నమేరుర్హాసితేనచ.' అని దోహదశాస్త్రమం దున్నది.

తా. దశదోహదములు గలవృక్షములను తుమ్మెదలు చుట్టుకొని తిరుగుటవలన సంకెళ్లు కాఁగాఁ దొలఁగనీయక మన్మథబలముఁ గూర్చికొనివచ్చి యుమియుట మొదలగు నవమానంబులను చేసినస్త్రీలను దమకుఁ బట్టియిమ్మని యవమానపడినచెట్లు తక్కిన చెట్లను ముట్టడివేసెనో యనునటులఁ జిలకలు కోయిలలు తొట్రుకొన శృంగారపుఁ దోఁటలు పుర మానుకొని సుందరముగా నుండును. అలం. ఉత్ప్రేక్ష.

సీ. మదగంధతారతమ్యము యామ్యకరికిఁ ద
త్కరులకుం గనబలెఁ గటము లొరసి
సురతశ్రమజ మాటఁ జూపోపకయుబలెఁ
గామినీమృదుగండఘర్మ ముడిపి
పరిమళవాహేచ్ఛఁ బ్రాణమీబలెఁ జించు
మృగనాభిచర్మభస్త్రికలు దూటి
అహితపన్నగభేదు లనిబలె గృహావిటం
కపుఁగలాపుల నొయ్య గఱులు నిమిరి
తే. వీటిసామగ్రిఁ గనుఁగొన వేగపడక
నడవఁ దనదిక్కుపుష్పదంతద్విపంబు
నెక్కెనో యన జడగతి నెపుడుఁ బొలయు
నందుఁ జందనశిఖరిమందానిలుంఁడు. 33

టీ. మద...ము - మద = మదముయొక్క, గంధ = వాసనయొక్క, తారతమ్యము = హెచ్చుతగ్గులను, యామ్యకరికిన్ - యామ్య = యమదిక్సంబంధియైన, కరికిన్ = వామన మనుగజమునకు, తత్కరులకున్ = ఆపట్టణపుటేనుఁగులకును, కనన్ బలెన్ = చూచుటకొఱకుబలె, కటములు = గండస్థలములను, ఒరసి = రాచికొని,

సురతశ్రమజము - సురత = రతియందలి, శ్రమజము = బడలికచేతను పుట్టినది, కౌటన్ = ఐనందువలన, చూపోపకయుంబలెన్ = చూడలేకవలె, కామినీ...ము - కామినీ = స్త్రీలయొక్క, మృదు = లేఁతలైన, గండ = చెక్కిళ్ళయందలి, ఘర్మము = చెమటను, ఉడిపి = పోఁగొట్టి, పరి...చ్ఛన్ - పరిమళ = సుగంధమును, వాహ = వహించెడి, ఇచ్ఛన్ = కాంక్షచేత, ప్రాణమీబలెన్ = ప్రాణమిచ్చుటకొఱకుబలె, చించు...లు-చించు = చినిఁగినట్టి, మృగ = కురంగములయొక్క, నాభి = బొడ్డు యొక్క, చర్మభస్త్రికలు = చర్మపుఁదిత్తులను, దూఱి = ప్రవేశించి, అహిత...లెన్ - అహిత = తనకు శత్రువైన, పన్నగ = పాములను, భేదులనిబలెన్ = భేదించెడునవి (భక్షించునవి) యన్నట్టువలె, గృహ...లన్ - గృహ = గృహమందలి, విటంక = కొణిగలమీఁద నున్న, కలాపులన్ = నెమిళ్ళను, ఒయ్యన్ = తిన్నఁగా, గఱులు = ఱెక్కలను, నిమిరి=తొడసి, వీటిసామగ్రిన్ - వీటి = ఆపురముయొక్క, సామగ్రిన్ = పరిపూర్ణతను, కనుఁగొనన్ = చూచుటకొఱకు, వేగపడక = త్వరపడక, నడవన్ = సంచరింపఁగా, తనదిక్కు=వాయవ్యపుదిక్కున నున్న, పుష్పదంతద్విపంబు=పుష్పదంత మను నేనుంగును, ఎక్కెనో అనన్=ఆరోహణముఁ జేసెనో యనునటుల, జడగతిన్ = మందగమనముచేతను, ఎప్పుడున్ = నిత్యమును, చంద...డు - చందనశిఖరి=చందన పర్వతమందలి, మందానిలుండు = తిన్ననిగాలి, అందున్ = ఆపురమునందు, పొలయున్ = విసరును.

తా. యమునిదిక్కునందలి యేనుఁగునకును ఖరగజంబులకును మదగంధ తారతమ్యముఁ జూత మనునటు లయ్యేనుఁగుల గండస్థలముల నొఱసి, యం దున్న పరిమళంబులం గ్రహించి, రతిశ్రమవలనఁ బుట్టిన చెమట నార్చునట్లు స్త్రీలచెక్కిళ్ళఁ బ్రసరించి తద్గంధముల సంగ్రహించికొని, చించినబొడ్డు గలిగి పడియున్న కస్తూరీమృగములకుఁ బ్రాణములఁ గల్పించుదానివలె వానిబొడ్డు చర్మపుఁదిత్తులలోఁ జొచ్చి, యాసుగంధమును దీసికొని గృహములయం దున్న నెమిళ్లు దమకు శత్రువులగుపాముల భక్షించునవి యని యాప్తతచేత దువ్వెనో యనునటుల, వానిఱెక్కల నిమిరి పట్టణపు సకలసమృద్ధిఁ జూడ నిచ్ఛగలదై వేగిరపడక మెల్లఁగాఁ దనదిక్కున నున్న పుష్పదంత మను గజము నెక్కి సంచరించుచున్నదో యనునటుల, నాపట్టణమందు మందమారుతము గమ్మున వాసించుచు విసరుచుండును. పాదములన్నిటను ఉత్ప్రేక్షాలంకారములు.

మత్స్యధ్వజుఁడు

సీ. ద్విష్వయోపాయధీరవిద్వద్వతంసంబు
షాడ్గుణ్యచాతురీచక్రవర్తి

క్రీడాచలీకృతశ్రీఖండగిరిరాజు
కనకాద్రిముద్రణగ్రంథకర్త
యందూనిబద్ధాబ్దబృందవేదండాళి
వననిధిస్తంభనాధునికరఘువు
తామ్రపర్ణ్యమలపాథఃకేళిహంసంబు
లంకేశమైత్రీప్రియంకరుండు
తే. స్వస్తికృద్వాస్తవస్తుత్యగస్తిమఘవ
మకుటమోటనశరకోటిమంత్రభృత్య
భూతభూతాత్తశాంభవభూమికుండు
దత్పురం బేలుఁ బాండ్యమత్స్యధ్వజుండు. 39

టీ. ద్విద్వ...బు ద్విద్వయ = నాలుగైన, ఉపాయ = సామ - దాన-భేద-దండము లనియెడి యుపాయములయొక్క, (ని. 'సామ దానే భేద దణ్డా విత్యుపాయా చతుష్టయ' మ్మని యమరుఁడు) ధీ=బుద్ధియందు, విద్వద్వతంసంబు = పండితశ్రేష్ఠుఁడు, షాడ్గు...ర్తి-షాడ్గుణ్య = సంధి విగ్రహ యాన ఆసన ద్వైధీభావ సమాశ్రయము లనియెడి షడ్గుణములయొక్క, చాతుర్య = నిపుణతయందు, చక్రవర్తి=సార్వభౌముఁడు, (ని. 'సన్ధిర్నా విగ్రహో యాన మాసనం ద్వైధ మాశ్రయః షడ్గుణాః' అని యమరుఁడు. వ్యా. 'షడ్గుణా ఏవ షాడ్గుణ్యమ్' అని చాతుర్వర్ణ్యం-త్రైలోక్య మన్నట్లు స్వార్థమందు ష్యఞ్ప్రత్యయము.) క్రీడా.. జు - క్రీడాచలీకృత = విలాసార్థమైన పర్వతముగాఁ జేయఁబడిన, శ్రీఖండగిరిరాజు=మలయపర్వతముగలవాఁడు, కనకా...ర్త-కనకాద్రి = మేరుపర్వతమును, ముద్రణ = ముద్రించుటయందు, గ్రంథకర్త = తన గెలుపు లిఖించినవాఁడు, (శ్లో. 'ఉదీచీం దిశ మాక్రమ్య పాణ్డ్యః పరమధార్మికః, ప్రాప్య మేరుగిరిం తస్మిన్ లిలేఖ బిరుదాన్ స్వకాన్' అని హాలాస్యమందు నతని గెలుపులు మేరుపర్వతమున వ్రాసినకథ వర్ణింపఁబడియున్నది.) అందూ...ళి - అందూ= శృంఖలలచేతను, నిబద్ధ = బంధింపఁబడిన, అబ్దబృంద = మేఘసమూహమువంటి, వేదండాళి = గజసమాజముగలవాఁడును, వన...వు-వననిధి=సముద్రముయొక్క, స్తంభన = కట్టుటయందు, అధునికరఘువు = నూతన రాఘవుఁడు, ('అధునా భవః అధునికః' అని కాలవాచకముమీఁద ఠక్ ప్రత్యయము. 'ఏతర్హి సంప్రతీదానీ మధునా' యని యమరుఁడు.) తామ్ర...బు-తామ్రపర్ణీ=తామ్రపర్ణియనునదియొక్కయు, అమల= నిర్మలమగు, పాథః=ఉదకమందు, కేళి=క్రీడించుట గల, హంసంబు=హంసప్రాయుఁడు,

లంకే...డు-లంకేశ = విభీషణునితో, మైత్రీ = చెలిమియందు, ప్రియంకరుండు = ఇష్టముఁజేయువాఁడు, స్వస్తి...స్తి-స్వస్తికృత్ = ఆశీర్వదించెడి, వాస్తవ = సత్యమైన, స్తుతి=స్తోత్రముగల, అగస్తి=అగస్త్యుఁడుగలవాఁడును, ('వస్తునఇయంవాస్తవీ,' 'వాస్తవీ స్తుతిర్యస్యవాస్తవస్తుతిః' అని వ్యుత్పత్తి, అగస్త్యశబ్దమున కగస్తిశబ్దమునుం గలదు). మఘవ...డు-మఘవ = దేవేంద్రునియొక్క, మకుట=కిరీటమును, మోటన = నుగ్గు సేయునట్టి, శరకోటి = బాణముల సమూహము గలవాఁడు, మంత్ర=మంత్రశక్తిచేతను, భృత్యభూత = కింకరులయిన, భూత=భూతములు గలిగి, ఆత్త=పొందఁబడిన, శాంభవ= రుద్రసంబంధి యగు, భూమికుండు = వేషముగలవాఁడును నైన, పాండ్య మత్స్య ధ్వజుండు = మత్స్యధ్వజుఁ డను పాండ్యదేశపురాజు, తత్పురంబు = ఆమధురా పట్టణమును, ఏలున్ = పరిపాలించును.

తా. పాండ్యదేశమునేలెడు మత్స్యధ్వజుఁ డనురాజు మేరుపర్వతమందుఁ దన గెలుపుకథలను వ్రాసినవాఁ డై, వాసవునికిరీటమును నుగ్గునుగ్గు గావించునట్టి శరసమూహముగలవాఁడై, భూతములను మంత్రశక్తిచే వశపఱచుకొనుటవలన నవి తన్ను సేవించుచుండ రెండవరుద్రునివలె నుండువాఁ డై, సామాద్యుపాయములయందును, సంధి విగ్రహాదిషాడ్గుణ్య విచారణయందును నతికుశలుఁడై, విలాసకాలంబులయందు మలయపర్వతముననే విహరించుచు నసంఖ్యాతంబులగు నేనుంగులుగలవాఁడై, సముద్రబంధనముఁ జేసినవాఁడై, శుద్ధోదకములు గల తామ్రపర్ణియందుఁ గ్రీడించువాఁడై, విభీషణునితోఁ జెలిమిచేసి యతని కిష్టములఁ దీర్చువాఁడై, నిత్య మగస్త్యాశీర్వాదముఁ బొందుచు నాపట్టణమును బాలించుచుండును. అలం. అతిశయోక్తి - ఉపమ.

ఉ. ఇందుకులావతంస మతఁ డేతఱి నేతరిగాఁ, డరిం బ్రజ
ల్కందఁ గొనం, డొరుం డొరుతల న్వినిపించినమాట డెందముం
జెంద ముదంబు దక్కఁ జెడఁ జేయఁ డొరు, న్వినతాస్యుఁడౌనుతిం
పం దనుఁ, బందనుం గొఱఁతవల్కఁడు[1] శూరతఁ దాను మించియున్.

టీ. ఇందుకులఅవతంసము = చంద్రవంశభూషణుం డగు, అతఁడు = ఆమత్స్యధ్వజుఁడనురాజు, ఏతఱిన్=ఎప్పటికిని, ఏతరి గాఁడు=నీతితప్పువాఁడు గాఁడు, అరిన్= పన్నును, ప్రజలు = మనుష్యులు, కందన్ = నొచ్చునట్లుగ, కొనండు=గ్రహింపఁడు, ఒరుండు=పరుఁడు, ఒరుతలన్ = మఱియొకనిమీఁద, వినిపించిన=విన్నవించిన, మాట= కొండెపుమాట, డెందమున్=హృదయమును, చెందన్=పొందఁగా, ముదంబు దక్కి =

1. శూరత దాన మిచ్చియున్.

సంతసము విడిచి, ఒరున్ = పరుని, చెఱఁజేయఁడు = చెఱుపఁడు, తనున్ = తన్ను, నుతింపన్ = ప్రజలు స్తోత్రముఁ జేయఁగా, వినతాస్యుఁ డౌన్ = ముఖమువంచువాఁ డౌను. అనఁగా నీరాజు ధీరోదాత్తనాయకుఁడు గనుక, (శ్లో. 'శౌర్యశ్రీ ప్రవణప్రశంసిషు నమద్భ్రూర్లజ్జతే వందిష్వ' అని) ప్రతాపరుద్రీయమందలి ధీరోదాత్తోదాహరణము, శ్లో. 'మహతాం కుఞ్జరాణాఞ్చ పురఃస్తోత్రం నహి ప్రియ' మ్మని మత్స్యభావకథనమున నుండు రీతిగా) నాత్మప్రశంసయందు నిష్టము లేనివాఁ డనుట. శూరత...యున్ - శూరతన్ = శౌర్యముచేత, తాను మించియున్ = అతిశయించియును, పందన్ = సోమరియగువానిని, కొఱఁత పల్కఁడు = తక్కువమాట చెప్పఁడు.

తా. ఆపురము నేలెడిమత్స్యధ్వజుఁ డనురాజు ప్రజల నొప్పించి పన్నుదీయక, కొండెపుమాటలు విని జనుల బాధపెట్టక, తన్ను ప్రజలు స్తోత్రముఁ జేసిన నుబ్బక, పరాక్రమముచేత గర్వపడి పందలఁ దక్కువమాట లాడక, చంద్రవంశమునకు భూషణప్రాయుఁడై సుగుణములచే నొప్పుచు నెప్పటికిని నీతి తప్పక యుండెను. అలం. వృత్త్యనుప్రాసము.

సీ. పాటీరగిరి[1]వనీ । వాటిఁ గ్రీడించియు
  నహిభయం బెఱుఁగఁ డౌ । వంతయైన
నత్యంతమితభాష । నవికత్థనుం డయ్యుఁ
  బరులఁ గేరడమున । భంగపఱుచుఁ
[2]బ్రీతిఁ దాఁ దామ్రప । ర్ణికి నాథుఁ డయ్యును
  సద్గోష్ఠిచే ననం । జనత మెలఁగు
మహనీయమహిమఁ దా । మధురాస్పదుం డయ్యు
  లావణ్యకలన ను । ల్లాస మొందు
తే. విషధిలహరిభిదోత్పత । త్పృషతజటిల
వలదురుక్రమతిమివర । వాలపతన
తులితపరబలకరిశిర । స్స్థలసముత్థ
బహుళముక్తావిముక్తాసి । పాతుఁ డతఁడు. 41

టీ. పాటీ...టిన్ - పాటీరగిరి = మలయపర్వతమందలి, వనీవాటిన్ = వనవీథిని, క్రీడించియున్ = క్రీడసల్పుచును, అవంతయైనన్ = అవగింజంతయైన, అహిభయంబు=సర్పభయంబును, ఎఱుఁగఁడు (శ్రీచందనాదులయందు సర్పములున్నను తద్భ

1. వనవాటి. 2. బ్రేమఁ దా.

యం బెట్టెటుఁగఁ దని విరోధము గలుగఁగ నిత్యము క్రీడాపరుఁడై యున్నను స్వపక్ష భయంబెటుఁగఁ దని పరిహారము. (ని. 'మహీభుజామహిభయంస్వపక్షప్రభవంభయ'మ్మని యమరుఁడు.) అత్యం...షన్ - అత్యంత=మిక్కిలియు, మితభాషన్=అల్పభాషచేత, అవికత్థనుఁడయ్యున్ = ప్రల్లదములాడనివాఁడయ్యును, కేరడమునన్=పరిహాసముచేత, పరులన్ = అన్యులను, భంగపఱుచున్ = అవమానపఱచును. (అల్పభాషికిఁ గేరడమే మని విరోధము గల్గఁగఁ గేరడదేశమునందలిశత్రువుల భంగపఱుచు నని పరిహారము. కేరడ మనుచోట ళడల కభేదము - 'విషయానంతరోరాజా శత్రు' వనురీతినిఁ గేరళ దేశపు రా జితనికి శత్రువు.) ప్రీతిన్ = ప్రేమచేతను, తాన్ = తాను, తామ్రపర్ణికిన్ = తామ్రపర్ణియను నాఁడయేనుఁగునకు, నాథుఁడయ్యును=ప్రభువయ్యును, సద్గోష్ఠిచేన్= సత్సహవాసముచేత, అనంజనతన్ = (అంజనో నభవతీ త్యనంజనః.తస్యభావః - అనంజనతా అనువృత్తిచేతను) అంజన మనుదిగ్గజము గాక, మెలఁగున్ (తామ్రపర్ణియను పేరు గల దిక్కరిణికిఁ బెనిమిటియై యుండియు అంజన మనుదిగ్గజ మెట్లు గాకపోయె నని విరోధము జనింపఁగా - తామ్రపర్ణియనుపేరఁ బాండ్యదేశమందుఁ బ్రసిద్ధినొందిన నదికిఁ బ్రభువై సద్గోష్ఠిచేత, అపగతం అంజనం పాపం యస్యసః తస్యభావః, అనంజనతా యనువృత్తిచేత పాపరహితుఁడుగా నుండె నని పరిహారము.) మహ...మన్ - మహనీయ = ఒప్పుచున్నట్టి, మహిమన్ = సామర్థ్యముచేతను, తాన్=తాను, మధురాస్పదుండయ్యును = తియ్యఁదనమునకు స్థానముగా నుండియును, లావణ్యకలనన్ = లవణభావసంగతిచేతను, ఉల్లాస మొందును [మధురాస్పదుఁడైనవాఁడు లవణభావసంగతిచేత నెట్టుల్లాసమొందు నని విరోధముపుట్టఁగా మధురాపట్టణమందుండి అవయవకాంతి విశేష ప్రాప్తిచేత నుల్లాస మొందు నని పరిహారము. శ్లో. 'ముక్తాఫలేషు తారళ్యం మనోజ్ఞం దృశ్యతే యథా, తద్వద్గాత్రేషు లోకానాం లావణ్యం దృశ్యతే బుధైః' అని లావణ్య లక్షణము. సీసపాదములు నాలుగింటను విరోధాభాసాలంకారము. శ్లో. 'ఆభాసత్వేవిరోధస్య విరోధాభాస ఇష్యతే' యని లక్షణము.] అతఁడు = ఆమత్స్యధ్వజుఁ డనురాజు, విషధి...దు-విషధి = సముద్రముయొక్క, లహరి = ప్రవాహముయొక్క, భిదా = భేదించుటచేత, ఉత్పతత్ = ఎగురుచున్న, పృషత = బిందువులయందు, జటిల = ముప్పిరిగా, వలత్ = చుట్టుకొనియున్నట్టియు, ఉరు = విస్తారమగు, క్రమ = సంచారముగల, తిమి = పెద్దచేఁపయొక్క, వర=శ్రేష్ఠమైన, వాల = తోఁకయొక్క, పతన = పతనముతోడను, తులిత = తుల్యమైన, పరబల=శత్రుబలములయందలి, కరి=ఏనుఁగులయొక్క, శిరస్స్థల=కుంభస్థలములవలన, సముత్థ=ఎగిరినట్టి, ముక్తా = ముత్యములయందు, అవిముక్త = విడువఁబడని, అసి = ఖడ్గముయొక్క, పాతుఁడు = పతనముగలవాఁడు.

తా. పరబలము సముద్రమువలెను నేనుంగుల కుంభస్థలములు కరుళ్లవలెను ముత్యములు జలబిందువులవలెను ఖడ్గము తిమి వాలమువలెను నుండె నని యంతటను ఉపమాలంకారము.

శా. దానత్యాగపతత్త్రమై తొలుపతత్త్రం బంబుధారన్ సదా
నానం,దత్సితకీర్తిహంసి చను మింటం, గ్రొత్త నా నేల, నా
నానీరార్ద్రపతత్త్రయయ్యు వడి మింటం బాఱుతజ్జాతి కే
లా నిల్చు న్గతి యన్యపత్త్రిగతిఁ బత్త్రైకప్రదేశాప్లుతిన్. 42

టీ. దానత్యాగపతత్త్రమై = దాన మన నుదకధారాపూర్వకముగ నిచ్చునది, త్యాగ మన నడుగఁబడకయే యుదకస్పర్శలేక యిచ్చునది, పతత్త్రమై=దానత్యాగములు రెండును రెండు ఱెక్కలుగాఁ గలదై, తత్సిత...సి - తత్ = ఆరాజుయొక్క, సిత = తెల్లనైన, కీర్తి = యశ మనియెడి, హంసి = పెంటిహంస, తొలుపతత్త్రంబు=మొదటి ఱెక్క, ('పతత్త్రం చ తనూరుహ మ్మని యమరుఁడు.) అంబుధారన్ = ఉదకధారచేత, సదా=ఎల్లప్పుడు, నానన్=నానఁగా, మింటన్=ఆకసమందు, చనున్=పోవును, క్రొత్త నాన్ ఏల=ఇది క్రొత్త యన నేటికి, నానా...యయ్యున్=నానా=సకలమయిన, నీర= ఉదకములచేతను, ఆర్ద్ర = తడుపఁబడిన, పతత్త్ర అయ్యున్ = ఱెక్కలు గలదైనను, వడిన్ = వేగముచేతను, మింటన్ = ఆకాశమందు, పాఱు = తిరుగు స్వభావముగల, తజ్జాతికిన్=ఆహంసజాతికి అన్యపత్త్రిగతిన్=ఇతర పక్షివలె, పత్త్రైకప్రదేశాప్లుతిన్ - పత్త్ర=ఱెక్కలయొక్క, ఏకప్రదేశ=ఒకప్రక్క, ఆప్లుతిన్ = తడియుటచేతను, గతి = గమనము, ఏలా=ఏమిటికి, నిల్చున్ = విరమించును.

తా. ఆసఁగా రెండు ఱెక్కలు దడిసినను హంసగమనమున తవిరోధ మనియుఁ, దదితరజాతిపక్షు లయినయెడ నార్ద్రమగు ఱెక్కలతో నెగసిపోవంజాల వనియు, నా రాజుయొక్క కీర్తి దానత్యాగము లనుఱెక్కలుగల హంసీస్వరూపమై తడిసిన మొదటి ఱెక్కతోనే యాకాశమునందును వ్యాపించి సంచరించుచున్న దనియు భావము.

అలం. రూపకానుప్రాణితకావ్యార్థాపత్తి.

సీ. శుకకదంబము గొలుసులచే నిబద్ధమై
వారాంగనాగారకారఁ బడఁగ
గిరికానికాయంబు లరిశూన్యబహుపుర
హర్మ్యవాటికలఁ [1]జెండాడు చుండఁ

1. వేఁటాడుచుండ.

గ్రందుగా నితరేత । రంబు రాయిడి సేయు
రాజులు తననూపు । రమున నొదుఁగ
నెగడు ననావృష్టి । నిజబలేభస్పర్ధి
సమదాన్యకరటి గం । డములఁ జేర
తే. దానవేళల నతివృష్టి । తనదు హస్త
గతము గాఁగఁ బ్రతాపాగ్నిఁ । గ్రాఁగిపోవు
కంటకులయందు శలభత । గలయ నడఁగ
నేలు నాపాండ్యుఁడు మహి నిరీతిగాఁగ. 43

టీ. శుకకదంబము=చిలుకలగుంపు, గొలుసులచేన్=శృంఖలలచేతను, నిబద్ధమై = కట్టఁబడినదై, వారా...రన్ - వారాంగనా = వేశ్యాస్త్రీలయొక్క, అగార=గృహము లనియెడు, కారన్ = చెఱసాలయందు, పడఁగన్ = ప్రవేశింపఁగా, గిరికానికాయంబులు = చిట్టెలుకలగుంపులు, అరి...లన్-అరి=శత్రురాజు పరుగిడినందున, శూన్య = పాడుపడియున్న, బహుపుర = అనేకపట్టణములయందలి, హర్మ్యవాటికలన్ = మేడల వరుసలయందు, చెండాడుచుండన్ = గంతులువేయుచుండఁగా, క్రందుగాన్ = సందడిగా, ఇతరేతరంబు=తమలోఁ దాము, రాయిడి = జగడము, చేయు = ఒనరించునట్టి, రాజులు = పుడమిఱేండ్లు, తన=తనయొక్క, నూపురమున్ = పాదకటకమందే, ఒదుఁగన్=అణఁగియుండఁగా-పాదాక్రాంతులై తన్నుఁ గొలుచు చుండఁగా ననుట, నెగడు= మిక్కుటమైన, అనావృష్టి = వర్షము లేకపోవుట, నిజ = స్వకీయమైన, బల = సేనల యందలి, ఇభ = ఏనుంగులతోడను, స్పర్ధి = కలహించిన, సమద=మదముతోఁగూడిన, అన్యకరటి = ఇతరగజములయొక్క, గండములన్ = చెక్కిళ్లయందు, చేరన్=ప్రవేశింపఁగా, అతివృష్టి=అతివర్షము, దానవేళలన్=దానముఁ జేయుసమయములను, తనదు= తనయొక్క, హస్తగతము కాఁగన్=హస్తమునఁ బ్రవేశింప, శలభత = శలభదోషము, ప్రతాపాగ్నిన్-ప్రతాప=తనప్రతాప మనియెడి, అగ్నిన్=అగ్నియందు, క్రాఁగిపోవు= మాడిపోవుచున్న, కంటకులయందున్=క్షుద్రశత్రువులయందు, కలయన్=కలియునటుల, అడఁగన్=అణఁగిపోఁగా, ఆ పాండ్యుఁడు=ఆపాండ్యరాజు, మహిన్=భూమిని, నిరీతి కాఁగన్=ఈతిబాధలు లేనట్లుగా, ఏలున్=పాలించును. అలం. రత్నావళి.

తా. శ్లో. 'అతివృష్టి రనావృష్టి ర్మూషికా శ్శలభా శ్శుకాః, అత్యాసన్నాశ్చ రాజాన షడేతా ఈతయః స్మృతాః' అనునట్టి షడ్బాధలను స్వరాష్ట్రమున లేకుండునట్లు, నితరస్థలముల నిల్పి యాపాండ్యభూపతి రాజ్యపరిపాలనముఁ జేసెను.

వ. అమ్మహీవల్లభుం డివ్విధంబున సామ్రాజ్యవైభవంబు లనుభవించు
[1]చుండఁ గొంతకాలంబున. 44

టీ. అమ్మహీవల్లభుండు = ఆభూపాలుఁడు, ఇవ్విధంబునన్ = ఈరీతిని, సామ్రాజ్యవైభవంబులు = సామ్రాజ్యసుఖంబులను, అనుభవించుచున్ ఉండన్, కొంత కాలంబునన్ = కొన్నిదినంబులకు.

తా. సుగమము.

— గ్రీష్మము —

తే. పాటలవసుంధరారుహాభాగధేయ
మాతతమరీచికాంబువర్షాగమంబు
ధరణిఁ బొడసూపె నంత నిదాఘసమయ
[2]ముదుటుతో శాల్మలిఫలవిదళనంబు. 45

టీ. అంతన్=అంతట, పాటల...ధేయము-పాటలవసుంధరారుహ = పాదిరి చెట్లకు, భాగధేయము = భాగ్యరూపమైనట్టియు, ఆతత...వర్షాగమంబు - ఆతత = విస్తారమగు, మరీచికా = ఎండమావు లనియెడి. (ని. 'మృగతృష్ణా మరీచికా' యని యమరుఁడు.) అంబు = ఉదకమునకు, వర్షాగమంబు = వర్షాకాలమైనట్టియు, శాల్మలీ ఫలవిదళనంబు - శాల్మలీ = బూరుగుచెట్లయొక్క, ఫల=ఫలములను, విదళనంబు=పగులఁ గొట్టునట్టిదియు నగు, నిదాఘసమయము = గ్రీష్మర్తువు, ఉదుటులోన్ = ఉద్ధతితోడ, ధరణిన్ = భూమియందు, పొడసూపెన్ = కనఁబడెను.

తా. పాదిరిచెట్లను బుష్పింపఁ జేయుచు, నెండమావులఁ గలుగఁజేయుచును, బూరుగుకాయలఁ బగులఁగొట్టునట్టి గ్రీష్మర్తువు ఉద్ధతిచేత భూమి యందుఁ గనిపించెను.

అలం. స్వభావోక్తి.

సీ. నిర్ఝరప్రబలవేణికలింకఁ జట్రాలఁ
బేరినప్రాఁచి పెన్సీఁట సెగసి
నెఱుకులు పడియనీరరివుర గువ్వలఁ బట్టఁ
బోయునీ రాడాడఁ బొలము నెఱసె

1, నంతఁ. 2. ఆదటులో.

సురగాలి దవదగ్ధ-తరుపర్ణతతి రేపఁ
బావురా లని డేఁగ-పదుపు దూఱె
నిద్రితద్రుచ్ఛాయ - నిలువక జరుగ వెం
బడినయధ్వగపంక్తి - పొరలువెట్టె
తే. క్షేత్రపాలున కుదికిన-చీర లాఱు
చాకిరేవులగము లయ్యె - సకలదిశలు
తెలుపులుగఁ దోఁచె నెండమా-వుల బయళ్లు
గందె నివి యెండ నన దిఙ్ముఖములు రాఁజె. 46

టీ. నిర్ఝరప్రబలవేణికలు - నిర్ఝర = సెలయేళ్లయొక్క, ప్రబల = విస్తారమైన, వేణికలు = ప్రవాహములు, ఇంకన్ = ఇనికిఁపోఁగా, చట్రాలన్ = చట్టుతాలయందు, పేరిన = పేరుకొన్నట్టి, ప్రాఁచి, పెన్పేఁటలు = పెద్దపగుళ్లు, ఎగసెన్ = లేచెను. ఎఱుకులు = ఎఱుకువాండ్రు, పడియ=పడియలయందలి, నీరు = ఉదకము, ఇవురన్ = ఇగిరిపోఁగా, గువ్వలన్ పట్టన్=అడవిపావురములను బట్టుటకు, పోయు=పోయుచున్న, నీరు= ఉదకము, ఆడాడన్ = అక్కడక్కడ, పొలమునన్ = భూమియందు, నెఱసెన్ = వ్యాపించెను, సురగాలి = సుడిగాడ్పు, దవదగ్ధతరుపర్ణతతిన్ - దవ = కారుచిచ్చుచేత, దగ్ధ=కాలినట్టి, తరు = మ్రాఁకులయొక్క, పర్ణతతిన్ = ఆకులగుంపులను, రేపన్ = ఎగురఁగొట్టఁగా, పావురా లని = కపోతములనుకొని, డేఁగపదుపు = శ్యేనసమూహము, దూఱెన్ = అడ్డముగ దూరెను, నిద్రి...యన్ - నిద్రిత = తాము నిదురఁబోయిన, ద్రు = వృక్షములయొక్క, ఛాయ = నీడ, నిలువక = నిలిచియుండక, జరుగన్ = అవలఁబోఁగా, వెంబడిన్ = ఆవెంటనే, అధ్వగపంక్తి - అధ్వగ = పాంథులయొక్క, పంక్తి = సమూహము, పొరలువెట్టెన్ = పొర్లుదండములు పెట్టెను, సకలదిశలు=అన్నిదిక్కులును, క్షేత్రపాలునకున్ = భైరవునకు ('త్వం భైరవ సమాగమ్య పుణ్యక్షేత్రాణిపాలయ, క్షేత్రపాల ఇతి శ్రీమన్ త్రిషు లోకేషు విశ్రుత' యని స్కాందమున నున్నది గనుక క్షేత్రపాలుఁ డనఁగా భైరవుఁడు,) ఉదికిన = ధౌతముఁ జేసిన, చీరలు = వస్త్రములు, ఆఱు = ఆఱఁగట్టినట్టి, చాకిరేవులగము లయ్యెన్=చాకిరేవు లాయెను. ఎండమావులన్ = ఎండమావులచేతను, బయళ్లు = బహిఃప్రదేశములు, తెలుపుగన్ తోఁచెన్ = తెలుపులై తోఁచెను. ఎండన్ = ఎండచేతను, ఇవి = ఈ దిఙ్ముఖములు, కందెన్ = వాడెను. అనఁగా, దిఙ్ముఖములు = దిక్కులమొగములు, రాఁజెన్=ధూమితము లయ్యెను. (డేఁగ - ఇందలి యరసున్నకు ఆకరము తెలియరాదు.)

తా. గ్రీష్మర్తువు ప్రవేశింపఁగానే సెలయేఱుల ప్రవాహము లింకెనుగానఁ జట్రాతి యందుఁ జేరియున్న ప్రాఁచి వెన్నెఁటలెగసెను. పడియలయందు నీ రింకియున్నందునఁ బిట్టలఁ బట్టుటకై యెఱుకవాండ్రచేతఁ బోయఁబడిన యుదకము శాలములయందుఁ గనుపించును. సుడిగాడ్పు లెండుటాకు లెగురునటుల వీఁచుచుండ దేగలుచూచి పావురము లని యెదురుదూఱుచుండును. త్రోవనడుచువారు వేడిమిచేత వృక్షముల క్రిందఁ బరుండి నిద్రించుచుండ, నావృక్షములనీడ, ప్రొద్దులోఁ గూడ జరుగునపుడు వెంటనే వారును పొర్లాడుదురు. నలుదిక్కుల నెండమావులు వ్యాపించియుండ నవి భైరవుఁడు దిగంబరుఁడు గనుక నతని కుదికి యారవేయించినచీరలో యనునటులఁ దెల్లనైయుండును.

అలం. 1, 2, 4 సీసపాదములలో స్వభావోక్తి. గీతములో 2, 4 పా. ఉత్ప్రేక్ష.

చ. సరియగు నిట్టివెట్టలను ౹ సర్వము నం చటమీఁదిసృష్టికై
శరధిప దిఙ్మరుజ్జ్వలిత ౹ చండత (క)రాతపవహ్ని నాఱఁగాఁ
గరువు లజుండు వీనిపయిఁ ౹ గట్టె ననన్ గనుపట్టె వెచ్చల
న్గరికిరికాసరాంగములఁ ౹ గప్పిన రొంపులు నంటి (దె) యాఱఁగన్.

టీ. వెచ్చలన్ = ఉదుకులచేతను, కరికిరి...ములన్ - కరి - ఏనుఁగుల యొక్కయు, కిరి = వరాహములయొక్కయు, కాసర = ఎనుబోఁతులయొక్కయు, (ని. 'వాహద్విషత్కాసరసైరిభా' యని యమరము.) అంగములన్ = దేహములను, కప్పిన రొంపులున్ = ఆచ్ఛాదించినపంకంబులుకూడ, అంటి = పేరుకొని, ఆఱఁగాన్ = ఎండఁగా, ఇట్టివెట్టలను = ఇట్టివేసవియందు, సర్వమున్ = సకలమును, సరియగున్ = నష్టమగును, అంచున్ = అనుకొని, అటమీఁదిసృష్టికై = భావిసృష్టికై, అజుండు = బ్రహ్మ, శరధిప = సముద్రముల కధిపతి యగువరుణునియొక్క, దిక్ = దిశయైన పడమటి దిక్కుయొక్క, మరుత్ = వాయువుచేతను, జ్వలిత = ప్రజ్వలింపఁజేయఁబడిన, చండతర = మిక్కిలి ప్రచండమైన, ఆతపవహ్నిన్ = ఎండ యనునగ్నిచేతను, ఆఱ.గన్ = ఎండునటుల, వీనిపైన్ = ఈకాసరాదులపై, కరువులు = మూసలు, కట్టె ననన్ = కట్టెనో యనునటుల, కనుపట్టెన్ = కానవచ్చెను.

తా. వేడిమిచేత నేనుఁగులు వరాహములు ఎనుబోతులు వీనిదేహములయందు పేరుకొనియున్న బురద లెండఁగా, నిట్టివేసవియందుఁ గాసరాదులు నష్టమగు నని పైసృష్టికై చిచ్చువంటి పడమటిగాడ్పున నాఱుచుండఁ జతుర్ముఖుఁడు వీనిపైఁగరువులు గట్టెనో యనునటులఁ గనుపడుచుండును. అలం. ఉత్ప్రేక్ష. ఆతపవహ్ని - రూపకము.

మ. దవధూమంపుఁదమంబులోఁ దమరస ద్రవ్యంబుఁ బంకేజబాం
ధవభానుప్రతతు ల్హరింపఁ గుయివెంటన్వెళ్లు శూన్యోరుకూ
పవితానం బనఁ జూడఁజూడఁ బుడమి న్బాటిల్లి పైవిప్పులై
యవసం బంచుల నాడఁగా నెగసె వాత్యాళి న్రజశ్చక్రముల్. 48

టీ. దవ...బులోన్ - దవ = గ్రీష్మసంబంధి యగుకార్చిచ్చుయొక్క, (ని. 'దవో వనహుతాశనః' అని యమరుఁడు.) ధూమంపు = పొగలనియెడి, తమంబులోన్ = చీఁకటియందు, పంకేజబాంధవభానుప్రతతుల్ = సూర్యకిరణసమూహములు, తమ... బు - తమ = తమయొక్క (అనఁగా బావులయొక్క యనుట), రస = ఉదకము లని యెడు, ద్రవ్యంబున్ = ధనమును, హరింపన్ = గ్రహింపఁగా, కుయివెంటన్ = మొఱ యనెడుకార్యమునకై అనఁగా మొఱపెట్టుటకు, వెళ్లు...వితానంబు - వెళ్లు = వెళ్లిపోవు చున్నట్టి, శూన్య = పాడైన, ఉరు = బహుళంబులగు, కూపవితానంబులు = నూతుల గుంపులు, ('క్రతువిస్తారయోరస్త్రీవితాన'మ్మని యమరుఁడు.) అనన్ = అనఁగా, వాత్యాళిన్ = వాయుసమూహముచేత, ('వాతానాం సమూహో వాత్యా' యని పాశాదికము గనుక సమూహార్థమందు యప్రత్యయము) పైవిప్పులై = విరివిగలవై, యవసంబు = కసవు, అంచులన్ = కొసలను, ఆడఁగాన్ = చుట్టితిరుగఁగా, చూడఁజూడన్ = వీక్షించుచుండఁగా, పుడమిన్ = భూమియందు, పాటిల్లి = విస్తరిల్లి, రజశ్చక్రముల్ = చక్రాకారపుఁబరాగములు, ఎగసెన్ = ఎగిరెను. ఇందు రెండవపాదమున ననుస్వార సంబంధయతి అప్పకవీయమున నీయతిలక్షణ మిట్లు కలదు. "ఆది పూర్ణయుతమ్మై టన వర్గాక్షరములు తుదను గల్గు వ్రాలు దక్కఁ, బొసఁగు నొకటి కొకటి భువిననుస్వారసంబంధయతులు నా ప్రబంధములను".

తా. సూర్యకిరణంబులు తమయొక్కరసము లనియెడి ద్రవ్యంబులను హరింపఁగా, మొఱపెట్టుటకు వెళ్లుచున్న పాడుబావులగుంపులో యనునటుల సుడిగాలి దుమ్ము కసవులతో నెగసి చక్రాకారముగఁ దిరుగుచుండును.

చ. పడమరవెట్ట నయ్యుదుకుఁ బ్రాశన మొల్లక కూటిపేదలై
బడలిక నూఁదు నచ్చిలువ ప్రగ్గములన్ రవియాజ్ఞ మాటికి
స్సుడియిడఁ బిచ్చుగుంటు రథము న్నిలుప న్బయనంబు సాగమిన్
జడను వహించె నాఁగ దివసంబులు దీర్ఘము లయ్యె[1] నత్తఱిన్. 49

1. నయ్యెడన్.

టీ. పడమరవెట్టన్ = పశ్చిమదిక్కుయొక్క వేడిమిచేత, అయ్యెడుకుఁబ్రాశనము = ఆయెండుకుటన్నమును (అనఁగా వేఁడిగాలి ననుట), ఒల్లక=లిననొల్లక, కూటిచేదలై=కూటికినొచ్చినవై, బడలికన్=ఆయాసముచేతను, ఊడు = వీడిపోవుచున్న, అచ్చిలువప్రగ్గములన్=ఆపాము లనియెడు ప్రగ్గములను, రవియాజ్ఞన్=సూర్యునియాజ్ఞచేతను, మాటికిన్=ప్రతిపదమునను, ముడియిడన్=ముళ్లువేయుటకు, పిచ్చుగుంటు=అనూరుఁడు, రథమున్ = అరదమును, నిలుపన్ = నిలుపఁగా, పయనంబు = ప్రయాణము, సాగమిన్=సాగకుండుటచేత, జడను వహించెన్=జాడ్యమును బొందెను, నాఁగన్ = అనఁగా, అత్తఱిన్=ఆగ్రీష్మకాలమందు, దివసంబులు=వాసరములు, దీర్ఘములయ్యెన్ = పొడవులాయెను.

తా. గ్రీష్మకాలంబున నహస్సు వృద్ధి నొందుటకుఁ గారణమును దెల్పుచున్నాఁడు. పడమటిగాలి వేఁడియగుటవలన నాయశన మొల్లక యన్నము లేనివియై యున్నందువలన బడలికచేత ముళ్ళు వీడిపోవుచున్నట్టి రథములకుఁ గట్టియున్న సర్పములను దివసేశ్వరునియాజ్ఞచేత మాటిమాటికి ముడియిడుట కనూరుఁ డరదము నిలుపఁ, బ్రయాణము సాగనిహేతువుచేత జడత్వము వహించెనో యనునటుల నాగ్రీష్మసంబంధి యగు దివసంబులయం దహస్సు పొడుగయ్యెను. అలం. హేతూత్ప్రేక్ష.

క. తరణిఖరకిరణశిఖి జగ, మెరియింపఁగఁ బొడమి గాలి నెగసినభసితో
త్కర మనఁగ శాల్మలీతరు,పరిణతఫలతూల మర్కపథమున కెగసెన్.

టీ. తర...ఖి - తరణి=సూర్యునియొక్క, ఖర=తీక్ష్ణమైన, కిరణ = కిరణములను, శిఖి = అగ్ని, జగము = జగత్తును, ఎరియింపఁగన్=దహింపఁగా, (ని. 'ద్యుమణి స్తరణి ర్మిత్రః; తిగ్మం తీక్ష్ణం ఖరం తద్వ' త్తనియు నమరుఁడు.) పొడమి = జనియించి, గాలిన్ = వాయువుచేతను, ఎగసినభసితోత్కరము = ఎగసినట్టిభస్మసమూహము, అనఁగన్ = అనునట్లు, శాల్మ...ము - శాల్మలీతరు = బూరుగుచెట్లయొక్క, పరిణత= పరిపక్వములైన, ఫల = ఫలములయందలి, తూలము = దూది, అర్కపథమునకున్ = సూర్యమార్గమునకు, ఎగసెన్ = ఎగిరెను.

తా. బూరుగుకాయలు పగిలి యం దున్నదూది యాకసమున కెగయఁగా, సూర్యకిరణంబు లనునగ్ని జగంబుల దహింప నాసమయంబున జనియించి గాలిచేత నెగసినభస్మసమూహమో యనునటుల నుండెను. అలం. రూపకానుప్రాణితవస్తూత్ప్రేక్ష.

చ. భరితనిజాంబుబింబితవిభాకరబింబవిజృంభితప్రభాం
కురముల నధ్వనీనకృతకూపకసంతతులు [1]వాలెచ్చె నధిరా

1. వాల్చు.

డ్విరహాభరంబున న్బొడముఁ వెచ్చకు శాంతి యొనర్ప వాహినీ
తరుణులు మేన దట్టముగఁ దాల్చినముత్తెపుఁబేరులో యనన్. 51

టీ. భరిత...లన్ - భరిత = సంపూర్ణమైన, నిజ = తమయొక్క - చెలమల యొక్క యనుట, అంబు = నీళ్లయందు, బింబిత = ప్రతిఫలించిన, విభాకరబింబ = సూర్యబింబముయొక్క, ('భాస్కరాహస్కర బ్రధ్న ప్రభాకరవిభాకరాః' అని యమ.) విజృంభిత = ప్రకాశితములగు, ప్రభా = కాంతులయొక్క, అంకురములన్ = మొలకలచేతను, అధ్వ...పఙ్క్తులు - అధ్వనీన = పథికులచేతను, కృత = ఉదకపాననిమిత్తముగాఁ జేయఁబడిన, కూపకపంక్తులు = చెలమలచాళ్లు, (ని. 'కూపకాస్తు విదారికా' యని యమరుఁడు.) అబ్ధి...నన్ - అబ్ధిరాట్=సముద్రునియొక్క, విరహాభరంబునన్ = విరహాతిశయముచేత, పొడమువెచ్చకున్ = జనియించినవేఁడిమికి, శాంతి ఒనర్పన్ = ఉపశమనముఁజేయుటకు, వాహినీతరుణులు - వాహినీ = నదు లనియెడి, తరుణులు = స్త్రీలు, మేనన్ = శరీరమందు, దట్టముగన్ = నిండారఁగా, తాల్చిన = ధరియించిన, ముత్తెపుఁబేరులో అనన్ = ముత్యపుదండలో యనునటుల, పొల్చెన్ = ఒప్పెను. అలం. వస్తూత్ప్రేక్ష.

తా. ఉదకపానముఁ జేయుటకై పథికులచేత నదులయందుఁ జేయంబడిన సంపూర్ణములగు చెలమలచాళ్లు, తమయందు సూర్యప్రభాంకురములు ప్రతిఫలింపఁగా, నిజనాథుఁడగుసముద్రునితో గ్రీష్మకాలమందుఁ గలియకుండుట యను విరహముచే జనియించిన వేఁడిమికి శమనముఁ జేయుకొఱకు నదు లనియెడు స్త్రీలు స్వశరీరములందు నిండారఁగా ధరియించిన ముత్యపుదండలో యనునటులఁ బ్రకాశించుచుండును.

మ. అతివృష్టి న్మును వార్ధిఁ గూర్చునెడకాఁ డౌటం [1]దముం గూర్చున
న్మతి లంచంబుగ హేమటంకములు మింటం బొల్చుపర్జన్యదే
వత కీ నెత్తినకే లనాఁ బొలిచె నిర్వారిస్రవంతి న్వియ
చ్ఛ్యుతి నమ్రచ్ఛదదృశ్యకర్ణికములై యున్నాళనాళీకముల్. 52

టీ. అతివృష్టిన్=అతిశయం బగువానలచేతను, మును = మునుపు, వార్ధిన్ = సముద్రుని, కూర్చు=పొందించునట్టి, ఎడ కాఁడు ఔటన్ = కుంటెనకాఁ డవుటచేతను, తమున్ = తమ్మును, కూర్చున్ = పొందించును, అన్ = అనునట్టి, మతిన్= బుద్ధిచేతను, లంచంబుగన్=ఉత్కోచముగ, హేమటంకములు=స్వర్ణటంకములు, మింటన్= అంతరిక్షమున, పర్జన్యదేవతకున్ = పర్జన్యుఁ డనుదేవతకు, ఈన్ = ఇచ్చుటకొఱకు,

1. దమిన్.

ఎత్తినకేలు అనాన్ = ఎత్తినహస్తమనఁగా, నిర్వారి = ఉదకములేని, ప్రవంతిన్ = నదియందు, పయశ్చ్యుతిన్ = నీళ్లుతఱుగుటచేతను. నమ్ర...వై - నమ్ర = వంగిన, ఛద=ఱెకులమీఁద, దృశ్య = కనఁబడుచున్న, కర్ణికములై = దుద్దులుగలవై, ఉన్నాళ నాళీకముల్ - ఉత్ = పైకి నిగిడిన, నాళ = తూండ్లు గల, నాళీకముల్ = కమలములు, పొలిచెన్ = ఒప్పెను.

తా. పూర్వమతిశయంబుగ వర్షించి మేఘుఁడు సముద్రమునకును నదులకును సంధానముఁ జేసెఁ గాన, మరల నాలాగునఁ జేయుమని వేఁడి పర్జన్యునకు లంచ మిచ్చుటకై బంగారు నాణెములఁ జేతులం బట్టి యెత్తినవో, యనునటుల నుందునదులయం దున్ననీ రినుకఁగాఁ గాఁడలు హస్తములవలెను, ఱెకులు వ్రేళ్లవలెను, దుద్దులు వరాలవలె నొప్పుచుండెను. అలం. వస్తూత్ప్రేక్ష.

సీ. నులివాడునాఁచు[1]వల్పుల గొంతొగర్చి లేఁ
        బొలవల్చుగాలి [2]వే పోక యొదిగి
   కడకువెళ్లఁగ నొక్క కడనుండి త్రొక్కుచు
        నులుచలఁ జిఱుతగుల్లల నమలుచు
   నెండ్రి కాలిఁజిక్కిన నెగసి యొక్కించుక
        తొలఁగి శితత్రోటిఁ దూఁటి తినుచుఁ
   దడి యింకునిలఁ జెమ్మమడివోనితమ్మిగుం
        పులను జీలుగుల నెండలు గడపుచుఁ
తే. దనరుబకపంక్తులకు జాను దఘ్ను మత్స్యఁ
   జెలువుగమి, యుడుములన రేల్దిరిగెఁ గుక్క
   పసికి బావులఁ బడుటకుఁ బసులయొరువు
   టెఱలకు మొసళ్లు; మలుఁగుమీఁ న్బొటెయఁ దూఁటె. ౧౩

టీ. నులి...లన్-నులివాడునాఁచు = కొంతవాడిన నాఁచుతీఁగయొక్క, వల్పులన్=బొబ్బరలచేత, గొంతు ఒగర్చి=గొంతు ఒగరుగలదై, లేఁబొలవచ్చుగాలిన్=లేఁత చేఁపపొలసువాసన గలవాయువుచేత, వే పోక=శీఘ్రముగఁ జనక, ఒదిగి=శరీరము వంచికొని, ఒక్కకడనుండి = ఒకచోటనుండి, కడకున్ వెళ్లఁగన్ = తుదముట్టునట్లుగ, త్రొక్కుచున్, ఉలుచలన్=ఉలుచ లను పేరు గల చిన్నచేఁపలను, చిఱుతగుల్లలన్ - చిఱు=చిన్నలైన, గుల్లలన్=నత్తగుల్లలను, నమలుచున్=భక్షించుచు ఎండ్రి = ఎండ్ర

1. వల్లుల. 2. వే పోకనెఱఁగి, బొలవల్చు గాలికిఁ బోక మగిడి.

కాయ, కాలు ఇఱికినన్=తన కాలుపట్టుకొన్నయెడల, ఎగసి=ఒక్కించుక తొలఁగి, శిత త్రోటిన్=వాఁడిముక్కున, తూఁటి=పొడిచి, తినుచున్=నములుచు, (ని. 'చంచుస్త్రోటి రుభేస్త్రియా'మ్మని యమరుఁడు.) తడి ఇంకు ఇలన్=తేమ యింకునట్టిభూమియందు, చేమ మడివోని=చేమకూర మడివంటి, తమ్మిగుంపులను=తామరగుంపులయందును, జీలుగులన్=జీలుగుచెట్లయందును, ఎండలు, కడపుచున్, తనరు=ఒప్పుచున్న, బకపంక్తులకున్=కొంగగుంపులకు, చెఱువుగమి=చెఱువులగుంపు, జానుదఘ్నము అయ్యెన్=మోఁకాలిబంటిదాయెను, ఉడుములనన్=ఉడుములనునట్లు, మొసళ్ళు=మకరములు, పసులయెరువు=పశువుల యెరువుపెంటలలోని, ఎఱలకున్=ఎఱ్ఱలకు, కుక్కపసికిన్=కుక్కల యుత్సాహమునకు, బావులన్ బఱుటకున్ = కూపములయందుఁ బఱనమగుటకు, రేల్ = రాత్రులయందు, తిరిగెన్ = సంచరించెను, మలుఁగుమీన్ = మలుఁగను పేరుగల చేఁప, బొఱియఁ దూఱెన్ = బొఱియలో దూఱెను.

తా. ఆగ్రీష్మవాసరంబులయందు నులివాడిననాఁచుఁ దిని గొంతుక యొగరెక్క-లేఁతచేఁపలవాసన గల గాలిచేత వేగిరముగాఁ బోక యొదిగి కడముట్టఁ ద్రొక్కుకొని పోయి యొకచోట నున్న యలుచలను నత్తగుల్లలను నమలి తిని, యెండ్రకాయ తన కాలు పట్టుకొనఁగా నెగసి కొంతదూరమున నిల్చి ముక్కునఁ బొడిచి దానిం భక్షించి, చేమకూర మళ్లవలెఁ దడియాఱిన తామరగుంపుల క్రిందను, జీలుగు బెండుచెట్ల క్రిందను నెండలకు దాఁగియున్న కొంగలకు: చెఱువులు జానుదఘ్నము లాయె ననియుఁ, గుక్కలకు వెఱచి మొసళ్ళు బావులలోఁ బఱుటకుఁ బసరముల యెరువులలోని యెఱ్ఱలకుఁగా సంచరించె ననియును, మలుఁగుమీను బొక్కలోఁ బ్రవేశించె ననియును తాత్పర్యము. అలం. స్వభావోక్తి.

ఉ. మీటగుమీల నెల్ల మును మ్రింగి క్రమంబున నైనయెండ పె
న్పీటికవెంటఁ దోఁచుతొగ వేరుబడి న్గొడుపై చెలంగఁగాఁ
ద్రోటికఁ గర్దమద్రవము [1]తోనె నశించిన బొమ్మిడాయ డా
[2]తూ్కటకులంబుఁగం దినె బకోటకులంబు జలహ్రదంబులన్. 54

టీ. బకోటకులంబు=పెద్ద కొంగలగుంపు, (ని. 'బకోటస్తుమహాబకః' యని నిఘంటువు.) మీటు అగు=గొప్పలైన, మీలన్ ఎల్లన్ = చేఁపలనన్నిటిని, మును మ్రింగి=ముందు మ్రింగి, క్రమంబునన్=వరుసగా, ఐన=ఐనట్టి, ఎండపెన్పీటికవెంటన్=ఎండచేత నైనపెద్దబీటికలచాలున, తోఁచు = కనుపించెడి, తొగవేరుబడిన్=కలువవేరు వెంటను,

1. తో నెనయించిన. 2. కూటకులంబు లేశెన.

కొడుపు ఐ = కొడుపువలెనై, చెలంగఁగాన్=ఒప్పఁగా, త్రోటికన్ = ముక్కుచేతను, కర్దమద్రవములోనె=బురదతడిలోనె, నశించిన = చనిపోయిన, బొమ్మడాయ = బొమ్మడాయ లనుపేరు గల చిన్నచేఁపలయొక్కయు, డాతుఱ్ఱుట = చేఁదుచేఁపల యొక్కయు, కులంబులన్=గుంపులను, (ని. 'బొమ్మడాయస్సూక్ష్మతోస్యాడాతుఱ్ఱుట స్తిక్తమత్స్యక' యని విశ్వము.) జలహ్రదంబులన్ = మడుఁగులయందు, తినెన్=భక్షించెను. (క్రమంబున నానె ననుపాఠమున ఆనెను త్రాగె నని యర్థము - డాతుఱ్ఱుట కులంబులేజెన ననుపాఠమున జెన యనఁగా గుడ్డులలోని పసుపువర్ణపునీరు.) అలం. స్వభావోక్తి.

తా. పెద్ద కొంగలగుంపు మడుఁగులయందుఁ దొలుత గొప్పచేఁపల నెల్లభక్షించి, గ్రీష్మకాలము రాఁగా నీ ళ్లింకిన పిమ్మట నేల పగులుటవలన బొరియలలోఁ గలువవేళ్ళ వెంటఁ గొడుపువలె నొప్పుచున్న బొమ్మడాయ లనియెడి చిన్నచేఁపలను, బురదలోఁ గూడ నెగిరిన చేఁదుచేపలను భక్షించెను.

శా. ప్రాతర్వేళల నట్టివెట్ట సొగసై పాటిల్లెఁ గుంభోంభనో
ద్భూతాంబుధ్వనివాద్యమై మరుదధఃపుంజీభవత్పాటల
వ్రాతామ్రేడితసిక్తభూసురభిళారామా(మ్)బుకుల్యాబహు
స్రోతస్సంధుల నంధుయంత్రనతికృత్ప్రోద్గీతగేయౌఘముల్. 55

టీ. ప్రాతర్వేళలన్ = ప్రాతఃకాలములయందు, అట్టివెట్టన్=అటువంటి గ్రీష్మమునందు, మరుద...లన్ - మరుత్=వాయువుచేతను, అధః=చెట్లక్రిందను, పుంజీభవత్=రాసులుగాఁబడుచున్న, పాటలవ్రాత = కలిగొట్టుపువ్వులసమూహముచేత, ఆమ్రేడిత = రెండుమూఁడువరుసలుగా, సిక్త = తడుపఁబడిన, భూ = భూమియందు, సురభిళ = సౌరభ్యముగల, ఆరామ=ఉద్యానవనముయొక్క, అంబుకుల్యా=నీటికాలువలయొక్క, బహు=అనేకములైన, స్రోతః = ప్రవాహములయొక్క, సంధులన్ = మధ్యప్రదేశములయందు, అంధు...ల్ - అంధు = బావులయొక్క, యంత్ర = ఏతములకు, నతి = వంగద్రొక్కుటను, కృత్ = చేయుచున్న జనులచేతను, ప్రోద్గీత = ప్ర+ఉత్+గీత = ఎత్తిపాడఁబడినట్టి, గేయ = పాటలయొక్క, ఓఘముల్ = సమూహములు, కుంభో...ధ్వని - కుంభ = ఘటములయొక్క, ఉంభన = ముసుఁగుటచేతను, ఉద్భూత=పుట్టినట్టి, అంబుధ్వని=నీళ్ళచప్పుడు, వాద్యమై = మద్దెలధ్వనివలెనై, సొగసై = సొంపుగను, పాటిల్లెన్ = ఒప్పెను. (ని. 'ఆమ్రేడితం ద్విస్త్రిరుక్తం, కుల్యాల్పాకృత్రిమాసరిత్, పుంస్యేవాన్ధుః ప్రహిఃకూప' యనియు నమరుఁడు.) అలం. స్వభావోక్తి. గేయమునకు

అంబుధ్వని మద్దెలధ్వని యై మనోహరత్వము సాపాదించుచున్నది గాన పరిణామాలంకారమును.

తా. వాయువుచే రాల్పఁబడిన కలిగొట్టుపువ్వులచేత రెండుమూఁడు మాఱులు తడుపఁబడినదై యున్న భూమియందుఁ బరిమళించుచున్న యుద్యానవనములయందలి వృక్షములకు నీళ్లుగట్టుటకై యేతములు ద్రొక్కుచున్నవాండ్రు గానముఁ జేయఁగ, బొక్కెనల ముంచునపుడు జనియించిన నీళ్ళచప్పు డను మద్దెలధ్వని గలదియై సొగసుగా నుండెను.

తే. మెండుమీఱిన పగటి బీఱెండ దాఁకి
యొల్లఁబోయిన లేబొండుమల్లెపాదల
తుదలఁ జప్పటలై కడుఁదొడ్డ లగుచుఁ
బొడమె మొగ్గలగము లగ్గిఁబొబ్బలట్లు. 56

టీ. మెండు... ఎండ-మెండుమీఱిన=దట్టమైన, పగటి=పవటియొక్క, బీఱెండ=మిడియెండ, తాఁకి = కొట్టి, ఒల్లఁబోయిన = మూర్ఛపోయిన, లేబొండు...లన్ - లేబొండుమల్లెపాదల = లేఁతబొండుమల్లెపాదలయొక్క, తుదలన్ = కొనలయందు. అగ్గిబొబ్బలట్లు = కాలినబొబ్బలవలెను, 'మొగ్గలగములు=మొగ్గలగుంపులు, చప్పటలై = అణఁగినవై, కడున్ దొడ్డలు అగుచున్ = మిగులగొప్పవై, పొడమెన్ = పుట్టెను, అలం. ఉత్ప్రేక్ష.

తా. ఆవేసవియందు దట్టమైనపేరెండ దాఁకి వాడినబొండుమల్లెలపాదల కొనలయం దణఁగినవై మిగుల గొప్పలగుచు నగ్గి బొబ్బలవలె నామొగ్గలగుంపులు పుట్టెను

మ. సుడి నాభిచ్ఛలన స్సరోజములు చక్షుఃప్రక్రియ న్నాఁచు క్రొ
మ్ముడిదంభంబునఁ జక్ర ఫేనపటలంబుల్ చన్నులు న్నవ్వుగా
నడరం జేసి నిదాఘభీతి సలిలంబు ల్భాగామిబీజార్థమై
కడవం బెట్టినవారిదేవతలు నాఁ గాంతాళి యొప్పు(ప్పె) న్ప్రపన్.

టీ. ప్రపన్ = చలిపందిళ్ళయందు, సుడి = నీళ్ళసుడి, నాభిచ్ఛలనన్ = బొడ్డులనియెడి వ్యాజముచేతను, సరోజములు = పద్మములు, చక్షుఃప్రక్రియన్ = నేత్రములరీతిచేతను, నాఁచు = ప్రాఁచి, క్రొమ్ముడిదంభంబునన్ = కొప్పనువ్యాజముచేతను, చక్ర...ల్-చక్ర=చక్రవాకములయొక్కయు, ఫేన = నురుఁగుయొక్కయు, పటలంబుల్ = సమూహములు, (క్రమముగా) చన్నులు = చనుదోయి, నవ్వుగాన్ = మందహాసమునుగా, అడరంజేసి = అమరునట్లు చేసి, నిదాఘభీతిన్ = గ్రీష్మమువలని

భయముచేత, ఆగామి=ముందటికి, బీజార్థమై=విత్తనముకొఱకై, సలిలంబు=జలమును, కడవన్ = కుండలో, పెట్టిన = ఉనిచినట్టి, వారిదేవతలు నాన్ = ఉదకాధిదేవతలో, యనునటులు, కాంతాళి = స్త్రీసమూహము, ఒప్పున్ = శోభించును. అలం. సాపహ్నవోత్ప్రేక్ష.

తా. జలదేవతాలక్షణములు స్త్రీలయవయవములకుఁ జెప్పంబడెను గానఁ, జలిపందిళ్లయందు నీళ్లు పోయుచున్న స్త్రీలు గ్రీష్మమునందు సకలము నష్టమగు నని భయపడి, ముందటివిత్తనముకొఱకు నీళ్లు కడవల నించికొనినవారై సుడులు, సరోజములు, నాచు, జక్కవలు, నురుఁగు ననువిశేషములను దమశరీరములయందే నాభులు, కన్నులు, క్రొమ్ముడి, స్తనములు, హాసము ననుమిషచేత నుంచుకొని యుండెడివారిదేవతలో యనునటులఁ బ్రకాశించుచుందురు.

సీ. సెగ కుల్కి మఱుఁగుఁ జొచ్చినజహ్నురవిజల
సరణి మల్లెలతోడిజడలు మెఱయ
వలిచన్నుఁగొమరు ముచ్చిలిన దిమ్మను తెఱం
గున ముంచుగరిగకాఁగుల మునుంగ
ధారలోఁ(ల)ఁ దోఁచు కన్దళుకులు వాసితో
త్పలపత్త్రపతనసంభ్రాంతి నొసఁగఁ
దెలిమోముపస మెచ్చి తలయూఁచు టెఱఁగి మా
నక నవ్వునేర్పు డెందములఁ గరఁపఁ
తే. దెఱవ లిటు నీరు వోయుపందిరియ చేరి
యవలఁ గొఱగాక పిచ్చుగుంపులై యనంగఁ
డనుపుగొనఁ జొచ్చెఁ గల్లగుట్టమర వారి
కధ్వగులు లాఁచి యిడువిడియముల పేర. 58

టీ. సెగకున్ = గ్రీష్మమునకు, ఉల్కి=భయపడి, కుఱుఁగు...ణిన్-మఱుఁగుఁ జొచ్చిన, జహ్నురవిజలసరణిన్ - జహ్ను=జహ్నుమునివలనను, రవి=సూర్యునివలనను, జలసరణిన్=పుట్టిన గంగా యమునలరీతిని, మల్లెలతోడిజడలు=గంగవలె మల్లెలు, యమునవలె జడలు, మెఱయన్=ఒప్పఁగా,(ఉత్ప్రేక్ష),వలిచన్నుఁగొమరు=వట్రువలైన తమ స్తనముల సౌందర్యమును, ముచ్చిలినది=హరించినది, ఇమ్ము అను తెఱఁగునన్=అది మరల నిమ్మనుకరణిని,ముంచు=మునుంగఁజేయునట్టి, గరిగ=కడవముంత, కాఁగులన్ మునుంగన్= నీళ్లకాఁగులలో మునుఁగఁగా, ధారలోన్=పథికులకుఁ బోయు నీటిధారలో, తోఁచు...

లు - తోఁచు = ప్రతిఫలించిన, కన్దళికలు = నేత్రప్రభలు, వాసి...లిన్-వాసిత = వాసనార్థమైన, ఉత్పలపత్త్ర = కలువఱేకులయొక్క, పతన = పడుచున్న వనియెడి, సంభ్రాంతిన్ = భ్రమను, ఒసఁగన్=కలుగఁజేయఁగా. (భ్రాంతిమదలంకారము), తెలి మోముపస = ఆస్త్రీలముఖసౌందర్యమును, (నీరుఁ ద్రాగుచున్నవారు చూచి), మెచ్చి= ఆనందించి, తలయూఁచుట ఎఱిఁగి = వారియభిప్రాయముఁ గని, మానక=నీరుపోయుట చాలింపక, నవ్వునేర్పు = నవ్వెడు చమత్కారము, డెందములన్=పథికులమనంబులను, కరఁపన్ = కరఁగింపఁగా, (సూక్ష్మాలంకారము), తెఱవలు = స్త్రీలు, ఇటు=ఇట్లు, నీరుపోయుపందిరియ చేరి=నీళ్లు పోయుచుండెడిపందిటియందే ప్రవేశించి, ఆవలన్ = మఱియొకతావునకు, కొఱగాక = పనికిరాక, పిచ్చుగుంటై = పంగువై, అనంగుఁడు = మన్మథుఁడు, కల్లగుట్టు అమరన్ = తెచ్చిపెట్టుకొన్న గాంభీర్యము ఒప్పుచుండఁగా, వారికిన్ = ఆస్త్రీలకు, అధ్వగులు = తెరువరులు, లాఁచి యిడు = ప్రీతితో నిచ్చు నట్టి, విడియములపేరన్=తాంబూలము లనువ్యాజముచేతను, అనుపుగొనన్=సుంకముఁ దీసికొనుటకు, చొచ్చెన్ = సిద్ధపడెను. అలం. సాపహ్నవోత్ప్రేక్ష.

తా. మల్లెపూదండలు గలకొప్పులు గంగాయమునలు రెండును నెండకు వెఱచి స్త్రీలవాఱుఁగుఁ జొచ్చెనో యనునటుల నొప్పె ననియు, నీళ్లకాఁగులలో ముంచెడి ముంతలు మాచిక్కఁదనమును మీరు దొంగిలినారుగాన మరల నిమ్మని చన్నులకడవలలోఁ జొచ్చి బాధించున ట్లుండె ననియు, నీళ్లుపోయఁగ నాధారయందుఁ గనుపించుచున్న కన్నులకాంతులు పరిమళమునకుఁగాఁ గట్టినకలువలో యనున ట్లుండె ననియు, పథికు లా స్త్రీలముఖసౌందర్యముఁ జూచి తలయూఁచఁగా, నాచేరఁబట్టి నీళ్లుత్రాఁగుచుఁ జాలు నని యూఁచిన ట్లూహింపక మానక నీళ్లుపోయుచు నవ్వెడునేర్పు పథికులమనంబులఁ గరగింపఁగ, స్త్రీలకుఁ బాంథులు మంచితనమునకై యిచ్చువిడియములు పిచ్చుకుంటై మఱి యొకచోటికిఁ బోక పడియున్న మన్మథుఁడు తీసికొను సుంకమువలె నుండెను.

చ. తొడిఁబడ నమ్మ [1]లక్క లని తూలుచు దీనత దోయి లొగ్గుచున్
వడ మఱి తేఁదేర నలసవాక్యము లెన్నక మోము గుబ్బలున్
గడఁకొనుకన్ [2]దీధితు లెసఁగాదిగఁ గన్గొనుచిట్టకంపుఁ ద్రాఁ
గుడుఁ గని సన్నల న్నగిరి [3]కొండలు పాంథుఁ బ్రపాప్రపాలికల్.

టీ. తొడిఁబడన్ = దాహజ్వరచేత నైనతొట్రుపాటుచేత, తూలుచున్=తూఁగాడుచు, అమ్మలు అక్కలు=అమ్మలారా అక్కలారా, అని = అనుచు, దీనతన్=దైన్య

1. నమ్మయక్క. 2. దీప్తులు నె. 3. క్రొల్పక.

ములో, దోయిలిఒగ్గుచున్ = (నీళ్లకై) దోసిలిపట్టుచు, వడ = (నీళ్ల త్రాగుటచే నట్టి) వెట్ట, మఱితేరన్ తేరన్ = క్రమముగా దీరఁగా తీరఁగా, అలవాక్యములు=మునుపన్న మాటలను, ఎన్నక = విచారింపక, మోముల్ గుబ్బలుల్ = ముఖములను స్తనములను, కడు...ధితులన్ - కడుకొను = బయలొరసిన, కక్షదీధితులన్ = చంకలమెఱపులను, ఎగాదిగన్=పైకినిఁ గ్రిందకును, కన్గొను = చూచుచున్నట్టి, చిట్టకంపుఁ ద్రాఁగుడున్= చేష్టలుగలత్రాఁగుటను, చిట్టక మన, కపట మనియు నర్థము గలదు. కని = చూచి, పాంథున్=పథికుని, కొందఱు=కొందఱైన, ప్రపా ప్రపాలికల్ = చలిపందిటియందు నీళ్లుపోయుచున్నస్త్రీలు, సన్నలన్ = ఒకరికొకరుచేసికొను సంజ్ఞలచేతను, నగిరి=నవ్విరి. అలం. సూక్ష్మము.

తా. తొలుత నమ్మ యక్క యనుచు దీనభావములో వచ్చి దాహజ్వరచేఁ దూలుచు దోసిళ్లయందు నీళ్లు పోయఁగఁ ద్రాఁగి బడలిక దీరఁగా, మునుపటిమాటల విచారింపక నీళ్లుపోయు స్త్రీలయొక్క కన్నులు, మోములు, స్తనములు, చంకలు వీని నెగాదిగఁ జూచి వికారములోఁ ద్రాఁగుచున్నపథికునిఁ గని, యాస్త్రీలు సైగలో నవ్విరనియుఁ, బాంథుఁడు కాముకుఁ డనియుఁ, దొట్రుపాటుచేతఁ దొలుత నమ్మ యక్క యని వచించె ననియుఁ దాత్పర్యము.

తే. ఎసఁగు కట్టావిక్రియ నావిరెగయఁ బగటి
యెండయుడుకు కాఱుకుందు భూమండలమునఁ
బొలిచె మాపటఁ బండువెన్నెల చకోర
పోతవితతికిఁ జాఁపట్టు వోసినట్టు. 60

టీ. ఎసఁగు=రేఁగుచున్నట్టి, కట్టావిక్రియన్=పెనముమీఁదఁ బిండిఁ బోయఁగఁ జుట్టు నెగయునట్టి యావిరిపొగవలెను, ఆవిరి ఎగయన్ = (నేలనుండి) ఆవిరి యెగురుచుండఁగా, పగటియెండ (వలని), ఉడుకు ఆఱుకుందు = వేఁడి యాఱుకుందు నట్టి, భూమండలమునన్ = కాలిన పెనమువంటి భూమండలముమీఁద, మాపటన్=రాత్రియందు, పండువెన్నెల = ముదురువెన్నెల, చకోరపోత వితతికిన్ = చకోరపుఁబిల్లల గుంపులకు, చాఁపట్టు=పలుచనిపెద్ద దోసెలను, పోసినట్టు = పోసినట్టువలె, పొలిచెన్ = ఒప్పెను. అలం. వస్తూత్ప్రేక్ష.

తా. పెనముమీఁదఁ బిండిఁబోయఁగ నెగసినయావిరిపొగవలె నావిరి యెగయుచుండఁగా, బవటియెండ యుడుకు కాఱుకుండెనుగానఁ గాలినపెనమువలె నున్నభూమండలమునందు రాత్రియందలి ముదురువెన్నెల చకోరపుఁబిల్లలగుంపులకుఁ బలుచని దోసెలను బోసిన ట్లొప్పుచుండెను.

సీ. పవలెల్ల దిక్కికాంబుపు[1]చల్లుపోరాట
నలసి మృణాళికాజడము లైన
బాహువు ల్తమదుకూ । ర్పరముల కెదురుగా
మలఁచి మూఁపులఁ గర । తలము లునిచి
ప్రాల్మాలి మిగుల[2]నా । ర్పనికమ్మ క్రొమ్ముడిఁ
దనిమొగ్గవిరవాది । దండవిరియ
ధాతగంధామోది । శీతలస్తనములు
వొందఁ గౌఁగిళ్లతో । బోరగిల్లి
తే. నారికేళాసవపుఁదీపు । టూరు పొలయ
వలిపయొంటొల్లెతో నుర । స్థ్సలులఁ గూర్కఁ
బ్రియల వేఁకువఁ దొడ లెచ్చ । రించి కలసి
రెలమి ధన్యులు దఱిపివె । న్నెలబయళ్ల. 61

టీ. పవలెల్లన్ = పగటివేళలనెల్లను, 'క్వచిద్గకారోవ'యనుసూత్రముచే గవర్ణమునకు వవర్ణము, దిక్కి...టన్ - దిక్కికా = డిగ్గియలయొక్క, అంబువు = నీటియొక్క, చల్లుపోరాటన్=ఒండొరులపై నీరుచల్లుటయనెడి పోరాటమునందు, అలసి= బడలి, మృణా...లైన-మృణాళికా = తమ్మితూఁడులవలె, జడములు = చల్లనివి, ఐన = అయినట్టి, బాహువుల్ = భుజములు, తమ...కున్ - తమదు = తమయొక్క, కూర్పరములకున్ = మోఁచేతులకు, ఎదురుగాన్, మలఁచి = మరలించి, మూఁపులన్ = భుజములపై, కరతలములు = అఱచేతులను, ఉనిచి = ఇడికొని, ప్రాల్మాలి = బద్ధకించి, మిగులన్=మిక్కిలి, ఆర్ప...డిన్-ఆర్పని=తడియాఱఁజేయనట్టి, కమ్మక్రొమ్ముడిన్=పరిమళించుచున్నకొప్పునందు, తని...ద-తని=క్రొత్తలగు, మొగ్గ=మొగ్గలచేతఁగట్టిన, విరవాది దండ = మల్లెపువ్వులదండ, విరియన్ = వికసింపఁగా, ధాత...లు - ధాత=కడుగఁబడిన, గంధ=పరిమళద్రవ్యములు గలవి యయ్యు, ఆమోది=పరిమళించుచున్న, శీతల= చల్లనైన, స్తనములు=చన్నులు, పొందన్=తగులునట్టుగా, కౌఁగిళ్లతోన్=ఆలింగనముల తోడ, బోరగిల్లి=బొమ్ముపైఁబరుండి, నారికేళఆసవపు = నారికేళమద్యమయమగు, తీపు టూరుపు ఒలయన్=తీపుగలనిట్టూర్పు వెడలఁగను, వలిప=సన్నమైన, ఒంటిపల్లెతోన్= ఏకవస్త్రముతోను, ఉరస్థ్సలులన్ కూర్క=బొమ్ములపై నిద్రించుచున్న, ప్రియలన్=

1. చల్లుపోరాడ సొలసి మృణాళికోజ్జ్వలము లైన. 2. నార్పమిఁ గమ్మక్రొమ్ముడి. పాఠాం.

ఇష్టులగు స్వస్త్రీలను, వేకువన్ = వేకువజాములయందు, తొడలు = ఊరువులను, ఎచ్చరించి=కదలించి, తఱిపివెన్నెల బయళ్లన్ = పండువెన్నెల గలబయళ్ళను, ఎలమిన్ = సంతోషముచేత, ధన్యులు = భాగ్యవంతులు, కలసిరి = రమించిరి. తఱిపివెన్నెల యను పదమునకు లక్షణచేతఁ బండువెన్నెల యనునర్థము సిద్ధించును.

తా. వేఁడిమిగలిగియుండుటచేతఁ బగళ్లెల్లను నడబావులయందు జలక్రీడలుసేసి రేఁడులవలెఁ జల్లనైయున్నహస్తములఁ దమమోఁచేతుల కెదురుగ మరలించి, భుజములపైఁ జేతుల నుంచికొని ప్రాల్మాలి తడిపోవున ట్లార్పఁబడిమి వాసించుచున్నకొప్పునందున్న క్రొత్తలగువిరవాదిమొగ్గలు వికసింపఁగా కడుగఁబడిన పరిమళద్రవ్యములు గలవియయ్యు, వాసనగలిగియున్న చల్లనైయున్న స్తనములు తాఁకుచుండున ట్లాలింగనములో బోరగిల్లి, పానముసేసిన నారికేళా సవముచేతఁ దీపుగలనిట్టూర్పు వెడలఁగా సన్నమైన యొంటివస్త్రములోఁ దమతొమ్ములపై నిద్రించుచున్న ప్రియురాండ్రను వేఁకువజాముల యందుఁ దొడలసంజ్ఞచేత లేపి, పండువెన్నెల బయళ్ళను వారితో భాగ్యవంతు లగుపురుషులు రమించుచుందురు. అలం. స్వభావోక్తి.

వ. అట్టిసమయంబున. (2

చ. హృదయము లెప్పుడు న్గదియ కే తఱచౌ వెడకౌఁగిలింతలు౯
గదిరెడుమేలు(ను)కార్యములఁ గల్గక మాటలయందె కల్గుపె
న్గదురులు వట్టిశైత్యములఁ జాలఘనంబయి మండువేసవి౯
బొదలఁగ నిల్చె దంపతుల పొందు లనార్యులపొందుకైవడిన్. 63

టీ. మండువేసవి౯ = గ్రీష్మమందు, దంపతులపొందులు = సతీపతుల సంపర్కములు, అనార్యులపొందుకైవడి౯=దుర్జనులకూటమివలె, హృదయములు = ఱొమ్ములు, ఎప్పుడున్=ఎప్పటికిని, కదియకే=సోఁకకయే (ఉష్ణమముచేత ననుట), తఱచౌ=మెండైన, వెడకౌఁగిలింపులున్ = వెట్టికౌఁగిలింతలును, మనస్సంగము లేక యని యర్థాంతరము. కదిరెడు=ప్రాప్తమైన, మేలుకార్యములన్=రతిక్రియలయందు, మంచిపనులయందు అని అనార్యపరము. కల్గక = లేక, మాటలయందె = ఒకప్రయోజనములేక మాటలనేర్పునందే, కల్గు=కలుగుచున్నట్టి, పెన్గదురులు=గొప్ప చాతుర్యములు, వాగాడంబరము లని యర్థాంతరము. వట్టిశైత్యములు = వట్టిచల్లఁదనములు (క్రియలచేత లే వనుట), చాల ఘనంబయి = మిగుల గొప్పవై, పొదలఁగన్ = పొందునట్లుగా, నిల్చెన్=ఉండెను.

తా. గ్రీష్మమందు సతీపతుల సంపర్కములు దుర్జనులకూటమింబలె నెప్పటికిని మనస్సంగము లేక మెండైన వట్టికౌఁగిలింతలచేత ప్రాప్తమై మేలుకార్యముల లేక మాటల

యందు మాత్రమేగల్గు చాతుర్యములచేతను జల్లఁదనముచేతను మిగుల గొప్పవై పొందునట్లుం బలె నుండెను.

ఉ. తీలగు కంతువెంబడిన తెమ్మెరలు న్రవిదీప్తి కళ్కి పా
తాళముఁ బట్టుచుండఁ దమ తావులు ముచ్చిలఁ బట్టి యోషధీ
పాలున కప్పగించె ననఁ బై సురభిశ్వసనంబు నించెఁ గాం
తాలసవక్త్రసీమ విటు లార్చు నుశీరపుఁదాళవృంతముల్. (4

టీ. విటులు=పల్లవులు, కాంతా...మన్ - కాంతా=ప్రియలయొక్క, ఆలస = బడలినట్టి, వక్త్ర = ముఖముయొక్క, సీమన్=ప్రదేశమునందు, ఆర్చు...ల్-ఆర్చు - విసరునట్టి, ఉశీరపుఁ దాళవృంతముల్=వట్టివేళ్ళవిసనకఱ్ఱలు, తీలు అగు=బలహీనుఁడైనట్టి, కంతువెంబడిన=మన్మథునివెంటనే, తెమ్మెరలున్=శీతవాయువులును, రవిదీప్తికిన్ అళ్కి = సూర్యప్రతాపమునకు వెఱచి, పాతాళముఁ బట్టుచుండన్ = పాతాళలోకముఁ జేరఁ బోవుచుండఁగా, తమ తావులు = తమవాసనలను, ముచ్చిలన్ = అపహరింపఁగా, పట్టి=పట్టుకొని, ఓషధీపాలునకున్=చంద్రునికి, అప్పగించెన్ అనన్=అప్పగించె నను నటుల, పైన్ = ముఖముమీఁద, సురభి = వాసించుచున్న, శ్వసనంబు = గాలిని, నించెన్ = నిండించెను. అలం. ఉత్ప్రేక్ష.

తా. గ్రీష్మమందు బలహీనుఁడై పాతాళమునకు వెళ్లుచున్న మన్మథుని వెన్నంటి సూర్యదీప్తికి వెఱచి వలసపోవుచున్న వాయువులను, దమవాసనల దొంగిలికొని పోవుచున్న వని పట్టి, తా మోషధులు గనుకఁ దమకుఁ బ్రభువైన చంద్రునికి నప్పగించెనో యనునటుల విటులు స్త్రీలముఖములయందలి చెమటాఱ విసరెదు వట్టివేళ్ళవిసనకఱ్ఱ లొప్పుచుండెననియు, నప్పగించిన సురభిశ్వసనము మలయమారుతమును, స్త్రీలముఖములు చంద్రుఁడును వాయువు దొంగ యనియును భావము.

చ. సమసి కథా (శా)వశిష్ట మగుచందనశైలసమీరణంబుఁ గృ
త్రిమగతి నింద్రజాలమునఁ దేఁబొడఁగె న్భువిఁ దాళవృంతజా
లము లది మాయ యాటకుఁ దలంపఁ దదీయమయూరపింఛికా
భ్రమణమె సాక్షి కాదె నగరంబున నట్టికడిందివేసవిన్. 65

టీ. నగరంబునన్ = మథురాపురమున, అట్టి = అటువంటి, కడిందివేసవిన్ = కఠిన మగు గ్రీష్మకాలమునందు, సమసి = నష్టమై, కథా...మున్-కథావశిష్టముఅగు= కథలందుమాత్రము మిగిలియున్నట్టిది అగు, చందనశైలసమీరణంబున్-చందనశైల = మలయపర్వతమునందలి, సమీరణంబున్=మందమారుతమును, భువిన్=భూమియందు,

తాళ...లు - తాళవృంత = విసనకఱ్ఱలయొక్క, జాలములు = సమూహములు, ఇంద్రజాలమునన్ = ఇంద్రజాలవిద్యలచేత, కృత్రిమగతిన్ = మాయచేతను, (ని. 'వ్యజనం తాలవృంతకం, చక్రం జాతం చ జాలక'మ్మనియు నమరము.) తేఁదొడఁగెన్ = తెచ్చుట కారంభించెను. అది = ఆవాయువులఁ దెచ్చునది, మాయ యాటకున్ = కపటమాటకు, తలఁపఁగన్ = విచారింపఁగా, తదీయ...మె - తదీయ = ఆతాళవృంత సంబంధియైన, మయూరపింఛికాభ్రమణమె - మయూర = నెమలియొక్క, పింఛికా = పింఛముయొక్క, భ్రమణమె = తిరుగుటయె, సాక్షికాదె = గుఱుతుగాదా.

తా. మిగుల కఠినమగు గ్రీష్మమందు మలయమారుతము నష్టమైపోఁగా దానిని మాయతో గారడివిద్యచేత విసనకఱ్ఱలు దెచ్చె ననియు, నది గారడ మగుటకుఁ దాళవృంతముల చుట్టును గోనలయం దున్న నెమలిపింఛికయె సాక్షి యనియుఁ, దాఁ గనుపింపక యుండి యిట్టివిద్యను జేసె ననియును భావము. ఐంద్రజాలికునకు నెమలిపింఛము కావలయు ననుటకుఁ బ్రయోగము. 'శ్లో. భ్రామయన్ బర్హిబర్హాణి మోహయన్ జంతుసంతతిం, విస్మారయన్ సభాః కశ్చి దాయయా వైంద్రజాలికః' అని.

తే. అట్టి వేసవి బెడిదంపు వెట్టకతన
హస్తము చెమర్ప సారెకు లస్తకంబు
దుసికిలఁగఁగాదె సవరింప వసము గాక
పుష్పబాణుని చెఱకువిల్ పుడమిఁ బడియె. 66

టీ. అట్టివేసవిన్ = అట్టిగ్రీష్మమందు, బెడిదంపువెట్టకతనన్ = కఠినమగువెట్ట చేతను, హస్తము = (మన్మథుని)చేయి, చెమర్పన్ = చెమటఁబోయఁగా, సారెకున్ = పలుమాఱును, లస్తకంబు = ధనుర్మధ్యము. (ని. 'లస్తకస్తుధనుర్మధ్య'మ్మని అమరము.) దుసికిలఁగన్ కాదె = పిడికిటనుండకజాఱిపోవఁగదా, సవరింపన్ = చక్కఁజేయుటకు, వసము గాక = వశముగాక, పుష్ప...ల్ - పుష్పబాణుని = మన్మథునియొక్క, చెఱకువిల్ = ఇక్షుధనువు, పుడమిన్ = భూమియందు, పడియెన్ = పతనమాయెను. అలం. హేతూత్ప్రేక్ష.

తా. అనఁగా నది భూమియందుఁ జెఱకు పండెడుకాల మనుట.

మ. 'తరుణు ల్తల్లియొఱ న్గుచంబు లునుపం దచ్ఛైత్యము ల్దీమ్ములై
సెరగేఁపం జనుదెంచెఁ గాక రవిదీప్తిం గ్రుంకి పాతాళగ
హ్వరముం దూఱినవారి నీమదుకుఁద్రాళ్లా తెచ్చు' నా దీర్ఘత
చ్ఛిరకృష్టిం గనునట్టిశైత్య మలరించె న్నూతులం దత్తఱిన్. 67

టీ. తరుణుల్ = యువతులు, తల్లియొఱల్ = నూతులపైఁ గట్టియున్న పెద్దయొఱ మీఁదను, కుచంబులు ఉనుపన్ = నీళ్లు చేఁదునప్పుడు స్తనములానింపఁగా, తచ్ఛైత్యముల్ - తత్ = ఆకుచములయొక్క, శైత్యముల్ = చలువలు, దీములై = ఆకర్షములై - పాటిగువ్వలై, (పాటిగువ్వ యనఁగా స్వజాతిపక్షుల నాకర్షించుటకుఁ బెంపఁబడిన పక్షి. ఉదకశైత్యమున కాకర్షకంబులై యనుట), పెరరేఁపన్ = ప్రేరేపింపఁగా, చనుదెంచెఁగాక = శైత్యము వచ్చెఁగాక, అట్లు గాకుండెనేని, రవిదీప్తిన్ = సూర్యప్రతాపముచేతను, క్రుంకి = అణఁగి, పాతాళగహ్వరమున్ = పాతాళబిలమును, (ని. 'దేవఖాతబిలే గుహా, గహ్వర' మ్మని యమరము.) దూఱినవారిన్ = చొచ్చియున్న జలమును, ఈయదుకుఁద్రాళ్లు = ఈముళ్లు వేసిన త్రాడులా, తెచ్చున్ = తేఁగలవు, నాన్ = అనఁగా, దీర్ఘ...ష్టిన్ - దీర్ఘ = పొడవైన, తత్ = ఆత్రాళ్ళయొక్క, చిర = తడవైన, కృష్టిన్ = చేఁదుటచేతను, కనునట్టి శైత్యములు = పొందునట్టిచల్లఁదనములు, అత్తఱిన్ = ఆగ్రీష్మమున, నూతులందున్ = చేఁదుడుబావుల యందు, అలరించెన్ = సంతోషపెట్టెను. అలం. హేతూత్ప్రేక్ష.

తా. శ్లో. 'కూపోదకం వటచ్ఛాయా తాంబూలం తరుణీకుచౌ, శీతకాలే భవే దుష్ణ ముష్ణకాలే తు శీతల' మ్మను న్యాయముంబట్టి, బావులయందు నీళ్లు చేఁదెడి తరుణుల యొక్క కుచములు తల్లియొఱ మోఁపఁగ నాకుచశైత్యములు పాటిగువ్వలై సూర్యకిరణ ములకు వెఱచి పాతాళము దూఱుకొనియున్న జలమును రేపఁగాఁ జనుదెంచెఁగాని, యీముళ్లువేసిన త్రాళ్లు తెచ్చునా యనునట్లు నూతులయందున్న నీళ్లచల్లఁదన మట్టి గ్రీష్మమునందు మిగుల సంతోషము పెట్టె నని తాత్పర్యము. నూతులలో నీళ్లు పాతా ళము నంటె నని భావము.

మ. స్వనిదానోగ్రనిదాఘవైఖరిన యూష్మన్మల్లికల్ కామినీ
కనదానీలకచాగ్రపఙ్క్తి నెఱియల్గాఁ బాపఁగాఁ, బాటల
ల్ఘనతం దేనియసోనఁ గూర్చ నది యాఁకగా నాభియు న్నిర్విషం
బును దోఁబుట్టువులయ్యు వేర్పడ గుణాంశబు ల్చూపఁగాఁ జూడమే.

టీ. స్వని...న - స్వ = తమకు నిదాన = కారణమైనట్టి, నిదాఘవైఖరిన = వేసవివలెనే మల్లికల్ = మల్లెలు, ఊష్మన్ = వేఁడిమిచేత, కామినీ...న్ - కామినీ = స్త్రీలయొక్క కనత్ = ఒప్పుచున్నట్టి, ఆనీల = సర్వము నల్లనైన, కచాగ్రపఙ్క్తిన్ = తలవెండ్రుకలకొనలను, నెఱియల్గాన్ = చీలికలుగా, పాపఁగాన్ = పాయఁజేయఁగా, పాటలల్ = కలిగొట్టుపువ్వులును, ('పుష్పేక్షీబేపి పాటలా' అని యమరము.) ఘనతన్ = దట్టముగా (అధికతచేత అనఁగా ఔదార్యముచేత ననియు) తేనియసోనన్ = మధు

స్రవముచేతను, కూర్చున్ = అకచాగ్రపుబ్రద్దలను మరలఁ గలియునట్లు చేయును, అవి యోఁగా = ఒక ఋతువునందుఁబుట్టినద్వివిధంబు లగు పుష్పములకు విరుద్ధముగ నుందు రెండుగుణము లెట్లు గల్గు ననఁగా యుక్తంబే, నాభియున్ = వత్సనాభి యను, నిర్విషంబును=విషహారమును, తోఁబుట్టువులయ్యున్, గుణంబులు=నైజగుణంబులను, వేర్పడన్ = వేఱుపడునట్లు, చూపఁగాన్ = అగపఱుపఁగను, చూడమె = చూడలేదా (చూచితి మనుట.) అలం. వికస్వరము. వత్సనాభియు, నిర్విషయు - విరుద్ధగుణములు గల ఓషధీ విశేషములు. రెండును ఓషధులు గాన తోఁబుట్టువులు.

తా. గ్రీష్మమున మల్లెలు పాదిరిపువ్వులును మెండుగ నుండుటవలన మల్లెలు ధరియింపఁగా నవి విచ్చుటవలన స్త్రీలవెండ్రుకలు వదులు ననియు, పాదిరిపువ్వుల ధరియింపఁగా నందున్న తేనెసోనచేత విచ్చియున్నకచాగ్రములు మరలఁ గదిసియుండు ననియుఁ, దోఁబుట్టువులైనను భిన్నగుణంబులు గల్గియున్న విషనిర్విషలవలె మల్లెలు పాదిరిపువ్వులు నొకఋతువునందుఁ బుట్టినవైనను భిన్నగుణంబులను బ్రకాశింపఁజేయుచుండెను.

శా. తారుణ్యాతిగచూతనూత్నఫలయుక్తైలాభిఘారస్వన
ద్ధారాధూపితశుష్యదంబుహృతమాత్స్యచ్ఛేదపాకోద్గతో
ద్గారంపుంగన రార్పు భోగులకు సంధ్యావేళలం గేళికాం
తారాభ్యంతరవాలుకాస్థితహిమాంతర్నారికేళాంబువుల్. 69

టీ. కేళి...ల్ - కేళికాంతార=శృంగారవనములయొక్క, అభ్యంతర = నడుమ నున్న, వాలుకా=ఇసుకయందు, స్థిత=ఉంచఁబడిన, హిమాంతః = అంతశ్శీతముగల, నారికేళాంబువుల్ = టెంకాయనీళ్లు, తారుణ్యా...రు-తారుణ్య = తరుణత్వమును, (పిందె, కాయ, దోర, పండు అను నాలుగుదశలలో కాయదశను) అతిగ=అతిక్రమించిన (దోరపండుదశలోనున్న), చూత=మామిడిచెట్లయొక్క, నూత్నఫల = దోరపండ్లతోడను, యుక్ = కూడినట్టి, తైల=నూనెయొక్క, అభిఘార = తిరుగఁబోఁతచేతను, స్వనత్ = ధ్వనించుచున్నట్టి, ధారా=అవిచ్ఛిన్నముగ, ధూపిత=పొగపఁబడినట్టి, శుష్యత్ =శోషించుచున్న, అంబు = ఉదకముగలప్రదేశమువలన, హృత = తేఁబడినట్టి, మాత్స్య = మత్స్యసంబంధి యగు, ఛేద = శకలములయొక్క, పాక=జీర్ణకాలమందు, ఉద్గత = ఊర్ధ్వముగవెళ్ళివచ్చునట్టి, ఉద్గారంబు = త్రేఁపులయొక్క, కనరు=కనరువాసనను, భోగులకున్ = భోగానుభవశాలురకును, సంధ్యా వేళలన్ = సంధ్యాకాలములందు, ఆర్చున్ = అణఁచును.

తా. అనఁగా నాగ్రీష్మకాలమందు భోగపరు లయిన పురుషులు మామిడికాయలతో వండుచున్ననూనెవలన గమ్మమనునట్లు, దిరుగఁబోఁతచేసినచేఁపలతో భోజనముఁ

జేసిన త్రేఁపులు విడువఁగ నది కనరుగ నుండును గాన సాకనరు పట్టుపడుటకుఁగా శృంగార వనములయందలి యిసుకలో స్థాపించియుండుటవలన నతిశీతలమగు టెంకాయ నీళ్లను సంధ్యాకాలములయందుఁ ద్రాగుచుందురు. అలం. స్వభావోక్తి.

క. గ్రామగ్రామంబున నొక
సామంతున కిడినచలువ చప్పరములు [1]త
న్పై మేదినిఁ గుంపటిలోఁ
దామరలుంబోలె నట్టితఱి నొప్పారెన్. 70

టీ. గ్రామగ్రామంబునన్ = ఊరూరనున్న, ఒకసామంతునకున్ = ఒక్కొక దొరకుఁగా, ఇడిన = దట్టముగ వేసిన, చలువచప్పరములు=చలువపందిళ్లు, మేదినిన్ = భూమియందు, తన్పై=తనియఁజేయునవియై (తఱచై యను పాఠమునకు మెండై యని యర్థము) అట్టితఱిన్=అవేసవియందు, కుంపటిలోన్=కుంపటిలో నున్న, తామరలుంబోలెన్ = కమలములవలెను, ఒప్పారెన్ = ఒప్పెను. అలం. అభూతోపమ యని కొందఱు. ఉత్ప్రేక్షయే యని మఱికొందఱు.

తా. ప్రతిగ్రామమునం దుండెడి దొరలకుఁగా వేసిన యనేకములగు చలువ పందిళ్లు గ్రీష్మకాలమందుఁ గుంపటియందలి తామరపూవువలెఁ జలువలు వెదజల్లుచుఁ దనియఁ జేయుచుండెను.

తే. తోఁటఁ బగ లుండి మల్లెలు తుఱిమి కావు
లమర మాపైన నిక్షుయంత్రముల కొయ్యఁ
జేరు ప్రజ వొల్చె భావివృష్టికిని గ్రుడ్డు
తో మధురిమేచ్ఛ డిగు నెఱ్ఱచీమ లనఁగ. 71

టీ. తోఁటన్=తోఁటయందు, పగలు ఉండి = పవలెల్ల నుండి, మాపు ఐనన్ = ప్రొద్దు గ్రుంకఁగా, మల్లెలు తుఱిమి = మల్లెపువ్వులు శిరంబున ముడుచుకొని, కావులు అమరన్=చంద్రకావివస్త్రములు ధరియించి, ఇక్షుయంత్రములకున్ = చెఱకుగానుగల సమీపమునకు. ఒయ్యన్ చేరు = మెల్లగఁ బ్రవేశించుచున్న, ప్రజ = జనము, భావి వృష్టికిన్=ముందు రాఁగలవర్షమునకు గ్రుడ్డుతోన్ = గ్రుడ్డు మోచికొని, మధురిమ ఇచ్ఛన్ = తీపుమీఁది కాంక్షచేతను, డిగు=దిగివచ్చునట్టి, ఎఱ్ఱచీమలు అనఁగన్=రక్త పిపీలిక లనునట్లు, పొల్చెన్ = ఒప్పెను.

తా. పగలెల్లను దోఁటలలో నుండి యస్తమింపఁగ మల్లెపువ్వులను శిరంబుల ధరియించుకొని చెఱకుగానుగల సమీపములకు మెల్లగఁ జేరుచున్న ప్రజలఁ జూడఁగా

1. తఱచై.

ముందువర్షమునకు సూచకంబై గ్రుడ్డులోఁగూడ దీపవస్తువులమీఁదియాశచేత దిగి వచ్చుచున్నయెట్టివీరులో యనునటుల నొప్పుచుండెను.

పరదేశివిప్రుఁడు

క. అప్పేనువేసవి విభవము
విప్పుగఁ దన్నగరనికటవృషగిరి హారికిం
దెప్పతిరుణాళ్లు రాఁ ముద
మొప్ప న్బరదేశివిప్రుఁ డొక్కఁడు భక్తిన్. 72

టీ. అప్పేనువేసవిన్ = ఆగ్రీష్మమందు, విభవము = వైభవము, విప్పుగన్ = విస్తరింపఁగాను, తన్న...కిన్ - తన్నగర=ఆ మధురయొక్క, నికట = సమీపమందలి, వృషగిరిహారికిన్ = అళఘురియం దుందు సుందరబాహుస్వామికి, తెప్పతిరుణాళ్లు = ఉడుపోత్సవము, రాన్ = రాఁగా, భక్తిన్ = ప్రియభక్తిచేతను, ముద మొప్పన్ = సంతసము పొల్చునటుల, ఒక్కఁడు=ఏకాకియైనట్టి, పరదేశివిప్రుఁడు=వైదేశికుఁడయిన బ్రాహ్మణుఁడు.

తా. సుగమము.

క. సేవించి పోవుతటి మధు
రావిభవముఁ జూడ వచ్చి శ్రాంతి మెయి న్సా
పా వైఘనీటఁ గృతసం
ధ్యావిధి యై నృపపురోహితావాసమునన్. 73

టీ. సేవించి = (సుందరబాహుస్వామిని) భజించి, పోవుతటిన్=(మరలతన దేశమునకు) పోవునపుడు, మధురావిభవము = మధురాపట్టణపుశృంగారమును, చూడన్ వచ్చి=కన్గొనుటకు వచ్చి, శ్రాంతిమెయిన్=బడలికచేతను, మాపు=సాయంకాలమందు, ఆ వైఘనీటన్ = ప్రసిద్ధం బగు నావైఘ యను నదీతీర్థంబులందు, కృత...విధియై- కృత=చేయఁబడిన, సంధ్యావిధియై = సంధ్యానుష్ఠానముగలవాఁడై, నృపపురోహితావాసమునన్=రాజపురోహితునిగృహమునం జేరి యుండు. తరువాతిపద్యముతో నన్వయము.

తా. ఆ విప్రుఁడు సుందరబాహుస్వామిని సేవించి పోవుసమయమున నా మధురాపురవైభవంబులఁ జూడ నిచ్ఛ గలవాఁడై వచ్చి బడలి సాయంకాలమం దా ప్రసిద్ధంబులగు వైఘ యను నదీతీర్థంబులయందు సంధ్యావందనాద్యనుష్ఠానములం బరిసమాప్తి నొందించి రాజపురోహితునియొక్క యిల్లు సొచ్చి యని యభిప్రాయము.

సీ. పరిపక్వసురభిరంభాఫలంబులతోడ
దలమెక్కు పనసపెండొలలతోడ
ఘృతపిండనిభకర్కరీఖండములతోడఁ
బలుదెఱంగుల మావిపండ్లతోడ
గోస్తనీమృదుగుళుచ్ఛస్తోమములతోడఁ
[1]గప్పులేఱిన వడప్రప్పుతోడ
సుమధురస్థూలదాడిమబీజములతోడఁ
[2]దనుపారు రసాదాడిగనెలతోడఁ

తే. బానకం బతిథుల కిడఁ దాను గ్రోలి
యర్చనాదత్తచందనచర్చఁ దేలి
విరులు సిగఁ దాల్చి కర్పూరవీటి[3]జౌరు
గొట్టుచు ద్విజుండు వెన్నెలఁబట్టు గాయ. 74

టీ. పరి...తోడన్ - పరిపక్వ = క్రమముగఁ బక్వమై, సురభి = పరిమళించుచున్న, రంభాఫలంబులతోడన్ = అరఁటిపండ్లతోడను, దలమెక్కు = బలిసియున్నఁ పనస పెండొలలతోడన్ = పనసతొలలతోడను, ఘృత...తోడన్ - ఘృతపిండనిభ = నేతికరుడులవంటి, కర్కరీఖండములతోడన్ = తెల్లచెఱకు ముక్కలతోడను, పలు... తోడన్ - పలుదెఱఁగుల = అనేకవిధములయిన, మావిపండ్లతోడన్ = చూతఫలంబులతోడను, గోస్తనీ...తోడన్ - గోస్తనీ = ద్రాక్షయొక్క, (ని. 'మృద్వీకా గోస్తనీద్రాక్షా' యని యమరము,) మృదు = కోమలంబులగు, గుళుచ్ఛ = గుత్తుల యొక్క, స్తోమంబులతోడన్ = సమూహములతోడను, కప్పు లేఱిన వడప్రప్పు తోడన్ = నల్లనిగింజలు పొట్టు లోనగువాని నొత్తి తీసివైచినట్టి వడపప్పుతోడను, సుమధుర...తోడన్ - సుమధుర=మిక్కిలియుఁ దీపై, స్థూల = గొప్పవై యున్న, దాడిమబీజములతోడన్=దానిమ్మగింజలతోను, తను...తోడన్-తనుపారు=తృప్తికరములైన, రసదాడిగనెలతోడన్ = రసదాడిచెఱకుగడలతుంటలతోను, పానకంబు = పానకమును, అతిథులకున్=అతిథులైన బ్రాహ్మణులకు, ఇడన్=ఆయింటిబ్రాహ్మణుఁడీయఁగా, తానును, గ్రోలి = పుచ్చుకొని, అర్చ...న్ = అర్చనా = పూజాకాలమందు, దత్త = ఇయ్యఁబడిన, చందన = శ్రీగంధముయొక్క, చర్చన్ = పూఁతచేత, తేలి = తోఁగి, విరులు= పుష్పంబులు, సిగన్ = శిఖయందు, తాల్చి = ధరించి, కర్పూరవీటిన్ = కర్పూర

1, కప్పుదేరిన. 2. తనరారు, 3. జబుర్దు.

మతిశయించిన విడియమును, చౌరుకొట్టుచున్=నమలుచు, వెన్నెల, బిట్టు=మిక్కిలిగా, కాయన్ = ప్రకాశించుచుండఁగా, ద్విజుండు = అపరదేశిబ్రాహ్మణుఁడు.

తా. పండిన యరఁటిపండ్లు, పెద్దవిగా నున్న పనసతొలలు, దోసపండ్ల బ్రద్దలు, ననేకవిధములైన మామిడిపండ్లు,ద్రాక్షగుత్తులు,తీపుగలదాడిమవిత్తులు తృప్తికూర్చు చెఱకు తుంటలు వీనితో నాయింటిబ్రాహ్మణుం డతిథులకుఁ బానకం బిచ్చునెడఁ దానును బానము సేసి తొలుత నిచ్చియున్న చందన మలఁదికొని పుష్పముల సిగయందు ధరియించి కర్పూర యుక్తంబైన తాంబూలము వేయుచు మంచి వెన్నెలయం దాపరదేశిబ్రాహ్మణుం డుండఁగా; అలం. స్వభావోక్తి.

తే. మాత్రసంచి తలాడగా | మార్గవేది
నొక్కఁ డార్యలు గీత లొం | డొకఁడు తా సు
భాషితంబులుగాఁ దోడి | బ్రాహ్మణౌఘ
ముబుసుపోకకుఁ జదువఁ బ | రున్నవేళ. 75

టీ. మాత్రసంచి = అసిమిసంచిని, తలాడగాన్=తలగడబిల్లగాఁ బెట్టుకొని, మార్గవేదిన్ = త్రోవయందున్న యొక యరుంగుమీఁదను, ఒక్కఁడు = ఒక బ్రాహ్మణుఁడు, ఆర్యలు=ఆర్యావృత్తములను, ఒండొకఁడు = మఱియొక్కఁడు, గీతలు = భగవద్గీతలను, తాన్ = తాను, సుభాషితంబులు గాన్ = నీతిశ్లోకంబులుగా, తోడిబ్రాహ్మణౌఘము = తనతోఁ బరుండియున్న బ్రాహ్మణులు, ఉబుసుపోకకున్ = ప్రొద్దుపుచ్చుకొనుటకు, చదువన్ = పఠింపఁగా, పరున్నవేళన్ = పరుండియున్న సమయమున, ముందఱి కన్వయము.

తా. అసిమిసంచిఁ దలగడబిళ్ళం జేసికొని మార్గములో నున్న తిన్నెమీఁద నొకఁ డార్యావృత్తములును, మఱియొకఁడు గీతలును, దాను నీతిశ్లోకములు నిట్లు తనతోఁగూడ నున్న బ్రాహ్మణులును బ్రొద్దుపుచ్చుకొనుటకుఁ బఠింపఁగాఁ బరుండి యుండఁగా.

రాజు భోగినికడకుఁ బోవుట

సీ. పన్నీటితోఁ గడం | బము సేసి పూసిన
మృగనాభిపస రాచ | నగరు దెలుపఁ
బాటలానిలము లా | ర్పఁగఁ దపారపుఁజుంగు
లలరుఁదావికి మూఁగు | నళులఁ జోపఁ
గర్ణడోలామౌక్తి | కచ్ఛాయ లెగఁ బ్రాఁకు
నురుహారరుచులఁ ద్ర | స్తరికిఁ దన్న

శశికాంతి చెంగావి ♦ దసిలి మించినకేల
 స్వర్ణత్సరువువాఁడి ♦ వాలు మెఱయ
తే. మెలఁత యడపముఁ దేఁ జర ♦ స్మేరు వనఁగఁ
దలవరులు కొంద ఱొలసి ముం ♦ దఱఁ (గల) జనంగ
నర్థి రథ్యాంతరాంతఃపు ♦ రాంతరమున
భోగినీసంగతికి రాజు ♦ పోవు చుండి. 76

టీ. పన్నీటితోన్ = పన్నీటితోడను, కదంబము చేసి=పరిమళము ద్రవ్యముల నన్నిటిఁ గలిపి, పూసిన...పస - పూసిన = అలఁదినట్టి, మృగనాభి = కస్తూరియొక్క, పస=మేలిమి వాసన, రాచనగరు = రాజగృహమును, తెలుపన్ = తెలుపఁగా, కస్తూరి రాజులకుఁదక్క సామాన్యులకుఁ జిక్క దనుట), పాటలానిలములు - పాటల=కలిగొట్టు పువ్వులయొక్క, అనిలములు=గాడ్పులు, అర్వఁగన్ = ఆడించుచుండఁగా, తపారపుఁ జుంగులు-తపారపు=తలను జుట్టియున్న, చుంగులు=వస్త్రపుకుచ్చెకొనలు, అలరుఁదావికిన్ = పువ్వువాసనలకు, మూఁగునళులన్ - మూఁగు=చుట్టుకొనునట్టి, అళులన్ = తుమ్మెదలను, చోపన్=తోలఁగా, కర్ణ...లు-కర్ణ=శ్రోత్రములందు, డోలా=వదలుచున్న, మౌక్తిక= ముత్యములయొక్క, ఛాయలు = కాంతులు, ఎగ...లన్ - ఎగఁబ్రాఁకు = పైకెగయు నట్టి, ఉరు = అధికమైన, హార = ముత్యాలదండలయొక్క, రుచులన్=కాంతులను, త్రస్తరికిన్=వెనుకకు (క్రిందికి), తన్నన్=కాలఁద్రోయఁగా, శశి...లు-శశి=చంద్రుని యొక్క, కాంతి = కాంతివంటికాంతిగల, చెంగావి దసిలి = చెంగావిరుమాలు, దసిలి-యను పాఠమున శ-స-ప్రాసయగుచు గాన 'దశమలంచి' యనుట మేలని కొందఱ మతము) మించిన = మీఱిన, కేలన్ = చేతఁబట్టిన, స్వర్ణత్సరువు=బంగారుపిడితోడి, వాఁడివాలు = తీక్ష్ణఖడ్గము, మెఱయన్ = ప్రకాశింపఁగా, మెలఁత = ఒక స్త్రీ, అడపమున్ తేన్ = తాంబూలపు సంచిని దేఁగా, చరస్మేరువు = నడయాడు పర్వతము, అనఁగన్ = అనునటుల, తలవరులు=తలారులు, కొందఱు=కాపుగా నుండు కొందఱు, ఒలసి = కనిపెట్టి, ముందఱన్ = పురోభాగమునందు, చనఁగన్ = పోఁగా, అర్థిన్ = ఆసక్తిచేతను, రథ్యాంతరాంతఃపురాంతరమునన్ - రథ్యాంతర = మార్గమధ్యమందలి, అంతఃపురాంతరమునన్=రెండవ యంతఃపురమువలె నున్న గృహమునందు, భోగినీసంగతికిన్ = భోగస్త్రీని భోగించుట కొఱకు, రాజు = పాండ్యుఁడు, పోవుచుండి = వెళ్లు చుండె. ముందఱి కన్వయము.

తా. సులభము.

చ. వినియె, నెల ల్చతుర్ద్వయిని వృష్టిదినాళికి, రాత్రికై దివం
బున, జరకై వయస్సునను బూని, పరంబున కిప్పు డుద్యమం
బనువుగఁ జేయఁగా వలయునంచుఁ బురోహితధర్మ మాత్మ గీ
ల్కొన నలవిప్రుఁ డాద్విజులలోన సుభాషితము ల్పఠింపఁగన్. 77

టీ. వృష్టిదినాళికిన్ = వర్షాకాలమైన నాలుగు మాసములకు, నెలల్ చతుర్ద్వయిని = తక్కిన యెనిమిది నెలలయందును, రాత్రికిన్, దినంబునన్=పగటియందును, జరకై = ముదిమికై, వయస్సునను = యౌవనమందును, పూని = ఆరంభించి, పరంబునకున్ = పరలోకమునకై, ఇప్పుడు = ఈశరీరమందే, ఉద్యమంబు = ప్రయత్నము, అనువుగన్ = లెస్సగా, చేయఁగావలయున్ = చేయవలయును, అంచున్=అనుచును, పురోహితధర్మము - పురః = ముందటికి, హిత=క్షేమకరంబైన, ధర్మము=న్యాయము, ఆత్మన్ = బుద్ధియందు, కీల్కొనన్ = నాటునట్లుగ, ఆ ద్విజులలోన్=తిన్నెమీఁద పరుండియున్న విప్రులలోపల, అలవిప్రుఁడు = ఆబ్రాహ్మణుఁడు, సుభాషితముల్ = నీతి ప్రతిపాదక శ్లోకములను, పఠింపన్ = చదువఁగా, (రాజు - పూర్వపద్యమందలి కర్త) వినియెన్ = విన్నవాఁడాయెను.

తా. 'వర్షార్థ మష్టౌ ప్రయతేత మాసా న్నిశార్థ మర్థం దివసే యతేత, వార్ధక్యహేతో ర్వయసా నవేన పరత్రహేతో రిహ జన్మనా చ' అను శ్లోకార్థముచొప్పున వర్షాకాలమైన నాలుగుమాసములకు వలయువస్తుసామగ్రులను మిగత యగు నెనిమిది మాసముల యందును, రాత్రికిఁ బగటియందును, జరకు వయస్సునందును, పరలోకమునకు వర్తమాన శరీరమందును, చేయందగిన ప్రయత్నములను బాగుగాఁ జేయవలయు నని ముందటికి హిత మగు న్యాయము మనంబున నంటునట్లుగా నాబ్రాహ్మణుఁడు విప్రుల నడుమనుండి నీతిశ్లోకములఁ బఠింపఁగా నప్పాండ్యరాజు వినియె నని యభిప్రాయము.

క. విని, తద్గ్రంథార్థము నె
మ్మనమున నూహించి తెలిసి మ్రాన్పడి కడకుం
దనమోసమునకు భయపడి
జనపతి యటు చనక నిలిచి సంతాపమునన్. 78

టీ. విని, తద్గ్రంథార్థమున్ = ఆసుభాషితముయొక్క యభిప్రాయమును, నెమ్మనమునన్=నిండు మనస్సునందు, ఊహించి = ఆలోచించి, తెలిసి=ఎఱింగి, మ్రాన్పడి = స్తబ్ధ చిత్తుఁడై, కడకున్ = చివరకు, తన = తనయొక్క, మోసమునకున్=ప్రమాదము

నకు, భయపడి = భీతిల్లి, జనపతి=రాజు, అటు చనక = భోగినీగృహమునకుఁ బోక, సంతాపమునన్ = పరితాపముచేత, నిలిచి, వైపద్యములో క్రియ.

ఉ. ఎక్కడిరాజ్యవైభవము ? లెక్కడిభోగము లేటిసంభ్రమం
బక్కట బుద్బుదప్రతిమ ? మైనశరీరము నమ్మి మోక్షపుం
జక్కి గణింపకుంటి యుగసంధుల నిల్చియుఁ గాలుచేతిబల్
త్రొక్కుల నమ్మనుప్రభృతుల్ దుద రూపఱ కుండ నేర్చిరే. 79

టీ. ఎక్కడి రాజ్యవైభవములు=రాజ్య మేమి శాశ్వతము, ఎక్కడి.భోగములు= తన భోగ మేమి నిత్యము, ఏటిసంభ్రమంబు=ఎక్కడి సంతోషము, అక్కట=కటకట, బుద్బుదప్రతిమము ఐన=నీటిబుడగతో సమానమైన, శరీరమున్ నమ్మి=దేహమునిత్య మని నమ్మి, మోక్షపుంజక్కి = మోక్షమార్గమును, గణింపక = లక్ష్యపెట్టక, ఉంటిన్ = ఉన్నవాఁడనైతిని.యుగసంధులన్=యుగములందుమాత్రమే కాక యుగసంధ్యలందును, నిల్చియున్ = ఉండియును, కాలు...లన్-కాలుచేతి = యమునిచేతనైన, బల్ త్రొక్కులన్ = విశేషమగు త్రొక్కుళ్లచేత, అమ్మనుప్రభృతులున్ = ప్రసిద్ధులైన మను మాంధాత్రాదులును, తుదన్ = శరీరత్యాగకాలమందు, రూపఱక = రూపు నష్టముగా కుండఁగ, ఉండనేర్చిరే = ఉండఁగలిగిరా.

ఆ. ఆవిపుని౦దు చెప్పిన నీతిశ్లోకముల యభిప్రాయమును గ్రహించి మఱంబున మిగుల విచారించి స్తబ్ధచిత్తుఁడై చివరకుఁ దనకుం గలిగెడు ప్రమాదమునకు భీతిల్లి యపాండ్యరాజు భోగినీగృహమునకుఁ బోక మార్గమందే నిలిచి పరితాపముచేత రాజ్య మేమిశాశ్వతము, భోగమేమి నిత్యమెక్కడిసంతోషము, కటకటా నీటిబుడగతోసమానం బగు నీశరీరమును నమ్మి మోక్షమార్గము విచారింపనైతిని. యుగములకొలఁది జీవించి యుండ నాభూమినిఁ బాలించినమన్వాదులుఁ దమతనుశరీరములను నిల్పఁగలిగిరా లేదు గదా యని విచారయుక్తుఁడై యుండె నని తాత్పర్యము. అలం. కావ్యార్థాపత్తి.

క. ఉన్నట్ల యుండ నద్దరి
కి న్నరులను నావ చేర్చుక్రియ వేసఁ దాఁ బో
కున్నట్ల యుండి కాలం
బు న్నరులకు వయసుఁ బుచ్చి ? మోసముఁ దెచ్చున్. 80

టీ. ఉన్నట్ల ఉండన్ = లోనివారికిఁ దనయొక్క గమనము తెలియరాకుండ- ఉన్నదానింబలెనుండి, నావ = ఓడ, (సూ. 'స్త్రోవావౌరైనావోః' యను సూత్రముచేత నోశబ్దమున కీరూపంబు వచ్చెను.) అద్దరికిన్ = ఆవలితీరమునకు, నరులను=మనుష్యులను,

చేర్పు క్రియన్ = చేర్చులాగున, తాన్ = తాను, వెసన్ పోకున్నట్ల ఉండి=వేగిరము జరిగిపోకున్నట్లుగా నుండి, కాలంబు=కాలము, నరులకున్ = మనుష్యులకు, వయసున్ పుచ్చి = ఆయువును బోఁగొట్టి (సూ. 'సాంతాదపయః ప్రభృతే స్లోనోఽన్యే షాం చ' యను సూత్రముచేత ద్విత్వాభావము,) మోసమున్ తెచ్చున్ = భంగపాటు గలిగించును. అలం. ఉపమ.

తా. నావ యెక్కఁగా నచటనే యున్నట్టు గనుపడుచు దరికి మనుష్యులఁ జేర్చురీతినిఁ, గాలంబును నరుల వయసు దెలియకుండునట్లుగఁ జేసి పోఁగొట్టి కడపటికి మోసముఁ దెచ్చు నని తాత్పర్యము. 4-వ పా-న అప్రస్తుతప్రశంస.

చ. సగరు నలుం బురూరవుఁ ద్రిశంకుసుతు న్బురుకుత్సుఁ గార్తవీ
ర్యు గయుఁ బృథుం భగీరథు సుహోత్రు శిబిం భరతుం దిలీపునిన్
భృగుకులు యౌవనాశ్వు శశిబిందు ననంగుని నంబరీషుఁ బూ
రుగురుని రంతి రాఘవు మరుత్తునిఁ గాలము గోలుపుచ్చదే? 81

టీ. షట్చక్రవర్తు లగు సగరుని, నలుని, పురూరవుని, త్రిశంకుని సుతుఁడగు హరిశ్చంద్రుని, పురుకుత్సుని, కార్తవీర్యుని, మఱియు మహారాజులగు గయుని, పృథుని, భగీరథుని, సుహోత్రుని, శిబిని, భరతుని, దిలీపుని, పరశురాముని, యువనాశ్వ పుత్త్రుఁడగు మాంధాతను, శశిబిందుని, అనంగుని, అంబరీషుని, యయాతిని, రంతిదేవుని, రాముని, మరుత్తుని అగు వీరలను, కాలము గోలుపుచ్చదే = కాలము మోసపుచ్చలేదా. అలం. అప్రస్తుతప్రశంస.

తా. సుగమము. ఇచ్చట పేర్కొనఁబడిన మహారాజులు షోడశమహారాజులు.

క. కానఁ దటిచ్చల మగు రా
జ్యానందము మరగి యింద్రియారాముఁడ నై
పో నింతనుండి పరలో
కానందంబునకె యత్న మాపాదింతున్. 82

టీ. కావన్ = కావునను, తటిచ్చలము అగు=మెఱుపువలె ననిత్యమైన, రాజ్యానందము = రాజ్యసుఖము, మరగి = తగిలి, ఇంద్రియారాముఁడ నై=ఇంద్రియపరవశుఁడనై, పోన్ = పోవను, ఇంతనుండి = ఇదిమొదలు, పరలోకానందంబునకె=పరలోకసుఖమునకే, యత్నము = ప్రయత్నమును, ఆపాదింతున్ = ఒనరింతును.

తా. కాలము చక్రవర్తులు మొదలగువారినిం గూడ మోసపుచ్చినది. కావున మెఱుపువలె నతిచంచలం బగురాజ్యానంద మపేక్షించి యింద్రియపరవశుఁడ నై యుండక యిదిమొదలు పరలోకసుఖమునకు వలయుప్రయత్న మొనరించెదను.

అలం. తటిచ్చలము - ఉపమ-ఇది 'ఇంతనుండి...ఆపాదింతున్' అను నిశ్చయమునకు హేతువు గాన కావ్యలింగాలంకారము.

క. వర్గత్రయపరత ముహు
స్స్వర్గక్ష్మామధ్యమాధ్వజఙ్ఘాలకతా
దుర్గతియు నొల్ల; మఱి యప
వర్గదుఁ డే వేల్పొ యెఱింగి వాని భజింతున్. 80

టీ. వర్గత్రయపరతన్ = ధర్మార్థకామాసక్తిచేత, ముహుః=పలుమాఱును, స్వర్గ...యన్-స్వర్గ = త్రివిష్టపముయొక్క, క్ష్మా=భూమియొక్క, మధ్యమ=మధ్యప్రదేశమందలి, అధ్వ=మార్గమునందు, జంఘాలకతా = సత్వరగమనమనియెడు, దుర్గతిన్ = నరకమును, ('నిరయో దుర్గతిస్త్రియా' మని యమరుఁడు.) ఒల్లన్ = ఇష్టపడను, మఱి = మఱి యేమనఁగా, అపవర్గదుఁడు = మోక్షము నిచ్చువాఁడు, ఏవేల్పు = ఏదైవమో, ఎఱింగి = తెలిసి, వానిన్ = ఆదైవమును, భజింతున్ = సేవింతును.

తా. ధర్మార్థకామము లనియెడి పురుషార్థత్రయాసక్తిచేతఁ బలుమాఱు స్వర్గము నుండి భూమికి భూమినుండి స్వర్గమునకును బోవుచుండు మార్గమునందు సత్వరగమనమను నరక మొల్లను. మఱి యే మన నపవర్గప్రదుం డగునట్టివేల్పెవ్వఁడో వాని నెఱింగి సేవించెదను.

క. అని తలఁచి మెచ్చి యవ్వి
ప్రునకు న్వీటికరండకమున ముద్రిత మై
యునిచినయొకముడు పార
క్షునిచే నిప్పించి నగరుఁ జొచ్చి నిశి చనన్. 81

టీ. అని తలఁచి = అట్లని యూహించి, మెచ్చి=తన కిట్టి జ్ఞానముఁ గలుగఁజేసి నందులకై సంతసిల్లి, అవ్విప్రునకున్ = ఆబ్రాహ్మణునికి, వీటీకరండమునన్ = వక్కలాకుల బరణియందు, ('గడుః కరణ్డో లగుడో వరణ్డశ్చ కిణో మణః'యని పుంలింగవిశేషమునం దమరుఁడు) ముద్రితమై = ముద్రింపఁబడి, ఉనిచిన = ఉంచఁబడియున్న, ఒకముడుపు=వరాలముల్లెయొకటి, ఆరక్షునిచేన్=తలవరిచేత) నగరు వెలువడఁగానే తలవరు లీరాజును గలిసికొని రని 75-లో నున్నది.) ఇప్పించి, నగరు = రాజగృహమును, చొచ్చి = ప్రవేశించి, నిశి = రాత్రి, చనన్ = వెళ్లఁగా. ముందటి కన్వయము.

తా. అప్పాండ్యరాజు పూర్వోక్తప్రకారంబుగ నూహించి తన కిట్టి జ్ఞానముఁ గలుగఁజేసిన యవ్విప్రునివిషయమై యానందమొంది యతనికిఁ దాంబూలకరండంబున ముద్రింపఁబడి యుంచియున్న వరాలముడు పొకటి యాతలవరిచేత నిప్పించి, తాను నగరు ప్రవేశించి, తెల్లవాఱిన పిమ్మట.

క. కొలువై బహుసమయంబుల
మెలఁగెడుకోవిదులఁ జూచి మీమీశాస్త్రం
బులలో నెవ్వఁడు మోక్షం
[1]బెలయించునో చూచి నిశ్చయింపుఁ డటంచున్. 85

టీ. కొలువై = ఆస్థానమందుఁగూర్చుండి, బహు...లన్-బహు=అనేకవిధంబు లగు, సమయంబులన్ = సిద్ధాంతములయందు, (ని. 'సమయాః శపథాచార కాల సిద్ధాంతసంవిదః' యని అమ.) మెలఁగెడుకోవిదులన్ - మెలఁగెడు = సంచరించుచున్న, కోవిదులన్ = పండితులను, చూచి = వీక్షించి, మీమీశాస్త్రంబులలోన్, ఎవ్వఁడు, మోక్షంబు = అపవర్గమును, ఎలయించునో = పొందించునో, చూచి, నిశ్చయింపుఁడు= పరిశీలనఁజేసి నిర్ణయింపుఁడు, అటంచున్ = అలాగని, పైపద్యములో క్రియ.

తే. వాద మొనరించి గెలిచి తత్త్వంబుఁ దెలుపు
వాని కని బీఱపువ్వులఁబోని టంక
సాలవాటులు నించి యాస్థానిఁ గట్టఁ
గాలసర్పముగతి ప్రేలుజాలెఁ జూచి. 86

టీ. వాదమొనరించి = ప్రసంగముసేసి, గెలిచి = జయమునొంది, తత్త్వంబుఁ దెలుపువానికిన్ అని = ఇదియ సత్యం బని కనుపఱుచువాని కనుచు, బీఱ...లు - బీఱపువ్వులన్ పోని = బీఱపువ్వులవంటి, టంకసాలవాటులు = క్రొత్తముద్రలువేసిన మాడలను (ఉపమ), నించి = నిండఁబోసి, ఆస్థానిన్ = సభయందు, (ని - 'ఆస్థానీ క్లీబమాస్థాన' మ్మని యమరము.) కట్టన్ = ప్రేలకట్టఁగా, కాలసర్పముగతిన్=కృష్ణసర్పమువలె, ప్రేలుజాలెన్ = ప్రేలాడుచున్న జాలెను, చూచి = వీక్షించి. అలం. ఉపమ.

తా. ఆస్థానమం దాపాండ్యరాజు గూర్చుండి యున్నవాఁడై యనేకశాస్త్ర సిద్ధాంతములు దెలిసికొనియున్న పండితోత్తములరావించి వారినిం జూచి మీమీశాస్త్రములయందుఁ జక్కఁగా విచారించి మోక్షప్రదుం డైనదేవుఁ డెవ్వఁడో యెఱిఁగింప

1. బెలయించుం జూచి.

వలయు ననుచుఁ బ్రసంగమొనరించి గెలిచి తత్త్వము దెలిపినవానికి నిప్పించెద నని, మాడలచే నింపఁబడిన జాలెను దెప్పించి సభయందుఁ గట్టింప నావరాలజాలెను జూచి యప్పండితులు.

క. హరు నొకఁ డన నుమ నొకఁ డన
హరి నొకఁ డన శిఖి నొకఁ డన (నర్కు నొకఁ డనన్
గరిముఖునొకఁ డన రజనీ
శ్వరు నొకఁ డన నజు నొకఁ డన (వా దైనతఱిన్. 87

టీ. ఒకఁడు = ఒకవిద్వాంసుఁడు, హరున్ అనన్ = శివుఁడు మోక్షప్రదుఁడనఁగా, ఒకఁడు = మఱియొకఁడు, ఉమన్ అనన్=శక్తి మోక్షప్రదాత్రి యనఁగా, ఒకఁడు = ఒక్కఁడు, హరిన్ = ఇంద్రుని, ఒకఁడు = ఒక్కఁడు, శిఖిన్ = అగ్నిని, ఒకఁడు = ఇంకొకఁడు, అర్కున్ = సూర్యుని, ఒకఁడు, కరిముఖున్=విఘ్నేశ్వరుని, ఒకఁడు, రజనీశ్వరున్ = నిశాపతిని - చంద్రుని, ఒకఁడు, అజున్ = బ్రహ్మను, (వీరలు మోక్షప్రదాత లని) వాదు = ప్రసంగము, ఐనతఱిన్ = ఐన సమయమందు.

తా. సుగమము.

తే. విల్లిపుత్తూరిలో నల్ల (విష్ణుచిత్తుఁ
డతులతులసీసుగంధిమాల్యమును మూల
మంత్రమున నక్కు [1]నేర్చుచో (మన్ననారు
దారమధురోక్తి[2] ని ట్లని (యానతిచ్చె. 88

టీ. విల్లిపుత్తూరిలోన్ = శ్రీవిల్లిపుత్తూరియందు, అల్ల విష్ణుచిత్తుఁడు = ఆ విష్ణుచిత్తుఁడు, అతుల...ను - అతుల = శ్రేష్ఠమైన, తులసీ = తులసిచేతను, సుగంధి=పరిమళించుచున్న, మాల్యమును = పుష్పమాలికను, మూలమంత్రమునన్ = శ్రీమదష్టాక్షరి యను మహామంత్రముచేత, అక్కుచేర్చుచోన్ = వక్షస్థలమందు సమర్పించునపుడు, మన్ననారు = మన్నారుస్వామి, ఉదార = గంభీరమైన, మధురోక్తిన్ = తియ్యని మాటలచేత, ఇ ట్లని = ఇవ్విధముగ, ఆనతిచ్చెన్ = సెలవిచ్చెను.

తా. శ్రీవిల్లిపుత్తూరిలో నున్న యావిష్ణుచిత్తుం డుత్తమం బగు తులసీదళములచేఁ బరిమళించుచున్న వనమాలిక నష్టాక్షరి యను మహామంత్రంబగు మూలమంత్రమును జపించుచు స్వామి వక్షస్థలంబున సమర్పింపఁగా, నాసమయమున మన్నారుస్వామి గంభీరమైన తియ్యనిమాటలచేత ని ట్లని యానతిచ్చెను.

---

1. సేర్పఁబో. 2. నవ్విధ మానతిచ్చె.

ఉ. 'నేఁడు మహామతీ! మధుర నీవు రయంబునఁ జొచ్చి యందుఁ బాం
డీఁడు దివాణము న్నెఱయ నించినఁ బ్రేలెడుదుర్మదాంధులన్
బోఁడిమి మాన్చి మన్మహిమఁ బ్రకటించి హరింపు శుల్కమున్;
వాఁడును రోసినాఁ డిహము వైష్ణవుఁగా నొనరింపు [1]సత్కృపన్.'

టీ. మహామతీ=మహాజ్ఞానము గల విష్ణుచిత్తుఁడా, నేఁడు=ఈప్రొద్దు, ఈవు = నీవు, మధురన్=మధురాపురమును, చొచ్చి=ప్రవేశించి, అందున్ = ఆమధురయందు, పాండీఁడు=పాండ్యరాజు (ఇది దేశ్యోక్తి), దివాణమున్=ఆస్థానమును, నెఱయన్ = నిండునట్లుగా, నించినన్ = నింపఁగా, ప్రేలెడు = నానావిధములుగఁ బలుకుచున్న, దుర్మదాంధులన్ = దుర్మదముచేత నంధులైనవాండ్రను, పోఁడిమి మాన్చి = గర్వ మణఁచి, మన్మహిమన్ = నాయొక్క మాహాత్మ్యమును, ప్రకటించి=ప్రసిద్ధియొనర్చి, శుల్కమున్ = విద్యాశుల్కమును, హరింపు = గ్రహింపుమా, వాఁడును=ఆపాండ్యుఁడును, ఇహమున్=ఈలోకమును, రోసినాఁడు=అసహ్యించుకొనినాఁడు, సత్కృపన్ = దయచేత, వైష్ణవుఁగాన్ = విష్ణుభక్తునిఁగా, ఒనరింపుము = చేయుము.

తా. మహాబుద్ధిశాలి వగు విష్ణుచిత్తుఁడా యని స్వామివారు సంబోధించి, నేఁటి దినమున నతివేగముతో మధుర కేతెంచి యందున్న పాండ్యరాజు దివాణము నిండఁ గూర్చుండి నానావిధములుగఁ బలుకుచున్న దుర్మదాంధులయొక్క కైపు మాన్చి, నా మహిమలను కొంతఁ దెలిపి విద్యాశుల్కమును గ్రహించి, యీలోకమును రోసియున్న పాండ్యునిం గృపచేత వైష్ణవుం గావింపు మని మన్నారుస్వామి విష్ణుచిత్తునితో సెల విచ్చెను.

తే. అనిన వడవడవడఁకి సాష్టాంగ మెఱఁగి
సమ్మదాశ్రులు పులకలు ముమ్మరింప
వినయవినమితగాత్రుఁ డై విప్రవరుఁడు
వెన్నునకు భక్తి నిట్లని విన్నవించె. 90

టీ. అనినన్=అనఁగా, విష్ణుచిత్తుఁడు, వడవడవడఁకి=మిక్కిలి కంపించి, సాష్టాంగము ఎఱఁగి=సాష్టాంగప్రణామముఁ జేసి, సమ్మదాశ్రులు=ఆనందాశ్రువులు, పులకలు=పులకాంకురములు, ముమ్మరింపన్ = అతిశయింపఁగా, వినయవినమితగాత్రుఁ డై = వినయముచేత వంపఁబడినదేహము గలవాఁడై, విప్రవరుఁడు=బ్రాహ్మణోత్తముఁ డగు విష్ణుచిత్తుఁడు, వెన్నునకున్=విష్ణువకు, భక్తిన్=భక్తిచేతను, ఇట్లని=ఈవిధముగా, విన్నవించెన్ = విన్నపము చేసెను.

---

1. సత్కృతిన్.

తా. మన్నారుస్వామి యీరీతి నాజ్ఞాపింపఁగా భయమునొంది విష్ణుచిత్తుఁడు సాష్టాంగనమస్కారముం జేసి యానందబాష్పములును బులకాంకురములును విస్తరిల్లఁగా వినయముచేత నమ్రుఁడై విష్ణునకు వక్ష్యమాణక్రమంబుగా భక్తిచేత విన్నవించెను.

శా. 'స్వామీ! నన్ను నితఃపురాపఠితశాస్త్రగ్రంథజాత్యంధు, నా
రామక్ష్మాఖననక్రియాఖరఖనిత్రగ్రాహితోద్యత్కిణ
స్తోమాస్నిగ్ధకరు, న్భవద్భవనదాసు, న్వాదిఁ గాఁ బంపుచో
భూమీభృత్సభ నోట మైన నయశంబు ల్మీకు రాకుండునే? 91

టీ. స్వామీ=రక్షకుఁడా, ఇతః...ధున్-ఇతఃపరా=ఇంతకు మున్ను, అపఠిత=చదువఁబడని, శాస్త్రగ్రంథ=శాస్త్రగ్రంథములయందు, జాత్యంధున్=పుట్టుగ్రుడ్డివాఁడ నైనట్టియు, ఆరామ...రున్-ఆరామ=ఉద్యానవనముయొక్క, క్ష్మా=భూమియొక్క, ఖననక్రియా=త్రవ్వుట యను కార్యమునందు, ఖర=తీక్ష్ణమైన, ఖనిత్ర=గుద్దలియొక్క, గ్రాహిత=గ్రహించుటచేత, ఉద్యత్=ఏర్పడిన, కిణస్తోమ=కాయల సమూహము చేతను, అస్నిగ్ధ=బిరుసైన, కరున్=హస్తములు గలయట్టియు, భవ...సున్-భవత్=మీయొక్క, భవనదాసున్=గృహసేవకుఁడనైనట్టియు, నన్నున్=నన్ను, వాదిఁగాన్=ప్రసంగించువానిఁగాఁ జేసి, పంపుచోన్=అనిపినయపుడు, భూమీభృత్సభన్=ఆ పాండ్యరాజుయొక్క సభయందు, ఓటమి ఐనన్=అపజయమగుచో, అయశంబుల్=అపకీర్తి, మీకున్ రాకుండునే=మీకు వచ్చునుగదా.

తా. ఇంతకుమున్ను శాస్త్రముం జదువక జ్ఞానమునందుఁ బుట్టుగ్రుడ్డినైనట్టియుఁ, బూలతోఁట నేలఁ ద్రవ్వుటకుఁగా గుద్దలిం బట్టుటచేతఁ గాయలు కాచి బిరుసైన హస్తములు గలయట్టియు, మీకోవెలకు దాసుఁడ నైనట్టియు నన్ను వాదమున కనిపితి రేని యారాజసభయందు గెల్పు లేక యోటమి వచ్చినయెడల దేవరకే యపకీర్తి వచ్చును గదా యని విష్ణుచిత్తుండు విన్నవించెను. అలం. పరికరాలంకారము.

మ. గృహసమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతియో [1]ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదము [2]లేల లేరె యితరు ల్మీలీలకుం బాత్రముల్? 92

టీ. నృహరీ=నృసింహస్వామీ, గృహసమ్మార్జనమో=మీకోవెలయందుఁ బరిమార్జనముఁ జేయుటో, జలఆహరణమో=తీర్థంబుఁ దెచ్చుటో, శృంగార పల్యంకికా

1. ద్రాగ్దీపికారోపమో. 2. నాకు.

వహనంబో=విలాసార్థము దేవరవా రారోహణముఁ జేసినపల్లకి మోచుటయో, వనమాలికాకరణమో = తులసిదండలు గట్టి సమర్పించుటయో, వాల్ల...బో - వాల్లభ్య = ప్రభుత్వమునకు, లభ్య = పొందఁదగిన, ధ్వజగ్రహణంబో = టెక్కెములు మోచుటయో, వ్యజనాతపత్రధృతియో = విసనకఱ్ఱ గొడుగుమున్నగువానిం బట్టుటయో, ప్రాక్=ముందఱను, దీపికారోపమో = దీపముఁబెట్టుటయో, వాదములు ఏల=వేఱెవాదులెందులకు, ఇతరుల్ = అన్యులు, నీలీలకున్ = నీవిలాసమునకు, పాత్రముల్ = తగినవారు, లేరే = లేరా. ఉన్నా రనుట. క్వచిద్ధర్మవిశేషేతు క్లీబేప్యుభయరూపతా' యను నథర్వణోక్తి చేతఁ బాత్రము లని యమహద్రూపము. అలం. లభ్యలభ్య - ఛేకానుప్రాసము.

తా. సుగమము.

మన్ననారు విష్ణుచిత్తు నను గ్రహించుట

తే అనినఁ దద్భక్తి కెద మెచ్చి । యచ్యుతుండు
మొలకనగ వొప్ప శ్రీదేవి । మోము సూచి
వా దితని [1]చేత గెలిపింతు । నాదుమహిమ
మువిద కను మని ప్రాభవం । బొప్పఁ [2]బలికె. 93

టీ. అనినన్=అనఁగా, తద్భక్తికిన్=ఆవిష్ణుచిత్తునిభక్తికి, ఎదన్ మెచ్చి = మనంబున మెచ్చుకొని, అచ్యుతుండు = శ్రీహరి, మొలకనగవు ఒప్పన్ = చిఱునవ్వంకురింపఁగా, శ్రీదేవిమోము చూచి=లక్ష్మీముఖము వీక్షించి, వాదు = వాదము, ఇతనిచేతన్ గెలిపింతున్=అనాఘ్రాతశాస్త్రగంధుఁడైన యీవిష్ణుచిత్తునిచేతనే గెలిపింతును. నాదుమహిమము=నాప్రభావమును, ఉవిద=ఓయువతీ, కనుము=చూడుము అని, ప్రాభవము = ప్రభుత్వము,ఒప్పన్=పొల్పగునట్లుగా, పల్కెన్=మఱియు నొక్కవాక్య మానతిచ్చెను.

తా. ఇ ట్లనఁగా నావిష్ణుచిత్తునిభక్తికి మెచ్చి మన్నారుస్వామి చిఱునవ్వు వెదలుచుండ శ్రీదేవిముఖము చూచి యితనిచేతనే వాదము గెలిపించెద నామహిమముం జూడు మని ప్రభుత్వ మొప్పునటుల మఱియొకవాక్య మానతిచ్చెను.

క. నీయిచ్చయొ? మిన్నక పో
వోయి; మునిప్రవర! నిన్ను । నొప్పింతును(నె) భూ
నాయకసభ నిందులకై
[3]యేయడ్డము వలవ దవల । నే నున్నాఁడన్. 94

1. చే. 2. బలికి. 3. నీయత్నము.

టీ. మునిప్రవర=మునిశ్రేష్ఠుఁడా, నీయిచ్ఛయె = నీయిష్టమా, మిన్నక=ఊరక, పోవోయి=చనుము, భూనాయకసభన్ = పాండ్యునిసభయందు, నిన్నున్ = నిన్ను, ఒప్పింతున్ = సభ్యులు శ్లాఘించునట్లు చేయుదును, (నొప్పింతునె=బాధపెట్టుదునా) ఇందులకై = ఈకార్యమునకై, ఏయుద్దము = ఏఅడ్డమాటయు, వలవదు = అక్కఱ లేదు, అవలన్=అవల నడుచుకార్య విషయమై, ఏన్=నేను, ఉన్నాఁడను.

తా. మునిశ్రేష్ఠుఁడ వగు నోయి విష్ణుచిత్తుఁడా నీయిష్టప్రకారమా! ఊరక వెళ్లు మపాండ్యరాజుయొక్క సభయందు నీకు మెప్పు గలుగఁజేసెద నిందులకై నీ వేమియుం జేయవల దచ్చటి కార్యముల నెఱవేర్చుటకై నే నున్నాఁడ నని స్వామి యానతిచ్చెను.

ఆ. అనిన మాఱు వలుక ◊ నలికి యయ్యాళువా
రియ్యకొనియెఁ బోవ ◊ నంతలోనఁ
బద్మనయనుఁ డతని◊పయనంబు తూఁగింపు
మనుచు నంబితోడ ◊ నానతిచ్చె. 95

టీ. అనినన్=అనఁగా, మాఱు పలుకన్=ప్రత్యుత్తరమిచ్చుటకు, అలికి=వెఱచి, అయ్యాళువారు = అప్పెరియాళ్వారు, పోవన్=స్వామిసన్నిధినుండి యాజ్ఞ వహించి వెళ్లుటకు, ఇయ్యకొనియెన్ = సమ్మతించెను, అంతలోనన్ = ఆసమయమున, పద్మనయనుఁడు = పుండరీకాక్షుఁ డయిన మన్నారుస్వామి, అతనిపయనంబున్ = ఆవిష్ణుచిత్తుని ప్రయాణమును, తూఁగింపుము = సాగింపుము, అనుచున్ = ఇట్లనుచు, నంబితోడన్ = అర్చకునితో, ఆనతిచ్చెన్ = ఆజ్ఞాపించెను.

తా. సుగమము.

విష్ణుచిత్తుఁడు మధుర కేఁగుట

క. ఆనతిఁ బడి శ్రీభండా
రాన న్సంబడముఁ దనదు ◊ [1]ప్రాయందలమున్
స్థానికుఁ డొసంగి పనుపం
గా నానతిఁ బడిన నిమితకాండ్రు వహింపన్. 96

టీ. ఆనతిన్ పడి=స్వామియాజ్ఞను పొంది, స్థానికుఁడు=పారుపత్తేకాఁడు, శ్రీభండారానన్=ఉగ్రాణమునుండి, సంబడము=దారిబత్తెమును, తన...మున్ - తనదు = తన సంబంధియైన, ప్రాయందలమున్ = పురాతనమైన యందలమును, ఒసంగి=ఇచ్చి,

1. ప్రాఁతందలమున్.

పనుపన్ = అనుపఁగా, అనతిఁబడిన్ అ = (స్థానికుని) ఆజ్ఞాప్రకారమే, నిమితకాండ్రు = మోఁతకాండ్రు, వహింపన్ = మోయఁగా. ముందటి కన్వయము.

తా. ఆకోవెలపారుపత్తెకాఁడు స్వామి యానతిచ్చిన తెఱంగున నుగ్రాణమునుండి దారిబత్తెమును దీసియిచ్చి, పురాతన మగునందలము నొసఁగి పంపఁగా, స్థానికునాజ్ఞఁ బొందిన మోఁతకాండ్రు మోయుచుండఁగా.

క. లావు గల[1]యట్టిగుజ్జుపు
జావడములమీఁద మాత్ర సంచులు తూలన్
గ్రేవల నేకాంగులు రా
[2]వీవధముల నరిసె లవని విభునకుఁ గొనుచున్. 97

టీ. లావు...మీఁదన్ - లావుగలయట్టి = బలిసియున్నట్టి, గుజ్జుపుజావడముల మీఁదన్ = గుజ్జుపుఁదట్టువులమీఁద, మాత్రసంచులు = ఆసిమిసంచులు (చూ. 74), తూలన్ = వ్రేలాడుచుండఁగా, ఏకాంగులు = కోవెలయధికారు లగు ఏకాంగులు, (ఏకాంగు లనఁగాఁ బుత్రమిత్రకళత్రాదులం బరిత్యజించి భగవత్కైంకర్యమే పరమప్రయోజన మని కావి. వస్త్రములు గట్టుకొని భగవత్కైంకర్యార్థము శరీరమును బ్రాణము నర్థమును తృణముగాఁ జూచు విరక్తులు.) క్రేవలన్ = ఇరుప్రక్కల, రాన్ = రాఁగా, వీవధములన్ = కావళ్లలో, అరిసెలు = అనేకవిధములుగాఁ జేయంబడిన యతిరసములు, అవని విభునకున్ = భూపతికి, కొనుచున్ = పట్టించికొని. మాత్రసంచి - బుజముపై వేసికొని మోయుట కనుకూలముగా రెండువైపులను రెండు సంచులగునట్లు మధ్యనడ్డముగాఁ గుట్టిన నిడుపుసంచి.

తా. మిగుల బలిసియున్న గుజ్జుపుఁదట్టువులమీఁద నసిమిసంచులు వ్రేలాడుచుండఁగాఁ గోవెల యధికారు లుభయపార్శ్వంబులఁ జనుదేర, భగవత్ప్రసాదంబు లయిన యతిరసంబులు రాజున కిచ్చుటకుఁగాఁ గావళ్లలోఁ బట్టించికొని.

సీ. భక్తిఁ ద్రోవకు సాధ్వి పరికరంబులు పెట్టి
కట్టిన పొరివిళంగాయ[3]గములు
నెసఁటిపోఁతలు గాఁగ నేర్చి నించినచిరం
తనపుశాలితేమతండులములు
నసిఁబెట్టి లో[4]జీర గుడము సాఁబాలుప్పుఁ
జెలఁగు సంబారంపుఁజింతపండు
సెల్లులోహండికా వళ్లకొమ్ముల వ్రేలు
గిడ్డి మొత్తము నేతిఁలడ్డిగలును

1. యద్దా. 2. వేవిధముల. 3. గమియాం. 4. ఁజెఱకరము.

తే. పెరుఁగువడియంబులును బచ్చివరుగు బేడ
లురుతరాచ్యుతపూజోపకరణపేటి
కలును జాత్తిన చాత్తనికులము బలసి
విధినిషేధము లెఱిఁగి తేఁగ మధుర కరిగె. 93

టీ. సాధ్వి = ఆవిష్ణుచిత్తునిభార్య, భక్తిన్ = భక్తిచేతను, త్రోవకున్ = మార్గమునకు, పరికరంబులువెట్టి = సంబారము లునిచి, కట్టిన = మూటఁగట్టిన, పొరివిళంగాయగములు = పొరివిళంగాయలను పణ్యారములును, ఎసటిపోఁతలు కాఁగన్ = ఆలీరుసనే వండుకొనఁదగినవై యిఱుకలేకుండునట్లుగా, ఏర్చి = ఏఱి, నించిన = నిండించిన, చిరం...ములు = చిరంతనపు = ప్రాఁతలైన, శాలిక్షేమతండులములు, లోన్ = లోపలన్, వడిఁబెట్టి = శోధించి (నలుసులు లేకుండునట్లేఱుట), జీర = జీలకఱ్ఱను, గుడము = బెల్లమును, సాఁబాలు = సరివాటుగా, ఉంపన్ = ఉంచఁగా, చెలఁగు = ఒప్పుచున్న, సంబారంపుఁజింతపండు = సంబారపుదినుసులు చేర్చిదంచిన చింతపండు, పెల్లు...లన్-పెల్లు = మెండైన, లోహండికావళ్ల = లోపలహండీలుగలకావళ్లయొక్క, కొమ్ములన్ = అగ్రములందు, వ్రేలు...ము-వ్రేలు = వ్రేలాడుచున్నట్టి, గిడ్డిముత్తము = ఆవులసంబంధియైన, నేతిలడ్డిగలును = నెయ్యిపోసిన లడ్డిగలును (లడ్డిగ లనఁగా మూఁతికూచిగనుండుపిడతలు), పెరుఁగువడియంబులును, పచ్చివరుగు = వేయింపనివరుగులు, బేడలు = ఒలుపుఁబప్పు, ఉరు...లును - ఉరుతర = గొప్పలైన, అచ్యుత=శ్రీవిష్ణునియొక్క పూజోపకరణపేటికలును = అర్చనోపయోగివస్తుపూరితములగు పెట్టెలును, చాత్తిన = శ్రీవైష్ణవులయొక్కయు, చాత్తని = చాత్తాదులయొక్క, కులము = సమూహము (చాత్తినవా రనఁగా ద్రావిడ ప్రబంధమధికరించియు భగవత్సన్నిధియందు సమర్పితముఁజేసిన బ్రాహ్మణోత్తములైన శ్రీవైష్ణవులు, చాత్తనివా రనఁగా ద్రావిడప్రబంధమధికరించియు భగవత్సన్నిధియందు సమర్పితముఁజేయ నధికారము చాలని యితరవర్ణవైష్ణవులు.) విధినిషేధము లెఱిఁగి తేఁగన్ = ఎవ్వరెవ్వరేమేమి తెచ్చుటకర్హులో వార లాయావస్తువులఁ దెచ్చుచుండఁగా, ఆవిష్ణుచిత్తుఁడు, మధురకున్ అరిగెన్ = మధురాపురమునకుఁ జనెను. శాలి...తండులము - ప్రయాణకాలములో దారిలో నుపయోగించుకొనుటకై కొనిపోయెడు కొంచెపాటి బియ్యము - ప్రాఁతది ఆరోగ్యకరము.

తా. ఆపెరియాళ్వారుయొక్కభార్య పతివ్రతాశిరోమణి యగుటంజేసి మిగుల భక్తితోఁ గూడినదై యతనిత్రోవకుఁ బరికరంబు లుంచి మూటఁగట్టినపొరివిళంగాయలు మిక్కిలియు పరిశోధింపఁబడిన క్షేమతండులములు, సంబారంపుఁజింతపండు, హండికావళ్లకొనలయందు వ్రేలాడుచుండెడి యావునేతిచే నింపఁబడిన కూఁచిమూఁతిపిడతలును, పెరుఁగు వడియంబులు వరుగులు చాయపప్పు శ్రీవిష్ణుపూజోపయోగిపరికరణ

బృందపూరితంబు లగుపేటికలును, వీని శ్రీవైష్ణవులు చాత్తాదులు స్వస్వయోగ్యతాను రూపంబుగ వెంటఁ దెచ్చుచుండ నావిష్ణుచిత్తుండు మధురానగరమునకు వెళ్లెను.

చ. యమనియమాదిలభ్య ద్రుహిణాది[1]జరన్మరుదిభ్య, సంసృతి
శ్రమహరనామకీర్తన, మురప్రవికర్తన పాతకావలీ
దమన రమాంగనాకమన తామరసాయతనేత్ర భక్తహృ
ద్భ్రమతృణదాత్ర, భూయువతిరంజన, వర్ణజితాభ్రఖంజనా. 99

టీ. యమ నియమాదిలభ్య = యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధు లనియెడు నష్టాంగయోగములచేఁ బొందఁదగినవాఁడా, ద్రుహి...భ్య - ద్రుహిణ=బ్రహ్మ, ఆది=మొదలగు, జరత్ = వృద్ధులైన, మరుత్ = దేవతలకు, ఇభ్య = ప్రభువైనవాఁడా, (ని. 'ధాతాబ్జయోనిర్ద్రుహిణః, ఇభ్య ఆఢ్యో ధనీ స్వామీ, మరుతౌ పవనామరౌ' యని యమరుఁడు.) సంసృతి...న - సంసృతి = జన్మమరణాదిరూప సంసారమందలి, శ్రమ=ఆయాసమును, హర=హరించునట్టి, నామ కీర్తన = నామసంకీర్తనముగలవాఁడా, మురప్రవికర్తన=మురాసురుని ఖండించినవాఁడా, పాతక ఆవలీదమన = పాపముల సమూహమును హరియించువాఁడా, రమా అంగనా కమన = లక్ష్మీకాముక, ('కమనః కామనోఽభికః' యని యమరుఁడు.) తామరసాయత నేత్ర = తామరఱేకులవలె వెడల్పులైన కన్నులుగలవాఁడా, భక్త...త్ర - భక్త = భక్తులయొక్క, హృత్ = మనంబులందలి, భ్రమ = అజ్ఞానమనియెడు, తృణ = గడ్డికి, దాత్ర = లవిత్రమైనవాఁడా, (ని. 'దాత్రం లవిత్ర' మ్మని యమరుఁడు.) భూయువతి రంజన - భూయువతి = భూమియను స్త్రీని, రంజన=సంతోషపెట్టువాఁడా, వర్ణ...నా- వర్ణ = దేహకాంతిచేతను, జిత=గెలువఁబడిన, అభ్ర = మేఘమును, ఖంజనా=కాటుక పిట్టయును గలవాఁడా, (ని. 'ఖఞ్జరీటస్తు ఖఞ్జనః, వర్ణో ద్విజాదౌ శుక్లాదౌ, అభ్రం మేఘో వారివాహ' యనియు నమరుఁడు.) ఇందు లభ్య, దిభ్య యిత్యాదు లంత్యాను ప్రాసములు కలవు.

తా. యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ సమాధు లనియెడియష్టాంగయోగములచేతఁ బొంద సాధ్యమైనట్టియు, చతుర్ముఖుఁడు మొదలగు బృందారకబృందంబులకుఁ బ్రభువైనట్టియు, జననమరణాదిరూపసంసారజన్య శ్రమ నివారకంబైన నామకీర్తనముగలయట్టియు, మురాసురుని వధియించినట్టియు, లక్ష్మీదేవికిఁ గాముకుఁడైనట్టియు, తామరఱేకులవలె విశాలములైన నేత్రములు గలయట్టియుఁ, భక్తజనహృదయస్థితము లగు భ్రమ లనియెడిగడ్డికి లవిత్రమైనట్టియు, భూవల్లభుం డై

1. జగ.

నట్టియు, నిజదేహకాంతిచేత గెలువఁబడిన మేఘఖంజనములయొక్క కాంతిగల యో శ్రీహరీ యని గ్రంథకర్త గ్రంథమధ్యమందుఁ జేయఁదగిన మంగళం బొనరించుచున్నాఁ డనుట.

క. దోర్ధూర్ధృతదుర్ధరగో,వర్ధన రాధానురాగవర్ధన! లీలా
వార్ధుషికా! యిషికాకృత, వార్ధశ్రవసైకనేత్రవైకృతనిపుణా! 100

టీ. దోర్ధూ...న-దోః = భుజము లనెడు, ధూర్ = కాఁడిచేతను, ధృత = ధరియింపఁబడినట్టి, దుర్ధర=అన్యులచే మోవ శక్యముగాని, గోవర్ధన=గోవర్ధనపర్వతము గలవాఁడా, రాధా...న-రాధా = రాధయొక్క, అనురాగ=ప్రీతిని, వర్ధన = వృద్ధిఁ బొందించువాఁడా, లీలా...కా-లీలా = విలాసముచేతను, వార్ధుషికా = వడ్డి పుచ్చుకొనువాఁడా, (ని. 'వృద్ధ్యాజీవో వార్ధుషిక' యని యమరుఁడు.) (వేంకటేశ్వరుఁడు వడ్డికాసులవాఁ డనుట.) ఇషికా...ణా - ఇషికాకృత = తృణముచేతఁ జేయఁబడిన, వార్ధశ్రవస = ఇంద్రపుత్త్రుఁ డయినకాకాసురునియొక్క, ఏక = ఒక్కటైన, నేత్ర = కంటియొక్క, వైకృత = భంగమునందు, నిపుణా = సమర్థుఁడా. వృత్త్యనుప్రాసము.

తా. ఇతరులచే ధరియింప నశక్యం బైనగోవర్ధనపర్వతమును భుజముచేత ధరియించినట్టియు, రాధకుఁ దనయందుఁగల ప్రీతి నభివృద్ధిఁ జేయుచున్నట్టియు,విలాసార్థము జనులచే వడ్డిఁ బుచ్చుకొనునట్టియు, తృణముచేత కాకరూపము వహించి సీతాస్తనవిదారణముచేసిన కాకాసురుని యొకకంటియొక్క వికారమును బొందించుటయందు సమర్థుఁ డైనట్టి యో శ్రీయఃపతీ; యని పూర్వమువలె మంగళం బొనరించుచున్నాఁడు.

మాలినీ. ద్రుహిణజముఖమౌనిస్తోమనిస్తంద్రభాస్వ
ద్దహరవిహరమాణాతామ్రపాదాంబుజాతా
బహిరబహిరపారప్రాణికోటిప్రపూర్ణా
మహిమవినుతవాణీమాధురీవేద్యపర్ణా. 101

టీ. ద్రుహిణజ..తా - ద్రుహిణ = బ్రహ్మవలన, జ = పుట్టిననారదుఁడు, ముఖ = మొదలగు, మౌనిస్తోమ = మునిబృందముయొక్క, నిస్తంద్ర = మఱపులేని, భాస్వత్ = ప్రకాశించుచున్న, దహర=హృదయాకాశమందు, విహరమాణ=విహరించుచున్న, ఆతామ్ర=అంతట నెఱ్ఱనైన, పాదాంబుజాతా = కమలములవంటి పాదములు గలవాఁడా, బహి...ర్ణా-బహిః = వెలుపలను, అబహిః = లోపలను, అపార=పారములేని, ప్రాణికోటి = జంతుకోట్లయందు, ప్రపూర్ణా=సంపూర్ణుఁడైనవాఁడా, మహిమ... ర్ణా-మహిమ = మహత్త్వముయొక్క, వినుతి = స్తోత్రరూపమైన, వాణీ = వాక్యములయొక్క, మాధురీ = మాధుర్యమును, వేది = తెలిసిన, అపర్ణా = పార్వతిగలవాఁడా.

శా. బ్రహ్మవలన జనియించిన సారదుఁడు మొదలగువారి సమాజముయొక్క నిశ్చలమై ప్రకాశించుచున్నదహరాకాశమందు సంచరించుచున్నట్టి మిగులనెఱ్ఱనైయున్న కమలములవంటి పదయుగళము గలవాఁడా! వెలుపలను లోపలను పారములేక యసంఖ్యేయంబు లగుజంతువులయందుఁ బరిపూర్ణుఁడా! పార్వతీదేవిచేతఁ దెలియఁబడిన నిజ మాహాత్మ్యముయొక్క స్తోత్రవాక్యమాధుర్యము గలలక్ష్మీనాయకా! వేంకటేశ్వరా.

మ. ఇది భూమండనకొండవీడుధరణీభృద్దుర్గపూర్వాద్రిభా
స్వదిభేశాత్మజవీరభద్రజనజీవగ్రాహ రాహూయమా
ణదృఢాంచద్భుజకృష్ణరాయమహిరాణ్నామాస్మదాముక్తమా
ల్యద నాశ్వాసము హృద్యపద్యము ద్వితీయంబై మహిం బొల్పగున్.

టీ. ఇది, భూమండన...దక్-భూమండన=భూదేవికిభూషణంబైన, (ని. 'భూషణంస్యాదలంక్రియా, మణ్డనం చ' యని యమరము.) కొండవీడుధరణీభృద్దుర్గ=కొండవీడను కొండదుర్గమునందును, పూర్వాద్రి = ఉదయగిరిదుర్గమునందును, భాస్వత్ = ప్రకాశించుచున్న, ఇభేశాత్మజ = గజపతికుమారుఁడైన, వీరభద్ర = వీరభద్రపాత్రుని యొక్క, జన = ప్రజయొక్క, జీవగ్రాహ = ప్రాణముతో గ్రహించుటయందు, రాహూయమాణ=రాహువువలె నాచరించెడి, దృఢ = బలిష్ఠమైన, అంచత్ = ఒప్పుచున్న, భుజ=భుజములు గలయట్టి, కృష్ణరాయమహిరాట్ నామ=కృష్ణరాయభూపతి యను పేరుగల, అస్మత్ = నాయొక్క, ఆముక్తమాల్యదక్ = ఆముక్తమాల్యదయందు, హృద్యపద్యము = మనోహరపద్యములుగల, ఆశ్వాసము, ద్వితీయంబై = రెండవదియై, మహిన్ = భూమియందు, పొల్పగున్ = ఒప్పుగును.

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తి మంత్రోపాసనాసమాసాదితాఖండ సాహితీధురీణుండు నాత్రేయగోత్రపవిత్రుండును వానిల్లవంశ పయోరాశిరాకాసుధాకరుండు నగు రామస్వామిశాస్త్రిచేత ననేకపూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యాలోచించి రచింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యదావ్యాఖ్యానంబున ద్వితీయాశ్వాసము.

---

1. మహిభృన్నామా.

శ్రీ ర స్తు

ఆ ము క్త మా ల్య ద

స వ్యా ఖ్యా న ము

తృ తీ యా శ్వా స ము

క. శ్రీ క్షితి నీళా వర! దను
జోక్షప్రాణహర! దంష్ట్రికోత్కృత్తహిర
ణ్యాక్షక్షపాచర! కృపా
వీక్షాదృతబాహులేయ! [1]వేంకటరాయా. 1

టీ. శ్రీ...వర - శ్రీ = లక్ష్మికి, క్షితి = భూమికి, నీళా = నీళాదేవికిని, వర = నాథుఁడైనవాఁడా, దను...ర - దనుజోక్ష = వృషభరూపుఁడైన రాక్షసునియొక్క, ప్రాణ = ప్రాణములను, హర = హరియించినట్టివాఁడా, దంష్ట్రి...ర - దంష్ట్రికా = కోఱచేత, ఉత్కృత్త = ఖండింపఁబడిన, హిరణ్యాక్ష = హిరణ్యాక్షుఁడనునట్టి, క్షపాచర = నిశాచరుఁడుగలవాఁడా, కృపా...య - కృపా = దయతోఁగూడిన, వీక్షా = కటాక్షముచేత, ఆదృత = ఆదరింపఁబడిన, బాహులేయ=కుమారస్వామిగలవాఁడవైన, వేంకటరాయా = వేంకటేశుఁడా.

తా. కమలాక్షితినీళాదేవులకు భర్తయైనట్టియు, వృషభాసురుని జీవమును హరియించినట్టియుఁ, వరాహావతారమందుఁ దన దంష్ట్రికచేత ఖండింపఁబడిన హిరణ్యాక్షుఁడు గలయట్టియుఁ, గృపాకటాక్షముచేతఁ గుమారస్వామి నాదరించినట్టి వేంకటరాయా! యని గ్రంథకర్త తన యిష్టదైవం బగు వేంకటేశుని సంబోధించి మంగళ మొనర్చును.

వ. అవధరింపు మట్లరిగి యవ్విష్ణుచిత్తుండు. 2

టీ. అవధరింపుము=చిత్తగింపుము, అట్లరిగి=అత్తెఱఁగున వెడలి, అవ్విష్ణుచిత్తుండు.

---

1. వేంకటరమణా.

విష్ణుచిత్తుఁడు రాజసభ కేఁగుట

శా. నిత్యంబు న్బ్రతిహారి వాద మగుట న్విజ్ఞప్తి లే కంపఁ, దా
నత్యూర్జస్వలుఁ డౌట భూపతియు సభ్యవ్రాతము న్శంకమైఁ
బ్రత్యుత్థానముఁ జేసి [1]మ్రొక్కఁగ, సభాభాగంబు సొత్తెంచి యౌ
న్నత్యప్రోజ్జ్వలరాజదత్తవరరత్నస్వర్ణపీఠస్థుఁ డై. 3

టీ. నిత్యంబున్ = ప్రతిదినమందును, వాద మగుటన్=విద్వాంసులకుఁ బరస్పర సంవాదము గలిగియుండుటచేత, ప్రతిహారి = ద్వారపాలకుఁడు, విజ్ఞప్తిలేక = ప్రభువునకు విన్నవింపకయె, అంపన్=అనుపఁగా, తాన్=తాను, (అనఁగా విష్ణుచిత్తుఁ డనుట.) అత్యూర్జస్వలుఁడు=మిగులఁదేజముగలవాఁడు, ఔటన్=అగుటచేత, భూపతియున్ = ప్రభువును, సభ్యవ్రాతమున్ = పండితసమూహంబును, శంకమైన్ = శంకచేత, ప్రత్యుత్థానముఁ జేసి=లేచి, మ్రొక్కఁగన్ = నమస్కారము చేయఁగా, సభాభాగంబు=సభాప్రదేశమును, చొత్తెంచి=చొచ్చి, ఔన్న...స్థుఁడు-ఔన్నత్య = పొడవాటిచేతను, ప్రోజ్జ్వల = ప్రకృష్టముగఁ బ్రకాశించుచున్నట్టియు, రాజ = ఏలికచేతను, దత్త = ఇయ్యఁబడిన, వర = శ్రేష్ఠములగు, రత్న = రత్నములు దాపిన, స్వర్ణపీఠస్థుఁడు = బంగారుపీఁటయందుఁ గూర్చుండి యున్నవాఁడు, ఐ. ముందటి కన్వయము.

తా. నిత్యమును విద్వాంసు లేతెంచి ప్రసంగించుటఁ దెలిసియున్నవాఁడు గాన ద్వారపాలకుఁడు రాజాజ్ఞఁ బొందకయే లోపలి కనుపఁగాఁ, బ్రవేశించిన విష్ణుచిత్తుఁడు మిగులఁ దేజోవంతుఁ డగుటంజేసి యాభూపాలుండును బండితులును మహాత్ముఁ డను శంకచేత లేచి నమస్కరింప, సభాప్రదేశము సొచ్చి రాజదత్తం బైన రత్నఖచితసింహాసనమందుఁ గూర్చుండి యున్నవాఁడై.

క. ఆతిథ్యము గొని, హరి తన
చేతోగతి నొలయ రంతు సేయని విద్వ
ద్వ్రాతంబుఁ జూచి 'లాఁతుల
మా తరవా యుడుగ మాట[2]లాడుం' డనుచున్. 4

టీ. ఆతిథ్యము గొని=అతిథిపూజను గ్రహించి, తనచేతోగతిన్ = తనయొక్క చిత్తవృత్తియందు, హరి=శ్రీహరి, ఒలయన్ = విహరింపఁగా, రంతుసేయని=చప్పుడు సేయకున్న, విద్వద్వ్రాతంబున్ = పండితసమూహమును, చూచి=వీక్షించి, తరవాయి = ఉపక్రమమును (మీరు ప్రారంభించినదానిని), ఉడుగన్ = నిలుపుటకు, లాఁతులమా = క్రొత్తవారమా? మాటలాడుండు = ప్రసంగముఁ జేయుండు, అనుచున్.

1. నిల్వఁగ. 2. లాడుఁడటంచున్.

తా. సుగమము.

తే. కతిపయోక్తులకే[1] వారి ప్రతిభఁ దెలిసి
నగవు తళుకొత్త రాజునెమ్మొగముఁ జూచి
'యీవు మాధ్యస్థ్యమున నున్న నేముఁ గొన్ని
నొడివెదము మాట' లని తదనుజ్ఞ వడసి. 5

టీ. కతిపయోక్తులచేన్ ఏ, కతిపయ = కొన్నియైన, ఉక్తులకే=మాటలకే, వారి= ఆసభ్యులయొక్క, ప్రతిభన్ = బుద్ధిని, తెలిసి=ఎఱింగి, నగవు = నవ్వు, తళుకొత్తన్= అంకురింపఁగా, రాజు = రాజుయొక్క, నెమ్మొగము = ముఖమును, చూచి = కని, ఈవు=నీవు, మాధ్యస్థ్యమునన్ = తటస్థభావమునందు, ఉన్నన్ = ఉన్నయెడ, ఏము= మేము, కొన్నిమాటలు = కొన్నియుక్తులను, నుడివెదము = వచించెదము, అని = చెప్పి, తదనుజ్ఞ వడసి = ఆరాజానుమతి నొంది.

తా. విష్ణుచిత్తుండు ఆసభ్యులు వచించుచున్న కొన్ని మాటలు వినుటచేతనే వారలబుద్ధిని తెలిసికొని, చిఱునవ్వులోఁ గూడినవాఁడై రాజుయొక్క ముఖమును జూచి, నీవు మాధ్యస్థ్యమునం దున్నయెడ మేము కొన్ని యుక్తులు చెప్పెద మని రాజానుమతి నొంది.

విష్ణుచిత్తులవాదము

సీ. అందులో నొకమేటి కభిముఖుం డై యాతఁ
డనిన వన్నియును మున్ననువదించి;
తొడఁగి యన్నిటి కన్ని దూషణంబులు వేగ
పడక తత్సభ[2]యొడఁ బడఁగఁ బల్కి;
ప్రక్కమాటల నెన్న కొక్కొకమాటనె
నిగ్రహస్థాన మనుగ్రహించి;
క్రందుగా రేఁగినం గలఁగ కందఱఁ దేర్చి
నిలిపి యమ్మొదలివానికినె [3]మగిడి

తే. మఱి శ్రుతి స్మృతి సూత్రసమాజమునకు
నైకకంఠ్యంబు గల్పించి యాత్మమతము
జగ మెఱుంగఁగ రాద్ధాంతముగ నొనర్చి
విజితుఁ గావించి దయ వాని విడిచిపెట్టె. 6

1. లోని ప్రతిభ దెలిసి. 2. యొదంబడఁగఁ జెప్పి. 3. మగుడి.

టీ. అందులోన్ = ఆవాదులలో, ఒకమేటికిన్ = ఒకప్రౌఢవాదికి, అభిముఖుండై = ఎదురుగా నున్నవాఁడై, అతఁడు అనినవన్నియును=అతఁడు చెప్పినయుక్తుల నన్నిటిని, మున్ను అనువదించి=ముందనువాదముఁ జేసి, తొడఁగి=ఉపక్రమించి, అన్నిటికిన్ = అతఁడు చెప్పినయుక్తుల కన్నిటికిని, అన్నిదూషణంబులు=అన్నిదోషంబులు, వేగపడక=త్వరపడక, ('ప్రథమాద్వైభక్తిక మోర్వ్యిందుశ్చ మహాన్వతిక్రియార్థేషు' అను సూత్రముచేత మువర్ణకలోపము.) తత్సభ = ఆసభ్యులు, ఒడఁబడఁగన్ = సమ్మతించునట్లుగ, పల్కి = సంభాషించి, ప్రక్కమాటలన్ = పార్శ్వములనున్నవారు చెప్పునట్టి యాయుక్తులను, ఎన్నక = గణన చేయక, ఒక్కొకమాటనె = ఒక్కొకయుక్తిచేతనే, నిగ్రహస్థాన మనుగ్రహించి = నిగ్రహస్థానమును యనుగ్రహములో తెలిపి, (నిగ్రహస్థాన మనఁగాఁ బ్రసంగదోషములకుఁ బేరు - ప్రసంగములలో పరాజయహేతువు), క్రందుగా రేఁగినన్ = దొమ్మిగాఁ బ్రసంగింపరాఁగా, కలఁగక = తొట్రుపాటు పడక, అందఱన్=ఎల్లరను, తీర్చి=సమాధానపఱిచి, నిలిపి=ఉంచి, అమ్మొదలివానికినె=ఆమొదలి విద్వాంసునకే, మగిడి = తిరిగి, మఱి=మఱియు, శ్రుతి = వేదవేదాంతములు, స్మృతి= ధర్మశాస్త్రములు, సూత్ర = వ్యాససూత్రములు మొదలగు దర్శనసూత్రములు వీని యొక్క, సమాజమునకున్=సమూహమునకు, ఐకకంఠ్యము = ఏకగ్రీవత, కల్పించి = చేసి, ఆత్మమతము = స్వమతము, జగమెఱుంగఁగన్ = లోకమెఱుంగునట్లు, రాద్ధాంతముగన్ = సిద్ధాంతముగా, ఒనర్చి = చేసి, విజితున్ కావించి = ఓడించి, దయన్ = కరుణచేతను, వానిన్ = అతనిని, విడిచిపెట్టి.

తా. ఆవాదులలో నొక ప్రౌఢవాది యభిముఖుండై యతఁడు చెప్పిన యుక్తులను ముందనువాదముఁ జేసి యుపక్రమించి పిమ్మట నాయుక్తుల కన్ని దూషణంబులును దాను త్వరపడక సభ్యులు మెచ్చునటులఁ బల్కి యిరుప్రక్కల నున్నవారు చెప్పుచున్నమాటల నెన్నక యొక్కొక్కయుక్తిచేత నిగ్రహస్థానము లొదవిన ననుగ్రహించి సభ్యులు దొమ్మిగా వచ్చి ప్రసంగింపఁ దాఁ దొట్రుపడక యందఱను సమాధానపఱిచి యుంచి యామొదలివిద్వాంసునకే మరల వేద శాస్త్ర బ్రహ్మ సూత్రములకు నేకవాక్యతఁ గల్పించి చెప్పి పిమ్మట స్వమతము సిద్ధాంత మని లోక మెఱుంగునట్లుగాఁ జేసి యోడించి దయచేత వాని విడిచి.

క. 'నీ వే మంటివి' రమ్మం
చావలివానికిని మగిడి ♦ యట్లనె(న) వానిం
గావించి; యొకఁ డొకఁడు (డ) రా
నా విప్రుల వాదసరణి ♦ నందఱఁ గెలిచెన్. 7

టీ. నీవు ఏమంటివి=తొలుత దొమ్మిగఁ బ్రసంగింప వచ్చినవారలలో నొక్కనిం జూచి యీవు పల్కిన దేమి, రమ్మంచున్=రమ్మని యోడించి, ఆవలివానికిని=ఆవలనున్న మఱియొకనికిని, మగిడి=అభిముఖుం డై, వానిన్ = ఆవాదిని, అట్లనె = మొదలివాది వలెనే, కావించి = చేసి, మఱియు నీప్రకారముగన్, ఒకఁడొకఁడు = ఒకని వెంట నొకఁడుగా, రాన్ = రాఁగా అవిప్రుఁడు = ఆవిష్ణుచిత్తుఁడు, వాదసరణిన్ = వాద ముఖమున, అందఱన్ = వాదుల నెల్లను, గెలిచెన్ = జయించెను.

తా. మఱియొకనిఁట్టు తిరిగి నీ వే మంటివి ర మ్మని ప్రసంగించి యోడఁగొట్టి, యావలివాని కెదురై వాని నోడఁగొట్టి, యీరీతి నొక్కొక్కఁడుగా రాఁగా నా విప్రుఁడు ప్రసంగించి యందఱఁ బ్రసంగించుసమయమున నోడఁ గొట్టెను.

అన్యమతనిరసనము

సీ. 'జగదుద్గతికిని బీజము ప్రధాన' మన నీ
క్షత్యాది వీకు నశబ్దవాదిఁ
బోరి 'నీశుఁ డే న' నా భోగమాత్రేత్యాద్యు
దాహృతిస్ఫూర్తి మాయావివాది
'ఫలియించుఁ గ్రియయ' నా ఫలమత యిత్యాది
సర్వేశుఁ గొనని యపూర్వవాది
'శాస్త్రయోనిత్వాది' సరణి నీశ్వరునిఁ దె
ల్పెదు ననుమాన' మను పీలువాది
తే. 'నిత్యులం దెల్ల నిత్యుఁ' డనన్నిత్యురూక్తి
క్షణికసర్వజ్ఞతేషి సౌగత వివాది
'ననుపపత్తేర్న' యనుసూత్ర మాది యైన
[1]వాని నృపతీశుఁ బ్రత్యక్ష వాదిఁ గెలిచె. 8

టీ. (1) జగదుద్గతికిని-జగత్=జగంబులయొక్క, ఉద్గతికిని-ఉత్పత్తికి, బీజము= కారణము, ప్రధానము = ప్రకృతి, అనన్=ఇట్లని వాదింపఁగా, ఈక్షన్ = విగతేశుఁ డనఁగా నీశ్వరుఁడు జగత్కారణము గా దనుపట్టి, అశబ్దవాదిన్ = సాంఖ్యుని (ఎవనికి వేదశబ్దమే ప్రమాణము కాదో వాఁడు), ఈక్షత్యాదిన్ = ఈక్షత్యాదిసూత్రోక్తుల చేతను (బ్ర. సూ. ౧. ౧. ౫. ఈక్షతేర్నాశబ్దమ్.)

1. వానినె నిరీశుఁ, వాణి.

(2) ఘోరన్=మిక్కిలి, ఏను=నేను, ఈశుఁడు=ఈశ్వరుఁడు, అనన్=అనఁగా, మాయావివాదిన్=మాయకుఁ గారణత్వముఁ జెప్పుచున్నట్టి యద్వైతిని, భోగ... త్తిన్-భోగమాత్రేత్యాది = భోగమాత్ర అనునది మొదలుగాఁగలసూత్రముయొక్క, ఉదాహృతి = ఉదాహరణముయొక్క, స్ఫూర్తిన్ = స్మరించుటచేతను, (౪-౪-౨౧ భోగమాత్రసామ్యలింగాచ్చ).

(3) క్రియయ = అగ్నిష్టోమాదిసత్క్రియయే, ఫలియించున్ = ఫలముల నిచ్చును, నాన్ = అని వాదింపఁగా, సర్వేశున్ కానని = సర్వేశ్వరునిఁ గాని యాదనట్టి, అపూర్వవాదిన్=మీమాంసకుని, ఫలమత ఇత్యాది = ఫలమత యను మొదలగుదానిచేతను, (సూ. 3-౨-3౮ ఫలమత ఉపపత్తేః.)

(4) ఈశ్వరునిన్ = జగదీశుని, అనుమానము = 'క్షిత్యంకురాదికం సకర్తృకం కార్యత్వాద్ఘటవత్' అనునట్టి యనుమానమే (శబ్దప్రమాణము కా దనుట.) తెల్పెదున్ = ఈశ్వరసద్భావమందు ప్రమాణము, అన్ = అనియెడు, పీలువాదిన్= పరమాణుకారణవాదిని - వైశేషికుని, శాస్త్ర...ణిన్ - శాస్త్రయోనిత్వాది = శాస్త్రయోనిత్వా (బ్ర. సూ. ౧-౧-3) త్తనునది మొదలగు, సరణిన్ = రీతిచేతను.

(5) నిత్యులందెల్లనిత్యుండు=నిత్యవస్తువులలో నిత్యుఁడీశ్వరుండు, అన్ = అనునట్టి, శ్రుత్యురూక్తిన్-శ్రుతి = వేదముయొక్క, ఉరు=గొప్పదైన, ఉక్తిన్=వాదము చేత, ['నిత్యోనిత్యానాం చేతన శ్చేతనానా మేకో బహూనాం యోవిదధాతి కామాన్, తమాత్మస్థం యేఽనుపశ్యన్తి ధీరాః తేషాం శాన్తి శ్శాశ్వతీనేతరేషామ్.' కఠో. 5 (13)]. క్షణికసర్వజ్ఞతేషి = క్షణికత్వసర్వజ్ఞత్వాదు లీశ్వరలక్షణంబు లనియెడు, సౌగతవివాదిన్=బౌద్ధుని, (ని. 'సౌగత శూన్యవాదిని' యని యమరము.)

(6) నృపతీశున్ = నిగ్రహానుగ్రహసమర్థుఁ డగురాజే యీశ్వరుం డనునట్టి, ప్రత్యక్షవాదిన్ = ప్రత్యక్షమే సత్య మని వాదించు వానిని, (అనఁగాఁ జార్వాకుఁ డనుట.) అనుపపత్తేర్న యనుసూత్రము, ఆదియైనవానిన్ = మొదలగువానిచేత, ('అనుపపత్తేస్తు న శారీరః.' ౧-౨-3) గెలిచెన్ = సభయందుఁ గ్రమముగ వందఱ నోడించెను.

తా. పరిదృశ్యమానం బగు నీ జగత్తునకుఁ బ్రకృతి కారణం బని వాదించునట్టి యశబ్దవాది యగుసాంఖ్యుని ఈక్షత్యాదిసూత్రములచేతను, నే నీశ్వరుఁడ నని వాదించు చున్న యద్వైతిని భోగమాత్రేత్యాది సూత్రములచేతను, కర్మబ్రహ్మవాది యగు మీమాంసకుని ఫలమత ఇత్యాది సూత్రములచేతను, పీలుపాకవాదిని శాస్త్రయోనిత్వాది

సూత్రములచేతను, క్షణికత్వసర్వజ్ఞత్వాదు లీశ్వరలక్షణంబులనియెడు బౌద్ధుని నిత్యో నిత్యాసా మనుశ్రుతిచేతను, నిగ్రహ సామర్థ్యము గలిగి కంటికి విషయుం డై యున్న రా జీశ్వరుం డను నట్టి ప్రత్యక్షవాదిని అనుపపత్తేర్న యను సూత్రముచేతను, నిత్తెఱంగున నా విష్ణుచిత్తుఁడు సభయందు వాదించి, వారల నెల్లఁ గ్రమంబుగ నోడఁగొట్టెను.

పైని చెప్పఁబడిన సూత్రముల యర్థములను శ్రీరామానుజాచార్య విరచిత బ్రహ్మసూత్ర భాష్యమునఁ గనం దగు.

శా. విద్వద్వందితుఁ డాతఁ డిట్లు సుఖ సంవిత్తత్త్వబోధైకచుం
చుద్వైపాయన[1]సూత్రసచ్ఛ్రుతుల నీశు న్మున్నిరూపించి, పైఁ
దద్విష్ణుత్వము దాని కన్య దివిషద్వ్యావర్తనంబు న్విశి
ష్టాద్వైతంబును దేటగాఁ దెలుప మాటాడె న్ప్రమాణంబులన్. 9

టీ. విద్వ...దు - విద్వత్ = విద్వాంసులచేతను, వందితుఁడు = నమస్కరింపఁబడు, ఆతఁడు = ఆవిష్ణుచిత్తుఁడు, ఇట్లు = ఈరీతిగా, సుఖ...లన్-సుఖ = సుఖస్వరూపమును, సంవిత్ = జ్ఞానస్వరూపమునైన, తత్త్వ = పరబ్రహ్మముయొక్క, బోధైకచుంచు = జ్ఞానమునకు ముఖ్యసాధకంబైన, 'తేనవిత్తశ్చుంచుప్రణపౌ' అనిసూత్రము. ద్వైపాయనసూత్ర = వ్యాససూత్రములచేతను, సచ్ఛ్రుతులన్ = వేదములచేతను, ఈశున్ = సర్వేశ్వరుని, మున్ = మున్ను, నిరూపించి = తెల్పి, పైన్ = పిమ్మట, తద్విష్ణుత్వము - తత్ = ఆసర్వేశ్వరునికి, విష్ణుత్వమున్ = వ్యాపకత్వమును, "విష్ణువ్యాప్తౌ" దానికిన్ = ఆవిష్ణుత్వమునకు, అన్య...నంబున్ - అన్యదివిషత్ = ఇతరదేవతలకు, వ్యావర్తనంబున్ = లేకుండుటయును, విశిష్టాద్వైతంబును, తేటగాన్ = ప్రత్యక్షముగా, తెలుపన్ = తెలుపుటకు, ప్రమాణంబులన్ = ప్రమాణవాక్యములచేతను, మాటాడెన్ = సంభాషించెను.

తా. విద్వాంసులచే నమస్కరింపఁబడుచున్న యా విష్ణుచిత్తుఁడు జ్ఞానస్వరూపమును, సుఖస్వరూపము నైనపరబ్రహ్మయొక్క బోధను బ్రకటింపఁజేయునట్టి బ్రహ్మసూత్రములచేతను వేదములచేతను నీశ్వరుని మున్నుగా నిరూపించి సిద్ధాంతముఁ జేసి యా పిమ్మట నా యీశ్వరునికి వ్యాపకత్వమును, దదితర దేవతలకు వ్యాప్యత్వమును విశిష్టాద్వైతంబును బ్రమాణములచేతఁ బ్రత్యక్ష మగునటులఁ దెలుపుటకు సంభాషించెను.

సీ. ఆదినారాయణుం డాయె నొక్కఁడ; బ్రహ్మ
లేఁడు, మహేశుండు లేఁడు, లేదు

1. సూత్రసంహితల.

రోదసి, లేఁడు సూర్యుఁడు, లేఁడు చంద్రుఁడు
లేవు నక్షత్రము ♦ ల్లేవు నీళ్లు,
లే దగ్ని, యట్లుండ 'లీల ♦ నేకాకిత
చనదు పెక్కయ్యెద ♦ ననుచు నయ్యెఁ
జిదచిద్ద్వయంబు సొచ్చి' యని ఛాందోగ్యంబు
దెలిపెడు నంతరాదిత్యవిద్య
తే. నర్కులోఁ బుండరీకాక్షుఁ ♦ డతఁడ యగుట
కక్షిణి యని యిష్టదృక్త్ర్యక్షదశశ
తాక్షవిధిరుద్రశక్రాదులందు నొకఁడు
కామి కాశ్రుతియే విలక్షణతఁ దెలిపె. 10

టీ. ఆదిన్=సృష్ట్యాదియందు, నారాయణుండు=విష్ణువు, ఒక్కఁడ = ఒక్కఁడె, ఆయెన్ = అయియుండెను. బ్రహ్మ = చతుర్ముఖుఁడు, లేఁడు. మహేశుఁడు. = శివుఁడు, లేఁడు. రోదసి = భూమ్యంతరిక్షప్రదేశము, లేదు. సూర్యుఁడు, లేఁడు చంద్రుఁడు, లేఁడు. నక్షత్రములు = చుక్కలు, లేవు. నీళ్లు, లేవు, అగ్ని, లేదు. అట్లుండన్ = ఆరీతి నుండఁగా, లీలన్ = విలాసముచేత, ఏకాకిత = ఒక్కఁడై యుండుట, చనదు = యుక్తము గాదు. పెక్కు అయ్యెదన్ = అనేకము లయ్యెదను, అనుచున్ = సంకల్పించి, చిదచి...సొచ్చి-చిత్ = చిత్తు (చేతనములయిన జీవులు), అచిత్ = అచిత్తు (జడములు - అచేతనములు), వీనియొక్కద్వయంబు = రెంటిని (అనఁగా జీవులయందును జడములయందు ననుట), చొచ్చి = ప్రవేశించి, (పెక్కు) అయ్యెన్=తాను బహురూపంబులాయెను, అని=ఇట్లని, ఛాందోగ్యంబు=ఛాందోగ్య మను నుపనిషత్తు, తెలిపెడున్=బోధించుచున్నది. అంతరాదిత్యవిద్యన్=అంతరాదిత్య మను విద్యయందు, అర్కులోన్ పుండరీకాక్షుఁడు అతఁడ అగుటకున్=సూర్యునియం దున్నపుండరీకాక్షుండు శ్రీమన్నారాయణుం డౌటకు 'తస్యాసం పుణ్డరీకాక్షం పుణ్డరీకే ఇవ అక్షిణీ' యని ద్వివచనముచేతను, అష్ట...దున్-అష్టదృక్ = ఎనిమిదికన్నులుగల యట్టి, త్ర్యక్ష = త్రిలోచనుండైనట్టి, దశశతాక్ష=సహస్రలోచనుండైనట్టి, విధి రుద్ర శక్ర ఆదులందున్ = బ్రహ్మేశానేంద్రాదులందు, ఒకఁడు = ఒక్కండును, కామిన్= సూర్యమండలాంతర్వర్తికాకపోవుటకు, ఆశ్రుతియే = ఆ ఛాందోగ్యమే, అక్షిణీ=రెండు కన్నులు, అని, విలక్షణతన్=వైలక్షణ్యమును - భేదమును, తెలిపెన్ = కనఁబఱచెను.

తా. సృష్ట్యాదియందు శ్రీమన్నారాయణుం డొక్కఁడె యుండుటంజేసి యే కాకిత విలాసమునకు యుక్తము గామి ననేకరూపంబులం బొందెద నని సంకల్పించి

చిదచిద్ద్వయాత్మకం బైన ప్రపంచమందుఁ దాను బ్రవేశించి బహురూపము లాయె నని ఛాందోగ్య మనుపనిషత్తు బోధించుచున్న దనియును, నిదియునుంగాక యంత రాదిత్య బిద్యయందు సూర్యునియం దున్న పుండరీకాక్షుండు నారాయణుం డనుటకు నక్షిణియను ద్వివచనము ముఖ్యసాధకం బనియు, బ్రహ్మరుద్రేంద్రాదులలో నెవ్వఁడు గా దనుటకు నా శ్రుతియే వైలక్షణ్యమును దెలుపుచున్న దనియు భావము.

మ. తుల లేకుండుస్వరూపరూపగుణభూతుల్ దోఁచు నేతచ్ఛ్రుతిః;
దలమై లోవెలిఁ దానె యున్కిఁ దెలిపెన్ నారాయణం; బారుణం
బుల సామాన్యవిశేషరీతి నిఖిలంబు న్శబ్దజాలంబు ని
ర్మలనారాయణశబ్దమందునె తుదన్ బర్యాప్త మయ్యె న్శ్రుతిన్.॥

టీ. తుల...ల్ - తులలేకుండు = సమానములేనట్టి, స్వరూప = నారాయణుని యొక్క దివ్యస్వరూపమును, రూప = దివ్యవిగ్రహమును, గుణ = అనంతకల్యాణగుణములును, భూతుల్ = దివ్యైశ్వర్యంబును, ఏతచ్ఛ్రుతిన్ = ఈవేదముచేత, తోఁచున్ = తానవచ్చుచున్నవి, దలమై=తటుచుగా, లోవెలిన్=లోపలను బైటను, తానె ఉన్కిన్= శ్రీమన్నారాయణుండె యున్నవాఁ డని (తైత్తిరీయోపనిషత్తునందు). నారాయణంబు = నారాయణమను నైదవపన్నము, తెలిపెన్ = తెలుపుచున్నది. శ్రుతిన్ = వేదమందలి, ఆరుణంబులన్ = ఆరుణములందు, సామాన్యవిశేషరీతిన్ = సామాన్య విశేషన్యాయముచేతను, నిఖిలంబున్ = సకలమైన, శబ్దజాలంబు = శబ్దసమూహము, నిర్మలనారాయణశబ్దమందునె = కేవలనారాయణశబ్దములోపలనే, తుదన్ = కడపట, పర్యాప్తమయ్యెన్ = పర్యవసన్నమాయెను.

తా. సాదృశ్యము లేనట్టి శ్రీ హరియొక్క దివ్యస్వరూప దివ్య విగ్రహానంత కల్యాణ గుణ దివ్యైశ్వర్యములు నీ శ్రుతియందు స్పష్ట మాచున్న వనియు, నారాయణుండె సర్వాంతర్బహిర్వ్యాపకుఁ డై తటుచుగా నున్నవాఁ డని తైత్తిరీయస్థమైన నారాయణ మను నైదవపన్నము దెలుపుచున్న దనియు, నారుణంబులందు సామాన్య విశేషన్యాయముచేత బ్రహ్మేంద్రాది సకలశబ్దములును దుదను నారాయణ శబ్దమందె పర్యవసన్నము లాయె ననియు భావము.

క. 'అపహతపాప్మా ది, వ్యోదేవ' యనంగఁ బరఁగుసూక్తుల మీఁదం
బౌ దగు నారాయణపద, మే దేవాంతరము లేమి నీశ్రుతిఁ దీర్చెన్.

టీ. ఈ శ్రుతిన్ = ఈఛాందోగ్యాదిశ్రుతులందు, అపహతపాప్మా దివ్యోదేవ అనంగన్ = శ్రు. 'అపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః' అనునటుల, పరఁగు=

ఒప్పుచున్న, సూక్తులమీఁదన్ = వేదవాక్యములమీఁదను, పాదగు=కుదురై యున్నట్టి నారాయణపదము, ఏదేవాంతరము లేమిన్ = అంతకంటె వేఱేదైవము లేకుండుటను, వాదు = వివాదమును, తీర్చెన్ = పోఁగొట్టెను.

తా. 'అపహతపాప్మే' త్యాది శ్రుతివాక్యములమీఁద కుదురై యున్నయా నారాయణపదమే శ్రీమన్నారాయణునికంటెఁ బరంబగ నేదైవమును లే దని నిస్సందేహమగునటుల భ్రమాత్మకజ్ఞానజన్యవివాదమును దీర్చెను.

వ. "(1) తొల్లి జామదగ్న్యభయంబునఁ బరిత్యక్తరాజ్యుం డై వైరాగ్యంబున దివోదాసాత్మజుం డగు ప్రతర్దనుండు జనార్దను నెఱుంగక యపవర్గకాంక్ష నింద్రు నారాధించిన నతండు సన్నిహితుం డై 'మాముపాస్స్వ' యనుటయు, (2) ముందు గర్భమునం దుండియు నఖండితతపస్తులితవామదేవుం డగు వామదేవుండు సూర్యోఽహం మనురహం కక్షీవానహ మ్మని శరీరవాచకశబ్దంబు శరీరపర్యంతంబు పోవుటం జేసి చిదచిచ్ఛరీరకుం డగు నప్పరమాత్ముం గూర్చి యనుసంధించె ననియుఁ దెలిపి, (3) చేతనుం డైన తా జగత్కారణంబు గామి విబుధులందెల్ల విజ్ఞానవృద్ధుం డగు నావృద్ధశ్రవుండు తదనుసంధానన్యాయంబున నుపదేశించె నని శ్రుతి సూత్రముఖంబుల నిగమాంతశాస్త్రఫక్కికఁ జాల వక్కాణింపంబడు నాత్మయు నవనియు ననల పవన గగన కాల మృత్యు ప్రభృత్యఖిల చిదచిత్ప్రపంచంబు లతనిశరీరంబు లనియు నందె వినంబడు, న ట్లగుట నశేష దివిషచ్ఛరీరంబు లన్నారాయణశరీరంబులే కదా యని (4) ముముక్షువున కప్పుండరీకాక్షుఁదక్క నేవ్యక్తినైన నుపాసింపవచ్చునే? విష్ణునకుఁ దత్తత్కాల విగ్రహంబు లగుటం బ్రహ్మ రుద్రార్జున వ్యాస భాను భార్గవాదిభజనంబు త్రైవర్గికునకుం గాక యపవర్గకాంక్షుల కయుక్తం బని స్మృతి చెప్పు, నదియుంగాక యీశ్వరునకుఁ జేతనునకు నిత్యసంబంధంబు 'మాతా పితా భ్రాతా నివాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణ' యని సమస్తంబునకుఁ బరాయణంబుగా నతనిం బ్రతిపాదించు శ్రుత్యంతరంబు గల దట్టి పరమేశ్వరుం గనుటకుం దగిన యోగంబుఁ జెప్పెద; [1]ఖాండిక్యకేశిధ్వజ సంవాదంబు విను మని యి ట్లనియె. 13

1. ఖాండిక్యజనకసంవాదం బను నితిహాసంబు విను మని యి ట్లనియె.

టీ. (1) తొల్లి=పూర్వకాలమందు, జామదగ్న్యభయంబునన్ = పరశురాముని వలని భయముచేత, పరిత్యక్తరాజ్యుం డై=రాజ్యముఁ ద్యజించినవాఁ డై, వైరాగ్యంబునన్=వైరాగ్యముచేత, దివోదాసాత్మజుం డగు=దివోదాసునకుఁగుమారుఁడైన, ప్రతర్దనుండు=ప్రతర్దనుం డనువాఁడు, జనార్దనున్=శ్రీహరిని, ఎఱుంగక=తెలిసికొనక, అపవర్గకాంక్షన్ = మోక్షేచ్ఛచేత, ఇంద్రున్=పాకశాసనుని, ఆరాధించినన్ = ఉపాసన సేయఁగా, అతఁడు=ఆయింద్రుఁడు, సన్నిహితుండై=సమీపించినవాఁడై, మామ్ ఉపాస్వ= నన్ను నారాధింపుము అనుటయు, (తొలుతఁ దన్ను నారాధించుచున్నవానితో మరలఁ దన్నె యారాధింపు మనుటచేత నతని యంతర్యామి యగు నారాయణుని నుపాసన సేయు మన్న ట్లర్థము సిద్ధించె నది యె ట్లనిన,

(2) ముందు = పూర్వమందు, గర్భమునందున్ ఉండియున్=ఉదరమునందుండియె, అఖండిత = భేదింపఁబడని, తపః = తపంబుచేతను, తులిత = సరిసేయఁబడిన, వామదేవుం డగు = రుద్రుఁడు గలవాఁడైనట్టి, వామదేవుండు = వామదేవుం డనుజడదారి, సూర్యః అహం = సూర్యుఁడను నేను, మనుః అహం=మనువును నేను, కక్షీవాన్ అహం=అగ్నిని నేను, అని = అనుచు, శరీరవాచకశబ్దంబు = శరీరవాచకం బైన యస్మచ్ఛబ్దంబు, శరీరపర్యంతంబు=శరీరము గలజీవపర్యంతంబు, పోవుటం జేసి = పోవుటచేతను, చిదచిచ్ఛరీరకుండగు - చిత్ = జీవుఁడు, అచిత్ = శరీరము, శరీరకుండు=శరీరముగాఁ గలవాఁడు, చిద్రూపాచిద్రూపదేహముగలవాఁ డనఁగా సర్వశరీరకుం డనుట. అగు = అగునట్టి, అప్పరమాత్మున్ గూర్చి=ఆపరవాసుదేవునింగూర్చి, అనుసంధించెను=చింతించెను, అనియు = అ ట్లని, తెలిపి = ఎఱింగించి,

(3) చేతనుండైన తాన్ = జీవుఁడైన తాను, జగత్కారణంబు గామిన్ = ఆకాశాదిజగత్తునకు హేతువు గాకపోవుటను, విబుధులం దెల్లన్ = దేవతలయం దెల్లను, విజ్ఞానవృద్ధుం డగు = విశేషజ్ఞానముచేతఁ బెద్దయైన, వృద్ధశ్రవుండు = దేవేంద్రుఁడు, తద...న్ - తత్ = ఆయర్థముయొక్క, అనుసంధాన న్యాయంబునన్ = చింతన యను న్యాయముచేతను, ఉపదేశించెను = ఆరాజున కుపదేశముఁ జేసెను, అని= అనుకొని, శ్రుతిసూత్రముఖంబులన్ = వేదములచేతను వ్యాససూత్రములచేతను, నిగమాంతశాస్త్రఫక్కికన్ = వేదాంతశాస్త్ర వాక్యరీతులచేతను, మిగులన్ = విశేషముగ, వక్కాణింపఁబడున్ = వ్యాఖ్యానముచేయంబడుచున్నది, ఆత్మయున్=జీవాత్మయును, అవనియున్=భూమియును, అనల పవన గగన కాలమృత్యుప్రభృతి = అగ్నివాయ్వాకాశ కాలమృత్యువులు మొదలగు, చిత్ అచిత్ప్రపంచంబులు=చిదచిత్తులయొక్క విస్తారము, అతని = అప్పరమాత్మునియొక్క, శరీరంబులు అనియున్ = దేహము లని, అంత

వినంబడు=ఆవేదమందె వినఁబడును, అట్లగుటన్=అలాగగుటచేత, అశే...లు-అశేష=సమస్తమైన, దివిషత్ = బ్రహ్మాది దేవతలయొక్క, శరీరంబులు = దేహములు, అనారాయణుని శరీరంబులే కదా అని, (చెప్పి.)

(4) ముముక్షువునకున్=మోక్షేచ్ఛగలవానికి, అపుండరీకాక్షున్ తక్కన్=ఆనారాయణుండుగాక, ఏవ్యక్తినైనను = ఏమూర్తినైనను, ఉపాసింపవచ్చునె = ఉపాసనచేయఁదగునా ? విష్ణునకున్ = పరమాత్మునకు, తత్తత్కాల విగ్రహంబులు అగుటన్ = సమయోచిత దేహములౌటచేతను, బ్రహ్మరుద్రార్జున వ్యాస భాను భార్గవ వీరులు, ఆది = మొదలగువారియొక్క, భజనంబు = ఉపాసన, త్రైవర్గికునకుంగాక = ధర్మార్థకామాపేక్ష గలవారలకేగాని, అపవర్గకాంక్షులకున్ = ముముక్షువులకు, అయుక్తంబు అని = తగదని, స్మృతి = ధర్మశాస్త్రము, చెప్పున్ = తెలుపుచున్నది, ఆదియునుంగాక, ఈశ్వరునకున్, చేతనునకున్=జీవునకును, నిత్యసంబంధంబు, మాతా=తల్లి, పితా = తండ్రి, భ్రాతా = తోఁబుట్టువు, ఆవాసః = అధిష్ఠానము, శరణం = రక్షకుఁడు, (ని. 'శరణం గృహరక్షిత్రో' యని యమరము.) సుహృత్ = మిత్రుఁడు, గతిః = ప్రాప్యము, నారాయణః=నారాయణుండె, అని = అట్లని, ('లోపోనమ ఆదికే విసర్గస్య' యను సూత్రముచేత విసర్గలోపము,) సమస్తంబునకుఁ బరాయణంబుగాన్ = నిఖిలమునకును బరమపదంబుగాన్, అతనిన్ = ఆనారాయణుని, ప్రతిపాదించు = తెలుపునట్టి, శ్రుత్యంతరంబు గలదు=మఱియొకశ్రుతి గలదు, అట్టిపరమేశ్వరుం గనుటకున్ = తాదృశదేవునిం దెలిసికొనుటకు, తగినయోగంబు చెప్పెదన్ = అనుకూలమైన యోగమును వచించెదను. ఖాండిక్య కేశిధ్వజ సంవాదంబు, విను మని=ఆకర్ణింపుమని, ఇట్లనియెన్ = వక్ష్యమాణక్రమంబుగాఁ బలికెను.

తా. పూర్వకాలమునఁ బరశురామునకు వెఱచి వైరాగ్యము నొందినట్టి దివోదాసాత్మజుం డైన ప్రతర్దనుం డనువాఁడు మోక్షేచ్ఛ గలవాఁ డై జనార్దనునిం గానక యింద్రు నారాధింప, నతఁడు ప్రత్యక్షమైన న్నుపాసన సేయు మనఁగా మదంతర్యామి నుపాసన సేయుమన్నట్టి యర్థ మూహింపఁబడియె, నెట్లనఁగా ముస్ను గర్భమునం దుండియుఁ దపంబునం-దీశ్వరునితోఁ దుల్యుం డైనవామదేవుం డనుముని సూర్యుఁడు నేను చంద్రుఁడు నే నగ్నియు నే నను శరీరవాచకశబ్దము శరీరిపర్యంతము పోవుటచేత నుభయశరీరకుం డైనపరమాత్ముంగూర్చి యనుసంధాన మొనర్చె నని తెలిపి, జీవుఁ డైన తా నుపాస్యుండను గా నని జ్ఞానవృద్ధుం డగునింద్రుఁడు దదనుసంధాన న్యాయంబున నుపదేశించెనని వేదవ్యాససూత్రవేదాంతశాస్త్రములయందు వివరింపఁబడియె ననియు, బ్రహ్మ శివుఁడు భూమి మొదలగు పంచభూతములు కాలమృత్యుప్రభృతి నిఖిలం బగు

చిదచిద్రూపవిస్తారంబు లతనిశరీరంబు లనియు, నైనను శుద్ధం బగు నారాయణ స్వరూపమును దక్క మఱియొకస్వరూపమును భజింపఁగూడ దనియు, బ్రహ్మాదులను ధర్మార్థకామకాంక్షు లుపాసన చేయుదురు గాని మోక్షార్థు లుపాసన సేయ రని స్మృతులు దెలుపుచున్న వనియు, జీవేశ్వరులకు నిత్యసంబంధం బనియు, మాతా పితా భ్రాతా వాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణ యని నిఖిలంబు నా నారాయణుం డని తెలుపునట్టి కొన్ని శ్రుతు లున్న వనియు, నట్టి పరమేశ్వరుం గనుటకు సాధకంబైనయోగంబు గలదు, దానిం జెప్పెద నని ఖాండిక్య కేశిధ్వజ సంవాదము చెప్పఁదొడఁగెను.

ఖాండిక్యకేశిధ్వజసంవాదము

మ. జనకాఖ్యాఖిలరాజ మొప్పు నిమివంశం బందు ధర్మధ్వజుం
డనుభూజాని మితధ్వజాఖ్య వసుధాధ్యక్షుం జగద్రక్షణా
వనజాతాక్షుఁ గృతధ్వజాఖ్యుఁ గనియె న్వారిద్దఱు న్గర్మఠున్
ఘనవిజ్ఞానుఁ గ్రమంబునం గనిరి తత్ఖాండిక్యుఁ గేశిధ్వజున్. 14

టీ. జనకా...జము - జనక = జనకుఁడను, ఆఖ్య= పేరుగల, అఖిలరాజము= సమస్తరాజులు గల, నిమివంశంబు = నిమి యను రాజుయొక్క వంశము, ఒప్పున్ = తనరును (అనఁగా నా నిమివంశంబునఁ బుట్టినరాజు లెల్ల జనకు లను నామము గలదనుట), అందున్ = ఆ నిమివంశమందు, ధర్మధ్వజుండు అను = ధర్మధ్వజుండనునట్టి, భూజాని = భూపతి, మితధ్వజాఖ్య= మితధ్వజుం డను పేరు గల, వసుధా అధ్యక్షున్ = అవనీశుని, జగ...క్షున్ - జగత్ = జగత్తుయొక్క, రక్షణా = పాలనయందు, వనజాతాక్షున్ = విష్ణువైనట్టి, కృతధ్వజ ఆఖ్యున్ = కృతధ్వజుఁ డనువానిని, కనియెన్, వారిద్దఱున్ = వారిరువురును, క్రమంబునన్ = వరుసగా, కర్మఠున్ = యాగాదికర్మశీలుఁ డైనట్టి, ఖాండిక్యున్ = ఖాండిక్యుఁ డనుతనిని, ఘనవిజ్ఞానున్ - ఘన = అధికమగు, విజ్ఞానున్ = జ్ఞానముగల (అనఁగా బ్రహ్మనిష్ఠుం డనుట), కేశిధ్వజున్ = కేశిధ్వజుఁ డనువానిని, కనిరి. యథాసంఖ్యాలంకారము.

తా. నిమివంశమందుఁ బుట్టినరాజుల కెల్లను జనకు లను నామము గల దనియు, ఆ నిమివంశోత్పన్నుఁ డైనట్టి ధర్మధ్వజుం డనురాజు మితధ్వజుం డనునట్టియుఁ గృతధ్వజుం డనునట్టియు నిద్దఱు పుత్త్రులుగాఁ బడసె ననియు, వా రిరువురును గ్రమంబుగ ననఁగా మితధ్వజుఁడు ఖాండిక్యుఁ డనువానిని, కృతధ్వజుఁడు బ్రహ్మనిష్ఠుం డగు కేశిధ్వజుఁ డనువానిం గనిరి అని భావము.

క. వా రిరువురుఁ దమలోపల
వేరము గొని రాజ్యకాంక్ష విజిగీషువు లై
హోరాహోరిం బోరిరి
బారాదిదినంబు లవని ప్రజలు తలంకన్. 15

టీ. వారిరువురున్=ఆఖాండిక్యకేశిధ్వజులు, తమలోపలన్, వేరము గొని = వైరముఁ బెట్టుకొని, రాజ్యకాంక్షన్=రాజ్యాపేక్షచేతను, విజిగీషువు లై=జయేచ్ఛగలవార లై, హోరాహోరిన్ = ఎడతెగక, బారాదిదినంబులు = పెక్కు దివసములు, అవనిప్రజలు = భూమియందలిప్రజలు, తలంకన్=భయపడునట్లుగా, పోరిరి = జగడమాడిరి.

తా. పిమ్మట నాఖాండిక్యకేశిధ్వజు లిరువురును దమలో విరోధపడి రాజ్యాపేక్షచేత నొకని నొకఁడు జయింప నిచ్ఛఁగొని భూమియం దున్న ప్రజలు భయంపడునటులఁ బెక్కు దినములు ఘోర మగుయుద్ధ మొనర్చిరి.

బారాది—'క. బారాది సొమ్ము లుండఁగ, హారముఁ గైకొనుచుఁ జనియె నందజము'. పాండు. 4 ఆ. 232 'బారాసి' పాఠాం.

చ. పలపల వేగ నిచ్చలును బోఁజులు దీర్చి యతండు నాతఁడున్
వెలువడి వచ్చి యిక్షుమతివేదిక యేపిరిగాఁగ వీఁగుచున్
దలపడుచుం బెనంగఁగఁ గృతధ్వజనందనుసైనికావళీ
హాళహాళికిం జెడ న్విఱిగె నార్తి మితధ్వజనందనుం డనిన్. 16

టీ. అతండున్=ఆఖాండిక్యుఁడును, ఆతఁడున్ = ఆకేశిధ్వజుండును, నిచ్చలును = నిత్యమును, పలపలవేగన్=తెల్లవాఱఁగా, పోఁజులు తీర్చి=బారులుదీర్చికొని, వెలువడి = రణమునకువెళ్ళివచ్చి, ఇక్షుమతివేదిక = ఇక్షుమతీనది, ఏపిరి గాఁగన్=ఎల్లగాఁగను, వీఁగుచున్ = విక్రమించుచును, తలపడుచున్=తగులు పడుచును, పెనంగఁగన్ = పోరఁగా, కృత...కిన్ - కృతధ్వజనందను = కేశిధ్వజునియొక్క, సైనిక = సేనాపతులయొక్క, ఆవళి = సమూహముయొక్క, హాళహాళికిన్=రాయిడికి, ఆర్తిన్= ఆపదచేత, మితధ్వజనందనుండు = ఖాండిక్యుఁడు, అనిన్=యుద్ధమందు, చెదరన్ విఱిగెన్ = పాఱిపోయెను.

తా. ప్రతిదివసమందును దెల్లవాఱఁగానే యిక్షుమతీనది యెల్లఁ జేసికొని పోఁజులు దీర్చుకొని జగడము సేయఁగాఁ, గేశిధ్వజుని సేనాపతుల ధాటికి నిలుపఁజాలక వెఱచి చెదరి విఱిగి ఖాండిక్యుఁడు యుద్ధమందుఁ బరువిడెను.

క. చెడవిఱిఁగి యడవిఁ బడి యెడ
నెడ గట్టులతుదలఁ గోటి యిడి లోఁ గడకుఁ
దడుకుఁ బొడిపించి యాకుల
గుడిసెల వసియించె మంత్రిగురుభటయుతుఁడై. 17

టీ. చెడవిఱిఁగి = పాఱిపోయి, అడవిన్ పడి = అరణ్యమును బ్రవేశించి, ఎడ నెడన్ = అక్కడక్కడను, గట్టులతుదలన్ = కొండలమీఁదను, కోటి ఇడి = వేగు ఉంచి, లోన్ = లోపలను, కడకున్ = తుదవెళ్లను, తడుకున్ పొడిపించి = కంప పాతించి, ఆకుల గుడిసెలన్ = పర్ణశాలలయందు, మంత్రి...డై - మంత్రి = ప్రధానులతోడను, గురు = గురువులతోడను, భట = బంట్లతోడను, యుతుఁడై = కూడినవాఁడై. వసియించెన్ = ఉండెను.

తా. పరువిడి యరణ్యము సొచ్చి యక్కడక్కడ నున్న కొండల కొనలయందు వేగునుంచి లోపలఁ జుట్టును గంప నాటించి పర్ణశాలలయందు నాఖాండిక్యుఁడు మంత్రి పురోహిత భట సహితుండై వాసము చేయుచుండెను.

శా. ఆకేశిధ్వజుఁ డంత నా నృపునిరాజ్యం బెల్లఁ జేర న్ఫలం
బాకాంక్షింపక గెల్తు మృత్యువు నవిద్య [1]న్బుట్టకుండం దుదన్
జా కుండ న్వలె నంచు యోగనిరతిం జ్ఞానాశ్రయుం డై మఖా
నీకంబు ల్రచియించు చం దొకటికిం దీక్షించి తా నున్నచోన్. 18

టీ. అంతన్ = పిమ్మట, ఆకేశిధ్వజుఁడు, ఆనృపునిరాజ్యంబెల్లన్ = ఖాండిక్యుని రాజ్య మంతయును, చేరన్ = తనకు రాఁగా, ఫలంబు ఆకాంక్షింపక = యాగాది కర్మ ఫలంబులం గోరక, మృత్యువున్ = సంసారరూపమృత్యువును, గెల్తున్ = జయింతును, అవిద్యన్ = అజ్ఞానముచేత, పుట్టకుండన్ = మరలజనింపకుండ, తుదన్ = కడపట, చాకుండన్ వలెన్ = చావకుండవలె ననుచును, యోగనిరతిన్ = యోగాసక్తిచేత, జ్ఞానాశ్రయుండై = జ్ఞానము నాశ్రయించినవాఁడై, మఖానీకంబు - మఖ = క్రతువులయొక్క, అనీకంబుల్ = సమూహమును, రచియించుచున్ = ఒనరించుచు, అందున్ = ఆక్రతువులయందు, ఒకటికిన్ = ఒకజన్మమునకు, దీక్షించి = దీక్షఁ గైకొని, తాన్ = తాను, ఉన్నచోన్ = ఉండఁగా.

తా. పిమ్మట నా ఖాండిక్యుని రాజ్యమంతయుఁ దనస్వాధీనమై యుండఁగాఁ గర్మఫలంబుల నపేక్షింపక మృత్యువును గెలువవలె ననియు, నజ్ఞానముచేత మరలఁ

1. న్బుట్టకుండుం, దుదన్ జాకుండ న్వడి.

బుట్టక కడపటఁ జావు లేకుండవలె ననియుఁ, నపేక్షించియోగస్థితిచేతను జ్ఞానము నాశ్రయించి యసంఖ్యేయంబు లగుక్రతువులం జేయుచు నందొక క్రతువునకు దీక్ష వహించి యున్న సమయంబున.

చ. పులు మఖశాలికానికటభూముల మేయుచు నేటివెంటఁ బె
ల్లలమెడునీఱముం దఱిసి యామ్యపతాకన ఘ(ధ)ర్మధేను వా
కెలవుల నాడు వాలభుజగిం గని గోండ్రని యంగలార్చుచున్
గళగతఘంట మ్రోయ నుఱుకం బిడుగుం బలెఁ దాఁకి యుద్ధతిన్.

టీ. ఘ(ధ)ర్మధేనువు=యాగధేనువు, మఖశాలికానికటభూములన్=యజ్ఞశాలా సమీపభూములయందు, పులు = కసవును, మేయుచున్, ఏటివెంటన్ = నదివెంబడి, పెల్ల...న్-పెల్లలమెడు=మిగులదట్టమైన, ఈఱమున్ = పొదరింటిని, (సూ. 'నస్స్యాత్తద్ధర్మోక్త' యని తద్ధర్మార్థకవిశేషణమున కచ్చుపరమైనప్పుడు నకారాగమము రాఁగా నలమెడునీఱ మని యాయెను.) తఱిసి=సమీపించి, యామ్య...కవన్ - యామ్య = యమసంబంధియైన, పతాకన్ = ధ్వజపటమనఁగా, ఆకెలవులన్ ఆడు = ఆపార్శ్వమునందుఁ గదలుచున్న, వాలభుజంగిన్ = (పులియొక్క) పామువంటితోఁకను, కని = చూచి, గోండ్రు అని అంగలార్చుచున్ = గోండ్రనిమిడుకుచును, గళగతఘుంట-గళగత=మెడనున్న, ఘంట, మ్రోయన్ = ధ్వనించుచుండఁగా, ఉఱుకన్ =పరువెత్తఁగా, పిడుగుంబలెన్=అశనివలె, (ఉత్ప్రేక్ష) తాఁకి = స్పృశించి, ఉద్ధతిన్=వడిచేతను.

తా. యాగ ధేనువు యజ్ఞశాలాసమీప ప్రదేశములందుఁ గసవు మేయుచు, నేటివెంట దట్టమగు పొదరింటి నాయుకొని యమ సంబంధియైన ధ్వజపట మను నటుల నాపార్శ్వమునం గదలుచున్న పామువంటి పులితోఁకను జూచి గోండ్రని యంగ లార్చుచు, మెడ నున్న ఘంట మ్రోయునటులఁ బరువిడినను చపలత పిడుగువలె వెంబ డించి వడిచేతఁ దాఁకెను.

ఉ. గబ్బు సమక్షికం బయి మొగంబడువ, న్దరుపర్ణము ల్పడన్
ద్రొబ్బుచుఁ, గార్మొగిళ్లుఁబొదరుతోఁ [1]బురణించెడు బొబ్బరింతగా
దుప్పబ్బి విసంజ్ఞగాఁగఁ జెవుకలూఁదిన వల్లవుఁ డార్వఁ [2]గూలఁగా
బెబ్బులి గొంతు క్రోల్గఱచి కెల్లున మార్మెడఁ ద్రెళ్లదాఁటుచున్.

టీ. గబ్బు=దుర్గంధము, సమక్షికంబు అయి = ఈఁగలతోఁగూడినదై, మొగంబు అడువన్ = ముఖమునఁ గొట్టుచుండఁగా, తరుపర్ణముల్ పడన్ = చెట్లనున్నయాకులు

1. జెఱలాడెడు. 2. వ్రాలఁగా.

రాలునట్లుగా, ద్రొబ్బుచున్ = త్రోయుచును, కార్మొ...తోన్ - కార్మొగిళ్ల=వర్షా
కాలపుమేఘములయొక్క, రొదతోన్=ధ్వనితోడను, పుర...గాడ్పు - పురణించెడు=
సమానమగునట్టి, బొబ్బరింత = బొప్పటయొక్క, గాడ్పు = గాలి, ఉబ్బి=ఉబికి, విసం
జ్ఞగాఁగన్ = ఒడలెఱుఁగకుండునట్లుగాను, చెవులు డూఁదినన్=కర్ణములఁ బ్రవేశింపఁగా,
వల్లవుఁడు = గొల్ల, ఉర్విన్ = భూమియందు, కూలఁగాన్ = పడఁగా, బెబ్బులి=పెద్ద
పులి, గొంతుక్రోల్ = గొంతుక్రోవి, కఱచి, పెల్లునన్ = అతిశయముచేత, మార్మెడన్=
మాఱుమెడతో, త్రెళ్లన్ = పడునట్లుగా, దాఁటుచున్ = లంఘించుచును. ముందటి
కన్వయము. అలం - స్వభావోక్తి.

తా. ఈఁగలతోఁ గూడిన దుర్గంధము ముఖమునకుఁ గొట్టుచుండఁ జెట్లయం
దున్నయాకులు రాలునటుల నూఁకుచును,మేఘధ్వనివంటి రొదచేత నిండియున్న బొప్ప
వలని గాలి యుబ్బి స్మృతి దప్పునట్లుగా, జెవులూఁదినఁ బసులకాపరియైన గొల్లవాఁడు
నేలఁ బడఁగాఁ బెద్దపులి ధేనువు మెడ గొఱికి మాఱుమెడతోఁ బడునటుల దాఁటెను.

ఆ. తనువుఁ గొమ్ము గొరిజఁ ♦ గొనకుండ మలఁపుచుఁ
జప్పు డెసఁగఁ దోఁక ♦ నప్పళించి
శోణితంబుఁ గ్రోలు ♦ చునె నేర్పుమై ఘు(ధ)ర్మ
గవిని గవికి నీడ్చు ♦ నవసరమున ౯1

టీ. ఆవ్యాఘ్రము, కొమ్మున్ = ఆగోవుయొక్క శృంగమును, గొరిజన్ = గొరి
సెను, కొనకుండన్ = తాఁకకుండ, తనువున్=దేహమును, మలఁపుచున్=మరలించుచు,
చప్పుడు ఎసఁగన్ = ధ్వనించునటుల, తోఁకన్ = వాలమును, అప్పళించి=తాటించి,
శోణితంబున్=రక్తమును, క్రోలుచున్=పానముసేయుచు, నేర్పుమైన్=నేర్పుతోను,
ఘర్మగవిన్=యాగధేనువును, గవికిన్ = కొండగుహకు, ఈడ్చునవసరమునన్=ఈడ్చు
సమయమందు. ముందటి కన్వయము.

తా. ఆ పులి యాగోవుయొక్క కొమ్ములు గొరిసెలుఁ దాఁకకుండ దానిశరీరము
మరలిచి, తన తోఁకను జాడించుచు రక్తపానము సేసి తన సామర్థ్యమునఁ గొండగవికి
నీడ్చుచున్న సమయంబున.

చ. పొలమురు[1]లందుఁ గూఁత లిడ ♦ భూసురు లన్నది [2]వార్చివార్చి ప్రాఁ
కుల తుద లెక్క,చప్పటలు ♦ గొట్టి యదల్పఁగ,సాహిణీలు మా

1. లంది, లెందుఁగూ. 2. లోనవార్చి.

వులఁ బఱపంగ,వైచి సెలవుల్వెస నాకుచుఁ బోయె వృక్షమం
డలికయి [1]తూలుచు న్ఘుటఘుటధ్వని సారె మలంగి చూచుచున్. 22

టీ. అందున్=అక్కడ, పొలమరులు=పొలముకాపరులు [పొలమరి యనఁగఁ గాఁపు వితమరి దోఁచు (ఆం. భా. నానా. 49.)], కూఁతలిడన్=కూఁతలుపెట్టఁగా, భూసురులు = బ్రాహ్మణులు, అన్నదిన్ = ఆనదియందు, వార్చివార్చి = సంధ్యవార్చి, మ్రాఁకులతుదలెక్కి=కొనమ్రాఁకుల కెక్కి, చప్పటలుగొట్టి=చప్పట్లుగొట్టి, అదల్పఁగన్ = అదలింపఁగా, సాహిణీలు=రౌతులు, మావులఁబఱపంగన్ = గుఱ్ఱములనెక్కి తఱుమఁగా, వైచి = ఆ ధేనువును విడిచి, సెలవులు నాకుచున్, వెసన్ = గొబ్బున, వృక్షమండలికయి = చెట్లు మెండుగ నుండుచోటికి, తూలుచున్=తూఁగుచు, ఘుటఘుటధ్వనిన్ = ఘుటఘుట ధ్వనిచేత, సారె = మాటిమాటికిని, మలంగిచూచుచున్ = మరలిచూచుచు. ముందటికన్వయము.

తా. ఆ ప్రాంతములందుఁ బొలముఁ దిరుగువారలు సూచి కూఁతలిడఁగా, విని బ్రాహ్మణు లానదియందు సంధ్యవార్చి చెట్లపై నెక్కి చప్పట్లు గొట్టి యదలించుచుండ, నంతలో రౌతులు గుఱ్ఱముల నెక్కివచ్చి తఱుమఁగా, నా పెద్దపులి సెలవులనాకుచు శీఘ్రముగా మిగులఁజెట్లు గలిగియున్నచోటికి ఘుటఘుటధ్వని జేయుచుఁ బలుమాఱు వెనుకఁ దిరిగి చూచుచు వెళ్లెను.

క. జుఱుజుఱుకున నెత్తురు వెలి
కుఱుకుచు రొద సేయ, [2]నఱితెఱయొదవిన యూర్పుల్
పఱవ[3]మిడిగ్రుడ్లు వడఁకఁగఁ
గొఱప్రాణముతోడఁ దన్ని (ను) కొను నమ్మొదవున్. 23

టీ. జుఱుజుఱుకునన్ = జుఱుకు జుఱుకు మను శబ్దములో, నెత్తురు = రక్తము, వెలికిన్ = వెలుపటికి, ఉఱుకుచున్ = బయలువెడలుచు, రొదసేయన్ = చప్పుడు సేయఁగా, అఱితె ఒదవిన్ అ = మెడగండి నుండియే, ఊర్పులు = నిట్టూర్పులు, పఱవన్ = వెడలఁగా, మిడిగ్రుడ్లు = మిట్టగ్రుడ్లు, వడఁకఁగన్ = వణఁకుచుండఁగా, కొఱప్రాణములోడన్ = కొనయుసురుతోడ, తన్నికొను = తన్నుకొనుచున్న, అమ్మొదవున్ = ఆగోవును.

తా. సుగమము. అలం. స్వభావోక్తి.

సీ. విన్నవించుటయు ఋత్విజులఁ బ్రాయశ్చిత్త
మడిగె రా, జడిగిన నెఱుఁగ మనిరి

---

1. తేలుచు. 2. నఱుత నొదవిన. 3. మిడిగ్రుడ్లవణఁకుచు.

వారు కసేరువుఁ । దా రెఱుంగక పోయి
        యతఁడును శునకుని । నడుగు మనియె
నతఁడు తాను నెఱుంగ । నని పల్కి, [1]నృప విను
        మా ఋత్విజులపిండు । నాకసేరు
వేను నెఱుంగలే । మిఁక నొక్కఁడేమె కా,
        దిల మఱి యెవ్వాఁడు । నెఱుఁగఁ, డెవ్వఁ
తే. డేని సప్తాంగములు నీకు । [2]నిచ్చి చెట్లు
వట్టి పెన్రాలతిప్పలు । వట్టి తిరుగు
నట్టిఖాండిక్యుఁ డొక్కఁడ । యరయ నెఱిఁగె
నే నెఱుఁగు; వేఁడు మది కర్జ । మేని' యనిన. 24

టీ. విన్నవించుటయున్ = ధేనువుకథను రాజునకుఁ దెలుపఁగా, రాజు, ఋత్విజులన్ = ఋత్విజులను, ప్రాయశ్చిత్తము అడిగెన్, అడిగినన్ = అడుగఁగా, వారు, తా రెఱుంగకపోయి = తా మెఱుంగక, కసేరువున్ = కసేరువను ఋషిని, అడుగు మనిరి, అతఁడును = ఆకసేరువును, శునకునిన్ = శునకమహర్షిని, అడుగు మనియెన్, అతఁడు = ఆశునకుఁడు, తానున్ = తానును, ఎఱుంగన్ = ఎఱుఁగను, అని పల్కి = అట్లని చెప్పి, నృప = ఓరాజా, వినుము = ఆలకింపుము, ఆఋత్విజులపిండును=ఋత్విక్సమూహమును, ఆకసేరువు=ఆకసేరువును, ఏనున్ = నేనును, ఎఱుంగలేము=ఎఱుఁగఁజాలము, ఇఁకన్ ఒక్కఁడేమె కాదు = ఒకనేమమాత్రమెయెఱుంగనివారముకాము, ఇలన్ = భూమియందు, ఎవ్వాఁడును = ఎట్టివాఁడును, ఎఱుఁగఁడు = తెలిసికొనఁడు, ఎవ్వఁడేని = ఎవ్వఁడనఁగా, నీకున్, సప్తాంగములు = స్వామ్యమాత్య సుహృత్కోశ రాష్ట్రబల దుర్గము లనియెడి సప్తాంగములను, ఇచ్చి=ఒసంగి, చెట్లువట్టి=వృక్షములంబట్టి, పెన్రాలతిప్పలువట్టి = పెద్దఱాతి గుట్టలఁబట్టి, తిరుగున్ = సంచరించుచున్నవాఁడో, అట్టి ఖాండిక్యుఁడు, ఒక్కరుండ = ఒకఁడుమాత్రమె, అరయన్ = విచారింపఁగా, ఎఱిఁగెనేని = ఎఱింగియుండెనేని, ఎఱుఁగున్ = ఎఱిఁగియుండును, అది = అడుగుట, కర్జమేని = కర్తవ్యమాయెనా, వేఁడుము = అడుగుము, అనినన్ = అనఁగా.

తా. ఆఘర్మధేనువుయొక్క వృత్తాంతము రాజునకు విన్నవింప నతఁడు ఋత్విజులను బ్రాయశ్చిత్త మడుగఁగాఁ దమకుఁ దెలియదు గానఁ గసేరు వనుఋషి నడుగు మనిరి. వాని నడుగఁగ నాకసేరువు శునకుని నడుగు మనియె; నాశునకు నడుగఁగా

1. కృప. 2. నిచ్చవిరిగి చెట్టు చెన్నాళ్ళ తిప్పలు వట్టి తిరుగు.

నతఁడు నాకుం దెలియ దని పల్కి, ఋత్విజులకును గసేరువునకును నాకును దెలియదు గదా, భూమియం దెవ్వరికిని దెలియదు. తెలిసియున్నయెడ నెవ్వఁడు సప్తాంగముల నీ కిచ్చి యడవిపాలై చెట్లు గుట్టలువట్టి తిరుగుచున్నవాఁడో యట్టి ఖాండిక్యునికిఁ దెలిసి యుండవచ్చును; గాన ప్రాయశ్చిత్త మడుగుట యవశ్యముగాఁ గర్తవ్యమాయెనేని యతని నడుగవలయు నని చెప్పెను.

చ. నరపతి [1]పల్కె, 'మౌనివర నారిపు నిష్కృతి [2]వేఁడఁబోయిన
న్ధర హతుఁ జేసెనేని సవనంపుఫలం బొడఁగూడుఁ; గాక మ
త్సరగతిఁ జెప్పెనేని మఖ తంత్ర మతంత్రముఁ గాక పూర్ణమౌ;
నిరుదెఱఁగు న్మదీప్సితమె యేఁ గెద' నంచు రథాధిరూఢుఁ డై. 2

టీ. నరపతి = రాజు, పలికెన్ = ఆశునకునితో ని ట్లనియెను, మౌనివర = ముని శ్రేష్ఠుఁడా, నారిపున్ = నాశత్రువును, (ఖాండిక్యుని) నిష్కృతిన్ = ప్రాయశ్చిత్తమును, వేఁడఁబోయినన్ = అడుగఁబోతినేని, అతఁడు నన్ను, ధరన్ = నేలపై, హతుఁజేసెనేని = చంపెనా, సవనఫలంబు = యజ్ఞఫలంబు, ఒడఁగూడున్ = సిద్ధించును, కాక = అట్లుకాక, అమత్సరగతిన్ = మత్సరపుమార్గము విడిచి, చెప్పెనేని = ప్రాయశ్చిత్తము పచించినయెడ, మఖతంత్రము = యజ్ఞకృత్యము, అతంత్రము గాక = క్రమము తప్పక, పూర్ణము ఔన్ = నెఱవేఱును, ఇరుదెఱఁగున్ = రెండువిధములును, మదీప్సితమె = నాకు ఇష్టమె, ఏఁగెదను = పోయెదను, అనుచున్ = అని, రథాధిరూఢుఁ డై = అరదము నెక్కినవాఁడై.

తా. ఆకేశిధ్వజుం డనురాజు శునకునితో, నోయిమునిశ్రేష్ఠుఁడా! నాయొక్క శత్రువగుఖాండిక్యునిఁ బ్రాయశ్చిత్త మడుగఁబోయిన సమయమున నేలపైఁ జంపెనేని యజ్ఞమధ్యమున శరీరము విడుచుటచేత యజ్ఞఫలము చేకూరును. లేక మాత్సర్యము వదలి ప్రాయశ్చిత్తము సెప్పెనేని యజ్ఞానుష్ఠానము పరిసమాప్తి నొందును. కాన నీరెండు విధములు నా మనోరథము లగుటచేతఁ బోయెద నని చెప్పి రథము నెక్కెను.

అలం. వికల్పాలంకారము.

క. హారిణాజినోత్తరీయుఁడు
నిరాయుధుఁడు నగుచు నతని నెల వగు నడవిన్
జొరఁ [3]గొట్టికాండ్రు పెక్కుముఁ
బరికించి యెఱింగి కలయఁబడి కూఁత లిడన్. 26

1. పల్కి. 2. వేఁడఁబోవ. 3. కోటికాండ్రు.

టీ. హరి...డు-హరిణాజిన = జింకచర్మము, ఉత్తరీయుండు = పైవస్త్రముగాఁ గలవాఁడును, నిరాయుధుఁడును = ఆయుధము లేనివాఁడును, అగుచున్ = ఐ, అతని నెలవగు=ఆఖాండిక్యుని స్థానమైన, అడవిన్ = అరణ్యమును, చొరన్=ప్రవేశింపఁగా, కొట్టికాండ్రు = అచ్చట నున్న వేగువాండ్రు, టెక్కెమున్ పరికించి = టెక్కెమును జూచి, ఎఱింగి = కేశిధ్వజుం డని తెలిసి, కలయఁబడి = కూడి, కూఁతలిడన్=కూఁతలు పెట్టఁగా. ముందటి కన్వయము.

తా. జింకచర్మము నుత్తరీయంబుగా ధరించి నిరాయుధుండై యా ఖాండిక్యునకు నివాసస్థాన మగునడవిఁ జొచ్చి పోఁగా, నచ్చట నుండు వేగువాండ్రు టెక్కెమును జూచి కేశిధ్వజరా జని యూహించి కలసి కూఁతలువెట్ట సాగిరి.

ఆ. వలస బెదర నృపతి కలఁగక [1]ప్రజవగ
లార్పఁ బనిచి కనుమలందు నిలువ
వేఱు వేఱ యేర్చి విలుమందిఁ బనిచి తాఁ
దడుకు పెండె మలుక వొడమ వెడలి. 27

టీ. వలస బెదరన్=వలసవచ్చియున్న జనము భయపడఁగా, నృపతి = ఖాండిక్యుఁడు, కలఁగక = చలింపక, ప్రజవగలు = జనులచింతలు, ఆర్పన్ = మాన్పుటకు, పనిచి = కొందఱఁ బంపి, కనుమలందున్ నిలువన్=గండ్లుకాచుటకు, విలుమందిన్ = విలుకాండ్రను, వేఱువేఱ ఏర్చి = ఏర్పఱచి, పనిచి = పంపి, తాన్ = తాను, అలుక= కోపము, పొడమన్ = అంకురింపఁగా, తడుకుపెండెము=తెట్టువాకిటి తలుపు, వెడలి = వెళ్లివచ్చి. ముందటి కన్వయము.

తా. వలస వచ్చియున్న ప్రజలు బెదరఁగా నాఖాండిక్యుఁడు చలింపక ప్రజల గోడు మాన్పుటకుఁ గొందఱ నియమించి, గండ్లు గాచుటకు విలుకాండ్ర నేర్పఱిచి పంపి, తాను కోపయుక్తుఁడై తడికపెండెము వెడలి వచ్చెను.

క. వచ్చు రిపుఁ [2]జూపులనె చుఱు
వుచ్చుచు సిరిఁ గొనుట మగుడఁ బొడముట రుష [3]ము
చ్చిచ్చునను వెచ్చమరి వి
ద్యుచ్చలచాపజ్యఁ దూపుఁ దొడుగుచుఁ బలికెన్. 28

టీ. వచ్చురిపున్-వచ్చు = తనదిశకు వచ్చెడి, రిపున్ = శత్రుఁడైన కేశిధ్వజుని, చూపులనె = చూపులచేతనే, చుఱుపుచ్చుచున్ = దహించుచు, సిరిఁగొనుట=రాజ్యముఁ

1. ప్రజపోక. 2. జూచుటయు మఱిఁ. 3. ముచ్చిచ్చున లా వెచ్చఁగ.

దీసికొనుట, మగుడఁబొడముట=మరలవచ్చుట, రుష = రోషము గలుగుట (యనునీ), ముచ్చిచ్చునను = మూఁడగ్నులచేతను, వెచ్చమరి = (వెచ్చ+అమరి) వేఁడిగలిగి, విద్యు...జ్యన్-విద్యుత్ = మెఱపువలె, చల = కదలుచున్నట్టి, చాపజ్యన్ = వింటి యల్లెయందు, తూఁపుఁదొడుఁగుచున్ = బాణమునుదొడుఁగుచు, పలికెన్ =వచించెను.

తా. తనదిక్కునకు వచ్చుచున్న కేశిధ్వజుని ఖాండిక్యుండు చూపులచేతనే దహించుచు, రాజ్యముఁ దీసికొనుటయుఁ మరల వచ్చుటయుఁ రోషము గలుఁగుటయు నను నీ మూఁడు విధములైన యగ్నిచేత వేఁడిమిని బొంది, మెఱపువలెఁ జపలమైనట్టి వింటియల్లెయందు బాణము తొడుఁగుచు నిట్లు పలికెను.

మ. 'ధన ధాన్య ద్విరదాశ్వ గో[1]ధనసమేతం బెల్ల [2]సామ్రాజ్యముం
గొనియుం జాలక తాటకేయ పలభుక్కూటాకృతిం జింకతో
లున నాచ్ఛన్నుఁడవై ప్రశాంతుగతి మాలోఁ జొచ్చి ప్రాణంబులుం
గొన [3]నేతెంచితె దుర్మతీ! కెడపెదఁగ్రూరంపుభల్లంబున(ల)న్.' 29

టీ. దుర్మతీ = ఓరిదుర్బుద్ధీ, ధన...బు - ధనములు, ధాన్యములు, ద్విరద = ఏనుఁగులు, అశ్వ = అశ్వములు, గోధన = గోవు లనెడి ద్రవ్యములతో, సమేతంబు = కూడిన, ఎల్లసామ్రాజ్యమున్ కొనియున్ = సామ్రాజ్య మంతయు హరించియును, చాలక = తృప్తినొందక, తాట...తిన్ - తాటకేయ=తాటకాపుత్త్రుఁడైన, పలభుక్ = మాంసభక్షకుఁడైన మారీచునియొక్క, కూటాకృతిన్ = కపటాకారములో, (ని. 'మాయానిశ్చల యంత్రేషు కైతవానృతరాశిషు, అయోఘనే శైలశృఙ్గే సీరాఙ్గే కూట మస్త్రియాం' అని యమరము.) జింకతోలునన్=కృష్ణాజినముచేత, ఆచ్ఛన్నుఁడవు ఐ= కప్పఁబడినవాఁడవై, ప్రశాంతుగతిన్=శాంతునింబలె, మాలోన్=మాలోపల, చొచ్చి= ప్రవేశించి, ప్రాణంబులున్ కొనన్ = ప్రాణములు కూడఁ దీసికొనుటకు, ఏతెంచితె = వచ్చితివా, క్రూరంపుభల్లంబునన్=ఘోరమైనయమ్ముచేత, కెడపెదన్ = పడవేసెదను.

తా. ధనధాన్యాది సకల సామ్రాజ్య సమృద్ధం బగు రాజ్యముం గైకొనియుఁను తృప్తి లేక మాయావేషము ధరియించిన మారీచునింబలె, జింకతోలుఁ గప్పుకొనివచ్చి మాలోఁ జొచ్చి మదీయ ప్రాణంబుల హరింప వచ్చితివా దుర్బుద్ధీ! నిన్ను బెడిదపు బాణమునఁ బడ వేసెద నని ఖాండిక్యుఁడు వచించెను.

మహాస్రగ్ధర

అసినం జేయెత్తి "యోహో! కయలుగక విను; కానాతతాయి న్బ్రి
మాదం,బున వైకల్యంబు యాగంబునకుఁ బొడమనేభూసురశ్రేణి వేఁడన్

1. గణ. 2. సామగ్రి. 3. నేతెంచెదె.

నిను నావేదించి పంపెన్ ‘న్నృపయతఁ డెఱుఁగు న్నిష్కృతిన్వేఁడుపో పొ’
మ్మని కోపమ్మైన రోషమ్మైన విడువు, మెన్ ట్లైన మే లింక” నన్నన్. 30

టీ. అనినన్=ఇట్లనఁగా, కేశిధ్వజుండు, చేయెత్తి=హస్తముఁ బైకెత్తి, ఓహో, అలుగక = కోపింపక, వినుము = ఆకర్ణింపుము. ఆతతాయిన్ = వధోద్యతుఁడను, (వధార్హుం డనియుఁ జెప్పవచ్చును), కాన్ = కాను, (శ్లో. ‘అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః, క్షేత్రదారాపహర్తారా షడేతే హ్యాతతాయినః, ఆతతాయినమాయాంతం హన్యాదేవావిచారయన్’ అని మనుస్మృతి.) ప్రమాదంబునన్ = మాంద్యముచేత, యాగంబునకున్ = యజ్ఞమునకు, వైకల్యంబు = వికలత్వము, పొడమన్ = పుట్టఁగా, ఏన్=నేను, భూసురశ్రేణిన్ = విప్రసంఘమును, వేఁడన్ = ప్రాయశ్చిత్త మడుగఁగా, నృప=రాజా, అతఁడు = ఖాండిక్యుఁడు, ఎఱుఁగున్ = తెలిసినవాఁడు, నిష్కృతిన్= ప్రాయశ్చిత్తమును, వేఁడుము = అడుగుము, పో పొమ్మని, నినున్ = నిన్ను, ఆవేదించి= నిరూపించి, పంపెన్=పైనము సేసెను. కోపమైనన్ = కోపమునైనను, రోపమ్మయినన్= బాణమునైనను, (ని. ‘పత్త్రీ రోప ఇషుర్ద్వయోః’ అని యమరము.) విడువుము, ఎట్లైనన్= ఏవిధంబైనను, ఇంకన్ = ఇఁకమీఁదను, మేలు = క్షేమము, అన్నన్ = అనఁగా.

తా. ఖాండిక్యుండు చంపెద ననఁగా విని, కేశిధ్వజుండు చేయెత్తి “యోహో కోపింపకుము. మఱి ‘హన్యాదేవావిచారయన్’ అను మనువచనప్రకారము విచారింపకయే వధించుటకు నే నాతతాయిని గాను. బుద్ధిమాంద్యమువలన జన్నమునకు వైకల్య మొదవఁగా, విప్రసంఘమును ప్రాయశ్చిత్తము వేఁడ, నందులకు ‘నోయి రాజా! యాఖాండిక్యునకుం దక్క నెవ్వరికిం దెలియదు గాన, నతని వేఁడుము పొ’మ్మని న న్నావేదించి పనిచిరి గాన వచ్చితిని. రోషమును వదలి ప్రాయశ్చిత్తము సెప్పినను లేక బాణమును విడిచి వధించినను, నీకముం దేవిధంబైనను క్షేమంబే” యని పలికెను.

వ. అనిన నతండు తరుషండంబు సొచ్చి, మంత్రి పురోహిత ప్రభృతి
సుహృజ్జనంబులకుఁ దద్వృత్తాంతం బంతయుం జెప్ప, మంతనంబునకుం
జొచ్చినమంత్రు లి ట్లనిరి. 31

టీ. అనినన్ = ఆకేశిధ్వజుం డి ట్లని చెప్పఁగా, అతండు = ఆఖాండిక్యుఁడు, తరుషండంబు చొచ్చి = చెట్లగుంపులోపలికిఁబోయి, మంత్రి పురోహితప్రభృతి సుహృజ్జనంబులకున్ = ప్రధానులు పురోహితులు మొదలగు నాప్తజనంబులకును, తద్వృత్తాంతంబు = ఆకేశిధ్వజునియొక్క వృత్తిని, చెప్పన్ = చెప్పఁగా, మంతనంబునకున్ = ఆలోచించుటకు, చొచ్చిన = ప్రవేశించిన, మంత్రులు = ప్రధానులు, ఇట్లనిరి.

తా. సుగమము.

క. 'పాలుగలవాఁడు మన కొక
జాలి యిడక తానె(న) తారసానకు వచ్చెన్;
వేళ యిదె, లెమ్ము, నృప! కృప
చాలు న్గారాకు మేపి చంపకు ప్రజలన్. 32

టీ. పాలు గలవాఁడు=దాయాదుఁ డయినవాఁడు, మనకున్ ఒకజాలి ఇడక = మనకొక వ్యథపెట్టకయే, తానె, తారసానకు వచ్చెన్=కలపడుట కేతెంచెను. ('ఏకృతౌ క్వచిచ్ఛన్దసి మో ర్దీర్ఘశ్చాత ఆదిమస్య భవే' త్తను సూత్రముచేత ములోపమును బూర్వవర్ణ దీర్ఘంబునుం గలిగె.) వేళ ఇదె = సమయ మిదె, నృప! = రాజా, కృప చాలున్=దయచేసినది చాలును, ప్రజలను=ప్రజలను, కారాకుమేపి = ఎండుటాకులు దినిపించి, చంపకుము = వధింపకుము, లెమ్ము.

తా. మంత్రులు 'దాయాదుఁ డైనవాఁడు మన కొకశ్రమ నియ్యక తానే తార సమునకు వచ్చెఁ గాన నిదె సమయము; రాజా! శత్రుని విషయమయి మీదయ చాలును, మీసేవకు లగుప్రజలను కారాకుఁ దినిపించి చంపకుము, శీఘ్రముగ యుద్ధమునకు లెమ్ము.

ఉ. అంటలు గట్టి [1]చేలకును నాంధ్రును బిడ్డలుఁ గూరఁగోయఁబోఁ,
గంటకము [2]ల్పదాగ్రములఁ గాఁడఁగ దూసిననొప్పిఁ గూయిడన్
గంటికి నిద్ర గాన కొదు గంబడి వేఁగెద మిందు; నొక్కమా
కంటయ కాదు, నీవు పడునట్టియవస్థ వచింప శక్యమే. 33

టీ. ఆంధ్రును = భార్యలును, ('నిత్యం దారాదేశ్చ స్యా ల్లో ర్లలయో రుకా చ తత్రస్త' అను సూత్రముచేత నాంధ్రు,) బిడ్డలు, అంటలు గట్టి=గుంపులు గట్టుకొని, చేలకును = క్షేత్రములకు, కూరఁగోయఁబోన్, కంటకముల్ = ముఁడ్లు, పదాగ్రములన్ = కాళ్ళకొనలయందు, కాడఁగన్ = నాటఁగా, దూసిననొప్పిన్=విడఁదీసిన నొప్పిచేత, కూయిడన్ = కూఁతలుపెట్టఁగా, కంటికిన్ నిద్ర కానక = కంటికి నిద్ర యెఱుంగక, ఒదుగంబడి = ఒదిగి, వేఁగెదము = వేఁగుచున్నారము, ఒక్కమాకున్ అంటయకాదు = మాకుమాత్ర మనుటే కాదు, ఇందున్ = ఇక్కడ, నీవు పడునట్టి యవస్థ = నీవు పడు కష్టము, వచింపన్ శక్యమే = చెప్పఁదరమా.

తా. ఆంధ్రును బిడ్డలును పొలములయందుఁ గూరలు గోయం బోవుతఱిఁ గాళ్ళ ముండ్లు నాటినం దీయఁగానే నొప్పిచేతఁ గూఁతలిడఁ గంటికి నిద్ర పట్టక యిచ్చట

1. చెర్కులకు, చెల్కులకు. 2. పదాబ్జములఁ గాఁడ నొదర్చిన నొప్పిఁగుయిడన్.

నొదిగికొని పేఁగుచున్నార మిట్టిశ్రమ మాకుమాత్రమె కాదు నీవు పడునట్టియవస్థయుఁ జెప్పఁదరము గాకున్నది గదా. అలం. స్వభావోక్తి.

తే. స్వామ్యమాత్యసుహృత్కోశజనపదబల
దుర్గములు స్వామి గలిగినఁ [1]దొలుతఁ గలవు
అంగి సుఖియైన నంగంబు లటకు మునుపె
చాల సుఖు లౌట మనకు దృష్టంబు గాదె ? 34

టీ. స్వామ్య.. లు-స్వామి = రాజు, అమాత్య=మంత్రులు, సుహృత్=ఆప్తులు, కోశ=భండారము, జనపద=దేశము, బల=చతురంగబలము, దుర్గ ము=కోట, (ద్వంద్వాంత మున బహువచనము) ఇవి, స్వామి=ప్రభువు, కలిగినన్=కలిగినట్లాయెనేని, తొలుతన్ కలవు = అమాత్యాదులు ముందే కలరు, అంగి = శరీరి, సుఖియైనన్ = సుఖముగల వాఁడాయెనేని. అంగంబులు = కరచరణాదులు, అటకుమునుపె = అంతకుముందఱనే, చాలసుఖులు ఔట = మిగుల సుఖముగలవౌట, మనకున్ దృష్టంబు కాదె = మనకు అనుభవమేకదా ? అలం. అప్రస్తుతప్రశంస, అర్థాంతరన్యాసము.

తా. స్వామ్యమాత్యాది సప్తాంగములు రాజుగలిగెనేని యటకు మున్నె యమాత్యాదులుం గలరు. శరీరి సుఖియైన యెడఁ గరచరణాద్యవయవములు మున్నె సుఖంబులం బడసి యుండుట మనకు దృష్టాంతముగా నుండ లేదా యని నుడివిరి.

క. అతనిపని దీర్ప రాజ్య
ద్వితయము నినుఁ జేరు నెట్టిపెరవున నైనన్
క్షితిపుల కరిజయము ధనో
న్నతియుఁ బ్రజా[2]నీతిరక్షణము ధర్మంబుల్. 35

టీ. అతనిపని తీర్పన్ = ఆకేశిధ్వజునిం జంపితివేని, రాజ్యద్వితయము = మా యుభయుల రాజ్యములు, నినున్=నిన్ను, చేరున్ = పొందును. ఎట్టిపెరవున నైనన్= ఏయుపాయముచేతనైనను, అరిజయము = శత్రుసంహారము, ధన ఉన్నతియున్=ధన మార్జించుటయు, ప్రజానీతిరక్షణమున్ = ప్రజలను నీతితో రక్షించుటయు, ఇవి, క్షితి పులకున్ = రాజులకు, ధర్మంబుల్ = ధర్మములు.

తా. ఆ కేశిధ్వజుని వధియించితి వేని మా యిరువుర రాజ్యములు నిన్నుఁ జేరును. ఎట్టి నేర్పుచేతఁ గాని శత్రుసంహారము సేయుటయు, ధన మార్జించుటయుఁ, బ్రజలను నీతిప్రకారముగఁ బాలించుటయు నివి క్షత్త్రియ ధర్మంబులు. అలం. అప్రస్తుతప్రశంస.

1. తొలుతె కలుగు. 2. సదయ.

క. అన్యాయంబున దుస్సహ
మన్యుం డగుప్రబలరిపుని ♦ మడియించిన ధ
ర్మన్యక్కృతి కగు నిష్కృతి
సన్యాయంబుగఁ బ్రజాళి ♦ సంరక్షింపన్. 36

టీ. దుస్సహమన్యుండు=సహింపరాని యాగ్రహముగలవాఁడు, అగు = అయిన, ప్రబల రిపునిన్ = బలవంతుఁ డైనశత్రువును, అన్యాయంబునన్=అనీతిచేత న్యాయ విరుద్ధముగా, మడి...కిన్ - మడియించిన = మడియించుటవలని, ధర్మన్యక్కృతికిన్= ధర్మతిరస్కారమునకు, ప్రజాళిన్ = ప్రజలసంఘమును, సన్యాయంబుగన్=న్యాయ యుక్తముగా, సంరక్షింపన్=పరిపాలింపఁగా, నిష్కృతి=అదె ప్రాయశ్చిత్తము, అగున్.

తా. మిగుల రోషయుక్తుఁ డైన శత్రువు నన్యాయముగ వధియించిన పక్షమున ధర్మ తిరస్కార మగు, నందులకు న్యాయముగా దయతోఁ బ్రజాపాలన మొనరించినయెడ నదియె ప్రాయశ్చిత్త మగుఁ గాక, నిరాయుధుఁ డైవచ్చిన పగవానిం జంపినయెడఁ బ్రాయశ్చిత్త మొనరింప వచ్చు నని చెప్పిరి.

క. తనరాష్ట్రము చెడ వచ్చిన
ననిమిషపతి విప్రుఁ డనక ♦ యాచార్యుఁ ద్రిశీ
ర్షునిఁ దునుమఁడె విడువుము దయ
నిను నమ్మినప్రజలు నవయ ♦ నీ దయ యేలా ? 37

టీ. తనరాష్ట్రము = తన రాజ్యము, చెడవచ్చినన్ = హానిఁజెందరాఁగా, అనిమిషపతి=దేవేంద్రుఁడు, విప్రుఁడు అనక=బ్రాహ్మణుఁ డని సంకోచింపక, ఆచార్యున్= గురువైనట్టి, త్రిశీర్షున్ = విశ్వరూపుని, తునుమఁడె = వధింపఁడా, దయన్=శత్రుని మీఁది కృపను, విడువుము = వదలుము, నిను నమ్మినప్రజలు, నవయన్ = కష్టపడఁగా, నీదయ = నీకృప, ఏలా = ఏటికి.

తా. దేవేంద్రుండు తన రాజ్యమునకుఁ గీడొనరించుచున్న యాచార్యుం డగు విశ్వరూపుని బ్రాహ్మణుం డని విచారింపకయే వధింపలేదా? శత్రునిమీఁద నున్న కృప విడువుము. నిన్ను నమ్మియుండు ప్రజలు కష్టపడుచుండఁగా నీ దయవలన నేమి ప్రయోజనము ? అని పలికిరి.

క. శిష్టు నిను నింత చేసిన
దుష్టాత్మునిఁ బిలుకుమార్చి ♦ దురితము పెనపఁ

నష్టంబుగ భూవల్లభ !
యిష్టాపూర్తములు సేసి । యెసఁగఁగ రాదే ? 38

టీ. భూవల్లభ = రాజా! శిష్టున్ = శిష్టుఁడవైనట్టి, నినున్ = నిన్ను, ఇంత చేసిన = మిక్కిలికష్టపెట్టిన, దుష్టాత్మునిన్=దురాత్ముని, పిలుకుమార్చి=చంపి, పిదపన్ = పిమ్మట, దురితము = పాపము, నష్టంబుగన్ = నశించునటుల, ఇష్టాపూర్తములు చేసి = క్రతువులు వాపీకూపాది నిర్మాణములు సేసి, (ని. 'అథ క్రతుకర్మేష్టం పూర్తం ఖాతాది కర్మచ' యని యమరము.) ఎసఁగఁగన్ రాదే = ఒప్పరాదే.

తా. పూజ్యుండవైన నిన్ను వ్యథపెట్టిన దుష్టుం డగుశత్రునిం జంపి పిదపఁ బాపములు పోవుటకుఁగాఁ, గ్రతువులు వాపీ కూపాది ధర్మములు సేయఁ గూడదా యని వచించి రనుట.

తే. ఇంక రెన్నాళ్లు సూచి, నీ । వంకఁ దెగువ
గలుగకుండినఁ బ్రజ లూళ్లు । దలఁచి పోవ
మౌని వగుటయె యొండె, వి । హీనసంధి
నతనిఁ గనుటొండె గా కొండు । మతము గలదె ? 39

టీ. ఇంకన్ = ఇఁకను, రెన్నాళ్లు చూచి = రెండుదినములు చూచి, నీవంకన్ = నీయందు, తెగువ = తెంపు, కలుగక ఉండినన్=లేకయుండెనేని, ప్రజలు = జనులు, ఊళ్లు దలఁచిపోవన్ = తమతమయూళ్లు స్మరించి లేచిపోయినయెడల, మౌనివి అగుటయె యొండె = మునివగుటకాని, విహీనసంధిన్ = హీనమగుసంధిచేత, అతనిన్ కనుటొండె = ఆకేశిధ్వజునిఁ జేరుటఁగాని, ఈరెండువిధములు దక్క, ఒండుమతము = గౌరవమైన మఱియొక మార్గము, కలదా ? లే దనుట.

తా. రాజా! ఇఁకమీఁద రెండు దినములు సూచి జనులు నీయందుఁ దెగువపుట్ట కుండెనేని వారి వారి యూళ్లు తలంచుకొని వెళ్లెదరు. పిదప నీవు మునివృత్తి నాశ్రయింపవలెను; లేక యతనితో హీనసంధియైనను జేయవలయును. ఈరెండువిధములు దక్క గౌరవం బైన మఱియొక మార్గము లే దనిరి. అలం. వికల్పము.

క. జనవర ! తపమునకుం జొ
చ్చినఁ గన్నులు [1]మూసికొంట । సెల, వింతియ కా
క నిదిధ్యాసకు బ్రహ్మం
బెనయునె పరిభవము(పు)శల్య । మెదలో మెఱయున్. 40

1. మూసికొనుట.

టీ. జనవర = రాజా ! పరిభవము(పు)శల్యము = అవమాన మనెడి యలుఁగు, ఎదలోన్ = హృదయమున, మెఱయన్ = మెదలుచుండఁగా, తపమునకున్ = తపస్సునకు, చొచ్చినన్ = ప్రవేశించినను, కన్నులు మూసికొంటె = కన్నులు మూసికొనుటయె, సెలవు = ప్రయోజనము, ఇంతియకాక = ఇంతేకాని, నిదిధ్యాసకున్ = ఏకాగ్రధ్యానమునకు, బ్రహ్మంబు = పరబ్రహ్మము, ఎనయునె = సందర్భించునా ?

తా. ఓ రాజా! తపం బొనర్చుట కేతెంచినను గన్నులు మూసికొనుటే ప్రయోజనము గాని, తిరస్కార మనియెడియలుగు హృదయమందు మెదలుచుండఁగా బ్రహ్మానుసంధాన మనుకూలింపదు.

క. అవమతిఁ బితృఘ్ను లగుభూ
ధవుల వెదకి పిల్లపిల్ల తరము తునిమి భా
ర్గవుఁడు ముని యయ్యె; మఱి వై
భవము వలదు శాంతి కైనఁ బగ దెగ కగునే. 41

టీ. అవమతిన్ = అవమానముచేత, పితృఘ్ను లగు = తండ్రినిఁ జంపినట్టి, భూధవులన్ = రాజులను, వెదకి, పిల్లపిల్లతరము = పిల్లలను సయితము వరుసగా, తునిమి = చంపి, భార్గవుఁడు = పరశురాముఁడు, ముని యయ్యెన్ = జడదారి యయ్యెను, మఱి = మఱియును, వైభవము = ప్రభుత్వము, వలదు = అక్కఱ లేదు, శాంతికైనన్ = ఉపశాంతికైనను, పగదెగక = పగఁదీర్చికొనక, అగునే = సిద్ధించునా, సిద్ధింప దనుట, అప్రస్తుతప్రశంస, అర్థాంతరన్యాసము.

తా. పరశురాముం డవమానముచేతఁ దనతండ్రినిఁ జంపిన రాజులను వెదకి పిల్లపిల్లతరము చంపి పిమ్మట ముని యయ్యెను. కాన నటువలెఁ బ్రభుత్వము వలదు. పోనీ, శాంతికైనను బగఁ దీర్పకయె సిద్ధింప దని పల్కిరి.

తే. పగయు వగయును లేక యేపాటి గన్న
నలరు సామాన్యసంసారి యగుట మేలు
మదిఁ (ఱితఁ) దగిలె నేని శాంతిచే మఱవఁ దగదు
రాజ్యభూమికఁ దాల్చినరాజున(ల)కును. 42

టీ. పగయున్ = ద్వేషమును, వగయును = విచారమును, లేక, ఏపాటి కన్నన్ = ఏమాత్రము గలిగినను, అలరు...రి - అలరు = సంతసించునట్టి, సామాన్య సంసారి అగుట మేలు = పరిపాటి సంసారి యగుటయే మేలు, రాజ్యభూమిక - రాజ్య = ప్రభుత్వ మనెడి, భూమికన్ = వేషమును, తా...ను - తాల్చిన = ధరియించిన, రాజునకును =

భూపాలునకును, మదిన్=బుద్ధిని, తగిలెనేని=శత్రుకృత తిరస్కార మంటినట్లాయెనా, (మఱితగిలెనేని అను పాఠమున-మఱి=అట్లుకాక, తగిలెనేని = పగయువగయు నంటిన యెడల-అని యర్థము.) శాంతిచేన్ = శమముచేతను, మఱవఁదగదు = మఱవరాదు.

తా. ఒకనితో ద్వేషమును జింతయును లేక యేపాటి కలిగినను సంతసించు నట్టి పరిపాటిసంసారి యగుట యుత్తమము. రాజ్య మనుభూమికను ధరియించిన రాజునకు శత్రుకృతతిరస్కారము మదిం దగిలెనేని శాంతచిత్తుఁడై సమాధిమై నుంట దుష్కరము.

క. పులి మల డిగి యూళ్లకు న
క్షులరుజ రాఁ జనము మాన్పఁగోఁ బనిచి గవిన్
[1]నెలకొన సురియలు గొని చని
పొలియునొ? యూరఁ గుయి రేఁగి పొడుచునొ? చెప్పుమా. 43

టీ. పులి=వ్యాఘ్రము, (ఈనినపుడు) అక్షులరుజన్ = కన్నులకలఁకచేత, మల డిగి = పర్వతమునుండి దిగి, ఊళ్లకున్ = గ్రామములకు, రాన్=రాఁగా, జనము=ప్రజ, మాన్పఁగోన్ పనిచి=దయచే ఆకలఁకను మాన్పుకొను మని పంపి, గవిన్ = గుహయందు, నెలకొనన్ = స్వస్థమైయుండఁగా, దానిమీఁద, సురియలుగొని = చుఱకత్తులను గొని, చని=పోయి, పొలియునో = దానిచేతఁ జచ్చునో, లేక, ఊరన్ = కన్నుల నొప్పితో వచ్చినప్పుడు గ్రామమందు (జనము), కుయిరేఁగి = గుంపు లయి కూఁతలు పెట్టుచు, పొడుచునొ, చెపుమా = వచింపుమా. అలం. అప్రస్తుతప్రశంస.

తా. పులి యీనినప్పుడు కన్నుల కలఁకతోఁ గొండ దిగి గ్రామములకు రాఁగా నందఱు ప్రోగై కూఁత లిడుచు వచ్చి యపాయము నొందిన పులినిఁ జంపుదురో, లేక దాని నేత్రవ్యాధిని దయచేసి మాన్పుకొన నిచ్చి, దానికి నెలవగు గవియందు స్వస్థముగా నుండు తఱి జన మాయుధములం బట్టిపోయి యా పులిచేతఁ జత్తురో వచింపుము.

క. ఈవేళ బలియు నతనిం
బో విడిచితి పొమ్ము [2]వాఁడు పోయిన రాజ్యం
బేవిధిఁ గ్రమ్మఱు నావెర
వీవెర వని ప్రేలు మఱచి [3]యేర్పడఁ జెపుమా. 44

1. నెలవుకొని సురియ గొని; నెలవుకొన సురియ గొని. 2. పాడిఁ బో. 3. యెన్నము చాలున్.

టీ. ఈవేళన్ = ఈసమయమున, బలియుఁ డతనిన్ = బలవంతుఁడగు నా కేశిధ్వజుని, పోవిడిచితి పోమ్ము = పోవునట్లుగ విడిచిపెట్టితివి పో, వాఁడు పోయినన్, రాజ్యంబు=సామ్రాజ్యము, ఏవిధిన్ క్రమ్మఱున్=ఏప్రకారము మరలవచ్చును, ఆవెరవు= సామ్రాజ్యము వచ్చెడి యా యుపాయము, ఈవెరవు అని=ఈయుపాయ మని, వ్రేలు మడఁచి = అంగుళమువంచి, ఏర్పడన్ = తెలియునటుల, చెపుమా = వచింపుమా.

తా. ఈ సమయమందు మిగుల బలవంతుఁడగు కేశిధ్వజుని విడిచి పెట్టితివిపో వాఁడు పోయిన పిమ్మట సామ్రాజ్య మేవిధంబున మరల వచ్చునో యా యుపాయం బిది యని వ్రేలు మడఁచి చెప్పుము.

తే. అలసతఁ బరున్నమనుజుండు కలియుగంబు,
ద్వాపరం బెన్నఁ గూర్చున్నవాఁడు, త్రేత
యుత్థితుఁడు, యాయి మఱి కృతయుగ మటన్న
నముచిదమనోక్తి ఋగ్బ్రాహ్మణమున వినవె(మె). 45

టీ. అలసతన్ = ఆయాసపడుటచేతను, పరున్నమనుజుండు = పండుకొనిన నరుఁడు, కలియుగంబు = కలియుగము వంటివాఁడు, కూర్చున్నవాఁడు, ఎన్నన్ = విచారింపఁగా, ద్వాపరంబు = ద్వాపరమువంటివాఁడు, ఉత్థితుండు = లేచినవాఁడు, త్రేత=త్రేతాయుగమువంటివాఁడు, మఱి=మఱియును, యాయి = సంచరించువాఁడు, కృతయుగము = కృతయుగమువంటివాఁడు, అటన్నన్ = అట్లనునట్టి, నముచిదమన ఉక్తిన్ = ఇంద్రుని వాక్యమును, ఋగ్బ్రాహ్మణమునన్ = ఋగ్వేదమందలి బ్రాహ్మణ మందు, వినవే = విన్నవాఁడవుకావా. (అనఁగా నిరుద్యోగుఁడుగా నున్నవాఁడు పరమ నికృష్టుఁ డనుట.) అలం. అప్రస్తుతప్రశంస.

క. ఛిద్రప్రహారి రాష్ట్రో
పద్రవపరిహారి యాప్తభాషణరుచి వే
ళోద్రిక్తుఁ డన్యవేళా
నుద్రిక్తుఁ డనల్పకాల ముర్వి [1]భరించున్. 46

టీ. ఛిద్రప్రహారి-ఛిద్ర = తన రాజ్యమందుఁ బుట్టిన దోషంబులను, ప్రహారి= పోఁగొట్టువాఁడును (శత్రువున కేదేని యిక్కట్టు వచ్చినప్పుడు సమయించువాఁడు), రాష్ట్రోపద్రవపరిహారి = రాజ్యమునకు శత్రువులవలని యుపద్రవమును బోఁగొట్టు వాఁడును, ఆప్త = ఇష్టులయినవారియొక్క, భాషణ = వాక్యములయందు, రుచి =

1. భుజించున్.

ప్రీతిఁగలవాఁడును, వేళా=శత్రువును వధింపఁదగిన సమయముదొరకినప్పుడు, ఉద్రిక్తుఁడు = త్వరపడినవాఁడును, అన్య...డు-అన్యవేళ = సమయముకానియప్పుడు, అనుద్రిక్తుఁడు = త్వరపడక యుండువాఁడును, అనల్పకాలము = బహుకాలము, ఉర్విన్ = భూమిని, భరించున్ = వహించును.

తా. తనరాజ్యమునఁ బుట్టిన దోషములను వెంటనే పోఁగొట్టుచుఁ, దనరాజ్యమునకు శత్రువులవలని యుపద్రవము లంటకుండఁ జేయుచు, శత్రుభంజనావసరము సిద్ధించినపు డాప్తుల ప్రీతి వాక్యముల విని ప్రయత్నపడుచును నాసమయములయందుఁ ద్వరపడక నిమ్మళించుచు, నిత్తెఱంగునఁ బ్రవర్తించురాజు బహుకాలము పుడమిఁ బాలించును.

వ. లేలె మ్మనుటయుఁ బ్రధానులకు భూనాథుం డిట్లనియె. 47

క. మీ నొడివినయది కార్యం
బౌ; నిప్పని సేయ రాజ్య § మంతయు మనకున్
వానికిఁ బరలోకము జిత
మౌ నొక్కట, నిందు వాసు § లరయఁగ వలయున్. 48

టీ. మీనొడివినయది=మీరన్నవాక్యము, కార్యం బౌన్=కర్తవ్యమవును, ఇప్పని సేయన్ = ఈకార్యము సేయఁగా, ఒక్కటన్=ఏకకాలములో, రాజ్యమంతయున్ = ఎల్లరాజ్యము, మనకున్, వానికిన్=ఆకేశిధ్వజునకు, పరలోకము=స్వర్గము, జితమౌన్ = గెలువఁబడిన దౌను, (అనఁగాఁ గలుగు ననుట). ఇందున్=ఈరెంటియందును, వాసులు= ఎక్కువతక్కువలు, అరయఁగవలయున్ = విచారింపవలయును.

తా. మీ రన్నది చేయఁ దగినది యౌను. ఈలాగునఁ జేయఁగా నేకకాలములో మనకు నెల్లరాజ్యంబును, వానికిఁ బరలోకమును సిద్ధించుచున్నది యయిన నీ రెంటి యొక్క తారతమ్యము విచారింప వలయు నని చెప్పెను.

క. పర[1]లోకసుఖము శాశ్వత
మరయ; మహీరాజ్యసౌఖ్య § మల్పానేహః
పరిభోగ్యం; బిందుల కై
దురితము కావించి తొలఁగు § దునె పరమునకున్. 49

టీ. అరయన్ = విచారింపఁగా, పరలోకసుఖము = పరలోకానందము, శాశ్వతము = నిత్యము, మహీరాజ్యసౌఖ్యము = భూపాలనమువలనిసుఖము, అల్పానేహఃపరి

1. లోకము శాశ్వతసుఖ.

భోగ్యంబు=స్వల్పకాల మనుభవింపఁదగినది. (ని. 'కాలోదిష్టోఽప్యనేహాపి' యని యమరము.) ఇందులకై = ఈఅల్పసుఖమునకై, దురితము=పాపము, కావించి = చేసి, పరమునకున్=పరలోకసుఖమునకు, తొలఁగుదునె=దూరమగుదునా. అలం. కావ్యలింగము.

తా. విచారింపఁగాఁ బరలోకానందము నిత్యమును, రాజ్యానంద మనిత్యమును గాన నల్పకాలానుభవయోగ్యం బైన రాజ్యమునకై పాప మొనర్చి పరలోకమునకు దూరీభూతుఁడను గా నొల్ల ననియె.

క. బద్ధాంజలిపుటు దీనున్
[1]క్రుద్ధతఁ దనమఱుఁగు సొరఁగఁ గూల్చుట కడుఁ గీ
డుద్ధతి పరలోకార్జన
బుద్ధికి నను [2]కండువాక్యములు తలఁప రొకో. 50

టీ. బద్ధాంజలిపుటున్=ముకుళితహస్తుఁడయినట్టి, దీనున్=దైన్యమొందినవానిని, తనమఱుఁగుసొరఁగన్ = తన్ను శరణుఁజొచ్చినపుడు, క్రుద్ధతన్ = కోపయుక్తుఁ డై, ఉద్ధతిన్ = గర్వముచేత, కూల్చుట=వధియించుట, పరలోకార్జనబుద్ధికిన్=పరలోకము సంపాదించెద ననుమనంబు గలవానికి, కడుఁగీడు = మిక్కిలిపాపము, అను=అనునట్టి, కండువాక్యములు = కండుమహర్షి వాక్యములు, తలఁపరొకో = విచారింపరా. అలం. అప్రస్తుతప్రశంస.

తా. బద్ధాంజలి యయి దీనత్వము వహించి శరణుఁ జొచ్చినవానిఁ బరలోక బుద్ధి గల పురుషుఁడు కోపయుక్తుఁ డై గర్వముచేత వధియించెనేని, యతనికి మహాపాతకంబని కండుమహర్షి చెప్పినవాక్యములు విచారింపరు కాఁబోలును.

ఆ. అనుచు వెడలి వచ్చి, యారాజు నడిగి, త
ద్ధర్మధేనువధక్రమంబు
దెలిసి, తగిన నిష్కృతి వచింప, నాతండు
[3]మగుడఁ గ్రతువు సాంగముగ నొనర్చె. 51

టీ. అనుచున్=ఇట్లనుచు, వెడలివచ్చి=పెండెముబయలువెళ్ళివచ్చి, ఆరాజున్=ఆకేశిధ్వజుని, అడిగి,ధర్మధేనువధక్రమంబు=యజ్ఞధేనువధప్రకారమును,(ని. 'ఉత్తమాగోషు నైచికీ' యని యమరము.) తెలిసి=ఎఱింగి, తగిననిష్కృతిన్=సరియైన ప్రాయశ్చిత్తమును, వచింపన్=చెప్పఁగా, ఆతండు = ఆ కేశిధ్వజుండు, మగుడన్=మరలివచ్చి,

1. క్రుద్ధుం డై శరణు చొరఁగ; క్రుద్ధుం డై మఱుఁగు సొరఁగ. 2. కణ్వ. 3. మగుడి.

క్రతువు = యజ్ఞమును, సాంగముగన్ = సంపూర్ణముగా, ఒనర్చి = చేసి. ముందటి కన్వయము.

తా. ఖాండిక్యుండు మంత్రులతో నాలోచించి యిట్లనుచుఁ బెండెము వెదలి వచ్చి కేశిధ్వజునివలన యజ్ఞధేను వధక్రమం బెఱింగి తగిన ప్రాయశ్చిత్తము విచారించి చెప్పఁగా, నా కేశిధ్వజుండు మరల యజ్ఞశాలకు వచ్చి క్రతువును సాంగోపాంగముగ నొనర్చెను.

ఆ. అవభృథాప్లుతోత్తమాంగుఁ డై, ఋత్విక్స
దస్యగణముఁ బూజఁ దనిపి, పిదప
సూత మగధ వంది వైతాళికప్రభృ
త్యర్థికోటి కభిమతార్థ మొసఁగి. 52

టీ. అవ...డై-అవభృథ=అవభృథ మనుయజ్ఞదీక్షాంతస్నానముచేతను, ఆప్లుత = చక్కఁగాఁదడుపఁబడిన,ఉత్తమాంగుఁడై=శిరముగలవాఁడై, ఋత్వి...మున్-ఋత్విక్ = ఋత్విజులయొక్కయు, సదస్య = సభ్యులయొక్కయు, గణమున్ = సమూహమును, పూజన్ = దక్షిణాంతపూజచేత, తనిపి = తృప్తినొందించి, పిదపన్=పిమ్మట, సూత... కిన్ - సూత, మగధ, వంది, వైతాళికప్రభృతి = వీరలుమొదలగు, అర్థికోటికిన్ = యాచకసమూహమునకు, అభిమతార్థము = కోరినవస్తువులను, ఒసఁగి = ఇచ్చి. ముందటి కన్వయము.

తా. కేశిధ్వజుండు యాగము ముగియఁగా నవభృథస్నాతుఁ డై ఋత్విజులకును బూజనీయులగు సభ్యులకును దక్షిణాంతపూజ లొనర్చి తృప్తి నొందించి సూతమాగధాది యాచక సమాజమునకుఁ గోరిన వస్తువుల నెల్ల నిచ్చెను.

తే. మఱియుఁ గోరినవారి యక్కఱలు తీర్చి
యును మనఃపూర్తి చాల కొయ్యనఁ దలంచి
'యకట గురుదక్షిణ యొసంగ దయితి' నంచు
మగుడఁ జని శంక నతఁడు సంభ్రమపడంగ. 53

టీ. మఱియున్ = ఇదియునుంగాక, కోరినవారి యక్కఱలు, తీర్చియును = కోరినవారికోర్కు లన్నియు నిచ్చియును, మనఃపూర్తి చాలక=మనస్సునకుఁ దనివితీరక, ఒయ్యనన్ = మెల్లగా, తలంచి=తలఁచుకొని, అకట, గురుదక్షిణ ఒసంగన్ ఐతిన్= గురుదక్షిణయీయనైతిని, అంచున్, మగుడన్ = మరలను, చని = పోయి, అతఁడు = ఆఖాండిక్యుఁడు, శంకన్ = అనుమానముచేతను, సంభ్రమపడంగన్=తొట్రుపడఁగా.

తా. మఱియు నా కేశిధ్వజుండు కోరినవారి మనోరథముల నెల్లఁ బూరించి యును మనస్తృప్తిలేక యాలోచించి, గురుదక్షిణ యీయనయితె నని మెల్లగఁ దలంచి కొని, యాఖాండిక్యుఁ డున్న నెలవుఁగూర్చి వెళ్లి యాఖాండిక్యుఁడు తొట్రుపడఁగా.

క. వారించి 'నీకు నెయ్యది
కోరిక? యేతెంచినాఁడ ౹ గురుదక్షిణ యీ
భూరమణ వేఁడు' మనుటయు
నారాజన్యుండు మఱియు ౹ నాప్తులతోడన్. ౫౪

టీ. వారించి = నీకు శంక వలవ దని తొట్రుపాటుమాన్పి, గురుదక్షిణ ఈన్ = గురుదక్షిణ యిచ్చుటకొఱకు, ఏతెంచినాఁడన్ = వచ్చినాఁడను, భూరమణ=ఓరాజా, నీకున్=నీకు, ఎయ్యది కోరిక = ఏమేమి యపేక్షితంబు, వేఁడుము=అడుగుము, అనుట యున్ = అనఁగా, ఆరాజన్యుండు = ఆఖాండిక్యుఁడు, మఱియున్ = మరల, ఆప్తుల తోడన్ = ఇష్టులతోడ.

క. 'గురుదక్షిణ యిచ్చుట కీ
నరవరుఁ డేతెంచె; మీరు ౹ నా కనురక్తుల్;
పరికించి పదింబదిగా
నరయుఁడు మది నెద్ది మేలు ౹ ప్రార్థించుటకున్.' 55

టీ. గురుదక్షిణ యిచ్చుటకున్, ఈనరవరుఁడు = కేశిధ్వజుండు, ఏతెంచెన్ = వచ్చెను, మీరు = మీరలు, నాకున్, అనురక్తులు=ఆప్తులు, ప్రార్థించుటకున్ = అడుగుటకు, ఎద్ది మేలు = ఏది యుత్తమంబు, మదిన్ = మనస్సున, పరికించి=వెదకి, పదిం బదిగాన్ = విస్తారముగ, అరయుఁడు = విచారింపుఁడు. అలం. కావ్యలింగము.

తా. గురుదక్షిణ యిచ్చుటకై కేశిధ్వజుండు వచ్చి యున్నాఁడు, మీరలు నాకాప్తులు కాన నెయ్యది యుత్తమం బపేక్షించుటకు, దానిం బరికించి మనంబునఁ బదింబదిగా విచారింపుఁడీ యని పలికెను.

ఉ. నావుఁడు వార లమ్మనుజ౹నాథున కిట్లని రుబ్బి; 'నేఁడుగా
దైవము కల్గె; వేగ గురు౹దక్షిణగాఁ జతురర్ణవీవృతో
ర్వీవలయం బశేషమును ౹ వేఁడుము భూవర; మమ్ము నందఱిన్
బ్రోవుము; బాంధవాప్తజన౹పోషణకం బెను ధర్మ మున్నదే? 56

టీ. నావుఁడున్=అట్లనఁగా, వారలు, ఉబ్బి = పొంగి, అమ్మనుజనాథునకున్= ఆఖాండిక్యునితో, ఇట్లనిరి = ఈవిధముగా నొడివిరి, నేఁడుగా = నేఁడుగదా

దైవముకల్గెన్ = అదృష్టము కలిగెను, వేగన్ = గొబ్బున, చతు...బు - చతురర్ణవీవృత = నాలుగు సముద్రములచేతఁ జుట్టఁబడియున్న, ఉర్వీవలయంబు = భూమండలము, అశేషము = సమస్తము, గురుదక్షిణగాన్, వేఁడుము = ప్రార్థింపుము, భూవర=రాజా, మమ్మున్ అందఱన్, ప్రోవుము = రక్షింపుము, బాంధవాప్త జనపోషణకంటెను = బంధుమిత్రవర్గరక్షణకంటెను, ధర్మము = పుణ్యము, ఉన్నదె = ఉన్నదా, లే దనుట.

తా. అట్లనఁగా వారలు హర్షముచేత నుబ్బి 'నేఁడుగదా యదృష్టము గలిగెను. నాలుగు సముద్రముల మధ్యంబున నున్న యశేష భూమండలమును దక్షిణగాఁ గోరి మమ్ముం గాపాడుము. బంధు మిత్ర జన రక్షణకంటెను వేఱె ధర్మము లే' దని ఖాండిక్యునితో విన్నవించిరి. అలం. కావ్యలింగము.

ఉ. ఎన్నఁడు లావు గూడు మన? కెన్నఁ డగు న్దఱి? యయ్యెనేని పో
రెన్నిక యౌనె? పోరిన[1]జయింప నశక్యము; నీదు భాగ్యసం
పన్నతఁ జేరెఁ గార్య మిటు బంధు సుహృత్తతి కొక్కకీడు రా
కున్నటులుండఁగానె; సిరు లూరక చావక నోవ కబ్బునే. 57

టీ. మనకున్, ఎన్నఁడు=ఎప్పుడు, లావు కూడున్ = బలిమిగల్గును, ఎన్నఁడు= ఎప్పుడు, తఱి=సమయము, అగున్ = ఔను, అయ్యెనేని = సమయము సిద్ధించినను, పోరు = యుద్ధము, ఎన్నికయౌనె = శ్రేష్ఠమగునా, శ్రేష్ఠము కా దనుట, పోరినన్ = యుద్ధమొనరించినను, జయింపన్ = గెలుచుట, అశక్యము = శక్యముగాదు, నీదు = నీయొక్క, భాగ్యసంపన్నతన్ = భాగ్యాతిశయముచేతను, బంధుసుహృత్తతికిన్ = బంధుమిత్రవర్గమునకు, కీడు = చెఱుపు, రాక = కలుగక, ఉన్నటులు ఉండఁగానె, కార్యము=ప్రయోజనము, ఇటు=ఈవిధముగ, చేరెన్=ఒనగూడెను, సిరులు=సంపదలు, చావక=మరణము నొందక, నోవక=నొప్పింబడక, ఊరక, అబ్బునే సిద్ధించునా, సిద్ధింప వనుట.

తా. ఎప్పుడు బలిమి గలుగు నెన్నఁడు సమయ మగును? సమయము కల్గినను జగడము శ్రేష్ఠము గాదు కదా? అయినను జగడ మొనర్చితిమిపో జయింప నశక్యంబు, నీయదృష్టమువలన నిట్టి ఘనకార్య మొనగూడెను, బంధుమిత్రవర్గముల కపాయము సంభవింపకయే సంపదలు సిద్ధింప వనిరి.

---

1. జయింపనె చెప్పిరె.

చ. అనవుఁడు నల్ల నవ్వి మనుజాధిపుఁ డిట్లను మీర లర్థసా
ధనపరతంత్రకోవిదులు దక్క మహాసుఖదాయి మోక్షమా
ర్గనయవిచారకోవిదులుగా రతిచంచల రాజ్యలక్ష్మి యే
మని చని వేఁడువాఁడఁ బరమార్థము వేఁడక యమ్మహామతిన్. 58

టీ. అనవుఁడున్ = వారిట్లనఁగా, అల్లనవ్వి = మెల్లగా నవ్వి, మనుజాధిపుఁడు = ఖాండిక్యుఁడు, ఇట్లుఅనున్ = ఈప్రకార మనియెను, మీరలు = మీరు, అర్థసాధన పరతంత్రకోవిదులు దక్కన్ = అర్థసాధక తంత్రవేత్తలుగాని, మహాసుఖదాయి = అఖండానందము నిచ్చునట్టి, మోక్షమార్గ నయవిచారకోవిదులు = మోక్షమార్గ విచారపరులు, కారు, అతిచంచల = మిగుల నస్థిరం బైన, రాజ్యలక్ష్మిన్ = రాజ్యసంపదను, ఏ మని = ఏమిపదార్థ మని, పరమార్థము వేఁడక = పరమపురుషార్థము గోరక, అమ్మహామతిన్ = అజ్ఞాన నిష్ఠుండగు కేశిధ్వజుని, చని = వెళ్లి, వేఁడువాఁడన్ = ప్రార్థింతును.

తా. వార లిట్లపేక్షింప మనుజాధిపుం డగుఖాండిక్యుండు విని నవ్వి, మీర లర్థసాధక తంత్రవేత్తలుగాని పరమ పురుషార్థసాధక తంత్రవేత్తలుగా; రమ్మహాజ్ఞానియైన కేశిధ్వజునియొద్దకుఁ బోయి మోక్షసాధక మార్గముం గోరక యస్థిరం బగు రాజ్యసంపద నెట్లు వేఁడుదు నని పల్కెను అలం. పదార్థహేతుకకావ్యలింగము.

క. నిమివంశోత్పన్నుల మఁట
మముబోఁటుల కకట రాజ్యమా లక్ష్యము వాఁ
డమలినయోగాశ్రయుఁ డు
త్తమయోగము గొనుట యుఱవా ధరఁ గొను టుఱవో. 59

టీ. నిమి...మఁట-నిమి=నిమిచక్రవర్తియొక్క, వంశ=కులమందు, ఉత్పన్నుల మఁట=పుట్టినవారమఁట, అకట=అయ్యో, మముబోఁటులకున్=మావంటివారికి, రాజ్యమా లక్ష్యము = రాజ్యము విషయమా, వాఁడు = ఆకేశిధ్వజుఁడు, అమ...డు-అమలిన = శుద్ధమైన, యోగ = యోగమునకు, ఆశ్రయుఁడు=స్థానమైనవాఁడు, అతనివలన ఉత్తమయోగముఁగొనుట, ఉఱవా = ఉచితమో, ధరన్ = భూమిని, కొనుట = గ్రహించుట, ఉఱవో = యుక్తమో.

తా. అయ్యో! నిమిచక్రవర్తివంశమునఁ బుట్టిన మావంటి వారలకు రాజ్య మొక విషయమా! వాఁ డుత్తమయోగి గాన వానివలన నపవర్గప్రదం బగు నుత్తమ యోగమును గొనుట యుత్తమమో, లేక, భూమిని గొనుట యుత్తమమో యని వచించె ననుట.

సీ. విడుఁ డని [1]వీడు వెఽల్వడి వచ్చి ఖాండిక్యుఁ
డారాజుఁ గనుఁగొని ఽ గారవమున
'గురునిష్క్రియంబు నిఽక్కువముగా నొసఁగదే'
యని [2]వల్క, 'యిత్తుఁ దఽథ్యముగ' నన్న
'నవనీతలేంద్ర! నీఽవధ్యాత్మరతుఁడవు
దక్షిణ గురున కీఁఽదలఁచితేని
సకలభవక్లేశఽసంక్షయం బెయ్యది
యవ్విద్య బోధింపు' ఽ మనిన నవ్వి
తే '[3]యహహ నిష్కంటకాస్మదీఽయాధిరాజ్య
మడుగ నొల్లక యిది యేటి ఽ కడిగి తిపుడు?
క్షత్రియుల [4]కెల్ల రాజ్యంబుఽకంటె మఱి ప్రి
యంబు గలదె?' యటన్న నిఽట్లనియె నతఁడు. 60

టీ. విడుఁడని=ఈమాటలు యుక్తంబులుగావు విడువుం డని, వీడువెల్వడివచ్చి=పాళెము విడిచివచ్చి, ఖాండిక్యుఁడు, ఆరాజున్ = కేశిధ్వజుని, కనుఁగొని = చూచి గారవమునన్ = ప్రేమచేత, గురునిష్క్రియంబు = గురుదక్షిణ, నిక్కువముగాన్ = నిజముగా, ఒసఁగదే యని = ఇచ్చెదవా యని, పల్క = వచించి, తథ్యముగన్ = సత్యముగా, ఇత్తున్ = ఇచ్చెదను, అన్నన్ = అనఁగా, అవనీతలేంద్ర = రాజా, నీవు, అధ్యాత్మరతుఁడవు = బ్రహ్మవిద్యానిష్ఠుఁడవు, గురునకున్ దక్షిణ ఈఁదలఁచితేని=గురుదక్షిణ యీఁదలఁచినయెడల, సకలభవక్లేశసంక్షయంబు ఎయ్యది = సాంసారికసర్వక్లేశనాశకం బేదో, అవ్విద్యన్ = అట్టివిద్యను, బోధింపుము = ఉపదేశింపుము, అనిన్ = అనఁగా, నవ్వి = హసించి, అహహ = ఆశ్చర్యము, నిష్కం...ము-నిష్కంటక=శత్రురహితమైన, అస్మదీయ = నాసంబంధియైనట్టి, అధిరాజ్యము=ప్రభుత్వమును, అడుగన్ ఒల్లక = వేఁడవలనక, ఇది ఏటికిన్ అడిగితి ఇపుడు=ఈయధ్యాత్మవిద్య నిపు డేల యడిగితివి, క్షత్రియులకున్ ఎల్లన్=రాజులకెల్లను, రాజ్యంబుకంటెన్=ప్రభుత్వమునకంటె, మఱి ప్రియంబు కలదె = అతిశయమైన యిష్టముగలదా, అటన్నన్ = అట్లనఁగా, అతఁడు = ఖాండిక్యుఁడు, ఇట్లనియెన్ = ఈప్రకార మనియెను.

తా. ఈ మీమాట లుత్తమములుగావు విడువుం డని యాఖాండిక్యుఁడు పాళెము వెడలివచ్చి కేశిధ్వజుం గని, ప్రీతితో గురుదక్షిణ నిశ్చయముగ నీయఁదలఁచితివా యని

1. గుడిసె. 2. పల్క నిత్తు. 3. యకట. 4. కెందు.

పల్కి, సత్యముగా నిత్తు నన్న 'ఓరాజా నీ వధ్యాత్మవిద్యయందు దక్షుఁడవు గాన సాంసారిక సర్వక్లేశ నాశకం బగునది యేదో యట్టి విద్యను బోధింపు' మనఁగా నవ్వి యాశ్చర్యమొంది 'నిష్కంటకమగునారాజ్యము నడుగ నొల్లక యీ యధ్యాత్మవిద్య నీవు డేల యడిగితివి? రాజుల కెల్లఁ బ్రభుత్వముకంటె గొప్పకార్యము గలదే?' అనఁగా నాఖాండిక్యుఁడు వక్ష్యమాణప్రకారముగ ని ట్లనియె.

మ. 'విను కేశిధ్వజ! ధాత్రి వేఁడమికి నావేదించెద న్హేతు వ
జ్ఞునకుం గాక వివేకి కేల జనియించున్ లౌల్యమెందున్? రణం
బునఁ బాడిన్ రిపు గెల్చువాఁడియుఁ బ్రజాపోషంబు ధర్మంబు రా
జున కౌ, నైన నశక్తుఁ ద్వద్విజితరాజ్యు న్న[1]న్నఘం బంటునే. 61

టీ. కేశిధ్వజ = కేశిధ్వజుఁడా, వినుము = ఆకర్ణింపుము, ధాత్రి = భూమిని, వేఁడమికిన్ = ప్రార్థింపకయుండుటకు, హేతువు = కారణమును, ఆవేదించెదన్ = తెలిపెదను, ఎందున్ = ఎందైనను, లౌల్యంబు = చాపల్యము, అజ్ఞునకుం గాక = అవివేకికిఁ దక్క, వివేకికిన్ = జ్ఞానికి, ఏల జనియించున్ = ఎందులకుఁ బుట్టును, రణంబునన్ = యుద్ధమందు, పాడిన్ = ధర్మముచేత, రిపున్ = శత్రువును, గెల్చువాఁడియున్ = జయించునట్టి బంటుతనమును, ప్రజాపోషంబున్ = ప్రజలరక్షించుటయును, రాజునకున్ = ప్రభువునకు, ధర్మంబు ఔన్ = న్యాయమగును, ఐనన్ = అట్లయినను, త్వద్విజితరాజ్యున్ - త్వత్ = నీచేత, విజిత = జయింపఁబడిన, రాజ్యున్ = రాజ్యముగలయట్టియు, అశక్తున్ = బలిమిలేనియట్టియు, నన్నున్ = నన్ను, అఘంబు = పాపము, అంటునె = స్పృశించునా, అంట దనుట.

తా. ఓయి కేశిధ్వజుఁడా! రాజ్యము వేఁడకుండుటకుఁ గారణముఁ దెలిపెద వినుము. ఏవస్తు వందయినను చాపల్య మజ్ఞునకుఁ గలుగు గాక జ్ఞానికి నేల జనియించును? యుద్ధమందు ధర్మముచేత శత్రువును గెల్చుటయుఁ, బ్రజల రక్షించుటయును, రాజులకు ధర్మం బౌ నయినను, నీచేత నపహరింపఁబడిన రాజ్యము గల్గి యశక్తుఁడ నై యున్న న న్నఘంబులు స్పృశింప వని చెప్పెను.

సీ. నరనాథ! యీరాజ్యపరిపాలనారాతి
హననాదికృతరూప యగునవిద్య
యనధికారికి విసర్జనముఁ గావింపంగఁ
గలుషంబు రా; దధికారియైన

---

1. న్నిహం.

వాఁడు విసర్జింప వచ్చు । వర్ణాచార
లోపంబుచే నగు । పాపలేప;
మైన నే నిత్తుఁ గొ । మ్మనఁ గొను ధరణి భో
గమునకుఁ గాక ధ । ర్మమున కగునె
తే. కాన సత్క్షత్త్రియులకు భై । క్షంబు కీడు
మత్ప్రధానులు వేఁడు సా । మ్రాజ్య మనెడు
పలుకు ధర్మచ్ఛలంపులో । భం బయుక్త
మిది యెఱిఁగి రాజ్య మడుగ నే । నిచ్చగింప. 62

టి. నరనాథ = కేశిధ్వజుఁడా, ఈరాజ్య...ప - ఈరాజ్యపరిపాలనమును, ఆరాతిహనన = శత్రుసంహారము, ఆది = మొదలగువానిచేత, కృత = చేయఁబడిన, రూప = స్వరూపము గలది, అగు=అయిన, అవిద్య = అజ్ఞానము, అనధికారికిన్ = అధికారము లేనివానికి, విసర్జనమున్ కావింపఁగన్=విడిచిపెట్టఁగా, కలుషంబు రాదు=పాప మొదవదు, అధికారియైనవాఁడు, విసర్జింపన్=విడువఁగా, వర్ణాచారలోపంబుచేన్=క్షత్త్రియ వంశాచారలోపముచేతను, అగు...ము - అగు = ఐనట్టి, పాప = కిల్బిషముయొక్క, లేపము = పూఁత, వచ్చున్=కలుగును, (అనఁగాఁ బాపప్రాప్తి యగు ననుట), ఐనన్ = ఐనను, ఏన్ = నేను, ఇత్తున్ = ఒసఁగెదను, కొమ్ము అనన్=గ్రహింపుమనఁగా, కొను=గ్రహించునట్టి, ధరణి=భూమి, భోగమునకున్ కాక=అనుభవించుటకేగాని, ధర్మమునకున్ అగునె = ధర్మమునకగునా, కానన్ = కనుక, సత్ క్షత్త్రియులకున్ = పుడమిఱేండ్లకు, భైక్షంబు = అడిగిపుచ్చుకొనుట, కీడు = పాపము, మత్ప్రధానులు = నామంత్రులు, సామ్రాజ్యము వేఁడు = రాజ్యమును వేఁడుము, అనెడు = అనియెడు, పలుకు=మాట, ధర్మ...బు - ధర్మచ్ఛలంపు = ధర్మమను వ్యాజముగల, లోభంబు = లోభగుణము, అయుక్తము = యుక్తముకాదు, అది యెఱిఁగి = అది తెలిసి, రాజ్యము అడుగన్ = ప్రభుత్వము వేఁడుటకు, ఏను, ఇచ్చగింపన్ = అపేక్షింపను.

తా. ఓయి కేశిధ్వజుఁడా! యీరాజ్యపరిపాలనము శత్రుసంహారము మొదలగువానిచేతఁ జేయఁబడిన రూపము గలయట్టి యవిద్య యనధికారి యగువాఁడు గ్రహింపక విడిచెనేని పాతకము రాదు. అధికారి యగువాఁడు విడిచెనేని క్షత్త్రియ వంశాచారలోప మగుటవలని పాపలేపమగును. ఐనను నే నిచ్చెదఁ బరిగ్రహింపు మనఁగా గ్రహించినట్టి సామ్రాజ్యము భోగమునకేకాని ధర్మమునకుఁ గాదు. కావున రాజులకు యాచ్ఞావృత్తిచేతఁ బుచ్చుకొనుట మిగులఁ బాతకము. నామంత్రులు రాజ్యమును

గోరు మన్న మాట ధర్మవ్యాజముగల లోభగుణంబయుక్తమైనది యని తెలిసి నేను రాజ్య మడుగక బ్రహ్మవిద్య నడిగితి నని ఖాండిక్యుఁడు పలికెను.

తే. 'ఆసపడుదురె బుధులు [1]రాజ్యమున మమత
మానని జడాత్ముల? ట్లహంమానపాన
మత్తులకె కాక యది యేల మాదృశులకు?'
ననిన హర్షించి మెచ్చి యజ్జనకుఁ డనియె. 63

టీ. బుధులు = పండితులు, మమత = మమకారము, మానని = విడువనట్టి, జడాత్ములట్లు = మూఢాత్ములంబలె, రాజ్యమునన్ = రాజ్యమందు, ఆసపడుదురె = వాంఛింతురా, ఆస = ఆవాంఛ, అహం...కాక-అహంమాన=అహంకార మనియెడి, పాన = మధుపానముచేతను, మత్తులకె కాక = మదించినవారికే కాని, మాదృశులకున్ = మావంటి వారికి, ఏల=ఎందుకు, అనినన్ = అనఁగా, హర్షించి=సంతసించి, మెచ్చి = శ్లాఘించి, అజ్జనకుఁడు = ఆకేశిధ్వజుఁడు, అనియెన్ = (ఇట్లు) పలికెను.

తా. ప్రాజ్ఞులైనవారు మమకారము విడువని మూఢులవలె రాజ్య మపేక్షింపరను వాంఛ యహంమానపానమత్తులై యున్న వారలకే కాక మముఁబోటుల కేల? అనఁగా నజ్జనకుండు హర్షించి స్తుతిఁజేసి యొకమాట చెప్పెను. పదార్థహేతుకకావ్యలింగము.

ఆ. 'ఏ నవిద్యవలన మృత్యువుఁ దరియింప
ననఘ రాజ్యమును మఖాదికములుఁ'
జేయు చున్నవాఁడ క్షీణింపఁజేయుదుఁ
బుణ్యఫలము భోగభుక్తి[2]వలన. 64

టీ. అనఘ = పాపరహితుఁడా! ఏన్ = నేను, అవిద్యవలనన్=అజ్ఞానమువలన, మృత్యువున్ = సంసారమును, తరియింపన్=దాఁటుటకై, రాజ్యమును=ప్రభుత్వమును, మఖ ఆదికములు=యజ్ఞాదిసత్కర్మములను, చేయుచున్ ఉన్నవాఁడన్=చేయుచున్నాఁడను, పుణ్యఫలమున్ = యజ్ఞాదిసత్కర్మలఫలమును, భోగభుక్తివలనన్=భోగానుభవముచేతను, క్షీణింపఁజేయుదున్ = నష్టపఱుతును.

తా. పాపరహితుఁడ వగు నోయి ఖాండిక్యుఁడా! నే నజ్ఞానమువలన సంసారము దాఁటుటకుఁ బ్రభుత్వమును, యాగాది సత్కర్మములను జేయుచున్నాఁడను, భోగానుభవమువలనఁ బుణ్యఫలంబుల క్షీణింపఁ జేయుదు నని వచించెను.

---

1. రాజ్యంపు మమత; రాజ్యంబుమమత. 2. చేత.

క. మన యీ నిమివంశము పా
వన మగుభాగ్యమున మనుజవర! తత్త్వవివే
చనచింత నీకుఁ బొడమెను;
విను మిఁక వినిపింతు నీ కవిద్యావిధమున్. 65

టీ. మనుజవర = రాజా! మన...ము-మన = మనయొక్క, ఈనిమివంశము = నిమిచక్రవర్తివంశము, పావ...నన్-పావనమగు=పవిత్రమగునట్టి, భాగ్యమునన్=పుణ్యముచేత, తత్త్వవివేచనచింత - తత్త్వ = తత్త్వముయొక్క, వివేచన=తెలిసికొనునట్టి, చింత = విచారము, నీకున్, పొడమెన్ = పుట్టెను. నీకున్=నీకు, అవిద్యావిధమున్= అజ్ఞానముయొక్కప్రకారమును; వినిపింతున్ = తెలియఁ జెప్పెదను. ఇఁకన్, వినుము= ఆలకింపుము.

తా. మానవశ్రేష్ఠుఁడా! మన యీ నిమిచక్రవర్తివంశము పరిశుద్ధమగునట్టి పుణ్యవిశేషముచేత నీకుఁ దత్త్వవివేచనచింత గలిగెను గాన, నిఁక నీకు నే నవిద్యామార్గముం దెలిపెద నాకర్ణింపు మనియెను.

ఆ. ఆత్మకాని మేన నాత్మబుద్ధియును న
స్వంబునందు మిగుల స్వత్వమతియు
నవనివర! యవిద్య యను మహాతరువును
త్పత్తి కీద్వయంబు విత్తు మొదలు. 66

టీ. అవనివర = భూనాథుఁడగు నోయి ఖాండిక్యుఁడా! ఆత్మకాని = జీవుఁడు కానట్టి, మేనన్ = శరీరమందు, ఆత్మబుద్ధియును = జీవ(తానను నెడి)జ్ఞానమును, అస్వంబునందున్ = తనదిగాకుండునట్టి గృహాదులయందు, స్వత్వమతియున్=తనది యను బుద్ధియును, ఈద్వయంబు=ఈరెండును, అవి...కిన్ - అవిద్య అను = అజ్ఞాన మనియెడు, మహాతరువు = గొప్పవృక్షముయొక్క, ఉత్పత్తికిన్ = జననమునకు, (షష్ఠ్యాఉతోఽచి నుమ్నే' అను సూత్రముచేత నుమాగమము.) మొదలు=ఆదియైనట్టి, విత్తు=బీజము.

తా. ఓ ఖాండిక్యమహారాజా! తానుగాని దేహమందు తాననుజ్ఞానమును, తనది గాక యుండెడి గృహాదులయందుఁ దనది యనెడి బుద్ధియును, ఈరెండు నజ్ఞాన మను మహావృక్షమునకు నాదియైన బీజము. ఈపద్యమునకు మూలమైన విష్ణుపురాణ శ్లోకము: 'అనాత్మ న్యాత్మబుద్ధి ర్యా అస్వే స్వ మితి యా మతిః, అవిద్యా తరుసంభూతి బీజ మేతద్ద్విధా స్థితమ్.'

క. నరనాథ! పాంచభౌతిక
శరీరమున దేహి మోహసాంద్రతమతమః
పరివృతుఁ డై 'యే నిది నా
పరికర' మని యవధిలేని భ్రమఁబడి తిరుగున్. 67

టీ. నరనాథ = రాజా! దేహి = జీవుఁడు, పాంచ...నన్-పాంచభౌతిక=పంచభూతపరిణామమైన, శరీరమునన్=కాయమునందు, సాంద్ర...డై-సాంద్రతమ=మిగుల దట్టమైన, తమః = అవిద్యచేతను, పరివృతుఁ డై = ఆవరింపఁబడినవాఁ డై, ఏన్=నేను, ఇది, నాపరికరము=నాసొమ్ము, అని=నిశ్చయించికొని, అవధిలేని=పరిమితిలేని, భ్రమన్ = అజ్ఞానమునందు, పడి, తిరుగున్ = భ్రమణముఁ జేయుచుండును.

తా. ఓరాజా! పంచభూత పరిణామం బగు దేహమందు మిగుల బలిసియున్న యజ్ఞానముచేత నావరింపఁబడినవాఁడు గాన జీవుఁడు నే ననియు, ఇవి నాపరికరంబు లనియును దరిలేని భ్రాంతిఁ జెంది తిరుగుచుండును.

క. జలవసుధాంబరపవన
జ్వలనంబులకంటెఁ దా నజస్రంబు వెలిన్
వెలుఁగొందునాత్మ యుండఁగఁ
గళేబరము నెవ్వఁ డాత్మగాఁ దలపోయున్. 68

టీ. జల...టెన్-జల=ఉదకము, వసుధా = భూమి, అంబర=ఆకాశము, పవన = వాయువు, జ్వలన = అగ్ని, ఈపంచభూతములకంటె, తాన్=తాను (అనఁగా నాత్మ యనుట), అజస్రంబు = నిరంతరమును, వెలిన్ = వేఱయి, వెలుఁగొందు=ప్రకాశించునట్టి, ఆత్మ=జీవుఁడు, ఉండఁగన్=ఉండఁగా, కళేబరమున్ = దేహమును, ఎవ్వఁడు = ఎట్టివాఁడు, ఆత్మగాన్ = తానుగా, తలపోయున్ = నిశ్చయము చేయును.

తా. పృథివ్యప్తేజోవాయ్వాకాశంబు లను పంచభూతములకంటెను దా నిరంతరము వెలుపటఁ బ్రకాశించుచున్న జీవుం డై యుండియు శరీరము నెవ్వఁ డాత్మ యని తలంచును?

సీ. వపు రుపభోగ్యముల్ నృప గృహక్షేత్రాదు
లవి బొంది వోఁగాక యాత్మ వగునె
యట్లన పుత్రపౌత్రానీకములు నాత్మ
గాని మైఁ బుట్టుటఁ గావు తనవి;

కాన మృత్యువుఁ గను ఽ కాయంబున జనించు
పుత్త్రాదులెడ స్వత్వఽబుద్ధి తగదు;
ఎపుడేని యాత్మ వేఱె యను నప్పుడే
యడరు భోగంబు లిఽయాత్మ కంట ;
తే. వట్లుగా కీయొడలె యాత్మఽయన్న నంటు ;
మృద్గృహము నిల్చు నె ట్లల్కు ఽ మృజ్జలాది
నట్లు భౌతిక భోగాశఽనాది భౌతి
కాంగములు నిల్చు; భోగ మిఁఽదాత్మ కెద్ది ? 69

టీ. నృప = రాజా, వపురుపభోగ్యముల్ = శరీరముచేత ననుభవింపఁదగినట్టి, గృహక్షేత్రాదులు=ఇండ్లు భార్య మొదలైనవి, (ని. 'క్షేత్రం పత్నీశరీరయోః' అని యమరము.) అవి=ఈచెప్పఁబడినవి, దొంటివి=దేహసంబంధులైనవి, కాఁగాక, ఆత్మవిఅగునె= ఆత్మసంబంధులైనవి యగునా, అట్లన = ఆరీతిగానే, పుత్త్ర...లున్ - పుత్త్రపౌత్ర= కొమారులు మనుమలు వీరియొక్క, అనీకములున్ = సంఘములును, ఆత్మ కాని=జీవుఁడు కాని, మైన్=దేహమందు, పుట్టుటన్=జనియించుటచేత, తనవి కావు = ఆత్మవిగావు, కానన్ = ఆ ట్లగుటచేత, మృత్యువున్ కనుకాయంబునన్=మృత్యువును బొందునట్టి శరీరమందు, జనించు=పుట్టుచున్న, పుత్త్రాదులెడన్ = కుమారులు మొదలగువారియందు, స్వత్వబుద్ధి = తన దనుజ్ఞానము, తగదు = కూడదు, ఎప్పుడేని = ఎప్పుడైనను, ఆత్మ= జీవాత్మ, వేఱె=భిన్నమే, అనున్ = అనుకొనునో, అప్పుడే, అడరు=వృద్ధియగుచున్న, భోగంబులు = స్రక్చందనాదులు, ఆత్మకున్ = తనకు, అంటవు = స్పృశింపవు, అట్లుగాక = అటుగాక, ఈయొడలె = ఈశరీరమె, ఆత్మ = నేను, అనన్ = అన్నట్టాయెనేని, అంటున్ = ముట్టును, మృద్గృహము = మృణ్మయనికేతనము, అల్కుమృజ్జలాదిన్ = అలికి పూసినట్టి మన్ను నీళ్లు మొదలగువానిచేత, ఎట్లు = ఏప్రకారము, నిలుచున్=ఉండునో, అట్లు=ఆప్రకారముగ, భౌతి...దిన్ - భౌతిక=భూతసంబంధులైన, భోగ = భోగ్యవస్తువులు, అశన = అన్నము, ఆదిన్ = మొదలుగాఁ గలవానిచేత, భౌతికాంగములు నిల్చున్ = పంచభూతాత్మక శరీరములు నిలుచును, ఇందున్= దీనియందు, భోగము = సుఖము, ఆత్మకున్ = జీవునకు, ఎద్ది = ఏది.

తా. ఓయిరాజా ! దేహోపభోగ్యంబులైన గృహక్షేత్రాదులు శరీరసంబంధులు గాని యాత్మసంబంధులు గావు. అట్లేయగుననే పుత్త్రపౌత్త్రాదిసమూహము దేహమందు జనియించుటచేత నాత్మవి గావు కాన, మరణము నొందునట్టి శరీరమున జనియించిన

పుత్త్రాదులందు స్వత్వబుద్ధి కూడ దనియు, నెపుడేని యాత్మకు దేహము భిన్నం బని భేద జ్ఞానము గలుగుచున్నదో యపుడు భోగంబు లాత్మ కంటవు. అటుగాక శరీరమె తా నని తలంచినయెడ భోగంబు లంటుచున్నవి; మంటిలోఁ గట్టంబడియున్న గృహము మృజ్జలాదులచేత నెట్లు నిలుచునో యత్తెఱంగున పంచభూతసంబంధులైన భోగము, అశనము మొదలగువానిచేత భౌతికాంగములు నిలుచును. దీనియం దాత్మకు భోగ మెక్కడిది?

మ. జనిసాహస్రబహుప్రయాణ మగు సంసారంపుఁద్రోవ న్సదా
చనుచుండు న్ఘనమోహఖేద మలమ న్సంసారిపాంథుండు వా
సన లం ధూళి ముసుంగు గాఁగ; నెపుడేఁ జ్ఞానంపుటుష్ణోదకం
బునఁ దత్క్షాళనసేయు; వాని కపు డమ్మోహశ్రమంబు న్జనున్. 70

టీ. జని...ము - జనిసాహస్ర=జన్మసహస్రము లనియెడి, బహుప్రయాణము= అనేక ప్రయాణములు గలది, అగు, సంసా...వన్ - సంసారంపు = జననమరణాది రూపమైన సంసార మనియెడు, త్రోవన్ = మార్గమునందు, సంసా...డు-సంసారి = సంసారి యను, పాంథుండు=పథికుఁడు, వాసనలు అన్=అనాదికర్మవాసన లనియెడు, ధూళి = పరాగము, ముసుంగు గాఁగన్ = కప్పుగాఁగా, ఘన...ము - ఘన=అతిశయ మగు, మోహ = మోహ మనియెడు, ఖేదము=క్లేశము, అలమన్ = చుట్టుకొనఁగా, సదాచనుచుండున్ = ఎప్పటికినిఁ దిరుగుచుండును, ఎపుడేన్ = ఏసమయమందైనను, జ్ఞానంపు టుష్ణోదకంబునన్ = శాస్త్రజన్యజ్ఞాన మనియెడి యుష్ణజలముచేత, తత్క్షాళన సేయున్ - తత్ = ఆకర్మవాసన లనియెడు పరాగమును, క్షాళనచేయున్ = కడుగు కొనునో, వానికిన్ = సంసారి యను పథికునికి, అపుడు = ఆక్షణమందు, అమ్మోహ శ్రమంబున్ = ఆమోహ మను శ్రమమును, చనున్ = నివర్తించును.

తా. జన్మసహస్రము లనియెడి యనేక ప్రయాణములుగల జనన మరణాది రూప మగు సంసార మను త్రోవయందు సంసారి యను పథికుం డనాదికర్మవాసన లనియెడి పరాగము గప్పుకొనఁగా, నతిశయం బగు మోహ మను క్లేశము చుట్టుకొనఁగా, నెడతెగక తిరుగుచుండును. ఎపుడు శాస్త్రజన్యజ్ఞాన మను నుష్ణోదకముచేత సంసారి యను తెరువరి యా కర్మవాసన లనియెడి పరాగమును గడుగఁకొనుచున్నాఁడో, యపుడ యమ్మోహ మను శ్రమము నివర్తించును. అలం. రూపకము.

తే. అట్టి మోహశ్రమం బాఱ నాశరీరి
స్వస్థుఁ డై తా ననన్యాతిశయ మబాధ

మనఁగ విలసిల్లు నిర్వాణ [1]మనుభవించు
ననఘ తొల్లియు నిర్వాణఖనియ కాన. 71

టీ. అనఘ = పాపరహితుఁడా! తొల్లియున్ = ఆదిలోఁగూడ, తాను, నిర్వాణఖనియ = ముక్తికి గనియే, కానన్ = అగుటంజేసి, అశరీరి = అజీవుఁడు, అట్టి...బు-అట్టి = అటువంటి, మోహశ్రమంబు = అజ్ఞానమనియెడి యాయాసము. ఆఱన్ = తీఱఁగా, స్వస్థుఁడై = తాను సుఖపడినవాఁడై, అనన్యాతిశయము = తనకంటె నతిశయము లేనట్టిదియు, అబాధము = దుఃఖరహితమైనదియు, అనఁగన్ = అనఁగా, విలసిల్లు = ఒప్పుచున్న, నిర్వాణము = మోక్షానందమును, అనుభవించున్ = భోగించును.

తా. పాపరహితుండవగు నోయిరాజా! యతండు తొలుత జీవన్ముక్తుఁడే కానఁ దాదృశం బగు నజ్ఞాన మనియెడి యాయాసము దీఱఁగా, జీవుండు సుఖియై సర్వోత్తమంబును దుఃఖరహితము నైనది యనునట్లుగఁ బ్రకాశించుచున్న యానంద మనుభవించును.

వ. విను జనేశ్వర! (1) జలం బస్పృష్టదహనం బయ్యుఁ దదీయ యోగం
బునఁ గలశోదరంబున నునికిం దా నతిశీలం బయ్యు నుడికి, శబ్దో
ద్రేకాది ధర్మంబులం బొందున ట్లాత్మయుం బ్రకృతి సంబంధంబున
నహమ్మానాది దూషితుం డై ప్రాకృతంబు లగు ధర్మంబులం బొందు;
(2) వీని కత్యంత విలక్షణుండు నక్షయుండు నాత్మ; య ట్లగుట నింత
యనర్థమూలం బగు నీయవిద్యాబీజంబు నీ కెఱింగించితి; నేవం
విధంబు లగు సకలక్లేశంబులకును సంక్షయ కరంబు యోగంబు
దక్క మఱియొం డుపాయము లే" దనుటయుఁ (3) బ్రీతుం డై
ఖాండిక్యుండును 'మహాత్మ! యిన్నిమివంశంబున విజ్ఞాత యోగ
శాస్త్రార్థుండ వీవు, నాకు నయ్యోగంబు సమస్తంబు విస్తరింప వలయు
ననినఁ గేశధ్వజుండు కృపాళుం డై (4) "మహీపాలా! విను మెందేని
సంస్థితుం డై ముని మఱి పునర్భవంబునకు రాక బ్రహ్మసాధర్మ్యంబుఁ
బొందు నట్టియోగంబుఁ జెప్పెద సావధానుండ వై విను మని
యి ట్లనియె. 2

టీ. విను = వినుము, జనేశ్వర = రాజా, (1) జలము = నీరు, అస్పృష్టదహనంబు అయ్యున్ = అగ్ని నంటక యుండియు, తదీ...నన్ - తదీయ =

---

1 మను భజించు. పాఠాం.

ఆయగ్నిసంబంధి యైన, యోగంబునన్ = సంపర్కముచేత, కలశోదరంబునన్=ఘటోదరమునందు, ఉడ్కన్ = ఉడుకుటంజేసి, తాన్ = ఉదకము, అతిశీతలంబయ్యున్ = మిగులం జల్లనైయుండియు, ఉడికి = కాఁగి, శబ్ద ఉద్రేకాది ధర్మంబులన్ = సలసల యను శబ్దము పొంగు మొదలైన గుణములను, పొందునట్లు = ఆశ్రయించినట్లు, ఆత్మయున్ = జీవుండును, ప్రకృతి సంబంధంబునన్ = శరీరసంబంధముచేత, అహమ్మానాదిదూషితుం డై = అహంకార మమకారాదులచేత మలినుం డై, ప్రాకృతంబు లగు ధర్మంబులన్ పొందున్ = ప్రకృతిజన్యగుణంబుల నాశ్రయించునుగాని, (ఆత్మకు జలమునకు, ప్రకృతికి అగ్నిసంయుక్తకలశమునకును, అహంకారాదులకును శబ్దోద్రేకాదులకును సామ్యము గనుక ఉపమాలంకారము.) (2) ఏనికిన్ = ఈప్రకృతిధర్మములకు, ఆత్మ = జీవుండు, అత్యంతవిలక్షణుండును = మిగుల వేఱైనవాఁడును, అక్షయుండును = నాశము లేనివాఁడును, (అగును.) అ ట్లగుటన్ = అట్లుగాన, ఇంత అనర్థమూలం బగు, ఈ అవిద్యా = ఈ అజ్ఞానముయొక్క, బీజంబు = కారణమును, ఎఱింగించితిన్ = తెలిపితిని. శ్లో. 'అనాత్మ న్యాత్మబుద్ధిర్యా అస్వే స్వమితి యా మతిః, అవిద్యాతరుసంభూత బీజమేత ద్ద్విధాస్థితమ్' అని విష్ణుపురాణము. ఏవం విధంబులు అగు= ఈప్రకారమైన, సకలక్లేశంబులకున్ = సమస్త దుఃఖములకును, సంక్షయకరంబు = నాశముం జేయునది, యోగంబుదక్క = యోగము గాక, మఱియొండు ఉపాయము లేదు అనుటయున్=మఱియొక సాధనము లే దనఁగా, ప్రీతుండై=సంతసించినవాఁడై, ఖాండిక్యుండును, (3) మహాత్మా = మహామతి యగు నోయి కేశిధ్వజుఁడా, ఈనిమి వంశంబునన్, విజ్ఞాత = తెలియఁబడిన, యోగశాస్త్రార్థుండవు = యోగశాస్త్రార్థము గల వాఁడవు, నీవు, నాకున్ = నాకును, అయ్యోగంబు విస్తరింపవలయును అనినన్ = ఆయోగమంతయు విపులముగాఁ జెప్పవలయు ననఁగా, కేశిధ్వజుండు, కృపాళుం డై = దయగలవాఁ డై, (4) మహీపాలా = భూనాయకుఁడా, వినుము = ఆకర్ణింపుము, ఎందేని సంస్థితుం డై = ఏయోగశాస్త్రమందు ఉన్నవాఁడై, ముని=సాధకుండు, మఱి= పిమ్మట, పునర్భవంబునకున్ రాక = పునర్జన్మమునకు రాక, (ఇట 'పరాసుప్రాప్త పఞ్చత్వ పరేతప్రేత సంస్థితాః, మృతప్రమీతౌ త్రిష్వేతే' అని యమరము గనుక సంస్థితుం డై - అనఁగా 'మరణించి' అని ప్రకరణముం బట్టి చావుం జెప్పుటయే సమంజస మగుఁ దోఁచుచున్నది.) బ్రహ్మసాధర్మ్యంబు=బ్రహ్మత్వమును, పొందున్ = పొందునో, అట్టి యోగంబున్ చెప్పెదన్ = ఆయోగము వచించెదను, సావధానుండ వై=నిశ్చలమనస్కుఁడవై, వినుము = ఆకర్ణింపుము, అని, ఇ ట్లనియెను.

ఆ. ప్రాణికోటికెల్ల ౹ బంధంబు మోక్షంబు
చేరుటకును మనసు ౹ కారణంబు
విషయసంగియైన ౹ విను బంధకారి; ని
ర్విషయ మైన ముక్తి ౹ విభవకారి. 73

టీ. ప్రాణికోటికిన్ ఎల్లన్=ఎల్లప్రాణులకును, బంధంబున్=సంసార రూపబంధమును, మోక్షంబున్ = తద్విమోచనమును, చేరుటకును=ఈరెండును పొందుటకును, మనసు=మనంబు, కారణంబు=హేతువు, (ఆమనస్సు) విషయసంగి ఐనన్=స్రక్చందన వనితాదివిషయములయందుఁ దగిలెనేని, బంధకారి = బంధము గలుగఁజేయునది, నిర్విషయము ఐనన్ = విషయములయందుఁ దగులకుండెనేని, ముక్తివిభవకారి = ముక్తి వైభవముం జేయునది. ఈపద్య మీక్రింది యుపనిషచ్ఛ్లోకమున కనువాదము:— "మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః, బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్." శాట్యాయనోపనిషత్తు.

తా. సకలజ్ఞానులయొక్క సంసారరూపబంధమునకును మోక్షమునకును మనంబే కారణ మనియు, సామనంబు స్రక్చందనాదివిషయములయందుఁ బ్రవేశించెనేని బంధంబును, విషయములయెడఁ దగులకుండెనేని యనన్యాతిశయం బగుమోక్షంబును గలుగఁ జేయును.

సీ. విజ్ఞానమునఁ జేసి ౹ విషయాదివలన నె
మ్మన మాహరించి బ్ర ౹ హ్మముఁ బరేశుఁ
జింతింపవలయు ౹ నిశ్శ్రేయసంబున; కట్లు
చింతింప నతఁడు త ౹ చ్చింతకునకు
నాత్మభావం బిచ్చు ౹ నాకర్షకము వికా
ర్యశ్మసారముఁ దా ౹ ర్చునట్లు; యోగ
మన యమాదికవిష ౹ యంబైన యాత్మప్ర
యత్నంబున కధీన ౹ మైన సాత్త్వి
తే. కపుమనోగతి యొయ్యది ౹ గలదు దాని
బ్రహ్మసంబంధినిఁగఁ జేయు ౹ ప్రౌఢి సూవె;
యిట్టి వైశిష్ట్యధర్మ మెం ౹ దేని గలుగు
నట్టి యోగంబు కలిగిన ౹ యతఁడె యోగి. 74

టీ. విజ్ఞానమునఁ జేసి = మోక్షమున కుపయోగించు (వి. 'మోక్షేధీర్జ్ఞానమ్' - అని అమ.) విశేషజ్ఞానముచేతను, విషయాదివలనన్ = స్రక్చందనాది యింద్రియార్థములు మొదలగువానివలన, నెమ్మనము = మనస్సును, ఆహరించి = మరలించి, పరేశున్ = పరమేశ్వరుఁడైన, బ్రహ్మమున్ = పరబ్రహ్మమును, నిశ్శ్రేయసంబునకున్ = మోక్షమునకై, చింతింపవలయున్ = ధ్యానముసేయవలయును, అట్లు చింతింపన్ = అలాగు ధ్యానము సేయఁగా, అతఁడు = ఆ బ్రహ్మము, తచ్చింతకునకున్ = ఆధ్యానము సేయువానికి, ఆకర్షకము = ఆకర్షకమైనట్టి సూదంటుఱాయి, వికారి = రూపాంతరముగల, అశ్మసారమున్ = లోహమును, తార్చునట్లు = ఆకర్షించునట్లు, ఆత్మభావంబు = తనస్వరూపమును, ఇచ్చున్ = ఒసఁగును, యోగము అనన్ = యోగ మనఁగా, యమాదికవిషయంబై = యమనియమాదివిషయమయిన, ఆత్మప్రయత్నంబునకున్ = జీవునియొక్క వ్యవసాయమునకు, అధీనమైన = లగులైన, సాత్త్వ...గతి - సాత్త్వికపు = సత్త్వగుణప్రధానమైన, మనోగతి = మనోవ్యాపారము, ఎయ్యది కలదు = ఏది కలదో, దానిన్ = ఆమనోవ్యాపారమును, బ్రహ్మసంబంధినిఁగాన్ = బ్రహ్మమును బొందినదానిఁగా, చేయుఁబ్రౌఢిసూవె = చేయుఁబ్రౌఢిమచుమీ, ఇట్టివైశిష్ట్యధర్మము = విశేషభావముగల ధర్మము, ఎందేని గలదు = ఎక్కడఁ గలదో, అట్టియోగంబు గలిగినయతఁడే యోగి = అట్టియోగము గలవాఁడే యోగి.

తా. విశేషజ్ఞానముచేత విషయాదులను హరించి బ్రహ్మానుసంధానముఁ జేయువాని కాపరబ్రహ్మము సూదంటుఱాయి వికారము గలయినుమును దనయందు గ్రహించినట్లు ఆత్మస్వరూపము నిచ్చు ననియు, యోగ మనఁగా యమనియమాది విషయకంబయిన తనప్రయత్నమున కధీనమైన సత్త్వగుణప్రధాన మగుమనోవ్యాపారమును బ్రహ్మసంబంధిఁగాఁజేయునట్టి ప్రౌఢిమచుమీ యనియు, నిట్టివైశిష్ట్యధర్మ మెందుఁ గలదో యదే యోగ మాయోగము గలవాఁడె యోగి యనియుఁ భావము.

వ. ( ) మఱియు బ్రహ్మచర్యాదు లగుయమంబు లేనును, స్వాధ్యాయాదులగు నియమంబు లేనును, నిష్కాముం డై యోగి యగువాఁడు మనోనైర్మల్య సంపాదనకు నాచరింపవలయు, నివి కామ్యంబు లైన విశిష్టఫలదంబులు; నిష్కాములకు ముక్తిదంబు లగు; (2) నట్టి యమనియమంబులు వదలక భద్రాసనాదులందు నొకటి నవలంబించి ప్రాణాభిధానం బగు పవనంబు నభ్యాసంబున వశంబు సేయవలయు; నదియె ప్రాణాయామ మనంబడు; నట్టి ప్రాణాయామంబు సబీజాబీజ సంజ్ఞలం

బరఁగు; నదియె ప్రాణాపానంబుల మిథోనురోధంబుల నుభయనిరోధనంబున రేచకాదిత్రైవిధ్యంబునుం బొందు; (3) మొదల నా చెప్పిన బీజాబీజ సంజ్ఞలందు నంతస్స్థూలరూపావలంబి యగునదియ సబీజం, బితరం బబీజంబు; మఱి శబ్దాదివిషయంబులం బ్రవణంబు లగు నింద్రియంబులం ద్రిప్పి మానసంబున కధీనంబులుసేయుట ప్రత్యాహారం; బిట్టి ప్రత్యాహారంబు ముముక్షున కవశ్యకర్తవ్యంబు; దీనివలన నతి చంచలంబు లగు నింద్రియంబులకు నాత్మవశ్యత గలుగు; నివి కన వశ్యంబులు గాకుండిన నాయోగి యోగసాధకుండు కానేరండు; ప్రాణాయామంబునఁ బవనంబులు, ప్రత్యాహారంబున నింద్రియంబులు, వశంబు లైన పిమ్మటఁ జిత్తంబుశుభాశ్రయంబునం దిడునది", యను టయు ఖాండిక్యుఁ డి ట్లనియె. 75

టీ. (1) మఱి=మఱియును, బ్రహ్మచర్య ఆదు లగుయమంబులు ఏనును = బ్రహ్మచర్యము మొదలైనయమంబు లైదును, ('అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము' అపరిగ్రహము - అనునవి.) స్వాధ్యాయాదులగు నియమంబులేనును = ప్రణవపూర్వకముగ వేదపారాయణముచేయుట మొదలైన నియమంబులైదును, (శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధాన మనునవి) యోగి యగువాఁడు, నిష్కాముఁ డై=కోరికలేనివాఁ డై, మనోనైర్మల్యసంపాదనకున్ = మనశ్శుద్ధిని సంపాదించుటకొఱకు, ఆచరింపవలయున్ = అనుష్ఠింపవలయును, ఇవి=ఈయమనియమములు, కామ్యంబులైనన్ = కోరికచేతఁ జేయఁబడినయెడ, విశిష్టఫలదంబులు=సకల ఫలప్రదంబులు, నిష్కాములకున్ = కోరికలేనివారలకు, ముక్తిదంబు లగున్ = మోక్షమిచ్చునవి యగును, (2) అట్టియమనియమంబులు, వదలక = విడువక, భద్రాసనాదులయందున్= భద్రాదులగు నాసనవిశేషములయందు,(ఇవి 84 ఐనను వానిలో నాల్గు-సిద్ధాసన, భద్రాసన, సింహాసన, పద్మాసనములు ముఖ్యతమములు.) ఒకటి నవలంబించి = ఒకటి నాశ్రయించి, ప్రాణాభిధానం బగు = ప్రాణమనుపేరుగల, పవనంబున్ = వాయువును, (శరీరములోపల ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అను పంచవాయువులు కలవు.) అభ్యాసంబునన్ వశంబుసేయవలయున్ = వాడుకచేత వశపఱుచుకొనవలయును, అదియె ప్రాణాయామ మనంబడున్, అట్టిప్రాణాయామంబు, సబీజాబీజసంజ్ఞలన్ పరఁగు=సబీజప్రాణాయామము అబీజప్రాణాయామ మని నామద్వయముచేత నొప్పును, అదియె = ఆ ప్రాణాయామమే, ప్రాణాపానంబుల = ప్రాణాపానంబులను రెండు వాయువులయొక్క, మిథః = పరస్పరము, అనురోధంబులన్ = అనుసరించుటచేతను,

ఉభయనిరోధనంబునన్ = రెంటిని నిలుపుటచేతను, రేచకాది త్రైవిధ్యంబునన్ = రేచక (ఊర్పును వెలిపుచ్చుట) పూరక (లోనికిపీల్చుట) కుంభకము, (చలింపనీయక ఆఁపివైచుట) లనియెడి త్రివిధత్వమును, పొందున్ = వహించును, (3) మొదలన్ నాచెప్పిన = తొలుత నేఁ జెప్పిన, సబీజాబీజసంజ్ఞలందున్ = ఈరెండునామముల యందును, అంతః = లోపలను, స్థూలరూపావలంబియగునదియ = స్థూలస్వరూపము నాశ్రయించునదియ, సబీజంబు = సబీజప్రాణాయామంబు, ఇతరంబు = సూక్ష్మస్వరూపావలంబి యగునదియే, అబీజంబు = అబీజప్రాణాయామంబు, మఱిశబ్దాదివిషయంబులన్ = శబ్ద స్పర్శ రూప రస గంధంబులను విషయములందు, ప్రవణంబు లగు = వ్యావర్తులైనట్టి, ఇంద్రియంబులన్ = శ్రోత్ర, త్వక్, చక్షుః, జిహ్వా, ఘ్రాణంబు లను పంచేంద్రియములను, త్రిప్పి = మరలించి, మానసంబునకున్ ఆధీనంబులు చేయుట = మనంబునకు వశముసేయుట, ప్రత్యాహారంబు, ఇట్టిప్రత్యాహారంబు, ముముక్షునకున్ = మోక్షేచ్ఛగలవానికి, అవశ్యకర్తవ్యంబు = తప్పకచేయఁదగినది, దీనివలనన్ = ఈ ప్రత్యాహారయోగమువలన, అతిచంచలంబు లగు = మిగులఁజపలంబులైన, ఇంద్రియంబులకున్ = పంచేంద్రియంబులకును, ఆత్మవశ్యత కలుగున్ = ఆత్మవశం బౌట కలుగును, ఇవి = ఈప్రాణేంద్రియంబులు, కనన్ = చూడఁగా, వశ్యంబులు కాకుండినన్ = వశవర్తులు కాకుండెనేని, అయోగి = అయోగపురుషుఁడు, యోగసాధకుండు కానేరండు= యోగము సాధించువాఁడు గాఁడు, ప్రాణాయామంబునన్ = ప్రాణాయామముచేతను, పవనంబులు = వాయువులును, ప్రత్యాహారంబునన్ = ప్రత్యాహారముచేత, ఇంద్రియంబులున్=శ్రోత్రాదులును, వశంబులైన=అధీనములైన, పిమ్మటన్=పిదప, చిత్తంబు = మనమును, శుభాశ్రయంబునందున్ = శుభాధార మగుపరబ్రహ్మమునందు, ఇడునది = పొందింపవలయును, అనుటయున్=అనఁగా, ఖాండిక్యుండు, ఇట్లు అనియెన్=ముందు చెప్పుచున్నాఁడు.

తా. బ్రహ్మచర్యము మొదలగు యమము లైదును, స్వాధ్యాయము మొదలగు నియమము లైదును చిత్తశుద్ధికొఱ కనుష్ఠింపవలయును. ఇవి కోరికచేతఁ జేసిన పక్షమున విశేషఫలముల నిచ్చును. కోరిక లేక చేసినయెడ మోక్ష మబ్బును భద్ర ముక్త పద్మ సిద్ధ వీర ముక్త పద్మ మను నివి మొదలగు నాసనములలో నొకటి నవలంబించి వాయువును రేచక పూరక కుంభకాభ్యాసముచేత వశపఱుచుకొనవలయును. ఇట్లు ప్రాణవాయువును వశపఱచుకొనుటయే ప్రాణాయామ మనంబడును. అది సబీజం బబీజం బని ద్వివిధంబు. శబ్ద స్పర్శ రూప రస గంధము లను పంచవిషయములకుఁ బోవు శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణమ్ము లనుపంచేంద్రియంబులు మరలుచుకొనుట ప్రత్యాహారంబు. ఇది

ముముక్షున కవశ్యము చేయఁదగినది. ఇట్లొనరింప నింద్రియములు మనస్సున కధీనము లగును. పిమ్మట శుద్ధం బగుచిత్తమును పరబ్రహ్మమందుఁ జేర్పవలయును.

క. మనమున కెద్ది శుభాశ్రయ,
మనఘ! యెఱింగింపు, మఱి సమస్తాధారం
బనఁ జను యద్వస్తువు? య
న్మనన మశేషోరుదుఃఖమండలిఁ జెఱుచున్? 76

టీ. అనఘ = పరిశుద్ధుఁడా, మనమునకున్ = మనస్సునకు, ఎద్ది=ఏవస్తువు, శుభాశ్రయము = శుభమైనస్థానము, మఱి = మఱియును, సమస్తాధారంబు = సకలమును ధరించునది, అనన్ = అనునట్టుల, యద్వస్తువు = ఏవస్తువు, చనున్=ఒప్పును, యన్మననము=ఏదేవుని చింతనము, అశే...లిన్ - అశేష = సకలమైనట్టియు, ఉరు = విస్తారమయిన, దుఃఖమండలిన్ = శోకసమూహములను, చెఱుచున్ = నష్టముఁ జేయునో, ఎఱింగింపుము = తెలుపుము.

తా. "మానసంబున కేది శుభమైనస్థానము? సకలాధారం బగువస్తు వేది? ఏ దేవునిమననము సకల దుఃఖ సమూహంబులం బోఁగొట్టునో, పరిశుద్ధుండ వగు నోయి కేశిధ్వజుఁడా! యెఱింగింపు" మని పలికెను.

తే. అనినఁ గేశిధ్వజుఁడు వానిఁ గనియె, 'బ్రహ్మ
మాశ్రయంబు మనంబునఁ; గదియ పరము
నపరము ననంగఁ బొలుచు, నం దపర మనఁగ
మూర్తము, పరం బనంగ నమూర్త మనఘ! 77

టీ. అనినన్ = ఇట్లనఁగా, కేశిధ్వజుఁడు = జనకుండు, వానికిన్ అనియెన్= ఆఖాండిక్యునకుఁ జెప్పెను, అనఘా=పరిశుద్ధుండ వగు నోయిరాజా, మనంబునకున్= చిత్తంబునకు, బ్రహ్మము = పరబ్రహ్మము, ఆశ్రయంబు = స్థానము, అదియ=ఆపర బ్రహ్మమే, పరమున్ = పర మనియు, అపరమున్ = అపర మనియు, అనంగన్ = అనునటుల, పొలుచున్=ఒప్పును, అందున్ = ఆరెంటియందు, అపర మనఁగన్, మూర్తము = రూపముకలది, పరంబు అనంగన్, అమూర్తము, అనఁగా రూపము గాకుండునది.

తా. అట్లనఁగాఁ గేశిధ్వజుండు పరబ్రహ్మమే చిత్తమునకు నాశ్రయం బనియుఁ, నా పరబ్రహ్మము పరాపరభేదంబులఁ జెంది యుండు ననియు, నపర మనఁగా రూపవత్పదార్థ మనియుఁ, పర మనఁగా అరూపవత్తనియు నాఖాండిక్యునకుఁ దెలిపెను.

మ. మును నాచెప్పిన రెంటిలోఁ బర మనఁగాముక్తాత్మ; దూరంబుపా
సనఁ గావింప నమూర్త; మింకపరసంజ్ఞం, బబ్జగర్భాది బ
ద్ధనికాయం బది మూర్తమైనను బరిత్యాజ్యంబు శశ్వత్త్రిభా
వనలం గూడుట నారురుక్షున కసేవ్యం బీద్వయంబు న్దుదన్. ౪

టీ. మును = ముందు, నాచెప్పిన = నేఁ జెప్పినట్టి, రెంటిలోన్ = ద్వయములో, పరము అనన్ = పర మనఁగా, ముక్తాత్మ = విడువఁబడిన బ్రహ్మము, అమూర్తము = ఆకారము లేనిది, గనుక, ఉపాసన గావింపన్ = ధ్యానముచేయుటకు, దూరంబు = శక్యము గాదు, ఇంకన్ = ఇంకను, అపరసంజ్ఞంబు = అపర మనుపేరుగలది, అబ్జగర్భాది = బ్రహ్మమొదలగు, బద్ధనికాయంబు = బద్ధజీవుల సంఘరూపము, అది = ఆయపరము, మూర్తమైనను = రూపవత్తైనను, శశ్వత్ = మాటిమాటికిని, త్రిభావనలన్ = భావనాత్రయముతోడను, కూడుటన్ = కూడియుండుటచేత, పరిత్యాజ్యంబు = సేవింపఁదగినది కాదు, ఆరురుక్షునకున్ = సాధకునికి, తుదన్ = కడపట, ఈద్వయంబున్ = ఈపరాపరములు రెండును, ఆసేవ్యంబు = విడువఁదగినవి.

తా. పూర్వము నాచేతఁ జెప్పఁబడిన పరాపరములలోఁ బరము నిరాకారము గాన ముముక్షువు లగుజీవుల కుపాసనాశక్య మనియు, నపర మనుసంజ్ఞ గల చతుర్ముఖాది బద్ధజీవన సంఘరూపము సాకారమైనను భావనాత్రయవిశిష్ట మగుటంజేసి పరిత్యాజ్య మనియు, నారురుక్షునకు శరీరత్యాగకాలమందు నీరెండువిధంబు లుపాసనకుఁ దగినవి కా వనియును దాత్పర్యము.

వ. ఆభావనాత్రయం బెద్ది యనినఁ జెప్పెద (1) బ్రహ్మభావనయుం గర్మభావనయు బ్రహ్మకర్మోభయభావనయు, నందు బ్రహ్మభావనాయుతులు సనందనాదులు, దేవాది స్థావరాంతరు లగుప్రాణు లందఱు కర్మభావనాభావకులు, హిరణ్యగర్భాదు లుభయభావకులు, వీ రీమూఁడుతెఱఁగులవారు భావనాత్రయాన్వితులు గావున నీత్రివిధాత్మక రూపంబ సేవ్యంబు, సనందనాదులును బ్రాగ్బ్రహ్మకల్పంబుల సంచరించుట భావనాబద్ధులె; యిబ్భావనాత్మకం బగు విశ్వంబు సంస్థితికి నవధి; దేవమనుష్యాది విశేషజ్ఞాన కర్మంబులు తొలంగించుటయు; ( ) యట్టి విశ్వంబై తోఁచు హిరణ్యగర్భాదులకంటె నన్యంబు పరాఖ్యం; బది ముక్తరూపం బమూర్తం బై యుండు నని మొదల సూచించితిం గదా; తదాకారంబుఁ దేటపఱిచెద;

పూర్వోక్త దేవాది భేదరహితం బై తద్భేదరాహిత్యంబున నిట్టి దట్టి దని వచించుటకు గోచరంబుగాక యపక్షయాది రహితంబును సచ్ఛబ్దవాచ్యంబును నాత్మసంవేద్యంబును నై జ్ఞానైకనిరూపణీయం బగుచు జ్ఞానశబ్ద వాచ్యంబునుం దాన యై బ్రహ్మాత్మకం బగుట బ్రహ్మ సంజ్ఞయుం గాంచి యొప్పు; (1) మఱి భావనాత్రయాత్మక సర్వవైలక్షణ్యంబె లక్షణంబుగాఁ గల యీరూపం బభ్యస్యమాన యోగుం డగుయోగికిం జింతింప నశక్యంబు; మఱి యపరం బని చెప్పంబడిన హిరణ్యగర్భుండు వాసవుండును బ్రజాపతులు మరుత్తులు వసువులు రుద్రులు ఆదిత్యులు తారకంబులు గ్రహంబులు గంధర్వ యక్ష రక్షో దైత్యాది సమస్త దేవయోనులు మనుష్యులు పశువులు అద్రులు సముద్రంబులు ద్రుమంబులు వెండియు నేకపాద ద్విపాద బహుపాదాపాదంబు లగు నితర భూతంబులుం దదుత్పత్తి హేతువులునుగా విలసిల్లు నట్టి ప్రధానాదివిశేషాంత చేతనాచేతనాత్మక ప్రపంచభావం బగు స్థూలరూపం *బుపక్రాంత యోగునకుఁ జింతింప శక్యంబు. (1) శక్యమేనియుఁ దద్భావనాత్రయాత్మకం బగుట నశుభాశ్రయంబు గావున ముక్తిసాధనంబుగా; దీ చెప్పఁబడిన సకల ప్రపంచంబును విష్ణుశక్తి సమన్వితం బై యతనికి శరీరంబు నై యుండు నట్టి విష్ణుశక్తులు మొదల నేఁ జెప్పిన పరాపరాఖ్యలను దదతిరిక్త యగు కర్మాఖ్యనుం ద్రివిధము లై యుండు; నందుఁ గర్మాఖ్యశక్తి చేత వేష్టిత యై యపరాఖ్య యగు క్షేత్రజ్ఞశక్తి జన్మ జరామరణాద్యనేక సంసారతాపంబు లనుభవించుచుఁ దత్తత్కర్మానుగుణ శరీరంబు లెత్తి విజ్ఞాన తారతమ్యంబుల నొందుఁ; దత్ప్రకారం బాకర్ణింపుము. 79

టీ. ఆభావనాత్రయంబు ఎద్ది = అనిన = ఆభావనాత్రయం బేది యనిన, చెప్పెదఁ=వచించెదను. (1) బ్రహ్మభావనయు కర్మభావనయు బ్రహ్మకర్మోభయ భావనయు నని మూఁడు ప్రకారములు. అందుఁ=ఆమాటియందు, సనందనాదులు=సనందనుఁడు మొదలగు మహాయోగు లెల్లను, బ్రహ్మభావనాయుతులు=బ్రహ్మచింతనపరులు, దేవాది

* బు ప్రశాంత.

స్థావరావరులగు = దేవతలు మొదలు పర్వతపాషాణములుతుదగాఁగల, ప్రాణు లందఱు=
జీవులందఱును, కర్మభావనాభావనులు = కర్మభావనాయుతులు, హిరణ్యగర్భాదులు,
ఉభయభావనాపరులు=కర్మబ్రహ్మఉభయభావనాపరులు, ఈమూఁడు తెఱంగులవారు=
ఈమూఁడు విధంబులవారును, భావనాత్రయ అన్వితులు = త్రిభావనలతోఁ గూడి
యున్నవారు, కావునన్=అట్లౌటవలన, ఈత్రివిధాత్మకరూపంబు = మూఁడువిధంబు
లగురూపంబులు, అసేవ్యంబు = సేవింపఁదగిననికావు, సనందనాదులు = సనందనుఁడు
మొదలగువారును, ప్రాగ్బ్రహ్మ కల్పంబులన్ = మునుపటి బ్రహ్మకల్పములయందు, సంచ
రించుటన్ = జన్మము లెత్తుటచేతను, భావనాబద్ధులు=బ్రహ్మభావన చేత బద్ధులైనవారు,
ఈ భావనాత్మకం బగు=భావనాస్వరూపం బైన, విశ్వంబు=జగత్తుయొక్క, స్థితికిన్ =
ఉనికికి, అవధి = మర్యాద, దేవమనుష్యాది = దేవతలు మనుష్యులు మొదలగు, విశేష=
నానావిధప్రపంచముయొక్క, జ్ఞానకర్మంబులు=జ్ఞానమును కర్మయు, క్షీణించుటయ =
నష్టమౌటయే, (2) అట్టి = అటువంటి, విశ్వం బై = జగత్తై, తోఁచు = కనుపించునట్టి,
హిరణ్యగర్భాదులకంటెన్ = చతుర్ముఖాదులకంటెను, అన్యంబు= ఇతరమైనది, పరా
ఖ్యంబు = పర మనుపేరు గలది, అది, ముక్తరూపంబు = రూపములేనిది, అమూర్తంబు
ఐయుండు నని, మొదలన్ = తొలుతనే, సూచించితింగదా = జ్ఞాపకము సేసితినిగదా,
తత్ ఆకారంబున్ తేటపఱిచెదన్ = తత్స్వరూపంబుఁ దెలిపెద, పూర్వో...
బై - పూర్వోక్త = మున్ను చెప్పఁబడిన, దేవాది భేదరహితం బై = దేవాది
భేదములు లేనిదై, తద్భేద రాహిత్యమునన్ = ఆభేదము లేకపోవుటచేత, ఇట్టిదట్టిదని
వచించుటకున్ = ఈదృశంబు తాదృశం బని పల్కుటకు, గోచరంబుగాక=విషయము
గాక, అపక్షయాది రహితంబును - అపక్షయ = నాశము, ఆది = మొదలగువికారము
లచే, రహితంబును = విడువఁబడినదియు, సచ్ఛబ్దవాచ్యంబును - సత్=సత్తను, శబ్ద =
శబ్దముచే, వాచ్యంబును = చెప్పఁదగినదియు, ఆత్మసంవేద్యంబును - ఆత్మ = జీవునిచేత,
సంవేద్యంబును = తెలియఁదగినదియు, ఐ, జ్ఞాన ఏకరూపణీయంబు = జ్ఞానముచేతనే
నిరూపింపఁదగినది, అగుచున్, జ్ఞానశబ్దవాచ్యంబును=జ్ఞాన మనుశబ్దముచేఁ జెప్పఁదగినది
యును, తాన యై, బ్రహ్మాత్మకంబు అగుటన్ = బ్రహ్మస్వరూపమౌటచేతను,
బ్రహ్మసంజ్ఞయున్ = బ్రహ్మమనునట్టి నామమును, కాంచి = పొంది, ఒప్పున్ =
ఒప్పుచుండును, (3) మఱి, భావనా...బె - భావనాత్రయాత్మక = త్రిభావనా
స్వరూపమైన, విశ్వ = జగత్తుకంటెను, వైలక్షణ్యంబె = వేఱగుటె, లక్షణంబుగాఁ
గల = చిహ్నము గాఁగల, స్వరూపంబు = ఇట్టి (అమూర్తబ్రహ్మ) రూపము, అభ్యస్య
మానయోగుఁడగు = అభ్యసింపఁబడు యోగముగల, యోగికిన్ = యోగవంతునికి,

చింతింపన్ అశక్యంబు = అనుసంధానము చేయ శక్యము గాదు, మఱి అపరం బని చెప్పంబడిన, హిరణ్యగర్భుఁడు = చతుర్ముఖుఁడు, వాసవుండు = ఇంద్రుఁడును, ప్రజాపతులు = దక్షాదులు, మరుత్తులు = మరుత్తులనెడి యొకతెగ దేవతలు, (అష్ట) వసువులు, (ఏకాదశ) రుద్రులు, (ద్వాదశ) ఆదిత్యులు, తారకంబులు=నక్షత్రములు, గ్రహంబులు=సప్తగ్రహములు, గంధర్వులు = హాహా హూహూ మొదలగు దేవగాయనులు, యక్ష = కుబేరుని ప్రజలు, రక్షః=రాక్షసులు, దైత్య=అసురులు, ఆది = మొదలయిన, సమస్తదేవయోనులు=సమస్తమయిన దేవాంశకులు, మనుష్యులు = మానవులు, పశువులు, అద్రులు = కొండలు, సముద్రంబులు, ద్రుమంబులు = చెట్లు, వెండియున్=మఱియు, ఏక...పాదంబులు-ఏకపాదములు, ద్విపాదములు బహుపాదములు (అగు), జంతువులును, అపాదంబులు = పాదములులేనివియు అగు, ఇతర భూతంబులున్ = ఇతర జంతువులును, తదుత్పత్తి హేతువులుగాన్=ఆభూతాది జన్మములకుఁ గారణంబులుగా, విలసిల్లునట్టి = ఒప్పుచున్నట్టి, ప్రధానాది విశేషాంత = ప్రధానము మొదలు వ్యక్తి విశేషములు తుదగాఁగల, చేతనా చేతనాత్మక = జ్ఞానాజ్ఞానజీవరూపమైన, ప్రపంచభావంబగు = ప్రపంచభావము గలయట్టి, స్థూలరూపంబు, ఉపక్రాంతయోగునకున్= యోగమున కుపక్రమించినయోగికి, చింతింపశక్యంబు = ధ్యానసాధ్యంబు, (4) శక్యమేనియున్ = ధ్యానసాధ్యంబైనను, తత్ = ఆ, భావనాత్రయాత్మకంబగుటకున్ = భావనాత్రయ స్వరూపమగుటచేత, అశుభాశ్రయంబు = శుభాశ్రయము గాదు, కావునన్ = కాన, ముక్తిసాధనంబుగాదు = మోక్షసాధనంబు గాదు, ఈచెప్పఁబడినసకల ప్రపంచంబును, విష్ణుసమన్వితంబై, అతనికిన్ = ఆదేవునికి, శరీరంబు నైయుండున్, అట్టి విష్ణుశక్తులు = విష్ణుసామర్థ్యములు, మొదలన్ నేన్ చెప్పిన = తొలుత నాచేఁ జెప్పఁబడిన, పరాపరాఖ్యలను = పర అపర అను నామములచేతను, తదరిక్తయగు = వానికి వేఱైన, కర్మాఖ్యము = కర్మశక్తియనునట్లుగా, త్రివిధములై యుండును, అందున్= వానియందు, కర్మాఖ్యశక్తిచేత వేష్టితయై = కర్మమను పేరుగలశక్తిచేతఁ జుట్టఁబడినదై, అపరాఖ్య అగు = అపరమను పేరుగల, క్షేత్రజ శక్తి=పురుషశక్తి, జన్మ...లన్ - జన్మజరామరణాది = జననము ముదిమి చచ్చుట మొదలగు, అనేక సంసారతాపంబులన్ = బహువిధములగు సంసారమువలని వేదనలను, అనుభవించుచున్, తత్క...లు - తత్కర్మ=ఆయాకర్మలకు, అనుగుణ = సరియైనట్టి, శరీరంబులు = దేహములు, ఎత్తి = పొంది, విజ్ఞానతారతమ్యంబులన్ = విశేష జ్ఞానంబులయొక్క హెచ్చుతక్కువలను, పొందున్ = చెందును, తత్ప్రకారంబు=తత్క్రమంబు, ఆకర్ణింపుము=వినుము.

సీ. ఉండు నప్రాణులం దొక్కించు కాశక్తి;
స్థావరశ్రేణిఁ ద జ్జాతికంటె;
నెట్టు రోఁకటిబండ జెట్టె మన్దిండి ము
న్నగు సరీసృపములం దంతకంటె;
ఖగముల [1]మఱి వాని కంటె; మృగావలి
యందు నూహింపఁగ నంతకంటె,
దంతి గోముఖ పశుతతి నంతకంటె; మ
ర్త్యకదంబకములయం దంతకంటె,
తే. యక్ష గంధర్వ నాగాళి నంతకంటె,
నంతకంటె నిలింపులం దంతకంటె
హరిహయునియందు, దక్షునం దంతకంటె,
నాద్యుఁడు హిరణ్యగర్భునం దంతకంటె. ౬౦

టీ. ఆశక్తి = ఆక్షేత్రజ్ఞశక్తి, అప్రాణులందున్ = ప్రాణరహితవస్తుజాలమందు, ఒక్కించుక = కొంచెము, ఉండున్ = ఉండును, తజ్జాతికంటెన్ = ప్రాణరహిత వస్తుజాతికంటెను, స్థావరశ్రేణిన్ = స్థావరవస్తువులగు పర్వతవృక్షాదులయందు, ద్విగుణంబుగ నుండును, (ఈపద్యమునం దుదాహరింపఁబడిన స్థావరశ్రేణిశబ్దము మొదలు హిరణ్యగర్భశబ్దమువఱకు యథాక్రమంబుగా దత్తచ్ఛబ్దవాచ్యంబు లగు భూతముల యందు నొకదానికంటె నొకదానియం దావిష్ణుశక్తి ద్విగుణంబుగా హెచ్చుగా నుండు నని యూహింపవలయు), తజ్జాతికంటెన్ = అస్థావరజాతికంటెను, ఎట్టులు, రోఁకటిబండలు, జెట్టిపోతులు, మన్దిండి = మన్ను దినునట్టి కణుదురు, మున్నగు = మొదలయిన, సరీసృపములందున్ = సర్పములందును, అంతకంటెన్, ఖగములన్ = పక్షులందును, వానికంటెన్, మృగావలిన్ = మృగసమూహమందును, ఊహింపన్ = గ్రహింపఁగా, అంతకంటెన్, దంతి...న్ - దంతి = ఏనుఁగు, గో = ఆవు, ముఖ = మొదలగు, పశుతతిన్ = పశుసంఘమందును, అంతకంటెన్, మర్త్య...దున్ - మర్త్య = మనుష్యులయొక్క, కదంబకములయందున్ = గుంపులయందును, అంతకంటెన్, యక్షగంధర్వనాగాళిన్ = యక్షులు నాగులయందును, అంతకంటెన్, నిలింపులందున్ = దేవతల యందును, అంతకంటెన్, హరిహయునియందున్ = దేవేంద్రునియందును, అంతకంటెన్,

1. యం దంతకంటె.

దక్షునియందును, అంతకంటెన్, ఆద్యుండు=మొదలివాఁడైన, హిరణ్యగర్భునందున్ = చతుర్ముఖునియందు, క్షేత్రజ్ఞశక్తి యుండును.

ఆ. ఇట్టిరూపకోటు । లెల్ల నవ్విష్ణుని
తనుచయంబు సుమ్ము । ధరణినాథ!
యతఁ డచింత్యశక్తి । నఖిలభూతముల నా
కసమువోలె నిండి । యెసఁగుఁ గాన. 81

టీ. ధరణినాథ = రాజా! అతఁడు = ఆదేవుఁడు, అచింత్యశక్తిన్ = చింతింప నశక్యంబైన సామర్థ్యముచేత, అఖిలభూతములన్ = సకలభూతములయందు, ఆకసమువోలెన్ = ఆకాశమువలె, నిండి = సంపూర్ణుఁడై, ఎసఁగున్ కానన్ = ఒప్పును గాన, ఇట్టిరూపకోటులెల్లన్ = ఏతాదృశరూప సహస్రంబు లన్నియును, అవ్విష్ణుని=ఆదేవుని యొక్క, తనుచయంబు సుమ్ము = దేహసమూహముసుమీ.

తా. ఓ ధరణినాథా! ఆవిష్ణు వప్రమేయం బగు నిజసామర్థ్యముచేత నిఖిల భూతములయం దాకాశముమాడ్కి నిండి ప్రకాశించుచుండును గాన, నుక్తంబులగు నేతాదృశరూప సహస్రంబు లాదేవుని శరీర పుంజంబులు సుమీ! యని కేశధ్వజుండు పలికెను.

సీ. మున్నెన్నినపరాఖ్య । మునకు ద్వితీయమై
విష్ణుసంజ్ఞఁ గను[1]ను । రీతిలేశ
యోగిహృద్ధ్యేయమై । యొప్పు నమూర్తరూ
పం బొందు; సత్సంజ్ఞఁ । బ్రాజ్ఞకోటి
దాని వచించు; నేతద్రూపమె సమస్త
శక్తుల కెల్ల నాశ్రయత [2]నొంది
ప్రాగుక్త విశ్వరూపవిలక్షణతఁ గాంచి
కల్యాణగుణభూతిగరిమఁ దనరి
తే. యతిమహత్త్వంబుచే । వెల్గునట్టి శక్తి
నలరు బ్రహ్మాంబ దేవతిర్యఙ్మనుష్య
నామచేష్టావదవతరణముల నాత్మ
లీల జగదుపకృతికిఁ గల్పించుచుండు. 82

1. సంజ్ఞనను. 2. ఁ బొంది.

టీ. ఉర్వీతలేశ=రాజా ! మున్ను ఎన్నిన పరాఖ్యమునకున్=మునుపుచెప్పిన పర మనియెడు పేరుగల బ్రహ్మమునకు, ద్వితీయమై=రెండవదియై, యోగిహృల్ధ్యేయమై= యోగులకు చిత్తములందు ధ్యానము సేయఁదగినదియై, ఒప్పు...బు - ఒప్పు = ఒప్పు చున్న, అమూర్తరూపంబు=మూర్తభిన్నరూపంబు, ఒండు=ఒకటి, విష్ణుసంజ్ఞ=విష్ణువను పేరును, కనున్ = పొందుచు. ప్రాజ్ఞకోటి=పండితసమూహము, (ని. 'ధీరో మనీషీ జ్ఞః ప్రాజ్ఞస్సఙ్ఖ్యావాన్పణ్డితః కవిః' యని యమరము.) దానికిన్=ఆరూపమును, సత్సంజ్ఞన్= సత్తను నామముచేత, వచించున్=పేర్కొనును. ఏతత్ రూపమె=ఈరూపమె, సమస్త శక్తులకున్ ఎల్లన్ = నానావిధము లైన సామర్థ్యములకును, ఆశ్రయతన్=స్థానమగు టను, ఒంది=పొంది, ప్రాగు...తన్-ప్రాక్ ఉక్త=ముందు చెప్పఁబడిన, విశ్వరూప=జగ ద్రూపముకంటె, విలక్షణతన్=వైలక్షణ్యమును, గాంచి=కని, కల్యా...మన్-కల్యాణ గుణభూతి = కల్యాణగుణ సంపత్తియొక్క, గరిమన్ = గురుత్వముచేతను, తనరి = ఒప్పి, అతిమహత్త్వంబుచేన్ = అత్యంత మాహాత్మ్యముచేత, వెల్గున్=ప్రకాశించును, అట్టి, శక్తిన్=సామర్థ్యముచేత, అలరు...బ-అలరు=ఒప్పునట్టి, బ్రహ్మంబ=పరబ్రహ్మమే, దేవ...లన్-దేవ=దేవతలయందు, తిర్యక్=మత్స్యాది తిర్యగ్జాతులయందును, మనుష్య= మనుష్యులందును, నామచేష్టావత్ = నృసింహ వామన మత్స్య కూర్మ వరాహ రామ కృష్ణాది నామములకుఁ దగిన చేష్టలు గల, అవతరణములన్ = అవతారములను, ఆత్మ లీలన్-ఆత్మ=తనయొక్క, లీలన్ = విలాసముచేతను, జగత్ ఉపకృతికిన్ = లోకోప కారమునకై, కల్పించుచుండున్ = చేయుచుండును.

తా. ఓయి భూనాయకుఁడా ! మున్ను నేఁ జెప్పిన పరబ్రహ్మ మనియెడు బ్రహ్మ మునకు రెండవదియై యోగులచేతఁ దెలియఁదగినది యైన మూర్తభిన్నరూపం బొక్కటి విష్ణు వనునామమును బొందియున్న దనియుఁ, బండితు లట్టిరూపంబును సత్తను సంజ్ఞచేత వచించుచున్నా రనియు, నీరూపంబె నానావిధసామర్థ్యముల కాశ్రయతను బొంది పూర్వము చెప్పఁబడిన జగద్రూపముకంటెను వైలక్ష్యముం గాంచి కల్యాణ గుణ సంపద్గురుత్వముచేత నొప్పి యత్యంత మాహాత్మ్యము గలిగి ప్రకాశించుచున్న సామర్థ్యముచేత నొప్పును. అట్టి పరబ్రహ్మమే నిజవిలాసముచేత దేవతిర్యఙ్మను ష్యులయొక్క నామములు వ్యాపారములుం గల రామకృష్ణాద్యవతారములను లోకోప కారమునకై కల్పించుచుండును.

ఆ. కర్మభుక్తికొఱకుఁ గాఁ దిట్టి తల్లీల;
యతఁడు సకలజాతుఁలందుఁ బుట్టుఁ;

బుట్టినట్టి యతని భూరిచేష్టితము ల
వ్యాహతములు రావణాదివలన. 83

టీ. ఇట్టిసల్లీల-ఇట్టి, తత్ = ఆదేవునియొక్క, లీల = విలాసక్రియ, కర్మభుక్తి కొఱకుఁ గాదు = కర్మానుభవముకొఱకుఁ గాదు, అతఁడు = ఆవిష్ణుదేవుఁడు, సకల జాతులందుఁ = దేవమనుష్య తిర్యగాది సమస్తజాతులయందును, పుట్టుఁ = జన్మము నొందును, పుట్టినట్టి=జనియించిన, అతని=ఆదేవునియొక్క, భూరిచేష్టితములు=అనంతము లైన వ్యాపారములు, రావణాదివలనఁ=రావణుఁడు మొదలగు దుష్టులవలన, అవ్యాహతములు = భగ్నములు గావింప నశక్యంబులు.

తా. ఆవిష్ణుదేవునియొక్క విలాసక్రియ స్వకీయ కర్మానుభవము కొఱకుఁ గా దనియు, నాతఁడు తిర్యగాది నిఖిల జాతులయందుఁ బుట్టినను నతని వ్యాపార విస్తారంబులు దుష్టు లగు రావణాదులవలన భగ్నములు గావింప నసాధ్యంబు లనియును తా.

వ. అట్టి పరమేశ్వరునకు బద్ధముక్తాది రూపంబు లనేకంబులు గలిగిన ముముక్షునకు జ్ఞానసిద్ధికిఁ బరవ్యూహవిభవాదిరూపంబులే చింతనీయంబులు; ప్రజ్వలితశిఖుం డగు పవనసఖుండు నీరసనికుంజంబు నెట్లు దహించు నట్లు చిత్తస్థుం డగు నవ్విష్ణుండు యోగిజనంబుల సకలకిల్బిషంబులు నిర్దహించుఁ గావున సకలశక్త్యాశ్రయుం డైన యప్పరమాత్మునియందుఁ జిత్తంబు నిల్పుట విశుద్ధ యగు ధారణ యనంబడు; సర్వసంగంబునఁ జలాత్మకం బగుచిత్తంబునకుఁ ద్రిభావభావనాతీతుం డగు నద్దేవుండు శుభాశ్రయుం డై ముక్తికరుం డగు; నేతద్వ్యతిరిక్తు లగు బ్రహ్మాదిదేవతలు కర్మయోను లగుట నశుద్ధులు గావునఁ జిత్తంబున కవలంబనీయులు గారు; మఱి నిరవలంబధ్యానంబు పొందుపడదు గావున, ధారణాధ్యానవిషయంబై శుద్ధంబగు స్థూలరూపాంతరం బయ్యనంతునకుం గలదు, దానిసవిస్తరంబుగాఁ జెప్పెద నాకర్ణింపుము.

టీ. అట్టిపరమేశ్వరునకు, బద్ధ, ముక్త, ఆది, రూపంబులు-బద్ధ = 'అపరసంజ్ఞంబు అబ్జగర్భాది బద్ధనికాయంబు మూర్తము' - ముక్త = 'పరము ముక్తాత్మ అమూర్తము'- ఆది = 'పరాఖ్యమునను ద్వితీయమై యోగి హృద్ధ్యేయమై యొప్పు నమూర్తరూపం బొందు' - (ప. 82) - రూపంబులు = స్వరూపములు. (చూ. 78) అనేకంబులు కలిగినన్ = పెక్కులు గలిగియుండినను, ముముక్షునకున్ = సాధకునికి, జ్ఞానసిద్ధికిన్ =

జ్ఞానము సిద్ధించుటకొఱకు, పర...లే - పర = వైకుంఠవాసుఁ డైన పరవాసుదేవుఁడు, వ్యూహ=సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులు, విభవ = రామకృష్ణాద్యవతారంబులు, ఆది= మొదలగు, రూపంబులె = స్వరూపములే, చింతనీయంబులు = ధ్యానవిషయంబులు, చిత్తస్థుం డగు=మనంబున నిల్చినట్టి, విష్ణుండు = విష్ణువు, ప్రజ్వలిత శిఖుం డగు=మిగుల మండుచున్న జ్వాలలుగల, పవనసఖుండు = అగ్ని, నీరసనికుంజంబున్ = ఎండినపొదను, ఎట్లుదహించున్ = ఏవిధంబుగఁ గాల్చునో, అట్లు = ఆవిధంబుగ, యోగి...లు-యోగి జనంబుల=యోగులయొక్క, సకల కిల్బిషంబులు=సమస్తపాపములను, నిర్దహించున్ = కాల్చును, కావునన్ = కాన, సకలశక్త్యాశ్రయుండైన = సమస్త సామర్థ్యముల కాధారమైన, అప్పరమాత్మునియందున్, చిత్తంబు నిలుపుట = మనం బుంచుట, విశుద్ధ యగు ధారణ యనంబడు, సర్వసంగంబునన్ = నిఖిలవస్తుసంబంధములచేత, చలాత్మకం బగు చిత్తంబునకున్=చంచలరూప మైనమనంబునకు, త్రిభావ...డు-త్రిభావ=మూఁడు భావములుగల (ప. 79) - బ్రహ్మభావన, కర్మభావన, తదుభయభావన అను, భావనా= ధ్యానములకు, అతీతుం డగు = వెలిగా నున్నట్టి, అద్దేవుండు, శుభాశ్రయుం డై=శుభ స్థానమై, ముక్తికరుఁ డగు=మోక్షమునిచ్చువాఁ డగును, ఏతద్వ్యతిరిక్తులగు = ఈవిష్ణు నకుభిన్ను లైన, బ్రహ్మాదిదేవతలు = చతుర్ముఖుండు మొదలగు నిలింపులు, కర్మయోను లగుటన్ = కర్మమే కారణంబుగాఁగలవా రౌటచేత, అశుద్ధులు = అయోగ్యులు (మలిను లనుట) [చూ. 78 (ఆ)], కావునన్, చిత్తంబున కవలంబనీయులు కారు=మనస్సున కాశ్రయింపఁదగినవారలుగారు, మఱియును, నిర...బు - నిరవలంబ = ఆధారములేని, ధ్యానంబు, పొందుపడదు కావునన్=సిద్ధింపదుగాన, ధారణాధ్యానవిషయం బై=ధార ణాధ్యానంబులకు గోచరం బై, శుద్ధంబగు = నిర్మలంబగు, స్థూలరూపాంతరంబు=మఱి యొకస్థూలరూపము, అయ్యనంతునకున్ = అపరబ్రహ్మమునకు, కలదు=ఉన్నది. దానిని సవిస్తరంబుగాఁ జెప్పెద నాకర్ణింపుము.

సీ. శరదిందుచకచకస్మయజిత్ప్రసన్నాస్యు,
దొడ్డకెందమ్మికన్దోయివాని,
నతికమ్రగల్లభాగాభోగఫాలాఢ్యు,
మకరాంకరత్నకర్ణికలవానిఁ,
గాంబవోద్యచ్ఛ్రీవిడంబివృత్తశిరోధి,
సిరి పొల్చుమచ్చ పేరురమువాని,
నతనాభియుతవళిత్రితయశాతోదరు,
జానులంబిచతుర్భుజములవానిఁ,

తే. కరివరకరోరు, రుచిరజం*ఘామనోజ్ఞు,
సమతఁబొందిన పదపల్లవములవాని,
హైమవసను, గిరీటహారాంగదాది
కలితు, శంఖరథాంగాదు లలరువాని. ౮౫

టీ. శర...స్యుఁ - శరత్ ఇందు = శరత్కాలచంద్రునియొక్క, చకచక = ధాళధళ్యముయొక్క, స్మయ = గర్వమును, జిత్ = గెలిచినట్టి, ప్రసన్న=ప్రసాదము గల, ఆస్యుఁ = ముఖముగలవానిని, దొడ్డ...నిఁ-దొడ్డ = గొప్పలైన, కెందమ్మి = ఎఱ్ఱదామరలవంటి, కన్దోయివానిఁ = నేత్రయుగళముగలవానిని, అళి...ధ్యుఁ - అళికము=మిగులఁ గమనీయమైన, గల్ల=చెక్కిళ్లయొక్క, భాగ=ప్రదేశముచేత, ఆభోగ= పరిపూర్తిగల, ఫాల=నొసటిచేత, ఆఢ్యుఁ = సంపన్నుఁడైనవానిని, మకర...నిఁ- మకర = మొసళ్లు, అంక = చిహ్నముగాఁగల, రత్న = మణిఖచితము లయిన, కర్ణికలవానిఁ=పోఁగులుగలవానిని, కాంబవ...ధిఁ-కాంబవ=శంఖసంబంధి యైన, ఉద్యత్ = విలసిల్లుచున్న, శ్రీ = కాంతియొక్క, విడంబి = పోలిక గలిగినట్టి, వృత్త=వట్రువైన, శిరోధిఁ = మెడగలవానిని, సిరి = లచ్చి, పొల్చుమచ్చ పేరురమువానిఁ-పొల్చు= ఒప్పునట్టి, మచ్చ = శ్రీవత్స మనుమచ్చ గల, పేరు ఉరమువానిఁ=గొప్ప ఱొమ్ము గలవానిని (లక్ష్మీదేవియు శ్రీవత్స మను మచ్చయును స్వామివక్షస్స్థలమం దుండుట ప్రసిద్ధము), నత...రుఁ-నత = లోఁతైన, నాభి = బొడ్డుతోడను, యుత = కూడియున్న, వళిత్రితయ = మూఁడుముడుఁతలు గలిగిన, శాత=సూక్ష్మమైన, ఉదరుఁ = బొజ్జగలవానిని, జాను...నిఁ - జానులంబి = మోఁకాళ్లపర్యంతము వ్రేలుచున్న, చతుర్భుజములవానిఁ = నాలుగుచేతులు గలవానిని, కరి...రుఁ - కరివర = గజశ్రేష్ఠముయొక్క, కర=తుండమువంటి, ఊరుఁ=తొడలుగలవానిని, రుచి...జ్ఞుఁ - రుచిర=మనోహరమైన, జంఘా=పిక్కలచేత, మనోజ్ఞుఁ = సుందరుఁడైనవానిని, సమ...నిఁ - సమతఁ బొందిన = సమమైనట్టి, పదపల్లవములవానిఁ = చిగురుటాకులవంటి పాదములు గలవానిని, హైమ...నుఁ - హైమ = సువర్ణసంబంధియైన, వసనుఁ = వస్త్రముగలవానిని, కిరీట...తుఁ - కిరీట, హార, అంగద=బాహుపురి, ఆది = మొదలైనవానితో, కలితుఁ = కూడియున్నవానిని, శంఖ...లు-శంఖ = శంఖము, రథాంగ = చక్రము, ఆదులు = మొదలుగాఁగల పంచాయుధములచే, అలరువానిఁ = ఒప్పుచున్నవానిని.

* జంఘు రమణీయు.

తా. శరత్కాల చంద్రునియందలి ధావళ్యమును ధిక్కరించుచుఁ బ్రసన్నమై యున్న ముఖము గలట్టియు, గొప్పవైన యెఱ్ఱదామరలవంటి నేత్రయుగళము గలిగి నట్టియు, మిగుల సుందరమగు చెక్కిళ్లు పరిపూర్తి గలనొసలు వీనిచే సంపన్నుఁడై నట్టియు, మకరాంకములు రత్నఖచితములునైన ప్రోఁగులు గలయట్టియు, శంఖకాంతి ననుకరించుచు వట్రువగానున్న మెడగలయట్టియు, లక్ష్మిచేతను శ్రీవత్స మను మచ్చచేతను నొప్పుచున్న ఱొమ్ముగల మిగుల లోఁతైన నాభితోఁగూడిన వళిత్రయముగల సూక్ష్మమగు బొజ్జగల యట్టియు, మోఁకాళ్లవఱకు వ్రేలెడి చతుర్భుజములుగలట్టియు, యేనుంగు తుండమువంటి తొడలచే నతిరమణీయంబగు పిక్కలచేత సుందరుండైనట్టియుఁ, జిగురుటాకులవంటి పాదములుగల్గి హైమవసనము గలట్టియుఁ, గిరీటహారాంగదాది సహితుఁడైనట్టియు, శంఖరథాంగాది పంచాయుధములచే నొప్పుచు నుక్తసకలలక్షణలక్షితుం డై యున్న జగదీశ్వరుం డగు శ్రీహరి దివ్యమంగళ విగ్రహమును సాధకుండు వక్ష్యమాణక్రమంబున ధ్యాన మొనర్పవలయును.

సీ. శ్రీవిష్ణు నీగతిఁ ꠲ జింతింప వలయుఁ [1]ద
    న్మయుఁ డగు యోగి క ꠲ క్రమంబుతోడ
నొక్కయంగమె మున్ను ꠲ చిక్క లోఁ భావించి
    యది దృఢం బగుటయు ꠲ నవలియంగ
కము మఱి చింతింపఁ ꠲ గాఁ దగు నట్టి య
    భ్యాసంబువలన [2]నయ్యవయవములు
నడచిన నున్న మాఁనక యెద్దియేనియుఁ
    జేయుచున్నను మదిఁ ꠲ బాయఁడేని;
తే. యతనిసామ్యంబు గని ముక్తుఁ ꠲ డగు; సురాది
    భేదసంజనకాజ్ఞాన ꠲ మేదఁ బిదప
నలము(రు)కల్యాణగుణముల ꠲ హరికిఁ దనకు
    లేని భేద మెవ్వాఁడు కల్పింపఁగలఁడు ? 86

టీ. శ్రీవిష్ణున్ = శ్రీహరిని, ఈగతిన్ = వక్ష్యమాణ ప్రకారంబుగ, చింతింప వలయున్ = ధ్యానముసేయవలయును, తన్మయుఁడగు = అవిష్ణుస్వరూప మయ్యెడి, యోగి=యోగవంతుఁడు, క్రమంబుతోడన్, మున్ను=తొలుత, ఒక్కయంగమే = ఒక యవయవమునే, చిక్కన్=గుఱుతుచిక్కునట్లుగ, లోన్=లోపల, భావించి=చింతించి,

1. దన్మయుఁ డయి. 2. నయ్యవయవి మఱి.

అది దృఢం బగుటయున్ = ఆయంగము దృఢముగ మనంబులో నిలిచినపిమ్మట, అవలి యంగకము-అవలి=ఆవల నున్న, అంగకము, మఱి = మఱియును, చింతింపఁగాఁదగున్ = ధ్యానము సేయవలయు, అట్టియభ్యాసంబువలనన్ = అటువంటివాడుకచేత, అయ్యవయవములు=ఆయంగములను, నడచినన్=గమన మొనరించినను, ఉన్నన్=స్థితుం డైనను, మానక=వదలక, ఎద్దియేనియున్ చేయుచున్నను=ఏపనిసేయుచుండినను, తుదిన్=బుద్ధిని, పాయఁడేని=తొలఁగకుండఁ జేసెనేని, అట్లాచరించిన సాధకుండు, అతనిసామ్యంబు - అతని=అప్పరమాత్మునియొక్క, సామ్యంబు=సారూప్యము, కని=కాంచి, ముక్తుఁడగున్ = మోక్షమందును, సురాది...ము-సురాది = సురలు మొదలగు, భేద=భేదమును, సంజనక=పుట్టించుచున్న, అజ్ఞానము = అవిద్య, ఏచన్ = నివర్తింపఁగా, పిదపన్ = పిమ్మట, అల...ములన్-అలము = ప్రాప్తమగునట్టి, కల్యాణగుణములన్ = సౌశీల్యాది శుభగుణములచేత, హరికిన్=విష్ణునకు, తనకున్=యోగికిని, లేనిభేదము=ఎన్నఁటికిలేకుండు భేదమును, ఎవ్వాఁడు=ఎట్టివాఁడు, కల్పింపఁగలఁడు=నిర్మాణము సేయ సమర్థుఁ డౌను ?

తా. శ్రియఃపతియొక్క సారూప్యం బపేక్షించువార లీప్రకారము ధ్యానము సేయవలయును. ఎట్లనిన: మున్నొక్క యవయవమును మనంబున గంటునట్లుగా మిగుల భావన యొనర్చి, యది దృఢముగ గుర్తు దగిలినపిమ్మట మఱియొక యంగమును భావించుచు నిత్తెఱంగున నవయవంబుల నెల్ల ధ్యానించి, తా నూరకున్నను లేక గమనాదివ్యాపారంబులు వడసి యున్నను, మఱియు నెట్టి యవస్థ నొందియున్నను, ధ్యానము మానక యుండిన నాయంగంబులు మనంబు విడిచి కదల కుండున ట్లభ్యాసపాటవ మొనర్చెనేని యట్టిసాధకుండు శ్రీహరి సారూప్యము నొంది ముక్తుం డగును. దేవతలు మొదలగువా రభేదమును గల్పించుచున్న యజ్ఞానము నివర్తించిన పిదపఁ గల్యాణ గుణసమన్వితుండై యావిష్ణునకుం దనకును లేని భేదం బెవ్వఁ డేనియుం గల్పింపఁజాలఁడు.

క. నరవర! యిటు బంధచ్యుతి
[1]కొఱ కగు నంగాష్టకాఖ్య(ధ్య) గురుయోగము వి
స్తరముగఁ జెప్పితి నింకన్
గరణీయం బెద్ది నాకుఁ గల్పింపు మనన్. 87

1. కర మగునంగాష్టకాఖ్యఘనయోగము. (2. ఆ. 6, 11, 18 - లలో ర ఱ ల సంకరములేక రచించినకవి యిటమాత్రమాసాంకర్యముచేయునా? కనుక 'కర మగు' నని యుంటయే సరి.)

టీ. నరవర=రాజా! ఇటు = ఈప్రకారము, బంధచ్యుతికొఱకున్ అగు=సంసార బంధమోచనమునకైనట్టి, అంగా...ము - అంగాష్టకాఖ్య = అంగాష్టక మను పేరం బరఁగిన, గురు=అతిశయంబగు, యోగము = సమాధిని, (యోగాంగములు చూ. ప. 35) విస్తరముగన్=విపులమగునట్లు, చెప్పితిన్=వచించితిని, ఇంకన్=ఇంకను, నాకున్, కరణీయంబు=చేయందగినది, ఎద్ది=ఏది, కల్పింపుము=చెప్పుము, అనన్=అనఁగా.

తా. ఓయి రాజా! ఈప్రకారముగా సంసార రూప బంధ మోచనంబునకై యంగాష్టకాఖ్యం బగు నుత్తమ యోగంబు సెప్పితి; నింక నేఁ జేయం దగినది యెద్దియో తెలుపు మనఁగా, నాఖాండిక్యుండు ముందు వచించుచున్నాఁ డనుట.

తే. 'నృప! కృతార్థుండ నైతి నా । కింతకంటె
నర్థనీయంబు మఱి యెద్ది ? । యనుచు నతని
కర్చఁ గావించి వల దన్న । నతఁ డొసంగు
తనదు తొంటిరాజ్యంబునఁ । దనయు నిలిపి. 88

టీ. నృప = కేశిధ్వజుండా! కృతార్థుండను ఐతిన్=ధన్యుండనైతిని, నాకున్, ఇంతకంటెన్ = ఈయోగముకంటెను, అర్థనీయంబు = కోరఁదగినది, మఱియెద్ది = మఱియొకటి యేది, అనుచున్, అతనికిన్=కేశిధ్వజునకు, అర్చఁగావించి = పూజయొనర్చి, వలదన్నను=వలవదన్నను, అతఁడు=ఆకేశిధ్వజుఁడు, ఒసఁగు=ఇచ్చినట్టి, తనదు...నన్- తనదు = తనయొక్క, తొంటిరాజ్యంబునన్ = పూర్వపు రాజ్యమునందు, తనయున్= పుత్త్రుని, ఉనిచి, ముందటి కన్వయము.

తా. ఓయి కేశిధ్వజుఁడా! ధన్యుండనైతి నీ యోగంబుకంటె వేఁడఁదగినది యెద్దియును లే దనుచు నాకేశిధ్వజునకుం బూజఁ గావించి, వలవదన్నను గేశిధ్వజుం డిచ్చిన తన పూర్వపు రాజ్యమునందుఁ దన పుత్త్రుని నియమించి.

వ. (1) పురోహిత ప్రధానుల నప్రాప్తయౌవనుం డగు నతని మెలపి కొండని నియోగించి, వారల దానసమ్మానాదులం బ్రోవు మని కుమారునకు నప్పగించి, గోవిందచరణారవింద విన్యస్తమానసుం డై ఖాండిక్యుం డుభయకర్మంబులు డులిపి, యవ్వనంబ తపోవనంబుగాఁ గొంతకాలంబు కేశిధ్వజోపదిష్టభక్తియోగానుసంధానంబున మధుమథన సాధర్మ్యంబు నొందె; (2) కేశిధ్వజుండును దత్పుత్త్రునిఁ దత్ప్రధానులఁ దదీయ రాజ్య పరిపాలన కనిచి మగుడి మిథిలాపురంబు ప్రవేశించి యోగాశ్రయుఁ డై భోగంబులం బుణ్యంబులు తదితరం

బుల దురితంబులు ప్రక్షీణంబులుగా క్షోణీతలం బేలుచుండెం,
(3) గావున ముముక్షున కుపాశ్రయణీయుం డధోక్షజుండు, పాండ్య
క్షితీశా! నీ వతని భజియింపు మిదియె భక్తియోగంబు, దీనియందు
నొక్క కొఱంతగల, దంతరాయంబు నొందినం బునర్భవంబుఁ
బొందించి మఱి ముక్తిఁ జేర్చు, న ట్లగుట నింతకంటె సులభోపాయం
బా యోధనంబున నయ్యధోక్షజుండు గాండీవి కుపదేశించిన శరణా
గత ధర్మంబ నిరపాయధర్మం" బని పరిణతాంతఃకరణుం డగు నతనికి
మూలమంత్ర పూర్వకంబుగాఁ ద్వయము ప్రసాదించి భాగవత
ప్రధానుం గావించిన. ౬9

టీ. ఖాండిక్యుఁడు, పురోహితులను, ప్రధానులను, అప్రాప్తయౌవనుం డగు = వయసురానివాఁ డై యున్న, అతనిన్ = ఆకుమారుని, మెలపికొండని = తీర్చికొండని, నియోగించి = ఆజ్ఞాపించి, వారలన్ = ఆమంత్రిపురోహితులను, దాన...లన్ - దాన=ఈవులు, సమ్మాన = బహుమానములు, ఆదులన్ = మొదలగువానిచేత, ప్రోవుమని=రక్షింపుమని, కుమారునకున్ అప్పగించి=పుత్రకునివశము గావించి, గోవింద...డై- గోవింద=శ్రీహరియొక్క, చరణారవింద = పాదపద్మములయందు, విన్యస్త = ఉంచఁబడిన, మానసుం డై=మనంబుగలవాఁ డై, ఖాండిక్యుఁడు, ఉభయకర్మంబులు దులిపి = పుణ్యపాపముల దుల్లఁగఁగొట్టి, అవ్వనంబ=తానున్న యరణ్యంబె, తపోవనంబుగాన్ = తపమొనరించునట్టి యాశ్రమముగా, కొంతకాలంబు = కొన్నినాళ్లు, కేశి...నన్ - కేశిధ్వజోపదిష్ట=కేశిధ్వజునిచేత నుపదేశింపఁబడిన, భక్తియోగాను సంధానమ్మునన్ = భక్తియోగము నాచరించుటచేత, మధు...నన్-మధుమథన = శ్రీమన్నారాయణుని యొక్క, సాధర్మ్యంబున్ = సమానధర్మమును, ఒందెన్=పొందెను, కేశిధ్వజుండును, తత్పుత్త్రుని=ఆఖాండిక్యుని కుమారుని, తత్ప్రధానులన్ = అతని మంత్రులను, తదీయ రాజ్యపరిపాలనకున్ అనిచి=ఖాండిక్యునిరాజ్యమంతయుం నేలుటకుఁబంపి, మగుడి=మరలి, మిథిలాపురంబు ప్రవేశించి = తాను మిథిలాపట్టణము సొచ్చి, యోగాశ్రయుం డై, భోగంబులన్=సుఖానుభవములచేత, పుణ్యంబులు = పుణ్యకర్మంబులు, తదితరంబులన్ = వానికంటెవేఱైన దుఃఖానుభవములచేత, దురితంబులు = పాపములు, ప్రక్షీణంబులు కాన్ = నశించునటుల, 'ప్రారబ్ధకర్మాణాం భోగా దేవక్షయ' యనునట్టి న్యాయావలంబి యై, క్షోణీతలంబు ఏలుచుండెన్, కావునన్=అటుగాన, ముముక్షునకున్, ఉపాశ్రయణీయుండు = ఆశ్రయింపఁదగినవాఁడు, అయ్యధోక్షజుండు=ఆవిష్ణుండె, పాండ్యక్షితీశా = ఓయిరాజా! నీవు, అతనిన్ = ఆవిష్ణుని, భజింపుము = భజనసేయుము, ఇది

భక్తియోగంబు దీనియందునొక్కకొఱఁతఁగలదు. అంతరాయంబు=విఘ్నము, ఒందినన్ = పొందినయెడల, పునర్భవంబున్ పొందించి = పునర్జన్మమెత్తించి, మఱి = పిదప, ముక్తిన్ చేర్పన్ = పరమపదమునందుఁజేర్చుచు, అట్లగుటన్ = ఆలాగగుటచేత, ఇంత కంటె సులభోపాయంబు, ఆయోధనమునన్ = తొల్లి భారతయుద్ధమందు, అయ్యధోక్షజుండు=ఆశ్రీకృష్ణుండు, గాండీవికిన్ = అర్జుననకు, ఉపదేశించిన శరణాగతధర్మంబ = శ్రీభగవద్గీతా చరమశ్లోకోక్తధర్మంబే, నిరపాయధర్మంబు=అపాయరహితమైన ధర్మము, అని = ఇట్లని, పరిణతాంతఃకరణుండగు = పరిపక్వమనస్కుండైన, అతనికిన్ = ఆపాండ్యరాజునకు, మూలతంత్రపూర్వకంబుగాన్ = శ్రీమదష్టాక్షరీమంత్రసహితంబుగా, ద్వయంబు = వాక్యద్వయంబును, ప్రసాదించి = అనుగ్రహించి, భాగవతప్రధానున్ = భాగవతోత్తమునిఁగా, కావించినన్ = చేయఁగా.

మ. వకుళాలంకృతయోగిహృన్నిలయ భాస్వత్పాండుభాస్వన్మయాం
బక నాభీజలజాతసూతవిధిసంప్రాప్తస్మరారిష్ట ము
ష్టికఠోరార్పణకర్కటీఫలితకేశిక్రూరరక్షోంగకా
కృకవాకుధ్వజదీర్ఘికాప్లవతపక్రీడోత్సవాద్యుత్సుకా. 90

టీ. వకుళా...య - వకుళ = పొగడపువ్వులచేతను, అలంకృత = అలంకరింపఁబడిన, యోగి = నమ్మాళ్వారనుయోగియొక్క, హృత్ = హృదయము, నిలయ = గృహముగాఁగలవాఁడా! భాస్వ...క - భాస్వత్ = సూర్యునియొక్క, పాండు=తెల్లనైన, భాస్వత్=కాఁతిగల చంద్రునియొక్క, మయ=స్వరూప మైన, అంబక=నేత్రద్వయముగలవాఁడా! (ని. 'స్యాదంబకమిషాదృశి' యని నిఘంటువు.) నాభీ...ష్ట - నాభీజలజాత = బొడ్డుతామరయందు, సూత = పుట్టిన, విధి = చతుర్ముఖునిచేతను, సంప్రాప్త = పొందఁబడిన, స్మర = మన్మథునికి, అరిష్ట = శత్రుఁడైన శివుఁడు గలవాఁడా! (విష్ణువు వలన బ్రహ్మయు నతనివలన రుద్రుఁడును బుట్టి రనుట) ముష్టి...కా - ముష్టి = పిడికిలియొక్క, కఠోర = నిష్ఠురమైన, అర్పణ = ఈవికి (అనఁగా ముష్టిఘాతమున కనుట). కర్కటీఫలిత=దోసపండుగాఁజేయఁబడిన, (ని. ఉర్వారుః కర్కటీస్త్రియా' అని అమ.) కేశి = కేశియనునట్టి, క్రూరరక్షః = కర్కశుండగురక్కసునియొక్క, అంగకా = దేహముగలవాఁడా, కృకవాకుధ్వజ = కోడి టెక్కెమందుఁ గల కుమారస్వామియొక్క, దీర్ఘికా = సరస్సునందు, ప్లవ = తెప్పచేత నగు, తపఃక్రీడా = గ్రీష్మకాలమందలి కేళియొక్క, ఉత్సవ=మహోత్సవము, ఆది=మొదలగువానియందు, ఉత్సుక=ఆసక్తుఁడైనవాఁడా.

తా. భాగవత ప్రధానుండగు నమ్మాళ్వారు హృదయమందు గ్రుమ్మరుచున్నట్టియు, సూర్యచంద్రులు నేత్రములుగాఁగలయట్టియుఁ, దనవలనఁ బుట్టినట్టి చతుర్ముఖుని యందుం బుట్టిన రుద్రుఁడు గలయట్టియుఁ, గఠోర మగు ముష్టిఘాతముచేత దోస పండుంబలెఁ బగుల్పఁబడిన కేశిదనుజుఁడు గలయట్టియుఁ, గ్రీష్మర్తువునందు స్కంద పుష్కరిణిలో నీఁదులాడుట యను నుత్సవముం దుత్సుకుఁడ వైనవాఁడా! యని తాత్పర్యము.

క. ఊరీకృతపాండవరథ, సారథ్య సయూథ్యగోపబాలకసహకే
లీరత భక్తప్రహ్లా, దారచితస్తోత్రపులకితాంచితగాత్రా. 91

టీ. ఊ...థ్య - ఊరీకృత = అంగీకరింపఁబడిన, పాండవ = అర్జునునియొక్క, రథ = అరదముయొక్క, సారథ్య=సూతత్వముగలవాఁడా! సయూథ్య...రత-సయూథ్య=చెలికాండ్రైన, గోపబాలక=గొల్లపిన్నవాండ్రతోడను, (ని. పృథుకశ్శాబకశ్శిశుః' అని అమ.) సహకేళీ = కూడంగ్రీడించుటయందు, రత = ఆసక్తిగలవాఁడా! భక్త...త్రా - భక్త=అనురక్తుఁడైన, ప్రహ్లాద = ప్రహ్లాదునిచేత, ఆరచిత=విశేషముగాఁ జేయంబడిన, స్తోత్ర = స్తుతిచేత, పులకిత = సంజాత పులక మైన, అంచిత = ఒప్పుచున్న, గాత్రా = దేహముగలవాఁడా.

తా. అర్జునుని రథమునకు సారథి యైనట్టియు, వయస్యులగు గొల్లలతోడి క్రీడల యం దాసక్తిగలయట్టియు, భాగవతుం డగు ప్రహ్లాదునిచేతఁ జేయఁబడిన స్తోత్రముచేత నైన రోమాంచముచే నొప్పుచున్న దేహముగలవాఁడా యని తాత్పర్యము.

స్రగ్విణి. ఆస్థితాహీంద్రశయ్యా దవీయస్తర
ప్రస్థితాంఘ్రీ శ్రితవ్రాత[1]చేతోఘదా
కస్థలప్రస్ఫురత్కాళియస్ఫాళ(లి) మూ
ర్ధస్థలీనృత్తమత్తల్లిహల్లీసకా. 92

టీ. ఆస్థితా...య్యా - ఆస్థిత = అధిష్ఠింపఁబడిన, అహీంద్ర = శేషుఁ డనెడు, శయ్యా=పాన్పుగలవాఁడా! దవీ...ఘ్రీ-దవీయస్తర=మిగులపొడువుగ, ప్రస్థిత=పెఁగిన, అంఘ్రీ = పాదములు గలవాఁడా! శ్రితవ్రాత = భక్తసమూహముయొక్క, చేతః = మనంబులందలి, అఘ=పాపములను, దా = ఖండించువాఁడా! (దో = అవఖండనే అని ధాతువు), కస్థల...కా-స్థల=ఉదకప్రదేశములు, ప్రస్ఫురత్=స్ఫురించుచున్నట్టి

1. చేతోగదా.

యనఁగా నుదకమం దున్న, కాళియ = కాళియుఁడను సర్పముయొక్క, క్ష్వేళ = విష యుక్తమైన, మూర్ధస్థలీ = శిరఃప్రదేశమందు, నృత్త = ఆడఁబడిన, మత్తల్లి = మత్తలీ నృత్యమును, హల్లీసక = హల్లీసక మను మండల తాండవమును గలవాఁడా.

తా. శేషశాయి యైనట్టియు, వామనావతారమందుఁ గడు దూరముగ నుంచఁ బడిన యంఘ్రియుగము గలయట్టియు, నాశ్రితజనపుంజ చిత్తస్థితంబులగు పాపంబులఁ బోఁగొట్టునట్టియుఁ, గాళియుం డనురక్కసుని శిరంబున నృత్తమొనర్చినట్టి యో శ్రీహరీ యని గ్రంథకర్త యొనర్చినధ్యానము.

మ. ఇది పాత్రప్రహారేశ్వరప్రభృతి బంహిష్ఠోత్కలానీక గు
ప్త దివిస్పృక్కటుయంత్రకొండపలి హృద్బాహాసి కద్రూజదీ
వ్యదుదారోద్యమకృష్ణరాయనృప సంజ్ఞాస్మత్కృపాముక్తమా
ల్యద నాశ్వాసము హృద్యపద్యము తృతీయంబై మహిం బొల్పగున్.

టీ. ఇది, పాత్ర...దక్ - పాత్రప్రహారేశ్వర ప్రభృతి=ప్రహారేశ్వర పాత్రుఁడు మొదలైన, బంహిష్ఠ=మిక్కిలి యధికులై యుండెడి, ఉత్కల = ఒడ్డెరాజులయొక్క, అనీక = సమూహముచేత, గుప్త = రక్షింపఁబడిన, దివిస్పృక్కటుయంత్రకొండపలి హృత్ = ఆకాశము నొరయుచుండెడు సమర్థమైన యంత్రములు గలిగియుండెడి కొండపల్లిదుర్గమును హరించుచునుండెడి, బాహా=భుజమందలి, అసి = ఖడ్గ మనియెడు, కద్రూజ = సర్పముయొక్క, దీవ్యత్ = ప్రకాశించుచు నుండెడి, ఉదారోద్యమ = మహోద్యోగముగలిగిన, కృష్ణరాయనృపసంజ్ఞాస్మత్కృత=కృష్ణరాయలనియెడిపేరుగలి గిన నాచేతఁ జేయఁబడిన, ఆముక్తమాల్యదక్=ఆముక్తమాల్యద యనియెడు ప్రబంధము నందు, హృద్యపద్యము=మనోహరపద్యములుగల, ఆశ్వాసము, తృతీయంబై=మూఁడ వది యై, మహిక్ = భూమియందు, పొల్పగుక్ = ఒప్పుఁగాత,

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తి మంత్రోపాసనాసమాసాదితాఖండ సాహితీ ధురీణుండు నాత్రేయగోత్రపవిత్రుఁడును వావిళ్లవంశ పయోరాశిరాకాసుధాకరుండు నగు రామస్వామిశాస్త్రిచేత ననేకపూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యాలోచించి రచింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యదావ్యాఖ్యానంబునఁ దృతీయా శ్వాసము.

శ్రీ ర స్తు

ఆ ము క్త మా ల్య ద

స వ్యా ఖ్యా న ము

చ తు ర్థా శ్వా స ము

క. శ్రీమందిరభుజమధ్యమ!
గోమండలకర్షి వేణుగుంఫన! దృప్య
ద్భౌమాహృతసురజనయి
త్రీమణితాటంక! వృషగిరిస్థ! ఖగాంకా! 1

టీ. శ్రీ...మ-శ్రీ=లక్ష్మీదేవికి, మందిర = నివాసస్థానమగు, భుజమధ్యమ=వక్షఃస్థలము గలవాఁడా! గోమం...న-గోమండల = ధేనుసమూహమును, కర్షి = ఆకర్షించుచున్న, వేణు = పిల్లఁగ్రోవియొక్క, గుంఫన=పూరించుటగలవాఁడా! దృప్య...క - దృప్యత్ = గర్వితుఁడగు, భౌమ = భూసుతుండగు నరకాసురునివలననుండి, ఆహృత= తేఁబడిన, సురజనయిత్రీ = దేవతామాత యగు నదితియొక్క, మణితాటంక = రత్నమయకర్ణభూషణములు గలవాఁడా! వృషగిరిస్థ=వేంకటాచల నివాసా! ఖగాంకా = గరుడకేతనా!

తా. నరకాసురుఁ డదితికర్ణతాటంకములు తనపరాక్రమమువలనఁ దెచ్చియుండెను; వానిని శ్రీకృష్ణుఁడు మరలఁ దీసికొనె నని శ్రీభాగవత ప్రసిద్ధము. తక్కిన వి వేంకటరమణస్వామికి విశేషణములు.

వ. అవధరింపు మా సమయంబున. 2

టీ. ఇది గ్రంథకర్త స్వామికి విన్నవించెడు మాట. ఆసమయంబునన్ = విష్ణుచిత్తుఁడు పరతత్త్వనిరూపణముఁ జేసిన సమయమందు.

విష్ణుచిత్తునివిజయము

మ. బలిమిం ద్రెంపఁగఁ బోలెఁ బాయవడుచుం బర్యాయ[1]భంగంబునన్
గలనూలెల్లను [2]నంచు మోవఁ దెగి రాఁగాఁ గొంత సేపుండి తాఁ
బెలుచ న్గంటు పుటుక్కనం దునిసి వే పృథ్విం బడె న్జాలె మి
న్నుల మ్రోసె న్సురదున్దుభు ల్గురిసెఁ బె న్సోనై విరు[3]ల్బోరనన్. 3

టీ. బలిమిన్ = బలాత్కారముచేత, త్రెంపఁగఁబోలెన్ = త్రెంచివేయుటచేత నన్నట్లు, పాయపడుచున్ = విచ్చిపోవుచు, పర్యాయభంగంబునన్ - పర్యాయ = క్రమముగా, భంగంబునన్ = తెగుటచేత, కలనూలెల్లను = ముడిలోని నూలిపోగులన్నియును, అంచుమోవన్ = చివరవఱకు, తెగిరాఁగాన్ = తెగినపిమ్మట, కొంతసేపుండి= కొంతకాలమంతరాళమున నుండి, తాన్ = జాలె యనుట, పెలుచన్ = కఠినముగా, గంటు = ముడుపుపైని కట్టియుండినత్రాటిముడి, పుటుక్కనన్ తునిసి = పుటుక్కను శబ్దము గలుగునట్లుగా తెగి, వే = తటాలునగా, జాలె = వరహాలసంచి, పృథ్విన్ = భూమిమీఁద, పడెన్ = కూలెను. అంతన్, మిన్నులన్ = ఆకాశమందు, సురదుందుభుల్ = దేవతలభేరులు, మ్రోసెన్ = ధ్వనిచేసెను, విరుల్ = పుష్పములు, పెన్సోన ఐ = పెద్దవర్షమై, బోరనన్=బోరు+అనన్=బోరుమనిధ్వని గలుగునట్లు, కురిసెన్= వర్షించెను.

తా. విష్ణుచిత్తుఁడు పరతత్త్వనిరూపణము సేయఁగా నంతకుమున్ను విద్యాశుల్కముగా వ్రేలఁగట్టించియున్న వరహాలసంచికిఁ జుట్టియున్న సూత్రమందలి నూలంతయును దనకుఁ దానే యంచువఱకు తెగి ముడుపు పుటుక్కనుధ్వనిసేయుచు సూత్రమునుండి తునిసి జాలె క్రిందఁ బడె ననియును, ఆపరతత్త్వ నిర్ణయమునకు దేవతలు సంతోషించి దుందుభులు మ్రోయించి పుష్పవర్షములు గురిపించి రనియును భావము.

శా. ఆవేళ న్పతి పారితోషికము లీ నందంద పంపన్, భ్రమ
త్సేవివ్రాతముచే ద్రుతస్ఖలిత యై దీవ్యన్మణిస్వర్ణభూ
షావాసచ్ఛట జానుదఘ్న యగుచు న్స్రంసచ్చ్యుతోష్ణీషికా
రై వేశ్మాంతరపద్ధతి న్నెరసె గోత్రాచిత్రమాల్యం బనన్. 4

టీ. ఆవేళన్ = ఆసమయమందు, పతి = పాండ్యరాజు, పారితోషికములు = సంతోషముగూర్చు బహుమానములను, ఈన్ = ఇచ్చుటకై, అందంద= అచ్చటచ్చటనే, పంపన్ = సేవకులను బంపఁగా, భ్రమ...చేన్-భ్రమత్ = తొట్రుపడుచున్న, సేవి =

1. భంగఁబుగా. 2. నంటు. 3. బోరునన్.

సేవకులయొక్క, వ్రాతము చేఁ = సమూహముచేతులనుండి, ప్రస్ఖలిత యై=త్వరిత ముగా జాఱిన దై, దివ్యన్మణిస్వర్ణభూషావాసచ్ఛట (ఇది కర్తృపదము), దివ్యత్ = ప్రకాశించుచున్న, మణి = రత్నములు చెక్కిన, స్వర్ణభూషా = బంగారు సొమ్ముల యొక్కయు, వాసః = వస్త్రములయొక్కయు, ఛట = సమూహము, సభ...తిఁ - సంసత్ = సభా సంబంధినియగు, చతుశ్శాలికా = నాలుగు శాలలుగల మండపము యొక్కయు, రైవేశ్మ = బొక్కసపుటింటియొక్కయు, అంతర = మధ్యప్రదేశమందలి, పద్ధతిఁ=మార్గమందు, జానుదఘ్న యగుచుఁ=మోఁకాలిబంటి యగుచు, గోత్రా... బనఁ - గోత్రా = భూమియొక్క, చిత్ర = నానావర్ణములుగల, మాల్యంబు అనఁ= మాలికాలంకారమో యనునట్లు, నెరసెఁ = వ్యాపించెను.

తా. పాండ్యరాజు సమయమందు సంతోషించి విష్ణుచిత్తుఁడు మొదలగు వారికి బహుమతు లొసంగుట కై పైపైని సేవకులు బొక్కసములకుఁ బంపఁగా, వా రాయుగ్రాణమునుండి రత్నములు చెక్కిన కనకభూషణములను వస్త్రములను నవ్వారిగాఁ దెచ్చునప్పుడు త్వరపాటుచేత వారిచేతులలో నుండి జాఱిపడిన యవి రాజు మొదలగు వారు గూరుచున్న సభామంటపము మొదలుకొని బొక్కసమువఱకు మార్గమధ్యమందు మోఁకాలియెత్తున నిండియుండె నని భావము. దీనిచే జాఱిపడిన రత్నాభరణాదులే యంతమిక్కుటముగా నుండఁగా, బహుమతు లిచ్చిన రత్నాదులకు లెక్కయే లే దనుట. అలం. అతిశయోక్త్యర్థాపత్త్యుత్ప్రేక్షలు.

ఆ. వేదవేద్య మైన ៛ విష్ణుతత్త్వం బిట్లు
వాదు గెలిచి తెలిపి ៛ వసుమతీశు
భక్తి నోలలార్చి ៛ భగవత్ప్రపన్నుఁగాఁ
జేసి లోకహితము ៛ సేయుటయును. ౧

టీ. ఇందు విష్ణుచిత్తుఁ డను కర్తృపద మధ్యాహార్యము. వేదవేద్య మైన=వేద ములచేఁ దెలియఁదగిన, విష్ణుతత్త్వంబు=నారాయణతత్త్వమును, ఇట్లు, వాదు గెలిచి= వాదమున గెలిచి, తెలిపి = బోధించి, వసుమతీశుఁ = పాండ్యరాజును, భక్తిఁ = భక్తిరసమందు, ఓలలార్చి = తేలఁజేసి, భగవత్ప్రపన్నుఁగాఁ - భగవత్ = శ్రీమన్నా రాయణునియందు, ప్రపన్నుఁగాఁ = ప్రపత్తిగలవానిఁగా; చేసి=ఒనరించి, లోకహి తము - లోక = లోకములకు, హితము=ఉపకారమును, చేయుటయును=చేయుఁగానే.

శా. అద్ధావాగ్విబుధ మ్మహో వచనకవ్యాహార మాహోవచ
స్సిద్ధ మ్మాగ కృతతాం గతః కలి రితి ៛ శ్రీసూక్తివిద్యాధర

మిద్ధౌద్ధత్య మగా ల్లయంహి కుధియా । [1]మిత్థం వద త్కిన్నర
మద్ధీరాగ్రణి గెల్పుటుత్సవమునం । దయ్యె న్నభ మ్మంతయున్. 6

టీ. నభమ్మంతయుఁ న్=ఆకాశమెల్లను, అద్ధీ...దుఁ న్ - అద్ధీరాగ్రణి = ధీరాగ్రేసరుఁ డగు నావిష్ణుచిత్తునియొక్క, గెల్పుటుత్సవమునందుఁ న్ = విజయోత్సవమునందు, అద్ధావాగ్విబుధమ్ము - అద్ధా = యథార్థమనెడు, (అద్ధా యన్నది సత్యార్థకమైన యవ్యయము.) వాక్ = మాటలుగల, విబుధమ్ము = దేవతలు గలదియు, అహోవచనకవ్యాహారము-అహో=అద్భుత మనెడి వచన=పలుకులు గల, కవ్యాహారము = పితృదేవతలుగలదియు, ('హవ్యకవ్యైదైవపిత్ర్యే' యని యమరము,) ఆహావచస్సిద్ధమ్ము - ఆహా= చిత్రమనెడు, వచః = పలుకులుగల, సిద్ధమ్ము=సిద్ధులు గలదియు, ఆః కృతతాంగతః కలిరితి శ్రీసూక్తివిద్యాధరమ్ము - కలిః = కలియుగము, కృతతాం = కృతయుగమాటను, గతః = పొందెను, ఆః=ఆశ్చర్యము, ఇతి = ఇట్లను, శ్రీసూక్తి = శుభవాక్కులుగల, విద్యాధర్మము = విద్యాధరులు గలదియు, ఇద్ధౌద్ధత్యమగాల్లయంహికుధియామిత్థంవదత్కిన్నరమ్ము - కుధియామ్ = కుత్సితబుద్ధులు గలవాండ్రయొక్క, ఇద్ధౌద్ధత్యమ్-ఇద్ధ = వృద్ధిఁబొందియున్న, ఔద్ధత్యమ్ = ధార్త్యము (గర్వము), లయమ్ = నాశమును, అగాద్ధి=పొందెను గదా, ఇత్థం వదత్ = ఇట్లు చెప్పుచున్న, కిన్నరమ్ము=కిన్నరులు గలదియు, అయ్యెఁ న్ = ఆయెను. అద్ధావాగ్విబుధమ్మనునది మొదలుగా నైదు కేవల సంస్కృతములవలెఁ గనఁబడు వాక్యములనడుమ నున్న యద్ధాదిపదములు వానికి వేఱు వేఱఁ బరమందున్నవాగాది సంస్కృతశబ్దములతోడ నన్వయించుచుండ విబుధాదిశబ్దములు సమాసాంతగతములై తత్సమంబు లగుచు నుండుటవలన నపదాన్యవ్యయ సుప్తిఙ్త్వాతుమునా మను సూత్రంబునకు విరుద్ధమ్ము గాకుండుటంజేసి సుసంగతంబు లయ్యెను.

తా. ఆవిష్ణుచిత్తుండు వాదమున జయించినప్పు డాకాశమందుఁ జేరియున్న దేవతలు సత్య మనియును, పితృదేవత లహో యనియును, సిద్ధు లాహా యనియును, విద్యాధరులు కలియుగము కృతయుగ మాయె నిది యెంత వింత యనియును, కిన్నరులు దుర్జనులబింక మడఁగె ననియును, మెచ్చి సంతసిల్లి పలుకుచుండి రని భావము.

సీ. సెలవులు నాకుచు । వెలి[2]యరంగులు సూడ
కరిగి పాదూవాహు । నరయువారు;

---

1. ఇత్యువన్నదత్. 2. అరుంగు - ఈతవి 'అరంగు' అను రూపమే గ్రహించె ననుటకు చూ. 5. ఆ. 4. ప.

తమమ్రోల నుండునందలముఁ గానక దాఁటి
పేరెలుంగున బెస్తఁ జీరువారు;
నగరు వెల్వడుదాఁకఁ దెగి పోయి మఱి నిల్చి
తోడివిద్వాంసులఁ గూడువారు;
నెదురైన తమవాని గృహకృత్య మడిగి వాఁ
డనునవి తప్ప నూఁకొనెడివారు;
తే. 'వాద మే మాయె?' నన్న 'భూవరునిపక్ష
పాత మాదాసరికిఁ గల్గి బ్రతికె' ననెడు
వారు, 'నౌ లెం, డిటు విమర్శదూరమైన
వాకిట వసించు నెవ్వఁ' డన్వారు నగుచు. 7

టీ. ముందు వచ్చెడు పద్యములో నుండు విద్వాంసు లను కర్తృపద మధ్యాహార్యము. ఇదివఱలో వాదము సేయుచున్న యితర విద్వాంసులు, సెలవులు = ఊర్ధ్వాధరోష్ఠసంధికోణములను, నాకుచున్ = విన్నఁదనమున నాకికొనుచు, వెలియరంగులు= నగరు వాకిట నున్న తిన్నెలను, చూడక = వీక్షింపకయే, అరిగి = ఆవలఁబోయి, పాదూవాహున్=పాదుకలు దెచ్చువానిని, అరయువారున్ = వెదకెడువారును, వాకిటి తిన్నెలమీఁద నున్న తమ పాదుకలు దెచ్చెడు సేవకులను గానక యావల నరిగి వెదకుచుండి రనుట. తమ మ్రోలన్=తమయెదుటనే, ఉండు నందలమున్=ఉన్నయాందోళికను, కానక = చూడక, దాఁటి=అతిక్రమించి, పేరెలుంగునన్ = పెద్ద కంఠనాదము చేత, బెస్తన్=బోయలను, చీరువారున్ = పిలిచెడువారును, నగరువెల్వడుదాఁకన్ = రాజగృహము విడుచువఱకు, తెగిపోయి=ఒకరినొకరు విడిచిపోయి, మఱి=పిమ్మట, నిల్చి= నిలుచుండి, తోడివిద్వాంసులన్ = తమతోడి పండితులను, కూడువారున్ = కలిసికొను వారును, రాజుభయముచేత నొండొరు లచ్చటఁ గలియక నగరు దాఁటిపోయి యొకరితో నొకరు గూడి రనుట. ఎదురైన = తమకెదురుపడిన, తమవానిన్=తమకు సంబంధించిన వానిని, గృహకృత్యము=తమయింటి వార్తను, అడిగి=ప్రశ్నచేసి, వాఁడు = ఆయడుగఁబడినవాఁడు, అనునవి = చెప్పెడు మాటలను, తప్పన్ = మనస్సునకుఁ దగులనియట్లు, ఊఁకొనెడువారు = ఊఁకొట్టెడువారును, తమ యింటనుండి వచ్చినవాఁడు తమ కెదురుపడఁగా వానిఁ దమ యింట్లవార్త యడిగి వాఁడు సెప్పెడు పల్కులయందు మనస్సులేక జరిగిన వాదమందే మతి గలిగి యూరక యూఁకొనుచుండి రనుట. వాదము ఏమి ఆయెన్ = వాదుసెల్లిన విధమేమి, అన్నన్=అని ఎవరేని యడుగఁగా, భూవరుని పక్షపాతము = రాజుయొక్క పక్షపాతము, ఆదాసరికిన్ = ఆవిష్ణుచిత్తున

తనుటకు బదులుగాఁ దిరస్కారోక్తిగ నాదాసరివాని కని రనుట. కలిగి = ఉదయించి, బ్రతికెన్ = ఆదాసరి జీవించెను, రాజు పక్షపాతమువలన నావిష్ణుచిత్తుఁడు బ్రదికెనే కాక నిక్కమునకు మేమే జయించితి మని చెప్పిరనుట, అనెడు వారును = అని చెప్పెడువారును, పోలెందు = పోనాను (నిరాదరార్థకము) ఇటు = ఈవిధముగా, విమర్శదూరము ఐన = విచారణకు దూర మగు, వాకిటన్ = ద్వారమందు, ఎవ్వఁడు వసించున్ = ఎవ్వఁడు నిలుచును? అన్ వారున్ అగుచున్ = అని పలికెడువారు నై, కలిసి యని ముందటిపద్యమున కన్వయము. ఇట్లు న్యాయవిమర్శలేని రాజు ద్వారమం దెవ్వఁడును నిల్వఁగూడ దని రనుట. ఇక్కడఁ బరాజితు లయిన విద్వాంసులస్వభావము వర్ణింపఁబడెఁ గాన స్వభావోక్త్యలంకారము.

తే. కలిసి యొకకొంతసేపుశృంగాటకముల
నగరుదెసఁ జూచుచునె మంతనంబు లాడి,
చనిరి విద్వాంసు లిండ్లకు నజ్జనవిభుండు
రూఢి నతని మహాగజారూఢుఁ జేసి. 8

టీ. విద్వాంసులు = ఆపండితులు, శృంగాటకములన్ = నలుత్రోవలు గలిసెడు చోటులయందు, కలిసి = కూడుకొని, నగరుదెసన్ = రాజగృహముతట్టు, చూచుచునె=వీక్షించుచునే, మంతనంబులాడి = రహస్యములాడి, ఇండ్లకున్ చనిరి = తమగృహములకుఁ బోయిరి. ఆజ్జనవిభుండు = ఆపాండ్యరాజు, రూఢికిన్ = ప్రసిద్ధి కొఱకు, అతనిన్ = ఆవిష్ణుచిత్తుని, మహాగజారూఢున్ - మహాగజ = పెద్దయేనుఁగు మీఁద, ఆరూఢున్ = ఎక్కినవానిఁగా, చేసి = ఒనరించి, పురి నేఁగించి యను ముందటి పద్యములో నన్వయము.

మ. 'పురియేఁగించి తదీయ మైననగరంబుం జేర్పుఁ' డంచు న్బడిన్
దొరలన్ రాజకుమారులన్ బనుపఁగాఁ దూర్యస్వనంబు ల్నిరం
తరవందిస్తుతులుం [1]జెలంగ గజఘంటావారకాంతాంఘ్రినూ
పురము ల్మ్రోయఁగఁ, గొల్చి వా రిడుగడం దబ్బో మార్గమధ్యంబునన్. 9

టీ. పురిన్ = మధురాపట్టణమందు, ఏఁగించి=మెఱవడిఁ జేయించి - ఊరేఁగించి యనుట, తదీయ మైన=ఆవిష్ణుచిత్తునిసంబంధి యైన, నగరంబున్ = పట్టణ మగు శ్రీవిల్లిపుత్తూరిని, చేర్పుఁడు అంచున్ = ప్రవేశపెట్టుండని, పాండ్యరా జనుట. దొరలన్ = రాజులను, రాజకుమారులన్ = రాచకొమరులను, బడిన్ = అతనివెంట, పనుపఁగాన్ = పంపఁగా,

1. గజేంద్రహయఘంటావార.

తూర్యస్వనంబుల్ = వాద్యఘోషములును, నిరంతరవందిస్తుతులున్ = ఎడతెగని బట్టుల కైవారములును, చెలంగన్ = విస్తరిల్లుచుండఁగా, గజ...ల్-గజఘంటా=ఏనుఁగులకుఁ గట్టిన గంటలును, వారకాంతాంఘ్రినూపురముల్=ఆటకత్తియలయొక్క పాదములయందలి యందియలును, మ్రోయఁగన్=ధ్వనిసేయుచుండఁగా, వారు = రాజులును, రాజకుమారులును, వందిమాగధులు, వారకాంతలు మొదలగువారు, ఇరుగడన్=పార్శ్వద్వయమందును, ద్విగుసమాసము, కొల్చి = సేవించుచు, పోన్ = పోవుచుండఁగా, మార్గమధ్యంబునన్ = నడితెరువునందు, క్రియ ముందటి పద్యమం దున్నది.

విష్ణుచిత్తునకు భగవంతుఁడు సాక్షాత్కరించుట

ఉ. ఇంగిలికంబునం దడిపి యెత్తు కసీసపు రెంటెమో యన
న్నింగి గరుత్పరంపరలనిగ్గున లేఁదొగ రెక్కె నంత వీ
చెం గలశాబ్ధిమీఁగడలజిడ్డెఱిఁగించెడు కమ్మగాడ్పు; నిం
డెం గడు మ్రోఁత పెన్దిరువడిం గని; రాఖగరాజు మూఁపునన్. 0

టీ. నింగి = ఆకాశము, ఇంగిలికంబునన్ = హింగుళశబ్దార్థ మగు నింగిలికము చేతను, తడిపి = ఆర్ద్రముఁజేసి, ఎత్తు = పైకెత్తిన, కసీసపు రెంటెమో = నీలవస్త్రమో, అనన్ = అనునట్లుగా, గరు...నిగ్గునన్ - గరుత్ = ముందు చెప్పఁబడు పెరియ తిరువడి ఱెక్కలయొక్క, పరంపరలన్ = పంక్తులయొక్క, నిగ్గునన్ = కాంతిచేత, లేఁదొగరుఎక్కెన్=తరుణారుణకాంతి గలిగెను, అంతన్=వెంటనే, గరుత్మంతుని ఱెక్కలెట్టివిగావున వానికాంతులచే నాకాశ మెఱ్ఱనయ్యె ననుట. అంతన్ = అంతట, కల...జిడ్డు - కలశాబ్ధి = పాలసముద్రముయొక్క, మీఁగడల = మీఁగడలయొక్క, జిడ్డు = జిడ్డువాసనను, ఎఱిఁగించెడు = తెలిపెడు, కమ్మగాడ్పు = సుగంధివాయువు, వీచెన్ = విసరెను, గరుత్మంతుఁడు కదలఁగానే యాయన ఱెక్కలవలనఁ బుట్టిన వాయువు క్షీరసముద్రపు మీఁగడలవాసనను రేఁపఁగా నావాసన లావాయువులోఁ గూడ వచ్చె ననుట. మ్రోఁత = పెద్ద ధ్వని, కడున్=మిక్కిలి, నిండెన్ = సంపూర్ణమయ్యెను. (అంతన్), పెన్దిరువడిన్ = (పెన్ = పెరియ = పెద్ద, తిరు = శ్రీ = పూజ్యమయిన, అడి=పాదముగలవాఁడు), పెరియ తిరువడి యని ద్రవిడభాషయందు శ్రీవైష్ణవసంకేతితమైన నామముగల వైనతేయుని, కనిరి = ఆరాజులు మొదలగువారు చూచిరి, ఆఖగరాజు మూఁపునన్ - ఆఖగరాజు = ఆపక్షీంద్రుఁ డగు గరుత్మంతుని యొక్క, మూఁపునన్ = స్కంధమందు, క్రియ ముందటి పద్యమునం దున్నది.

తా. విష్ణుచిత్తునకుఁ బ్రత్యక్ష మగుటకు శ్రీ క్షీరసముద్రమునుండి స్వామి వెడలఁగానే గరుత్మంతుని ఱెక్కల యెఱ్ఱకాంతిచేత నాకాశ మింగిలీకములోఁ దడిపి యెత్తిన నీలిగుడ్డవలె నీలలోహితవర్ణము గలిగియుండెఁ; నంతలోనే పాలమీఁగడ జిడ్డు వాసనలతో వాయువులు విసరె; నంతలోనే గరుత్మంతుని ఱెక్కల ధ్వని వినంబడెఁ; నంతలో నతివేగవంతుఁ డగు గరుత్మంతుండు గానఁబడియె; నంత నతని వీఁపుమీఁద స్వామియుఁ దోఁచె నని భావము.

సీ. చిగురుఁబొట్లపుదోయిఁ గెంజమ్ము లనఁ దార్క్ష్య
హస్తోదరముల దివ్యాంఘ్రు లమర
నునుఁగప్పుమేనఁ దోఁచిన[1] తదర్వచ్ఛాయ
లీలఁ దాల్చుపసిండిచేల మెఱయ
వ్రాలిన యోగివర్గమునిర్మలాంతఃక
రణములువోలె హారములు తనర
సిరికిఁ బుట్టింటినెచ్చెలు లౌఁట మనవికి
డాసె నా మకరకుండలము లమర
తే. [2]శ్రిత సిత మరాళ వాల్యాభిహత పరాగ
వలయమండిత కల్పశాఖలొ యనంగ
శంఖచక్రాంచితోరుహస్తములు దనరఁ
దోఁచెఁ గమలేక్షణుండు చతుర్భుజుండు. 11

టీ. చిగురు...యిన్-చిగురుఁబొట్లపు=చివుళ్ళపొట్లముయొక్క, దోయిన్=ద్వంద్వమందు, కెంజమ్ములు అనన్=ఎఱ్ఱదామరపువ్వు లనునట్లు, తార్క్ష్య...ములన్-తార్క్ష్య=గరుత్మంతునియొక్క, హస్తోదరములన్=కరతలపుటములయందు (అరచేతులం దనుట), దివ్యాంఘ్రులు = శ్రీపాదములు, అమరన్=పొందుపడఁగా, నునుఁగప్పుమేనన్ = నిద్ద మగునీలవర్ణము గల దివ్యమంగళవిగ్రహమందు, తోఁచి...లన్-తోఁచిన = ప్రతిఫలించిన, తత్ అర్వ = ఆవాహన మగు గరుత్మంతునియొక్క, ఛాయలీలన్ = కాంతివలె, తాల్చు...చేల-తాల్చు = ధరించిన, పసిండిచేల=కనకాంబరము, మెఱయన్=ప్రకాశించుచుండఁగా, వ్రాలిన...లన్ - వ్రాలిన = చేరినట్టి, యోగివర్గము=యోగీశ్వర

1. తదూర్ధ్వచ్ఛాయ 2. శ్రితసితచ్ఛద. - శ్రిత=ఆశ్రయించిన, సితచ్ఛద = హంసలుగలవి. ఈపాఠమున ఉక్తపాఠమునకు గలుగు అపుష్టార్థతాదోషము పరిహార మగును గాన సమంజసమైనది.

సమూహముయొక్క, నిర్మలాంతఃకరణములువోలెన్=నిష్కళంకములగు అంతరంగముల వలెను, ప్రాలిన యనుశబ్ద మంతఃకరణశబ్దముతో నన్వయించునది. ఇది సమస్తపదము. హారములు=ముక్తాహారములు, తనరన్ = ఒప్పుచుండఁగా, సిరికిన్=శ్రీదేవికి, పుట్టి... ఉన్-పుట్టింటి = జనకగృహసంబంధు లైన, నెచ్చెలులుబోటన్=స్నేహితులాటచేతను, మనవిన్ = విన్నవించుటకు, డాసెన్ నాన్=సమీపించెనో యనునట్లు, మకరకుండలములు = మకరాకారకర్ణభూషణములు, అమరన్, శ్రీదేవియును మకరములును సముద్రమునందే జనించుటంజేసి లక్ష్మికిఁ బుట్టినయింటి స్నేహములు గలవి గావున మిక్కిలి చనవు గలిగి శ్రియఃపతి వీనుల సమీపమునకుఁ జేరె ననుట. శ్రిత...లో-శ్రిత = చేరియున్న, సిత=తెల్లనైన, మరాళ = హంసచేతను, వాత్యా = సుడిగాడ్పుచేతను, అభిహత=రేఁపఁబడిన, పరాగ=కెంధూళియొక్క, వలయ=వలయముచేతను, మండిత=అలంకరింపఁబడిన, కల్పశాఖలో అనంగన్ = కల్పవృక్షపుఁగొమ్మలో యనునట్లు, శంఖ...లు-శంఖ = పాంచజన్యముచేతను, చక్ర=సుదర్శనముచేతను, అంచిత = ఒప్పుచున్న, ఉరు=దీర్ఘము లైన, హస్తములు=భుజములు, తనరన్=ప్రకాశింపఁగా, శంఖము హంసవలెను, చక్రము పరాగవలయమువలెను, భుజములు కల్పశాఖవలెను న్నవనుట. కమలేక్షణుండు = తమ్మికంటి, చతుర్భుజుండు=నాల్గుభుజములు గలిగినస్వామి, తోఁచెన్ = ప్రత్యక్షమయ్యెను. ఉత్ప్రేక్షాలంకారము.

క. ఎప్పుడు హరిఁ గని రమరులు
ముప్పదియును మూఁడుకోట్లున్ మునిఁ గనుఁగొనువా
రప్పుడు తత్కరములతో
విప్పిన గొడుగులును మింటన్ వేగమ మొగిడెన్. 12

టీ. ఎప్పుడు=ఏక్షణమందు, మునిన్ కనుఁగొనువారు=విష్ణుచిత్తుని సేవించెడివారు, ముప్పదియును మూఁడుకోట్లు = త్రయస్త్రింశత్కోటిసంఖ్యగల, అమరులు = దేవతలు, హరిన్=స్వామిని, కని=చూచిరో, అప్పుడు = ఆక్షణమందు, తత్కరములతోన్ = వారిహస్తములతోడ, విప్పిన = తెఱవఁబడిన, గొడుగులును = దేవతల ఛత్రములును, మింటన్ = ఆకాశమందు, వేగమ=శీఘ్రమే, మొగిడెన్ = ముకుళిత మయ్యెను.

తా. ముందే స్వర్గమందలి ముప్పదిమూఁడుకోట్ల దేవతలు విష్ణుచిత్తునిఁ జూడ వచ్చియుండిరి గావున, వారలు స్వామి వేంచేసినంతనే యదివఱలోఁ దెఱవఁబడియున్న గొడుగులు ముడిచి హస్తములు మొగిడ్చి నమస్కరించిరి. అలం. సహోక్తి.

తే. [1]సామరదిదృక్షుఖస్థరక్షఃపిశాచ
పుంజ మహిభుక్పతత్త్ర ప్రభంజనములు
సోఁక వెలిఁ బాఱెఁ గళ్యానశూర్పవాత
ఘట్టనలఁ [2]బాఱు పెనుఁబొల్లకట్టువోలె. 13

టీ. సామర...ము-స అమర = దేవతలతోఁగూడిన, దిదృక్షు=చూడఁ గోరిన, ఖస్థ=ఆకాశమందు నిలిచియుండ్న, రక్షఃపిశాచపుంజము = రక్కసులయొక్కయు పిశాచులయొక్కయు సమూహము, రక్షఃపిశాచాదులు దేవయోనులగుటంజేసి స్వర్గమందుండరనుట. అహి...ములు - అహిభుక్ = సర్పభక్షకుఁ డగు గరుత్మంతుని యొక్క, పతత్త్ర = ఱెక్కలవలని, ప్రభంజనములు = పెనుగాడ్పులు, సోఁకన్ = స్పృశింపఁగానే, వెలిన్ = వెలుపుచేతను, కళ్యానన్=కళ్ళమునందు, శూర్ప...లన్- శూర్పవాత = చేటల గాడ్పులయొక్క, ఘట్టనలన్ = ఒరపిళ్ళచేత, పాఱు...లెన్ - పాఱు = ఎగసిపోవుచున్నట్టి, పెను = పెద్దదియగు, పొల్లకట్టువోలెన్ = తాలుకలవలె, పాఱెన్ = పరుగెత్తెను. ప్రథమపాదమం దున్న సామరపదముయొక్క ప్రథమవర్ణము రక్షశ్శబ్దముయొక్క యంతిమవర్ణముతోడ సంబంధపడునట్లు, హా ల్పవిధానముగా నుభయపక్షములలోనిదిగా సాంబాదిశబ్దములవలె విశ్రమముఁ జెప్పినాఁడు సమ్మదదిదృక్షు అను పాఠమున సంతోషమునఁ జూడఁగోరెదు అని యర్థము. కళ్యాన ననుచోట, 'వికృతౌ క్వచిచ్ఛలోపో మోర్ధీర్ఘశ్చాత ఆదిమస్యభవే' త్తను సూత్రానుసరణముగా, 'కం. మానుగ ధృతరాష్ట్రుఁడు ప్రా, ణానం గలుగంగ' ననియెడు భారతప్రయోగమువలె సంగత మైనది. అంతరిక్షమం దంతకు ముున్న దేవతలతోడఁ జేరి యున్న రక్షఃపిశాచ సంఘము తమజాతికి విరోధి యగుస్వామికి వాహనమైన గరుత్మంతుని ఱెక్కలగాడ్పు తమపై వీవఁగానే భయపడి పరుగెత్తెను. దేవతలు మాత్రము నిలచి యుండిరి; ఎట్లంటేని, కళ్ళమందు ధాన్యముమీఁదఁ జేటలచేత విసరఁగానే గట్టి నిల్చి పొట్టు చెదరి పోయిన ట్లని భావము.

క. నీరంధ్రకుసుమధారా
సారచరచ్చంచరీకసంకులఝంకా
రానుకారి సంస్తవ
కారి మునిస్తోమసామగానం బెసఁగెన్. 14

1. సమ్మద. 2. బాఱి చనుపొల్ల.

టీ. నీరంధ్ర ..బు - నీరంధ్ర=దట్టమైన, కుసుమధారా = పుష్పధారలయొక్క, ఆసార = వర్షమందు, చరత్ = సంచరించుచున్న, చంచరీక = తుమ్మెదలయొక్క, ('ఇన్దిన్దిరశ్చఞ్చరీకః' యని యమరము.) సంకుల = అధికమైన, కల = అవ్యక్త మధురములగు, ఝంకార = ఝంకృతులను, అనుకారి = అనుకరించుచున్న, సంస్తవ=స్తోత్రములను, కారి=చేయుచున్న, ముని=నారదాదిమునులయొక్క, స్తోమ = సమూహముయొక్క, సామగానంబు=సామవేదముయొక్కపాట, ఎసంగెన్=విస్తరిల్లెను. స్వామితోఁగూడ నారదాది మునీంద్రులు సామగానములు సేయుచుండఁగా, నది పుష్పవర్షమునఁ బడి తిరిగెడు తేఁటుల మ్రోఁతవలె మధురమై యేతెంచె నని భావము.

తే. అట్లు ప్రత్యక్షమైనపద్మాక్షు నంత
రిక్షమునఁ గాంచి, ముని ప్రమోదాశ్రుజలము
నిగుడఁ బులకించి, కరటిఘంటికలె తాళ
ములుగ నిట్లని యమ్మహాత్ముని నుతించె. 15

టీ. అట్లు=పూర్వోక్తరీతిగా, ప్రత్యక్షమైన=సాక్షాత్కరించినట్టి, పద్మాక్షున్ = తామరలవంటి నేత్రములు గల స్వామిని, లేక లక్ష్మీదేవియే నేత్రములయందుఁ గల స్వామిని, అంతరిక్షమునన్ = ఆకాశమందు, కాంచి = చూచి, ముని=విష్ణుచిత్తుఁడు. ప్రమోదాశ్రుజలము = ఆనందబాష్పములు, నిగుడన్ = వెలికుబుకఁగా, పులకించి = గగుర్పాటుచెంది, కరటిఘంటికలె - కరటి = తానెక్కియున్న యేనుఁగుయొక్క, ఘంటికలె = ఇరుప్రక్కలనున్న గంటలే, తాళములుగన్ = వాయించెడు తాళములు కాఁగా, అమ్మహాత్మునిన్ = ఆపరమాత్ముఁ డగుస్వామిని, ఇట్లని=వక్ష్యమాణక్రమముగా, నుతించెన్ = కొనియాడెను.

విష్ణుచిత్తుఁడు శ్రీమహావిష్ణువును స్తుతించుట

కవిరాజవిరాజితము.—

జయ జయ దానవదారణకారణ శార్ఙ్గరథాంగగదాసిధరా
జయ జయ చంద్రదినేంద్రశతాయుతసాంద్రశరీరమహఃప్రసరా
జయ జయ తామరసోదరసోదరచారుపదోజ్ఝితగాంగఝరా
జయ జయ కేశవ కేశినిషూదన శౌరి శరజ్జజాక్ష హరీ 16

టీ. దానవ...రా - దానవ = రాక్షసులయొక్క, దారణ = ఛేదనమునకు, కారణ = హేతువులగు, శార్ఙ్గ = ధనువును, రథాంగ=చక్రమును, గదా=గదను, అసి=

నందక మనుఖడ్గమును, ధరా=ధరించినస్వామీ ! జయజయ = సర్వోత్కృష్టుఁడవుగాఁ బ్రవర్తిల్లుమా. (ద్విరుక్తి ఆదరాతిశయము సూచించును.) దరా అనుపాఠమందు శంఖమును గలవాఁడా యని యర్థము. దానవదారణకారణ యని ప్రత్యేక విశేషణము గాను జెప్పవచ్చును; జయజయ యని నాల్గు పాదములయందును వచ్చును. చంద్ర... రా-చంద్ర = చందురులయొక్కయు, దినేంద్ర=సూర్యులయొక్కయు, శతాయుత= అయుత (పదివేలు) శతసంఖ్యలయొక్క వలెనే, సాంద్ర = దట్టమైన, శరీర = దివ్య మంగళ విగ్రహముయొక్క, మహః = కాంతులయొక్క, ప్రసరా = వ్యాప్తికల వాఁడా, తామ...రా - తామరస = తామరపువ్వులయొక్క, ఉదర = అంతర్భాగ మునకు, సోదర = తోఁబుట్టువును, చారు = సుందరము నగు, పద = పాదము చేత, ఉజ్ఝిత = విడువఁబడిన, గాంగ = గంగానదీసంబంధి యగు, ఝరా = ప్రవాహము గలవాఁడా ! కేశినిషూదన = కేశి యనురక్కసుని సంహరించినవాఁడా, శరజ్జలజాక్ష - శరత్ = శరత్కాలమందలి, జలజ= కమలమువంటి, అక్ష=కన్నులు గల వాఁడా ! కేశవ=బ్రహ్మరుద్రుల కుత్పత్తిస్థాన మైనస్వామీ. ('క ఇతి బ్రహ్మణోనామ ఈశోహం సర్వదేహినామ్, ఆవాంతవాఙ్గసంభూతౌ తస్మాత్కేశవనామవాన్.' అని ప్రమాణము), శౌరి = హరీ, అని మంగళాశాసనము చేసెను. భగవంతునకు జీవకోటి యాశీర్వాదము చేయవచ్చునా యనినఁ బూర్వ మట్టియాచారము కలదు. 'పూర్వాం దిశం వజ్రధరః దక్షిణాం పాతు తే యమః, వరుణః పశ్చిమా మాశాం ధనేశస్తూత్తరాందిశ' మ్మని సీతమ్మవారు శ్రీరాములవారికి మంగళాశాసనము చేసియున్నారు.

మత్స్యావతారము

మ. దివిజద్వేషి నుదారవారిచరమూర్తిం ద్రుంచి, చాతుర్య మొ
ప్ప వడిం జౌకపుఁదెల్లకౌచుగమి దంభం బొంద మైఁ దాల్చి, వే
దవిశుద్ధాక్షరపఙ్క్తిఁ గ్రమ్మఱఁగ వేధం జేర్చెదో నాఁగఁ, ద
ద్భువనం బబ్ధిసితాంబుబిందు లలమం బ్రోద్యద్రుచిం దాఁటవే. 17

టీ. దివిజద్వేషిన్ = వేదచోరుఁ డగుసోమకాసురుని, ఉదార...ర్తిన్ - ఉదార=కొలఁది తెలియరాని, వారిచర=మీనముయొక్క, మూర్తిన్ = శరీరముచేతను, త్రుంచి = ఖండించి (చించి = చీల్చి), చాతుర్యము = విజ్ఞానము, ఒప్పన్=తనరుచు నట్లు, వడిన్ = వేగముచేత, చౌకపు...బు - చౌకపు = చదరమగు, తెల్లకౌచు=ధవళ కాంతిగల పైపొట్టుయొక్క, గమి = సమూహ మనెడు, దంభంబు = వ్యాజము, ఒందన్ = పొందునట్లు, మైన్ = శరీరమందు, తాల్చి=ధరించి, వేద...పఙ్క్తిన్-

వేద=వేదములయొక్క, విశుద్ధ=శుభ్రములగు, అక్షర=అక్షరములయొక్క, పఙ్క్తిన్=శ్రేణిని, క్రమ్మఱఁగన్ = మరల, వేధన్ = బ్రహ్మదేవుని, చేర్చెదో నాఁగన్=చేర్తువో యనునట్లు, తద్భువనంబు = ఆబ్రహ్మలోకమును, అబ్ధి...లు - అబ్ధి=సముద్రముయొక్క, సిత = తెల్లనైన, అంబు = ఉదకములయొక్క, బిఁదులు = బిందువులు, అలమన్ = వ్యాపింపఁగా, ప్రోద్యద్రుచిన్ - ప్రోద్యత్ = వృద్ధిపొందుచున్న, రుచిన్=కాంతిచేత, దాఁటవే = అతిక్రమింపవా. ('ఉదారోదక్షిణేఖ్యాతే దానశౌణ్డే మహత్యపి' యని రత్నమాల. 'స్త్రియాంమూర్తిస్తనుస్తనూః' అనియును, 'కపటోస్త్రీవ్యాజ దమ్భోపధ యశ్ఛద్మకైతవే' యనియు నమరము.) నీవు మత్స్యరూపమును ధరించి వేదచోరకుఁ డగు రక్కసుని వధించి, వాఁ డపహరించిన వేదములు నేర్పుతో నప్పుడే బ్రహ్మ కిచ్చుటకై పోయెదవో యనునట్లు, నీవు సంచరించు చుండుటవలన సముద్రోదకములు సత్యలోక మాక్రమింపుచుండఁగా నీ వాలోకము దాఁటితి వనియు, నప్పుడు నీమీనశరీరమందలి తెల్లనిపొఁలు పరిశుద్ధములగు వేదాక్షరములో యన్నట్లుండె ననియు భావము. కైత వాపహ్నుత్యనుప్రాణితమైన యుత్ప్రేక్షాలంకారము.

చ. ఎలమి యుగాంతవారి కెదురెక్కు తతిన్ వడిఁ దాలుగహ్వరం
బులఁ జనునీటివెల్లిబడిఁబోవు సపక్షనగోరువాశ్చరం
బులుఁ దనుఁ దాఁకఁ దద్గతతమ్రోయునజాండమ దైత్యు వేదప
ఙ్క్తులుగొని కూల్చి*నట్టి జయదుందుభిఁ జేసితి కా మురాంతకా.

టీ. మురాంతకా=మురాసురునిసంహరించినవాఁడా! ఎలమిన్=సంతోషముచేతను, యుగాంతవారికిన్ = ప్రళయోదకమునకు, ఎదురెక్కు తతిన్=ఎదురుగాఁ బోవుసమయ మందు, వడిన్=వేగముచేతను, తాలుగహ్వరంబులన్ = దవుడలనెడు గుహలయందు, చను = పోవునట్టి, నీటివెల్లిబడిన్=జలప్రవాహమువెంట, పోవు = పోయెడు, సప... లు-సపక్ష = ఱెక్కలతోఁ గూడియున్న, నగ = మైనాకాదిపర్వతములును, ఉరు = గొప్పలగు, వాశ్చరంబులు = తిమితిమింగిలములు మొదలగు జలచరములును, తనున్ = బ్రహ్మాండము ననుట, తాఁకన్=తగులఁగా, తద్గతతన్ = ఆదవుడలను పొందియుండుట చేతను, మ్రోయు...మ - మ్రోయు=ధ్వనిఁజేయుచున్న, అజాండమ=బ్రహ్మాండమే, దైత్యున్ =సోమకాసురుని, వేదపఙ్క్తులుగొని = వేద సమూహములను దీసికొని, కూల్చినట్టి=సంహరించినట్టి, జయదుందుభిన్=జయభేరినిగా, చేసితి కా=ఒనర్చితివికదా! ఇచ్చట నజాండమ యని ప్రథమావిభక్తి. 'ఇతరత్ర చద్వితీయా తస్యాః ప్రథమా చ జడప

---

* సద్విజయ.

దాసాం స్యాత్' అనుసూత్ర మనుసరించి, యప్రాణి వాచక మగు జయదుందుభియందలి ద్వితీయకుఁ దుల్యమైనది. మఱియు, 'కర్మాదేః కర్తృత్వ' మిత్యాది సూత్రపద్ధతివలన జయదుందుభియందుఁ గూర్చినట్టి యను పద మన్వయించుట సరిగా నున్నది.

తా. మీనము తన నైజగుణముచేత నీటి కెదురెక్కుట ప్రసిద్ధము గావున, నీ మత్స్యము ప్రళయోదక ప్రవాహమున కెదురెక్కుచుండఁగా నావేగమునకు నిలువలేక యానీటివెంబడి మైనాకాది పర్వతంబులును, దిమిప్రముఖంబు లగు మహాజలచరంబులు నవశంబులై దొరలి యామీనముయొక్క దవుడలలోఁ బడిన వనియును, జల ప్రళయమందు బ్రహ్మాండము సెడకుండ నామత్స్యమూర్తి తన దవుడల నునిచికొని యున్నాఁడనియును, నామైనాకాదు లావేగముచేత నాబ్రహ్మాండము దగులఁగా నది ధ్వనిఁజేసెఁ గావున బ్రహ్మాండమే స్వామి వేదములు దీసికొని రక్కసుని ద్రొక్కలించిన దానికి జయభేరివలె నుండె ననియు భావము. అలం. అనుభయతాద్రూప్యరూపకా లంకారము.

చ. మితి గడవం దిమింగిలత ♦ మెయ్మెయిఁ బెంచిన నీదు వాతఁ గు
త్సితపలలాశి యైనచిఱుఁ♦జేఁ పది ద్రెళ్లుట నీవు మ్రింగు టే?
శ్రుతు లగునూరుపు ల్మగుడఁ♦జొచ్చుతఱి న్భవదేధనైధనై
ధిత జవశక్తి నీడ్చికొని ♦ తెచ్చుటకాక తదల్పతాల్పతన్. 19

టీ. మితి = పరిమాణము, గడవన్ = మీఱఁగా—కల్పము ముగియఁగా ననుట, తిమింగిలతన్ = మహామీనత్వమును! మెయ్మెయిన్ = అవలీలగా, పెంచిన=పెంచినట్టి, నీదు = నీసంబంధియైన, వాతన్ = వక్త్రమునందు, కుత్సిత...న-కుత్సితపలలాశియైన = కుత్సితరాక్షసుఁ డనియును, మీనములు మాంసము భక్షించుట ప్రసిద్ధము గావున నట్టి పలలాశియగు, చిఱుచేఁప=చిన్నచేఁప, అది=మత్స్యత్వారోపముచేత నసమహద్వాచకము, రాక్షసుఁ డనుట, త్రెళ్లుట = పడుట, నీవు మ్రింగుటే = నీవు కబళించుటయా యని ప్రశ్నార్థకము. శ్రుతులగు = వేదమయములగు, ఊరుపుల్ = ఉచ్ఛ్వాసవాయువులు, మగుడన్ = మరల, చొచ్చుతఱిన్ = వక్త్రమునందుఁ బ్రవేశించునప్పుడు, తదల్పతాల్పతన్-తత్ = ఆపలలాశియొక్క, అల్పతాల్పతన్ = అత్యంతాల్పమాటచేతను, భవ...న్-భవత్=నీయొక్క, ఏధనైధన = అతిసమృద్ధిచేతను, ఏధిత=వృద్ధిచేయఁబడిన, జవ = వేగముయొక్క, శక్తిన్ = సామర్థ్యముచేతను, ఈడ్చికొని తెచ్చుటకాక = తీసికొనివచ్చుటయేకాక, మ్రింగుట కా దనుట. తిమింగిలత మెయ్మెయి యనుచోట నికా రము లోపించుటకు విరాటపర్వమున "మ. మగుడం గీచకుఁ బట్ట వాఁడును బలోన్మ

దంబున న్వాహుఁగ, ర్వగరిష్ఠుం డగు నాహిడింబరిపుఁ దీవ్రక్రోధుఁ డై పట్టి బె, ట్టు గఁ ద్రోపాడఁగ నిద్దఱు న్భుజబలాటోపంబు మై నొండొరు, న్నిగులం జాలక కొంత సేపువడి మెత్తఁ బోరి రుగ్రాకృతిన్," అన్న పద్యంబునం జతుర్థపాదంబునను, నిర్వచనోత్తరరామాయణమందు, "ఉ. ఆటున మూర్ఛవోయినప్రహస్తుఁ గనుంగొని యుఱుకఁ దాఁకిన, న్నీటడగించు నర్జునుఁడు కేవలుఁడే యని భీతచిత్తులై, మేటిమగ ల్బలం బెదరి మెత్తయి మార్కొన లేక పాఱిన, న్గాటుకకొండవోలె దశకంఠుఁ డెదిర్చె మహీమహేంద్రునిన్." అనిన పద్యంబునఁ దృతీయపాదంబునను, దిక్కన సోమయాజి ప్రయోగంబు కలిమిఁ జేసి యిందుం బ్రయోగింపఁబడియె.

తా. ఇంతంత యని చెప్పఁగూడని యత్యున్నతశరీరముతో మత్స్యమూర్తి విహరించుచుండఁగా, నాయన యుచ్ఛ్వాసవాయువులు మగిడి ముఖమందుఁ బ్రవేశించునప్పు డావాయువులవెంబడి నీమహామీనము ముందఱ నత్యల్పతముం దనున ట్లున్నయా రక్కసుఁడు తనకుఁ దానే త్రెళ్లెను గాక యామత్స్య మది యొక యత్నముగా వాని మ్రింగ లే దనియును మహామత్స్యములును బర్వతాదులును బ్రవేశించెడు నావక్త్రమం దీకుబ్సితపలలభక్షక మగురాక్షసుఁ డను చిన్న చేఁప పడిపోవుట చిత్రము గాదు. అలం. హేత్వపహ్నుత్యలంకారము.

కూర్మమూర్తి

మ. జలపూరప్లవమానమృణ్మయమహీసంరక్షకై గార యీ
బలె ముక్తామణిశుక్తిశంఖనికురుంబం బెల్లఁ జూర్ణంబుగా
బలభిద్వజ్రసదృఙ్నిజోపరిపరిభ్రామ్యన్మహామందరా
చలసంఘృష్టిఘుకట్ట మైనకమఠస్వామి న్నినుం గొల్చెదన్. 20

టీ. జల...కై - జలపూర = నీటిప్రవాహమందు, ప్లవమాన = తేలుచున్న, మృణ్మయ = మృత్తికావికార మగు, మహీ = భూమియొక్క, సంరక్షకై = రక్షణముకొఱకు, గార ఈబలెన్ = గచ్చుసేయుటకొఱకువలె, ముక్తా...బు-ముక్తామణి= ముత్తెములయొక్కయు, శుక్తి=గుల్లయొక్కయు, శంఖ=సంకులయొక్కయు, నికురుంబంబు = సమూహము, ఎల్లన్=అంతయును, చూర్ణంబు కాన్ = సున్నమగునట్లు, బల...ము - బలభిత్=దేవేంద్రుని, వజ్ర=వజ్రాయుధముతోడ, సదృక్=సమానమైన, నిజఉపరి = స్వకీయమైన పైభాగమందు, పరిభ్రామ్యత్ = తిరుగుచున్న, మహత్ = గొప్పదియైన, మందరాచల = మందరపర్వతముతోడ, సంఘృష్టి = ఒరసికొనుటకు,

ఘురట్టము వైన = అడుగు తిరుగ లియయిన, కమఠస్వామిన్ = కూర్మరాజైన, నినున్ = నిన్ను, కొల్చెదన్ = సేవించెదను.

తా. సముద్రమథనకాలమందు మందరాచలముక్రిందఁ గమఠమూర్తియొక్క కర్పర మొరసికొనుచుండఁగా, సముద్రమందలి ముత్తెములు ముత్తెపుఁజిప్పలు శంఖము లెల్ల నాపర్వతకర్పరములసందునఁ బడి నలిగి చూర్ణమగుచుండె: గావున సముద్రోదకములయందు మృద్వికార మగు భూమి నాని కరఁగు నని దాని గట్టిపఱుచుటకై గారకొలుకు స్వామి సున్నము నూఱుచున్నాఁడో యన్నట్లుండె నని భావము. అలం. ఫలోత్ప్రేక్ష. సంఘృష్టిఘురట్ట మనుచో రూపకము.

—వరాహమూర్తి—

చ. ఒకమఱి బుద్బుగింప విలయోదకము ల్పయి కుబ్బి, చిప్ప వ్ర
చ్చుకొని మహాభ్రవీథిఁ జన, సూకరత న్మెయి వెంచి, వెండి క్రిం
దికిఁ గయివ్రాలు తత్సలిలనిర్మలధార నదగపరస్ఫుర
త్ప్రకృతికి నీ యజాండమును బంగరుముంగరఁగా నొనర్పవే? 41

టీ. ఒకమఱి=ఒకతూరి, బుద్బుగింపన్ = ఘూత్కారముసేయఁగా, ఇది వరాహచేష్ట, విలయోదకముల్ = ప్రళయజలములు, పయికుబ్బి=పైకిఉబికి, చిప్ప=బ్రహ్మాండకర్పరమును, వ్రచ్చుకొని = భేదించుకొని, మహాభ్రవీథిన్ = మహాకాశముయొక్క వీథియందు, చనన్ = పోఁగా, సూకరతన్ = వరాహత్వమునందు, మెయివెంచి = శరీరమును బెంచి, వెండి = మరల, క్రిందికిన్ = అధోభాగమునకు, కయివ్రాలు=దిగజాఱుచున్న, తత్స...ధారన్ - తత్=మున్ను చెప్పఁబడిన, సలిల=ఉదకముయొక్క, నిర్మల = తేటయయిన, ధారన్ = ధారచేతను, అదగపర = బ్రహ్మాండమునకు: బరమైనట్టియుఁ, స్ఫురత్ = ప్రకాశించుచున్న, ప్రకృతిన్ = మాయ యనెడు స్త్రీకి, ఈ యజాండమును = ఈబ్రహ్మాండమును, బంగరుముంగరగాన్ = సువర్ణమయ నాసాభూషణముగాఁగ, ఒనర్పవే = చేయవా.

తా. వరాహావతారమందు నొక్కసారి ప్రళయసముద్రమందలి యుదకములలో నాదివరాహము మూఁతి నుంచి బుద్బుగింపఁగానే, యాయుదకములు బ్రహ్మాండకర్పరము దాఁటి యావలఁ బైకి పోయి మగిడి వచ్చుచుండఁగా, నాయుదకధార యాకర్పరమునకుఁ బైగా నున్న ప్రకృతి యనెడు స్త్రీయొక్క ముక్కుకొన నున్న సన్నకాఁడవలె నుండె ననియును, బ్రహ్మాండ మాకాఁడకు నడికి యున్న బంగారుముంగరవలె నుండె ననియు నట్లొక్కసారి బుద్బుగించినమాత్రనే సముద్రోదకములు బ్రహ్మాండమును దాఁటఁ

శేషుంతంత బలము గలిగినవరాహరూపమును స్వామి ధరించె ననియును భావము. అలం. ఉత్ప్రేక్షాలంకారము, అతిశయోక్త్యనుప్రాణితము.

నృసింహమూర్తి

మ. అసురేంద్రాశయకుండికాచ్ఛరుధిరవ్యాప్తస్వకచ్ఛాయఁ గాం
చి సముద్యత్ప్రతిసింహమత్సరమిళచ్చేష్టన్ దదుద్దామదీ
ర్ఘసటాఘాటముఁ బెల్లగించుగతి నాంత్రశ్రేణిఁ గిన్కన్ వెరం
జుసితక్రూర భవన్నఖావళులు ప్రోచు న్మర్త్యపంచాననా. 22

టీ. మర్త్యపంచాననా = ఓనరసింహా అని సంబుద్ధి. అసు...న్-అసురేంద్ర = రాక్షసేశ్వరుఁ డగుహిరణ్యకశిపునియొక్క, ఆశయ = హృదయ మనెడు, కుండికా = కుండికయందలి, అచ్ఛ=లేట యయిన, రుధిర=నెత్తుటియందు, వ్యాప్త=ప్రతిబింబిత మైన, స్వక=స్వీయమైన, ఛాయన్ = నీడను, కాంచి = చూచి, సము...ష్టన్-సముద్యత్=విజృంభించుచున్న, ప్రతిసింహ=అన్యసింహ మనెడి, మత్సర = ఈసుతోడను, మిళత్=కూడుకొన్న, చేష్టన్=చిట్టకముచేతను, తదు...మున్-తత్=ఆప్రతిసింహము యొక్క, ఉద్దామ=గొప్పలయి, దీర్ఘ = నిడుదలగు, సటా = జాలువెంద్రుకలయొక్క, ఘాటమున్ = సమూహమును, పెల్లగించుగతిన్=పెకలించునట్లుగా, ఆంత్రశ్రేణిన్= ప్రేఁగులయొక్క పంక్తిని, కిన్కన్ = కోపముచేత, వెరంజు...లు - వెరంజు=జవురు కొనుచున్నట్టి, సిత = తెల్లనైన, క్రూర = తీక్ష్ణములైన, భవన్నఖావళులు = నీగోళ్ల యొక్కపఙ్క్తులు, ప్రోచున్=(మమ్ము) రక్షించును.

తా. స్వామి నృసింహావతార మెత్తినప్పుడు హిరణ్యకశిపునిహృదయముఁ జీల్చి యారక్తమందు నీడఁ జూచి ప్రతిబింబించిన తనరూపును మఱియొకసింహము రూప మని మత్సరించి, యాకోపముచేతఁ దత్సింహముయొక్క సటలు పెల్లగించెనో యన్నట్లు హిరణ్యకశిపుని ప్రేఁగులు బైటికి లాగె ననియు, నట్లు లాగిన తెల్లనితీక్ష్ణము లగుగోళ్లు తమ్ము రక్షించు నని మంగళాశీర్వచనము చేసె ననియు భావము. అలం. భ్రాంతిమదను ప్రాణితోత్ప్రేక్షాలంకారము.

ఉ మునుము న్నెల్పును దూఱఁదూఱ మఱికెంపున్వ్రేండియుం దూఱఁ గం
దనగాయం గలనల్పుం దోఁప నఖకోణశ్రేణిచే విక్రమం
బున వాఁ డుగ్రతఁ గొన్నయట్టి విలసన్మూర్తిత్రయీతేజముం
గొనులీల న్వివళింపవే యసురవక్షోభిత్తి మిథ్యాహరి! 23

టీ. మిథ్యాహరీ=మాయాసింహరూపధారి వగు నృసింహస్వామీ యని సంబుద్ధి. మునుమున్ = మొదలను, తెల్పును = ధావళ్యమును, తూఁటఁదూఁటన్ = ఉచ్చిపోఁగా పోఁగా, మఱి = పిమ్మట, కెంపున్ = ఎఱుపును, వెండియున్ తూఁటన్ = ఇంకనుం దూటిపోఁగా, కందనగాయన్ = గుండెకాయయందు, కల=కలిగినట్టి, నల్పున్ = నీల వర్ణమును, తోఁపన్=కనుపడఁగా, విక్రమంబునన్ = పరాక్రమముచేతను, వాఁడు = ఆహిరణ్యకశిపుఁడు, ఉగ్రతన్ = బెట్టిదముచేతను, కొన్నయట్టి = గ్రహించిన, విలస...మున్-వి.సత్=ఒప్పుచున్న, మూర్తిత్రయీ=పంచానన చతురానన జనార్దను లనియెడు ముగ్గురు మూర్తులయొక్క, తేజమున్ = తేజస్సును, కొనలీలన్ = మరల గ్రహియించునట్లు, నఖ...చేన్ - నఖ = గోళ్లయొక్క, కోణ = కొనలయొక్క, శ్రేణిచేన్ = పఙ్క్తిచేత, అసుర...త్తిన్-అసుర = రాక్షసునియొక్క, వక్షోభిత్తిన్ = గోడవంటి వక్షఃస్థలమును, వివరింపవే = చీల్పవా?

తా. హిరణ్యకశిపుని వక్షఃస్థలము భేదించినప్పుడు మొదటిభాగము తెగఁగాని తెల్లగా నుండె ననియును, మఱికొంత తెగఁగాని ఆమాంస మెఱ్ఱగా నుండె ననియు, కడకుఁ దెగఁగా గుండెకాయం దవిలి నల్లగా నుండె ననియును, ఆ మూఁడుకాంతులు తోఁచుట దొల్లి వాఁడు విక్రమించి శివుని తెల్లనితేజస్సును బ్రహ్మదేవుని యెఱ్ఱనితేజస్సును విష్ణుదేవుని నల్లనితేజస్సును గ్రహించెను గావున నవి వానిశరీరములో నుండఁగా, స్వామివారు వానిని మరల బైటికిఁ దీయుచున్నట్లుండె ననియు భావము. అలం. స్వభావోక్త్యనుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

వామనమూర్తి

మ. బలిదైతేయభయాంధకారభరితబ్రహ్మాండగేహంబులోఁ
పలఁ బై మండెడుతత్ప్రతాపమయదీపజ్వాల డింద న్గడుం
దలమై మింటికిఁ గ్రక్కున న్నెగయునుద్యత్తన్మహాచ్ఛాయ నాఁ
గలనీలాంగము శింశుమార మొరయంగాఁ బెంపవే వామనా! 24

టీ. వామనా! బలి...లన్ - బలి = బలిచక్రవర్తి యనెడు, దైతేయ=రాక్షసునివలని, భయ = భయ మనియెడు, అంధకార=కటికచీఁకటిచేత, భరిత=నింపఁబడిన, బ్రహ్మాండ = బ్రహ్మాండ మనెడు, గేహంబులోపలన్ = ఇంటిలోపలను, పైన్=ఉపరి భాగమందు, మండెడు...ల - మండెడు = ప్రజ్వరిల్లెడు, తత్ప్రతాపమయ=ఆబలిచక్రవర్తియొక్క పరాక్రమరూపమైన, దీపజ్వాల = దివ్వెవెలుఁగు, డిందన్ = మఱుఁగు పడునట్లుగా, కడున్ = మిగుల, దలమై = దట్టమై, మింటికిన్ = ఆకాశమునకు,

గ్రక్కునన్ = వేగముగా, నెగయు...య - నెగయు = ఉద్గమించుచున్న, ఇది నకారాది పదము, ఉద్యత్ = ప్రకాశించుచున్న, తత్ = ఆదీపప్రభానివారణానంతర మయిన, మహాచ్ఛాయ నాన్ = పెద్దనీడయో యనఁగా, కలనీలాంగము-కల=ఉన్నట్టి, నీలాంగము = నల్లని శరీరమును, శింశుమారము = శింశుమారచక్రము, ఒరయంగాన్ = అంటునట్లు, పెంపవే = పెనుపవా?

తా. బలిచక్రవర్తివలని భయ మనెడు చీఁకటి బ్రహ్మాండ మనునింటిలో వ్యాపించి యుండెననియును, దానిమీఁద నవఁగా మూఁడులోకము లతిక్రమించి యతని ప్రతాప మనియెడుదీపము వెల్గుచుండె ననియును, దద్దీపజ్వాల యదు గగన ట్లంతకంటెఁ బైఁగా శింశుమారచక్ర మంటువఱకు స్వామివారు నల్లనిశరీరముఁ బెంపఁగా నది దీపమున క్రిద్ద మగుఛాయవలె నుండె ననియును భావము. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

పరశురామావతారము

మ. శమితక్షత్త్రకళత్రనేత్రజలవర్షావేళ నీకీర్తిహం
సము క్రౌంచస్ఫుటతావకాంబకసుషిం డాఁగంగ నీక్షించి వ
ర్షము రా నంచలు నంద నేఁడుఁ జను నిచ్ఛ న్నాఁటి తచ్చేష్ట వా
యమిఁ దిర్యక్తతి దా గతానుగతికం బౌఁగా కుఠారీహరీ. 25

టీ. కుఠారీహరీ = పరశుధారి వగుస్వామీ! యని సంబుద్ధి, శమిత...ళన్ - శమిత = నశింపఁజేయఁబడిన, క్షత్త్ర=రాజులయొక్క, కళత్ర=భార్యలయొక్క, నేత్ర జల=కన్నీళ్ళనియెడు, వర్షావేళన్ = వర్షాకాలమందు, నీ కీర్తిహంసము = నీకీర్తి యనెడునంచ. (ఇచ్చట సమాసాంతమగుటవలన మువర్ణము వచ్చినది.) క్రౌంచ...షిన్ - క్రౌంచ = కొంచగుబ్బలియందు, స్ఫుట = వ్యక్తమైన, తావక=నీసంబంధియగు, అంబక = బాణమువలని, సుషిన్ = బిలమందు, ('రంధ్రం శ్వభ్రం వపా సుషి' యని యమరము.) డాఁగంగన్ = కదలిపోఁగా, ఈక్షించి = చూచి, వర్షము రాన్=వాన రాఁగానే, అంచలున్ = హంసలును, ఇచ్ఛన్=మనస్సునందు, తచ్చేష్ట=తత్ ఆనీకీర్తి హంసముయొక్క, చేష్ట = గమనవ్యాపారము, నాఁటి = పాదుకొని, వాయమిన్ = ఎడఁబాయకుండుటచేత, అంద=ఆక్రౌంచబిలమందే, నేఁడున్=ఈకాలమందును,చనున్= పోవును, తిర్యక్తతి - తిర్యక్=పశుపక్షిప్రముఖతిర్యగ్జాతులయొక్క, తతి=సమూహము, తాన్ = తాను, గతానుగతికంబు పోఁగా = ముందటఁ బోయినదానివెంటనే పోవు గదా. అలం. రూపకాను ప్రాణితమైన హేతూత్ప్రేక్షయు, అర్థాంతరన్యాసమును.

తా. ఓ పరశురామావతారా ! నీవు రాజులను సంహరించుటవలన వారిభార్యలు దుఃఖించుచుండఁగా వారికన్నీ రనువర్షాకాలమందు నీకీర్తిహంసము, తొల్లి నీవు కుమారస్వామివలెనే శివునొద్ద విలువిద్య నేర్చికొని పరీక్షకొఱకుఁ గ్రౌంచపర్వతమును నీ బాణముచేత ఛేదించితివి కావున, నాబిలములో నుండి యూవలికి వెడలి పోయె ననియుఁను, అపోవుట సూచి భూమియందలి యితరహంసలు వర్షాకాలము రాఁగానే ఆ బిలములో నుండియే యిప్పటికిని మానససరస్సునకుఁ బోవు ననియును, దిర్యగ్జాతి యొకదానివెంట నొక్కఁడు పోవునే కాని జాటవిడువ దనియును భావము. హంసలు వర్షాకాలము రాఁగానే క్రౌంచపర్వత బిలముద్వారమున మానససరస్సునకుఁ బోవుట ప్రసిద్ధము. పరశురాముఁడు క్రౌంచపర్వతమును భేదించె ననుటకు 'భృగుపతియశో వర్త్మ యత్క్రౌంచరంధ్ర' మ్మని కాళిదాసప్రయోగము.

శ్రీరామావతారము

మ. పవిధారాపతనంబుఁ గైకొనని యప్పౌలస్త్యుమై సప్తధా
తువులం [1]దూఱఁ బరిశ్రమంబునకు నుద్యోగించె నా సప్తసా
లవిభేదం బొనరించి నిల్వక [2]సలీలం జన్న యుష్మన్మరు
జ్జవనాస్త్రం బొసఁగు న్సిరుల్ రఘుకులస్వామీ! రమావల్లభా! 26

టీ. రఘుకులస్వామీ = రఘువంశనాయకా! రమావల్లభా = శ్రీసీతానాథా! పవి...బున్ - పవి = వజ్రాయుధముయొక్క, ధారా = అంచుయొక్క, పతనంబున్ = ప్రహారమును, కైకొ...లన్ - కైకొనని = సరకుసేయని, అప్పౌలస్త్య = ఆపులస్త్య వంశజుఁడైన రావణాసురునియొక్క, మై=శరీరముయొక్క, సప్తధాతువులన్ = త్వగసృగస్థిస్నాయు శుక్లవసామజ్జ లనియెడు నేడు ధాతువులను, దూఱన్ = ప్రవేశించుటకై, పరిశ్రమంబునకున్=అలవాటునకు, ఉద్యోగించెన్ నాన్=ఆరంభించెనో యను నట్లు, సప్త...బు-సప్త = ఏడైన, సాల=కిష్కింధాప్రాంతమందలి మద్దిచెట్లయొక్క, విభేదంబు=వ్రచ్చుటను, ఒనరించి=చేసి, నిల్వక=విరమింపక, సలీలన్=క్రీడగా, చన్న=పోయిన, యుష్మ...బు - యుష్మత్ = నీయొక్క, మరుత్ = వాయువువలె, జవన = వేగము గలిగిన, అస్త్రంబు = బాణము, (వాయవ్యాస్త్ర మని యేనియుం జెప్పవచ్చును.) సిరుల్ = శ్రీలను, ఒసఁగున్ = ఇచ్చుఁగాత.

తా. దేవేంద్రుని వజ్రాయుధముచేతఁ బ్రహరింపఁబడియు లక్ష్యము సేయని రావణాసురుని కఠినమైన శరీరమందలి సప్తధాతువులను భేదించుటకై మున్నే యల

1. దూఱు పరిశ్రమం. 2. వెస జన్నట్టి.

వఱచుకొనుటకువాలి సప్తసంఖ్యగల సాలవృక్షములమీఁద సుగ్రీవుని నమ్మకముకొఱకు శ్రీరామస్వామివారు బాణమును బ్రయోగింపఁగా నది యాసాలములలో దూఱి యావలఁ బోయె ననియు, నట్టి బాణము మాకు సిరు లొసంగుత మనియును భావము. ఉత్ప్రేక్ష.

సీ. స్యందనస్థితబిడౌజఃక్షత్తృజాడ్యకృ
ఝంఝూమరుద్గరుఝ్ఝాత్కృతములు
క్రవ్యాశిరాడ్గాత్రకనదసృగ్గాహన
స్ఫుటశల్యహవ్యభుక్ఛూత్కృతములు
యోధవర్మితహృత్పుటోత్క్రాంతనిజపాత
సాలాశ్మకృతముహుస్తాత్కృతములు
పతితోగ్రరక్షఃకబంధభారభృశార్తి
భుగ్నభోగఫణీంద్ర ఫూత్కృతములు
తే. శ్రాంతరథ్యనిరంతరచ్ఛాయదములు
దివ్యతావక కార్ముకోత్ప్రేరితములు
కలుషము లడంచుఁ గాత లంకాపురాంగ
ణాంబరచరత్కలంబ కదంబకములు. 27

టీ. స్యందన = రథమందు, స్థిత = ఉన్నట్టి, బిడౌజః = దేవేంద్రుని యొక్క, క్షత్తృ = సారథి యగు మాతలికి, జాడ్య = మాంద్యమును, కృత్ = చేయుచున్న, ఝంఝామరుత్ = పెనుగాడ్పులు గల, గరుత్ = ఱెక్కలయొక్క, ఝూత్కృతములు = ఝూత్కారములు గలవియు, క్రవ్యా...లు - క్రవ్య = మాంసమును, అశి = భక్షించెడురాక్షసులకు, రాట్ = రాజైన దశకంఠుని యొక్క, గాత్ర = దేహమందు, కనత్ = వెలుఁగుచున్న, అసృక్ = రక్తమందు, గాహన = మునుఁగుటచేత, స్ఫుట = వ్యక్తమైన, శల్య = ములుకులయందలి, హవ్యభుక్ = అగ్నియొక్క, ఛూత్కృతములు = ఛూత్కారములు గలవియు, యోధ...లు - యోధ = జోదులయొక్క, వర్మిత = సంజాతకవచము లగు హృత్పుట = హృదయపుటములవలన, ఉత్క్రాంత = వెడలిన, నిజ = స్వకీయములగు, పాత = వ్రేటులచేత నగు, సాల = లంకాపురి కోటలప్రాకార మందలి, అశ్మ = పాషాణములయందు, కృత = చేయఁబడిన, ముహుః = సారెసారెకుఁ గలుగు, తాత్కృతములు = తాత్కారములు గలవియు, పతిత...లు - పతిత = పడిన, ఉగ్ర = భయంకరులగు, రక్షః = రక్కసులయొక్క, కబంధ = మొండెములయొక్క, భార = వ్రేఁగుచేతనైన, భృశ = మిక్కిలియగు, ఆర్తి = పీడచేత, భుగ్న = వంగిన, భోగ =

పడగలుగల, ఫణీంద్ర = పాపఱేఁడగు శేషునియొక్క, ఫూత్కృతములు = ఫూత్కారములు గలవియు, శ్రాంత...లు - శ్రాంత = బడలిన, రథ్య=తేరిగుఱ్ఱములకు, నిరంతర=దట్టమగు, ఛాయదములు = నీడ యిచ్చునవియు, దివ్య...లు - దివ్య = శ్రేష్ఠమగు, తావక=నీసంబంధియగు, కార్ముక=ధనువువలన, ఉత్ప్రేరితములు = విడువఁబడినవియు అగు, లంకా...లు - లంకాపుర=లంకాపట్టణము యొక్క, అంగణ = సమీపమందలి, అంబర = ఆకాశమునందు, చరత్ = చరించుచున్న, కలంబ = బాణములయొక్క, కదంబకములు = సమూహములు, కలుషములు = మాపాపములను, అడంచుఁగాత = అడఁచివేయునుగాక. (ని. "శతాఙ్గస్స్యందనో రథః", 'బిడౌజాః పాకశాసనః' 'సూతః క్షత్తాచ సారథిః', 'జంఝావాతస్సవృష్టికః', 'గరుత్పక్షచ్ఛదాః పత్త్రం', 'రుధిరేసృగ్లోహితాస్ర రక్తక్షతజశోణితం', 'హుతభుగ్దహనోహవ్యవాహనః', 'భటాయోధాశ్చ యోద్ధారః', 'సన్నద్ధోవర్మితస్సజ్జః,' 'ప్రాకారోవరణస్సాలః', 'ముహుఃపునఃపునశ్శశ్వదభీక్ష్ణమసకృత్సమాః', 'కబంధోఽస్త్రీక్రియాయుక్త మపమూర్థ కళేబరం', 'భోగస్సుఖేస్త్ర్యాదిభృతావహేశ్చ ఫణకాయయోః', 'రథ్యోవోఢా రథస్యయః,' 'కలంబమార్గణశరాః', 'నికురుంబం కదంబక' మ్మని యాయాపదముల కమరము. 'శల్యోవంశ శలాకాయాం శకుంతామరయోరపి, శల్యః కశ్చిన్మహీపాల' యని రత్నమాల.)

తా. శ్రీరాముఁడు రావణునితో యుద్ధముసేయునప్పుడు స్వామి ధనుస్సునలన విడువఁబడి లంకాపట్టణ ప్రాంతములయందు సంచరించెడు బాణపరంపర లప్పుడు స్వర్గమునుండి దేవేంద్రునివలనఁ బనుపఁబడిన రథమందు సారథ్యముఁ జేయుచున్న మాతలికి మాంద్యము గలుగునట్లు, పార్శ్వములయందుఁ గట్టిన ఱెక్కలు పెనుగాడ్పుతో ఝూత్కారములు సేయునవియును, మఱియు రావణుని శరీరమందుఁ బ్రవేశించి యెముకలతో నొఱసికొనినప్పుడు ములుకులలో నిప్పువడఁగా నందలి రక్త మా నిప్పుతోఁ జేరి చుంయి మని శబ్దము వెడలు నవియును, నిశరరాక్షసులకవచములు చించి హృదయములు భేదించి వెన్నులోనుండి దాఁటి యంత నిలువక లంకాపట్టణపుఁ గోట పాషాణములకుఁ దగులఁగా సారెకు శాంకారములు గలుగు నవియును, ఆబాణముల చేత లెక్కకు మిక్కిలియగు రక్కసుల పీనుఁగు పెంటలవలన నధిక భారముగల భూమిని భరింపలేక పడగలు వంచికొని శేషుఁడు బుసలు విడుచు నవియును, పిమ్మట యుద్ధమందు రథమునకుఁ బూన్చిన వేలుపుల గుఱ్ఱములేనియు మిక్కిలి బడలికను జెందఁగా వానిబడలిక దీఱుటకుఁ బందిరివేసినట్లు దట్టమగు నీడ నిచ్చుచున్న వనియును, నట్టిబాణములు మాపాపములు పోఁగొట్టుఁగాక యనియు భావము.

బలరామావతారము

చ. 'క్షితి హలకృష్టిఁ బుట్టి యడఁగెన్ క్షితియందునె సీత' యంచుఁ ద
త్సతి విరహార్తిఁ బాండిమముఁ దాలిచి రామశరీర మెత్తి యా
క్షితిఖననక్రియ న్మగుడఁ జెందఁగఁ గాక, కళిందజా[1]తట
క్షితి దున నేటికి న్హలముచే [2]మఱి నీ కవశాత్మత [3]న్హలీ. 28

టీ. హలీ = ఓ బలరామస్వామీ ! సీత = సీతాదేవి, క్షితిన్ = భూమియందు, హలకృష్టిన్ = నాఁగలితో దున్నుటచేత, పుట్టి = జనించి, క్షితియందునె = భూమియందే, అడఁగెన్ = అడఁగిపోయెను, అంచున్ = అనుచు, తత్సతి = ఆసీతయొక్క, విరహార్తిన్ - విరహ = ఎడఁబాపుచేనైన, ఆర్తిన్ = పీడచేత, పాండిమమున్ = తెల్లఁదనమును, తాలిచి = ధరించి, రామశరీరము = రామావతారము, (బలరామావతారమనుట) ఈక్షితిఖననక్రియన్ - ఈక్షితి = ఈభూమియొక్క, ఖనన = త్రవ్వుటయొక్క, క్రియన్ = కార్యముచేతను, మగుడన్ చెందఁగన్ కాక = తిరిగిపొందుటకై కాక, కళింద...న్-కళిందజా = కాళిందీనదియొక్క, తట = దరియొక్క, క్షితిన్ = భూమిని, మఱి = పదంపడి, హలముచేన్ = నాఁగలిచేతను, అవశాత్మతన్ - అవశ = స్వాధీనముగాని, ఆత్మతన్ = శరీరము గలుగుటచేత, నీకు దున నేటికిన్ - దునన్ = దున్నుట, నీకున్ ఏటికిన్ = నీకేమి యక్కఱ యనుట.—ఇచ్చట దున్ను ధాతువు 'ప్రథమలుగపి ద్విరుల్లోపః' అనుసూత్రమువలన దును అనియెడు ధాతువయ్యె. కం. 'దునకయు వెదబెట్టకయును' నను మొదలగు ప్రబంధపరమేశ్వరాది మహాకవి ప్రయోగసిద్ధం బయి యున్నది.

తా. స్వామీ ! పూర్వము రామావతార మెత్తినప్పుడు సీతాదేవి భూమియందు జనకచక్రవర్తి దున్నించుచుండఁగాఁ బుట్టి, కడపట స్వామివారిసభాస్థలిలో భూమియందే యడఁగిపోయెఁ గావున నారాముఁడే మరల బలరాముఁ డై యవతరించి యాసీతావిరహమువలన మున్నునల్లనైన దేహము తెల్లనై యుండఁగా నాసీత భూమిలోనే యున్నదనియును, మున్ను దున్నుటవలననే పుట్టెఁగావున మరల దున్ని యాసీతను బొందవలయునని యూహించి విరహాతిశయమువలన మైమఱచి కాళిందీతీరభూమి నాఁగటిచే దున్నితివే కాక వేఱొకప్రయోజన మే మున్న దనియును భావము. యమునాతీరమును దున్నుటకు సీతాప్రాప్తిని ఫలముగా నుత్ప్రేక్షించినాఁడు గనుక ఫలోత్ప్రేక్ష.

---

1. తటిన్. 2. గాని. 3. హరీ.

కృష్ణావతారము

ఉ. ఆయతయుష్మదాకృతి కరాగ్రనగాంచలవాంత వారిధా
రాయుతచంద్ర కాంతఫలకావళి బింబిత యై [1]వెలుంగ నా
రాయణమూర్తిమత్కవచరత్నముచేఁ బరిరక్షఁ గాంచె నా
నోయదువీర! వృష్టిఁ బసి యూఱడఁ బ్రోవవె సప్తరాత్రముల్

టీ. ఓయదువీర = ఓయాదవవీరుఁడ వగు శ్రీకృష్ణ యని యామంత్రణము. ఆయత...తి-ఆయత=పొడువగు, యుష్మత్=నీయొక్క, ఆకృతి=ఆకారము, కరాగ్ర...ళిన్-కరాగ్ర-కర = నీహస్తముయొక్క, అగ్ర=చివరయందలి, నగ=గోవర్ధనపర్వతము యొక్క, అంచల = అంచులవలన, వాంత=వెడలుచున్న, వారిధారా = ఉదకధారల తోడ, యుత=కూడిన, చంద్రకాంతఫలక = చంద్రకాంతపుఁబలకలయొక్క, ఆవళిన్ = పఙ్క్తులయందు, బింబిత యై=ప్రతిఫలించిన దై, వెలుంగన్ = ప్రకాశించుచుండఁగా, నారా...చేన్ - నారాయణ = నారాయణసంబంధియగు, మూర్తిమత్=శరీరముఁగల, కవచరత్నముచేన్ = కవచశ్రేష్ఠముచేత, పరిరక్షన్ = మిక్కిలి సంరక్షణమును, కాంచెనాన్=పొందెనో యనఁగా, వృష్టిన్ = దేవేంద్రనియుక్తవర్షమందు, సప్తరాత్రముల్ = ఏడు రాత్రులు, పసి = పశుసమూహము, ఊఱడన్ = ఊఱటఁజెందునట్లు, ప్రోవవె = సంరక్షింపవా?

తా. స్వామీ! కృష్ణావతారమెత్తినప్పుడు దేవేంద్రుఁడు సప్తరాత్రములు ప్రబలమగు వర్షము గురియింపఁగా నట్టికాలమందు గోవర్ధనగిరి హస్తాగ్రమునందు ధరించి గోవులను రక్షించితివిగావున, నాపర్వత మెత్తినప్పుడు చుట్టును జాఱుచున్న యుదకధారలతోఁగూడిన చంద్రకాంతములయందు నీయాకృతి ప్రతిఫలించుచుండఁగా నేదిక్కునఁ జూచినఁ గృష్ణమయమై యుండుటంజేసి శరీరముఁగల నారాయణకవచము గోవులు ధరించినవియో యన్నట్లుండె ననియును, నారాయణకవచ మాపదల నడంచుట ప్రసిద్ధంబుగావున నట్టి కవచధారణంబుననే యవి రక్షింపఁబడినట్లు గోవులను నీవు రక్షించితి వనియును భావము. నారాయణుఁ డను పదమున కర్థ ముదకవాసి యగు విష్ణువు గనుక నిచ్చట నుదకప్రతిబింబిత మైన శ్రీకృష్ణవిగ్రహము నట్లు చెప్పెను. ఉత్ప్రేక్షాలంకారము.

---

1. చెలంగ.

బౌద్ధావతారము

మ. తరుణత్వాత్సుతబాణపంచకమునం దైత్యాబలాశ్రేణి త
ద్వరసందోహము యుష్మదాత్మకజరద్బాణం బొకంట న్జెడన్
ద్వరఁ గావించితి వేటికో? యహహా! బుద్ధం బయ్యె నీభావ మ
త్తరుణీశీలతనుత్ర మేరికి నసాధ్యం బౌటఁ గా కేశవా! 30

టీ. కేశవా = బ్రహ్మేశానోత్పత్తికారణమవైన స్వామీ యని సంబోధనము. తరుణ...నన్-తరుణ=లేఁతవాఁడగు, త్వత్సుత=నీకొడుకగు మన్మథునియొక్క, బాణ=బాణములయొక్క, పంచకమునన్=ఐదింటిచేత, దైత్యాబలాశ్రేణిన్ - దైత్య=త్రిపుర రాక్షసులయొక్క, అబలా=భార్యలయొక్క, శ్రేణిన్=సమూహంబును, యుష్మ...టన్-యుష్మదాత్మక = భవన్మయమైన, జరత్ = ముదిమిగల, బాణంబు ఒకంటన్ = ఒక్క బాణముచేతను, తద్వర...ము - తత్ = ఆదైత్యస్త్రీలయొక్క, వర = భర్తలయొక్క, సందోహము=సమూహము, చెడన్=భంగపడునట్లు, ఏటికో = ఏలొకో, త్వరఁ గావించితివి=శీఘ్రముసేసితివి, అహహా = ఆహా! నీభావము=నీయభిప్రాయము, బుద్ధంబయ్యెన్ = తెలియనయ్యెను. అత్త...ము - అత్తరుణీశీల = ఆస్త్రీలయొక్క పాతివ్రత్య మనియెడు, తనుత్రము=కవచము, ఏరికిన్ = ఎవ్వారికిని, అసాధ్యంబౌటఁగా = అసాధ్యమౌటచేతఁ గదా యని త్వర గావించితి వనుట తన్వయము.

తా. త్రిపురసంహారకాలంబున నాత్రిపురస్త్రీలపాతివ్రత్య మసాధ్య మవుటం జేసి ముందఱవారిని జెఱచుటకు స్వామి తనకుమారుఁ డగుమన్మథుఁడు తనకంటె లేఁతవాఁ డగుటవలన నతని యైదుబాణములను ముసలివాఁ డగు తనరూప మయిన యొకబాణమును ద్వరితముగా వారిభర్తలగు త్రిపుర రాక్షసులఁ జెఱుపుట కుపయోగింపఁ జేసె నని ముఖ్య భావము. ముద్రాలంకారము.

కల్క్యవతారము

శా. ఘోరాపారమహాఘపంచకముఁ జక్కుల్సేయఁగా నేర్ప(ర్పు)నా
ధారాపంచకధావనం బెలుఁగుగంధర్వంబుఁ ద్రొక్కించు బ
ల్బీరంపున్నెఱరౌతుఁ గీకటశరాళీవారణాణీభవ
ద్దోరుద్భ్రాంతకృపాణికాద్వితయవిద్యుద్దీధి నిం గొల్చెదన్. 31

టీ. ఘోరా...న్-ఘోర=కఠోరములగునట్టియు, అపార = పారము లేనివియు, మహాత్=అధికము లగునవియు నగు, అఘ పాపములయొక్క, పంచకమున్=ఐదింటిని,

'స్వర్ణస్తేయీ సురాపాయీ బ్రహ్మహా గురుతల్పగః, మహాపాతకినస్త్వేతే తత్సంయోగీచ పఞ్చమః' అని. ఇవి మహాపాతకములు. చెన్కుల్ = ఖురములు, చేయఁగాన్ = చేయుటకు, నేర్పున్ నాన్ = నేర్పుటకో యనునట్లు, ధారా...న్ - ధారా = అశ్వగతివిశేషము లగు నాస్కందితధౌరితక రేచితవల్గితప్లుతము లనియెడు ధారలయొక్క, ('గతయోఽమూః పఞ్చధారా' యని యమరము) పంచక = ఐదింటియొక్క, ధావనన్ = పరువిడుట చేతను, వెలుఁగు...ఖుర్ - వెలుఁగు = ప్రకాశించుచున్న, గంధర్వంబున్ = అశ్వమును, త్రొక్కించు...తున్ - త్రొక్కించు = నడిపించుచున్నట్టి, బల్ = అధికమగు, వీరంపు = వీర గుణముగల, నెఱరాతున్ = పూర్ణరాహుత్తును, కీకట...ధిన్ - కీకట = మ్లేచ్ఛుల యొక్క, (కీకటదేశవాసులు = బోయలు, 'దేశభేదేచ కీకటః' యని నిఘంటువు.) శరాళి = బాణసమూహములకు, వారవాణీభవత్ = కవచమగుచున్న, దోః = భుజములయందు, ఉద్భ్రాంత = త్రిప్పఁబడుచున్న, కృపాణికా = పట్టాకత్తులయొక్క, ద్వితయ = జంట యనియెడు, విద్యుద్గ్రంథిన్ = మెఱపుముడి గలిగిన, నిన్ = కల్కియగు నిన్ను, కొల్చెదన్ = సేవించెదను.

తా. స్వామి కల్క్యవతారమం దుత్తమాశ్వముమీఁద నెక్కి బవిరి, దువాలంబు, రవగాలు, జోఁదన, జళిపి యను పేరుగల యైదు గమనవిశేషములచేత నడుపుచుండఁగాఁ, బంచమహాపాపముల నడఁగఁద్రొక్కుటకు నైదు విధము లగు గమనములు నేర్పుచున్నట్లుండు ననియును, రెండుచేతుల రెండుపట్టాకత్తులు పూని త్రిప్పుచుండఁగా నన్ని ప్రక్కల మెఱపులు మెఱసినట్లుండు ననియును, నాఖడ్గద్వయ సంచారమే యాకాలమందు స్వామి నెదిరింపఁగల మ్లేచ్ఛులబాణ పరంపరలకుఁ గవచమై యాబాణములను పైకి రానీకుండు ననియును భావము.

చ. అని [1]నుతియింపఁగా హరి సుధాశనవర్ధకిఁ జూచి 'పాండ్యుఁ డి
చ్చినధన మిమ్మునీశ్వరుఁ డశేషము భాగవతాస్మదీయగే
హనివహసాత్కరించి యకటా! కడు రిక్తత నొందు; నేతనీ
యనిలయ మప్పురి న్మణిమయంబును సౌధముఁ జేయు నావుడున్.

టీ. అని = ఈరీతిగాను, నుతియింపఁగాన్ = స్తోత్రము సేయఁగా, హరి = స్వామి, సుధాశనవర్ధకిన్ - సుధాశన = దేవతలయొక్క, వర్ధకిన్ = వడ్రంగియగు విశ్వకర్మను, ('తక్షాతు వర్ధకి స్త్వష్టా' యని యమరము.) చూచి = వీక్షించి, పాండ్యుఁ డిచ్చిన ధనము = పాండ్యరా జొసంగిన ద్రవ్యమును, ఇమ్మునీశ్వరుఁడు = ఈ విష్ణు

1. వినుతింపఁగా.

చిత్తుఁడు, అశేషము = సమస్తమును, భాగ...చి - భాగవత = భగవద్భక్తుల విషయమందు, అస్మదీయ = నాసంబంధులగు, గేహ = ఆలయములయొక్క, నివహ = సమూహమునను, సాక్షరించి = వినియోగ పఱిచి, అకటా = అయ్యో, కడున్ = మిక్కిలి, రిక్తతన్ = లేమిని, ఒందున్=పొందును. అప్పురిన్ = ఆవిల్లిపుత్తూరియందు, ఏతదీయనిలయము - ఏతదీయ=ఈవిష్ణుచిత్తుని సంబంధియగు, నిలయము = గృహమును, మణిమయంబును = మణివికారముగాను, సార్థమున్ = ధనసహితమైనదిగాను, చేయుం= చేయుము, నావుడున్ అనఁగా.

తా. సుగమము.

తే. విశ్వకర్మయు నట్ల కావించె; నంత
నంబుజాక్షుఁడు నమ్ముని నాదరించి
యాక్షణాగోచరుం డయ్యె ఋషియు నేఁగి
పౌరులు [1]భజింప విల్లిపుత్తూరి కరిగె. 33

టీ. ఈక్షణాగోచరుండయ్యెన్ = అంతర్ధానముం జెందెను. కడమ సుగమము.

విష్ణుచిత్తుని స్వపురప్రవేశము

క. స్థానికులు తన్ముని దిదృ
క్షానందితు లగుచుఁ బురముఁ గై సేసి ప్రజ
ల్తో [2]నరుగ నాగవాసము
తో నెదురుగ నేఁగి రంత తూర్యము లులియన్. 34

టీ. స్థానికులు = శ్రీవిల్లిపుత్తూరిలోని దేవస్థానమందలి యధికారులు, తన్మ...లు-తన్ముని=ఆవిష్ణుచిత్తునియొక్క, దిదృక్షా=దర్శనేచ్ఛచేత, ఆనందితులు=సంతోషపడినవారు, అగుచున్, పురమున్ = విల్లిపుత్తూరిని, కై సేసి = అలంకరించి, ప్రజల్=పౌరులు, తోన్ అరుగన్ = కూడరాఁగా, నాగవాసముతోన్=భోగముమేళముతోడ, ఎదురుగ నేఁగిరి = అభిముఖముగాఁ బోయిరి, తూర్యములు = వాద్యములు, ఉలియన్ = ధ్వనిసేయుచుండఁగా, అంతన్ = పిమ్మట, ఇది మొదటి కన్వయము

తా. సుగమము.

వ. (1) ఇ ట్లైహికా ర్లోకిని పట్టపవిత్ర భగవత్ప్రసాదతీర్థంబు లుపాయనంబులుగాఁ బ్రణామంబు లాచరించి లేచి, ప్రాంజలులై, భర్మపరికర్మ

1. భజింపఁగానె పుత్తూరి. 2. నడువ.

వర్ణితం బగుబ్రహ్మరథంబున నబ్భాగవతవతంసంబు నునిచికొని పోవు
సమయంబునఁ, బరస్పరసమేతంబు లగుపౌరజానపదజనంబులు గలిసి
మెలసి నడచునెడ; (2) మృదంగం బుపాంగం బావజంబు దండెతాళం
బురుమ కిన్నెర సన్నగాళెవీణె ముఖవీణె వాసెగ్రోలు డోలు మౌరి
భేరి గౌరు గుమ్మెట తమ్మెటంబు డుక్కడక్కిచక్కిచయ్యంకి లోనగు
నసంఖ్యాతవాదిత్ర త్రితయపరంపరలు మొరయ; (3) నెడనెడఁ బసతు
కలు మలఁపుగొనఁ, బట్టణాగతగజ ఘట్టఘోట్టాణఘోటక ఘంటా
కదంబ ఘుర్ఘురఘోషంబుల కనుప్రాసంబులై విలాసినీమంజుమంజీరంబు
లెలుఁగియ్య, నల్లనల్లనం జాఁగుతెఱఁ; (4) గెలఁకులఁ గవచితకుథా
కర్బురలగుకరివరకరేణుకంధరలం గనకాంకుశంబులు చేఁబూని సేవించి
పోవుసామంత భూకాంతకుమారఘట్టంబులం బిట్టు గాంచి, యొం
డొరుఁ గడవ సంభ్రమించుచు, మ్రొక్కి నిక్కి చేయెత్తి యెత్తిలి
నేత్రంబు లుత్తానతరళతారకంబులుగా మగిడి మగిడి పొగడుచుం
బోవుతఱిఁ; (5) దద్రాజకదంబకం బచ్చటిపడంతుకలకుం దమకుం
బురికిం జనుదెంచినప్పు డెల్ల నెడకాండ్రగుట మేలమాడఁబోలు నా
ప్రోలిమేళంపుఁ గళావతుల ప్రేయునెఱంబునం గ్రామగ్రామగ్రాముణు
లొసంగునారంగమాతులుంగజంబీరకుందకందుకాదులం బూర్వాను
భుక్త లగున క్తంకరముఖుల వైవ; (6) ధళధళత్తరళతాటంకంబును
నంకురితస్మితంబునుగా, నాతన్ముఖప్రేంఖోళితస్ఫీతసాకూతవిభ్రమాకేక
రాపాంగవిలోకనంబును నాచలితధమ్మిల్లంబునుంగా, మొగంబులు
తిగిచికొని సంమర్దంబునం జనుమార్దంగికుల మూఁపులు మఱుఁగులం
డాఁగి యన్నాగవాసంబు నాగరకవిలోకనంబునం జెలరేఁగి మొగం
బులు బిగించికొని వేదు రెత్తినగతి నందియెత్తఁ బ్రతిపదంబును
మర్దళముఖావమర్దనకుఁ గ్రుంగుటయు, బయలుపడి చేయునది లేక
యాకడకు మగిడి తుఱుము దిద్దుచుఁ దద్వారణాభినయవత్సరా
చీనకరాబ్జలై సుడివడునెడం బొడముకర్ణకుసుమావతంసకపోల
ఖురళి కించిచ్చలనోపలక్ష్యవైలక్ష్య హాసకుంవంబులు సాంద్రతర
చంద్రికాకందంబులందీటుకొలుపఁ, (7) దాటూక్తివాచాటలగుజరఠవని
తలు తమకు మ్రొక్కం దారుమ్రొక్క కొక్కించుక యొరమోమిడి,

వారియిరుపక్కియల నొదిఁగితొంటియంటుఁ దలంచి తలవాంచిన,
వంచనం గటాక్షించి యొక్కసక్కెంబునకుఁ దమచేత మ్రొక్కించుకొను
వేడ్కనక్కడం బుడమితేఁడు లేమి సామాన్యమానవులం గైకొనక,
సుమాళంబు వేద్యంబుగా విద్యావయోవృద్ధులరగు మీరు మ్రొక్కం
దాను మ్రొక్కమి యెట్లు మ్రొక్కింపుం డనుటయు, (8) గ్రక్కునం
బొడమ మొక్క నగవులమోముఁదమ్ములకు వేఱొక్కవింత తెలివి
యొక్క, మ్రొక్క కక్కడఁ గెడఁగూడి నడచు తోడిచేడియల కద్దొర
లకుఁ దమకుఁ దద్దయుం బొందు గలదను పెద్దఱికం బెఱుకపఱుపఁ
గెమ్మోవులు మఱలంచి లోలోన నొయ్య నొయ్యన నుచుక్కన నక్కి
కెత్తంగి దక్కెసొమ్మని తమ్ము నమ్ము మసళ్లు ముందఱికి నూకి 'యక్కక్క
మ్రొక్కవే మనపాలివేలు' పని బుజ్జగించియు బొమలుగొని జఱకిం
చియు నెట్టకేఁలకు నొడంబఱిచినఁ; (·) ద్రపాతరళనయన లై విరళవిర
ళాంగుళాంజలిబంధంబుగా మ్రొక్కి కక్కసాన నిట్లు మ్రొక్కించి
హెచ్చి యచ్చయ్యాళ్యట మెడఁ బడకయుండఁ జిగురుగండెలుఁబోలె
నల్లుకొని గొల్లన నగునల్లొలాంగనలఁ గల్లకోపంబునం గొట్టి కసరుఁ
జూ పబ్భ్యాపసంఘంబుపై నిగుడ మగుడ మఱుపడు కొమిరె హరిణ
లోచనలచలితకంకణసంకుల క్రేంకారంబు లాననామోదమేదురాళి
ఝుంకారంబుల బిఱకంబు లడంపఁ, (0) జెవులసంకులు లోవంకభుజం
బులు కొంకిసిగలు కావిదుప్పటులు నొప్పనిమ్ము దెప్పరం బై ముప్పిన
నప్పురంబు సేరి, రసికజనబాంధవంబున బంధువియోగంబు మఱచి,
గంధకలనాకుసుమ స్రగ్గ్రథనాదులనాంధ్యంబు లేకలరు నంధ్రదేశీయు
లగు గంధకారులు 'పాటపాట పద్యంపు మ్రొక్కులతో వెట్టివెట్టి
కైవారంబుల గౌరుతత్తడలపై వచ్చు రాచవారిపై నాఁడువారిపై
నాళువారిపైఁ జల్లగాఁ జల్లఁ బెల్లెగసి సృష్టియెల్లను ముష్టీకరించుచు,
నప్పుష్టభేద యగు పరిమళసమష్టిం బెట్టు పిష్టాతకంబు నభోమండలికిఁ
జండాతకం బై చండకిరణంబులు మాటుపఱుపఁ, బన్నీరు నించిన నన్నీరు
తిత్తులొత్త; విముత్తలంబునం బాఱి కైవ్రాలు ధారల వాద్యంబులు
తడిసిన విద్యోపజీవులు పుష్కరంబులు క్రాఁప నగ్గిరోయుచుండ,
(11) నమొత మత్తఱి నృత్తంబుఁ జూడ నిలిచి మెత్తమెత్తన నడచు

చుండు మిండతండంబునం దారు నప్పించు పుండరీకాస్యలవకాశంబుఁ గాంచి కాశకుసుమప్రతిఫలనపాంసురంబులై పద్యాతిహృద్యపార్శ్వద్వయోద్యానపాదపంబులకుం బాఱుచెంగలువకాలువలకుం డిగ్గి, కాసరదధిమండమాపరంబులుగాఁ బిసికి యారంబెట్టిన నారంగశృంగబేరభంగంబులతోఁ గట్టిన కలమాన్నంపుఁజల్డి పోకపాత్రలం గుడవఁ గూర్చుండ వీక్షించి; (2) కుక్షింభరిత్వంబున క్షుత్క్షాములై తిరిగితిరిగి వేసరియోసరిలినదాసరిగుంపువారిపాల గోపాలభిక్ష భిక్షించి భక్షింపఁ దీరక్షోణి నిలిపినతోరంపుదివెదాఁకోలల (తిరువిళక్కోలల) రంధ్రగోళంబుల నుత్కీలంబులై మండు ధగధగనిజగజ్జ్యోతి దీపజాలంబుల మధ్య ధూపకుండికాంగారంబుల నీరాజఁ గ్రాఁచి నాదుఁ బరికింప వాయించు ధిమిధిమిధ్వానంబులకుం బెదరి యీవలియుపవనశుకంబు లావలి కావలియుపవనశుకంబు లీవలికి దట్టంబుగాఁ గట్టనితోరణంబులై పఱవఁ, దలలు విసుకుటయు నోరు దెఱచుటయుఁ గేలు సఱచుటయుఁ దక్కమిక్కుటంబగుకోలాహలంబున నేపాటియుం బాట వినరాక మూఁకగట్టిన భాగవతజాతంబు లేతేర; (3) నూఱారి సంతసంతకుం దిరుగఁ బెద్ద లింటింట సంతరించిన పిలుకవాటుగోడిగల జావడంబులకుం బుట్టి కాల్గట్టి విడువ నెత్తంబున మెత్తని గఱికమేసి పోసరించి మాపుమాపున మేపుపజ్జకవణంపు మేపునఁ బిడుక గొఱపంబు తోమక్కంబునఁ బుటపుటనై కటియకంబడి వ్రాఁతఁ గని యైన నీడకని యైనం బెదరుకొదమతట్టువగుంపు కాలి కొలంకికి వ్రేలు లాలుకుంచెలు గీలించిన గవ్వదంటలగంటల నలంకరించి, మోలుగు మడ్డిం దోఁచి మూరకొక్కుంపును జేనకొక్కుంపునుగాఁ గుట్టిన డొల్లుటుల్లారు ఉల్లసిల్లం జల్లించిన పల్లంబులపైఁ జిల్లతైలంబును వాసనకొడుపులం బూనినమఱుంగుఁజంద్రికచేలలై రవణంబులుగా నెదురుగా వేడుకం జూడవచ్చిన యవ్వీటి మేటసాలె యగసాలెపటుసాలె వానె వైజాతిసాఁతు లేతులకొమిరెలు తుములమై వచ్చుతచ్చుమూసామజంబులం జూచి యేచిన వెఱం దమయెక్కుడింత లెక్కికొని వాగె లిరుగేలం గుదియంబట్టిన నిలువ కయ్యుత్సవం బీక్షింప వచ్చినప్రజలం ద్రొక్కుచుం బోవఁ, (4) దన్మధ్యవృద్ధవధ్వాతు

రాదులు తిట్ట నిట్టట్టనలేక ప్రాణంబులు పిడికిటం బట్టుకొని పోవుచు, నవీనసవిధ కేదారంబులం ద్రెళ్లి చట్టలు దిగంబడి వెడల లేకుండం దారు దిగ నిమ్ములేక యిమ్మటఁగొని నలుదెసలుం జూడం జూచి కేలు సఱచి కోహో యని గేలిసేయు గణికాకదంబంబుల చప్పటులు నిబిడనిష్కుటనికటపిరుహాటమ్ములం బ్రతిశబ్దంబులు పుట్టింప, (1) నిట్లనూనవిభవంబు చిగురొత్త నత్తిరుపతి సొచ్చి యచ్చక్రధరు నగరి మోసల నిలుచుటయు, నవ్విష్ణుచిత్తుండు దద్రథావతరణంబు చేసి ధరణీధవసమూహస్థానికవ్యూహంబు వెంటరా నవ్వైష్ణవుండు సేవించి, తత్ప్రసాదలబ్ధం బగు పరివట్టంబున నలంకృతుండై, నానాలంకార సహితంబును రత్నకాంచనమయంబునగు నాత్మీయభవనంబుం గాంచి విస్మితుం డై పుండరీకాక్షమహిమాభిలబ్ధవైభవంబు గాఁ దెలిసి తత్రత్యధాత్రీకళత్రవర్గంబుల ననిపి, ప్రవేశించి తొంటికంటె శత గుణంబుగా భాగవతపూజాప్రవణుం డై యుండె నంత. 31

టీ. (1) ఇట్లు=పూర్వోక్తప్రకారముగా, (స్థానికులు) ఎదుర్కొని = ఎదురుగా వచ్చి, పట్ట=తిరుప్పరివట్టమును, పవిత్ర=పావనము లైన, భగవత్ప్రసాద తీర్థంబులు=రంగ మన్నారుస్వామియొక్క యభిషేకోదకనిర్మాల్యాదులును, (ఇచ్చట గ్రంథకర్త 'అల్పాచ్తరం పూర్వ' మ్మని ద్వంద్వమునకు నిషేధ మున్నప్పటికిని 'లక్షణహేత్వోః క్రియాయాః' యనుజ్ఞాపిక సూత్రముచేతఁ బ్రయోగించియున్నాఁడు.) ఉపాయనంబులు కాన్ = కానుకలు కాఁగా, ప్రణామంబు లాచరించి = నమస్కరించి, లేచి= ఉత్థితు లై, ప్రాంజలు లై = చేతులు జోడించినవారై, భర్మ...బగు = భర్మ=బంగారుమయమైన, పరికర్మ = అలంకారముచేతను, వర్మితం బగు = సన్నద్ధమైన, బ్రహ్మరథంబునన్ = బ్రహ్మరథమందు (దీనిని బ్రాహ్మణులే పట్టుదురు.), అభ్యాగవతవతంసంబున్= భగవద్భక్త శిరోభూషణమయిన యావిష్ణుచిత్తుని, (ని. గాఙ్గేయం భర్మ కర్బురం, 'పరికర్మాఙ్గసంస్కారః', 'సన్నద్ధో వర్మితస్సజ్జః', 'పుంస్యుత్తంసావతంసౌ ద్వౌ కర్ణపూరేపి శేఖరే' యనియు నమరము.) ఉనిచి = ఉంచి, కొనిపోవు సమయంబునన్ = వేంచేపు చేసికొని వెళ్లుకాలమందు, పరస్పర...లగు,- పరస్పర = అన్యోన్యము, సమేతంబులగు= కలసియున్నటువంటి, పౌర...బులు-పౌర = పట్టణమందలి, జానపద = పల్లెలయందలి, జనంబులు=నరులు, కలసి = కూడికొని, మెలఁగి=వ్యాప్తమై, నడచునెడన్ = పోవునపుడు.

(2) మృదంగంబు = మద్దెల, ఉపాంగంబు=తిత్తి, ఆవజము = రుంజ, దండె= తంబుఱా, తాళంబు = లయకుసరిగావాయించు కంచువాద్యము, ఉరుమ = వాద్య విశేషము, కిన్నెర = తంత్రీవాద్యవిశేషము, సన్నగాళె = తిరుచ్చిన్నము, వీణె = విపంచి, ముఖవీణె = మోర్చింగు, వాసెగ్రోలు = పిల్లనగ్రోవి, డోలు = చర్మవాద్య విశేషము (డోల), నూరి = నాగసరమును, భేరి = దుందుభి ('భేరీ స్త్రీ దుందుభిః పుమాన్' అని యమరము.) గౌరు = కాహళి, గుమ్మెట = తుడుము, తమ్మెటంబు = డప్పు, డుక్క, చక్కి, డక్కి వాద్యవిశేషములు, చుయ్యంకి = తాళము ('తనరుం జుయ్యంకి కైముడి యనంగం దాళము'-ఆం. భా. 1-128) లోనగు=మొదలుగాగల, అసంఖ్యాత = లెక్కకుమిక్కుటమైన, (అంకాద్యదివాద్య త్రితయ మనియును పాఠము గలదు) వాది...లు-వాదిత్ర = వాద్యములయొక్క, త్రితయ = మూఁటియొక్క, పరంపరలు = సమూహములు, (ని. 'తౌర్యత్రికం నృత్తగీత వాద్యం నాట్యమిదం త్రయ' మ్మని యమరము.) మొరయన్ = ధ్వనిచేయఁగా,

(3) ఎడనెడన్=నడుమనడుమ, పడఁతుకలు = నాట్యస్త్రీలు, మలఁపుకొనన్-ఎమురుతిరిగి నాట్యముచేయఁగా, పట్టణా...ను - పట్టణ = నగరములనుండి, ఆగత= వచ్చినటువంటి, గజఘట్ట = ఏనుగుల సమూహముయొక్కయు ఘోట్టాణ=ఘోట్టాణ దేశమందుఁ బుట్టిన, ఘోటక = అశ్వములయొక్కయు, ఘంటాకదంబ = గంటల సమూహముయొక్క, ఘుర్ఘురఘోషంబులకున్ = ఘుర్ఘురధ్వనులకు, అనుప్రాసంబులై = అనుకరణములై, విలాసినీ...లు-విలాసినీ = స్త్రీలయొక్క, మంజు = సుందరములయిన, ('మనోజ్ఞం మంజుమంజుళ' మ్మని యమరము.) మంజీరంబులు = అందెలు, (మంజీరో నూపురో స్త్రియా' మ్మని యమరము.) ఎలుఁగియ్యన్ = ధ్వనిచేయఁగా, అల్లనల్లన్ = మెల్లమెల్లగా, చాగుతఱిన్ = నడచుసమయమందు,

(4) కెలంకులన్ = ప్రాంతములందు, కవచి...లగు - కవచిత = కంచుకము లుగాఁ జేయఁబడినటువంటి, కుథా = చిత్రకంబళములచేత, కర్బురలగు = చిత్రవర్ణము లయిన, (ని. 'ప్రవేణ్యాస్తరణం వర్ణః పరిస్తోమః కుథోద్వయోః' యని యమరము.) కరి...లన్-కరివర = గజశ్రేష్ఠములయొక్కయు, కరేణు = పిడియేనుఁగులయొక్కయు, కంధరలన్ = కంఠప్రదేశములయందు, (ని. 'కరేణురిభ్యాంస్త్రీ నేభ' యనియు,) 'కంఠోగళోఽథగ్రీవాయాం శిరోధిః కంధరేత్యపి' యనియు నమరము.) కనకాంకు శంబులు = బంగారపుఖ్ఖులు, చేఁబూని = చేతఁబట్టి, సేవించిపోవు = విష్ణుచిత్తు నను సరించిపోవుచున్నట్టి, సామంత...బులన్ - సామంత= తన దేశమును జుట్టికొని యున్న దేశములకు నధిపతు లైన, భూకాంత = రాజులయొక్క, కుమార =

దియం నగునట్లుగ, ఆ తన్ముఖ...ను - ఆ తన్ముఖ = ఆ విటులముఖ పర్యంతమును, ప్రేంఖోళిత = జోగినటువంటి, (సి. 'ఆజీవదర్థేభివ్యాప్తౌ సీమ్న్యర్థే ధాతుయోగజ' యనియు, 'ప్రేంఖోళిత స్తరళిత స్తులితాందోళితావపి' యనియు నమరము.) స్ఫీత = విశాలమైన, సాకూత = అభిప్రాయ సహితమైన, విభ్రమ = విలాసముగలిగిన, ఆకేకర= ఇంచుకంతయోరగా చూచుచున్నట్టి, అపాంగ = కడకన్నులయొక్క, (వి. 'విశాలం విపులం స్ఫీత' మని విశ్వ. 'అపాంగౌ నేత్రయో రంతౌ' అని అమర) విలోకనంబును= చూపులు గలుగునట్లుగా, ఆచలిత...గాన్ - ఆచలిత = ఇంచుకంత చలింపఁబడిన, ధమ్మిల్లంబును గాన్ = కొప్పుగలుగునట్లుగా, ('ధమ్మిల్లస్సంయతాః కచాః' యని యమరము.) మొగంబులు తిగిచికొని=ముఖంబులఁ ద్రిప్పికొని, సమ్మర్దంబునన్=సంఘమందు, చను...నన్ - చను = వెళ్లుచున్న, మార్దంగికుల = మద్దెలవాయించువారలయొక్క, మూపుల = భుజములయొక్క, మఱుఁగులన్ = చాటున, డాఁగి = అదృశ్య మై, అన్నాగవాసంబు = ఆవేశ్యాసమూహము, నాగరక...నన్ - నాగరక = ఆపట్టణపు జనులయొక్క, విలోకనంబునన్ = చూచుటచేతను, వెలరేఁగి = బిట్టురేఁగి, మొగంబులు = ముఖములు, బిగించి = ముడిచికొని, వేమరెత్తినగతిన్ = వెట్టెత్తిన రీతిని, ('వెడగువేదురు వెట్టి వేరడి వీరడి వెంగలి వెంబరవి త్తవంగ'నని యాంధ్రనామ సంగ్రహము.) అరిపి యెత్తన్ = ఆశ్చర్యమగునట్లు, (అరులెత్తన్ - అనుపాతమందు దరువుబట్టుట కని యర్థము) ప్రతిపదంబును = అడుగడుగునకును, మర్దల...కున్ - మర్దలముఖ = మృదంగముఖముయొక్క, అవమర్దనకున్ = వాయించుటకు, క్రుంగుటయున్=వంగఁగా, బయలువడి = బయటఁబడి, (మద్దెలకాండ్ర చాటున దాఁగియున్న వేశ్య లనుట) చేయునదిలేక = ఒనరించునట్టి యుపాయాంతరము దోఁచక, అకడకున్ మగిడి = నారంగాదుల వేయుచున్న విటులవైపునఁ దిరిగి, తుఱుము దిద్దుచున్=కొప్పు సవరించుచు, తద్వా...లు ఐ - తత్ = ఆ నారంగకందుకాదులయొక్క, వారణ = నివారించుటయందు, అభినయవత్ = వ్యంజకములోఁగూడిన, పరాచీన = పరాఙ్ముఖములైన, ('పరాఙ్ముఖః పరాచీన' యని యమరము.) కరాబ్జలై = హస్తారవిందములుగలవారై, సుడివడునెడన్ = తిరుగుచున్నసమయమందు, పొడను...లు - పొడము = కనుపడుచున్నటువంటి, కర్ణ కుసుమావతంస - కర్ణ = చెవులయందున్న, కుసుమ=పుష్పరూపమైన, అవతంస=భూషణముయొక్కయు, కపోల=గండస్థలములనియెడు, ఖురళీ = సాముచేయుప్రదేశములయందు, కించిత్ చలన=ఇంచుకంతకంపనముతో, ఉపలక్ష్య = కూడుకొన్నటువంటి, వైలక్ష్య = ఆశ్చర్యముతోఁ గూడినటువంటి, ('విలక్షో విస్మయాన్వితః' యని యమరము.) హాసకుందంబులు = మల్లెమొగ్గలవంటి నగవులు, సాంద్ర...

పుత్త్రులయొక్క, ఘట్టంబులన్ = సమూహములను, బిట్టుగాంచి = మిగులఁజూచి, ఒండొరుఁ...చున్ - ఒండొరున్ = ఒకరొకరిని, కడవన్ = అతిక్రమించుట కొఱకు, సంభ్రమించుచున్ = త్వరపడుచు, మ్రొక్కి = అంజలిఁ జేసి, నిక్కి = ఉబికి, చేయెత్తి = హస్త ప్రసారణముఁజేసి, ఒత్తిలి = ఒక పార్శ్వమున కొదిఁగి, నేత్రంబులు = కన్నులు, ఉత్తాన...గాన్ - ఉత్తాన = ఉబికినట్టియు, తరళ = చంచలమయిన, తారకంబులుగాన్ = కనీనికలు గలిగినవి కాఁగా, (కనుపాపలు గలిగినవికాఁగా ననుట.) (ని. 'నిమ్నం గభీరం గంభీర ముత్తానం తద్విపర్యయే, చఞ్చలం తరళం చైన తారకాక్ష్ణః కనీనికా' యనియు నమరము.) మగిడి మగిడి = ఎదురు తిరిగి తిరిగి, పొగడుచుం బోవుతఱిన్ = స్తోత్రమొనరించుచు వెళ్లుసమయంబున,

(5) తద్రాజకదంబకంబు = ఆరాజకుమారవర్గము, అచటిపడంతుకలకున్ = అక్కడ నున్న స్త్రీలకును, తమకున్ = తమకును, (వచ్చినవారి కనుట) పురికిన్ చను దెంచినపు డెల్లన్ = ఆ విల్లిపుత్తూరికి వచ్చినప్పు డంతయు, ఎదకాండ్రు అగుటన్ = కుంటెనకాండ్రగుటచేత, మేలమాడన్ = పరిహాసమాడుటకొఱకు, పోలు = తగిన, ఆ ప్రోలి...లన్ - ఆ ప్రోలి = అప్పట్టణమందలి, ('పట్టణంబున కాఖ్య లై బరగు చుండు, ప్రోలనఁగ వీడనంగను శూలపాణి' యని యాంధ్రనామసంగ్రహము.) మేళంపు = నాగవాసము గూడివచ్చిన, కళావతులన్ = వేశ్యలను, ప్రేయు నెపంబునన్ = ప్రేయునట్టి వ్యాజముచేత, గ్రామ...లు - గ్రామగ్రామ = ఊరూరి యొక్కయు, గ్రామణులు = గ్రామాధికారులు, (ని. 'గ్రామణీర్నాపితే శ్రేష్ఠః' యని యమరుఁడు.) ఒసఁగు...లన్ - ఒసంగు = తెచ్చియిచ్చిన, నారంగ = తీయనారింజ (కిచ్చిలి) పండ్లచేతను, మాతులుంగ = మాదీఫలములచేతను, జంబీర = నిమ్మపండ్లచేతను, కుందకందుకాదులన్ = మొల్లపూబంతులు మొదలగువానిచేతను, (ని. 'ఫలపూరో బీజ పూరో రుచకో మాతులుఙ్గకః' యనియు, 'స్యుర్జంబీరే దంతశఠః జంబ జంబీరజంభలా' యనియు, 'గేందుకః కందుకః' యనియు నమరము.) పూర్వానుభుక్తలు అగు = ముం దనుభవింపఁబడినటువంటి, నక్తం...లన్ - నక్తంకర = చంద్రునివంటి, ముఖులన్ = మోములుగలస్త్రీలను, వైవన్ = ప్రేయఁగా, (ని. 'నక్షత్రేశః క్షపాకరః' యని యమరము.)

(6) ధళధళ...ను-ధళధళత్ = తళతళమనునట్లుగా, తరళ = మెఱయుచున్న, తాటంకంబును = కమ్మలుగలిగినదియు, (ని. 'తాటంకః కర్ణపూరకః' యని యమరము.) అంకు...ను - అంకురిత = ఉదయించినటువంటి, స్మితంబును గాన్ = చిఱునవ్వుగల

లన్ - సాంద్రతరమైన = దట్టమైన, ('ఘనంనిరన్తరం సాంద్ర' మని యమరము.) చంద్రికా = వెన్నెలయొక్క, కందంబులన్ = మూలప్రదేశములను, దీటుకొలుపన్ = సామ్యమును బొందింపఁగా, ముఖము లనేకములు గాన బహువచనప్రయోగము.

(7) చాటూక్తి...లు - చాటు ఉక్తి=చతురవాక్యములచేతను, వాచాటలు = గర్వ్యావాక్యములు గలిగినవారు, (ని. 'వాచాటో బహుగర్వ్యావా' క్కని యమరము.) అగుజరఠవనితలు = ఆయినవృద్ధాంగనలు, ('జరఠౌ జీర్ణ కర్కశౌ' అని నానార్థరత్నమాల.) తమకున్ = ఆ విటులకు, మ్రొక్కన్ = నమస్కరింపఁగా, తారు = తాము, మ్రొక్కక = అంజలి గావింపక, ఒక్కించుక = ఇంచుకంత, ఓరమోమిడి=మాఱుమొగముచేసి, వారి...లన్ - వారి = ఆవృద్ధస్త్రీలయొక్క, ఇరుపక్కియలన్ - ఇరు = రెండైన, పక్కియలన్ = పార్శ్వములయందు, ఒదిఁగి= ఒత్తిగిలి, తొంటిఅంటున్ తలంచి=పూర్వపు సంబంధమును స్మరించి, తలవాంచినన్ = శిరస్సువంపఁగా, వంచనన్ = ఆరాజకుమారులు ఆస్త్రీలు నమస్కరింపని కపటమును, కటాక్షించి=చూచి, ఎక్కసక్కెంబునకున్ = పరిహాసమునకు, తమచేతన్ = ఆ స్త్రీల చేత, మ్రొక్కించుకొనువేడ్కన్=వందనము చేయించుకొనవలయు నను కుతూహలము చేతను, అక్కడన్=అస్థలమందు, పుడమిఱేఁడు లేమిన్=రాజు లేనందువలన, సామాన్య మానవులన్ = సాధారణ జనులను, కైకొనక = లక్ష్యపెట్టక, సుమాళంబు = మనోభావము, వేద్యంబు కాన్ = తెలియుటకొఱకు, విద్యావయోవృద్ధులరగు - విద్యా=గానాదులచేతను, వయః = వయస్సుచేతను, వృద్ధులరు = పెద్దవాండ్రు, అగు, మీరు మ్రొక్కన్=మీరు నమస్కరింపఁగా, తారు=తాము, (వయస్త్రీ లనుట.) మ్రొక్కమి ఎట్లు = నమస్కరింపక పోవుటెట్లు, మ్రొక్కింపుఁడు అనుటయున్ = మీరు నమస్కరింపఁ జేయుఁ డనుటయు,

(8) గ్రక్కునన్=శీఘ్రముగ, పొడము...లన్-పొడము=పుట్టుచున్న, మొక్కనగవులన్=హాసాంకురములచేత, మోముఁదమ్ములకున్ = ముఖపద్మములకు, వేఱొక్క వింతతేఁటియొక్కన్=మఱియొక యాశ్చర్యపుఁదేటి గనుపట్టఁగా, మ్రొక్కక = నమస్కరింపక, అక్కడన్=ఆ స్థలమందు, కెడగూడి=జతగూడి, నడచు=చనుచున్న, తోడిచేడియలకున్=సహవాసపుస్త్రీలకు, అద్దొరలకున్ = ఆ రాజకుమారులకును, తమకును = వారాంగనలకును, తద్దయున్ పొందు కలదు అను-తద్దయున్=ఎక్కువగా, పొందుకలదను=అనుకూల్యము గలదను, పెద్దతికంబు = గొప్పతనము, ఎఱుకపఱుపన్ = బయలుపఱుచుటకొఱకు, కెమ్మోవులు=ఎఱ్ఱనియధరోష్ఠములు, మలంచి = మడిచి, (పెదవులు విఱిచి యనుట) లోలోనన్=లోలోపల, ఒయ్యనొయ్యనన్ = మిగుల శీఘ్రముగను,

ఉచుక్కనన్=అనాదరశబ్దముచేయఁగా, (అనఁగా సాశ్చర్యకరమైన ధ్వని విశేషము చేయఁగా ననుట) అక్కలు ఎఱింగి=ఆజాడ దెలిసి, దక్కె సొమ్మని=ధనము దొఱకెనని, కమ్మన్=ఆస్త్రీలను, అమ్మమసఖ్లు=అవృద్ధవేశ్యలు, ముందటికి నూకి = అగ్రభాగమునకుఁ ద్రోచి, అక్కక్క=ఓయక్కక్క, (ఆదరముచేత ద్విరుక్తి) మన పాలివేలుపు = మన పాలిటిదైవము, మ్రొక్కవే=వందనముసేయుము, అని బుజ్జగించియున్ = మంచిమాట లాడియును, బొమలగోని = భ్రూసంజ్ఞచేతను, జంకించియున్ = వెఱపించియును, ఎట్టకేలకున్ = కొంతసేపటికి, ఒడంబఱచిరన్ = సమ్మతింపఁజేయఁగా,

(9) త్రపా...లై-త్రపా=లజ్జచేతను, తరళ=చంచలములైన, నయనలై = నేత్రముగలవారై, విరళ...గాన్ - విరళవిరళ=మిక్కిలి యెడములైన, అంగుళ = వ్రేళ్లుగల, అంజలిబంధంబుగాన్ = జోడింపఁబడిన చేతులు గలుగునట్లుగా, మ్రొక్కి = వందన మొనరించి, (విరళవిరళాంజలిబంధ మనియును పాఠము గలదు,) కక్కసంబునన్ = బహుసంకటముచేతను, అట్లు = అలాగున, మ్రొక్కించి = నమస్కారముచేయించి, హెచ్చి = అతిశయించి, అచ్చయ్యాటము ఎడపడక ఉండన్ = ఆసల్లాప మెడము గాకుండఁగా, జిగురుగుండెలుఁ బోలెన్=జిగురుగుండెలలాగున, (జిగురుగండె లనఁగాఁ బక్షులఁ బట్టుటకొఱకు నశ్వత్థక్షీరాదులచేత వండఁబడి వీనెలకుఁ బూయఁబడి యుండు పక్షిగ్రహణ యంత్ర విశేషములు) అల్లుకొని = చుట్టికొని, గొల్లనన్ అగు = గొల్లున హాసించుచున్న, అల్లోలాంగనలన్ = అవృద్ధవేశ్యలను, కల్లకోపంబునన్ = అబద్ధపుఁ గోపముచేత, (కొమరాండ్రు) కొట్టి=ప్రహరించి, కసరుఁజూపు = కోపదృష్టి, అబ్బాళ సంఘంబుపైన్ = ఆ రాజకుమార సంఘముమీఁద, నిగుడన్ = ప్రసరించునట్లుగా, మగుడన్ = మరలఁగా, మఱుపడు = అదృశ్యలగునట్టి, కొమిరె...నలు - కొమిరె = పిన్నవయస్సుగల, హరిణలోచనల = లేడికన్నులవంటి కన్నులుగల స్త్రీలయొక్క, చలిత...రంబు-చలిత = కదలింపఁబడిన, కంకణ = కరభూషణములయొక్క, సంకుల = సంకీర్ణములైన, (ని. 'సంకీర్ణం సంకులాకీర్ణే' యని యమరము.) క్రేంకారంబులు=క్రేంకారధ్వనులు, ఆననా...లన్-ఆననామోద-ఆనన = ముఖముయొక్క, ఆమోద=పరిమళమునకు, (ని. 'ఆమోదస్సోఽతి నిర్హారీ' యని యమరము. మేదుర=దట్టమైన, అళి= తుమ్మెదలయొక్క, ఝుంకారంబులన్ = ఝుంకారధ్వనులను, బింకంబులు అడంపన్ = గర్వముల నణఁపఁగా, తిరస్కరింపఁగా ననుట,

(10) చెవులసంకులు - చెవుల = కర్ణప్రదేశములయందలి, సంకులు = సంకు పూసలును, లోవంకభుజంబులున్ - లోవంక = లోపలికి వంగిన, భుజంబులున్ = బాహువులును, కొంకిసిగలు = వంకరకేశబంధంబులు, కావిదుప్పట్లున్ = చాయ

బట్టలును, ఒప్పన్ = అమరియుండఁగా, ఇమ్ము = స్వస్థలము, దెప్పరం బై = తప్పిపోయి, ముప్పునన్ = వార్ధక్యమందు, అప్పురంబు = ఆ శ్రీవిల్లిపుత్తూరు, చేరి = ప్రవేశించి, రసిక...నన్ - రసికజన = సజ్జనులయొక్క, బాంధవంబునన్ = సహవాసముచేత, బంధువియోగంబున్ = బాంధవుల నెడబాయుటను, మఱచి = విస్మృతిఁజెంది, గంధకల నా...లన్ - గంధకలనా = బుక్కాచేయుట, కుసుమస్రక్ = పుష్పమాలికయొక్క, గ్రథనాదులన్ = కూర్చుట మొదలగువానియందు, ఆంధ్యంబులేక = మాంద్యములేక, అలరు = ఒప్పుచున్నట్టి, ఆంధ్రదేశీయు లగు = తెనుఁగు దేశమందుండివచ్చిన, గంధ కారులు = బుక్కావాండ్రు, పాట...లోన్ - పాటపాటఁ = గొద్దిగొద్దియఁగు ('పాట, పాటయనఁ గొద్దిగొద్దియన్నాటచెలఁగు'-ఆం.భా. 3, 67) పద్యంపు = పద్యములోఁగూడిన, మ్రొక్కులలోన్ = దండములలోఁదను, వెట్టివెట్టికై వారంబులన్ = చేతులు సాచి చేయు పిచ్చిపిచ్చిస్తోత్రములలోను, గౌరు తత్తడులపైన్ వచ్చు = ఏనుంగులమీఁదను గుఱ్ఱములమీఁదను వచ్చెడి, రాచవారిపైన్ = రాజసంఘంబులమీఁదను, ఆఁడు వారిపైన్ = నాట్యమాడు స్త్రీలమీఁదను, ఆళువారిపైన్ = పెరియాళ్వారి (విష్ణుచిత్తుని) పైనను, చల్లగాన్ చల్లన్ = మిగుల నవకీర్ణము చేయఁగా, పెల్లెగసి = బిట్టెగసి, సృష్టి యెల్లను = సర్వజగమంతయును, ముష్టీకరించు = పిడికిటిపట్టున వ్యాపించిన, అస్పష్టభేద యగు = భేద మేర్పడకయున్న, పరిమళసముష్టిన్ పెట్టు = వాసనల నీనుచున్న, పిష్టాతకంబు = బుక్కాము, (ని. "పిష్టాతః పటవాసకః' యని యమరము.) నభోమండలికిన్ = అంతరిక్ష ప్రదేశమునకు, చందాతకంబై = అర్ధోరుక (చల్లాడ)మై, చండకరకిరణమ్ములన్ = సూర్య కిరణములను, మాటుపఱుపన్ = ఆచ్ఛాదింపఁగా, పన్నీరు నించిన = హిమాంబువులచే నిండించిన, ఆన్నీరు తిత్తులు ఒత్తన్ = (తన్నీరుతిత్తు లనియును బాఠము కలదు.) ఆపన్నీటి చర్మభస్త్రికలను బిగియఁబట్టగా, వియత్తలంబునన్ పాఱి = అంతరిక్షమునకెగసి, కైవ్రాలు = క్రిందుగా వంగుచున్న, ధారలన్ = ఉదకధారలచేతను, వాద్యంబులు = మృదంగాదులు, తడిసినన్ = క్లిన్నములుగాఁగా, విద్యోపజీవులు = విద్యా+ఉపజీవులు = ఆవాద్య విద్యలచేత జీవనము చేయువారు, పుష్కరంబులు క్రాఁపన్ - పుష్కరంబులు = వాద్యభాండముఖంబులు, క్రాఁపన్ = కాఁచుటకొఱకు, (ని. 'పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాణ్డముఖే జలే' అని యమరము.) అగ్గిరోయుచుండన్ = నిప్పును వెదకుచుండఁగా,

(11) అమ్మొత్తము = ఆసమూహము, అత్తఱిన్ = ఆసమయమందు, నృత్తంబుఁ జూడనిలిచి = నాట్యమాడుటను వీక్షింప నిలిచి, మెత్తమెత్తనన్ = మెల్లమెల్లగా, నడచు చుండు = అరుగుచున్నట్టి, మిండతండంబును = విటసమూహమును, తారున్ = తామును, అప్పిండు...లు - అప్పిండు = సమూహమందలి, పుండరీకాస్యలు = స్త్రీలు, అవతా

తఱిన్=సమయమును, కాంచి = చూచి, కాశ...లు-కాశకుసుమ = ఱెల్లుపువ్వుల యొక్క, ప్రతిఫలన = ప్రతిబింబించుటచేతను, పాండుర ములు=తెల్లనై, పద్యా... కము-పద్యా = మార్గములయందు, (ని 'హరిణః పాండురః పాండుః సరణిః పద్ధతిః పద్యా' యని యమరము.) అతిహృద్య=మిగుల మనోహరము లైన, పార్శ్వద్వయ = ఇరుప్రక్కలయందును, ఉద్యానపాదపములకున్ = ఆక్రీడావనమందున్న వృక్షము లకు, పాఱు...కున్ డిగ్గి - పాఱు = ప్రవహించుచున్న, చెంగలువ కాలువలకు డిగ్గి - చెంగలువ = ఎఱ్ఱకలువలుగల, కాలువలకున్ = సారణులకు, డిగ్గి = దిగి, కాసరీదధి మండ మాసరంబులుగాఁ బిసికి - కాసరీ=గేదలయొక్క. దధి=పెరుఁగుచేతను, మండ= మీఁగడచేతను, (ని. 'మండం దధిభవం మస్తు' అని యమరము.) మాసరంబులుగాన్ = దట్టముగాను, పిసికి=కలిపి, ఆరంబెట్టిన నారంగశృంగబేరభంగంబులతోన్ కట్టిన-ఆరం బెట్టిన = లవణములోఁ జేర్చి హాన్చి ఎండఁబెట్టిన, నారంగ = నారింజకాయల (నార దబ్బ కాయల)యొక్కయు, శృఙ్గబేర = అల్లముయొక్కయు, భంగంబులతోన్=తున కలతోడను, (ని 'ఆర్ద్రికం శృంగబేరం స్యా' త్తని యమరము.) కట్టిన = బంధించిన, కలమాన్నంపుఁజల్డి = రాజనపుఁ బర్యుషితాన్నము, ('మోస్తువిధ త్త్యేకవచనకేపుంపూ' అని శబ్దానుశాసనుఁడు సూత్రించినాఁడు గనుక కలమాన్న మనుచోట మకారమునకుఁ బుమాదేశము వచ్చెను.) పోకపొత్తులన్ = క్రముకపుపట్టలయందు, (పొత్తులన్=ఏక పాత్రలయందు,) కుడువన్=భోజనము సేయుటకు, కూర్చుండన్ = ఆసీనులు కాఁగా, వీక్షించి = (దాసరిగుంపు) చూచి,

(12) కుక్షింభరిత్వంబునన్ = ఉదరపోషణత్వంబుచేతను, క్షుత్క్షాము లై = ఆఁకలిచేతఁగృశించినవా రై, తిరిగితిరిగి =సంచరించి సంచరించి, వేసరి = విసికి, ఓసరి లిన = అలసినట్టి, దాసరిగుంపు = దాసర్లసమూహము, వారిపాలన్ = చర్గిగుడుచు విటులయొద్ద, గోపాలభిక్ష = అన్నభిక్ష, (దాసర్లు భిక్షకుఁబోవునపుడు గోపాలభిక్ష యని యడుగుట ప్రసిద్ధముగాన నిచ్చట గోపాలభిక్ష యని ప్రయోగించినాఁడు. మాధుకర మన్నట్లు) భిక్షించి = యాచించి, భక్షింపన్ = భోజనముచేయుటకు, తీర క్షోణిన్ = ఏటిదరినేలయందు, నిలిపిన = ఉనిచిన, తోరంపు = లావగు, దివెదారి కోలల = దీపపు కంబములయొక్క, (తిరువిళక్కాలను పాఠమున నిదె యర్థము.) రంధ్రగోళంబులన్ = సుషిరప్రదేశములనుండి, ఉల్కాలంబు లై = ఉద్గతజ్వాల లై, మండు = వెలుఁగుచున్న, ధగధగని = ధగధగమనియెడు, జగజ్జోతి దీపజాలంబులన్- జగజ్జోతి (యనఁగాఁ బ్రమిదెలు మొదలగువానియందు వత్తివేయక మధ్యప్రదేశ మందుఁ జమురుచేతఁ దడుపఁబడిన గుడ్డలులోనుగాఁ గలవాని నించి వెలుఁగించు దీపము),

దీపజాలంబులన్ = దీపసమూహములచేతను, ('జాలంగవాక్ష ఆనాయే క్షారకే కపటే గణే' యని విశ్వము.) మధ్య...ఱన్ - మధ్య = మార్గముయొక్క నడుమను వేసిన, ధూపకుండికాంగారంబులన్ - ధూప = ఉపచారార్థము వేసిన సాంబ్రాణి పొగయొక్క, కుణ్డికా = పాత్రలయందున్న, (ని. 'పుంసిచకుండః పీఠరేతోయాధారేచవహ్నిగర్తేచ, కుండో జారాజ్జాతస్సధర్తృకాయాంకమండలౌకుండీ' యని నానార్థరత్నమాల.) అంగారంబులన్ = అగ్నులయందు, (ని. 'అంగారోఽలాతముల్ముక' మ్మని యమరుఁడు.) నీరాఱన్ గ్రాఁచి-నీరాఱన్ = తడియాఱునట్లుగ, గ్రాఁచి = తప్తముచేసి, నాదున్ పరికింపన్ = ధ్వనిచూచుటకు, వాయించు = ధ్వనిఁజేయునట్టి, ధిమిధిమిధ్వానంబులకున్ = ధిమిధిమియను ధ్వనులకు, బెదరి = జడిసి, ఈవలియుపవన శుకంబులు - ఈవలి = ఇవతలి వైపున నున్న, ఉపవన = ప్రాంతోద్యానవనమందలి, శుకంబులు = చిలుకలు, ఆవలికిన్ = ఆవలి వైపునకును, ఆవలి యుపవనశుకంబులు = ఆవలి తోఁటయందున్న చిలుకలు, ఈవలికిన్ = ఇవతలికిని, దట్టంబుగాన్ = ఎడతెగకుండ, కట్టనితోరణంబులై = ఏర్పఱుపని మకరతోరణంబులై, పఱవన్ = వ్యాపింపఁగా, తలలు విసరుటయున్ = శిరఃకంపనములు చేయుటయును, (అభినయించునపుడు తలలు కదలుచుండు ననుట.) నోరు దెఱచుటయున్ = పాడుటకు వదనములు విప్పుటయు, కేలుసఱచుటయున్ = చప్పట్లు గొట్టుటయును, తక్కన్ = తప్ప, మిక్కుటంబగు = అతిశయమైన, ఆకోలాహలంబునన్ = ఆకలకల ధ్వనియందు, ('కోలాహలః కలకలః' యని యమరము.) ఏపాటియున్ = ఎంతమాత్రమును, పాట వినరాక = పాడుట వినఁబడక యుండఁగా, మూఁకగట్టిన = గుంపులై యున్న, భాగవతజాతంబులేతేరన్ - భాగవత = భగవద్భక్తులయొక్క, జాతంబులు = సంఘంబులు, ('ఉత్పన్నభూతయోర్జాతం బృందజాత్యోస్తునద్వయోః' యని యుత్పలమాల.) ఏతేరన్ = వచ్చుచుండఁగా,

(13) ఊరూరి సంతసంతకున్ - ఊరూరి = ప్రతిగ్రామముయొక్క, సంతసంతకున్ = ప్రతిసంతకును, (సంత యనఁగా వారమున కొకపర్యాయము సకల వస్తువులం జేర్చికొని యందఱకు విక్రయించుటయుఁ గ్రయమునకుఁ దీసికొనుటయు నిట్టి వ్యాపారమునకు నిర్ణయించుకొన్న ప్రదేశము.) తిరుగన్ = సంచరించుటకు, పెద్దలు = ప్రముఖులు, ఇంటింటన్ = ప్రతిగృహమందును, సంత...కున్ - సంతరించిన = పోషించిన, పిలుకవాటు = పిల్లలనిచ్చునట్టి, గోడిగలజావడములకున్ = ఆఁడుగుఱ్ఱపుతట్లకు, పుట్టి = జనియించి, కాలుగట్టివిడువన్ = పొడవైన త్రాటిచేఁ బాదబంధన మొనరించి విడువఁగా, నెత్తంబునన్ = ఊరిబీటియందు, మెత్తని = మృదువులైన, గఱిక మేసి = దూర్వను దిని, పొసరించి = పొగరెక్కి, మాపుమాపునన్ = ప్రతి సాయం

కాలమందును, మేపు = తినిపించుచున్న, సజ్జకవణంపు మేపునన్ = గంటెకోటి మేత చేతను, పిడుక = కరీష మను, గొఱిపంబు = గుఱ్ఱమును దోమునట్టి సాధనముచేత, తోమకంబునన్=శరీర శోధనముచేత, పుటపుటనై = నున్ననున్ననై, కలియకంబడి ప్రాఁతన్ కనియైనన్=నల్లకంబడి గుడ్డచూచినను, నీడఁ గనియైనన్=మనుష్యాదులనీడను వీక్షించినను, బెదరు = జడుపుఁగొనుచున్న, కొదమతట్టువగుంపు - కొదమ=లేఁతలైన, తట్టువ = గుఱ్ఱములయొక్క, గుంపు = సమూహము, కాలికొలందికిన్ = పాదముల పర్యంతము, వ్రేలు=లంబితములై యున్న, లాలుకుంచెలు=ఎఱ్ఱని కుచ్చులు, (లాలుకుంచె లనఁగా గంగెద్దులవాండ్రు చేతపట్టుకొనివచ్చు సౌరంపుకుచ్చు లని కొందఱు) కీలించిన= కట్టిన, గవ్వదంటలన్=వరాటికాసరములచేతను, గంటలన్=గంటలచేత, అలంకరించి= ప్రసాధనముఁ జేసి, మోలుగుమడ్డిం దోఁచి = మోదుగుచెక్క వేసి కాఁచిన నీళ్లతోఁ దడిపి, మూరకొక్కండును=హస్తప్రమాణమున కొకటియును, జేనకొక్కండునుగాన్ = అరమూర కొక్కటియును గలుగునట్లుగ, కుట్టిన=కుట్టఁబడిన, డొల్లుటుల్లారులు - డొల్లు ఉల్లారులు=వ్రేలుజాలరులు, ఉల్లసిల్లన్=వెలుఁగునట్లుగా, (మోదుగుచెక్క రసముచేతను రంగువేయఁగా, నలుపువర్ణము వచ్చునుగాన నెఱ్ఱని కుచ్చుల నడుమను వీని నొక్కటిని జేర్చి కట్టఁబడి యున్న జాలరుల ననుట.) పల్లించిన=ఆయితపఱిచిన, పల్లంబులపైన్= పల్యాణముల మీఁద, చిల్లతైలంబును = ఇడుగవగరును, వాసనకొడుపులన్ = పరిమళ యుక్తమైన శలాకలచేతను, పూసిన=లేపనము చేయఁబడిన, మణుంగు=చలువ చేయఁబడి నటువంటి, చంద్రికల చేలలె = తెల్లబట్టలె, రవణంబులుగాన్ = భూషణములుగాను, ఎదురుగాన్ =అభిముఖముగాను, వేడుకన్ చూడవచ్చిన = సంతోషముచేత వీక్షించు టకై వచ్చిన, అవ్వీటి...లె - అవ్వీటి=ఆ శ్రీవిల్లిపుత్తూరి యందున్న, మేటి=ప్రబలు లైన, సాలె = వస్త్రకారులును, అగసాలె = స్వర్ణకారులును, పటుసాలె = పట్నూలు వాండ్రు, వానె=హీనజాతి కోమట్లును, వైజాతి=పలుపవాండ్రును, సాఁతులు=గోనెలు నేయువాండ్రును, (అనఁగాఁ బెరికెవాండ్రనుట.) ఏతుల=చాఁపలు నేయువాండ్రును, వీరలయొక్క, కొమిరెలు=స్త్రీలు, (కొమరులు అను పాఠమున చిన్నవాండ్రని యర్థము. 'కొమలు' అని శ. ర. పా.) తుములమై = సంకులమై, వచ్చు...లన్ - వచ్చు = ఏతెంచుచున్న, తచ్చమూసామజంబులన్ చూచి=ఆ సేనయందలి యేనుంగుల వీక్షించి, (ని. 'పృతనానీకినీచమూః' అనియు, 'సామజః పేచకీ శూర్ప శ్రుతిర్ద్వ్యదణ్డ ఇత్యపి,' యనియు నమరము,) ఏచిన=అధికమైన, వెఱన్ = భయముచేతను, తమ=తమయొక్క, ఎక్కిరింతలెత్తికొని=అశ్వములు దమపై నున్నవారి నెత్తుకొని, వాఁగె లిరుగేలంగుదియం బట్టినన్-వాఁగెలు=కళ్లెములను, ఇరుగేలన్=రెండు చేతులచేతను, కుదియన్ పట్టినన్ =

బిగియఁ బట్టినను, నిఱువక=ఆ స్థలమం దుండకయె, ఆయ్యుత్సవం బీక్షింపవచ్చిన=ఆ తిరునాళ్లఁ జూడ నేతెంచినట్టి, ప్రజలన్ = మనుష్యులను, త్రొక్కుచున్, పోవన్ = పారిపోవఁగనె.

(14) తన్మధ్యవృద్ధవధ్వాతురాదులు - తన్మధ్య = ఆ త్రొక్కఁడుపడుచున్న వారి నడుమనున్న, వృద్ధ = ముదుసళ్లును, వధూ = స్త్రీలును, ఆతుర=రోగపీడితులును, ఆదులు=లోనగువారు, తిట్టన్ = శపింపఁగా, ఇట్టుఅట్టు అనలేక=మాఱుమాటాడలేక, ప్రాణంబులు పిడికిటం బట్టికొని = అరచేతిలో నుసురులంబెట్టికొని, పోవుచున్ = వెళ్లుచును, నవీన సవిధకేదారంబులన్ - నవీన=నూతనములైన, సవిధ = సమీపమందున్న, కేదారంబులన్=దమ్ముచేసిన వరిమళ్ళలోను, (ని. 'కేదారకంస్యాత్కైదార్యం క్షేత్రం కైదారకం గణే' యని యమరము.) త్రెళ్ళి=తుళ్లి, చట్టలు దిగంబడి = తొడలవఱకుఁ గ్రుంగిపోయి, (చప్పట లనియును పాఠము గలదు) వెడలలేకుండన్ = పైకి లేవకుండఁగా, తారు=తాము, దిగన్ = దిగుటకు, ఇమ్ము లేక = స్థలము గానక, పిమ్మటఁగొని= వ్యథపడుచు, నలుదెసలన్ = నాలుగు దిక్కులను, చూడన్ = వీక్షింపఁగా, చూచి= వారినిజూచి, కేలుచఱచి = చప్పట్లుగొట్టి, హోహో యని = హోహో యను పరిహాస వ్యంజకమగు ధ్వని విశేషముచేసి, గేలిసేయు = పరిహాసముఁ జేయుచున్న (తేరిచూచి హోయని గేలిసేయు నగ్నికాకదంబంబుల యని యొక పాఠము. నగ్నిక యనఁగా సమర్తాడనిది) గణికాకదంబంబుల = వేశ్యాసంఘములయొక్క, చప్పటులు = చేతులు తట్టుటలు, నిబిడనిష్కుటవిటపిఘాటంబులన్ - నిబిడ = దట్టమైన, నిష్కుట = ఉపవనములయొక్క, విటపి=వృక్షములయొక్క, ఘాటంబులన్=సమూహములందు, ప్రతిశబ్దంబులు = ప్రతిధ్వనులు, పుట్టింపన్ = ఇయ్యఁగా,

(15) ఇట్లు=ఇత్తెఱంగున, అనూనవిభవంబు = మహావైభవము, చిగురొత్తన్ = అంకురింపఁగా, ఆత్తిరుపతి = ఆ శ్రీవిల్లిపుత్తూరు, చొచ్చి=ప్రవేశించి, అచ్చక్రధరు= ఆ శ్రీమహావిష్ణునియొక్క, నగరిన్ = దివ్యమందిరముయొక్క, మోసలన్ = ముఖశాలయందు, నిలుచుటయున్ = ఉండఁగా, అవ్విష్ణుచిత్తుండు = ఆ పెరియాళువారు, తద్రథావతరణంబుఁజేసి = ఆ బ్రహ్మరథమును డిగ్గి, ధరణీధవ సమూహస్థానిక వ్యూహంబులు - ధరణీధవ = రాజులయొక్క, సమూహ = సంఘమును, స్థానిక = దేవస్థానాధికారులయొక్క, వ్యూహంబులు = సమూహములును, వెంటరాన్=వెంబడించి రాఁగా, అవ్వైకుంఠున్ సేవించి = ఆ స్వామిని దర్శనముచేసి, తత్ప్రసాదలబ్ధంబగు=ఆ పుండరీకాక్షుని యనుగ్రహమువలనఁ బొందఁబడినదైన, ('ప్రసాదస్తు ప్రసన్నతా, యని

యమరము.) పరివట్టంబునన్ = తిరుపరివట్టంబుచేత, అలంకృతుం డై = భూషితుం డై, నానాలంకార సహితంబును - నానాలంకార = అనేక విధములగు ప్రసాధనముల తోడ, సహితంబును=కూడికొనినదియును, రత్న=మణులయొక్కయు, కాంచన=బంగారముయొక్కయు, మయంబును నగు = వికారము నైన, ఆత్మీయభవనంబుఁ గాంచి = స్వీయగృహమును జూచి, విస్మితుం డై=ఆశ్చర్యము నొందినవాఁ డై, పుండ...గాన్- పుండరీకాక్ష = శ్రీమహావిష్ణునియొక్క, మహిమ = ప్రభావముచేతను, అభిలబ్ధ=పొందఁబడిన, వైభవంబుగాన్=ప్రాభవముగాను, తెలిసి=ఎఱింగి, తత్రత్య...ల్ - తత్రత్య= అచ్చట నున్న, ధాత్రీకళత్ర=రాజులయొక్క, వర్గంబుల్=సమూహములను, అనిపి = పంపి, ప్రవేశించి = గృహప్రవేశ మొనరించి, తొంటికంటెన్=మునుపటికంటెను, శత గుణంబుగాన్ = నూఱంత లధికముగా, భాగవతపూజాప్రవణుం డై - భాగవత=విష్ణు భక్తులయొక్క, పూజా=సపర్యయందు, ప్రవణుం డై=ఆసక్తి గలవాఁ డై, ఉండెన్ = ఉండెను. అంతన్ = తరువాత.

తా. శ్రీవిల్లిపుత్తూరిలో నుండు దేవస్థానమందలి యధికారులు నృత్తగీత వాద్యములతోడ నా విష్ణుచిత్తు నెదుర్కొని నమస్కరించి, యతనిం దాము తెచ్చిన స్వర్ణమయం బైన బ్రహ్మరథమునం దునిచికొనిపోవు తఱి మహావైభవంబులతో నందఱు వెంట నంటిరాఁగా నా విష్ణుచిత్తుండు పురము ప్రవేశించి కోవెల ముందఱ బ్రహ్మరథంబు డిగ్గి యచ్యుతుని సేవించి యాదేవుని యనుగ్రహంబున లబ్ధం బైన కాంచన నిర్మితంబగు తన గృహము ప్రవేశించి తొల్లింటికంటె నధికంబుగ భాగవతపూజా పరాయణుండై యుండె నని భావము.

మ. ఉలుపా ల్పట్టిన యిండ్ల మజ్జననృపార్హోదారభుక్తి క్రియో
జ్జ్వలులై రే హరికొల్వునన్ వివిధ లాస్యస్పర్ధిసుభ్రూభ్రుకుం
సులవాదు ల్సరి దీ(దే)ర్చి పుచ్చి మఱి వారసోభూషణ గ్రామముల్(న్)
జలజాతాక్షునకున్ సమర్పణము నిష్ఠం జేసి యవ్వేళువన్. 30

టీ. ఉలుపాల్పట్టిన = కానుకలు దెచ్చిన, ఇండ్లన్ = వారి గృహములయందు, మజ్జన...లు - మజ్జన = అభ్యంగాదులచేతను, నృపార్హ = రాజయోగ్యమైన, భుక్తి క్రియా=భోజనవ్యాపారములచేతను, ఉజ్జ్వలులు=వెలుఁగుచున్నవారలు, ఐ, రే=రాత్రి యందు, హరికొల్వునన్ = భగవత్సన్నిధానమందు, వివిధ లాస్యస్పర్ధి - వివిధ = పలు తెఱంగులైన, లాస్య=నాట్యములయందు, ('లాస్యంనృత్తంచనర్తన' మ్మని యమరము). స్పర్ధి = వివాదపడుచున్న, సుభ్రూ = స్త్రీలయొక్కయు, భ్రుకుంసుల = నర్తకుల

యొక్కయు, ('భృసంసశ్చ భ్రుకుంసశ్చ భ్రూకుంసశ్చేతి నర్తకః' యని యమరము.) వాదులు = వివాదములను, సరిదీర్చి = సరిపుచ్చి, (సమ్మతిపఱిచి యనుట.) పుచ్చి = అంపి, (ఇచ్చి యను పాఠమున వారికి బహుమతు లిచ్చి యని యర్థము.) మణివాసో భూషణ గ్రామముల్ - మణి = రత్నములును, వాసః = వస్త్రములును, భూషణ=ఆభరణములును, గ్రామముల్=ఊళ్లును, జలజాతాక్షునకున్ = పుండరీకాక్షునకు, నిష్ఠన్= భక్తిచేతను, సమర్పణముఁజేసి=సమర్పించి, అవ్వేళవన్=ఆ తెల్లవాఱుజామున. అరిగిరి యను ననంతర పద్యములోని క్రియతో నన్వయము.

తా. అప్పు డావిష్ణుచిత్తు ననుసరించి వచ్చియున్న పుడమిఱేండ్రు తమకుఁ గానుకలు దెచ్చి యిచ్చియున్న వారి గృహములయందు నభ్యంగస్నానములును రాజయోగ్యంబు లయిన భోజనకృత్యంబులం దీర్చికొని, రాత్రియందు భగవత్కైంకర్యాసక్తచిత్తులై యాదేవమందిరముల కరుగుదెంచి యం దనేకవిధ నాట్యములయందు వాదులిడుచున్న నర్తకీనర్తకుల వాదములు దీర్చి పుత్తెంచి యప్పుండరీకాక్షునకు నతి భక్తితోడం బ్రత్నరత్నభూషణాంబర గ్రామాదుల లొసంగి తెల్లవాఱఁగానే,

తే. ప్రభువు లరిగిరి క్రమ్మఱఁ బాండ్యనగరి
కమ్మునియు నట్లు వైష్ణవాభ్యర్చనంబుఁ
దనచిరంతనతులసికాదామకరణ
దాస్యమును జేసికొనుచుఁ దత్పరత నుండె. 37

టీ. క్రమ్మఱన్ = మరిగియు, ప్రభువులు = అధికారులు, పాండ్యనగరికిన్ = మధురకు, అరిగిరి=వెళ్లిరి, అమ్మునియున్=ఆ విష్ణుచిత్తుఁడును, అట్లు=పూర్వప్రకారము, వైష్ణవాభ్యర్చనంబున్ = భాగవతారాధనమును. తన...ను - తన=తనయొక్క, చిరంతన = బహుకాలమునుండి యొప్పియున్న, తులసికాదామ = తులసిమాలికలయొక్క, కరణ=చేయుట యను, దాస్యమును=కైంకర్యమును, చేసికొనుచున్ = సలుపుకొనుచు, తత్పరతన్ = భగవదాసక్తిచేతను, ('తత్పరే ప్రసితాసక్తౌ' అని యమరము.) ఉండెన్.

తా. అప్పు డా ప్రభువులు మధురాపురంబునకు మరల నేతెంచిరి. పిమ్మట మునివరుం డైన యా విష్ణుచిత్తుఁడు మునుపటియట్ల తాను భాగవతారాధనమును, చిరకాలానుష్ఠితం బై యున్న తులసీమాలికాకరణరూపం బగు భగవత్కైంకర్యమును జేసికొనుచు నా దేవునియం దాసక్తి గలవాఁ డై యుండెను.

వ. ఒక్కనాఁడు మధ్యాహ్న సమయమాలికా సమారోపణా నంతరం
బున మందిరంబునకుం బోవు నతనిం బ్రసాద మందస్మిత సుందరవదనుం

బగు కటాక్షంబున వీక్షించి పక్షిపుంగవకేతనుండు పుండరీకనికేతన
కి ట్లనియె. 38

టీ. ఒక్కనాఁడు=ఒకదినము, మధ్యా...నన్ - మధ్యాహ్నసమయ=మధ్యాహ్నకాలమందు, (ని. 'సమయా శ్శపథాచార కాలసిద్ధాంతసంవిద' యని యమరము.) మాలికాసమారోపణానంతరంబునన్=పుష్పమాల సమర్పణము సేసిన పిదప, మందిరంబునకున్ పోవు=తన గృహమునకు వెళ్లుచున్న, అతనికి=అవిష్ణుచిత్తుని, ప్రసాదమందస్మిత సుందరవళక్షంబు-ప్రసాద = అనుగ్రహముచేత నైన, మందస్మిత = చిఱునవ్వుచేతను, సుందర = అందముగా, వళక్షంబు = తెల్లనైనది అగు, (ని. 'వళక్షో ధవళో ఽర్జునః' యని యమరము,) కటాక్షంబునన్=కడకంటిచూపుచేత, వీక్షించి=చూచి, పక్షిపుంగవ కేతనుండు = గరుడధ్వజుఁడు, (భగవంతుం డనుట.) పుండరీకనికేతనకున్ = లక్ష్మితో, ఇట్లు = వక్ష్యమాణక్రమంబున, అనియెన్ = పలికెను.

తా. ఒక్కనాఁ డావిష్ణుచిత్తుఁడు మధ్యాహ్నకాలమున నిత్యము తాను పుష్పమాలికను స్వామికి నొసంగురీతిని సమర్పించి తనయింటికి వెళ్లుచుండఁగా, నప్పు డప్పక్షిపుంగవకేతనుం డైన విష్ణుదేవుం డతనిం దన కరుణాకటాక్షమునకుఁ బాత్రుంజేసి యాపద్మనికేతన యగులక్ష్మీదేవితో ని ట్లని వచించెను.

యామునాచార్యచరిత్రము

తే. 'యామునాచార్యుఁ డొక్కఁడు నీమహాత్ముఁ
డొక్కఁడును గాదె మన్మతం బుద్ధరించి
రస్మదీయకృపాతిశయమున' ననిన
నిందిరాదేవి తనభర్త కిట్టు లనియె. 39

టీ. యామునాచార్యుఁ డొక్కఁడు = యామునాచార్యుఁ డొక్కండును, ఈ మహాత్ముఁడొక్కఁడును = ఈవిష్ణుచిత్తుఁడొకఁడును, కాదె = వీరలిరువురే గదా, మన్మతంబు = శ్రీవైష్ణవసిద్ధాంతమును, అస్మ...నన్ - అస్మదీయ = నాసంబంధి యైన, కృపాతిశయమునన్ = దయాధిక్యముచేతను, ఉద్ధరించిరి = నిర్వహించిరి, అనినన్ = ఇట్లనఁగా, ఇందిరాదేవి = లక్ష్మీదేవి ('ఇందిరా లోకమాతా మా' యని యమరము) తన భర్తకున్ = తనకు భర్తయైన శ్రీమహావిష్ణువుతో, ఇట్టు లనియెన్ = వక్ష్యమాణ క్రమమున వచించెను.

తా. యామునాచార్యుం డను ఆళవందారును, విష్ణుచిత్తుండును, వీ రిరువురేగాక నాకృపకుం బాత్రులై వైష్ణవసిద్ధాంతం బుద్ధరించి రనఁగా విని యాలక్ష్మీదేవి తన భర్తయైన శ్రీవిష్ణుదేవునితో ని ట్లనియెను.

క. 'ఇతని కథయెఱిఁగినది కా
యతఁ డేమి యొనర్చె ?' ననిన నబ్జాక్షుం డా
శతపత్త్రనిలయ కిట్లను
నతివ కలం డొకఁడు మత్పదాశ్రితుఁ డాదిన్. 40

టీ. ఇతనికథ=ఈ విష్ణుచిత్తునిచరిత్రము, ఎఱిఁగినది కా = తెలియఁబడినదిగదా, అతఁడు=ఆయామునాచార్యుఁడు, ఏమి యొనర్చెన్=ఏమి చేసెను, అనినన్=ఇట్లు మందలింపఁగా, అబ్జాక్షుండు = పుండరీకాక్షుఁడు, ఆ శతపత్త్రనిలయకున్ = ఆ యిందిరాదేవికి, ఇ ట్లనున్ = ఈలాగునఁ బలికెను, అతివ = ఓ లక్ష్మీ, ఆదిన్ = తొలుదొల్తను, మత్పదాశ్రితుఁడు, మత్పద = నాచరణములను, ఆశ్రితుఁడు = ఆశ్రయించినవాఁడు, ఒకఁడు = ఒక్కండు, కలండు = ఉండెను.

తా. ఈ విష్ణుచిత్తుని చరిత్రం బెల్లఁ దెలియఁబడియున్నదిగాని యయ్యామునాచార్యుం డేమి యొనరించెనో తెలియఁబడదు గాన వివరించి తెలుపు మనవుఁ డప్పుడప్పుండరీకాక్షుం డాయబ్జాలయతో నోయింతీ యింతకుమున్ను మదీయచరణారవిందమరంద పాన ప్రముదిత హృదయుండై యొక్కరుం డుండె నని యానతిచ్చెను.

ఆ. అతఁడు చిఱుతనాఁడె యాచార్యకులమున
[1]వేఁకు వేదశాస్త్రవిద్య లభ్య
సించు చుండ నపుడు చెలువ యిప్పటిపాండ్య
నృపతి పూర్వవంశ్యుఁడే యొకండు. 41

టీ. అతఁడు = ఆ యామునాచార్యుఁడు, చిఱుతనాఁడె = పిన్నవయస్సుననే, ఆచార్యకులమున్ = గురుని గృహమందు, (ని. 'సభావాసః కులం క్షితిః' యని యమరశేషము.) వేదశాస్త్ర-వేద=శ్రుతులను, శాస్త్ర=షట్ఛాస్త్రములను, విద్యలన్ = కళలను, అభ్యసించుచుండన్ = నేర్చుకొనుచుండఁగా, (అనఁగాఁ జదువులు చదువఁగా ననుట.) చెలువ=ఓలక్ష్మీదేవీ, అపుడు=ఆ కాలమందు, ఇప్పటి పాఁడ్యనృపతి పూర్వవంశ్యుఁడే=ఈ పాండ్యరాజు వంశమునఁ బూర్వము జనించినవాఁడే, ఒకండు = ఒకరాజు.

1. వేదశాస్త్రముఖ్యవిద్య లభ్య.

తా. యామునాచార్యుఁడు బాల్యమందె గురుకులవాస మొనరించుచు వేద శాస్త్రాది నిఖిలవిద్యలు గఱచుచుండు నవసరంబున నిప్పటి పాండ్యరాజుయొక్క వంశజుఁ డగు పూర్వపు రాజులలో నొక్కరుఁ డుండెను. ఇక్కడ యామునాచార్యుని కంటె విష్ణుచిత్తుఁడు పూర్వుఁ డైనను యామునాచార్యుఁడు పూర్వుఁ డని భగవంతుఁడు చెప్పుటవలన లోకసంరక్షణార్థము భగవదవతారము లెట్లు పలుమాఱు కలుగునో అట్లే భాగవతావతారము లని యెఱుంగునది.

తే. వెఱ్ఱిశైవంబు ముదిరి మద్వినుతి వినఁడు,
నతి యొనర్పఁడు మామకప్రతిమలకును,
హరుఁడె పరతత్త్వ మను, మదీయాలయముల
నుత్సవంబుల కులుకు, నేయ్యురును నట్ల. 42

టీ. వెఱ్ఱిశైవంబు = చిత్తభ్రమరూపమైన శివభక్తి, ముదిరి=అతిశయించి, మద్వినుతి వినఁడు = నా స్తోత్రముల నాలకింపఁడు (అనఁగా జెవులఁబెట్టఁ డనుట.) మామక ప్రతిమలకును=నా సంబంధమైన విగ్రహములకును, నతి ఒనర్పఁడు = నమస్కరింపఁడు, హరుఁడె=శివుఁడె, పరతత్త్వము అనున్ = పరబ్రహ్మ మనును, మదీయాలయములన్ = విష్ణుమందిరములయందలి, ఉత్సవములకున్ = తిరునాళ్లకును, ఉలుకున్ = అదరి పడును, నెయ్యురును=అతని స్నేహితులును, అట్ల=ఆరాజువలెనే, (ఉలుకుదు రనుట.)

తా. ఆ రాజునకు వెఱ్ఱిశైవము ముదిరి విష్ణుస్తవములు చెవియందుఁ బెట్టక, విష్ణు విగ్రహములకు నమస్కరింపక, విష్ణుమందిరములయందు జరిగింపంబడు నుత్సవాదుల కసహ్యపడుచు, శివుఁడే పరబ్రహ్మ మని తాను తన స్నేహితులతోఁగూడ నివ్విధంబుగా నుండెను.

సీ. అశ్రాంత జంగమార్చా శ్రద్ధ (సక్తి) వర్తిలు
వేదవిద్ద్విజపూజ వీటిఁ [1]గలిపి;
భౌమవారపు వీరభద్ర పళ్లెర మిడు
గృహాశైవశంబు లిఱ్ఱింకు లింక;
షణ్ణవతిశ్రాద్ధచయ మారఁ బెట్టు శం
కరదాస మయ్య భక్తప్రతతికి
నాద్యంబు లైనదేవాలయంబులు ప్రాల
నవని నిరాశ మతాలి నిలుపు;

1. గలుపు.

తే. జందె ముత్తరశైవంబుఁ జెంది త్రెంచుఁ
బతితు లారాధ్యదేవళ్లెప్రాప్యు లనుచు
నుపనిషత్తులు వారిచే నుబ్బి వినుచు
వెండి యే జంగ మెత్తిన వెఱఁగుపడును. 43

టీ. వేదవిద్ద్విజపూజన్ - వేదవిత్ = వేదార్థ మెఱిఁగిన, ద్విజ = బ్రాహ్మణుల యొక్క, పూజన్=సపర్యను, వీటిఁగలిపి = వ్యర్థమగునట్లుచేసి, అశ్రాంతజంగమార్చాశ్రద్ధన్-అశ్రాంత=ఎడతెగని, జంగమ అర్చా=జంగములపూజయందు, శ్రద్ధన్=ఆసక్తిచేత, (అత్యంతజంగమార్చా శ్రద్ధ ననియును పాఠము కలదు. అందు, జంగమార్చయందు మిక్కుటమైన శ్రద్ధతో నని యర్థము.) వర్తిలున్=ప్రవర్తించును, భౌమ......ము-భౌమవారపు = అంగారకవారసంబంధి యైన, వీరభద్రపళ్లెరము = వీరభద్రపళ్లెర మను గణార్చనను (ప్రతిమంగళవారమునాఁడును వీరభద్రుఁడను ప్రమథాధిపతికి నైవేద్యము గొనిపోవు పెద్దపళ్లెరను,) ఇడున్ = ఒనర్చును, గృహదైవతంబులు = ఇలువేల్పులు, ఇట్టొరు లింకన్ = మిక్కిలి యింకిపోఁగా, (బెదరి ముడిగియుండఁగా నని కొందఱు, ఆపక్షమున నిట్టొరు లనఁగా జింకలు భయమునొంది దూరముగ వెళ్ల యత్నించుసమయమున, బెదరి ముడిగియుండు నవస్థావిశేష మని యర్థము.) షణ్ణవతిశ్రాద్ధచయము=తొంబదియాఱు తిథులు. (శ్లో. 'అమాయుగమనుక్రాంతి ధృతిపాతమహాలయాః, తిస్రోష్టకాశ్చ విజ్ఞేయా షణ్ణవత్యః ప్రకీర్తితాః) ఆరన్ = నశింపఁగా, శంకరదాసమయ్య = శంకరదాసమయ్య లని పేర్కొనంబడు, భక్తప్రతతికిన్ = శివభక్తుల సమూహములకు, పెట్టన్ = ఇడును, ఆద్యంబు లైన = పురాతనములగు, దేవాలయంబులు = కోవెలలు, వ్రాలన్ = పడిపోఁగా, అవనిన్ = భూమియందు, నిరా...శి-నిరాశ = జంగములకు, మఠాళి = సన్న్యాసులు మొదలగువారుండు గృహసమూహములు, నిలుపున్ = కట్టించును. (జంగమపీఠస్థులకు స్థిరంతు లనియును, మఱియు వారలకే చరంతు లనియు, లింగధారులయొక్క గురువులకు నయ్య లనియును వారిలో వ్యవహారము గనుక స్థిరాళిమఠాళి యను పాఠమున స్థిరంతుల మఠముల నని యర్థము.) జందెము = యజ్ఞోపవీతమును, ఉత్తరశైవంబున్ = పిమ్మట వచ్చిన శైవంబును, చెంది = అంగీకరించి, త్రెంచున్ = త్రెంచివైచును, పతితులు=వేదబాహ్యు లైన, ఆరాధ్యదేవళ్లె=ఆరాధ్య దైవతములె (అనఁగా లింగధారు లనుట.), ప్రాప్యులు అనుచున్ = పొందఁదగినవా రనుచును, ఉపనిషత్తులు = కాలాగ్నిరుద్రాద్యుపనిషత్తులను, వారిచేన్ = ఆ యారాధ్యులచేతను, ఉబ్బి = సంతోషించి, వినుచున్ = ఆలకించి వినుచును, వెండి = మఱియును, ఏ

జంగము = ఏ జంగమదేవరయైనను, ఎత్తినన్ = ప్రశంసచేసినను, వెఱఁగుపడున్ = ఆశ్చర్యపడును.

తా. అనఁగా నప్పాండ్యరాజు వైదికంబులగు కర్మముల మాని జంగాల సేవించుచు, వారు చెప్పు శైవశాస్త్రములనే యాచరించుచుండె నని ముఖ్యతాత్పర్యము.

క. శివలింగముఁ దాల్చినజన
[1]నివహము లేమైనఁ జేయ నిది పాపము తా
నవుఁ గా దనఁ డాసమయము
నవు నను విప్రులక యగ్రహారము లిచ్చున్. 14

టీ. శివలింగముఁ దాల్చిన = శివలింగముఁ గట్టికొనిన, జననివహములు=నరసమూహములు, ఏమైనఁజేయన్ = ఏపని చేసినను, తాన్ = తాను, ఇది = ఇట్లొనర్చుట, పాపము = దురిత మని, అవుఁగాదనఁడు = యుక్తమనిగాని అయుక్త మనిగాని చెప్పఁడు, ఆసమయమున్ = ఆయాచారమును, (ని. 'సమయాశ్శపథాచార కాలసిద్ధాంతసంవిద' యని యమరము.) అవునను విప్రులకె=అది యుక్త మని చెప్పుచున్న పుడమివేల్పులకే, అగ్రహారము లిచ్చున్ = గ్రామముల నొసంగును.

తా. మఱియు నారాజు లింగధారు లగు జనంబు లెటువంటి దుష్కృత్యము లొనర్చినను విచారింపక యుండుటయె కాక, యాశైవాచారము యుక్త మని తన యభిప్రాయము ననుసరించి పలుకుచుండు బ్రాహ్మణుల కగ్రహారాదుల నిచ్చుచుండెను.

తే. అతఁడు రాజ్యంబుఁ బాలించునవసరమునఁ
దనవశం బైన యట్టియత్తామ్రపర్ణిఁ
గలుగు నలపుట్టరాని[2]ముక్తామణివర
కులము మాహేశ్వరులకంధరలకుఁ దీటె. 15

టీ. అతఁడు = అప్పాండ్యరాజు, రాజ్యంబున్ = దేశమును, పాలించు నవసరమునన్ = ఏలుచున్న కాలమందు, తనవశంబైనయట్టి=తన యధీన మైన, అత్తామ్రపర్ణిన్ = ఆతామ్రపర్ణియనునదియందు, కలుగు...బు - కలుగు=జనించుచున్న, అల= ప్రసిద్ధమైన, పుట్టరాని = అపూర్వములైన, ముక్తామణివర = శ్రేష్ఠంబులగు ముత్తియములయొక్క, కులము=రాశి (మొత్తము), మాహేశ్వరుల కంధరలకున్ = లింగధారుల మెడలకు (వారి మెడలలోని రుద్రాక్షతావళములలో నడుమ నడుమ కూర్చుకొనుటకు),

1. నివహంబేమైన. 2. ముక్తామణీకులంబు మాహేశ్వరుల కంధలకును లీటె.

తీఱెన్ = సరిపోయెను, (కంఠలకును దీటై ననుపారమున బొంతలకు సరిపోయె నని యర్థము.)

తా. ఆరాజు రాజ్యపాలనం బొనరుప్చుతఱిఁ దనదేశమందున్న తామ్రపర్ణి యను నదియం దుత్పవించి యమూల్యంబు లై చెలంగుచున్న ముత్తియపురాసు లాలింగధారులకు హారము లయ్యె నని భావము.

తే. అప్పు [1]డిచ్ఛుకు లగుబ్రాహ్మణౌఘ మెల్ల
నాత్మజనిభూమి విడువలే కలికభూతి
గడ్డముల నాన రుదురాకలిడ్డ సంది
సూతసంహిత లిఱికించి చొరఁ దొడఁగిరి. 46

టీ. అప్పుడు=అక్కాలమందు, ఇచ్ఛుకులు అగు=ఇచ్ఛానువర్తు లైన, బ్రాహ్మణౌఘము ఎల్లన్ = విప్రులందఱును, ఆత్మజనిభూమిన్=తమజన్మభూమిని, విడువ లేక= త్యజింపఁజాలక, అలికభూతి - అలిక = ముఖమందలి, భూతి = భస్మము, గడ్డములన్= చుబుకప్రదేశములయందు, ఆనన్ = నిండఁగా, రుదు...దిన్ - రుదురాకలిడ్డ=రుద్రాక్షలుకట్టికొనిన, సందిన్ = సందిటియందు, సూతసంహితలు = సూతసంహితా గ్రంథములను, ఇఱికించికొని = ఉనిచికొని, చొరఁదొడఁగిరి = ప్రవేశింప నారంభించిరి. (ని. 'జనిరుత్పత్తి రుద్భవ' యనియు, 'లలాటమలికంగోధిః' అనియు, 'భూతి ర్భస్మని సంపది, యనియు నమరము.)

తా. అపుడు జన్మభూమియం దపేక్ష గలకొందఱు బ్రాహ్మణు లారాజుయొక్క యిచ్ఛానువర్తనము గలవార లై తమముఖములయందు గడ్డములవఱకు వ్యాపించునట్లు విభూతిఁబూసి రుద్రాక్షలు ధరించుకొని చంకలో సూతసంహిత యను గ్రంథము నిఱికించికొని యెదుటికి రా సాగి రని తాత్పర్యము.

క. శీలముఁ బట్టియు గంజా,హాల లుపాంశున భుజించునధముల బైటం
జాలఁడు వైవన్ విప్ర,స్థాలిత్యము [2]బైట వేసినకనుగిఱపు సభన్. 47

టీ. శీలమున్ = జంగమదీక్షను, పట్టియున్ = పూనియును, ఉపాంశునన్ = రహస్యముగా, గంజాహాలలు - గంజా = గంజాయిని, హాలలు = వివిధమద్యములను, భుజించునధములన్ = సేవించుచున్న నీచులను, బైటవైవన్ = బయలుఁబెట్టుటకు, చాలఁడు = శక్తిహీనుఁ డగును, విప్రస్థాలిత్యమున్ - విప్ర = బ్రాహ్మణులయొక్క, స్థాలిత్యమున్ = తప్పిదమును, బైటవేసి = ప్రకటనసేసి. సభన్ = కొలువుకూటమందు,

1. డిచ్ఛుకు లగుచు బ్రాహ్మణులు గొంద, తాత్మ. 2. బైలు సేసి.

కనుగిఱుపుక్ = హేళనముచేయుం మని సభ్యులఁ జూచి కనుసంజ్ఞ చేయుఁను. (ని. 'సురా హలిప్రియాహాలా' యనియుం, 'రహఃశ్చోపాంశు చాలిఙ్గ' యనియుఁ నమరము.)

తా. శైవదీక్ష వహించియుఁ రహస్యముగా గంజాయిఁ దిని మద్యపానముఁ జేయుచున్నట్టి భ్రష్టులను ఆపాండ్యరాజు పట్టి విచారించి శిక్షింపఁడు గాని, బ్రాహ్మణులకుఁ బ్రమాదముచేత సంభవించిన కొంచెపుఁదప్పిదములను సభయందు బయలుపఱచి సభ్యులం జూచి హేళనముచేసి యాక్షేపింపుఁ డని కనుసంజ్ఞఁ జేయుఁచుండును.

క. ఆరాజుమహిషి [1]నియతి మ,దారాధనపరత నుండు;ననట్లుండియు దు
ర్వారవ్యథకుం గానదు,పారము విభుఁ డస్మదంఘ్రిభక్తుఁడు కామిన్.

టీ. ఆరాజుమహిషి = ఆ పుడమిఱేనిపట్టపురాణి, నియతిన్ = భాగ్యముచేతను, మదారాధనపరతన్ - మత్ = నాయొక్క, ఆరాధన = పూజనమందు, పరతన్ = ఆసక్తిచేత, ఉండున్ = వర్తించును, ఆట్లుండియున్ = మద్భక్తురాలై యుండియును, విభుఁడు=ప్రియుఁడు, అస్మదంఘ్రిభక్తుఁడు కామిన్-అస్మత్ = నాయొక్క, అంఘ్రి= పాదములకు, భక్తుఁడు కామిన్ = భక్తుఁడు కాకుండుటంజేసి, దుర్వారవ్యథకున్ = మితిలేని మనోదుఃఖమునకు, పారమున్ = తుదను, కానదు = పొందదు.

తా. ఆ రాజుయొక్క భార్యమాత్రము తనసుకృతముచే నాసపర్యయం దనురక్తి గలది యై యుండియుఁ, దనమగండు నాకు భక్తుఁడు గాక యుండుటజేసి, తానపారం బగుదుఃఖసముద్రంబున మునింగియుండు.

వ. మఱియు నప్పురంధ్రీరత్నము. 49

టీ. మఱియున్ = ఇంకను, అప్పురంధ్రీరత్నంబు - పురంధ్రీ = సచ్చరిత్రగల వనితలలోపల, రత్నంబు = శ్రేష్ఠమైన యాపట్టపుదేవి.

సీ. వేంగడం బైనట్టి ముంగిట [2]నెలకొన్న
బృందావనికి మ్రుగ్గు వెట్టుఁదాన;
దశమినాఁ డేకభుక్తముఁ జేసి యవలినాఁ
డోర్చి జాగరముతో నుండు నిట్రు;
బారసి పోసీదు పైనిద్రఁ బొటుట
కల్లుపాదు మత్పుణ్యకథలఁ ద్రోయు;
సేవంపుమూనాళ్లు కామింప దధినాథు;
ప.ఱునాఁడు కన్నును మనసు దనియ

1. యని. 2. నిడికొన్న.

తే. నారజపువన్నెఁబతిసెజ్జ కరుగుఁ గూర్మి;
నరుగుచో నాభిఁ దుడిచి కప్పురపునాభిఁ
బెట్టు; నిట్టులు మద్భక్తి పుట్టియును ని
జేశునెడ భక్తి చెడదు మదిష్ట మగుట. 50

టీ. వింగడంబు ఐనట్టి=సుందరముగ నున్నయట్టి, ముంగిటన్=ముంగిలియందు, నెలకొన్న = పాదుకొనియున్న, బృందావనికిన్ = తులసీవనమునకు, తాన = తాను, ముగ్గువెట్టున్=రంగవల్లినిడును, దశమినాఁడు=దశమిదివసమందు, ఏకభుక్తమున్ చేసి= ఒక్కప్రొద్దుండి, ఆవలినాఁడు = మఱుచటిదినము, (అనఁగా నేకాదశియం దనుట.) ఓర్చి=సహించి, జాగరములోన్ = నిద్రలేమిలోఁదను, నిట్రుఉండున్ = ఉపవాసముందును, బారసి=ద్వాదశీవ్రతము, పోనీదు = విడువదు, పై నిద్రన్ = పారణానంతర మందుఁగలుగునిదురను, పాఱుటక్కలు పాడు = బ్రాహ్మణస్త్రీలు పాడునట్టి, ('పాఱుఁ డనఁగఁ బుడమివేల్పు బాఁపఁ డనఁగ' నని యాంధ్రనామసంగ్రహము.) మత్ = నా యొక్క, పుణ్యకథలన్ = పవిత్రకరంబు లగుచరిత్రములచేతను, ద్రోయున్=కడపును, నేమంపుమూనాళ్లు-నేమంపు = నియమమైన, మూనాళ్లు = దశమి యేకాదశి ద్వాదశి యను మూఁడు దివసములును, అధినాథున్=పెనిమిటిని, కామింపదు=కోరదు, మఱు నాఁడు = ఆ మూఁడురోజులు కడచినవెనుక, కన్నులు = నేత్రంబులు, మనస్సు=మనంబును, తనియన్ = ఆనందించునట్లు, ఆరజపువన్నెన్ - ఆరజపు = మనోహరమైన, వన్నెన్ = సింగారములోఁదను, పతి = ప్రియునియొక్క, సెజ్జకున్ = పానుపుమీఁదికి, కూర్మిన్=ప్రేమచేత, అరుగున్ = వెళ్లును, అరుగుచోన్=ప్రియునిం గలయుటకు వెళ్లునపుడు, నాభిన్=నిడుపుగఁబెట్టిన కస్తూరిబొట్టును, తుడిచి=తీసివేసి కప్పురపునాభిన్= కర్పూరపుబొట్టును, పెట్టున్ = పెట్టుకొనును, (విభూతిచుక్క యని పెనిమిటి కగపడున ట్లనుట.) ఇట్టులన్ = ఇవ్విధంబుగ, మద్భక్తిపుట్టియును=నాయందుఁ బూజ్యానురాగ ముదయించియును, నిజేశునెడన్ = తనభర్తయందు, భక్తి చెడదు=అనురాగము విడువదు, మత్ ఇష్టము అగుటన్=నాకిష్టమైనయదియగుటచేతను, (స్త్రీలు పతివ్రతలై యుండుట తమ కిష్ట మని తెలిసి యామె పతిభక్తి విడువ దనుట.)

తా. మఱియు సచ్చరిత్రలు గలవనితారత్నంబైన యారాణియు, విశాలంబైన నగళ్లయొక్కముంగిళ్లయందు నెలకొనియున్నతులసీవనమందుఁ దాన ముగ్గులు పెట్టుచు దశమినాఁ డొక్కప్రొద్దుండి యేకాదశిని శుద్ధోపవాసజాగరణములచేతఁ గడపి ద్వాదశినాఁడు పారణ యొనర్చి బ్రాహ్మణస్త్రీలు పాడుచున్న విష్ణుస్తోత్రపాఠములచేత నిదురపోకయు ప్రొద్దుపుచ్చి యామూఁడురాత్రులు పతిసంభోగముఁ గోరక

నియమముచేత ని ట్లేకాదశీవ్రత మాచరించి, యామునుఁడు ప్రియుఁ డుత్సహించునట్లు కన్నులపండువై సొబఁగైయున్న యలంకారమునఁ జెలంగుచు నత్యంతప్రీతితోఁ దంగాంతునిఁ గూడం దలంచి పోవునవసరంబున ముందుఁ దనముఖంబున నిలువుగ నునిచికొనియున్న కస్తూరీతిలకమును దుడిచి, శైవదీక్ష వహించియున్న తనభర్తవిభూతి యని యుత్సహించునట్లు కర్పూరములోఁ జుక్కబొట్టు పెట్టి పతిశయ్యం జేరును. నాయంది ట్లద్భుతం బైనభక్తి జనించియును స్త్రీలకుఁ బతివ్రతాధర్మం బత్యంతాదరణీయం బని మచ్ఛాసనంబు నెఱింగియు పతిభక్తియందు మిగుల ననురక్తురా లై యుండె నని భావము.

క. వనజజరుద్రాదులు మ, త్తనువుల; తత్పూజనంబు ౹ తథ్యము మత్పూ
జనమ; తదీప్సితఫలదా,తను [1]నేన యట్లైనఁ గలవు ౹ తరతమవృత్తుల్.

టీ. వనజజరుద్రాదులు=బ్రహ్మయు రుద్రుఁడు మొదలగువారు, మత్తనువుల = నాశరీరములే, తత్పూజనంబు-తత్=వారలయొక్క, పూజనంబు=అర్చించుట, మత్పూజనమ = నన్నుఁ గూర్చి యొనర్చినపూజయే, తథ్యము = యథార్థము. తదీ...ను - తత్ = ఆ ట్లాబ్రహ్మరుద్రాదులను బూజించువారలయొక్క, ఈప్సితఫల = ఇష్టసిద్ధులకు, దాతను = ఇచ్చువాఁడను, నేన = నేనే, అట్లైనన్ = అలాగైనప్పటికిని, తరతమవృత్తుల్ = హెచ్చుతగ్గులు, కలవు = కలిగియుండును.

తా. ఈశానుఁడు, బ్రహ్మ లోనగువా రందఱును నాశరీరంబు లగుటంజేసి వారల నారాధించినయెడ యథార్థముగ న న్నారాధించినట్లు సంతసించి య ట్లొనర్చిన మనుజులకు నభీష్టార్థముల నిచ్చువాఁడను నేన యైనను నాకును వారలకును దారతమ్యము గలదు.

క. కేవలశరీరదృష్టిన, దేవతల న్వేఱ కలుగఁ ౹ దెలిసినజడులన్
నావాసుదేవతాస్థితి, భావింపనిపూజ సాంత ౹ ఫలమై త్రిప్పున్. 12

టీ. కేవలశరీరదృష్టిన-కేవల=ముఖ్యముగ, శరీర=ఇతరదేవతల శరీరములయొక్క, దృష్టిన = చూచుటచేతనే, దేవతలన్ = అస్మచ్ఛరీరభూతు లైన యితరదేవతలను, వేఱ కలుగన్ = ప్రత్యేకముగ నున్నట్లు, తెలిసినజడులన్=ఎఱిఁగినయజ్ఞానులను. నావాసుదేవతాస్థితి-నా = నాయొక్క, వాసుదేవతా = వాసుదేవత్వముయొక్క, శ్లో.

1. నేనె యట్లైన; నే నట్లైన—తనువుల, జనమ, నేన అని యవధారణాంతములు చేసి, అవధారణాంతముల కచ్చు పరమగునపుడు సంధి లేదను సూత్రమున కీ రూపము విరోధము.

'సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతి వై యతః, అతోఽస్య వాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే' అని విష్ణుపురాణము. స్థితిన్ = ఉంటను, భావింపని,=తలంపని, పూజ = ఆరాధనము, సాంతఫలమై - సాంత = అంతముతోఁగూడిన, ఫలమై = ఫలముగలదై, త్రిప్పున్ = మళ్లించును.

తా. ముఖ్యముగ నితరదేవత లందఱు నా శరీరంబులే, కాన నట్టిదేవతలు నాకు వేఱుగా నున్నవా రనియును, ప్రత్యేకఫలప్రదు లనియును, దెలిసికొనియున్న యజ్ఞులకు నా వాసుదేవత్వస్థితిని దెలియనిపూజ యల్పఫలప్రదాయకమై యనేక జననమరణ రూప దుఃఖములం ద్రిప్పుచుండు నని భావము.

వ. మఱియు నీరహస్యంబుఁ దెలియ కబ్భూపతి తామసుం డై మామకీనంబు లగు జనంబుల సామాన్యబుద్ధిం జూచుచుఁ దద్వృత్తుల కగు నుపద్రవంబుల నుపేక్షించుచు రక్షావిముఖుం డై యుండ వీక్షించి కలియుగంబున ద్రవిడమండలంబునఁ గృతమాలాతామ్రపర్ణీతటంబుల మద్భక్తులు తఱ చగుటను దద్దేశంబున కొఁడయం డతం డగుటను రక్షణశిక్షణంబులు రాజముఖంబునం గాక నేన సాక్షాత్కరించి చేయమియుఁ దద్రక్షణేచ్ఛ యస్మదాభిముఖ్యంబునం గాని పొడమమియు నాయాభిముఖ్యంబు సంవాదంబునం గాని పుట్టమియు నే విచారించి తదాభిముఖ్యకరణార్థంబుగ నాస్థానం బెక్కి వాదిజయంబు సేయవలయు నను తలం పవ్విప్రకుమారునకుం బుట్టింప నతం డేఁగి నానాదేశాగతవీతానాథవృద్ధభూసురకుటుంబంబులకు ధాన్యాజినపటాదులు వటువులకుం బెండ్లిండ్ల కనుపనీతుల కుపనయనంబులకుఁ బంగ్వంధబధిరాదులకు పౌరథేయాదియానంబులు మఱియుఁ జెఱువు గడమఁబడియె ననియుఁ దేవగుడులకుఁ బూజ నడువ దనియు నెడవునం జలిపంది రిడియెద మనియుఁ దిథి చిక్కె ననియుఁ దీర్థయాత్రఁ జనియెద మనియును వ్రతోద్యాపన కనియును వ్యాధి మాన్పుకో ననియును జెప్పి పంప నారాణివాసంబు గుప్తాగుప్త ప్రకారంబులం బంపు ద్రవ్యంబుఁ దెచ్చి యిచ్చుముదుప ళ్లగు వర్షధరులచేతులకుం గ్రందుకొని చే సాఁచిన సందిటితోరణంబులై తోఁచు నేకదండి త్రిదండి బ్రహ్మచారుల యున్న మితదండంబులనిండారు కాషాయకద్రువస్త్రకౌపీనపరంపరలం గ్రమ్మి *కావళ్లపడగలఁ జాడఁ

---

* కావళ్లపడగల జడగొని.

గాని కేవలకార్పణ్యంబ విద్యగాఁ దక్కినవిద్య లెఱుంగక వేదు నీదృగ్విధానేకప్రాణుల కాధారం బగు పడమటిద్వారంబుఁ జేరి ప్రతి దినాస్మత్పాదభజనకథా శ్రుతపూర్వ యగునాయుర్వీధవుదేవి కాశీ ర్వచనాక్షతంబులు దౌవారికముఖంబునం బంపి వైదేశికుండ వైష్ణవ వటుండ వాది గలిగిన విష్ణుతత్త్వంబె పరతత్త్వం బని వాదించి గెలి చెద వసుధావరుండు విష్ణుభక్తివిముఖుండు గావున వైష్ణవునిమనవి విన్నవింప నెవ్వరు వెఱతురు నీవు విష్ణుభక్తిపరాయణవు పతిహితా చారవుం గావున నీకు విన్నవించి పంపితి నీవిభుఁడు నీకు విధేయుండు విన్నవించి నన్ను రప్పించి వాదంబు సేయింప నోపుదేని వాదించి గెల్చి నీదుభర్తకు భగవద్భక్తిఁ బుట్టించి కృతార్థుం గావించెద నని విన్నవింపం బంచిన. 53

టీ. మఱియున్, ఈరహస్యంబున్ = సర్వము నే ననియెడి యేకాంతమును, తెలియక=ఎఱుంగక, అబ్జాపతి=ఆరాజు, తామసుండై=తమోగుణముగలవాఁడై, మామ కీనంబులగు=మద్భక్తులైన, జనంబులన్ = మనుజులను, సామాన్యబుద్ధిన్ చూచుచున్= సాధారణజను లని తలంచుచు, తద్వృత్తులకున్-తత్=ఆభక్తులయొక్క, వృత్తులకున్= మాన్యక్షేత్రాదులకు, అగు నుపద్రవంబులన్ = కలిగినబాధలను, ఉపేక్షించుచున్=నివ ర్తింపఁజేయక, రక్షావిముఖుండై=పాలించుటకుఁ బరాఙ్ముఖుండై, ఉండన్=వర్తించు చుండఁగా, వీక్షించి = చూచి, కలియుగంబునన్ = కలికాలమందు, ద్రవిడమండలం బునన్=అరవదేశమునను, కృతమాలాతామ్రపర్ణీతటంబులన్ - కృతమాల=కృతమాల యను నదియొక్కయు, తామ్రపర్ణీ=తామ్రపర్ణీయనునదియొక్కయుఁ, తటంబులన్ = తీరములయందు, మద్భక్తులు = నాకు దాసులైన భాగవతోత్తములు, తఱచు అగుటన్ = విస్తరిల్లియుండుటచేతను, శ్లో. 'కలౌ ఖలు భవిష్యంతి నారాయణపరాయణాః, క్వచి త్క్వచిన్మహాభాగ ద్రావిడేషు చ భూరిశ' యని శుకయోగీంద్రునివచనము. తద్దేశంబు నకున్ = ఆదేశమునకు, ఒడయండు = రాజు, అతం డగుటన్ = ఆ పాండ్యరా జగుటచేత, ('ఒడయఁ డేలిక యొకిమీఁదు పుడమి ఱేఁ' డని యాంధ్రనామసంగ్ర హము,) రక్షణశిక్షణంబులు రక్షణ=పాలించుటయు, శిక్షణంబులు=శాసించుటయును, రాజముఖంబునన్ కాక = పార్థివునివలననేకాని, నేన = నేనే, సాక్షాత్కరించి= ప్రత్యక్షమై, చేయమియున్ = చేయకుండుటయును, తద్రక్షణేచ్ఛ - తత్=ఆభగవ

ద్భక్తులయొక్క, రక్షణేచ్ఛ = పాలనాభిలాషము, అస్మదాభిముఖ్యంబునంగాని - అస్మత్ = నాయొక్క, అభిముఖ్యంబునన్ కాని = సన్నిధియందేకాని, పొడమ మియ్యఁన్ = పుట్టమియును, నాయాభిముఖ్యంబు - నా=నాయొక్క, అభిముఖ్యంబు= అనుకూల్యము, సంవాదంబునన్ కాని=సంవాదాత్ప్రామాణ్యం బను న్యాయముచేతనే కాని, పుట్టమియఁన్ = జనింపకుండుటయును, విచారించి = తలపోసి, తదాభిముఖ్యకరణార్థంబుగన్ - తత్=ఆరాజుయొక్క, అభిముఖ్య=అభిముఖుఁ డగుటయొక్క, కరణార్థంబుగన్=చేయుటకును, ఆస్థానంబు ఎక్కి=సభను ప్రవేశించి, వాదిజయంబు-వాది = వాదులయొక్క, జయంబు = గెలుపును, చేయవలయున్ = ఒనరింపవలయును, అను= అనునట్టి, తలంపు = ఆలోచనను, అవ్విప్రకుమారునకున్ = ఆబ్రాహ్మణవటువునకు, పుట్టింపన్ = జనింపఁజేయఁగా, అతండు = ఆవిప్రుఁడు, ఏఁగి = వెళ్ళి, నానా...కున్ - నానాదేశ ఆగత = బహుదేశములనుండి వచ్చినట్టియు, దీన = దరిద్రులైనట్టియుఁ, అనాథ = దిక్కులేనట్టియు, వృద్ధ = వృద్ధులైనట్టియు, భూసురకుటుంబములకున్ = బ్రాహ్మణసంసారులకు, ధాన్యాజినపటాదులు = ధాన్య = వడ్లును, అజిన = కృష్ణాజినములను, పటాదులు = వస్త్రములు లోనగువానిని, వటువులకున్ = బ్రహ్మచారులకు, పెండ్లిండ్లకును = వివాహములకును, అనుపనీతులకున్ = జందెములేనివారికి, ఉపనయనంబులకున్=ఉపనీతులుగా నొనర్చుటకును, పంగ్వంధబధిరాదులకున్ - పంగు=కుంటు, అంధ=గ్రుడ్డు, బధిర=చెవిటివాండ్రు, ఆదులకున్=మున్నగువారికి, సౌరభేయాదియానంబులును = ఎడ్లు మొదలగు వాహనంబులును, (సురభి యనఁగాఁ గామధేనువు; దాని వలనఁ బుట్టినది. సౌరభేయ మనఁగా నెద్దు; అది మొదలైనవి యని విగ్రహార్థము.) మఱియున్ = వెండియును, చెఱువు కదమఁబడియె ననియున్=చెఱువుల గుంటల పని ముగియకున్న దనియుఁ, పేదగుడులకున్ పూజ నడువ దనియున్=బీదవడి యున్న దేవాలయములోని దేవతలకు ధూపదీపనైవేద్యాదులకు లేకయున్న దనియుఁ, ఎడవునన్ = ఎడారిని, చలిపంది రిడియెద మనియున్ = పానీయశాల నేర్పఱిచెద మనియుఁ, తిథి = పైతృకము, చిక్కును అనియున్=దిగఁబడు ననియుఁ, తీర్థయాత్రన్ చనియెదము అనియున్=పుణ్యతీర్థంబుల సేవించుటకు వెళ్లెద మనియును, వ్రతోద్యాపన కనియున్ = శాస్త్రసిద్ధకర్మంబులఁ దుదముట్టించుట కనియును, వ్యాధిమాన్పుకో ననియున్ = రోగము బోఁగొట్టుకో ననియును, చెప్పిపంపన్ = వాక్రుచ్చి యంపఁగా, ఆరాణివాసంబు = రాజుదేవి, గుప్తాగుప్తప్రకారంబులన్ - గుప్త=రహస్యమైనట్టియు, అగుప్త = ప్రకటమైనట్టియు, ప్రకారంబులన్ = రీతులచేతను, పంపుద్రవ్యంబుల్ - పంపు = అనిపినట్టి, ద్రవ్యంబుల్ = సామగ్రులను, తెచ్చి = తీసికొని వచ్చి

ఇచ్చు...కుఁ - ఇచ్చు = ఇడుచున్నయట్టి, ముదుసళ్ళగు = వృద్ధులైనట్టి, వర్షధరుల = షండులయొక్క, చేతులకుఁ = హస్తములకు, క్రందుకొని = సందడిగొని, చేసాఁచిన = హస్తప్రసారణము చేయుచున్న, సందిటితోరణంబులై = సందిళ్ళతోఁ గట్టిన తోరణములై, తోఁచు...లన్ - తోఁచు = కనఁబడుచున్న, ఏకదండి = స్మార్తసన్న్యాసులయొక్కయు, త్రిదండి = వైష్ణవసన్న్యాసు లనఁగా జియ్యరులయొక్కయు, బ్రహ్మచారుల = వటువులయొక్కయు, ఉన్నమిత=ఎత్తఁబడ్డ, దండంబులన్=కఱ్ఱలయందు, నిండా...లన్ = నిండారు = వ్యాపించుచున్న, కషాయ=ఎఱ్ఱనైనట్టియు, కద్రు = పచ్చనైనట్టి, (ని. 'రాగద్రవ్యేకషాయోస్త్రీ నిర్యాసే పారదే రసే, పిశఙ్గా కద్రుపిఙ్గళౌ' అని యాదవామరములు.) వస్త్రకాపీన పరంపరలన్ - వస్త్ర = శాటులయొక్కయు, (దండములకుం గట్టు ముద్రవస్త్రము లనుట.) కాపీన = గోఁచులయొక్కయు, పరంపరలన్ = సమూహములచేతను, క్రమ్మి = కప్పి, కావళ్ళపడగలజాడఁగొని - కావళ్ళ = కావలియున్న స్థానములందలి, పడగల = టెక్కెములయొక్క, జాడఁగొని = వైఖరిఁదెలిసి, (కావళ్ళ = వివధములయొక్క, పడగల = కొసలవలెను, జడగొని = మెలికలుగొని,) కేవలకార్పణ్యంబ = ఒక్క దీనత్వమే, విద్య కాన్ = చదువుగా, తక్కిన విద్య లెఱుంగక = వేఱుచదువు లెఱుఁగక, వేఁడు...కున్ - వేఁడు = యాచించుచున్న, ఈదృగ్విధ = ఇత్తెఱంగుననున్నట్టి, అనేక = లెక్కకు మిక్కుటం బైన, ప్రాణులకున్ = చేతనులకు, ఆధారంబగు = ఆస్పదమైన, పశ్చిమద్వారంబున్=వెనుకనున్న గుమ్మమును, (అనఁగా దిడ్డివాకిలి ననుట.) చేరి=ప్రవేశించి, ప్రతి...పూర్వ-ప్రతిదిన = దినదినమందును, అస్మత్పాద=నాచరణములయొక్క, భజనకథాశ్రుతపూర్వ అగు = ముందు వినఁబడిన భజనగాథలు గలదైన, (పూర్వము వినఁబడినవి శ్రుతపూర్వములు, దేనిచేత నాపాద భజనకథలు ముందు వినఁబడియున్నదో అది యని విగ్రహార్థము. భగవత్పాదారవిందధ్యానగరిష్ఠురా లనుట.) ఆయుర్వీధరుదేవికిన్ = ఆపాండ్యరాజు భార్యకు, ఆశీర్వచనాక్షతంబులు=మంగళాశాసనపూర్వకాక్షతలను, దౌవారికముఖంబునన్ పంపి = ద్వారపాలునిచేతఁ బంపి, వైదేశికుండన్=పరదేశిని, వైష్ణవ వటుండన్=విష్ణుభక్తి గల బ్రహ్మచారిని, వాది కలిగిన్ = విద్యావాదము చేయువాఁ డున్నయెడ, విష్ణుతత్త్వంబె = నారాయణస్వరూపమే, పరతత్త్వంబు అని=పరమార్థమని, వాదించి=ప్రసంగ మొనరించి, గెల్చెదన్=జయించెదను. వసుధావరుండు=రాజు, విష్ణుభక్తివిముఖుండు కావున్=నారాయణునియందుఁ బూజ్యప్రతిపత్తిలేనివాఁ డగుటంజేసి, వైష్ణవునిమనవి=విష్ణుభక్తుఁడ నైన నాయొక్క విజ్ఞాపనమును, విన్నవింపన్ = ఎఱిఁగించుటను, ఎవ్వరును = అందఱును, వెఱగురు=భయపడు

దురు. నీవు, విష్ణుభక్తిపరాయణవు=విష్ణుభక్తియందాసక్తిగలదానవు, పతిహితాచారవృత్తావున్=భర్తకనుకూలంబగు సద్వృత్తిగలదానవుగనుక, నీకున్ = నీకొఱకు, విన్నవించి = విజ్ఞాపనముచేసి, పంపిరిన్ = అనిపిరిని, నీవిభుండు = నీభర్త, నీకు విధేయుండు=నీకు వశ్యుఁడు, విన్నవించి = విన్నప మొనరించి, నన్నున్, రప్పించి=పిలువఁబంచి, వాదంబు = ప్రసంగమును, చేయింపన్ = చేయించుటకు, ఓపుదేనిన్=సమర్థురాలవైతివా, వాదించి=ప్రసంగించి, గెల్చి=ప్రతివాదులను జయించి, నీదు భర్తకున్= నీపతికి, భగవద్భక్తిన్ = శ్రీమన్నారాయణునియం దాసక్తిని, పుట్టించి = జనింపఁజేసి, కృతార్థున్ = కృతకృత్యునిగా, కావించెదన్ = చేసెదను. అని= ఇట్లని, విన్నవింపన్ పంచినన్ = విన్నపము చేయఁబంపఁగా.

తా. వెండియు నీ రహస్యం బెఱుంగక పుడమిఱేఁ డజ్ఞానుం డై నాభక్తులను సామాన్యజనులమాడ్కిం జూచుచు వారల జీవనంబులకుం గలుగు నుపద్రవంబులను వారింపక యుండం జూచి, నాయం దనురక్తి లేని యీరాజును వాదమున మెప్పించి నాభక్తుం గావింపనియెడఁ గలియుగంబునం గృతమాలాతామ్రపర్ణీ తీరములయందు దండిగ వాసముచేయు నాభక్తుల నద్దేశము నేలుచున్న యితండు సమ్మానింపఁ డని విచారించి, వాదమున జయించి రాజును విష్ణుభక్తుం గావింపవలయునను తలం పయ్యాము నాచార్యునకు నేఁ బుట్టింప నతం డచ్చటి కరిగి యనేకదేశములనుండి వచ్చు బహువిధ యాచకతండంబుల కిష్టార్థంబుల నిచ్చుచు, మత్పాదసేవయం దనురక్తురాలై యున్న యాభూపతిదేవియొద్దకు దౌవారికముఖంబున మంగళాశాసనాక్షతలం బంపి, వాది గలిగిన యెడ విష్ణుతత్త్వంబె పరతత్త్వ మని సిద్ధాంత మొనరింపఁగలవాఁడ నయ్యును విష్ణుభక్తివిముఖుం డైన రాజునకు నామనవి విన్నవించువారు లేకయుండుటం జేసి విష్ణుభక్తురా లగు నీకు విన్నవించితిని. నీవు విష్ణుభక్తియు, పతిభక్తియును గల దాన వగుట చేత నీభర్త నీకు వశ్యుఁడై యున్నవాఁడు గాన విన్నపముఁ జేసి నన్నుఁ బిలువ నంపి ప్రసంగముఁ జేయింపఁగలదాన వైతివేని వచ్చి సభయందుఁ బ్రసంగించి వాదులను జయించి నీ పతికి శ్రీవిష్ణుభక్తిఁ బుట్టించి ధన్యునిం జేసెద నని విన్నవింపు మని పంచె ననుట.

తే. గ్రీష్మసమయనిదాఘార్తకేకిరమణి
నవఘనధ్వని కలుషచంద్రమున నలరి,
*యేకతపు నర్మగోష్ఠిఁ బ్రాణేశుతోడ
నతని విధ మెఱిఁగింప, నిట్టట్టు వసుచు. 51

* ఏకతమ.

టీ. గ్రీష్మ...ణి-గ్రీష్మసమయ = వేసవికాలమందు, (ని. సమయాశ్శపథాచారకాలసిద్ధాంతసంవిద' యని యమరము,) నిరుత్సాహ=సంతోషరహిత యైన, కేకిరమణి= ఆఁడునెమలి, నవఘనధ్వనికిన్-నవ=క్రొత్త యైన, ఘనధ్వనికిన్=ఉఱుమునకు, అలరుచందమునన్ = సంతసించునట్లుంబలె, అలరి = ఆనందించి, ఏక...ష్టిన్ - ఏకతపు = ఏకాంతమం దైన, నర్మ = విలాసార్థమగు, గోష్ఠిన్ = ముచ్చటించునపుడు, ప్రాణేశుతోడన్=పెనిమిటితో, అతని విధము-అతని=అయ్యామునాచార్యునియొక్క, విధము= ప్రసంగ మొనరించెద నన్నరీతిని, ఎఱిఁగింపన్=తెలుపఁగా, ఇట్టట్టుపడుచున్=అచ్చెరు వొందుచును.

తా. పిమ్మట నారాజుభార్య వేసవికాలమునం దుత్సాహము లేకయున్న యాఁడునెమలి నూతన మేఘధ్వనికి నానందించు పోలిక నుబ్బి యుత్సహించి యేకాంతంబున సరససల్లాపము లాడువేళం దన ప్రాణవల్లభునితో నయ్యామునాచార్యవర్యుం డానతిచ్చినవిధం బెల్ల నెఱిఁగింప నయ్యుర్వీనాథుం డాశ్చర్యము నొందుచు.

క. భూవల్లభుఁ 'డెట్టెట్టా
 తా వాదముఁ జేసి శివమతంబు జయింపం
 గా వచ్చెనో? చూతముగా,
 రావింపు' మటన్న నాఁటిరాత్రి చనంగన్. 55

టీ. భూవల్లభుఁడు = రాజు, ఎట్టెట్టా = ఏలాగేలాగు, తాన్=తాను, (బ్రహ్మచారి యనుట.) వాదముఁ జేసి=వాదించి, శివమతంబున్=శైవమతమును, జయింపంగా వచ్చెనో = గెలువవచ్చెనా, చూతముగా = వీక్షించెదముగాని, రావింపుము = పిలువ నంపుము, అటన్నన్=అట్లనఁగా, నాఁటిరాత్రి=ఆ రాతిరి, చనంగన్=వెళ్ళఁగా.

తా. ఆ భూకాంతుం డేలాగున నాబ్రహ్మచారి వాద మొనరించి శివమతమును జయింపఁగలఁడో చూతము పిలువఁ బంపు మనుటయు, నింతలోఁ దెల్లవాఱఁగా నని భావము.

వ. ప్రభాతంబునం [1]బరిమితాస్థానంబునం గొలువున్న భర్తమ్రోలఁ దానుండి యయ్యిందువదన యతవి యనుమతిం బ్రతిహారిచేతఁ బిలువఁ బంచిన నబ్భానిలింపకుమారుండు. 56

టీ. ప్రభాతంబునన్ = ప్రాతఃకాలమందు, పరిమితాస్థానంబునన్=మితజనము గల సభయందు, కొలువున్న=కూర్చుండి యున్న, భర్తమ్రోలన్=పెనిమిటియెదుటను,

1. బరిమితజనం బగు నాస్థానంబునం.

ఉండి=నిల్చుండి, అయ్యిందువదన=చంద్రునివంటి మోము గలయారాజుభార్య, అతని=ఆరాజుయొక్క, అనుమతిన్ = సమ్మతిచేత, ప్రతిహారిచేతన్ = ద్వారపాలకునిచేత, పిలువఁబంచినన్ = రమ్మని చెప్పిపంపఁగానే, ఆఖ్యానిలింపకుమారుండు = ఆపురమి వేల్పుకొమరుఁడు.

యామునాచార్యుఁడు పాండ్యసభం జేరుట

క. ద్వారంబు సొచ్చి, కీలిత
గారుడమహీ వజ్రవేదికం జివురులఁ గెం
పారు నొకపిప్పలముఁ గని,
యా రావి న్వాదసాక్షికై వలగొనుచున్. 57

టీ. ద్వారంబు=తలవాకిలిని, చొచ్చి = ప్రవేశించి, కీ...హిన్-కీలిత=చెక్కఁబడిన, గారుడ=మరకతమయ మైన, మహిన్=భూమియందు, వజ్రవేదికన్=రవలలోఁ గట్టినతిన్నెయందు, చివురులన్ = చిగుళ్ళచేతను, కెం...ముల్ - కెంపారు=ఎఱ్ఱనగుచున్న, ఒకపిప్పలమున్=ఒకయశ్వత్థవృక్షమును, కని = చూచి, ఆ రావిన్=ఆ యశ్వత్థమును, వాదసాక్షి కై=ప్రసంగమునకు సాక్షిగా నుండుట కై, వలగొనుచున్ = ప్రదక్షిణ మొనరించుచు నని యుత్తరపద్యముతో నన్వయము.

తా. పిమ్మట వాకారమునుండి నగరుఁ బ్రవేశించి, పచ్చలచేతఁ జెక్కఁబడియున్నభూమియందు మిగుల వెలగల రవలచేతఁ గట్టబడిన వేదికయం దెఱ్ఱ నైన చిగుళ్ళచేత నొప్పుచున్న యశ్వత్థవృక్షమును జూచి, తాను జేయం బూనిన వాదమునకు దాని సాక్షిగాఁ గైకొను నిచ్చలోఁ బ్రదక్షిణ మొనరించుచును.

సీ. పసిఁడిగ చ్చుమర సోపానముల్ మూఁటఁ దుం
గితవిశాలితయుఁ జిత్రితయు నైన
సభ మహాకుథముపై శార్దూలచర్మకం(ఖం)
థా(డా)వృతుల్ జటిలులు నైన జరఠ
మాహేశ్వరులు చుట్టి (ట్టు) రా హారపంధి [1]రు
ద్రాక్షాయుతముఁ దాల్చి యలికభూతి
సురఁటిగాడ్పుల రాల నరుణాయతాక్షుఁడై
కులుగద్దె బిల్లఁ బ్రకోష్ఠ మునిచి

1. రుద్రాక్ష.

నంది ముద్రితపాణియందుఁ జెక్కుఁ గదియ యా
 గమములు వినుచు హేమము పొదివిన
తే. యలఁతి¹రుదురాకగమి కుట్టులందు మెఱయ
 వెలితపారంబు మించ దువ్వలువ గప్పి
 యడపమును వాఁడివా లొక్కయతివ తాల్ప
 భార్య వింజామ రిడ నొప్పుపాండ్యుఁ గనియె. 53

టీ. పసిఁడి = బంగారముయొక్క, గచ్చు = పూఁత, అమరన్ = ఒప్పుచుండఁగా, సోపానముల్ = మెట్లు, (అనఁగా నంతస్తు లనుట.) మూఁటన్ = మూఁటిచేత, తుంగిత = పొడుగింపఁబడినదియు, విశాలితయున్ = వైశాల్యముగలదిగాఁ జేయఁబడినట్టిదియు, చిత్రితయున్ = చిత్తరువులు గలదియును, ఐన సభన్ = అగు ఆస్థానమండపమందు, మహత్ = అధిక మైన, కుథముపైన్ = ఆస్తరణమునందు, శార్దూలచర్మకంథావృతుల్ - శార్దూలచర్మ = పులితోలుచేతను, కంథా = బొంతలచేతను, ఆవృతుల్ = కప్పఁబడినట్టియు, జటిలులును = జడలుగలిగియున్నట్టి, జరఠ = వృద్ధు లైన, మాహేశ్వరులు = లింగధారులు, చుట్టిరాన్ = పరివేష్టింపఁగా, హారసంధిన్ - హార = ముత్యాలపేరులయొక్క, సంధిన్ = సందులయందు, రుద్రాక్షాయుతముఁ దాల్చి - రుద్రాక్ష = రుదురాకముల యొక్క, అయుతమున్ తాల్చి = పెక్కులు ధరించి, (ని. 'శతంసహస్రమయుతం లక్షమానంత్యవాచక' మ్మని వచనము.) అలికభూతి = ముఖమందలిభస్మము, సురఁటిగాడ్పులన్ = వింజామరలగాలిచేత, రాలన్ = పడుచుండఁగా, అరుణాయతాక్షుఁ డై = ఎఱ్ఱనై దీర్ఘము లైనట్టి కన్నులుగలవాఁ డై, కుఱుగద్దెన్ = కుఱుచపీఠమునందు, బిల్లన్ = వట్రువైన తలగడయందు, ప్రకోష్ఠము ఉనిచి = మోఁచే యాని, నంది...దన్ - నంది ముద్రిత = వృషాంకితాంగుళీయకముగల, పాణియందున్ = హస్తమునందు, చెక్కుఁగది = గండస్థలమును జేర్చి, ఆగమములు వినుచున్ = శైవాగమము లాలకించుచు, హే...మి- హేమము పొదివిన = పైఁడిపొదిగిన, అలఁతి = సన్నము లయిన, రుదురాక = రుద్రాక్షములయొక్క, గమి = సమూహము, కుట్టులందున్ = అంటుపోఁగులందు, మెఱయన్ = వెలుంగఁగా, వె...బు - వెలి = తెల్లనైన, తపారంబు = పాగాను, మించన్ = అతిశయించునట్లుగా, దువ్వలువన్ = దుప్పటిని, కప్పి = ఆచ్ఛాదించికొని, అడపమును = తాంబూలపుసంచిని, వాఁడివాలు = పదును గలఖడ్గమును, ఒక్క అతివ తాల్పన్ = ఒకస్త్రీ ధరించియుండఁగా, భార్య = రాజపత్ని, వింజామర ఇడన్ = విసరఁగా, ఒప్పు =

1. రుద్రాక్ష.

చెన్నొందుచున్న, పాండ్యున్ = పాండ్యరాజును, కనియెన్=చూచెను. (ఇది పంచపాదసీస మని కొందఱును, చతుష్పాద మని, మఱికొంద ఱైదవపాదములేకయుం వక్కాణింతురు.)

తా. పసిండివన్నె గ్రాఁతచే నొప్పి మూఁడంతస్తులమెట్లును మిగుల పొడవు వెడల్పును గల్గి పలుదెఱంగు లయిన చిత్తరువులచేఁ జెన్నొందియున్న సభామంటపము నందు గొప్ప యాస్తరణంబునం బులితోళ్లను బొంతలును గప్పుకొని జడలు ధరించిన వృద్ధు లగు లింగధారులు దన్నుఁ బరివేష్టించియుండ, రత్నహారములయొక్క నడుమ నడుమను రుద్రాక్షములం గూర్పించి ధరియించి నొసటం బుట్టిన విభూతి వింజామరల గాలికి రాలుచుండఁ గన్ను లెఱ్ఱఁజేయుచు, చిఱుతగద్దియయందు బిల్లదిండుమీఁద మోఁచేయి యుంచి నంది ముద్రితంబు లైన యుంగరములు గల హస్తమునఁ జెక్కిలి యుంచికొని మాహేశ్వరులు చదువు శైవాగమముల నాలకించి వినుచుఁ, గుందనపు బంగారముచేతఁ గట్టఁబడిన సన్నరుద్రాక్షల కుట్టుపోఁగులు గల్గి తెల్లనిపాగాను ధరించి, నాణ్యపు దుప్పటి గప్పుకొని, ఒకప్రక్కనడపమును వాఁడి యైనకత్తి చేతం బట్టిన యొక స్త్రీ తన్ను సేవింపం బట్టపుదేవి యైన తనభార్య వింజామర లిడుచుండం బ్రకాశించుచున్న యప్పాండ్యరాజుం గనియె నని భావము.

వ. కని వినతుం డై చేర నరిగి యజ్ఞోపవీతంబు కానుకిచ్చి కూర్చున్న
నాదరింపక సంరంభి యై యవ్విశ్వంభరాభర్త యి ట్లనియె. 59

టీ. కని = చూచి, (యామునాచార్యుఁడు) వినతుం డై=నమ్రుఁ డై, చేరన్ అరిగి = సమీపమునకుఁ బోయి, యజ్ఞోపవీతంబు కానుక ఇచ్చి = జందె ముపాయనం బుగ నొసంగి, కూర్చున్నన్ = ఆసీనుఁడు కాఁగా, ఆదరింపక = మన్నన చేయక, సంరంభి యై = ఉద్రేకముగలవాఁ డై, అవ్విశ్వంభరాభర్త=ఆ రాజు, ఇట్లనియెన్ = వక్ష్యమాణక్రమంబునఁ బలికెను.

తే. 'సంగతియె యోయి యిసుమంత ! తింగణావు
తత్త్వనిర్ణయవాదంబు ! తరమె నీకు ?
నోడితేనియుఁ బట్టి మొఱ్ఱో యనంగ
లింగమును గట్ట కుడుగ, మొఱజెంగి నొడువు. 60

టీ. ఓయి = ఓ బ్రహ్మచారీ! సంగతియె = యుక్తమా, ఇసు...వు - (నీవు) ఇసుమంత = ఇంచుకంత, తింగణావు = చిన్నవాఁడవు, తత్త్వనిర్ణయవాదంబు=స్వరూప నిశ్చయ ప్రసంగము, నీకున్ తరమె = నీకు శక్యమా, ఓడితేనియున్ = పరాజితుండ

వైతివేని, పట్టి = బలాత్కరించి, మొట్టో అనంగన్=అర్థధ్వని చేయఁగా, లింగము కట్టక = శివమూర్తి బంధింపక, ఉడుగము = మానము, ఎఱింగి = విచారించుకొని, నొడువు = మాటలాడుము.

తా. అప్పు డప్పాండ్యరాజు 'ఓ బ్రహ్మచారీ! న్యాయమా, నీవు మిక్కిలి చిఱుతవాఁడవు గాన స్వరూపసిద్ధాంతమె ట్లొనర్పఁగలవు? వాదమునఁ బరాజితుఁడ వైతివేని మొట్టోయన్నను వదలక పట్టి లింగముఁ గట్టించి పంపుదుము; విచారించి మాటలాడు మనియె.

తే. వాదుల మటంచుఁ జెప్పించి ◊ వత్తు; రోట
మైన దయ నీరె యేమైన ◊ నని విలజ్జ
జూటుఁదనమున సభ లెక్కు ◊ చొరవకాండ్రు;
[1]పాఱువారలసుద్ది సెప్పంగ నేల. 61

టీ. (పాఱువారలు) వాదులము అటంచున్ = ప్రాసంగికుల మని, చెప్పించి = వర్తమానముఁ బంపి, వత్తురు = ఏతెంచెదరు, ఓటమైనన్ = ఓడినను, దయన్ = కృప చేత, ఏమైనన్ = కొంచెమైనను, ఈరె=ఇయ్యరా, అని=ఇట్లని, విలజ్జన్=సిగ్గు లేకుం డుటచేతను, జూటుఁదనమునన్ = మోసముచేతను, సభలు = ఆస్థానములను, ఎక్కు = ప్రవేశించునట్టి, చొరవకాండ్రు=ప్రవేశించు స్వభావముగల సాహసికు లైనవారు, వత్తు రను క్రియతో నన్వయము. పాఱువారల = బ్రాహ్మణులయొక్క, సుద్ది = వృత్తాంత మును, చెప్పంగన్ ఏల = వచించుట యెందులకు.

తా. మఱియు నారాజు ఏమియు నెఱుంగని బ్రాహ్మణులు తాము వాదమం దోడినను, గరుణించి కొంచె మయిన నీయరా చూత మని తలపోసి ప్రాసంగికుల మని చెప్పికొనుచు వచ్చుచున్నారు. ఇట్లు లజ్జలేక మోసకారితనమున సభలను బ్రవేశించు నట్టిసాహసికు లగునావిప్రుల వృత్తాంత మే మని వచింపుదు నని నిందించె నని భావము.

వ. అని పలికి దరహాసంబుతో దేవిదెసఁ జూచి యి ట్లనియె. 62

టీ. అని పలికి = ఈలాగునఁ జెప్పి, దరహాసంబుతోన్ = చిఱునవ్వుతో, దేవి దెసన్ = భార్యదిక్కును, చూచి = వీక్షించి, ఇట్లనియెన్ = వక్ష్యమాణ క్రమంబుగ వక్కాణించెను.

క. అస్మన్మతస్థుఁ డోడిన
భస్మము రుద్రాక్షములును ◊ బూసి గుఱుతని చే

1. పాఱుదుర వాండ్రసుద్ది చెప్పంగ నేల.

విస్మయముగఁ [1]దప్తపుముర
ఘస్మరచక్రాంకితుండఁ గాఁగలవాఁడన్. 63

టీ. అస్మన్మతస్థుఁడు ఓడినన్=నాకిష్టమైన శైవమతస్థుఁడు పరాజితుఁ డాయెనా, భస్మము=విభూతిని, రుద్రాక్షములును = రుద్రాక్షములను, పాసి = త్యజించి, ఇతనిచేన్ = ఈ వటువుచేతను, విస్మయముగన్=ఆశ్చర్యముగా, తప్త...దన్ - తప్తపు = తపింపఁబడిన, మురఘస్మర = మురాసురుని భక్షించిన విష్ణుదేవునియొక్క, చక్ర = చక్రముచేతను, అంకితుండన్=చిహ్నితుఁ డను, కాఁగలవాఁడన్ = అయ్యెదను. (ని. 'భక్షకో ఘస్మరోఽద్మర' యని యమరము.) (సాప్తము - అనుపాఠమున-స ఆప్తము-ఆప్తులతోఁగూడ చక్రాంకితము చేసికొందు నని యర్థము.)

తా. ఇపుడు నడువఁబోయెడి వాదమున నా కభిమతుం డయినశివమతస్థుఁ డోడెనేని విభూతి రుద్రాక్షములం బరిత్యజించి నే నీ బ్రహ్మచారిచేతఁ జక్రాంకితుండ నయ్యెద ననియె.

తే. ఉవిద! యీనీదువిద్వాంసుఁ డోడెనేని
నీకు నితని కే నన్నపూనికయ యన్న
'నొప్పితిమి దేవ రానతి దప్పకున్నఁ
జాలు మఱి పంచభూతము ల్సాక్షి గాఁగ.' 64

టీ. ఉవిద=ఓస్త్రీ, ఈ నీదువిద్వాంసుఁడు ఓడెనేని = ఈ నీపండితుఁడు పరాజితుఁడాయెనా, నీకున్=నీకును, ఇతనికిన్=ఈ యామునాచార్యునకును, ఏన్=నేను, అన్న=అన్నట్టి, పూనికయ = ప్రతిజ్ఞయే, అన్నన్ = ఇట్లనఁగా, ఒప్పితిమి=మేము సమ్మతించితిమి. దేవర = తాము, ఆనతిన్ = చెప్పినమాటను, తప్పకున్నన్ = అతిక్రమింపకయుంటిరా, చాలును = పర్యాప్తము. మఱి = మఱియును, పంచభూతములు = పృథివ్యప్తేజోవాయ్వాకాశములు, సాక్షిగాఁగన్=నిష్పక్షపాతముచేతఁ జూచువారలు గాఁగా, తప్పకుండినఁ జాలు నని క్రింది కన్వయము.

తా. ఓ వనితామణీ! నీ పండితుఁ డోడెనా నీవును నీ యామునాచార్యుఁడును నేఁ జెప్పినట్లే శైవదీక్ష వహింపవలసి యుండు ననఁగా విని, యా రాజుభార్య "యో స్వామీ మీయాజ్ఞ కొడంబడితిమి. మీరును బంచభూతములు సాక్షిగా నానతిచ్చిన మాటను దప్పక నడవవలయు" నని ప్రత్యుత్తర మిచ్చె ననుట.

వ. అని పలుకు నయ్యిరువుర ప్రతిజ్ఞ లాకర్ణించి. 65

1. సాప్తము మర.

టీ. అని = ఇట్లని, పలుకు=వచించుచున్న, అయ్యిరువుర = ఆయిద్దఱ యొక్క, ప్రతిజ్ఞలు=శపథములను, ఆకర్ణించి = విని.

తే. అతఁడు మృగకృత్తి పెళపెళ యనఁగఁ బసుపు
గోచి గట్టిన మోదుగుఁగోల నెగయఁ
బ్రాంజలి వినీతుఁడై విన్నపం బటంచు
నర్ధముక్తాసనత నిట్టు లనియెఁ బతికి ౧౬

టీ. అతఁడు = ఆ యామునాచార్యుఁడు, మృగకృత్తి=కృష్ణాజినము, పెళపెళ యనఁగన్=పెళపెళమని యాడఁగాను, పసుపుగోచి=హారిద్రాకౌపీనము, కట్టిన = కట్టఁబడిన, మోదుగుఁగోలన్ = పలాశదండమందు, ఎగయన్ = చలింపఁగా, ప్రాంజలి = చేతులుజోడించినవాఁడై, నమ్రుఁడై, విన్నపంబు అటంచున్=నేను మ్రొక్కుచునట్టి వాక్యము నాలకింపు మటంచును, అర్ధముక్తాసనతన్ = సగము విడువఁబడిన యాసనము గలవాఁడై, పతికిన్=రాజునుగూర్చి. (ధృతిని-అను పాఠమున సంతోషముతో, ధైర్యముతో నని యర్థము.) ఇట్టు లనియెన్=ఈలా గనియెను.

తా. అట్లయ్యిరువురు నిర్ణయించుకొనిన శపథముల నాకర్ణించి యామునాచార్యుం డపుడు తాను ధరియించియున్న కృష్ణాజినము పెళపెళలాడఁగాఁ బాలాశదండము నందు బంధింపఁబడినగోచి చలించునట్లు సగము విడువఁబడ్డ యాసనముగలవాఁడై చేతులు జోడించి విన్నవించెద నాకర్ణింపు మని రాజునుగూర్చి పలికె ననుట.

క. 'దేవా! యిట్లని యానతి
యీ వల దేఁ గడుపుఁగూటికిట రా [1]నాడ
బ్బేవారిఁ బ్రోవ భిక్షా
జీవిక వర్ణికిని విధి సృజించెనె గాదే. ౧౭

టీ. దేవా = ఓరాజా! ఇట్లని = ఈలాగని, ఆనతి యీవలదు=ఆజ్ఞ యీయవలదు, ఏన్ = నేను, కడుపుఁగూటికిన్ = పొట్టకూటకమునకు, ఇటరాన్=ఇక్కడికి రాను, నాడబ్బు = నాద్రవ్యము, ఏవారిన్ ప్రోవన్ = ఎవ్వరిని రక్షించుటకొఱకు, వర్ణికిని = బ్రహ్మచారికి, భిక్షాజీవిక=యాచ్ఞాజీవనము, విధి = బ్రహ్మ, సృజించెనెగాదె = సృష్టించియే యున్నాఁడుగదా.

తా. ఓయిరాజా! నీ వీలాగున సెలవీయవలదు; నేను కడుపుకూటికొఱకు వచ్చి వివాదముఁజేసెద నని చెప్పి వచ్చినవాఁడను కాను. నే నెవ్వరిని రక్షింపవలసియున్నది? బ్రహ్మచారికి బ్రహ్మ భిక్షావృత్తిని మున్నే సృజించియుంచియుండ లేదా? యని భావము.

1. నాధం బేవారి.

తే. ఎవ్వఁ డీ(డే)సర్వభూతస్థుఁ డిత్తెఱంగు
నను బ్రేరేఁచె నతని యానతియె తెచ్చె
నెఱిఁగినవి నాల్గు నొడువ నెట్లైన లెస్స
యతఁడ బొంకిన నేమి సేయంగ వచ్చు. 68

టీ. ఎవ్వఁడు = ఏభగవంతుఁడు, ఈసర్వభూతస్థుఁడు=ఈసర్వాంతర్యామి యై, ఇత్తెఱంగునను = ఈప్రకారమునను, (వాదార్థమై యనుట.) ప్రేరేఁచెన్ = ప్రేరణ చేసెనో, అతని = ఆదేవునియొక్క, ఆనతియె = ఆజ్ఞయే, తెచ్చెన్ = తీసికొనివచ్చెను, అతఁడ=నన్నుఁదెచ్చినభగవంతుఁడే, బొంకినన్=అబద్ధమాడినను, ఏమి సేయంగవచ్చున్= ఏమి సేయఁగలను, ఎఱిఁగినవి=నాకుఁ దెలిసినవి, నాల్గు=నాలుగుయుక్తులును, నొడువన్= చెప్పఁగా, ఎట్లైన = ఏలాగైనను, లెస్స = యోగ్యమె.

తా. సర్వాంతర్యామి యైన యేదేవుఁడు న న్నిట్లు వాదముసేయు మని ప్రేరేపించెనో యట్టిభగవంతుఁడే బొంకినపుడు నే నేమి సేయంగలవాఁడను? నాకుం దెలిసి యున్న నాలుగుయుక్తులను జెప్పెద; దానిపై నేలాగైనను యోగ్యమే యని పలికెను.

తే. పంతమైనను గానిమ్ము పార్థివేంద్ర
యుక్తులను నిగ్రహస్థాన మొదవె నేని
యమ్మ దెచ్చినవిద్వాంసుఁ డనఁగ వలవ
దెట్లు గావింప వలయు నట్లట్ల చేయు.' 69

టీ. పార్థివేంద్ర=ఓయిరాజా! పంతమైనను=నీవాడిన ప్రతిజ్ఞనైనను, కానిమ్ము= జరగనిమ్ము, యుక్తులను = ప్రతివాదియుక్తులచేతను, నిగ్రహస్థానము = ఓడుట, ఒదవె నేని = వచ్చెనేని, అమ్మ = దేవరదేవి, తెచ్చినవిద్వాంసుఁడు = రావించిన పండితుఁడు, అనఁగన్ వలదు = అని విచారింపకుము, ఎట్లు కావింపవలయున్=ఏలాగునఁ జేయవల యునో, అట్లట్ల చేయుము = ఆలాగుననే చేయుము.

వ. అని య(యు)లుకు విడిచి పలికి, మగుడం గూర్చుండి, యతని యను
మతి వాదంబునకుం దొడంగి. 70

టీ. అని=ఈలాగని, అలుకు=భయమును, విడిచి = త్యజించి, పలికి=వాక్రుచ్చి, మగుడన్=మరలను, కూర్చుండి = ఆసీనుఁడై, అతని యనుమతిన్ = ఆరాజుయొక్క యాజ్ఞచే, వాదంబునకున్=ప్రసంగమునకు, తొడంగి = ఉపక్రమించి.

తా. ఓయిరాజా! నే ప్రతివాదియుక్తులకు నోడితినేని మీరానతిచ్చినట్టి ప్రతిజ్ఞనైనను జరగింపుఁడు, అమ్మగారు పిలువంబంచిన విద్వాంసుం డని మన్నింపక మీ కిష్టము వచ్చినయట్లు చేయింపుఁ డని పల్కె ననుట.

అన్యమతఖండనము

సీ. అందులో నొకమేటి కభిముఖుండై యాతఁ
డనిన వన్నియును ము న్ననువదించి;
తొడఁగి యన్నిటి కన్ని దూషణంబులు వేగ
పడక తత్సభ యొడఁ బడఁగఁ బల్కి;
ప్రక్కమాటల నెన్న కొక్కొకమాటనె
నిగ్రహస్థాన మనుగ్రహించి;
క్రందుగా రేఁగినఁ గలఁగ కందఱఁ దీర్చి
నిలిపి; యమ్మొదలి వానికినె మగిడి:
తే. మఱి శ్రుతిస్మృతిసూత్రసమాజమునకు
నైకకంఠ్యంబు గల్పించి, యాత్మమతము
జగ మెఱుంగఁగ రాద్ధాంతముగ నొనర్చి
విజితుఁ గావించి దయ వాని విడిచిపెట్టె. 71

టీ. అందులోన్ = ఆవాదులలో, ఒకమేటికిన్ = ఒక ప్రౌఢవాదికి, అభిముఖుండై = ఎదురుగా నున్నవాఁడై, ఆతఁ డనినవన్నియున్ = ఆతఁడు చెప్పినయుక్తు లన్నిటిని, మున్ను అనువదించి = ముం దనువాదముఁ జేసి, తొడఁగి = ఉపక్రమించి, అన్నిటికిన్ = ఆతఁడు చెప్పినయుక్తుల కన్నిటికిని, అన్నిదూషణంబులు = అన్నిదోషంబులు, వేగపడక = త్వరపడక, ('ప్రథమాపైభక్తికమోర్బిందుశ్చ మహాన్వతిక్రియార్థేషు' అనుసూత్రముచేత మువర్ణకలోపము.) తత్సభ = ఆసభ్యులు, ఒడఁబడఁగన్ = సమ్మతించినట్లుగా, పల్కి = సంభాషించి, ప్రక్కమాటలన్ = పార్శ్వముల నున్నవారు చెప్పునట్టి యుక్తులను, ఎన్నక = గణనచేయక, ఒక్కొకమాటనె = ఒక్కొకయుక్తిచేతనే, నిగ్రహస్థాన మనుగ్రహించి = నిగ్రహస్థానమును బొందించి, ('నిగ్రహస్థాన' మనఁగాఁ బ్రసంగదోషములకు పరాజయహేతువులకుఁ బేరు.) క్రందుగా రేఁగిన = దొమ్మిగాఁ బ్రసంగింపరాఁగా, కలఁగక = తొట్రుపాటుపడక, అందఱన్ = ఎల్లరను, తీర్చి = సమాధానపఱిచి, నిలిపి = ఉంచి, అమ్మొదలివానికినె = ఆ మొదలి విద్వాంసునకె, మగిడి = తిరిగి. మఱి = మఱియును, శ్రుతి = వేద వేదాంతములు. స్మృతి =

ధర్మశాస్త్రములు, సూత్ర = వ్యాససూత్రములు, వీనియొక్క, సమాజములకున్ = సమూహములకు, ఐకకంఠ్యము = ఏకగ్రీవత, కల్పించి=చేసి, ఆత్మమతము=స్వమతము, జగ మెఱుంగఁగన్ = లోక మెఱుంగునట్లు, రాద్ధాంతముగన్=సిద్ధాంతముగా, ఒనర్చి=చేసి, విజితున్ కావించి = ఓడించి, దయన్ = కరుణచేత, వానిన్ = అతనిని, విడిచి పెట్టె: చూ. 3 ఆ. ౬ ప.

తా. ఆ వాదులలో నొక ప్రౌఢవాది కభిముఖుం డై యతఁడు సెప్పినయుక్తులను మఱందనువాదముఁ జేసి యుపక్రమించి, పిమ్మట నా యుక్తుల కన్నిదూషణంబులును దాను త్వరపడక సభ్యులు మెచ్చునటులఁ బల్కి, యిరుప్రక్కల నున్నవారు సెప్పు చున్నమాటల నెన్నక యొక్కొకయుక్తిచేత నిగ్రహస్థానము లొదవిన ననుగ్రహించి, సభ్యులు దొమ్మిగా వచ్చి ప్రసంగింపఁ దాఁ దొట్రుపడక యందఱను సమాధానపఱిచి యుంచి, యా మొదలివిద్వాంసునకే మరల వేదశాస్త్ర బ్రహ్మసూత్రములకు నేకవాక్యతఁ గల్పించి చెప్పి పిమ్మట స్వమతము సిద్ధాంత మని లోక మెఱుంగునట్లుగఁ జేసి యోడించి దయచేత వానిని విడిచిపెట్టును.

క. 'నీ వేమంటివి ర'మ్మం, చావలివానికిని మగిడి యట్లనె వానిం
గావించి; యొకఁడొకఁడు రా, నావిప్రుఁడు వాదసరణి నందఱఁ గెలిచెన్.

టీ. నీవు ఏమంటివి = తొలుత దొమ్మిగఁ బ్రసంగింపవచ్చినవారలలో నొక్కనిం జూచి యీవు పల్కినదేమి, రమ్మంచున్ = రమ్మని యోడించి, ఆవలివానికిని=ఆవలనున్న మఱియొకనికిని, మగిడి=అభిముఖుం డై, వానిన్ = ఆ వానిని, అట్లనె = మొదలివాదిని వలెనే, కావించి = చేసి, మఱియు నీప్రకారముగన్, ఒకఁడొకఁడు = ఒకనివెంట నొకఁడుగా, రాన్=రాఁగాను, ఆవిప్రుఁడు=ఆ యామునాచార్యుఁడు, వాదసరణిన్ = వాదముఖమున, అందఱన్ = వాదుల నెల్లను, గెలిచెన్ = జయించెను.

తా. మఱియొకనితట్టు తిరిగి నీ వేమంటివి ర మ్మని ప్రసంగించి యోడఁగొట్టి యావలివాని కెదురై వాని నోడఁగొట్టి యీరీతి నొక్కొకఁడుగ రాఁగా నావిప్రుఁడు ప్రసంగించి యందఱఁ బ్రసంగించుసమయమున నోడఁగొట్టెను.

వ. ఇట్లు జయించి విష్ణుదేవుండె పరతత్త్వం బనియు విశిష్టాద్వైతంబ
మతంబు నగుటం బ్రతిష్ఠించిన. 73

టీ. ఇట్లు జయించి=ఇవ్విధమున గెలిచి, విష్ణుదేవుండె=శ్రీమన్నారాయణుండె, పరతత్త్వంబు అనియున్ = పరబ్రహ్మ మనియును, విశిష్టాద్వైతంబ=జీవేశ్వరులకు భేద ప్రతిపాదన మగుటయె, మతంబున్ = సిద్ధాంతమును, అగుటన్, ప్రతిష్ఠించినన్=స్థా

పలుకఁగా (స్థూల చిదచిద్విశిష్ట పరబ్రహ్మమునకును, సూక్ష్మ చిదచిద్విశిష్ట పరబ్రహ్మమునకును అభేద మని చెప్పుటయ విశిష్టాద్వైతశబ్దార్థ మనుట.)

క. [1]ఆయెడను నొక్కపలు కెదు
రై యుండెడు పిప్పలమున నాయెను విన 'నో
హో యిది నిక్కము నృప నా
రాయణుఁడె పరంబు గొల్వు మతని' నటంచున్. 74

టీ. ఆయెడను = ఆసమయమందు, ఎ...నన్ - ఎదురైయుండెడు=పురోభాగమున నున్నట్టి, పిప్పలమునన్ = రావిచెట్టునందు, ఓహో = ఓయీ, నృప = రాజా! ఇది=ఈ యామునాచార్యుఁడు చెప్పినది, నిక్కము = యథార్థము, నారాయణుండె = విష్ణుదేవుఁడె, పరంబు = పరబ్రహ్మము, అతనిన్ = ఆనారాయణుని, కొలువుము=సేవింపుము, అటంచున్=ఇట్లనుచు, ఒక్కపలుకు = ఒక వాక్యము, వినన్ ఆయెన్ = వినఁబడెను.

తా. ఇట్లు యామునాచార్యుండు సిద్ధాంత మొనర్చినసమయమున నెదుట నున్న రావిమ్రానినుండి, 'యోయిరాజా! యీ బ్రహ్మచారి చెప్పినది నిజము. శ్రీమన్నారాయణుండే పరబ్రహ్మ మగుటంజేసి యద్దేవుని సేవింపు' మను నొక్క శబ్దము వినవచ్చెను.

వ. అప్పలుకులు విని ఖిన్నుం డై యక్కూడిన పాషండషండంబు తలవంచుకొని పోయిన నాయుర్వీధవుండు నతని మాహాత్మ్యంబునకు సంతోషించి సాష్టాంగ మెఱఁగి, హర్షాద్భుతరసోత్తరంగితాంతరంగుం డై, భుజగశయనచరణకుశేశయభక్తివాడమి కృతార్థతం బొంది, పాండ్యమండలమునకు భాగినేయుండ పట్టాప్తుండు గావునఁ బాత్రం బని బ్రహ్మచారి యగు నతనికిఁ దనకడగొట్టు చెలియలిం బరిణయంబు సేసి యరణంబుగ నమ్మహాత్మునకు ధారాపూర్వకంబుగా నర్ధరాజ్యం బిచ్చి, యువరాజుం జేసి, యధీతసాంగవేదుం డగు నతనికి నధర్వశిరస్సభ్యస్తం బని యెఱింగి, యందుఁ దివ్యాస్త్రమంత్రంబుల కలిమియుం దెలిసి, యమ్మహాత్మున కెచ్చరించి, దుస్సాధం బగు విరోధియూథంబు సాధింపు మని దండయాత్రఁ బనిచిన, నయ్యామునుండును సన్నద్ధుం డగుతఱిఁ దత్పురోహితప్రధానమంత్రివర్గంబు సన్నిహితంబు లగు నివార్షిక

1. ఆయెడ నొక పలుకం కెదు.

దినంబులు గడపి శరత్సమయంబున విద్విషత్సంహారంబునకు విజయంబు
సేయు మనుటయు, నత్తెఱంగు రాజున కెఱింగించి తత్సమ్మతంబున
నిలిచె నంత. 75

టీ. అప్పలుకులు విని = ఆ వాక్యము లాలకించి, ఖిన్నుం డై = విచారించువాఁడై, అక్కాడిన పాషండషండంబు = వాదమునకు నాయత్తపడి వచ్చిన యావేదబాహ్యుల సమూహము, తలవంచుకొని, (సిగ్గుచే ననుట) లేచిపోయినన్ = వెడలిపోఁగా, ఆయుర్వీధవుండును = ఆరాజును, అతని మాహాత్మ్యంబునకున్ = అయ్యాయమునాచార్యుని ప్రభావంబునకు, సంతోషించి = హర్షించి, సాష్టాంగ మెఱఁగి = ఎనిమిది యంగములతో నమస్కారమొనర్చి, (ఉరస్సు, శిరస్సు దృష్టి, మనస్సు, వచస్సు, కాళ్లు, చేతులు, చెవులు ఈ యెనిమిదింటితోఁ జేయు నమస్కారము సాష్టాంగము. దండవత్తుగా భూమి పయిం బడుట సాష్టాంగమండ్రు. 'ఎరగెః జేమోడ్చె నన నమస్కృతి యొనర్చె, ననుటకివి యాఖ్య లై చెల్లు నని యాంధ్రనామసంగ్రహము) హ...డై - హర్షాద్భుతరస = సంతోషరసముచేతను ఆశ్చర్యరసముచేతను, ఉత్తరంగిత=ఉప్పొంగింపఁబడిన, అంతరంగుండై = హృదయముగలవాఁడై, భు...క్తి-భుజగశయన = శేషశాయియొక్క, చరణకుశేశయ = పాదపద్మములయందు, భక్తి=భజింపవలయు నన్న యాసక్తి, పొదమి = పుట్టి, కృతార్థతన్ పొంది = కృతకృత్యుఁడై, పాండ్యమండలంబునకున్ = పాండ్యదేశమునకు, భాగినేయుండె=మేనల్లుఁడె, పట్టార్హుండు కావునన్=ప్రభుత్వమునకుఁ దగినవాఁడు గాన, పాత్రం బని = యోగ్యుఁ డని, బ్రహ్మచారియగు నతనికిన్=వటువైనట్టి యయ్యామునాచార్యునకు, తన కడగొట్టుచెలియలిన్=తన చిన్నచెల్లిలిని, పరిణయంబు చేసి = వివాహము గావించి, అరణంబుగన్ = కట్నముగ, (అరణం బనఁగాఁ బెండ్లికాలమందు మామగా రల్లుని కిచ్చునట్టి ద్రవ్యము.) అమ్మహాత్మునకున్ = ఆ వటువునకు, ధారాపూర్వకంబుగాన్ = దానముగా, అర్ధరాజ్యం బిచ్చి = సగముదేశము నొసంగి, యువరాజుం జేసి = యువరాజుగా నియమించి, అధీతసాంగ వేదుం డగు = షడంగవేదవేత్తయగు, అతనికిన్ = ఆయ్యామునాచార్యునకు, అధర్వశిరస్సు = అధర్వణశిఖ, అభ్యస్తం బని=చదువఁబడిన దని, ఎఱింగి=తెలిసి, అందున్ = ఆ యధర్వణవేదమందు, దివ్య=మహిమగల, అస్త్రమంత్రంబుల = బ్రహ్మాస్త్రము మొదలగు నస్త్రంబులయొక్కయు, తత్సాక్షాత్కారము చేయు మనువులయొక్కయు, కలిమియున్ = కలిగియుండుటను, తెలిసి = ఎఱింగి, అమ్మహాత్మునకున్ = అతనికి, ఎచ్చరించి = ప్రస్తావ మొనరించి, దుస్సాధం బగు = సాధింపశక్యముగాని, విరోధియూథంబున్ = శత్రుసమూహమును, సాధింపు మని = జయింపు మని, దండయాత్రన్ = యుద్ధయాత్రను, పనిచినన్ =

చేయుమనఁగా, అయ్యామునందు = అయ్యామునాచార్యుండు, సన్నద్ధుండగుతఱిన్ = ప్రయాణోద్యుక్తుం డైన సమయమునను, తత్పు... వర్గంబు-తత్ = ఆయామునాచార్యుని యొక్క, పురోహిత = పురోహితునియొక్కయు, ప్రధాన = మహామంత్రుల (దివానుల) యొక్కయు, మంత్రి = అమాత్యులయొక్కయు, వర్గంబు = గణంబు, సన్నిహితంబు లగు = సమీపించియున్న, ఇవ్వార్షికదినంబులు= ఈ వానకాలపు దివసంబులు, కడపి = వెళ్ళఁజేసి, శరత్సమయంబునన్ = ఆశ్వయుజకార్తికమాసములయందు, విద్విషత్సంహారంబునకున్ = శత్రువులం బరిమార్చుటకు, విజయంబుసేయు మనుటయున్ = చనుం డనఁగా, అత్తెఱంగు=ఆవర్షాకాలప్రయుక్తప్రవిరోధమును, రాజునకున్ = ప్రభువునకు, ఎఱింగించి = తెలిపి, తత్సమ్మతంబునన్ = ఆరాజుయొక్క యనుమతిచేతను, నిలిచెన్ = వెళ్ళకయుండెను, అంతన్ = అటుపిమ్మటను.

తా. అపు డట్లనుచితముగ నుత్పన్నము లైన వాక్యములను విని చేయునది లేక యాసభయం దున్న సామందు లగు దుర్వాదులు ఖిన్నులై లేచిపోయిరి. రా జయ్యామునాచార్య మహత్త్వంబునకు మెచ్చి సంతసించి యవ్విప్రునకు దండప్రణామం బాచరించి శ్రీవిష్ణుదేవునియందు భక్తి జనించుటవలనఁ గృతకృత్యుం డై తనరాజ్యము మేనల్లునికిం బట్టముగట్టునట్టిసంప్రదాయము గలది యగుటంజేసి యతనికిం దనముద్దు చెలియలి నిచ్చి వివాహంబొనర్చి, యావివాహకాలమున ధారాపూర్వకముగఁ దన రాజ్యమున నర్ధరాజ్యమిచ్చి యువరాజుగా నియమించి, తరువాత నధికనిఖిలాస్త్రవేదుం డగు నతనిం జిరకాలముగఁ దన కసాధ్యులై యున్న శత్రురాజుల సాధింపు మని నియోగింప, నందుల కయ్యామునాచార్యుం డొడంబడి యుద్ధయాత్ర వెళ్లుట కుద్యుక్తుఁడయ్యెను. కాని, మంత్రిపురోహితులు మొదలగువార లిప్పుడు సంప్రాప్తించియున్న వర్షాకాలము వెళ్ళఁగానే దండయాత్ర యొనర్చుట యుక్త మని విన్నవించిన నవ్విధ మారాజునకుఁ దెలిపి యతని యనుజ్ఞ వడసి నిలిచియుండెను.

వర్షాకాలవర్ణనము

ఉ. కర్కశుఁ డంట కోర్వ కుదకంబులు వాఁగపతి గూర్చినట్లు న
య్యర్కుఁడు దాను గూర్చి మఱి యాసలిలాధిపచిహ్నవాహతం
బేర్కొలగంగ నాతఁ డెలమి న్మకరస్థితిఁ గన్న నీర్ష్యఁ దాఁ
గర్కటకస్థుఁ డయ్యె ననఁ గర్కటకస్థితిఁ గాంచె నత్తఱిన్. 76

టీ. అర్కుఁడు = సూర్యుఁడు, కర్కశుఁ డంటకున్ = కఠినుఁ డనుటకు, ఓర్వక = సహింపక, ఉదకంబులు = జలములను, వాఁగపతి = వరుణుఁడు, కూర్చినట్లు

సంగ్రహించినట్లు, అయ్యర్కుఁడున్ = ఆసూర్యుఁడును, తాను=తానును, కూర్చి=జల సంగ్రహముఁజేసి, మఱి = తరువాతను, అ...తన్ - ఆసలిలాధిపచిహ్న = వరుణుని యొక్క గుఱుతయిన మొసలి, వాహతన్=తనకు వాహనముగాఁగలది అని, పేర్కల గంగన్ = పేరువహించిన దైన (ప్రసిద్ధమయిన) గంగానదియందు, అతఁడు = ఆవరుణుఁడు, ఎలమిన్ = ప్రీతితో, మకరస్థితిన్ - మకర = మొసలియందు, స్థితిన్ = ఉండుటను, కన్నన్ = పొందఁగా, ఈర్ష్యన్ = అసూయచేత, తాన్ = తాను, కర్కటకస్థుఁ డయ్యెన్ నన్ = కుళీరమందుఁ బ్రవేశించెనో యన్నట్లు, అత్తఱిన్ = ఆసమయమందు, కర్కటకస్థితిన్ కాంచెన్ = కుళీరమందుఁ బ్రవేశించెను. సూర్యునకు సహజమైన కర్కాటకరాశి ప్రవేశమునకు మకరస్థవరుణేర్ష్యాకృతత్వము నుత్ప్రేక్షించుటవలన నుత్ప్రేక్షాలంకారము.

తా. సూర్యుఁడు తడవుఁ దనుట సహింపని వరుణుఁడు తాను జలములు సంగ్రహింప నాసూర్యుఁడును జలగ్రహణ మొనర్చి, వరుణునిచిహ్నము తనకువాహన మగుటచే ప్రసిద్ధమగునట్లు మొసలి యం దుండఁగా, నసూయచే సూర్యుఁడుకూడఁ గర్కటకస్థితి గాంచెనో యన్నట్లు కర్కటరాశియందుఁ బ్రవేశించెను. అనఁగా వర్షాకాల మారంభమయ్యెను.

తే. వనతతివరాహవాహారివాయుభుగ్వి
రోధివారణవర్షాభుగలాధిఁ దొఱఁగె
నెండ్రి రవి చేర మూఁడవయెడకుఁ జేరు
తరణి ధరణిం బ్రమోదసంధాయి గాఁడె 77

టీ. రవి = సూర్యుఁడు, ఎండ్రిన్ = కర్కటమును, చేరన్ = ప్రవేశింపఁగా, వన...ధిన్ - వనతతి = వనసమూహమును, వరాహ = అడవిపందులును, వాహారి = మహిషములును, వాయుభుగ్విరోధి = పాములకు విరోధు లగు మయూరములును, వారణ = ఏనుఁగులును, వర్షాభులు = కప్పలును, ఆధిన్ = మనోవ్యధను, తొఱఁగెన్ = మానెను. (ని. 'వరాహస్సూకరోఘృష్టిః, నీలకణ్ఠోభుజఙ్గభుక్, కుఞ్జరోవారణః కరీ, లులాయో మహిషోవాహద్విషత్కాసరసైరిభాః, భేకేమండూకవర్షాభూః' అని యంతట నమరము.) మూఁడవయెడకున్ = జన్మలగ్నతృతీయస్థానమునకు, చేరు = ప్రవేశించునట్టి, తరణి = సూర్యుఁడు, ధరణిన్ = భూమియందు, ప్రమోదసంధాయి = సంతోషము నిచ్చువాఁడు, కాఁడె = కాఁడా! అగును.

తా. 'షట్త్రిదశస్థో భానుః' అని జన్మరాశికి మూఁట నాఱింటఁ బదింట నున్న సూర్యుఁడు శుభఫలప్రదుఁడు గాన వనతతి, వారాహ, వాహారి, వాయుభుగ్విరోధి,

వారణ, వర్షాభులసామాద్యక్షరము వకార మగుటవలన 'వోవా వీవో రోహిణీ' అని సామాద్యక్షరముచేత వీనికి రోహిణీనక్షత్రమాయెను గానఁ గృత్తికా త్రిపాదం రోహిణీ మృగశిరార్ధం వృషభ మని వృషభలగ్న మాయెను. ఆవృషభలగ్నమునకు మూఁడవది యైన కర్కాటకమందు రవి ప్రవేశింపఁగానే వర్షములు కురిసినందున యాటింటికిని సంతోషకరుఁ డాయె నని చెప్పి సామాన్యముచేత విశేషమును సమర్థించి నందునఁ దద్రూపమగు నర్థాంతరన్యాసాలంకారము. అడవులు, అడవిపందులు, నెమిళ్లు, ఏనుఁగులు, కప్పలు జలము కోరుచుండునుగాన వర్షాకాలము రాఁగానే వానిమనోవ్యథ తొలఁగెను. సూర్యుఁడు కర్కాటకము ప్రవేశించుటతోఁ దృతీయస్థానము చేరిన రవి సంతోషప్రదుఁడే యగును గదా.

తే. వనధిగమనజగర్భార్క°జనితఘృణులు
మఱి ప్రసూతికి నతని°ధామంబుఁ జేరె(ర)
ఘనతఁ జొచ్చినయిండ్లను °[1]దనయ లుండి
కాన్పునకుఁ బుట్టినిల్చేరు°క్రమము గనమె. 73

టీ. వ...లు - వనధి = సముద్రముయొక్క, గమన = పొందుటచేతను, జ= పుట్టిన, గర్భ = చూలుగల (అనగా నుదకము లోపలఁ గలిగినటువంటి), అర్క=సూర్యుని వలన, జనిత = పుట్టినటువంటి, ఘృణులు = కిరణములు, మఱి = తదనంతరమందు, ప్రసూతికిన్ = ప్రసవించుటకు, అతనిధామంబున్=ఆసూర్యునియొక్క స్థానమును, చేరెన్=ప్రవేశించెను. ఘనతన్ = ఆధిక్యముచేతను, చొచ్చినయిండ్లను=అత్తవారిండ్లను, తనయలు = కొమార్తెలు, ఉండి=కాఁపురముండి, కాన్పునకున్=ప్రసవమునకు, పుట్టినిల్ చేరుక్రమము = తల్లిగారింటికి వెళ్లు మర్యాదను, చూడమా, చూచుచున్నా మనుట.

తా. సూర్యకిరణములే మేఘము లనిప్రసిద్ధి గాన, సూర్యునివలనఁ బుట్టిన మేఘములు సముద్రునిం బొందుటచే లోపల నిమిడియున్న యుదకములను గర్భములఁ దాల్చి ప్రసవమునకుఁ దమ జన్మస్థానమైన సూర్యునిఁ జేరుచున్న వన్నట్లు వర్ణించుచు, గొప్పఁదనముచేత నత్తవారింటఁ గాఁపురముచేయుచున్న కొమార్తెలను గర్భము గలుగఁగానే వారు బిడ్డలం గనుటకుఁ బుట్టినిల్లు చేరుచుండు మర్యాదవలె నొప్పెను. మేఘములు సముద్రోదకముచేత గర్భమును ధరించి లోకమునంతట వర్షించుచున్న వని ప్రతీతి గనుక నిట్లు వర్ణింపఁబడియె. అర్థాంతరన్యాసాలంకారము.

1. దనుజ లుండి.

తే. ఉర్విఁ గాదంబినుల యల ♦ యుమ్మనీరు
దొరుఁగఁ గేకులు కేకలు ♦ తోన సేసె
ద్విజత నారణ్యకధ్వని ♦ వినఁగఁ జేసి
గర్భము సుఖచ్యుతము సేయఁ ♦ గడఁగె ననఁగ. 79

టీ. ఉర్విన్ = పుడమిమీఁద, కా...రు-కాదంబినుల = మొయిళ్ళగుంపుల యొక్క, అల=ప్రసిద్ధమైన, ఉమ్మనీరు = ప్రసవజలము (అనఁగా గర్భకోశములో శిశువు నావరించియుండి ప్రసవకాలమున వెలువడునీరు.) దొరుఁగన్ = స్రవింపఁగా, ద్విజతన్=ద్విజత్వముచేతను, (ని. 'దంతవిప్రాండజాద్విజాః' యని యమరము.) ఆరణ్యక ధ్వని = ఆటవికజనము వర్షమురాఁగా వర్షమువచ్చె నని రొదచేయును గనుక నది యను నారణ్యకశాఖయొక్క ధ్వనిని, వినఁగఁజేసి = శ్రుతపఱిచి, గర్భము సుఖచ్యుతము సేయన్ = సుఖప్రసవము గల్గు నట్లొనర్చుటకు, కడఁగెను అనఁగన్=ఉపక్రమించిన వనఁగా, కేకులు = నెమిళ్లు, కేకలు=కేకాస్వరములను, తోన = వెంబడిగానె, చేసెన్ = ఒనర్చెను. ఇచ్చట మేఘోదయమువలన సంతసించిన మయూరములయొక్క కేకలను సుఖప్రసవార్థమైన యారణ్యకశాఖాధ్వనికి హేతు వని యుత్ప్రేక్షించినందున నుత్ప్రేక్షాలంకారము.

తా. లోకమందు వేకటి గల యువిదలకుఁ బ్రసవసమయమునఁ గల్గు నుమ్మనీరు గానుపింపఁగా, నక్కడ నుండు స్త్రీలు దానిం జూచి ప్రసవకాలం బని యూహించి తమలోఁ దాము గొలగొల లాడుట ప్రసిద్ధము గావున నావిధముగా నెమిళ్లు మేఘమ్ముల నుండి యుబ్బనీరు స్రవింపఁగాఁ దాము ద్విజు లగుటంజేసి సుఖప్రసవార్థ మారణ్యకశాఖ నధ్యయనముఁజేసి వినిపించుటకు నుపక్రమించెనో యన్నట్లు వెంబడించి కేకానాద ములం జేసెను.

మ. అలపర్జన్యుఁడు భానుఁ డన్కొలిమిలో ♦ నభ్రంపుఁ బెన్గొప్పెరన్
జల మాఁగన్ బిసుగుక్కుజాత్యపుటయ♦స్కాంతంబునత్తున్కలో
పలఁ జూప న్మహిమీఁదిలోహరజముల్ ♦ పైఁ బర్వె నా లేచె వా
త్యలఁ బ్రాగ్గావమషుల్మాగి ల్మొదల గ్రద్ధంతై దివిం [1]బర్విననన్. 80

టీ. అ...డు-అల=ప్రసిద్ధుఁ డైన, పర్జన్యుఁడు=దేవేంద్రుఁడు (కమ్మరవాఁడు), భానుఁడు అన్=సూర్యుఁ డనియెడు, కొలిమిలోన్ = కొలిమియందు, అభ్రంపుఁబెన్గొ ప్పెరన్=మేఘ మను పెద్దనీళ్ల కాఁగులు, జలము ఆఁగన్=ఉదకములనాపుటకై, పి...

1. లేచినన్.

పు - పిడుగు = అశనియను, ఉల్క = లోహముయొక్క, జాత్యపు = సజాతీయమైన, అయస్కాంతంబు = సూదంటుఱాతియొక్క, అత్తున్కన్ =అతిశకలమును, లోపలన్ = అంతర్భాగమందు, చూపన్ = అలికింపఁగా, మ...ముల్-మహిమీఁది = భూమండలముమీఁద నున్న, లోహరజముల్ = ఉల్కపొడులు, పైన్=పైకి, పర్వెన్ = ఎగసి వ్యాపించెనో, నాన్ = అనునట్లు, వాత్యలన్ = సుడిగాడ్పులచేత, ప్రాగ్దావమషుల్ - ప్రాక్‌దావ=మొదలి వైన కార్చిచ్చులయొక్క, మషుల్ = బూడిదలు, మొగిల్ = మేఘము, మొదలన్ = ప్రప్రథమమందు, గ్రద్దంతై=గ్రద్దంతపరిమాణముగల దై, దివిన్ = అంతరిక్షమందు, పర్విన్కన్ = వ్యాపింపఁగా, లేచెన్ = ఎగసెను.

తా. తొల్దొల్త మేఘము గృధ్రమాత్రమై యంతరిక్షమున నుండునప్పుడు భూమియందున్న కార్చిచ్చుల మషీసమూహములు సుడిగాడ్పులచే నెగురఁగొట్టఁబడి పైకెగసి యందున్న స్వల్పమేఘమును గలయునపుడు పర్జన్యుం డను కమ్మరవాఁడుసూర్యుఁ డనుకొలిమియందు మేఘ మను నీళ్ళకాఁగును నీరు కాఱకుండుటకై పిడుగుక్కునకు సజాతి యైన సూదంటుఱాతి తునకలు లోపల నతుకఁబెట్టఁగాఁ బుడమియం దున్న లోహరజఃపుంజములన్నియుఁ బయికి నెగసి యామేఘము నావరించి వృద్ధిఁబొందించున ట్లుండెను. రూపకోత్థాపితమైన యుత్ప్రేక్షాలంకారము.

తే. ఇలకు డిగి చుట్టిచుట్టి దు । మ్మెత్తి యెగసి
పోయి తము ముంచుసుడిగాలి । పుష్కరములఁ
గడలినీ రభ్రకలభముల్ । గ్రాసె ధరణి
నభ్రకరిశిక్ష దివిఁ గాంచి । నట్టికరణి. 81

టీ. ఇలకున్ డిగి = భూమికి దిగి, చుట్టిచుట్టి = గిరగిరం దిరిగి, దుమ్మెత్తి=ధూళిని గ్రహించి, ఎగసి = మీఁదికెగిరిపోయి, తమున్=తమ్మును (అనఁగా మేఘముల ననుట), ముంచు=కప్పుచున్న, సుడిగాలి = తిరుగుడువాయువును, పుష్కరములన్ = తొండపు కొనలచేత, అ...ల్-అభ్ర = మేఘము లనియెడు, కలభముల్=ఏనుఁగుగున్నలు, కడలి నీరు = సముద్రమునఁ బానముఁ జేసియున్ననీటిని, దివిన్=అంతరిక్షమందు, ధరణిన్= భూమియందు, గ్రాసెన్ = వెళ్ళఁజల్లెను, అభ్రకరి = ఐరావతముయొక్క, శిక్షన్ = నేర్పుటను, కాంచినట్టికరణిన్ = పొందెనోయన్నట్లు, ధరణిన్ = భూమియందు, గ్రాసెన్=వెదల నుమిసెను.

తా. లోకమునం దేనుఁగులు దొండముల కొనలచేత దుమ్మెత్తి పైకిఁ జల్లుటయు ను నీటిని బీల్చి మరల వెళ్ళఁజిమ్ముటయును బ్రసిద్ధముగావున, మేఘము లను నేనుఁగుగున్నలు

భూమియందు లేచిన సుడిగాడ్పు లను కుండములచేత సముద్రోదకమును పానముఁజేసి యైరావతముయొక్క సాహచర్యముచేత నంతరిక్షమం దభ్యాసముఁజేసిన విద్యచేతనో యన్నట్లు మరల వెళ్ళఁజొచ్చెను. ఇది రూపకోత్థాపిత మైన యుత్ప్రేక్షాలంకారము.

తే. కృతపయఃపాననవమేఘపృథుకములకు
రాలె నొయ్యన వడగండ్లపాలపండ్లు
మఱి బలాకాద్విజాళిసంప్రాప్తి గలిగెఁ
బెరుఁగఁ బెరుఁగంగ ధ్వనియు గంభీరమయ్యె. 82

టీ. కృ...కున్-కృత=చేయఁబడిన, పయః = ఉదకములను క్షీరములయొక్క, ('పయఃపానీయ దుగ్ధయోః' యని రత్నమాల.) పాన = త్రాగుటగలిగినట్టి, నవ=క్రొత్తలైన, మేఘ=మొయిళ్ళనియెడు, పృథుకములకున్=పసిబిడ్డలకు, ('పృథుకశ్శాబకశ్శిశుః' అని యమరము.) ఒయ్యనన్=మెల్లమెల్లఁగా, వడగండ్లపాలపండ్లు=వర్షోపలము లను బాల్యదంతములు, రాలెన్ = పడెను, మఱి = వెనుకను, బలాకా = కొంగ లనియెడు, ద్విజాళి = పలువరుసయొక్క, సంప్రాప్తి = ప్రాప్తించుట, కలిగెన్=సంభవించెను, పెరుఁగఁబెరుఁగంగన్ = నానాఁట వృద్ధిబొందఁగా, ధ్వనియు = శబ్దమును, గంభీర మయ్యెన్ = మిగుల నతిశయించెను.

తా. స్తన్యపానముఁజేయు పసిబిడ్డలకు మెల్ల మెల్లనఁ బాలపండ్లు రాలి, మరల పండ్లు మొలవఁగా, నానాఁట వృద్ధిఁబొంది స్వరమతిశయించున ట్లుదకపానము గల నూతన జలధరములకు వడగండ్లను బాల్యదంతములు రాలి, పిమ్మటఁ గొంగలను దంత పఙ్క్తి గల్గి క్రమముగా వృద్ధిఁజెందఁగా గంభీరధ్వని యతిశయిల్లెను. శ్లేషానుప్రాణిత రూపకాలంకారము.

మ. తనతోయం బినరశ్ము లెత్త నిల వాత్యారేణుమూర్తి న్మహేం
ద్రునకుం జెప్పఁగ ముచ్చుఁ బట్ట దివమంతన్ విల్లు టింపన్ భయం
బునఁ దద్రశ్మిసహస్రము న్వెస డిగెం బో డాఁగి వే క్రమ్మఱిం
ప ననం ధారలు దోఁచె మించు వెలిఁగింప న్మబ్బుల న్వెల్లిపెన్. 83

టీ. ఇల=భూమి, త...బు-తన=తనయొక్క, తోయంబు=నీటిని, (తోయ మను శబ్దము దేశ్యమగుటవలన ముఖ్యవస్తువును బోధించుచున్నదిగాన శ్రేష్ఠమైనపదార్థమనుట.) ఇనరశ్ములు = సూర్యకిరణములు, ఎత్తన్=అపహరింపఁగా, వా...ర్తిన్ - వాత్యా=సుడి గాలివలన నెగసినట్టి, రేణు=పరాగరూపమయిన, మూర్తిన్=శరీరముచేత, మహేంద్రున కున్=దేవేంద్రునకు, చెప్పఁగన్=ఎఱింగింపఁగా, ఆయింద్రుండు, ముచ్చున్=దొంగను,

పట్టన్ = పట్టుటకై, దివమందున్ = అంతరిక్షమందు, విల్లు టింపన్ = ధనుస్సును బూనఁగా, భయంబునన్ = భీతిచేత, తద్రశ్మి...మున్ - తత్ = ఆ సూర్యునియొక్క, రశ్మి = కిరణముల యొక్క, సహస్రమున్ = వేయును, వెసన్ = వేగముచేత, డాఁగి = కానరాకయుండి, వే = త్వరితముగా, వెల్లిపైన్ = ప్రవాహముమీఁద, గ్రుమ్మరింపన్ = వర్షించుటకు, డిగెన్ పో = దిగెను గాఁబోలు, అనన్ = అనునట్లు, మించు = మెఱపు వెలిఁగింపన్ = (కనుపించునట్లు) వెలుఁగుచేయఁగా, మబ్బులన్ = మేఘములయందు, ధారలు = నీటి ధారలు, తోఁచెన్ = కనఁబడెను.

తా. భూమి తన యుదకము లను ముఖ్యవస్తువులను సూర్యకిరణములు హరించి కొనిపోయిన వని సుడిగాలిచే రేపఁబడిన పరాగరూపముచుదాల్చి యింద్రునితో మొఱపెట్ట, నాయింద్రుఁ డంతరిక్షమం దాదొంగలను బట్టుటకై తన ధనుస్సును గనుపఱుపఁగా, నందులకు భయమంది సహస్రకిరణములు నేకకాలమందు వానిం గ్రుమ్మరింప నుద్యమించినవో యనునట్లు మేఘములనుండి వచ్చు నుదకధారలు మెఱపుల వెలుంగునఁ గానవచ్చుచుండెను. అలం. ఉత్ప్రేక్ష.

చ. తొలితొలివచ్చుధారల కె(నె)దుర్కొని తచ్ఛటఁ దీఁగెచుట్టుగా
నలముచు ధాత్రి లేచి పొలుపారె మలీమసబాష్పవల్లు ల
త్తొలితొలి ధారకే వెఱచి తోనె ఘనౌఘము వానకాళ్ళకుం
బలరిపుఁ డాలయాభ్రముల భంగినె సంకెల లూన్చెనో యనన్. 14

టీ. తొలితొలివచ్చు = ముందుముందుగ వచ్చుచున్న, ధారలకున్ = నీటిధారలకు, ఎదుర్కొని = ఎదిరించి, తచ్ఛటన్ = ఆధారాసమూహమును, తీఁగెచుట్టుగాన్ = లతాపరివేష్టన మన్నట్లుగా, అలముచున్ = చుట్టుకొనుచు, ధాత్రిన్ = భూమియందు, లేచి = ఉత్థితమై, మ...లు - మలీమస = నల్లనైన, బాష్ప = పొగలయొక్క, వల్లులు = తీఁగెలు, బలరిపుఁడు = ఇంద్రుఁడు, అత్తొలితొలిధారకే = ముందుముందు గురిసినయుదక ధారకే, వెఱచి = మిగుల వర్షించు నని జంకి, తోనె = వెంబడినే, ఘ...కున్ - ఘనౌఘము = మేఘ సమూహముయొక్క, వానకాళ్ళకున్ = ధారలను పాదములకు, ఆ = ప్రసిద్ధమయిన, లయ = ప్రళయకాలమందలి, అభ్రములభంగినె = పుష్కలావర్తాది మేఘములకుఁ బలె, సంకెలలు = నిగళబంధములు, ఊన్చెనో యనన్ = తగిలించెనోయన్నట్లు; పొలుపారెన్ = ఒప్పుచుండెను. (ని. 'సమితి ర్మండలీ పిండీ రింఛోళిః పటలీ ఛటా, మలీమసంతు మలినం కచ్చరం మలదూషితం, బాష్పనేత్రజలోష్మణోః, 'వల్లీగు ప్రగతి ర్లతా' అని యంతట నమరము.)

తా. నేలమీఁదఁ జినుకులు రాలఁగానే యందున్న వేఁడిమి పొగరూపమై పై కెగయుట ప్రసిద్ధము గావున ముందు ముందు వర్షించు నుదకధారలచే గ్రీష్మతప తప్తమైనభూమియొక్క పొగతీఁగ లాధారలనెదుర్కొనుచుండ, దేవేంద్రుండు తొలుదొల్లఁ గనుపడిన యుదకధారలకు వెఱచి ముందు విశేషముగా వర్షించుచున్న శంకచేత మున్ను ప్రళయకాలమేఘము లైన పుష్కలావర్తాదులను నిర్బంధించినవిధమున నీమబ్బులకును సంకెలలు దగిలించెనో యన్నట్లొప్పుచుండెను. ఉత్ప్రేక్షాలంకారము.

చ. ఎడపక మున్ను మింటిపయి నేతగులంబును లేమి మూకతన్
[1]వెడలెడుచోఁ గఠోరఘనబృందము లడ్డమువడ్డ వానిమే
యిడియ జవోష్మఁ బాఱెడురవీందులదట్టపుబండికండ్లచ
ప్పుడుగతి మ్రోసె రేవగలు భూరిభయంకరగర్జ లత్తఱిన్. 85

టీ. ఎడపక = ఎడతెగక, మింటిపయిన్ = ఆకాశమందు, మున్ను = వర్షాకాలమునకుఁ బూర్వమందు, ఏతగులంబును లేమిన్ = ఏ ప్రతిబంధమును లేని కారణమున, మూకతన్ = చప్పుడులేనట్లు, వెడలెడుచోన్ = పోవువేళలందు, క...లు - కఠోర = దట్టమైన, ఘన = మబ్బులయొక్క, బృందములు = గుంపులు, అడ్డము వడ్డన్ = నిరోధింపఁగా, వానిమే=ఆ మేఘముల శరీరము, ఇడియన్ = నలఁగునట్లు, (ఇడియ నన్నది ద్రావిడదేశియము.) జవోష్మన్ = వేగముచేతి వేండ్రముచేత, పా...లన్ - పాఱెడు= పరువిడుచున్న, రవీందుల = సూర్యచంద్రులయొక్క, దట్టపు = సాంద్రమైన, బండికండ్ల=రథచక్రములయొక్క, చప్పుడుగతిన్=ధ్వనివలె, రేవగలు = అహోరాత్రములు, భూరి...లు - భూరి = అధికమగునట్లు, భయంకర = భీకరము లైన, గర్జలు=ఉఱుములు, ఆ త్తఱిన్ = ఆసమయమందు, మ్రోసెన్ = శబ్దించెను.

తా. వర్షాకాలమునకుఁ బూర్వమున నాకాశమం దెడతెగక యేలాటి ప్రతిబంధము లేనికారణమున నిశ్శబ్దముగఁ బోవునప్పుడు దట్టమైన మబ్బులచా శ్రద్ధము రాఁగా, వానికాయములు నలఁగునట్లువేగముచేతివేఁడిమితోఁ బరువిడుచున్న దివాకరశశిపాకరులయొక్క యరదముల చప్పుడులపగిది నహోరాత్రములపు డత్యంతభయంకరములై యుఱుము లుఱిమెను. అలం. వస్తూత్ప్రేక్ష.

చ. దినములవెంబడిం జడనిధి న్మును గ్రోలిననీరిలోనఁ జే
రినలవణంపుఘట్టముల దృష్ట్యదిసమ్మదదావము ల్దవు
ల్కొని పెటిలించునార్భటు లొకో యనఁగా సతటిద్భయంకర
స్తనితములన్ సృజించె నతిసాంద్రఘనాఘనగర్భగోళముల్. 86

1. వెడలెఁ గఠోరమేఘములు వేమరు లడ్డము వడ్డ.

టీ. దినములవెంబడిన్ = దినాలవరుసను, జలనిధిన్ = సముద్రమందు, మును ద్రోలిననీరిలోనన్=మున్ను ద్రావిన యుదకములోపల, పే...లన్ - పేరినన్=ఘనీభవించిన, లవణాంబుఘుట్టములన్ = ఉప్పుబిళ్ళలను, దృ...ల్ - దృప్యల్=అతిశయించినట్టి, ఇరమ్మద=మేఘజ్యోతి యనెడు, చాపముల్ = కార్చిచ్చులు, తవుల్కొని=అంటుకొని, పె...కో అనఁగాన్ - పెటిలించు=పెట్లునట్లుగఁ జేయునట్టి, ఆర్భటులోకా' అనఁగాన్= ధ్వనులోయన్నట్టు, స...లన్ - సతటిద్భయంకర = మెఱుపులతోఁగూడి భయంకరములైన, స్తనితములన్=ఉఱుములను, అతి...ముల్-అతిసాంద్ర=మిగులదట్టమైన, ఘనాఘన=వానకాలపు మొయిళ్ళయొక్క, గర్భగోళముల్=ఉదరప్రదేశములు, సృజించెన్=కావించెను. ('వార్షికాబ్దో ఘనాఘనః' యని యమరము.) ఉత్ప్రేక్షాలంకారము.

తా. మేఘములు నానాఁట సముద్రమందుఁ ద్రావిన నీరు లోపలఁజేరి యుప్పుబిళ్ళలు కాఁగా, వానిని మేఘాగ్నులు దహింప నందుఁ బుట్టిన పెటపెటధ్వనులో యన్నట్లు మించులచేత భయంకరము లైయున్న యుఱుము లామేఘములయందు నొప్పుచుండెను.

మ. ఇనరశ్ముల్ తృష వార్ధిఁ జేరి జల మొక్కింత యాన నాత్మోష్మఁ జు
య్యన వెంటం బొగముంచికో నెగసి వాతాధూతతత్సంధులం
గన నొచుం గళదశ్రులై వడఁకు రేఖం దిక్తటప్రోత్థిత
స్తనయిత్నుచ్ఛటఁ జంచలల్ మెఱసె నాసారంబు దోరంబుగన్. 87

టీ. ఇనరశ్ముల్ = సూర్యకిరణములు, తృషన్=దప్పిచేత, వార్ధిన్ చేరి=సముద్రమునుబొంది, జలము ఒక్కింత ఆనన్=ఉదకమును గొంత పానముచేయఁగా, వెంటన్= వెంటనే, ఆత్మఊష్మన్ = స్వకీయమైన యుబ్బుచేత, చుయ్యనన్=చుయ్యి మని ధ్వని పెట్టఁగా, పొగముంచికోన్ = ధూమము గప్పుకొనఁగా, ఎగసి = అంతరిక్షమున కెగసి, వా...లన్-వాత = గాలిచేతను, ఆధూత = కదలింపఁబడిన, తత్సంధులన్ = ఆమబ్బుయొక్కసందులయందు, కననొచున్=అగపడుచు, గ...లు ఐ-గళత్=జాఱుచున్నట్టి, అశ్రులై=కన్నీళ్లుగలవై (పొగ దగిలినపుడు కన్నుల నీరు గాఱుట ప్రసిద్ధము.) వడఁకు రేఖన్ = కంపించుచందమున, ది...టన్-దిక్తట=దిగంతములయందు, ప్రోత్థిత = పుట్టినట్టి, స్తనయిత్నుచ్ఛటన్=మొయిళ్ళగమియందు, ఆసారంబు=ముసురువాన, దోరంబుగన్ = అతిశయింపఁగా, చంచలల్ = మెఱుపులు, మెఱసెన్ = వెలిఁగెను. (ని. స్తనయిత్నుర్బలాహకః, ధారాసంపాత ఆసారః చఞ్చలా చపలాపి చ' యని యంకట నమరము.)

తా. సూర్యుని కిరణరూపము లగు మేఘములు సముద్రోదకమును బీల్చుతఱిఁ దమయొక్క యూష్మముచేతఁ జుంయ్యుమని శబ్దించుచుండ, వెంటనే పొగ చుట్టికొన్నందునఁ బైకెగసి వాయువుచేతఁ గదలింపఁబడినందువలనఁ, దమయందుఁ గాన వచ్చుచుఁ గాఱుచున్నకన్నీరు గలవై కంపించుచందంబున నున్న మెఱుపులు దిగంతములయందు జనించిన మేఘములయందు జడివాన గురియుచుండఁగాఁ బ్రకాశించెను.

మ. ఇలకుం గల్గినజీవనంబుల నిజానిష్టోగ్రమార్తాండమం
డల మానం దనవైరివైరి సఖుఁ డౌటం దద్రవిం బీల్చి య
య్యిల కొక్కుమ్మడిఁ గుమ్మరింపఁ దగుఁ దానెంతైన నంతైనమం
డలమున్ రాహుపొసంగఁ దాల్చుగతి మింటం బర్వె[1] నీలాభ్రముల్.

టీ. ఇలకున్ =భూమికి, క...లన్-కల్గిన=ఉన్నటువంటి, జీవనంబులన్ =ఉదకములను, ని...ము-నిజ=రాహువునకు, అనిష్ట=శత్రు వైన, ఉగ్ర=తీక్ష్ణమైన, మార్తాండమండలము = సూర్యుని బింబము, ఆనన్ = పానము సేయఁగా, అపహరింపఁగా, త...రి-తన=తనయొక్క, వైరివైరి=పగవాని పగవాఁడు, సఖుఁడౌటన్ =మిత్త్రుఁడగుటచేతను, (అనఁగా లోకమందుఁ దనశత్రునిశత్రువు తనకు మిత్త్రుఁడౌట ప్రసిద్ధముగాన భూమియందున్న జలముల నపహరించిన సూర్యునకు శత్రువైన రాహువునకును భూమికిని మైత్త్రి యనుట.) తద్రవిన్ = ఆసూర్యుని, పీల్చి = ఊఁటుకొని, (మును సూర్యుఁడు హరించిన యుదకములను మరల నాకర్షించి యనుట.) అయ్యిలకున్ = ఆభూమికి, ఒక్కుమ్మడిన్ = ఒకపర్యాయమే, కుమ్మరింపన్ = కురియుటకు, తాన్ = ఆరాహువు, ఎంతైనన్ = ఎంతటియాకృతిగలవాఁ డైనను, తగున్=సమర్థుఁడగునో, అంతైనమండలమున్ = అంతఁగాఁ బెరుఁగుచున్నబింబమును, రాహు=సైంహికేయుఁడు, పొసంగన్= సరిపడునట్లు, తాల్చుగతిన్ = ధారణ మొనరించెనో యన్నట్లు, నీలాభ్రముల్=నల్లమబ్బులు, మింటన్ = ఆకాశమందు, పర్వెన్ = వ్యాపించెను.

తా. ఆకాశమం దంతట వ్యాపించియున్న నల్లమబ్బులను జూడఁగా, భూమి తనజలములను సూర్యుఁడు పానముఁజేసి హరింపఁగా వానిని మరల రప్పించుకొనవలయు నన్న యభిప్రాయముతో సూర్యునకు విరోధియైన రాహువుతోఁ జెప్ప, నతఁడు భూమికి మిత్త్రుఁడౌటంజేసి యాసూర్యకిరణములయం దున్న యుదకములను గ్రహించి వర్షించుట కుద్యమించి తగురీతిఁ దాల్చిన మండలమో యన్నట్లుండెను. ఉత్ప్రేక్షాలంకారము.

తే. పుట్ట [2]వెడలి నభోభిత్తిఁ బట్టుశక్ర
కార్ముకపుఁ బెద్ద పలువన్నెకట్లజెట్టి

1. గాలాభ్రముల్. 2. వదలి.

దైన నడచెడు కాళ్లగుంపనఁగ గాలిఁ
గార్కొని దిగంతముల వానకాళ్లు నడచె. 89

టీ. పుట్టవెడలి = వల్మీకమునుండి బయలుదేఱి, ('శ్లో. వల్మీకాగ్రాత్ప్రభవతి ధనుః ఖండ మాఖండలస్య' యని కాళిదాస ప్రయోగము.) నభోభిత్తిన్ = ఆకాశ మనియెడుగోడను, ప...ది-పట్టు=అవలంబించునట్టి, శక్రకార్ముకపు=ఇంద్రధనుస్సనియెడు, పెద్ద = గొప్ప దైన, పలువన్నె = నానావర్ణములుగల, కట్లజెఱ్ఱిది = కట్లుగలశతపది సంబంధి, ఐన, న...పు-నడచెడు = చనుచున్నట్టి, కాళ్లగుంపు అనఁగన్ = పాదముల చాళ్లనునట్లు, గాలిన్ = వాయువుచేత, కార్కొని=నల్లనివై, వానకాళ్లు=వర్షధారలు, దిగంతములన్ = దిక్తటములయందు, నడచెన్ = ప్రవర్తించెను.

తా. వల్మీకమునుండి వెడలి యాకాశ మనుగోడ నాశ్రయించి నడచుచున్న యింద్రధను స్సనియెడు బహువిధముల వన్నెలు గల కట్లు గలిగియున్న జెఱ్ఱికాళ్లో యనునట్లు నలుగడలయందును వర్షధారలు కానఁబడెను. అలం రూపోత్థాపిత మయిన యుత్ప్రేక్ష.

చ. ఒకచినుకు న్సస్య యగు నుర్వికి డిగ్గఁగ నీవు మూఁగి చా
తకము లటంచు లోఁ గనలి దట్టముగా నలమేఘుఁ డాఁపుచుం
డక చన నూఁదఁగాఁ దొరఁగు నాళిపుటుండలు వోలె రాలెఁ ద
క్కక పడు వర్షధారల ముఖస్థములై కరకానికాయముల్. 90

టీ. ఒకచినుకున్ = ఒక్కబిందువునుగూడ, సస్య=పయిరులోఁగూడినది, అగు ఉర్వికిన్=ఐనభూమికి, చాతకములు=వానకోయిలలు, మూఁగి=చుట్టుకొని, డిగ్గఁగ నీవు= జాఱనీయవు, (తామే వర్షబిందువుల నన్నిటిని పానము చేయును), అటంచున్=ఇట్లా గనుచును, అల=ప్రసిద్ధుఁ డైన, మేఘుఁడు = జలధరుఁడు, లోన్ = లోపలను, కనలి= కోపించి, దట్టముగాన్=నిబిడముగా, ఆఁపుచుండక = సంచరింపక, చనన్=పోవునట్లు, ఊఁదఁగాన్=ముఖవాయువుతో వెళ్లనూఁదఁగా, తొరఁగు=పడుచున్న, నాళపుటుండలు వోలెన్ = క్రోవియందలియుండలవలెను, (లోకమునఁ బిట్టలుపట్టువారు నోటిలో నుండలు వేసికొని గొట్టముతో వానిఁ బిట్టలపైఁ బడున ట్లూఁదుట ప్రసిద్ధము గానఁ బ్రయోగించినాఁడు.) కరకానికాయముల్ = వడగండ్లరాసులు, తక్కక = ఎడతెగక, పడు=పతనమగుచున్న, వర్షధారల=వానకాళ్లయొక్క, ముఖస్థములై=అగ్రములయం దున్నవై, రాలెన్=పడెను. శ్లో. 'సర్వంసహాపతితమంబు న చాతకానా' మని యున్న

ప్రకారము భూసంస్పృష్టజలము చాతకములకు రోగహేతువుగాన నంతరాళముననే గ్రహించుట ప్రసిద్ధము.

తా. చాతకపక్షు లొక బిందువు నైనను సస్యములతోఁ గూడిన భూమియందుఁ బడనీక నడుమనే పానముఁజేసి గుంపై యాడుచుండఁ జూచి, మేఘుఁ డాత్మలోఁ గోపించి యాచాతకపక్షులకు వెళ్లఁగొట్టుటకై పిట్టలం బట్టువాఁడు నోటనించినయుండలకు గొట్టముద్వారమున వెళ్లగొట్టుచందమున, వాఁడు రువ్వు వాళపుటుండలో యనునట్లు నిరంతరవర్షధారాముఖమున వడగండ్లు పడెను. అలం. ఉత్ప్రేక్ష.

సీ. ఎలగోలుజల్లు ము । న్పెళపెళ నేటవా
ల్పడి గాలి నట్టిండ్లఁ । దడిపి చనఁగ;
నట్టె తో వడగండ్ల । కట్టావులు దుమార
మావులు రేఁచి రెండవదియుఁ జన
మఱి మూఁడవది నిల్చి । మెఱసి బిట్టుఱిమి శీ
కరవారిసృష్టిఁ జీఁకటిగ నలమ
నుయ్యెలచేరుల । యోజఁ బైపై వెండి
జల్లుపై జల్లు పె । ల్లల్లుకొనఁగ
తే. భూభృదాపాది దుర్భరాంభోభరంపు
నడి మరుజ్ఝంఝఁ దెరలక । కడవ వంచి
నట్లు హోరని ధారౌఘ । మైక్య మొంది
మిన్ను మన్నును నొకటిగా । వృష్టి బలిసె. ౯౧

టీ. ఎలగోలుజల్లు = మొదటవచ్చిన వానజల్లు, మున్ = ప్రథమమందు, పెళపెళన్ = పెళపెళధ్వనితో, ఏటవాల్పడి = వంపుగా వాలి, గాలిన్ = వాయువుచేతను, నట్టిండ్లన్ = గృహమధ్యభూములను, తడిపి = తడియఁజేసి, చనఁగన్ = పోఁగా, అట్టె = ఆప్రకారమే, తోన్ = వెంబడిగానే, వడగండ్ల = వర్షోపలములయొక్క, కట్టావులు = కావిరులు, దుమారము = పరాగమును, ఆవులు = మట్టివాసనకొట్టుచు లేచునట్టి ఉబ్బలను, రేఁచి = ఎగురఁజేసి, రెండవదియున్ = రెండవదియైనజల్లును, చనన్ = పోఁగా, మఱి = పిమ్మట, మూఁడవది = తృతీయమైన వానజల్లు, నిల్చి = నిలువఁబడి, మెఱసి = మించులను వెలిఁగించి, బిట్టుఱిమి = మిగుల గర్జించి, శీకర = తుంపరలతోఁగూడిన, వారిన్ = ఉదకముచేత, సృష్టిన్ = ప్రపంచమును, చీఁకటిగన్ అలమన్ = అంధకారమగునట్లు చుట్టుకొనఁగా, ఉయ్యెల చేరులయోజన్ = డోలయొక్క గొలుసులవలెను, పైపైన్ = మీఁదమీఁదను, (వెంటవెంట

ననుట.) వెండి=మఱియును, జల్లుపైన్=వర్షముమీఁదను, జల్లు=వర్షము, పెల్లు=అతిశయముగ, అల్లుకొనఁగాన్ = క్రమ్ముకోఁగా, భూ...డిన్ - భూభిదాపాది - భూ=భూమియొక్క, భిదా=భేదమును, ఆపాది=ప్రతిపాదించుచున్న, దుర్భర=భరింపశక్యముగాని, అంభోభరంపు = ఉదకాతిశయముయొక్క, వడిన్=వేగముచేతను, మరుజ్ఝంఝన్ = ఝంఝామారుతముచేతను, ('ఝంఝావాతస్సవృష్టికః' యని యమరము.) తెరలక = తెమలక, కడవ వంచినట్లు=బానకుమ్మరించినవైఖరిని, హోరని=హోరుమను ధ్వనితోఁ గూడి, ధారౌఘము = ధారాసమూహము, ఐక్యమొంది=ఏకీభవించి, మిన్నుమన్నునొకటిగాన్=ఆకాశభూములు రెండు నొక్కటి యగునట్లు, వృష్టి = వర్షము, బలిసెన్ = వృద్ధిఁబొందెను.

తా. పెళపెళధ్వనితో మొదటి జల్లేటవాలుగా వచ్చి గాలిచే గుమ్మములనుండి లోనికిఁ జొచ్చి నట్టిల్లు దడిపి చనఁగా, వెంటనే రెండవజల్లు వచ్చి వేఁడిపొగలు ధూళిపొగలు రేపి చనఁగా, మూఁడవజల్లు వచ్చి కొంతసేపాఁగి యుఱుములతో మెఱుపులతోఁ దుంపరలతో నంధకారబంధుర మొనర్చి చనఁగా, నటుపైని జల్లుపై జల్లు వచ్చి కారుక్రమ్మి దుర్భరవర్షాజలవేశమునకుఁదోడు ఝంఝామారుతము రాఁగా, భూమ్యాకాశము లేకమగునట్లు హోరుమను ధ్వనితో విడువకుండఁగ నేకధారగాఁ గడవలతో నీరుపోసినట్లు వర్ష మధికమయ్యెను.

మ. అలపర్జన్యుఁడు కేకిపాత్రములఁగుం పాడించుచో మేఘమం
డలపున్ మద్దెల గ్రుంగ లేవను మరున్మార్దంగికుం డర్థి నొ
త్త లలి న్నేలకు వ్రాలుచు న్నెగయుచుం [1]దారాడున త్తెల్లజ
ల్లులుఁ గెంగుచ్చులు నయ్యె ధారలును దళ్లోలేంద్రగోపంబులున్.

టీ. ఆలపర్జన్యుఁడు = ఆ యింద్రుఁడు, కే...పు - కేకి = మయూరము లనియెడు, పాత్రముల = నటులయొక్క, గుంపు = సమూహమును, ఆడించుచోన్ = నాట్యమాడించుతఱి, మరుత్‌మార్దంగికుండు = వాయువనెడు మద్దెలకాఁడు, లలిన్ = విలాసముగా, అర్థిన్ = ప్రియముతో, మేఘమండలపున్ మద్దెల = మబ్బులగుంపను మృదంగమును, క్రుంగన్ = క్రిందికి వచ్చుటకును, లేవను = ఉత్థితమగుటకును, ఒత్తన్ = త్రోయఁగా, ధారలును=ఉదకధారలును, నేలకున్=భూమికి, వ్రాలుచున్ = వంగుచును, ఎగయుచున్ = మీఁదికి నెగయుచును, తా...లున్ - తారాడు=తిరాడుచున్న, ఆత్తెల్లజల్లులన్ = ఆ ధవళమయిన జాలరులును, దళ్లోలేంద్రగోపంబులున్ -

1. తారాడు నత్తెల్లజల్లులకున్ గుచ్చులు.

కల్ = ఆ వర్షధారలయందు, లోల = చలించుచున్న, ('చలల్లోలం చలాచల' మని యమరము.) ఇంద్రగోపంబులున్ = ఆర్ద్రపురుగులును, కెంగుచ్చులున్ = ఎఱ్ఱనిగుచ్చులును, అయ్యెన్ = ఆయెను. రూపకాలంకారము; యథాసంఖ్యమును.

తా. ఆ ట్లమోఘముగా వర్షించు సమయంబున నా ప్రసిద్ధుం డగు పర్జన్యుఁడు మయూరము లనునటుల నాడించునవసరంబున మేఘములు మృదంగములుగా, వాయువు మద్దెల వాయించువాఁడుగా, జలధారలు జాలరులుగా, వానియందుఁ జలించుచున్న యార్ద్రపురుగులు కెంగుచ్చులునుగాఁ గన్పట్టెను.

ఉ. ఓహరిసాహరిం బ్రథమ కొల్కెడుధారల గాడ్పు లేటవా
ల్గా హతి నీడ్చి వీఁగుప్రజకలం గలఁప న్మొగు లొందె నంబుభృ
ద్వాహచలద్రథత్వము మొదల్ మెఱుఁగఱ్ఱధ్వజ మెక్క నాటగా
నావదనం జెలంగుజన కాంతము నూళ్లకుఁ బోవ రామియున్.

టీ. ఓహరిసాహరిన్ = అవిచ్ఛిన్నముగా, ప్రథమము = ముందఱగా, ఒల్కెడు ధారల్ = కురియుచున్న నీటిధారలను, గాడ్పులు = వాయువులు, హతిన్ = తమ యొక్క కొట్టుచేత, ఏటవాల్గాన్ = చేటచేర్పుగా, ఈడ్చి = ఆకర్షించి, వీఁగు ప్రజల్ = మఱుఁగులయందు దాఁగిన జనులను, కలఁపన్ = తడిపివ్యాకులపెట్టఁగా, మొగులు=మేఘము, అం...ము-అంబుభృద్వాహ=దేవేంద్రునకు, (ని. 'తురాషాణ్మేఘవాహనః' యని యమరము.) చలద్రథత్వము - చలత్ = కదలుచున్న, రథత్వము = స్యందనభావమును, ఒందెన్=పొందెను, ఈజన మింతకు ముందేల వెళ్లక నిల్చియుండె నను శంకను వారించుచున్నాఁడు.—మొదల్ = తొలుత, మెఱుఁగఱ్ఱధ్వజము = మించనిగొడు టెక్కెము, ఎక్కనాటగాన్ = ఆరోహణముచేయఁగా, ఆవదనన్ = ఆధ్వజారోహణ సమయమందు, చెలంగుజనము = ఉన్న ప్రజలు, ఆంతము=కడవఱకును. ('ఆజీవదర్శేభివ్యాప్తౌ సీమార్థధాతుయోగజే' యని యమరము.) ఊళ్ళకున్ = గ్రామములకు, పోవరామియున్ = పోఁగూడక యుండుటను సయితము, (వాన వెలియు వఱకు ననుట.) నొందె నని పూర్వముతో నన్వయము.

తా. ముందుగ నవిచ్ఛిన్నముగాఁ గురియుచున్న వర్షధార లనుగాడ్పులు విసరుచున్న వేగముచేతఁ జేటచేర్పుగా లాగి, మఱుఁగున దాఁగినట్టి ప్రజలను క్లేశపెట్టఁగా, మేఘము లింద్రునకుఁ జలద్రథ మగుటను బొందెను. లోకమునం దుత్సవాదులలో ధ్వజారోహణకాలమందున్న జనులు ధ్వజావరోహణమువఱకు నచ్చటనే యుండుటప్రసిద్ధము గాన, మిం చనిగొడు ధ్వజము నెత్తగానే యచ్చట నున్న జనులు తుదవఱకు నుండిరో యన్నట్లు కదలుటకు యత్నములేక యావర్షమునందు దడిసిరి. మేఘము లింద్రునికి

రథముగాను, వర్షధారలు లేరుమోకులుగాను, మఱుఁగున వంగిన ప్రజలు రథ మీడ్చు వారుగా నుత్ప్రేక్షింపఁబడెను.

తే. మిగుల నామనిఁ బచ్చచాంపేయకముల
నమ్మి కడపళ్ళఁ దము వైచినాఁడు మగుడ
నాసపడువారి నవ్విన ట్లల్ల విచ్చెఁ
గలయ మూతులు కేతకీగహనతతులు. 94

టీ. మిగులన్ = మిక్కిలియును, ఆమనిన్ = వసంతఋతువునందు, పచ్చచాంపేయకములన్ - పచ్చ = పసుపువన్నెగల, చాంపేయకములన్ = సంపెఁగలను, (ని. 'ఛండీరోఽథచాంపేయ శ్చంపకో హేమపుష్పకః' యని యమరము.) నమ్మి=నిత్యమని విశ్వసించి, కడపళ్లన్ = కడపటను, (కంచెలో ననుట) తమున్ = కేతకులను, వైచి = పడవయిచి, నాఁడు = వర్షర్తువునందు, మగుడన్ = తిరిగియును, ఆసపడువారిన్ = ఆశించెడువారిని, నవ్వినట్లు = అపహసించినట్లు, అల్లన్ = మెల్లగా, కేతకీగహనతతులు = మొగలితోఁటవరుసలు, కలయన్ = అంతటను, మూతులు = ముఖములు, విచ్చెన్ = వికసించెను.

తా. ఆ వర్షర్తువం దంతట వికసించియున్న మొగలిపువ్వులను జూడఁగా, వసంత ఋతువునందుఁ బ్రబలియున్న సంపంగిపువ్వులను నమ్మి తమ్ము గడపట వేసి యిపు డాసంపంగులు లేకపోవుటచేత మరల నపేక్షించుచున్న జనులను జూచి నవ్విన ట్లుండెను. ఆపత్తనమునందుఁ దోఁటలచుట్టును మొగలిపూవు లుండుట ప్రసిద్ధముగానఁ గడపట వేసినట్లు వర్ణించెను. ఉత్ప్రేక్షాలంకారము.

చ. అనయము నందనంపుదివియందున యుండి ప్రసూనవాసనల్
గని పఱతెంచిపోవు నలకారుమెఱుంగులె పోవ రాక చి
క్కెనొ నవగంధలుబ్ధభుజగీపరివేష్టన నా మొగళ్లపిం
డునఁ జెలఁగెం బటింపితగకమ్ము డెగమ్ము బుప్పరేకుమొత్తముల్. 95

టీ. అనయము = ఎల్లప్పుడును, నందనంపు దివియందునె = నందనవనముతోడి యాకాశమునందే (స్వర్గమునందే), ఉండి = కాలము గడపి, ప్రసూనవాసనల్ = నందనోద్యాన కుసుమామోదములను, కని = పొంది, పఱతెంచిపోవు = (వర్షించుటకు భూమికి దిగివచ్చిన మేఘములతోడను) వచ్చి మరలిపోవుచున్నట్టి, అల=ప్రసిద్ధమైన, కారుమెఱుఁగులె = తొలకరిమెఱుపులె, నవ...నన్-నవ = క్రొత్తదైన, గంధ = పరిమళమునందు, (ని. 'గంధేగంధక ఆమోదే లేశేసంబంధగర్వయోః' యని విశ్వము.)

లుబ్ధ = లోభపడుచున్న, భుజగీ = ఆఁడుపాముఁబాములయొక్క, పరివేష్టనన్ = చుట్టుకొనుటచేతను, పోవరాక చిక్కెనో = చనఁజాలక పట్టువడెనో, నాన్ = అనునట్లు, మొగళ్లపిండునన్ = మొగలివనమందు, పసిఁడితగడున్ = బంగారుఱేకును, తెగడున్ = తిరస్కరించుచున్న, పువురేకుమొత్తముల్ = పువ్వులరేకుల సమూహములు, చెలఁగెన్ = ప్రకాశించెను. హేతూత్ప్రేక్ష, వస్తూత్ప్రేక్ష.

తా. ఆ దేశమునందుఁ గంచెలవరుసల నుండెడు మొగళ్లయందుఁ జొక్కపు బంగారు ఱేకులను మించు పువ్వులరేకులఁ జూడఁగా, నాకాశముననే యనవరతమునుండు నందనోద్యానవనప్రసూనపరిమళముల గ్రహించి తమ కాధారము లగు మొయిళ్లవెంట వర్షించుటకై భూమికి నరుగుదెంచి, మరల పోవుచున్న మెఱుపులానవగంధమునందాసక్తములయిన స్త్రీసర్పములచేతఁ జుట్టఁబడి కదలుటకు శక్తిలేక నిలువంబడి యున్నవో యన్నట్లుండెను.

చ. బలుసెక నించువి ల్లడుగుఁవట్టినదే యిపు డాకుబూదిగెం
పులఁ ద్రిరుచిత్వ మూఁది మరుఁముష్టిబిగిం దివిఁ గ్రాయుమౌక్తికం
బులజడి [1]దీన నందఱకుఁ బో యిది యింద్రునిదేని పుట్ట రాఁ
గెలసమొ నాఁగ బోల్విలుజిగిం గరకాస్రుతి నొప్పె మేఘముల్. 93

టీ. బలుసెకన్ = మిక్కుటమగు వెట్టచేతను, (గ్రీష్మకాలమం దనుట.) ఇంచువిల్లు = చెఱకువిల్లు, అడుగువట్టినదే = భూమినిఁ బడవేసినదే, (అనఁగా మొలువవేసినచెఱకే యనుట.) ఇపుడు = ఈవర్షాకాలమందు, ఆకుబూదిగెంపులన్ - ఆకు = పచ్చనియాకుల చేతఁ బసరువర్ణము, బూది = నడుమనుండు తెలుపు, కెంపుల్ = చెఱకున నుండెడి యెఱుపు వీనిచేత, త్రిరుచిత్వము = హారిత శ్వేత రక్తము లనియెడు త్రివిధకాంతులు గలిగి యుంటను, ఊఁది = పొంది, మరుముష్టిబిగిన్ = మన్మథుని పిడికిటిబిగిచేతను, దివిన్ = ఆకసమునందు, మౌక్తికంబులజడి = ముత్యపువర్షము, దీనన్ = ఈ ధనుస్సుచు, క్రాయున్ = వెళ్ళఁగ్రాయును, అందఱకున్ పో = ఎల్లవారికిని పోవుదుజుమీ, ఇది = ఈ ధనుస్సు, ఇంద్రునిదేని = ఇంద్రుని దైన పక్షమున, పుట్టరాఁగెలసమొ = పుట్టలోనుండి యేలవచ్చెను, నాఁగన్ = అనునట్లుగా, పోల్ = చూడఁదగిన, విలుజిగిన్ = ఇంద్రధనుః కాంతిచేత, కరకాస్రుతిన్ = వడగండ్లవానచేత, మేఘము = మొయిళ్లు, ఒప్పెన్ = చెన్నొందెను.

తా. గ్రీష్మకాలమందు వెట్టచేత నిక్షుధనుస్సు నేలం బడియుండి యిప్పు డాకు బూది కెంపు లనియెడు మూఁడు వర్ణములు గలిగిన దై మరుని ముష్టిబిగిచే వెలుపలికి

---

1. జుష్మనం దొరఁగుఁబో.

మాత్తికముల వర్షించుచున్నదిసుమా! అట్లుగాక ఇంద్రుని దైన యీధనుస్సు పుట్టనుండి రావలసిననిమిత్తమే మని తోఁపింపఁజేయుచున్న యింద్రధనుఃకాంతితోఁగూడిన వడగండ్లచేత మేఘము లొప్పుచుండెను. శుద్ధాపహ్నవానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

చ. అతిజల మబ్ధిఁ గ్రోలె నితఁ డంతయు రా నతివృష్టిదోష మౌ
మితి నిపు డబ్దతం బరిణమించినతోయమె చాలుఁ బంట క
న్మతి నలధాత కట్ట గగనంబున వర్తులత న్సమంతతో
[1]వృత మగు సేతుమండలము శ్రీఁ బరివేషము సుట్టె భానునిన్. 97

టీ. ఇతఁడు = ఈ సూర్యుఁడు, అబ్ధిన్ = సముద్రమందు, అతిజలము = మిక్కిలి నీటిని, క్రోలెన్ = పానముచేసెను. అంతయున్ = పానముచేసిన యుదకమంతయును, రాన్ = వచ్చినపక్షమున, అతివృష్టిదోషము ఔన్ = అతివృష్టిరూప మగు నీతిబాధ యగును, మితిన్ = తగుమాత్రముచేతను, ఇపుడు = ఈ సమయమందు, అబ్దతన్ = మేఘత్వముచేత, పరి...మె-పరిణమించిన = ఏర్పడిన, తోయమె = ఉదకమే, పంటకున్ = సస్యములు ఫలించుటకు, చాలున్ = సరిపోవును, అన్మతిన్ = అనునట్టితలంపుచేత, అలధాత = ఆ బ్రహ్మ, కట్టన్ = కట్టగట్టఁగా, గగనంబునన్ = ఆకాశమందు, వర్తులతన్ = వలయాకృతిచేతను, స...ము అగు-సమంతతః = అంతటను, వృత మగు = చుట్టుకొనియున్న, సేతుమండలము = మండలాకారమగు కట్టయొక్క, శ్రీన్ = కాంతిచేత, పరివేషము = వరదగుడి, భానునిన్ = సూర్యుని, చుట్టెన్ = చుట్టుకొనెను.

తా. సూర్యునిఁ జుట్టికొనియున్న పరివేషమును జూడఁగా నీ భానుఁ డబ్ధియం దతిశయముగ నుదకపాన మొనరించియున్నవాఁడు. ఆజలమంతయు వర్షరూపమునఁ గురిసినచో నతివృష్టిదోషము ఘటించును. మేఘరూపము వహించి యిపుడు మితముగ వర్షించిన యుదకము సస్యములకుఁ జాలియున్నయది యని ధాత యాలోచించి యాసూర్యునికిరణములకు గమనములేకుండుటకై పరివేష మను మిషచేత నాసహస్రాంశుని బంధించెనో యన్న ట్లుండెను.

తే. గగనరంగస్థలంబున మిగులఁ బ్రౌఢి
మమునఁ గాలిక [2]నిల్చి కోలము నటింపఁ
బోరి మొగంబున రాలు నిప్పుక లనంగ
గుంపులై రాలె మహి [3]నింద్రగోపతతులు. 98

1. వృతి యగు. 2. నిలి. 3. నింద్రగోపకములు.

టీ. గ...నన్ - గగన=ఆకాశ మనియెడు, రంగస్థలంబునన్ = నాట్యభూమి యందు, మిగులన్ = మిక్కిలి, ప్రౌఢిమమునన్=దిట్టతనముచేత, కాళిక=మబ్బులగుం పసిడి కాళికాశక్తి, (ని. 'మేఘజాలేఽపి కాళికా' యని యమరము.) నిల్చి=నిలువంబడి, కోలము నటింపన్=నాట్యమొనరింపఁగా, (నీలికోలము ధరింపన్ అని శ. ర. పా. అపుడు నీలికోలము = నల్లనివేషము ధరించి నాట్యముచేయఁగా నని యర్థము.) పోరిన్=అధిక ముగా, మొగంబునరాలు=ముఖమునుండి పడుచున్న, నిప్పుకలనంగన్=అగ్నికణములో యన్నట్లు, ఇంద్రగోపతతులు=ఆర్ద్రపురుగులు, గుంపులై = మొత్తములై, మహిన్= భూమియందు, రాలెన్ = పడెను. రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

తా. ఆకాశమనునాట్యభూమియందు మిగులనైపుణ్యముతో మబ్బులగుం పసు కాళికాశక్తి నాట్యము చేయఁగా, నామె మొగమునుండి రాలు అగ్నికణములో యన్న ట్లార్ద్రపురుగులు భూమిపై గుంపులుగఁ బడెను.

క. ద్యుమణికరాళి మొగుళ్లై
యమవస శశి కలయఁ గూర్చి హావ నౌటయు న
య్యమృతపుబిందులె క్రమ్మఱ
నుమిసెడు నన వానఁ గరకలుడుగక రాలెన్. 92

టీ. ద్యు...ళి-ద్యుమణి=సూర్యునియొక్క, (ని. 'ద్యుమణిస్తరణిర్మిత్రః' యని యమరము.) కరాళి = కిరణపఙ్క్తి, మొగుళ్లై=మేఘములై, అమవసన్=అమావాస్య యందు, శశి=చందమామ, కలయన్=కమలోఁ గలియుటవలన, కూర్చి=అమృతబిందువు లను గూడఁబెట్టికొని, (చంద్రుం డమృతకిరణుం డగుటచేత ననుట. అమావాస్యనాఁడు చంద్ర సూర్యు లేకస్థానగతు లౌట ప్రసిద్ధము.) ('దర్శస్సూర్యేందుసంగమః' యని యమరము.) హావనౌటయున్=వేళకాఁగానే, అయ్యమృతబిందులె = అయ్యమృత కణములనే, క్రమ్మఱన్=మఱలను, ఉమిసెడునవన్=వెళ్లఁగ్రక్కుచున్నవో యన్నట్లు, వానన్ = వర్షములోను, కరకలు=వడగండ్లు, ఉడుగక=ఎడతెగక, రాలెన్=పడెను.

తా. అవిచ్ఛిన్నముగా వర్షములోఁగూడ రాలుచున్న వడగండ్లను జూడఁగా, సూర్యకిరణములు మేఘములై యమావాస్యయందుఁ జంద్రునితోఁగూడి గ్రహించి కొని కూడఁ బెట్టియున్న యమృతబిందువులను సమయము తటస్థింపఁగా మరల వెళ్ళఁ గ్రక్కుచున్నవో యన్నట్లుండెను.

చ. స్ఫురణ మొగుళ్లపై మొవలఁ బొల్చె జంస్రుతి నాఁడునాఁటికిం
గరఁగుచుఁ బుట్టుమంచుమణికారుకరత్తిమ యెల్ల వెల్లిఁ గొ

న్నురుగులు గట్టినట్టులు గనుంగొన [1]నయ్యె సురేంద్రగోపముల్
గరఁగినవింటియప్పసరుకైవడిఁ [2]దెట్టెలుపెట్టుపచ్చికన్. 100

టీ. స్ఫురణన్ = ప్రకాశముచేత, మొగిళ్లపైన్ = మేఘములమీఁద, మొదలన్ = ప్రథమమందు, పొల్చి=ఒప్పి, జ...లిన్ - జల=ఉదకముయొక్క, స్రుతిన్ = స్రవణముచేతను, నాఁడునాఁటికిన్ = దినదినమునకు, కరఁగుచున్ = కరఁగిపోవుచు, పుట్టుచున్=ఉత్పత్తియగుచు, ఉం...మ ఎల్లన్-ఉండు=ఉన్నటువంటి, మణికార్ముక= ఇంద్రధనుస్సుయొక్క, రక్తిమ ఎల్లన్ = ఆరుణ్యమంతయును, వెల్లిన్=వఱదయందు, కెన్నురుఁగులు గట్టినట్టులు = రక్తవర్ణముగల ఫేనము లయినట్లు, కనుంగొననయ్యెన్= చూడ సొంపై యుండెను, కరఁగిన = ద్రవించి స్రవించిన, వింటియప్పసరుకైవడిన్= ఆమణి ధనుస్సుయొక్క యాకుపచ్చవర్ణమువలె, తె...కన్ - తెట్టెలుపెట్టు=సాంద్రమగు, పచ్చికన్=పచ్చికయందు, సురేంద్రగోపముల్ = ఆర్ద్రపురుగులు, కనుంగొనన్ ఒప్పెన్ - అని క్రిందికి నన్వయము.

తా. ఇంద్రధనుస్సుయొక్క యెఱ్ఱఁదనమంతయు మొదట మేఘములపైఁ బ్రకాశించి జలపాతముచేఁ గ్రమక్రమముగఁ గరఁగుచుఁ బుట్టుచుఁ దుదకు వఱదయం దెఱుపు రంగుగల నురుగులైనట్లు కనుపట్టఁజొచ్చెను. కరఁగిపోయినయింద్రధనువుయొక్క యాకుపచ్చవర్ణమువలె నొప్పు పచ్చికయందు నార్ద్రపురుగులు ఎఱుపునురుఁగులవలె నొప్పెను.

చ. పెళపెళ మబ్బు బిట్టుఱుమ భీతి విదూరశిలాంకుర [3]చ్ఛటో
త్పులకినియై ప్రియు న్నిదుర వోవుహరి న్వడిఁ గౌఁగిలింపఁగాఁ
దలరి ధరిత్రి సాఁచుగరు[4] దాల్చినకే లనఁ గంకణంపుమ్రోఁ
తలఁ బులు దేల వంపు[5] పయిఁదాల్చి నదు ల్వడిఁ జొచ్చెనారిధిన్.

టీ. మబ్బు = మేఘము, పెళపెళన్=పెళపెళ మని, బిట్టుఱుమన్=విశేషముగా గర్జింపఁగా, భీతిన్=భయముచేతను, వి...ని వి-విదూరశిలా = వైదూర్యములయొక్క, అంకుర = మొలకలయొక్క, ఛటా=సమూహముచేతను, (ఛల యను పాఠమున వ్యాజముచేత నని యర్థము.) ఉత్=ఉద్గతమైన, పులకిని యై=రోమాంచముఁగలదై, మేఘము లుఱుమఁగా వైదూర్యాంకురములు పుట్టుట ప్రసిద్ధము. (శ్లో. 'విదూరభూమిర్నవమేఘశబ్దా దుద్భిన్నయా రత్నశలాకయేవ' అని కాళిదాసమహాకవిప్రయోగము.) ప్రియున్= ఇష్టుఁడైనట్టియు, ని...రిన్-నిదురవోవు=నిద్రించుచున్న, హరిన్=శ్రీకృష్ణస్వామిని,

---

1. నొప్పెఁ దవింద్రగోపముల్. 2. దెట్టువ గట్టుపచ్చికన్. 3. చ్ఛలో.
4. దాలుపు: గేళ్లన. 5. వెస.

వడిన్ = వేగముచేత, కౌఁగిలింపఁగాన్ = ఆలింగన మొనరించుటకొఱకు, తలరి=త్వర పడి, ధరిత్రి = భూమి, చాఁచు...లు-చాఁచు=ప్రసరింపఁజేసినట్టియు, గరు తాల్చిన = పులకాంకురితమైనట్టి, కేలు అనన్=హస్తమో యన్నట్లు, కంక...లన్ - కంకణంపు= కంకణపక్షు లనియెడు వలయములయొక్క (జాత్యేకవచనము.) మ్రోఁతలన్=శబ్దముల చేతను, పులు=పచ్చికసవు, తేలన్=మునుంగక పైనుండునట్లు, వండు=బురద, పయిన్ = మీఁదను, తాల్చి=ధరియించి, నదుల్ = ఏఱ్లు, వడిన్=వేగముతో, వారిధిన్=సముద్ర మందు, చొచ్చెన్ = ప్రవేశించెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. మేఘములు పెళపెళ మని యుఱుమఁగా భూదేవి భీతినొంది నిద్రవోవు తన భర్త యగు శ్రీమహావిష్ణువును గౌఁగిలించుకొఱకుఁ జాఁచిన పులకాంకురములు గల హస్తమో యన్నట్లు కంకణధ్వనులు విస్తరిల్లఁగా వండునీళ్లతోఁ బచ్చికసవును బైనిఁ దాల్చి ప్రవాహములు సముద్రమును బ్రవేశించెను.

తే. కేకిషడ్జంబె తక్కఁ గోకిలపుఁబంచ
మం బఱుటఁ దోయిపదరులు ॥ మదిఁ(జి)బొసఁగమి
నదియుఁ బ్రియుఁ గూర్ప నదులచోఁ ॥ నమృత మయ్యెఁ
బ్రోషితలఁ జేరికకు నంపు ॥ బోఁటివోలె. 102

టీ. కేకిషడ్జంబె తక్కన్=నెమిలియొక్క షడ్జస్వరముదప్ప, (ని.'షడ్జం మయూరో వదతి పికః కూజతి పఞ్చమ' మ్మని యమరము.) కో...బు-కోకిలపు = కోయిలయొక్క, పంచమంబు = పంచమస్వరము, అఱుటన్ = లేకపోవుటవల్ల, తో...లు - తోయి = మేఘములయొక్క, పదరులు = ధ్వనులు, (ఉఱుము లనుట.) మదిన్ పొసఁగమిన్ = మనంబునకుఁ దగనివై యుండుటవలన, అదియున్ = ఆషడ్జస్వరమును, ప్రియున్ = వల్లభుఁడైన సముద్రుని, కూర్పన్ = కూర్చుటకై, నదులచోన్ = సరిత్తులపట్లను, అమృతమయ్యెన్ = సుధారసమాయెను. (హితమాయె నని యర్థము.) ప్రోషితలన్ = విరహిణులయిన స్త్రీలను, చేరికకున్ = నాథుల పొందునకు, అంపు...లెన్ - అంపు = పంపునట్టి, బోఁటివోలెన్ = మందయానవలె, హితమయ్యె నని క్రిందికి నన్వయము. (శ్లో. 'దేశాంతరగతే కాంతే ఖిన్నా ప్రోషితభర్తృకా' యని వారిలక్షణము.)

తా. వర్షాకాలమునందు నెమిళ్లయొక్క షడ్జస్వరముదప్ప కోయిలలయొక్క పంచమస్వరము లేమిఁజేసి మేఘములయొక్క గర్జనధ్వను లుల్లమునకు నిష్టములుగాక యాషడ్జస్వరమే విరహిణులై యున్న వామలోచనలను దమతమనాథులచెంతకుఁ జేర్చు నట్టిబోఁటివలె నదులకు వానికిఁ బ్రియుండయిన సముద్రునిఁగూర్చుట విషయమై యిష్ట

మాయెను. ఇచ్చట మయూరమునకు నదీసముద్రములకు దౌత్యవర్ణనముఁ జేయుటవలన దూతీసామ్యము చెప్పఁబడెను గనుక నుపమాలంకారము.

తే. తతతనువు రాహు సోమామృతంబు మ్రింగఁ
జక్రి దునిమిన మెడగంటి చాయఁ బొలిచె
నసితమేఘస్థమణిధను వాసుదర్శ
నం బనఁగ నింగిఁ బ్రతిసూర్య బింబ మలరె. 103

టీ. అ...వు-అసిత=నల్లనైన, మేఘస్థ = మేఘమందున్న, మణిధనువు=ఇంద్రధనుస్సు, త...హు-తత = విస్తారమయిన, తనువు = దేహముగల, రాహు=సైంహికేయుండు, సోమామృతంబు = చంద్రసుధను, మ్రింగన్=కబళింపఁగా, చక్రి=శ్రీమహావిష్ణువు, దు...యన్-దునమిన = ఖండించిన, మెడ=కంఠమందలి, గంటి = గాయము యొక్క, చాయన్ = పోలికచేతను, పొలిచెన్ = ఒప్పెను, ప్రతిసూర్యబింబము = ప్రతిఫలితసూర్యబింబము, ఆసుదర్శనం బనఁగన్ = దునిమి యావంక నిలిచియున్న చక్రమో యన్నట్లు, నింగిన్ = ఆకాశమందు, అలరెన్ = ప్రకాశించెను.

తా. మితిలేని శరీరము గల రాహువు చంద్రునియందున్న యమృతకళ గ్రసింపరాఁగా, శ్రీమహావిష్ణువుచేత ఖండింపఁబడిన కంఠమందలి గాయముమాడ్కి మేఘమధ్యమం దింద్రధనుస్సును, ఆరాహుకంఠమును ఛేదింపవచ్చియున్న చక్రమువలెఁ బ్రతి సూర్యబింబమును బ్రకాశించెను. ఉత్ప్రేక్షాలంకారము.

చ. స్వరుఖరతాబ్రసాహిరిపుజాలమదాచిరరుక్శిఖిప్రభా
కరక[1]బకాతివాస్స్రుతికిఁ గా లవణేక్షుసురాజ్యదధ్యుదా
కరములు దుగ్ధశుద్ధజలకంధులు నాఁ గలయట్టిసప్తసా
గరముల మేఘుఁ డానె నొకోకా యనఁగాఁ గనుపట్టె వీనిచేన్. 104

టీ. వీనిచేన్ = స్వరుఖరతాదిగుణములు గలిగియుండుటచేత, స్వ...కన్ - కాన్ - స్వరు = పిడుగునకు, ఖరతా = తీక్ష్ణతగలుగుటకొఱకును, అబ్రస - అప్ = ఉదకమునకు, రస = మాధుర్యము గల్గుటకొఱకును. అహిరిపుజాల = నెమిళ్ళగుంపులకు, మద = గర్వము గలుగుటకొఱకును, అచిరరుక్ = మెఱపు లనియెడు, శిఖి = అగ్నికి, ప్రభా = దీప్తిగలుగుటకొఱకును, కరక = వడగండ్లకొఱకును, బక = కొంగలకొఱకును, అతివాస్స్రుతికిఁగాన్ = శుద్ధోదకమును వర్షించుటకొఱకును, (ని. 'శతకోటిస్స్వరుశ్శంబో దంభోళిరశనిర్ద్వయోః, నీలకంఠో భుజంగభుక్, వర్షోపలస్తు కరకః, ఆపస్త్రీభూమ్ని

1. బకాచ్ఛవాస్స్రుతులకై.

వార్వారి' యని యంతట నమరము.) మేఘుఁడు = అభ్రము, లవణ=ఉప్పుయొక్కయు, ఇక్షు = చెఱకుపాలయొక్కయు, సురా = కల్లుయొక్కయు, ఆజ్య = నేతియొక్కయు, దధి = పెరుగుయొక్క, ఉదాకరములు = సముద్రములును, దుగ్ధ = పాలయొక్కయు, శుద్ధజల = మంచినీళ్ళయొక్కయు, కంధులు = సముద్రములు, సాకల్యట్టి = అనుపేళ్లలోనుండునట్టి, (లోనగునట్టి యనుపాఠము పొసఁగియుండమింజేసి దిద్దుపాటు చేయఁబడెను.) సప్తసాగరములన్ = సప్తసముద్రములను, ఆనెనొకొ = పానము చేసెనాయేమి, అనఁగా = అనునట్లు, కనుపట్టెన్ = చూపట్టెను. హేతూత్ప్రేక్షాలంకారము. యథాసంఖ్యాలంకారమును.

తా. మేఘములయందు స్వరుఖరతాది గుణములు గనుపట్టుటంజేసి తత్తద్గుణహేతుభూతంబు లైన సప్తసముద్రములయందు నీ జలధరంబు లుదపాన మొనరించి వచ్చెనో యన్నట్లు గానంబడుచుండెను.

మ. తనిమం బచ్చమెఱుంగుగోఁచియు మణీధనుర్జ్వలాషాఢముం
గొని పుట్టం గొడుగబ్బ నెమ్మిపురియాకు ల్విప్పి శబ్దంబు మిం
చ నతస్ఫారరజోబలిత్వమున నుచ్చస్ఫూర్తి మిన్దన్ని వే
ఘననీలాంగుఁడుగాంచెఁబాద[1]సలిలౌఘుంబుల్ మరుత్సృష్టమున్. ౧౫

టీ. తనిమన్ = సూక్ష్మత్వములోఁగూడిన, ప...యున్ - పచ్చ = పచ్చని, మెఱుంగు = మెఱుపనియెడు, గోఁచియున్ = కౌపీనమును, మ...మున్-మణీధన్వ= ఇంద్రచాప మనియెడు, ఉజ్జ్వల = వెలుంగుచున్న, ఆషాఢమున్ = దండమును (ని. 'పాలాశో దండ ఆషాఢ' యని యమరము.) కొని = వహించి, పుట్టన్ = పుట్టయందు, గొడుగబ్బన్ = పుట్టగొడుగనుగొడుగు గలుగఁగా, నె...ల్ - నెమ్మిపురి = నెమిలిపింఛ మనియెడు, ఆకు ల్విప్పి=పొత్తమందలియాకులు విచ్చి, శబ్దంబుమించన్ = ఉఱుములనియెడు వేదవాక్యములు బయలుదేఱఁగా, (శేకాధ్వను లనియెడు వేదవాక్యములనియైనఁ జెప్పవచ్చును.) న...న్-నత = అడఁగిన, స్ఫార = అతిశయమైన, రజః బలిత్వమునన్ = పరాగ మను బలిచక్రవర్తి గలుగుటచేతను, ఉ...ర్తిన్-ఉచ్చ = ఉన్నత మైన, స్ఫూర్తిన్ = పటిమచేతను, వేఁశీఘ్రముగ, మిన్దన్ని = ఆకాశమందు నిలిచి, ఘననీలాంగుఁడు - ఘన = మేఘమనెడు, నీలాంగుఁడు = వామనుఁడు, మరుత్ = దేవతలచేతను వాయువుచేతను, సృష్టమున్ = కల్పింపఁబడిన, పాదసలిలౌఘుంబుల్ = పాద్యోదక ప్రవాహమును (వానకాల్వను), కాంచెన్ = పొందెను.

---

1. పలితా.

తా. చిన్న పచ్చని మెఱుపనెడి గోఁచియు, నింద్రధనుస్సను దండమును దాల్చి, పుట్ట గొడు గను ఛత్త్రము లభింపఁగా నెమలిపింఛ మను గ్రంథమునందలి పుటలు విప్పి, యుఱుము లను వేదవాక్యములతో నడఁగిపోయిన పరాగ మను బలిచక్రవర్తిచే గొప్ప శక్తిచే నాకాశమును దన్ని వాయు వనుదేవతచే వానకా ళ్ళనుపాద్యోదకమును మేఘుఁడును వామనమూర్తి పొందెను. మేఘుఁడు మెఱుపు మొదలగు లక్షణములను వహించి యుండఁగాఁ బసుపుగోఁచి మొదలగువానిని ధరించియున్న వామనస్వామిగా రూపింపఁబడెను. కాన నిట రూపకాలంకారము.

క. ఘనవృష్టికతన ఫణు లే
పున నలవల్మీకరంధ్రములు మూయఁగ నె
త్తినగొడుగు లనఁగ ఛత్త్రా
కనికాయం బవనినెల్లకడలం బొడమెన్. 106

టీ. ఘనవృష్టికతనన్ = ఎక్కుడు వానలు గల్గుటచేతను, ఫణులు = సర్పములు, ఏపునన్ = ఉదుటుచేతను, అల = ప్రసిద్ధములయిన, వల్మీకరంధ్రములు - వల్మీక = పుట్టలయొక్క, రంధ్రములు = బిలములను, మూయఁగన్ = కప్పుటకొఱకు, ఎత్తిన = పైన నిలిపిన, గొడుగు లనఁగన్ = ఛత్త్రము లనునట్లు, ఛత్త్రాకనికాయంబు = పుట్టగొడుగులయొక్క సమూహము, అవనిన్ = పుడమియందు, ఎల్లకడలన్ = సకలదిక్కుల యందును, పొడమెన్ = పుట్టెను.

తా. మిక్కుటముగా వర్షములు గురియుచుండఁగా సర్పములు దమ నివాస స్థానములయిన పుట్టలకలుఁగు మూయుటకై యెత్తిన ఛత్త్రములో యన్న ట్లెల్లదిక్కుల యందును బుట్టగొడుగులు కానవచ్చెను. ఉత్ప్రేక్షాలంకారము.

ఉ. సారెకు మింట మేఘుఁడు నిజస్ఫురణం బఱః క్రూర మా పురోం
గారకయోగమూఁది తిరుగన్ సకుటుంబముఁ దద్గ్రహంబు నెం
తే రుష ద్రొబ్బ నంతలును నింతలునై పడుతన్న భస్స్వలాం
గారశిఖప్రతానముల కైవడి రాలె సురేంద్రగోపముల్. 107

టీ. మేఘుఁడు = వలాహకుఁడు, మింటన్ = అంతరిక్షమందు, సారెకున్ = మాటిమాటికిని, ని...బు-నిజ = తనయొక్క, స్ఫురణంబు = స్ఫూర్తి, అఱన్ = చెదు నట్లు, క్రూరమా = కఠినమైనట్టి, పురోంగారకయోగమూఁది = పురోంగారక మను నవ యోగము వహించి, తిరుగన్ = అచ్చటనుండి మరలఁగా, (శ్లో. 'పురోంగారే త్వనావృష్టిః పురశ్శుక్రే ప్రవర్షతి' అని జ్యోతిశ్శాస్త్రమునం దున్నది) సకుటుంబమున్ = దారపుత్త్రాదులతో నున్న, తద్గ్రహంబున్ = ఆ యంగారక గ్రహమును, ఎంతేరుషన్ = అధిక

మైన కోపముచేతను, ద్రొబ్బన్ = క్రిందికిఁ బడఁద్రోయఁగా, అంతలు నింతలు నై = ఇంతంతతునియలై, కడు=పడుచున్నట్టియు, త...డిన్ - తన్నభః = ఆయాకాశము వలనను, చ్యుత=జాఱిన, అంగార=అంగారకునియొక్క, శిశుప్రతానముల కైవడిన్ = పిల్లల గుంపులవలె, (ని. 'అంగారాభూసుతోల్ముకే' యని రత్నమాల.) సురేంద్రగోప ముల్ = ఇంద్రగోపపురుగులు, రాలెన్ = పడెను.

తా. ఇంద్రగోపములు పుడమియందు రాలఁగా, మేఘుఁ డంతరిక్షమునందుఁ దన మహిమను నంగారకగ్రహము పురోంగారకయోగమును వహించి యడంచుచుండం జూచి, పిమ్మట నాయోగమును వదలి వెళ్లుచున్న యాయంగారకగ్రహమును దారపుత్రాదులతో నత్యంతరోషముచేత భూమిపయిం బడద్రోయఁగాఁ దుత్తుమురులై పడుచున్న దాని పిల్లలో యన్నట్లుండెను.

క. కాకోదరాహితుల వ
ల్మీకంబులఁ దూర్చె మెఱసి । మేఘుం డని గుం
పై కనుఁగొని పొగడెదు నన
భేకధ్వను లెసఁగె వృత్త । భేదానుకృతిన్. 108

టీ. కాకోదరాహితులన్-కాకోదర=సర్పము లనియెడు, అహితులన్ = శత్రువులను, మెఱసి = మెఱుపుల మెఱయఁజేసి, మేఘుండు = ఘనుఁడు, వల్మీకంబులన్ = పుట్టలను, దూర్చెన్ = ప్రవేశింపఁజేసెను, అని=ఈలాగని, గుంపై = మొత్తములై, కనుఁగొని = చూచి, పొగడెదు ననన్ = స్తోత్రము చేయుచున్నవో యనునట్లు, వృత్తభేదానుకృతిన్ - వృత్తభేద = మండూకాది వృత్తభేదములయొక్క, అనుకృతిన్ = అనుకరణముచేతను, భేకధ్వనులు = కప్పకూఁతలు, ఎసఁగెన్ = అతిశయించెను.

తా. అపుడు మండూకాదివృత్తభేదముల ననుకరించు భేకధ్వనులు గలుగఁగా, నవి మేఘుఁడు తమకు శత్రువులైన సర్పములను మెఱుపుల మెఱయంజేసి పుట్టలలోఁ బ్రవేశింపఁ జేసె నని తలంచికొని సంతోషించి గుంపుగూడి యా మేఘమును బొగడుచున్నవో యన్నట్లుండెను. క్రియానిమిత్తక్రియాస్వరూపోత్ప్రేక్ష.

తే. మొగిలు పైచీఁకటులు నెక్కొ । జిగి మెఱుఁగులఁ
బగలు రాతిరి రాతిరి । పగలు చేసె
సకలమును నిద్రపుచ్చు కేశవుని నిద్ర
పుచ్చు ఘనునకు నిట్టి దద్భుతమె [1]తలఁప. 109

1. యనఁగ.

టీ. మొగిలు=మేఘుఁడు, మై చీఁకటులన్-మై=శరీరముయొక్క, చీఁకటులన్= అంధకారముచేతను, ఎక్కుజిగిమెఱుఁగులన్ = అధికమైన కాంతిగల మెఱుపులచేతను, పగలు = దినమును, రాతిరి = రేయిగా, రాతిరి=నిశను, పగలు = దినముగాను, చేసెన్= కావించెను. సకలమును = సర్వప్రపంచమును, నిద్రపుచ్చు = ప్రళయకాలమందుఁ దన యుదరంబున నునిచికొని నిద్రింపఁజేయునట్టి, కేశవునిన్ = శ్రీమహావిష్ణువును, ని... డున్ - నిద్రపుచ్చు = సుప్తిబొందించుచున్న, ఘనునడున్ = మేఘునడును, అధికున డును, (భగవంతుఁడు వర్షాకాలమందు యోగనిద్రాసక్తుఁ డని ప్రసిద్ధముగాన నిద్రపుచ్చు నని ప్రయోగించెను.) ఇట్టిది = పగలు రాత్రి, రాత్రి పగలుగాఁజేయుట, తలఁపన్ = విచారింపఁగా, అద్భుతమె = ఆశ్చర్యమా! కా దనుట. అర్థాపత్త్యలంకారము. యథాసంఖ్యాలంకారముగూడఁ గలదు.

తా. పెనుచీఁకటిచేతను జొక్కుపుమెఱుపులచేతను మేఘుఁడు రాత్రిని బగలుగను బగటిని రేయిగ నొనర్చె, ననఁగా నంధకారము గ్రమ్ముకొనునట్లుగాఁ జుట్టికొని వర్షించుచు మెఱపులు మెఱయుచుండెను. సమస్త విశ్వములను యోగనిద్రాసక్తుఁ డగు విష్ణుమూర్తి తన యుదరమున నుంచుకొని సుషుప్తి నొందించును గాన నట్టి శ్రీ విష్ణుమూర్తినే నిద్రింపఁజేయు మేఘుఁడు రాత్రి పగలు పగలు రాత్రి చేయఁగలుగుటలోనే యాశ్చర్యమును లేదుగదా!

తే. ధూళి యడఁగిన మఱి మింటఁ దోఁచె శంప
జలధర ద్రోణి మన్ను పర్జన్యుఁ డెత్తి
ఖనదిఁ ద[1]చ్ఛ్రీవిభూషేచ్ఛఁ గడుగ మెఱయు
మృదుమహీగతవసురజోరేఖ యనఁగ. 110

టీ. ధూళి = దుమ్ము, అడఁగినన్ = అడఁగఁగా, మఱి = పిమ్మటను, మింటన్ = అంతరిక్షమందు, శంప = మెఱపు, తోఁచెన్ = కనుపించెను, పర్జన్యుఁడు = ఇంద్రుఁడు, జ...ణిన్-జలధర=మేఘమనియెడు, ద్రోణిన్=దోనియందు, (అనఁగా జలగడుగువాఁడు మసికట్టుకడిగెడు పలక యనుట,) మన్నున్ = భూమియందలి ధూళి రూపమైన మృత్తికను, ఎత్తి = ఉంచికొని, ఖనదిన్ = ఆకాశగంగయందు, తచ్ఛ్రీ విభూషేచ్ఛన్-తచ్ఛ్రీ=ఆగగనలక్ష్మికి, విభూషేచ్ఛన్ = భూషణముకొఱకైన యిచ్ఛ చేతను, కడుగన్ = క్షాళనముచేయఁగా, మెఱయు=జ్వలించుచున్న, మృదుమహీగత= మృదువైన భూమియందున్న, వసు=బంగారముయొక్క, రజః = ధూళియొక్క, రేఖ యనఁగాన్ = చాలనఁగా, తోఁచె నని క్రిందటి కన్వయము.

---

1. తచ్ఛ్రి.

తా. వర్షముచేత భూమియందలి దుమ్మడఁగఁగాఁ బిమ్మటఁ గానవచ్చిన విద్యుల్లత, పర్జన్యుఁడు మేఘమను దోనెయందు భూపరాగము నెత్తికొని గగనలక్ష్మికి భూషణములు చేయవలయు నన్న యిచ్ఛచేత నాకాశగంగయందుఁ గడుగఁగా బ్రకాశించుచుండెను. రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

తే. స్థూలపరిపక్వకాననోదుంబరాగ్ర
రంధ్రముల వాననీరు సొరంగ వెడలె
మశకపఙ్క్తులు దావధూమంబు లడఁగ
రచ్చ సేయంగ వెడలె విశ్రాంతి కనఁగ. 111

టీ. స్థూ...లన్-స్థూల = గొప్పలై, పరిపక్వ=పండియున్న, కానన = అడవి యందలి, ఉదుంబర=మేడి పండ్లయొక్క, అగ్ర = తుదలయందున్న, రంధ్రములన్ = బెజ్జములయందు, వాననీరు సొరంగన్ = వర్షోదకము ప్రవేశింపఁగా, మశకపఙ్క్తులు= దోమలచాళ్లు, దావధూమంబులడఁగన్=కాఱుచిచ్చుల పొగలణఁగఁగా, విశ్రాంతికిన్= శ్రమము దీఁగొట్టుకొనుటకొఱకు, రచ్చసేయంగన్ = కొలువుసేయుటకు, వెడలెను అనఁగన్ = బయలుదేఱె నన్నట్లు, వెడలెన్ = బయలుదేఱెను.

తా. వానలు మెండుగాఁ గురియుటచేత నడవియందలి పరిపక్వములైన మేడి పండ్లనుండి దోమలగుంపులు వెడలెను. అవి కాఱుచిచ్చులు చల్లాఱుటంజేసి విశ్రాంతి కొఱకుఁ గొలువుచేయ నాలోచించి బయలువెళ్లెనో యన్నట్లుండెను.

స్రగ్ధర. గ్రావాళిం గేతకీకోరకకుటజరజోరాజి దూర్వాంకురశ్రీ
తో వీక్షింపం దినానుత్రుటి మఱుపడుచుందోఁచు నిట్లా తిరోభా
వావిర్భావంబులం బొరయక పొరయ నభస్స్వభ్రము ల్గప్పి పై నెం
తే విప్పె పింఛికల్ బర్హిణులు దిరుగఁ బెల్లింద్రజాలంబుఁజూపెన్.

టీ. గ్రావాళిన్-గ్రావ = పర్వతములయొక్క, ఆళిన్=సమూహమందు, (ని. 'అద్రిగోత్రగిరిగ్రావాచలశైలశిలోచ్చయాః' యని యమరము.) కే...జి-కేతకీకోరక= మొగలిమొగ్గలయొక్కయు, కుటజ=కొండమల్లెమొగ్గలయొక్కయు, (ని. 'కలికాకోరకః పుమా' ననియు, 'కుటజో గిరిమల్లికా' యనియు నమరము.) రజోరాజి=పరాగపఙ్క్తి, దూ...తోన్-దూర్వాంకుర = గరికమొలకలయొక్క, శ్రీతోన్ = సంపదతో, వీక్షింపన్=చూడఁగా, ది...టిన్-దిన=పగటియొక్క, అనుత్రుటిన్ = ప్రతిక్షణమందును, (ని. 'స్త్రియాం మాత్రాత్రుటిః పుంసి' యని యమరము.) మఱుపడుచున్ = కనుపడక యుండుచును, తోఁచుచున్ = కనఁబడుచును, ఇట్లా=ఈప్రకారముగను, తిరోభావా

విర్భావంబులన్ - తిరోభావ = కనఁబడకయుండుటను, ఆవిర్భావంబులన్ = కనఁబడుటను, పాయక = ఎడతెగక, పొరయన్ = పొందఁగా, నభస్సు = శ్రావణమాసము, అభ్రముల్ = మేఘములను, కప్పి = పఱపి, పైన్ = మీఁద, బర్హిణులు = నెమిళ్లు, పింఛికల్ = పురులు, ఎంతేనిప్పె = మిక్కిలి వ్యాప్తములై, తిరుగన్ = ఆడుచుండఁగా, పెల్లు = అధికమైన, ఇంద్రజాలంబున్ = ఇంద్రజాల మనుశాబరవిద్యను, చూపెన్ = కనుపఱచెను.

తా. వర్షాకాలమునఁ బుష్పించుచున్న కుటజకేతకాదుల పరాగములును గరిక కాంతులును గొంతపడిఁ గప్పట్టియుఁ గొంతపడిఁ గప్పడకయు నిట్లు తిరోధానావిర్భావముల నెడతెగక పొందఁగా, శ్రావణమాస మను నైంద్రజాలికుఁడు మేఘములను తెరవేసి నెమిళ్ళయొక్క నెడల్పులైన పింఛములు వ్యాపింపఁజేసి యతిశయమైన యింద్రజాలవిద్యను గనుపఱచెను. భస్మమును దూర్వయును నెమిలిపింఛము నింద్రజాల సాధనములు. తిరోధానావిర్భావము లింద్రజాలగుణములు. ఇవి యన్నియు నప్పుడు కలిగియున్న వనుట. రూపకాలంకారము.

తే. గిరులతటజంబుతరువులఁ ◊ దొరఁగుపండ్లఁ
బుట్టె జంబూనదులు గానఁ ◊ బొదువుమొయిలు
మేన నవి [1]సోఁకునెడలుగా ◊ మితిఁ దటిచ్ఛ
లంబునను శుద్ధజాంబూనదంబు లయ్యె. 113

టీ. గిరుల = కొండలయొక్క, తట = చరులయందుఁబుట్టిన, జంబుతరువులన్ = నేరేడుచెట్లనుండి, తొ...న్ - తొరఁగు = రాలుచున్న, పండ్లన్ = ఫలములవలన, జంబూనదులు = నేరేడుపండ్లరసపుటేళ్లు, పుట్టెన్ = ఉదయించెను, కానన్ = ఆదరియందు, పొ...నన్-పొదువు=అలముకొన్న, మొయిలు=మేఘముయొక్క, మేనన్ = శరీరమందు, అవి = ఆ జంబూనదులు, సో...గా - సోఁకు = తాఁకుపట్టి, ఎడలుగా = తావులేగదా, మితిన్ = మేరదప్పక, త...ను-తటిల్=మెఱుపనియెడు, ఛలంబునను= వ్యాజముచేత, శు...లు-శుద్ధ = చొక్కములైన, జాంబూనదంబులు = సువర్ణములు, అయ్యెన్ = అయెను.

తా. మేఘములయందుండు మెఱపును జూడఁగాఁ గొండలయందలి చరులయందు జనించియున్న నేరేడుచెట్లనుండి రాలుచున్నపండ్లయందుఁ బుట్టిన జంబూనదు లదరి యందెల్లవిశల నుండఁగా, నవి దలముకొన్న మేఘములయొక్క దేహములందు నవి సోఁకి

1. సోఁకనలవుగా.

నందున జంబూనది ప్రవహించినచో స్వర్ణమగునట్టి మర్యాద దప్పక కటిత్తులను వ్యాజమును పొంది మొయిళ్ళు శుద్ధజాంబూనదమయము లాయెను. అపహ్నవాలంకారము.

తే. సురభిబడిఁ జన్న సప్తలా౹శోకకమల
కువలయామ్రాళిఁ గదంబ ౹ కుటజనీప
కకుభయూథిక లనుసాయ ౹ కములు మరున
కేను గల్గి గేదఁగిసురె ౹ యెక్కు డయ్యె. 114

టీ. సురభిబడిన్ = వసంతునివెంబడిగా, చన్న = పోయినటువంటి. (ని. 'సురభిస్తు గవి స్త్రియాం, వసంతచైత్రయోః పుంసి త్రిషు సౌమ్యసుగంధినోః' అని రత్నమాల.) సప్తలా=విరజాజియొక్కయు, (ని. 'సప్తలా నవమాలికా' యని యమరము.) అశోక = కంకేళియొక్కయు, కమల = పద్మముయొక్కయు, కువలయ = కలువయొక్కయు, ఆమ్ర = చూతముయొక్కయు, ఆళికిన్ = సమూహమునకు, క...లు-కదంబ = కడిమి పువ్వును, కుటజ=కొడిసెపువ్వును, నీప = కదపపువ్వును, (అమరమున గదంబనీపములు పర్యాయములుగాఁ జెప్పఁబడియున్నను శుకులు 'బిల్వవకుళామ్రకదంబనీపాః' అని భిన్నజాతిగాఁ బ్రయోగించియున్నారు గనుక నీ గ్రంథకర్తయును రెంటిని వేఱుగాఁ జెప్పె నని యెఱుఁగఁదగును.) కకుభ = మద్దిపువ్వును, (ని. 'ఇంద్రద్రుః కకుభోఽర్జునః' యని యమరము.) యూథికలు=అడవిమొల్లయును, (ని. 'గణికా యూథికాంబష్ఠా' యని యమరము.) అను=అనునట్టి, సాయకములు=బాణములు, మరునకున్ = మన్మథునకు, ఏను కల్గి = పంచబాణములకుఁ బ్రతినిధి పంచబాణములు గల్గియు, గేదఁగిసురె = మొగలిరేకను సురియకత్తి, ఎక్కుడయ్యెన్ = శ్రేష్ఠమాయె నని యర్థము. ఆఱవమాయుధమాయె నని భావము.

తా. వసంతునితోడ నరిగిన సప్తలాశోకాది పంచబాణములకు బదులుగా నీ వర్షర్తువునందుఁ గదంబకుటజాది పంచసాయకములు గల్గియుఁ గేతకీసుమము మెక్కుడయ్యె ననఁగా నీ ఋతువు వసంతర్తువుకంటె నతిశయముగా స్మరోద్దీపక మాయెను. పరిమాణాలంకారము.

క. నటనపరకేకిపాత్ర
స్ఫుటయవనిక లన మొగుళ్లు ౹ పొదివెన్ భూభృ
త్తటుల నవి యూఁకు దిను చిట
పాటరవము సెలంగెఁ దాళకములఁ జప్పుడునై. 115

టీ. న...లు అనన్ - నటన = నాట్యమునందు, పర = ఆసక్తము లైన, కేకి= నెమళ్లనియెడు, పాత్ర=నాట్యస్త్రీలయొక్క, స్ఫుట=వ్యక్తమైన, యవనికలు=తెరల్ =

నీలితెరలో యనఁగా, (ని. 'ప్రతిసీరాయవనికాస్యాత్తిరస్కరిణీచసా' యని యమరము.) భూభృత్తటులన్ = కొండలచరులయందు, పాఁచెన్ = వ్యాపించెను, అవి=ఆ మేఘములు, ఆకు దిను = పర్ణములను దినుచున్న, చిటపాటరవము=చిటపాటయనుధ్వని, తాళములచప్పుడునై = తాళధ్వని యై, (నాట్యోపయోగి తాళంబు లనుట.) చెలఁగెన్ = ఒప్పెను. రూపకానుప్రాణితమైన యుత్ప్రేక్షాలంకారము.

తా. అప్పుడు నెమళ్లనియెడునాట్యస్త్రీలు నాట్యముసేయఁగా మబ్బులు కొండలలోని యాకులు మేయుచుండఁ గల్గిన చిటపాటధ్వనులు తాళములుగా నామేఘములు నీలపుఁదెరగుడ్డలుగా నొప్పుచుండెను.

చ. జలధర ముప్పుతోఁ బులు సొసంగురసం బని యప్పయోధి నిం
పొలయఁగఁ గ్రోలి పై దధిపయోధియుఁ గ్రోలఁగఁ బ్రాఁచి దొటఁబె
న్పులుసుఁగరుళ్లఁ గ్రాయ నవె పోవడగండ్లన రాలెఁ గాని నాఁ
డిలఁ బడువానిఁ దిన్నయపుడే చలి పండ్లువడంగ నేటికిన్. 116

టీ. జలధరము = మేఘము ఉప్పుతోన్ = లవణముతోఁగూడిన, పులుసు = ఆమ్లము, రసంబు = రుచిని, ఒసంగు నని = ఇచ్చు నని, అప్పయోధిన్ = ఆ లవణసముద్రమును, ఇంపొలయఁగన్ = ప్రీతిగల్గునటుల, క్రోలి = పానముచేసి, పైన్ = ఆ పిమ్మటను, దధిపయోధియున్ = పెరుఁగుసముద్రమును, క్రోలఁగన్ = త్రావఁగా, ప్రాఁచిదొటన్ = అది ప్రాచీనమైనదిగాన, (పులిసినపెరుఁగనుట) పె...ళ్లన్-పెన్పులుసు=మిగులఁ బుల్లనైన, కరుళ్లన్=పెరుఁగుగడ్డలను, క్రాయన్ = వెళ్లఁగ్రక్కఁగా, ఆవెపో = అట్లువెళ్ళఁగ్రక్కఁబడిన పెరుఁగుగడ్డలే, వడగండ్లనన్ = కరక లనునట్లుగా, రాలెన్ = పతనమునొందెను, కానినాఁడు = ఆవడగండ్లు దధికణములు కాకపోయె నేని, ఇలన్ = భూమియందు, పడువానిన్=పతనమగుచున్న యావడగండ్లను, తిన్నయపుడే=తినఁగానే, పండ్లు = దంతములు, చలి వడంగ నేటికిన్ = జిల్లుమని గిట్టుకొని పోవలసిన నిమిత్తమేమి ?

తా. అపుడు రాలుచున్న వడగండ్లను నోటిలోవ్రేయఁగాఁ బండ్లు జివ్వునితీపు గలవై పులుసు దగిలిన దంతములమాడ్కి వస్త్వంతరముల నమలుటకు శక్తి చాలకుండుటంజేసి, మేఘము పులుసులో నుప్పు గలిపినట్లయిన మిక్కిలి రుచిగా నుండు నని తలంచి ముందు లవణసముద్రమున నీరు ద్రావి యాపిమ్మట దధిసముద్రమును బానముచేయఁగా, నది ప్రాఁచిదొటవలన మిక్కిలి పులుసుగా నుండెను గాన దాని వెళ్ళఁ గ్రక్కఁగానే యాగడ్డలే వడగండ్లనువ్యాజమున రాలుచున్నవి. ఉత్ప్రేక్షాలంకారము.

తే. అపు డసళ్లకు డిగఁ బ్రేఁకమేఘాళి పొదువు
నచలములపైనె దొడ్డికట్టగు మృగాళి
చూడఁ జూపట్టె మీఁదిపర్జన్యధన్వి
నృపున కగు తెరవేఁటయాయిత మనంగ. 117

టీ. అపుడు = ఆవర్షాకాలమునందు, అసళ్లకున్ డిగఁ = బురదలలోఁ దిగఁ, మేఘాళి = మబ్బులచాళ్లు, పొదువు = చుట్టుకొన్న, అచలములపైనె = కొండలమీఁదనె, దొడ్డి కట్టగు = దొడ్డిలోఁ దోలఁబడినవానివలె నిలిచియున్న, మృగాళి = లేళ్లగుంపు, చూడన్ = వీక్షింపఁగా, మీ...న్వి - మీఁది = పయినున్న, పర్జన్య = ఇంద్రుఁడని యెడు, ధన్వి = ధనుర్ధరుఁడైన, నృపునకున్ = రాజునకు, అగు = ఏర్పడినటువంటి, తెరవేఁటయాయితము = సిద్ధమయిన తెరవేఁట, అనంగన్ = అనునట్లు, చూపట్టెన్ = కానవచ్చెను. (తెరవేఁటయనఁగా గొప్పయధికారులు వేఁటకు వెడలునవసరమున ననుచరులయిన వేఁటకాండ్రచేత మృగము లొక్కచోటఁ గూడియుండునట్లుగఁ జుట్టును తెరవేసి సమకూర్చుట)

తా. ఆవానకాలమునందు జడిసి బురదలకు డిగఁ మబ్బులగుంపు చుట్టును వ్యాపించి యుండుటయు, కొండలపైని దొడ్డికట్టుగానున్నట్లు మృగములు నిలువఁబడి యుండుటయు ఎట్లుండెననఁగాఁ, పర్జన్యుండనువిలుకాఁ డగు దొడ్డరాజునకై సిద్ధపఱుపఁబడిన తెరవేఁటయో యన్నట్లుండెను. ఉత్ప్రేక్ష.

చ. తడి తల డిగ్గి మూఁప జడఁ గతం దుది ఱెప్పలఁ గన్ను విప్పి పు
ల్లొప్పదుచు నీరు ముంగరలఁ బోలిక ముక్కునఁ గూడ నోటఁ గొం
తొడియుచు గూఁటికట్టె సగ మొత్తుచు ఱెక్కవిదుర్పు మున్నుగా
వడఁకుచుఁ గాక [1]చేష్టుడిగెఁ బక్షులు వక్షము జానువుల్ చొరన్.

టీ. తడి = నీరు, తలడిగ్గి = తమ తలలనుండి దిగి, మూఁపన్ = ముంచుకొనఁగా, (అనఁగా వర్షము దొల్తఁ బక్షులతలలుదడిపి పిమ్మట వానిశరీరములను దడుపఁగా ననుట.) జడతన్ = జాడ్యముచేతను, తుదిఱెప్పలన్ = పక్ష్మాగ్రములచేత, కన్నువిప్పి = నేత్రములు తెఱచి, పుల్లొప్పదుచున్ = కన్నులు పులకరించుచును (అనగాఁ దెఱవఁగూడని కన్నుల నతిప్రయత్నమునఁ దెఱచి లోనినీళ్లు వెలువరించుచు.) నీరు = వర్షోదకము, ముంగరల పోలికన్ = ముక్కఱలకైవడి, ముక్కులన్ కూడన్ = నాసికలయందు వ్రేలఁగా, నోటన్ = వదనముచేతను, కొంతఒడియుచున్ = కొంతస్వీకరించుచును, గూఁటికట్టెన్ =

1. చేయుడిగె-చేష్ట+ఉడిగెన్ - అనుచో తత్పుూకార సంధిదుష్టము. గనుక చేష్టడిగెన్ - అనుటయే సరియైనపాఠము.

గూఁటిపుడకయందు, సగము = అర్ధము, ఒత్తుచున్ = కుదుచుచును, పక్షులు=పిట్టలు, జానువుల్=తమ మోఁకాళ్లు, వక్షము=ఎద, చొరన్ = చొచ్చియుండఁగా, వడఁకుబడె కాక = కంపమొందుటయేకాక, ఱెక్కవిదుర్పు మున్నగాన్ = పక్షవిధూననము మొదలయిన, చేష్ట=వ్యాపారము, ఉడిగెన్=మానెను. స్వభావోక్తి, ఉపమ.

తా. ఆసమయంబునఁ బిట్టలు గూఁడ్లయందు ముద్దలుగాఁ దదుపఁబడి కాళ్లు ముడుచుకొని చలికి వడఁకుట దక్క నొండుచేష్ట లుడిగి యుండెను.

క. చెందు నెఱపంజ కుంకుమ
క్రందునఁ గెంపెక్కు దివికిఁ గాశ్మీరత రా
నిందుశిలాత్వము రవి గని
యెం దోయముఁ గురియ నేల యిటు గాకున్నన్. 119

టీ. చెందు = ప్రాప్తమైన, నెఱసంజ=పూర్ణసంధ్యారాగ మనియెడు, కుంకుమ= కుంకుమపువ్వుయొక్క, క్రందునన్ = అతిశయముచేత, కెం...కిన్ - కెంపెక్కు = ఎఱుపెక్కిన, దివికిన్ = ఆకాశమునకు, కాశ్మీరత = కాశ్మీరదేశత్వము, రాన్ = రాఁగా, రవి=సూర్యుఁడు, ఇందుశిలాత్వము = చంద్రకాంతమణియౌటను, కనియెన్ = పొందెను, ఇటు కాకున్నన్ = సూర్యుఁడు చంద్రశిల గాకుండెనేని, తోయమున్ = జలమును, కురియనేల = వర్షింప నిమిత్తమేమి?

తా. సంధ్యాకాలమునందు వర్షించుచుండఁగా, ఎఱుపుఁజెందిన సంధ్య యను కుంకుమపువ్వుచేత నెఱ్ఱనైన యాకసమునకుఁ గాశ్మీరదేశత్వము రాఁగా, సూర్యుఁడు తద్దేశోద్భవ మని ప్రసిద్ధికెక్కిన యిందుశిలాత్వమును బొందెను. అటుగాకపోయె నేని యాసూర్యుఁ డుదకంబుల వర్షించుటకు హేతు వేమని ప్రజలు తలంచున ట్లుండెను.

చ. అలజలరాశినీటఁ బగ లర్కకరావళి చూలు దాల్పఁగా
నలమిన యీర్ష్య రాత్రి ధవళాంశుకరావళి తాముఁ దాల్పఁ ద
జ్జలముల కాస మూఁగికొనుచాడ్పున నాడి వహించెఁ జాలు *ద
బ్బుల నిల ముంచు నీలఘనపుంజమువల్ల బలాకమాలికల్. 120

టీ. అల = ప్రసిద్ధమైన, జలరాశి = సముద్రముయొక్క, నీటన్=ఉదకముచే, పగలు = పగటియందు, అర్కకరావళి = సూర్యకిరణసమూహము, (ని. 'బలహస్తాంశవః కరా' యని యమరము.) చూలుదాల్పఁగాన్=గర్భముధరియింపఁగా, అలమినయీర్ష్యన్ = జనించిన యసూయచేత, రాత్రిన్ = రేయియందు, ధవళాంశుకరావళి = చంద్రకిరణ సమూహము, తామున్ = తామును, తాల్పన్ = గర్భములు ధరియించుకొనుటకు, తజ్జల

* నంబుల నిల ముంచు. (జలముచే భూమిని ముసుఁగఁజేయు.)

ములకున్ = ఆసముద్రోదకములఁ ద్రావుటకై, ఆసన్ = ఆశతో, మూఁగికొనుచాదు, నన్ = చుట్టుకొనినవిధమున, ఆడి = సంచరించి, బలాకమాలికల్ = తెల్లకొంగలచాళ్లు, (ని. 'బలాకాబిసకంఠికా' యని యమరము.) మబ్బులన్ = చీఁకట్లచేతను, ఇలన్ = భూమిని, ము...ల్లన్ - ముంచు = కప్పుచున్న, నీలఘన = కాలమేఘములయొక్క, పుంజము వల్లన్ = సమూహమువలనను, చూలు = గర్భమును, వహించెన్ = ధరియించెను.

తా. తెల్లకొంగలు రాత్రులయందు నంధకార మగునట్లు భూమియందుఁ గప్పి యున్న నల్లమబ్బులను మాలికలుగాఁ జుట్టికొని యానీళ్లు త్రాగి గర్భము ధరింపఁగా, సూర్యకిరణములు పగటియందు సముద్రోదకముచేత గర్భము ధరియింపఁజూచి యీర్ష్య గలవి యై చంద్రకిరణములు తాము గర్భముల ధరియించుటకొఱకు నాసముద్రోదకములం దీల్చుటకై తిరుగుచున్నట్లుండెను. ఉత్ప్రేక్ష.

క. ఉఱుము విని యలకకై దివి
వెఱఁ బఱచుమరాళపటలి విడిచినఁ బడు న
క్కఱచిన బిసలవవిసరము
తెఱఁగున వడగండ్లు ధవళదీధితి రాలెన్. 121

టీ. ఉఱుమున్ = గర్జితమును, విని = ఆలకించి, అలకకై = అలకాపురమున కెదురై, దివిన్ = అంతరిక్షమునందు, వెఱన్ = భయముచేత, ప...లి - పఱచు = పఱువిడుచున్నట్టి, మరాళపటలి = అంచలగుంపు, విడిచినన్ = వదలఁగా, పడు = పతనము నొందుచున్నట్టి, అ...నన్ - అక్కఱచిన = ఆయంచలు గొఱికిన, బిసలవవిసరము = తామరతూఁడు తునుకలసమూహముయొక్క, తెఱఁగునన్ = చందమునను, వడగండ్లు = వర్షోపలములు, ధవళదీధితిన్ = తెల్లనికాంతితోడను, రాలెన్ = పడెను.

తా. ఆకాశమునం దలకానగరోన్ముఖ మై యంచలగుంపు పోవుచుండఁగా, నుఱుములధ్వని విని భయపడి నోట నున్న తామరతూఁడులముక్కలు విడిచి వేయఁగా, నవి పుడమిఁ బడుచున్నవిధమున వడగండ్లు తెల్లని వై పడెను. ఉత్ప్రేక్ష.

క. తటిదుత్సారితఫణభృ
త్పటలి నిరన్నంబు లయ్యుఁ దక్కవు బర్హుల్
నటన మతిహర్ష హేతూ
త్కటలాభం బిడునె మది క్షుధ న్నిర్వట్టున్. 122

టీ. బర్హుల్ = నెమళ్లు, త...లిన్ - తటిల్ = మెఱుపులచేత, ఉత్సారిత = పోఁదోలఁబడిన, ఫణభృత్ = పాములయొక్క, పటలిన్ = సమూహముచేత, నిరన్నంబు లయ్యున్ = నిరాహారము లైనప్పటికిని, నటనము = నాట్యమాడుటను, తక్కవు = మానవు

అ...ఋ-అతిహర్ష=అత్యంత సంతోషమునకు, హేతు = కారణముయొక్క, ఉత్కట= అధికమైన, లాభంబు=ప్రాప్తి, మదిన్ = మనంబునందు, క్షుధన్=ఆకలిని, నీర్వట్టున్ = దప్పిని, ఇడుసె=కలుగఁజేయుఁగా ! (చేయ దనుట).

తా. మెఱపులు మెఱసి పాములగుంపులను బుట్టలోనికిఁ ద్రోసివేసిన కారణమున నాహారము లేనప్పటికిని నెమిళ్లు తమనృత్యమునుమాత్రము మానకుండెను. పరమసంతోష సమయమున నాఁకలిదప్పులు మనస్సునకుఁ దోఁపవుగదా! అర్థాంతరన్యాసాలంకారము.

సీ. రవిఁ జూచి కుడుచువారలకును గృకలాప
ములకును దృష్టి మిన్నులనె నిలిచె
సంధ్యార్ఘ్యదాయిద్విజశ్రేణి కిలు సేరు
మొదవులకును భ్రాంతి మది జనించె
[1]హాలజీవిసందోహములకు బలాకికా
విసరంబులకు మంచి వెదలు [2]దొరకె
నెలమిఁ బొల్పగుయయాధికలకు సంతలకూట
ములకును మఱి విచ్చుమొగ్గ లొదవె
తే. నతిథిసంఘంబునకు నీనినట్టియెనుప
కడుపులేఁగలగమికి వాకట్టు లెసఁగె
మంత్రిమిద్దెలవారికి మరుపములకు
నెలఁత వాసినవారికి నిదుర చెడియె. 123

టీ. రవిన్ = సూర్యుని, చూచి = వీక్షించి, కుడుచువారలకును = భోజనము సేయువారికిని, కృకలాసములకును = తొండలకును, (ని. 'సరటః కృకలాసస్స్యా' త్తని యమరము.) దృష్టి = చూపు, మిన్నులనె = అంతరిక్షమందే, నిలిచెన్=ఉండెను. (ఆదిత్యునిఁ జూడక భుజింపమను నియమము గలవారలకుఁ దద్దర్శనాపేక్షచేతను, తొండలను వానిపాలనుసందున నీరుచొచ్చిన వాని దేహము లూనుచున్నవిగానఁ గొమ్మలం దూర్ధ్వముగ నిలిచియుండుటచేతను గనుచూపు లంతరిక్షమందె యుండు ననుట.) సం...కిన్- సంధ్యార్ఘ్యదాయి-సంధ్యా = సాయంకాలమునందు, అర్ఘ్యదాయి = అర్ఘ్యప్రదానము చేయునట్టి, ద్విజశ్రేణికిన్ = పుడమివేల్పులసంఘమునకును, ఇలుసేరు మొదవులకున్ = ఇండ్లకువచ్చుచున్న పసులకును, భ్రాంతి = సాయంకాలమను భ్రమము, మదిన్=బుద్ధియందు, జనించెన్ = పుట్టెను. హాలజీవిసందోహములకున్ = వ్యవసాయముఁ జేయు

1. హాలిబీజ. 2. దొరికె.

జనసమూహమునకును, బలాకికావిసరంబులకున్ = తెల్లకొంగలగుంపులకును, మం...లు- మంచి - అనుకూలమైన, వెదలు=చల్లఁబడ్డచేలు చక్కఁగా మొలచుటయు, గర్భధారణమును, దొరకెన్ = ప్రాప్తించెను. (శ్లో. గర్భం బలాకా దధతేఽబ్దయోగాన్నాకేనిబద్ధావలయం సమంతా' త్తని కర్ణోదయమందుఁ బ్రయోగము.) ఎలమిన్ = ఉత్సాహములో, పొ...దున్-పొల్పగు = ఒప్పుచున్న, యూథికలకున్ = మొల్లల భేదములకును, సంతలకూటములకును=సంతలకువచ్చి కూడియున్న జనములకును, (సంత యనఁగా గ్రామాంతరములనుండి వర్తకులు నానావిధంబులైన సరకులందెచ్చి బస్తీగా నుండుగ్రామమునకు వెలుపల నునిచి యావస్తువులను విక్రయించెడు బజారు.) మఱి = మిక్కిలి యును, విచ్చుమొగ్గలు = పరువిడుటయు, మొగ్గలువిచ్చుటయును, ఒదవెన్ = కలిగెను. (అనఁగా వర్షాకాలమునందుఁ బుష్పించునట్టి యూథికలు వికసించిన వనియు; వర్షము రాఁగా సంతకువచ్చిన ప్రజ లూళ్ళకు విచ్చిపోయి రనియు భావము.) అతిథి సంఘంబునకున్=అతిథిసమూహమునకును, ఈ...కిన్-ఈనినట్టి, ఎనుఁ=గేదెలయొక్క, కదుపు=సంఘముయొక్క, లేఁగలగమికిన్ = దూడలసమూహమునకు, వాకట్టులు = వాగ్బంధనములు, ఎసఁగెన్ = అతిశయించెను, (మేరదప్పినవర్షము గురియుచుండఁగా సంచరించుట కుపాయమొందని యతిథులకు నన్నము లే నందునను - గేదెకదుపుల లేఁగలకుఁ జలిచేత దవదలుమూసికొని పాలుగుడువఁగూడనందునను వాగ్బంధనము లొదవె ననుట.) మంటిమిద్దెలవారికిన్ = మంటితో మేడలేర్పఱచుకొన్నవారికిని, మరు పనులకున్ = మన్మథవ్యాపారములకు, నెలఁత = స్త్రీలను, (ఇది జాత్యేకవచనము) పాసినవారికిన్ = ఎడఁబాసినవారికిని, నిదురచెడియెన్ = నిద్రలేకపోయెను (అనఁగా మంటిమిద్దెలుగల వారికిఁ బైనున్న మన్ను వర్షముచేతఁ గఱఁగి యింటిలో పడుటచేతను, మన్మథవ్యాపారములకు స్త్రీలులేనివారికి విరహవేదన గల్గుటచేతను నిదురలేకయుంట ప్రసిద్ధము. మఱి పనులకు నెలఁతఁబాసినవారికనుదాని కితర వ్యాపారార్థము స్త్రీల నెడఁబాసినవారికని కొన్నివ్యాఖ్యానములలో నున్నది. మరుపనులకును నిద్రలేకపోయె నని యైనం జెప్ప వచ్చును. ఆపక్షమున నవి యధికముగా జరిగె నని భావము.) శ్లో.'వర్ణ్యానామితరేషాం వా ధర్మైక్యం తుల్యయోగితా' యను లక్షణముచేత నొప్పియున్న తుల్యయోగితాలంకారము. రెండవగీటున భ్రాంతిమదలంకారము.

ఉ. కాలునిమున్న నందినయి ౹ గంటలు దున్నక మంటినా మహా
కాలునినందిదున్ననయి ౹ కర్దమమగ్నత లేక మంటి నా
హాలికు లెన్నఁడుం దెగని ౹ పూరులచేలును జొడుమళ్లుమం
గా లలి నేరుసాఁగి రిలఁ ౹ గల్గుపసింగొని పేద మున్నుగన్. 124

టీ. కా...న్న-కాలుని = యమునియొక్క, దున్న=వాహనమైన మహిషము-('కాలో దండధరః శ్రాద్ధదేవః' యని యమరము.) నంది నయి=వృషభమై, గంటు= అవురుదుబ్బలను, దున్నక=కృషిచేయక, మంటి రాన్ = బ్రదికితి ననఁగా, మహాకాలుని నంది=రుద్రునకు వాహనమైన వృషభము, ('మహాకాలో మహానటః యని యమరము.) దున్న నయి=దున్నపోతనై, కర్దమమగ్నతలేక = బురదలయందుఁ గాళ్లదిగఁబడతలేక - ('పంకో స్త్రీ శాదకర్దమౌ' యని యమరము.) మంటినాన్=బ్రతికితి ననునట్లుగ, హాలికులు=కృషీవలులు, ఎ...ను - ఎన్నఁడున్ తెగని = ఏదినమందును దున్నని, ఔరుల చేలును = గంటను గల చెలికలును, చౌడుమళ్లుమంగాన్ = ఊషరములగు కేదారములుగా, లలిన్=ఆసక్తిచేతను, పేదమున్నగాన్ = దరిద్రుఁడు మొదలుగా, ఇ...సిన్ గొని - ఇలఁగల్గు = భూమియందున్న, పసింగొని = పశుమాత్రమునంతయును గూర్చి, ఏరుసాఁగిరి = మడకకట్టి దున్నిరి.

తా. దున్నపోతులకు వెలిదుక్కి కష్టముగనుక యమునికి వాహనమగుటవల్ల దున్నక సుఖించితి నని యామహిషమును, ఎద్దులకు రొంపిదుక్కి కష్టముగనుక నీశ్వరునకు వాహనమైనందున దున్నవలసినఁలే దని యావృషభమును నెంచునట్లుగాఁ బురమియం దెల్లెడల నుండు పశువులం దెచ్చి బీదలు మొదలగు హాలికులు బీటిచేలు చవుటి కయ్యలుగూడ దున్నిరి. ఉత్ప్రేక్ష.

క. వరుజుబడి రొంపిఁ ద్రొక్కం
జరణంబులఁ జుట్టి పసిఁడిఁచాయకడుపులం
బొరి నీరుకట్టె లమరెను
బిరుదులు హాలికులు దున్నఁ బెట్టిరొ యనఁగన్. 125

టీ. వరుజుబడిన్ = మడిగనిమవెంబడిని, రొంపిఁద్రొక్కన్=మడిలో నీరువెళ్ళకుండునట్లు బురదను ద్రొక్కఁగా, చరణంబులన్ = పాదములను, చుట్టి = చుట్టికొని, పసిఁడిచాయకడుపులన్ = బంగారువన్నెగల యుదరములతోఁగూడిన, నీరుకట్టెలు=నీరుతొట్టు పాములు, పొరిన్ = ఔద్ధత్యముచేతను, హాలికులు = కర్షకులు, దున్నన్ = దుక్కియందు, బిరుదులు=తమకు సరియెవ్వరును గా రని గండపెండెరములు, పెట్టిరొ అనఁగన్ = ధరియించిరో యన్నట్లు, అమరెన్ = ఒప్పెను.

తా. కర్షకులు మడిలో బురదను ద్రొక్కుచుండఁగా,వారిపాదములను జుట్టుకొన్న బంగారువన్నెగల పొట్టలతోఁగూడిన నీరుకట్టెలు, సేద్యకాండ్రు తమ గొప్పఁదనమును జాటుటకై దుక్కియందు ధరించిన గండపెండేరములా యన్నట్లుండెను. ఉత్ప్రేక్ష.

క. నాని శిఖ వంటచెఱకుల
చే నఱ నవి వెండి వంటచెఱకులె యగుటం
బోనంబు ప్రజకు జక్కుల
బోనంబులె యయ్యెఁ బ్రొయ్యి పొగయమి వృష్టిన్. 126

టీ. శిఖ = అగ్ని, వంటచెఱకులచేన్ = వంటకట్టియలచేతను, నాని = తడిసి, అఱన్ = చల్లాఱఁగా, (ఎడతెగని వానలచేతఁ దడిసియున్నకట్టెలను నిప్పుమీఁద వేయఁగానే యాయగ్ని చల్లాఱె ననుట.) అవి = ఆయింధనములు, వెండి = మఱియును, (అనఁగా విచారింపఁగా ననుట.) వంటచెఱకులె యగుటన్ = వంట కుపయోగ్యమయిన చెఱకు లని యన్వర్థము లగుటచేతను (అనఁగా బెల్లమువండుటకుఁ దగిన చెఱకులు రసఘనములై యుండి గానుగయందుంచి త్రిప్పఁగా నెట్లు రసమును వెళ్ళఁగ్రక్కునో యా తీరుననే ప్రొయిలోనఁ బెట్టఁగానే కట్టియలు నీరు వడియుటంజేసి వంటచెఱకు లన్న పేరు సార్థకమాయె ననుట.) బోనంబు = అన్నము, ప్రజకున్ = జనమునకు, జక్కుల బోనంబులె యయ్యెన్ = కామేశ్వరునిఁగొల్చు జక్కులవాండ్ర యన్నమాయెను. (అనఁగా శూద్రులయొక్క పెండిలిమొదలగు నుత్సవములయందు జక్కులవాండ్రు అరివేణిపెట్టిన శూన్యభాండములను దలమీఁద మోచికొని బోనాలుబోనాలని పల్కుట ప్రసిద్ధముగానఁ దత్తుల్యంబాయె నని భావము.) ప్రొయ్యి = పొయ్యి, వృష్టిన్ = వర్షముచేతను, పొగయమిన్ = రాఁజకయుండుటచేత నని క్రింది కన్వయము.

నిరుక్తియు మిథ్యాధ్యవసితము.

తా. వానకుఁ దడిసినవంటచెఱకులు పొయిలోఁబెట్టఁగా వానిచే నగ్ని చల్లాఱెను. వండుటకారంభించుటతోడనే నీటిఁగ్రక్కి నిప్పారుటవలన గానుగులోనుంచి త్రిప్పఁగా రసముచిప్పిలు చెఱకులఁబోలి సార్థకనామభాజనములయ్యెను. వానచేతఁ బొయ్యిలోని నిప్పు రాఁజకపోవుటచేఁ బ్రజల భోజనములు మిథ్యాభోజనము లయ్యెను.

సీ. ఇల్లిల్లు దిరుగ నొక్కిం తబ్బు శిఖ, యబ్బె
నే నింటిలోఁ బూరి యిడి విసరక
రాఁజదు, రాఁజిన [1]రవులుకొల్పాసలె
గాని కల్గదు గూడు దానఁ, గలిగె
నేని కూ రగుట మం, దైనఁ బెవ్వఁగ సుఖ
భుక్తి సేకూర, దా భుక్తి యిడినఁ

1. రవులుకోల్పాసాలఁ.

ప్రాగ్భోక్తలకె తీఱు బహుజనాన్నము, దీఱ
నారుల కొదవుఁ బునఃప్రయత్న,
తే. మాజ్యపటముఖ్యలయ మెన్న, రాలయాంగ
దాములయ మెన్న, రంతికరు గారజనిక
పచన నాంధోగృహిణి రామిఁ బడక మఱఁదు
వెడవెడనె యార్వ నొగిలి రజ్జడిని గృహులు 127

టీ. అజ్జడిని = ఆముసురునందు, ఇల్లిలు = ప్రతిగృహమునకును, తిరుగన్ = వెళ్ళఁగా, శిఖ=అగ్గి, ఒక్కింత=కొంచెము, అబ్బన్=దొరకును, అబ్బె నేని=దొరకినచో, ఇంటిలోన్ పూరి = ఇంటిపైకసవును, ఇడి=దానిపై నుంచి, విసరక రాఁజను=వీజనము సేయక యంటికొనదు. రాఁజినన్ = అంటికొనినను, రవులుకొల్పు ఆసరెకాని = ప్రజ్వలింపఁజేయు నపేక్ష యొకటి దక్క, దానన్ = ఆమంటవలన, కూడు = అన్నము, కల్గదు = దొరకదు (రవులుకోల్వాసాలఁగాని యను పాఠమునందు గృహములలోని వాసములను వెలిచి పెట్టక గాని రగుల దని యర్థము.) కలిగెనేని=అన్నమైనప్పటికిని, కూర అగుట = శాకమగుట, మందు = ఔషధము (అనఁగా దుర్లభ మనుట.) ఐనన్ = శాకమైనను, పెనొప్పగన్ = ప్రబలమైన ధూమముచేతను, సుఖభుక్తిచేకూరదు = సుఖకరమైన భోజనము దొరకదు. అనుక్తియిడినన్=అభోజనము పెట్టినను,బహుజ రాన్నము= ఇంటిలో నున్నవారలకెల్ల వండిన యన్నము. ప్రాగ్భోక్తలకే = తొలుబంతి భోజనముఁ జేయువారలకే, తీఱున్ = సరిపోవును (అకాలమునకు వచ్చిన యతిథులఁ బరిహరింప రామింజేసి వారల కిడుటచేతఁ బక్వాన్నము సరిపోవు ననుట.) తీఱన్ = సరిపోఁగా, నారులకున్ = ఆఁడువారలకు, పునః ప్రయత్నము=మరల వంటయొనర్చుట, ఒదవున్= కలుగును, అంతికరున్ = ప్రాఙ్యుక్తి, ఆ...ము - ఆజ్య = నేతిచేతఁ దడుపఁబడిన, పట ముఖ్య = కోకలు లోనైన వానియొక్క, లయము ఎన్నరు = నష్టము విచారింపరు, ఆ...ము - ఆలయ=ఇంటియొక్క, అంగదాము=వాసాలయొక్క, లయము=నాశమును, ఎన్నరు=లెక్కింపరు (ప్రాఙ్యుమండుటకై నేతిలో బట్టలు దడిపివైచియును వాసాలు పెలికివైచియును వాని నష్టమును లెక్కింపకుండి రనుట.) ఆ...ణి - ఆరజనిక=రాత్రి వఱకును, పచన = పాకముసేయుటచేతను, నాంధః=అన్నము లేకయుండిన, గృహిణి= ఇల్లాలు, రామిన్ = రాకపోవుటవలన, పడకన్ = శయ్యయందు, మఱుఁదు = పచ్చవిస్తుఁడు, వెడవెడనె=పెళపెళ మని, ఆర్వన్ = వేగిరింపఁగా, గృహులు = గృహస్థులు, నొగిలిరి = నొచ్చిరి. స్వభావోక్తియు, ఏకావళియు.

తా. ఆసమయంబునందు నెల్లదిక్కులయందు నతిథులంద ఱాహారమజ్జనశయనాదులయందుఁ గ్లేశము నొందున ట్లెడతెగక జడివానలు గురియుచుండెను.

చ. పిడుగుల కల్కి లోఁ దొలిచి భీరులు కంచముఁ జల్లుదీధితు
ల్గడపల వెళ్లి రాఁ బొగలఁ గావిరిబ్రుంగెడు పుల్లగృహంబు లె
ల్లెడఁ గనుపట్టె [1]నూళ్ల నిల యెల్లను ముంచి రసాతలంబుపై
విడియఁగ దండు డిగ్గిన సవిద్యుదురు స్తనయిత్నులో యనన్. 129

టీ. పిడుగులకున్ = అశనిపాతములకు, అల్కి = వెఱచి, భీరులు = భయస్వభావముగల స్త్రీలు, (భీరుర్భీమ్వాధరాఙ్గనా' యని నిఘంటువు.) కంచము = భోజనపాత్రమును, లోన్ తొలిచి = కదపలకు లోపల నేకడిగి, చ...ల్-చల్లు = త్రిప్పినీరు బైటఁ జల్లఁగాఁ బుట్టిన, దీధితుల్ = కాంతులు, కదపల్ వెళ్లి రాన్ = దేహళులదాఁటిరాఁగా, పొగలన్ = ధూమములచేతను, కా...లు-కావిరి బ్రుంగెడు = ధూమ్రవర్ణము గప్పినట్టి, (వర్షాకాలమందుఁ దడిసిన గృహములకుఁ బొగ చుట్టికొనియుండుట ప్రసిద్ధము.) పుల్లగృహంబులు = పూరి యిండ్లు, ఎల్లెడన్ = ఏదెసఁ జూచినను, ఊళ్ళన్ = గ్రామములయందు, ఇలయెల్లను = భూమియంతయును, ముంచి = వాననీళ్ళచేత నిండింపఁజేసి, రసాతలంబుపైన్ = పాతాళముమీఁద, విడియఁగన్ = ఆక్రమింపవలయు నని, ద...లో అనన్-ఉరు = గొప్పలయిన, దండు డిగ్గిన = భూమియందు సేనాసమేతమై విడిసిన, సవిద్యుత్ = మెఱుములతోఁ గూడిన, స్తనయిత్నులో అనన్ = మేఘములో యనునట్లు, కనుపట్టెన్ = చూపట్టెను.

తా. పిడుగులు పడుచుంటచే భయపడి స్త్రీలు గుమ్మములోపలనుండియే కంచములు తొలిచి చల్లఁగాఁ బుట్టిన కాంతులు గుమ్మములుదాఁటి బయట ప్రకాశించుచుండ, గ్రామములం దెల్లెడల ధూమ్రముతో నిండిన గడ్డియిండ్లు కానవగుచుండెను. ఆయిండ్లు భూమినంతను జలమయ మొనర్చి పాతాళముపై దండెత్తి విడిసిన మెఱుములతోఁ గూడిన మేఘములో యనున ట్లుండెను. ఉత్ప్రేక్షాలంకారము.

చ. గొడుగుల గాలిఁ గూల్చి మఱి కోలలతోడన పాఱ నాన్చెఁ జే
ద్పడ జడి మేఘుఁ డట్లక(గు)ట పాంథులపైఁ దన కెంత వైరమో
తడిసినమేన నింకి యది దారవియోగజవహ్నిఁ గొంత కొం
తుడిపె విధాతరక్ష విష మొక్కొకమాఁ టమృతంబు సేయుటన్.

టీ. మేఘుఁడు = జలధరుఁడు, గొడుగులన్ = పాంథుల ఛత్రములను, గాలిన్ = వాయువుచేతను, కూల్చి = ఎగురఁగొట్టి, మఱి = పిమ్మట, కోలలతోడన = గొడుగు

---

1. నీళ్ళ.

కట్టులుమాత్రము చేతఁబట్టి, పాఱన్ = పరువిడుచుండఁగా, జడిన్ = వర్షముచేతను, చేర్పడన్ = బాధపడునట్లుగ, నానిచెన్ = తడిపెను. అట్లు = ఆలాగుతడుపునట్లు, అకట = అయ్యో, తనరున్ = మేఘునికి, పాంథులపైన్ = పథికులమీఁద, ఎంతవైరమో = ఏపాటివిరోధమో (నానిచెనని క్రిందికన్వయము.) విధాతరక్ష = విరించియొక్క రక్షణము, విషము = గరళమును, ఒక్కొకమాటు = ఒక్కొకపర్యాయము, అమృతంబు సేయుటన్ = సుధగాఁజేయుటవలన, అది = ఆవర్షము, తడిసిన మేనన్ = నానినశరీరమందు, ఇంకి = ఇగిరి, దారవియోగజవహ్నిన్ = భార్యలవిరహమువల్లఁబుట్టిన యగ్నిని, కొంతకొంతడిడిపెన్ = కొంతవడిఁ బోఁగొట్టెను. ఈపద్యమునందుఁ బూర్వార్ధంబున వ్యాఘాతాలంకారంబు నుత్తరార్ధంబున విచిత్రాలంకారము. శ్లో. 'స్యాద్వ్యాఘాతో తథాకారి తథాకారి క్రియేతచేత్, విచిత్రం యత్ప్రయత్నశ్చే ద్విపరీతఫలేప్సయా' అని వానికి లక్షణము.

తా. మేఘునకుఁ బాంథులపై నెంత వైరమోకాని వాయువుచే వారి గొడుగుల నెగురఁగొట్టి, మిగిలిన గొడుగుకట్టులతోనే వారిని బరుగిడఁజేసి వర్షముచేతడిపి బాధించెను. కాని, యొక్కొక్కప్పుడు బ్రహ్మదేవుని కృపవలన విష మమృతమగునట్లు వర్షజలము తడిసిన పాంథులశరీరములఁ జొచ్చి యందలి భార్యావియోగాగ్నిని గొంతవఱకైనను బోఁగొట్టుచుండెను.

తే. దవుల జల్లని తూఱ నంతకుమునుపటి
జల్లునీ రూని వచ్చునాజల్లు మొదలి
గాలి యెలగోలుచేఁ గొమ్మగదలి జల్లు
దలపడకమున్ను వంగుళ్లఁ దడిపెఁ దరులు. 130

టీ. తరులు = వృక్షములు, దవులన్ = దూరమునందు, జల్లని = వానయనుకొని, తూఱన్ = వానిక్రిందికిఁబోఁగా, అంతకుమునుపటిజల్లు = దూరమునుండి వచ్చువానకంటె మున్నుగురిసియున్నవానయొక్క, నీరూని = ఉదకముగలవై, వచ్చునాజల్లు = దూరమున వచ్చుచున్నయావానయొక్క, మొదలి = ముందుగవచ్చిన, గాలియెలగోలుచేన్ = ఎలగోలుగాలిచేతను, (దండునకు ముందుగాఁ బోయి హెచ్చరికచేయుటకు నెలగో లని చెప్పుట ప్రసిద్ధము.) కొమ్మగదలి = శాఖ చలనమునొంది, జల్లుదలపడకమున్న = వచ్చుచున్న వర్షము రాకమునుపే, వంగుళ్ళన్ = నమ్రములైయున్నకొమ్మలు మొదలగువానియందు నిలిచియున్న జలముచేతను, తడిపెన్ = నానిచెను, పథికుల నని పూర్వపద్యమున నుండు కర్మ నధ్యాహరింపవలయును.

తా. పాపము పథికులు దూరమునుండి వచ్చుచున్న వర్షపుజల్లునఁ దడువకుండుటకై వృక్షముల క్రిందకుఁ జేరఁగా, నంతకుఁ బూర్వపుజల్లువలన నాచెట్టుకొమ్మలపై నాకులలో నిలిచినవాననీటిచే యాక్రొత్తజల్లు వచ్చులోపలనే వారు తడిసిరి. అలం. స్వభావోక్తియు, విషమాలంకారభేదమును.

చ. రయమున వృష్టికై యొదిఁగి రచ్చలపై విధియింతు రుగ్రతన్
హయపతిమీఁద దంతిపతి నాతనిపై నృపతిం గజాదిని
ర్ణయముల [1]మొత్తులాడుదురు ప్రబ్బికయించుక విప్ప విచ్చుమొ
గ్గయి మఱి పాఱిపోదురు సమస్తదిశాగతులైన యధ్వగుల్. 31

టీ. స...ల్-సమస్తదిశ=సకలదిశలనుండి, ఆగతులైన=వచ్చినట్టి, అధ్వగుల్ = తెరువరులు, రయమునన్=వేగముచేత, వృష్టికై=వానకై, ఒదిగి=చోటుచాలక అడఁగికొని, రచ్చలపైన్=ధర్మపుచావిళ్ళ యరుఁగులమీఁద, హయపతిమీఁదన్ = అశ్వపతిపైని, దంతిపతిన్ = గజపతిని, ఆతనిపైన్ = ఆగజపతిమీఁదను, నృపతిన్=నరపతిని (అశ్వపతి ప్రబలుఁడు, వానికంటె గజపతి ప్రబలుఁడు, గజపతికంటె నరపతి ప్రబలుఁడని యనుట.) ఉగ్రతన్=కోపములోడను, విధియింతురు=నిర్ణయింతురు, గజాదినిర్ణయములన్-గజ=యేనుఁగులు, ఆది=మొదలగువానియొక్క, నిర్ణయములన్ = నిశ్చయించుటలయందు, మొత్తులాడుదురు = కలహపడుదురు (అనఁగా నశ్వపతి యెక్కుడని యొకఁడును, గజపతియ ప్రబలుఁడని మఱియొకఁడును, నందఱికంటె నరపతి యధికుఁడని యన్యుండును, వానికంటె వీనికి నశ్వము లెక్కువనియు, వీనికంటె వానికి గజంబులు తక్కువనియు, నీ మొదలగు గజాదిసంఖ్యానిర్ణయాభినివేశములచేతఁ గలహించుచుందు రనుట.) ప్రబ్బు=మేఘము, ఒకయించుకవిప్పన్=కొంచెము విడువఁగానే, మఱి=పిమ్మట, విచ్చుమొగ్గయి=ప్రోగువిడినవారలై, పాఱిపోదురు = ఎవ్వరిదారిని వారు వెళ్లుదురు. అలం. స్వభావోక్తి.

తా. పలుదెసలనుండి వచ్చిన బాటసారులు వర్షమురాఁగానే త్వరితముగా ధర్మసత్రముల యరుగులపైఁ జేరి యహంకారములతో సక్రోధులై, యశ్వపతిమీఁద గజపతి గజపతిపై నృపతి యనియు వానికంటె వీనికి వీనికంటె వానికి గజము లెక్కువ యశ్వములు తక్కువ యాదిగాఁగల వ్యర్థభాషణములఁ గలహించుచుందురు. ఇంతలో మేఘములు విడువఁగానే యెక్కరును నిల్వక తమతమ దారులఁబట్టి పోవుచుందురు.

క. తనరెఱ బలిభుక్తతులు నిం
డినగ్రామశ్రీల కఱితి సీమలు లగుటం

1. గొట్టులాడుదురు.

గనియెఁ దృణగ్రాహిత ననఁ
గొనుకపవులఁ జైత్యతరుల క [1]గూండ్లిడుభ్రమణన్. 132

టీ. బలిభుక్తతులు=కాకులగుంపులు, ('ధ్వాంక్షాత్మఘోషపరభృద్బలిభుగ్వాయసా అపి' యని యమరము.) నిండిన గ్రామశ్రీలకున్ = సంపూర్ణగ్రామలక్ష్ములకు, అఱితి = కంఠమునందున్న, నీలము లగుటన్ = ఇంద్రనీలమణులౌటచేత, తనరెన్ = ఒప్పెను, చైత్యతరులన్ = ఉద్యానపాదములందు, ('చైత్యమాయతనే· బౌద్ధే బింబే చోద్యానపాదపే' యని విశ్వము.) గూండ్లిడుభ్రమణన్ - గూండ్లిడు = గూండ్లుపెట్టుటకొఱకు, భ్రమణన్ = తిరుగుటచేతను, కొనుకసవులన్ = పట్టికొనిపోవుతృణములచేతను, తృణగ్రాహితన్ = తృణగ్రాహిత్వమును, కనియెన్ = పొందెను, అనన్ = అనునట్లు, తనరెనని క్రింది కన్వయము.

తా. నీలములు తృణగ్రాహులు గాన నావిధముగఁ గాకులగుంపులు గ్రామసమీపమునందు నుద్యానమందలిచెట్లయందుఁ గూండ్లు గట్టికొనవలయునన్న యిచ్ఛచేఁ గఱచికొనిపోవుచున్న కసవులను జూడఁగా, దండి యైన గ్రామలక్ష్ములు కంఠమునందు ధరియించిన హారమందలి నీలమణులు తృణంబు లని గ్రహించుచున్నవో యన్నట్లుగా నొప్పెను. ఉత్ప్రేక్ష.

మ. వసతు ల్వెల్వడి వానకై గుడిసె మోవన్ రాక తా నాని యే
పసగా నిల్చినజమ్ముగూడఁ బొల మంబళ్లోయుచుం బట్టి పె
న్ముసురం దీఁగెడు కాఁపుగుబ్బెతల పెన్గుబ్బ ల్పునాస ల్వెలిం
బిసికిళ్లుం బిసికిళ్లు హాలికుల కర్పించె న్నభస్యంబునన్. 133

టీ. నభస్యంబునన్=భాద్రపదమాసమునందు, వసతుల్=గృహములు, వెల్వడి = బయలువెళ్లి, వానకై = వర్షబాధానివృత్తి కొఱకు, గుడిసెమోవన్ = పొలములోఁ గాపునిమిత్తమై వేయఁబడ్డకుటీరము దగిలికొనఁగా, రాక=లోపలికిరాక, తాన్=తాను, ఆనియే=తగిలికొనియే, పసగాన్=ఒప్పిదముగా, ని...డన్-నిల్చిన=నిలువంబడియున్న, జమ్ముగూడన్ = జమ్ముచేఁగట్టబడ్డ గూడయందు, (జమ్ముగూడ కావలిగుడెసె లోనికి రాక గుడిసె దగిలి నిలిచియుండఁగా ననుట.) పొలము = కృషిసేయుభూమికి, అంబళ్లోయుచున్ = నంబలిమోచికొనుచు, పట్టి=ధరియించి, పెన్ముసురందున్ = జడివానయందు, ఈ...ల్-ఈఁగెడు = గుడిసెలోపలం దూఱునట్టి, కాఁపుగుబ్బెతల = కాఁపువాండ్రవనితలయొక్క, పెన్గుబ్బల్ = గొప్పవైనకుచములును, పునాసల్ = పూర్వసస్యంబు లైన

1. గూడెదు.

సజ్జలుమొదలయినవియును (పునర్వసుకార్తెయందుఁ జల్లఁబడ్డధాన్యములు గనుకఁ బునాస లని వ్యవహారము) వెలిఁ = వెలుపలను, హాలికులకుఁ=కృషిఁజేయు శూద్రులకు, పిసికిళ్లుఁ = కుచగ్రహణములును, పిసికిళ్లు=కంకులు నలుపుటలును, అర్పించెఁ=ఒసఁగెను.

తా. భాద్రపదమాసమునందు గృహముల వెలువడి జమ్ముగూడయందుఁ బొలమున కఁబలి, యన్నము మున్నగునవి మోచికొనిపోవుచు గొప్పవానయందు గుడిసెలు దూఱు కాఁపుస్త్రీల కుచములు, పునర్వసునక్షత్రమునఁ జల్లిన పునాసపస్యములు, కర్షకులకుఁ గుచములు నలుపుటయుఁ గంకులునలుపుటయు నను పనులు కలుగఁజేసెను. స్వభావోక్తి.

మ. గురుగుం జెంచలిఁ దుమ్మి లేఁదగిరిసాకుం దింత్రిణీపల్లవో
త్కరముం గూడఁ బొరంటి నూనియలతోఁ గట్టావికుట్టారుగో
గిరము [1]ల్మెక్కి తమిం[2]గొమల్పొలము వోఁ గ్రేఁపు[3]ల్మెయుల్నాఁక మేఁ
కెరువుంగుంపటి మంచ మెక్కిరి ప్రభుత్వైకాప్తి రెడ్లజ్జడిన్. 131

టీ. అజ్జడిఁ = ఆ ముసురునందు, గురుగుఁ = కురకటశాకమును, చెంచలి = తువిన్నకశాకము, తుమ్మి = ద్రోణశాకము, లేఁదగిరిసాకుఁ = కోమలమైన తంటెపుఁగూరయును, తింత్రిణీపల్లవోత్కరముఁ = చింతచిగురును, కూడఁ = వానితోఁ గలిపి, నూనియలతోఁ = తైలములతో, పొరంటి = పొరఁటి, కట్టావి = చుట్టు నావిరి బొటి మిగుల వేఁడియయిన, కుట్టారుగ+ఓగిరముల్ = కుఱుచయారికకూళ్లు, (మూఁడు నెలలకుఁ బండునవి కుఱుచయారిక లనియు నయిదునెలలకుఁ బండునవి పెద్దారికలనియుఁ జెప్పుదురు.) మెక్కి = తృప్తిగా తిని, తమిఁ = రాత్రియందు, కొమల్=కొడుకులు, (చెట్లకు శాఖలవంటివారు గనుక నిట్లు చెప్పవచ్చును.) పొలముపోఁ = చేలుగాయఁ బోఁగా, రెడ్లు = పెత్తనముచేయు కాఁపులు, ప్రభుత్వైకాప్తిఁ = అధికారమొకటి యబ్బుటచేత, క్రేఁపుల్ = దూడలు, మెయుల్ = దేహములను, నాఁకఁ = లేహన మొనరింపఁగా, మేఁకెరువుం గుంపటి = మేఁకలయెరువున నెత్తియుంచిన కుంపట్లుగల, మంచమెక్కిరి = మంచముపైఁ బవ్వళించిరి (వానకుఁ దడిసియు నని దూడలను మంచపుఁ గోళ్లకుఁగట్ట నవి దేహములను నాఁకుచుండఁగా శయనించి రనుట,)

తా. ఆవర్షాసమయమున కురకటము, తువిన్నకము, ద్రోణము, తంటెఁగూర, చింతచిగురు పొరఁటి నూనెతో నావిరిలేచుచున్న కుఱుచయారికలకూళ్లు మెక్కి, పుత్త్రులు పొలమున కేఁగఁ దాము తమమంచముల కోళ్లకుఁ గట్టిన దూడలు తమ

---

1. ల్మేసి. 2. కసుల్పొలము. 3. ల్మెయిన్నాక.

శరీరములు నాకు చుండఁగా మంచముక్రింద మేఁకయెరువువలన రాఁజు కుంపటు లుంచుకొని తమ గొప్పఁదన ముట్టిపడ రెడ్లు పవ్వళించిరి.

సీ. మణియష్టిఁ గేలిబర్హిణషడ్జసుధ వీను
        లోలాడఁ బ్రొద్దెక్కఁ మేలుకాంచి
ఘుమఘుమవత్సుమగంధరాజాంగమ
        ర్దనపైఁ జిరోష్ణమజ్జనము లాడి
మిసిమిదువ్వలువ బన్నసరంబు మొగలిఱే
        కులఁ దాల్చి జా మెక్కఁ గొలు వొసంగి
జాంగలామిషముతోఁ శాల్యన్న మధికహా
        య్యంగవీనంబుగా నారగించి
తే. మృగమదము మించుతములంపుఁటిరులు మోవి
దలముగా సాగకుహాసంతి వెలుఁగ సౌధ
శిఖరవాతాయనాగతాచిరరుగంశు
నతమృగవరోధములతోడ నగిరి నృపులు. 135

టీ. మణియష్టిన్=మణిమయమైన దండమునందున్న, కే...ధన్-కేళిబర్హిణ= పెంపుడునెమళ్ళ యొక్క, షడ్జ = షడ్జస్వరమనియెడు. సుధన్ = అమృతమునందు, వీనులు = చెవులు, ఓలాడన్ = జలకమాడఁగా, (అనఁగా వీనులకు విందై నిండఁగా నని భావము.) ప్రొద్దెక్క = సూర్యోదయం బైన మఱి కొంతసేపటికి, మేలుకాంచి = నిద్రలేచి ఘు...పైన్ - ఘుమఘుమవత్ = ఘుమ్మని వాసించుచున్న, సుమగంధరాజ = కుసుమగంధమను ద్రవ్యముయొక్క. అంగమర్దనపైన్=నలుఁగుబెట్టినమీఁదట, చిరోష్ణ= మిక్కిలివేఁడిగల యుదకములచేత, మజ్జనములు = జలకములు, ఆడి = సలిపి, (చిరోష్ణ మజ్జనములాడి యని యున్నందున నుష్ణశబ్దమునకు నుష్ణోదక మని యర్థముఁ జెప్ప వలయును.) మిసిమిదువ్వలువన్ = సరిగ తళతళలాడుదుప్పటిని, బన్నసరంబుల్ = బన్న సరము లను హారములను, మొగలిఱేకులన్ = మొగలిపువ్వులను, తాల్చి = ధరియించి, జామెక్క = జాము ప్రొద్దెక్కినవెనుక, కొలువొసంగి = సభఁజేసి, జా...తోన్ - జాంగల = మరుభూమియందలి, ఆమిషములోన్ = మాంసములోడను, (అనఁగా మరు భూమియందు సంచరించెడు కౌఁజు, పూరేఁడు, ఉడుము, ఏఁదుఁబంది మొదలగు వాని మాంస మనుట.) ('పలలం క్రవ్యమామిష'మ్మని యమరము.) శాల్యన్నము=రాజనపు సాదమును, అధికహయ్యంగవీనంబుగాన్ = అప్పుడు వెన్న గాఁచిననేయి యెక్కుడుగాఁ గలుగునట్లు ('తత్తుహయ్యంగవీనం యద్ధ్యో గోదోహోద్భవం ఘృత'మ్మని యమరము.)

ఆరగించి=భోజనముఁజేసి, మృగమదముమించు = కస్తూరియొక్క వగఁగల, తములంపు టిరులు = విడెముచే నల్లనైనకాంతులు, (కస్తూరి యధికమగుటవలన నల్లగానుండుట చేత నిరు లనుట.) మోవిన్ = పెదవిపై, దళముగాన్ = దట్టముకాఁగా, సాగరుహసంలిప్తవెలుఁగన్ =అగరుచెక్కతో నించినకుంపట్లు ప్రజ్వలించుచుండఁగా, సౌ...న్-సౌధ = ఉప్పరిగెలయొక్క, శిఖర = పైయంతస్తులయందున్న, వాతాయన=గవాక్షముల నుండి, ఆగత=వచ్చినట్టి, అచిరరుక్ = మెఱుపులయొక్క, అంశు=కాంతులచేతను, నత=వంపఁబడిన, దృక్=చూపులుగల, అవరోధములతోడన్=అంతఃపురస్త్రీలతో, ('శుద్ధాంతశ్చావరోధశ్చ' యని యమరము) నృపులు=రాజులు, నగిరి = ఆనందించిరి. స్వభావోక్తి.

వ. ఇట్లు సాంద్రసలిలధారాసారమాసరంబు లగు వార్షికవాసరంబులు
ప్రశాంతం బగుటయుఁ దదనంతరంబ. 136

టీ. ఇట్లు=ఈవిధముగా, సా...లు-సాంద్ర=ఘనమైన, సలిల=ఉదకములయొక్క, ధార=ధారలయొక్క, ఆసార = సమ్యక్ప్రవర్షణములచేతను మాసరంబులగు=వ్యాప్తములైన,వార్షికవాసరంబులు=వానకాలపుదినములు, ప్రశాంతం బగుటయున్=శాంతింపఁగా, తదనంతరంబ = అటుపిమ్మట.

—శరదృతువు—

ఉ. రాజమరాళలబ్ధగిరిరంధ్రము శాలివనీశరావళీ
వైజననంబు యజ్వహుతవాజహుతాశయ భాస్వదిందిరాం
భోజసమాగమం బుదితబోధభుజంగశయోపచారనీ
రాజనఫుల్లమల్లికసరం బుదయించె శరద్దినం బిలన్. 137

టీ. రా...ము-రాజమరాళ=రాజహంసలచేత, లబ్ధ=పొందఁబడిన, గిరిరంధ్రము=క్రౌంచపర్వతముయొక్క బిలముగల్గినట్టియు, (అంచలు మానససరోవరమున వర్షాకాలము వెళ్లపుచ్చి శరదృతువురాఁగాఁ గ్రౌంచపర్వతపుబిలములోఁజొచ్చి దశార్ణాదిదేశంబులకు వచ్చుట ప్రసిద్ధము.) శాలివనీ = రాజనపుఁజేలకు, శరావలీ = రెల్లుగంటలసమూహము నకును, వైజననంబు=కానుపునెలయైనదియును, ('సూతిమాసో వైజననః' యని యమరము.) యజ్వ = విధ్యుక్తప్రకారము జన్నముఁజేసినవారిచేత, హుత = హోమముచేయఁబడ్డ, వాజ = హవిస్సుగల, హుతాశనము = శ్రౌతాగ్నిగలదియును, (అపుడు సోమయాజులు నూతనాన్నభోజనముకొఱకు నాగ్రయణేష్ట్యాదికముఁజేసిరనుట, లేక, వాజివాజపేయము గలయదియైనఁ జెప్పవచ్చును. శరద్వాజపేయము ప్రసిద్ధము.) భా...బు - భాస్వత్ = వెలుంగుచున్న, ఇందిరా = లక్ష్మికి, అంభోజ = కమలములతోడి, సమాగమంబు = కల

యుతగలదియుండు, (శరదృతువునందుఁ గమలములకు వికసనముగల్గుటంజేసి వానియందే లక్ష్మి నివసించె నఁట.) ఉ...బు-ఉదిత = జనించిన, బోధ = మేల్కొనుటగల, భుజంగశయ = దామోదరునకు, ఉపచార = పూజనార్థమైన, నీరాజన=నివాళియయిన, ఫుల్ల= వికసించిన, హల్లక = చెంగల్వలుగల, సరంబు = కొలంకులు గలిగినట్టి, ('హల్లకం రక్త సంధ్యా'మ్మని యమరము.) (అనఁగా: చాతుర్మాస్యము లప్పటికిఁ గడచినవి గాన భగవంతుండు నిద్రమేలుకొనఁగా శరల్లక్ష్మి నీరాజనమెత్తెనో యన్నట్లు చెన్నొందియున్న యెఱ్ఱని గల్వలతో నొప్పియున్న కొలంకులు గలవనుట.) శరద్దినంబు = శరద్వాసరము, ఇలన్ = భూమియందు, ఉదయించెన్ = కనుపడెను వికసించిన చెంగల్వలను నిద్ర మేలుకొన్న యీశ్వరునకు శయనోత్థదారనీరాజనముగా వర్ణించినందున నుత్ప్రేక్షాలంకారము.

తా. పుడమిపై వర్షాకాలము కడచిన శరత్కాలము ప్రవేశించెను. ఆశరద్వాసరము రాజహంసలతోఁగూడిన క్రౌంచపర్వతబిలము గలది. అనఁగా శరత్కాలము రాఁగానే రాజహంసలు క్రౌంచనగబిలమునుండి దశార్ణాదిదేశములకుఁ బోఁ దొచ్చును. మఱియు నది శాలిధాన్యపుఁజేలు, రెల్లుగంటలసమూహమును ఈనుకాలము; యజ్ఞము చేయువారు వాజపేయ మొనర్చి హోమములుచేయు శ్రౌతాగ్ని కలకాలము; లక్ష్మీదేవి కమలములఁ బ్రవేశింప నవి వికసించుకాలము; మఱియు భుజగశయనుఁడు నిద్ర మేల్కొనఁగా నాతనికి నీరాజనముగాఁ బూచి వికసించియున్న చెంగలువలుగల సరోవరములు గలకాలము.

క. కరము పొగ రెక్కె నంబర
మురువిద్యుద్దీపకళిక లుమిసిన ధూమ
స్ఫురణఁ బొగచూరె ననఁగా
హరిమణిజంబూఫలాసితామలరుచులన్. 133

టీ. కరము = మిక్కిలి, అంబరము = గగనము, ఉ...లు - ఉరు = అధికమైన, విద్యుత్ = మెఱుపు లనియెడు, దీపకళికలు = దీపాంకురములు, ఉ...ణన్-ఉమిసిన= చిమ్మినటువంటి, (శ్లో. 'నిష్ఠ్యూతోద్గీర్ణవాంతాదిగౌణవృత్తివ్యపాశ్రయమ్, అతిసుందర మన్యత్ర గ్రామ్యకక్ష్యాం విగాహతే' అని ఆచార్యదండి చెప్పియున్నారు గాన నుమిసిన - అనునది మొదలగువానికి గౌణార్థములె కాని ముఖ్యార్థములు చెప్పఁగూడదు.) ధూమ= పొగయొక్క, స్ఫురణన్ = స్ఫురించుటచేత, పొగచూరె ననఁగాన్ = ధూమిత మాయెనో యన్నట్లు, హ...లన్-హరిమణి=ఇంద్రనీలములవలెను, జంబూఫల=నేరేడు పండ్లవలెను, అసిత = నల్లనై, అమల = స్వచ్ఛములై యున్న, రుచులన్ = కాంతులచేతను, పొగ రెక్కెన్ = మదించెను. ఉత్ప్రేక్షాలంకారము-రూపకానుప్రాణితము.

తా. శరత్కాలప్రవేశము కాఁగానే యాకాశము మిక్కిలి నలుపెక్కెను. ఆయాకాశము విస్తారములగు విద్యుద్దీపముల యంకురములు చిమ్మిన దట్టపుఁ బొగచేత ధూమిత మయ్యెనో యన్నట్లు ఇంద్రనీలములవలెను నేరేడుపండ్లవలెను నల్లనైన స్వచ్ఛకాంతులచే నొప్పారెను.

ఆ. సాంధ్యరాగలహరి సామిరంజితములై
తిరిగె మింట నిదుర దెలిసినట్టి
యిందిరాధిపతికి నెత్తుకర్పూరనీ
రాజనంబు లన శరద్ఘనములు 119

టీ. శరద్ఘనములు = శరత్కాలమేఘములు, సా...లు ఐ-సాంధ్య = సంధ్యాసంబంధియయిన, రాగ = రక్తిమయొక్క, లహరి=తరంగముల చేతను, ('మహత్సూల్లోల కల్లోలౌ లహర్యూర్మిస్తు వీచిష్వ' అని యమరశేషము.) సామి = సగము. రంజితములై = కెంపు వర్ణములుగలవిగాఁ జేయఁబడినవై, ని...కిన్ - నిదురదెలిసినట్టి = నిద్ర మేల్కాంచిన, ఇందిరాధిపతికిన్ = లక్ష్మీరమణునకు, ఎ...నన్-ఎత్తు = పట్టినటువంటి, కర్పూరనీరాజనంబులనన్ = ఘనసారపురివ్వాళులో యన్నట్లు, మింటన్ = అంతరిక్షమునందు, తిరిగెన్ = సంచరించెను, ('సామిత్వర్ధే జుగుప్సితే' యనియు, 'ఇందిరా లోకమాతా మా' యనియు నమరము.) ఉత్ప్రేక్షాలంకారము.

తా. ఆశరత్కాలమేఘములు సంధ్యాకాలమునందలి యెఱుపురంగుచే సగమెఱుపుగలవై నిద్రమేల్కన్న విష్ణుమూర్తికిఁ బట్టుకర్పూర నీరాజనములో యన్నట్లాకసమున సంచరించెను.

చ. అళిగరుదంచలామలత దంతరబింబిత యయ్యెఁ బాకని
ర్దళితమహాఫలౌఘహరి తచ్ఛదకర్కటికావనాలి నాఁ
గలమవనభ్రమచ్ఛుకనికాయము లోపల సాంధ్యరక్తిమం
బలఁతిగఁ దాల్చి మింటఁ గన నయ్యె విపాండుపయోదఖండముల్.

టీ. వి...ల్-విపాండు = మిగులఁ దెల్లనైన, పయోద=మబ్బులయొక్క, ఖండముల్ = శకలములు, క...ము-కలమవన = పండినరాజనపు చేలమీఁద, భ్రమత్ = తిరుగుచున్న, శుకనికాయము = చిలుకలగుంపు, లోపలన్ = శరత్కాలమేఘములలోపల సా...బు - సాంధ్య = సంధ్యాకాలసంబంధియైన, రక్తిమంబు = ఎఱుపు అలఁతిగన్ = కొంచెముగా, తాల్చి = ధరియించి, పా...ళి-పాక = పండుటచేతను, నిర్దళిత = మిక్కిలి విరిసిన, మహత్ = గొప్పవైన, ఫల = పండ్లయొక్క, ఓఘ = సమూహముగల్గినయు, హరిత చ్ఛద = పచ్చనియాకులుగల, కర్కటికావనాలి = దోసతోఁటలగుంపు, అ...త-అళి=

తుమ్మెదలయొక్క, గరుత్ = ఱెక్కలయొక్క, అంచల = కొనలవలె నున్న, అమల = నిర్మలమయిన, ఖత్ = ఆకాశముయొక్క, అంతర = నడుమను, బింబిత = ప్రతిఫలించె నో కో, అయ్యెనాన్ = అన్నట్లు, కననయ్యెన్ = చూడనొప్పెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. పండినపైరులమీఁద సంచరించుచున్న చిలుకలగుంపును దమయందించు కంఠసంధ్యారాగకరక్తిమము ధరియించిన తెల్లని మేఘఖండములును, బరిపక్వము లై పండి విరిసిన గొప్పపండ్లును బచ్చనయినయాకులును గల దోసతోఁటలు, ద్విరేఫముల ఱెక్కలమొనలవలె నైగనిగ్యము గలయయ్యాకాశమునందుఁ బ్రతిఫలించెనో యన్న ట్లుండెను.

క. ఘుణగణవిహరణఁ జివికిన
మణిధనువునఁ దొరఁగు నుసి సమానములై ద
ర్పణనిభనభమునఁ బరిణత
శణకణహారిణములు *జలదశకలము లొలసెన్. 141

టీ. ఘు...ణన్-ఘుణ = నుసిపురుగులయొక్క, గణ = సమూహముయొక్క, విహరణన్ = సంచారముచేత, చి . నన్ - చివికిన = వానలకుఁదడిసి శిథిలమయిన, మణి ధనువునన్ = ఇంద్రధనువునందుండి, తొ...లు ఐ-తొరఁగు = పడుచున్నటువంటి, నుసి సమానము లై = పరాగసదృశము లై, పరి...లు-పరిణత = పరిపక్వములయిన, శణ = జనుప నారయొక్క, కణ = లేశములవలెను, హారిణములు = తెల్లనైనటువంటి, జలదశకల ములు = మబ్బుతునుకలు, ద...నన్ - దర్పణ = అద్దములోదను, నిభ = సమానమయిన, నభమునన్ = ఆకాశమందు, ఒలసెన్ = సంచరించెను శరత్కాలమేఘములను మణి ధనువుయొక్క పరాగము లని యుత్ప్రేక్షించినందున నుత్ప్రేక్షాలంకారము.

తా. శరత్కాల మేఘశకలములు పండియెండిన జనుపనారలేశములవలె మిక్కిలి తెల్లనై, నుసిపురుగులు పట్టుటచేఁ జీకిపోయిన యింద్రధనుస్సునుండి రాలిపడు పొడి వలె, నద్దములో సమానముగ స్వచ్ఛమైన యాకాశమున సంచరించెను.

క. రవిశశిముకురములు శర
ద్యువతి మెఱుఁగువెట్టుభూతి యో యనఁ బర్వెన్
బవనాహతసప్తచ్ఛద
నివహపరాగంబు దివికి నిర్మలకాంతిన్. 142

టీ. ర...లు-రవిశశి = చంద్రసూర్యు లనియెడు, ముకురములు = అద్దములను, శరద్యువతి = శరదృతువను జవరాలు, మెఱుఁగువెట్టు = కాంతిఁగలుగఁజేయుటకై, భూతి

---

* పాండుజలదము లొలసెన్.

యో యనన్=భస్మమో యనఁగా, ప...బు-పవన=వాయువుచేతను, ఆహత = ఎగురఁ గొట్టఁబడిన, సప్తచ్ఛద = ఏడాకుల యరఁట్లయొక్క, నివహ = సమూహముయొక్క, పరాగంబు = పుప్పొడి, దివిన్ = అంతరిక్షమునకు, ని...లిన్-నిర్మల=స్వచ్ఛమయిన, కాంతిన్=తేజస్సుచేతను, పర్వెన్=వ్యాపించెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. లోకమునం దద్దమునకు వచ్చిన మాలిన్యమును భస్మముచేతఁ దుడుచుట ప్రసిద్ధము గాన, నటు వర్షాకాలమందుఁ జంద్రసూర్యు లనునద్దములకు నైర్మల్యము దక్కువ పడఁగా వానికి మెఱుఁ గెక్కించి చక్కఁబఱచుటకై శరద్వనిత యుంచిన విభూతియో యనున ట్లాసమయమందు సప్తచ్ఛదపరాగములు గాలిచేత నెగరఁగొట్టం బడి యంతరిక్షమున వ్యాపించెను.

స్రగ్ధర. సంభూతజ్ఞప్తివాతా । శనశయనము విశ్వంభరుం డూఁదిలేవన్
గంభీరప్రక్రియామ । గ్నత డిగు జగతిం । గ్రందుగాఁ దోఁచు వర్షా
దంభోళిస్థూలరంధ్రో । ద్గతసితపృథుపా । తాళజాతాంబుధారా
స్తంభంబుల్పోలె నెన్ను । ల్ధవళరుచిశర । స్తంబపఙ్క్తిం జనించెన్.

టీ. సం...ప్తిన్-సంభూత = జనించినట్టి, జ్ఞప్తిన్ = మెలఁకువచేతను, వాతాశన శయనమున్ = శేషపర్యంకమును, విశ్వంభరుండు = శ్రీమహావిష్ణువు, ('విశ్వంభరః కైటభజి ద్విధుశ్శ్రీవత్సలాంఛనః' యని యమరము.) ఊఁదిలేవన్=ఊఁతుకొనిలేవఁగా, గం...తన్-గంభీరప్రక్రియా=నిమ్న ప్రకారమగునట్లు, మగ్నతన్=మునుఁగుటవల్లను, డిగు= క్రిందికినడఁగినట్టి, జగతిన్=భూమియందు, క్రందుగాన్=దట్టముగా, తో...చ్-తోఁచు= కానవచ్చుచున్న, వర్షా=వానకాలమందలి, దంభోళి=పిడుగులయొక్క, స్థూలరంధ్ర = గొప్పబెజ్జములవలన, ఉద్గత = బయలుదేఱిన, సిత = తెల్లనైన, పృథు = గొప్పలైన, పాతాళజాత = పాతాళలోకమందుఁ బుట్టిన, అంబుధారాస్తంభంబుల్ పోలెన్ = స్తంభములవంటి యుదకధారలవలె, శరస్తంబపఙ్క్తిన్ = రెల్లుకాఁడలవరుసయందు, ఎన్నుల్ = కంకులు, ధవళరుచిన్ = తెల్లనికాంతితో, జనించెన్=పుట్టెను. ఇందు రెల్లు యొక్క యెన్నులను బిడుగులరంధ్రములనుండి బయలువెళ్ళినట్టి పాతాళజలధారాస్తంభములుగా నుత్ప్రేక్షించినందున నుత్ప్రేక్షాలంకారము.

తా. ఆశరదృతువునం దేచక్కనఁ జూచినను రెల్లుపొదలు ఎన్నులు దీసి తెల్లగాఁ బ్రకాశించుచుండెను. అది యెట్లుండె ననఁ శ్రీమహావిష్ణువు శేషపర్యంకమునుండి నిద్రమేల్కొని యూనుకొనిలేవఁగాఁ గ్రిందికడకు భూమియందుఁ బడినపిడుగులు చేసిన రంధ్రములనుండి పాతాళమునఁ బడు స్తంభములవంటి జలధారలవలె రెల్లుకాఁడలను వెన్నులు తెల్లనై పుట్టెను.

తే. నీరజేక్షణుఁ డవ్వేళ నిద్ర దెలిసి
యడుగుఁ దనమీఁద మోప నోయవనిరమణి
కంటకితగాత్రి యయ్యె నాఁగా విపాక
పరుషకంటకశాలిమంజరులు వొలిచె. 141

టీ. నీరజేక్షణుఁడు = విష్ణుదేవుఁడు, అవ్వేళన్ = ఆ శరత్సమయమునందు, నిద్ర దెలిసి = నిదురమేల్కని, అడుగున్ = పాదమును, తనమీఁదన్ = భూమిపైని, మోపనో = ఉంచఁగానో, అవనిరమణి = భూదేవి, కంటకితగాత్రి యయ్యె నాఁగన్ = పులకితాంగియయ్యె నన్నట్లు, విపాక = పండుటచేత, ప...లు - పరుష=వాఁడి యై యున్న, కంటక = ముండ్లుగల, శాలిమంజరులు = సన్నవరియెన్నులు, పొలిచెన్ = ఒప్పెను. హేతూత్ప్రేక్షాలంకారము.

తా. పండి ముదురైనందున వాఁడిమి గలిగియున్న ముండ్లతోనుండు సన్నవరి యెన్నలం జూడఁగా, నా శరదృతువునందుఁ గమలాక్షుండు నిద్ర లేచి యడుగుఁ దనమీఁద నుంచుటచేత నాభూదేవి పులకితగాత్రి యాయె ననున ట్లుండెను.

మ. స్ఫుటభూయోహ్యతిశంక వార్ధి నినరశ్ము ల్మిన్ను చేర్పం దటి
చ్ఛట లౌర్వంబుగఁ గారుకొంచు ఘనమై క్ష్మాఁ దీర వర్షింప న
చ్ఛోటనుం దోఁచి గ్రసింపఁ బోలుఁ గలశీసూనుండు గాకున్న నొ
క్కాటఁ దారాగ్రహభాస్కరేందుమణిశుక్తుల్ వ్యక్తమై తోఁచునే.

టీ. స్ఫు...కన్ - స్ఫుట = వ్యక్తమైన, భూయోహ్యతిశంకన్ =అగస్త్యుండు మరలఁ బానముఁజేయు ననుభయముచేత, ('శంకావితర్కభయయోః' అని యమరము.) ఇనరశ్ముల్ = సూర్యకిరణములు, వార్ధిన్ = సముద్రమును, మిన్ను చేర్పన్ =అంతరిక్షమును బొందింపఁగా, (సూర్యకిరణములు సముద్రోదకమును మేఘములందుఁ జేర్పఁగా ననుట.) తటిచ్ఛటలు = విద్యుత్సమూహములు, ఔర్వంబుగన్ = బడబాగ్నిగా, కారుకొంచున్ = నల్లనిదై, ఘనమై = మేఘమై, క్ష్మన్ =భూమిని, తీరవర్షింపన్ = ఉదకమంతయు వానలు గురియఁగా, అచ్ఛోటనున్ = ఆ యాకాశమునందును, కలశీసూనుండు = అగస్త్యుఁడు, తోఁచి = కనుపించి, గ్రసింపన్ పోలున్ = సముద్రోదకము బానముజేసెఁ గాఁబోలు, కాకున్నన్ = అట్లు గాకుండెనేని, ఒక్కాటన్ = ఏకరీతిగా, తా...ల్ - తారా = చుక్కలును, గ్రహ = అంగారకాదిగ్రహములును, భాస్కర = సూర్యుఁడును, ఇందు = చంద్రుఁడును, (అనియెడు) మణి=రత్నములును, శుక్తుల్=ముత్యపుఁజిప్పలును, వ్యక్తమై=స్ఫుటమై, తోఁచునే=కానవచ్చునా, కానరా వనుట. అలం. ఉత్ప్రేక్ష, చివరిపాదమున రూపకము.

తా. శరత్సమయమున నంతరిక్షమందు మేఘములు లేక, నక్షత్ర సూర్యేందులు స్ఫుటముగఁ బ్రకాశించుటను నగస్త్యోదయమగుటను జూడఁగాఁ, బూర్వ మగస్త్యునికి వెఱచి మేఘరూపమును వహించి యాకాశమును జెందియున్న సముద్రుని నగస్త్యుఁడు మరలఁ బానముచేసియుండును. లేకపోయెనేని యందుండు తారాగ్రహాము లనియెడు రత్నములును, సూర్యచంద్రులనుముత్యపుఁజిప్పలును గానవచ్చుటకుఁ గారణము లేదను నట్లు తోఁచుచుండెను.

చ. అలమలయాద్రి కుంభభవుఁ డన్కతకంబు శరత్తుకుండమం
డలిఁ బ్రతిబింబకైతవమునం దమ కిచ్చిన వారిదేవత
ల్తొలఁకులకేలఁ దాప నిడి తోమఁ గలం కడఁగెం దదీయత
త్ఫలతకు హ్రస్వ మాటె కరి తారక లంబువుఁ దేర్చునే యనన్.

టీ. అ...ఖన్ - అల=ప్రసిద్ధమైన, మలయాద్రి = పటీరపర్వతమునందున్నట్టి, కుంభసంభవుఁడు.= అగస్త్యుఁడు, ('అగస్త్యః కుంభసంభవః' యని యమరము.) అన్ కతకంబున్ = అనుచిల్లగింజను, ('చక్షుష్యః కతకః కాంతికృ' త్తనిరత్నమాల.) శ...లిన్ - శరత్తు = శరదృతువు, కుండమండలిన్ = సరస్సమూహములందు, ప్రతిబింబకైతవమునన్ = ప్రతిఫలనవ్యాజముచేతను, తమకున్ = ఆవారిదేవతలకు, ఇచ్చినన్ = ఇయ్యఁగా, వారిదేవతల్ = జలదేవతలు, తొలఁకులకేలన్ = తరంగములను హస్తములచేతను, తాఁపనిడి = మెట్టుఱాతిమీఁదఁబెట్టి, తోమన్ = అరగఁదీయఁగా, కలంకు అడంగెన్ = కాలుష్యము దీఱెను, తదీయ = ఆ యగస్త్యుని సంబంధియైన, తత్ఫలతకున్ = ఆ చిల్లగింజౌటకు, హ్రస్వమాటె = చిన్నదౌటయే, కరి = సాక్షి, (చిల్లగింజ గనుకనే రాచినందున హ్రస్వమాయె ననుట.) (అట్లుగాకుండెనేని) తారకలు = నక్షత్రములు, అంబువున్ = ఉదకమును, తేర్చునే = తేఁటగాఁజేయునా, చేయ వనుట. అనన్ = అనునట్లు, కలంకడఁగె నని క్రిందికన్వయము, రూపకానుప్రాణితాపహ్నుత్యుత్థాపితోత్ప్రేక్షాలంకారము.

తా. మలయపర్వతముపై నున్న యగస్త్యుఁ డను నిండుపగింజను శరదృతువు సరస్సులలోఁ బ్రతిబింబించు వ్యాజమున వారిదేవతల కీయఁగా, నాజలదేవతలు కెరటములనుచేతులతో సోపానశిలలపైఁ బెట్టి యాచిల్లగింజ నరగఁదీయఁగా జలములు కలఁకలు దేఱి స్వచ్ఛములయ్యెను. అగస్త్యుఁడు చిల్లగింజయాయె ననుట కాచిల్లగింజనరగఁదీయఁగా చిన్నదౌటయే సాక్ష్యము. అట్లు కానినాఁడు నక్షత్రములు నీటికాలుష్యమును బాపలేవు గదా యనునట్లు జలములు స్వచ్ఛము లయ్యెను.

చ. ఇలకు సుధాసమత్వము వ । హింప శరజ్జలజాక్షి కుండమం
డలి సలిలంబు కల్మష మ । డంగ మొగుల్విరియెండఁగాయుచోఁ
జిలుకు నిశారజఃపటలి । చెన్ను వహించెఁ దరంగపఙ్క్తిపై
దళదరవిందకైరవక । దంబకడారపరాగపూగముల్. 147

టీ. తరంగపఙ్క్తిపైన్ = కరుళ్లబంతిమీఁద, ద...ల్ - దళత్ = వికసించుచున్న, అరవింద = పద్మములయొక్కయు, కైరవ=కలువలయొక్క, కదంబ = సమూహములయొక్క, కడార=పచ్చనైనటువంటి, ('కడారః కపిలః పింగః' యని యమరము.) పూగముల్ = సమూహములు, ('పూగో వితానం ప్రకరః' యని యమరము.) ఇలకున్ = భూమికి, సుధాసమత్వము = అమృతసామ్యము, వహింపన్ = పొందునట్లు, శరజ్జలజాక్షి=శరత్కాలమను స్త్రీ, కుండమండలిన్ = కొలంకులసమూహమందు, ('కుండం పిఠరే తోయాధారవిశేషే చ వహ్నిగర్తే చ, కుండో జారాజ్జాతస్సభర్తృకాయాం కమండలౌ కుండీ' యని రత్నమాల.) సలిలంబు=ఉదకము, కల్మషమడంగన్ = కలుషము పోవుటకు, మొగుల్ = మబ్బులు, విరి=విరిసిన, ఎండఁగాయుచోన్=ఎండ కాయఁగా, చి...లి - చిలుకు = చల్లఁబడినటువంటి, నిశారజఃపటలి = పసుపుపొడిరాశియొక్క, చెన్ను = సౌందర్యమును, వహించెన్ = పొందెను. ఉత్ప్రేక్ష.

తా. ఆసమయమున వికసించిన తామరలయొక్కయుఁ గలువలయొక్కయుఁ బరాగములు తరంగముల పైఁబడి శరదృతు వను స్త్రీ యుదకములోని కల్మష మడఁగించి రుచిఁబుట్టించుటకొఱకుఁ జల్లిన పసుపుపొడివలె నుండెను.

ఉ. హెచ్చినమైత్త్రిఁ బద్మినుల । కెల్ల ఘనాత్యయకారుకుండు సొ
మ్మచ్చుపడంగఁ జేయుటకు । నై యలక్రౌంచనగంబుపేరిక
మ్మచ్చున నీడ్చు శర్వగిరి । యందలి వెండిశలాకపిండు నా
వచ్చి మరాళమాలికలు । వ్రాలెఁ గొలంకులఁ జక్రఝంకృతిన్. 148

టీ. హెచ్చినమైత్త్రిన్=అతిశయించినస్నేహముచేత, పద్మినులకెల్లన్ = తామర కొలంకు లను పద్మినీ స్త్రీల కంతయును, ఘనాత్యయ = మేఘావసానమనెడు (అనఁగా శరదృతు వనుట.) కారుకుండు = అగసాలెవాఁడు, సొమ్ము = భూషణము, అచ్చుపడంగన్ = సమముగ నుండులాగున, చేయుటకునై = తీఁగెగా నొనరించుటకై, అల = ప్రసిద్ధమైన, క్రౌ...నన్ - క్రౌంచనగంబుపేరి=క్రౌంచపర్వత మనియెడు పేరుగల, కమ్మచ్చునన్ = వెండిబంగారు తీఁగెతీయునట్టి యినుపకమ్మచ్చుయొక్క బెజ్జమందు, ఈ...నాన్ - ఈడ్చు = లాగెడు, శర్వగిరియందలి = కైలాసపర్వతమునం దున్న,

వెండిశలాకపిండులన్ = రజతపుఁదీఁగెల సమూహమో యనునట్లు, మరాళమాలికలు = హంసలబంతులు, వచ్చి = ఏతెంచి, కొలంకులన్ = సరస్సులయందు, చ...లన్ - చక్ర = సుడిగాలియొక్క, ఝంకృతిన్ = ఝంకారముతోడను, వ్రాలెన్ = దిగెను.

తా. మిక్కిలి యనురాగముతోఁ దామరకొలఁకు లనుపద్మినీస్త్రీలకు శరదృతు వను నగసాలెవాఁడు అందమగు భూషణ మొనర్చుటకై క్రౌంచాచల మను కమ్మచ్చునందు లాగు కైలాసపర్వతమందున్న వెండితీఁగల సమూహమో, యనునట్లు కడువేగముగా హంసల సమూహము వచ్చి శరదృతువునందుఁ గొలఁకులఁ జేరెను. శ్లిష్టరూపకానుప్రాణితోత్ప్రేక్ష.

తే. కుంభజుఁడు వార్ధితోఁ గ్రోలి కుక్షి నున్న
మించుముక్తాచ్ఛటలె కుమ్మరించె ననఁగ
జలజదళములఁ దేటలుఁ జవులు నయిన
యంబుకణములు పొలిచెఁ బద్మాకరముల. 149

టీ. కుంభజుఁడు=అగస్త్యుఁడు, వార్ధితోఁ గ్రోలి=సముద్రములోఁగూడఁ బానము చేసి, కుక్షి నున్న = ఉదరములో నున్న, మించు = అతిశయించిన, ముక్తాచ్ఛటలె = మౌక్తికసమూహములే, కుమ్మరించె ననఁగన్ = మగుడ విగువఁబోసెనో యనఁగ, జలజదళములన్ = తామరాకులయందు, తేటలు = స్వచ్ఛమైనటువంటివియు, చవులునైన = రుచిగలవియునైన, (ముత్యాలలో నొక్క లెక్కకు చవి యని పేరుగనుక నవి యనియు నర్థము.) అంబుకణములు = ఉదకబిందువులు, పద్మాకరములన్ - పద్మ = తామరలకు, ఆకరములన్ = గనులైన కొలఁకులయందు, పొలిచెన్ = ఒప్పెను. శ్లేషానుప్రాణితోత్ప్రేక్ష.

తా. తామరచెఱువులయందలి పద్మపత్త్రములమీఁదఁ జేరిన స్వచ్ఛములు రుచికరములు నైన జలబిందువులు, అగస్త్యుఁడు సముద్ర మాపోశనించినపుడు కడుపులోనికిఁ జొచ్చిన ముత్యముల సమూహము మరల వెలికి దిగువఁబోసెనో యన్నట్లొప్పారెను.

చ. కెరలు స్రవంతిపై యిసుక క్రిందగువేళ నినుండు మేఘపుం
దెర సనఁ జల్లఁగా విరహ దీప్తకరస్ఫుత మాసజీరకో
త్కరగుడ మట్ల పద్మినులఁ గ్రమ్ముసకేసరమాధ్వి పొల్చెఁ బైఁ
గర మరుదారెఁ దేట్లు [1]సెక గందినముత్తెపుసేసలో యనన్. 150

1. సెగఁ గట్టిన.

టీ. కె...క-కెరలు=ప్రవహించుచున్న, స్రవంతిన్=నదులయందు, ('స్రవంతీ నిమ్నగాపగా'యని యమరము.) పైయిసుక=ప్రవాహవేగముచేత నీళ్ళతోఁ గలిసి పైగాఁ బ్రవహించుచున్న యిసుక, క్రిందగువేళన్=అడుగుఁబట్టినప్పుడు, (వేగము తగ్గినప్పు డిసుక క్రిందఁబడుట ప్రసిద్ధము. స్రవంతి యనఁగా నిసుకపోసియుండు ఘటికా యంత్రమనఁబడు పేరుగనుక దానిలోఁ బైయిసుక క్రిందికి రాఁగా ననియు నర్థము.) ఇనుఁడు= సూర్యుఁ డనునాయకుఁడు, ('ఇనస్సూర్యేప్రభౌ'యని యమరము.) మేఘపుందెరసనన్= మేఘమనుతెర దీయఁగా, చల్లఁగాన్ = చిలుకరింపఁగా (ఉంచఁగా ననుట.) వి...ము అట్లు-విరహ = వియోగవేదనచేత, దీప్త = వెచ్చనైన, కర=హస్తమందు, ప్లుతమా = తేలుచున్న, సజీరకోత్కర = జీలకఱ్ఱతోఁగూడిన, గుడమట్ల = బెల్లము వలె, పద్మినులన్=తామరపువ్వు లనియెడు పద్మినీజాతి స్త్రీలయందు, క్ర...ధ్వి-క్రమ్ము=వ్యాపించి నట్టి, సకేసరమాధ్వి = కేసరములతోఁగూడిన మకరందము, పొల్చెన్ = ఒప్పెను, ('పద్మినీకరిణీశ్రీ స్త్రీ సరోజనలినీషుచ' యని రత్నమాల.) (విరహతాపతప్తమైన హస్తమందు గుడ ముంచఁగాఁ గరఁగి పాకమైనట్లు మకరంద ముండె ననుట.) తేంట్లు=తుమ్మెదలు, సెకన్ = తాపముచేతను, కం...లో అనన్-కందిన = కమలినటువంటి, ముత్తెపు సేసలో అనన్ = ముత్యాలతలంబ్రాలోయనునట్లు, పైన్ = ఉపరిభాగమందు, కరము= మిక్కిలి, అరుదారెన్ = ఒప్పెను. రూపకానుప్రాణిత ఉత్ప్రేక్షాలంకారము.

తా. తామరపువ్వులయందుఁ గేసరములతోఁ గూడిన మకరందము నదులవేగము తగ్గినపుడు మేఘపుఁదెర తొలఁగఁగా, సూర్యుఁడు పైయిసుక క్రిందికిఁ జల్లఁగా నది పద్మినులహస్తములఁబడి విరహవేదనచే దీప్తములగుహస్తములఁ బెట్టిన జీలకఱ్ఱతోఁగూడిన బెల్లమువలె నొప్పెను. విరహవేదనచేఁ గమలిన ముత్యాలసేసలవలె వానిపైఁ దుమ్మెద లొప్పారెను.

చ. జలజదళస్థతోయములు సందుల క్రిందుగఁ దోఁచుమింటినీ
డలుఁ గనుపట్టె నత్తఱిఁ దటాకములన్ లఘిమంబు రెంటిలోఁ
దెలియఁ దరంగఁ బైకెగయు తేఁటులచేసులఁ దూర్పఁ దోయము
ల్పలుచనఁ దేలి మిన్నడుగువట్టెఁ గడుం దళమాటవో యనన్. 151

టీ. జ...లు-జలజదళ = పద్మపత్రములయందు, స్థ = ఉన్నటువంటి, తోయములు = ఉదకములును, సం...గన్ - సందుల = ఆ పద్మపత్రముల సందులయొక్క, క్రిందుగన్ = అధోభాగమునందు, తో...లున్ - తోఁచు=కనుపించుచున్న, మింటినీడలున్=ఆకాశము యొక్క ప్రతిఫలనములును, అత్తఱిన్=ఆ శరత్సమయమునందు,

లఘిమంబు=చులకఁదనము, రెంటిలోన్ = ఆకాశజలములలోను, తెలియన్=ఎఱుంగుట కొఱకు, తరంగన్ పైకెగయు = కరుళ్ళచేతఁ బైకెగయుచున్న, తేఁటుల = తుమ్మెదలని యెడు, చేరులన్=దారములచేతను, తూన్పన్ = తామరాకులనియెడు తూనికె సిబ్బుల యందుఁ దూపఁగా, తోయముల్ = ఉదకములు, పలుచనన్ = తేలికయగుటవల్ల, తేలి = పైఁకిదేలి, మిన్ను = ఆకాశము, కదున్ = మిక్కిలియును, దళమాటనో = మందమాటచేతనో, అడుగువట్టెన్ = క్రిందికిఁ బోయెను. అనన్ = అనఁగా, తటాకములన్ = సరస్సులయందు, కనుపట్టెన్ = చూపట్టెను. ఉత్ప్రేక్ష.

తా. తామరాకులపయినుండు నీరును, వాని సందులయందుఁ దటాకములోని యుదకమునఁ బ్రతిఫలించిన యాకాశముయొక్క నీడలను జూచి, యాకాశము తేలికయో, లేక యుదకములు తేలికయో, చూత మను సంకల్పముచేతఁ దేంట్లను దారములు గల తటాకమను తక్కెడయందుఁ దూనికవేయఁగా నుదకములు పలుచన గనుక మీఁదికి వచ్చెను, మిన్ను దళముగనుక నడుగుఁబట్టెను.

మ. ఇలకు న్వ్రేఁగుగఁ బండుతీరవనపుండ్రేక్షుచ్ఛట ల్దీపు ల
గ్గలమై వ్రాల నురుస్వనంబు లెసఁగంగాఁ ద్రిప్పు రాట్నంపుగుం
డ్రలు నాఁ దేనెకొలంకులం బొరలి పాఱన్ విచ్చు పంకేరుహం
బుల నాడెం దొలుసంజఁ దేఁటివలయంబుల్తారఘుంకారముల్. 152

టీ. ఇలకున్=భూమికి, వ్రేఁగుగన్ = బరువగునట్లు, పం...ల్-పండు = పరిపక్వమైన, తీర = దరియందలి, వన = ఉద్యానవనమందున్న, పుండ్రేక్షుచ్ఛటల్ = నామాలచెఱకుగుంపులు,('రసాల ఇక్షుస్తద్భేదాః పుండ్రకాంతారకాదయః' యని యమరము.) తీపులు=మాధుర్యములు, అగ్గలమై = అతిశయమై (రసము విస్తరించి యనుట), వ్రాలన్=మీఁదవంగఁగా, ఉరుస్వనంబులు=అధికమైనధ్వనులు, ఎసఁగంగాన్=ఒప్పఁగా, త్రిప్పు=త్రిప్పఁబడుచున్న, రాట్నంపు గుండ్రలు నాన్ = చెఱకుగానుగయొక్క కోల లోయనఁగా, తేనె=మకరందము, కొలంకులన్ = సరస్సులయందు, పొరలిపాఱన్ = లుంఠితమై ప్రవహింపఁగా, విచ్చు = వికసించుచున్న, పంకేరుహంబులన్ = పద్మములయందు, తారఘుంకారముల్ = గంభీరములయిన ధ్వనివిశేషములు గల, తేఁటి...బుల్- తేఁటి = తుమ్మెదలయొక్క, వలయంబుల్ = మండలాకారభ్రమణంబులు, తొలు సంజన్ = ప్రాతస్సంధ్యయందు, ఆడెన్ = తిరిగెను. ఉత్ప్రేక్షాలంకారము.

తా. తీరమందలి చెఱకులు వంగి తటాకములలో నున్న కమలములమీఁదఁ బడియుండ, నా కమలంబులయందలి మకరందములు సరస్సులలోఁ బొరలి పాఱుచుం

దఁగా, నందు మండలాకారభ్రమణములు సేయుచున్న తుమ్మెదలయొక్క ధ్వనులు చెలువు గానుగకోలలధ్వనులవలె నుండెను.

సీ. హాలనమత్కదళికంకదాభతిర్యఙ్నతా
స్యమునఁ గొమ్మొకటి మోకపనఁగఁ గ్రుంగఁ
గటముల డిగి చిబుకమున రే పేరిన
మద మంజనగ్రంథికమాడ్కి మెఱయ
ఛిద్రోత్థహతవలకత్కద్రూజ మనఁ జుట్టు
తో విప్పుతో దరిఁ క దొండ మాడ
తెల్లు పెల్లలు నీటఁ క ద్రెళ్లి ఫేనము వండు
నయి పునఃప్రావృడాశయము నొసఁగ
తే. ఘనరజోవృష్టికై మీఁదికన్ను మొగుడఁ
గటిదెసలు నిక్క బరితోలు క గదఁ గిలు
మదము తిక్కత నదులకీఁ క దదనుకృద్వ్ర
పాలితోఁ దేంట్లు పఱవఁ గోకరాడెఁ గరులు. 113

టీ. హా...నక్ - హాల = నాఁగేటిదుక్కిచేత, నమత్ = వంగుచున్నటువంటి, కదళికందాభ = అనఁటిదుంపసామ్యముగల, తిర్యక్ = అడ్డముగా, నత=వంగినటువంటి, ఆస్యమునక్ = ముఖమందు, కొమ్మొకటి = ఒకవిషాణము (దంత మనుట), మోసు+అనఁగక్ = ఆకువిప్పనియరఁటిమొలక యనునట్లు, క్రుంగక్ = వంగఁగా, కటములక్=గండస్థలమునుండి, డిగి = జాఱి, చిబుకమునక్ = గడ్డమందు, రే=రాత్రియందు, పే...ము- పేరిన = ఘనీభవించిన, మదము = దానము, అంజనగ్రంథిమాడ్కిక్ = కాటుకదబ్బివలెను, మెఱయక్ = ఒప్పఁగా, చి...ము - ఛిద్రోత్థ = రంధ్రమువలన బయలువెడలినట్టియు, హత = కొట్టఁబడినదిగనుక, వలత్ = చుట్టుకొనుచున్న, కద్రూజము అనక్= సర్పమో యనఁగా, చుట్టుతోక్ = పెనఁచికొనుటతోఁ, విప్పుతోక్ = విడఁదీయుటతోఁను, దరిక్ = నదీకూలమందు, తొండము=శుండాదండము, ఆడక్ = చలించుచుండఁగా, తెల్లు=శరములు, పెల్లలు = మంటిగడ్డలును, నీటక్=ఉదకమునందు, త్రెళ్లి= పడి, ఫేనము=నురువును, వండును = ప్రవాహములోవచ్చియున్న బురదయును, అయి= అయినదై, పు...ము - పునః = మరలను, ప్రావృడాశయమక్ = వర్షాకాలమనుబుద్ధిని, ఒసఁగక్ = పుట్టింపఁగా, (అనఁగాఁ దెల్లనితెల్లు నురుఁగుగా మంటిపెల్లలు

వండునుగా నున్నందున వర్షాకాల మను బుద్ధిని బుట్టించె ననుట.) ఘనరజోవృష్టికై = ఘన=అధికమైన, రజః=పరాగముయొక్క, వృష్టికై=వర్షమువలన (చల్లుటవలన ననుట.), మీఁదికన్ను = పైనేత్రము, మొగుడన్ = మూయఁబడఁగా, కటిదెసలు = మొల ప్రక్కలు (పిఱుఁదు ప్రక్క లనియుం జెప్పఁదగును), నిక్కన్ = పైకెగయఁగా, బరితోలు = పార్శ్వమందున్న చర్మము, కదలన్ = చలింపఁగా, కీలు = స్రవించుచున్న, మదము=దానోదకము, తిక్తతన్ = సౌగంధ్యమును, నదులకున్ = సరిత్తులకు, ఈన్= ఒసఁగఁగా, ('కటుతిక్తకషాయాస్తు సౌరభ్యేఽపిప్రకీర్తితాః' యని యాదవము.) తత్= ఆ తమ్మును, అనుకృత్=అనుకరించుచున్న (పోల్చిన యనుట.), వృషాలితోన్=వృషభ సమూహముతోఁగూడను, ('సుకృతేవృషభేవృషః' యని యమరము.) తేంట్లు=తుమ్మెదలు, వఱవన్=తమవ్యాపారమునకు వెఱచి పాఱిపోఁగా, కరులు = ఏనుఁగులు, కోరాడెను = తొండముతో నేలఁబొడిచి దుమ్మెత్తి పైఁ జల్లులాడెను. ఉత్ప్రేక్షాలంకారము. గీతిలో స్వభావోక్తి.

తా. ఆశరత్కాలమునం దేనుఁగులు మదించి తొండములతో నేల బొడిచి దుమ్మెత్తి పైఁజల్లులాడుచు విహరించెను.

శా. గండద్వంద్వగళత్కరాళమదరేఖల్ ఫుల్లసప్తచ్ఛదా
ఖండక్షోదసిత ల్ప్రకీర్ణకములై కర్ణద్వయి న్మించఁగాఁ
గొండల్ద్రవ్విన మన్ను కత్తులగతిం గొమ్ముం గొన ల్మ్రుంప వే
దండంబుల్చవుదంతు లాటఁ దెలిపెం దండెత్త భూపాలికిన్. 154

టీ. గం...ల్ - గండద్వంద్వ = కపోలద్వయమువలన, గళత్=జాఱుచున్న, కరాళ=దట్టమైన, ('కరాళో దంతురే తుఙ్గే' యని రత్నమాల) మదరేఖల్=దానప్రవాహపుచాళ్లు, ఫుల్ల...తల్ - ఫుల్ల=విచ్చినటువంటి, సప్తచ్ఛద = ఏడాకులయరంట్లయొక్క, అఖండ = అధికమైన, క్షోద = పుప్పొడిచేత, సితల్ = తెల్లనైనవై, ప్రకీర్ణకము లై = చామరము లై, ('చామరంతుప్రకీర్ణక' మ్మని యమరము.) కర్ణద్వయిన్= శ్రోత్రయుగమును, మించఁగాన్ = అతిక్రమించికొమ్ములపర్యంతమురాఁగా, కొండల్ త్రవ్వినమన్ను = పర్వతములు కోరాడినమట్టి, కత్తులగతిన్ = ఒరలతోనున్నఖడ్గముల రీతిని, కొమ్ముంగొనల్ = దంతాగ్రములను, ముంపన్ = కప్పఁగా, వేదండంబుల్ = మత్తేభములు, భూపాలికిన్ = రాజమండలమునకు, దండెత్తన్ = యుద్ధయాత్ర కొఱకు, చవుదంతు లాటన్ = చతుర్దంతదంతావళములాటను (అనఁగా నైరావతము లాట) తెలిపెన్ = చూపెను. చామరసదృశములైనమదరేఖలు కొమ్ములమాడ్కి నుండెను. ఉత్ప్రేక్ష.

తే. అప్పు డన్యోన్యవిజిగీషు లైనదొరల
కవదొనలనుండి లబ్ధలక్ష్యతఁ బడసిన
స్వకులశరపాళిచేఁ గీర్తి చాలఁ గనెనొ
యన వనాళిఁ బ్రఫుల్లశరాళి మెఱసె. 155

టీ. అప్పుడు = ఆశరత్సమయమునందు, అన్యోన్యవిజిగీషు లైన = ఒండొరుల జయింపనిచ్ఛగల్గినటువంటి, దొరల = నృపులయొక్క, కవ = రెం డైన, దొనలనుండి= తూణీరములందుండి, లబ్ధలక్ష్యతన్ = పొందఁబడినగుఱిగలవి యైన, ('లక్షం లక్ష్యం శరవ్య'మ్మని యమరము) స్వకులశరపాళిచేన్ - స్వ = తమయొక్క, కుల = వంశము గల, (తాము శరశబ్దవాచ్యులు గనుక ననుట.) శరపాళిచేన్ = బాణసమూహముచేత, కీర్తి చాలన్ గనెనొ అనన్ = అధికమైనయశస్సును బొందెనో యనఁగా, వనాళిన్ = అరణ్యపంక్తియందు, ప్ర...ళిన్ - ప్రఫుల్ల = వికసించిన, శరాళి = కాశకుసుమపంక్తి, మెఱసెన్ = వెలిఁగెను. శ్లేషానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

తా. కీర్తి తెలు పగుట కవిసమయము గాన తెల్లపువ్వులుం దెల్లగుటంజేసి యపు డవి విస్తరించి యున్నందున విస్తారమైనకీర్తిని బాణములు పొందెనో యన్నట్లుండెను.

తే. దరులతడివండుపొదువుమూఁపురము లంటు
తెల్లగంటల నాఁబోతు లుల్లసిల్లె
గిరుల మోరులసవి సముద్గీర్ణసలిల
జలధరచ్ఛేదములు వ్రాలఁ జెలఁగుకరణి. 156

టీ. ద...లు - దరుల = నదీకూలములందలి, తడివండు=కర్దమము పొదువు = వ్యాపించిన, మూఁపురములు = కకుత్ప్రదేశములను, అం...లన్-అంటు=తగిలికొనునట్టి, తెల్లగంటలన్ = పూచినతెల్లగంటలచేత, ఆఁబోతులు = అచ్చుపేయఁబడిన కోడెలు, ఉల్లసిల్లెన్=మిగుల నొప్పెను, గి...విన్-గిరుల=కొండలయొక్క, మోరులసవిన్=శిఖరములను బుద్ధిచేత, స...లు-సముద్గీర్ణ=కురియఁబడిన, సలిల = ఉదకములుగల, జలధరచ్ఛేదములు=మబ్బుతునియలు, వ్రాలన్ చెలఁగుకరణిన్=చేరఁజూచెడుచందమునను, ఉల్లసిల్లె నని క్రింది కన్వయము.

తా. పర్వతశిఖరము లనుభ్రమచేత వర్షించినమబ్బుతునుకలు చేరఁ బోవుచుండెనా యనునట్లు నదీకూలము లందలి తడిమన్నున మెదలినమూఁపురములను పూచినతెల్లగంట లంటుకొనిన యాఁబోతు లపుడు మిక్కిలి చెలువొందెను. ఉత్ప్రేక్ష.

తే. గగనలక్ష్మి నిజోరు నక్షత్రమాలి
కలు వియన్నది జలములఁ గడుగఁ బిసుక

నెఱయు కుంకుడుపండులనురువు లనఁగఁ
బలపలని పాండురాంబుదపఙ్క్తు లమరె. 157

టీ. గగనలక్ష్మి = ఆకాశలక్ష్మి, ని...లు-నిజ = స్వీయమైన, ఉరు = గొప్పలైన, నక్షత్రమాలికలు = చుక్కలపఙ్క్తులనియెడు నిరువదియేడు ముత్యములుగల హారములు ('సైవ నక్షత్రమాలాస్యాత్సప్తవింశతి మౌక్తికా' యని యమరము.) వి...లఁ - వియన్నది = ఆకాశగంగయందలి, జలములఁ = ఉదకములయందు, కడుగఁ = ముఱికి నెత్తుటకొఱకు, పిసుకఁ = నలఁపఁగా, నె...వులు అనఁగఁ - నెఱయు = వ్యాపించినట్టి, కుంకుడుపండుల = కుంకుడుపండ్లయొక్క, నురువులు అనఁగఁ = ఫేనములో యనునట్లు, పలపలని = పలుచనైన, పాండుర = తెల్లనైనట్టి, అంబుదపఙ్క్తులు = మబ్బుల చాళ్లు, అమరెఁ = ఒప్పెను. శ్లేషానుప్రాణితమైన యుత్ప్రేక్షాలంకారము.

తా. ఆకాశమనులక్ష్మీదేవి చుక్కలవరుసలనియెడు తనగొప్పహారములు ఆకాశ గంగాజలములఁ గడిగిస్వచ్ఛము లొనర్చుటకొఱ కందుఁ బిసికి వ్యాపింపఁజేసిన కుంకుడు కాయనురుఁగులో యన్నట్లు పలుచనై తెల్లగ నున్న మేఘపఙ్క్తు లొప్పారెను.

శా. అప్పు ల్వారిధిచేతఁ బుచ్చుకొని కార్యంబైన ము న్గొన్నయ
య్యప్పు ల్దొ చనియుఁ సవృద్ధికముగా నవ్వార్ధికే తీర్పఁగా
నప్పుణ్యాతివిశుద్ధజీవుఁడు నిజాచ్ఛాంగంబులం దోఁచు న
ట్లొప్పారె న్శశిబింబగర్భితములై ద్యోచారిశుభ్రాభ్రముల్. 158

టీ. అప్పుల్ = ఉదకములు, ఋణములును, వారిధిచేతఁ = సముద్రునిచేత, పుచ్చుకొని = కైకొని, కార్యంబైనన్ = పనితీఱఁగా, ము...న్-మున్గొన్న = ముందు పుచ్చుకొనినట్టి, అయ్యప్పుల్ = ఆ యుదకములను, ఆ ఋణములను, దొఁచనియుఁ = దూరదేశములువెళ్ళియును, వానకాలము గడచియును, సవృద్ధికముగాన్ = అధికముగా వడ్డితోఁ గూడను, అవ్వార్ధికే = ఆ సముద్రునికే, తీర్పఁగాన్ = సరిపుచ్చఁగా, అ...డు-అప్పుణ్య = ఆఋణముక్తిరూప సుకృతముచేతను, అతివిశుద్ధ = మిగులఁ బరిశుద్ధుఁడైన, జీవుఁడు = ప్రాణి, ని...లన్-నిజ = స్వీయములైన, అచ్ఛ = స్వచ్ఛములైన, అంగంబులన్ = అవయవములందు, తోఁచునట్లు = అగపడునట్లు, శశిబింబగర్భితములై = చంద్రబింబ ముదరమందుఁ గలవియై, ద్యో...ల్-ద్యోచారి = అంతరిక్షమున సంచరించుచున్న, శుభ్రాభ్రముల్ = తెల్లని మబ్బులు, ఒప్పారెన్ = ఒప్పిదమాయెను.

తా. 'శ్లో. బ్రహ్మహా ముచ్యతే పాపైరృణీ తు నకదాచన' యన్నట్లు ఋణ మపరిహార్యమైన పాపము గనుక, నట్టిపాపముచేత విముక్తుఁడైనమనుజునిమాడ్కిఁ జంద్రగర్భితములైనమేఘములు వెలింగెను. శ్లేషానుప్రాణితమైన యుత్ప్రేక్ష.

చ. విశదపయోదపుంబొరలఁ వేష్టనచే నొకమై నభోమణిన్
లశునపటత్వమొందుట మనంబున నారసి కాంచి విష్ణుఁ డ
య్యశివతకై పదంబు వలయంబునఁ బాపి యవస్తులోభక
ర్కశతఁ బ్రబోధ మొంది సిరిఁ గాంచి చెలంగెఁ బయఃపయోనిధిన్.

టీ. వి...చేన్-విశద = తెల్లనైన, పయోదపు = మేఘములవైన, పొరల = ఆవరణములయొక్క, వేష్టనచేన్ = వ్యాప్తిచేత, ఒకమైన్=ఒక ప్రదేశమునందు, నభోమణిన్=(సూర్యుని) ఆకాశమందలి మణిని, లశునపటత్వమొందుటన్=లశునపట మను దోషము పొందుటను, లశునపటలము - రత్నదోషము - "సీ. పాలుపైఁ బూసిన లీల నుండెడుడాలు లశునపటల మది లక్ష్మిఁ జెఱచు." రత్నపరీక్ష-౧౫.) మనంబునన్ = చిత్తమందు, ఆరసి = విచారించి, కాంచి=చూచి, విష్ణుఁడు = లక్ష్మీరమణుఁడు, అయ్యశివతకై = ఆదోషనివృత్తికై, (తులమెత్తుగల కెంపునకు మణి యని సంజ్ఞ గాన వానికిఁ గలుగు లశునపట మనుదోషము ద్యుమణి యైన సూర్యునికి శరత్కాల మేఘరూపములోఁ గలుగఁగాఁ జూచి శివంకరము గాదు గనుకఁ దన్నివృత్తికై యనుట.) వలయంబునన్ = పరివేషమువలనను (అందెవలనను,) పదంబు=తన పాదమైన యాకాశమును, పాపి = విడిపించి, (అప్పుడు పరివేష ముండ దనుట.) అవస్తులోభకర్కశతన్ = కూడనివస్తువునందు లోభముచేతఁ గఠినుండు కాకపోవుటవలన, (అనఁగాఁ దోషవస్తువులయం దాసక్తిలేనివాఁ డౌటవలన ననుట.) ప్రబోధమొంది = జాగ్రత్తనొంది, మేలుకొని, పయఃపయోనిధిన్ = పాలసముద్రమునందు, సిరిన్ కాంచి = సంపద నొంది, శ్రీమహాలక్ష్మినిఁ బొంది, చెలంగెన్ = ఒప్పెను.

తా. సూర్యుఁ డను నాకాశమణిని దెల్లనిమేఘములు చుట్టుకొని లశునపట మను దోషము పరివేషమై యావరింపఁగా, విష్ణువు చూచి యది శుభకరముగా దని పరివేషమునుండి విడిపించి దోషవస్తువులం దనాసక్తుఁడు గనుక నాఁడు మేల్కొని లక్ష్మీసహితుఁ డై పాలసముద్రమునఁ బవళించి వెలుఁగొందెను. రూపకాలంకారము.

ఉ. అంబరవాసు లగ్నిక్రియకై ద్యుమణిస్ఫటికోపలంబునం
దుం బడయన్నరజ్జలదతూలపరంపరఁ గొంత పై ఘటిం
పం బెలుచం జనించి మఱి వట్టున నిల్వక [1]యాక్రమించెఁగాఁ
కం బరితాపమూనె ననఁ గాసె మొగుల్వెరియొండ లత్తఱిన్. 160

టీ. అంబరవాసులు=దివిషదులు (దేవతలు), అగ్నిక్రియకై = వహ్నిఁ బుట్టించుటకై, (వర్షర్తువునందు క్షీణమైనదాని ననుట.), ద్యుమణిస్ఫటికోపలంబునందున్ -

1 యాక్రమింప నాకంబది తాపమూనె.

ద్యుమణి=సూర్యుఁ డనియెడు, స్ఫటికఉపలంబునందున్=స్ఫటికశిలయందు, పడయన్= పొందుటకొఱకు, శ...రన్ - శరజ్జలద = శరన్మేఘము లనియెడు, తూలపరంపరన్ = దూదిప్రోగును, కొంత=కొంచెము, పైఘటింపన్=మీఁద నుంచఁగా, పెలుచన్ జనించి = విస్తరించి యగ్నిపుట్టి, మఱి=పిమ్మటను, మట్టునన్=కొద్దిగా, నిల్వక = నిలిచియుండక, కాకన్ = వేడిమిచేత, పరితాపమూనన్ = వ్యాకులత్వమును బొందునట్లు, ఆక్ర మించెన్=వ్యాపించెను. అనన్=అనఁగా, అత్తఱిన్=ఆశరత్కాలమునందు, మొగులిర్విరి యొందలు=మబ్బువిరిసిన యొందలు, కాసెన్=తపించెను. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

క. కంజహితాస్తోదయముల
సంజ కడల నడుమఁ గప్పు ♦ సంధిల మిన్నొ
ప్పెం జూడఁ బ్రకృతిశబరీ
గుంజానాసావిభూష ♦ కొమరు భజింపన్. 161

టీ. కం...జ - కంజహిత = సూర్యునియొక్క, అస్తోదయముల = అస్తమయ ఉదయకాలములయొక్క, సంజ = ఎఱ్ఱసంధ్యారాగము, కడలన్ = దిక్కులయందును, కప్పున్ = నైల్యమును, నడుమన్ = మధ్యప్రదేశమందును, సంధిలన్=వ్యాపింపఁగా, మిన్ను = అంతరిక్షము, ప్ర...రు - ప్రకృతిశబరీ = మూలప్రకృతి యనుచెంచిత యొక్క, గుంజానాసా విభూష = గురిగింజముక్కఱయొక్క, కొమరున్ = సౌందర్య మును, భజింపన్ = పొందునట్లుగా, చూడన్ = వీక్షింపఁగా, ఒప్పెన్=చెన్నొందెను.

తా. సంధ్యాకాలములయందు దానిరక్తిమముఁ దిగంతములవఱకు వ్యాపించి యుండఁగా, నంతరిక్షమునడుమ నల్లనై ప్రకృతి యను కిరాతస్త్రీయొక్క ముక్కఱ యందు నలుపు పైపైపుగా నుంచి యద్దముగాఁ గ్రుచ్చిన గురిగింజవలెఁ జూడనొప్పెను. రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

తే. గూండ్లకై శాలిమంజరు ♦ ల్గొనుచు మూఁగి
యంబరంబునఁ బఱచు కీ ♦ రాళి వాలెఁ
బసరుటొంటొంటియాకుతోఁ బండఁ బాఱి
ఛేదభయమున నెగసిన ♦ చేలనంగ. 162

టీ. గూండ్లకై = కులాయములకై, శాలిమంజరులు = వరియెన్నులు, ('వల్లరీమంజరీస్త్రియా' మ్మని యమరము.) కొనుచున్=గ్రహించికొనుచు, మూఁగి=గుంపులుగూడి, అంబరంబునన్ = ఆకాశమునందు, పఱచు = ఎగసిపోవుచున్న, కీరాళి = శుకపంక్తి, ('కీరశుకౌ సమౌ' అని యమరము.) పసరుటొంటొంటియాకుతోన్ = పసరువర్ణముగల యొక్కొకపర్ణములోడను, పండఁబాఱి=పరిపక్వములై, ఛేదభయమునన్ = తమ్ముఁగోసి

మేయుదు రన్న భయముచేత, ఎగసిన చేలనంగన్ = పైకెగరిన పైరుచేలో యన్నట్లు, పొలిచెన్ = ఒప్పెను. ఉత్ప్రేక్ష. ప్రథమ ద్వితీయ పాదముల స్వభావోక్తి.

సీ. శ్రీలు తా రౌట నా । శ్రితపద్మకర్ణికా
        కృతిఁ జెవు ల్కమలక । ర్ణికల మెఱయ
    నతనుసారథ్యకృ । ద్రతిరేఖ మంచెపై
        నదలించు రొదఁ జిల్క । పదుపు పఱవఁ
    దొగలమొగ్గలవైవ । దూరమేగమిఁ బెట్టు
        చప్పట్లఁ జన్నులు । జడలు గదల
    వెడత్రోవ మును చెప్పి । వడి నవ్వ దిరుగు న
        ధ్వగులఁ గోలఁది నప । త్రపయు మరల
తే. నధరరదనప్రసాదంబు । నడుగ నోరు
    దెఱచెనో యన వ్రీలి ము । త్తెములు తోఁచు
    చెఱకు జంఘలఁ బోలమి । శిరసు వాంచు
    రాజనముఁ గాచు గోపికా । రాజి పొలిచె. 163

చెఱకుతోఁటలను వరిచేలను కావలిగాయు పడఁతులను వర్ణించుచున్నాఁడు.

టీ. తారు = శ్రోత్రములు, శ్రీలు = శ్రీకారములు (శ్రీయనునక్షరమును పోలినవి) లక్ష్ములును, ఔటన్ = అయినందువలన, ఆ...తిన్-ఆశ్రిత = ఆశ్రయించిన, పద్మకర్ణికాకృతిన్ = తామరమిద్దెలవలెను, చెవుల్ = కర్ణములు, కమలకర్ణికలన్ = తామరమిద్దెలలో, మెఱయన్ = వెలుఁగఁగా, అతను = పెనిమిటి యైన మన్మథునకు, సారథ్యకృత్ = రథమునడుపుచున్న, రతిరేఖన్ = మన్మథునిభార్యయయిన రతివలె, (సారథ్యముచేయుచు రతీదేవి చిలుక గుఱ్ఱము నెట్లదలించునో యట్లనుట.) మంచెపైన్ = మంచెమీఁదను, ఆదలించురొదన్ = నివారించుధ్వనిచేత, చి...న్ - చిల్కపదుపు = కీరపంక్తి, పఱవన్ = పరువిడుచుండఁగా, తొ...లన్ - తొగల = కలువలయొక్క, మొగ్గలన్ = కుట్మలములను, వైవన్ = విసరివేయుఁగా, దూరమేగమిన్. = ఆచిలుకలు దవ్వుగా వెళ్ళనందున, పెట్టు చప్పట్లన్ = చేతుల కట్టుటలచేతను, చన్నులు = కుచములును, జడలు = కేశపాశములును, కదలన్ = చలింపఁగా, మును = పూర్వము, వెడత్రోవన్ = దబ్బఱమార్గమును, చెప్పి=పల్కి, నవ్వన్ = హాసముచేయఁగా, వడిన్ = శీఘ్రముగా, తిరుగు = మరలవచ్చుచున్నటువంటి, అధ్వగులకోలఁదిన్ = పథికులతోడనే, అపత్రపయున్ = సిగ్గును, మరలన్ = మళ్ళఁగా, (పథికులకుఁ దప్పుదారిఁ జెప్పి నవ్వఁగా నది గ్రహించి యా పథికులు మళ్ళిరాఁగా లజ్జించి రనుట.) అ...బున్ - అధర =

పెదవియొక్కయు, రదన = దంతములయొక్క, ప్రసాదంబుల్ = అనుగ్రహమును, అడుగన్ = యాచించుటకొఱకు, నోరుదెఱచెనోయనన్=వదనమువిప్పెనోయనఁగా, వ్రీలి = పగిలి, ముత్యములు = మౌక్తికములు, తోఁచు = కనుపడునట్టి, చెఱకుల్ = ఇక్షువనమును, జంఘులఁ బోలమిన్ = తమపిక్కలను సరిపోలనందున, శిరసు వాంచు = తలవంచికొనిన, రాజనముల్ = శాలిసస్యమును, కా...జి - కాచు = రక్షించుచున్న, గోపికారాజి = చేలకాపరిస్త్రీలవరుస, పొలిచెన్ = ఒప్పెను. ఉత్ప్రేక్ష.

తా. చెఱకులు తమయందలి రసమాధుర్యముకంటె నాచెఱకు తోఁటకాచు స్త్రీలయొక్క యధర రసమాధుర్య మధిక మనియుం, దమలోనున్న ముత్యముల చక్కఁదనముకంటె నాస్త్రీలయొక్క పలువరుసల చక్కఁదన మతిశయ మనియుం, నధరరదనములకు నోఁడి పరాజితులయినవారు నోరిగిలించి వేఁడుకొన్నట్లు కనుపులు పగిలి గర్భగతము లయిన ముత్యములు కనఁబట్టుచెఱకును, తమపైరు పొట్ట లాస్త్రీల పిక్కలకు సాటిరానందున సిగ్గుచేఁ దలవాంచికొన్నట్లు పండి వంగియున్న రాజనపుచేలను గాచుచున్న స్త్రీలు శ్రీమహాలక్ష్మికి నాశ్రయస్థానమైన కమలకర్ణికలు బహిర్నిర్గతము లయినందున శ్రీసదృశము లయిన శ్రోత్రములు గనుక నాని, నవి యాదరించినట్లుగఁ జెవులయందుఁ గమలకర్ణికలు ధరించికొని, మన్మథరథరథ్యంబు లయిన చిలుకల నదలించు రతీదేవిమాడ్కిఁ జిలుకలం దోలుచుఁ గలువపువ్వులతోఁ దోలఁగా నవి దూరము పోనందునఁ జప్పట్లుఁ గొట్టుచు నధ్వగులకు పెడత్రోవఁ జెప్పి నవ్వఁగా వారు మట్లుటలోనె సిగ్గుగలవా రయి యొప్పిరి.

తే. నింగి యత్తఱిఁ దామహానీలమైన
గరిమకుం దగబహు తృణగ్రాహి యయ్యె
ననఁగఁ బరిణత కలమాదికయవసరాశి
తతులు గిరు లన నభ్రంకషతఁ జెలంగె. 104

టీ. నింగి = ఆకాశము, అత్తఱిన్ = ఆశరదృతువునందు, తాన్ = తాను, మహానీల మైన=మిగుల నల్లనైనట్టియు, నీలమణి యైనట్టియుఁ, గరిమకున్=ఆధిక్యమునకు, తగన్ = అర్హమగునట్లు, బహుతృణగ్రాహి = చాలకసవును గ్రహించునది, అయ్యె ననఁగన్=అయెనో యన్నట్లు, పరిణత = పండియున్న, కలమాది = వరిమొదలగువాని యొక్క, యవసరాశి = గడ్డివాములయొక్క, తతులు=వరుసలు గిరులనన్=కొండలో యనునట్లు, అభ్రంకషతన్=ఆకాశము నొరసికొనుటచేత, చెలంగెన్ = ప్రకాశించెను. పరిణామోత్ప్రేక్షాలంకారములు.

మ. అయనిష్ఠన్ ధవళాతపత్త్రి దగు నయ్యార్యాగంబు సాగంగ నం
దు యమిశ్రేణులు రాఁగఁ బుంగవకకుత్స్థుం డల్ల వర్షాదినా
త్యయరాముండు సలక్ష్మణుం డినున కోజోవాప్తిగా విల్లు ని
ర్దయతం ద్రుంపఁ బ్రభగ్న శాల్యవని సీతాలబ్ధి గాకుండునే. 165

టీ. అయనిష్ఠన్ = శుభావహవిధినిష్ఠచేతను, ('అయశ్శుభావహో విధిః' యని యమరము.) ధవళాతపత్త్రిదగు = తెల్లదామరగొడుగుల శరదృతువు దైన, ఆర్యాగంబు = ఆరాకయును, ధవళాతపత్త్రిదగు = తెల్లని గొడుగుల జనకుని దైన, అర్యాగంబు = ఆయజ్ఞమును, (ఇచ్చట = దవళశబ్దముచేతఁ బుండరీకము లక్షింపఁబడును. 'పుండరీకాతపత్త్రస్తం వికసత్కాశచామర' మ్మని రఘువంశమున శరదృతువర్ణనమున్నది.) సాగంగన్ = జరఁగగా, అందున్ = ఆ శరత్కాలమందును, ఆ జన్నమునందును, యమిశ్రేణులు = హంసపంక్తులును, యోగిబృందములును, (యమిన్ శబ్దమునకు బుషు లర్థము, ఆబుషులకు హంస లను పేరు గలదు గనుక లక్షితలక్షణచేత హంస లన్న యర్థము.), రాఁగన్ = వచ్చుచుండఁగా, పుంగవకకుత్స్థుండు = ఎద్దయొక్క మూఁపురములయందున్నట్టియుఁ, కకుత్స్థులలోఁ శ్రేష్ఠుఁ డైనట్టియు, పుంగవాదు లుత్తరపదములై శ్రేష్ఠార్థము నిచ్చునవి యైన నిచ్చట శ్లేషనిమిత్తము పూర్వపదమాయెను. ('ప్రాధాన్యే రాజలింగే చ వృషాంగే కకుద స్త్రియా' మ్మని యమరము.) అల్ల = ప్రసిద్ధమైన, వర్షా ...దు-వర్షాదినాత్యయ=శరదృతువనెడు, రాముండు = శ్రీరాముఁడు, సలక్ష్మణుండు= ఆఁడుబెగ్గురులతోఁ గూడినవాఁడును, సుమిత్రానందనునితోఁ గూడినవాఁడును, ('సారసస్యతు లక్ష్మణా' యని యమరము.) (సారసపక్షులు వర్షర్తువునందుఁ బిల్లలువెట్టి శరత్కాలమునందు వ్యాపించునవి యనుట.) ఇనునకున్ = సూర్యునకును, జనకునకును, ఓజః అవాప్తిగాన్ = తేజమును గీర్తియును గలుగునట్లుగా, విల్లు = మణి ధనుస్సును, శివధనుస్సును, నిర్దయతన్ త్రుంపన్ = సంకోచింపక విఱువఁగా, ప్రభగ్నశాల్యవనిన్= కోయఁబడిన రాజనాలు గల భూమియందు, సీతాలబ్ధి కాకుండునే = నాఁగేటిచాలు యొక్క లాభము కలుగకుండునా (పొలమున వరి గోయఁగానే మరల దున్ని రనుట.) ('సీతాలాంగలపద్ధతిః' యని యమరము.) ప్రభగ్న = విఱుచుటచేత, శాలి = ఒప్పుచున్న, (మాగాణి) అవనిన్=భూమియందు, సీతాలబ్ధి కాకుండునే = వైదేహియొక్క ప్రాప్తి కాకపోవునా? (కలుగుననుట.) రూపకానుప్రాణిత శ్లేషాలంకారము. ('నానార్థ సంశ్రయ శ్లేషో వర్ణ్యావర్ణ్యోభయాస్పద' యని శ్లేషలక్షణము.)

క. మొగులు విరియెండ వెండియు
నిగుడ శుకశ్రేణి పసురు కనింగి న్నిండన్

బెగడెఁ బ్రజ హారితవాజుల
గగనమణిస్యందనంబు గదిసెనొ యనుచున్. 166

టీ. మొగులు = మేఘములు, విరియెండ = విరిసినయెండ, (శరత్కాలాతప మనుట.) వెండియున్ = మిక్కిలియును, నిగుడన్ = వ్యాపింపఁగా, శుకశ్రేణి=చిలుకలపదుపుయొక్క, పసరు = పచ్చనిచాయ, నింగిన్ = ఆకాశమందు, నిండన్=పూర్ణమగుచుండఁగా, హ...బు-హారితవాజుల = పచ్చడాలుగల గుఱ్ఱములుగల ('పాలాశో హరితో హరిత్, వాజివాహార్వ గంధర్వా' యనియు నమరము.) గగనమణిస్యందనంబు= సూర్యరథము, కదిసెనొ యనుచున్ = సమీపించివచ్చెనో యని, ప్రజ = జనము, బెగడెన్ = జడిసెను. అతిశయోక్త్యలంకారము.

తే. భువి సరఃకైరవశ్రేణి పోవఁద్రోల
దివిఁ గనద్గ్రహనక్షత్ర దీప్తి దఱుమఁ
గృష్ణపక్షపువాసిలే కిరులు దనదు
నలుపునను గూడె నన నైల్య మొలసె నభము. 167

టీ. భువిన్ = భూమియందు, స...ణి-సరః = కొలఁకులయందున్న, కైరవశ్రేణి= తెల్లనికలువబంతి, ('సితే కుముద కైరవే' యని యమరము.) పోవఁద్రోలన్ = వెళ్లఁదోలఁగా, దివిన్ = అంతరిక్షమందు, కనత్ = ప్రకాశించుచున్న, గ్రహ=అంగారకాదులయొక్కయు, నక్షత్ర=అశ్విన్యాదులయొక్కయు, దీప్తి=కాంతి, దఱుమన్=వెళ్లఁగొట్టఁగా, ఇరులు = అంధకారములు, కృష్ణపక్షపువాసిలేక = బహుళపక్షపురేలబలిమిలేక, తనదునలుపునను = తననైల్యముతోడను, కూడె ననన్ = కలిసెనో యన్నట్లు, నభము = ఆకాశము, నైల్యమొలసెన్ = అతినైల్యమును బొందెను. ఉత్ప్రేక్షాలంకారము.

క. క్రేపుదలఁచి పసి మేయుచుఁ
జేపినపాల్గలయ నెండ చేఁ బాంథజనుల్
దూపింపమి కజుఁ డంపిన
యాపాగా యనఁగ నదుల నంచలు మెఱసెన్. 168

టీ. పసి = పశుసమూహము, మేయుచున్ = పొలముకసవుఁ దినుచును, క్రేపుదలఁచి = లేఁగదూడలను దలంచికొని, చేపినపాల్ = వెలికుబికి స్రవించినక్షీరములు, కలయన్ = నద్యుదకముతోఁ జేరఁగా, ఎండచేన్ = ఆతపముచేతను, పాంథజనులు= అధ్వగులు, దూపింపమికిన్ = పానముసేయునందునకు, (ఎండలోఁ దప్పిగొన్నవారు

పాలుద్రావనుంట ప్రసిద్ధము.) అఱఁ దంపిన=ఆనదులలోని క్షీరనీరములు వేఱుపఱుపు మని బ్రహ్మదేవుఁ డనిపినట్టి, ఆ పాగా అనఁగన్=తన వాహనపంక్తియో యనునట్లు, అంచలు= హంసలు, మెఱసెన్ = వెలిఁగెను. ఉత్ప్రేక్షాలంకారము.

తే. వెదమొదవుఁ గూడఁబోలేమి § వెచ్చఁ గ్రొవ్వు
[1]స్వల్ప మెడసూప వెడలెనో § యనఁగ నెట్ట
కేలకును గ్రుంగి తెచ్చుఱం § కెలు నిగుడఁగ
మందగతి గున్కె వృషభము § ల్మందపిఱుఁద. 169

టీ. వెదమొదవున్ = ఋతుమైనధేనువును, కూడన్ = కలియుటకు, పోలేమిన్ = నడువలేనందున, వెచ్చన్=తాపముచేత, క్రొవ్వు=కంఠమువఱకున్నమదము, స్వల్పము= కొంచెము, ఎడసూపన్ = సందువిప్పఁగా, వెడలెనో అనఁగన్ = బయలు దేఱెనో యనునట్లు, ఎట్టకేలకున్ = కొంతతడవునకు, గ్రుంగి = భూమికివంగి, తెచ్చుఱంకెలు= రప్పించెడు వృషభధ్వనులు, నిగుడఁగన్ = సాగఁగా, వృషభముల్ = ఆఁబోతులు, మందపిఱుఁదన్ = పసులగుంపువెనుక, మందగతిన్ = మెల్లనినడకలో, గున్కెన్ = కొంచెముగా పరువుపెట్టెను. 'వెద...అనఁగన్'-హేతూత్ప్రేక్ష; 'ఎట్టకేల...పిఱుఁద' స్వభావోక్తి.

తే. శరధిజలమెల్ల రిత్తగాఁ § గురియ నుప్పు
డొక్కఁ జేరిన నత్తెల్పె § చిక్కి మీఁదఁ
గాన నగుచున్న దచ్ఛత § చే ననంగఁ
బఱచు శరదభ్రములమేని § పాండి మమరె. 170

టీ. శరధిజలము ఎల్లన్=సముద్రోదకమంతయు, రిత్తగాన్ కురియన్=శూన్యమగునట్లువర్షింపఁగా, ఉప్పు = జలమందుండు లవణాంశము, డొక్కన్ పేరినన్=కడుపులో ఘనీభవింపఁగా, అత్తెల్పె చిక్కి = ఆలవణముయొక్క ధావళ్యముమాత్రము మిగిలి, అచ్ఛతచేన్=నైర్మల్యముచేత, మీఁదన్ = మేఘముపై, కానవగుచున్నది=చూడఁబడుచున్నది, అనంగన్=అనునట్లు, పఱచు = పరువిడుచున్న, శ...మ-శరదభ్రముల=శరత్కాలమేఘములయొక్క, మేని=దేహముయొక్క, పాండిమ=ధావళ్యము, అమరెన్= ఒప్పెను. హేతూత్ప్రేక్షాలంకారము.

క. శరనిధి మున్ను గ్రోలినని
ర్ఝరజలములు గురిసి మేఘ § భావం బఱె య

---

1. 'కల్పమెడచాప...యనఁగ'-వే. పా. (కల్పన్=కరఁగునట్లు, మెడచాఁచన్ = కంఠమును దీర్ఘీ కరించినందున - అని టీక) ఆపాఠమున యతిభంగము.

క్కరములు కరములై కా జిగి
నొరిమె ననన్ రవియు మెఱసె । నుడిగెను మొయిలున్. 171

టీ. శరనిధిన్ = సముద్రమునందు, మునుగ్రోలిన = మున్నుపానముచేసిన, నిర్ఝర జలములు = అధికోదకములు, కురిసి = వర్షించి, మేఘభావంబు అఱి = జలధరత్వమును బోఁగొట్టికొని, అక్కరములు = ఆ సూర్యకిరణములు, కరములై కాన్ = సూర్యకిరణములుగాని కాఁగా, రవి = సూర్యుఁడు, జిగిన్ = తేజస్సుచేత, ఒరిమె ననన్ = తీక్ష్ణుఁడాయె నన్నట్లు, మెఱసెన్ = ప్రకాశించెను మొయిలున్ = మేఘమును, ఉడిగెన్ = శాంతించెను. హేతూత్ప్రేక్ష.

క. ప్రాశించిననీ రంతయుఁ, బో శరదభ్రములు మగుడఁ । బూరింపఁగనా
వేశించెఁ గొలంకుల ననఁ, గాశప్రతిబింబపటలి । కడు నొప్పారెన్. 172

టీ. శరదభ్రములు = శరత్కాలమేఘములు, ప్రాశించిననీరంతయున్ = మునుపు తాముగ్రోలినయుదకమంతయు, పోన్ = వెళ్ళఁగా, మగుడన్ పూరింపఁగన్ = మరల నిండించుకొనుటకు, కొలంకులన్ = సరస్సులయందు, ఆవేశించెన్ = ప్రవేశించెను, అనన్ = అనునట్లు, కాశప్రతిబింబపటలి = తెల్లుపువ్వుల ప్రతిమానసమూహము, కడున్ = మిగులను, ఒప్పారెన్ = చెన్నొందెను.

తే. కొలనఁ గరిదంపతులు పద్మ । కలిక లొకటి
కొకటి యీనెత్త మకరంద । మొలుక నమరె
నివి శరత్పద్మనిలయకు । నెలమితోడఁ
గవల నభిషేకమున కెత్తు । కడవ లనఁగ. 173

టీ. కొలనన్ = సరస్సులయందు, (జాత్యేకవచనము), కరిదంపతులు = సతీపతులైనయేనుఁగులు రెండు, పద్మకలికలు = తామరకమ్మిమొగ్గలు, ఒకటికొకటి యీన్ ఎత్తన్ = పరస్పరమిచ్చుటకై పైకెత్తఁగా, మకరందము = పూఁదేనె, ఒలుకన్ = క్రమ్మించుచుండఁగా, ఇవి = ఈ పద్మముకుళములు, శరత్పద్మనిలయకున్ = శరల్లక్ష్మికి, ఎలమితోడన్ = సంతోషముచేతను, కవలన్ = జోడుగా, అభిషేకమునకున్ ఎత్తు = స్నానమొనరించుటకుద్దిష్టమైనట్టి, కడవ లనఁగన్ = కుంభములోయన్నట్లు, అమరెన్ = ఒప్పెను.

తా. తామరకొలంకులయందు క్రీడించుచున్నగజమిథునము జోడుగా, (శ్లో. 'లక్ష్మీర్దివ్యైర్గజేంద్రైర్మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః) అన్న ట్లేనుంగులు శ్రీమహాలక్ష్మికి హస్తంబులయందు సువర్ణకుంభములను ధరించి యభిషేక మొనరించు చందంబునఁ గానవచ్చుచుండెను. ఉత్ప్రేక్ష.

తే. పంక మడుగంటి తేఱిన । బావు లెల్లఁ
బంకములె చేసెఁ గ్రమ్మఱఁ । బంకజములు
గళితమకరందయుతరజః । కర్దమమునఁ
గారణగుణంబు కలుగదే । కార్యమునకు. 174

టీ. పంకము = అడుసు, అడుగంటి = అధఃప్రదేశముఁబట్టి, తేఱినబావులెల్లన్ = స్వచ్ఛోదకములు గల్గినకొలంకు లన్నియును, పంకజము = కమలములు, గ...నన్ - గళిత = జాఱినటువంటి, మకరందయుత = పూఁదేనియతోఁగూడిన, రజఃకర్దమమునన్ = పరాగ పంకముచేతను, క్రమ్మఱన్ = మగుడను, పంకములె = కర్దమయుక్తములైనవి గానే, చేసెన్ = ఒనర్చెను. కారణగుణంబు = కారణముయొక్క గుణము, కార్యమునకున్ = క్రియకును, కలుగదె. (కలుగు ననుట.)

తా. కమలములు పంకజములు గాన నీళ్ళను బంకయుక్తములుగాఁ జేసెను. సామాన్యముచేత విశేషము సమర్థించిన యర్థాంతరన్యాసాలంకారము. శ్లో. 'జ్ఞేయ స్సోఽర్థాంతరన్యాసో వస్తుప్రస్తుత్య కించన, తత్సాధనసమర్థస్య న్యాసో యోఽన్యస్య వస్తునః' అని దానిలక్షణము.

క. ఒసఁగి రగస్త్యార్ఘ్యములం
గొసరి జను ల్వార్ధినీరు । గ్రోలితి వీనిన్
సస్యకై మా కిమ్మని క
న్కసరుడుగం గావ నప్పగించెడుమాడ్కిన్. 175

టీ. జనుల్ = మనుష్యులు, కొసరి = వేడికొనుచు, వార్ధి = సముద్రమందలి, నీరు = ఉదకము, క్రోలితి = పానముచేసితివి. వీనిన్ = మాకుపయోగమైన యీయుదకము, సస్యకై = పైరులకొఱకై, మాకున్ = మాకొఱకు, ఇమ్మని = విడువు మని, కన్కసరుడుగన్ = కోపప్రయుక్తమైన నేత్రదోషము నివర్తించుటకై, కావన్ = ఆయుదకము ద్రావక రక్షించుటకొఱకు, అప్పగించెడుమాడ్కిన్ = ఇదిగో రక్షింపు మని యొప్పగించిరోయని, అగస్త్యార్ఘ్యములన్ - అగస్త్య = అగస్త్యునికి, అర్ఘ్యములన్ = జలాంజలులను, ఒసంగిరి = ఇచ్చిరి. ఫలోత్ప్రేక్ష. శరదృతువునందు నగస్త్యుని కిచ్చునట్టి యర్ఘ్యముల నిట్లుత్ప్రేక్షించెను.

క. పరుషాతపత్త్రం బగు
ధరణీపాత్రమునఁ బడుట । దళ మయ్యెఁ జుమీ
పఃపక్వంబై యనఁగా
శరదిందుజ్యోత్స్న రేలు । సాంద్రతఁ గాసెన్. 176

టీ. ప...న్ - పరుష=కఠినమైన, ఆతప=ఎండచేతను, తప్తంబగు = కాఁగినటువంటి, ధరణి=భూమి యనెడు, పాత్రమున్=ఆధారమందు (పెనముమీఁద ననుట), పడుటన్ = పతనమగుటచేత, దళమయ్యెన్ చుమీ = దట్టమాయెనుజుమా, అనఁగాన్= అనునట్లు, పరిపక్వంబై = పండినదై, శరదిందుజ్యోత్స్న=శరచ్చంద్రచంద్రిక, రేలు= రాత్రులయందు, సాంద్రత్ = దట్టముగా, కాసెన్ = వెలిఁగెను. హేతూత్ప్రేక్ష.

తే. వృష్టితతి నిడ్డజెనఁ ద్రావఁ ౹ గ్రిందనుండి
తేటనదినీటఁ దనవెంటఁ ౹ దేలుమీల
తళుకుతోఁ నాఁచులత దోఁచె ౹ వెలికి [1]జమిలి
వెండిమీ లెక్కువెంద్రుకవిల్లువోలె. 177

టీ. వృష్టితతిన్ = వర్షాకాలమునందు, ఇడ్డ = పెట్టిన, జెనన్=చేఁపలయొక్క గ్రుడ్లసమూహమును, త్రావన్ = పానముసేయుటకొఱకు, క్రిందనుండి = అడుగునఁ బట్టి, తేట = నిర్మలమైన, నదినీటన్ = ఏటియుదకమందు, తనవెంటన్=ఆనాఁచుతీఁగ వెంబడి, తే...లోన్ - తేలు = పైకివచ్చుచున్న, మీల = మత్స్యములయొక్క, తళుకులోన్ = కాంతితోడ, వెలికిన్ = బైటికి, జ...లు - జమిలి=జోడుజోడయిన, వెండిమీలు = రజతముచేఁగఁజేయఁబడిన మత్స్యములు, ఎక్కు = పైకెగయఁగా నొప్పున్న, వెంద్రుకవిల్లువోలెన్ = గుఱ్ఱపుతోఁకవెంద్రుకలచేఁగట్టిన ధనుస్సోయన్నట్లు (. ౨ దాసరివాండ్రు వాయించువాద్య మనియు, దీని పేరు కామాచి యనియుఁ జెప్పుదురు.) నాఁచులత తోఁచెన్ = ప్రాఁచితీఁగ గన్పించెను. ఉపమ.

తా. వానకాలమందుఁ జేఁపలు నాఁచుతీఁగవెంట గ్రుడ్లు విడిచియుండ వానిం దినుటకు నీళ్లనుండి యానాఁచుతీఁగ వెంబడిని మత్స్యములు పైకి రాఁగా, నదిదాసరివాండ్రు గుఱ్ఱపువెంద్రుకలచేత వింటిబద్దకట్టి వానిమీఁద వెండితగుళ్ళచే మత్స్యముల నేర్పఱచి వాయించునప్పు డవి పైకెగయుటవలెఁ గన్పట్టెను.

క. హంసము క్రౌంచముతొలిరా
మాంసలరుచి వచ్చెఁ దాను ౹ మలయముశిఖఁ బా
ల్హాంస విఱువ నీ ర్వెడిచెను
హంసమున కగస్తి పరమ ౹ హంసం బగుటన్. 178

టీ. హంసము=అంచపిట్ట, క్రౌంచముతొలిరాన్=క్రౌంచపర్వతబిలమునమండి రాఁగా, తాను = ఆయగస్త్యుఁడును, మలయముశిఖన్ = మలయపర్వతాగ్రమునను౦డి,

1. జమిలి? జములు? ప్రయోగాంతరము లేదు. 'జములు నే.త యని వ్యవహారము. ఇంకను విచార్యము.

మాంసలరుచిన్ = అధికకాంతిచేతను, 'బలవాన్మాంసలోంసలః' అని యమరము.) వచ్చెన్ = ఉదయించెను. హంసములకున్=చక్రాంగములకు, అగస్తి = అగస్త్యమహర్షి ('అగస్త్యోఽగస్తిరిత్యపి' యని ద్విరూపకోశము.) పరమహంసంబు అగుటన్=పరమహంస యను ఋషియగుటచేత, హంస=అంచ, పాల్=క్షీరమును, విఱువన్=నీరములో వేఱు పఱుపఁగా, నీర్వెలిచెను = తాను నీళ్ళలోనిబురదను బోఁగొట్టెను.

తా. హంసలు పాలునీళ్ళు వేర్పఱుప, నగస్త్యుఁడు నీరుబురదవేర్పఱచినాఁడున పరమహంస యనునట్లు శరదృతువునందు నుదకములు కలక లుడిగి నిర్మలము లాయెను.

తే. క్రౌంచ మొకకొన్ని గ్రుడ్డులు గాంచె మింట
నవి యహంసచ్ఛదాచ్ఛాద నానుభూతి
హంసతతు లయ్యెఁ గావన్న నరుణచూడ
గుప్తభుజగాశనాండము ల్గుఱులు గావె. 179

టీ. క్రౌంచము=క్రౌంచగుబ్బలియందున్న రంధ్రము ఒకకొన్ని గ్రుడ్డులు=కొన్ని అండములను, మింటన్ = తనపైభాగమందు, గాంచెన్ = వహించెను. (పరశురాముని బాణముచేతఁ దొలువఁబడిన క్రౌంచాచల రంధ్రమునుండి హంసలు మానససరోవరంబునకుఁ జనుటయుఁ, మరలి వచ్చుచుండుటయునుం గల దని సంప్రదాయము.) అవి = ఆక్రౌంచాచలములోని గ్రుడ్డులు, అహంస=వానియందురాకపోకలుగల హంసేతరములైన పక్షులయొక్క, ఛద = ఱెక్కలయొక్క, ఆచ్ఛాదన = కప్పుటయొక్క, అనుభూతిన్=అనుభవముచేత, హంసతతు లయ్యెన్=అంచలగుంపులాయెను, కావన్నన్ = హంస గ్రుడ్లరితరపక్షులుపొదిగిన హంసపిల్లలుగానేరవన్నట్లాయెనా, అ...ల్ - అరుణచూడ = కోళ్ళచేతను, ('కృకవాకుస్తామ్రచూడః కుక్కుటశ్చరణాయుధః' యని యమరము.) గుప్త=పొదుగఁబడిన, భుజగాశన=నెమళ్ళయొక్క, అండముల్=గ్రుడ్డులు, గుఱులుగావె = చిహ్నములుకావా (అవు నవుట) ఇందు సామాన్యముచే విశేషమును సమర్థించిన యర్థాంతరన్యాసాలంకారముచేత నుత్థాపితం బైన యసంబంధమైన సంబంధముఁ గలుగఁజేసిన యతిశయోక్త్యలంకారము.

చ. కలయఁగ వారిదేవతలు గాంచుసరోవరదంభదర్పణం
బులపయి దట్టపుందెలుము వోవఁగఁ దా రలకించు గియ్యఁగా
బలె నలువంకలం గలయఁ బాయక తేలుచుఁ బద్మరేణువు
ల్కెలఁకులఁ బాసిపోఁజెలఁగెఁ గ్రేంకృతు లిచ్చుమరాళమాలికల్.

టీ. వారిదేవతలు = జలాధిదేవతలు, కలయఁగన్=అంతటను, కాంచు = చూచుచున్నటువంటి, సరోవర = కొలంకు లనియెడు, దంభ = వ్యాజముగల, దర్పణంబుల

పయిన్ = అద్దములమీఁదను, దట్టపుఁజిలుము=సాంద్రమైన మాలిన్యము, పోవఁగన్ = పోవునట్లు, తారు = ఆజలాధిదేవతలు, అలకంచున్ = ఆయద్దమైనకంచును, గీయఁగాఁబలెన్=తోమిగీఁకఁబెట్టినందువలననో యన్నట్లు, నలువంకలన్ = నాలుగుదిక్కులయందును, కలయన్ = వ్యాపించునట్లు, పాయక = విచ్ఛిన్నముగాక, తేలుచున్=పోవక మీఁదనే యుండుచు, పద్మరేణువుల్ = నళినపరాగములు, కెలఁకులఁబాసిపోన్=ప్రక్కలకు విడిపోవునట్లు క్రేం...ల్ - క్రేంకృతులిచ్చు = క్రేంకారములుచేసెను, మరాళమాలికల్=అంచలబంతులు, చెలఁగెన్ = ఒప్పెను. కైతవాపహ్నుత్యుత్థాపితోత్ప్రేక్షాలంకారము.

తా. జలదేవతలు తామెల్లెడలఁజూచు సరోవరము లనునద్దములపైఁగల దట్టమగు మాలిన్యము పోవునట్లు తోమి గీఁతపెట్టిరో యన్నట్లు, హంసలసమూహము లవిచ్ఛిన్నములై క్రేంకారము లొనర్చుచుఁ బొలుపారెను. వానిక్రేంకారములచే నళినపరాగములు ప్రక్కలకుఁ బోవుచుండెను.

సీ. అర్కమండలిఁ కభ్ర మడ్డమైనంతనె
యెఱ మాని మోము బి ట్టెత్తి చూచి
ఘుమఘుమధ్వని గాలి గుహఁ జొరఁ బురి యొకిం
చుక విచ్చి కని తలంచుకొని వంచి
నిష్పుష్ప కేతకీ నేత్రాంబు వొత్తి ఖే.
కపుఁ డెంకి పడియచోఁ గర్ణమొగ్గి
కేకరుఁ ద్ర్యవనత గ్రీవమై రాక యొ
క్కిం తార్చి వాత నే మేమొ కమిచి
తే. వెడలు బీఱెండకును శర ద్వృత్తి ముడిగి
వార్షికమె యెక్క త్రోటిని ర్వంకపక్ష
తులను గిఱుపుచు వెఱ్ఱిచూపుల నురంబు
కెలఁకులఁ గనుంగొనుచుఁ గానఁ గేకు లుండె. 161

టీ. అర్కమండలికిన్ = సూర్యమండలమునకు, అభ్రము = మేఘము, అడ్డమైనంతనె=కొంచెమాచ్ఛాదకముకాఁగానే, ఎఱమాని=మేఁతవిడిచి, మోము=ముఖమును, బిట్టెత్తి = పొడవుగా నెత్తి, చూచి = వీక్షించి, (వానకాల మనుభ్రాంతిచేఁ జూచి యనుట.) ఘుమఘుమధ్వని=ఘుమఘుమశబ్దముచేత, గాలి=వాయువు, గుహన్‌చొరన్ = గుహలోఁ బ్రవేశింపఁగా, పురి యొకించుక విచ్చి=పింఛమును గొంచెము విచ్చి, (గాలిచేతఁ గల్గినధ్వనిని మేఘధ్వని యని భ్రమించి యనుట.) కని = చూచి, తలంచుకొని=

అది యుక్తముగా దని విక్కరించి, వంచి = పింఛమును మరల నడంచి. నిష్ఫలమ్ము కేకికి నేత్రాంబువు ఒత్తి=పువ్వులులేని మొగలిచెట్లయొక్క కన్నీరు దుడిచి, భేకపుఁడొంకి = కప్పలకునికిపట్టైన, పడియచోన్ = పల్వలములోనినెఱియకై, కర్ణ మొగ్గి=చెవి వంచి (కప్పకూఁతలు గలిగినవర్షము గల దన్న ప్రతీతిని బట్టి యనుట.) కేకరున్=తనవాక్కు నకు, త్ర్య...ది-త్ర్యవనత = మూఁడుమాఱులు వంచఁబడిన, గ్రీవమై = మెడగలదై. రాక=ఆకేకాధ్వనియును వెడలక, ఒక్కం తార్చి = కొంచెముధ్వనిచేసి, వాతన్=నోటి చేతను, ఏమేమొ కమిచి = ఏమేమోచప్పరించుకొనుచు, వె...కున్-వెదలు = కలిగిన, చీఁపొందకున్=తీక్ష్ణాతపనివృత్తికొఱకు, శరద్వృక్షమున్=ఏడాకు లరఁటిచెట్టును, డిగి = విడిచిపెట్టి, వార్షికమైయెక్కి=గుమ్మము నారోహించి, ('శారదో విషమచ్ఛదః, వార్షికం త్రాయమాణాస్యా' త్తని రెంటికి నమరము) (వర్షాకాలమున నెక్కియున్న వృక్షమున నెక్కినవర్షము కలుగు నని శరద్వృక్షము విడిచి వార్షికవృక్షమున నెక్కె ననుట.) త్రోటిన్=ముక్కుచేతను, ('చంచుస్త్రోటిరుభే స్త్రియా' మ్మని యమరము.) ఇర్వంకపక్షతులను=ఉభయపార్శ్వపక్షమూలములను, ('స్త్రీపక్షతిః పక్షమూల' మ్మని యమరము.) గిఱుపుచున్=వెండ్రుకలు దువ్వికొనుచు, వెట్టిచూపునన్ = వికృతపుదృష్టిచేత, ఉరంబున్= ఱొమ్మును, కెలఁకులన్=ఇరుప్రక్కలను, కనుంగొనుచున్ = చూచికొనుచు, కానన్ = అరణ్యమునందు, కేకులు = నెమిళ్లు, ఉండెన్ = నివసించెను. స్వభావోక్తి.

క. వెలుతు రస లంటి యొండియు
లలి విప్పమిఁ జెడక శిఖక । లాపము వని వ
ర్తిలెఁ బర్జన్యుఁడు నటన
మ్ముల మెచ్చి మెఱుంగుఁగాసె । ముద్రించె ననన్. 1·2

టీ. శిఖకలాపము-శిఖ = నెమిళ్ళయొక్క, కలాపము = పురి, అసలంటి = బురద తగిలి, వెలుతురు=మబ్బువిడినయెండచేతను, ఎండియున్=ఆఱియును, లలి విప్పమిన్ = ఎప్పటికిని విడఁజేయకపోవుటవలన, (సామాన్యముగాఁ దడిసినపురులు విప్పరావు, బురద యంటి యొండి యున్నట్లున్న వనుట.) చెడక = చెడిపోక, వనిన్=అడవియందు, పర్జన్యుఁడు=వర్షదేవత, నటనమ్ములన్=నాట్యమును, మెచ్చి=శ్లాఘించి, మెఱుంగుఁగాసెన్= ప్రకాశించుచున్న చిత్రవస్త్రమును, ముద్రించె ననన్ = ముద్రవేసెనో యన్నట్లు, వర్తిలెన్ = ఉండెను.

తా. వానకాలపుబురదలు తమకలాపములకు నంటి యెండచేత నిగిరినందున శరత్కాలమునందు నెమిళ్లు పించములు విప్పి యాడక యుండఁగా, వర్షదేవత నెమిళ్ల

యొక్క నృత్యములకు మెచ్చి తననటులు మఱియొకచో నాడకుండునట్లు ముద్ర వేసెనో యన్నట్లుండెను. ఉత్ప్రేక్ష.

సీ. చక్రస్తనప్రకాశమునకు ఫేనంపుఁ
గొంగిడి కొనకొనఁ (గొనగొన)గోళ్ల గొణఁగి
యశ్మనితంబంబు హంసహారమును బ
రాగరేఖాస్వర్ణ రశనముగను
జలశాటిపులినంపు జఘనంబుపై జాఱ
వ్యస్తవేతసభుజ స్వస్తిక మిడి
తనిమతో వెచ్చనై తటశరప్రతిబింబ
హాసాలి బాష్ప లుచ్ఛ్వాసములును

తే. నగుచు నిలిచి చెందొవకంట నలిగి తమ్ము
లంటు కైయొత్తు పదనతి నలరి కువల
మధులహరి నబ్ధిఁ జెంది పై మగతనముల
నొక్కెడలఁ గూడుచు స్రవంతు లుబ్బఁ బెనఁచె. 183

టీ. స్రవంతులు=నదులు, ('స్రవంతీ నిమ్నగాపగా' యని యమరము.) ఉచ్ఛ్వాసములును=పరీవాహము లనెడు నిట్టూర్పులుకలవి, ('జలోచ్ఛ్వాసాః పరీవాహాః' యని యమరము.) అగుచున్=అయినవై, చెం...టన్-చెందొవ=ఎఱ్ఱగలువయనియెడు, కంటన్ = నేత్రముచేత, అలిగి=కోపగించి, (శరత్కాలమందుఁ బ్రవాహములు తక్కువైనందునఁ బెనిమిటియైన సముద్రునితోఁ దమకుసంపర్కము లేమింజేసి ప్రణయకోపమునొంది యనుట) తమ్ములంటు=పద్మములనంటుచున్న, కైయొత్తు=సముద్రపుఁగాలువల పొంగుట యనెడు (కై=హస్తముచేతను, ఒత్తు=పట్టుటగల,) పద = పాదములయందు, నతిన్ = నమస్కారముచేతను, అలరి = సంతసించి, చ...కున్-చక్రస్తన = కోకము లనియెడు కుచములయొక్క, ప్రకాశమునకున్=కనుపించుటకొఱకై, ఫేనంపు = నురుఁగనియెడు, కొంగు=పైఁటచెఱఁగు, ఇడి=విడిచి, (భర్తకుఁ గుచంబులు గన్పించుటకై పైఁటచెఱఁగుఁ దొలఁగించె ననుట,) కొనకొనఁ గోళ్ళన్ = జలకుక్కుటములను వ్యాజముచేత (బొల్లికోళ్ళనుట.) గొణఁగి = జల్పితముఁజేసి (అనఁగా మణితము లనుట) అశ్మనితంబంబున్= పాషాణములను కటిపశ్చాద్భాగమును, ('పశ్చాన్నితంబః స్త్రీకట్యా' మ్మని యమరము.) హంసహారమును = మరాళము లను ముత్యాలసరము, ప...ను - పరాగరేఖా = పద్మరేణువులబంతియే, స్వర్ణరశనముగను=బంగారు మొలనూలుగాను, జలశాటి - జల = ఉదకము లనియెడు, శాటి = వస్త్రము, పులినంపు = ఇసుకదిన్నెయనియెడు, జఘనంబు

పైన్ = కటిపూర్వభాగముమీఁదనుండి, జాఱన్ = గళితముకాఁగా, ('క్లీబే తు జఘనం పురః' యని యమరము.) వ్య...ము ఇడి - వ్యస్త = వేఱైనట్టి, వేతస = ప్రబ్బలి చెట్లనియెడు, భుజ=బాహువులయొక్క, స్వస్తికమిడి=స్వస్తికబంధమునుంచి, (భుజస్వస్తికమనఁగా భర్తనాలింగనమొనర్చుటకై చేయునట్టి భుజబంధవిశేషము.) తనిమలోన్ = సూక్ష్మరూపములోఁద, వెచ్చనై=వేఁడియై, త...లు-తట = తీరమందున్న, శర=తెల్లుపువ్వులయొక్క, ప్రతిబింబ=ప్రతిఫలనము లనియెడు, హాస = నవ్వును, అళి = తుమ్మెదలనియెడు, బాష్పలు=సకజ్జలానందబాష్పములు గలవియై, కువలమధులహరిన్-కువల= కలువలయొక్క, ('కువాలం కువలం కుల'మ్మని నానార్థరూపకోశము.) మధు=మకరందముయొక్క, లహరిన్ = ప్రవాహముచేతను, అబ్ధిన్ = సంద్రమును, చెంది = పొంది, పైమగతనములన్ = పురుషాయితములచేత, ఒక్కెడలన్ = ఒక్కొకప్పుడు, కూడుచున్=కలయుచును, ఉబ్బున్ పెనఁచెన్ = సముద్రుని నుప్పొంగించెను.

తా. సముద్రముయొక్క సమీపమునకుఁ గలువమకరందప్రవాహములోవచ్చి, శరత్కాలమందుఁ బ్రవాహములు లేమిం జేసి కూటమి లేకుండుటవలనఁ బ్రణయకోపప్రయుక్తం బైన నేత్రరక్తిమలు గల్గిన తెల్లకలువలచే నొప్పుచు, నురుపు కాలువల పోటనియెడు హస్తములతో నొత్తుటచేత నమ్రత్వమునకు సంతసించి యొకానొకప్పుడు గూడుచుఁ, బురుషాయితరతులచేత నదులు సముద్రుని సంతోషము బొందించెను. (ఈపద్యమునకుఁ బెక్కండ్రు పెక్కువిధములుగ నర్థవర్ణనంబులు చేయుదురు. అవి యన్నియు మిగులరసయుక్తంబులుగా నుండనందున గ్రంథవిస్తరభీతిచేతనిం దుపేక్షింపంబడియె. (పురుషాయితలక్షణము. 'నటదుత్తుంగపయోధరంబు గతమందాక్షక్రియోదారమ, స్ఫుటనాగంకురమక్షికోణనివసద్భ్రూషేఁషదర్పంబునం, ఘటితాలింగనవామనీకృతకుచాగ్రప్రాధరోమాంచమై, విటుఁ జొక్కించెఁ బ్రఫుల్లపద్మనయనావీరాయితం బెంతయున్.' అని నరసభూపాలీయమున నున్నది.) రూపకాలంకారము.

యామునప్రభు దిగ్విజయము

వ. ఇట్లు శరత్సమయం బెసంగిన నంగీకృతక్షత్త్రధర్ముండు గావున దిగ్విజయయాత్ర ధర్మం బని యానీతబలషట్కంబు నాకృష్టసామంతరాట్కంబుగా వెడలి. 184

టీ. ఇట్లు = ఈయుక్తక్రమంబున, శరత్సమయంబు = శరదృతువు, ఎసంగినన్= ఒప్పఁగా, (యామునాచార్యుండును), అంగీకృత = అంగీకరింపఁబడిన, క్షత్త్రధర్ముండు గావునన్=క్షాత్త్రములు గలవాఁడౌటచేత, దిగ్విజయయాత్ర-దిక్ = తూర్పుమొదలగు

దిశలయొక్క, విజయ=గెలుపునిమిత్తమై, యాత్ర = తర్లిపోవుట, ధర్మ్యం బని=న్యాయమని, ఆనీత = పిలువంబడిన, బలషట్కంబు = షడ్విధం బైన సైన్యము గలుగునట్లును, (మౌల్యభృత్యాదిరూపముగ బలము షడ్విధము. శ్లో. షడ్విధం బలమాదాయప్రతస్థే దిగ్జిగీషయా' యని కాళిదాసుని ప్రయోగము.) ఆకృష్ట=ఆకర్షింపఁబడిన, సమస్త=ఎల్లవారైన, సామంతరాట్కంబుగాన్ = తనదేశమునకుఁ జుట్టుప్రక్కల నుండు రాజులు గల్గునట్లును, వెడలి = యుద్ధయాత్రకు బయలువెడలి.

మహాస్రగ్ధర. గజఘోటస్యందనాళీకబళితధరణింగాద్రవేయాధిరాణ్మూ
ర్ధజరత్నశ్రేణు లంతర్ణములసవతులై ప్రగ్గఁ బాదాంతకుంత
ధ్వజవాతాఘాతఘూర్ణద్వనధురవళుల్వాద్యముల్ మీఱఁగా, ద
ద్ద్విజరాజన్యుండు విద్విడ్విదళన మలిఁ గావించె దిగ్జైత్రయాత్రన్.

టీ. గ...ణిన్-గజ=ఏనుఁగులయొక్కయు, ఘోట = గుఱ్ఱములయొక్కయు, స్యందన = అరదములయొక్కయు, ఆళీ = సమూహముచేత, కబళిత = మ్రింగఁబడిన, ధరణిన్=భూమియందు, కా...లు-కాద్రవేయ=పాములకు, అధిరాట్ = దొరయగు నశేషునియొక్క, మూర్ధజ=తలయందుఁబుట్టిన, రత్నశ్రేణులు = రత్నాలపఙ్క్తులు, అంతర్ణఋలసవతు లై=భూమి రత్నగర్భ గనుకఁ దా మాభూమిలో నున్నరత్నములతో సమానములై యనుట. ప్రగ్గన్ = అవిసిపోఁగా, పా...ల్ - పాదాత=పదాతిసేనా సంబంధియైన, కుంత = ఈటెలయందున్నటువంటి, ధ్వజ = టెక్కెపుబట్టలయొక్క, వాత = గాలియొక్క, ఆఘాత = తాఁకుడుచేతను, ఘూర్ణత్ = పొంగుచున్నటువంటి, వనధుల=సముద్రములయొక్క, రవళుల్ = ధ్వనులు, వాద్యముల్ = మద్దెల, డోలు, వీణె, సన్నాయి మొదలగువానిని, మీఱఁగాన్=అతిశయింపఁగా, తద్ద్విజరాజన్యుండు= విప్రుఁడైన యారాజు, (యామునాచార్యుఁ డనుట.) దిగ్జైత్రయాత్రన్ = దిగ్విజయయాత్రయందు, అనిన్=యుద్ధమందు, విద్విడ్విదళనమున్-విద్విట్ = పగతురయొక్క, విదళనమున్=సంహారమును, కావించెన్=ఒనర్చెను. అసంబంధమున సంబంధాతిశయోక్తి.

క. జన్నములు చేసి దానము
లన్నానాదేశవిప్రులం దనిపి సుసం
పన్నత ననిశము బహుభో
గోన్నతుఁడై యాదమఱచి యుండె నశంకన్. 156

టీ. జన్నములు = యజ్ఞములు, చేసి = కావించి, దానములన్ = ఉదకధారాపూర్వకంబుగ నిచ్చినయీవులచేతను, నానాదేశవిప్రులన్=బహుదేశములనుండివచ్చిన

బ్రాహ్మణులను, తనిపి = తృప్తినొందించి, సుసంపన్నతన్ = సకలసమృద్ధిగలవాఁడౌట
చేత, అనిశమున్=ఎల్లప్పుడును, బహుభోగోన్నతుఁడై=ఎక్కుడైనసుఖములచే నతిశ
యించినవాఁడై, అశంకన్ = వెఱపులేనట్లు, ఆదమఱచి = విచారములేక, ఉండెన్=
వసించెను. రాజ్యమోహముచేత జ్ఞానభక్తివైరాగ్యములు మఱచి యుండె ననుట.

వ. (1) మఱియు నతనిరాజ్యంబునఁ గసవుఁ గఱచి చేయెత్తి మొఱఁ
బెట్టుట కరులయందఁ, (2) యట్లునట్లువడ మెడఁ బట్టి త్రోయుట వెడ
వెడం బోవుపల్లవులం బండువతలంటులకు నింటికిం దెచ్చుపణ్యాంగ
నాభాషితల పరిహాసచేష్టలయంద, (3)సున్నము మెత్తుటయుంబట్టుకారు
లంబట్టుటయు సౌధసౌవర్ణభూషాది నిర్మాణంబులయంద, (4) కాసె
చుట్టుటయుఁ గత్తి గట్టుటయుఁ గృకవాకులకలహంబులయంద, (5)
యతుల్యతులనాదిఘర్షణాదిదోషంబులు జాంబూనదపరీక్షాదుల
యంద, (6) యే దేనియుం గన్నువేయుట మృదంగాదివాదిత్రంబుల
యంద, (7) ధాతువాదంబులు తఱచగుట శాబ్దికులయంద; కాక,
యితరస్థలంబుల లేకుండ రాజ్యపరిపాలనంబు సేయుచుండె. 187

టీ. (1) మఱియున్=వెండియు, అతనిరాజ్యంబునన్=అయ్యామునాచార్యుని
దేశమందు, కసవుఁగఱచి=తృణముఁగఱచి, చేయెత్తిమొఱఁబెట్టుట = హస్తమునుపైకెత్తి
మొఱలిడుట, కరులయంద = ఏనుగులయందె, (చెయ్యనఁగాఁ గరము. అది కలది కరి
యని వ్యవహారము.).(పరిసంఖ్యాలంకారము) (2)అట్లునట్లువడన్=ఆయాలాగునఁ బతన
మగునట్లు, మెడఁబట్టిత్రోయుట = గళముఁబట్టి యావలికిం ద్రొబ్బుట, వెడవెడంబోవు=
మెల్లమెల్లనె నడచుచున్నట్టి, పల్లవులన్=విటులను, ('షిద్గః పల్లవికో విటః' యని యమ
రము.) పండువతలంటులకున్ = సంవత్సరాదిపండువు మొదలగు సంతోష దినములయం
దభ్యంగము సేయుట కొఱకు, ఇంటికిన్ తెచ్చు = గృహమునకు రావించుచున్న,
పణ్యాంగనాభాషితల = వేశ్యాసహోదరులయొక్క, పరిహాసచేష్టలయంద = ఎగతాళి
వ్యాపారములయందె, (3) సున్నము మెత్తుటయున్ = సుధాలేపమును, పట్టుకారులం
బట్టుటయు = కంసాలవానికొఱముట్లలో నొక విధమైనవాని చేతంబట్టుటయు, సౌధ
సౌవర్ణభూషాదినిర్మాణంబులయంద - సౌధ = మేడలయొక్కయు, సౌవర్ణ=సువర్ణ
మయము లైన, భూషాది = ఆభరణాదులయొక్కయు, నిర్మాణంబులయంద = చేయుట
యందె, (సున్నముఁబూయుట మేడలకును, బట్టుకారులంబట్టుట స్వర్ణభూషాదులకు
ననుట,) (4) కాసెచుట్టుటయున్=లాఁగుమీఁద గోకకట్టుటయు, కత్తిగట్టుటయున్=
ఖడ్గబంధనమును, కృకవాకులకలహంబులయంద = కుక్కుట యుద్ధంబులయందె, (కోడి

పందెములయందె) (5) అ...లు - అతుల్య = సరిగానివస్తువులో, తులనా=తూఁచుట, (పోల్చుట యని యొకయర్థము) ఆది = లోనగు, ఘర్షణాదిదోషంబులు = ఒరయుట మొదలైనవి, జాంబూనదపరీక్షాదులందు = స్వర్ణశోధనాదులయందె, ('రుక్మం కార్తస్వరం జాంబూనదమష్టాపదోఽస్త్రియా' మ్మని యమరము.) (6) ఏదేనియుఁగ్=ఏవస్తువునైనను, కన్నువేయుట = అభిలాషపడుట, మృదంగాది వాదిత్రంబులయందు = మద్దెల మొదలగు వాద్యములయందె, (మద్దెలకు వేయునట్టికన్ను కరణి యని చెప్పఁబడును.) ('చతుర్విధమిదం వాద్యం వాదిత్రాతోద్యనామక' మ్మని యమరము.) (7) ధాతువాదంబులు తఱచగుట = మోసములు మెండగుటయు, భూవాదిధాతువులవిషయమైనవాదములు విస్తరిల్లుటయును శాబ్దికులయందు కాక = వైయాకరణులయందె కాని, (ఈ కాక యనుపద మన్ని సావధారణసప్తమ్యంతములతో నన్వయింపవలసినది.) ఇతరస్థలంబులఁగ్ = వేఱుచోట్లను, లేకుండఁగ్=లేక యుండునట్లు, రాజ్యపరిపాలనంబు = ప్రజాపాలనము, చేయుచుండెఁగ్ = ఒనరించుచుండెను.

తే. తత్పితామహుఁ డైననా ◊ థముని శిష్యుఁ
డైనశ్రీపుండరీకాక్షు ◊ ననుఁగుశిష్యుఁ
డైన శ్రీరామమిశ్రాఖ్యుఁ ◊ డార్తిఁ దనకు
పరమగురుపౌత్రునకు నిట్టి ◊ బంధ మెట్లు ? 188

టీ. తత్పితామహుఁడు=అయ్యామునాచార్యుని తండ్రికిఁదండ్రి, అయిన=అయినటువంటి, నా...డు - నాథముని=శ్రీమన్నాథమునికి, శిష్యుఁడు = అంతేవాసి, ఐన=అయినట్టి, శ్రీ...డు - శ్రీపుండరీకాక్షు=యోగియగు నప్పుండరీకాక్షునకు, (ఈయన పేరు ద్రవిడభాషయందు ఉయ్యకొండా రని యందురు.) అనుఁగుశిష్యుఁడు=ప్రియచ్ఛాత్రుఁడు. ('ఛాత్రాంతేవాసినౌ శిష్యాః' యని యమరము.) ఐన = అయినటువంటి, శ్రీరామమిశ్రాఖ్యుఁడు = శ్రీరామమిశ్రుం డను నామముగలయోగి, (ద్రవిడభాషలో నీయనపేరు మణక్కాల్‌నంబి యందురు,) ఆర్తిఁగ్ = బాధచేత, తనదు = తనకు, పరమగురు = పరమాచార్యుఁ డైన నాథమునికి, పౌత్రునకుఁగ్=మనుమఁ డైన యామునాచార్యునకు, (ఇందున కుదాహరణము. శ్లో. పితామహం నాథమునిం విలోక్య ప్రసీద మద్వృత్త మచింతయిత్వా' యని యామునాచార్యుని ప్రయోగము. అనుంగు శిష్యుఁ డై శ్రీరామమిశ్రాఖ్యుఁ డన్నచో శ్రీరామమిశ్రునికి నాచార్యుఁడు శ్రీపుండరీకాక్షుఁడు, ఆయనకు నాచార్యుఁడు శ్రీమన్నాథముని గనుక నాయన యాచార్యునకు నాచార్యుండు పరమాచార్యుండు గానఁ బరమగురు పౌత్రుఁ డని ప్రయోగింపఁబడెను.)

ఇట్టి బంధ మెట్లు=ఇటువంటి రాజ్యప్రాప్తిరూపమైన ప్రతిబంధక మేలాగు సంభవించెను? 194 - లో అని వితర్కించి - యనుదానితో నన్వయము)

వ. యోగసామ్రాజ్యంబు మఱచి సామ్రాజ్యంబునం దాసక్తుం డయ్యె నట్టిమహాత్మువంశంబునం బుట్టినట్టి యితం డి ట్లగుట యతివ్యతిక్రమంబు. 189

టీ. యోగసామ్రాజ్యంబుమఱచి=ఐశ్వర్యరూపమైన శక్తియోగ ప్రపత్తియోగములను విడిచి, సామ్రాజ్యంబునందు ఆసక్తుఁడయ్యెన్ = సమ్రాట్టుయొక్క భావము సామ్రాజ్యము, ('శాస్తి యశ్చాజ్ఞయా రాజ్ఞస్స సమ్రా' ట్టని యమరము.) అట్టిమహాత్మువంశంబునన్ పుట్టినట్టి=అటువంటి మహాపురుషుని కులమునందు జన్మించిన, ఇతండు = ఈ యామునాచార్యుండు, ఇ ట్లగుట=రాజ్యాసక్తుండౌట, అతివ్యతిక్రమంబు=మిగుల నతిక్రమము.

సీ. వృషశైలఝరవారిఁ ద్రిషవణస్నానంబు
నిష్ఠఁ గావించి యాహ్నికముఁ దీర్చి
యేకాంతగుహ తత్తటీకుశాసనమున
నుండి లక్ష్మీశాంఘ్రిపుండరీక
మంజురత్నఫలక హర్షాశ్రువై దహరపు
ష్కరమున భావించి సవిత తిరుగ
యజ్ఞోపవీతపద్మాక్షమాలికతోడి
యోగపట్టికఁ గూడి యురము మెఱయ
తే. శౌరిఁ దద్ధరణీధ్రవాస్తవ్యుఁ గొలిచి
సతియు నాలర్కశాకమండితము వండ
నిల్లుకుందున కర్పించి వేల్మిఁ దీర్చి
యిట్లు తనుయాత్ర నడపు మున్నితనితాత. 190

టీ. వృషశైలఝరవారిన్ - వృషశైల=ఘటికాచలముయొక్క, (దీనికి ద్రవిడ భాషయందు అళగర్ తిరుమల యని నామము. నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి యని పర్యాయములుగాను వ్యవహారము గలదు.) ఝరవారిన్=సెలయేటి యుదకమందు, త్రిషవణస్నానంబు=మూఁడువేళలయందు జలకములాడుటను, నిష్ఠన్=నియమముచేత, కావించి=చేసి, ఆహ్నికమున్ = సంధ్యావందనాది కృత్యమును, తీర్చి=ఒనర్చి, ఏ... నన్ - ఏకాంత = రహస్యమైన, గుహ = గుహలుగల, తత్ = ఆ వృషశైలము యొక్క, తటీ=చఱియందు, కుశాసనమునన్=దర్భాసనమునందు, ఉండి = కూర్చుండి,

లక్ష్మీశ = శ్రీపతియొక్క, అంఘ్రిపుండరీకము = పాదపద్మమును, అంకురత్ = మొలచుచున్న, పులక = రోమాంచమును, హర్షాశ్రుపై = ఆనందబాష్పములు గలవాఁడై, దహరపుష్కరమునన్ = హృత్పుండరీకమందు, ('పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాండముఖే జలే, వ్యోమ్ని ఖడ్గే జలే పద్మే తీర్థౌషధివిశేషయోః' అని యమరము.) భావించి = ధ్యానించి, సవిత తిరుగన్ = ప్రొద్దు పడమటికి మళ్ళఁగా, యజ్ఞోపవీత = జందెముతోడను, పద్మాక్షమాలికతోడి = తామరపూసలతోడను గూడిన, (ఇది తులసిపూలదండల కుపలక్షణము. (శ్లో. 'యే కంఠలగ్నతులసీనళినాక్షమాలా యే బాహుమూలపరిచిహ్నితశంఖచక్రాః' యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుండ్రాస్తే వైష్ణవా భువనమాశు పవిత్రయంతి' యని యున్నది.) యోగపట్టికన్ = యోగులు జందెముగా వేసికొనునట్టి యల్లికపట్టు పట్టెడను, కూడి = కలిసి, ఉరము = ఱొమ్ము, మెఱయన్ = వెలుంగఁగా, తద్ధరణీధ్ర = ఆ వృషశైలమందు, వాస్తవ్యున్ = ఉన్నటువంటి, శౌరిన్ = సుందరబాహుస్వామిని, కొలిచి = సేవించి, సతియున్ = నాథమునిభార్యయును, అంచితము = ఒప్పైన, అలర్కశాకము = ముండ్లముస్తెకూరను, వండన్ = పచనముఁ జేయఁగా, ఇల్లుకుందునకున్ = తన యింట నారాధింపఁబడు కమలనాథునకు, అర్పించి = సమర్పణముచేసి, వేల్మిన్ = ఔపాసనాదిహోమములను, తీర్చి = ఒనర్చి, మున్ను = పూర్వమందు, ఇతనితాత = ఈ యామునాచార్యునికిఁ బితామహుం డైన శ్రీమన్నాథముని, ఇట్లు = ఉక్తక్రమంబుగా, తను యాత్రన్ = శరీరయాత్రను, నడపున్ = నడపుచుండెను.

క. తొడిఁబడి విషయాతురు నవి
విడువు మనుటకంటెఁ గలదె వేఱేపగ నే
ర్పడరఁ గథాదుల నొకవెం
బడి దోఁపం బలికి మైత్రి వాపుట యొప్పున్. 191

టీ. తొడిఁబడి = త్వరపడి, విషయాతురున్ = స్రక్చందనాదివిషయములయందాసక్తుఁ డైన వానిని, అవి = ఆ విషయములను, విడువు మనుటకంటెన్ = విడిచిపెట్టుమనుటకంటె, వేఱేపగ = అన్యమైనవిరోధము, కలదె = ఉన్నదా, (లే దనుట.) నేర్పు = చతురత్వము, అడరన్ = ఒప్పఁగా, కథాదులన్ = భారతాదికథలయందు, ఒకవెంబడి తోఁపన్ = ఏదేనొకక్రమముదోఁచునట్లు, పలికి = తెలిపి, మైత్రి = విషయములయందున్న స్నేహము, పాపుట = వదల్చుట, ఒప్పున్ = తగును.

క. వసుధం బుత్త్రాదికదు
ర్వ్యసనము సైతమును దండ్రి వారించుటకున్

వసపడ దఁట మఱి రాజ్య
వ్యసనము వారింప నెంతవాఁ డెవ్వాఁడున్. 192

టీ. వసుధన్ = భూమియందు, పుత్త్రాదిక = సుతులు మొదలగువారియొక్క, దుర్వ్యసనము సైతమును = స్త్రీద్యూతాదిచింతయైనను, తండ్రి = జనకుఁడు, వారించుటకున్ = నివర్తింపఁజేయుటకు, వసపడదఁట = శక్యము గా దఁట, మఱి = ఇఁకను, రాజ్యవ్యసనమున్=కొరతనపుఁజింతను, వారింపన్=నివర్తింపఁజేయుటకు, ఎవ్వాఁడున్= ఎవ్వఁడును, ఎంతవాఁడు = ఎంతటివాఁడు, (ఎట్టివాఁ డైనను మాన్పలేఁ డనుట.) కావ్యార్థాపత్తి.

ఆ. నల్ల క్రోల నిచ్చి మెల్లనె చివ్వంగి
నోరి జింకఁ దివియు నేరు పొదవు
వేఁటకాఁడువోలె విషయాళివలనఁ ద
త్తృష్ణఁ దీర నిచ్చి త్రిప్పు టురవు. 193

టీ. నల్ల = రక్తమును, క్రోలనిచ్చి = త్రావనిచ్చి, మెల్లనె=తడవుగానె, చి... కన్ - చివ్వంగి=తరక్షువుయొక్క, నోరి = నోటియందున్న, జింకన్ = లేడిని, తి... లెన్ - తివియు = తీయునట్టి, నేరుపొదవు = నైపుణ్యముగల్గినట్టి, వేఁటకాఁడు వోలెన్ = మృగయునివలె, విషయాళివలనన్=శబ్దాదివిషయసమూహము వలననుండి, తత్తృష్ణన్ = ఆ యామునాచార్యులయొక్క యాశను, తీరనిచ్చి = ముగియనిచ్చి, త్రిప్పుట = మళ్లించుట, ఉరవు = మంచిది. ఉపమ.

వ. కావున నెట్లయిన నితని నింక నుపేక్షింప రా దుపాయంబునఁ
జొచ్చి యొక్కరీతిం ద్రిప్ప వలయు నుర్వి నాహారదోషంబె విజ్ఞాన
నాశంబునకు మూలం బని వితర్కించి. 194

టీ. కావునన్, ఎట్లయినన్ = ఏలాగైనను, ఇతనిన్=ఈయామునాచార్యుని, ఇంకన్ = ఇఁకమీఁదను, ఉపేక్షింపరాదు. (అలక్ష్యముసేయరాదు) ఉపాయంబునఁ జొచ్చి = నేర్పులోఁ బ్రవేశించి, ఒక్కరీతిన్ త్రిప్పవలయున్=ఒకానొకప్రకారము చేత మళ్ళింపవలయును, ఉర్విన్ = భూమియందు, ఆహారదోషంబు = భోజనమువలని దోషంబు (అనఁగాఁ బాప మనుట. ఆశ్రయనిమిత్తజాతిస్వరూప దుష్టాహారవర్జనంబు వలనఁ గాయ శుద్ధి యని యున్నది గావున), విజ్ఞాననాశంబునకున్ = మఱచెడుటకు, మూలం బని = కారణం బని, వితర్కించి = ఊహించి. ఈవితర్కమున కారంభము 188 వ పద్యమున.

క. ముల్లుదలకొననినవకపుఁ, బల్లవములతోడ ముక్తిభామచెవులకుం
బల్లేరుఁబువ్వులగుపువు, లుల్లసిలునలర్కశాకమొదుగుగఁగొనుచున్.

టీ. ముల్లుదలకొనని=కంటకము పుట్టని, నవకపు=లేఁతలైన, పల్లవములతోడన్=చిగుళ్ళతో, ము...కున్ - ముక్తిభామ = మోక్షాంగనయొక్క, చెవులకున్=కర్ణములకు, పల్లేరుఁబువ్వులగు, (అనఁగాఁ బల్లేరుపువ్వులనెడు భూషణములవలె నున్నవియనుట.) పువులు = పుష్పములు, ఉ...ము-ఉల్లసిలు=ఒప్పుచున్న, అలర్కశాకము=ముండ్లముస్తెకూర, ఒదుగుగన్=విస్తారముగా, కొనుచున్=సంగ్రహించికొనుచు, (శ్లో. 'అయత్నతో యామున మాత్మదాస మలర్కపత్త్రార్పణ నిష్క్రయేణ, యఃక్రీతవా నాస్థితయావ రాజ్యం నమామి తం రామ మమేయసత్త్వమ్' అని ప్రసిద్ధము.)

తే. తెచ్చి యొకవైష్ణవుఁడు కాను కిచ్చె ననుచు
బానసపుబాడబులచేతఁ బంపుటయును
నతఁడు ప్రియపడి వండించి యారగింపఁ
దెచ్చు నిచ్చఁ గొన్నాళ్లిట్లు తెచ్చుచుండ. 196

టీ. ఒకవైష్ణవుఁడు = ఒకవిష్ణుభక్తుఁడు, తెచ్చి = తీసికొనివచ్చి, కాను కిచ్చెను అనుచున్ = ఉపహారమొసంగె నని, బానసపుబాడబులచేతన్=వంటబ్రాహ్మణులచేతను, పంపుటయును = అంపఁగా, ('ద్విజాత్యగ్రజన్మభూదేవ బాడబాః' అని యమరము.) అతఁడు=అయ్యామునాచార్యుండు, ప్రియపడి=ఇష్టపడి, వండించి=పచనము చేయించి ఆరగింపన్ = భోజనముచేయఁగా, ఇచ్చన్=ప్రియముతో, తెచ్చున్=మరలఁ దెచ్చి యిచ్చును. కొన్నాళ్లు = కొన్నిదినములు, ఇట్లు = ఈప్రకారముగా, తెచ్చుచుండన్= తెచ్చియిచ్చుచుండఁగా.

వ. ఒక్కనాఁ డతండు భోజనసమయంబున సకలశాకాస్వాదనంబు సేయుచు వచ్చి తచ్ఛాకంబు నంజుచుం దలంచుకొని యేతదానీత యగుభాగవతు భోజనానంతరంబ మమ్ముం గాన్పింపుం డని పలికి పాణిప్రక్షాళనాచమనానంతరంబ యతనిం గాన్పించుకొని నమస్కరించి వచ్చిన ప్రయోజనం బడుగుటయు నతం డిట్లనియె. 197

టీ. ఒక్కనాఁడు = ఒక్కదినమునందు, భోజనసమయంబునన్=ఆరగించుతఱి, స...బు - సకల=సమస్తమైన, శాక=వ్యంజనములయొక్క, ఆస్వాదనంబు=రుచిచూచుటను, చేయుచున్, వచ్చి=క్రమముగా వచ్చి, తచ్ఛాకంబున్=ఆముండ్లముస్తెకూరను, నంజుచున్ = ఆస్వాదించుచును, తలంచుకొని = జ్ఞప్తితెచ్చుకొని, ఏతదానీత యగు=

ఈకూర దెచ్చినట్టి, భాగవతుఁ=భగవద్భక్తుని, భోజనానంతరంబ=ఆరగించిన వెనుకనే, మమ్ముం గాన్పింపుం డని=మమ్ముఁ గనుఁగొనఁజేయుం డని, పలికె = నుడివి, పాణిప్రక్షాళ నాచమనానంతరంబ = చెయిగడిగి యుపస్పర్శము చేసినపిమ్మటను, అతనిఁ గాన్పించు కొని=ఆమహాభాగవతునిం గానిపింపఁజేసికొని, నమస్కరించి = సేవించి, వచ్చినప్రయో జనం బడుగుటయు = ఆగమనకార్యమును పృచ్ఛసేయఁగా, అతండు = ఆ శ్రీరామ మిశ్రుఁడు, ఇట్లనియెఁ = వక్ష్యమాణక్రమంబునం బలికెను.

క మీపెద్దలు గూర్చినని, క్షేప మొకటి సహ్యజనిత౹సింధుజలాంత
ర్ద్వీపమున నుండ నీకుం, జూపంగా వచ్చితిని వ౹సుమతీనాథా. 198

టీ. వసుమతీనాథా = ఓయిరాజా! మీపెద్దలు = వృద్ధులయిన మీపితృపితా మహాదులు, కూర్చిన=కూడఁబెట్టినట్టి, భక్తిచేత సేవించినట్టియు, నిక్షేపమొకటి=ప్రాఁతి పెట్టిన యొకనిధి, స...నఁ - సహ్య = సహ్యపర్వతమునందు, జనిత=పుట్టినటువంటి, సింధు=కావేరియొక్క, జలాంతః = ప్రవాహద్వయమధ్యమున నున్న, ద్వీపమునఁ = దీవిగడ్డయందు, ఉండఁ=ఉండఁగా, నీకుఁ=నీకు, చూపంగాఁ=కనుపఱచుటకొఱకు, వచ్చితిని = ఏతెంచితిని. లలితాలంకారము.

క. నా కేటికి నిక్షేపము, నాకు నిధియు నాకరంబు ౹ నరనాథులసొ
మ్మే కాన విన్నవించెద, నాకర్ణింపుము తదీయ౹మగువిధ మెల్లన్. 199

టీ. నిక్షేపము=ధననిధి, నాకుఁ ఏటికిఁ=నాకెందులకు, నాకు=అని పలుకరుము, నిధియుఁ=నిక్షేపమును, ఆకరంబుఁ=గనియును, నరనాథులసొమ్మే కానఁ = రాజుల ద్రవ్యమేగనుక, విన్నవించెదఁ=తెలిపెదను, తదీయమగు=ఆనిక్షేపసంబంధి యైన, విధ మెల్లఁ = స్వరూపమంతయును, ఆకర్ణింపుము = వినుము.

సీ. స్ఫటల మణుల్మిఱ ౹ కాంతమై శ్వేతమై
నట్టిత్రాఁ చొక్కటి ౹ చుట్టియుండు
రక్షోగృహీత మ౹న్వృథ తొల్లి గల దది
పొలయ దం దేఁడాఱు౹నెలలు గాని
యేపాటిబలి యైనఁ ౹ జేపడుఁ బ్రాణిహిం
సాదిపూజనముల ౹ కాసపడదు
తనవెలుం గొగి నిరం౹జనదృష్టికినె లక్ష్య
మై యుండు నయ్యు నిం౹తంత గాదు
తే. రత్న మొక్కటిపై నపూ౹ర్వంబు మెఱయుఁ
గలదు పద్మంబు శంఖంబు ౹ పలుకు లేటి

కక్షయ మనంత మాద్య మేకాంతమందు
భూప నీ కొక్కనికె కాక చూపరాదు. 200

టీ. స్ఫటలన్ = పడగలయందు, మణులు=రత్నములు, మీఱన్ = అతిశయింపఁగా, ('స్ఫటాయాంతు ఫణాద్వయోః' అని యమరము.) కాంతమై=ఓర్పుగల్గినదై, శ్వేతమైనట్టి=తెల్లనైనటువంటి, త్రాచొక్కటి = ఒక కృష్ణసర్పము, చుట్టియుండన్ = పరివేష్టించియుండును (ధననిక్షేపమును సర్పము చుట్టికొనియుంట ప్రసిద్ధము గానఁ బ్రకృతమందు రంగనాయకుని యామునాచార్యునియొక్క పూర్వులుంచిన నిక్షేపముగా రూపించిచెప్పినందున ద్వ్యర్థిగా శ్రీరంగేశ్వరునియందలి ధర్మములను నిధి ధర్మములు గాను, నాయన శేషశాయి యగుటవల్ల సర్పావతారములకు నిధు లని వ్యవహారము గలదు గనుక నట్టి నిక్షేపమునకు సర్పము చుట్టికొనియున్నట్లును జెప్పుట యుక్తము.) ర...ము - రక్షః = రక్కసునిచేత, గృహీతము = స్వీకరింపఁబడ్డది, అన్ = అనెడు, ప్రథ=ప్రసిద్ధి, తొల్లి=పూర్వమునందు, కలదు=కద్దు, అది=ఆప్రసిద్ధి, ఆందున్ = ఆనిధియందు, ఏఁడు = సంవత్సరమునకైనను, ఆఱునెలలుగాని = షణ్మాసములకుంగాని, పొలయదు=పొందదు (నిక్షేపమునకు రాక్షసగృహీతత్వ ముందును గనుక నట్లిక్కడ శ్రీరంగనాయకుఁడు పూర్వము విభీషణునిచేత స్వీకరింపఁబడిన విభీషణుఁ డాఱుమాసములకు నొకపర్యాయముగాని, సంవత్సరమునకు నొకపర్యాయముగాని పూజయొనర్చుచుండుట ప్రసిద్ధముగాన నిప్పుడా నిక్షేపమునకు రాక్షసగృహీతత్వము నిరంతరము లేదు సులభముగా గ్రహింపవచ్చుననుట.) ఏపాటిబలి యైనన్=నిశ్చలచిత్తుఁడై యెంత మాత్రముపూజచేసినను, చేపడున్=అనుగ్రహించును. ('బలిః పూజోపహారయోః' అని యమరము.) ప్రాణి = జంతువులయొక్క, హింసాది = కాయక్లేశాదులవలన, పూజనములకున్=అర్చనలను (ద్వితీయార్థమందుషష్ఠి), ఆసపడదు=అపేక్షింపదు (లోకమునందు నిక్షేపమును బొందువారలు ప్రాణిహింసాది బలులొసంగి దానిం గొనుట ప్రసిద్ధము గాన నట్లుగాక సూక్ష్మబలిచేత నబ్బు ననిచెప్పుటవలన సులభోపాయముచేతనే శ్రీరంగేశుఁడు ప్రసన్నుఁడౌ ననుట), తన=ఆనిక్షేపముయొక్క, వెలుంగు=జ్వలించుట (అనఁగాఁ గనుపించుట యనుట), ఒగిన్ = ప్రయత్నముచేత, నిరంజనదృష్టికినె = కాటుకఁబెట్టని కన్నులుగలవానికె, లక్ష్యమైయుండున్=చూడఁదగినదై యుండును (ధననిక్షేపాదులం జూచువారు కంటఁ గాటుకఁబెట్టిచూచుట ప్రసిద్ధమైనను ఈనిక్షేపమును జూచుటకు నది యక్కఱలేదనుట), తనవెలుఁగు=స్వప్రకాశము, ఒగిన్=యత్నముచేత, నిరంజన= బాధరహితమైన, దృష్టికినె = జ్ఞానముగలవానికె, లక్ష్యమైయుండున్ = చూడఁదగినదైయుండును (కేవలచర్మచక్షుస్సులకు గోచరము గాదనుట), అయ్యున్=కనుపించున

దయ్యెను, ఇంతంతగాదు = ఇంతమాత్రమని లెక్కింపరాదు, (అనిధి యింత యనియు శ్రీరంగనాయకులమహిమ యింత యనియుం జెప్ప శక్యముగా దనుట), పైఁ=అనిశేషముమీఁదను, రత్న మొకటి=ఒకమణి, మెఱయుఁ=వెలుగొందును, శంఖంబు పద్మంబు=శంఖపద్మాది సంఖ్యగలద్రవ్యము, కలదు=కద్దు (శ్రీరంగనాథునిచేతియందు శంఖము నాభియందు పద్మ ముండుట ప్రసిద్ధము.) పలుకు లేటికిఁ=మాటలెందుకు, (అది) అక్షయము = నాశరహితము, అనంతము = అంతములేనిది, దేశకృతకాలకృతపరిచ్ఛేదము లేనిది, అవ్యము=బహుకాలముగనుండియున్నదియు, సర్వభూతాదియు, (కనుక)భూప=ఓయివిప్రప్రభుఁడా, ఏకాంతమందుఁ = రహస్యముగా, నీకొక్కనికె కాక = నీకు మాత్రమేకాని, చూపరాదు=అన్యులకుఁ జూపఁగూడదు. అనఁగా నితరులు చూడఁగూడ దనుట (అసాధారణభగవద్భక్తిఘని యైన నాథముని మనుమఁడవు గనుక నీకాయోగ్యత గల దని భావము.) శ్లిష్టరూపకమును వ్యతిరేకమును.

వ. అని విన్నవించిన సంతసించి సేనాసమేతుం డై యతండు మున్నుగా
శ్రీరంగంబున కరిగి కావేరీచంద్రపుష్కరిణులఁ దీర్థం బాడి రంగ
నాథు సేవించి సాభిప్రాయంబుగా నతనిం గటాక్షించిన నతం
డి ట్లనియె. 201

టీ. అని = ఇట్లని, విన్నవించినఁ = విజ్ఞాపనముచేయఁగా, సంతసించి=సంతోషించి, సేనాసమేతుండై=సేనతోఁగూడుకొనినవాఁడై, అతండు=ఆ శ్రీరామమిశ్రుఁడు, మున్నుగాఁ=ముందుగాను, శ్రీరంగంబునకుఁ అరిగి=శ్రీరంగ మను దివ్యక్షేత్రమునకు వెళ్లి, కావేరీ చంద్రపుష్కరిణులఁ=కావేరీ చంద్రపుష్కరిణులయందు, తీర్థమాడి=స్నానముఁజేసి, రంగనాథుఁ = రంగనాయకుని, సేవించి=నమస్కరించి, సాభిప్రాయంబుగాఁ = ఆకూతసహిత మగునట్లు, అతనిఁ=ఆశ్రీరామమిశ్రుని, కటాక్షించినఁ = చూడఁగా, అతఁడు=ఆశ్రీరామమిశ్రుఁడు, ఇట్లనియెఁ=వక్ష్యమాణక్రమంబుగఁబలికెను.

క. మీపెద్దలు గూర్చినని
క్షేప మ్మిది కొమ్మటంచు శ్రీరంగపతి
శ్రీపదయుగ్మముఁ జూపిన
నాపృథివీపతిహతాదరపాస్తభ్రముఁడై. 202

టీ. మీపెద్దలు=మీపూర్వికులయిన నాథమునిప్రభృతులు, కూర్చిన=సంపాదించిన, నిక్షేపమ్ము=ధననిక్షేపము, కొమ్ము అటంచుఁ = దీనిం బరిగ్రహింపు మని, శ్రీరంగపతి=శ్రీరంగనాయకునియొక్క, శ్రీపదయుగ్మముఁ = శోభాయుక్తమగు పదద్వంద్వ

ము్ను, చూపినన్ = కనుపింపఁజేయఁగా, ఆపృథివీపతి = ఆయామునాచార్యుఁడు, మ...ఁడు ఐ - మహాత్ = అదరుపాటున, ('ప్రసవ్యాతుమహార్థక' యని యమరము.) అపాస్త = పోఁగొట్టఁబడిన, భ్రముఁడై = భ్రాంతిగలవాఁడై.

వ. గ్రక్కునఁ దనపూర్వదశఁ దలంచి యిన్నాళ్లు తనప్రమాదంబునకుం
బరమ నిర్వేదన నొంది నీ వెవ్వండ వనుటయు, నే మీపితామహుం
డగునాథముని ప్రశిష్యుండ, నయ్యోగివరుండు భావిభవజ్జన్మం బెఱింగి
భాగవతవతంసంబ వగునీచేత నివ్విశిష్టాద్వైతంబు సకల భూతహితం
బుగా వెలయం గల యది యని నిశ్చయించి నీకు ద్వయం బుపదే
శింపు మని తన శిష్యుఁ డగు పుండరీకాక్షున కుపదేశించిన నతండు
భోగాసక్తుండ వైన నిన్నుపాయంబునఁ దెలిపి నీ కుపదేశింపు మను
టయుఁ బనివింటి, ననిన సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లి యతనిచేతం
బంచసంస్కారసంస్కృతుం డై యంత నిలువక తురీయాశ్రమంబునకు
రాఁగలవాఁ డై స్కంధావారంబునకు మగుడి వచ్చి కుమారునందు
రాజ్యభారంబుఁ బెట్టి బంధుమిత్రామాత్య సమేతం బగు బలచతుష్ట
యంబును బ్రకృతివర్గంబును నతని కొప్పగించి యి ట్లనియె. 203

టీ. గ్రక్కునన్ = శీఘ్రముగా, తన...శన్ - తన = తనయొక్క, పూర్వ దశన్ = పూర్వమైనస్థితిని, తలంచి = స్మరించుకొని, ఇన్నాళ్లు = ఇన్నిదినములు, తన = తనయొక్క, ప్రమాదంబునకున్ = మఱపునకు, పరమనిర్వేదనన్ = అధికమైన విషాదమును, ఒంది = చెంది, నీ వెవ్వండవు అనుటయున్ = నీ వెవ్వఁడ వనఁగా, నేన్ = నేను, మీపితామహుండగు = మీతండ్రితండ్రియైన, నాథమునిప్రశిష్యుండన్ = నాథముని యొక్క యనుంగుశిష్యుఁ డయిన పుండరీకాక్షున కంతేవాసిని, అయ్యోగివరుండు = శ్రీమన్నాథముని, భా...బు - భావి = కాఁగల, భవత్ = మీయొక్క, జన్మంబు = అవతారమును, ఎఱింగి = తెలిసి, భాగవతవతంసంబ వగు = భగవద్భక్తశిరోభూషణం బయిన, నీచేతన్, ఇవ్విశిష్టాద్వైతంబు (స్థూలచిదచిద్విశిష్టపరమాత్మకు సూక్ష్మచిదచిద్విశిష్టపరమాత్మకు నభేద మని చెప్పుటయే విశిష్టాద్వైతశబ్దార్థము) సక...కాన్ - సకలభూత = నిఖిలప్రాణులకును, హితంబుగాన్ = మేలగునట్లు, వెలయంగల యది = శోభింపఁగలది, అని నిశ్చయించి = అ ట్లని రూఢిఁజేసి, నీకు ద్వయం బుపదేశింపు మని = నీకు మంత్రరత్నదానముఁ జేయుము మని, తనశిష్యుం డగు పుండరీకాక్షున కుపదేశించినన్ = తనయంతేవాసియైన పుండరీకాక్షునకు ద్వయమంత్రదానము చేయఁగా, అతండు = ఆపుండరీకాక్షుండు, భోగాసక్తుండ వయిన = అర్థకామాదులయం దిచ్ఛగల

వాఁడ వయిన, నిన్నున్ = నిన్ను, ఉపాయంబునం దెలిపి = నేర్పుచేత నాలింగించి, నీకుపదేశింపు మనుటయున్=నీకు ద్వయమంత్రదానముఁ జేయు మనఁగా, (శ్లో. 'నేతృత్వం నిత్యయోగం సముచితగుణజాతం తనుఖ్యాపనం చో, పాయం కర్తవ్యభాగం త్వథమిథున పరం ప్రాప్యమేవం ప్రసిద్ధమ్; స్వామిత్వం ప్రార్థనాం చ ప్రబలతరవిరోధి ప్రహాణం ద శైతా, న్మంతారంత్రాయతే చేత్యధిగతనియమం షట్పదోఽయం ద్వ్యఖండః' అని ద్వయ మంత్రలక్షణము.) పనివింటినని నన్=వచ్చితి ననఁగా, సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లి=అష్టాంగయుక్తమగునట్లు నతియొనర్చి, అతనిచేతన్=ఆశ్రీరామమిశ్రునిచేతను, పంచసంస్కారసంస్కృతుం డై = అయిదు శోధనలచేత శోధింపఁబడినవాఁ డై, (పంచసంస్కారములనఁగా, శ్లో. 'తాపః పుండ్రస్తథా నామ మంత్రో యాగశ్చ పంచమః, అమీ పరమసంస్కారాః పరమైకాంతిహేతవః' యని దానిలక్షణము.) అంతన్ నిలువక=అంతమాత్రముచేత విరమింపక, తురీయాశ్రమంబునకు రాఁగలవాఁడై = చతుర్థాశ్రమమునకు వచ్చుటకుద్యుక్తుం డై (అనఁగా యత్యాశ్రమమున కనుట). స్కంధావారంబునకున్=దండుదిగియున్న స్థలమునకు, మగుడివచ్చి=తిరిగివచ్చి, ('స్కంధావారో నివేశన'మ్మని నిఘంటువు.) కుమారునందున్ రాజ్యభారంబున్ పెట్టి = రాజ్యంబునఁ బుత్త్రునభిషిక్తుం జేసి, బంధుమిత్త్రామాత్యసమేతం బగు = బాంధవమిత్త్రామాత్యులతోఁ గూడియున్న, బలచతుష్టయంబును = చతురంగసైన్యమును, ప్రకృతివర్గంబును = ప్రజాసమూహమును, అతనికిన్ = ఆకుమారునికి, ఒప్పగించి = అధీనముచేసి, ఇట్లనియెన్ = వక్ష్యమాణక్రమంబునఁ బల్కెను. ('రాజ్యాంగాని ప్రకృతయః పౌరాణాం శ్రేణయోఽపి చ' యని యమరము.)

రాజనీతి

క. ఏపట్టున విసువక ర
   క్షాపరుఁడవు గమ్ము ప్రజల । చక్కి విపన్ను
   ల్గూపెట్టిన విని తీర్పుము
   కాపురుషులమీఁద నిడకు । కార్యభరంబుల్. 204

టీ. ఏపట్టునన్ = ఏసమయమునందును, విసువక = వేసరక. ప్రజలచక్కిన్ = జనులపట్టున, రక్షాపరుఁడవు గమ్ము = రక్షణపరతంత్రుఁడ వగుము విపన్నుల్ = ఆపద నొందినవారలు, కూపెట్టిరన్ = మొఱపెట్టఁగా, విని = ఆలోచించి, తీర్పుము = వారియాపదలఁదొలఁగఁజేయుము, కార్యభరంబుల్ = గొప్పపనులను, కాపురుషులమీఁదన్ = కుత్సితజనులయందు, ఇడకుము = ఉంచకుము.

తే. రాష్ట్రవర్ధన మెదఁ గోరు । రాజు మేలు
   రాష్ట్రమును గోరుదానఁ గా । ర్యమొ యనంగ

రాదు బ్రహ్మోత్తరము లైన ప్రజలయేక
ముఖపుఁగోర్కిఁ దదంతరా త్ముం డొసఁగఁడె. 205

టీ. రాష్ట్రవర్ధనము = ప్రజాభివృద్ధిని, (రాష్ట్ర మనఁగా దేశ మనియుం జెప్ప వచ్చును.) ఎదన్=హృదయమందు, కో...లుకోరు=అపేక్షించుచున్నటువంటి, రాజు=ఏలికయొక్క, మేలు=వృద్ధిని, రాష్ట్రమును = ప్రజయును, కోరున్ = అపేక్షించును. దానన్=అట్లుకోరుటవలన, కార్యమెు=ప్రయోజన మేమి, అనంగన్ రాదు=అనఁగూడదు, బ్రహ్మోత్తరము లైన = బ్రాహ్మణులులోనగు, ప్రజల = జనములయొక్క, ఏకముఖపుఁగోర్కిన్ = ఒక్కరూపమయినకోరికను, తదంతరాత్ముండు=వారి యంతర్యామి యయిన శ్రీమన్నారాయణుఁడు, ఒసఁగఁడె = ఇయ్యఁడా (ఇచ్చు ననుట.)

ఆ. ఆజ్ఞ వలయు నృపతి కాభీరభిల్లాది
కంపకోల నూల నాజ్ఞ చెల్లు
నంట సార్వభౌముఁ డైన భూపతియాజ్ఞ
కెల్లవారుఁ దల్ల డిల్లవలదె. 206

టీ. నృపతికిన్ = రాజునకు, ఆజ్ఞ = సెలవు, వలయున్ = వాలాయముకావలయును, ఆ...కిన్ - అభీర=గొల్లలకును, భిల్లాదికిన్ = చెంచువాండ్రు బోయవాండ్రు మొదలగువారికిని, ('భేదాః కిరాతశబరపుళిందాః మ్లేచ్ఛజాతయః, గోపీగోపాలగోసంఖ్య గోధుగాభీరవల్లవాః' యని రెంటికి నమరము.) అంపకోలన్ = అంపకట్టచేత, నూలన్=దారపుఁబోగుచేతను ఆజ్ఞ చెల్లునంట = ఉత్తరువుచెల్లుబడియగునఁట, (అడవులయందుండెడు పశుప్రాయు లైన పాళెగాండ్రుసహిత మెవని కైన నభయదానముచేసిన వానిచేత నొకయంపకట్టె గాని నూలిపోఁగు గాని తమ ముద్రగా నిచ్చినపక్షమున మఱియతనిని జోరు లంట రని ప్రసిద్ధము.), సార్వభౌముఁడైన = సకలభూమండలము నేలుచున్న, భూ...కున్ - భూపతి = రాజుయొక్క, ఆజ్ఞకున్ = ఉత్తరువునకు, ఎల్లవారున్=సకలజనులును, తల్లడిల్లవలదె=వెఱువవలదా, భూమండలమునకంతయుఁ బ్రభుత్వముచేయుచుండు రాజున కెల్లవారును భయముతోఁగూడి వశంవదు లై యుండవలయును. కావ్యార్థాపత్తి.

క. దుర్గము లాప్తద్విజవర, వర్గమునకె యిమ్ము దుర్గ వ త్తత్తతి క
త్సర్గళధరాధి రాజ్యవి, నిర్గతసాధ్వసత పాడమనిలుపకు కొలఁదిన్.

టీ. దుర్గములు = స్థలజలగిరివనదుర్గములను, ఆ...కె - ఆప్త = ప్రియులయిన, ద్విజవరవర్గమునకె = బ్రాహ్మణోత్తమ సమూహమునకె, ఇమ్ము = ఇయ్యఁగావలయును,

(దుర్గాధిపత్యంబు లనుట.) దుర్గవత్ = స్థలదుర్గాదులుగల, తత్తతికిన్ = ఆధ్వజబృందము నకు, అత్యర్గళ = నివారింపశక్యముగాని, ధ...తన్ - ధరాధిరాజ్య = భూమండలాధి పత్యముచేత, వినిర్గత = పోయినటువంటి, సాధ్వసత = భయముగలుగుట, పొదమన్ = జనించునట్లు, కొలఁదిన్ = కొద్దిని, నిలుపకు = ఉంచకుము. 'భీతిర్భీస్సాధ్వసంభయం' అని యమరము.)

తా. దుర్గాధిపత్యము బొందినవాఁడే పాటిశత్రువు వచ్చినను వెఱవక యెదిరించుటకు యుక్తమైన బలస్తోమములంగూర్చి వానిం భరియింపుము.(చూ.209-217ప.)

ఆ. మొదలఁ బెనిచి పిదపఁ । గుదియింప నెవ్వాఁడుఁ
దనదు తొంటిహీన । దశఁ దలంపఁ
డలుగుఁ గాన శీల । మరయుచుఁ గ్రమవృద్ధిఁ
బెనిచి వేళవేళఁ । బనులు గొనుము. 208

టీ. మొదలన్ = ప్రథమమందు, పెనిచి = వృద్ధిచేసి, పిదపన్ = వెనుక, కుది యింపన్ = తగ్గింపఁగా, ఎవ్వాఁడున్ = ఎటువంటివాఁ డయినను, త...శన్-తనదు= తనయొక్క, తొంటిహీనదశన్ = ముందటి తక్కువస్థితిని, తలఁపఁడు = స్మరింపఁడు, అలుగున్ కానన్ = కోపించును గనుక (అనఁగా దొర తన్నుఁ దగ్గించినాఁ డని కోపగించునుగాని తానున్న తక్కువస్థితిని దలఁపఁ డనుట.), శీల మరయుచున్ = వానివానినడవడి తెలిసికొనుచును, (స్వభావము ననియైనఁ జెప్పవచ్చును.) ('శీలం స్వభావే సద్వృత్తే' యని యమరము.) క్రమవృద్ధిన్ పెనిచి = పర్యాయముగా వృద్ధినొందించి, వేళవేళన్ = ఎల్లసమయములయందును, పనులు గొనుము = కార్యములు చేయించుకొనుము.

ఆ. అనభిజాతుఁ గీక । టాలయు నశ్రుతు
నలుకుమాని బొంకు । పలుకువాని
నాతతాయి గడుసు । నన్యదేశ్యు నధర్ము
విడుము విప్రునేల । వేఁడితేని. 209

టీ. అనభిజాతున్ = హీనకులము గలవానిని, కీకటాలయున్-కీకట = శబరపల్లి యందు, ఆలయున్ = గృహముగలవానిని, అశ్రుతున్ = పాండిత్యము లేనివానిని, అలుకు మాని = భయము విడిచి, బొంకుపలుకువానిన్ = దబ్బరలాడువానిని, ఆతతాయిన్ = ద్రోహచింతకుని, (శ్లో. 'అగ్నిదో గరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహః, క్షేత్రదారాపహర్తా చ షడేతే ఆతతాయినః' యని యాతతాయి లక్షణము.) గడుసున్ = అపవాద భయములేనివానిని, అన్యదేశ్యున్ = దేశాంతరస్థుని, అధర్మున్ = ధర్మబాహ్యుని,

విప్రుఁన్ = ఇట్టిబ్రాహ్మణుని, ఏలన్ వేఁడితేని=ఉద్యోగమిచ్చి పోషింపఁదలంచితివేని, విడుము = వదలుము. ఇట్టివారలు బ్రాహ్మణు లైనను బరిహరింపు మనుట.

క. తక్కుము మిగులఁ బథిచ్యుత
పక్కణవర్తితులఁ దొల్లి । భ్రష్టగువిప్రుం
డొక్కం డలుగఁడె ప్రోచిన
కొక్కెరపై నొక్కపూఁట । కూటికిఁగాఁగన్. 210

టీ. మిగులన్ = మిక్కిలి, పథిచ్యుత=స్వవృత్తిభ్రష్టులై దుష్ట సంసర్గముగల, పక్కణవర్తితులన్ = శబరవాటికలయందుఁ బెరిగినటువంటి బ్రాహ్మణులను, తక్కుము= విడువుము. తొల్లి = పూర్వమునందు, భ్రష్టగు = చెడిపోయినట్టి, విప్రుం డొక్కండు= బ్రాహ్మణుఁడొక్కరుఁడు, ప్రోఁచిన = తన్నుఁ గాపాడినట్టి, కొక్కెరపయిన్ = కొంగ మీఁద, ఒక్కపూఁటకూటికిన్ కాఁగన్=ఏకకాలాహారమునకుఁగా(మాంసార్థియై మేలు మఱచి యనుట.), అలుగఁడె = కోపింపఁడా. (గౌతమనాడీజంఘులకథ మహాభారత మందలి శాంతిపర్వంబున రాజధర్మమందుఁ జెప్పఁబడియున్నయది.)

తా. బ్రాహ్మణుఁడై జన్మించినను మద్యమాంసముల మఱిగి భ్రష్టుఁడైనవాఁడు నిరంతరము దానికై కులాచారములు మొదలగువానియందు లక్ష్య ముంచక స్వేచ్ఛాను సారముగ వర్తిల్లుచుండును గనుక నట్టివాని కధికార మియ్యంగూడదు.

చ. చదివి యధర్మభీరు నృప । శాస్త్రవిధిజ్ఞతల న్వయస్సు డె
బ్బదిటికి లోను నేఁబదికి । బాహ్యమునై యరుజ న్స్వపూర్వ్యులై
మద మఱి రాజుప్రార్థన న । మాత్యతఁ గైకొని తీర్చుపాఱువా
రొదవిన నంగము ల్మిగుల । నూర్జితమౌటకుఁ బూఁట సాలదే. 211

టీ. చదివి=శాస్త్రాదులం బఠించి, అధర్మభీరు నృపశాస్త్రవిధిజ్ఞతలన్=అన్యాయ భీతితోను రాజనీతి పరిజ్ఞానములోనుగూడి, వయస్సు = ప్రాయము, ('ఖగబాల్యాది నోర్వయ' యని నిఘంటువు.) డెబ్బదిటికిన్=సప్తతి సంవత్సరములకు, లోనున్=లోపు గాను, ఏఁబదికిన్ = పంచాశద్వర్షములకు, బాహ్యము = వెలపటిదికాను, ఐ = కల వారై, అరుజన్ = రోగములేమియందు, స్వపూర్వ్యులై=తమ పెద్దలనాటనుండి కని పెట్టియున్నవారై, మదమఱి = మాత్సర్యాదులు లేక, రాజు = నృపునియొక్క, ప్రార్థనన్=వేఁడుకొనుటచేత, అమాత్యతన్=ప్రధానత్వమును, కైకొని=అంగీకరించి, తీర్చు= కార్యనిర్వాహముచేయునట్టి, పాఱువారు = బ్రాహ్మణులు, ఒదవినన్ = లభించిరేని, అంగముల్ = రాజ్యాంగములు, ('స్వామ్యమాత్యసుహృత్కోశ రాష్ట్రదుర్గబలానిచ,

రాజ్యాంగాని' యని యమరము.) మిగులన్=మిక్కిలియు, ఊర్జితమాటకున్ = వృద్ధి బొందుటకు, ఘూఁట చాలదె=అఱదినము చాలదా, నీతిశాస్త్రమందుఁ జెప్పఁబడియున్న లక్షణములుగల మంత్రి దొరకినట్లాయె నేని క్షిప్రమున రాజ్య మభివృద్ధి నొందును.

వ. అట్టిమంత్రివర్గంబు దొరక దేని. 212

శా. నీతిం దాన తలంచి చేయఁ బని గా ౹ నీ కాకపోనీ బల
వ్రాతార్థాఢ్యత నెమ్మి నుండ కొరుఁ బ్రో ౹ వ న్మంత్రి యంచుం గుణా
తీతుం గుమ్మడికాయ యంత యగుము ౹ త్తెంబై మనం బేర్వ న
ట్లే తా నాతనిచేతిలో బ్రతుకువాఁ ౹ డే యాఁ జుమీ మీఁదటన్.

టీ. నీతిన్=రాజన్యాయముచేతను, తాన తలంచి=తానే యోజించి, చేయన్= రాజ్యపాలన మొనరింపఁగా, పనిగానీ = కార్యముతీరనీ, కాకపోనీ = కార్యముతీరక పోనీ, బ...తన్-బలవ్రాత = సేనాసమూహముచేతను, అర్థ=ధనముచేతను, ఆఢ్యతన్= ఒప్పియుండుటచేతను, ('ఇభ్యఆఢ్యోధనీస్వామి' యని యమరము.) (ధనబలములు గల్గి స్వతంత్రుఁడై యుంటచేత ననుట.) నెమ్మినుండక=నెమ్మది నుండక, గుణాతీతున్=సద్గుణముల నతిక్రమించినట్టి (అనఁగా గుణశూన్యుఁడనుట), ఒరున్=మఱియొక పురుషుని, మంత్రి అంచున్ = అమాత్యుఁడని, ప్రోవన్ = రక్షింపఁగా, గుమ్మడికాయయంతయగు ముత్తెంబై=కూశ్మాండప్రమాణమైన మౌక్తికమై (గుమ్మడికాయయంతముత్తె మనఁగా శరీర మందు ధరింపఁగూడ దనుట), మనంబేర్వన్ = మనోవ్యథసేయఁగా (స్వాధీనుఁడుగాక యనుట.) అట్లే = అలాగుననే, తాన్=పరాధీనుఁడయినతాను, ఆతనిచేతిలోన్=అస్వవశుఁడుగాని మంత్రిహస్తములో, మీఁదటన్ = వెనుకను, బ్రతుకువాఁడేయాఁజుమీ= అతఁడు చెప్పినట్లు విని జీవింపవలయుఁజుమా. (అనఁగాఁ దగినమంత్రి దొరక నపుడు నీతిశాస్త్రపరుఁడై తానే యెల్లపనులు చూచికొనుచు స్వతంత్రుఁడై యున్న రాజు సుఖపడును.)

క. ఒక్కనివిఱివికినె దొర
లెక్కండ్రే నొక్కనొకనివెంబడి ననుఁగుల్
పెక్కండ్రు నిలువఁ బను లగుఁ
గక్కసము గుదింపఁ బెంపఁగాఁ గాకుండున్. 214

టీ. ఒక్కనివిఱివికిని = ఒకనికి విస్తరించియిచ్చుదానికే, దొరల్=ఉద్యోగస్థులు, పెక్కండ్రేని = అనేకులయినేని (అనఁగా నొకయధికార మనేకుల కిచ్చినప్పు డనుట,) ఒక్కనొకనివెంబడిన్ = వారిలో నొకనొకనివెంట, అనుఁగుల్ = వారివారి స్నేహితులు, పెక్కండ్రు = అనేకులు నిలువన్ = నిలిచియుండఁగా, పనులు = రాజకార్య

ములు, అగున్ = అనుకూలమగును, కుదింపన్ = తగ్గింపఁగా, కక్కసము = కఠినము, పెంపఁగాన్ = వృద్ధిసేయఁగాను, కక్కసము గాకుండున్ = కఠినము కాకయుండును.

క. ధనముఖ్యము కేవల మే
పనికిన్ రా దాప్త గలిగి పలువురు ప్రభువుల్
పనిసేయక తద్వశ్యం
బునకు నలోభానృశంస్యముల్ ఋతముఁ జెలుల్. 215

టీ. పలువురు=పెక్కండ్రైన, ప్రభువులు=గొప్పయుద్యోగస్థులు, పనిసేయక = ముందు నిలువంబడి శ్రద్ధతోఁ గార్యమొనర్పక, ధనముఖ్యము=ధనప్రాధాన్యము, కేవలము=ముఖ్యముగా, ఏపనికిన్ రాదు=ఏప్రయోజనమునకును రాదు, తద్వశ్యంబునకున్ = వారు స్వాధీను లౌటకు, అ...ల్ - అలోభ=లోభరాహిత్యమును, అనృశంస్యముల్ = క్రౌర్యరాహిత్యమును, ఋతమున్ = సత్యమును, చెలుల్ = స్నేహితులును, (ఉండవలయు నని యధ్యాహారము.)

తా. అనఁగా రాజునకు ధనముమాత్రముండి యుపయోగింపదు, గొప్పవారి సాహాయ్యమును ముఖ్యముగ నుండవలయును గాన, వారు స్వాధీను లగుటకై యౌదార్యమును, క్రౌర్యము లేకయు, సత్యప్రవర్తనమును గల్గి మిత్త్రులతోఁగూడి యుండవలయు ననుట

క. భాండాగారహయాద్యము
లుండియు ననువగుమనుష్యు లొదవమి నవియున్
మండలము నవయ నరి కొది
గుండిన సింహాసనంబు లుర్వి న్వినమే. 216

టీ. భాం...లు-భాండ=మూలధనముయొక్క, అగార=గృహమును, (బొక్కసమనుట.) ('స్యాద్భాండమశ్వాభరణే మంత్రే మూల వణిగ్ధనే' యని యమరము.) (ఇచట వణిగ్ధనము గాకుండినను మూలధనమాత్రమందే ప్రయోగము.) హయాద్యములు = గుఱ్ఱములుమొదలగునవి, ఉండియున్ = ఉండినను, అనువగుమనుష్యులు = తగిన మనుజులు, ఒదవమిన్ = లేనందువలనను, అవియున్ = ఆయర్థబలములురెండును, మండలమున్=రాష్ట్రమును, నవయన్ = నశించిపోఁగా, అరికిన్=శత్త్రువునకు, ఒదిగుండిన(?) = మూల వీగుచున్న, సింహాసనంబులు = వాని నధిష్ఠించురాజులను (అనఁగా సంస్థానముల ననుట), ఉర్విన్ = భూమియందు, విన మే = వినకున్నామా (అనఁగా నెవ్విధంబున నయినను మంచి మనుష్యులం గూర్చికొనియుంట యుక్త మనుట.)

తే. బాహుజాంఘ్రిజముఖవిడంబనకు నయినఁ
గొలిచి మనువిప్రధర్మంబుఁ దెలిసియైన
బూని సంకటముల నిల్చుఁగానఁ దఱుచు
బ్రాహ్మణునిఁ బ్రభుఁ జేయుట పతికి హితము. 217

టీ. బా...కున్ - అయినన్ - బాహుజ = క్షత్రియులును ('మూర్ధాభిషిక్తో రాజన్యో బాహుజః క్షత్రియోవిరా'ట్టని యమరము.) అంఘ్రిజ=శూద్రులును, ముఖ= మొదలగువారిని, విడంబనకున్ అయినన్ = అనుకరింపవలయునని యైనను, కొలిచి = పూర్వమందు రాజసేవయొనర్చి, మ...బున్-మను = కాలమును గడపి బ్రదుకుచున్న, విప్ర = బ్రాహ్మణులయొక్క, ధర్మంబున్ = ఆచారమును, తెలిసియైనన్ = గ్రహించి యైనను, అతఁడు = ఆవిప్రుఁడు, సంకటములన్ = ఇక్కట్టువేళలయందు, పూని = వహించుకొని, నిల్చున్ కానన్ = నిలువంబడుచున్నాఁడుగనుక, పతికిన్=రాజునకు, తఱచు=విస్తారముగా, బ్రాహ్మణునిన్ = విప్రుని, ప్రభున్ చేయుట=అధికారిగా నియమించుట, హితము = అనుకూలము.

ఉ. ఆయతి కాని కీడు మమరాలయముఖ్యము లాతఁ డర్థతృ
ష్ణాయుతుఁడై నిజోర్వి నగునట్టికిఁ దద్ధనముం దొరల్చి రా
జాయతనంబుఁ జేర్చు మఱియట్టి దపథ్యము దాన నొంటి గాఁ
డే యధికారి గావలయు నించుక తిన్నను వాఁడె రూపఱున్. 218

టీ. ఆయతి కానికిన్ = ధనమురాఁబట్టువానికి, అమరాలయముఖ్యములు=దేవాలయములు మొదలగువానిని, (అనఁగా దేవబ్రాహ్మణ జీవనాధికారముల ననుట.) ఈడుము = ఇయ్యకుము, అతఁడు = ఆయుద్యోగస్థుఁడును, అర్థతృష్ణాయుతుఁ డై = ద్రవ్యాశతోఁ గూడినవాఁడై, నిజోర్వినగునట్టికిన్=తానుద్యోగముఁ జేయునట్టి దేశమునందైన నష్టికి, తద్ధనమున్ = ఆదేవబ్రాహ్మణులయొక్క ద్రవ్యమును, దొరల్చి = హరించి, రాజాయతనంబున్ = నృపునియింటిని, చేర్చున్ = చేర్చును, మఱి = అనంతరమందు, అట్టిది= ఆదేవబ్రాహ్మణద్రవ్యప్రాప్తి, అపథ్యము కానన్ = రాజునకుఁ గీడుగావున, ఒంటిగాఁడె= ఒక్కఁడె, అధికారి కావలయున్ = ఉద్యోగస్థుఁడుగా నుండవలయును (దేవబ్రాహ్మణ ద్రవ్యలేశముగలసినను రాజునకుఁ బాతకముగాన నది కలియకుండున ట్లధికారిని వేఱుగా నేర్పఱచుట యుక్తము) ఇంచుక తిన్నను = అట్లు నియమింపఁ బడినవాఁడు కొంచెము భక్షించినను, వాఁడె = ఆదేవబ్రాహ్మణ వృత్త్యధికారియే, రూపఱున్ = నశించిపోవును.

చ. మును దనసీమ చేసికొని । ముల్లిడి గుద్దట వెండి చేనిమె
త్తనకయి వేరు వెల్లఁకియఁ । ద్రవ్వెడుకర్షకునట్లు శత్రుతో
నెనసియు నైన దుర్గబల । మేకొని యైన నిజాత్మ చింతలే
క నెగడఁజేసి లోన మఱి । కంటకశోధనఁ జేయు టొప్పగున్. 219

టీ. (రాజైనవాఁడు) మును=ప్రథమమందు, తనసీమచేసికొని=తన యావరణము కావించికొని, ముల్లిడి = చుట్టును గంచెవేసి, వెండి=మఱియును, గుద్దటన్=గుద్దలిచేత, చేనిమెత్తనకయి = వరిమొదలగునవి ఫలించునట్టి ప్రదేశమునయున్న మన్ను మృదువగుటకై, వేరు = వృక్షాదులమూలమును, వెల్లఁకియన్ = మోటును (జాత్యేకవచనము.) ద్ర...ట్లు-ద్రవ్వెడు=ఖననముచేయుచున్న, కర్షకునట్లు=కాఁపువానివలె, శత్రుతోన్=పగఱునితోడ, ఎనసియు నైనన్ = కపటస్నేహము చేసియైనను, దుర్గబలమే కొని యైనన్ = స్థలజలాది దుర్గములం గైకొనియైనను, తనసీమచేసికొని=రాష్ట్రము తన యధీనముచేసికొని, నిజాత్మ=తనహృదయమున, చింతలేక = పరునిచేత నుపద్రవము కలుగునను విచారములేక, నెగడఁజేసి = ఒప్పఁజేసి, లోనన్ = ఆరాజ్యమందు, మఱి=పిమ్మట, కంటకశోధనన్=క్షుద్రశత్రు నిరసనము, ('సూచ్యగ్రే క్షుద్రశత్రౌచ రోమహర్షేచ కంటకః' యని యమరము.) చేయుటొప్పగున్ = చేయుట యుక్తము.

క. మొదలనె యొఱుదలకానిం
జెదరంగా నాడ కాత్మఁ । జింతింపు పదిం
బదిగ మృష యేని మఱి విడు
ముదస్తుఁగాఁ గాక యుండ । నొక్కమతమునన్. 220

టీ. ఒఱుదలకానిన్=పిశునుని (కొండెగాని ననుట.) మొదలనే = ప్రథమమందే, చెదరంగాన్ ఆడక = కలఁతబడి పోవునట్టుచెప్పక, ఆత్మన్ = మనస్సునందు, పదింబదిగన్ = లెస్సగా (పదిపర్యాయము లనుట), చింతింపుము = విచారింపుము, మృష యేని = అబద్ధమాయెనా, మఱి = పిమ్మట, ఒక్కమతమునన్ = ఒకపక్షమునను, ఉదస్తుఁగాన్ కాక ఉండన్ = పరాభూతుండు గాకుండునట్లు, విడువుము = వదలుము.

తా. కొండెగాండ్రఁ దూలనాడిన రాజునకు రహస్య వృత్తాంతములు తెలియవు గనుక చెదరనాడఁగూడదు.

క. ధరణి నసాధ్యనగాటవు
లిరవుగ భూపీడ సేయు । నెఱుకుల పోరుగా
ల్లిరవుగ నస్థితిహూరుల
కిరవుగ నిచ్చునది మిథను । నెట్లయిన నురున్. 221

టీ. ధరణిన్ = భూమియందు, అ...లు-అసాధ్య = సాధింపనలవిగాని, నగ = కొండలును, అటవులు = అరణ్యములును, ఇరవుగన్ = టెంకిచేసికొని, భూ...ట్ల - భూపీడసేయు=భూమి కుపద్రవము చేయుచున్న, ఎఱుకుల=ఈపేరుగల నీచజాతివాండ్ర యొక్క, పొరుగూళ్లు=సమీపగ్రామములను, అ...కున్ - అస్థితి = స్థితిదప్పినటువంటి, శూరులకున్ = శౌర్యముగల పురుషులకు, (విదేశములనుండి స్థితిదప్పివచ్చిన శూరుల కనుట.) ఇరవుగన్ = ఉనికిపట్టుగా, ఎరవుగన్=మనోవృత్తికిగాను, ఇచ్చునది=ఇయ్యవలయును, మిథమున్=పరస్పరమును, ఎట్లయినన్ = స్పర్ధచేతనేలాగైనను, ఉరున్= మేలగును.

తా. ఇట్లొనర్చితివేని వైదేశికులైన శూరులు దెగినను మిగుల హాని లేదు, ఆటవికులు తెగిరేని యది మిక్కిలియు మేలౌను.

వ. విశేషించియు నప్పార్వతీయబలంబు లోనం గూడుకొన్న రాజునకుఁ బ్రజాబాధ దఱుఁగ దెట్లేని బెదరు వాపి వారలం జేకూర్చుకొనవలయు నవిశ్వాసంబును విశ్వాసంబును నలుకయు నెలమియు నతివైరంబును నత్యానుకూల్యంబును నల్పు లగుట నల్పంబునన యగు నెట్లంటేని. 222

టీ. విశేషించియున్ = మిగులఁగా, అపార్వతీయబలంబు=అయాటవికసేన, లోనన్ కూడుకొన్నన్=అడవిలోమెండైయుండెనా, రాజునకున్ = మండలాధిపతికి, ప్రజాబాధ తఱుగదు = జనపీడతక్కువపడదు (రాజునకుం దిరుగంబడి పోరు లేక వానిదేశమున కుపద్రవము చేయుచుందు రనుట), ఎట్లేనిన్=ఏలాగైనను, బెదరువాపి = జడుపుఁదీర్చి, వారలన్=ఆయాటవికులను, చేకూర్చుకొనవలయున్ = అనుకూలముచేసికొనవలయును, అవిశ్వాసంబును = నమ్మకపోవుటయును, విశ్వాసంబును = నమ్ముటయును, అలుకయున్ = కోపమును, ఎలమియున్ = ఆర్ద్రహృదయత్వమును, అతివైరంబున్ = అత్యంతవిరోధమును, అత్యానుకూల్యంబును = అత్యంతసహకారిత్వమును, అల్పులగుటన్ = తుచ్ఛజాతులగుటవలన, అల్పంబునన=స్వల్ప కార్యముచేతనే, అగున్ = కలుగును, ఎట్లంటేని = ఏవిధంబంటివా.

శా. విల్లుం దానును భిల్లుఁ డొక్కఁ డరుగ న్విం దింట దుగ్ధాన్నముల్
భిల్లుం డన్యుఁడు వెట్ట నార యుడుక న్వీక్షించి దొబ్బించు వాఁ
డెల్ల న్స్వమ్ముగఁ జేసి త న్ననుపరా నెందేఁ దెగం జూడఁగా
నుల్లంబై చన నంపు నార చెడు నా నూహించి పోనంపఁడే. 223

టీ. విల్లున్ దాల్చు = వింటినిధరియించు వాడు (విల్లుచేతఁబట్టి యనుట), భిల్లుఁ డొక్కఁడు = ఒక బోయవాఁడు, అరుగన్ = పోఁగా, భిల్లుఁడన్యుఁడు = మఱియొక బోయవాఁడు, ఇంటన్ = తనగృహమందు, దుగ్ధాన్నమున్ = పాలన్నమును, విందు= ప్రీతిపూర్వకమైనభోజనమును, పెట్టన్=ఇడఁగా, నార యందుక నీక్షించి=వానియింటి వానకి త్రాటికొఱకై ప్రాయిమీఁదఁ బక్వమగుచున్న పట్టతాటలపై నెట్టఁగా దొంగిననీటిని జూచి, దొబ్బఱించున్ = మాంస మని యెంచి, (ఇవి తనకుఁ బెట్టకపోయెఁగదా యని కొంచెపుఁబనిగా విచారించి కోపించి యనుట,) వాఁడు = అతఁడు, ఎల్లన్ = దీనినంత యును, వమ్ముఁగఁజేసి=వ్యర్థపఱిచి, తన్నునుపరాన్ = వాఁడు తన్నుసుపుటకొఱకుఁ గొంత దూరమురాఁగా, ఎందేన్ = ఎక్కడనైనను, తెగంజూడఁగాన్ = చంపఁదలఁపఁగా, ఉల్లంబై = మనస్సుగలవాఁడై, చననంపుము = పోనంపుము, నారచెదుసాన్ = ప్రాయి మీఁద నుడుకఁబెట్టివచ్చినత్వక్కు చిమిడిపోవుచున్నది వెళ్ళవలెననఁగా, ఊహించి = ఆ పిమ్మట నుడుకునది నారగాని మాంసముకాదని వితర్కించి, పోనంపఁడే=పోవునట్లు సెలవిచ్చి పంపఁడా, (చంపకయె పోనిచ్చె ననుట.) అల్పుల కతివైరాత్యానుకూల్యము లల్పకార్యములవలననే పుట్టుచున్న వనిభావము.

క. ఆపాలుగూటనె నిజ, మేపాటియుఁ దప్ప రాడి । రే నెరసునఁ గొం
తేపాటిగన్న నలుగుదు, రీపని యెంతనక వెడఁగు । టెద నాటవికుల్.

టీ. ఆటవికుల్ = భిల్లపుళిందాదులు, ఆ పాలుగూటనె = ఆ క్షీరాన్నముఁ బెట్టుటచేతనే, ఆడిరేన్=పలికిరా, నిజమేపాటియుఁ దప్పరు=తా మాడినయథార్థమైన పలుకు నెంతమాత్ర మతిక్రమింపరు, నెరసునన్ = తప్పిదము విషయమై, కొంత = కొంచెము, ఏపాటిగన్నన్ = ఏమాత్రము చూచినను, ఈపని=ఈకార్యము, ఎంతనక= ఎంతమాత్ర మని యెంచక, వెడఁగుటెదన్ = వెఱ్ఱిమనస్సుచేతను, అలుగుదురు = కోప గింతురు.

తా. బోయవాండ్రు మొదలగు నల్పజనులు కారణములఁబట్టి ప్రసాదనిగ్రహములు గలవారగుదురుగాని గొప్పకార్యములకుఁ దగినట్లు గొప్పఁగా యోజింపరు.

తే. ఆటవికవశ్యకలన సత్యమున వైరి
మనుజపతిమైత్రి దూతస । మ్మానమునను
గూర్మి దఱి భృతిఁ గాల్వుర । కును సపారి
తోషికపుసేవ నెలమి రా । తులకుఁ గలుగు. 225

టీ. ఆ...న-ఆటవిక=పుళిందాదులయొక్క, వశ్యకలన = స్వాధీనకరణము, సత్యమునన్ =యథార్థము వచించుటచేత, కలుగున్ = అగును, (సత్యవాక్యముననే వశ్య

లగుదు రనుట)వై...తి వైరి=శత్రువైన,మనుజపతి=నృపునియొక్క, మైత్రి=స్నేహము, దూతసమ్మానమునన్ = వారి రాయబారులను బహుమానించుటచేతను, కలుగన్ = సంభవించును, తఱిన్ = కోరిన సమయమందు, భృతిన్ = జీతమిచ్చుటచేతను, కాల్బ రకును = పదాతులకును, కూర్మి=మైత్రి, కలుగున్=సంభవించును, ('భృతిర్భరణమూల్య యోః' యని రత్నమాల.) సపారితోషికపుసేవన్ = బహుమానములతోఁగూడఁ గొలి పించుకొన్నందువల్లను, రాతులకున్ = అశ్వారోహకులకు, ఎలమి = సంతోషము, కలుగున్ = సంభవించును. (రాజైనవాఁడు సమయములనుబట్టి వారివారికిం దగినట్లు నడపింపవలయు ననుట.)

క. మే లగుఘోటకమును శుం
డాలంబును నాప్తసుభటు కనకె యిమ్ము తఱిన్
మే లగు మేఁపున మందురఁ
బాలింపుము దొరలపాలు పఱుపకు మెపుడున్. 226

టీ. తఱిన్=ఆయా సమయములయందు, మేలగుఘోటకమును = గొప్ప యశ్వ మును, శుండాలంబును = ఏనుఁగును, ఆ...ట-ఆప్త=ఇష్టుఁ డైన, సుభటునకె = మంచి రౌతునకె, ఇమ్ము=ఒసఁగుము, తఱిన్=సమయము వచ్చినపుడు, మందురన్=వాజిశాల యందు, ('వాజిశాలాతుమందురా' యని యమరము.) (ఇది గజశాలకు నుపలక్షణము.) మేలగుమేఁపునన్ = మంచి మేఁతచేత, పాలింపుము = సంరక్షింపుము, ఎపుడున్ = ఏ సమయమందును, దొరలపాలుపఱుపకుము = గొప్పయధికారులవశము చేయకుము.

తా. గజాశ్వాదులకు సుభరక్షణము చేయఁదలంచితివేని దానినొప్పి నెఱుంగక యారోహణముఁజేయునట్టి గొప్ప యుద్యోగస్థుల కధీనముచేయక యాప్తుఁ డైన బంటున కధీనము సేయుము. సమయము వచ్చినతఱి నీవు మే లగును

తే. కార్య మొక్కఁడు కనిన మా త్సర్యమున నొ
కండు గా దని ఖండించుఁ గ న్నెఱింగి
యిరువురను గా దనక కొల్వు విరిసి మీఁద
నల్లవాఁ డెన్నినది సేయ నగు శుభంబు. 227

టీ. ఒక్కఁడు = ప్రధానపురుషుఁడు, కార్యము = పనిని, కనినన్ = తెలిసి చెప్పఁగా, మాత్సర్యమునన్ = అట్లు చెప్పినవానిమీఁది ద్వేషముచేతను, ఒకండు = మఱియొకఁడు, కా దని ఖండించున్ = అతఁడు చెప్పినట్లు కా దని భంగపఱచును, కన్నెఱింగి = వారిద్దఱిలోని యాలోచనక్రమము నెఱిఁగి, ఇరువురను = అలాగునఁ జెప్పిన వారిద్దఱను, కా దనక = నిషేధింపక, కొల్వు విరిసి=సభ చాలించి, మీఁదన్=

పిమ్మటను, అల్లవాఁడు = మాత్సర్యములేక లోల్తహితముఁ జెప్పినవాఁడు, ఎన్నినది సేయన్ = విచారించిన కార్యమునే చేయఁగా, శుభంబు=మంగళము, అగున్=ఔను.

క. పగ వెలిఁ గని లోదస్యులఁ
చిగురింపఁగఁ జేసి నృపతి । చిక్కువడఁ బను
ల్దెగి సేయక తారే ది
క్కుగ నడతు రశంక నల్లి । కొని దుస్సచివుల్. 228

టీ. పగవెలిన్ కని=రాజునకు సమనంతరదేశమునందుండునట్టి విరోధుల నుండఁ జూచి, లోదస్యులన్=స్వరాష్ట్రమునందలి క్షుద్రశత్రువులను, ('దస్యుః శాత్రవశ్శత్రవః' యని యమరము.) చిగురింపఁగన్=పల్లవింపఁగా, చేసి=ఒనర్చి, నృపతి=రాజు, చిక్కుపడన్ = తమచేఁ జిక్కునట్లు, పనుల్ = రాచకార్యములను, తెగిచేయక = సాహసించి యొనర్పక, తారే దిక్కుగన్ = వేఱుమంత్రులులేక రాజునకుఁ దామే యాధారమగునట్లు, దుస్సచివుల్=దుష్టమంత్రులు, అశంకన్ = భయములేనట్లు, అల్లుకొని=కొందఱుఁ గట్టుకొని; (ఏకీభవించి యనుట.) నడతురు = ప్రవర్తింతురు, (కావున నట్టి దుర్మంత్రులు లేక యుండునట్లుగఁ బ్రభుత్వము సేయవలయును.)

క. ఇప్పింతు రాత్మవశులకుఁ
దప్పింతురు పరుల కాడి । తప్పింతురు రా
జిప్పగిదివాఁడె యని వే
చెప్పినఁ బెఱవారు నమ్మి । చేరక యుండన్. 229

టీ. ఆత్మవశులకున్ = తమకు స్వాధీనులై యుండువారలకు, ఇప్పింతురు = వలయు వస్తువుల నియ్యఁజేయుదురు, పరులకున్=తమ కనుబంధము లేనివారలకు, తప్పింతురు = ఇయ్యకుండునట్లు చేయుదురు, ఆడి తప్పింతురు=రాజు పలికినమాట దొలఁగునట్లుచేయుదురు, వే = వేయివిధములుగా, చెప్పినన్ = పలికినను, రాజు = ఱేఁడు, ఇప్పగిదివాఁడె యని = ఈలాగునఁజెప్పి తప్పెడువాఁడే యని, పెఱవారు=అన్యులెవ్వరును, నమ్మి = విశ్వసించి, చేరక యుండన్ = దగ్గఱవచ్చి చేరకుండునట్లు, రాజుచేత నాడి తప్పింతు రని క్రిందికన్వయము.

ఆ. వాఁడిఁ బొదలు జఠర । వైశ్వానరుఁడు కఫ
ప్రముఖదోషయుక్తి । బలిమిచెడిన
వెలి మహౌషధంబు । బలమిచ్చుగతిఁ బ్రతి
సేయ వారిమదముఁ । జెఱుచుఁ బగఱు, 230

టీ. వాఁడిన్ = తైక్ష్ణ్యముచేత, పా...డు-పాదలు=ప్రబలుండైన, జఠరవైశ్వానరుఁడు = ఉదరాగ్ని, కఫప్రముఖదోషయుక్తిన్ = శ్లేష్మాదిదోష సంబంధముచేత, బలిమిచెడినన్=సత్త్వహీనుఁడుకాఁగా, వెలిన్ = వెలుపలనున్న, మహౌషధంబు=శ్రేష్ఠమైనభైషజ్యము, బలమిచ్చుగతిన్ = జఠరాగ్నికి సత్త్వముగలుగఁజేయునట్లు, ప్రతిసేయన్ = బదులుగా నొకసమర్థుని నియమింపఁగా, పరుఁడు = ఆ యధికారమునకు వచ్చినపురుషుఁడు, వారిమదమున్ = ఆ దుర్మంత్రులయొక్క పొగరును, చెఱచున్ = అడఁచును. ఉపమాలంకారము.

వ. వారి మిగిలి ప్రతిసేయ నెట్లంటేని. 231

టీ. వారిన్ మిగిలి = పూర్వమునందున్న యామంత్రుల నతిక్రమించి, ప్రతిసేయను=ఏలాగున నితరపురుషునిఁదేవచ్చును. అంటేని = ఈలాగంటివా చెప్పెదను.

క. భండారముతో హయమద
శుండాలఘటాళి దనదు సొమ్మై పాగా
నుండిన నంతటఁ బాయదె
పండితుఁడును బిరుదునైన పతికిని బయలై. 232

టీ. భండారముతోన్ = బొక్కసముతోడను, హ...ళి - హయ = గుఱ్ఱముల యొక్కయు, మదశుండాల=మదపుటేనుఁగులయొక్కయు, ఘట=గుంపులయొక్కయు, ఆళి=వరుస, తనదుసొమ్మై = తనయధీన మై, పాగా నుండినన్ = కాలయం దుండఁగా, అంతటన్=అటుపిమ్మటను, పండితుఁడును = ఎఱుకగలవాఁడును, బిరుదు నైన=శూరుఁడు నైనటువంటి, పతికిన్ = రాజునకు, బయలై = దుర్మంత్రివ్యాపారము నివృత్తమై, పాయదె = పోదా, (పోవుననుట)

క. కుడుపున నొకకడి దఱిఁగినఁ
జెడఁ జూచుటె కాక పతికిఁ జెలియుం గలఁడే
యిడ నని విడువం జెల్లునె
నడపవలయు నేర్చినట్లు నమ్మకయె కృపన్. 233

టీ. కుడుపునన్ = భోజనమందు, ఒకకడి=ఒక్కకబళము, తఱిఁగినన్=తక్కువపడఁగా, చెడఁజూచుటెకాక = రాజునకుఁజెఱుపుతలంచువారేకాని, పతికిన్=రాజునకు, చెలియున్ = మిత్త్రుఁడును, కలఁడే = ఉన్నాఁడా, (లేఁ డనుట.) ఇడ నని = ఇట్టివీరులకుఁబెట్ట నని, విడువన్ = త్యజించుట, చెల్లునె=తగునా, (విడువం గూడదనుట.) నేర్చినట్లు = తగినయట్లు, నమ్మకయె = వారియందు మనంబున విశ్వాస ముంచకయే,

కృపన్ = దయచేతను, నడపవలయున్=పోషింపవలయును, (సేవకులకుఁ దక్కువపడ నట్లు పోషింపకున్న స్వప్రయోజనములు జరుగవుగానఁ జక్కఁగాఁ బోషింపవలయును.)

చ. ఒకటికి రోయకుంటఁ గను । మున్నవియుం ద్రుపదుండు మారణే
ష్టికిఁ బసిఁ జూపి వేఁడ ముని । సింహుఁ డొకండు తమన్న వేల్చుఁ బం
డొకఁ డపవిత్రభూమిఁ గని । యొల్లక యేఁ జనఁ దా గ్రహించె రో
య కనియెఁ గాన నట్లెఱుఁగ । నౌఁ జను సర్వముఁ గాన శక్యమే.

టీ. ఒకటికిన్ = ఒకయకృత్యమునకు, రోయకుంటన్ = అసహ్యపడకుండుట చేత, ఉన్నవియున్ = తక్కినవడవడికలను, కనుము = తెలిసికొనుము, ద్రుపదుండు= పాంచాలుఁడు, మారణేష్టికిన్ = హింసారూపమైన హోమమునకై, పసిన్ = పెక్కు గోవులను, చూపి = అగపఱిచి, వేఁడన్ = ఇచ్చెద నని ప్రార్థింపఁగా, మునిసింహుఁ డొకండు=ఉపయాజుఁడు అను మునిశ్రేష్ఠుం డొకండు, ('స్యురుత్తరపదే వ్యాఘ్రపుంగవర్షభకుంజరాః, సింహశార్దూలనాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః' యని యమరము.) తమన్న వేల్చున్=తమ జ్యేష్ఠభ్రాత యైన యాజుఁడు పాపకర్మ మనిరోయక హోమము సేయును అ దెట్లంటేని. పండొకఁడు = ఒకఫలమును, అపవిత్రభూమిన్=అపరిశుద్ధస్థలమందు, కని = పడియుండఁగాఁ జూచి, ఒల్లక = ఆఫలమును గ్రహింపక, ఏన్=నేను, చనన్ = ఆవలికిఁబోఁగా, తాన్ = మాయన్నయైన యాజుఁడు, రోయక=ఏవగింపక, గ్రహించెన్=పుచ్చుకొనెను, అనియెన్ కానన్=అలా గనెను గనుక, (అనఁగా ఫలాపేక్ష గలవాఁడుగనుక నాయనయొద్దకు దెళ్లిన మారణయజ్ఞము జేయించును గాన నచ్చటికి వెళ్లు మని ద్రుపదునితోఁ బల్కెను గనుక ననుట.) అట్లెఱుఁగ నౌన్ = స్థాలీపులాకన్యాయముచేత నట్లెఱుంగవలయును, చనుసర్వమున్ = జరగువానినన్నిటిని, కానన్=పరీక్షించిచూచుట, శక్యమె=సాధ్యమా. (కా దనుట.) అర్థాంతరన్యాసము.

క. వీఁ డెడరునఁ గీ డెన్నిన
వాఁడని జయమైన హింస । వదలి కొనుము శ్రీ
పోఁడి మహి యేమికొఱప
ల్వాఁడి చెడిన నట్టిదయకు । వైరియు నమ్మున్. 235

టీ. వీఁడు = ఈపురుషుఁడు, ఎడరునన్ = ఇక్కట్టుసమయమునందు, కీడు = అనిష్టమును, ఎన్నినవాఁ డని=తలంచినవాఁడని, (గూఢశత్రువును, తదవష్టబ్ధుండైన బలవద్విరోధియు ననుట.) జయమైనన్ = ఉపాయముచేత గెలిచినపిమ్మట, హింస వదలి = చంపఁదలఁక శ్రీ = ఐశ్వర్యముయొక్క, పోఁడిమి = అతిశయమును, కొనుము = హరిం

పుము, అహి = పాము, కొఱపల్వాడి సెడినన్ = పంటిక్రైక్ష్ణ్య మడంగినపిమ్మట, ఏమి కొఱ = ఏమిచేయఁగలదు? వైరియున్=శత్రువును, అట్టిదయనున్=అటువంటి విరోధిని జంపకవిడిచినకృపను, నమ్మున్ = విశ్వసించును, (హింసాపరుఁడు గాకుండెనేని శత్రువైనను నమ్మ ననుట.) దృష్టాంతాలంకారము.

తే. దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల
మిల యొకింతైన గుంట కాల్వలు రచించి
నయము పేదకు నరిఁ గోరుననునొసంగి
ప్రబలఁ జేసిన నర్థ ధర్మములు పెరుఁగు. 236

టీ. దేశవైశాల్యము - దేశ = రాష్ట్రముయొక్క, వైశాల్యము = విస్తారగల్గుట, అర్థసిద్ధికిన్ = ధనాదాయమునకు, మూలము = హేతువు, ఇల యొకింతైనన్=(అట్లు విస్తారముగాక) భూమికొంచెమైనను, గుంట = తటాకములు, కాల్వలు = పంటకాలువలు, రచించి = కలుగఁజేసి, పేదకున్=దరిద్రుఁడైన కాపువానికి, అరిన్=పన్నునందును, కోరునను = వారకమందును, నయము = మేలు, ఒసంగి=కలుగఁజేసి, ప్రబలన్= వృద్ధిపొందునట్లు, చేసినన్=ఒనర్చినట్లాయెనా, అర్థధర్మములు=ధర్మార్థములు, పెరుఁగున్ = వృద్ధినొందును.

తే. ప్రజ లవిసి చన్నఁ బిలువక పసులఁ గొలుచు
నమ్మి యిండ్లింధనంబునకాయె ననెడు
కలని నక్కైన యధికారి గలన్నృపతికి
నేడుదీవులు గొన్న సమృద్ధి లేదు. 237

టీ. ప్రజలు = తనరాష్ట్రమునందలిజనులు, అవిసి = నొగిలి, చన్నన్ = లేచి పోఁగా, పిలువక = మరలవారిని నోదంబఱచి వెంటఁబెట్టుకొనిరాక, అప్పసులన్ = వారి పశువులను, కొలుచున్ = ధాన్యమును, అమ్మి=విక్రయించి, ఇండ్లు = వారిగృహములు, ఇంధనంబుల కాయెన్ = వంటచెఱకున కొదిగెను, అనెడు=అనునట్టి, కలనినక్కయైన = పొలిలోని జంబుకమువలె నశుభమును గోరుచున్న, అధికారిగల = ఉద్యోగస్థుఁడు గల్గినట్టి, నృపతికిన్ = రాజునకు, ఏడుదీవులు = సప్తద్వీపములను, కొన్నన్ = గ్రహించినప్పటికిని, సమృద్ధి లేదు = సంపద చేకూరదు. లోకోక్త్యలంకారము.

మహాస్రగ్ధర

ఉర వాచాగంబు భోగంబు భయము నొకపాలుగ్రసేవావనార్థం
బిరువాల్నిండారుబండారిలు నొక నొకపాలిట్లుగా నాయ మొప్పం

చరదృష్టిఁ వైరిపక్షేక్షణము సచివముఖ్యస్వపక్షేక్షణంబుఁ
ధరణీనాథుం డొనర్పందగుఁ దగు దునుమందస్కరాళిన్నిజోర్విన్.

టీ. రాజు తనకువచ్చునట్టి యాయతిని నాలుగుపాళ్లుచేసి, ఉరవు = అధికము, ఔ చాగంబు=ఐనత్యాగమును, (ఇది త్యాగశబ్దభవము.) భోగంబు=స్వానుభవమును, ఉభయమున్ = రెంటికిని, ఒకపాలు = ఒకభాగము, ఉ...బు-ఉగ్ర = ప్రతాపశాలియైన, సేనా = చతురంగబలముయొక్క, అవనార్థంబు = రక్షణముకొఱకు, ఇరువాల్= రెండుభాగములును, నిం...లు-నిండారు = సంపూర్ణ మయి, బండారిలు = కోశాగారమును, చొరన్ = ప్రవేశించుటకై, ఒకపాలు=ఒకభాగమును, ఇట్లుగాన్=ఈచతుష్ప్రకారములుగా, ఆయముఒప్పన్ = అర్థాగమమేర్పడియుండఁగా, ('అర్థాగమో భవేదాయ' యని యమరము.) చరదృష్టిన్=చారు లనియెడు నేత్రముచేత, ('అపసర్పశ్చరస్ప్రశః, చారశ్చగూఢపురుషః' యని యమరము.) వైరిపక్షేక్షణమును=శత్రుపార్శ్వదర్శనమును, సచివముఖ్య = మంత్రులు మొదలగు, స్వపక్ష ఈక్షణంబున్=తనపక్షము వారిని చూచుటయును, (శుచి శస్తస్వపక్షేక్షణంబున్ అనుపాఠమున పరిశుద్ధులయిన మంత్రులలో నగు స్వపక్ష జనదర్శనమును) ధరణీనాథుండు=రాజు, ఒనర్పన్ తగున్= చేయఁదగును, నిజోర్విన్=తనరాజ్యమునందు, తస్కరాళిన్ = దొంగలగుంపును, దును మందగున్ = చంపుట యోగ్యమగును.

క. లాలన నారక్షులగమి
నేలి తెలిసి మ్రుచ్చు నాజ్ఞయిడక తఱచు చెఱం
బోలఁతి నిడ నయశ మెం
తే లేవదె శూలపృథువణిఙ్న్యాయమునన్. 231

టీ. లాలనన్ = బహుమానముచేత, ఆరక్షులగమిన్ = తలవరులగుంపును, ఏలి= పోషించి, తెలిసి = ఎఱిఁగి, మ్రుచ్చున్ = దొంగను, ఆజ్ఞయిడక = వెంటనే శిక్షింపక, చెఱన్ = బందిఖానాలోనుండి, అతఁడు = ఆదొంగ, పోన్=పాఱిపోఁగా, లాఁతిన్ ఇడన్=వాఁడుపలాయితుఁడైనందునఁ దలవరులు తమకాజ్ఞ వచ్చునని యన్యునిం దెచ్చి చూచెఱసాలలో నుంచఁగా, శూలపృథువణిఙ్న్యాయమునన్=కొఱ్ఱునవేయఁబడిన పెద్ద కోమటిసెట్టి న్యాయ్యమువలె, అయశ మెంతే లేవదె = అపకీర్తి యధికమురాదా, (వచ్చు ననుట.) ఆదెట్లన, నపరాధముఁజేసినవానిం గొఱ్ఱునవేయుమనట్లొక వివేకములేని రాజాజ్ఞచేయఁగాఁ, గొఱ్ఱునవేయునవసరంబునఁ బెద్దకొఱ్ఱున సన్నపాటియపరాధిని వేయునెడఁ దగియుండదని అని చూడవచ్చిన యా పెద్దకోమటిసెట్టి తగియున్నాఁ డని యొకండు చెప్పఁగా, యుక్త మని యెంచి యట్లుపెద్దసెట్టినే కొఱ్ఱునవేయించినరాజున

కొంత యపకీర్తిగలిగెనో యంత యపకీర్తి గల్గు ననుట. దీనిని శూలపృథువణిఙ్న్యాయ మందురు. ఉపమాలంకారము.

చ. ఎఱుఁగ నగున్ స్వశక్తి నవనీశుఁడు నాలుగుపాళ్ల మూఁడుపా
ళ్లెఱుఁగక మోచినట్టిపని కిష్టసుహృత్తతి దెల్ప నొక్కపా
లెఱుఁగ నగు న్నయాఢ్యమతి నిట్లు నిరాగ్రహుఁడైనఁ జేయునె
త్తఱి విపదుగ్రదండపరతంత్రుఁడు గాక చిరంబు రాజ్యమున్. 240

టీ. అవనీశుఁడు = రాజు, నాలుగుపాళ్ళన్ = తెలియందగిన నాలుగంశముల యందు, స్వశక్తిన్ = తన సామర్థ్యముచేత, మూఁడుపాళ్లు=మూఁడంశములను, ఎఱుఁగ నగున్ = తెలియఁదగును, ఎఱుఁగక మోచినట్టిపనికిన్ = ఎఱుకపడనట్లు దాఁచియుంచిన విషయమునకు, ఇష్ట = ఆప్తులైన, సుహృత్తతి = మిత్రబృందము, తెల్పన్ = ఎఱుక చేయఁగా, ఒక్కపాలు = ఆయొకభాగమును, ఎఱుఁగ నగున్ = తెలిసికొనవలయును, నయాఢ్యమతిన్=నీతియుక్తమైన బుద్ధిచేత, ఇట్లు = ఉక్తప్రకారముగా, నిరాగ్రహుఁడైనన్ = కోపములేనివాఁడాయెనా, ఎత్తఱిన్ = ఏసమయమునందును, వి...డుగాక= విపత్=తనకుఁ గల్గినయాపదకును, ఉగ్రదండ=అపరాధులవిషయమైన భయంకరం బగు దండమునకును, పరతంత్రుఁడుగాక=అధీనుఁడుగాక (క్రూరదండము సేయక యనుట.), చిరంబు = బహుకాలము, రాజ్యమున్ = దొరతనము, చేయున్ = ఒనర్చును.

తే. కన్నొకటి నిద్రవోఁ బెఱకంట జాగ
రంబు గావించు భూరుహాగ్రంబుమీఁది
యచ్ఛభల్లంబుగతి భోగ మనుభవించు
నెడను బహిరంతరరులపై దృష్టివలయు. 241

టీ. కన్నొకటి=ఒకనేత్రము, నిద్రవోన్=నిదురింపఁగా, పెఱకంటన్=రెండవ నేత్రముచేత, జాగరంబు గావించు=మేలుకొన్నటువంటి, భూరుహాగ్రంబుమీఁది = చెట్టుయొక్కకొసనున్న, అచ్ఛభల్లంబుగతిన్=భల్లూకమువలె, ('ఋక్షాచ్ఛభల్లభల్లూకాః' యని యమరము.) భోగ మనుభవించునెడను = రాజ్యసుఖానుభవముఁ జేయునప్పుడు, బ...పైన్ - బహిరంతః=బాహ్యాంతరములయం దున్న, అరులపైన్ = శత్రులమీఁద, దృష్టివలయున్ = చూపు నుంచవలయును.

ఉ. అక్షరపక్షపాతమున నర్థము నూళ్ల నొసంగ నుబ్బునన్
భిక్షుజటాధరాదికులు భిన్ననిజవ్రతు లౌదు రైన దు

ర్భిక్షరుజా శిశుచ్యుతులు । పెక్కగు భక్తియ చాలు దానఁ ద
త్ప్రత్యభిభిత్వ మేయఘము । దార్పదు శంకఁ దలంగు మిట్యెడన్.

టీ. అ...నర్ - అక్షర = నాశము నొందని, (విద్యాపరముగా నైనఁ జెప్పవచ్చును.) పక్షపాతమునర్ = దాక్షిణ్యముచేత, (చెడనియనుగ్రహముచేత ననుట. అక్షరముఁ జదివియున్నా రన్న పక్షపాతముచేత ననియుం జెప్పవచ్చును.) అర్థముర్ = ధనమును, ఊళ్లర్ = గ్రామములను, ఒసంగర్ = ఈయఁగా, ఉబ్బునర్ = పొగరుచేతను, భి...లు - భిక్షు = సన్న్యాసులు, జటాధర = జడలు ధరించినవారును, ఆదికులు = లోనగువారు, భిన్ననిజవ్రతు లౌదురు = నియమభ్రంశముగలవారౌదురు, ఐనర్ = అట్లగుటవలన, దు...లు - దుర్భిక్ష = క్షామమును, రుజా = ముక్కడి మొదలగు వ్యాధులును, శిశుచ్యుతులు = బాలారిష్టములును, పెక్కగుర్ = విస్తరిల్లియుండును, భక్తియ చాలుర్ = వారిపట్లఁ బూజ్యానురాగమే చాలును, దానర్ = ఆ యర్థగ్రామాదుల నియ్యనందున, (అగు) తత్ ప్రత్యభిభిత్వము = అగు నాసన్న్యాసులు మొదలగువారు క్షోభపడుట, ఏయఘముర్ = ఏ పాపమును, తార్పదు = రాజును బొందింపదు? ఇట్యెడర్ = ఈపట్ల, శంకర్ = భయములు, తలంగుము = విడువుము ('శంకావితర్క భయయోః' యని యమరము.)

క. వినువారత్రయవిజ్ఞాపన । కోర్వుము వధ్యకోటి । పట్టునఁ జెదరం
దన కప్పుడె కీడగు నను, జనముం బట్టుటకు మునుప । శస్త్రమ చాలున్.

టీ. విను = ఈ చెప్పెడిహితము వినుము. వధ్యకోటిపట్టునర్ = చంపఁ దగిన ప్రజలపట్లను, వా...కుర్ - వారత్రయ = మూఁడుమాఱులు, విజ్ఞాపనకుర్ = విన్నపమునకు, ఓర్వుము = సహించుకొనుము. (మూఁడు నేరములను గావు మనుట.) చెదరర్ = వాఁడు దప్పించికొనివెళ్లినా, తనకుర్ = రాజునకు, అప్పుడె = విడువఁగానే, కీడు = అనిష్టము, అగునను = సంభవించునని తోఁచెడు, జనముర్ = మనుష్యులను, పట్టుటకుర్ = పట్టుకొనివచ్చుటకు, మునుప = ముందె, శస్త్రమ = శస్త్రమె, చాలుర్ = పర్యాప్తము.

తా. పట్టుబడిన శత్రువును విడిచిపెట్టిన హానికర మని తోఁచెనా యప్పుడ హతునిం గావింపుము.

క. ఘోరాలాపములకు నతి
ఘోరుఁడు [1]దా నయ్యు నృపతి । సోఁకోర్వఁ దగు
న్వా రుబ్బుదు రందున నిజ
ఘోరత దొరలంపఁ గనుట । సూ కార్య మిలన్. 244

1. దానైనపతియుఁ జోఁకోర్వఁదగున్.

టీ. నృపతి=రాజు, తాను అతికారుఁడుఅయ్యుక్=మిగులఁ బరాక్రమవంతుఁడై నప్పటికిని, కూరాలాపములకుక్=వీరుఁడాడెడి శౌర్యవాక్యములకు, చోఁకు=తగులు, ఓర్వఁదగుక్ = కూరాలాపశ్రవణజన్యమైన యహంకృతి సహించి యుండఁదగును, అందునక్ = అట్లోర్చి వినుటవలన, వారు = ఆకూరులు, ఉబ్బుదురు=ఉత్సాహమును విదువరు, ఇలక్=భూమియందు, నిజకూరతక్ = స్వీయకూరత్వమును, దొరలందుక్= తనకు సరియైన ప్రభువులందు, కనుట = చూచుట, కార్యమునూ = యుక్తమునుమీ. (అనఁగాఁ దనభటుల కూరాలాపంబుల నోర్వవలయు ననుట.)

శా. రేవు ల్మావు మతంగజంబులు మణిశ్రీఖండముక్తాదియుక్
రా వాణిజ్యము పెంచి యేలఁగ నగు । న్వర్షంపుటెవ్వక్ రుజక్
హావళ్లం దిగు నన్యభూప్రజలరా । జాయాయిజాత్యోచితిక్
బ్రోవంగాఁ దగుఁదోఁట దొడ్డిగను లా । ప్తు ల్చూడఁ బంపం దగున్.

టీ. రేవుల్=ఓడలుదిగునట్టి కరవాకపట్టణములందె, (సప్తమ్యర్థమందుఁ బ్రథమ.) మా...లు - మావు = అశ్వములును, మతంగజంబులు = ఏనుఁగులును, మణి=రత్నములును, శ్రీ...ల్-శ్రీఖండ = చందనము మొదలగు పరిమళద్రవ్యములును, ముక్తాదియంక్ = ముత్యములు మొదలగునవియును, రాక్=వచ్చునట్లుగా, వాణిజ్యముపెంచి= బేరముపెంపుసేసి, ఏలఁగనగుక్ = పాలింపవలయును, వర్షంపుటెవ్వక్=క్షామముచేత, రుజక్ = రోగములచేతను, హావళ్ళక్ = ఉపద్రవముచేతను, దిగు = చేరినటువంటి, అన్యభూప్రజలక్ = దేశాంతరప్రజములను, రాజు=ప్రభువు, ఆయాయిజాత్యోచితిక్= వారివారి కులములకుఁ దగినట్లుగా, ప్రోవంగాక్ తగుక్ = రక్షింపవలయును, తోఁట = ఉద్యానవనములు, దొడ్డి = పశువులమందలు, గనులు = రత్నములుండు నాకరములును, ఆప్తుల్ = తనకు హితముఁగోరుచున్నవారు, చూడఁబంపందగుక్=పరామర్శ చేయుటకై పంపుట యుక్తము.

తా. సముద్రతీరమునమండు పట్టణములకుఁ దురంగగజమణి శ్రీఖండాదులు వచ్చునట్లు వర్తకము వృద్ధిఁజేయించి యొదలలోని సరకులు సులభముగా దిగునట్లుగా నవతరణమార్గంబులం గాపాడవలయును.

ఆ. హదను వచ్చుదాఁక । నపరాధిపై రోష
మాఁగి చెఱుపవలయు । హదను వేచి
లక్ష్యసిద్ధిదాఁక । లావున శర మాఁగి
కాఁడ విడుచు వింటి । వాఁడువోలె.

టీ. పదనువచ్చుదాఁకన్ = తనకు సమయమువచ్చువఱకును, అపరాధిపైన్ = తప్పుచేసినవానిమీఁద, రోషమున్ = కోపమును, అఁగి = అడంచికొని, పదను = సమయమును, వేచి=కనిపెట్టి, లక్ష్యసిద్ధిదాఁకన్ = గుఱి తనకు లోనయ్యెడు పర్యంతము, లావునన్ = తనబలిమిచేతను, శరమాఁగి = బాణము నాకర్షించిపట్టి, కాఁడవిడుచు = బాణమును దిగఁబడునట్లు వదలుచున్న, వింటివాఁడువోలెన్ = ధానుష్కునివలె, చెఱుపవలయున్ = నిగ్రహింపవలయును. ఉపమ.

శా. పోవం బోలు లఘుప్రయాణము దినం । బు ల్గొన్ని యొండొంటనే
కావైరిక్షితి కంబువు ల్వెనుకఁ ద రాఁ । గా నిల్చు జాలుంబలెం
ద్రోవన్ సైన్యము గూడ వైరిబలసాం । ద్రుం డైనఁ బూజాదులం
బోవం బోలుఁ జరోక్తిచేత నసదేఁ । బో కావరింపం దగున్. 247

టీ. (రాజు) కావైరిక్షితికిన్ = కుత్సితశత్రునియొక్క భూమికి, లఘుప్రయాణము = కొంచెపుపైనములుగ, దినంబుల్గొన్ని = కొన్నిదినములు, ఒండొంటనే = ఒకటొకటిగా, అంబువుల్ = ఉదకములు, వెనుకఁదరాఁగా = వెంబడిరాఁగా, నిల్చుజాలుంబలెన్ = ముందుపోవుచున్న కొంచెము నీళ్లు వెనుక మొందుగవచ్చునీళ్లు కూడువఱకు నిలుచుచందమున, త్రోవన్ = మార్గమందు, సైన్యము కూడన్ = తనసేన కలిసికొను పర్యంతము, పోవంబోలున్ = వెళ్ళఁదగును, వైరి = ఆశత్రువు, బలసాంద్రుం డైనన్ = బలవంతుఁడాయెనా, పూజాదులన్ = వారుసేయునట్టి యుపచారములకే, పోవం బోలున్=మళ్లికొని వెళ్ళవలెను, చరోక్తిచేతన్ = వేగులవారివేగుచేతను, అసదేన్ = వాఁడు అల్పుఁడని వినఁబడెనా, పోక = వెనుకకు మళ్ళక, ఆవరింపందగున్=చుట్టుకొనవలయును. ఉపమ.

చ. ద్రవిణము నొవ్వఁగొంట నొ । ఱ ద్రాబలతో నిడుచుంట భూమిగొం
తవలికి నిచ్చుచుంట ప్రథ । మాప్తతఁ జూడక శంక నుంట లోఁ
బొవయు నృపాళికై యభయ । ము న్మణిభూషలు గుప్తిఁ బంపి భూ
ధనుఁ డరియం దిడందగు భి । దం దనయం దివి మాన్పుకోఁదగున్.

టీ. ద్రవిణము=ధనమును, నొవ్వన్ కొంట = తనరాజ్యమందలి ప్రజలునొచ్చునట్లు పుచ్చుకొనుటయును, ('హిరణ్యం ద్రవిణం ద్యుమ్న' మ్మని యమరము.) ఒఱన్ = ఆలోచనను, ద్రాబలతోన్=పాదలతోడ, ఇడుచుంటన్=చేయుచుండుటయును, భూమి కొంత=కొంతదేశమును, అవలికిన్ = వెలుపలికి, ఇచ్చుచుంట = ఒసంగుచుండుటయును, (శత్రువులు బలాత్కరించి తనభూమి నాక్రమింపఁగా; మంచి పని యని సమ్మతించి

యుండుట యనుట. ఈమూఁడు రాజదోషములను), ప్రథమాప్తతన్ = ముఖ్యముగా నిష్ఠురాటను, చూడక = విచారింపక, శంకనుంటన్ = అహితముఁజేయునన్న సంశయములో నుండుటచేత, లోన్=లోపల, పొవయు = పొగరాఁజుచున్నట్టి, నృపాళికై = శత్రువునొద్దనుండు రాజులకొఱకు, అభమున్ = అభయదానమును, మణి = రత్నములను, భూషలు=ఆభరణములను, గుప్తిన్ = రహస్యముగా, పంపి=అనిపి, భూధవుఁడు = రాజు, భిదన్ = భేదోపాయముచేతను, అరియం దిడం దగున్ = శత్రువునందుండఁదగును, ఇవి = ఈచెప్పఁబడిన మూఁడు రాజదోషములు, తనయందున్ మాన్పఁగోఁదగున్=తనయొద్ద లేకుండఁజేసికొనవలయును.

తా. శత్రురాజు తనకుఁ బరమాప్తులయిన సామంతరాజులయం దపనమ్మకపడఁగా నందుచేత వారు లోపల దుఃఖించుచుండు సమయమున, వారి కభయదానముచేసి, మణిభూషాదు లిచ్చి, భేదపఱచి, శత్రురా జతనిరాజ్యమునందలి ప్రజలు నొచ్చునట్లు పన్ను పుచ్చుకొనుకొలాగున దుష్టులతో నాలోచించునట్లును, వైరులు దనభూమి నాక్రమించుకొన్నప్పుడు సోమరితనముననో కయ్యమునకు వెఱచియో కొంతభాగము నిచ్చులాగునను జేయుచు, దన రాష్ట్రమునందు నివి పుట్టకుండునట్లు విచారించుకొనుచుండవలయును.

క. అహితుఁడు వేఁడిన నేలెడు
మహి సగమే నిచ్చి తెగనిమైత్రి గొని విభుం
డహిభయము మాన్పఁగోఁ దగు
నహిభయ మహిభయముకంటె నధికము గాదే 249

టీ. అహితుఁడు = శత్రువు, వేఁడినన్ = అడిగినచో, ఏలెడు మహిన్=తాను రాజ్యముఁజేయుచున్నట్టి భూమిని, సగముఇచ్చియున్=అర్ధమిచ్చియైనను, తెగనిమైత్రి గొని = విడువని స్నేహము సంపాదించి, విభుఁడు=రాజైనవాఁడు, అహిభయమున్ = స్వపక్షభీతిని, మాన్పఁగోఁదగున్ = నివారించుకొనఁదగును, ('మహీభుజా మహిభయం స్వపక్షప్రభవం భయ' మ్మని యమరము.) అహిభయము = స్వచక్రభీతి, అహిభయము కంటెన్ = సర్పభీతికంటెను, అధికముగాదే = అతిశయముకాదా.

తా. రాజులు స్వపక్షమువలననే భయమువచ్చునప్పుడు పగవానికైనను బ్రియము చెప్పి యతఁడు సగమురాజ్యము గోరిన నిచ్చి స్వపక్ష భయమును మాపుకొనవలయును.)

చ. పలుకులు వేయు నేమిటికిఁ బార్థివుఁ డాత్మ భుజాభృతక్షమా
తలమున గుట్టుఁబేసు బహుళధా యరయించి యడంచి చంచలా
త్ములగమిలో మెలంగుపురుషుండును బోలె నశంక నించుచున్
మెలఁగఁడ యేని రాజ్యఫలమే యది రాజ్యము దుఃఖలబ్ధికే. 250

టీ. పలుకులు=మాటలు, వేయునేమిటికిన్ = వేయియేందులకు, పార్థివుఁడు = రాజు, ఆ...నన్-ఆత్మభుజా=తన బాహువుచేతను, భృత=వహింపఁబడిన, ('దోర్దోపాచ భుజ' యని ద్విరూపకోశము.) క్ష్మాతలమునన్=భూతలమందు, గుట్టుఁబేదు = గూఢశత్రువును (తన రహస్యమును బయలుపఱచువాఁ డనుట) (వియోగినీ సముత్కారముల కీడు చూచుటకు దర్పణరేఁపెదు కుట్టు పేదని వారాహప్రయోగము) బహుధా = అనేక ప్రకారములచేత, అరయించి = వెదకించి, (తెలిసి యనుట.) అడంచి = అడఁచివేసి, చంచలాక్షులగమిలోన్ = స్త్రీసంఘములోపల, మె...లెన్ - మెలంగు = సంచరించుచున్న, పురుషుండునుదోలెన్=నరునిచందంబున, (స్త్రీలసమక్షమునందుఁ బురుషుండేలాగున నిర్భయుండై యుండునో యట్లనుట.) అశంకనించుచున్ = నిర్భయముఁజేసికొనుచు, మెలఁగఁడయేని = సంచరింపకపోయెనా, అది=అట్లుంట, రాజ్యఫలమే= దొరతనముఁ జెల్లించుటకుఁ బ్రయోజనమా, రాజ్యము = దొరతనము, దుఃఖలబ్ధికే = అసుఖప్రాప్తి కొఱకు (కనుక లోపల నహిత మాచరించువారిని మట్టుఁబెట్టవలయును.)

తే. బెదరి చేరనిబలియుని ♦ బిగియఁ బట్ట
కతనిమైవడినే వచ్చి ♦ హత్తఁ జేత
క్రమము పెనఁగెడుబలుమీను ♦ త్రాటఁ జేఁదు
నొడ్డుగాలంపువేఁటకాఁ ♦ డుపమ గాఁడె. 251

టీ. బెదరి=ఉలికి, చేరనిబలియుని = దేశమునకు రాకయున్న ప్రబలశత్రువును, బిగియఁబట్టక = శ్రమపడి నిగ్రహింపక, అతనిమైవడినేవచ్చి=తనకుఁ దానేవచ్చి, హత్తఁజేత=తనకుఁ బట్టువడులాగునఁజేయుట, క్రమము = యుక్తము, పె...ను-పెనఁగెడు= లాగులాడుచున్న, బలుమీను = గొప్పమత్స్యమును, త్రాటన్ = త్రాటిచేత, చేఁదు = చేఁదుచున్నటువంటి, ఒడ్డుగాలంపువేటకాఁడు = గట్టుననున్నట్టి బడిశధారియగు లుబ్ధకుఁడు, (గాలమును మత్స్యము పట్టఁగానే వడిలోలాగిన నాసూత్రము తెగును గాన నట్లు గాకుండ లాగుచును వదలుచును మెల్లఁగాఁ జేఁదుకొనుచున్న బడిశధారి యనుట.) ఉపమగాఁడే=దృష్టాంతముగాఁడా. (కావున నెట్టికార్యము నైనను నేర్పుతో సాధింపవలయు ననుట.)

సీ. దండపారుష్యంబు ♦ కొండెంబున నతర్క-
మఱిసంధి కెడయీక ♦ మరలఁబడుట
యవలితప్పెన్నికకన్న విదేశ్యుఁ జెఱచుట
ప్రతిప్రవర్తకున ♦ కేర్పడఁగఁ జేత

జనునవిశ్వాసంబు § గనుఁగొని మెలఁగుట
విశ్వసనీయుల § వేర్పఱచుట
మోమోట మంత్రంబుఁ జొ మిక్కిలిడుకొంట
మంత్రభేత్తకు నాజ్ఞ § మఱచియుంట
తే. వింత పుట్టినఁ గనుగల్గి § చింతసేయ
కుంట మాన్యులపట్టున § నొక్క చూపె
చూడకుంట విహీనులఁ § గూడుకొంట
వ్యసని యైయుంట చలముంట § వలదు పతికి. 253

టీ. దండపారుష్యంబు = కఠినశిక్షయు, కొండెంబునన్ = పైశున్యమందు, అత ర్క్యము = చర్చచేసి పరీక్షింపకుండుటయు, అరి=శత్రునితోడ, సంధికిన్ = సమాధాన పడుటకు, ఎడయీక = సందీయక, మరలఁబడుట=తిరుగుబాటగుటయు, అవలితప్పెన్ని కన్న = దేశాంతరమందుండి తన కక్కడి స్వామిచేసిన యపరాధమునెంచి తన్ను నమ్మి చూడవచ్చిన, విదేశ్యున్=వైదేశికుని, చెఱచుట = చెడగొట్టుట, ప్రతిప్రవర్తకునకున్= ప్రతికూలుఁడైన ప్రధానికి ఏర్పడఁగన్=తేటపడునట్లు, చేఁత=ఆలోచనసేయుటయు, జనునవిశ్వాసంబున్=ప్రజనుఁగల యప్రీతిని, కనుఁగొని=తెలిసికొని, మెలఁగుట=వారితోఁ గూడియుంటయు, విశ్వసనీయులన్ = నమ్మఁదగినవారలను, వేర్పఱచుట = భేదబుద్ధిచే దూరమున నుంచుటయు, మోమోటన్ = ముఖప్రీతిచేత, మంత్రంబుచోన్ = ఆలోచించు స్థలమందు, మిక్కిలిడుకొంట=ఆలోచనకుఁ దగనివారినిఁ జేర్చుకొనుటయును, మంత్రభేత్తకున్ = ఆలోచన వెల్లడిచేసిన పురుషునకు, ఆజ్ఞ=శిక్షవిధించుటకు, మఱచి యుంట=విస్మరించియుండుటయు, వింతపుట్టినన్=ఉత్పాతములు జనింపఁగా, కనుగల్గి= మెలఁకువగలవాఁడై, చింతసేయకుంట=వానికిఁ బ్రతిగావింప నాలోచింపకుండుటయు, మాన్యులపట్టునన్=పూజ్యులవిషయమై, ఒక్కచూపె = ఏకరీతిగా, చూడకుంట=పూజ సేయకుండుటయు, హీనులన్=దుష్టులతోడ, కూడుకొంట = సహవాసముఁ జేయుటయు, వ్యసని యైయుంట=స్త్రీ ద్యూతమృగయాదిచింతలు గలవాఁడై యుండుటయు, చల ముంట = పట్టుదల కలిగియుండుటయును (అనఁగా మాత్సర్యముకలిమి యనుట) పతికిన్ = రాజునకు, వలదు = కూడదు.

తా. రాజైనవానికి నీపద్యమునందుఁ జెప్పంబడియున్న దండపారుష్యాది దుర్గుణ ములు లేకయుండెనేని చిరకాలము రాజ్యసుఖ మనుభవించుచుండును.

క. త్రివిధోత్పాతము లొదవిన, నవనివిభుఁడువిడువవలయు § నధిక ద్రవ్యం
బవనీసురముఖసురముఖ,పవనసఖముఖముల భుక్తి § బలిహోమవిధిన్.

టీ. త్రివిధోత్పాతములు=దివ్యభౌమాంతరిక్షము లనియెడు మూఁడు తెఱంగులై తెలియవచ్చునట్టికీళ్లు, ఒదవినన్ = జనింపఁగా, అవనివిభుఁడు=రాజు, అ...లన్-అవనీసురముఖ = బ్రాహ్మణముఖమందును, సురముఖ = దేవతావదనమందును, పవనసఖముఖములన్ = అగ్నిముఖమందును, భుక్తి = భోజనములచేతను, బలి = పూజోపహారాదులచేతను, హోమవిధిన్ = వ్రేల్చుటచేతను, అధికద్రవ్యంబు=పెక్కుధనమును, విడువవలయున్ = వినియోగము చేయవలయును. క్రమాలంకారము.

తా. త్రివిధోత్పాతలక్షణము. వృద్ధవసిష్ఠుఁడు చెప్పియున్నాఁడు. 'దివిజా యే ఋక్షగ్రహాస్తేదివాఖ్యా మహాఫలదాః, పరివేషేంద్రధనురుల్కా గంధర్వ నగరనిర్ఘాతాః, గగనవికారజ మేతన్మధ్యమఫలదం తథాంతరిక్షం చ, భూమిభవాభౌమాస్స్యుశ్చరస్థిరా వస్తుసంభవాయేచ, ఏతేఽధమఫలదాస్స్యు స్తేషాం కథయామి ఫలాని రూపాణి. ఆబాలవిద్వజ్జనసుప్రసిద్ధం యద్వస్తురూపంప్రకృతం తతోన్యత్, ఉత్పాతమాద్యాస్త్రివిధం వదంతి దివ్యాంతరిక్షక్షితిజన్మ భేదమ్' తదుత్పత్తికారణము వృద్ధవసిష్ఠుఁడు చెప్పియున్నాఁడు. 'అధర్మతస్త్వసత్యాచ్చ నాస్తిక్యా దతిలోభతః, అనాచారా న్నృణాం నిత్య ముపసర్గః ప్రజాయతే, తద్భేదా స్త్రివిధోత్పాతా జాయంతే దుఃఖరోగదాః, దివ్యాంతరిక్షక్షితిజాః వికారా ఘోరరూపిణః' వరాహోక్తి 'మనుజానామపచారా దపరక్తాదేవతాస్సృజంత్యేతాన్, తత్ప్రతిఘాతాయ నృపశ్శాంతిం రాష్ట్రే ప్రయుంజీత.' గార్గివచము. 'అకృత్వా శాంతికం రాజా దుఃఖాంభోధౌ నిమజ్జతి, పురే జనపదే కోశే వాహనేషు పురోహితే, స్త్రీష్వాత్మ నిచ పుత్రేషు పచ్యతే చైవ మష్టసు.' అనియున్నందున, రా జట్టియుత్పాతంబులు గలుగకుండునట్లు పాలింపవలయు, నొకవిధంబున నవి గలిగెనేని, యవ్యవహితముగఁ దచ్ఛాంతి యైనను జేయవలయును.

ఉ స్పర్ధ పరస్పరంబు దొరలపట్టున యోధులపట్టున న్నృపుల్
వర్ధనమొందఁ జేయఁదగు వారిహితాహితచర్య లొంద వం
తర్ధి మిథోవ్యథావహ హితత ప్రథమానసమానతా ప్రథా
ధూర్ధరతాదులం దగిలి ద్రోహపుఁజింతఁ దలంప రేమియున్. 254

టీ. నృపుల్=రాజులు, దొరలపట్టునన్ = గొప్పయుద్యోగస్థులవిషయమునను, యోధులపట్టునన్ = వారిక్రింద నుండుభటుల విషయమునను, పరస్పరంబు=ఒండొరులకు, స్పర్ధ=విరోధము, వర్ధనమొందన్ = వృద్ధిఁబొందునట్లుగ, చేయఁదగున్ = చేయవలయును (అట్లు కలహముఁబుట్టించిన ట్లయినను), వా...లు - వారి = వారలయొక్క, హితాహితచర్యలు = మంచిచెడ్డనడతలు, అంతర్ధిన్ = దాఁగుటను, ఒందవు = పొందవు,

మి...లన్ - మిథః = అన్యోన్యము, వ్యథావహ = దుఃఖహేతువగు, హిత=ఇష్టులని, ప్రథమాన=ప్రసిద్ధులై, సమానతా=సములై యుండుటచేతనైన, ప్రథా=ప్రసిద్ధియొక్క, ధూర్ధరతాదులన్=ధురంధరత్వము మొదలగువానియందు, తగిలి=తగులుకొని, ఏమిరఁగున్= ఇంచుకంతైనను, ద్రోహపుఁజింతన్ = చెడుచింతను, తలంపరు=స్మరింపరు. (అంతయును హితాచరణమునం దాసక్తులై యుందు రనుట.)

చ. ధరణిపుఁ డెందునేఁ దగదు । తాఁ జన నూఁటకొక్కనిం దగుం
దొర నొనరించి పంప నరి । దుర్బలుచేఁ జెడఁ డాతఁ డర్థభూ
కరితురగర్ధి లేక కొఱగాఁ డటు సేయ ద్విజాన్యుఁ డల్కకే
నెరపు నతండు నుర్వలయు । నిండినదుర్గబలోర్వి యీఁ దగున్.

టీ. ధరణిపుఁడు = రాజు, ఎందునేన్ = ఎచ్చటికెచ్చటికేనియును, తాన్ = తాను, చనఁదగదు = చనరాదు కనుక, ఊఁటకున్ = తనకు సహాయముగా నుండుటకు, ఒక్కనిన్ = ఒక్కని, దొరన్=ప్రభువునుగా, ఒనరించి = చేసి, పంపన్ = అంపుట, తగున్ = యుక్తము, అరి = ప్రబలశత్రువు, దుర్బలుచేన్ = బలహీనునిచేత, చెడఁడు= సాధింపఁబడఁడు (కావున), ఆతఁడు = ఆయధికార పురుషుఁడు, అ...ర్ధి - అర్థ = ద్రవ్యముయొక్కయు, భూ = పండునట్టి భూమియొక్కయును, కరి = ఏనుగుల యొక్కయు, తురగ=గుఱ్ఱములయొక్కయును, ఋద్ధి=సమృద్ధి, లేక = లేకయుండెనేని, కొఱగాఁడు=పనికిరాఁడు, అటు సేయన్ = అట్లు పెంపుఁజేసినపుడును, ద్విజాన్యుఁడు= క్షత్రియుఁడు లోనగువాఁడు, అల్కకే = అలుకలేక, నెరపున్ = తగినవాఁడై నిలుచును, అతండునున్ = ఆబ్రాహ్మణుఁడును, వలయున్=రాజున కాప్తుఁడై యుండ వలయును, నిం...ర్వి - నిండిన = నిండారిన, దుర్గబలోర్వి = దుర్గమును గజతురంగబల ములును భూములును, ఈఁదగున్ = ఇయ్యందగును. (దుర్గస్థలములు బ్రాహ్మణుల కీయక క్షత్రియాదుల కిచ్చిన వారు మళ్లఁబడి పోరుదు రనుట.)

క. అడవులు గడిదేశములవి
దడములుగాఁ బెంపు మాత్మ । ధరణీస్థలికిన్
నడుములవి పాళ్లుపాళ్లుగఁ
బొడిపింపుము దస్యుబాధ । పొఁదక యుండన్. 256

టీ. గడిదేశములవి = గడిస్థలములయందుఁ (ఎల్లలయందు) గల, అడవులు = విపినములను, దడములుగాన్ = బలువిడిగా, పెంపుము=వృద్ధిఁబొందింపుము, ఆ...కిన్ - ఆత్మ = తనయొక్క, ధరణీస్థలికిన్ = దేశమునకు, నడుములవి = మధ్యముననుండునట్టి

యడవులను, దస్యుబాధ = దొంగలవలనియుపద్రవము, పొందకయుండక = కలుగకుండునట్లు, పొట్ల పొట్లగన్ = తునుకలుగా, పొడిపింపుము = నఱకింపుము.

తా. నీయేలుబడిదేశమునందు మధ్యమున నున్న యడవులను జోరబాధ లేక యుండుటకై పొడిపొడిగాఁ గొట్టివేయింపుము.

చ. క్షమఁ గుఱుమన్నెపుంగవన । చారిజనంబెడ దోషదృష్టి కు
ద్యముఁ గడుగంగఁ బూన్కి తెగ । దల్గిన సర్వము బాస నీగి వ
శ్యముగ నొనర్ప దాడి కగు । నౌఁగడి కొల్లలకు న్శతాపరా
ధమును సహస్రదండనము నతర్క్యము సర్వము నేలువానికిన్. 287

టీ. క్షమన్ = భూమియందు, కుఱుమన్నెపుంగవనచారిజనంబెడన్ = కొంచెపాటిమన్నెతికముగల యాటవికజనులపట్ల, దోషదృష్టి = దోషమెంచుట, కుద్యమున్ = మఁటిగోడను, కదుగంగఁబూన్కి = మన్ను లేవకుండఁ గడుగుటకు దొరకొన్నచందము, అల్గినన్ = వారిపట్లఁగోపగించినను, సర్వము తెగదు = మొదలంటతెగదు, బాసన్ = సత్యవాక్యము చెప్పుటచేత, ఈగిన్ = వాహనాదుల నిచ్చుటచేతను, వశ్యముగన్ = తనకు వారు వశవర్తు లగునట్లుగా, ఒనర్పన్=చేసికొన్నట్లయిన, దాడికిన్ = శత్రువుల మీఁద దండెత్తుటకు, అగున్ = పనికివచ్చును, గడికొల్లలకున్ = గడిదేశములు కొల్లఁ బెట్టుటకును, ఔన్ = పనికివచ్చును, సర్వమున్ = సమస్తమును, ఏలువానికిన్=పరిపాలనముఁ జేయురాజునకు, శతాపరాధమును=అనేకులు చేయునట్టియపరాధమును, సహస్ర దండమున్ = అనేకజనులను శిక్షించుటయును, అతర్క్యము=తలంచుట యుక్తముకాదు.

తే. సింధుర మహాశ్వముఖ్యము । ల్చేర్చు దౌల
దీవివణిజుల కూళ్ళు సద్గృహములు పురిఁ
గొలువుఁ దేజంబు వెలమేలు । గలుగఁ బ్రాఁత
వారిఁగాఁ జేయు మరి నవి । చేరకుండ. 288

టీ. సిం...ల్-సింధుర = ఏనుఁగులును, మహాశ్వ = గొప్పయశ్వములు, ముఖ్యముల్ = లోనగువానిని, చే...కున్-చేర్చు = తెచ్చుచున్నట్టి, దౌల=దూరమునయున్న, దీవివణిజులకున్ = ద్వీపములయందలి వర్తకులకు, ఊళ్లు=గ్రామములు, పురిన్=నీపట్టణమందు, సద్గృహములు = మంచియిండ్లును, కొలువున్=నిత్యము నీసేవయును, తేజము= బహుమానములును, వెలమేలు = వారికొనుమొదలుమీఁద నాదాయమును, కలుగన్ = కలుగునట్లుగా, (చేసి) అవి = అగజాదివస్తువులు, అరిన్ = నీశత్రువును, చేరకుండన్= చెందకయుండునట్టు, ప్రాఁతవారిఁగాన్ = వారలను నీవారినిగాను, చేయుము = ఒనర్చు కొనుము.

తే. గడినృపులరాయబారులయెడఁ గొలువున
సరససల్లాపములు రాజు పలుపవలయుఁ
గార్యఖడ్గము లనుచరు ల్గానఁ బలుక
వలయు నవి మైత్రిఁ దా దేఁట బలుకవలయు. 259

టీ. రాజు=ప్రభువు, గ...డన్-గడినృపుల=తన భూమికి సమసంకరదేశాధిపతుల యొక్క, రాయబారులయెడన్=నియోగులపట్లను, కొలువునన్ = తన కచ్చేరియందు, సరససల్లాపములు = రసయుక్తములగు మంచిమాటలె, పలుపవలయున్ = ఆడవలయును, కార్యఖడ్గములు = కార్యసమాచారములను ఖడ్గసమాచారములను, అనుచరుల్ = సమీపస్థులు, కానన్=తెలియునట్లు, పలుకవలయున్ = వచింపవలయును. అవి=చారులచేత నట్లు చెప్పఁబడినమాటలను, తాన్ = రాజు, మైత్రిన్ = స్నేహాభిప్రాయముచేత, తేటఁ బలుకవలయున్ = ఆమాటలు తప్పిదము లైనవి కా వని తేటఁబలుకవలయును.

తే. తా నవంబుగ దొరఁ జేయువానిమంత్ర
మునకు వేగమె లోఁజేయఁ జనదు వాఁడు
క్రొత్తమన్నన రహిఁ ననుఁగులకుఁ జెప్ప
నయిన నది చెడు మఱి వాఁడు నడఁగుఁ గాన 260

టీ. (రాజు), తాన్=తాను, నవంబుగన్ = క్రొత్తగా, దొరఁజేయువానిన్ = దొరతన మిచ్చి పెంపుఁజేసిన నరుని, మంత్రమునకున్=ఆలోచనకు, వేగమె=వేగిరముగా, లోఁజేయఁజనదు = కూర్చికొనఁగూడదు, (అట్లు చేర్చుకొనిన ట్లాయెనా) వాఁడు = ఆక్రొత్తయుద్యోగస్థుఁడు, క్రొత్తమన్ననన్ = నూతనపు బహుమానములను పొంగి, రహిన్=తేజములో, అనుఁగులకున్=తన నెయ్యురకు, చెప్పన్=చెప్పఁగా, అయినన్= కొనసాగినను, అది = ఆ కార్యము, చెడున్ = కాకపోవును, మఱి = ఇ టియగాక, వాఁడున్ = అట్లు మంత్రమును బైటఁబెట్టినవాఁడును, అడగున్ = చెడిపోవును, కానన్ = కావున, (మంత్రమునకు లోఁజేయఁగూడ దని యన్వయము.)

సీ. హితబహుశ్రుతిధర్మరతశూరతాస్వవ్యూ
ర్వతల మన్త్రిజుల దుర్గముల నిలిపి
పులిజున్ను మొదలుగాఁ బురుషాయుషావధి
కం దండ నవరణ ల్పొందుపఱిచి
చీమంత యైనను సామంతకోటికి
ఖితముఁ దప్పక యుండ క్షితు లొసంగి

యాయాధికవ్యయానధికంబునుం బ్రజా
విరుజంబుగాఁగ బం।డరువుఁ గూర్చి
తే. క్షీణరిపుధాత్రిఁ జరదృష్టి।చేతఁ జూచి
బకగతి హఠాద్గ్రహించి తాఁ। బ్రజయు నొవ్వ
కయ పగఱగాత్రములనె చీ।కాకుపఱచు
నృపతి డెందానఁ జేయిడి। నిద్రవోవు. 261

టీ. హిత...లన్-హిత = కుశలచింతచేతను, బహుశ్రుత=విశేషశాస్త్రపరిచితిచేతను, ధర్మరత=న్యాయాసక్తిచేతను, శూరతా = మగఁటిమిచేతను, స్వపూర్వతలన్ = తనవంశక్రమానుగతత్వముచేతను, (కూడి) మన్ ద్విజులన్=వృద్ధియగుచున్న బ్రాహ్మణులను, దుర్గములన్ = దుర్గస్థలములయందు, నిలిపి=ఉంచి, పులిజున్ను మొదలుగాన్= పులిజున్ను మొదలైన నిఖిలంబగు నపూర్వవస్తువులును, పురుషాయుషావధికిన్ = నూఱు సంవత్సరములవఱకును, అందుండన్ = ఆదుర్గములయం దుండునట్లు, నవరణల్ = పద్ధతులు, పొంకుపఱిచి = కలుగఁజేసి, సామంతకోటికిన్ = తన్నుఁ గొలుచుచుండు మన్నెగాండ్రకు, సీమంతయైనను = కొంచెమైనను, మితమున్ = ఆడుకొన్నరీతిని, తప్పక యుండన్ = తప్పిపోకుండ, క్షితులు = భూములు, ఒసంగి=ఇచ్చి. ఆయాధికవ్యయానధికంబును = ఆదాయ మెక్కుడుగాను వ్యయము తక్కువగాను, ప్రజావిరుజంబుగాఁగన్=తనదేశప్రజలు నొవ్వనియట్లుగా, బందరువున్ కూర్చి=బొక్కసము నించి, క్షీ...త్రిన్-క్షీణరిపు = క్షయిష్ణువైనశత్రునియొక్క, ధాత్రిన్ = దేశమును, చరదృష్టిచేతన్ = వేగువాండ్రచేతను, చూచి = ఎఱిఁగి, బకగతిన్ = కొంగచందమునఁ బొంచియుండి, హఠాద్గ్రహించి = సమయము తటస్థింపఁగా నొక్కఁడాటున నాక్రమించి, తాన్=తానును, ప్రజయున్ = తనయొక్క ప్రజలును, నొవ్వకయ = నొప్పిఁ జెందకయే, ప...నె - పగఱ = తన శత్రువులయొక్క, గాత్రములనె = దేహములనే, చీ...లి-చీకాకుపఱచు = కలఁకపడునట్లు చేయుచున్న, నృపతి=రాజు, డెందానన్ = రొమ్మున, చేయిడి = హస్తము నుంచుకొని, నిద్రవోవున్ = సుఖముగా నిద్రించును. (ఇందుఁ జెప్పఁబడియున్న విధముగా రాజు ప్రవర్తించెనేని యెందేనియు ఖేదము నొందక సుఖంబుల ననుభవించుచుండు ననుట)

క. ఎచ్చో గజఘోటక్రయ, తచ్చర్వాణసుభటజీవి। తద్విజసురపూ
జోచ్చనిజభోగములకగు, వెచ్చము వెచ్చంబు గాదు।విత్తంబునకున్.

టీ. విత్తంబునకున్=రాజార్జించిన ధనమునకు, ఎచ్చోన్=ఏకాలమందును, గ...లకున్-గజ = ఏనుఁగులయొక్క, ఘోట = అశ్వములయొక్కయు, క్రయ = కొను

టకును, తచ్చర్వణ=వానిమేపునకును, సుభటజీవిత=మంచిరాణువకు నిచ్చునట్టి జీతములకును, ద్విజ = బ్రాహ్మణులయొక్కయు, సుర = దేవతలయొక్కయు, పూజా = పూజలకును, ఉచ్చనిజభోగములకున్=ఉన్నతము లైన తన యనుభవములకును, అగు=అగునటువంటి, వెచ్చము = వ్యయము, వెచ్చంబు కాదు = వ్యయముకాదు. (పైని చెప్పఁబడిన వానివిషయమై వ్యయ మవశ్యముగాఁ జేయవలయుఁ గాన నిది దుర్వ్యయ మని తలంపరాదు.)

ఆ. ప్రతిన వలదు వైరి ♦ పట్టున నృపతికి
దండువెడలఁ దీఱ ♦ కుండుఁ దీఱుఁ
గాక యుండియుండి ♦ కాలాంతరమున నౌఁ
గార్యకాఁడొ యంక ♦ గాఁడొ నృపుఁడు. 263

టీ. నృపతికిన్ = రాజునకు, వైరిపట్టునన్ = పగతునిపట్టున, ప్రతిన=ప్రతిజ్ఞ, వలదు=ఎప్పటికిని కూడదు, దండువెడలన్=యుద్ధయాత్రకుఁ బోయినను, తీరకుండున్= నిర్ణయించుకొన్న సమయమునకు ముగింపుకాకపోవును, తీరున్ = ముగింపగును, కాక యుండియుండి = అప్పటికిఁ గాకుండనుండియుండి, కాలాంతరమునన్ = మఱియొక సమయమందు, ఔన్ = అవును, నృపుఁడు = రాజైనవాఁడు, కార్యకాఁడొ = కార్యపరుఁడో, అంకగాఁడొ=సమరశీలుఁడో (అనఁగాఁ గాకువుచేతఁ గార్యపరుఁడే యనుట.)

క. పోరానిపట్లఁబొడుచుట,వైరిబలముతిరుగజయమొ ♦ స్వర్గమొయగునా
నారూపయంత్రతత్ప్రా, కారాదులపట్లఁ బ్రజనె ♦ కవియింపఁ దగున్.

టీ. రాజు, పోరానిపట్లన్ = శత్రువులు పైకివెళ్లుటకు వసరులేకయున్న సమయములను, పొడుచుటన్ = పోరునఁ గొట్టుటచేత, వైరిబలము = శత్రుబలము, తిరుగన్= ఏవంకఁబోవ నశక్యమై తెగించి తిరుగుబాటుకాఁగా, జయమొ=గెలుపైనను, స్వర్గమొ= వీరస్వర్గ మైనను, అగున్ = సిద్ధమౌను, (అనఁగాఁ ద్రోవలేక యిక్కట్టున నున్న శత్రువులబలమును జెనకరా దనుట.) నానారూపయంత్ర = పలుతెఱఁగులగు నాయుధవిశేషములపట్లను, తత్ = ఆ శత్రురాజులయొక్క, ప్రాకారాదులపట్లన్=కోటలు మొదలగు వానియందును, ప్రజనె=తన బలమునె, కవియింపఁ దగున్=కవియునట్లు చేయవలయును; గాని తాను బోఁగూడ దనుట.

చ. మనమున నొండురెండుమఱు ♦ మంత్రములన్సరిపోవఁ జెప్పినం
జనపతు లాతనిం బిలువ ♦ సాగుదు రాగతి సారెఁ బిల్చిన

చ్చనువునకే ధనాదిఁగొని । సంగతిగానివి క్రొవ్వి చేయఁ జె
ప్పు నృపతి తద్బహిశ్చరిత।ముం జరుచేఁ బరికింపఁగాఁ దగున్. 265

టీ. మనమునకున్=రాజులయొక్క చిత్తమునకు, ఒండు రెండుమఱి = ఒకటి రెండుమాఱులు, మంత్రములన్ = ఆలోచనలను, సరిపోవన్=సరిపడునట్లు, చెప్పినన్= చెప్పినట్టాయెనా, జనపతులు=రాజులు, ఆతనిన్=అట్లు తమ మనంబునకు సరిపడఁ జెప్పియున్నవానిని, పిలువసాగుదురు = పిలువ నారంభింతురు, ఆగతిన్=ఆరీతుగను, సారెన్ పిల్చి = మాటిమాటికిఁ బిలువనంపినట్టి, అచ్చనువునకే=ఆచొరవకే, ధనాది=సొమ్ము మొదలగువానిని, కొని=వారివలన సంపాదించికొని, క్రొవ్వి = మదించి, సంగతిగానివి= అసంగతములయిన కొన్నిపనులను, చేయన్ = ఒనర్చుట కై, చెప్పున్=నిర్ణయించును, (అట్లు గావున), నృపతి = రాజు, తత్=ఆయాలోచన చెప్పువానియొక్క, బహిశ్చరితమున్ = వెలినడవడిని, చరుచేన్ = వేగువానిచేత, పరికింపఁగాఁదగున్ = తెలిసికొనవలయును.

తా. రాజైనవాఁడు రెండు మూఁడు ఆలోచనలకే దేలుపోయి వాని నమ్మియుండక వీఁడు పరహితుఁడై యోజనలు చెప్పుచున్నవాఁడో, లేక తనకు హితబుద్ధిఁ జెప్పుచున్నాఁడో, యని వాని వెలినడవడి నితరులచేఁ దెలిసికొనవలయును.

క. గడివాఁడు చెడునెయేఁ దగుఁ
జెడఁజేయుట చెడఁడయేని । చెల్మియె తగుఁ బై
గడివాఁ డేపని కగుఁ దన
గడివాఁ డరియైనఁ దనకె । గడి కావఁబడున్. 266

టీ. గడివాఁడు=తన పగవానిమానిసి యై తన గడి సరిహద్దునయుండువాఁడు, చెడు నెయేన్=చెడునట్లు తోఁచినపక్షమున, చెడఁజేయుట=అట్లు పొడిచిచెఱుపుట, తగున్= యుక్తము, చెడఁడయేని = చెడఁ డని తోఁచినట్లాయెనా, చెల్మియె తగున్=వానితో మైత్రి యొనర్చుటయె మంచిది, తన గడివాఁడు=తనయొక్క యెల్లయందుఁ గాపలి యుండువాఁడు, అరి యైనన్ = తనకు శత్రు వైనట్టాయెనా, పైగడివాఁడు = పరునిసీమ యొక్క గడి కాచువాఁడు, ఏపనికగున్ = ఏమికార్యమునకు వచ్చును, తనకె = తన కొఱకే, గడికావఁబడున్ = గడి రక్షింపఁబడును.

తే. రాష్ట్ర మెఱయించు కొనుము దుర్గములు తదవ
రోధ మగుపడ్డఁ బుట్టించు।కరూఢి నడపు

పరుషములు తద్రిపులరాయబారులెదుటఁ
బలుకకుము సంధి యొకవేళ వలసియుండు. 267

టీ. రాష్ట్రము = నీ శత్రురాష్ట్రమును, దుర్గములు=వారిదుర్గస్థానములను, ఎరియించుకొనుము = హరింపుము, తదవరోధము = వారిస్త్రీలు, అగపడ్డన్ = దొరకిరేని, పుట్టింటిరూఢిన్ = ఆ స్త్రీలు పుట్టినింట నుండఁగా నేమి మర్యాద నడుచునో యట్టి మర్యాదను, నడపుము=జరగింపుము, త...టన్-తద్రిపుల=ఆ శత్రువులయొక్క, రాయబారుల = సంధిమాటలాడువారియొక్క, ఎదుటన్ = ముందరను, పరుషములు = కఠిన వాక్యములు, పలుకకుము = వచింపకుము, ఒకవేళన్ = ఒకసమయమునందు, సంధి = సమాధానము, వలసియుండున్=కావలసియుండును; గనుక పరుషము లాడఁగూడ దని పూర్వముతో నన్వయము.

ఆ. అభిచారఘనగరాంబుదూషితరుజ్ని
రంతరాద్రిగహనదంతురోగ్ర
కీకటోర్వి మేరుగిరిసమార్థము వచ్చు
నేని చొరకు మంపు మిడుముకొనఁగ. 268

టీ. అభిచార=అభిచారక్రియలు చేయుజనులచేత, ఘన=నిబిడమైయున్నట్టియు, గరాంబు = విషజలముచేతను, దూషిత=దుష్టమైనట్టియు, రుక్ + నిరంతర = వ్యాధిబహుళమైనట్టియు, అద్రి = కొండలచేతను, గహన = కాఱడవులచేతను, దంతుర = ప్రవేశింప నశక్యమైనట్టి, ఉగ్రకీకటోర్వి = ధూర్తులగు మ్లేచ్ఛులయొక్కభూములను, మేరుగిరి = హేమాద్రితో, సమ = తుల్యమైన, అర్థము=ద్రవ్యము, వచ్చునేని=లభించునట్లుండినను, చొరక = నీవు వెళ్లక, ఇడుము కొనఁగన్=ఆదేశములనాక్రమించునట్లు, అంపుము = దళములనుమాత్రము పంపుము.

క. రాణింపఁ బల్కి తనపని
జాణై కొనుఁ గొలుచు సంతసపుదతిఁ దొలఁగుం
ద్రాణ చెడఁ గపటమానిసి
నాణె మెఱుఁగ బచ్చు గాఁగ నరపతికిఁ దగున్. 269

టీ. కపటమానిసి = కుత్సితుఁడైన మనుష్యుఁడు, రాణింపన్ = ఇంపుపుట్టునట్లుగా, పల్కి=మాటలాడి, జాణ ఐ=చతురుఁడై, తనపనిన్ = స్వప్రయోజనమును, కొనున్ = కాఁజేసికొనును, సంతసపుఁదతిన్ = దొర లుత్సాహవంతులై యున్నసమయంబునను, కొలుచున్ = కొలువుఁజేయును, త్రాణచెడన్ = దొరకించుక బలిమిదప్పి

దిగులొందఁగా, తొలఁగున్ = దాఁటిపోవును, సాటెము = మంచిచెడ్డలను, ఎఱుఁగన్ = తాఁదెలిసికొనుటకు, బచ్చుగాఁగన్ = కోమటివానివలె నుండుట, సరపలికిన్ = షేనికి, తగున్ = అమరియుండును.

సీ. తజ్జ్ఞమండలిఁ గూర్చి ధాతువుల్ దెలిసి హే
మాదులఁ గొని ప్రకృత్యనుగుణాల్ప
జీవనాహృతులచేఁ జెలఁగి మహాబలో
ద్రేకంబు మర్దన రిత్తఁజేసి
స్నేహార్ద్రుఁ డగుచు నశేషంబుఁ బోషించి
నరవర్ణములతప్పసరణు లుడిపి
సతతద్విజప్రతిష్ఠాశాలి యై బలి
యించుపట్టులు బలియించి పలుచఁ
తే. జేయుపట్టులు పలుచఁగాఁ జేసి తేజ
మెసఁగ శోధన మఱవక యెసఁగవలయు
సాంగరాజ్య మొకెత్తుగ స్వాంగ రాజ్య
మొక్కయెత్తుగ నృపతి యాయుష్యపరత. 270

అవ. ఈపద్యమునందు స్వాంగరాజ్యమును బాలించుభంగి సాంగరాజ్యమును రా జైనవాఁడు పరిపాలింపవలయు నని రెండర్థములు వచ్చునట్లు చెప్పుచున్నాఁడు:—

టీ. తత్ జ్ఞమండలిన్ = వైద్యులను, అభిజ్ఞులను, కూర్చి=కలయఁజేసి, ధాతువుల్ = సప్తధాతువులను, సువర్ణాదిజనకములైనధాతువులను, తెలిసి=ఎఱింగి, హేమాదులుగొని = సువర్ణభస్మము మొదలగువానిఁ బుచ్చుకొని, ఆధాతువులయం దుండు సువర్ణరజతాదులను స్వీకరించి, ప్ర...చేన్ - ప్రకృతి = తనశరీరప్రకృతికిని, ప్రజలకును, అనుగుణ = తగునట్లు, అల్పజీవన = మితమైనయన్నోదకములయొక్కయు, మితమైనద్రవ్యముయొక్కయు, ఆహృతులచేన్ = పుచ్చుకొనుటచేత, చెలఁగి = ఒప్పి, మహాబలోద్రేకంబున్ = వాయువుయొక్కప్రకోపమును, ప్రబలశత్రువుయొక్కయౌద్ధత్యమును, మర్దనన్ = అంగమర్దనచేతను, దండించుటచేతను, రిత్తఁజేసి = మట్టుపఱచి, స్నేహార్ద్రుఁడగుచున్=అభ్యంజనమును, ప్రేమయుఁగలవాఁడై, అశేషంబులన్=సకలావయవములను, సమస్తప్రజలను, పోషించి = పెంపొందఁజేసి, నరన్ = పలితమును, వర్ణములతప్పసరణులు = దేహమం దాయాస్థానముల వన్నెలు మాఱుటను, నరవర్ణముల = మనుష్యులయొక్కబ్రాహ్మణాదివర్ణములయొక్క, తప్పసరణులు = శాస్త్రవిరుద్ధాచారము

లను, ఉడిపి=తదుచిత క్రియలచేతను మాన్పి, సతతద్విజప్రతిష్ఠాశాలియై=ఎల్లప్పుడుఁ బలు వరుసలకును, బ్రాహ్మణులకును దార్ఢ్యప్రతిష్ఠలను సంపాదించుటచే నొప్పుచున్నవాఁడై, బలియించుపట్టులు బలియించి=హస్తమస్త్యాదులను, దుర్గములను బలియఁజేసి, బలుచఁజేయుపట్టులు బలుచఁగాఁజేసి=ఉదరాదులను, మధ్యదేశమునందలి యడవులను బలుచఁగాఁజేసి, తేజమెసఁగన్ = ఇంద్రియప్రతాపము లభివృద్ధి యగునట్లు, శోధనన్ = వస్తి శోధనను, నగరశోధనను, మఱవక=విస్మృతిచెందక, నృపతి = రాజు, ఆయుష్యపరతన్ = ఆయుర్వృద్ధియం దాసక్తుఁ డౌటచేతను, స్వాంగరాజ్యము = తనశరీరము, ఒక్కయెత్తుగన్=ఒకవంతుగాను, సాంగరాజ్యము=సప్తాంగములతోడి రాజ్యము, ఒక్కయెత్తుగన్ = ఒకవంతుగాను, ఎసఁగవలయున్ = పెంపొందవలయును.

సీ. సౌఖశాయనిక భిషక్పూర్వకము కాల్య
వేళఁ గార్తాంతికద్విజులగోష్ఠి
జాము వోవ నమాత్య సామంతపూర్వకం
బర్థార్జనస్థ కాయస్థగోష్ఠి
దినమధ్యమమున మర్దనమల్లపూర్వకం
బుగ సూదసూపకృన్మృగయుగోష్ఠి
యపరాహ్ణమున దేవతార్చనపూర్వకం
బార్యధర్మాధికృద్యతులగోష్ఠి
తే. భుక్తిమీఁద విదూషక పూర్వకము పు
రాణకవిగోష్ఠి చారపూ ర్వకము సంజ
జాముగాయకగోష్ఠి ని శలఁ సుషుప్తి
పూర్వకము ప్రేయసీగోష్ఠి పొసఁగుఁ బతికి. 271

టీ. పతికిన్=రాజునకు, కాల్యవేళన్=ప్రభాతసమయమునందు, ('ప్రత్యూషో హర్ముఖంకల్య' యని యమరము.) సౌ...ము-సౌఖశాయనిక = సుఖశయనమా యని యడుగువారును, ('భృగ్వాదీనదుగృహ్ణాంతుసౌఖశాయనికానృషీ'నని రఘువంశమునందుఁ గవిపుంగవుఁడైన కాళిదాసునిప్రయోగ మున్నది.) భిషక్=వైద్యులును, పూర్వకము= మొదలుగా, కార్తాంతికద్విజులగోష్ఠి=జ్యోతిశ్శాస్త్రవిదు లైన విప్రులయొక్క సంబాధము, జామువోవన్=జాము ప్రొద్దెక్కిన వెనుకను, అ...బు-అమాత్య=మంత్రులును, సామంత = అమరగాండ్రును, పూర్వకంబు = మొదలుగా, అ...ష్ఠి-అర్థార్జనస్థ = ద్రవ్యార్జనాధికారమునం దుండువారలయొక్కయు, కాయస్థ = కరణాలయొక్కయు,

గోష్ఠి = సంబంధమును, దినమధ్యమమునన్ = మధ్యాహ్న సమయమునందు, మ...బు- మర్దన = అంగమర్దనముఁ జేయునట్టి, మల్ల = జెట్టివాండ్రు, పూర్వకంబుగన్ = లోనుగా, సూ...ష్ఠి సూద = వంటకము వండువారియొక్కయు, సూపకృత్ = పప్పుకూరలు వండువారలయొక్కయు, మృగయు = వంటవారికి మాంసముదెచ్చి యిచ్చునట్టి వేటకాండ్ర యొక్కయు, గోష్ఠి = సాంగత్యమును, అపరాహ్ణమునన్ = పగటి తృతీయభాగమునందు, దేవతార్చనాపూర్వకంబు = దేవపూజ మొదలుగా, ఆర్య = పూజ్యులయొక్కయు, ధర్మాధికృత్ = ధర్మాధికారులయొక్కయు, యతుల = జ్ఞానము నుపదేశించుచున్న మానులయొక్కయు, గోష్ఠి = సభయును, భుక్తిమీఁదన్ = భోజనముఁ జేసినపిమ్మటను, విదూషకపూర్వకము = వికటకవులు మొదలుగా, పు...ష్ఠి - పురాణ = పౌరాణికుల యొక్కయు, కవి = కవీశ్వరులయొక్కయు, గోష్ఠి = సభయును, సంజజాము = సాయంకాలమునందు, చారపూర్వకము = వేగులవారు మొదలుగా, గాయకగోష్ఠి = పాఠకుల యొక్క గోష్ఠియును, నిశన్ = రాత్రియందు, సుషుప్తిపూర్వకము = నిద్రవోవుట మొదలుగా, ప్రేయసీగోష్ఠి = తన ప్రియురాలి గోష్ఠియును, పొసఁగున్ = ఒప్పును.

క. హితులు హితాహితులు సదా
హితులును నై రాజునెడల ♦ నిటు త్రివిధమునన్
క్షితి ననుచరు లుందురు సం
తతముఁ మఱి వారిఁ దెల్పె ♦ దన్ విను మనఘా. 272

టీ. ఈపద్యార్థము తరువాతి పద్యమున స్పష్టమగును గనుక దీనికి టీక వ్రాయలేదు.

చ. హితులు భిషగ్గ్రహజ్ఞబుధ ♦ బృందకవీంద్రపురోహితు, ల్హితా
హితులు ధనార్జనాదినృప ♦ కృత్యనియుక్తులు, వెండి కేవలా
హితులు దశావశార్పితస ♦ మృద్ధరమాభరణేచ్ఛు, లౌట నా
హితమును నట్లు గాఁ జతుర ♦ వృత్తిఁ జరించుట నీతి జేనికిన్. 273

టీ. భి...ల్ భిషక్ = వైద్యులును, గ్రహజ్ఞ = జ్యోతిషికులును, బుధబృంద = విద్వత్సమూహమును, కవీంద్ర = కవివరులును, పురోహితుల్ = పురోహితులును, హితులు = ఇష్టులు, ధ...లు-ధనార్జనాది = ద్రవ్యము పోగుచేయుట మొదలగు, నృప కృత్య = రాజ్యకార్యములయందు, నియుక్తులు = అధ్యక్షులుగా నియమింపఁబడినవారలు, హితాహితులు = హితులుగా నహితులుగా నుందురు. వెండి = మఱియు, దశావశార్పిత = ఆయా దశావశముచేత నగరి కీయఁబడినట్టి, సమృద్ధరమాభరణేచ్ఛులు = సమగ్రమైన తమ యైశ్వర్యములను సమయభేదములయందు మరలఁ బొందవలయు నని కాచియుండు

వారలు, కేవల అహితులు=కేవల శత్రువులు, ఔటన్=అట్లగుటవలన, అహితమునన్=వారిపట్ల తాఁ జేసిన హితమును, అట్లకాన్=తదనుగుణ మగునట్లుగా, చతురవృత్తిన్=నైపుణిచేత, చరించుట = వర్తించుట, జనికిన్ = రాజునకు, నీతి = తగినది.

ఆ. పాత్రభూతు లెస్సఁ । బరికించి యతఁ డడు
గకయు నొకఁడు[1]సెప్ప । కయు మునుపుగఁ
బనసపండ్లు దిగిన । పరిగ స్వప్నము గన్న
నెఱిగ నొసఁగి వెఱఁగు । పఱచు టొప్పు. 274

టీ. పాత్రభూతున్=సత్పాత్రుఁడైనవానిని, లెస్సన్=చక్కఁగా, పరికించి=తెలిసి, అతఁడు=ఆ యోగ్యపురుషుఁడు, అడుగకయున్ = అడుగకుండుటయును, ఒకఁడు చెప్పకయున్ = మఱియొక్కఁడతనికి దాన మిమ్మని తనతోఁ జెప్పకుండుటయును, మునుపుగన్ = పూర్వమే, [1]పనసపండ్లు దిగినపరిగన్=మొత్తములుగాఁ బనసపండ్లొక సారి దిగినచందముగా, స్వప్నముకన్న నెఱిగన్ = కలలో సకల వస్తుజాతముల నొక్క పర్యాయముగాఁ జూచినరీతిని, ఒసంగి = ఒక్కసారిగానే హేరాళముగా నిచ్చి, వెఱఁగుపఱచుట=ఆ సత్పాత్రు నద్భుతమొందఁ జేయుట, ఒప్పున్ = తగును.

---

1. 'చెప్పకయున్ మునుపు = రాజు నీకు సత్కారము చేయ నున్నాఁడని అతనితో ఎవ్వఁడును చెప్పకముందే - ఇచ్చి ఆశ్చర్యపెట్టుట ఒప్పున్' అను నొకా నొక టీ. అనుచితము.

'పనస...రిగన్ = ఉన్నట్టే ఉండి ఒక క్షణములో పనసచెట్టునిండ పనసపండ్లే దిగఁబడిన నెట్లుండునో ఆవిధముగాను. అభూతోపమ' అని అదే. టీ.

పనసపండ్లు దిగుట యనఁగా పనస (చెట్టున) పిందెలు పుట్టుట యని సంప్రదాయార్థము.—"దిగుట To come forth as fruit from the bud" బ్రౌను.

పనస వనస్పతి. అనఁగా పూఁతలేకయే కాయలు కాయుచెట్టు, మేడివంటిది. కావున ఫలోత్పత్తికి ముందెట్టి సూచనయు నుండదు, ఉన్నట్లే ఉండి చెట్టు ఆపాద మస్తకము పిందెలు పుట్టి కూర్చుండును.

పనస తటాలున సమృద్ధిగా ఫలించి ఆశ్చర్యము కలిగించునట్లు రాజు తటాలున సమృద్ధిగా సత్కరించి ఆశ్చర్యమును గొలుపవలె నని యర్థము. చక్కని ఉపమ.

'పనసపండ్లు దిగినపరిగన్' అను జాతీయమునకు—'పనసపండ్లే దిగఁబడిన నెట్లుండునో ఆవిధముగాను' అని యర్థము చేయుటయు, అది 'అభూతోపమ' యనుటయు సరికాదు.

క. పితృదేవక్రియలనువిధిఁ, బితృక్రియలేసూక్ష్మలగుటఁ। బితృభక్తుఁడవై
శ్రుతిశీలతపశ్శాంతా, చ్యుతభక్తులకొసఁగి పనుపు। మున్నతగతికిన్.

టీ. పితృ=పితృదేవతలయొక్కయు, దేవ = దేవతలయొక్కయు, క్రియలన్= కర్మములయందు, విధిన్ = విధిశాస్త్రముచేతను, పితృక్రియలే = పితృప్రీతికరములైన కర్మములె, సూక్ష్మలు అగుటన్ = బుద్ధిమంతులచే విచారింపఁదగిన యతిశయము గలవి యగుటచేత, పితృభక్తుఁడవై = నీవును బితృభక్తి గలవాఁడవై, శ్రుతిశీలతపశ్శాంతాచ్యుత భక్తులకున్ = శాస్త్రాధ్యయనముచేతను మంచినడకలచేతను వయస్సుచేతను శాంతులై యచ్యుతునిభక్తి గల్గియున్నవారలకు, ఒసఁగి=అభీష్టవస్తువుల నిచ్చి, ఉన్నతగతికిన్ = పితృలనూర్ధ్వలోకములకు, పనుపుము = అంపుము.

క. దానము ద్విజరక్షణకును
జ్ఞానము నిజరక్షణకుఁగ। శరణము చొరు మొం
తే నారాయణు 'రాజ్యాం
తే నరకం ధ్రువ' మటంట। దీఱునె యొంటన్. 276

టీ. (బ్రాహ్మణసంరక్షణము రాజధర్మ మగుటంజేసి) దానము = తాఁజేయునట్టి దానములు, ద్విజరక్షణకును=బ్రాహ్మణ సంరక్షణకొఱ కనియు, జ్ఞానము=శ్రీపతి సర్వోత్కృష్టుఁ డనియు నీ సమస్త చేతనులు నతనికి దాసభూతు లనియు నెఱుంగుట, నిజ రక్షణకుఁగన్=తన రక్షణార్థ మనియును, (తెలిసి), ఎంతేన్=మిక్కిలి, నారాయణున్= శ్రీమన్నారాయణుని, శరణముచొరుము=లెస్సఁగా శరణువేఁడుము, రాజ్యాంతే నరకం ధ్రువమ్ అటంట=రాజునకు రాజ్యాంతమునందు నరకము నిశ్చయ మను లోకోక్తి గలదు గావున నది, ఒంటన్=మఱియొక్కదానివలన, తీఱునె=తొలఁగునా (తొలఁగ దనుట.)

తే. ఆలు పతిభక్తి స్త్రీపుంస। పాళి వావి
యతి వశిత్వము దిగుజాతు। లగ్రజాతి
ననుసరించుట హితవృత్తి। నధిపునికి
భృత్యుఁ డొదవుట నృప దండ। భీతిఁ జుమ్ము. 277

టీ. నృప = ఓయి రాజా ! ఆలు = భార్య, పతిభక్తి = భర్త విషయమైన భార్యానురాగమును, స్త్రీ...ళి - స్త్రీపుంస = స్త్రీపురుషులయొక్క, పాళి = పఙ్క్తి, వావి = వరుసలను, యతి = జడదారి, వశిత్వము = ఇంద్రియ నిగ్రహమును, దిగుజాతులు=తక్కువజాతివారు; అగ్రజాతిన్ = మొదటిజాతివారిని, అనుసరించుట=భక్తియుక్తులై యనుసరించి యుండుటయు, అధిపునికిన్ = ఏలెడువాని కార్యమునకు,

హితవృత్తిన్ = మంచినడతగలవాఁడై, భృత్యుఁడు = బంటు, ఒదవుట = ఉపయోగ పడుటయును, దండభీతిఁజుమ్ము = దండభయముచేతఁజుమీ. (ఇట్లుండుటంజేసి రాజులకు యుక్తదండ మవశ్యకర్తవ్య మనుట.)

ఆ. చంపి ధార్మికుండు, సతిఁ బొంది మఱి బ్రహ్మ
చారి, బొంకి సత్య శాలి, యార
గించి సదుపవాసి, కేడించి శూరుఁడు,
చింది ధనియు, నగు వి చిత్రసరణి. 278

టీ. చంపి = దుష్టులను మచ్చుమాపి, ధార్మికుండు = ధర్మాత్ముఁడును, సతిన్ = తన ధర్మపత్నిని, కూడి = ఋతుకాలములయందుఁగలిసి, బ్రహ్మచారియు = బ్రహ్మచర్యము నల్పువాఁడును, బొంకి = పరులకు మేలు గలుగుపట్లు దబ్బఱలాడి, సత్యశాలి = యథార్థ వాది, ఆరగించి = (ఆవేళయందు భుజింపక) 'సాయంప్రాతర్ద్విజాతీనా' మను విధి నను సరించి యిరుమాఱుమాత్రము భోజనముచేసి, సదుపవాసి=ఆహారరహితుఁడును, కేడించి= గురుజనాదులతో వారియనుమతిని సంప్రాప్త మగుయుద్ధమునట్ల విముఖుఁడై చాలించి, శూరుఁడు = వీరుఁడును, చింది = సత్పాత్రమందు మెండుగ వ్యయముచేసి, ధని యున్=ధనికుఁడును, విచిత్రసరణిన్ = అద్భుతరీతిని, అగున్ = అవును. (కావున ధర్మ సూక్ష్మము దెలిసి నడవవలయు ననుట.)

తా. దుష్టుల నుక్కడంచువాఁడు ధర్మాత్ముం డనియును; ఋతుకాలములయందు మాత్రము భార్యాసంగమముచేయువాఁడు బ్రహ్మచారి యనియును; పరులకు మేలు కల్గునిమిత్త మబద్ధములాడువాఁడు సత్యవంతుఁ డనియు; దినమున కిరుమాఱులు భోజ నముచేయువాఁడు సదోపవాసి యనియును; పెద్దలయనుమతిచే శత్రువును జయింపకయే యుద్ధమునుండి మఱలినవాఁడు శూరుఁ డనియును; ధనమును సద్వినియోగ మొనర్చు వాఁడు ధనికుఁ డనియును భావము.

ఆ. ప్రణిధి స్వపురగృహియు భాషావిదుఁడు ప్రణి
ధ్యంతరావిదుండు నగునతండు
లింగమాత్రకృశుఁడు లిప్సాధికద్రవ్య
దానధనియుఁ గాక తఱిమఁ జొరఁడు. 279

టీ. ప్రణిధి=వేగువాఁడు, ('ప్రణిధిః ప్రార్థనే చరే' యని యమరము.) స్వపుర గృహియు = తనపట్టణమునందుఁ గాఁపుర ముండువాఁడును, భాషావిదుఁడు = నానా భాషలు దెలిసినవాఁడును, ప్రణిధ్యంతరావిదుఁడు = దేశాంతరపువేగరులను దెలిసిన వాఁడును, లింగమాత్రకృశుఁడు = ఏచిహ్నమును లేనివాఁడును, లి...యుం-లిప్సా = తాఁగోరినంతకంటె, అధికద్రవ్య=అధికద్రవ్యమును, ('వాంఛాలిప్సామనోరథః' యని

యమరము.) దానన్ = దొరయిచ్చుటచేత, ధనియు = ధనవంతుఁడును, కాక = కాని వాఁడై, తలఁగియుఁజొరఁడు = అవృత్తికిఁ బ్రవేశింపఁడు.

క. తనుభృశ దమనజ సుకృతము
ధనదత్తినె కొనఁగవలయుఁ ‖ దత్తదృతుకమ
ర్దనమజ్జనభోజనలే
పన వసన ప్రసవ వహన ‖ పరతం బలికిన్. 230

టీ. త...ము - తను = శరీరమును, భృశ = మిక్కిలి, దమనజ = ఉపవాసాదులుండి శోషింపఁజేయుటచేత సంపాదించునట్టి, సుకృతము = పుణ్యము, పలికిన్ = రాజునకు, ధనదత్తినె = ద్రవ్యము నమితముగా నిచ్చుటచేతనే, కొనఁగవలయున్=గ్రహింపవలయును, త...తన్ - తత్తదృతుక = ఆయాకాలములకు ననుకూలములైన, మర్దన = అంగమర్దనము, మజ్జన = స్నానము, భోజన = అభ్యవహారము, లేపన = మైపూఁతయు, వసన=వస్త్రము, ప్రసవ=పుష్పము, వహనపరతన్=వీనియొక్క సేవతోనుండి కొనవలయు నన పూర్వపద్యములో నన్వయము.

క. నానావిధపాడబముల
నాను [1]నృపాహార మెపుడు ‖ నపరాహ్ణమునం
గాని మఱి [2]శుద్ధకోష్ఠపు
గానితమి న్భుక్తి యెపుడుఁ ‖ గడుఁ బథ్య మగున్. 231

టీ. నృపాహారము = రాజులు భోజనముచేయుపంటకము మొదలగునది, ఎపుడున్ = ఏకాలమందును, నా...లన్ - నానావిధ=పలుతెఱంగులైన, పాడబములన్ = రుచులతోడను, (పానీయములతోడను - అనుట యుక్తము) ఆనున్=కూడియుండుము, అపరాహ్ణమునంగాని = అపరాహ్ణమందే కాని, మఱి = అటుగాక, శుద్ధకోష్ఠపు - గర్భగోళశుద్ధి, కానితమిన్ = కాకుండునట్టి త్వరచేత, భుక్తి=భోజనము, ఎపుడున్ = ఏసమయమందు, కడున్ = మిగులను, పథ్యము = హితము, అగున్ కాదు. (ఎపుడును గాదనుట. అనఁగా నపరాహ్ణమునందు భోజనము చేసినట్లాయె నా శరీరమునకు సౌకర్యకరముగా నుండు ననుట.)

క. విను వర్గ సమత నృపుఁ డు
న్నను ధర్మాంశంబె హెచ్చి ‖ నా పెఱ మడి కె
త్తిననీరును దెగి యలరా
జనపుమడికి నెక్కినట్లు ‖ చను ముదమందన్. 232

1. ఉపాహార మని డీ. పే. శా. 2. శుద్ధకోష్ఠతఁ, గానితమిన్ భుక్తి...

టీ. నృపుఁడు = రాజు, వర్గసమర్థ=ధర్మార్థకామము లనియెడు త్రివర్గసంపద యందు సమర్థ్యములో, ఉన్నను=ఉండఁగా, ధర్మాంశంబె = అందు ధర్మముమాత్రము, హెచ్చెనా = అతిశయించెనా, పెఱమడికిన్ = మిగిలినమళ్ళకు, ఎత్తిన=కట్టఁబడిన, నీరును = ఉదకమును, తెగి = గండిచేసికొని, రాజనపుమడికిన్ = వడ్లపైరుకయ్యకు, ఎక్కినట్లు=పాఱినచందముగా, ముదమందన్=సంతోషించుట, చనున్=తగును.

క. వెలయించునట్టి యొకమణి
వెలుఁగాశం గొనుము ధరణి వెండి సువేషో
జ్జ్వలతకు వలదే వాసర
ములఁ మణులవిభూషణములు భూపతి దాల్పన్. 233

టీ. వెలయించునట్టి = నిర్దోషమైవెలుఁగునట్టి ఒకమణిన్=ఒకజాతిరత్నములలో నేరత్నము నైననొక్కటిని, వెలుఁగాశన్=కాంతియందుఁగల యపేక్షచేతను, కొనుము= విడువక ధరియింపుము, వెండి = ఇంతియేగాక, ధరణిన్ = భూమియందు, భూపతి = రాజు, సువేషోజ్జ్వలతకున్-సువేష = మంచి యలంకారముయొక్క, ఉజ్జ్వలతకున్ = ప్రకాశించుటకు, వాసరములన్ = ఏడు వారములయందును తాల్పన్=ధరియించుకొను టకు, మణులవిభూషణములు-మణుల = రత్నములచేఁ జెక్కఁబడిన, విభూషణములు = సొమ్ములు, వలదే = వలదా, అవశ్యముగ ధరియింపవలె నని కాదు (అనఁగా నేదాని యందైనను, ఘనమైనరత్న మొకటి ప్రకాశార్థమై నిరంతరము ధరియింపవలయు ననియు, మఱియు నేడు వారాలలోఁ గ్రమముగ నాయావారాధిపతులైన గ్రహములకుఁ జెప్పఁబడిన రత్నములసొమ్ముల నాయాదినములయం దలంకరించుకొనవలయు ననియు భావము.)

క. చేయునది రాజ్య మఁట యఘ
మే యవధిగ నీఁగువార మే మనఁ జన దా
మ్నాయంబు నశక్యాను
ష్ఠేయముఁ జెప్పదు స్వశక్తిఁ జేయఁగఁ జెప్పున్. 234

టీ. చేయునది = చేయుచుండునది, రాజ్యమఁట = ప్రభుత్వమఁట, అఘము = ఈపాపమును, ఏయవధిగన్=ఎన్నాళ్ళకు, ఏము=మేము, నీఁగువారము=పోఁగొట్టుకొనఁ గలవారము, అనన్ చనదు = అని తలంపఁగూడదు, ఆమ్నాయంబును = వేదమును, స్వశక్తిన్=శక్త్యనుసారముగా, చేయఁగన్=చేయవలయునని, చెప్పున్=విధించునుగాని, అశక్య=సాధ్యముగాని, అనుష్ఠేయమున్ = కృత్యమును, చెప్పదు=విధింపదు. (అనఁగా శక్త్యనుసారముగ ధర్మమాచరించి యధర్మపరిహార మొనర్పనఁ దోషంబు లంట వనుట.)

వ. మను దండధరాదులు విశేషించి దోషం బెఱింగి దండించిరొ ధర్మపథులనఁ బరఁగిరి ప్రజాపరిపాలనంబు పనిగాఁ బ్రజానాథుఁడు [1]బహుముఖంబులం బుట్టింపం బుట్టి విరాట్సమ్రాట్ప్రభృతి వేదోదితశబ్దవాచ్యుం డై దేవసదృశుం డగుమూర్ధాభిషిక్తుఁడు సోఁకోర్చియిలకు నగునలజళ్లు తీర్చినంగాక జన్మంబు సఫలం బగునె కేవలేంద్రియప్రీతిబందీకృత పరకళత్రపథికపరిషత్పరిహారణప్రాప్తవిత్తములః బాటచ్చరప్రభులకు జరుగదే యింత లాంపట్య మేమి పని యని యవనియెడ నవనవైముఖ్యంబు చెల్ల దెట్లనినఁ దొల్లి కృతయుగంబునఁ గృతవీర్యనందనుం డగు సహస్రబాహుం డాత్మీయదోస్స్తంభసంభృత యగు నీవిశ్వంభర నేద్వీపంబున నేనాఁట నేపీట నేత్రోవ నేక్రేవ నేవేళ నెవ్వఁ డేమి సేయం దలంచు నప్పు డందందు నసి ముసల చాపాది శస్త్రాస్త్రధారి యై తోఁచి యాజ్ఞయిడు నట్లాజ్ఞయిడ నంతిమం బగు నీయుగంబున యాగానుసారంబుగా మితసారం బగురాజలోకంబునకు శక్యంబు గాదుగదా యొక్క రాజలోకంబున కననేల యిక్కాలంబు నందలి భూసురులకు నక్కాలంబునం దలి భూమిదివిజులకుఁ గలశక్తి యున్నదె యొక్కబాడబుండు కడలినీరు గ్రుక్కం గొనియె నొక్కవిప్రుండు స్రష్టృసృష్టికిఁ బ్రతిస్రష్ట యయ్యె నొక్కబ్రాహ్మణుండు బ్రహ్మదండంబున బ్రహ్మాస్త్రంబు వారించె నట్టియనుష్ఠానంబు మాకు లేదెం దేమి ప్రయోజనం బని శక్త్యనుష్ఠానంబు వీరికి విడువవచ్చునే వీరితరుల కుపాసనీయులు గాక పోయిరె కావునసావధానుండవై శక్తికొలఁది శ్రుతదృష్టంబు లుపేక్షింపక రక్షణశిక్షణంబు లాచరించుచు నశక్యంబున కార్తశరణాగతరక్షకుం డగుపుండరీకాక్షుమీఁద భారం బిడి యనహంకృతిఁ బ్రవర్తిల్ల నెల్ల సంసిద్ధులు కరస్థంబు లగు నది యట్లుండె నట్లయిన పట్టబద్ధుం డగు రాజు ధర్మంబునంద దృష్టి యిడి నడువవలయు వరుణవైశ్రవణ వాయువైశ్వానర వాసవాదుల జన్మంబులును బహుభవారబ్ధక్రియాలబ్ధంబుల భూర్భువస్స్వరాదులగు నిజగంబులును ధర్మప్రతిష్ఠితంబులు కావునఁ దదాచరణచణుండవై ఋణత్రయంబును నీఁగి సమానులం దుత్తమశ్లోకుండ వై రాజ్యపరిపాల

1. బాహులం బుట్టించు.

నంబు సేయు మని యభిషిక్తుం జేసె నిది మదీయభక్తప్రభావం బని
యంబుజాలయ కానతిచ్చె. 28౫

టీ. మనుదండధరాదులు=మనువు యముఁడు మొదలగువారు, విశేషించి దోషం బెఱింగి దండించిరయె = మిగులదోషంబులఁ దెలిసి శిక్షించిరయె, ధర్మపరు లనఁబరఁగిరి = ధర్మాసక్తచిత్తు లని మతికెక్కిరి, ప్రజానాథుండు = చతురాననుండు, ప్రజాపాలనంబు పనిగాన్ = ప్రజాసంరక్షణార్థముగా, బహుముఖంబులన్ = ఇంద్రాదిదిక్పాలకుల యంశంబులందు, పుట్టింపన్=జననమొందింపఁగా, పుట్టి=జనించి, వి...దుపి-విరాట్ = విరాట్టు, సమ్రాట్ = సమ్రాట్టు, ప్రభృతి = మొదలగు, వేద = ప్రాఁజదువులయందు, ఉదిత = చెప్పఁబడిన, శబ్ద=వాచకపదములకు, వాచ్యుం డై=అభిధేయుం డై, దేవసదృశుండగు=దేవతలతో సరియగు, మూర్ధాభిషిక్తుండు=రాజు, సోఁడోర్చి=కష్టమునుసహించి, ఇలకున్ = భూమికి, అగు = కలుగుచున్న, అలజళ్లు = ఉపద్రవములను, తీర్చినంగాక= నివారింపఁజేయకగాని, జన్మంబు = పుట్టుక, సఫలంబగునె = సార్థకమగునా, కే...తి - కేవల=ముఖ్యముగా, ఇంద్రియ=కర్మేంద్రియములయొక్క, ప్రీతి=తృప్తి, బ...లన్ - బందీకృత = చెఱసాలలోనుంచఁబడియున్న, పర = ఇతరులయొక్క, కళత్ర = స్త్రీల చేతను, పథిక = తెరువరులయొక్క, పరిషత్ = సమూహమును, ప్రహరణ = కొట్టుట చేతను, ప్రాప్త = లభించినటువంటి, విత్తమ్ములన్ = ధనములచేతను, పాటచ్చరప్రభులకున్ = దొంగదొరలకును, జరుగదె = కాలము గడవలేదా, ఇంతలాంపట్యమేమిటని యని=ఇంతటి యాయాసమొందులకని, అవనియెడన్ = భూమిపట్ల, అ...బు అవన = రక్షించుటయందు, వైముఖ్యంబు = విముఖభావము, చెల్లదు = కూడదు, ఎట్లనినన్ = ఏలాగంటివా, తొల్లి = పూర్వకాలమందు, కృతయుగంబునన్ = కృతయుగమందు, కృతవీర్యనందనుండగు = కృతవీర్యునిపుత్త్రుండైన, సహస్రబాహుండు=సహస్రబాహుఁడనువాఁడు, ఆ...త అగు - ఆత్మీయదోఃస్తంభ = తనభుజములచేతను, సంభృత అగు = భరింపఁబడిన దైయున్న, ఈవిశ్వంభరన్=ఈభూమిని, ఏద్వీపంబునన్ = ఏదీవియందు, ఏనాఁటన్ = ఏదినమందు, ఏపీటన్ = ఏపట్టణమందు, ఏత్రోవన్ = ఏమార్గమందును, ఏక్రేవన్ = ఏకార్యమందును, ఏవేళన్ = ఏసమయమందును, ఎవ్వఁడు = ఎట్టివాఁడు, ఏమిసేయం దలంచున్ = ఏమియొనర్చుటకుఁ జింతించుచుండునో, అప్పుడు అందందున్=అప్పుడె వానినంతయు నెఱింగి యక్కడక్కడ, అ...రి ఐ - అసిముసల చాపాది = కత్తి, రోఁకలి, విల్లు లోనుగాఁగల, శస్త్రాస్త్రధారియై = శస్త్రాస్త్రముల ధరించినవాఁ డై, తోఁచి = కనఁబడి, ఆజ్ఞయిడన్ = దండించును, అట్లాజ్ఞయిడన్ = అలాగుదండించుటకు, అంతిమాంతగు = కడపటి దైన, ఈయుగంబునన్ = ఈకలియుగ

మందు, యాగానుసారంబుగాన్ = యజ్ఞములకుఁ దగినట్లు, మితసారంబగు = స్వల్ప బలముగల, రాజలోకంబునకున్ = నృపవర్గమునకు, శక్యంబుగాదుగదా, ఒక్కరాజ లోకంబునకున్ = ఒకక్షత్త్రియజనమునకు, అననేల = చెప్పనేమిటికి, ఇక్కాలంబు నందలి = ఇప్పుడున్నటువంటి, భూసురులకు = బ్రాహ్మణులకు, అక్కాలంబు నందలి = అప్పుడున్నటువంటి, భూమిదివిజులకున్ = భూసురులకును, కలశక్తి - కల = కలిగి యున్న, శక్తి=నిగ్రహసామర్థ్యము, ఉన్నదె = కలదా, ఒక్కబాడబుండు = అగస్త్యుఁ డనునొక పుడమివేల్పు, కడలినీరు = సముద్రోదక మంతయును, గ్రుక్కం గొనియెన్ = పుక్కిలియం దిమిడ్చెను, ఒక్కవిప్రుండు = విశ్వామిత్త్రుఁ డనునొకద్విజుఁడు, స్రష్టృ సృష్టికిన్ = బ్రహ్మసృష్టికి, ప్రతిస్రష్ట అయ్యెన్ = మాఱుసృష్టిచేయువాఁ డాయెను, ఒక్కబ్రాహ్మణుండు వసిష్ఠుం డనినులికెక్కినయొకమునివర్యుండు, బ్రహ్మదండంబునన్ = బ్రహ్మదండముచేత, బ్రహ్మాస్త్రంబున్ = చతురాననాస్త్రమును, వారించెన్ = మట్టుపఱిచెను, అట్టియనుష్ఠానంబు = అటువంటి తపశ్చర్య, మాకున్ లేదు=మాయందుఁగనఁబడదు, ఎందేమి ప్రయోజనం బని = దేనియం దేమికార్యమని, వీరికిన్ = ఈద్విజులకు, శక్త్యనుష్ఠానంబు = యథాశక్తి నాచరించుట, విడువవచ్చునె = త్యజింపఁదగునా, వీరు = ఈబ్రాహ్మణులు, ఇతరులకున్ = క్షత్త్రియాదులకు, ఉపాసచేయులుగాక పోయిరే = పూజ్యులుగాక యున్నారా, కావునన్=అట్లుండుటచేత, సావధానుండవై=జాగ్రత్త గలవాఁడవై, శక్తికొలఁదిన్=సామర్థ్యానుగుణముగా, శ్రుత = వినఁబడినవానిని, దృష్టంబులు = చూడఁబడినవానిని, ఉపేక్షింపక = అశ్రద్ధచేయక, రక్షణశిక్షణంబులు=శిష్టసంరక్షణదుష్టశిక్షణంబులను, ఆచరించుచున్ = చేయుచును, అశక్యంబునకున్ = నీకు నలవిగాని కార్యవిషయమై, ఆర్తశరణాగతరక్షకుండగు = దీనజనసంరక్షణబద్ధదీక్షుండగు, పుండరీకాక్షుమీఁదన్ = శ్రీమన్నారాయణునిమీఁద, భారంబిడి = బరువుంచి, అనహంకృతిన్ = అహంకారరాహిత్యముచేత, ప్రవర్తిల్లన్=సంచరింపఁగా, ఎల్లసంసిద్ధులు= సకలకార్యసిద్ధులును, కరస్థంబులగున్ = అఱచేతిలోనుండునవి యగును, అవియట్లుండె= అది యాలాగుండెను. అట్లైన = అవిధమైన, పట్టబద్ధుండగు=పట్టముగట్టఁబడిన, రాజు = ప్రభువు, ధర్మంబునంద = ధర్మమునందే, దృష్టియిడి = జ్ఞప్తియుంచి, నడపవలయున్ = ప్రవర్తింపవలయును, వ...లు - వరుణవైశ్రవణ వాయువైశ్వానర వాసవాదుల = వరుణ కుబేరానిలధనంజయేంద్రాదులయొక్క, జన్మంబులును = ఉత్పత్తులును, బ...ల - బహుభవారబ్ధ = అనేకజన్మములయం దారంభింపఁబడిన, క్రియా = యాగాదిక్రియల చేతను, లబ్ధంబుల = పొందఁబడిన, భూర్భువస్స్వరాదులగు, ఇజ్జగంబులును = ఈలోకములును, ధర్మప్రతిష్ఠితంబులుకావునన్=ధర్మమునందియుండునవిగనుక, తదాచరణచణుం

రవై = దాని నాచరించుటయందు దక్షుండ వై, ఋణత్రయంబును = ఋషిదేవపితృ ఋణములను, నీఁగి = తీర్చి, సమానులందుర్ = నీతోడివారలలో, ఉత్తమశ్లోకుండ వై = కీర్తికరుండ వై, రాజ్యపరిపాలనంబు = ప్రజాపరిపాలనంబు, చేయు మని = ఒనర్పు మని, అభిషిక్తుఁ జేసెన్ = పట్టాభిషిక్తుఁగావించెను, ఇది = నాచేతఁ జెప్పఁబడిన యీసంగతి, మదీయభక్తప్రభావం బని = నాభక్తుని ప్రభావ మని, అంబుజాలయకున్ = లక్ష్మీదేవికి, ఆనతిచ్చెన్ = తెలియునట్లు సెలవిచ్చెను.

శా. దుగ్ధాంభోధిమహాగృహోత్సుక ! సుధాంధోబృందచూడామణీ
రుగ్ధారాశబలీకృతాంఘ్రియుగ ! కారుణ్యాంబుసింధూభవ
ద్దృగ్ధామా ! ధృతమంథ ! సింధురవరార్తిక్షేపిదోశ్చక్ర ! శ్రీ
ముగ్ధాలాపరసాదరా ; కృతపలాన్మూర్ఛస్వనోద్యద్దరా ! 286

టీ. దు...క - దుగ్ధాంభోధి = పాలసముద్ర మనియెడు, మహాగృహ = గొప్ప మందిరమందు, ఉత్సుక = ఆసక్తుఁడ వైనస్వామీ, సుధాం...యుగ - సుధాంధన్ బృంద = వేల్పులగుంపులయొక్క, చూడామణీ = శిరోరత్నములయొక్క, రుగ్ధారా = కాంతిపరంపరచేతను, శబలీకృత = శబలవర్ణముగాఁ జేయంబడిన, అంఘ్రియుగ = పాదయుగళము గలవాఁడా, కా...మా - కారుణ్యాంబు = దయారస మను నీటికి, సింధూభవత్ = సముద్రమగుచున్న, దృక్ = చూపులకు, ధామా = ఉనికిపట్టైన వాఁడా, ధృ...థ - ధృత = మోయఁబడిన, మంథ = కవ్వపుఁగొండగలవాఁడా, సిం...క్ర - సింధురవర = గజేంద్రునియొక్క, ఆర్తి = ఖేదమును, క్షేపి = పోఁగొట్టు చున్నటువంటి, దోః = భుజమందలి, చక్ర = చక్రాయుధముగల స్వామీ, శ్రీ...రా- శ్రీ = లక్ష్మీదేవియొక్క, ముగ్ధాలాప = ముద్దుపలుకులయందును, రస = శృంగారాదిరస ములయందును, ఆదరా = ఆదరముగల యోస్వామీ, కృ...రా - కృత = చేయఁబడిన, పలాత్ = రక్కసులయొక్క, మూర్ఛ = మూర్ఛగల, స్వన = ధ్వనిచేతను, ఉద్యత్ = విజృంభించుచున్న, దరా = శంఖముగల యోస్వామీ, యని యాశ్వాసాంతమున భగ వత్ప్రార్థన.

క కరధృతదరారివితరణ
పరిపాలితతొండమాన్నృపాలక ? పునరు
త్తరితనరవస్త్రబాలక !
శరణాగతసేవధీ ! భుజంగాశరధీ ! 287

టీ. కర...లక - కరధృత = హస్తముచేత ధరింపఁబడిన, దర = శంఖము యొక్కయు, అరి = చక్రముయొక్కయు, వితరణ=ఇచ్చుటచేత, పరిపాలిత=రక్షింపఁబడిన, తొండమాన్నృపాలక = తొండమాన్‌చక్రవర్తి యను రాజు గలవాఁడా, (తొండమాన్ చక్రవర్తికి శంఖచక్రము లిచ్చె ననుట ప్రసిద్ధము), పు...క-పునరుత్తరిత = మరలఁ బ్రతికింపఁబడఁగ, నర = విజయునికి, నప్తృ = మనుమఁడైన, బాలక= చిన్నవాఁడు గలవాఁడా. శ...ధీ - శరణాగత = శరణు పొందినవారికి, సేవధీ = నిధియైన యోస్వామీ, భు...థీ - భుజంగాశ=గరుత్మంతునిచేత, రథీ=రథముగల స్వామీ.

మత్తకోకిల. కుండలిద్విషదుగ్రకేతన ? గోత్రభిద్ద్రుమహారిదో
శ్చండిమోత్పులకీకృతాంగక సత్య ! దౌత్యకురూక్త వా
క్పండితత్వయశోనిధీకృత పాండవేయ ! కపర్దికో
దండఖండన పాటవాంచదుదారదారసమాగమా! 233

టీ. కుం...న - కుండలి = సర్పములకు, ద్విషత్ = శత్రువైన గరుత్మంతుఁడే, ఉగ్ర=భయంకరమైన, కేతన=ధ్వజముగాఁ గలవాఁడా, గో...త్య - గోత్రభిత్=దేవేంద్రునియొక్క, ద్రుమ=వృక్షమును, హారి = హరించినటువంటి, దోః=భుజములయొక్క, చండిమ = అతికోపముచేతను, ఉత్పులకీకృత = పులకాంకురయుక్తముగాఁ జేయఁబడిన, అంగక = అవయవములుగల, సత్యా=సత్యభామ గలవాఁడా, దౌ...య - దౌత్య=దూతభావముచేతను, కురు = కౌరవులవిషయమందు, ఉక్త = పలుకఁబడిన, వాక్ = మాటలయందు, పండితత్వ = పాండిత్యముచేతను, యశోనిధీకృత = కీర్తిమంతులుగాఁ జేయఁబడిన, పాండవేయ=పాండుకుమారులుగల స్వామీ, క...మా - కపర్ది=శివునియొక్క, కోదండ = వింటియొక్క, ఖండన=విఱుచుటయందలి, పాటవ=నేర్పుచేత, అంచత్= ఒప్పుచున్నటువంటి, ఉదార = గొప్పది యైన, దారసమాగమా = సీతాసంయోగముగల స్వామి.

మ. ఇది సింహాచలదంభకేసరిపదాభీష్టార్చనాపుణ్యాల
బ్ధదురుట్టంకణ పొట్టునూరివిజయస్తంభోపలోట్టంకితాం
కదృఢేష్టాక్షర కృష్ణరాయనృపసంజ్ఞాస్తత్కృతాముక్తమా
ల్యద నాశ్వాసవరంబు నాలవది హృద్యంబై మహిం బొల్పగున్.

టీ. ఇది, సిం...దక్ - సింహాచల=సింహాద్రియందలి, దంభకేసరి = మాయానృసింహుఁడైన స్వామియొక్క, పద=పాదములయొక్క, అభీష్ట=ఇష్టము లైన, అర్చ

సా = భూజలచేతనైనట్టి, పుణ్య=సుకృతముచేత, లబ్ధ = పొందఁబడినటువంటి, దురుట్టంకణ=ప్రయత్నముచే సాటఁదగినటువంటి, పొట్టునూరి=పొట్టునూరియందలి, విజయస్తంభోపల=తాళిజయస్తభమందు, ఉట్టంకిత = వ్రాయఁబడినటువంటియు, అంక=బిరుదైనటువంటియు, దృఢశాశ్వతమైనటువంటి, ఇష్టాక్షర = అభిమతవర్ణములు గల్గిన, కృష్ణరాయనృపసంజ్ఞ = కృష్ణరాయధరణీకాంతుండనియెడు పేరుగల్గిన, అస్మత్=నాచేత, కృత=రచింపఁబడిన, ఆముక్తమాల్యదన్ = ఆముక్తమాల్యద యను ప్రబంధమందు, నాలవది=నాలవది యైన, ఆశ్వాసవరంబు=శ్రేష్ఠమైనయాశ్వాసము, హృద్యంబై=సకలకవిజనమనోహరంబై, మహిన్ = భూమియందు, పొల్పుగన్ = ప్రసిద్ధ మౌను.

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తిమంత్రోపాసనాసమాసాదితాఖండసాహితీధురీణుండు నాత్రేయగోత్రపవిత్రుఁడును వావిళ్లవంశపయోరాశిరాకాసుధాకరుండు నగు రామస్వామిశాస్త్రిచేత ననేక పూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యాలోచించి రచియింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యద వ్యాఖ్యానంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీరస్తు

ఆముక్తమాల్యద

సవ్యాఖ్యానము

పంచమాశ్వాసము

క. శ్రీనీళాజాంబవతీ
మానసతామరసవిహరమాణమిళిందా!
భానద్యుదయకళిందా!
నానాంఘ్రిశిరోక్ష! శేషనగహర్యక్షా! 1

టీ. శ్రీ...దా - శ్రీ = లక్ష్మీదేవియొక్కయు, నీళా = నీళాదేవియొక్కయు, జాంబవతీ = జాంబవతీదేవియొక్కయు, మానస=మనస్సు లనియెడు, తామరస=తామర పూవులయందు, విహరమాణ = విహరించుచున్న, మిళిందా = భృంగమా, భా...దా-భా=శరీరకాంతి యనియెడు, నదీ = యమునానదియొక్క, ఉదయ=ఉత్పత్తికి, కళిందా = కళింద మనుపేరుగల పర్వతమా, (కాళిందీనది కాంతివంటి శరీరకాంతిగల వాఁ డనుట.), నా...క్ష-నానా = అపరిమితములైన, అంఘ్రి=పాదములును, శిరః= శిరములును, అక్ష = కన్నులును గలవాఁడా, (ఇది పురుషసూక్తప్రశస్తము.), శే...క్షా-శేషనగ=శేషాచలమందు, హర్యక్షా=సింహమా, అని స్వామికి విశేషణములు.

వ. అవధరింపు మవ్విష్ణుచిత్తుండు. 2

టీ. అవధరింపుము = చిత్తగింపుము, అవ్విష్ణుచిత్తుం డనుకర్తృపదము ముందటి పద్యమున కన్వయింపఁగలదు.

మహాస్రగ్ధర

ఒకనాఁ డామ్రాంకురౌఘంబును గుసుమకుడుంగోదరశ్రేణిఁ దల్ప
ప్రకరంబై కాంక్షచే ముగ్ధపతులఁ బరిపైఁ బ్రౌఢి వాటించి నిట్టూ
ర్పెక వోట్టన్ డస్సి వీరాయిత మఱి మఱి తా రెట్లమున్నట్లయానా
యికలం గందప్పుడోటం బెఱిఁగి తఱిమి నీఁ బేసె నా నంటుతోఁటన్. 3

టీ. ఒకనాఁడు=ఒక్క దినమందు, (ఇచ్చట సప్తమికిఁ బ్రథమ.), ఆమ్రాంకుర = మామిడిచిగుళ్ళయొక్క, ఓఘంబు = సమూహము, ఉరు=గొప్పలగు, కుసుమకుడుంగ = పూవులపొదలయొక్క, ఉదర = అంతఃప్రదేశములయందలి, క్షోణిన్ = భూమియందు, తల్పప్రకరంబై-తల్ప = సెజ్జలయొక్క, ప్రకరంబై=పరంపర యై, కాంక్షచేన్ = కోరికచేత, మున్ = ప్రథమమందు, పతులన్=తమ నాయకులను, పదరి=రజ్జులాడి, పైఁబ్రౌఢి - పైన్ = పైగా, ప్రౌఢి = సురతనైపుణ్యమును (పైప్రౌఢి అను పాఠమున ఉపరిసురత నైపుణ్యము నని యర్థము.) పాటించి=ఉపక్రమించి, నిట్టూర్పు= ఉచ్ఛ్వాసము, ఎకదొట్టన్ = ఉద్గతముకాఁగా, డస్సి = ఆయాసపడి, వీరాయితము = ఆయుపరతిని, అఱి = ఉడిగి, మఱి = పిమ్మట, తారు = తాము, (ఆనాయిక లనుట.) మున్ను = ఉపరతికిఁ బూర్వమందు, ఎట్ల = ఏ విధమో, అట్లయా=అవిధముగానేయగు, (మరలఁ గ్రిందైరనుట.), నాయికలన్ = స్త్రీలను, కందర్పుఁడు=మన్మథుఁడు, ఓటంబు= ఓడిపోవుటను, ఎఱిఁగి = తెలిసి, తఱిమి = వెంబడించి, వీఁపేసె నాన్ = వీఁపునఁ గొట్టెనో యనగా, అంటు = అంటుకొన్న, తోఁటన్ = ఉద్యానమునందు, (ఈపద్యమునందు ఆమ్రాంకురౌఘం బనునది కర్తృపదము, అంటు అను ధాతువుతోఁద నన్వయింపఁదగినది. మఱియు విష్ణుచిత్తుం డను కర్తృపదముతో నన్వయింపఁదగిన క్రియాపదము పై పద్యమం దున్నది.)

తా. మామిడి చిగుళ్ళ శయ్యలయందు స్త్రీపురుషులు చేరి యుపరతమందుఁ బురుషుల నోడించునట్లు నాయికలు పంతగించి తాము పురుషులపైఁ జేరి యుపరతి సల్పుచు, నాయాసమువలన రొఁజుచు నుపరతిఁ జాలించి పూర్వము తా మెట్లు క్రిందై యుండిరో యట్లే మరలఁ బురుషులకు గ్రిందైరి. కావున, నా సం దెఱింగి మన్మథుఁడు స్త్రీలు ఉపరతి చాలించి యోడినందులకుఁ గుఱుతుగా నోడినవారిని వీఁపునఁ గొట్టుట ప్రసిద్ధ మగుటవలన వారిని వీఁపునఁ గొట్టఁగా నైన గాయములో యనునట్లు మున్ను శయ్యగాఁ బఱచికొన్న యాచిగుళ్లే చెమ్మటలుగల స్త్రీలవీఁపున నంటుకొని యుండెను. ఇట్టివనమం దొక్కనాఁడు విష్ణుచిత్తుండు అని వెనుక పద్యములో నన్వయము.

గో దా దే వి

ఉ. వింగడ మైన యొక్కవనవీథిఁ గనుంగొనె నీడ సున్నపున్
రంగుటరంగు పచ్చలయరం గయి పో వెలిదమ్మిబావికిం
జెంగట నుల్లసిల్లు తులసీవనసీమ శుభాంగి నొక్కబా
లం గురువిందకందళదళ ప్రతిమాంఘ్రికరోదరాధరన్. 4

టీ. వింగడము = విశాలము, ఐన, ఒక్క వనవీథిన్ = ఒక శృంగారవనశ్రేణి యందు, సున్నపున్ రంగుటరంగు=సున్నపురంగు గల తెల్లనితిన్నె, నీడన్=వనచ్ఛాయ చేత, పచ్చలయరంగయిపోన్ = మరకతమయవేదిక యగుచుండఁగా, వెలిదమ్మిబావి కిన్ = తెల్లదామరపూవులుగలబావికి, చెంగటన్ = సమీపమందు, ఉల్లసిల్లు = ప్రకాశించుచున్న, తులసీవనసీమన్ = తులసీవనప్రదేశమందు, శుభాంగిన్ - శుభ = శుభలక్షణయుక్తము లగు, అంగిన్ = అవయవములు గలిగినట్టియు, కు...రన్ - కురువింద = కురువింద మను పేరుగల యొక జాతి కెంపులయొక్క, (సీ. 'సలలిత మత్త కోకిలలోచనద్యుతిఁ దనరారుఁ గురువింద మనెడుకెంపు' అని రత్నశాస్త్రము.) కందళ= మొలకలయొక్క, దళ = చెక్కులతోఁడ, ప్రతిమ = సరియైన, అంఘ్రికరోదర = పాద తలహస్తతలములును, అధరన్ = మోవియుఁగలదానిని, ఒక్క బాలన్ = ఒక బాలి కను, కనుంగొనెన్ = విష్ణుచిత్తుఁడు చూచెను.

తా. విష్ణుచిత్తుఁడు శృంగారవనవీథిలో నీడలు దేఱెడు తెల్లని సున్నపురంగు గల యరఁగు చెట్టుల నీడలచేత మరకత మయమైనట్లు కనఁబడు చుండఁగా, దాని సమీపమునందలి తెల్లదామరకొలని చెంగట నొక్క తులసీవనమందు శుభలక్షణ లక్షితరాలగు నొక స్త్రీ శిశువును జూచెను. తద్గుణాలంకారము.

చ. కనుఁగొని విస్మయం బొదవఁగాఁ గదియం జని సౌకుమార్యమున్
దనురుచియును స్సులక్షణవితానముఁ దేజముఁ జెల్వుఁ గొంత సే
పనిమిషదృష్టిఁ జూచి యహాహా యనపత్యున కమ్మకుందుఁడే
తనయఁగ నాకు నీశిశువుఁ దాఁ గృప సేసె నటంచు హృష్టుఁడై. 5

టీ. కనుఁగొని=చూచి, విస్మయంబు ఒదవఁగాన్=ఆశ్చర్య మంకురింపఁగా, కదియన్ చని=సమీపించిపోయి, సౌకుమార్యమున్ = సుకుమారత్వమును, తనురుచియున్= దేహకాంతియును, సు..మున్-సులక్షణ = శుభలక్షణములయొక్క, వితానమున్ = సమూహమును, తేజమున్ = తేజస్సును, చెల్వున్ = సౌందర్యమును, కొంతసేపు = కించిత్కాలము, అనిమిషదృష్టిన్ = ఱెప్పపాటులేనిచూపుచేత, చూచి = వీక్షించి, అహాహా=ఆశ్చర్యము, అమ్మకుందుఁడే=ఆవిష్ణుదేవుఁడే, అనపత్యునకున్ = సంతానము లేనివాఁడనగు నాకు, తనయఁగన్ = కూఁతుఁగా, ఈశిశువున్ = ఈబిడ్డను, తాన్ = తాను, (విష్ణువనుట,) కృపసేసెన్ = దయచేసెను, అటంచున్ = అనుకొని, హృష్టుఁడై = హర్షము గలవాఁడై.

తా. సుగమము.

క. కొనిపోయి ధర్మగేహిని
కనురక్తి నొసంగఁ బొంగి యాయమయును జేఁ
పు నిజస్తన్యంబుల చేఁ
బెనిచె న్గోమొప్ప నిట్లు పెరుఁగఁ గ్రమమునన్. 6

టీ. కొనిపోయి=ఆ శిశువును దీసికొనిపోయి, ధర్మగేహినికిన్=తన భార్యకున్, అనురక్తిన్ = అనురాగముతో, ఒసంగన్=ఇయ్యఁగా, పొంగి=సంతోషించి, ఆయమయును=ఆమెయును, చే... చేన్ - చేఁపు=పొంగివచ్చుచున్న, నిజస్తన్యంబులచేన్-నిజ=స్వకీయములగు, స్తన్యంబులచేన్ = చనుఁబాలచేతను, గోము = గారాము, ఒప్పన్ = పొందికయగునట్లు, పెనిచెన్ = సాఁకెను, ఇట్లు పెరుఁగన్ = ఈవిధమునఁ బెరుఁగుచుండఁగా, క్రమమునన్ = క్రమక్రమముగా నని ముందటి పద్యమున కన్వయము.

సీ. వాతెఱ తొంటికైవడి మాటలాడదు
కుటిలవృత్తి వహించెఁ గుంతలంబు
లక్షులు సిరులు రా నఱచూడ్కిఁ గనుఁగొనె
నాడించె బొమగొని యాననంబు
చనుఁగొమ లెన్గయవక్షముపేక్షఁ గడకొత్తెఁ
బాణిపాదము లెఱ్ఱవాఱఁ దొడఁగె
సారెకు మధ్యంబు దారిద్ర్యముల చెప్పె
జూచొర్వ కిటులొఁగఁ జొచ్చె మేను
తే. వట్టిగాంభీర్య మొక్కఁడు వెట్టుకొనియె
నాభి నానాఁటి కీగతి నాఁటిపొందు
చవుకయైనట్టి యిచ్చటఁ జనదు నిలువ
ననుచు జాఱెనకరణి బాల్యంబు జాఱె. 7

టీ. వాతెఱ = అధరోష్ఠము, తొంటికైవడిన్=పూర్వమువలె, మాటలాడదు = సంభాషింపదు, (యౌవన ప్రాదుర్భావము కాఁగానే రాజసము హెచ్చె ననుట.) కుంతలంబులు=తలవెండ్రుకలు, కుటిలవృత్తిన్=కుటిలవ్యాపారమును, వహించెన్ = ధరియించెను, (పూర్వమువలె సాధారణముగ నుండక కౌటిల్యమును దాల్చె నని యర్థము, వంకర లాయె నని భావము.), అక్షులు = కన్నులు, సిరులు రాన్ = సంపదలు దమకు రాఁగానే, అఱచూడ్కిన్ = సగముచూపు చేత, కనుఁగొనెన్=చూచెను. (చిన్ననాఁటి వలెఁ జూడ దని యర్థము, యౌవనాతిశయముచేత రక్త శ్వేత నీలవర్ణములు గలిగి

మెఱుఁగెక్కె విలాసములు గలిగె నని భావము.), ఆననంబు = ముఖము, బొమగొని = కనుబొమ ముడివైచి, ఆడించెన్ = కదలించెను. (పరిహాసమునకు బొమలాడించె నని యర్థాంతరము. మొగము చిట్లించుకొనె నని యర్థము. జవ్వనమునఁ గనుబొమలకు గాంతి యెక్కె నని భావము.), చనుఁగొమల్ = స్తనములనెడి కొమ్ములు, నెగయన్ = ఎగయఁగా, వక్షము = ఱొమ్ము, ఉపేక్షన్ = ఒప్పరికించుటచేత, కడకొత్తెన్ = ఆవలద్రోఁచెను (స్తనము లనియెడు వస్త్వంతరములు గలుగఁగానే త న్నుపేక్షించి చేర నీయక మూలకుఁ ద్రోచె నని యర్థము. జవ్వనమందుఁ జన్నులు చెన్నుమీఱె నని భావము.), పాణిపాదములు = కరపాదములు, ఎఱ్ఱవాఱఁదొడఁగెన్ = కెంపుకచేత నరుణవర్ణము వహించెను, (యౌవనము రాఁగానే కాలుసేతులు మిగులఁ దొగరుజిగి యెక్కె నని భావము.) సారెకున్ = మాటిమాటికి, మధ్యంబు = నడుము, దారిద్ర్యముల = తన లేములే, చెప్పెన్ = ఉచ్చరించెను. (తన లేమియే తెలుపును గాని పిన్ననాఁటివలెఁ గలిమిఁ దెలుప దని యర్థము, నడుము సన్నమయ్యె నని భావము.), మేను = శరీరము, ఓర్వక = మునుపటివలె మాలిన్యము నోర్వక, ఇటు = ఈప్రకారముగా, లోఁగఁజొచ్చెన్ = సంకోచింప నారంభించెను, (సందడి కోర్వ దని యర్థము, నాగరకము హెచ్చయ్యె నని భావము.), నాభి = పొక్కిలి, వట్టిగాంభీర్యమొక్కఁడు = ప్రయోజనములేనియొక్క గంభీరతను, పెట్టుకొనియెన్ = ఉంచుకొనెను. (తొల్లింటియట్లు గాక బెట్టుగా నుండె నని యర్థము. మిక్కిలి లోఁతాయె నని భావము.), నానాఁటికిన్ = నాఁడునాఁటికి, ఈగతిన్ = ఈవిధముచేత, నాఁటిపొందు = అలనాఁటి స్నేహము, చవుకయైనట్టి = ఎల్లిదమైనట్టి, ఇచ్చటన్ = ఈయమశరీరమందు, నిలువఁజనదు = ఉండఁగూడదు, అనుచున్ = ఇట్లని, జాఱినకరణిన్ = వదలిపోయినట్టుగా, బాల్యంబు = పసితనము, జాఱెన్ = తొలఁగిపోయెను. శ్లేషోత్థాపితోత్ప్రేక్షాలంకారము.

శా. హేమాభాంగవిభాధరారుణిమవక్త్రేందుప్రభాశ్రీలఁ ద
ద్భామారత్నము వొందవయ్యె మును దత్తద్వర్ణయుక్తాఖ్యలన్
శ్యామాత్వం బళిగర్వధూర్వహకచచ్ఛాయాచ్ఛటం గాంచె నొఁ
గా మున్నర్వ 'శిరగప్రధాన' మనువాక్యం బెమ్మెయిం దప్పునే. ౪

టీ. తద్భామారత్నము = ఆకన్యారత్నము, మును = మొదలను, హే...లన్- హేమాభాంగవిభా - హేమ = బంగారుయొక్క, ఆభా = కాంతివంటికాంతిగల, అంగ = నెమ్మేనియొక్క, విభా = పచ్చనికాంతియొక్కయు, అధరారుణిమ - అధర = వాతెఱయొక్క, అరుణిమ = ఎఱ్ఱనికాంతియొక్కయు, వక్త్రేందుప్రభా-వక్త్ర = నెమ్మొగముయొక్క, ఇందుప్రభా = చంద్రకాంతియొక్కయు, శ్రీలన్ = సంపదలచేత

తత్తద్వర్ణయుక్తాఖ్యలన్ - తత్తత్ = ఆయా, వర్ణ = పీతరక్తాదులగు వన్నెలకు, యుక్త = తగినట్టి, ఆఖ్యలన్ = నామధేయములను, పొందదయ్యెన్ = పొందనియదియయ్యెను. అ...టన్ - అళిగర్వధూర్వహ - అళి = తుమ్మెదలయొక్క, గర్వ = గర్వముయొక్క, ధూః = భారమును, వహ = వహించిన, కచ = క్రొమ్ముడియొక్క, ఛాయా=నీలకాంతులయొక్క, ఛటన్ = సముదాయముచేత, శ్యామాఖ్యంబు = శ్యామలవర్ణము గలిగిన దనుటను, ('శ్యామా యౌవనమధ్యస్థా' యని యునికిం జేసి యౌవన మధ్యస్థభావము ననుట.) కాంచెన్ = పొందెను, కాఁగా = యుక్తమేకదా, మున్ను = పూర్వమందు, ఉర్విన్=భూమియందు, శిరఃప్రధాన మను=శిరస్సే ప్రధాన మనియెడు, వాక్యంబు= మాట, ('సర్వస్య గాత్రస్య శిరః ప్రధాన' మ్మనియెడు వాక్యము.) ఎమ్మెయిన్=ఏరీతిచే నైనను, తప్పునే = తప్పునా, తప్ప దనుట.

తా. ఆకన్యక శరీరము బంగారువన్నెగలిగి యున్నదానివలన నొండె, అధరోష్ఠమెఱ్ఱఁగానుండినదానివలన నొండె, నెమ్మోము చందురువన్నె గలిగి యుండినదానివలన నొండె, తత్తద్వర్ణానుసరణముగా హేమాంగి, బింబోష్ఠి, చంద్రముఖి యనియెడు నిట్టి నామములు వహింపక తేఁటులతో దీటగు నల్లని తలవెండ్రుకలకాంతి కనుగుణముగ శ్యామ యను నామము వహించెను. శ్యామ యన యౌవనమధ్యస్థురా లనియును, సర్వ శరీరమందు శిరమే ప్రధాన మగుటచేత నా శిరఃకాంతియే ప్రధానముగా నా పేరు వచ్చె ననియును భావము. హేతూత్ప్రేక్ష.

క. ఆయతభుజైకచక్రుం
డాయదుపతి దొమ్మిఁ గెలువ నదరుమరుని కా
లాయసచక్రపరంపర
లో యన నుంగరపుఁగురులు యువతికి నమరున్. 9

టీ. ఆ...డు-ఆయత = నిడుదయగు, భుజ = భుజమందు, ఏక = ఒక్కటైన, చక్రుండు=సుదర్శనచక్రముగల, ఆయదుపతిన్=ఆప్రసిద్ధుఁడగు శ్రీకృష్ణుని, దొమ్మిన్= క్రందుకయ్యముచేతను, గెలువన్ = జయించుటకొఱకు, అ...లో - అదరు = విక్రమించుచున్న, మరుని = స్మరునియొక్క, కాలాయసచక్రపరంపరలో-కాల = నల్లనైన, ఆయస = ఉక్కుతోఁ జేయఁబడిన, చక్ర=చక్రములయొక్క, పరంపరలో = సమూహములో, అనన్ = అనునట్లు, ఉంగరపుఁగురులు = కుటిలకుంతలములు, యువతికిన్ = ఆయువిదకు, అమరున్ = ఒప్పును. ఉత్ప్రేక్ష.

తా. ఈ గోదాదేవి శ్రీకృష్ణుని మోహింపఁగలది యై యున్నదిగావున, నొక్క చక్రము మాత్రము గలిగిన యా శ్రీకృష్ణుని గెలుచుటకై యుద్యోగించిన మన్మ

ధుని యుక్కుచక్రముల గుంపులో యన్న ట్లాయువతియొక్క యుంగరములుగాఁ బ్రకాశించుచున్న తలపెండ్రుక లొప్పును.

తే. సకలసీమంతినీలోకసమతిశాయి
భాగ్యవర్ణావళులు వ్రాసెఁ బద్మగర్భుఁ
డనఁగఁ గర్పూరతిలక రజోవదాత
ఫాలమునఁ గుంతలశ్రేణి పడఁతి కమరు. 10

టీ. పడఁతికిన్ = ఆ చెలువకు, పద్మగర్భుఁడు = బ్రహ్మదేవుఁడు, స...లు-సకల = సమస్తమైన, సీమంతినీ = స్త్రీలయొక్క, లోక = జనములను, సమతిశాయి = మిక్కిలి యతిశయించుచున్న, భాగ్య = భాగ్యముగల, వర్ణ = అక్షరములయొక్క, ఆవళులు = పఙ్క్తులను, వ్రాసె ననఁగన్ = లిఖయించెనో యనునట్లు, కర్పూరతిలక=కపురంపుఁదిలకముయొక్క, రజః = పరాగముచేత, అవదాత = ధవళవర్ణముగల, ఫాలమునన్ = నెన్నుదిటియందు, కుంతలశ్రేణి = ముంగురులగుంపు, అమరున్ = ప్రకాశించును.

తా. కర్పూరతిలకముయొక్క పరాగముచేతఁ దెల్లనైన లలాటమందు నల్లని ముంగురు లాలయు చుండఁగా, నీ యమ యెల్లపల్లవాధరలకంటె నధికతమ భాగ్యము గలది యగు నని తమ్మిచూలి వ్రాసిన శుభాక్షరములవలె నుండెను. వస్తూత్ప్రేక్ష.

శా. సైరంధ్రు ల్పయి కెత్తి కజ్జలముఁ బక్ష్మశ్రేణికం దీర్ప వా
లారుంగన్నులమీఁదఁ జూచుతఱి ఫాలాంచచ్చతుర్థీనిశా
స్ఫారేందుం గనె వక్త్ర మక్కనుటఁగా పర్వేందుఁ డాత్మప్రభా
చోరుం డుండఁగఁ దన్నుఁ దద్గతవిభాచోరం బనున్ లోకముల్.॥

టీ. వక్త్రము=ఆమె ముఖము, సైరంధ్రులు=అలంకరించెడు స్త్రీలు, పయికెత్తి = పైకెగయనెత్తి, కజ్జలమున్ = కాటుకను, పక్ష్మశ్రేణికన్ = తొంగలిఱెప్పలయందు, తీర్పన్ = దిద్దుచుండఁగా, వాలారుంగన్నులన్ = నెఱిసోగలగు నేత్రములచేత, మీఁదన్ = ఊర్ధ్వభాగమందు, చూచుతఱిన్ = ఈక్షించునప్పుడు, ఫాల = లలాటమనియెడు, అంచత్ = ఒప్పుచున్న, చతుర్థీనిశా = చవితినాఁటిరాత్రియందు, స్ఫారేందున్-స్ఫార = ప్రకాశించుచున్న, ఇందున్ = చందురుని, కనెన్=చూచెను, అక్కనుటగా = ఆచూచుటచేతనేకదా, పర్వేందుఁడు = పున్నమనాఁటి చందమామ, ఆత్మప్రభాచోరుండు - ఆత్మ = తనయొక్క (ముఖముయొక్క యనుట), ప్రభా = కాంతులయొక్క, చోరుండు = మ్రుచ్చు, ఉండఁగన్ = కానవచ్చుచుండఁగా, తన్నున్ = ముఖము ననుట, లోకములు = జనములు, తద్గతవిభాచోరంబనున్ -

కల్ = ఆచంద్రుని, గత = పొందిన, విభా = కాంతియొక్క, చోరంబు అగున్ = దొంగ యగును.

తా. సైరంధ్రులు ముఖమును బైకెత్తి ఱెప్పలయందుఁ గాటుక పెట్టుచుండఁగా, విశాలము లగు నేత్రములచేత స్వభావముగాఁ బైని జూచునప్పుడు లలాట మనియెడు చవితినాఁటి చంద్రుఁడు గనఁబడుటం జేసి యా దోషమున నీ మొగముఁ జూచిన వారెల్ల ముఖకాంతి దొంగిలిన పూర్ణచంద్రుఁ డటుండఁగా, నీ నెమ్మొగమే చంద్రుని కాంతిని దొంగిలించిన దని వచింతురు. ఇందువలనఁ గాంతిచే ముఖచంద్రుల కభేద మని భావము. రూపకాపహ్నుత్యనుప్రాణితోత్ప్రేక్ష.

చ. కనుఁగవఁ దన్నుఁ గెల్వఁగ మృగం బలసూదున కిందు రేఁతు నే
ననిి రుచిదక్కఁ దత్పరిమళాఢ్యత లేమి నతండు గొంకఁ దా
నినుపఁ జన న్బగం దనదునెత్తుటఁ బొట్టిడుకొంట కాక వా
సనక యన న్మొగం బమరుఁజామకు ఫాలము పచ్చికస్తురిన్. 12

టీ. మొగంబు = ముఖము, కనుఁగవన్ = నేత్రద్వయముచేత, తన్నున్ = మృగము ననుట, గెల్వఁగన్ = జయింపఁగా, మృగంబు = ఇఱ్ఱి, అలసూదునకున్ = అవిరోధమునకు, నేను = మృగ మనుట, ఇందున్ = చంద్రుని, రేఁతున్ = ప్రేరేఁపుదును, అని = అనుచు, రుచిదక్కన్ = కాంతిదప్ప, తత్పరిమళాఢ్యత-తత్ = ఆముఖమందలి, పరిమళ = పరిమళమువంటి పరిమళముచేత, ఆఢ్యత=చాలియుండుట, లేమిన్= లేకుండుటచేత, అతండు = ఆచంద్రుఁడు, కొంకన్ = సంకోచింపఁగా, తాన్ = ఆ మృగము, నినుపన్ = నింపుటకు, (నిండించుటకనుట.), చనన్ = పోవఁగా, పగన్ = చలముచేత, తనదు = అమృగముయొక్క, నెత్తుటన్ = రక్తముచేత, బొట్టిడుకొంట కాక = తిలకముపెట్టుకొనుటేకాని, వాసనక = వాసనకా, అనన్ = అనునట్లుగా, చామకున్ = ఆశ్యామకు, ఫాలము = లలాటము, పచ్చికస్తురిన్ = క్రొత్తకస్తూరిచేత, అమరున్ = ఒప్పును.

తా. ఆశ్యామయొక్క ముఖము లలాటమందలి కస్తూరితిలకముచేతఁ బ్రకాశించుచుండఁగా, నాముఖము తనయందలి కన్నుదోయిచేత నిఱ్ఱిని జయింపఁగా, నాపగఁ దీర్చుకొనుటకుఁ జంద్రునితోఁ గలిసికొని యామొగమును గెల్చుటకు నతనిఁ దోడు రమ్మన, ముఖమునకువలెఁ దనకును గాంతియున్నదే కాక, పరిమళము లేమిం జేసి యతఁడు సంశయించుచుండఁగా నామృగ మనఁగా గస్తూరి మృగ మగును గావున నది పరిమళమును నతని కొసంగఁ బూనుకొనఁగా, నిదియంతయు సహింపక యామొగము మృగము నెత్తుటి

చేతఁ దిలక మంచుకొనేనే కాక వాసనకొఱకుఁ గాదు. మఱియు సమస్తపరిమళములు ముఖమందుఁ గలిగి యున్నవి. ఉత్ప్రేక్ష.

తే. కడిఁది విలు చేఁదిగుఱికిఁ గీలుకఱచి నిలుపు
మరుని కువలయశరము కంపములఁ బోలుఁ
దార కడకంటికై సారెఁ జేరిచేరి
వేగ మగుడ సలజ్జదృగ్విభ్రమములు. 13

టీ. తార = కనుగ్రుడ్డు, కడకంటికై = నేత్రాంతమువఱకు, సారె=మాటిమాటికి, చేరిచేరి=ప్రవేశించి ప్రవేశించి, వేగఁ మగుడన్ = శీఘ్రముగా మరలుచుండఁగా, సలజ్జదృగ్విభ్రమములు-సలజ్జ=సిగ్గుతోఁగూడిన, దృక్ = చూపులయొక్క, విభ్రమములు = విలాసములు, (ఇది కర్తృపదము.) కడిఁదివిలు-కడిఁది=బలువగు, విలు=ధనుస్సును, చేఁది= ఆకర్షించి, గుఱికిన్ = లక్ష్యసిద్ధికొఱకు, (ఇచ్చటఁ జతుర్థికి షష్ఠి), కీలుకఱచి=పండ్లు బిగియబట్టుకొని, ని...లన్ పోలున్-నిలుపు = నిల్పఁబట్టిన, మరుని = మన్మథునియొక్క, కువలయశరము = కలువతూపుయొక్క, కంపములఁబోలున్ = చలనములను బోలును.

తా. ఆనెలఁత మెఱుఁగెక్కిన కడకంటిచూపులు మన్మథుఁడు పెద్దవిలు పూని లివిచి గుఱికుదురునంతకు నల్లెత్రాటికి ధనుర్దండమునకు నడుమఁ జలింపించుచున్న కలువ బాణములవలె నుండెను. ఉత్ప్రేక్ష.

తే. నవ వయస్సీధుమదముచేఁ శ్రవణకూప
ములఁ బడెడు శంక నలువ చాపలము లుడుగ
నిడిన శృంఖల లనఁ గాటుకిడిన దీర్ఘ
పక్ష్మరేఖలఁ గనుదోయి పడఁతి కలరు. 14

టీ. నవ=నూతనమైన, వయః=వయస్సనియెడు, సీధుమదముచేన్ = మద్యమదముచేత, ('మైరేయమాసవస్సీధు' వని యమరము.) శ్ర...లన్-శ్రవణ=చెవులనియెడు, కూపములన్ = నూతులయందు, పడెడుశంకన్ = పడునను సంశయముచేత, నలువ = చతుర్ముఖుఁడు, చాపలములు ఉడుగన్ = నేత్రముల చంచలభావములు తగ్గునట్లుగా, ఇ...నన్-ఇడిన=ఉనిచిన, శృంఖలలు అనన్=సంకెళ్లనునట్లు, కా...లన్ - కాటుక ఇడిన = కాటుక పెట్టుకొనిన, దీర్ఘ = నిడుదలగు, పక్ష్మ = ఱెప్పలయొక్క, రేఖలన్= రేఖలచేతనే, కనుదోయి = నేత్రద్వయము, పడఁతికిన్ = ఆగోదాదేవికి, అలరున్ = ప్రకాశించును. (ఈపద్యమందు సీధుమద మనఁగా గజమద మని యర్థము చేసిన పక్షమున సీధుకూప పతన శృంఖలాది పదములవలన గజము ద్యోతమాన మగుచున్నది

గాన, నది యథ్యాహార్యము. ఆపక్షమున సీధు వనఁగా గజనేత్ర మదమునకుఁ బేరైనను వంశకరీరకరికలభాదిశబ్దంబులవలె గ్రహింపవలయును.)

తా. ఆ పడఁతియొక్క నిడువాలిక లగుచు వీనులవఱకు నున్న కాటుకకన్నులు తమయందలి యౌవనమను సారాయిమదముచేతఁ జెవు లను నూతులలోఁ బడు, (సీధు వనఁగా గజనేత్రమద మను నర్థమున నేనుఁగులు మదించినప్పుడు నేత్రములలో మదముచేతఁ గన్నెఱుంగక నూతులలోఁ బడినట్లే యీ కన్నులును శ్రవణ రూపము లందుఁ బడు) నను సంశయముచేత వాని చాంచల్య ముడుగునట్లుగా నేనుఁగులకుం బోలెఁ జతుర్ముఖుఁడు సంకెళ్లు వేసెనో యన్నట్లు తఱచు వెంద్రుకలుగల తొంగలి ప్పలలోఁ గూడి ప్రకాశించుచున్నవి. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష. శ్లో. 'దానంకపోలయో స్సీధు రక్ష్ణోశ్శ్రోత్యోస్తు సాగరః, కరాగ్రే సీకర స్సిక్థం స్తనాగ్రే మేహనే మదః. హృదయే ఘర్మ సలిలం మేఘస్తు చరణవ్రజే, సంజ్ఞా యాప్తమదా హ్యేతే జాయంతే భద్రదంతినః' అని గజమదవిభేద మెఱుఁగవలయును.

చ. అనయము రాగమొప్ప సహజాననచంద్రకటాక్షపంక్తి ప
ర్విన నఘశంకఁ గర్ణమను శ్రీ మఱువెట్టుఁ జెలంగి చెండుఁగొ
ట్టనవనిఁబడ్డకమ్మ మగుడం గొనునంతకు నంసపాళి నం
గన యిడి దాఁచుపేరఁ బెఱకర్ణముకమ్మ పయిం దళుక్కనన్. 15

టీ. అనయమున్ = ఎల్లప్పుడును, రాగము=అనురాగము, ఒప్పన్ = స్ఫుటము గాఁగా, సహ... క్తి-సహజ = తోఁబుట్టువగు, ఆననచంద్ర = ముఖచంద్రునియొక్క, కటాక్ష=క్రేగంటి చూపులయొక్క, పంక్తి = చాలు, పర్విన్ = వ్యాపింపఁగా, అఘశంకన్ = పాపమువచ్చుననెడు సందియముచేత, కర్ణమనియెడు=వీననియెడు, (కర్ణము శ్రీకారమువలె నున్నది గనుకను శ్రీకారము లక్ష్మీరూపము గనుకను ఇట్లు రూపకము చేసెను.) శ్రీన్ = సిరిని, అంగన = ఆయింతి, చెలంగి = విజృంభించి, చెండుఁగొట్టన్ = కందుక క్రీడలుసలుపుచుండఁగా, అవనిన్ పడ్డ=భూమిపైఁబడిన, కమ్మ=కర్ణభూషణమును, మగుడన్=మరల, గొనునంతకున్ = గ్రహించువఱకు, అంసపాళిన్-అంస=భుజాగ్రము యొక్క, పాళిన్ = ప్రదేశమందు, ఇడి = ఉనిచి, దాఁచుపేరన్ = గుప్తముచేసెడు నెపముచేత, పెఱకర్ణముకమ్మ = రెండవవీను తాటంకము, పయిన్ = ఉపరిభాగమందు, తళుక్కనన్ = తళుక్కని మెఱయఁగా, మఱువెట్టున్=మఱుఁగువెట్టును. అపహ్నవము చేత నుత్ప్రేక్ష గలిగియున్నది. అది గమ్య. కర్ణశ్రీయన్నది రూపకాలంకారము.

తా. లోకమందుఁ బుణ్యాంగన యగు సహోదరి వట్టిచెవుల నుండఁగాఁ బురుషుఁడు చూడఁ గూడదు కావున, నీయంగన శ్రీకారమువంటి తన కర్ణ మనెడు లక్ష్మిని

దాను జెండు గొట్టునప్పు డదరి క్రిందఁబడిన కమ్మను దాను మరలఁ దీసికొనువఱకు నా చెవికి సహోదరుఁడగు మొగ మనియెడు చంద్రుఁడు చూడకుండ నాచెవిం దన భుజాగ్రమందుంచి దాఁచుచున్న దనియెడు నెపముచేత నాకర్ణమును గనఁబడకుండఁ జేయును; శిరము ప్రక్కకు వంచి భుజాగ్రముచే నొక చెవి దాఁచినప్పుడు రెండవచెవి కమ్మపైఁ దళుక్కని మెఱయుచున్నది.

శా. నాసాచంపకత న్సుగంధ మచటన్ రా భృంగముల్ గ్రోల సం
త్రాసం బందియుఁ బల్కుచో నలము వక్త్రంబేల నా నేల యం
దే సౌరభ్యము లేదు కుందములుగావే దంతము ల్గానినాఁ
డాసక్తిన్ బ్రతిబింబదంభమున నేలా వ్రాలఁ దజ్జాలికిన్? 16

టీ. నాసాచంపకతన్ - నాసా=నాసిక యనియెడు. చంపకతన్=సంపెఁగపువ్వు గలుగుటచేత, సుగంధము=ఆ సంపెఁగవాసన, అచటన్ = ఆముఖమందు, రాన్=వచ్చుచుండఁగా, భృంగముల్ = తుమ్మెదలు, గ్రోలన్ = ఆస్వాదించుటకు, సంత్రాసంబు= భయమును, అందియున్ = చెందియును, పల్కుచోన్ = ఆయువిద పలుకునప్పుడు, వక్త్రంబు=ముఖమును, ఏల ఆలమున్ = ఏటికి ముసరుకొనును, నాన్=అనఁగా, ఏల= ఏటికి, (తుమ్మెదలకు సంపెఁగవాసన విరోధ మనుట.), అందున్=ఆముఖమందు, ఏసౌరభ్యము లేదు=ఏ పరిమళము లేదు? (అన్ని పరిమళములు నున్న వనుట.), దంతములు=రదనములు, కుందములుగావే = మొల్లమొగ్గలుగావా ? కానినాఁడు = కానియెడల, తజ్జాలికిన్=ఆభృంగజాలికి, ఆసక్తిన్=శ్రద్ధచేత, ప్రతిబింబ = ప్రతిఫలన మనియెడు, దంభమునన్=నెపముచేత, వ్రాలన్=వ్రాలుట, ఏలా=ఏమి యక్కఱ?

తా. ఆయువిద నాసిక సంపెఁగపూవువలె నుండును, ముఖమందు నా సంపెఁగ వాసనలకు భయంపడి తుమ్మెదలు ముసర వెఱచియు మరల మాటలాడునప్పుడు మఱియొక పరిమళము రాఁగా దానికొఱకు ముసరును, సర్వ పరిమళములు ముఖమందుఁ గలవు, దంతములు మొల్ల మొగ్గలవలె నుండును, తుమ్మెదలు ముఖము మీఁదఁ దిరుగునప్పు డాదంతములమీఁదఁ బ్రతిఫలించుచుండును. వ్యాజోక్తి, ఉత్ప్రేక్ష, భ్రాంతిమదతిశయోక్తి, రూపకమును. కైతవాపహ్నుతియు అలంకారములు.

తే. శంఖసామ్యంబు రా మున్ను జలజభవుఁడు
సరసిరుహపత్త్రనేత్ర కంధర యొనర్చె
జవ్వనము వచ్చి వెండి సాక్షాత్కరించు
శంఖమున చేసె నును గంధసారచర్చ. 17

టీ. జలజభవుఁడు = తమ్మిచూలి-బ్రహ్మ, మున్ను = పూర్వమందు, శంఖ...ఖ- శంఖ=శంఖముతోడి, సామ్యంబు = సరియగుట, రాన్ = వచ్చునట్లు, సరసిరుహపత్త్ర నేత్ర = తమ్మిరేకులవంటి కన్నులుగల యాపొలఁతియొక్క, కంధర = కంఠమును, ఒనర్చెన్ = నిర్మించెను. జవ్వనము=యౌవనము, వచ్చి=ప్రాదుర్భవించి, వెండి = మరల, సా...న-వగు, సాక్షాత్కరించు=ప్రత్యక్షమైనట్టి, శంఖమున=శంఖమునే, ను...ర్చెన్- నును=మృదువగు, గంధసారచర్చ - గంధసార = మంచిగంధముయొక్క, చర్చ=పూఁత చేతను, చేసెన్ = ఒనర్చెను.

తా. ఆ సరసిజాక్షి కంఠము శంఖముతో సమ మగునట్లు బ్రహ్మ మున్నొనర్చెను, కాని యౌవనము వచ్చి గంధపుఁబూఁతచేత ధవళవర్ణమును గలుగఁజేసి ప్రత్యక్ష శంఖమునే చేసెను, దీనివలన బ్రహ్మకంటె యౌవనమే యధికతర మని భావము. అలం. ఉపమాగమ్యోత్ప్రేక్షలు.

క. కమలదళేక్షణ సంగీ
తమున నిగుడుమంద్రమధ్య ‡ తారత్రిస్థా
నములకుఁ దీర్చిన రేఖల
క్రమమగు రేఖాత్రయమునఁ ‡ గంఠం బమరున్. 18

టీ. క...నన్-కమలదళేక్షణ=తమ్మిరేకులవంటి కన్నులుగల యానెలతయొక్క, సంగీతమునన్ = గానమందు, ని...కున్ - నిగుడు = పుట్టు, మంద్రమధ్యతార = మంద్రము, మధ్యము, తార మనియెడి, త్రి=మూఁటియొక్క, స్థానములకున్=ప్రదేశములకు, తీ...నన్ - తీర్చిన = దిద్దినట్టి, రేఖలక్రమమగు = గుఱుతురేఖలక్రమము గల, రేఖాత్రయమునన్ = వళిత్రయముచేతను, కంఠంబు = కంఠము, అమరున్ = ఒప్పును. (మంద్రస్తుగంభీరే తారోఽత్యుచ్చైస్త్రయస్త్రిషు, విలంబితం ద్రుతం మధ్య'మ్మని యమరము. 'యస్యాస్తిస్రో గళే రేఖా దృశ్యంతే సా పతివ్రతా' యని సాముద్రిక శాస్త్రము.)

తా. ఆయమ పాటఁబాడునప్పుడు మంద్ర మధ్య తారము లనియెడు స్వరములు మూఁడు పుట్టుటకు స్థానములయిన వని గుఱుతుకొఱకు మూఁడు రేఖ లున్నవో యనునట్లు కంఠమున మూఁడు వళులు ప్రకాశించును. ఉత్ప్రేక్షాలంకారము.

తే. లలన మృదుబాహుబిసయుగ ‡ లతలు గడఁగి
బిసలతాశ్రీలనెల్లను ‡ వెస హరించె
మఱి హరింపంగఁ గా యవి ‡ నెఱులు విఱిగి
సారె దనుయాత్రఁ దంతులఁ ‡ జరపుచుండు. 19

టీ. ల...లు-లలన = ఆస్త్రీకొఱకు, మృదు = మెత్తనగు, బాహు=భుజము లనియెడు, బిస = తామరతూఁడులయొక్క, యుగ = జంటయొక్క, లతలు = తీఁగెలు, కడఁగి = యత్నపడి, బిసలతాశ్రీలనెల్లను - బిసలతా = లోకమందలి తామరతూఁడులయొక్క, శ్రీలనెల్లను = సంపదలనన్నిటిని, వెసన్ = వేగముగాను, హరించెన్ = కైకొనియెను, మఱి=మరల, హరింపంగఁగా = గ్రహింపఁగానేకదా, అవి = తూఁడులు, నెఱులు=పూర్ణత్వములు, విఱిగి = విరిసిపోయి, సారె = పలుమాఱును, తనుయాత్రన్= దేహయాత్రను, (శరీరపోషణము ననుట), తంతుల = నూలిపోఁగులచేతనే (తంతువులే యాహారముగా.), జరపుచుండున్ = కడపుచుండును.

తా. ఆయమయొక్క కోమలము లగు బాహువు లనియెడు తామరతూఁడులు చెలరేఁగి యెల్లతూఁడుల కాంతిసంపదల నపహరింపఁగా, నవి గుంపు చెదరి మఱియొక విధముచే బ్రదుకఁ జాలక నూలిపోఁగులు వడికికొని శరీరయాత్రఁ గడపు ననియును, దామరతూఁడులు విఱిగెనేని వానిలో నూలిపోఁగు లుండు ననియుచు భావము. అలం. రూపకానుప్రాణితగమ్యోత్ప్రేక్ష.

మ. తళుకొత్తు న్భుజకీర్తివజ్రఘృణిసూత్రస్యూతహారస్ఫుర
త్కళికా చిత్ర కుచద్వయోపరిగళాధస్స్వల్పవిస్తారదై
ర్ఘ్యలసత్తిర్యగురస్తటం బనువివాహాంచన్మనోజాత పా
టల దంతచ్ఛదబోడబాసికము దండల్వ్రేలెఁ గేల్లింతికిన్. 20

టీ. ఇంతికిన్ = ఆస్త్రీకి, కేల్లు = హస్తములు, భు...ఘృణి - భుజకీర్తి = బాహుపురులయందలి, వజ్ర = మగఱాలయొక్క, ఘృణి = కాంతు లనియెడు, సూత్ర = దారములచేత, స్యూత = కూర్పఁబడిన, హార = పూవులపేరులయందు, స్ఫురత్=ప్రకాశించుచున్న, కళికా = మొగ్గలచేత, చిత్ర=చిత్రవర్ణముగలయట్టియు, కుచద్వయ=చనుదోయికి, ఉపరి = పైఁగాను, గళాధః - గళ = కంఠమునకు, అధః = క్రిందుగాను, స్వల్ప=అల్పమైన, విస్తార=వెడల్పుచేత, దైర్ఘ్య=పొడవుచేత, లసత్ = ఒప్పుచున్నట్టియు, తిర్యక్=అడ్డమగు, ఉరస్తటంబను=వక్షస్స్థల మనియెడు, వివా...చ్ఛద - వివాహ = పెండ్లియందు, అంచత్ = ఒప్పుచున్న, మనోజాత = మన్మథుని యొక్క, పాటల = ఎఱ్ఱనగు, దంతచ్ఛద=వాతెఱగల రతీదేవియొక్క, బోడబాసికము= శిఖరములేని బాసికముయొక్క, దండల్వ్రేలెన్=ఇరుగడల వ్రేలుచున్న దండలవలె, తళు కొత్తున్ = మెఱయును.

తా. ఆయింతియొక్క కంఠమునకు దిగువగాను గుచముల కెగువగా నున్న ప్రదేశము కొంచెము వెడలుపును బొడువును గలిగియున్నది. భుజకీర్తులయందలి వజ్ర

కాంతు లావణ్యప్రదేశ మందలి పూలదండలయందుఁ బ్రతిఫలింపఁగా, నా మొగ్గల చేత నది విచిత్ర వర్ణముగలది యై మన్మథుఁడు రతీదేవిని వివాహ మైనప్పు డారతీదేవి ముఖమందుఁ గట్టిన బాసికమువలెనే యుండెను. హస్తములు రెండు నా బాసికమునకు రెండు పార్శ్వములయందు వ్రేలుచున్న దండలో యనునట్లును ఉండెను. ఉత్ప్రేక్ష.

చ. ఒదవెడుజవ్వనంబు వెలిఁకొత్తఁగఁ బయ్యెద సిగ్గుఁ గూడి బి
ట్టదుమఁగ లేఁత లౌట దిగఁ నాఁకకుమీఱను లేక వక్షపుం
జదుపునఁ బ్రక్కల న్మెఱసిఁ చప్పటలై మఱి లావుగూడఁ బైఁ
బొదలె ననంగఁ బిక్కటిలెఁ బొల్తుకచన్నులు నాఁడునాఁటికిన్. 21

టీ. పొ...లు - పొల్తుక = ఆ పొలఁతియొక్క, చన్నులు = స్తనములు, (ఇది కర్తృపదము.) ఒ...బు-ఒదవెడు=పుట్టుచున్న, జవ్వనంబు=యౌవనము,వెలిఁకొత్తఁగన్ = బైటఁ ద్రోయఁగా, పయ్యెద = పైఁటచెఱఁగు, సిగ్గుఁగూడి = లజ్జనుగూడికొని, బిట్టు = గట్టిగా, అదుమఁగన్ = లోపలికిఁ ద్రోయఁగా, లేఁతలౌటన్ = తరుణములౌటచేత, దిగన్=దిగివచ్చుటకును, ఆఁకకుమీఱను=ఆజ్ఞకతిక్రమింపను, లేక=చాలక, వ...నన్-వక్షపున్=వక్షస్స్థలసంబంధియగు, చదుపునన్=సమ్మర్దముచేత, ప్రక్కలన్=పార్శ్వములందు, మెఱసి = ప్రస్ఫుటము లై, చప్పటలై = అడఁగిన వై, మఱి = పిమ్మట, లావుగూడన్ = బలమురాఁగా, పైఁబొదలె ననంగన్ = పైకి వ్యాపించినవో యన్నట్లు, నాఁడునాఁటికిన్ = దినక్రమమున, బిక్కటిలెన్ = విస్తరిల్లెను.

తా. ఆ యుంగ్మలికుచములను యౌవనము బయటఁ ద్రోయుచుండఁగాను సిగ్గు వచ్చి పైఁటచెఱఁగుతోఁ గూడి మరల లోపలికిఁ ద్రోయఁగా, నవి లేఁతవి గావున దిగి వచ్చుటకును పై కెగయుటకును నేరక, యురస్స్థలమందె యొత్తిడిం బడి పార్శ్వముల కొఱఁగి అడఁగి చప్పట లై, పిమ్మటఁ గ్రమక్రమముగా లేఁతఱికము వదలఁగానే బలము వచ్చి పైకిఁ బిక్కటిల్లెను. (యౌవనప్రాదుర్భావము కాఁగానే చనుదోయి కానఁబడె ననియును, లజ్జ దోఁచె ననియును, దరువాతఁ గుదురులఁ గట్టి యురమెల్ల నాక్రమించి స్తనములు క్రిక్కిఱిసి బిక్కటిల్లె ననియును భావము.) ఉత్ప్రేక్ష.

తే. వృతరఘూత్తమశాప మొక్కింత విడిచి
విడిచి కడకేఁగ నప్పుడప్పుడ కవిసెడు
చక్రయుగ మన ఱొమ్మొయ్య నాక్రమించి[1]
కొమిరెచన్నులు పృథుచూచుకముల నమరె. 22

1. ఆక్రమించు, కొమిరెచన్నులు లేఁగప్పుకొనల నమరె.

టీ. వృ...ము-వృత=ఆవరించిన, రఘూత్తమ = శ్రీరామునియొక్క, శాపము= శపించుట, ఒక్కింత=ఒక కొంచెము, విడిచివిడిచి = వదలివదలి, కడకేఁగన్ = తొలఁగి పోఁగా, అప్పుడప్పుడ=తత్కాలమందే, కవిసెదు = కూడుకొనియెదు, చక్ర=జక్కవల యొక్క, యుగము అనన్=కవయో యనునట్లు, ఱొమ్ము=వక్షస్థలమును, ఒయ్యన్= మెల్లఁగా, ఆక్రమించి = వ్యాపించి, కొమిరె= ఆ యువతియొక్క యనికాని, కొమిరె చన్నులు=ఉదుటుకుచములనికాని, పృథు = కొంచెముపెద్దవియగు, చూచుకములన్ = చనుమొనలచేత, అమరున్=ఒప్పును. చక్రవాకములకు రాత్రియెల్లవియోగముగలుగునట్లు శ్రీరాముఁడు సీతాదేవి వియోగ మనుభవించునప్పుడు శాపమిచ్చుట పురాణప్రసిద్ధము.

తా. చక్రవాకద్వయము తమకు సంభవించిన శ్రీరామ శాపమును వదలి యప్పుడప్పుడే కలియుచుండిన నె ట్లుండునో, యా రీతిగానే వట్రువ యై యొండొంటికిఁ జేరువ యై కుచద్వయము ఱొమ్ము నాక్రమించెను, ఆపక్షులముక్కులవలెనే చనుమొన లొప్పారెను. ఉత్ప్రేక్ష.

క. తా రెట్లట్లుగఁ దమ్ముం
జేరిన ముత్తెంపుసరులఁ ౹ జేడియచన్నుల్
లోరెంట లుడిపె ఘనమగు
వారు నిజార్జవముఁ జేరువారికి నీరే. 23

టీ. చేడియచన్నుల్=ఆబాలికస్తనములు, తా రెట్లు = తా మెట్లో, అట్లుగన్= ఆరీతిగానే (అనఁగా రెండుస్తనములు వేఱుగా దూరముననుండి నానాఁటఁ జేరువకు వచ్చి యొరసికొన్న ట్లనుట), తమ్ముంజేరిన = తమ్మునాశ్రయించిన, ముత్తెంపుసరులన్= ముక్తాహారములను, లోరెంటలు = లోపలిజంటలను, ఉడిపెన్=పోఁ జేసెను, ఘనమగు వారు = ఘనతగలవారు, నిజార్జవము - నిజ=స్వకీయమగు, ఆర్జవము = ఒయ్యారమును, చేరువారికిన్ = తమ్ము నాశ్రయించినవారికిని, ఈరే=ఇయ్యరా (ఇత్తు రనుట).

తా. కుచములు తాము మధ్యభాగమున సందు లేక కదిసియున్నవి గావున, నందుఁ జేరిన హారములును గుచమధ్యమందు విరళముగ నుండుటను తావులేక కుచములయం దన్నిపేట లొక్కటఁ గూడి, ఘను లైనవారు తమవలెనే యుండుటకుఁ దమ యాశ్రితులకుఁ దమ సుగుణము లిచ్చురీతి నొప్పారెను. అర్థాంతరన్యాసాలంకారము.

తే. విరహితతిమీఁది కోపాన ౹ మరుఁడు దివియ
వేగమై పైఁడియొఱతోన ౹ విసరఁ గుట్లు
దునిసి బైటికి నసిధార ౹ దోఁచె ననఁగఁ
గనకరుచి మధ్యలత నారు ౹ కాంత కలరు. 24

టీ. కాంతకున్=ఆయింతికి, ఆరు=నూఁగారు, (ఇది కర్తృపదము,) వి...న్-విరహి=వియోగులయొక్క, తతిమీఁది = సమూహముపైనున్న, కోపానన్=కోపముచేత, మరుఁడు = స్మరుండు, తివియన్ = ఒఱలోనుండి తీయుటకును, వేగమై = వేగముగల వాఁడై, (సీ. 'అప్సరోనికురుంబ మాటలుఁ, బాటలు నైవినోదింపంగ నమరగణ' మని యును, క. 'కాచికొనివచ్చితగనా, నేచినయట్లచటనచట నిలిపితిమునినా,థా చేటును భంగంబును, నైచిత్తము శోకమునకు నగ్గంబయ్యెన్' అనియు నున్న భారతప్రయోగంబుల కలిమి నగుధాతువునకు కలిమి అర్థము.) పైఁడియొఱలోన=కనకమయమగు నొఱలోఁగూడనే, విసరన్=నఱుకుటకువిసరఁగా, కట్లు=ఆయొఱకట్లు, తునిసి = తెగి, బైటికిన్=బాహ్యప్రదేశమునకు, అసిధార = కత్తివాదర, తోఁచెన్ అనఁగన్ = కానవచ్చెనను నట్లుగా, కనకరుచి = బంగరుకాంతిగల, మధ్యలతన్ = కౌఁదీఁగెయందు, అలరున్ = ప్రకాశించును.

తా. మన్మథుఁడు విరహులపైఁ దన కధికమగు కోపము రాఁగా నా కోపాతిశయముచేతఁ గత్తి బైటికిఁ దీయు నంత తడవులేక వేగము పడి పసిఁడి యొఱలోనే యాఖడ్గమును విసరఁగా, నా వేగమువలన నొఱను గట్టియున్న కట్లు తెగి యా సందున నాకత్తివాదర కనఁబడినట్లు బంగారు వన్నెగల కౌఁదీఁగెయందు నల్లనికాంతిగల నూఁగారు ప్రకాశించెను. ఉత్ప్రేక్షాలంకారము.

క. అండజగామిని యూరుపుఁ
బిండువలపు లాన నాభిబిలము వెడలి చ
న్గొండల నడుమను బ్రాఁకెడు
కుండలియో యనఁగ నారు కొమరొప్పారున్. 25

టీ. అం...లు - అండజగామిని = ఆహంసయానయొక్క, ఊరుపుఁబిండు = ఉచ్ఛ్వాసవాయు సమూహముయొక్క, వలపులు=పరిమళములను, ఆనన్=ఆస్వాదించుటకు, నాభిబిలము = బొక్కిలియను బిలమునుండి, వెడలి = బయలుదేఱి, చన్గొండల నడుమను=కుచగిరులమధ్యమున, ప్రాఁకెడు = ప్రాఁకుచున్న, కుండలియో యనఁగన్ = త్రాఁచుఁబామో యనునట్లు, ఆరుకొమరు - ఆరు = రోమరాజియొక్క, కొమరు = సౌందర్యము, ఒప్పారున్ = తనరును.

తా. మఱియు నాహంసయానయొక్క నూఁగారు పరిమళముగల యుచ్ఛ్వాసవాయువుల నాస్వాదించుటకై నాభి యనియెడుబిలములోనుండి వెలువడి చన్నులనియెడు కొండలనడుమ నెగఁబ్రాఁకుచున్న కాలసర్పమో యనునట్లుండెను. (సర్పములు వాయు

భక్షణము సల్పు ననియు, వాని కున్నత పర్వములయందుఁ బ్రాకుటయందుఁ బ్రయాసము గావున మెల్లగఁ బ్రాఁకుచుండు ననియు భావము.) రూపకాను ప్రాణితోత్ప్రేక్ష.

క. అంగన నిలిచినబాహువు
లుం గౌనును నేఱుపఱుచు ♦ లోకమునకు ర
త్నాంగద కాంచీభేదము
లుం గెళవుల నడిమియునుకులు నూఁగారున్. 26

టీ. అంగన=ఆయింతి, నిలిచినన్ = నిలుచునప్పుడు, లోకమునకున్=చూచెడు జనమునకు,రత్నా . . . లును-రత్న=మణిమయములైన,అంగద=బాహుపురులయొక్కయు, కాంచీ=మొలనూలియొక్కయు, భేదములు = వేఱుపాటులును, కె. . . లున్-కెళవుల = పార్శ్వములయందలియును, నడిమి=మధ్యప్రదేశమందలియును, ఉనుకులున్=ఉండుటలును, నూఁగారున్ = రోమావళియును, బాహువులున్=బాహువులును, కౌనును=నడుమును, ఏఱుపఱుచున్ = వివరించును.

తా. నడుమును రోమలములగు బాహువులును సమకృశము లై యున్నవి గావునఁ, జూచు వారి కాభేద మెఱుక పడకుండఁగా భుజకీర్తులును పార్శ్వద్వయమందు నిలుచుటలును బాహువులఁ దెలుపుట, మొలనూలు నడుమ నుండుట, నూఁగారు నీమూఁడును ఇది నడు మని తెలుపును, అట్లు కానియెడలఁ జేతు లెయ్యవియో నడు మెద్దియో తెలియుట కష్టము. విశేషాలంకారము.

క. తనుమధ్యవళీభంగము
లను గూర్పఁగ నవియుఁ దత్కుళలములయగుటఁ గం
తుని యిడిన పత్తిజేకనఁ
జను నొడ్డాణమున నడుము ♦ చామకు నమరున్. 27

టీ. చామకున్ = ఆశ్యామకు, త. . . ను - తను = సూక్ష్మమగు, మధ్య=నడుముయొక్క, వళి=త్రివళు లనియెడు, భంగములను = విఱుగులను, కూర్పఁగన్=అదుకుటకు, అవియున్=అవళులును, తత్కులముల యగుటన్ = ఆబంగారుజాతిగలవేయవుటచేత, కం. . . నన్ - కంతుని = మన్మథుఁ డనియెడు నగసాలెవానియొక్క, ఇడిన = ఉనిచిన, పత్తిజేకనన్ = పత్తికట్టునిమిత్తముంచిన బంగారుజేకోయనునట్లు, చను = ఒప్పుచున్న, ఒడ్డాణమునన్=కాంచీగుణముచేతను, నడుము=మధ్యము, అమరున్=చెన్నగును.

తా. సూక్ష్మ మగు నడుముయొక్క వళు లనియెడు తునుకలకు మన్మథుఁ డదుకు పెట్టఁ దలఁచి బంగారు బంగారుతోనే యదుకును గావున నావళులు బంగారుతునుకలే యగుట నా మధ్యవళుల నడుమఁ దన పత్తితికను బంగారు జేకు వేసి యదికి బిగించెనో యనునట్లున్న యొడ్డాణముచేత నడుముపొల్పారును.రూపకోత్థాపితోత్ప్రేక్షాలంకారము.

క. లేఁగౌఁదీఁగె నితంబము
ప్రేఁగునఁ ద్రెవ్వుటయుఁ గని విరించి బిగింపన్
లోఁగి ముడియిడియె వదలుగ
నాఁ గోకస్తని గభీరనాభి చెలంగున్. 28

టీ. లేఁగౌఁదీఁగె = లేఁతయగు మధ్యలత, ని...న్ - నితంబము = పిఱుఁదు యొక్క, ప్రేఁగునన్ = భారముచేతను, త్రెవ్వుటయున్ = తెగిపోఁగా, కని = చూచి, విరించి=బ్రహ్మదేవుఁడు, బిగింపన్=బిగియించుటకు, లోఁగి = సందేహించి, వదలుగన్= బిట్టులేకుండ, ముడియిడియె నాన్ = ముడివేసెనోయనునట్లు, కోకస్తని=ఆచక్రవాక స్తనియొక్క, గభీరనాభి = లోఁతైన పొక్కిలి (యిది కర్తృపదము), చెలంగున్ = ప్రకాశించును.

తా. సృష్టికర్త యగు బ్రహ్మదేవుఁ డాకోకస్తనియొక్క పిఱుఁదుల భారముచేత లేఁత కౌను దీఁగె లాగఁ బడి తెగుటఁ జూచి, మరల సంధించుటకు యత్నపడి బిగి యించిన మరలఁ దెగునేమో యని సందేహించి, వదలుగా ముడివేసి మరల సంధించిన ముడియో యన్నట్లు నాభి ప్రకాశించును. ఉపమోత్థాపితోత్ప్రేక్షాలంకారము.

క. వెలఁది కటిపేర నిల నొక
పులినము దిగఁబడియె సింధుపులినపుఁబఙ్క్తిన్
నలువ యది పడఁగఁగాదే
తెలియుట కం దంచపదము స్థిరముగ నిలిపెన్. 29

టీ. సింధు...బఙ్క్తిన్-సింధు = నదీసముద్రములయొక్క, పులినపు = ఇసుక దిన్నియలయొక్క, పఙ్క్తిన్=శ్రేణియందు, వెలఁదికటిపేరన్-వెలఁది=ఆస్త్రీలయొక్క, కటి=పిఱుఁ దనియెడు, పేరన్=వ్యాజముచేత, ఇలన్=భూమియందు, ఒక పులినము= ఒక్క యిసుకదిన్నియ, దిగఁబడియెన్ = తప్పిపోయెను. నలువ=చతుర్ముఖుఁడు, అది= ఆపులినము, పడఁగఁగాదే = తప్పిపోవుటచేతనేకదా, తెలియుటకు = ఎఱుఁగుటకొఱకు, అందు=ఆసింధు పులిన పఙ్క్తియందు, అంచపదమున్=హంసపాదమును, తిరముగన్= స్థిరముగా, నిలిపెన్=ఉనిచెను.

తా. ఆయమ పిఱుఁదు ఇసుక తిన్నియవలె నున్న దనియును, మున్ను బ్రహ్మ దేవుఁడు సముద్రతీరములయందును నదీతీరములయందు సైకతములు సృజించునప్పు డా పఙ్క్తిలో నీయమ పిఱుఁ దను నిసుకదిన్నె చేరక దిగఁబడియెనుగాన నది యెఱిఁగి యక్షరపఙ్క్తిలో దిగఁబడిన యక్షరమునకు గుఱుఁతుగా నక్కడ హంసపాదముపెట్టుట

ప్రసిద్ధము గావున, నట్టి విధముగానే యిది దిగఁబడుట దెలియుటకొఱకు కాపులిన పక్షి-యందు సంచరించెడు హంసలయొక్క పదచిహ్నము లనియెడు హంసపాదము పెట్టెను. వ్యస్తరూపకానుప్రాణిత హేతూత్ప్రేక్షాలంకారము.

తే. కదళి తివియించె నాగ్రాంఘ్రికంబు తొడల
పెనుపు నె ట్లన్నఁ బొరల శోధన నడంచు
కొన్న యాఁదోఁకపాటును గొప్పు విప్ప
మెఱయు గోర్మ్రుచ్చులును గెంపు గుఱులు గావె. 30

టీ. కదళి=అరఁటిచెట్టు, ఆంగ్రాంఘ్రికంబు = పాదాగ్రములవఱకును, తొడల = ఊరువులయొక్కయు, పెనుపున్ = అతిశయమును, తివియించెన్ = లాఁగికొనెను. ఎట్లన్నన్=అది యేవిధమున ననఁగా, పొరల=అరఁటిపట్టలపొరలయొక్క, శోధనన్= శోధించుటచేత, (దొంగదగ్గఱనుండు వస్త్రాదులలోని పొరలసందున సోదా చూచుట యనుట.), అడంచుకొన్న = దాఁచుకొన్నట్టి, ఆఁదోఁకపాటును = గోపుచ్ఛాకారమును, (ఇది తొడలపెనుపు), కొప్పువిప్పన్ = అరఁటిపువ్వువిప్పఁగా, (దొంగ సిగ ముడి విప్పఁగా ననుట.), మెఱయు = బయటఁబడునట్టి, గోర్మ్రుచ్చులును = గోళ్లను దొంగలును, (అరఁటిపువ్వులోని తెల్లని కుసుమలలోఁ గొన్ని గోళ్లవలెనుండును. వాని నిచ్చటః చౌర్యసాధకనఖారాయుధములుగాఁ జెప్పినాఁడు. ఆయరఁటి పువ్వునందే మఱియొకవిధమయిన కుసుమలకు దొంగ లని పేరు కలదు), కెంపు=పద్మరాగమును, అరుణకాంతియును, (దొంగ సిగవిప్పినప్పుడు కెంపు గనుపడె ననుట.), గుఱులు = నిదర్శనములు, కావె=కావా, అవు ననుట. (ఈ పద్యమునందుఁ గ్రమవ్యత్యయమయినను దోషావహంబు గాదు, ప్రయోగములు గలవు.)

తా. ఈయమ తొడల సౌందర్యమును, పాదాగ్రముల యొప్పిదమును, అరఁటి చెట్టు మ్రుచ్చిలింపఁగా నది యెట్టెఱుఁగ వచ్చె ననఁగాఁ, పొరలు విప్పఁగా దొడల యందలి సౌందర్యమును; పువ్వనియెడు కొప్పు విప్పఁగా నందలి కెంపును గేసరములును పాదతల రక్తకాంతియును నఖాకార శస్త్రములును సాక్షులై యుండఁగా, వేఱు నిదర్శనములతోఁ బనిలేదు. అనుమానాలంకారము.

తే. వసుధలో నెట్టి శ్రీ గలవారి వేని
కరభములు దాస్యములు చేయు సరసిజాక్షి
యూరువుల కెట్ల టన్నఁ బైఁ దాను మోచు
గొడఁగులును నల్లకలశముల్ గుఱులు గావె. 31

టీ. వసుధలోన్=భూమిలో, ఎట్టి శ్రీగలవారివేని=ఏవిధమైనసంపద గలవారివైనను, కరభములు=హస్తభాగవిశేషములు, ఊరువులకున్=పెందొడలకు, దాస్యములు=వరవుడములు, చేయఁగన్=ఒనర్చుచు, అటు=ఆవిధము, ఎట్లన్నన్=ఎట్లనఁగా, పైన్=తమమీఁద, తారు=తాము, మోచు=వహించెడు, గొడుగులును=ఛత్రములును, అల్లకలశముల్=ఆప్రసిద్ధములగు పూర్ణకుంభములను, (దాస్యములు చేసెడువారు తమ హస్తములయందు గొడుగులను జలాహరణమునకుఁ గలశములను దాల్తురనుట.), మఱియు నుత్తమస్త్రీల హస్తములయందు ఛత్రకలశాదిరేఖ లుండు ననుట. శ్లో. 'అంకుశం కుండలం ఛత్రం యస్యాః పాణితలే భవేత్, పుత్త్రం ప్రసూయతే నారీ నరః పృథివీపతిః. యస్యాః కరతలే పద్మం పూర్ణకుంభం తథైవ చ, రాజపత్నీత్వమాప్నోతి పుత్త్రైశ్చ సహ మోదతే.' అని సాముద్రికశాస్త్రము. గుఱుతు గావె=గుర్తులు గావా? (ఔ ననుట.)

తా. లోకమందలి యెంత సంపద గల స్త్రీల కరభములైన నాయను యూరువులకు దాస్యము సేయుటే కాక, యాయమ యూరువులతోఁడ సామ్యముఁ జెందనేరవు. అవి దాసులై యుండుటకు గుఱుతు లేమనిన, నాహస్తములయందు రేఖాకారములగు ఛత్రములును గలశములు నుండుటయే, అట్టి రేఖలుగల భాగ్యవతులు కావుననే యీయమ్మవారికి దాస్యములు సేయుటకుఁ గలుగుననియును, సాధారణస్త్రీల కది దొరక దనియును భావము. ఉత్తమస్త్రీల చేతులయందుండు ఛత్ర కలశ రేఖల నూరు సేవార్థము ధరించిన ఛత్రకలశములుగా నుత్ప్రేక్షించినాఁడు గనుక నుత్ప్రేక్షాలంకారము.

క. వలరాజుకుటుంబము న,గ్గలముగఁ బోషించుకలమగర్భములయ్యెన్
బోలఁతుకజంఘ లతిశ్యా,మల మంజీరస్థనిబిడమరకతకాంతిన్. 32

టీ. పో...లు - పోలఁతుక = ఆపోలఁతియొక్క, జంఘలు = పిక్కలు, అ...తిన్ - అతిశ్యామల=మిక్కిలి శ్యామలవర్ణములుగల, మంజీరస్థ = అందియలయందున్న, నిబిడ=దట్టములగు, మరకత=పచ్చలయొక్క, కాంతిన్=ప్రకాశముచేత, వ...మున్- వలరాజు=మన్మథునియొక్క, కుటుంబమున్=సంసారమును, అగ్గలముగన్=అధికముగా, పో...లు అయ్యెన్ - పోషించు=ప్రోచెడు, కలమగర్భములు అయ్యెన్ = వరిపొట్టలయ్యెను. (శ్యామలహరిద్వర్ణముల కభేదం బగుటకు 'మరకతమణిస్తంభగంభీరబాహు' వని శ్రీకృష్ణకర్ణామృతమునందును, 'శుకాంకనీలోపలనిర్మితానాం' అని మాఘకావ్య తృతీయసర్గమందును, సీ. 'అభినవజలధరశ్యామంబు లగుచోటు లాకు జొంపంబుల ననుకరింప' అని విరాటపర్వంబున నునికిం జేసి మరకతంబులయందు శ్యామలవర్ణము గలుగునట్లు నిచ్చటఁ జెప్పఁబడియె.)

తా. ఆ పొలఁతి పిక్కలతి నిర్మలములై యుండుటం జేసి పాదకటకములయం దలి దట్టమగు పచ్చలకాంతిచే వ్యాప్తములై వరి పొట్టలవలెఁ బచ్చని వన్నెగలిగి యున్నవి. ఈ వరి పొట్టలు మన్మథుని కుటుంబ పోషణమునకు మిక్కిలి యుపయోగ మగుచున్నవి. ఉత్ప్రేక్ష.

తే. ఉవిదనిద్దంపుజంఘల సవతుఁ గోరి
కలమగర్భంబు లడఁచు లోఁ గంటకములు
చాతురుల మించి మఱి దివసక్రమమున
నిలువ కవి బాహిరములైనఁ దలలు వంచు. 33

టీ. ఉ...తున్ - ఉవిద=ఆయువతియొక్క, నిద్దంపు = స్నిగ్ధములగు, జంఘల= పిక్కలయొక్క, సవతున్ = సాపత్న్యమును, కోరి = అపేక్షించి, కలమగర్భంబులు= రాజనపుఁబొట్టలు, కంటకములు=తనయందలిదోషములు, (వరికి జుంజుఱుముండ్లు గలిగి యుండుట ప్రసిద్ధము.), చాతురులన్ = నేర్పులచేత, మించి=అతిశయించి, లోన్ = తనలోనే, అడఁచున్=దాఁచుకొనును, మఱి = పిమ్మట, అవి=ఆకంటకములు, నిలువక = లోపల నిముడక, దివసక్రమమునన్=నానాఁట, బాహిరములైనన్=బయల్పడఁగా, తలలు వంచున్=సిగ్గుచేత శిరములు వంచును.

తా. నిద్దములగు నాయువిదపిక్కలతో రాజనపుఁబొట్టలు సామ్యము రాఁ గోరి తమ యంతర్దోషములు బయల్పడనీక నేర్పుచేత దాఁచెనే కాక, మఱికొన్ని దినముల లోనే యా కంటక దోషము గనఁబడఁగా నా వరిపొట్టలు సిగ్గుచేతఁ దలలు వంచు కొనును. (అనఁగా నాయమ పిక్కలు మిక్కిలి నునుపు గలిగియున్న వనియును, వరి పొట్టలు మొదట సామ్యమునకు వచ్చినను వెనుక వెన్ను తీయఁగానే ముండ్లు బయలఁ బడుటయును, భారతముచేతఁ దలలు వంచుటయును బ్రసిద్ధ మని భావము.) ఫలహేతూ త్ప్రేక్షలకు సంసృష్టి.

చ. ఇలఁ గలవస్తుసంతతుల కెల్లను గచ్చిదు మత్స్వభావపా
టలరుచి యింక వేఱ యొకఁడా లిడవచ్చునె లక్కనీట మ
మ్మలమిన దెంతముగ్ధ యిది యంచుఁ బదాబ్జము లంగుళీముఖం
బు నగునట్లు మించునఖములై యరుణ్మ గోమ రారు నింతికిన్. 34

టీ. ఇలన్ = భూమియందు, క...కున్ ఎల్లను - కల = ఉన్నట్టి, వస్తుసంత తులకెల్లను=సమస్త వస్తుసముదాయములకును, మ...చి - మత్ =మాయొక్క, స్వభావ= ప్రకృతిచేతనే, పాటల = ఎఱ్ఱని, రుచి = కాంతి, గచ్చిదున్=వన్నెఁబెట్టును, ఇంకన్

వేఱు=మఱియొకరకమగు, ఒకడాలు=ఒకవర్ణనమును, ఇడవచ్చునె = మాఱుఁబెట్టవచ్చునా, ఇది=ఈయమ, లక్కనీటన్ = లాక్షారసము చేత, మమ్మున్=మము, అలమినది=పూసినది, ఎంతముగ్ధ = ఎంతతెలియనిది, అంచున్=అనుచు, పదాబ్జములు = అడుగుదమ్ములు, (ఇది కర్తృపదము.), అంగుళీముఖంబులన్ - అంగుళీ=వ్రేళ్ళనియెడు,ముఖంబులన్ = మొగములచేత, నగునట్లు=పరిహసించునట్లు, మిం...ముల్ - మించు=అతిశయించునట్టి, నఖముల్=గోళ్లు, మెఱయన్=ప్రకాశింపఁగా, ఇంతికిన్=ఆయమకు, కొమరారున్ = ఒప్పును, ముగ్ధ యన్నందుకు, శ్లో. ముగ్ధేత్యాద్వాదశం స్త్రీణాం మధ్యేయష్టాదశం స్మృతమ్, అత ఊర్ధ్వం ప్రగల్భేతి వ్యవస్థా త్రయముచ్యతే." అని యాధారము.

తా. ఆయమ పాదాబ్జములకు మంగళార్థమై లాక్షారస మిడఁగా, నప్పుడా పాదములు లోకమందలి సమస్తవస్తువులకు వన్నెఁ బెట్టెడుమాకు వేఱొకవన్నెఁ బెట్టవచ్చునా? యది తెలియఁగక యీ ముగ్ధ మాకు లక్కనీరుపూసె నని వ్రేళ్ళనియెడు ముఖములచేతఁ బకపక నవ్వుచున్నవో యన్నట్లు గోళ్లు తెల్లఁగా మెఱయుచుండఁగా నాపాదము లొప్పుచున్నవి. ఉత్ప్రేక్ష.

క. లలనోపరిపదకచ్ఛప
ములు బలిమిమెయిన్ గజప్రభూతగతిశ్రీ
విలసనముఁ గొనఁగఁగాదే
కలిగెన్ గజకచ్ఛపోగ్రకలహం బుర్విన్. 35

టీ. ల...లు - లలనా = ఆయమయొక్క, ఉపరిపద = మీఁగాళ్ళనియెడు, కచ్ఛపములు = తాఁబేళ్లు, బలిమిమెయిన్ = బలాత్కారముచేత, గజ...మున్ - గజ = ఏనుఁగులయొక్క, ప్రభూతగతి = ఒయ్యారపు నడకయొక్క, శ్రీ = సంపదయొక్క, విలసనమున్ = విలాసమును, కొనఁగఁగాదే = గ్రహింపఁగాఁగదా, ఉర్విన్ = భూమియందు, గజకచ్ఛపోగ్రకలహంబు - గజ = ఏనుఁగుయొక్కయు, కచ్ఛప = తాఁబేటియొక్కయు, ఉగ్ర = భయంకరమయిన, కలహంబు = పోరాటము, కలిగెన్ = ఉదయించెను.

తా. ఆ లలనయొక్క మీఁగాళ్లు తాఁబేళ్లవలెను, గజగమనమువంటి గమనమును గలిగియు నున్నవి. ఆకచ్ఛపములు గజముయొక్క గమనసంపదను హరింపఁగా దానివలన నా యేనుఁగునకును దాఁబేటికిని గలహము సంభవించెను; దానిచేతనే భూమియందు గజకచ్ఛప సంవాద మను సామెత యేర్పడెను. రూఢోత్థాపితహేతూత్ప్రేక్ష.

తే. తరుణితనుకాంతియెదుట నూతనహరిద్ర
తులకురాలేక యత్యంతమలిన మయ్యె

నౌటఁగా రాత్రి యన నిశ యనఁ దమిస్ర
యన నిశీథిని యన క్షప యనఁగఁ బరఁగె. 36

టీ. నూతనహారిద్ర=పచ్చిపసుపు, తరుణి=ఆలేమయొక్క, తను=శరీరముయొక్క, కాంతియెదుటన్=ప్రకాశముముందఱ, తులకున్ రాలేక=సామ్యమునకురాలేక, (త్రాసునకు రాలేక యనుట.) అత్యంతమలినమయ్యెన్ = మిక్కిలి మాలిన్యమునొందెను. (పచ్చిపసు పెండిన పిమ్మటఁ బైన నల్లగా నగును.), నౌటఁగా = కాఁబట్టియేకదా, రాత్రియనన్, నిశ యనన్, తమిస్ర యనన్, నిశీథిని యనన్, క్షప యనన్ (ఇవి యన్నియు రాత్రికి నామములు. ఈపేళ్లే పసుపునకును జెల్లును. 'నిశాఖ్యాకాంచనీ పీతా హారిద్రా వరవర్ణినీ అని నిఘంటువు. కాన నీపేరులచేత నా పసుపు), పరఁగెన్= ఒప్పెను. (కరఁగె నను పాఠమును గలదు. పసుపురాఁచినఁ గరఁగుట ప్రశస్తము.)

తా. ఆమె సుందరశరీరము పచ్చిపసుపురంగును మించి మిక్కిలి ప్రకాశించుచుండెను. ఉత్ప్రేక్షయు, సారాలంకారమును.

సీ. అయ్యిందువదన ధరాంగన కావునఁ
 ప్రాఙ్మైత్రిఁ బొరుగులభాగవతుల
గృహములందు మరాళికైకావళీ హారి
 ణీ మనోజ్ఞా స్రగ్విణీసమాఖ్య
లమర జనించి వయస్యలై నాగక
 న్యలు పుత్రికావివాహములయందుఁ
బాడు పద్మాలయాపరిణయామేయగే
 యముల ననంతకల్యాణగుణము
తే. లద్భుతం బొప్ప విని విని యతనిఁ గవయు
బుద్ధి ప్రాగ్జన్మసంస్కారమున జనింపఁ
[1]దదవతారానుమేయకథాసుధాను
కలితలీలానుకృతుల వర్తిలుచు నుండి. 37

టీ. అయ్యిందువదన = ఆచంద్రముఖి, ధరాంగన కావునన్=భూమిదేవియగుట చేత, ప్రాఙ్మైత్రిన్ = పూర్వజన్మస్నేహముచేత, నాగకన్యలు = భుజంగకన్యలు, పొ...దన్ - పొరుగుల = సమీపములయందలి, భాగవతుల = భగవద్భక్తులయొక్క, గృహములయందున్ = తిరుమాళిగలయందు, మరాళికా, ఏకావళీ, హారిణీ, మనోజ్ఞా,

1. దదవతారకథాగోష్ఠిఁ దదవతార.

స్రగ్విణీ అనియెడు, సమాఖ్య లమరన్ = నామధేయము లొప్పుచుండఁగా, జనించి= అవతరించి, వయస్యలై = ఆయమకు నెచ్చెలులై, పుత్రికావివాహములయందున్ = బొమ్మలపెండ్లిండ్లయందు, పా...లన్-పాడు = గానముచేసెదు, పద్మాలయాపరిణయ= లక్ష్మీకళ్యాణ మనియెడు, అమేయ = లెక్కకు మీఱిన, గేయములన్=పాటలయందు, అనంతకళ్యాణగుణములు - అనంత - విష్ణువుయొక్క, కళ్యాణ = మంగళకరములగు, గుణములు=గొనములు, అద్భుతంబొప్పన్ = అబ్బురము గలుగునట్లు, విని విని, ఆతని= ఆవిష్ణుదేవుని, క...ద్ధి-కవయు = కూడెదు, బుద్ధి = మనీష, ప్రాగ్జన్మసంస్కారమునన్ - ప్రాగ్జన్మ = పూర్వజన్మసంబంధియగు, సంస్కారమునన్=సంస్కారముచేత, (ఇచ్చటఁ తృతీయార్థమున సప్తమి.) జనింపన్ = పుట్టఁగా, తదవతారానుమేయకథాసుధాను కలిత లీలానుకృతులన్ - తత్ = ఆస్వామియొక్క, అవతార = రామకృష్ణాద్యవతారములయొక్క, అనుమేయ = ఊహింపఁదగిన, కథాసుధా = అమృతమువంటి కథల తోడ, అనుకలిత=కూడికొన్న, లీలా = విలాసములయొక్క, అనుకృతులన్=అనుకారములచేత, వర్తిలుచునుండి = ఒప్పుచు.

సీ. తమతండ్రి శ్రీశదత్తశ్రీలు గృహమునఁ
ద్రవ్వితండములయ్యెఁ దనదు తొంటి
స్రగ్వినిర్మాణదాస్యం బనుత్సేకత
జరపుచుఁ బ్రజ్ఞ వైష్ణవపురాణ
సంహితావ్యాఖ్యారచనఁ బ్రొద్దుఁ గడపుచుఁ
గట్టెడుకమ్మచెంగలువవిరుల
తోమాలె లలకలు దువ్వి కంతునకు [1]బా
ర్హనిబద్ధఖేటకం బనఁగ నీల
తే. వృషకరుద్రేఖ నెడమకొక్కింత యొఱగ
సిడిన ధమ్మిల్లవలయంబు సడుగునందుఁ
గొంతసే పర్థిఁ గిలించి కూపవారి
నీడ వీక్షించి క్రమ్మఱ గూడ నునుచు. 38

టీ. తమ తండ్రి=ఆమె తండ్రియగు విష్ణుచిత్తుఁడు, గృహమునన్=తమయింటి యందు, శ్రీశదత్తశ్రీలు - శ్రీశ=శ్రియఃపతిచేత, దత్త=ఇయ్యఁబడిన, శ్రీలు=సిరులు, ('శోభాసంపత్తిపద్మాసు లక్ష్మీ శ్రీరితికథ్యతే' యని హలాయుధము.) ద్రవ్వితండము

1. కూర్పరబద్ధ. ఆర్ద్రనిబద్ధ - ఆర్ద్రశబ్దమునకు నెమలిరెక్కలను నర్థము తోఁపఁగదు. ఆయర్థమున కాకరమేదియు లభింపదు. కనుక 'బార్హ' అనుపాఠమే సమంజసము.

లయ్యున్ = కలుఁగకయుండినను, తనదు = తన సంబంధియగు, తొంటి=తొల్లింటి, స్రగ్వినిర్మాణదాస్యంబు - స్రక్ = పుష్పమాలికయొక్క, వినిర్మాణ = కూర్చుట యనియెడు, దాస్యంబు = కైంకర్యంబు, అనుత్సేకతన్ = గర్వములేమిని, జరపుచున్ = చేయుచును, ప్రజ్ఞన్ = జ్ఞానముచేత, వై...నన్ - వైష్ణవపురాణసంహితా = శ్రీవిష్ణుపురాణసంహితయొక్క, వ్యాఖ్యారచనన్ = వ్యాఖ్యానముఁజేయుటచేత, ప్రొద్దుఁగడపుచున్=కాలక్షేపముఁ జేయుచు, కట్టెదు=కూర్చుచుండెడు, కమ్మ...లు - కమ్మ = సుగంధముగల, చెంగలువవిరుల = ఎఱ్ఱగలువపూలయొక్క, తోమాలెలు = దండలు, (ఇచ్చట ద్వితీయార్థమందుఁ బ్రథమ.) అలకలు=కురులు, దువ్వి, కంతునకున్ = మన్మథునకు, బార్హ! = నెమలిఈకలచేత, నిబద్ధ = కూర్పఁబడిన, ఖేటకంబనఁగన్ = కేడెమో యనునట్లు (కూర్పరబద్ధ యను పాఠమున మోచేతఁగట్టఁబడిన యని యర్థము.) నీలవృషకకుద్రేఖన్ - నీలవృష = నల్లని యాఁబోతుయొక్క, కకుత్ = మూఁపురముయొక్క, రేఖన్=ఆకారమువంటియాకారముచేత, ('వృషాఙ్గేకకుదం త్రిషు' అని యమరము.) ఎడమకున్ = వామపార్శ్వమునకు, ఒక్కింత = ఇంచుకంత, ఒఱగన్ = ఒఱగఁగా, ఇడిన=ఉనుచుకొనిన, అనఁగా దిద్దిన, ధమ్మిల్లవలయంబు = వట్రువయగు కొప్పుయొక్క, ('ధమ్మిల్లస్సంయతాః కచాః' అని యమరము.) అడుగునందున్=అంతర్భాగమందు, కొంతసేపు, అర్థిన్ = కోర్కిచేత, కీలించి = తుఱుముకొని, కూపవారిన్ = నూతినీటియందు, నీడన్ వీక్షించి=నీడను జూచుకొని, క్రమ్మఱన్ = మగిడి, గూడన్ = తమ తండ్రియుంచిన పుష్పముల పుటికలోను, ఉనుచున్=ఉంచును. 'గూడ' అనఁగా వైష్ణవపరిభాషయందు బుట్ట యని యర్థము.

తా. ఆచంద్రవదన తన తండ్రియగు విష్ణుచిత్తుండు శ్రియఃపతికృపవలన నధికతర సంపదలు గలిగినను గర్వింపక, పూర్వమువలెనే పుష్పమాలికాకైంకర్యముఁ జేయుచు శ్రీవిష్ణుపురాణవ్యాఖ్యానముచేతఁ గాలక్షేపముఁ జేయుచుఁ గూర్చెడు చెంగలువ దండలను దాను కొప్పులో ధరించి, నూతిలో నీడఁ జూచుకొని మరల వానినిఁ గూడబుట్టలో నునుచును. ఆకొప్పు నెడమప్రక్క కొఱఁగి యుండును.

ఉ. [1]ఆ నవలా యలంతి పసుపాడి దుకూలముఁ దాల్చి గుబ్బచన్
గోనలఁ దావు లుప్పతిలఁ గుంకుము తేటల నిగ్గుదేఱఁ గ
ప్రానన నాభిఁ దీర్చి పితృబద్ధ లతాంతము లర్థిఁ గొప్పునం
బూని యొకింత సేపునిచిఃపుచ్చి చెలిం గని మెచ్చ నూచ్చునన్. 39

1. ఆనవలావలంతి.

టీ. ఆ నవలా = ఆ యింతి, (అన్యదేశమగుటంజేసి దీర్ఘాంతము.) అ...డి - అలంతి = స్వల్పమగు, పసుపాడి = పసుపుతోడి స్నానముచేసి, (ఆనవలావలంతి యను పాఠమున స్త్రీరత్న మని యర్థము.) దుకూలము=ధౌతవస్త్రమును, తాల్చి=ధరించి, గుబ్బ చన్గోనలన్ = గుబ్బ చనుగొనలయందు, (కోణశబ్దమువలనఁ గోన కొన అనురూపములు గలుగును, లేక, స్తనములు పర్వత సమములు గనుకఁ దత్ప్రదేశములను గోన లన వచ్చును.) తావులు=పరిమళములు, ఉప్పతిలన్ = ఉదయించునట్టు, కుం...గ్గు-కుంకుమ లేటల = కుంకుముకాంతులయొక్క, నిగ్గు=నిగారంపు, తేఱన్=కానరాఁగా, కప్రానన= కర్పూరముచేతనే, నాభిన్ = తిలకమును, తీర్చి = దిద్ది, పిత్రుబద్ధలతాంతములు-పిత్రు= తండ్రియగు విష్ణుచిత్తునిచేత, బద్ధ=కట్టఁబడిన, లతాంతములు = పుష్పములను, ఆర్తిన్= కోరికచేత, కొప్పునన్=ధమ్మిల్లమందు, పూని = ధరించి, ఒకింతసేపు, ఉనిచి=ఉంచుకొని, పుచ్చి = మరలఁదీసి, చెలిన్ = చెలికత్తెను, కని = చూచి, వెచ్చన్ = వేఁడిమిగాఁగ, ఊర్చుచున్ = ఉచ్ఛ్వసించుచు - అని ముందటి పద్యములో నన్వయము.

క. మీపాడిన హరిచందము
లేపాడిగఁ దలఁపవచ్చు ? నితఁ డేసతులం
గాపాడినవాఁ డనుఁగై
త్రోపాడినఁ దన్ను వలచి ? తొయ్యలులారా ! 40

టీ. తొయ్యలులారా = స్త్రీలారా, మీపాడిన హరిచందములు = మీయొక్క పాటలలోని స్వామియొక్కరీతులు, ఏపాడిగన్ = ఏమర్యాదగాను, తలఁపవచ్చున్ = ఊహింపవచ్చును, ఇతఁడు=ఈహరి, తన్నున్ వలచి=తన్ను మోహించి, త్రోపాడినన్= పెంబడించినను, అనుఁగై = వారికిఁ బ్రియుఁడై, ఏ సతులన్ = ఏ స్త్రీలను, కాపాడిన వాఁడు, ఈ ప్రశ్నవలన నాస్వామి మర్యాదలేనివాఁ డనియును, దన్ను మోహించిన స్త్రీలనైనను దాను స్నేహించి కాపాడ లే దనియును, బరిహాసించుట.

తే. తాను సురమాని నృపతనుల్ ? దాల్చి యకట
కామినీతతి నుడికించుకకంటె నట్టి
గండెయును నల్ల దాసరికిగాఁ పు కిరియు
హరియు నై పోవుటయ పంచి ? దనుయుగంబు. 41

టీ. తాను = ఆహరి, సు...ల్-సురమాని = వామన పరశురామ బుద్ధుల యొక్కయు, నృప=శ్రీరామునియొక్కయు, తనుల్ = శరీరములు, తాల్చి=వహించి, అకట=అయ్యయ్యో, కామినీతతిన్=స్త్రీ సమూహమును, ఉడికించుకంటెన్ = తపింపఁ

చేయుటకంటెను, అట్టె = అప్రకారమే, (మరల నవతారాంతరముఁ బొందకుండు నట్లనుట), గండెయును=మత్స్యమును, నల్లదాసరిగాఁడును = కూర్మమును, కిరియున్ = వరాహమును, హరియున్=సింహమును, అయి, అనుయుగంబున్=ప్రతియుగమందును, పోవుటయ=పోవుటే, మంచిది=మేలు.

తా. ఆ హరి వామన పరశురామ బుద్ధ రామావతారములయందు స్త్రీలను దపింపఁ జేయుటకంటె, మత్స్య కూర్మ వరాహ సింహ రూపములతోనే ప్రతియుగమందు నుండుటయే మేలు. ఇట్లు తిర్యగ్జాతిరూపములతో నుండిన స్త్రీ లెవ్వరును మోహింపరు గావున వారికిఁ దాపము లేకుండును. లేశాలంకారము.

క. ఆతనువుల లేరుగదా
నాతులు మఱి కాక కలిగినన్ వగ తిర్య
గ్జాతికి నీజాతికిఁ గల
యాతివ్రత గలదె యెఱుఁగ కిట్లే లంటిన్. 42

టీ. ఆతనువులన్ = ఆమత్స్యకూర్మాద్యవతారములయందు, నాతులు = స్త్రీలు లేరుగదా, మఱికాక = వెండియు నటుగాక, కలిగినన్=స్త్రీ లుండినను, ['విష్ణోర్దేహాను రూపాం వై కరోత్యేషాత్మనస్తనుం' మనియున్నది గనుకఁ దిర్యగ్జాతి స్త్రీ లుండవచ్చు ననుట.), వగ = భేదము, తిర్యగ్జాతికిన్=ఆమత్స్యకూర్మాదితిర్యక్స్త్రీజాతికి, ఈజాతికిన్=ఈమనుష్యజాతికిఁ గలిగిన, ఈతీవ్రత = ఈత్వరపాటు, కలదె = కలుగునా, అని మరల, ఎఱుఁగక=తెలియక, ఇట్లుఏలఅంటిన్=ఈవిధముగా నేమిటి కంటి నని ముందఱి పద్యములో నన్వయము. ఆక్షేపాలంకారము.

తే. 'ఆత్మవ త్సర్వభూతాని' యనుట బొంకె
ముద్దియల కైన వలవంత ముచ్చటలను
నాటపాటలఁ గతలఁ గొంతడఁగుఁ గాని
నోరు లేనిజంతువులకు నొప్పి ఘనము. 43

టీ. ఆత్మవత్సర్వభూతాని - సర్వభూతాని = సమస్తభూతములును, ఆత్మవత్ = తనవలెనే, అనుట = అని చెప్పుట, బొంకె=అసత్యమా, (సత్యమే యనుట.), ('మాతృవత్పరదారాణి పరద్రవ్యాణి లోష్టవత్, ఆత్మవత్సర్వభూతాని యః పశ్యతి స పశ్యతి.' యని శ్లోకము.) ముద్దియలకున్ = మనుష్యస్త్రీలకు, ఐన = కలిగిన, వలవంత = విరహతాపము, ముచ్చటలను = ఒండొరులకుఁ జెప్పుకొనుటచేత, ఆటపాటలన్ = నృత్యగానములచేత, కతలన్=అహరికథలచేతను, కొంతఅడఁగున్ కాని = కొంత మట్టుపడును

గాని, నోరులేని జంతువులకున్ = మాటలాడలేని జంతువులకు, నొప్పి = ప్రయాసము, ఘనము = అధికము.

తా. పై పద్యమందు నెఱుఁగక యని మరలఁ దెలిసి మనుష్యస్త్రీలకు ముచ్చటలు మొదలయినవానిచేతఁ గొంత విరహతాప మాఱును గాని, యీ మత్స్యకూర్మాది తిర్యగ్జాతి స్త్రీలకే పాపము తాప మధికము. అప్రస్తుతప్రశంసాలంకారము.

మ. ధరపై నీతఁడు పూర్వకల్పముల సక్తస్త్రీవిశాలాంబకాం
బురుహశ్రేణి జలంబుమైఁ బులకలున్ బూరించుచున్ బెంచు దు
ర్ధరకర్మం బలమంగ వచ్చుజలచారస్తబ్ధరోమత్వకే
సరిత లొప్పం డవతారదంభమున నాచ్ఛాదించుఁ దాఁ బ్రౌఢిమన్.

టీ. ఈతఁడు=ఈహరి, ధరపైన్=భూమిమీఁద, పూర్వకల్పములన్ = పూర్వయుగములయందు, స...ణిన్-సక్త=తనయందు మోహముగల, స్త్రీ = స్త్రీల యొక్క, విశాల=వెడఁదలగు, అంబకాంబురుహ =కమలములవంటి నేత్రములయొక్క, శ్రేణిన్ = పఙ్క్తియందు, జలంబు = ఉదకమును, మైన్ = శరీరమందు, పులకలున్=రోమాంచములును, పూరించుచున్ = నిండించుచును, పెంచు = వృద్ధిఁబొందఁ జేసెడు, దుర్ధర = ధరింపరాని, కర్మంబు=సంచితకర్మము, అలమంగన్=వ్యాపింపఁగా, వచ్చు= సంభవించునట్టి, జలచారస్తబ్ధరోమత్వకేసరితల్ = నీటఁదిరుగుటయు (మత్స్యకూర్మముల భావమును), నిట్టవొడిచిన రోమములు గలుగుటయు (వరాహభావమును), మెడమీఁదఁ గొనవెండ్రుకలు గలుగుటయును సింహభావమును, తాన్ = ఆ హరి, ప్రౌఢిన్ = నేర్పుచేతను, పొందు = ఇతరములగు, (ఇదియొండను శబ్దము పకారాదిగానుండు, నెట్లన్నను, ఒచ్చెము - పొచ్చెము, ఊను-పూను, ఒనరించు - పొనరించు, ఇత్యాదులవలెనని యెఱుఁగవలయు.), అవతారదంభమునన్=అవతారమనియెడు నెపముచేత, ఆచ్ఛాదించున్=మఱుఁగుపఱుచును, కైతవాపహ్నవాలంకారము. ('కైతవాపహ్నుతిర్వ్యక్తౌ వ్యాజాద్యైర్నిహ్నుతేఃపదైః' అని దాని లక్షణము.)

తా. ఆ హరి పూర్వయుగములయందు భూమిమీఁదఁ దన్ను మోహించిన స్త్రీల కోరికలు దీర్పక వారిని విరహమందు మునుఁగఁ జేసి దుఃఖపెట్టినాఁడు. కావున నా కర్మపరిపాకము తన కనుభవమునకు రాఁగా 'శుభకృచ్ఛుభ మాప్నోతి పాపకృత్పాప మశ్నుతే' యన్నట్లా స్త్రీలకుఁ గన్నీరు గలుగఁజేసిన హేతువువలన నా కన్నులలో సరియగు మీనుమేనితోఁ దాను నీటిలోఁ దిరుగు నట్లేర్పడఁగా నది మత్స్యావతారము గాను, మఱియు నా స్త్రీల శరీరములయందు గగుర్పాటు గలుగఁజేసిన హేతువువలనఁ దనకు నట్లె నిక్క వొడిచిన రోమములు రాఁగా నది వరాహావతారముగాను, మఱియు

వానివలననే తనకు మెడమీఁదఁ గొనవెండ్రుకలు గలుగఁగా నరసింహ ముఖము గల యవతారముగాను నేర్పడెను. కావున నది యా కర్ణానుభవ మని తెలియరాకుండ నాతఁడు చక్కనినేర్పుతో మఱుఁగు పెట్టుచున్నాఁడు. కైతవాపహ్నుతికిని ఉత్ప్రేక్షకును సంసృష్టి.

క. అనిమిషముని మనుజాధిప
జననంబుల నీతఁ డెట్లు జలజాక్షులఁ గూ
ర్చినవారి నేఁచె దయలే
కనిన వినుఁడు మీఁదుపాటలందఁ దెలిపెదన్. 45

టీ. అనిమిషముని=వామన పరశురాములయొక్కయు, మనుజాధిప=శ్రీరాముని యొక్కయు, జననంబులన్ = అవతారములయందు, ఈతఁడు = ఈహరి, కూర్చినవారిన్=ప్రేమపడినవారైన, జలజాక్షులన్=స్త్రీలను, దయలేక = కృపమాలి, ఎట్లేఁచెననినన్=ఏరీతిచే ఖేదపెట్టెననఁగా, మీదుపాటలందు=మీసంబంధులగు పాటలయందే, తెలిపెదన్=ఎఱిఁగించెదను, వినుఁడు = వినుండు

చ. మొదల నుపేంద్రుఁడై యితఁడమోఘహతిం భృగుపత్ని ద్రుంచియ
మ్ముదుసలి గేహినీవిరహమున్ దనయట్లన పొందు మన్న నా
కదియును దేవకార్యమునకు నయ్యెడునంచు వహించి త్రోఁచు లా
వెద వటు వయ్యు లచ్చి మదికెన్నఁడుఁ బాయని జాలి నింపఁడే?

టీ. ఇతఁడు=ఈహరి, మొదలన్=ప్రథమమందు, ఉపేంద్రుఁడై=విష్ణుమూర్తియై, అమోఘహతిన్ = బీఱువోనివ్రేటుచేత, భృగుపత్నిన్ = భృగుమహాముని భార్యను, ద్రుంచి=సంహరించి, అమ్ముదుసలి=ఆవృద్ధుయిన భృగువు, తనయట్లన=తనవలెనే, గేహినీవిరహమున్ = భార్యావిరహమును, పొందు మన్నన్ = అనుభవింపు మనఁగా, నాకదియును = నాకా భార్యావియోగమును, దేవకార్యమునకున్=దేవతల కార్యముకొఱకే, అయ్యెడునంచున్=అవునని, వహించి=ఆశాపమును వహించి, త్రోఁచు=కాలమునుగడపునట్టి, లావెదన్=దృఢమయిన మనస్సుచేత, వటువయ్యున్=తాను బ్రహ్మచారియయ్యును, లచ్చిమదికిన్=లక్ష్మీదేవిమనస్సునకు, ఎన్నఁడున్ = సంతతమును, పాయని = విడువని, జాలి = విచారమును, నింపఁడే = నిండింపఁడా? వ్యతిరేక ప్రశ్న.

తా. భృగుభార్యను దునిమి యా వృద్ధొసంగిన శాపము దేవతల కార్యము కొఱకగు నని తాను సమ్మతిగా వహించి వామనుఁడై యవతరించి బ్రహ్మచారియై యుండియును వివాహము చేసికొనక నిత్యానపాయిని యయిన లక్ష్మికి నెడఁబాటువలని వ్యస

నమును గలుగఁ జేసెను గదా! విష్ణుమూర్తి దేవతలకొఱకై భృగు భార్యను దునుముట, భృగుమహర్షి భార్యావిరహతాపమునందు మని విష్ణుని శపించి భార్యను బ్రదికించుకొనుట, పురాణప్రసిద్ధము.

మ. ప్రళయార్కోగ్రకుఠారకోణము నృపత్రైవిధ్యవత్పీఠికా
ఖ్యలఁ ద్రిస్థానము లేడుమార్లు వరుసన్ ఘట్టించు దోశ్శక్తిఁ గీ
ర్తిలసద్వల్లకి మ్రోయ రక్తయయి యెంతే వశ్యయౌ భూసతీ
తిలకంబుం దుదఁ ద్రోవఁ గశ్యపున కార్తిం బిడ్డయై పోవదే? 47

టీ. ప్ర...ము-ప్రళయార్క=ప్రళయసూర్యునివలె, ఉగ్ర=తీక్ష్ణమగు, కుఠార = గండ్రగొడ్డలి యనియెడు, కోణము = వీణవాయించెడుకడ్డిని, (కోణో వీణాదివాదన' మ్మని యమరము.) నృ...లన్-నృప=రాజులయొక్క, త్రైవిధ్యవత్=శత్రుమిత్త్రోదాసీన భేదములచేత మూఁడువిధములుగల, పీఠికా=సింహాసనము లనియెడు, ఆఖ్యలన్=పేళ్ళ చేత, త్రిస్థానములు=మంద్రమధ్యతారకము లనియెడు మూఁడుస్థానములను, ఏడుమార్లు= సప్తవారములు, వరుసన్ = షడ్జాదిసప్తస్వరక్రమముగా, ఘట్టించు=కొట్టెడు, వాయించెడు, దోశ్శక్తిన్ = భుజశక్తిచేత, కీర్తిలసద్వల్లకి - కీర్తి = యశ మనియెడు, లసత్ = ఒప్పుచున్న, వల్లకి=వీణ, మ్రోయన్=ధ్వనిసేయఁగా, రక్తయై=అనురక్తిగలిగినదై యని యును, రాజరక్తముచేతఁ దడుపఁబడి యెఱ్ఱనిదై అనియును, ఎంతేన్=మిక్కిలి, వశ్యయౌ= స్వాధీనపడిన, భూసతీతిలకంబున్=భూదేవి యనెడు పతివ్రతారత్నమును, తుదన్ త్రోవన్=కడకుఁద్రోయఁగా, కశ్యపునకున్ = కశ్యపుఁ డనుబుషికి, ఆర్తిన్ = ఆయాసముచేత, బిడ్డయై=పుత్త్రికయై, పోవదే=పోవదా, పోయెననుట. (త్రైవిధ్యవత్తను తావునఁ బూర్వవ్యాఖ్యానముల ననుసరించి శత్రుమిత్త్రోదాసీనభేదముచేత నని వ్రాసితిమిగాని శత్రు, శత్రుమిత్త్ర, మిత్త్రశత్రుభేదముచేత మూఁడువిధములు చెప్పుట యుక్త మని తోఁచుచున్నది.)

తా. పరశురాముఁడు కుఠార మనెడు కడ్డిచేతఁ ద్రివిధ నృపసింహాసనము లని యెడు మంద్రాదిస్థానముల నేడు మాఱులు ఘట్టింపఁగా, మూఁడేళ్లిరువదియొక్క మాఱయ్యె; నట్లు దోర్బలముచేత వాయించెఁ గావునఁ గీర్తి యనెడువీణెయొక్క మ్రోఁత విని, యనురక్తురా లగు భూమినిఁ దా నేలక కశ్యపునకు ధారవోసిన, నాపె పతివ్రత గనుక నతనిఁ బొందక యతనికి బిడ్డయై కాశ్యపి యని పిలువఁబడెను. రూపకోజ్జీవితమును శ్లేషోత్థాపితమునైన లేశాలంకారము.

మ. తనసౌందర్యము చెప్పఁగాఁ గరఁగి పద్మాకాంత రప్పించి మో
హాన కంజంబున వైచి తియ్యమిడు నెయ్యం బొప్పఁ బైకొన్న మా

తి నృశంసత్వమునం దొఱంగి చని వెఱ్ఱిం జేసెఁ గాకుత్స్థుఁ డై
న నిలింపారివిదారిచందములు డెంద౦బాన న్విచారింపుఁడా. 48

టీ. త...ము - తన = ఆహరియొక్క, సౌందర్యము = చక్కఁదనమును చెప్పఁగాన్ = జనులు చెప్పఁగా, కరఁగి=ప్రియపడి, పద్మాకాంత=శ్రీదేవి, రప్పించి = రావించి, మోహనకంజమునన్ = మోహము గలుగఁజేసెడు పద్మముచేత, వైచి = విసరివేసి, తియ్యమిడు = మాధుర్యమొసఁగెడు, నెయ్యంబొప్పన్ = ప్రేమమించఁగా, పైకొనన్ = కౌఁగిలింపరాఁగా, మీఱి=ఆయమ నతిక్రమించి, నృశంసత్వమునన్ = క్రౌర్యముచేత, తొఱంగి = విసర్జించి, చని=పోయి, వెఱ్ఱిజేసెన్ = ఉన్మత్తురాలినిఁ జేసెను, కాకుత్స్థుఁ డైన=ఆకాకుత్స్థవంశజాతుఁడైన, నిలింపారివిదారి = రాక్షసాంతకునియొక్క, చందములు=చర్యలు, డెందానన్=మనస్సునందు, విచారింపుఁడా = ఆలోచింపుఁడు.

తా. శ్రీరాముల సౌందర్యమును విని శ్రీదేవి పిలిపించి విలాసముగాఁ దన చేతికమలముచేత వైచి యతి ప్రేమచేఁ గౌఁగిలింప రాఁగా, నది తప్పుఁజేసి యొప్పక కఠినచిత్తుఁ డై తొలఁగి యాయమను వెఱ్ఱిగాఁ జేసిన యారాముని చందము మీరే మదిలో విచారింపుఁడు. లేశాలంకారము.

చ. చెలువముఁ దాల్చి త న్గవయఁ జేరిన రాగిణి రావణస్వసన్
నలువురు నవ్వ న త్తెఱఁగొనర్పక యేలిన వియ్య మై యతం
డలుగఁడు సీత కిట్టి తలఁపాత్మఁ దలంపక యాయమ న్వృథా
కలహమునం దనుం దొఱఁగు కాఁకకు నాఁకకు లోను సేయఁడే. 49

టీ. చెలువమున్=సౌందర్యమును, తాల్చి=తాను వహించి,తన్=తన్ను, కవయన్ = కూడుటకు, చేరిన=సమీపించిన, రాగిణిన్=అనురాగముగల, రావణస్వసన్=రావణునితోఁబుట్టువగు శూర్పణఖను, నలువురు = చూచిననలుగురు, అనఁగా సర్వజను లనుట, నవ్వన్=పరిహాసింపఁగా, అత్తెఱఁగు = ఆరీతిని, (ముక్కు సెవులు గోయుట ననుట.), ఒనర్పక=చేయక, ఏలినన్ = పాలించినను, వియ్యమై = సంబంధి యై, (అనఁగా బావమఱఁది యై యనుట.), అతండు=ఆరావణుఁడు, సీతకున్ = సీతాదేవికి, అలుగఁడు = కోపింపఁడు, ఇట్టితలఁపు=ఈ యాలోచనను, ఆత్మన్ = బుద్ధియందు, తలంపక = ఆలోచింపక, ఆయమన్=ఆమెను. అనఁగా సీతాదేవిని, వృథాకలహమునన్ = రిత్తకయ్యముచేత, తనున్ = తన్ను, తొఱఁగు = ఎడఁబాసెడు, కాఁకకున్ = తాపమునకును, ఆఁకకున్=రావణునింట చెఱలో నుండుటకును, లోనుసేయఁడే=లోఁబడఁ జేయలేదా?

తా. ఆ శ్రీరాముఁడు దాను సుందరుఁడు గావునఁ దన్నుఁ జూచి మోహించి వచ్చిన శూర్పణఖను నలుగురు నవ్వునట్లొరంగిఁ జేయక యెలికొనసేసి, దానికి సోదరుఁడగు రావణుండు తనకు బావమఱఁదియై సీత నిమిత్తము కోపింపఁడుగదా? ఈ సంగతి యాలోచింపక వట్టి పోరు పెట్టుకొని, సీత తన్నుఁ బాసి తాపముఁ జెందునట్లును, రావణుని నిర్బంధమునకు లోఁబడునట్లును చేసినాఁడుకదా! లేశాలంకారము.

శా. ఫీట్కారస్రవదస్రమై పెదవి కంపింప న్మొఱ ల్గిట్టి ప్రా
వృట్కాలాంబుదగర్జ గెల్వఁగ వలచ్ఛ్రీఖండశాఖాసిత
త్విట్కుంభీనసరేఖఁ గే లసిలతా ధృద్బాహు వేష్టింప ముక్
రాట్కంఠీరవమై యొనర్చె వడి సోణాలంట [1]ఘోణాచ్ఛిదన్. 10

టీ. ఫీ...మై-ఫీట్కార = ఫీట్టను ధ్వనితోడ, స్రవదస్రమై-స్రవత్ = కాఱుచున్న, అస్రమై = నెత్తురుగలదై, పెదవి=ఓష్ఠము, కంపింపన్=వడఁకుచుండఁగాఁ, మొఱల్=ఆర్తనాదములు. కిట్టి=సమీపించి, ప్రా...ర్జన్-ప్రావృట్కాలఅంబుద=వర్షాకాల మేఘముయొక్క, గర్జన్=ఉఱుమును, గెల్వఁగన్ = జయింపఁగా, వ...ఖన్-వలత్= చుట్టుకొనుచున్న, శ్రీఖండ = చందనవృక్షముయొక్క, శాఖా=కొమ్మయందలి, అసిత= నల్లనగు, త్విట్=కాంతిగల, కుంభీనస = త్రాఁచుఁబాముయొక్క, రేఖన్ = పోలికచేత, కేలు = శూర్పణఖహస్తము, అసిలతా = లతవంటిఖడ్గమును, ధృత్ = ధరించుచున్న, బాహున్=భుజమును, (తే. 'నేలనాలుగు చెఱఁగుల నృపులకొలువు, లందు నేను వర్తించితి నవనినాథ, యగ్గలించి నాయెదుర బాహాప్పళించి, కడఁగఁ జాలెదు మల్లులం గాననెందు.' అన్న పద్యమందుఁ దృతీయపాదమున పువర్ణకము లేనియట్లు సోమయాజి విరాటపర్వంబునం బ్రయోగించెఁ గావున నిచ్చటను పువర్ణకము లేకయే చెల్లుబడియయ్యె.) వేష్టింపన్=చుట్టుకోఁగా, ముక్ = పూర్వమందు, రాట్కంఠీరవమై=రాజసింహమై, ఘోణాచ్ఛిదన్-ఘోణా=నాసికయొక్క, ఛిదన్=ఛేదమును,సోణాలంటన్= నాసామూలముననుండు ఎముక లంటునట్లు, వడిన్=వేగముచేత, ఒనర్చెన్ = చేసెను.

తా. మున్ను తాను రాజసింహమై స్త్రీబాధఁ జేయకుండెడు నియమము గల్గియు, శూర్పణఖయొక్క నాసికను శల్యము దగులునట్లు ఛేదింపఁగా, నాముక్కు దెగునప్పుడు ఫీట్టనుధ్వనితోఁగూడ రక్తము గాఱుచుండఁగా, దానిపెదవి వడవడవడఁకుచుండఁగా మొఱ్ఱో యను నార్తనాద మఱిమి నట్లుండఁగా, దానిచేయి, దనచేతినిఁ జుట్టుకొనఁగా నతి వేగముగా దాని ముక్కు సెవులు గోసెనుకదా! (లక్ష్మణుఁడు కోసిన నయ్యాజ్ఞ తనది గావునఁ దానే యని తాత్పర్యము.) లేశాలంకారమును, ఉపమయును.

---

1. నాసాచ్ఛిదన్.

తే. ఒల్లఁ బొమ్మన్నఁ బోదె! తా నుల్లసముల
నేఁప నది రక్కసియ యాట [1]నెగ్గె? వలచి
స్త్రీలు తలవంపఁ దాన వచ్చె నది చాల
కాఁడుదాని [2]బజీతు సేయంగ నగునె? 51

టీ. ఒల్లన్=నే నిష్టపడను, పొమ్ము అన్నన్=పొమ్మని చెప్పఁగా, పోదే=ఆశూర్పణఖ పోదా, తాను=ఆరాముఁడు, ఉల్లసములన్=పరిహాసములచేత, ఏఁపన్=తపింపఁజేయఁగా, అది=ఆశూర్పణఖ, రక్కసియ యాటన్ = రాక్షసియే యాటచేతను, ఎగ్గె=తప్పిదమా, (బోట యెగ్గె యను పాఠమున రాక్షసియాఁటదియు తప్పిదమా యని యర్థము.), వలచి= మోహపడి, స్త్రీలు=విన్నకన్నస్త్రీలు, తలవంపన్=శిరమువంచుకొనునట్లు, తానవచ్చెన్= శూర్పణఖ తానే వచ్చెను, అదిచాలక = అట్లు వచ్చుటయేచాలక, ('వనిత తనంతఁ దావలచి వచ్చినఁ జుల్కనగాదె యేరికిన్' అని మనుచరిత్రమున నున్నది.), ఆఁడు దానిన్=స్త్రీని, బజీతుసేయంగన్=రచ్చసేయుట, అగునే=తగునా.

తా. శ్రీరాముఁడు శూర్పణఖ మోహించి వచ్చినప్పుడు వలదు పొమ్మని తాను జెప్పెనేని యది పోదా? అట్లు సేయక దానిని పరిహాసములచేత నడియాసలు గల్పించి మిగుల వగలం బొగిలించినాఁడు. అది మోహము గలిగినది గావున నట్లు వచ్చుట దానికిఁ దప్పుగాదు. లోకమం దీవార్త స్త్రీలు విని, తలలు వంచునట్లు తనంతన తాను వచ్చుటచాలక మరల దాని నిట్లు రచ్చఁబెట్టవచ్చునా? లేశాలంకారము, అర్థాంతరన్యాసము.

మ. తను నంటన్ సతు లౌటఁ గోరు మునిబృందంబుం దదాపాదిప
ద్వనజక్షోదము గల్గియు న్బెఱజనిం దా వల్లవస్త్రీలుగా
జననం బందఁగఁ జేసి కూడియును నాసక్తాత్మలం గాందినీ
తనయప్రేరణఁ బాసె భోజపుర యాత్రాదంభసంరంభియై. 52

టీ. తనున్ = తన్ను, అంటన్ = కవియుటకు, సతులౌటన్ = స్త్రీలగుటను, కోరు=అభిలషించెడు, మునిబృందంబున్ = మునులసమూహమును, త...ము - తదాపాదిత్=ఆస్త్రీత్వమును, ఆపాది=కలుగఁజేయునట్టి, పద్వనజ= పాదపద్మముయొక్క, క్షోదము = పరాగము, ('పదంఘ్రిశ్చరణోఽస్త్రియా' మ్మనియు, 'చూర్ణేక్షోదస్సము ల్పింజ' యనియు నమరము.) కల్గియున్=తాను గలిగియుండియును, పెఱజనిన్=మఱియొకజన్మమందు, తాన్ = తాను, వల్లవస్త్రీలుగాన్ = గోపాంగనలుగా, ('గోధుగా

1. యెగ్గె. 2. బజాయి,

భీరవల్లవాః' యని యమరము.) జననంబందఁగఁజేసి = పుట్టునట్లుచేసి, కూడియును= సంభోగించియు, ఆసక్త = తనయందుఁదగిలిన, అత్మలన్=చిత్తములుగల యాస్త్రీలను, కాందినీతనయప్రేరణన్ = అక్రూరునిప్రేరణచేత, (అక్రూరుని తల్లిపేరు కాందిని.), భోజపురయాత్రారంభసంరంభియై-భోజపుర=మథురాపురమునకు, యాత్రా = ప్రయాణ మనెడు, దంభ=నెపముచేతను, ('కపటోస్త్రీవ్యాజదంభోపధయ శ్ఛద్మకైతవే' యని యమరము.) సంరంభి యై=ప్రయత్నముఁగలవాఁ డై, పాసెన్ = విడిచెను.

తా. శ్రీరామావతారమందు 'రామస్సర్వాంగసుందరః' యనినట్లును, 'రూపౌ దార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్' అనునట్లును, గలిగిన తన సౌందర్యమును జూచి మునిజనులుఁ దన్నుఁ గవియుటకై స్త్రీత్వము నపేక్షింపఁగా, నప్పుడే వారలను స్త్రీలనుగాఁ జేయక - అనఁగా తాలిని నాలినిగాఁ జేసినవాఁ డనుట - అట్టిపాదపద్మ పరాగము గలిగియుండియు నప్పుడట్లు చేయక, తా నొకయవతార మెత్తి యా కృష్ణావతారమందు వారిని గోపికలుగాఁ బుట్టఁ జేసి, యప్పుడు వారితోఁ గలసియుం సంతత మట్లుండక, తన్ను మరిగియున్న స్త్రీలను విడిచి యక్రూరప్రేరణవలన మథురా పట్టణమునకుఁ బోఁడా ? అట్లు పోవుటవలన నాస్త్రీలకు వెత గలిగించినాఁడు కదా ! లేశాలంకారము, కైతవాపహ్నుతి.

చ. హతల నొనర్చె మోహితలఁ నల్ల యయోముఖి నాపులస్త్యభూ
సుతను విరూప లౌట ననుచో ముసలి న్పెర నిట్టతాఁడువం
టలివ రమించెఁ దా ముసలియయ్యు రహి న్మఱుగుజ్జుప్రేష్యకై
ధృతిసెడి యుగ్రసేనునకుఁ బ్రేష్యత నొందియు దిద్ది యేలఁడే. 53

టీ. మోహితలన్ = వలచిన, అల్ల అయోముఖిన్ = అప్రసిద్ధినొందిన యయో ముఖి యను రాక్షసస్త్రీని, ఆపులస్త్యభూసుతను=పులస్త్యనందనుఁడగు విశ్రవసునికూఁతు రగు శూర్పణఖను, విరూప లౌటన్ = రూపహీనలగుటచేత, హతలనొనర్చెన్=భంగ పఱిచెను, అనుచోన్ = అనెడుపట్ల, (వారు సౌందర్యము లేనివారుగనుక భంగపఱచె నందమా యనిన ననుట.), ముసలిన్ = వృద్ధైనదానిని, పెర = పెద్దదియగు, నిట్టతాడు వంటి=నిడుపాటి తాటిమ్రానివంటి, అలివన్=రేవతీదేవిని,(ఇచ్చటఁ దదాదిగణపఠిత సంధి వికల్పము), తాన్=తాను, ముసలియయ్యున్=ముసలివాఁడయ్యును, రమించెన్ = భోగించెను, (యుగాంతరమునుండి వృద్ధయినదియుఁ బెద్ద పొడవుగలదియు నైన రేవతీదేవిని దాను ముసల మను నాయుధము గలబలరాముఁ డయ్యును మోహించి రమింపఁడా ! స్వరూపముచేత నానురూప్యమును గలుగఁ జేసికొని రమింప లేదా !

అని భావము.) ('తాలాంకో ముసలీహలీ' యని యమరము.) మఱుగుజ్జుప్రేష్యకై=కుబ్జ యగుపరిచారికకై, ధృతిసెడి=ధైర్యములేక, ఉగ్రసేనునకున్=ఉగ్రమైన సేనగలవానికి, (ఉగ్రసేనుఁడను పేరుగల కంసజనకుని కనుట), ప్రేష్యతన్ = పరిచారకత్వమును, ఒంది యున్ = తాను బొందియును. (దాని కనురూపుఁడై యనుట.), దిద్ది=దానికుబ్జతనుదీర్చి, ఏలఁడే=పరిపాలింపఁడా.

తా. ఓ చెలులారా! అయోముఖియు శూర్పణఖయు మోహించిరేనియు వారు లావణ్యవతులు గారు కావున వారినిఁ దా నేలుకొన లేదని మీరంటిరేని, బలరాముఁడు తాను ముసలియయ్యును, నిడుపాటితాటిచెట్టువంటి ముసలిది యగు రేవతిని రమింప లేదా! కృష్ణుఁ డుగ్రసేనునికిఁ బరిచారకుఁడయ్యును మఱుగుజ్జగు త్రివక్రను జక్కఁగా దిద్ది యామెను రమింపఁడా? (అతనికిఁ బక్షపాతమే కాక లావణ్యతారుణ్యాది గుణములతో నక్కఱలే దని భావము.

తే. తనకు నందఱుఁ గూర్మి బృందావనమున
నొకతె రతిఁ దేల్చి కాఁక నొండొకతెఁ బ్రేల్చి
యంత రాధకు మేలువాఁడై మురారి
యెల్ల సతులకు నెద నుడుకే యిడండె. 54

టీ. తనకున్ = ఆ కృష్ణునకు, అందఱున్=వల్లవపల్లవాధరలెల్లను, కూర్మిన్ = మోహపడియుండఁగా, బృందావనమునన్ = బృందావనమందు, ఒకతెన్ = ఒక్క గోపికను, రతిఁ దేల్చి=సురతసుఖ మనుభవింపఁజేసి, ఒండొకతన్=మఱియొకగొల్లతను, కాఁకన్ = విరహతాపముచేత, ప్రేల్చి = తపింపఁజేసి, అంతన్ = అనంతరమందు, రాధకున్=రాధ యనుప్రసిద్ధగోపికకు, మేలువాఁడై = అనుకూలుఁడై, మురారి = ఆ శ్రీకృష్ణుఁడు, (ఇది కర్తృపదము.), ఎల్లసతులకున్ = సర్వస్త్రీలకు, (రతిఁదేలినట్టియు రతిఁ దేలనట్టివారి కందఱి కనుట), ఎదన్ = హృదయమందు, (జాత్యేకవచనము), ఉడుకే=తాపమునే, ఇడండె=ఉనుపఁడా? శ్లేషాలంకారము.

వ. అని యిట్లు త్రపాభరంబున నుపాలంభదంభంబుగాఁ జేయు పునః పునస్స్మరణంబున నంతఃకరణరాగంబు తేటపడం దెలిసి బోటు లిజ్జోటి కైటభారియెడ నాటుకొన్న కన్నెకూర్మి లజ్జా వశంవద యై వెలివిరియంగానీక పుటపాకనికాశం బగు కాఁకఁ జీకాకుపడి నాఁడునాఁటికి నగుచున్నట్లు కిటకిట నగుచున్న దింత నియ్యింతి యెరవు మాన్చి యింగితం బెఱుక పఱచుకొని చింతాపనోదంబు సేయకున్నం బ్రమాదం బని నవ్వుచు నర్మగర్భంబుగా ని ట్లనిరి. 55

టీ. అని యిట్లు=ఈపూర్వోక్తప్రకారంబుగా, త్రపాభరంబునన్ = సిగ్గుప్రేఁగుచేత, ఉపాలంభదంభంబుగాన్ = నిందావ్యాజముగా, చేయు = చేయుచున్న, పునఃపునస్స్మరణంబునన్ = సారెసారె కగుస్మరణముచేత, అంతఃకరణ = మనస్సునందలి, రాగంబు = కృష్ణునివిషయమున ననురాగము, లేటపడన్ = బయల్పడఁగా, తెలిసి= ఎఱిఁగి, బోటులు=చెలులు, ఇజ్జోటి = ఈయువతి, కైటభారియెడన్ = కృష్ణునియందు, నాటుకొన్న=పాదుకొనినట్టి, కన్నెకూర్మిన్ = వివాహమునకుముందు గలిగినయనురాగము, లజ్జావశంవదయై = లజ్జాపరవశురాలై, వెలివిరియంగానీక = బయల్పడనీయక, పుటపాకనికాశంబగు = పుటమువేసినపాకముతో సరియగు, తాఁకన్ = అంతస్తాపముచేత, చీకాకుపడి=చిక్కువడి, నాఁడునాఁటికిన్ = నానాఁటికి, నగుచున్నట్ల = నవ్వుచున్నట్టే, కిటకిటనగుచున్నది=సంకటపడుచున్నది, ఇంతన్ = ఇంతట, ఇయ్యింతి=ఈయువతియొక్క, ఎరవు మాన్చి = ఆయాసము నడంచి, ఇంగితంబు = అభిప్రాయమును, ('ఇంగితం హృద్గతో భావ' అని యమరకోశము.) ఎఱుకపఱచుకొని = ఎఱిఁగింపఁజేసికొని, చింతాపనోదంబు-చింతా = విచారముయొక్క, అపనోదంబు = పరిహారమును, చేయకయున్నన్ = చేయక యుంటిమేని, ప్రమాదం బని=మోసమగు నని తలంచి, నవ్వుచున్=హాసించుచు, నర్మగర్భంబుగాన్=విలాసగర్భమగునట్లు, ఇ ట్లనిరి=ఈవక్ష్యమాణక్రమముగా ననిరి.

ఉ. ఎవ్వారు నట్లపో నెరసు । లెన్నకమానరు ప్రాణభర్తలన్
దవ్వుల నున్నఁ గాఁకకతన । న్మఱి వారలు వశ్యులైనఁ దా
రెవ్వరి నొల్ల రొక్కటయి । యింద్రుఁడు చంద్రుఁ డటండ్రు బోటి తా
నివ్వలఁ దేరకత్తె యగు । నిట్టివి నీతలవేగెనే చెలీ. 50

టీ. ప్రాణభర్తలన్ = ప్రాణేశ్వరులను, దవ్వులన్ ఉన్నన్=దూరముననున్న సమయమునందు, కాఁకకతనన్ = తాపహేతువుచేత, నెరసులు = తప్పులను, ఎన్నకమానరు=లెక్కింపక పోవరు. ఎవ్వరున్=ఎల్లస్త్రీలును, అట్ల పో=అప్రకారమే, మఱి=పిమ్మట, వారలు= ఆప్రాణభర్తలు, వశ్యులైనన్ = స్వాధీనపడిరేని, తారు = ఆస్త్రీలు, ఎవ్వరిన్ ఒల్లక = ఎవ్వరినైన నిచ్ఛగింపక, ఒక్కటయి = సతీపతులేకమై, ఇంద్రుఁడు చంద్రుఁ డటండ్రు = ఆభర్త నింద్రుఁడు చంద్రుఁ డనియందురు, ఇవ్వలన్ = ఈవలను, బోటి = చెలికత్తె, తాన్ = తాను, తేరకత్తె యగున్ = అన్యురాలవుదు, ఇట్టివి=ఇట్టి వార్తలు, నీతల వేగెనే = నీతలమీఁదనే యుదయించెనా, సర్వత్ర కల వనుట. చెలీ యని సంబోధనము.

తా. దూరమందుఁ బ్రియు లున్నప్పుడు లోకమందలి స్త్రీ లందఱును భర్తల తప్పు లెన్నక పోరు. వారు సమీపించి వశపడినప్పుడు వారి నింద్రుఁడు చంద్రుఁ డని భాషించుచు నేక మై యుందురు. పూర్వము ప్రియునిఁ బిలుచుట మొదలగు పనుల యందు నక్కఱ గలిగి యున్న చెలికత్తె యప్పుడు వేరకత్తె యగును? ఇట్టి పనులు నీకే కలిగినవా? అంతటఁ గలిగి యున్నవియే. ప్రస్తుతప్రశంస, లోకోక్తి.

క. అనుటయు నెలనగ వడఁచుచుఁ
గన లించుక తెచ్చి యామొగఱచుచు నయ్యం
గనలర్ కందుకనికరముఁ
గొని వ్రేయుచుఁ గెలను చూచుకొనుచుం బలికెన్. 57

టీ. అనుటయున్ = ఇట్లనిన, ఎలనగవు = లేఁతనవ్వు, అడఁచుచున్=బయలు మెఱయనీక మాటుపఱచుచు, కనలు = కోపము, ఇంచుక = కొంచెము, తెచ్చి=బయలు పఱచి, మొదు కఱచుచున్=క్రిందిపెదవిని దంతపంక్తిచే గఱచుకొనుచు, అయ్యంగ నలన్=ఆస్త్రీలను, కందుకనికరమున్=చెండులపిండును, కొని=గ్రహించి, వ్రేయుచున్= కొట్టుచును, కెలను = పార్శ్వమును, చూచుకొనుచున్ = ఈక్షించికొనుచు, పలికెన్= (ఆయింతి) పలికెను. స్వభావోక్తి.

క. విడువక మీగానము సొగ
సిడుటయు మఱి పాడుఁ డనుట యెగ్గే! పాసెం
బడిగినవారే పేదలె?
కొడిమెలు గట్టకుఁడి యతనిఁగొని పనియేలా? 58

టీ. విడువక=ఎడతెగక, మీగానము = మీయొక్కపాట, సొగసిడుటయున్= ఇంపొసంగినందున, మఱి = ఇంకను, పాడుఁ డనుట=గానముసేయుఁ డని చెప్పుట, ఎగ్గే= తప్పా, పాసెంబు = పాయసము, అడిగినవారే = వేఁడినవారే, పేదలె = దరిద్రులా, (పాయసము మధురమైయుండిన దాని నడిగినవారు దరిద్రులా ? ఆమాధుర్యము గ్రోల నిచ్ఛగించినవారే యనుట.), కొడిమెలు=లేని నిందలు, కట్టకుం.డీ = పెట్టకుఁడు, అతనిఁ గొని = ఆకృష్ణుని గ్రహించి, పని యేలా=ఏమి యక్కఱగలదు. లోకోక్త్యలంకారము.

శా. పోనిం డన్న వయస్య లిట్లని రగుం గొ బో నిక్క మిం కిప్పుడే
గాని మ్మిం కొం కొంతసేపునకునే గానీ సఖి యెల్లియే
గానీ నీనుడిఁ దన్మనోజ్ఞగుణము ల్గానీ తదన్యాయము
ల్గానీ డిందినఁ జింత నీకతనిపైఁ గా కెవ్వరిం దేల్చెదే? 59

టీ. పోనిందు అన్నన్ = ఆయమ పోనిం దని చెప్పఁగా, వయస్యలు = చెలులు, ఇట్లనిరి = ఈవక్ష్యమాణక్రమముగా ననిరి, అగుంబో = ఔనుపో, నిక్కము = నిశ్చయమే, ఇం కిప్పుడే గానిమ్ము = ఇంకమీఁద నిప్పుడేగాని, ఇఁకొకకొంతసేపునకునేగానీ = ఇంకొకకొంత కాలమునకేకాని, (ఇచ్చట నవధారణార్థకమగు నేకారము షష్ఠీవిభక్త్యంతమద్రుతముమీఁదవచ్చినది), సఖీ = ఓచెలీ, ఎగ్గెమే గాని = ఛేపే కాని, నీనుడిన్ = నీవాక్యమందు, తన్మనోజ్ఞగుణముల్ గానీ = ఆస్వామియొక్క మనోహరములగు గుణములుగానీ, తదన్యాయముల్గానీ - తత్ = ఆస్వామియొక్క, అన్యాయముల్గానీ = నేరములయినఁగానీ, డిందినన్ = జాఱిన, (నీనోర వచ్చినేని యనుట,) చింత = విచారము, నీకున్, అతనిపైఁ గాక = ఆస్వామిమీఁదనేకాని, ఎవ్వరిన్ తేల్చెదే = మఱియెవ్వరిని బ్రస్తావింతువు ?

తా. ఎక్కడి ప్రసంగము లని పోనిం దని యాయమ చెప్పఁగాఁ, చెలు 'లగును, నీమాట నిక్కమే కాని, యింకమీఁద నిప్పుడే కాని, మఱికొంతసేపుఁ కేకాని, ఛేపే కాని, నీనోట నా శ్రీకృష్ణుని మంచిగుణములే కాని, చెడుగుణములే కాని వచ్చినా, యప్పుడు నీమది యతనియందుఁ దగిలియుండును గాక, మఱి యెవ్వరిని నీవు దలంపవు గదా!' అనిరి.

సీ. నఖముఖోజ్ఝితపరాఙ్ముఖముక్తబాష్పాంబు
      పటిమ దీపపుఁజిటచిటలు తెలుపఁ
   పాఁసుపాంసూత్సృష్టఘూత్కృతు లకృశమధ్య
      పార్శ్వమువాయుఃప్రకంపములు తెలుప
   నొదవెడుగాద్గద్య మదరిపాటునఁ బల్కఁ
      రింపఁ బుట్టెడు కేకరింత తెలుప
   వలవంత విసువు కాంతల పుట్టు దూషించు
      కారణంబులతోంటికథలు తెలుప
తే. నలఁతఁ బానుపుపైఁ బొరలాట తెలుపఁ
   దెగువ లోలోననే నవ్వు నగవు తెలుపఁ
   గలఁక మామీఁదిపనిలేని కసరు తెలుపఁ
   బాలఁతి రేలు నీయున్కియే పులుగుగాదె. 60

టీ. మఱియు నొక సఖీవాక్యము, న...బు-నఖముఖ = కొనగోళ్ల చేత, ఉజ్ఝిత = విదలింపఁబడినట్టియు, పరాఙ్ముఖ = ఆవలిమొగమై, ముక్త = విడువఁబడిన, బాష్పాంబు = కన్నీళ్లయొక్క, పటిమ = పటుత్వమును, దీపపుఁజిటచిటలు = దీపమువలనఁ బుట్టిన చిటచిట ధ్వనులు, తెలుపన్ = ఎఱిఁగింపఁగా, (ఆయమ యావలి మొగమై కన్నీరు విడుచుచు

నాబాష్పాంబువులు గొనగోళ్ల విదిలింపఁగా నవి దీపముమీఁద బడి చిటచిట యనుచుం డఁగా జలసంబంధము లేక దీపమందుఁ జిటచిటధ్వని పుట్టదు గనుక నిదియ జ్ఞాపకమయ్యె ననుట), పోరన్=మిక్కిలియు, ఉ...తుల్-ఉపాంశు=ఏకాంతమున (రహస్యముగా), ఉత్సృష్ట=విడువఁబడిన, ఫూత్కృతుల్=ఫూత్కారములను, కృ...లు-కృశ=కృశించిన, మధ్య=నడుముయొక్క, పార్శ్వ=ప్రక్కలయందలి, ముహుఃప్రకంపములు=మాటిమాటికిఁ గదలుటలు, తెలుపన్=తెలియఁజేయఁగా,(ఎవ్వరికినిఁ దెలియకుండ రహస్యముగా నాయాసముచేత బుసలు విడువఁగాఁ బ్రక్కలు గదలు ననుట), ఒ...ము-ఒదవెదు = జనించెదు, గాద్గద్యము=డగ్గుత్తిక పడుట, అదరిపాటునన్=హఠాత్కారముగా, పల్కరింపన్ = మేము పల్కరింపఁగా, పుట్టెడు = ఉదయించెడు, కేకరింత = కుత్తుక సరుదుకొనుట, తెలుపన్ = తెలుపఁగా, (చెలికత్తెలు హఠాత్తుగాఁ బిలిచినఁ బలుకఁబోఁగా నాయమకుఁ గలిగెడు డగ్గుత్తిక యాచెలులకుఁ దెలియకుండఁ గేకరించెదు నెపముచేత మఱుఁగు పఱుచు ననుట), వ...వు - వలవంత = విరహతాపమువలననైన, విసువు=వేసటను, కాంతలపుట్టు = స్త్రీలజన్మమును, దూషించు = దూషించెదు, కారణాఢ్యుల = హేతువులుగల, తొంటి కథలు = పూర్వకథలు, తెలుపన్=తెలియఁజేయఁగా, (స్త్రీలై పుట్టఁగూడ దని యనేక పూర్వకథాదృష్టాంతములు చెప్ప ననుట.), ఆలఁతన్ = ఆయాసమును, పానుపుపైన్ = శయ్యమీఁద, పొరలాట = పొరలాడుట, తెలుపన్ = తెలుపఁగా, (విరహాతిశయముచేతఁ బడక కుదురక పొరలు ననుట.) తెగువ=ప్రాణత్యాగము పఱకు సాహసమును, లోలోననే నవ్వ=లోలోపలనే యపహసించెదు, నగవు=హాసము, (నడచు నడకలు, పలుకుపలుకులు అను వ్యవహారము ననుసరించి నవ్వునగవన్న ప్రయోగము), తెలుపన్ = తెలియఁజేయఁగా, ('మరణేసతి కిం భయ' మ్మనిన రీతిగాఁ దెంపుఁ జేసి లోలోపలనే ప్రచ్ఛన్నముగా నవ్వ ననుట), కలఁక = కలంగుటను, మామీఁది = మాపైఁ గలిగిన, పనిలేని=కారణముమాలిన, కసరు = గద్దించుట, తెలుపన్ = తెలియఁజేయఁగా, (మనస్సు తాపాతిశయముచేతఁ గలుషించి యుండుటవలనఁ జెలులను గారణములేక కసరివైచు ననుట), పొలఁతి=ఓయింతీ, రేలు=రాత్రులయందు, నీయున్కియే=నీవర్తనమే, పులుగుగాదె = (హరిమీఁది నీమరులునకు) గుర్తుగాదా.

తా. సుగమము. అనుమానాలంకారము.

చ. ఎఱుఁగరుగా యొకద్భుతము ? నీచెలి దీర్ఘికఁ దీర్థమాడ నా
యఱుతఁ దగిల్చి పోవుఁ దనహారము వోయిన నేను బోవుదున్
మఱవక వెంటఁ బోవ జలమగ్నత నా నది సున్నమైనఁ దాఁ
గఱకటి పెట్టి స్నానమునకుఁగాని నిజార్తి యెఱుంగ దేమియున్. 61

టీ. ఒక సఖి తక్కినసఖులతో ననుమాట,—ఒకయబ్బురమున్=ఒకయబ్బురమును, ఎఱుఁగరుగా = మీరు తెలియరుగా, ఈచెలి = ఈసఖి అనఁగా గోదాదేవి యనుట, దీర్ఘికన్ = డిగ్గియయందు, తీర్థమాడన్ = స్నానముసేయుటకు, తన హారము = తన ముత్తియపుఁబేరును, నా అఱుతన్ = నాకంఠమందు, తగిల్చి = ఉనిచి, పోవున్ = చనును, పోయినన్ = తానటుపోయిన, నేనున్ పోవుదున్ = నేనును బోదును, మఱువక=విస్మృతిలేక, వెంటఁబోవన్ = వెంబడిఁబోఁగా, జలమగ్నతన్ = నీటియందు మునుఁగుటచేత, అది=ఆహారము, సున్నము = చూర్ణము, ఔన్=అవును, ఐనన్=అట్లు సున్నముకాఁగా, తాన్=తాను, అనగా నీయమ, కటకటిపెట్టి = బాధించి, సొమ్ము = తన హారమును, అడుగుఁగాని = వేఁడునుగాని, ఏమియున్ = కొంచెమైనను, నిజార్తి = తన ప్రయాసమును, ఎఱుంగదు = తెలియనేరదు, ముగ్ధ యగుట నని భావము.

తా. ఈ యమ విరహతాపముచేతఁ గ్రాఁగుడువలన శరీరమందలి ముక్తాహారములు పెటిలి యుండిన నవియే నాయమతోఁడ నీటమునిఁగి నప్పుడు విరిసి సున్నమాయె ననియుఁ, నంతతాప మీయమ యనుభవించుచున్న దనియుఁ, నొకచెలి కడమచెలులతోఁ జెప్పెను. అతిశయోక్తి.

చ. అనిన మరాళి పల్కు వినవా హారిణీ యొకనాఁడు కస్తురిం
గొని యిదు బొట్టు నా కనుచుఁ గూర్మి నొసంగినఁ బెట్టుచుండఁ జు
ట్టనుచు మొగంబు వ్రేసినటు లా తనయూర్పుల నింకి యింకి పో
యిన పలుబేంట్లు గోరఁ గొని యెత్తనె పట్టెను మాటిమాటికిన్. 62

టీ. అనినన్ = ఇట్లనఁగా, మరాళి = మరాళి యనియెడి చెలి, పల్కున్ = పలుకును, హారిణీ, వినవా=విను మనుట, ఒకనాఁడు = ఒక దినమందు, కస్తురిన్ కొని = కస్తూరిని దీసికొని, ఇదు బొట్టు నాకున్ అనుచున్ = నాకుఁ దిలకముఁబెట్టు మని, కూర్మిన్=ప్రేమచేత, ఒసంగినన్=కస్తూరినీయఁగా, పెట్టుచుండన్=తాను బొట్టుపెట్టుచుండఁగా, చుట్టనుచున్=చుట్టు మని, మొగంబువ్రేసినటులా = మొగమడఁచినట్లగు వట్టి, తన యూర్పులన్=తన యుచ్ఛ్వాసవాయువులచేత, ఇంకి యింకిపోయిన=మిక్కిలి తడియాఱిన, పలుబేంట్లు = కస్తూరియొక్క పెక్కుబేఁటికలు, మాటిమాటికిన్ = సారెసారెకు, గోరఁగొని = గోటిచే గ్రహించి, ఎత్తనె = ఎత్తివేయుటకే, పట్టెను = ప్రొద్దుసరిపోయెను. అతిశయోక్తి.

తా. మరాళి హారిణితోఁ జెప్పెడు పల్కు:—వినవే చెలీ! యీ యమ నొకనాఁడు నాకుఁ గస్తూరి తిలకముఁ బెట్టు మనఁగా, నా మొగ మడఁచినట్లు తన వేఁడి నిట్టూర్పు లెగయఁగా వానివేఁడిమిచేత నానుదుటి తిలకము పెట్టునప్పుడే యెండిపోవు

చుండఁగా నాభీటికలు దన గోటితోఁద మాటిమాటి కెత్తనే కాలము సరిపోయెను గాని బొట్టుపెట్టుటకుఁ గాలము చాలక పోయెను. చూచితివా యీయమ తాపాతిశయము!

మ. అనినన్ స్రగ్విణి వల్కెఁ దన్నుఁ జెలులారా నే లతాడోలఁ జి
క్కన నూఁపం దెగి వ్రాల దీని చనువ్రేఁకం బేక్రియం దాల్తునో
యని పట్టం దినమధ్యమార్కరుచిఖిద్యన్మంజరుల్వోని వా
డినపాలిండ్లను బెండుబొమ్మగతి నుండెన్ సందిటం జుల్కనై. 63

టీ. అనినన్=అనఁగా, స్రగ్విణి = స్రగ్విణి యను చెలి, వల్కెన్=వక్ష్యమాణ రీతిచేతఁ బలికెను, చెలులారా = సఖులారా, తన్నున్ = ఈయమను, నేన్ = నేను, లతాడోలన్ = తీఁగెయుయ్యెలయందు, చిక్కనన్ = దృఢముగా, ఊఁపన్ = ఊఁగింపఁగా, తెగి = అలత ఈయమశరీరతాపముచేతఁదెగి, వ్రాలన్=ఈమె దిగువఁబడఁగా, దీని=ఈయమయొక్క, చనువ్రేఁకంబు = స్తనభారము, ఏక్రియన్=ఏరీతిగా, తాల్తునో=ధరింతునో, అని=అనుకొని సంశయించుచు, పట్టన్=ఈయమను బట్టుకొనఁగా, ది...ను-దినమధ్యమ=పట్టపగటి, అర్క=సూర్యునియొక్క, రుచి=ఎండచేత, ఖిద్యత్=వాడుచున్న, మంజరుల్వోని=పూలగుత్తులవలె నున్న, వాడిన=మ్లానములగు, పాలిండ్లను=పయోధరములచేత, బెండుబొమ్మగతిన్=బెండుతోఁ జేసిన బొమ్మవలె, సందిటన్=నా కౌఁగిటియందు, చుల్కనై=లఘువై, ఉండెన్ = నిలిచెను, ఉపమాలంకారము.

తా. ఆమె వియోగతాపముచేతఁ గృశింప శరీరము తేలిక యయ్యె నని భావము.

వ. అని తనయవస్థఁ దోఁపనాడిన ననాదరయుంబోలె వారల కిట్లనియె.

టీ. తన యవస్థన్=తన విరహదశను, తోఁపన్ ఆడినన్=బయల్పడఁ బలుకఁగా, అనాదరయుం బోలెన్ = ఆదరములేనిదానివలె, వారలకున్ ఇట్లనియెన్.

క. ఆర్పఁగఁ దీర్పఁగ మిక్కిలి
నేర్పుగలవయస్యలట్లు నెలఁతలు మీ మీ
నేర్పునఁ బలికెద రక్కఱ
యేర్పడ మీ కీ విచార మేటికిఁ జెప్పుఁడీ 65

టీ. ఆర్పఁగన్ = పోఁబుచ్చుటకును, తీర్పఁగన్ = దిద్దుటకును, మిక్కిలి = అధికముగా, నేర్పుగలవయస్యలట్లు = పోఁడిమి గల చెలులవలెనే, నెలఁతలు=స్త్రీలారా, మీమీనేర్పునన్ = మీమీసామర్థ్యముచేత, అక్కఱ = ఆవశ్యకము, ఏర్పడన్ = స్పష్టపడునట్లు, పలికెదరు = చెప్పెదరు, మీకున్ ఈ విచార మేటికిన్=మీకీ చింతయేల, చెప్పుడీ = చెప్పుఁడు.

తా. ఆర్పఁ దీర్ప నేర్పుగల చెలులవలె నక్కఱ గలిగినట్లు మీమీచాతుర్యముల కొలఁది బలికెదరుగాక మీ కీయాలోచన మేల? చెప్పుఁడు.

వ. అని మేలంబు సేసికొని తేలిపోఁ బలికి పుటపాకప్రకారంబగు వియోగ
దవథుభరం బవ్వాధూరత్నం బడంచికొని యుండియు నుండలేక నిశా
సమయంబుల నొక్కొకమాటు తనలోన. 66

టీ. అని=ఇట్లని, మేలంబుసేసికొని=పరిహాసము చేసికొని, తేలిపోఁబలికి=అలక్ష్యముగా మాటలాడి, పుటపాకప్రకారంబగు = పుటమువేసిన లోపలఁ గుములుచున్న ట్లగు, వియోగదవథుభరంబు = విరహతాపాతిశయమును, అవ్వాధూరత్నంబు = ఆబోటిమేటి, అడంచికొనియుండియున్ = మఱుఁగుపఱుచుకొని యుండియు, ఉండలేక=నిలువఁజాలక, నిశాసమయంబులన్ = రాత్రులయందు, ఒక్కొకమాటు=ఒక్కొక్కతూరి, తనలోనన్ = తనంతటనే, ఈవక్ష్యమాణప్రకార మనుకొనుచుండు నని మీఁది కన్వయము.

సీ. అభినవకువలయశ్యామకోమలమైన
        డామూఁపు మకరకుండలము దాల్ప
నిస్తులాస్యశ్రీ వయస్స్తంభనిక్షిప్త
        నింబచ్ఛదభ్రూవికల్పంబు నిక్కఁ
బరువంపు మంకెనవిరి వంపు నరవంపు
        వాతెఱ చెంద్రంపువానఁ గురియ
నందంపు మెఱుఁగువాలారు కన్గవ చూడ్కి
        శ్రవణ కుండల కాంతి సవతుగాఁగ
తే. సప్తభువనాంగనానురంజనకు సప్త
విధ పరీవాహముగ గానసుధ వెలార్చ
మాడ్కి వేణువుపై వ్రేళ్లు మార్చిమార్చి
మురలుకొలిపితె గోవింద మందసతుల. 67

టీ. గోవింద, అ...ము - అభినవ=అప్పుడు వికసించిన, కువలయ = నల్లగలువ వలెనే, శ్యామ=చామనచాయకలిగినదై, కోమలము=మృదువు, ఐన, డామూఁపు=ఎడమ భుజశిఖరము, మకరకుండలమున్ = వామకర్ణ మకరకుండలమును, తాల్పన్ = వహింపఁగా, (వేణు గానము సేయు నప్పుడు మెడ యొఱగ నిడఁగా నెడమ భుజము మీఁదికిఁ గుండలము వచ్చె ననుట.), ని...భ్రూవు - నిస్తుల = సరిలేని, ఆస్యశ్రీ = ముఖకాంతి యొక్క, వయః=వయస్సును, స్తంభ=నిల్పుటకొఱకు, నిక్షిప్త=దృష్టిదోషము లేకుండ నునుపఁబడిన, నింబచ్ఛద = వేఁపాకువంటి, భ్రూవు = కనుబొమ, (ఈశబ్దము హ్రస్వాం

తము నగును. 'భ్రుకుటిర్భ్రుకుటిస్స్త్రియామ్' అని అమరము.) అల్వంబు = ఇంచుకంత, నిక్కన్ = నిక్కుచుండఁగా, (సంస్కారవిశేషముచేత వేఁపాకు వయస్తంభకర మని ప్రసిద్ధము. కనుబొమ యెగురవేయుచు గానముసేయునెడల ముఖకాంతి వయ స్సతిక్రమింపకుండ దృష్టిదోషమురాని యట్లుంచిన వేఁపాకువలె నాకనుబొమ యుండె ననుట), ప...అ-పరువంపు = లెస్సగావికసించిన, మంకెనవిరి = బంధూకపుష్పమును, వంపు = నమ్రముగాఁజేయుచున్న, అరవంపు = సగము వంచిన, వాతెఱ = అధరోష్ఠము, చెం...నన్-చెందిరంపు = సిందూరసంబంధియగు, వానన్ = వర్షమును, కురియన్ = వర్షింపఁగా, (పెదవి సగముమడిచి పిల్లఁగ్రోవి నూఁదుచున్నాఁ డనుట.), అం...డ్కి-అందంపు = అందమగు, మెఱుఁగు = నిద్దమగు, వాలారు = నిడుదయగు, కన్గవ = నేత్రద్వయము యొక్క, చూడ్కి = దృష్టి, శ్ర...తి-శ్రవణకుండల = కర్ణకుండలముయొక్క, కాంతి = కాంతికి, సవతుగాగన్ = సమానమగుచుండఁగా, (ఆ గానమప్పు డట్టి చూడ్కి కర్ణాంతాయతములగు నేత్రముల కొనలను వ్యాపించియుండె ననుట), స...కున్-సప్తభువన = భూర్భువస్సువరాది సప్తలోకములయం దున్న, అంగనా = స్త్రీలయొక్క, అనురంజనకున్ = అనురక్తి గలిగించుటకు, సప్తవిధపరీవాహముగన్ = ఏడు తెఱఁగులగు ప్రవాహము లగునట్లు, ('జలోచ్ఛ్వాసాః పరీవాహా' అని యమరము.) గానసుధన్ = గానామృతమును, వెలార్చు మాడ్కిన్ = పైకుఁబుకఁజేసెదురీతిగా, వేణువుపైన్ = పిల్లఁగ్రోవి మీఁద, వ్రేళ్లు = అంగుళములను, మార్చిమార్చి = పరివృత్తిఁజేసి, గోవిందా = ఓయి శ్రీకృష్ణుఁడా, మందపతులన్ = గోపికాస్త్రీలను, మరులు కొలిపితె = మోహపడఁజేసితివే, శ్రీకృష్ణుని వేణుగానవినోదము ననుసంధించుచున్న దని భావము. పెద్దపాదములందు ఉపమోత్ప్రేక్షలు - గీతియందుత్ప్రేక్ష.

చ. అక్కట రాధ నీకుఁ దగవా మగవారల నత్తమామలం
దక్కి ముకుందవేణుకలనాదపుటీలకు లేటిమొత్తమై
త్రెక్కొనుకాఁకచే నడికిరే లరుదెంచిన గోపికావళిన్
బొక్కఁగఁజేసి తద్రుచిరభోగము గుత్తగ నీవ కైకొనన్. 63

టీ. రాధ = ఓ రాధికా, మగవారలన్ = భర్తలను, అత్తమామలన్ = శ్వశ్రూశ్వశురులను, తక్కి = కికురించి, ము...కున్-ముకుంద = శ్రీకృష్ణునియొక్క, వేణు = పిల్లనగ్రోవియొక్క, కల = అవ్యక్తమధురమగు, నాదపుటీలకున్ = గానమను నీలకు, (ఈల యనఁగా జారచోరు లొండొరులకుఁ దెలుపుకొను సంకేతనాదము), లేటిమొత్తమై = మృగీసమూహమువలె నై, త్రె...చేన్ - త్రెక్కొను = భరింపఁగూడని, కాఁకచేన్ = తాపముచేత, నడికిరేలు = అర్ధరాత్రులయందు, అ...ళిన్-అరుదెంచిన =

వచ్చినట్టి, గోపికావళిన్ = గోపికాసమూహమును, పొక్కఁగన్ చేసి = పరితపించున ట్లొనర్చి, తద్రుచిరభోగము-తత్=ఆ కృష్ణునియొక్క, రుచిర=ఇంపైన, భోగమున్= అనుభవమును, గుత్తగన్ = గుత్తఁజేసినట్లు, నీవ = నీవే, కైకొనన్ = గ్రహించుట, నీకున్ = నీకు, తగవా = న్యాయమా, అకట = అయ్యో, (ప్రథమపాదమందు, ప్రశ్నాకలిత దీర్ఘ యతి.)

తా. తాను దాప మనుభవించుచు రాధ నుద్దేశించి శ్రీకృష్ణ సంభోగము సమస్త గోపికలకు లేకుండఁ జేసి గుత్తఁ జేసినట్లు నీ వొక్కతెవే యనుభవింప వచ్చునా యని రాధను దూఱుచున్నది.

ఉ అక్కమలాక్షుఁ డొక్కతె నిజాంసమునం దిడి కుంజపుంజపుం
జక్కికిఁ గొంచుఁబోవఁ బెఱచాన లినాత్మజ వెంట వ్రేఁగున
న్మిక్కిలి డిగ్గు పాదసరణిం జని రోయుదు రట్ల రోసి తా
రక్కడఁ గాంచు టేమి వలదా యభిమాన మొకింత యింతికిన్? 69

టీ. అక్కమలాక్షుఁడు = ఆ కృష్ణుఁడు, ఒక్కతెన్ = ఒకస్త్రీని, నిజాంసము నందున్ = తనమూఁపునందు, ఇడి = ఉనిచికొని, కుంజపుంజపుంజక్కికిన్=పొదరిండ్ల గుంపుతావునకు, కొంచుఁబోవన్ = తీసికొనిపోవఁగా, పెఱచానలు = ఇతరస్త్రీలు, ఇనాత్మజవెంటన్ = సూర్యతనయ యగు యమునానదివెంబడి, వ్రేఁగునన్ = భారము చేత, మిక్కిలి = అధికముగా, డిగ్గు = దిగఁబడియున్న, పాదసరణిన్ = కాలిజాడను, చని=పోయి, రోయుదురు = వెదకుదురు, అట్లె = ఆప్రకారమే, రోసి = వెదకి, తారు = తాము, అక్కడన్ = ఆ పొదరిండ్లప్రదేశమందు, కాంచుటేమి=చూచుట యేమున్నది, ఇంతికిన్ = స్త్రీకి, అభిమానము = ఱోషము. ఒకింత = కొంచెమైనను, వలదా = ఉండవలదా ?

తా. శ్రీకృష్ణుఁడు గోపికల వంచించి యొక్కదానిఁ దనభుజము మీఁదఁ గూర్చుండఁబెట్టుకొని పొదరిండ్లచాటునకుఁబోఁగా, నాగోపికలందఱును గృష్ణునిం గానక స్త్రీని మోచికొనిపోవుచున్న భారముచేత నాయనపాదములు యమునానది సికతా తలంబుల మిగుల దిగఁబడియుండిన నాజాడను బోయి వెదకెదరుగాక; అట్లు వెదకి శ్రీకృష్ణునిఁ జూచుటవలన నాగోపికతోఁగూడి యున్నప్పుడు దమ కేమిపని యని స్త్రీకిఁ గొంచెమైన నభిమానముండవలదా యని దూఱెను. అర్థాంతరన్యాసము.

చ.-ఇలు కలనైన వెల్వడని యాలువుటాండ్రకుఁ దాపికతై వై
యులు కెడలించి శౌరితను యోగపు వాచవిఁ జూపి మీఁదఁ బె

ల్లలము వియోగవహ్ని భవదంతర సైకతపఙ్క్తి పొంత వం
తలఁ బొరలించి తౌమ శమనస్వస వుగ్రమయూఖనందనీ! 70

టీ. ఉగ్రమయూఖనందనీ = తీక్ష్ణకిరణములుగల సూర్యునియొక్క కూఁతురవైన యో యమునానదీ, ఇలు = గృహమును, కలనైనన్ = స్వప్నమందేని, వె...దన్-వెల్వదని = వెడలిరాని, కొలువుటాండ్రన్ = మానవతులగు గోపికలను, తావికత్తెవై = కుంటెనకత్తెవై, ఊఱడిలించి = (వారల) భయముదీర్చి, శౌ...విన్-శౌరి = శ్రీకృష్ణుని యొక్క, తను = శరీరము యొక్క, యోగపు = సంయోగమనియెడి, వాచవిన్ చూపి = వాగ్రుచిఁజూపి, (విటుని యొద్దనుండి మధురవస్తువులు కొనివచ్చి స్త్రీలకిచ్చి రుచిఁ బుట్టించి యనుకూలపఱుచుట దూతికకు యుక్తమే గనుక వాచవి యని ప్రయోగించినాఁడు), మీఁదన్ = అనంతరమందు, పెల్లు = అధికముగా, అ...హ్నిన్-అలము = వ్యాపించుచున్న, వియోగవహ్నిన్ = విరహాగ్నిచేత, భ...తన్-భవత్ = నీయొక్క, అంతర = మధ్యప్రదేశమందలి, సైకత = ఇసుకదిన్నెల యొక్క, పఙ్క్తి = సమూహము యొక్క, పొంతన్ = సమీపమందు, వంతలన్ = తాపములచేత, పొరలించితి = వారినిఁ బొరలునట్లు చేసితివి, శమనస్వసవు ఔదు = యమునితోఁబుట్టువగుదువు, ('యమునా శమనస్వసా' యని యమరము.)

తా. ఓ యమునానదీ! నీవు జగములఁ దపింపఁజేసెడు సూర్యునికిఁ గూఁతురవై, యంతకుం డగుయమునికిఁ దోఁబుట్టువైతివి గావున, నీ కఠినగుణమునకుఁ దగినట్లు స్వప్నమందైన నిల్లు వెడలని మానవతులగు గొల్లసతుల కెడకత్తెవై, యిల్లు వెడలించి భయము వాపి మొదల నతనితోఁ గూడునట్లొనర్చి యారుచిఁ జూపి పిమ్మట నా కృష్ణుని నెడఁ బాపి, నీ యిసుకదిన్నియలమీఁద వారలు విరహాగ్నిచేతఁ బొరలాడునట్లు చేసితివి గదే! ఎంత కఠినాత్మురాలవే? వ్యాజనిందాలంకారము.

వ. అని యొంటిపాటునం దనలోనం బలుకు పలుకు లాలించి పొంచి
యున్న వయస్యలాస్యంబు లపహాస్యచంద్రికాతుందిలంబులుగాఁ
దోఁచి 'భామ యేమేమి నీ మనం బెఱింగియే కదా మును మున్న
యతనిమాటలు మానలేవంటి' మని మూఁపలించినం గించిదవన
తాననయై నెమ్మొగంబు వెలవెలపాటు లేనగవున నడంచి మఱి
మొఱంగ ననువుపడక యందంబుగూఁడుకొని వారికిట్లనియె. 71

టీ. అని = ఈరీతిగా, ఒంటిపాటునన్ = ఏకాంతమందు, తనలోనన్ పలుకు పలుకులు = తనలోఁ దా ననియెడుమాటలు, ఆలించి = విని, పొం...లు-పొంచియున్న =

దాఁగియున్న, వయస్యలు = సఖులు, ఆస్యంబులు = మొగములు, అ...గాఁ - అదహాస్య = మేలంపు నవ్వు లనియెడు, చంద్రికా = వెన్నెలచేత, తుందిలంబులు కాఁ = పిక్కటిల్లినట్లుగా, తోఁచి = కనఁబడి, భామ = ఓయింతీ, ఏమేమి, ఎఱిఁగియేకదా = తెలిసియేకదా, మునుమున్న = ప్రప్రథమమందే, ఆకని మాటలు = ఆస్వామివార్తలు, మానలేవు అంటిమి అని = విడువఁజాల వంటి మనుచు, మూదలించినఁ = ప్రస్తావింపఁగా, (తాఁకనాడఁగా ననుట.), కించిదవనతానన యై = కొంచెముతలవంచుకొన్న దై, అమ్మొగంబు = ముఖముయొక్క, వెలవెలపాటు = సిగ్గుచేఁ జెల్లఁబోవుటను, లేనగవునఁ = లేఁత నగవుచేత, అడంచి = మట్టుపఱిచి, మఱి = ఇంకను, మొఱంగఁ = దాఁపఁగా, అనువు పడక = వలనుగాక, అందంబు కూడుకొని = వారిని గలపికొని, వారికిఁ ఇట్లనియెఁ = ఆ చెలుల కిట్లనియె.

తే. నాఁడు మన మున్న నెట్లొ పూఁబోఁడులార;
యనిన వారలు మగుడ నాయమకు ననిరి
యింతి నాఁ డుండ వెందుఁ బోయితివి నీ వ
టన్న నచ్చెరువడి వారి కతివ పలికె 72

టీ. పూఁబోఁడులార = ఓ చెలులారా! నాఁడు = ఆ గోపికాకృష్ణుల క్రీడాకాలమందు, మన మున్నఁ = నేను మీరు నుండినను, ఎట్లొ = ఏవిధమగునో, అనినఁ = అనఁగా, వారలు = ఆచెలులు, మగుడఁ = మరల, ఆయమకుఁ = ఆమెకు, అనిరి = చెప్పిరి, ఇంతీ = ఓచెలీ, నాఁడు నీ వుండక = ఆకాలమందు నీవుండక, ఎందుఁబోయితివి = ఎక్కడఁ బోయితివి, అ ట్లన్నఁ = అప్రకార మనఁగా, అచ్చెరువడి = ఆశ్చర్యపడి, అతివ = ఆ యింతి, వారికిఁ బలికెఁ = ఆచెలుల కనియెను.

తే. సకియలార త్రైకాలికజ్ఞానవంతు
లైన ఋషులట్ల పలికెద రంత యెఱుక
యెదఁ గలిగెనేని యెఱిఁగింపుఁ డేను మొదల
నెవ్వతె నటన్న మఱి వార లిట్టు లనిరి. 73

టీ. సకియలారా = సఖులారా, త్రై...లు - త్రైకాలిక = భూతభవిష్యద్వర్తమానకాలత్రయసంబంధియగు, జ్ఞానవంతులు = జ్ఞానము గలవారు, ఐన, ఋషులట్ల = మునీశ్వరులవలె, పలికెదరు = వచించెదరు, అంతయెఱుక = తాదృశజ్ఞానము, ఎదఁ = హృదయమందు, కలిగెనేని = ఉండెనేని, ఏను = నేను మొదలఁ = ప్రథమమందు, (పూర్వజన్మమం దనుట), ఎవ్వతెను, ఎఱిఁగింపుఁ డటన్నఁ = తెలుపుఁ డనఁగా, మఱి = పిమ్మట, వారు = ఆచెలులు, ఇట్టు లనిరి.

మ. దివిజద్రుప్రసవంబుఁ గాంచిన సపత్నిం జూచి చూపోప కిం
తవుజిల్లుంబని యంత సేసి మది నీర్ష్యాక్రోధము ల్సందడిం
ప విరిం బోక ద్రుమంబుఁ గైకొనఁబతి న్మందన్నమ్రానెల్లఁ దే
నవధిం బెట్టిన సత్య వీ వహహ కావా? భామినీ నావుడున్. 74

టీ. ది...త్నిన్-దివిజద్రు=కల్పవృక్షముయొక్క, ప్రసవంబున్=పుష్పమును, (ని. 'స్యాదుత్పాదేఫలేపుష్పేప్రసవోగర్భమోచనే' యని అమర.) కాంచిన=పొందిన, సపత్నిన్=సవతాలగురుక్మిణిని, చూచి=కాంచి, చూపోపక=ఓర్వలేక, ఇంత అవుజిల్లుంబని=ఇంతైనచిన్నపనిని, అంత సేసి = అంతఁగొప్పఁగాఁజేసి, మదిన్ = మనస్సునందు, ఈర్ష్యాక్రోధముల్ - ఈర్ష్యా=ఈసును, క్రోధముల్=కోపమును, సందడింపన్ = పెనఁగొనఁగా, విరిన్=పుష్పముచేత, పోక=చనక, ద్రుమంబున్=వృక్షమును, కైకొనన్=గ్రహింపఁగోరి, పతిన్ = భర్తయగు శ్రీకృష్ణుని, మందన్నన్ = ఔషధ మనఁగా, మ్రానెల్లన్ = వృక్షమెల్లను, తేన్=తెచ్చునట్లు, అవధింబెట్టిన = శ్రమపెట్టినట్టియు మేరఁబెట్టినట్టియు, సత్యవు = సత్యభామవు, ఈవు=నీవు, కావా? అహహా=ఆశ్చర్యము, ('అహాహేత్యద్భుతేఖేదే' యని యమరము.) భామినీ = ఓయింతీ యని సంబోధనము, ('కోపనాసైవభామినీ' యనియున్నది గనుకఁ గోపముగలదానా యనుట), నావుడున్ = అనఁగా.

తా. ఓభామినీ ! నీసవతియగు రుక్మిణీదేవి శ్రీకృష్ణునిచేతఁ బారిజాత పుష్పము గ్రహింపఁగా, నీవు చూచి యోర్వఁజాలక యీసును జలంబును మెఱయ స్వల్పమగు నక్కార్యంబు నెంతోఁ గొప్పఁ జేసి యలిగి యా పుష్పమునుమాత్రమేగాక స్వర్గము నుండి పారిజాత వృక్షమునే తెప్పింపఁగోరి, మం దనిన మ్రానెల్లఁ దెప్పించునట్లు తలంచి, యాప్రకారము శ్రీకృష్ణుని శ్రమ పఱచి పారిజాతవృక్షమును బడసిన సత్యభామవు నీవేకాదా ?

వ. గ్రక్కునం బ్రత్యుత్పన్నవిజ్ఞానయై గృహదీపికారోపణంబునం గృహ
గతపదార్థంబు లొక్కమాఱె దృగ్గోచరంబు లగునట్లు జన్మాంత
రంబున నయ్యనంతునితోడి క్రీడాప్రపంచంబు సద్యస్సమనుభూతం
బైన తెఱంగునం దోఁచిన. 75

టీ. గ్రక్కునన్ = వెంటనే, ప్రత్యుత్పన్నవిజ్ఞాన యై - ప్రత్యుత్పన్న = ఉదయించిన, విజ్ఞాన యై = విశేషజ్ఞానము కలదై, గృహదీపికారోపణంబునన్ = నిలయమందు దీపముంచుటచేత, గృహగతపదార్థంబులు = ఇంటిలోనున్న వస్తువులు, ఒక్క

మూఁటె = ఒకసారియె, దృగ్గోచరంబులగునట్లు = దృష్టివిషయములయినభంగిని, జన్మాంతరంబునన్ = పూర్వజన్మమందు, అయ్యనంతునితోడి = ఆశ్రీకృష్ణస్వామితోడి, క్రీడాప్రపంచంబు=విహారవైపుల్యము, సద్యస్సమనుభూతం బైన తెఱంగునన్ = అప్పుడు లెస్సగా ననుభవించినమాడ్కిని, తోఁచినన్ = అగపడఁగా. గృహదీపికా...తెఱంగునన్ - ఉపమాలంకారము.

ఉ. వాలికకన్నులం బొడముఁవారి సకజ్జల మాశ్రితశ్రవో
గోళక మై తదంతికపుఁగుంతలవల్లికిఁ దల్లిఁదోడుగా
మైలవలి న్నన ల్నిగుడుఁ మైఁ బులకల్పొడమన్ శ్లథాంగియై
సోలినఁ జూచి డెందములుఁ జుట్టిన హా యనిబోటు లర్మిలిన్. 76

టీ. వాలిక=నిడుదలగు, కన్నులన్ = నేత్రములయందు, పొడము = ఉదయించెడు, వారి=బాష్పము, సకజ్జలము=కాటుకనీటితోఁ గూడినదియై, ఆ...కము-ఆశ్రిత = ఆశ్రయింపఁబడిన, శ్రవః = చెవు లనియెడు, గోళకము=గోళములుగలది,ఐ = అయి, ('వైధవేయే భగ్నభాణ్డే శిరస్త్రేమణికేగుడే,కమ్బళే చేస్ది)యస్థానే పూగకోశేచగోళకః-' నానా.) తదంతికపు = ఆకర్ణసమీపమునందున్న, కుంతలవల్లికిన్ = తలవెండ్రుకలు అను తీఁగెకు, తోడుగాన్=తల్లియుఁదోఁబుట్టువుకాఁగా, (కాటుకతో నల్లనై యున్నదిగావునఁ గురులకు సమానమైన దనుట.), మైలవలిన్ = శరీరమనియెడి యేలకితీఁగెయందు, (లవలి = వెన్నెలతీఁగ యనికొందఱు), ననల్=పుష్పములు, నిగుడుమైన్=పుట్టెడిరీతిచేత, పులకల్ = రోమాంచములు, పొడమన్ = పుట్టఁగా, శ్లథాంగియై = బెండువడిన దేహముగలదియై, సోలినన్ = మూర్ఛిల్లఁగా, చూచి = వీక్షించి, బోటులు = చెలికత్తెయలు, డెందములు = అంతరంగములు, చుట్టనన్ = చుఱుక్కనఁగా, హాయని = అయ్యోయనియంగలార్చి, అర్మిలిన్ = కూర్మిచేత, ఆయమయందలి ప్రేమచేత నని ముందటి పద్యములో నన్వయము.

తా. ఆయమ కన్నీరు నింపుచుండ నది చెవులనిండి తలవెండ్రుకలు దడుపఁగా, నెమ్మేను గగుర్పొడువఁగా, సోలినఁ గాంచి డెందంబులం గంది తోడి పూఁబోఁడులు ప్రేమంబున ని ట్లనిరి.

ఉ. ఎంతకుఁ దెచ్చెనే సరసిజేక్షణ యొద్దను లందుమీఁద జ
న్మాంతరవర్తనంబు హృదయంబున కిత్తఱి నెచ్చరించి గో
రంతలు కొండలంత లగునట్లుగఁ జేసితి మంచుఁ జేటికా
వాంతసతాళవృంతమృదువాతహిమాంబుకణాళిఁ దేర్చినన్. 77

టీ. స...ల్-సరసిజేక్షణ=పద్మాక్షియగునీయమయొక్క, చెయ్దములు = వ్యాపారములు, ఎంతకుఁ దెచ్చెనే = ఎంతవఱకుఁదెచ్చెను, అందుమీఁదన్ = ఆకష్టముమీఁద, జన్మాంతరవర్తనంబు = పూర్వజన్మవ్యాపారమును, హృదయంబునకున్ = ఎదకు, ఇత్తఱిన్ = ఈసమయమందు, ఎచ్చరించి = ఎఱుకపఱచి, గోరంతలు = గోరంత స్వల్పములగుకార్యములు, కొండలంతలగునట్లుగన్ = పర్వతోపమానము లగునట్లుగా, చేసితి మంచున్ = కావించితి మని, చేటికా = పరిచారికలచేత, వాంత = వీవఁబడిన, సతాళవృంత = వీవనలతోఁగూడిన, మృదువాత = మందమారుతముగల, హిమాంబు = పన్నీటియొక్క, కణాళిన్ = బిందుపరంపరచేత, తేర్చినన్=మూర్ఛఁదేల్పఁగా, (విసనకఱ్ఱలమీఁదఁ బన్నీరు చిలుకరించి చెలికత్తియలు పరిచారికలచేత వీవఁ జేసి సేదఁదేర్చిరనుట.)

క. తెలిసి కను దెఱచి ౹ వెండియు
జలజేక్షణ తన్ముకుంద ౹ చరణస్మృతిని
శ్చలతఁ గనుమొగిచి ౹ మఱి య
శ్రులు ఱెప్పలఁ దోఁపఁ దెఱచి ౹ చూచి సఖులతోన్. 78

టీ. తెలిసి=తెలివొంది, కనుదెఱచి = నేత్రము విచ్చి, వెండియున్ = మరలను, జలజేక్షణ = ఆనాయిక, తన్ముకుందచరణస్మృతినిశ్చలతన్ - తన్ముకుంద=ఆ శ్రీకృష్ణుని యొక్క, చరణస్మృతి = పాదస్మరణమందు, నిశ్చలతన్ = స్థైర్యముచేత, కనుమొగిచి= నేత్రము మూసి, మఱి = పిమ్మట, అశ్రులు = బాష్పజలములు, ఱెప్పలన్ = పక్ష్ములయందు, తోఁపన్ = కానరాఁగా, తెఱచి = కనుదెఱచి, చూచి = వీక్షించి, సఖులతోన్ = చెలులతోడ. అని ముందటి కన్వయము.

క. మీ రెవ్వ రనుటయును శృం
గారిణి మే మురగకన్య ౹ కల మింతకు ము
న్ధారుణి కేతెంచితి మన
నా రామలఁ గౌఁగిలించి ౹ యార్తి న్బలికెన్. 79

టీ. మీ రెవ్వ రనుటయును = మీ రెవ్వ రనఁగా, శృంగారిణి = ఓసుందరీ, మేమురగకన్యలము = మేము నాగకన్యలము, ఇంతకుమున్ = ఈజన్మమునకు ముందు, ధారుణికేతెంచితిమనన్ = భూలోకమునకు వచ్చితి మనఁగానే, ఆరామలన్=ఆస్త్రీలను, కౌఁగిలించి = ఆలింగనముఁజేసికొని, ఆర్తిన్ = మనస్తాపముచేత, పలికెన్ = వచించెను.

ఉ. అట్టి మురారి కప్పుడనుఁ గై మఱి యీకలివేళఁ గ్రమ్మఱం
బుట్టి వియోగవేదనలఁ బొక్కెడు నీ తను వేల తండ్రి తా
నిట్టగు నన్ను నింకొకని కియ్యక తొల్తన యోగశక్తిఁ బోఁ
బెట్టెద దీని వెండియు నుపేంద్రపదాంబురుహంబు పట్టెదన్. 80

టీ. అట్టిమురారికి౯ = అట్టిశ్రీకృష్ణునకు, అప్పుడు = ఆకాలమందు, అనుఁగై = ప్రియురాలనై, (ఇచ్చట అనుఁగునై యని యుండవలసినను అది వైకల్పికవిధిగాన అనుఁగై అనియు నుండవచ్చును. ఇట్లు ఆదిపర్వంబున - గీ. 'కౌరవుల కెల్ల గురువైన కారణంబు' అని ప్రయోగింపఁబడియున్నది.) మఱి = పిమ్మటను, ఈకలివేళ౯ = ఈకలియుగకాలమందు, క్రమ్మఱ౯ = మరల, పుట్టి = జనించి, వియోగవేదనల౯ = విరహవేదనలచేత, పొక్కెడు = పరితపించెడు, ఈతను వేల = ఈశరీరమేటికి, తండ్రి = మాజనకుఁడు, తాను = ఆయన, ఇట్టగు = ఈరీతిగలిగియున్న, నన్ను౯ = నన్ను, ఇంకొకనికి౯ = మఱియొకనికి, ఈయకతొల్తన = ఇయ్యకముందఱనే, దీని౯ = ఈశరీరమును, యోగశక్తి౯ = యోగబలముచేత, పోఁబెట్టెద౯ = విసర్జించెదను, వెండియు౯ = మగిడి, ఉపేంద్ర = ఆత్రివిక్రమునియొక్క, పదాంబురుహంబు = చరణసరోజమును, పట్టెద౯ = అవలంబించెదను.

తా. అట్టి శ్రీకృష్ణునకుఁ దొల్లి ప్రియురాలనై యుండియు నీకలి వేళ మరల జనించి వియోగతాపముచేతఁ గ్రాఁగెడు నీదేహమును మా తండ్రి నన్నొకని కియ్యక మున్నే యోగశక్తిచేత విడిచి మగిడి యాయుపేంద్రు పాదపద్మంబ యవలంబించెద నని భావము.

క. అది యొండె భక్తి యెవ్వతె
యెద విశ్లేషైకభీరువృత్తిఁ బ్రియలా
భదశ న్మెయిఁ దొఱఁగించును
హదనున నదిగాక యున్న యవి వైశికముల్. 81

టీ. ఎవ్వతె = ఏస్త్రీయైన, ఎద౯ = హృదయమందు, వి...త్తి౯ - విశ్లేష = వియోగమువలన, ఏక = ముఖ్యముగు, భీరువృత్తి౯ = భయంపడినవర్తనముచేత, ప్రియలాభదశ౯ = ప్రియునియొక్కలాభదశయందే, హదనున౯ = మంచిసమయమందు, మెయి౯ = శరీరమును, తొఱఁగించును = జార్చునో, అది = ఆశరీరత్యాగవ్యాపారము, ఒండె = ఒకటే, భక్తి = పతిభక్తి, అదిగాక = అట్లుగాకుండినను, ఉన్నయవి = మిగులునట్టి భక్తులు, వైశికముల్ = 'విత్తమాత్రోపాధిక సకలపురుషాభిలాష సామాన్యా' యను నట్లు వేశ్యాభక్తియేకాక నిక్కము గా దనుట.

తా. ఏయింతి తనప్రాణనాథుఁడు దాఁపున నుండినప్పుడే యతనితో వియోగము గలుగు నేమో యను భయముచేత మంచిసమయము గనుఁగొని శరీరత్యాగము సేయునో యాపెదే పతిభక్తిగాక యితరములైనవి వేశ్యాభక్తివంటి వని భావము.

తే. అనినవారలు పల్కి రాయదువతంస
మెందుఁ జన్నాఁడు విను రంగమంద నిల్చె
వేగపా టేల ? యతఁడ నీవిభుఁ డగుటకు
నర్చనాదుల నివ్విటిహరి భజింపు. 82

టీ. అనినన్=ఇట్లుచెప్పఁగా, వారలు పల్కిరి=ఆచెలు లీవక్ష్యమాణక్రమముగా వచించిరి, ఆయదువతంసము = ఆయాదవరత్న మగు శ్రీకృష్ణుఁడు, ఎందుఁ జన్నాఁడు= ఎక్కడ నేఁగినవాఁడు, వినుము=ఆలకింపుము, రంగమంద=శ్రీరంగక్షేత్రమందే, నిల్చెన్ = నివసించెను, వేగపాటేల = త్వరపడుటయేటికి, అతఁడ = ఆస్వామియే, నీవిభుఁ డగుటకున్=నీభర్తయగుటకు, ఇవ్విటిహరిన్ = ఈశ్రీవిల్లిపుత్తూరున నున్న స్వామిని, అర్చనాదులన్=పూజాదులచేత, భజింపుము=సేవింపుము.

తా. శ్రీకృష్ణుఁ డిప్పు డెచ్చటికిఁ బోలేదు, శ్రీరంగమందే యున్నాఁడు గావున నతఁడు నీభర్త యగుటకు నీయూర నున్న వటపత్రశాయి యుడయవరస్వామినిఁ బూజనాదులచేతఁ గొల్వుము.

చ. అలుకకు మన్నఁ దేఱె మఱి । యంతటనుండియు వేళవేళ నె
చ్చెలు లిడు తెల్వ్వల న్మగుడఁ । జింతల సంతమసంబుల న్సమా
కలితత మించె సొమ్మిడని । కార్శ్యమునన్ హృదయంబున న్సదా
పలపలగాక నీలముల । బన్నసరంబయి నిర్మలాంగికిన్. 83

టీ. అలుకకుమన్నన్=వెఱవకు మని చెప్పఁగా, తేఱె=తెలివొందె, మఱి=అనంతరమందు, అంతటనుండియున్=అప్పుడు మొదలుకొని, వేళవేళన్=ప్రతికాలమందును, నెచ్చెలులు=చెలికత్తియలు, ఇడు = ఉనిచెడి, తెల్వ్వలన్ = జ్ఞానము లనెడు ధావళ్యములతోడను, మగుడన్=మరల, చింతల = విచారము లనియెడు, సంతమసంబులన్=చీఁకటులతోడను, సమాకలితత = కూడుకొనుట, (ఇది కర్తృపదము.), నిర్మలాంగికిన్=స్వచ్ఛశరీరముగల యాయువిదకు, సొమ్మిడని=భూషణము ధరింపని, కార్శ్యమునన్=కృశించుటచేత, హృదయంబునన్ = ఎదయందు, సదా = ఎల్లప్పుడును, పలపలగాక=పలచనగాక, నీలములబన్నసరంబయి = నీలములతోఁ గూర్చిన ముక్తాహారమై, మించెన్=ఒప్పెను.

తా. ఆయమకుఁ గృశత్వముచేత సొమ్ము లిడ కుండినను హృదయమందుఁ జెలుల మాటలఁ దెల్వులును, మరలఁ గలిగెడు చింతాభరంబులను చీకటులును, గూడి

కొని నీలములతోఁ జేర్చిన ముత్తెపు సరమువలె నుండెను. దీనికిఁ జింతాసంతమసంబులు నీలములవలెను, చెలుల మాటలవలనఁ గలిగెడు తెలుపులను తెలుపులు ముత్తెములవలె నుండెననియును, లో నున్న భావము నిర్మలాంగియాట బయలఁ దోఁచెను. పరిణామాలంకారము.

తే. ఎలసి యేప్రొద్దుఁ గనువొందనీక మరుఁడు
కలహమునఁ గంకకాఁడయి కాలు ద్రవ్వఁ
బాండుబహుళపక్షపరంపరలు వెడల
కింటిలో నేదుముల్లయ్యె నిందుముఖికి. 84

టీ. ఎలసి=కనుపెట్టుకొని, ఏప్రొద్దున్=సంతతమును, కనువొందనీక=కన్నుమూయనీక, మరుఁడు = స్మరుఁడు, కలహమునన్=పోరాటమునను, అంకకాఁడయి=మిక్కిలి పట్టుదలగలవాఁడై, కాలుద్రవ్వన్ = కాలుద్రవ్వుచుండఁగా, పా...లు-పాండుబహుళపక్ష=శుక్లపక్ష బహుళపక్ష రాత్రులయొక్క, పరంపరలు=వరుసలు, వెడలక=కదలక, ఇందుముఖికిన్ = ఆచంద్రముఖికి, ఇంటిలోన్=గృహమందు, ఏదుముల్లయ్యెన్=ఏదుఁబంది ముల్లుండినట్లె యాయెను.

తా. మన్మథుఁ డెడతెగక యెప్పుడుఁ గనువైచి నిద్రఁబట్టనీకుండఁ గచ్చరుఁ గాలు ద్రవ్వుచుండఁగా, శుక్లపక్షరాత్రులును బహుళపక్షరాత్రులు నొక్కఁడుగానే చక్కఁగా జరుగక యేదుముల్లింటిలో నుండిన నాయింటివారి కెటు క్షేమములేక నిద్దుర పట్టక పోవునో, యారీతిగానే యాయమ శ్రమపడుచుండెను. శల్యమృగరోమ మింటనున్న నాయింటఁ గలహము కలుగుననుట ప్రసిద్ధము. ఇచ్చట శుక్లపక్షరాత్రులు తెల్లగాను కృష్ణపక్షరాత్రులు నల్లఁగా నుండుటగనుక వానిపరంపర యేదుఁబందిముల్లుఁగాఁ జెప్పఁబడెను. ఆరోప్యమాణమయిన యేదుఁబందిముల్లు కలహమును గలుగఁజేయుట కుపయోగించెను గనుక పరిణామాలంకారము.

మ. తలిరుంగైదువుజోదునానతి వధూధైర్యంపుఁబెన్గోట కం
దళితాహర్ముఖయంత్రకారుఁ డలుకన్నానాఁటికిం ద్రెళ్లఁ గో
మలమార్తండమరీచిదీపకళికోష్మం జూఁడి యేయుం దళ
ద్దళపాథోరుహలోహనాళకుహరోద్యచ్చంచరీకాస్త్రముల్. 85

టీ. కందళితాహర్ముఖయంత్రకారుఁడు = అంకురించిన ప్రాతఃకాల మనియెడు ఫిరంగిరాతు, త...లిన్ - తలిరుంగైదువు=చిగురుటాకుబాఁకుగల, జోదు=యోధుఁడగు మన్మథునియొక్క, ఆనతిన్=ఆజ్ఞప్తిచేత, వ...ట - వధూ=ఆవనితయొక్క, ధైర్యంపు=ధైర్యమయమగు, పెన్గోట = పెద్దకోట, నానాఁటికిన్ = దినక్రమముగా, త్రెళ్లన్ = కూలుటకు, కో...ష్మన్ - కోమల=మృదువగు, మార్తండ = బాలసూర్యునియొక్క,

మరీచి=కిరణములనియెడు, దీపకళికా=మొగ్గవంటిదీపములయొక్క, ఊష్మన్=వేడిమిచేత, చూఁడి = ముట్టించి, ద...ల్ - దళత్=వికసించుచున్న, దళ=ఱేకులుగల, పాథోరుహ=కమలము లనియెడు, లోహనాళ = ఫిరంగులయొక్క, కుహర = బిలమునుండి, ఉద్యత్=వెడలుచున్న, చంచత్=మదించిన, చంచరీక=తుమ్మెదలనియెడు, అశ్మముల్=గుండ్లను, అలుకన్=కోపముచేత, ఏయున్=ప్రయోగించును.

తా. ప్రాతఃకాల మనెడు ఫిరంగిరౌతు మన్మథుఁ డను యోధవరుని సెలవొంది యాయమ ధైర్యమనియెడు కోట నానాఁటికిఁ గ్రిందఁ గూలుటకై, బాల సూర్యకిరణములు సోఁకుటవలన వికసించుచున్న కమలము లనియెడు ఫిరంగులలోనుండి వెడలెడు గండుతుమ్మెద లనియెడు గుండ్లను బారు సేయును, అప్పుడాకిరణజ్వాలయే జానకి త్రాటి రంజకపువేడిమియై యుండెను; ఆయమకు రాత్రులు ధైర్యము లేదాయెఁగదా ప్రాతః కాలమందును లేదాయెను; సాయంకాలములందుఁ గమలములు ముకుళించు నప్పుడు తుమ్మెద లాకమలములలోఁ జొచ్చియుండి సూర్యోదయము కాఁగానే వికసించిన వానిలోనుండి వెడలు చుండెను. రూపకాలంకారము.

తే. సురుచిరవితానదంభకౌసుంభధారి
తుహినధారాగృహాంగి బిందువులు సెదర
పొంత ఘటయంత్రసరముఁ ద్రిప్పుచు జపించు
మగువధృతి దూల మధ్యాహ్నమంత్రవాది. 86

టీ. మధ్యాహ్నమంత్రవాది = మధ్యాహ్నమనియెడి మాంత్రికుఁడు, మ...తి-మగువ=ఆయమయొక్క, ధృతి=ధైర్యము, తూలన్=చలించుటకై, సు...రి-సురుచిర=ప్రకాశించుచున్న, వితాన=మేలుకట్టనియెడు, దంభ=వ్యాజముగల, కౌసుంభ=కాషాయ వస్త్రమును, ధారి = ధరించినవాఁడును, తు...గి - తుహినధారాగృహ = మంచువంటి ధారలుగల గృహమనియెడు, అంగి = శరీరముగలవాఁడునై, (ఇవిరెండును మధ్యాహ్న మంత్రవాదికి విశేషణములు), బిందువులు=ధారాబిందువులు, (బిందువు లనఁగా ధైర్యము యొక్క ప్రాణము లనికొందఱు, బంధువ లను పాఠమున్నను ప్రాణము లనియే యర్థము. 'బంధుర్బంధూకపుష్పే స్యాత్ప్రాణబంధ్వోశ్చ భర్తరి' అని విశ్వము.) చెదరన్=పడుచుండఁగా, ఘ...ముల్ - ఘటయంత్ర=కుంభయంత్ర మనియెడు, సరముల్=జపమాలికను, త్రిప్పుచున్=పరివృత్తిఁజేయుచు, పొంతన్ = సమీపమున, జపించున్=జపము సేయును.

తా. తొగ రద్దిన చందువ లనియెడు కాషాయములను ధరించి మంచువలె ధారలు గురిసెడు గృహ మనియెడిశరీరము భస్మధూసరిత మైనట్లు తెల్లఁగా నుండఁగా, జలము

వెదచల్లుచుఁ దిరుగుచున్న ఘటయంత్ర మనియెడు జపమాలిక ద్రిప్పుచు మధ్యాహ్న మనియెడు మాంత్రికుఁడు మగువ ధైర్యము చెడిపోవుటకుఁ దన నోటి తుప్పరలు రాలు నట్లు జపముఁ జేయుచుండును. దీనివలనఁ దాపోపశమనార్థమై నీటి తుంపురులు నెగయు చున్న ఘటయంత్రములుగల యింటిలో నాయమ యుండఁగా, నక్కడను దాప మధిక మాయె నని తోఁచుచున్నది. ఘటయంత్ర మనఁగా నొక మోకు వెంటఁ గడవలు గట్టి బావిలోఁ జేఁదుచు రాఁగాఁ గొన్ని మునుఁగునవియు మఱికొన్ని నీరు గ్రుమ్మరించునవియై యుండును. రూపకాలంకారము

ఉ. తామరసాప్తతామ్రముఖ దంష్ట్రిత విస్ఫుట మల్లి హల్లక
స్తోమరజచ్ఛటాంగక మధుద్యుతితార వియద్ద్రుచంక్రమో
ద్దామ పితృప్రసూప్లవగి దైన్యరుతోత్థరథాంగపోత చిం
తామయనిద్రలం బొలసి తాపముసేయఁ దొడంగె నింతికిన్. 87

టీ. తా...ఖ-తామరసాప్త=కమలాప్తుఁ డగుసూర్యుఁ డనియెడు, తామ్ర=ఎఱ్ఱనైన, ముఖ=మొగముగలయట్టియు, దంష్ట్రిత = కోఱలుగాఁ జేయఁబడిన, విస్ఫుట=వికసించిన, మల్లి=మల్లెపువ్వులు గలిగినట్టియు, హల్లక = ఎఱ్ఱకలువలయొక్క, స్తోమ=సమూహముయొక్క, రజః=పుప్పొళ్లయొక్క, ఛటా=ప్రోగనియెడు, అంగక = శరీరముగల యట్టియు, మధు=మకరందముయొక్క, ద్యుతి = కాంతివంటి కాంతిగల, తార=నక్షత్రములనెడు కనుగ్రుడ్లుగలట్టియు. (శ్లిష్టరూపకము), వియత్=ఆకసమనియెడు ద్రు=వృక్షమందు, చంక్రమ=సంచరించుటయందు, ఉద్దామ=అడ్డపాటులేనియదియును నగు, పితృప్రసూ=సాయంసంధ్యయనెడు, ప్లవగి = ఆఁడుకోఁతి, ('సాయంసంధ్యా పితృప్రసూ' అని యమరము.) దైన్యరుత=దీనాలాపములతోడ, ఉత్థ=లేచినట్టి, రథాంగ=చక్రవాకములనియెడు, పోత=పిల్లలుగలదియై, చింతామయ=చింతావికారములగు, నిద్రలన్ = నిద్దురలయందు, పొలసి = కనఁబడి, ఇంతికిన్ = ఆయమకు, తాపముసేయన్ = తాపము గలుగఁజేయుటకు, తొడంగెన్ = ఉపక్రమించెను.

తా. 'స్వప్నే మయాయం వికృతో౽ద్యదృష్టశ్శాఖామృగశ్శాస్త్రగణైర్నిషిద్ధః' అని సుందరకాండమందును, 'స్వప్నే వానరమార్జాలభల్లూకాదుఃఖహేతవః' అని గ్రంథాంతరమున నున్నట్లు, స్వప్నమందువానరదర్శనము శుభావహము గాదు గావున 'కోయం తామ్రముఖః కపి' అనినట్లు అస్తమింపఁబోయెడు సూర్యుఁ డనియెడు నెఱ్ఱని ముఖము గలిగి, సాయంకాలమందు వికసిల్లుచున్న మల్లెమొగ్గలనియెడు తెల్లని కోఱలు గలిగి, యెఱ్ఱ గలువ పుప్పొడి తిప్ప యనియెడు పచ్చని శరీరము గలిగి, 'పిఙ్గాక్షం

పురతస్స్థిత' మన్న ట్లాపూలమకరందమువలె పింగళ వర్ణము గల నక్షత్రము లనెడుకను గ్రుడ్లు కలిగి యాకస మనియెడు చెట్టుమీఁదఁ దిరుగుచు నస్తమయకాలమందు నొండొంటిఁ బాసి దీనాలాపములు సేసెడు జక్కవ లనియెడు పిల్లలతోఁ గూడిన సాయంసంధ్య యనియెడు నాఁడుకోఁతి, యానాయకకు నిద్రలు లేకున్నను శరీరమెఱుఁగ రాని చింతామయనిద్రలోఁ దోఁచుచుండుఁ గావున, నాయక మిగుల వగలం బొగులు చుండెను. రూపకాలంకారము.

వ. ఇత్తెఱంగున సకల కాలంబుల నారటంబునకు నూఱటఁ గాన కుండి
యు నప్పుండరీకాక్షి యందుండు నప్పుండరీకాక్షు నారాధనంబున
నా రాధారమణుం గ్రమ్మఱఁ జెంద డెందంబునం దలంచి. ౬౮

టీ. ఇత్తెఱంగునన్ = ఈప్రకారముగాను, సకలకాలంబును = అహోరాత్రములు, ఆరటంబునకు = పరితాపమునకు, ఊఱటఁగానకుండియున్ = ఉపశాంతి పొంద కుండియు, అప్పుండరీకాక్షి = ఆనాయిక, అందుండు = ఆ శ్రీవిల్లిపుత్తూరుననుండు, పుండరీకాక్షు = విష్ణువుయొక్క, ఆరాధనంబునన్ = పూజచేయుటచేతను, ఆ రాధారమణున్ = ఆ శ్రీకృష్ణస్వామిని, క్రమ్మఱఁజెందన్=తిరిగిపొందుటకు, డెందంబునన్ తలంచి = మనస్సున నెంచుకొని.

సీ. పద్మాస్య ప్రతిదినఽప్రత్యూషమును మౌన
నియతి మేల్కని సఖీఽచయము మోవ
హేమపాత్రిక హరిఽద్రామలక్యాదిక
స్నానీయవస్తువ్రఽజంబుఁ గొనుచు
ధౌతాంశుకంబులుఽతడి యొత్తులును దేవ
నంతగపథంబునఽ నరిగి నిజగృ
హారామదీర్ఘికఽ ననుసంహితద్రావి
డామ్నాయయై స్నానఽమాచరించి
తే. పర్జనీలేశ పూర్ణసౌఽభాగ్యదాంగ
ధూళి చకచక లీరెండఽతోడ మాఱు
మలయ నిడువెండ్రుకలగుంపుఽములచివైచి
వేగ వెడవెడఁ దడియొత్తిఽ విధియుతముగ. ౬౯

టీ. పద్మాస్య = ఆకమలముఖి, ప్రతిదినప్రత్యూషమును = ప్రతిదినప్రాతఃకాలమందును, మౌననియతిన్ = మౌనవ్రతముచేత, మేల్కని=నిద్దురలేచి, సఖీచయము=

చెలుల మొత్తము, మ్రోలన్=తనముందఱ, హేమపాత్రికన్ = బంగారుపళ్లెరమునందు, హ...బున్-హారిద్రా=పసుపును, ఆమలక్యాదిక = ఉసిరికపిండిమొదలగు, స్నానీయ = స్నానమునకుఁ దగిన, వస్తు = ద్రవ్యములయొక్క, వ్రజంబున్ = సమూహమును, కొనుచున్ = గ్రహించుకొనుచు, ధౌతాంశుకంబులు = ఉదికిన చీరలును, తడియొత్తులును=తడిఁదుడుచుకొను వస్త్రములును, తేరన్=తెచ్చుచుండఁగా, అంతఃపథంబునన్ = పెరటిత్రోవను, అరిగి = పోయి, ని...య ఐ-నిజగృహ = తమయింటి సంబంధియగు, ఆరామ=ఉద్యానమందలి, దీర్ఘికన్ = డిగ్గియయందు, అనుసంహిత = అనుసంధానము సేయఁబడిన, ద్రావిడామ్నాయయై = ద్రావిడవేదముగలదియై, ('నమామ్యహం ద్రావిడ వేదసాగరమ్' అనియు, 'ద్రవిడోపనిషద్గాథాం పఠితస్య ద్విజస్యవై, యోవై పాదోదకం పాతి స పునాతి వసుంధరామ్' అని యున్నది గనుక ద్రవిడవేదానుసంధానముఁ జేసె ననుట.) స్నానమాచరించి = తీర్థమాడి, ప...లు-పర్జనీలేశ = పసుపుపొడికి, పూర్ణ = మెఁడుకొన్న, సౌభాగ్య = సొబగుఁదనమును, ద = ఇచ్చునట్టి, అంగ = శరీరము యొక్క, ధూళి = పడఁకుటయొక్క, చకచకలు=చాకచక్యములు, ఈరెండతోడన్ = బాలాతపముతోడ, మాఱుమలయన్ = ప్రతిఘటింపఁగా, ని...పు-నిదు= దీర్ఘములగు, వెండ్రుకలగుంపు = కేశములసమూహము, మలఁచివైచి = వెనుకకు వేసికొని, వేగన్= శీఘ్రముగా, వెడవెడన్ = అసమీచీనముగా, తడియొత్తి = ఒడలు దుడిచి, విధియుతముగన్=శాస్త్రవిధిప్రకారముగా నని ముందటి కన్వయము. 'లలాటే కేశవం ధ్యాయే' త్తని యూర్ధ్వపుండ్రప్రకరణమం దున్నది గనుక విధియుత మని ప్రయోగింపఁబడెను. గీతమున ఉపమాలంకారము.

ఉ. కుందరదాగ్ర నెన్నొసలఁ గుమ్మడిగింజ తెఱంగు పాండుమృ
ద్బిందువుఁ దీర్చి చెందిరము పేచకశీర్షముపైఁ బలె న్గటిం
జందురకావిజీ బమరఁ జల్లని రేయిటి తట్టుపు న్గళు
ల్విందులఁ దేల నూనెముడి వెండ్రుకలం దడి తావు లీనఁగన్. 90

టీ. కుందరదాగ్ర=మొల్లమొగ్గలవంటి దంతాగ్రములుగల యాయువతి, నెన్నొసలన్ = లలాటమందు, పాండుమృత్ = తిరుమణియొక్కయు, గుమ్మడిగింజతెఱగు= కూశ్మాండ బీజముయొక్క రీతిగా, బిందువున్ = తిలకమును, తీర్చి = దిద్ది, చెందిరము = సింధూరము, పేచకశీర్షముపైఁబలెన్=గజమస్తకముమీఁదవలె, ('పేచకః పేచకీ తథా' అని ద్విరూపకోశమందును, 'సామజః పేచకీశూర్ప శ్రుతిర్ద్వైదాండ' అని యమరమునను.) చందురకావిజీఱు=చంద్రకావిజిల్గుచీర, కటిన్ = పిఱుందున, అమరన్ = ఒప్పఁగా,

చల్లని = శీతలమగు, రేయిటి=రాత్రియందలి, తట్టుపునుఁగు=సాంకవవిశేషము, అళుల్ = తుమ్మెదలు, విందులఁదేలన్ =విందుభోజనములు సేయఁగా, నూనెముడి వెండ్రుకలన్ = నూనె గలిగి ముడివేయఁబడిన కేశపాశమునందు, తడితావులీనఁగన్ =ఆర్ద్రపరిమళములు సృజింపఁగా అని ముందటి కన్వయము.

తా. ఆమె తిరుమణిని శ్రీచూర్ణమును బెట్టుకొని, చంద్రకావిచీర ధరించి యుండెను, రాత్రి శరీరమందు ధరించిన పునుఁగు వాసనలకుఁ దుమ్మెదలు గ్రమ్ముకొను చుండఁగా, మెఱుఁగురాచియున్న వెండ్రుకలు ముడియిడ నామెనుండి యొక వింత పరిమళము వచ్చుచుండెను.

తే. బోటి గట్టిన చెంగల్వపూవుటెత్తుఁ
దరు పరిణతోరుకదళీమంజరియుఁ గొనుచుఁ
బోయి గుడి నంబి విజనంబుఁ జేయఁ జొచ్చి
మ్రొక్కి వేదికఁ బలువన్నె మ్రుగ్గు వెట్టి. 91

టీ. బోటి=చెలికత్తె, క...త్తు-కట్టిన = కూర్చిన, చెంగల్వపూవుటెత్తున్ = ఎఱ్ఱ కలువ పూవులదండయును, త...యున్-తరు=వృక్షమునందే, పరిణత=లెస్సఁగాఁబండిన, ఉరు=పెద్దదైన, కదళీ=అరఁటిపండ్లయొక్క, మంజరియున్ =గెలయును, కొనుచున్ = తేఁగా, పోయి=చని, నంబి = అర్చకుఁడు, గుడిన్ = కోవెలను, విజనంబుఁజేయన్ = జనరహితమగునట్లు గావింపఁగా, చొచ్చి = అచ్చటఁ బ్రవేశించి, మ్రొక్కి = స్వామికి దండము సమర్పించి, వేదికన్ = తిన్నెయందు, ప...గ్గున్-పలువన్నె=పెక్కురంగులు గల, మ్రుగ్గున్ = రంగవల్లిని, పెట్టి = తీర్చి.

తే. కపిలగవిసర్పిఁ బృథు దీపకళికఁ దీర్చి
ద్వయముతో వక్షమునఁ గల్వదండ సేర్చి
యగరు ధూపంబు లిడి శర్కరాజ్యయుక్త
హృద్యకదళీఫలాళి నైవేద్య మిచ్చి. 92

టీ. కపిలగవి = కపిలధేనువుయొక్క, సర్పిన్ = నేతిచేత, పృథు = పెద్దయగు, దీపకళికన్ = దీపజ్వాలను, తీర్చి = వెలిఁగించి, ద్వయముతోన్ = ద్వయ మనియెడు, మంత్రోచ్చారణముతోడ, వక్షమునన్ = స్వామివక్షస్స్థలమందు, కల్వదండ=చెంగల్వ మాలికను, చేర్చి=సమర్పించి, అగరుధూపంబులిడి = అగరుచెక్క పొడితో ధూపములు వేసి, శ...ళిన్-శర్కరా = చక్కెరతోడను, ఆజ్య = నేతితోడను, యుక్త = కూడి యున్న, హృద్య = మనోహరములగు, కదళీఫల = అరఁటిపండ్లయొక్క, ఆళిన్=సమూహమును, నైవేద్యము = ఆరగింపను, ఇచ్చి = సమర్పించి.

క. ఖండిత పూగీ నాగర
ఖండంబులు ఘన శశాంకశకలంబులచే
*హిండితములు గావించి య
ఖండస్థిరభక్తి నొసఁగి కదలి చెలులతోన్. 93

టీ. ఖం...లు-ఖండిత = కత్తిరింపఁబడిన, పూగీ = పోఁకలయొక్కయు, నాగర= సొంటియొక్కయు, ఖండంబులు = తునుకలను, ఘ...చేన్-ఘన=గొప్పలగు, శశాంక ఖండంబులచేన్=కర్పూరశకలములచేతను, ('ఘనసారశ్చంద్రసంజ్ఞః' అని నిఘంటువు.) హిండితములు గావించి = కలియఁగూర్చి, (హిండిత మను తాంబూలము.) అఖండ = కొదవలేని, స్థిర = తిరమయిన, భక్తిన్ = భక్తిచేత, ఒసఁగి = స్వామికి సమర్పించి, కదలి = అచ్చటనుండి వెడలి, చెలులతోన్ = సఖులతోడ నని ముందటి కన్వయము.

తే. చెలువ గర్భగృహ ప్రదక్షిణముఁ జేసి
వినతయై మౌళి శఠకోపమును ధరించి
చరణతీర్థముఁ గొని తత్ప్రసాదలబ్ధ
మయినమాల్యముఁ దాల్చి గేహమున కరుగు. 94

టీ. చెలువ = అసుందరి, గ...ముఁ-గర్భగృహ = గర్భగృహమునకు, ప్రదక్షిణముఁ జేసి = వలగొని, వినతయై = నమ్రయై, మౌళిన్ = శిరమునందు, శఠకోపమును= శ్రీశఠకోపమును, ధరించి=వహించి, చరణతీర్థముఁ=ఆస్వామివారి శ్రీపాదతీర్థమును, కొని = పుచ్చుకొని, త...ముఁ-తత్ = ఆస్వామియొక్క, ప్రసాద = ప్రసన్నత్వము చేత, లబ్ధమయిన = లభించిన, మాల్యముఁ = పూదండను, తాల్చి=ధరించి, గేహమునకున్ = తన యింటికి, అరుగున్ = పోవును.

క. ప్రతిదినము నిట్లు చని య
చ్యుత పూజ యొనర్చి వచ్చి సుదతి వియోగ
చ్యుతధైర్య యగుచు నయ్యదు
పతిగుణములు ద్రవిడభాషఁ బాడుచు నుండున్. 95

టీ. ప్రతిదినమున్ = అనుదినమందును, ఇట్లు = ఈరీతిగా, చని = పోయి, అచ్యుతపూజ=ఆస్వామి పూజనము, ఒనర్చి = చేసి, వచ్చి=మరల నింటికివచ్చి, సుదతి= ఆయమ, వియోగ = విరహముచేత, చ్యుత = జారిన, ధైర్యయగుచున్ = ధైర్యము గలదియై, అయ్యదుపతి=ఆశ్రీకృష్ణునియొక్క, గుణములు=కల్యాణగుణములను, ద్రవిడ

---

* హిండిత మను తాంబూలము.

భాషన్=ద్రావిడభాషయందు, పాడుచునుండున్=గానము చేయుచుండును. ఈయమ స్వయముగా తిరుప్పావై యను ద్రవిడప్రబంధము చేసి దానిని గానము చేసెను.

వసంతర్తువు

తే. మొదల నాముక్తమాల్యద । మదనతాప
తరణి పెనువెట్ట వేఁగిన । దక్షిణాశ
మత్కృతోష్మకుఁ దుదముట్ట । మాఁడు ననుచుఁ
దొలఁగె నన నుత్తరాశకుఁ । దొలఁగెఁ దరణి. 96

టీ. మొదలన్ = ప్రథమమందు, ఆముక్తమాల్యద - ఆముక్త = ధరించి విడువఁబడిన, మాల్య = పుష్పమాలికలను, ద = స్వామి కిచ్చిన చూడిక్కొడుత్త నాచ్చియారనియెడు నాయమ్మయొక్క, మదనతాప - మదన = మన్మథునిచేతనైన, తాప = విరహతాప మనియెడు, తరణి = సూర్యునియొక్క, పెనువెట్టన్ = అధికోష్ణముచేత, వేఁగిన = పరితపించిన, దక్షిణాశ = దక్షిణదిక్కు, మత్కృత=నాచేతఁజేయఁబడిన, ఊష్మకున్ = వేఁడిమికి, తుదముట్టన్ = పరిసమాప్తమగునట్లు, మాఁడు ననుచున్ = మాఁడిపోవునని, తొలఁగెననన్ = తొలఁగెనో యనునట్లు, తరణి=సూర్యుఁడు, ఉత్తరాశకున్=ఉత్తర దిక్కునకు, తొలఁగెన్ = సంచలించెను, ఉత్తరాయణగతుఁ డాయెను.

తా. ఇప్పుడె చూడిక్కొడుత్తనాచ్చియారుయొక్క విరహతాపమనెడు సూర్యదీప్తిచేత నీదక్షిణదిక్కు వేఁగుచున్నది; దీనిపై నేనును వేఁడిమిఁ జేసితినేని యీ దిక్కు మాఁడి పోవునని తలంచి సూర్యుఁ డాదిక్కునుండి తొలంగెనో యనున ట్లుత్తరాయణ ప్రవేశమాయెను. ఆచూడిక్కొడుత్తనాచ్చియారు ధనుర్మాసమం దీవ్రతము బూని ముప్పది దినములు ముప్పది పాటలుగాఁ దిరుప్పావై పాడె ననియును, పిమ్మట మకరసంక్రమణము ప్రవేశించె ననియును భావము. రూపకోత్థాపితహేతూత్ప్రేక్షాలంకారము.

చ. తెలియఁగ వచ్చె నట్టితఱిఁ । దిగ్మకరుండు ధనాధిపాశకై
తొలఁగినకారణం బతివ । దుర్వహ దీర్ఘవియోగవహ్ని పె
ల్లలమిన తద్దిశం దగిలినట్టి తనూష్మ ఘనీభవన్మహా
జలమయశంకరశ్వశురశైలముకోనల చల్వఁ దీర్పఁగోన్. 97

టీ. అట్టితఱిన్=ఆసమయమందు, తిగ్మకరుండు = తీక్ష్ణకిరణుండగు సూర్యుఁడు, ధనాధిపాశకై = కుబేరదిక్కునకై, తొలఁగిన కారణంబు = తొలఁగిచనిన హేతువు, అ...హ్ని - అతివ = ఆచూడిక్కొడుత్తనాచ్చియారుయొక్క, దుర్వహ = వహింపఁ

గూడని, దీర్ఘ=పొడువగు, వియోగవహ్ని=విరహాగ్ని. పెల్లు=అధికముగా, అ...శన్ - అలమిన=వ్యాపించినట్టి, తద్దిశన్ = ఆదక్షిణదిశయందు, త...ష్మన్ - తగిలినట్టి=తనకు నంటినట్టి, తనూష్మన్ = శరీరతాపమును, ఘ...ల్వన్ - ఘనీభవల్ = కరుడుగట్టిన, మహాజలమయ = మహోదకవికారమగు, శంకర = ఈశ్వరునకు, శ్వశుర = మామమగు, శైలము = హిమవత్పర్వతముయొక్క, కోనల=చరులయందలి, చల్వన్=శైత్యముచేత, తీర్చుకోన్ = పోఁగొట్టుకొనుట కని, తెలియఁగవచ్చెన్ = ఎఱుకపడవచ్చెను.

తా. సూర్యుఁడు దక్షిణదిక్కునుండి యుత్తరదిక్కునకుఁ జనుటకుఁ గారణ మే మనఁగా, దక్షిణ దిశయందుఁ జూడిక్కొడుత్తనాచ్చియారుండెఁ గావున నాయమతాప మాదిక్కెల్ల వ్యాపింపఁగా, సూర్యుఁ డచ్చట నుండఁగా నతనికి నావేఁడిమి దాఁకుట వలన హిమవత్పర్వతము చఱియలలోని శైత్యముచేత నాకాఁక నడంచుకొనుటకై యా యుత్తరదిశకుఁ బోయెను. కావ్యలింగానుప్రాణితఫలోత్ప్రేక్షాలంకారము.

తే. కినిసి వలఱేఁడు దండెత్తఁ గేతు వగుట
మీన మిలఁ దోఁచు టుచితంబ మేష మేమి
పని యనఁగనేల? విరహాఖ్యఁ బాంథయువతి
దాహమున కగ్గి రాఁగఁ దత్తడియు రాదె? 98

టీ. కినిసి =కోపించి, వలఱేఁడు = మన్మథుఁడు, దండెత్తన్ = విరహులమీఁద దండెత్తిరాఁగా, కేతువగుటన్ = టెక్కెమౌటచేత, మీనము = మత్స్యము, (మీన సంక్రాంతి యనుట.), ('ప్రద్యుమ్నో మీనకేతనః' అని యమరము.) ఇలన్ = భూమి యందు, తోఁచుట = కనఁబడుట, ఉచితంబ = తగినదియే, మేషము = మేఁక, (మేష సంక్రాంతి యనుట), ఏమిపనియనఁగ నేల=ఏమిపనికివచ్చెననుటయేల, విరహాఖ్యన్=విరహ మనెడుపేరిచేత, పాం...తున్ - పాంథ = వియోగవతులగు, యువతి = ఉవిదల యొక్క, దాహమునకున్ = దహించుటకై, అగ్గి=అగ్ని, రాఁగన్=వచ్చుచుండఁగా, తత్తడియున్ = వాహనమును, రాదే = రాదా? (వచ్చును.)

తా. మన్మథునకు మీనము టెక్కెము గావున నతఁడు దండెత్త వచ్చునప్పు డది కనఁబడుట సరియేగాని, మేష మేల వచ్చె ననఁగా, నగ్ని మేషవాహనుఁడు గావున నతఁడు విరహ మను నామముచేత వియోగినులను దహించుటకై రాఁగా నతని వాహ నము కూడ వచ్చెను. మీన సంక్రాంతి వచ్చి యానెల గడచి మేషసంక్రాంతి వచ్చెను. శ్లేషచేత మీనమేషములకు సంతాపకరత్వము చెప్పినాఁడు గనుక నలంకారముచేత వస్తుధ్వని.

చ. ప్రియ పరిరంభణ ద్రఢిమ పెల్లిఁకఁ జైత్రుఁడు వచ్చి చేయుఁగా
వ్యయ మని సీతునంద చెలువ ల్పెదవు ల్దడుపంగ వచ్చెఁ దా
రయమునఁ బేర్చి యా ఋతువు రాఁ జలి విచ్చి తొలంగి రయ్యవ
స్థయుచితమే కదా విపది ధైర్య మనం జనుమాట యింతకున్. 99

టీ. ప్రి...ల్లు-ప్రియ=ప్రియులయొక్క, పరిరంభణ = ఆలింగనములయొక్క, ద్రఢిమ = దార్ఢ్యముయొక్క, పెల్లు = ఆధిక్యమును, ఇఁకన్ = భవిష్యత్కాలమందు, చైత్రుఁడు = మధుమాసము, వచ్చి = ఆసన్నుఁడై, వ్యయముసేయుఁగా = నాశము జేయునుగదా, అని = అనుకొని, సీతునంద = చలికాలమందే, చెలువల్ = సుందరులు, పెదవుల్దడుపంగన్ = భయముచేతఁ బెదవులుఁ దడుపుకొనుచుండఁగా (చలిచేతఁ బగిలిన పెదవులను నాలుకలచేఁ దడుపుదురు గనుక దానిని భయానుభావముగాఁ జెప్పినాఁడు), ఆ ఋతువు = ఆవసంతర్తువు, తాన్ = తాను, రయమునన్ = వేగముచేతను, పేర్చి=అతిశయించి, వచ్చెన్=ప్రవేశించెను, రాన్=అట్లురాఁగా, చలివిచ్చి = చలిదేఱి, (భయములేకయనుటయును. వసంతర్తువురాఁగానే చలిపోయె ననుట), అయ్యవస్థ=అట్లు భయపడి పెదవులుదడుపుటయును, చలిచేతఁదడుపుచుండుటయును, తొలఁగిరి=విడిచిరి. ఇంతకున్ = ఇంతపనికిని, విపదిధైర్యమనంజనున్ = ఆపదయందు ధైర్యముండవలయు ననఁగా నొప్పుచున్న, మాట=వాక్యము, ('విపదిధైర్య మథాభ్యుదయే క్షమా' అను వాక్యమనుట,) ఉచితమేకదా = తగినదేకదా.

తా. స్త్రీలందఱు తమ ప్రియుల బిగి కౌఁగిలింత లింకఁ జైత్రుఁడు వచ్చి యిప్పటివలె నుండనీక నశింపఁజేయునని చలికాలమందే భయపడి పెదవులు దడిపికొనుచుండఁగా నతఁడు రానే వచ్చెను; అట్లు రాఁగా వారు చలిదీఱి యా యవస్థ విడిచిరి, విపది ధైర్య మనుమాట యాపని కుచితమే కదా! చలికాలములో వలెఁ జైత్రమాసములో గాఢాలింగనము లుండవనియును, జలిచేతఁ బెదవులు పగులఁగా నాలుకకొనలచేఁ దడుపుకొందు రనియును, వసంతర్తువు రాఁగానే చలి తగ్గెననియును, వారా పెదవులు దడుపుకొనుట మాని రనియును భావము. హేతూత్ప్రేక్ష, అర్థాంతరన్యాసము, శ్లేషాలంకారమును.

ఉ. స్పష్ట బహువ్రణం బయిన సీతున కల్కి నిజోష్ఠపల్లవో
చ్ఛిష్టముఁ గొన్న దిమ్మధు విసీయన కింతులుమోవిఁ దన్మధూ
చ్ఛిష్టముఁ గొన్న యొచ్చె మడఁగజేసిన వారు కృతం బెఱింగి వి
స్పష్టముగా నొనర్చిరి వసంతున కూఁటట దోహదంబులన్. 100

టీ. ని...మున్-నిజోష్ఠపల్లవ-నిజ = తమయొక్క, ఓష్ఠపల్లవ = మోవిచిగురుల యొక్క, ఉచ్ఛిష్టమున్ = ఎంగిలిని, కొన్నది = గ్రహించినది, ఇమ్మధువు = ఈతేనియ, ఇసీయనక = ఛీయనక, ఇంతులు = స్త్రీలు, సృ...ణ-సృష్ట = సృజింపఁబడిన, బహు వ్రణంబు = పలుగాయములు గలది, ఐన, సీతునకున్ = చలికాలమునకు, అలికి = వెఱచి, మోవిన్ = అధరోష్ఠమునందు, తన్మధూచ్ఛిష్టమున్ - తత్ = తమచేత నిరసింపఁబడినట్టి, మధూచ్ఛిష్టమున్ = తేనియకెంగిలియైన మయినమును, ('మధూచ్ఛిష్టంతు సిక్థకమ్' అని యమరము.) కొన్న = గ్రహించిన, ఒచ్చెము = లోపమును, అఱఁజేసినన్ = పోవునట్లొన ర్పఁగా, వారు = ఆస్త్రీలు, కృతంబెఱిఁగి = ఉపకార మెఱిఁగి, వసంతునకున్ = మధు మాసమునకు, దోహదంబులన్ = దశవిధదోహదములచేత, ('తరుగుల్మలతాదీనా మకాలే కుశలైః కృతం, పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదం స్యాత్తు తత్క్రియా' యని దోహదప్రకారము.) ఊఱటన్ = విశ్రాంతిని, విస్పష్టముగాన్ = ప్రకట మగునట్లు, ఒన ర్చిరి = చేసిరి.

తా. స్త్రీలు మున్ను తేనియద్రావు నెడ నది యోష్ఠపల్లవములయందలి మాధుర్య మును బుచ్చుకొన్నదిగానఁ దమ యెంగిలి తిన్న దని తెలిసియు, దానికి రోఁతపడక చలికి వెఱచి తమ పెదవులయం దున్నట్టి తేనియ కెంగిలి యగు మయినమును జలిపుండ్ల కడ్డముగాఁ బెట్టుకొనియుండిరి. వసంతర్తువు రాఁగానే చలి పోయెను గావున, వార లా మయినము వదలునట్లు, అనఁగా తమ కా చిన్నతనము నీ వసంతుఁడు పోఁగొట్టె నని యుపకారస్మృతి గలిగి, యందులకుఁ బ్రత్యుపకారముగా వసంతుని కార్య మగు పుష్పింపఁజేయుటను దామే దోహదములచేతఁ గనఁబఱచి యతనికి నూఱట గలుగఁ జేసిరి. పరివృత్త్యలంకారము.

మ. మునుపే చంద్రబలంబు గల్గి మలయంపుం గమ్మ తేగాడ్పుఁ దే
రున నేతెంచు లతాంతబాణునకు సూర్యుండు న్మహిం గ్రొత్తగా
ననుకూలించెఁ జలంబున న్విరహిణీప్రాణాపహారంబు సే
యన యూహించు విధాత కృత్య మది యేలామానునెప్పట్టునన్.

టీ. మునుపే = పూర్వమే, చంద్రబలంబుగల్గి = గ్రహచారరీతిచేతఁ జంద్రబలంబు గల్గి, (మన్మథునికిఁ జంద్రుఁడు స్నేహితుఁ డనుట), మ...న్ - మలయంపు = మలయ పర్వతసంబంధియైనట్టియు, కమ్మ = పరిమళించునట్టి, తేగాడ్పు = మందమారుత మని యెడు, తేరునన్ = రథమందు, ఏ...న్-ఏతెంచు = వచ్చునట్టి, లతాంతబాణునకున్ = పుష్పాస్త్రుఁడగు మన్మథునికి, సూర్యుండున్ = సూర్యుండును, మహిన్ = భూమియందు, క్రొత్తగా = నూతనముగా, అనుకూలించెన్ = చాలివచ్చెను. (సూర్యుఁడు మేషమునఁ

ప్రవేశించి వసంతర్తువును దేఁగా నది మన్మథునకు సాహాయ్యమయ్యె ననియును, చంద్రసూర్యు లనుకూలించి రనుటవలనను, మహిననుటవలనను, గాల దేశములు మన్మథునికి మేలిమియై యుండె ననియును భావము.) చలంబునన్ = దీర్ఘక్రోధముచేత, విరహిణీప్రాణాపహారము - విరహిణీ = పాంథస్త్రీలయొక్క, ప్రాణ = ప్రాణములయొక్క, అపహారంబు = అపహారణమును, చేయన = చేయుటచే, (అవధారణము), ఊ...ము - ఊహించు = సంకల్పించెదు, విధాత = బ్రహ్మయొక్క, కృత్యము = కార్యము, అది = అట్టిది, ఎప్పట్టునన్ = ఎచ్చోటనైన, ఏలా మానున్ =ఏమిటికి విరమించును, కొనసాగు ననుట. అర్థాంతరన్యాసాలంకారము. అప్రస్తుతప్రశంస.

క. మలయకటకోటజస్థిత
కలశిసుత సేవ నిట్లు § గనెనొ తదాశా
నిలుఁ డనఁగ నలసవృత్తిన
మెలఁగుచు నాపోశనించె § మిహికాజలధిన్. 102

టీ. మ...వన్-మలయ = మలయపర్వతముయొక్క, కటక=చఱియయందలి, ('కటకం వలయే సానౌ రాజధానీ నితంబయోః'అని నిఘంటువు.)ఉటజ=పర్ణశాలయందు, స్థిత = ఉండిన, కలశిసుత = కలశసంభవుఁ డగు నగస్త్యమహామునియొక్క, సేవన్ = శుశ్రూషచేత, తదాశానిలుఁడు-తత్=ఆదక్షిణపుదియగు, ఆశా = దిశయందలి, అనిలుఁడు = వాయువు, (అనఁగా దక్షిణపు గాలి) ఇట్లు = ఈవక్ష్యమాణక్రమముగా, కనెనొ అనఁగన్=పొందెనో యనునట్లు, అలసవృత్తిన - అలస=ప్రాలుమాలిన, వృత్తిన= వర్తనముచేతనే, మెలఁగుచున్ = సంచరించుచు, మిహికాజలధిన్ - మిహికా = మంచనియెదు, ('ప్రాలేయం మిహికాచసా' అని యమరము) జలధిన్ = సముద్రమును, ఆపోశనించెన్ = ఆపోశనము చేసెను.

తా. సముద్రపానము చేసియున్న యగస్త్యుఁడు నివసించెడు దక్షిణదిశయందే మలయమారుత ముండును గావున, నాయనయొద్ద శుశ్రూష చేసి తానును దన గురువు వలెనే మంచనియెదు కడలిని ద్రావె ననియును 'మీనే శీతనివారణ' మ్మని యున్నది గావునఁ జైత్రమాసమందు మంచు ఇనికిపోవుటచే, మందమారుతము వీచెను. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

క. మలయతరు న్యాయమ యిలఁ
గలతరువులకెల్లఁ జేయఁ § గాఁ బొలసెఁ జుమీ
యలరించునెపంబునఁ బరి
మళితములు ననఁగ నచటి § మారుత మొలసెన్. 103

టీ. మ...మ - మలయతరు = మలయపర్వతమందలి చందనవృక్షములయొక్క, న్యాయమ = న్యాయమే, (పరిమళగుణమే యనుట), ఇలన్ = భూమియందు, కల తరువులకెల్లన్ = ఉన్న సమస్తవృక్షములకును, చేయఁగాన్ = చేయుటకై, అలరించు నెపంబునన్ = పుష్పింపఁజేసెడు వ్యాజముచేత, పరిమళితములు కన్ = సంజాత పరిమళములగునట్లు, పొలసెఁజుమీ = వీచెనుజుమీ, అనఁగన్ = అనునట్లు, అచటిమారుతము = ఆమలయపర్వతమందలి వాయువు, ఒలసెన్ = పొలసెను.

తా. మలయ పర్వతమందలి చందనవృక్షములకుఁ గల పరిమళగుణమే భూమియందలి యెల్లచెట్లకుఁ గలుగఁ జేసెడు నిమిత్తము వానిఁ బుష్పింప జేసెడువ్యాజముచేతఁ బరిమళము గలిగె ననిపించి సంచరించెనో యనునట్లు. మలయ మారుతము వీచెను. ఎల్ల తరువులు లెస్సగా పుష్పించి పరిమళించుచుండెను.

ఉ. కుప్పసము ల్వదల్చి రిఱికగుబ్బల నొత్తిలి హత్తి వేగుజా
మిప్పలలర్చు గాడ్పుల కధీశుఁ గ్రమంబున ఘర్మశంక మై
నుప్పతిలంగ దోమతెరక లుప్పర మెత్తిరి దక్కి రూష్మముల్
డెప్పరమైన లోహకటీ ప్రకటీకరణంబుఁ గామినుల్. 101

టీ. కామినుల్ = వలపుగలయింతులు, కుప్పసములు = కూర్పాసములను, (అవి కల ననుట), వదల్చిరి = సడలించిరి, ఇఱికగుబ్బలన్ = క్రిక్కిఱిసిన గొప్పచన్నులచేత, (వలిగుబ్బల ననుపాఠమున శీతలస్తనములచేత ననియర్థము. 'కూపోదకం వటచ్ఛాయా తాంబూలం స్తనమండలం, శీతకాలే భవేదుష్ణముష్ణకాలేతు శీతల' మ్మని యున్నది.) అధీశున్ = తమప్రియుని, ఒత్తిలి = ఒత్తిగిలి, హత్తి = ఆలింగనము చేసికొని, క్రమంబునన్ = కొంతసేపునకు, మైన్ = శరీరమందు, ఘర్మశంక = చెమ్మటపోసె ననుసందియము, ఉప్పతిలంగన్ = ఉత్పత్తికాఁగా, వేగుజాము = వేకువజామునందు, ఇప్పలలర్చు=ఇప్పచెట్లఁ బుష్పింపఁజేసెడు, గాడ్పులకున్ = వాయువులకుఁగా, దోమతెరలు= మశకబాధానివృత్త్యర్థముగావేసియున్న తెరబట్టలను, ఉప్పరమెత్తిరి=పైకెగయవేసిరి, ఊష్మముల్=కాఁకలు, డెప్పరమైనన్=అతిశయముకాఁగా, లో...బున్-లోహకటీ= ఇనుపకుఁపట్లయొక్క, ప్రకటీకరణంబున్=బయల్పఱచుటకును, తక్కిరి=మానివేసిరి.

తా. కాములు చలికాలమందువలె అవికలు దొడుగక యవి సడల్చి, తా మొత్తిగిలి నాథులం గౌఁగిలించుకొని తమ క్రిక్కిఱిసిన గుబ్బలు వారి ఱొమ్ములు దాఁకున ట్లునిచికొని, కొంతసేపునకు శరీరమంతఁ జెమట పోసె నని సంశయించి, ప్రభాత సమయమందు నిప్పపూల విప్పఁ జేసెడు వాయువులు మెల్లన వీచుచుండఁగా మంచ

ముల దోమతెరలు పైకెగయ నెత్తిరి గాని, తొల్లింటి యట్ల యిరుపకుంపటులు గదలింప రైరి. స్వభావోక్త్యలంకారము.

మ. అరుణాంశుండు హిమర్తువన్ రజని డీలై క్రుంకి పుష్పర్తు వా
సర కల్యోదితుఁ డౌచు మున్న యిడుటన్ శ్యామాకుచాలేపసం
కరసాంద్రాగ్నిశిఖారుణప్రభఁ గొనెన్ గాకున్నఁ గాలజ్ఞప
త్త్రిరుతం బెట్లు చెలంగు మానకుపితస్త్రీ కర్ణ దంభోళి యై 105

టీ. అరుణాంశుండు=అరుణకిరణుండగు సూర్యుఁడు, హి...న్-హిమర్తువన్= హేమంతఋతు వనియెడు, రజనిన్ = రాత్రియందు, డీలై = దుర్బలుఁడై, క్రుంకి = అస్తమించి, (శ్లో. ఉపచితేషు పరేష్వసమర్థతాం వ్రజతి కాలవశా ద్బలవానపి, తపసి మందగభస్తి రభీశుమా న్నహి మహాహి మహానికరోఽభవేత్.' అన్నట్లు హేమంతర్తువు నందు సూర్యుఁడు బలహీనుం డనియును రాత్రియందు బలహీనుండై యస్తమించి యని యును భావము). పు...డు-పుష్పర్తు=వసంతర్తువనెడి, వాసర = దినముయొక్క, కల్య= ప్రాతఃకాలమందు, (ప్రత్యూషోహర్ముఖం కల్యమ్' అని యమరము.) ఉదితుఁడౌచున్= ఉదయించుచు, మున్నయిడుటన్ = మునుపు నిలచియుండుటచేత, శ్యా...భన్ - శ్యామా = చామలయొక్క, కుచ = గుబ్బలయందలి, ఆలేప = కలపములోడను, సంకర= కూడియున్న, సాంద్ర=దట్టమగు, అగ్నిశిఖ = కుంకుమపువ్వనెడి యగ్నిజ్వాలయందలి, అరుణప్రభన్ = ఎఱ్ఱనగుతనకాంతిని, కొనెన్ = మరల గ్రహించెను. ('కామినీస్తనభర గిరిదుర్గసీమ్ని నిర్భయ నీలీన నిదాఘ భార' అన్నట్టు స్త్రీల కుచములయందుఁ జలికాలమున నగ్నిదాఁగుట ప్రసిద్ధము. సూర్యుఁ డస్తమించునప్పుడు దన తేజ మగ్నిలోఁ నునుచుట 'దినాంతే నిహితం తేజ స్సవిత్రేవ హుతాశన' అన్నట్లు ప్రసిద్ధము. మఱియు 'కుంకుమేగ్నిశిఖం మతమ్' అను నిఘంటువుచేత నగ్నిశిఖ మను నామముగల కుంకుమ పువ్వు స్త్రీలు కుచములయందు హేమంత సమయమం దలఁదికొని యుండిరి గనుక నాకుంకుమపువ్వునందలి యరుణకాంతి యనుట. హిమర్తువను రాత్రి చని, వసంతర్తు వను మఱునాఁటి ప్రభాతము వచ్చెనమట.) కాకున్నన్ = అట్లురాకున్న, కా...ఋ- కాలజ్ఞపత్త్రి = కుక్కుటములయొక్క, రుతంబు = నాదము, మా...ళి-మానకుపితస్త్రీ= నాథునితప్పునఁ గోపించియున్న స్త్రీలయొక్క, కర్ణ = చెవులకు, దంభోళి ఐ=వజ్రాయు ధమువలెఁ గఠోరమై, ఎట్లు చెలంగున్ = ఏభంగి విజృంభించును ?

కాలజ్ఞపత్త్రి యనఁగా 'కాలం వసంత కాలం జానాతి వేత్తీతి కాలజ్ఞ' అను వ్యుత్పత్తిచేతఁ గోకిలము 'కాలజ్ఞాపికకుక్కుటౌ' అని శాశ్వత నిఘంటువున నున్నది గనుక 'వసంతకాలే సంప్రాప్తే కాకఃకాకః పికఃపికః' అని యన్నట్లు, కోయిలలు కూసె

ననుటయుఁ, దెల్లవాఱు జామునఁ గోడికూసినఁ బొలయలుకఁ బూనియున్న పొలఁతులకు భయ మగు ననుటయును, వసంతర్తువునందుఁ గోయిల కూయఁగానే మానకుపితురాలగు స్త్రీకి విరహము గలుగు ననుటయు సుప్రసిద్ధములు.

తా. సూర్యుఁడు చలికాలము వదలి వసంతకాలమందు లెస్స ప్రకాశించెను. కావున, సాహేమంతర్తు వతనికి రాత్రిప్రాయమై యుండెను; అప్పు డతని కరుణ కాంతి హిమప్రచ్ఛన్నమై యుండును; వసంతర్తువు ప్రాతఃకాలము వలె నుండును; అప్పుడు స్త్రీలు స్తనములయందుఁ గుంకుమపువ్వులఁదుకొనుట మానిరి గావున నది సూర్యసంబంధి యగు నరుణకాంతియై యుండి యాస్త్రీల స్తనములయందలి యగ్నికి నొప్పగింపఁబడి మరల గ్రహియింపఁబడిన ట్లుండెను. ఆ వసంతర్తువు సూర్యోదయకాలము గానిపట్ల కాలజ్ఞములగు కోయిలలయొక్కయుఁ, గోళ్ళయొక్కయుఁ గూఁత లేల వినవచ్చును? అని విని మానకుపిత లగు యువతులు భయంపడుటకుఁ గతం బేమి? అనుమానానుప్రాణిత రూపకాలంకారము.

తే. మృగమదాలేపమును మాని । రగరుకలనఁ
జన్నుఁగవ మీఁది కొప్పిరి । బన్నసరము
లొంటి కురువేరు పోఁచకుఁ । గంటగింప
రైరి తుఱిమెడు సరపువ్వులం దలివలు. 106

టీ. అలివలు=స్త్రీలు, మృగమదాలేపములు = కస్తూరి యలఁదుకొనుటను, అగరుకలనన్=అగరుగంధ మలందుకొనుటవలన, మానిరి=విసర్జించిరి, చన్నుఁగవమీఁదికిన్ = కుచద్వయోపరిభాగమునకు, బన్నసరములు=ముత్యాలహారములను, ఒప్పిరి = సమ్మతించిరి, తుఱిమెడు=తమ కురులయందుఁ జెక్కెడు, సరపువ్వులందున్ = దండలుగట్టిన పువ్వులయందు, ఒంటికురువేరు పోఁచకున్ = ఒక్కఁడైన లామజ్జకలేశమునకు, కంటగింపరైరి = ఏవగింపరైరి. ఏవగింపక ధరించి రనుట. ఇవి యన్నియు సమశీతోష్ణము లగు నుపచారములు. స్వభావోక్త్యలంకారము.

చ. చిలువసుధారసాధరల । చెల్వపుఁబుక్కిటితావిఁ దీయ నై
వలపుల నందుతత్ప్రియుల । వక్త్రవిషజ్వలనోష్మ నొట్టనై
వెలువడి దద్గుణద్వితయ । వేధఁ జుమీ యన మ్రానుపట్టుటల్
తలిరులు పుట్టుటల్ కలుగఁ । దార్కొనెఁ జందనశైలవాతముల్.

టీ. చందనశైలవాతముల్ = మలయమారుతములు, చి...విన్ = చిలువసుధారసాధరల = అమృతరసమువంటి యధరోష్ఠములుగల నాగకన్యలయొక్క, చెల్వపు =

సుందరమగు, పుక్కిటితావిన్ = పుక్కిళ్ళపరిమళముచేత, తీయనై = మధురమై, వ... మ్మన్ - వలపులనందు = ప్రేమవశ్యులయిన, తల్ప్రియుల=ఆయాఁడుఁబాములమగలగు మగపాములయొక్క, వక్త్రవిష = పుక్కిళ్ళవిష మనియెడు, జ్వలన = అగ్నియొక్క, ఊష్మన్=వేఁడిమిచేత, ఒఱ్ఱనై = తీక్ష్ణమై, వెలువడి = బయలుదేఱి, తత్=ఆ, గుణ= మాధుర్యతీక్ష్ణత్వగుణములయొక్క, ద్వితయు=ద్వంద్వమువలన నయిన, వేధన్=సోఁకుట చేత, చుమీ=చుమా, అనన్=అనఁగా, ప్రానుపట్టుటల్ = ఆ వాయువులుసోఁకుటవలన శరీరములు నిశ్చేష్టితములగుటయు, ఆకులురాలి ప్రాఁకులుమాత్ర మగపడుచుండుటయు, (ఇది విషాగ్నిగుణము), తలిరులుపుట్టుటల్ = చెట్లయందుఁ జిగు ళ్లుదయించుటయును, (ఇది యధర మాధుర్య గుణము), కలుగన్=కలుగునట్లుగా, తారొక్కసెన్ = విసరెను.

తా. మలయమారుతము వచ్చునప్పు డాఁడుఁబాములు మగపాము లాపర్వతము మీఁద నీ వాయువును భక్షించుటచేత రెండు గుణములు గలిగి, యాఁడుఁబాముల పానముచేతఁ జిగుళ్లు పుట్టుటయును మగపాముల పానముచేత ప్రాన్పట్టుటయును గలుగును (ఈ పద్యమునందు వ్యుత్క్రమము దోషావహంబుగాదు. 'ఊర్ధ్వపుండ్రం వామధ్యేచ్ఛిద్రంతు ధారయేత్, శ్రుణు షణ్ముఖ తన్మధ్యే ఉమయాహం శ్రియాహరిః.' అని యున్నది.) హేతూత్ప్రేక్ష.

మ. మదనస్యందనతా స్వవృత్తిఁ దెలిపెం బాటీర భూభృద్వల
న్మృదువాతం బతిపక్వ పాదప లతా వృంతావళీ మూలరం
ధ్రదళత్పంకజకర్ణికాగణహారి ద్రాభంగ భా భాసుర
చ్ఛదన చ్ఛద్మవివర్తికాంచన కన చ్చక్రచ్ఛటాచీత్కృతిన్. 103

టీ. పా...బు - పాటీరభూభృత్ = మలయపర్వతమందు, వలత్ = సుడియుచున్న, మృదువాతంబు = మందమారుతము, అ...తిన్ - అతిపక్వ = మిగులఁబండిన, పాదప = వృక్షములయొక్కయు, లతా = తీఁగెలయొక్కయు, వృంత=పూఁదొడిమల యొక్క, ('వృంతం ప్రసవబంధన' మ్మని యమరము.) ఆవళీ=పఙ్క్తులయొక్క, మూల రంధ్ర = మొదళ్ళగండ్లనుండి, దళత్=విరియఁబడుచున్న, పంకజకర్ణికా=తామరమిద్దెల యొక్క, గణ=సమూహముయొక్కయు హారిద్రాభంగ = పసుపుఁజిందఱలయొక్కయు, భా = కాంతిపంటికాంతిచేత, భాసుర = ప్రకాశించుచున్న, ఛదన = ఆకు లనియెడు, ఛద్మ=వ్యాజముచేత, వివర్తి = గిఱగిఱతిరిగికొనుచున్న, కాంచన=బంగారుచేత, కనత్= ప్రకాశించుచున్న, చక్ర = బండికండ్లయొక్క, ఛటా=గుంపుయొక్క, చీత్కృతిన్= చీత్కారముచేత, మ...త్తిన్-మదన = మన్మథునికి, స్యందనతా = రథమగుటయందు, స్వవృత్తిన్ = తన వ్యాపారమును, తెలిపెన్ = ఎఱుకపఱిచెను.

తా. చెట్లమీఁదనుండియుఁ దీఁగలమీఁదనుండియుఁ బండుటాకులు డొడిమ లూడి తామర మిద్దెలవలెను బసుపు జిందఱవలెను బచ్చనై కొంచెము ధ్వనితో గిఱగిఱఁ దిరుగుచుండెను. అవి యట్లగుట వాయువు మన్మథునికి రథమగుటకు గుఱుతుగా నాబండి బంగారు చక్రములు తిరుగుచున్నవో యన్నట్లుండెను. 'మందానిలస్యందనః' అని దక్షిణ వాయువునకు మన్మథరథత్వము ప్రసిద్ధము. కైశికాపహ్నవాలంకారము. ఉత్ప్రేక్షనిదర్శన సంసృష్టి. పంకజకర్ణికాగణహారిద్రాభంగ - పదార్థవృత్తినిదర్శన. 109

వ. తదనంతరంబ.

సీ. క్ష్మా వశా రక్త రాంకవ మరణ్యానీమ
ధూదితారుణిమ వల్ల్యురగరసని
కోద్గతి తరుగరుత్మద్గరుద్గణ ముద్భి
దాహార్యజీమూతరోహితంబు
నవ మిలిందప్రాఘుణకనిమంత్రణ శోభ
నాక్షతప్రతతివాయస విభక్త
పరభృతౌఘప్రాప్త పత్త్రిక మాలతీ
త్రాసామయావహార్ద్రక్షతజము
తే. ప్రమదవన వనదేవతాసముదయాంగ
రాగ మినజ హారిజ్జగత్ప్రాణ శాణ
కషణదలితదళాంతసంక్రాంత కాంతి
ఘనమణిశలాకచిగురాకుకలయ మొలిచె. 110

టీ. క్ష్మా...ము-క్ష్మా=భూమి యనెడు, వశా=ఆఁడేనుఁగునకు,('కరిణీధేనుకావశా' అని యమరము.) రక్త=ఎఱ్ఱనగు, రాంకవము=బూర్నీసును, ('రాంకవం మృగరోమజమ్' అని యమరము.) అరణ్యాని = మహారణ్యమునకు, ('మహారణ్యమరణ్యానీ' అని యమరము.) మధు = వసంతర్తువను మద్యముచేత, ఉదిత=పుట్టినట్టి, అరుణిమ=ఎఱుపును. వల్లి ఉరగ=తీఁగె లనియెడు పాములయొక్క, రసనికా=నాలుకలయొక్క, ఉద్గతి=బయలు వెడలుటయును, తరు...ము-తరు=వృక్షము లనియెడు, గరుత్మత్=గరుత్మంతులయొక్క, గరుత్ = ఱెక్కలయొక్క, గణము = సమూహంబును. ఉ...బు - ఉద్భిత్ = పొద లనియెడు, ఆహార్యజీమూత = కల్పితమేఘములను, రోహితంబు = కొరముసు, ('ఇంద్రాయుధంశక్రధనుస్తదేవఋజురోహితమ్' అని యమరము.) న...తి-నవ = నూతనమగు, మిళింద=తుమ్మెద లనియెడు, ప్రాఘుణక = అతిథులయొక్క, నిమంత్రణ=విందునకుఁ బిల్చుటయందు, శోభనాక్షత = శుభాక్షతలయొక్క, ప్రతతి = సమూహంబును;

వా...క.వాయస = కాకులతోడ, విభక్త = వేఱుపడిన, పరభృత=కోయిలలయొక్క, ఓఘ=గుంపుచేత, ప్రాప్త = పొందఁబడిన, పత్త్రిక = విభాగపరిష్కార పత్త్రికయును, (వసంతఋతువు రాఁగానే కాకులతోఁ గోకిలలు వేఱుపడుట ప్రసిద్ధము), మా...ము-మాలతీ = జాజిచెట్టునకు, త్రాస = భయమనెడు, ఆమయ = రోగమును, ఆవహ = కలుగఁజేయునట్టి, ఆర్ద్రక్షతజము=పచ్చిరక్తంబును, ప్ర...ము-ప్రమదవన=క్రీడోద్యానములయందలి, వనదేవతా = వనదేవతలయొక్క, సముదయ = సమూహముయొక్క, అంగరాగము = కుంకుమంపుమైపూఁతయును, ఇన...లాక-ఇనజ = సూర్యపుత్త్రుఁడగు యమునియొక్క, ('ఇనస్సూర్యే ప్రభావపి' అని అమర.) హరిత్ = దిక్కగుదక్షిణ సంబంధియగు, జగత్ప్రాణ=వాయు వనియెడు, శాణ=సానతోడి, కషణ=ఒఱిపిడిచేత, దళిత=రాల్పఁబడిన, దళ=ఆకులనెడుపొరలయొక్క, అంత=నాశముచేత, ('అంతో నాశో ద్వయోర్మృత్యు' అని యమరము.) సంక్రాంత = నెరసినట్టి, కాంతి = దీప్తిగల, ఘన = గొప్పయగు, మణిశలాక = రత్నపుకణికయు నగు, చిగురాకు = పల్లవములు, (జాత్యేక వచనము), కలయన్ = అంతటను, మొలిచెన్ = మొనసూపెను.

తా. భూమి యనియెడు నాఁడేసుఁగుపైఁ గప్పిన యెఱ్ఱబూర్నీసువలెను, మహారణ్యమునకు వసంతఋతు వను మద్యముచేతఁ దోఁచిన రక్తకాంతివలెను, తీఁగె లనియెడు పాములు తమ నాలుకలు వెడల నిడెనో యనునట్లును, వృక్షము లనియెడు గరుడపక్షుల ఱెక్కలో యనునట్లును, పొద లనియెడు కల్పిత మేఘములకుఁ గొరదు లను పగిదిని, తుమ్మెద లను నభ్యాగతులను గ్రొత్తగఁ బిలుచుటకై యునిచిన శోభనాక్షతములగు చందమునను, కాకులతోడఁ గూడియుండి యప్పుడు వేఱుపడిపోయెడు కోకిలముల కొదవిన విభాగ పత్త్రికలయందమునను, జాజిచెట్లకు భయరోగమును గల్పించు క్రొత్తనెత్తుటి భంగిని, క్రీడోద్యాన వనదేవతలు నెమ్మేనులఁ బూసికొన్న కుంకుమంపు మైపూఁత భాతిని, మలయమారుత మను సానతో నొఱయంబడి రాలిన యాకులచేతఁ గానఁబడిన మెండగు దీప్తి గలిగిన గొప్ప రత్నశలాకలజోకయనం దగి చిగురాకు మొనసి కనఁబడియెను. మాలాపరంపరిత రూపకము.

తే. శరనిధుల మాఘ్యములు దీఱె ♦ మరున కట్టి
యదరున జయింతు మని కదా ♦ యద్దినాళిఁ
గ్రూరతిథిఁ గృష్ణరజనిఁ దశద్వైరిఁ గనియుఁ
బెద్ద లివు రాఁకుఁబట్టైన ♦ పెట్టువడిరి. 111

టీ. మరునకున్ = స్మరునికి, శరనిధులన్ = అంపదొనలయందు, మాఘ్యములు = మొల్లపువ్వు లనియెడు బాణములు, తీఱెన్ = సమసిపోయెను, (వసంతర్తువులో మొల్లలు

ఘూయ మనుట.), అట్టియదరున్ = ఆసంకటమునందు, (బాణములేనివేళ ననుట), పెద్దలు = వృద్ధులు, (యోగు లనుట), జయింతుము = మన్మథునిఁ గెల్తుము, అనికదా = అనియే కాదా, అద్దినాళిన్ = ఆమాఘదినపరంపరయందు, క్రూరతిథిన్ = క్రూరతిథియైన, కృష్ణరజనిన్ = బహుళపక్ష చతుర్దశి రాత్రియందు, (శివరాత్రినాఁ డనుట.) తద్వైరిన్ = ఆ మన్మథవైరి యగు శివుని, కనియున్ = చూచియు, (సేవించి యనుట.) ఇవురాకుఁ బట్టైన = చిగురాకనియెడు పట్టాకత్తిచేతనే, పెట్టువడిరి = దెబ్బఁదినిరి.

తా. పెద్దలగువారు మన్మథునికి మొల్లములుకులు లేని తఱి వేచి, యా యిఱుకటమున నతని గెల్త మని తలంచి, యతని విరోధి యగు శివునిఁ గ్రూరతిథి యగు చీఁకటి రాత్రియందుఁ జూచియుఁ బ్రయోజనము లేక పోవుటయేకాక, యా మన్మథుఁడు తనకు బాణములు లేకుండినను జిగురా కనియెడు పట్టాకత్తిచేతనే వసంతర్తుప్రారంభకాలమునందు వారలఁ బ్రహరించి జయము గొనెను. విషాదనాలంకారము.

తే. అవని నపుడు నవోదితుం డైన యట్టి
మరునకుం గుసుమర్తు వన్మంత్రసాని
బొడ్డుగోసిన కొడవలిఁ బోలె విరహి
దారకం బయ్యెఁ గింశుకకోరకంబు. 112

టీ. అవనిన్ = భూమియందు, అపుడు = తత్కాలమునందు (ఆ చైత్రమాసమందు), నవోదితుం డైన = నూతనముగా నుదయించిన, (అభ్యుదయమొందిన యనుట). అట్టి = ఆ ప్రసిద్ధుఁ డగు, మరునకున్ = స్మరునకు, కుసుమర్తు వన్ = వసంతర్తు వనియెడు, మంత్రసాని = సుఖప్రసవముచేయించునట్టి స్త్రీ, బొడ్డుగోసిన = నాభినాళచ్ఛేదముఁ జేసిన, కొడవలిఁబోలెన్ = లవిత్రమువలెనే, కింశుకకోరకంబు = మోదుగుమొగ్గ, విరహి = వియోగులకు, దారకంబయ్యెన్ = ఛేదకమాయెను.

తా. వసంతర్తువునందు మోదుగులు పుష్పింపఁగా నామొగ్గ వంకరగా నెఱ్ఱనై యుండుటవలన నప్పుడు పుట్టిన మన్మథుని బొడ్డు గోసిన నెత్తురులోడి లిక్కికొడవలి వలె నుండి విరహులకు వేధఁ జేయున దాయెను. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

చ. కుసుమము లెల్లఁ గామినులకొప్పుల నుండ నటుండ లేమి సి
గ్గెసఁగఁగ వంగినట్లు జనియించె నవ ల్మఱి వంగి జీవితే
శసమితి కొమ్ములం గరఁచి చల్లఁ గుచతుణి కాంగరాగ మా
టపదె యటంచు రాగిలిన యట్టులు రాగిలి విచ్చెఁ గింశుకిన్. 113

టీ. కుసుమములెల్లన్ = సమస్తపుష్పములును, కా...లన్ - కామినుల = యువతులయొక్క, కొప్పులన్ = ధమ్మిల్లములయందు, ఉండన్ = ధరింపఁబడియుండఁగా,

ఆటుండ లేమిన్ = తా మట్లుండ లేకపోవుటచేత, (నిర్గంధములగుటచేత ననుట.) సిగ్గెసఁగఁగన్ = లజ్జ యతిశయింపఁగా, వంగినట్లు = నమ్రములైనటువలె, ననల్ = మొగ్గలు, జనియించెన్ = పుట్టెను, మఱి = పిమ్మట, వంగి = అట్లే వంగియుండి, జీవితేశసమితి - జీవితేశ = ఆస్త్రీలప్రాణనాథులయొక్క, సమితి = సమూహము, కరఁచి = రసముదీసి, కొమ్ముల్ = చిమ్మనగ్రోవులచేత, చల్లన్ = చిమ్ముచుండఁగా, (మోదుగుపూమొగ్గల రసముదీసి వసంతములాడుదు రనుట), కు...ట - కుచ = స్తనములయందు, క్షణిక = క్షణమాత్రముండెడు, అంగరాగమాట = మైపూఁత యగుట, అసదె = స్వల్పమా, (అన్ని పువ్వులవలెఁ గొప్పులయం దుండుటకంటెఁ జన్నులపైఁ జేరుట సామాన్యము గా దనుట), ఆటంచున్ = అనుకొని, రాగిలినయట్టులు = రంజిల్లినభంగి, రాగిలి = రక్తి గలిగి, కింశుకిన్ = మోదుగుచెట్టునందు, విచ్చెన్ = వికసించెను, ఎఱ్ఱనై మోదుగుపువ్వులు వికసిల్లె ననుట. హేతూత్ప్రేక్ష.

ఉ. నైపుణిఁ జందనాద్రి గహనద్రుమ సౌరభ వీచిఁ దామ్రప
ర్ణీపరిలబ్ధ మౌక్తికమణిప్రకరంబులు తోఁచి దక్షిణా
శావనుందు సల్లు వెదఁ జల్ల జనించెన కాక వానికే
లా పొడమంగ నిప్పొలప మప్పుడు నా వనిఁ దోఁచెఁ గ్రొన్ననల్.

టీ. దక్షిణాశావనుందు = దక్షిణదిగ్వాయువు, నైపుణిన్ = నేర్పుచేత, తామ్రపర్ణి = తామ్రపర్ణీనదియందు, పరిలబ్ధ = గ్రహింపఁబడిన, మౌక్తికమణి = ముక్తామణులయొక్క, ప్రకరంబులు = సమూహములును, చం...చిన్ - చందనాద్రి = మలయపర్వతముయొక్క, గహన = అరణ్యమందలి, ద్రుమ = చందనవృక్షములయొక్క, సౌరభ = పరిమళముయొక్క, వీచిన్ = తరంగమందు, తోఁచి = తోఁగఁజేసి, (తడిసియనుట), *చల్లువెదన్ = చల్లెడువెదయందు, (లోకమందు గొఱ్ఱువెద, చల్లువెద యని రెండువిధములు. వానిలో వరుసగా నేర్పడియుండు నది గొఱ్ఱువెదయును, అంతట వ్యాపించి యుండు నది చల్లువెదయును గనుక చల్లువెద యన్నాఁడు.) చల్లన్ = విత్తనము వేయఁగా, జనించెనకాక = మొలచెనే కాని, అప్పుడు = ఆవసంతకాలమందు, వీనికిన్ = ఈ మొగ్గలకు, ఆప్పొలపము = ఆపోలుపు, (ముత్తెములవంటి రూపమును బరిమళము ననుట.), పొడమంగన్ = పుట్టుటకు, ఏలా = ఏమి పని, నాన్ = అనునట్లు, క్రొన్ననల్ = క్రొత్తమొగ్గలు, వనిన్ = వనములయందు, (జాత్యేకవచనము.), తోఁచెన్ = కనుపడెను.

*చల్లు-వెదచల్ల ప్రశస్తము. (చల్లు వెదకుఁగాని దాని వ్యతిరేకరూపమగు గొఱ్ఱువెదకుఁగాని ప్రయోగాంతరములు లేవు. గొఱ్ఱు వెద శ. ర. సూ. నిలలో నగ్రాహ్యము. చింత్యము. చల్లు = చల్లఁబడునవి-విత్తనములు, వెదచల్లన్ = అంతటను చల్లుటచే.) (!)

టీ. వనములయందు ముత్తెములవంటి రూపము గలిగి పరిమళముతోడ మొగ్గలు పుట్టఁగా మలయమారుతము తామ్రపర్ణీనదిలోని ముత్తెము లేటి యవి మలయవృక్ష పరిమళలహరీతరంగములో నేర్పుగా ముంచి యవియే చల్లువెదగా, చల్లిన కారణముచేత మొలకలెత్తినవేకాని లేనియెడ నీచెట్లమీఁది మొగ్గల కా శృంగారము రాదు. ఇట్లు చెప్పుటచేత మలయమారుత మొక కర్షకుఁ డని ధ్వనించుచున్నది. హేతూత్ప్రేక్ష.

క. వీరుద్ద్రుమిథునమేళన
కై రతిపతి యేయ దుస్సి హరితద్యుతిఁ బై
నారెగయఁ బొటమరించిన
నారసముల మొనలనంగ నన లవి మించెన్. 115

టీ. వీ...కై-వీరుత్=లతలయొక్కయు, ద్రు=వృక్షములయొక్కయు, మిథున=ద్వంద్వముయొక్క, మేళనకై = సంపర్కముకొఱకు, రతిపతి = మన్మథుఁడు, ఏయన్=బాణము నేయఁగా, దుస్సి = దాటి యావలనుండి యీవలికిఁబోయి, హరితద్యుతిన్ = పచ్చనికాంతిచేత, పైన్=ఉపరిభాగమందు, నారెగయన్ = నారయెగసి పోవునట్లు, పొటమరించిన = అంకురించిన, నా...గన్-నారసముల = బాణములయొక్క, మొనలు అనంగన్=అగ్రములో యనునట్లు, ననలు అవి=ఆమొగ్గలు (వ్యస్తవిశేషణము.), మించెన్ అతిశయించెను.

తా. లతావృక్షసంపర్కమునకై మన్మథుఁ డాలతలను వృక్షములను దన నారసములచే నేయఁగా నవి యాలతావృక్షశరీరమ్ములలోఁ దూఁటి వెన్నులయందు మొనలఁ జూపుచున్నవో యన్నట్లు మొగ్గలు బలిసెను. రూఢోత్థాపితోత్ప్రేక్ష.

చ. తనయుదరంబునం బొడమి తామ్రరుచిచ్ఛట లుల్లసిల్లఁ గో
ల్కొను ధరణీజసంతతికిఁ గోరకదంతము లించుకంత ని
క్కినయది యాదిగాఁగఁ జెలఁగెన్ వనలక్ష్మి గడుం జెలంగఁగాఁ
జనుఁ బ్రియుఁడైన మాధవుని సంగతి మీఁదటఁ జాలఁ గల్గుటన్.

టీ. తనయుదరంబునన్ = తనగర్భమందు, పొడమి = పుట్టి, తా...లు-తామ్రరుచి = అరుణకాంతులయొక్క, ఛటలు = సమూహములు, ఉల్లసిల్లన్ = ప్రకాశింపఁగా, కో...కిన్-కోల్కొను = వృద్ధిఁబొందుచున్న, (శిశువులు పుట్టినప్పుడెల్లగానుండుటయు నానాఁటికి వృద్ధియగుటయుఁ బ్రసిద్ధము), ధరణీజ = వృక్షములనియెడు, సంతతికిన్ = సంతానమునకు, కో...లు-కోరక=మొగ్గలనియెడు, దంతములు=పండ్లు, ఇంచుకంత = కొంచెము, నిక్కిన యది = అంకురించినది, ఆదిగాఁగన్=మొదలుకొని, వనలక్ష్మి = వనలక్ష్మియనెడు పొలఁతి, కడున్ = మిక్కిలి, చెలఁగెన్=సంతోషించెను,

మీఁదటన్ = ఆటుపిమ్మట, ప్రియుఁడు = ఇష్టుఁడు, ఐన, మాధవుని = వైశాఖమాస మనియెడు పురుషునియొక్క, సంగతి = సాంగత్య మనియెడు సంపర్కము, చాలన్ = చాలునట్లు, కల్గుటన్ = కల్గుటను హేతువుచేతను, చెలంగఁగాఁజనున్ = సంతోషించుట యుచితమే యగును.

టీ. లోకమందలి స్త్రీలు తమ సంతానమునకుఁ బండ్లు మొలిచెడువఱకు బాలింతలై పురుషసాంగత్యము లేకుండి పండ్లు మొలవఁగానే పురుషులు తమతో సంభోగింతురని సంతోషపడినట్లుగానే, వనలక్ష్మియు వృక్షములు చిగిర్చి వృద్ధియై మొగ్గలు పొడమిన కారణంబున నావృక్షములు బిడ్డలనియును, మొగ్గలు వారిపండ్లనియును, వైశాఖమాసము తనపురుషుఁ డనియును, ప్రకాశము సంతోషమనియును, నన్నట్లు చెలువయ్యెను. వనలక్ష్మి యనియు, మాధవునిసంగతి యనియుఁ జెప్పుటవలన, లక్ష్మికి మాధవ సాంగత్యము యుక్తమే యని భావము. బాలింతలకు బిడ్డలకు దంతములు మొలచునంతవరకుఁ బురుష సంపర్కము గూడ దని స్మృతులయందుఁ బ్రసిద్ధము. శ్లేషానుప్రాణిత రూపకము

సీ. మును నవల్దమిఁ బట్టి § ముంగాళ్ల ముక్కుజో
డనలఁ బీలిచి పసర్కొనిన విడిచి
పరువంపువిరిగొందు § లరసి చాలై త్రోవఁ
బెట్టి యీరము లీఁగు § పిండుఁ దగిలి
క్రొవ్విరిఁ దొలుత నొక్కఁడు కని యది వ్రాలు
తఱి దాసి నిలఁబడఁ § దాఁచి క్రోలి
యాకురాలుపుగండ్ల § నానెడు నాస నిం
తడుఁగూడి బం కంటి § యంగలార్చి
తే. యెట్టకేలకు నొకఁ డబ్బఁ § బొట్టనిండఁ
గ్రోలి యది గాలిఁ గదలినఁ § గూలు నగుచు
భ్రమదవనపాలికలు వేడ్కఁ § బట్ట నగుచు
మధుదినాదిక్షుధాభ్రమ § న్మధుపచయము. 117

టీ. మ...ము-మధుదినాది = వసంతర్తుప్రథమదినమందు, క్షుధా=ఆఁకలిచేత, భ్రమత్ = భ్రమ్మరుచున్న, మధుపచయము = తేఁటిగుంపు, మును = మొదలను, నవల్ = మొగ్గలను, తమిన్ = మోహముచేత, ముంగాళ్లన్ = అగ్రాంఘులచేత, పట్టి = అవలంబించి, ముక్కుజోడనలన్ = నాసికాబిలద్వయములచేత, పీలిచి = దూఁటికొని, పసర్కొనినన్ = పసరువాసనరాఁగా, విడిచి=వానినివిసర్జించి, ప...లు-పరువంపు = పక్వములగు, విరి = పూలుగల, గొందులు=మాఱుమూలలు, అరసి=వెదకి,

చాలై = గుంపుగొని, త్రోవఁబెట్టి = పోవుటకు మార్గముఁబెట్టి, ఈరమురీఁగు=పొదలం దూఱెడు, పిండున్ = సమూహమును, తగిలి = వెనుముట్టి, తొలుతన్ = ప్రథమ మందు, క్రొవ్విరిన్ = క్రొత్తపుష్పమును, ఒక్కఁడు = ఒకభృంగము, కని = చూచి, అది వ్రాలుతఱిన్ = అదిముసరికొనునప్పుడు, దానిన్ = ఆభృంగమును, ఇలన్ పడన్ = భూమియందుఁబడునట్లు, తాఁచి = తన్ని, క్రోలి=మకరందము పానముసేసి, ఆకురా లుపుగండ్లన్ = ఆకులురాలిన తొడిమలమొదళ్ళయందు, ఆనెడునాసన్ = పానము చేసెడునాశచేత, ఇంత = కొంచెము, అడుగుమోఁచి = పాదము నిలిపి, బంక=ఆవృంత మూలనిర్యాసము (జిగురు), అంటి = స్పృశించికొని, అంగలార్చి=కాలువెలుపలికిరాక ఖేదపడి, ఎట్టకేలకున్ = కొంతసేపునకు, ఒకఁడు అబ్బన్ = ఒక పుష్పము దొరకఁగా, పొట్ట నిండన్=కడుపునిండునట్లు, క్రోలి = మకరందపానముసేసి, అది = ఆపుష్పము, గాలిన్ = వాయువుచేత, కదలినన్ = చలింపఁగా, నగుచున్=నవ్వుచును, ప్రమదవన పాలికలు = శృంగారవనములను బరిపాలించెడు పొలఁతులు, పట్టన్ = పట్టుకొనుటకు, అగుచున్ = దుర్బలములై వశపడుచు, కూలున్ = క్రిందపడును. స్వభావోక్తి.

సీ. మరుదూఢమలయాహి । గరధూమ్య లనుగళ
　　న్మనసిజరథపదాం । జనకళికలు
త్రాసధావచ్ఛిశిరత్య । క్తబాష్పముల్
　　పికపంచమస్వరో । ద్భేద వీణ
లబ్ధాగమన్మరం । దాసారజంబువుల్
　　హిందోళ సాహూన్మ । సుందరోచు
లభిసారికాంశుకో । ద్యన్నీల గుళికలు
　　జాత్యనుల్లసనాత్త । శాపతతులు
తే. చైత్రసంజీవనౌషధీ । జాతచేత
నాత్మజని హేతు తరు పున । ర్యాయి యువతి
కరవిధూతహసంతికాం । గారచయము
లళుల పఙ్క్తులు వనుల నట్టాడఁ దొడఁగె. 118

టీ. మ...మ్య-మరుత్ = వాయువుచేత, ఊఢ=వహింపఁబడిన, మలయ=మలయ పర్వతమందలి, అహి=సర్పములయొక్క, గర = విషముయొక్క, ధూమ్యలు = ధూమ సమూహములైనట్టియు, (వాయువశముచేతనే పొగ లెగయు ననియు విషధూమములు మిగుల నల్లనైయుండు ననియు భావము.), అ...లు-అనుగళత్ = మిడువకజాఱుచున్న, (ఇది యంజన కళికలకు విశేషణము.), మనసిజ = మన్మథునియొక్క, రథపద=బండి

చక్రములయందలి, అంజనకళికలు=కందెనముద్దలయినట్టియు, (వసంతర్తువునందుఁ గ్రొత్తగా మరుఁడు వెడలెఁ గావునఁ దేరుచక్రముల కప్పుడు కందెనవేయఁగా నాచక్రములు దిరుగునప్పు డా కందెనముద్దలు జాఱు ననుట.), త్రా...ల్ - త్రాస = భయముచేత, ధావత్ = పాఱిపోవుచున్న, శిశిర = శిశిరర్తువుచేత, త్యక్త = విడువఁబడిన, బాష్పముల్=కన్నీళ్లయినట్టియు, (శిశిరర్తువు వెడలినప్పుడు దుఃఖించె ననుట.), పి...లు-పిక=కోయిలలయొక్క, పంచమస్వర=పంచమస్వరముయొక్క, ఉద్భేద=పుట్టుటకు, వీణలు = కస్తూరివీణలైనట్టియు, ('పికః కూజతి పంచమమ్' అని నిఘంటువు. వీణయందు పంచమస్వర ముండుటకు 'శ్రుతిభ్యస్స్యు స్స్వరాష్షడ్జర్షభ గాంధార మధ్యమాః, పంచమో ధైవతశ్చాథ నిషాద ఇతి సప్తధా, తేషాం సంజ్ఞాస్సరిగమపధనీత్యపరామతాః', అని సంగీతశాస్త్రము.) అబ్దాగమత్ = వర్షాకాలమువలె నాచరించుచున్న, మరంద=మకరందముయొక్క, ఆసార = ధారాసంపాతమునకు, జంబువుల్ = నేరేడుపండులైనట్టియు, (వర్షాకాలమందు నేరేళ్లుఫలించు ననుట, అబ్దాగమ మనఁగా సంవత్సరాగమము, అబ్దాగమమే అబ్దాగ మని శ్లిష్టరూపకము.) హిం...లు-హిందోళ = ఆ కాలమందుఁ బాడఁదగిన విష్ణు ప్రియమైన హిందోళరాగమునకు, సాక్షాత్ = ప్రత్యక్షమయిన, ముకుంద = కలివేల్పుయొక్క, రోచులు = శరీరకాంతులయినట్టియు, ('శిశిరస్య వసంతస్య సంధా హిందోళరాగకమ్' అని సంగీతశాస్త్ర ప్రసిద్ధము. కావున నప్పు డా రాగమునకు సంతోషించి ప్రసన్నుఁడై వచ్చి గోవిందునిశరీరకాంతులవలెనుండె ననుట.) అ...లు - అభిసారికా = ప్రియులకొఱకు సంకేతస్థానములను గూర్చి పోవుచుండెడు స్త్రీలయొక్క, ('కాంతార్థినీతు యాయాతి సంకేతం సాభిసారికా' అని యమరము.) అంశుక = వస్త్రములకు, ఉద్యన్నీలగుళికలు = సద్యోనైల్య సంపాదకఘుటికావిశేషములు, (అభిసారికలు తమ గోపనార్థమై నీలవస్త్రములు ధరింతు రనుట), జా...లు - జాలి = జాజులవలన, అనుల్లసన = ప్రకాశములేకుండుటంబట్టి, ఆత్త = పొందఁబడిన, తాప = విట్లయొక్క, తతులు = సమూహములైనట్టియు, (వసంతర్తువునందు జాజులు వికసిల్లవు గావున నవి వసంతునిఁ దిట్టఁగా నాశాపములే యిట్లు వచ్చె ననుట), చై...లు-చైత్ర=చైత్రమాసమనియెడు, సంజీవనౌషధీ=సంజీవనౌషధముచేత, జాత=ఉదయించిన, చేతన=చైతన్యముగల, ఆత్మ = తమయొక్క, జని = జన్మమునకు, హేతు = కారణములగు, తరు = వృక్షములనుగూర్చి, పునర్యాయి = మగిడిపోవుచున్న, యువతి=ఉవిదలయొక్క, కర=హస్తములచేత, విధూత=పాఱఁజల్లఁబడిన, హసంతికా=కుంపట్లయందలి, ఇంగాల = బొగ్గులయొక్క, చయములు = సమూహములైనట్టియు, ('నిర్ధూమాంగారభరితహసంతికాయంత్రస్య చ' అని భోజరా జన్నట్లు, చలికాలమందు స్త్రీలు కుంపట్లెత్తి

యుండి వసంతర్తువు రాఁగానే చలిదీఱెఁ గావున నాఁకుంపట్లు పాఱఁ జల్లఁగా నందలి నల్ల బొగ్గులకు వసంతర్తువనెడు సంజీవనౌషధము దగిలి ప్రాణములువచ్చి తమ జన్మములకు హేతువు లగు వృక్షములను గూర్చి మరలఁ బోవుచున్న ట్లుండె ననుట.) అళుల పఙ్క్తులు=తుమ్మెదలగుంపులు, వనులన్=వనములయందు, అట్టాడన్ = సంచరించుటకు, తొడఁగెన్ = ఉపక్రమించెను. మాలారూపకము.

తే. ద్విజతఁ గాంచియు మధుసేవ ౹ విడువ లేక
జాతిఁ బాసిన తేంట్లనిస్స్వనముఁ గూడు
కొనుటనో యనఁ గోకిలస్స్వనము సెలఁగెఁ
దనరు మఱి పంచమత్వంబు ౹ తప్పకుండ. 119

టీ. ద్విజతఁగాంచియున్=విప్రత్వమును బొందియును, ('దంతవిప్రాణ్డజాద్విజా' అని నిఘంటు వున్నదిగానఁ దుమ్మెదలు నండజము లగుటచేతఁ బక్షు లయ్యె ననుట.) మధుసేవన్=మద్యపానమును, విడువలేక=విసర్జింపలేక, (మకరందపాన మనుటయు నిది కోకిలపర్యాయ మైనప్పుడు ద్విజత్వమును వసంతర్తుసేవ యనుట.), జాతిన్=తమ ద్విజజాతిని, పా...న్ - పాసిన = విడిచిన, తేంట్ల = తుమ్మెదలయొక్క, నిస్స్వనమున్ = నాదమును, కూడుకొనుటనో = సంయోగించుటచేతనో, (తుమ్మెదలు మధుసేవవలనఁ గులభ్రష్టము లయిన వనియును, జాతిని విడిచె ననుట.), అనన్ = అనునట్లు, కోకిల స్వనము = పికస్వరము, తనరున్, మఱి=పిమ్మట, పంచమత్వంబు=పంచమస్వరత్వమును, ఐదవ మహాపాతకుఁడగుటయును, ('పికఃకూజతి పంచమమ్' అన్నట్లు పంచమస్వరత్వ మనుటయుఁ 'తత్సంయోగీ చ పంచమ' యనున ట్లయిదవవాఁ డగుటయు ననుట,) తప్పకుండన్ = తప్పిపోకుండునట్లు, చెలఁగెన్ = ఒప్పెను. (కోకిలములకుఁ బంచమ స్వరము స్ఫుటముగావచ్చె ననుట.) శ్లేషోత్థాపితహేతూత్ప్రేక్ష.

ఉ. పూచినమావులం దవిలి ౹ పూవిలుజోదున కమ్మె మాధవుం
డేచిన శంక నాతఁ డవి ౹ యేకొనియే పథికావళీజయ
శ్రీచణుఁ డయ్యె నట్టిద యకృత్యముచే నగునట్టిపీడయుం
గోచరమౌనె దైవ మనుకూలము నై పరుమేలు తీఱినన్. 120

టీ. మాధవుండు = వసంతుఁడు, పూ...లన్ - పూచిన=శరీరము పూచిన, మావులన్=గుఱ్ఱములను, తవిలి = అంటి, ఏ...కన్ - ఏచిన=అతిశయించిన, శంకన్=అనర్థ శంకచేత, పూవిలుజోదునకున్ = కుసుమకార్ముకునకు, అమ్మెన్ = విక్రయించెను, (గుఱ్ఱములకు శరీరమున పూచెనేని యవి కీడుసేయుట యశ్వశాస్త్రప్రసిద్ధ మనుటయుఁ బూచిన మామిళ్ళనుటయును), అవియె కొనియె = ఆ పూచిన మావులనే కొనియె,

అతఁడు = ఆమన్మథుఁడు, ప...డు - పథికావళీ=విరహిసమూహముయొక్క, జయశ్రీ= జయసంపదయందు, చణుఁడు అయ్యెన్ = సమర్థుఁడయ్యెను, అట్టిద = అట్టిదేకదా, అకృత్యముఁచేన్=దుష్కార్యముచేత, అ...యున్ - అగునట్టి=కలుగునట్టి, పీడయున్= ఆర్తియును, దైవమనుకూలమునై = దైవమనుకూలించియుండియు, పరుమేలు-పరు = శత్రువుయొక్క, మేలు = మంచికాలము, తీఱినన్=సమాప్తికాఁగా, గోచరమౌనె = తనకుఁ గనపడునా, (మావుల నమ్మినవాఁడు మాధవుఁడు గనుక దైవ మనుకూలమై యని చెప్పెను, దైవానుకూల్యమున్నప్పుడు జయ మెవ్విధముననైనఁ గలుగు ననుట.)

తా. వసంతర్తువునందు మామిడిచెట్లు లెస్సఁగాఁ బూచెను, మన్మథుఁ డా పువ్వులచేతఁ బథికులను జయించెను. కీడు చేయవలసిన పూచినమావులు జయప్రదము లయినట్లు చెప్పుటవలన వ్యాఘాతాలంకారము. 'స్యాద్వ్యాఘాతో తథాకారి తథా కారిక్రియేతచేత్' అని దానిలక్షణము. ఆవ్యాఘాతాలంకారము మావు లను తావున శ్లేషమూలకాభేదాతిశయోక్తిచేత ననుప్రాణితము గనుక నా రెంటికిని సంకరము. దీని కర్థాంతరన్యాసాలంకారములో సంసృష్టి.

మ. ఉరుశక్తి న్మధుమాసదోగ్ధ పిదుకన్ ౸ జ్యోత్స్నగవీచంద్రమస్
స్ఫురదూధగ్రప్రవిముక్తమైన నిబిడ౸జ్యోత్స్నాపయఃపూరమున్
విరియంబాఱినగొజ్జెఁగ ల్గురియ ము౸న్నీరైన యక్కమ్మనీ
రు రహిం గూడిన నేర్పరించు గములై ౸ రోలంబకాదంబముల్.

టీ. మధుమాసదోగ్ధ-మధుమాస = వసంతర్తువనెడు, దోగ్ధ=పాలుపిదుకువాఁడు, ఉరుశక్తిన్ = మహాబలముచేత, పిదుకన్=పిండఁగా, జ్యో...మున్ - జ్యోత్స్న = వెన్నెలరాత్రియనెడు, గవీ = గోవుయొక్క, చంద్రమః = చందమామ యనెడు, స్ఫురత్ = గొప్పదైన, ఊధః = పొదుగువలన, ప్రవిముక్తమైన = కురిసిన, నిబిడ = దట్టమైన, జ్యోత్స్నా = వెన్నెలయనెడి, పయః = పాలయొక్క, పూరమున్ = సమూహమును, వి...ల్ - విరియంబాఱిన = వికసించిన, గొజ్జెఁగల్ = గొజ్జంగిపూలు, కురియన్ = వర్షింపఁగా, మున్నీరైన = సముద్రప్రాయ మయిన, అక్కమ్మనీరు = ఆ మకరందమును, రహిన్=సొంపుఁగా, కూడినన్=కలిసికొనఁగా, రోలంబకాదంబముల్ - రోలంబ = తుమ్మెదలనియెడు, కాదంబముల్ = కలహంసలు, గుంపులై=గములై, ఏర్ప రించున్ = ప్రత్యేకపఱుచును. (వెన్నెలయందు గొజ్జెఁగఁపూఁదేనెను దుమ్మెదలు గ్రోలె ననుటయు, హంసలు పాలు నీరు వేఱు పఱుచుటయు ప్రసిద్ధము లనుట). రూపకాలం కారముచే నుత్థాపితమైన యున్మీలితాలంకారము.

ఉ. దిగ్గియ నంచ తూఁడు గొని \ తీరవనేక్షువువంకమీఁదుగా
నగ్గడ ఫుల్లకేసరము \ నందు వసింపఁగ నెక్కునూలిను[1]
న్వగ్గము నం దనారత మ \ రంద సరస్యరవిందగోష్ఠికిన్
వెగ్గలమాడుతేంట్లు మరు \ వింటికిఁ బూనె గుణద్వయత్వమున్. 22

టీ. దిగ్గియన్ = దీర్ఘికయందు, (రూ. డిగ్గియ), అంచ = హంస, తూఁడు = కమలనాళమును, కొని = గ్రహించి, తీ...గాన్ - తీర = దరియందలి, వన = వనము యొక్క, ఇక్షువు = చెఱకుయొక్క, వంకమీఁదుగాన్ = వంపుమీఁదుగా, అగ్గడన్ = ఆప్రాంతమందు, ఫు...దున్ - ఫుల్ల = పుష్పించిన, కేసరమునందున్ = పొన్నచెట్టునందు, ('పున్నాగః పురుషస్తుఙ్గః కేసరో దేవవల్లభః' అని నిఘంటువు,) వసింపఁగన్ = వ్రాలఁగా, ఎ...మున్ - ఎక్కు = ఆచెఱకునకెక్కువట్టి, నూలి = ఆబిసనాళతంతు సంబంధియగు, నున్ = నునుపైన, వగ్గమున్ = సూత్రంబు, అందు = ఆపొన్నచెట్టున, అ...కిన్ - అనారత = ఎడతెగని, మరంద = మకరందముయొక్కయు, సరసీ = ఆడిగ్గియయందలి, అరవింద = కమలములయొక్క, గోష్ఠికిన్ = సమాజమునకును, వెగ్గలము = అధికముగా, ఆడు = సంచరించుచున్న, తేంట్లు = తుమ్మెదలును, మరువింటికిన్ = మన్మథుని ధనువునకు, గుణద్వయత్వమున్ - గుణ = గొనయములయొక్క, ద్వయత్వమున్ = జంటతనమును, పూనెన్ = వహించెను.

తా. ఒక సరస్సులోనుండి హంస తామరతూఁడు ద్రుంచుకొని దానిదరి నున్న చెఱకువంకమీఁదుగాఁ బొన్నచెట్టుమీఁద వ్రాలఁగా, నాబిసనాళతంతువు లాచెఱకునకుఁ దగుల్కొని యది యొక యల్లెత్రాడుగాను, మఱియు నా పొన్నపూలమకరందము కొఱకు నా సరస్సునందలి కమలముల మకరందముకొఱకు నెడతెగక చాలుగట్టి యా చెఱకువంకమీఁదుగానే తిరుగుచున్న తుమ్మెద లొక్క యల్లెత్రాడుగాను, ఈరెండును రెం డల్లెత్రాళ్లుగా మన్మథునికి ధనుస్సయిన యా చెఱకున కమరుటచే బాంధ విజయమునకై మన్మథుఁడు తన వింటికి బటువుగా రెండల్లెత్రాళ్లు వేసికొనెను. గమ్యోత్ప్రేక్ష.

చ. నిడుద మధూళిక ల్నడుమ \ నే కొని తీఁగెలు సాఁగఁ జుట్టుకొం
చడవిఁ గడార కాచకట \ కాకృతి సుళ్ళ మెలంగె గాముపుల్
జడగతి నధ్వనీనపరి \ షత్పటునిశ్వసితానలం బెదు
ర్పడ మఱి సార్చునై చురచు \ రన్ దుద సుళ్లుగ ద్రుక్కెనో యనన్.

టీ. ని...ల్ - నిడుద = పొడువులగు, మధూళికల్ = మకరందధారలను, నడుమనే = భూమిని బడకుండ మధ్యభాగముననే, కొని = గ్రహించి, తీఁగెలుసాగన్ = (మకరందము

1. ఒక్కనూలి.

జిగటగావున) తీఁగెలు సాఁగునట్లు, చుట్టుకొంచుర్ = వలయితము లౌచు, గాడుపుల్ = వాయువులు, అ...బు - అధ్వనీన = పథికులయొక్క, పరిమళ్ = సమూహముయొక్క, పటునిశ్వసిత = పెద్దనిట్టూర్పులయొక్క, అనలంబు = అగ్ని. ఎదుర్పడర్ = తనకెదురు గాఁగా, మటి = పిమ్మట, సార్చులై = మంటలతోఁ గూడినవై, చురచురన్ = చురచుర యనఁగా, తుదన్ = అగ్రమందు, సుళ్లుగన్ = ఆవర్తములుగలుగఁగా, స్రుక్కెనో యనన్ = శోషించెనో యనునట్లు, అడవిన్ = అరణ్యమందు, కడార = కపిలవర్ణముగల, ('కడారః కపిలః పిఙ్గ' అని నిఘంటువు.) కాచకటక = గాఁజుచుట్టయొక్క, ఆకృతి = ఆకారమువంటి యాకారముగల, సుళ్లన్ = ఆవర్తములచేత, జడగతిన్ = మందగమనము చేత, మెలంగెన్ = సంచరించెను.

తా. పుష్పములనుండి జాఱెడు మకరందధారలు క్రిందఁబడకుండ నడుమనే గ్రహించి తీఁగెలు సాఁగునట్లు వలయితములై గాజులవలెఁ గపిల వర్ణము గలిగి యడవులయందు వాయువులు సంచరింపఁగా విరహులయొక్క నిట్టూర్పుచే నెదురుపడఁగా మండుచున గ్రముల సుళ్ళవలె ముడుఁచుకొని సుఱసుఱ స్రుక్కెనో యన్నట్లుండెను. ఉత్ప్రేక్ష.

చ. కురిసినక్రిందిపుష్పాడులఁ గొంచు నగంబుల మీఁదికై పిశం
గరుచులఁ గొన్ని పెల్లెగసె గాడ్పులసుళ్ పతి మాధవుండు రా
నెరవుగఁ బూవుసొమ్మిడి వనేందిర భూమికి వెండి మెట్టతా
మరరవణంబు రాఁ గొన భ్రమద్గతులౌ మరచుట్టులో యనన్. 124

టీ. కు...లన్ - కురిసిన = పుష్పములనుండి రాలినట్టి, క్రింది = వృక్షముల క్రిందనున్న, పుష్పాడులన్ = పుష్పరజములను, కొంచున్ = గ్రహించుచు, అగంబుల మీఁదికై = వృక్షములపైకిఁగాను, పిశంగరుచులన్ = పచ్చనికాంతులచేత, కొన్ని = కతిపయములగు, గాడ్పులసుళ్ = వాయువులయొక్క యావర్తములు (కర్తృపదము) కొన్ని, పతి = భర్తయగు, మాధవుఁడు = విష్ణుఁడు, (వైశాఖమాసము ననుట.) రాన్ = రాఁగా, వనేందిర = వనలక్ష్మి, పూవుసొమ్ము = పుష్పము లనియెడు ఆభరణము, మె...బు-మెట్టతామర=స్థలకమల మనియెడు, రవణంబు=భూషణము, రాన్ = రాఁగా, ఆభూషణము, భూమికిన్ = నేలకు, ఎరవుగనిడి = ఎరవుగాఁబెట్టి వెండి = మఱియు, కొనన్ = తీసికొనఁగా, భ్రమద్గతులౌ - భ్రమత్ = తిరుగుచున్న, గతులౌ = గమనములు గల, మరచుట్టులో యనన్ = చీలలో యనునట్లు, పెల్లు = అధికముగా, ఎగసెన్ = ఉద్గమించెను, సుళ్లను కర్తృపదమునకు 'సలోపోశ్చ' అను సూత్రముచేత నల్లోపమై యీ రూపము వచ్చెను.

తా. భూమికిని దనకును భర్తయగు మాధవుఁడు రాఁగా, వనలక్ష్మి తనకుఁ గల పూవుసొమ్మును భూమి కెరవుగాఁ బెట్టి, భూమికిఁ గల మెట్టతామర యను వేఱొక వింతసొమ్ము తాను బెట్టుకొనఁగా మరలఁ దిరుగుచున్న మరచుట్టులో యనునట్లు చెట్లక్రింద రాలిన పుష్పాదులు లేఁపికొని పచ్చనివన్నె గలిగి కొన్ని సుడిగాడ్పులు చెట్లపై కెగసెను. వస్తూత్ప్రేక్ష.

చ తరుణులు దోహదాన మధుధార నన ల్వకుళాళి నింపఁగాఁ
దరుణుల మేము గామె యని తద్గతలై వనదేవత ల్సురన్
ధర వకుళౌఘ మెల్లను ననల్గనఁ గ్రాయఁగ నించుబుగ్గలన్
దొరసె మధుప్రపూర్ణత మధూకములం బృథుపాండుపుష్పముల్.

టీ. తరుణులు=యువతులు, దోహదాన = దోహదమువలన, మధుధారన్=మద్య ధారచేత, వకుళాళిన్=పొగడచెట్ల పఙ్క్తియందు, ననల్=పుష్పములను, నింపఁగాన్= నిండింపఁగా, ('వకుళో ముఖసీధునా' అన్నట్లనుట), ఏము=మేము, తరుణులము గామె= యువతులము గామా, అని=అనుచు, తద్గతలై-తత్=ఆ వనమును, గతలు=పొందినవారు, ఐ=అయి, వనదేవతల్=వనదేవతలు, సురన్=మద్యముచేత, (మకరందముచేత ననుట.) ధరన్=భూమియందు, వకుళౌఘము=పొగడలగుంపు, ఎల్లను=సమస్తమును, ననల్గనన్ = మొగ్గలు వేయునట్లు, క్రాయఁగన్=ఉమియుటకై, నిం...లు-నించు=నిండించియున్న, బుగ్గలై=పుక్కిళ్లు, అన్ మధూకములన్=అను ఇప్పచెట్లయందు, పృ...లు-పృథు=పెద్దవి యగు, పాండు=తెల్లనగు, పుష్పములు=పువ్వులు, మధుప్రపూర్ణతన్-మధు=మకరందము చేత, ప్రపూర్ణతన్=మిక్కిలి నిండియుండుటచేత, దొరసెన్=పోలెను.

తా. ఇప్పపువ్వులు మిగులఁ దెల్లనై మకరంద భరితములై యుండఁగా, దశవిధ దోహదములలో నొకఁడైన ముఖసీధువుచేతఁ దరుణులు పొగడచెట్లను బుష్పింపఁ జేయఁగాఁ జూచిన వనదేవతలు తాము దరుణు లగుట నారీతిగానే సమస్త వకుళ వృక్షములను బుష్పింపఁ జేయుటకై యత్నపడి యుమియుటకై తెల్లని మద్యముఁ బుక్కిళ్లఁ బట్టియుండఁగా నా బుగ్గలవలెనుండెను. వస్తూత్ప్రేక్ష.

చ. తరుణుల కౌఁగిట న్ననుచుతమ్ము వృథా విరులెత్త జేసె మో
పరులుగఁ జైత్రుఁ డంచుఁ దమభావమనోభవవహ్ని వెచ్చి ని
ర్భరమధుపాళిధూమము పరాగపు నీఱును దేనెకట్టెచాఁ
దరుదుగఁ దాల్పఁగాఁ గొరవులై యొరగంబడెఁ గొన్ని భూజముల్.

టీ. త...టన్ - తరుణుల = ఉవిదలయొక్క కౌఁగిటన్ = ఆలింగనముచేత, న...మ్మున్-ననుచు = పుష్పించునట్టి, తమ్మున్ = తమ్మును, (గోరింటలను), ('ఆలిఙ్గనా

ఝ్కురవక' అన్నట్లనుట.) వృథా=వ్యర్థముగా, చైత్రుఁడు=వసంతర్తువు, మోపరులుగన్ = బరువు మోసెడువారిఁగా, విరులెత్తన్ = పుష్పములెత్తునట్లుగా, చేసెన్ = ఒనర్చెను. అంచున్=అనుచు, త...హ్ని - తత్ = ఆయువత్యాలింగనముయొక్క, అభావ=లేమి చేత, మనోభవ=మన్మథసంబంధి యయిన, వహ్నిన్=అగ్నిచేత, వెచ్చి = దగ్ధములై, ని...ము-నిర్భర = నిబ్బరములైన, మధుప = తుమ్మెదలయొక్క. ఆళి=పఙ్క్తి యనెడు, ధూమము=పొగయును, పరాగపు=పుష్పరజోమయమగు, నీఱును=భస్మమును, తేనెకట్టె చాఁదు = మకరందమనియెడు కట్టెచాఁదును, (పచ్చికట్టె కాలునప్పుడు లోపలినీరు పైకుబికి చాఁదుగట్టు ననుట), అరుదుగన్=వింతగా, తాల్పఁగాన్=ధరింపఁగా, కొన్ని భూజముల్ = కొన్నిచెట్లు, కొరవులై=అలాతములై, (కొరవు లనఁగా (గురువకములు) ఒరగంబడెన్ = నేలవ్రాలెను. (తాపభరముచే ననుటయుఁ బుష్పభరముచే నను టయు) అలాతమను నర్థమున శకటరేఫము. శ్లేషయందు రేఫద్వయము గ్రాహ్యము

తా. కురవకశబ్దభవములై కొరవులని చెప్పఁబడియెడు గోరింటలు స్త్రీల యాలింగ నములచేతనే మేము పూయుదుమే యట్టి మమ్ము నీ చైత్రుఁడు బరువుచేటుగాఁ దాను వృథా పుష్పింపఁజేసె నని యాస్త్రీల యాలింగనము లేకుండుటవలని మదనాగ్నిచేతఁ దపింపఁ బడినందులకుఁ జిహ్నముగాఁ దుమ్మెదలు పొగ లెగసినట్లును, బుప్పొడి బూది రాలినట్లును, మకరందము దానిలోని నీరుపేరి నల్లఁబడి చాఁదుగట్టినట్లుండఁగా నొరగఁబడి తమ పేరు సార్థక మగునట్లు కొఱవులవలె నుండెను, ఆకులు మొదలగునవి కనుపడకుండు నట్లు లెస్స పూచి యుండెను. అలం. గమ్యోత్ప్రేక్షాలంకారము. రూపకోత్థాపితము, శ్లేషానుప్రాణితము.

ఆ. ఫలశలాటు లురల । నళులకై తమకూడు
చెఱుప మావు లంటి । చెలువ పిందు
మగుడ ననలు నింప । మొగము గన్నులు నెఱ్ఱ
వాఱె మిగుల శౌక । పైకములకు. 127

టీ. చెలువపిందు = సుందరీసమూహము, ఫలశలాటులు = పండ్లుగాయలు, ఉరలన్=రాలిపోవునట్లు, అళులకై = తేఁటులకొఱకు, తమకూడు = తమయాహారము, చెఱుపన్=చెఱుచుటకై, మావులు = మామిడిచెట్లను, అంటి=స్పృశించి, ('కరస్పర్శేన మాకంద' యనున ట్లనుట.) మగుడన్=మరల, ననలు=పుష్పములను, నింపన్ = నిండిం పఁగా, శౌకపైకములకున్ = చిలుకల కోకిలల గుంపులకు, మొగము = ముఖమును, కన్నులు=నేత్రములును మిగులన్=అధికము, ఎఱ్ఱవాఱెన్=కోపముచేత నెఱ్ఱ నయ్యెను, (చిలుకలకు ముఖమును గోయిలలకుఁ గన్నులును వసంతర్తువునందు మిక్కిలి యెఱ్ఱనై యుండుట ప్రసిద్ధ మనుట). హేతూత్ప్రేక్షగమ్య యథాసంఖ్యాలంకారమును.

మ. అతులప్రేమరసార్ద్రి యోర్తు ప్రియహాస్యక్రీడ సంకేతవం
చితయై తత్క్షణజాంగజజ్వరమిళచ్చిత్తభ్రమం బూని నా
పతి నోవృక్షమ కానవే యన సపుష్పం బయ్యెఁ గోఁ గంతలో
నతఁడు న్దోఁచిన నవ్వఁడు న్విరిసెఁ బ్రాంతాంచన్నమేరుద్రుమున్. 128

టీ. అ...ర్ద్రి-అతుల = సమానములేని, ప్రేమరస=ప్రేముడిచేత, ఆర్ద్రి=సరసమైన, ఓర్తు=ఒక్కనాతి, ప్రి...డన్-ప్రియ = తననాథునియొక్క, హాస్యక్రీడన్ = పరిహాసక్రీడయందు, (దాఁగిలిమూఁత యనుట),సంకేత=సంకేతస్థానమందు, వంచితయై=మోసపోయినదై, త...బు-తత్క్షణజ = అప్పుడే పుట్టిన, అంగజజ్వర = విరహజ్వరము తోడను, మిళత్=కూడికొన్న, చిత్తభ్రమంబు = మనశ్చాంచల్యమును, ఊని=పొంది, ఓవృక్షమ = ఓచెట్టా, నాపతిన్ = నానాథుని, కానవే = చూడవా, అనన్ = అని పల్కఁగా, గోఁగు=కర్ణికారము, సపుష్పంబయ్యెన్ = పుష్పములతోఁ గూడినదయ్యెను, (సల్లాపతఃకర్ణికారః’ అన్నట్లనుట.) అంతలోన్=ఆపల్కరించునంతలో, అతఁడున్ = ప్రియుఁడును, తోఁచినన్ = కానరాఁగా, నవ్వఁడున్ = నవ్వఁగానె, (ఆస్త్రీయనుట), ప్రాంతాంచన్నమేరుద్రుమున్ - ప్రాంత = చేరువను, అంచత్ = ఒప్పుచున్న, నమేరుద్రుమున్ = సురపొన్నచెట్టును, విరిసెన్ = పుష్పించెను. (‘నమేరుర్హాసితేన చ’.)

తా. ఒకస్త్రీ తన నాథునిఁ గనుమఱచి వెదకుచు నొక కొండగోఁగును బలుకరింపఁగా నది పుష్పించెను. అంతలోనే తననాథుఁడు గనిపించిన నాయింతి నవ్వఁగానే యాచేరువ నున్న సురపొన్నచెట్టును బుష్పించెను. ప్రహర్షణాలంకారము.

తే. స్థాణు వొక్కండు మగవాఁడు తలఁక కుమియ
ఫల మొసఁగె నట్టి కినియక పద్మవదన
వదనసురఁ గూర్మి నొసఁగ నీవలదె పుష్ప
మైన ననుమాడ్కి నుమిసిన నలరెఁ బొగడ. 129

టీ. స్థాణువు=మొద్దును, శివుఁడును, ఒక్కండు మగవాఁడు = ఒక్కపురుషుఁడు, తలఁకక = సంకోచింపక, ఉమియన్ = ఉమ్మివేయఁగా, కినియక = కోపింపక, ఫల మొసఁగెన్ = పండిచ్చెను, (కోరిక నిచ్చెను), (‘స్థాణూ రుద్ర ఉమాపతిః’ అని అమరము.) (స్థాణువుపైఁ బోయ తిన్నప్ప యనువాఁడు పూజార్థము పుక్కిటి నురనుమియఁగాఁ గోపగింపక కామితఫల మిచ్చెనఁట. ఇది శ్రీకాళహస్తి మాహాత్మ్య ప్రసిద్ధము.) అట్టె=అప్రకారమే, పద్మవదన=తమ్మివంటి మొగముగల యువిద, వదనసురన్=తననోటి యందలిమద్యమును, కూర్మిన్ = ప్రేమచేత, ఒసఁగన్ = ఇయ్యఁగా, పుష్పమైన

నీవలదే=పూవేనియు నీవలదా, అనుమాడ్కిన్=అనియెదురీలిచేత, ఉమిసినన్ = ఉమియఁగా, పొగడ=వకుళవృక్షము, అలరెన్ = పుష్పించెను. ('వకుళో ముఖసీధునా'.)

తా. మున్నొక మగవాఁడు స్థాణువు పై నుమిసిన నతనికి ఫల మొసఁగి యుండఁగాఁ, దామరవంటి మోము గల యువతి పుక్కిటిసుర యొసఁగఁగాఁ బువ్వైన నియ్యవలదా? యన్నట్లు, పొగడపై నొకమగువ యుమియఁగా నది పూచె నని భావము. అర్థాపత్త్యుత్థాపితోత్ప్రేక్ష.

తే. మధువుఁ గాంతలపుక్కిటిమధువుఁ బేళ్ల
యీర్ష్యఁ బస సూపఁ బొగడపై (నెలయ దాన
విరిసెఁ దొల్లిటిదళములు (విరులు జడిసె
దీన నగ్గల్పునకు నుబ్బి (తేఁటు లార్చె. 130

టీ. మధువున్ = వసంతమాసమును, కాంతల=స్త్రీలయొక్క, పుక్కిటి = బుగ్గల యందలి, మధువున్=మద్యమును, పేళ్ల=సమాన నామముచేతనైన, ఈర్ష్యన్=ఈసుచేత, పస=తమ తమ హెచ్చులను, చూపన్=కనఁబఱచుటకై, పొగడపైన్=వకుళవృక్షము మీఁద, ఎలయన్ = వ్యాపింపఁగా, దానన్ = ఆ వ్యాపించుటచేత, తొల్లిటిదళములు= మున్నున్నసైన్యములు, (ఆకు లనుట),('దళం శస్త్రే భటే ఛదే' అని నిఘంటువు.)విరిసెన్= విచ్చెను, (రాలె ననుట), విరులు = తొల్లింటిపువ్వులు, జడిసెన్=భయపడెను. (క్రొత్త పువ్వులు జడిగొనె ననుట), దీనన్=ఈహేతువుచేత, అగ్గల్పునకున్ = ఆవసంతవిజయమునకు, ఉబ్బి = సంతసించి, తేఁటులు = తనపక్షమున నున్న తుమ్మెదలు, ఆర్చెన్ = సింహనాదముచేసెను, (ధ్వనిచేసె ననుట.)

తా. మధు వను నామము వసంతర్తువునకును మద్యమునకును జెల్లును గావున, నా నామైక్య వైరముచేతఁ దమ తమ పస పొగడచెట్టుపైఁ గనుపింపఁగా, సుదతుల పుక్కిళ్ళ మధువుచేఁ జిగిరించి పుష్పించియున్న యాకులను బువ్వులను రాలిచి, వసంతర్తువు పొగడను మరలఁ బుష్పింపఁజేసెను; మరలఁ బూచినపూల కలరి తుమ్మెదలు మ్రోసెను. వ్యతిరేక యథాసంఖ్యములతో సంకీర్ణమయిన యుత్ప్రేక్ష.

ఉ. మేకొని తాఁచినం భృగువు (మెచ్చినవానికి మర్త్యభార్యయా
శ్రీకి నివాస మై చెలిమి (సేయుట నిట్టిప్రశాంతిగల్గె నో
కా కన నాతి తన్నిన వికాసము నొంది వనస్థలస్థితా
శోకము సేసె మెచ్చునఁ బ్రసూనరజఃకనకాభిషేకమున్. 131

టీ. తాఁచినన్ = తన్నినను, మేకొని = అంగీకరించి, భృగువున్=భృగుమహామునిని, మెచ్చిన వానికిన్ = మెచ్చుకొన్నయావిష్ణునకు, మ...ర్త్య-మర్త్య = మను

ష్యుఁడైన రామావతారమందలి, భార్య = గృహిణి, ఔ శ్రీకిన్ = ఐన శ్రీదేవియగు సీతకు, నివాసమై = ఉనికిపట్టై, చెలిమిసేయుటన్ = స్నేహముచేయుటచేత, ఇ...తి - ఇట్టి = ఈవిధమయిన, ప్రశాంతి = అధికశాంతి, కల్గెనో కాక = కలిగినది కాఁబోలు, అనన్ = అనునట్లు, నాతి=ఒకయింతి, తన్నినన్ = తన్నఁగా, వికాసమునొంది= వికసిల్లి, ('అశోకశ్చరణాహత్యా, యన్న ట్లనుట.) వ...ము-వనస్థల=వనప్రదేశమందు, స్థిత=ఉన్నట్టి, అశోకము=అశోకవృక్షము, మెచ్చునన్ = సంతుష్టిచేత, ప్ర...మున్- ప్రసూనరజః = పుప్పొడి యనియెడు, కనకాభిషేకమున్, చేసెన్=ఒనర్చెను.

తా. తొల్లి భృగుమహాముని తన్నఁగాఁ గోపింపక మెచ్చుకొన్న విష్ణుదేవునికి, రామావతారమందు భార్యయైన సీతాదేవికి లంకయందు నివాసస్థానమై చెలిమి చేయ, నా సంబంధముచేతఁ దనకు నట్టి శాంతగుణము గలిగెనో యనున ట్లశోకవృక్షము దన్నొక నాతి తన్నఁగాఁ బుష్పించి పచ్చని పుప్పొడిచేత నాయింతికిఁ గనకాభిషేకముఁ జేసిన ట్లుండెను. భృగుమహర్షి త్రిమూర్తుల ప్రాశస్త్యము నరయుటకై ఋషులచే నియమింపఁబడి విష్ణుమూర్తిని దన్నెను. (శివబ్రహ్మ లాతఁ డొనర్చిన యవమానము సహింపలేకపోయిరి; విష్ణువు సహించెను. అందుచే విష్ణువే పరమశాంతమూర్తి పూజార్హుఁడు నని భృగువు చాటెను.) రూపకాను ప్రాణితహేతూత్ప్రేక్ష.

మ. అళు లేతద్వదనేందు రాగ మిళనా ప్రాదుర్భవత్కోరకం
బులతేనె ల్సుధలంచు రా నొకతె నెమ్మోమెత్తఁ జైత్రంపుఁబు
వ్వులలోఁ దద్గుణు లయ్యె గంధఫలిఁ బువ్వు ల్వొట్టి పోఁదోలె నొ
చ్చెల చేఁదై తలచెందుఁ [1]దల్లిబడికోర్కె ల్చెట్టాటయే కామహిన్. 132

టీ. ఒకతె = ఒక్క నాతి, నెమ్మోమెత్తన్ = ముఖమెత్తఁగా, అళులు = తుమ్మెదలు, ఏ...న్ - ఏతద్వదనేందు - ఏతత్ = ఈనాతియొక్క, వదన=ముఖమను, ఇందు = చంద్రునియొక్క, రాగ = రక్తితోఁ, మిళనా = కూడుటచేత, ప్రాదుర్భవత్ = పుట్టుచున్న, కోరకంబుల = మొగ్గలయొక్క, తేనెల్ = మకరందములు, సుధలంచున్ = అమృతము లని, (తియ్యనై యుండు నవి యనుట], ('ముఖరాగేణ చంపకః' అనునట్లనుట.) చైత్రంపుఁబువ్వులలోన్ = చైత్రుఁడు వికసింపఁజేసిన పుష్పములలో, తద్గుణులయ్యెన్ = ఆకాంతాముఖగుణములే కలవి యయ్యెనా యని కాకువు, (కాలేదనుట), గంధఫలిన్ = సంపెఁగయందు, పువ్వుల్వొట్టి = పుష్పము లుదయించి, చేఁదై=తిక్తమై, పోఁదోలెన్ = వెడలఁగొట్టెను, ఒచ్చెల=ఇది ఖేదోక్తి ఓచెల్లయనుటకు రూపాంతరము.

---

1. తల్లిబడి కోర్చెవాట; తల్లిబడి కోర్చెట్లాట.

ఎందుఁ = ఎచ్చటనైనను, మహిఁ = భూమియందు, తఱచు = బహుళముగా, తల్లిబడిఁ గోల్ చెట్ల కౌటయేకా = [1]తల్లి పోలికలోని దుర్గుణములు కలదగుటయే గదా.

తా. ఒకస్త్రీ మొగమెత్తఁగా దాని ముఖచంద్రసుధసంయోగమువలనఁ బుట్టిన సంపెంగమొగ్గలలోని మకరందము చంద్రసుధవలెనే తియ్యఁగా నుండు నని తుమ్మెదలు రాఁగాఁ జెట్టునఁ బుట్టుటచేఁ బూర్వపుగుణమే కలిగి సంపెంగ పువ్వులు తుమ్మెదలకు మిక్కిలి చేఁదై చేరకుండఁ బాఱఁదోలెను; బిడ్డలకుఁ దల్లి గుణమే యుండు నని కదా లోకోక్తి. అర్థాంతరన్యాసాలంకారము.

చ. అలరెఁ బ్రియాళు వోర్తు ప్రియ । మాట వసంతముఁ బాడ నప్పు డ
వ్వెలఁదిసపత్ని భక్తికిని । వేల్పులు మెత్తురు గాన రాగ మ
చ్ఛలమునఁ దన్నుఁ బాడఁగ వ । సంతుఁడు తా దయచేసెఁ గాక యా
[2]యెలె నిజశక్తినా యనుచు । నీపసకుం గొదవెట్టె నీసునన్. 133

టీ. ఓర్తు = ఒక్కతె, ప్రియమాటన్ = తనకిష్ట మాటవలన, వసంతమున్ = వసంతరాగమును, పాడన్ = గానముసేయఁగా, ప్రియాళువు = ప్రేంకణపుఁజెట్టు, అలరెన్ = పుష్పించెను, ('వసంతస్సహాయస్తు వసంతర్తౌ ప్రగీయతే' అను సంగీతశాస్త్ర సంప్రదాయమునఁ బాడఁగా 'గీత్యా ప్రియాళు ర్నిశరాం' అన్నట్లు పుష్పించె ననుట.) అప్పుడు = ఆకాలమందు, అ...త్ని - అవ్వెలఁది = ఆపాడినచేడెయొక్క, సపత్ని = సవతి, వేల్పులు, భక్తికిని, మెత్తురుగానన్ = మెచ్చుకొందురుగావున, రాగము = వసంతరాగము, అచ్ఛలమునన్ = ఆను నెపముచేత, తన్నున్ = ఆవసంతుని, పాడఁగన్ = గానముసేయఁగా, వసంతుఁడు, తాన్ = తాను, దయచేసెఁగాక = కృప చేసెను గాని, ఈ ప్రియాళువును బుష్పింపఁజేసెనుగాని యనుట. నిజశక్తినా - నిజ = ఈబిడయొక్క, శక్తినా = సామర్థ్యముచేతనా, ఆయెలె = అప్పుడేయాయెలే, ఇది నిస్సారార్థకము. అనుచున్ = అనిపల్కుచు, ఈపసకున్ = ఈ పాటఁబాడి పుష్పింపఁజేసిన స్వారస్యమునకు, ఈసునన్ = సవతియందలి యీర్ష్యచేత, కొదవెట్టెన్ = కొఱఁతను ఆరోపించెను.

తా. ఓర్తు వసంతరాగముఁ బాడఁగాఁ బ్రేంకణము పూచెను; దానికి నాస్త్రీయొక్క సవతి మెచ్చుకొనక నీసుచేత వేల్పులు భక్తికి మెత్తురు గావున, వసంత మని

1. తల్లిబడి గోల్చెట్టౌటయేకా = తల్లివలెఁ బెఱిగిన గోలిచెట్టు వంటిదేకదా= (గోలిచెట్టు = రేఁగుచెట్టు) వ్రా. ము...అ, యలె. 2. నిజశక్తినా యనుచు నా పసకున్ గొదవెట్టె నీసునన్. (శ. ర. పా. వ్రాతప్రతి పాఠము.)

యెదు తనపేరుగల రాగముచేతఁ దన్నుఁ బాడఁగా, నావసంత దైవతమే యీ చెట్టును బుష్పింపఁ జేసెనుగాని, యీపె కింత సామర్థ్యమా యని నిరసించెను. కైతవాపహ్నుతి.

తే. అధరసుధఁ బ్రాణిజతఁ బ్రాణి ♦ యగుచు మౌక్తి
కాండమాలిక నిడెను నాసాగ్రమౌక్తి
కంబ యనఁజాలు ననలిచ్చె ♦ గతజరత్సు
మంపు వావిలి మొగమూర్పు ♦ నింప నోర్తు. 134

టీ. ఓర్తు = ఒక్కతె, మొగమూర్పు = మొగమునందలి యుచ్ఛ్వాసమును, నింపన్ = నిండింపఁగా, ('సిందువారో ముఖానిలాత్' అనున ట్లనుట.) అధరసుధన్ = అధరమందలి యమృతస్పర్శముచేత, ప్రాణిజతన్ = ప్రాణముగల ముత్తెపుఁ జిప్పవలనఁ బుట్టినదగుటచేత, ప్రాణి అగుచున్ = తానును బ్రాణము గలదగుచు, నాసాగ్రమౌక్తికంబ-నాసా = ఆపొలఁతిముక్కుయొక్క, అగ్ర = కొనయందలి, మౌక్తికంబ = ముక్తాభూషణమె, మౌ...కన్ - మౌక్తికాండ = ముత్తెంపుగ్రుడ్లయొక్క, మాలికన్ = పఙ్క్తిని, ఇడెను = పెట్టెను, అనన్ = అనునట్లు, గతజరత్సుమంపు-గత = రాలిపోయిన, జరత్ = ముదురువైన, సుమంపు = పువ్వులుగల, వావిలి = నిర్గుండీవృక్షము (సిందువారము) - చాలు ననలిచ్చెన్ = శ్రేణిగా నుండు మొగ్గల నీనెను.

తా. ఒక్క మగువ నిట్టూర్పు నింపఁగా దానివలనఁ బువ్వులు రాలిపోయిన వావిలిచెట్టునందుఁ గ్రొత్తగా శ్రేణిగట్టి మొగ్గలు గనిపించెను; అది యాస్త్రీయొక్క యధరమందలి యమృత స్పర్శముచేతఁ బ్రాణము గల ముత్తెపుఁ జిప్పలోఁ దాను బుట్టి యున్నందునను, దానును బ్రాణముగలదై యానెలఁత నాసాభూషణ మగు మౌక్తికము పోలుగా ముత్తెపు గ్రుడ్లు పెట్టిన ట్లుండెను. వస్తూత్ప్రేక్ష.

చ. ఘనమగు నాకురాలి తిలకం బతిరిక్తత నున్న నోర్తు లోఁ
గనికర మూని కన్నుఁగవఁ ♦ గాయజుఁ డిల్లడ యిడ్డ తూపులే
యనువుగ నించెఁగాక మఱి ♦ యంటక ముట్టక యొక్కచేష్టలే
క నెగడెఁ జూడ్కి నంట యిది ♦ గల్లనఁగా నలరించెఁ జూపులన్. 135

టీ. ఓర్తు = ఒకయింతి, ఘనమగు = దట్టమైన, ఆకు రాలి, తిలకంబు = బొట్టుగుచెట్టు, అతిరిక్తతన్ = మిక్కిలిదారిద్ర్యముచేత, ఉన్నన్ = ఉండఁగా, లోన్ = మనస్సులో, కనికరము = కారుణ్యమును, ఊని = ఊహించి, కన్నుఁగవన్ = తననేత్రద్వయమందు, కాయజుఁడు = పూవిల్తుఁడు, ఇ...వే-ఇల్లడఇడ్డ = దాఁచియుంచిన, తూపులే = బాణములే, అనువుగన్ = సొగసుగా, నించెన్ కాక = ఈపె నిండించెఁగాని, మఱి = లేని

యెడ, అంటకముట్టక = తగులక తాఁకకయే, ఇది (జాత్యుక్తి), ఒక్కచేష్ట లేక = ఒక వ్యాపారమును లేక, చూడ్కిన్=చూపుచేత, నెగడెను అంట = వృద్ధియయ్యె ననుట, ఇది = ఈపుల్కు, కల్ల అనఁగాన్ = అసత్యమనునట్లుగా, చూపులన్ = వీక్షణముల చేత, అలరించెన్ = పుష్పింపఁ జేసెను, ('తిలకో వీక్షణేన చ' యన్నట్లనుట.)

తా. ఒక బొట్టుగుచెట్టున నాకులు రాలి బీదగిలి యుండఁగా, నొకతె మిక్కిలి గనికరముతో దానిం జూడఁగా నప్పుడే తప్పక విప్పుగల గొప్పపువ్వు లుప్పతిల్ల, నది మదనుని యంప గుదులు దాఁచియున్న యాచకోరలోచన కనులయందలి యా ములుకులు మరల వెడలించి యీ తిలకముపై నెలయించెఁ గాని, లేకున్న నీజోక నంటక ముట్టకయే చిట్టలుం బెట్టకయే యుట్టిపడ్డట్టు లిట్టు పువ్వులు పుట్టుట కల్ల యని యెల్ల రనున ట్లొప్పియుండెను. ఉత్ప్రేక్ష.

తే. సాంద్రమకరందవృష్టి రసాతలంబుఁ
దొరఁగు పువ్వుల భువియుఁ బూఁధూళి నభము
నీక్రమత్రయి మాధవుఁ డాక్రమించె
నురువిరోచనజనిత మహోష్మ మడఁగ. 136

టీ. సాం...ష్టిన్-సాంద్ర=తఱచైన, మకరంద=పూఁదేనియలయొక్క, వృష్టిన్ = వానచేత, రసాతలంబున్ = పాతాళమును, తొరఁగు = రాలుచున్న, పువ్వులన్=పుష్పములచేత, భువియున్ = భూమిని, పూధూళిన్=పుష్పరజముచేత, (మిశ్రసమాసము), నభమున్ = ఆకాశమును, నీక్రమత్రయిన్=ఈచెప్పఁబడిన మకరంద పుష్పరజము లని యెడు మూఁడువిధములైన విక్రమముచేత, మాధవుఁడు = వసంతుఁ డనియెడు త్రివిక్రముఁడు, ఉ...ము-ఉరు = విస్తారమైన, విరోచన = సూర్యునిచేత, జనిత = పుట్టిన, మహోష్మము = మహాప్రతాపము, అడఁగన్ = శాంతిబొందునట్లు, ఆక్రమించెన్ = త్రిలోకముల నాక్రమించెను.

తా. మాధవుం డని విష్ణునకుఁ దగిన పేరుగల వసంతుఁడు, సూర్యప్రతాపము బలిప్రతాపమువలె నడఁగునట్లు, పాతాళమర్త్య స్వర్గలోకములను వరుసగా మకరంద పుష్పరజముచేత మూఁడడుగులచేత నాత్రివిక్రమునివలె నాక్రమించెను, వసంతర్తువు నందు సూర్యుఁ డంత విస్తారముగా వేఁడిమిఁ జూపఁడని భావము. ప్రకృత వసంతవర్ణనముచేత నప్రస్తుత త్రివిక్రమ పరిస్ఫూర్తి గలుగుటవలన సమాసోక్త్యలంకారము.

క. ఊఁడఁ గొనఁ బడుమధూళిక
యోడికలకుఁ గ్రిందఁ గ్రమ్మియుండెడు తేంట్లన్

నీడలు దిరిగియుఁ దిరుగని
జాడఁ దరు లొప్పలిచె నవ్వసంతపువేళన్. 137

టీ. ఊఁదుకొనన్=భూమియూటపట్టునట్లు, (ఊఁదుకొను. నాటు అని సూ. ని. కాని యర్థ మిట సరిపడునట్లు తోఁచదు. ఊఁదుకొను=ఊఁదుచుకొను చులోపము. కొను స్వార్థమున నైనపుడు ఊఁదుకొను=బురదయగు అనుట యుక్తము.) స...కున్ - పడు=స్రవించుచున్న, మధూళిక=మకరందధారలయొక్క, ఓడికలకున్ = ప్రవాహము లకు, క్రిందన్ = అధోభాగమందు, క్ర...ట్లన్ క్రమ్మియుండెను = ముసరుకొన్న, తేంట్లన్ = తుమ్మెదలచేత, నీడలు తిరిగియున్ = ఛాయలు ప్రొద్దువెంబడి మఱియొక దిక్కునకుఁ దిరిగియుండు, తిరుగనిజాడన్ = తిరుగనిరీతిగానే, తరుల్ = వృక్షములు, అవ్వసంతపువేళన్ = ఆవసంతకాలమందు, పొలిచెన్ = ఒప్పెను.

తా. ఆ వసంతర్తువునందు మకరంద మధికమై స్రవింపఁగా, నావాసనకుఁ జెట్ల క్రింది భూమిమీఁద దుమ్మెదలు గ్రమ్ముకొని లేవక నల్లనై యుండెఁ గావునఁ బ్రొద్దు వెంట నీడలు దిరిగినను దిరుగనియట్లే యాచోట్లు నీడలవలె నుండెను. పూర్వరూపా లంకారము.

చ. శతదళమంజరీధవళచైత్రనిశామలచంద్రికౌఘముల్
వృత వియదంత కేళివనవృక్ష లతాంతరజశ్ఛట న్గళం
కితఁ గని కామినీకమనకేళియుఁ బోఁ జెడవా నగాటవీ
కతకపరాగ మొక్కెడఁ గ్రమ్మి యనచ్ఛత మాన్పకుండినన్. 138

టీ. శ...ల్ - శతదళ = తెల్లదామరపువ్వులయొక్క, మంజరీ=గుత్తులవలెనే, ధవళ=తెల్లనైన, చైత్ర=చైత్రమాససంబంధినులగు, నిశా=రాత్రులయందలి, అమల = స్వచ్ఛమైన, చంద్రికా=వెన్నెలయొక్క, ఓఘముల్ = జలప్రవాహములు, ('ఓఘో వితానే వేణ్యాం చ' అని నిఘంటువు.) వృత = ఆవరింపఁబడిన, వియదంత=ఆకాశప్రదే శముగల, కేళివన = ఉద్యానవనములయందలి, వృక్ష = చెట్లయొక్క, లతాంత=పువ్వు లయొక్క, రజః = పరాగముయొక్క, ఛటన్ = సమూహముచేత, కళంకితన్ = బురద గలుగుటను, కని=పొంది, న...ము-నగాటవీ-నగ = పర్వతములయందలి, అటవీ= అడవులయందలి, కతక = చిల్లచెట్లయొక్క, పరాగము = రజము, ఒక్కెడన్ = ఒక దిక్కునందు, క్రమ్మి=వ్యాపించి, అనచ్ఛతన్=స్వచ్ఛముగాకుండుటను, మాన్పకుండినన్= పోఁగొట్టనియెడల, కామినీకమన = విటీవిటులయొక్క, కేళియున్ = క్రీడయును, పోన్=పోవునట్లుగా, చెడవా = చెడిపోవా, (పోవు ననుట).

తా. తెల్లనైన చైత్రమాసరాత్రులయందలి వెన్నెల లనియెడు నిర్మలోదకప్రవాహము లుద్యానవనములలోని పుష్పాదుల తిప్పలచేఁ గలఁగినవై యుండఁగా, నవి తేఱుట కొకమూలను గొందల యడవులలోని చిల్లచెట్ల పుష్పాదులు వ్యాపించి యా కలఁక దీర్చి యా నీరు దేర్చిన లెస్సైయుండునే కాక, యట్లు చేయకుండిన నా ప్రవాహములు విటీవిటుల క్రీడల కుపయోగింపక తామును జెడిపోవును. (బురదనీటిలోఁ జిల్లపొడిరాల్చిన నీరు తేరుట ప్రసిద్ధము.) ఉపమానరూపకాతిశయోక్తులకు సంసృష్టి.

సీ. శైత్యపాండిమలు దుషారాంతమునఁ జేరె
నిరులుకొన్ ద్రాక్షపందిరుల విరుల
వలయగానము లయుక్తలకార్శ్యమునఁ జేరె
మలయంపుఁ గమ్మవీవలుల నలుల
సౌరభోల్లాసముల్జాతి క్రుంగఁగఁ జేరె
నలరారు కొదమ క్రోవులను నెలను
స్ఫుట జటామస్కరంబులు ప్రతిచ్యుతిఁ జేరె
నందన ప్లక్ష సంతతుల వృతుల
తే. స్వభృతపరభృత వినుత రసాలపరిష
దహారహాగక్ల్ప్త బహురహాగప్రహారవిహార
మాణ మానవతీ [1]పరిమ్లానిమాని
వారి వారిజవనగంధవాహ మొలసె. 139

టీ. తుషారాంతమునన్ - తుషార=మంచుయొక్క, అంతమునన్ = నాశకాలమందు, (శిశిరర్తువు కడవఁగా ననుట), శైత్యపాండిమలు=చల్లఁదనమును·దెల్లఁదనమును, (ఇవి మంచిగుణములు), ఇరులుకొన్ = చీఁకట్లు గ్రమ్ముచున్న, ద్రాక్షపందిరులన్ = ద్రాక్ష పందిళ్ళయందును, విరులన్ = పుష్పములయందు, చేరెన్ = ప్రవేశించెను. (ద్రాక్షపందిళ్లు బలసి యల్లికొనెఁ గావున నచ్చటఁ జల్లఁదనమును, పుష్పములు వికసిల్లఁగా నందుఁ దెల్లఁదనమును జేరె ననుట), అ...నన్ - అయుక్తల = ప్రియులతోఁ గూడికొనని విరహముగల స్త్రీలయొక్క, కార్శ్యమునన్ = కృశించుటయందు, వలయగానములు = వారియొక్క కంకణములును సంగీతములును, మలయంపు= మలయపర్వతసంబంధులగు, కమ్మ=పరిమళించుచున్న, వీవలులన్ = వాయువులయందును, అలులన్ = తుమ్మెదలయందును, చేరెన్ = ప్రవేశించెను, (విరహముచేత స్త్రీలు కృశిం

1. రతి,

కఁగా వారి కంకణములు దూసిపోయె ననియుఁ, జింతచేత గానములు మాని రనియుం, నా చిహ్నములు వరుసగా సుడిగాడ్పులయందుఁ గంకణత్వమును దుమ్మెదలయందు గానమును జేరె నలుట), జాలి = జాజి, (జాత్యేకవచనము), క్రుంగఁగన్ = అడఁగి పోఁగా, సౌరభోల్లాసముల్ = వానియొక్క పరిమళ ప్రకాశములు, అలరారు = పుష్పించుచున్న, కొదమక్రోవులను=గున్నలయిన క్రోవిచెట్లయందును, (పరిమళమనుట), నెలను = చంద్రునియందును, (ప్రకాశ మనుట), చేరెన్ = ప్రవేశించెను, వ్రతిచ్యుతిన్ - వ్రతి = సన్న్యాసులయొక్క, చ్యుతిన్ = జాఱుటచేత, (వసంతర్తువురాఁగానే సన్న్యాసులు వ్రతమును గాపాడుకోఁజాలక పోయి రనుట), స్ఫుట = స్పష్టములగు, జటా = వారియొక్క జడలును, మస్కరంబులు = వేణుదండములును, నందన=ఉద్యానములలోని, ప్లక్ష=జువ్విచెట్లయొక్క, సంతతులన్ = సమూహములయందు, (జటా స్వరూపములుగ నూడలు దిగె ననుట), వృతులన్ = ఆవరణములయందు, (వెలుఁగుల వెదుళ్లు గానవచ్చె ననుట), ('వేణుమస్కరతేజసా' అనియును, 'ప్రాచీనం ప్రాంతతో వృతి' అనియు నిఘంటువులు) చేరెన్ = ప్రవేశించెను. స్వభృత=తమచేతఁ బోషింపఁబడిన, పరభృత = కోయిలలచేతను, వినుత = శ్లాఘింపఁబడిన, రసాల = తియ్యమామిళ్లయొక్క, పరిషత్ = గోష్ఠులయందు, అహరహః = దినదినమును, క్లృప్త = చేయఁబడిన, బహు = అనంతములగు, రహః = ఏకాంతములందలి, ప్రహర=జాములయందు, విహరమాణ = విహరించుచున్న, మానవతీ=ఈలువుటాండ్రయొక్క, పరిమ్లానిమ=హెచ్చైన బడలికను, అనివారి = మిక్కిలి నివారించుచున్న, వారిజవనగంధవాహము=కమలవనములమీఁదుగా వీచెడు వాయువు, ఒలసెన్ = విసరెను.

తా. మామిడితోఁటయందుఁ గోయిలలు చిగుళ్ళకొఱకు గుంపులు గూడి కూయుచుండఁగా నవి యనియెడు గడియారములచేతఁ బ్రొద్దులు గడపుచు స్త్రీ లుండఁగా వారి బడలికలు వాయువులు దీర్చును. కడమ సుగమము. యథాసంఖ్యము. పర్యాయాలంకారము : 'పర్యాయో యది పర్యాయేణైకస్యానేకవర్ణన' మ్మని దానిలక్షణము. స్వభావోక్తియు.

ఉ. సారెకుఁ గీరము ల్ఫలరసాలముశాఖలలోనఁ ద్రిమ్మరం
గా రహిఁ దన్మధూళికకుఁ గా నళిపఙ్క్తులు వెంటఁ గ్రుమ్మరం
గా రొదమించె నందుఁ జిలుక ల్వనలక్ష్మియుఁ దద్వచస్సుధాం
ధోరుచు లానఁగా సరిపఁణు ల్జనుల ల్లిడి పెంపఁగా బలెన్. 140

టీ. సారెకున్ = మాటిమాటికి, కీరముల్ = చిలుకలు, ఫల = పండియున్న, రసాలము = తియ్యమామిడియొక్క, శాఖలలోనన్ = కొమ్మలలోపల, త్రిమ్మరంగాన్ =

సంచరించుచుండఁగా, రతిన్ = శృంగారమును, తన్మధూళికలఁగాన్-తత్ = ఆఫలముల యొక్క, మధూళికలఁగాన్ = రసధారలఁగాను, అళిపఙ్క్తులు = తేఁటిచాళ్లు, వెంటన్ = చిలుకలవెంట, భ్రమరంగాన్ = తిరుగఁగా, అందున్ = ఆవనమందు, వనలక్ష్మియున్ = వనదేవతయును, తద్వచస్సుధాంధోరుచులు - తత్ = ఆచిలుకలయొక్క, వచః = పలుకు లనెడు, సుధాంధః = అమృతరూప మగునన్నముయొక్క, రుచులు = చవులను, అనఁగాన్ = ఆస్వాదించుటకై, జనులట్ల = భూప్రజలవలెనే, సరిపణల్ = గొలుసులను, ఇడి = ఉనిచి, చిలుకల్ = చిలుకలను, పెంపఁగాబలెన్ = పెనుచుచున్నట్లు, రొద = ధ్వని, మించెన్ = అతిశయించెను.

తా. పాడిన తియ్యమామిడి కొమ్మలలోఁ దిరుగుచున్న చిలుకల వెంబడి తుమ్మెదలు మెసలఁగా నవి సరిపణులవలె నుండెఁ గావున, వనలక్ష్మియుఁ జిలుకలపలుకులు విని యల్లరుటకై మనుష్యులవలెనే చిలుకలకు గొలుసులు వేసి పెనుచుచున్న ట్లుండఁగాఁ జిలుకలు రొదసేసెను.

సీ. ప్రతిహంతృతాత్తకీటత చన్న భృంగసం
ఘపుటంగములచేతఁ గాయమెత్తి
యమదిశాగత మరుత్ప్రాణియై [1]దదళిరం
గస్థలాబ్జినిఁ దమ్మికన్ను దెఱచి
ప్రాంతఫుల్లామ్ర సంశ్రయి తచ్ఛటాహాతా
ద్గతి లేచి చెలిఁ జైత్రుఁ గౌఁగిలించి
యురు పరాగపుఁగోటి నుద్దండ వాప్యుత్ప
లస్రవత్సీధు రత్యస్ర ముడిపి
తే. క్రమ్మఱఁ బలాశ కటకాముఖమునఁ గీర
చలితశాఖాస్ఫుటాశోకశరముఁ గూర్చెఁ
దద్రతికిఁ గాఁగఁ జలికాలఁ దన్ని మంచు
పాండురాంగుండు విడిచిపోఁ బ్రదికి మరుఁడు. 141

టీ. మరుఁడు = మన్మథుఁడు, వ్ర...త - వ్రతి = వ్రతములు గలవారియొక్క, హంతృతా = హత్యచేతను, ఆత్త = సంభవించిన, కీటత = పురుగగుట, చన్నన్ = పోఁగా, భృం...తన్ - భృంగసంఘపు = తేఁటిగుంపు లనెడు, అంగములచేతన్ = అవయవముల చేత, కాయమెత్తి = (తాను) దేహమెత్తి, (సన్న్యాసులను జంపుటచేతఁ బురుగు జన్మము

1. వికచరంగత్స్థలా; కదళిరంగస్థలా.

వచ్చెననుట), య...ణి-ఐ యమ = యమునియొక్క, దిశా = దిక్కువలన, ఆగత = వచ్చినట్టి, మరుత్ = వాయువుచేత, ప్రాణి ఐ=ప్రాణములుగలవాఁడై, త...నిక్ - తదళి = మున్నుచెప్పఁబడిన తుమ్మెదలకు, రంగస్థల = నృత్తస్థలమైన, అబ్జినిక్=కమలలత యందు, తమ్మి = తామరయనియెడు, కన్ను = నేత్రమును, తెఱచి = విచ్చి, (అందఱ ప్రాణములు దీయువాఁడు యముఁడు మరల నీ మరుని ప్రాణములను బంపె ననుట, పుట్టినపిదప శిశువు గన్నుదెఱచు ననుట), ప్రాం...లిక్ - ప్రాంత = సమీపమందలి, ఫుల్ల = పుష్పించిన, ఆమ్ర=మామిడిచెట్టును, సంశ్రయ = ఆశ్రయించినట్టియు, తచ్ఛటా-తత్ = ఆతుమ్మెదలయొక్క, ఛటా=సమూహముయొక్క, హాతాద్గలిక్ = అల వాకచేతను, లేచి = ఉద్గమించి, చెలిక్=స్నేహితుఁడైన, చైత్రుక్=వసంతమాసమును, కౌఁగిలించి = ఆలింగనముచేసికొని, (ఎడఁబాసి యాపదఁజెందినవారు తమచెలినిఁ జూడఁ గానే కౌఁగిలించుకొనుట ప్రసిద్ధము), ఉ...టిక్ - ఉరు = విస్తారమగు, పరాగపు = పుప్పొడిరూపమగు, శాటిక్ = వస్త్రముచేత, ఉద్దండ = అధికమగు, వాపి=డిగ్గియయం దలి, ఉత్పల = కలువపువ్వువలన, స్రవత్=జాఱుచున్న, సీధు = మకరంద మనియెడు, రత్యస్రము-రతి=తనభార్యయగు రతీదేవియొక్క, అస్రము = కన్నీటిని, ఉడిపి=తుడిచి, (తన విరహముచేత రతీదేవి దుఃఖించుచుండఁగా మరల నుదయించి యాయమకన్నీరు దుడిచె ననుట), క్రమ్మఱక్=మరలను, ప...నక్-పలాశ=మోదుగుఁబువ్వనియెడు, కటకాముఖమునక్=కటకాముఖమనుహస్తమందు, ('తర్జనీమధ్యమామధ్యే పుంఖాంగుష్ఠేనపీడ్యతే, యస్మిన్నసామికాయోగాత్ సహస్తః కటకాముఖమ్' అనితల్లక్షణము.) కీ...ముక్-కీర=చిలుకచేత, చలిత = కదలింపఁబడిన, శాఖా=కొమ్మయందు, స్ఫుట=వికసించిన, అశోక = అశోక పుష్పమనియెడు, శరముక్=బాణమునకు, కూర్చెక్=సంధించెను, మ...డు - మంచు = శిశిరర్తువనియెడు, పాండురాంగుండు=తెల్లనిశరీరముగల శివుఁడు, తద్రతికిఁ గాఁగక్ = ఆట్టిరతీదేవికొఱకు, చలికాలక్=చలియనుపాదముచేత, తన్ని = తాఁచి, విడిచి = ఇతనినంతట విసర్జించి, పోక్ = పోఁగా, బ్రదికి=జీవించి, కూర్చెననుదానితో నన్వయము. చలికాల మనియెడు శివుఁ డీ మన్మథునిం దుదముట్టఁ జంపక, కాలఁ దన్ని రతీదేవియందుఁ గరుణించి, యామెకై వీనిని విడిచెఁ గావున (బ్రైఁ జెప్పినట్లు బ్రదికి యిట్లాయె ననుట.) రూపకాలంకారము.

చ. చిగురుఁ బికాళికి న్స్థలముఁ(జిల్కలగుంపునకు న్మధూళిఁ దేఁ
టగమికిఁ దావి గాలికి విటవిటకోటికిఁ బువ్వులుం దలం
బుగఁ గృప నీనియు న్సురభిఁపుంస్త్వముఁ బాంథులచోటఁ బూనె స
ట్లగుఁ బ్రజ కోర్కులిచ్చుతన కాత్మఁ దలంచిన దబ్బదే యనన్.

టీ. సురభి = వసంతర్తువు, (కామధేనువు ననియుం జెప్పఁదగు), పికాళికిన్ = కోయిలచాలునకు, చిగురు = పల్లవమును, చిల్కలగుంపునకున్ = శుకసమూహమునకు, ఫలమున్ = పండును, తేఁటిగమికిన్ = భృంగచయమునకు, మధూళిన్=మధుధారను, గాలికిన్ = మలయమారుతమునకు, తావిన్ = పరిమళమును, విటీవిటకోటికిన్=కామినీకమనసముదాయమునకు, పువ్వులున్ = పుష్పములును, దలంబుగన్ = దట్టముగా, కృపన్ = దయచేత, ఈనియున్ = ఇచ్చియును, (ఈనుట స్త్రీధర్మముగనుక నది గలిగియు నని పుంస్త్వవిరోధము), అట్లగున్=ఆరీతి యగును, ప్ర...బు.ప్రజ=జనము యొక్క, కోర్కులు = కామితములను, ఇచ్చు = ఒసఁగునట్టి, తనకున్, ఆత్మన్=బుద్ధియందు, తలంచినది = ఊహించినది, అబ్బదే=లభింపదా, అనన్=అనునట్లు, పాంథులచోటన్ = విరహులవిషయమున, పుంస్త్వమున్=మగతనమును, పూనెన్=వహించెను, (విరహులనుమాత్రము బాధించె ననుట).

తా. సురభి యనఁగా వసంతర్తువును గామధేనువునుగాన, నది స్త్రీవ్యక్తియైన నందఱకుఁ గోరిక లిచ్చునట్టి సామర్థ్యము గలిగి యున్న తనకు ఆమగతనము గోరినచో రాదా యనునట్లు పుంస్త్వముం దాల్చెను. కావ్యార్థాపత్త్యంగముగఁ గల్గినయుల్లేఖాలంకారము.

సీ. సహకార ఫలరస । సౌరభ్యములఁ గూడి
మాధ్వీ మోవులఁ గదంబముగ వలవ
మలయజోదరత జంబీఫల ఫలత్వగ్గత
శ్రీ మించుచెవులఁ గోజ్జెఁగలు మెఱయ
శశి కదళీదరచ్ఛదపుఁ బావడలూరు
చకచకఁ బట్టి పాలికిఁ బెనంగఁ
ద్రాక్షతేంట్లకుఁ గాఁక । లెక్కింపఁ జెరివిన
గంధఫలీ పఙ్క్తిఁ । గబరు లలరఁ
తే. [1]గేలఁ గలవంటకపుఁదావికిని బులిమిన
ఘుసృణములు మించ ననలఁ జే । రెసఁగెడు వన
ములు నమేరురజోవృష్టి । బూదిఁ జఱవ
నింతు లెనసిరి పూఁబొదరిండ్లఁ బతుల. 143

1. గేలుగల వంటకపుఁ దావికిని బులిమిన, ఘుసృణమును మించు ననల చేరెసఁగుఁ బవనములు నమేరు రజోవృష్టి బూద సరవ.

టీ. స...ల్ - సహకారఫల = తియ్యమామిడిపండ్లయొక్క, రస=రసముయొక్క, సౌరభ్యములన్ = పరిమళములను, కూడి = కలిసికొని, మాధ్వి = తేనె, మోవులన్ = వాతెఱలయందు, కదంబముగన్ = కలపముగా, వలవన్ = పరిమళింపఁగా, (మామిడి పండ్లరసమును మద్యమును స్త్రీలు గ్రోలుదు రనుట), మ...తన్-మలయజ=చందనము, ఉదరతన్ = లోపలఁగల్గియుండుటచేత, జం...శ్రీన్ - జంభలఫల = దూదినిమ్మపండ్ల యొక్క, త్వక్ = చెక్కులను, గత = పొందిన, శ్రీ=కాంతివంటికాంతిచేత, మించు= అతిశయించుచున్న, చెవులన్ = శ్రోత్రములయందు, గొజ్జఁగలు = గొజ్జఁగపూలు, మెఱయన్ = ప్రకాశింపఁగా, (స్త్రీలు గొజ్జఁగపూలను కర్ణభూషణములుగా నునిచికొని రనుట), క...లు-కళికదళ = కర్పూరపుటరఁటిచెట్టుయొక్క, ఉదర = గర్భమందలి ఛదపు = మోవువంటి, పావడలు = అంగదట్టములు, ప్రావారములు, ఊ...తన్ - ఊరు = తొడలయందలి, చకచకన్ = మెఱసెడుకాంతిని, పట్టి = అవలంబించి, పాలికిఁ బెనంగన్ = భాగమునకుఁ బెనఁగులాడఁగా, (లేఁత యరఁటిమోవులవంటి పావడలు గట్టుకొని రనుట), త్రొ...కున్-త్రొక్కు = (వాసనలకై తమతలలు) త్రొక్కుచున్న, తేంట్లకున్ = తుమ్మెదలకు, కాఁకలు = తాపములను, ఎక్కింపన్ = అతిశయింపఁజేయు టకు, చె...త్రిన్-చెఱివిన = తుఱిమినట్టి, గంధఫలీపఙ్క్తిన్ = సంపెఁగపూలచాలుచేత, కబరులు = కొమ్ముడులు, అలరన్ = ప్రకాశింపఁగా, (తమ తలలమీఁద వ్రాలుచున్న తేఁటులకోటుకడి వానికి భయముకొఱకు సంపెఁగపూలు దుఱిమి రనుట), కేలన్ = హస్తమందు, క...కిన్-కలవంటకపు = చిత్రాన్నములయొక్క, తావికిన్ = పరిమళము పోవుటకుగాను, పు...లు - పులిమిన = పూసికొనియున్న, ఘుసృణములు = కుంకుమపుఁ బూఁతలు, మించన్ = అతిశయింపఁగా, [శర్కరాన్నము (చక్కెరపొంగలి) మొదలగు కలవంటకములను భుజింపఁగా నావాసన తెలియకుండుటకుఁ జేతులయందుఁ గుంకుమ పూవుఁ జేర్చి రనుట], ననలన్ = పుష్పములచేత, పే...లు - పేరెసఁగెడు = మిక్కిలి యొప్పుచున్న, వనములు = తోఁటలు, న...ష్టిన్ - నమేరు = సురపొన్నలయొక్క, రజః = పుష్పొడులయొక్క, వృష్టిన్ = కురియుటచేత, బూదిన్ = ధూళిని, (దుమ్ము ననుట), చఱవన్ = పూయుచుండఁగా, (స్త్రీలమీఁదఁ బుప్పొడులు రాలుచుండు ననుట) ఇంతులు = యువతులు, పూఁబొదరిండ్లన్ = పూచిన నికుంజములయందు, పతులన్ = తమనాథులను, ఎనసిరి = పొందిరి.

తా. స్త్రీలు లెస్సగా నలంకరించుకొని నికుంజగృహములయందుఁ దమ నాథులతోఁ గ్రీడించిరి. స్వభావోక్తి - ఉపమయంగము.

వ. అట్టి వసంత సమయంబున.

ఉ. కామిని మేఘరంజి మధుగర్వ మడంతు నటంచు లో నిజ
క్షేమముఁ గోరి పాడి మణిచిత్రమరుత్తృణతాచిరద్యుతి
స్తోమవలాహకావళులు తోఁచి ప్రఫుల్లకదంబకేతకో
ద్దామ సమీరణాహతులఁదాపము నీ నొరగు న్విచేష్టతన్. 145

టీ. కామిని = చూడికుడుత్తనాచ్చియారు, మధుగర్వము - మధు = వసంతర్తువు యొక్క, గర్వము = క్రొవ్వును, అడంతు నటంచున్ = అడఁచెద నని, లోన్ = అంతరంగమందు, నిజక్షేమమున్ = తనక్షేమమును, కోరి = అపేక్షించి, మేఘరంజిన్ = మేఘరంజి యనియెడురాగమును, పాడి = గానముచేసి, మ...లు - మణి = మణిమయమైనట్టియు, చిత్ర = నానావర్ణములుగల, మరుత్తృణత = దేవధనువు, అనఁగా నింద్రచాపమును, అచిరద్యుతి = మెఱుపులయొక్కయు, స్తోమ = సమూహముగల, వలాహక = మేఘములయొక్కయుఁ, బెగ్గురుపులుఁగులయొక్కయుఁ, ఆవళులు = పఙ్క్తులు, తోఁచి=కనఁబడి, ప్ర...లన్-ప్రఫుల్ల = వికసిల్లిన, కదంబ = కడిమిపూవులయొక్కయు, కేతక = గేదంగులయొక్కయు, ఉద్దామ = అధికమగు, సమీరణ = వాయువుయొక్క, ఆహతులన్ = వీచుటలచేత, తాపమున్ = సంతాపము, ఈన్ = కలుగఁజేయఁగా, విచేష్టతన్ = చేష్టలుడుగుటచేత, ఒరగున్ = సోలును, (ఇచట మూర్ఛారూపమయిన మన్మథావస్థ చెప్పఁబడినది.)

తా. వసంతర్తువు హెచ్చియుండుటచేత దానిమంద మడంతు నని తనక్షేమముఁ గోరి మేఘరంజిరాగము నా చూడికుడుత్తనాచ్చియా రాలాపముఁజేయఁగా, నంత మేఘోదయమై వెంటనే యాచిహ్నము లన్నియుఁ గల్గి యావర్షర్తువునందుఁ బుష్పించెడు కడిమి గేదఁగి పూలమీఁదుగా వాయువులు విసరుటవలన మిక్కిలి తాప మొదవఁగా, నాయమ చేష్టలు దక్కి మూర్ఛ మునిఁగెను. విషమాలంకారము.

తే. అతివ పూర్ణేందుభీతిఁ దదశ్మశాలఁ
దెండి యతఁ డందు నిఱుమడి తీండ్రఁ దోఁప
మింటి పయినుంట గా దని యింటిపైకిఁ
దెచ్చుకొంటి నటంచుఁ బెన్ ఱెచ్చు వెడలు. 146

టీ. అతివ=ఆయింతి, పూ...తిన్-పూర్ణేందు = నిండుచందురునివలన, భీతిన్ = భయముచేత, తదశ్మశాలన్ = ఆచంద్రకాంతశాలయందు, తెండి = పరుండి, (శయనించి యనుట), అతఁడు = ఆ చంద్రుఁడు, అందున్=ఆ చంద్రకాంతశాలయందు, ఇ...డ్రన్-ఇఱుమడి = ద్విగుణమయిన, తీండ్రన్ = వేండ్రములో, తోఁపన్ = కనఁబడఁగా, మింటిపయిన్ = ఆకసముమీఁద, ఉంట=ఉండుట, కా దని=కూడ దని, ఇంటి

పైకిన్=గృహముమీఁదికి, లెచ్చుకొంటికిన్, (ప్రతిబింబరూపముగా ననుట), అటంచున్ = అని, షెన్ టిచ్చున్ = మిక్కిలిచీఁదఱచేత, వెదలున్ = ఆ చంద్రకాంతశాలనుండి వెదలును. విషమాలంకార లలితాలంకారములు.

తే. భ్రమరగీతిక మాయ విపంచి మీఁట
దాన శ్రుతిఁగూడి మిగులఁ దద్రక్తి హెచ్చ
వే నివారించి లేచి దైవికము నెదుట
యుక్తులు ఫలింప వనుచు బిట్టూర్చి నవ్వు. 147

టీ. ఆదేవి, భ్ర...క-భ్రమర = తేఁటులయొక్క, గీతిక = పాట, మాయన్ = మాయఁటకు, (వినరాకుండుట కనుట) విపంచిన్=వీణను, మీటన్ = వాయింపఁగా, దానన్=ఆమీటుటచేత, శ్రుతిన్ = సుతియందు, కూడి = కలిసికొని, మిగులన్=అధికముగా, తద్రక్తి=ఆ భృంగగానానురక్తి, హెచ్చన్=అతిశయింపఁగా, వే=వేగముగాను, నివారించి = చాలించి, లేచి, దైవికమునెదుటన్=దైవయత్నముముందఱ, యుక్తులు=మనయుక్తులు, ఫలింప వనుచున్ = తుదముట్టవని, బిట్టూర్చి = పెద్దనిట్టూర్పు విడిచి, నవ్వున్ = హాసించును, (పూర్వపద్యమున నున్న యతివ యను కర్తృపదమున కనువృత్తి చేసికోవలయును). విషమాలంకారము.

తే. వెలఁది కతితాపదం బయ్యె నిరులపాన్పు
మును దదంఘ్రిహతాది భర్త్సనలు కన్న
తరులఁ బొడమిన వ్రూఱట దన కొసఁగునె
పొంచి తఱివేచి మిగుల నొప్పించుఁగాక. 148

టీ. వెలఁదికిన్=ఆయింతికి, విరులపాన్పు=పుష్పశయ్య, అతితాపదంబయ్యెన్ = మిక్కిలితాపముచేసెను, మును = పూర్వము, త...లు - తదంఘ్రిహతాది - తత్ = ఆయమయొక్క, అంఘ్రిహత=కాలితన్నులే, ఆది=మొదలగు, భర్త్సనలు = తిరస్కారములను, క...లన్ - కన్న = పొందిన, తరులన్ = వృక్షములయందు, పొడమినవి = పుట్టినయాపువ్వులు, పొంచి=వంచించి, తఱివేచి=సమయముఁగనిపెట్టి, మిగులన్ = అధికముగా, నొప్పించుఁగాక = నొప్పిగలుగఁజేయునేకాక, తనకున్, ఊఱట = సుఖమును, ఒసగునె=ఇచ్చునా, (ఇయ్య వనుట.) అనఁగా, దోహదములయందు, తనచే ('అశోకశ్చరణాహత్యా వకుళో ముఖసీధునా' అన్నట్లు, పాదతాడనాదులగు తిరస్కారములఁజెందిన యశోకవృక్షము మొదలగునవి సుఖము నీయ వనుట.) విషమము, ఉత్ప్రేక్ష.

శా. పూజాదంభమునన్ బరాకుమెయి మున్పూఁబోఁడి నేర్పూఁది చే
తోజాతానల మార్ప శాస్త్రసరణిన్ దూలి న్హరి న్వ్రాసి ల
జ్జాజాడ్యాకులదృష్టిఁ బ్రత్యవయవేక్షం జేయుచోఁ వెండి వ
క్షోజాగ్రద్రమఁ గాంచి తల్లడిలు నీసు న్దాపమున్ మీఱఁగన్.149

టీ. పూఁబోఁడి = ఆవనిత, పూజాదంభమునన్=పూజ యనెడు వ్యాజముచేత, పరాకుమెయిన్ = హెచ్చరికలేనియట్లు, మున్ = మొదలను, నేర్పు=సామర్థ్యమును, ఊఁది=అవలంబించి, చేతోజాతానలము = మన్మథాగ్నిని, ఆర్పన్ = మాన్చుటకు, శాస్త్రసరణిన్=శాస్త్రమార్గముచేత, తూలిన్ = తూలికచేత, హరిన్ = శ్రియఃపతిని, వ్రాసి=లిఖించి, ల...ష్టిన్ - లజ్జా=సిగ్గు చేతనయిన, జాడ్య=జడభావముచేత, ఆకుల = వ్యాకుల మగు, దృష్టిన్=చూడ్కిచేత, ప్రత్యవయవ = ప్రతియవయవముయొక్క, ఈక్షన్=చూచుటను, చేయుచోన్ = ఒనర్చునెడ, వెండి = మరల, వ...మన్ - వక్షః=ఆస్వామివక్షస్స్థలమందు, జాగ్రత్=విలసిల్లుచున్న, రమన్ = శ్రీదేవిని, కాంచి = చూచి, ఈసున్ = (సపత్నీభావమున నగు) నీర్ష్యయును, (ఇది యీర్ష్యాశబ్దభవము,) తాపమున్ = సంతాపమును, మీఱఁగన్=అతిశయింపఁగా, తల్లడిలున్=పరితపించును.

తా. ఆ లేమ తనవిరహ మార్పఁ దలంచి శాస్త్రోక్త మార్గముగా వక్షస్స్థలమందు శ్రీదేవి గలుగునట్లు, స్వామియొక్క రూపమును బూజావ్యాజముచేతఁ బరాకుగాఁ జిత్తరువునందుఁ గలముతో వ్రాసి, పిమ్మట లజ్జనొంది, యాస్వామియొక్క ప్రత్యవయవ సౌష్ఠవమును జూచుచున్నప్పుడు వక్షస్స్థలమందుఁ దాను వ్రాసిన లక్ష్మీదేవిని చూచి, తన సవతి యగుట నీసును దాపము నతిశయింపఁ దల్లడిల్లుచుండును. కైతవాపహ్నవ మంగ మగు విషమాలంకారము.

చ. కుముదసరస్తటస్ఫటికకూలవనోత్పలశయ్య వ్రాలి పూ
ర్ణిమలఁ బికాళి కుట్టుసుఱు ద్రిక్కఁగ ధర్మపుదార వట్టు శే
షము రెయి మల్లికాళిరుతి సక్కఁగఁ జేయక యుండ నిల్పు నా
యమ మఱునాటికిం గలుగ నాంతగళచ్ఛ్రుతిగుంభితాశ్రువుల్.150

టీ. కుము...య్యన్. కుముదసరః=వెలిగలువడిగ్గియయొక్క, తట = దరియందలి, స్ఫటిక = స్ఫటికమణివికార మగు, కూల = తీరమందలి, వన=ఉద్యానమందు, ఉత్పల శయ్యన్=కలువపూలపాన్పునందు, వ్రాలి = సోరఁగి, పూర్ణిమలన్ = పున్నమలయందు, పికాళిన్=కోయిలగుంపుచేత, కుట్టుసుఱు=కొఱప్రాణము, త్రిక్కఁగన్=మిగులునట్లు, ధర్మపుదార=ధర్మోదకధారను, ప...ము - పట్టు=గ్రహించునట్టి, శేషము=మిగిలియున్నదాని,

రేయి=రాత్రియందు, మ...లి-మల్లికా=మల్లెపూలయందలి, అళి = తుమ్మెదలయొక్క, రుతి = ధ్వని, చక్కఁగఁజేయకయుండఁగ = కడతేర్పకుండునట్లు, ఆయమ = ఆమె, మఱునాఁటికిఁ = మఱుచటిదినమునకు, కలుగఁ = ఉండుటకు, నా...ల్-శాంత = అనంతముగ, గళత్=జాఱుచున్న, శ్రుతి=చెవులయందు, గుంభిత=నింపఁబడిన, అశ్రుపుల్ = కన్నీళ్లు, నిల్పఁగ = నిలుచునట్లుసేయును.

తా. ఆమె పున్నమలయందుఁ దెల్ల కలువ డిగ్గియ దరులయందు స్ఫటికమయ తీరములయందుఁ గలువపూసెజ్జయందు మేను వైచి యుండఁగాఁ, బగలు కోయిల గుంపులు ప్రాణమానములను క్షీణింపఁ జేయుచుండఁగా, వానిని యాచించి ధర్మోదకధారం బట్టి కొంచెము మిగులఁ జేసికొనఁగా, సామిగిలిన దానిని రాత్రియందు మల్లెపూవులపైఁదిరిగెడు తేఁటుల మ్రోఁత నిరవశేషముఁ జేయకుండ రెండవనాఁటికుండుటకై చెవుల నిండఁ గన్నీరు నించును. అనఁగా నామ్రోఁత వినకుండ నా నీ రడ్డపడు ననియుఁ, దుఃఖించు చున్నప్పుడు నేత్రకోణములనుండి జాఱిన యశ్రువులు వీనులు నిండె ననియు భావము. ఇచట నామెకు సాత్త్వికభావము చెప్పఁబడెను (తే 'సత్త్వమన మనోవృత్తితజ్జంబులైన, భావములు సాత్త్వికము లష్టభావితములు.' 'స్తంభరోమాంచ బాష్ప వైస్వర్యకంప, వలయ వైవర్ణ్యమూర్ఛ సంజ్ఞలఁ దనర్చి' అని దాని లక్షణము.) అతిశయోక్తి.

తే. నెలఁతఁ గుచకుంభయుగళ ముండియు వియోగ
జలధి నీఁదింప లేదయ్యెఁ సఖులు వంచు
చున్న పన్నీటివెల్లి లోఁగొన్నకతన
ముంప కది లాఘవమునఁ దేలింపఁగలదె. 151

టీ. కుచకుంభయుగళము-కుచ = పాలిండ్లనియెడు, కుంభ = కుంభములయొక్క, యుగళము=ద్వంద్వము, ఉండియుఁ = కలిగియు, నెలఁతన్ = ఆ కోమలిని, వియోగ జలధిన్ = విరహసముద్రమును, ఈఁదింపలేదయ్యెన్ = ఈఁదఁ జేయలేకపోయెను, సఖులు=ఆమె చెలులు, వ...న్-వంచుచున్న = కుమ్మరించుచున్న, పన్నీటివెల్లిన్ = పన్నీటి ప్రవాహమును, లోఁగొన్నకతనన్ = ముంచిన హేతువుచేత, అది=ఆ కుంభ యుగము, ముంపక = వియోగసముద్రమున మునుఁగఁజేయక, లాఘవమునన్=తేలికగా, తేలింపఁగలదే=తేలఁజేయఁగలదా (లే దనుట.) రూపకోత్థాపితవిశేషోక్తి, కావ్యలింగము.

తా. ఆమెకుఁ దాపోపశమనముకొఱకుఁ జెలులు పన్నీ రమితముగా వంచు చున్నను దానిచేతనైనను దాపము దీఱక యది యొక సముద్రప్రాయమై యుండెను.

ఉ. చంచలనేత్ర దాల్చు జలజాతమృణాలసరంబు వేగ స
ల్లించినఁ బాఱుతెంచి కబళించి తదూష్మకు నంగలార్చు రా

యంచకుచేష్టఁ గాంచి యిఁకనైనను గందుమొ యంచు మోమె వీ
క్షించినఁ దోఁచు లేనగవు సేరుచు బోంట్లకొకింత ప్రాణముల్. 152

టీ. చంచలనేత్ర=ఆచంచలాక్షి, తా...ఖుర్ - తాల్చు = ధరించిన, జలజాత మృణాల = తామరతూఁడులయొక్క, సరంబుర్ = మాలికను, వేగర్ = తెల్లవాఱఁగానే, సళ్లించినర్=సడలించి యావలవేయఁగా, పాఱుతెంచి=పరువెత్తివచ్చి, కబళించి=మ్రింగి, తదూష్మకుర్ - తత్ = ఆబిసనాళసంబంధియగు, ఊష్మకుర్ = (శరీరస్పర్శచేతనైన) వేఁడిమికి, అం...ష్టర్ - అంగలార్చు = వగర్చుచున్న, రాయంచ = రాజహంసయొక్క, కుచేష్టర్=వెట్టిచేష్టను, కాంచి = చూచి, ఇఁకనైనను = ఇఁకనేనియు, కందుమొ యంచుర్=నవ్వును కాంతుమేమో యని, మోమె=ఆమె ముఖమునే, వీక్షించినర్ = తాము చూడఁగా, తో...వు - తోఁచు=అగపడిన, లేనగవు = ఆమెయొక్క చిఱునగవు, బోంట్లకుర్ = చెలులకు, ఒకింత = ఇంచుకంత, ప్రాణముర్, చేరుచుర్ = ఒడఁగూర్చును.

తా. ఆమె తాపోపశమనార్థమై తామరతూఁడులసరములు ధరించి యుండి మఱునాఁడు తెల్లవాఱినవెనుక నవి పీడఁదీసి పాఱవైచిన, నప టి పెంపుడు హంస వచ్చి యామృణాళమును గబళించి వెంటనే (యవి యామె విరహతాపముచేత వేఁడిమియెక్కియున్నవి గావున నాహంసకు గొంతులోఁ గనరెత్తఁగానే), ఉమియుచు నంగలార్చుచుండెఁ, గావున నావింతఁ జూచియైన నీయమ నవ్వునా యని యామె మోమే చూచుచుండఁగా నామె నవ్వెను. ఆచిఱునగవు వలనఁ జెలులకుఁ బ్రాణము వచ్చి ధైర్యము గలిగెను. (ప్రాణసంశయము గలిగినప్పుడు నవ్వు వచ్చెనేని బ్రదుకుట ప్రసిద్ధము) చంచల వీక్షించినర్ - అతిశయోక్తి - తోఁచు...ప్రాణముర్ - స్వభావోక్తి.

ఉ. శ్రీపతిమీఁది గీతముల ప్రేమ విపంచిక నంటఁ బాఁడిసం
తాపము పోఁక పెట్టుమయికనంబు కరంగిన డించి పాడు నా
లాపినిఁ దాఁచె పెన్నెమటకల న్నతి తంత్రులు [1]జజ్జురోఁ గలా
లాపిని దాన పాడుసు గళంబును గద్గదమైన మ్రాన్పడున్. 153

టీ. కలాలాపిని - కల = అవ్యక్తమధురములగు, ఆలాపిని = ఆలాపములుగల యామంజుభాషిణి శ్రీ...మన్ - శ్రీపతిమీఁది=శ్రియఃపతిమీఁది, గీతముల=గీతములయందలి, ప్రేమన్=ప్రేముడిచేత, విపంచికర్ = వీణను, అంటర్ = స్పృశింపఁగానే,

1. జబ్బుగా, జల్వగా- పా. లు. జబ్బు అనుటకు భస్మమగు అని పూ. ము. అర్థము. జజ్వగా-నానిజజ్వపడఁగా-అని పూర్వతరముద్రణము.

పాణిసంతాపము=విరహముచేతనైన చేతులవేఁడిమి, సోఁకి = తగిలి, మెట్లమయినంబు= వీణమెట్లకువేసియున్న మైనము, కరంగినన్ = కరఁగిపోఁగా, డించి = ఆవీణను దించి, ఆలాపినిన్=తంబురాను, తాల్చి = ధరించి, పాడున్ = గానముచేయును, మఱి=పిమ్మటను, పెన్నెమటలన్=ఆయాసమువలనఁగలిగిన యెక్కుడు చెమ్మటలచేతను, తంత్రులు= తంబురాతంతులు, జబ్బు కాన్ = భస్మముకాఁగా, తాన = తానే, పాడును = గాత్రమునఁబాడును, గళంబును=కంఠమును, గద్గదమైనన్=డగ్గుత్తికపడఁగా, మ్రాన్పడున్ = చేష్టయుడుగును, (నానాఁటికి విరహ మధికమాయె ననుట), ఇవియుం సాత్త్వికభావములే. విషమాలంకారము.

తే. ప్రతికుసుమతల్పమునఁ జాఱిపడిన తప్త
వలయ మలినాంకయుగము వర్తులతఁ బొలిచెఁ
జూడ నిఁక మానధైర్యము లుసున్న లనుచు
సుదతి బోంట్లకుఁ ద్రప వ్రాసి చూపె ననఁగ. 154

టీ. సుదతి = మంచిపలువరుసగల యోయువిద, చూడన్ = ఆలోచింపఁగా, ఇఁకన్=భావికాలమందు, మానధైర్యముల్=మానమును దాలిమియు, సున్నలనుచున్= పూజ్యము లని, (లే వనుట), త్రపన్=సిగ్గుచేత, బోంట్లకున్=చెలులకు, వ్రాసి చూపె ననఁగన్=లిఖించి కనుపఱిచె ననునట్లు, ప్రతికుసుమతల్పమునన్ = అన్ని పూలపాన్పు లందును, జా...ము-జాఱిపడిన = కృశత్వముచేత వీడిపడిన, తప్త = శరీరతాపముచేతఁ దపింపఁబడిన, వలయ = కంకణములయొక్క, మలిన = నల్లపడిన, అంక = చిహ్నముల యొక్క, యుగము=ద్వంద్వము, వర్తులతన్=వట్రువగుటచేత, పొలిచెన్ = ఒప్పెను.

తా. పూలపాన్పులు శరీరతాపముచేత వాడిపోవుచుండఁగా, వేఱువేఱ మరలఁ బఱచుచుండఁగా, నట్టి యన్నిపాన్పులందును జాఱిపడిన కంకణద్వయముయొక్క మలినములగు గుండ్రని గుఱుతులు సుదతి తన కిఁకమీఁద మానధైర్యములు రెండును లే వని తాను సిగ్గుచేతఁ జెప్పలేక చెలులకుఁ దెలియునట్లు వ్రాసి చూపెనో యనునట్లు కనిపించెను. ఉత్ప్రేక్ష.

ఉ. ఆవనజాక్షి కాఁకఁ బొరలాడ నలంగిన సొమ్ముఁ జీరలున్
వేసిన నూడ్చి యూడ్చి మఱి వేఱ వహించుట వారక్లప్తముల్
గా వనమాలిసేవయెడఁ గాంతు నొదుంగక కల్ల తెల్వితో
నే వలవంత దాఁగఁ జరియించిన డాఁగమిఁ జూచి నెవ్వగన్. 155

టీ. ఆవనజాక్షి = ఆపద్మాక్షి, కాఁకన్ = విరహతాపముచేత, పొరలాడన్ = పొరలఁగా, నలంగిన=క్షుణ్ణము లైనట్టి, సొమ్మున్ = భూషణమును, చీరలున్=వస్త్రము

లును, వేవినన్ = తెల్లవాఱఁగానే, ఊడ్చి యూడ్చి = పరిహరించి పరిహరించి, (అతిశయంబున ద్విరుక్తి.), మఱి=ఆవల, వేఱ=ప్రత్యేకమయినవాని, వహించుట = ధరించుటయే, వారక్షణముల్ కాన్ = అవసరనిర్ణీతము లగునట్లుగా, వనమాలిసేవయెడన్ = భగవత్సేవపట్టున, కాంక్షన్=ఆసక్తిచేత, ఒదుంగక = వెనుదీయక, కల్ల తెల్వితోనే = లేనితెలివితోడనే, వలవంత = విరహతాపము, దాఁగన్ = ప్రచ్ఛన్నమగునట్లు, చరియించినన్=సంచరించినను, డాఁగమిన్ = దాఁగకుండుటచేత, చూచి=వీక్షించి, (దీనికి వెనుకటిపద్యమున నున్న విష్ణుచిత్తుఁ డన్నది కర్తృపదము), నెవ్వగన్ = ఖేదముచేత, (ముందటిపద్యముతో నన్వయము.)

తా. ఆమె విరహాతిశయముచేతఁ బొరలి పొరలి నలఁగిన సొమ్ములును వలువలును వదలివదలి మరల ధరించుచు, నాదరించుట యనునది శృంగారముకొఱ కనునట్లు గనుపఱచి, భగవత్సేవయందుఁ గాంక్షమానక లేనితెలివిని దెచ్చుకొని, తన తాపము తెలియకుండునట్లు సంచరించిన, విరహము దాఁగక బయల్పడఁగాఁ జూచి విష్ణుచిత్తుఁడు ఖేదపడెను. యుక్త్యలంకారము.

క. పుత్త్రియుఁ దాఁ గామిని నొక
పుత్త్రియు నట్లుండుటకు నబుద్ధేక్షుధనుః
పత్త్రి యగు విష్ణుచిత్తుఁ డ
పత్త్రపలే కదియు నేతపంబో యనుచున్. 156

టీ. తాన్ = ఆవిష్ణుచిత్తుఁడు, పుత్త్రియున్ = పుత్త్రవంతుఁడును, కామిని = కాకుండుటచేతను, ఒక పుత్త్రియున్=తనయొక్క యొకకూఁతురును, అట్లుండుటకున్= ఆరీతిగ నుండుటకు, అబుద్ధేక్షుధనుఃపత్త్రి-అబుద్ధ = ఎఱుంగఁబడని, ఇక్షుధనుః = చెఱకు విల్తునియొక్క, పత్త్రి=ములుకులుగలవాఁడును, అగు విష్ణుచిత్తుఁడు=అగు నాపెరియాళు వారు, అపత్త్రపలేక = లజ్జలేక, అదియున్, ఏతపంబో = ఏమి తపస్సో, అనుచున్= అని యెంచుచు.

తా. ఆ విష్ణుచిత్తుఁ డెన్నఁడును మదన శరప్రహార మెఱుఁగనివాఁడు గావున నాయమకుఁ గల్గినది విరహ మని యెఱుఁగక యామె యట్లుండుటయు నొక తపమే యని తలఁచెను.

వ. తలపోసి దినదిన ప్రవర్ధమాన తనయాతనుగ్లాని కత్యంత దుఃఖితుం
డై తత్కారణం బెఱుంగక వల దని మౌగ్ధ్యంబున వారించి చూచి
యంతకంత కగలం బగుటకు గుడికిం జని పూజాంతిమ నమస్కార
కాంతరంబునఁ దన మనోనివేదనం బన్నగరివెన్నునకు విన్న
వింపం బునర్నమస్కృతిఁ జేసి. 'దేవా దేవరదాసి యగు మదీయ
పుత్త్రి యేమి గుఱించియో విచిత్రం బగు వ్రతచర్యం గాత్రశోషంబు

సేయుచున్నది, వలదన్న విన దపుత్త్రకుండ నగు నాకుఁ బుత్త్రియైనను బుత్త్రకుండైనను దాన యే నేమి సేయుదు, మఱి తన తపశ్చర్య తెఱుంగు మా తపశ్చర్య తెఱుంగు గాదు, ఏము భవద్దివస భవజ్జని దివస రాత్త్రులం దక్క గణరాత్త్రజాగరంబు లెఱుంగ, మేము బిసబీజాక్షవలయంబులు దక్క బిసవలయంబు లెఱుంగ, మేము ప్రసాద కుసుమంబుఁ జెవిఁ జెరువుటఁ దక్క నవి కప్పుకొన నందు శయనింప నెఱుంగ, మేము చెంబుల భవత్తీర్థంబు గ్రోలినఁ దానంగంబులు దడిపి కొను, నేము చాంద్రాయణంబులఁ జంద్రవృద్ధిబడిఁ గడి యెక్కించినఁ దా డించు, నేము నిదిధ్యాస నిశ్వాస నిరోధంబు సేసినం దాఁ దద్ధ్యానదశ వెలికి నిగుడించు, నేము చిన్ముద్రకై హృదయంబునం గేలు సేర్చినం దాఁ గిసలయోత్తరీయంబులు వహించు, నేము సితపక్ష నూత్నేందుఁ గీర్తించినం దాఁ బూర్ణేందు నుపాలంభించు, నిట్లుగాఁ బ్రవర్తిల్లు చున్నయది, యిది యేటితపం బున్మాదంబు గానోపు, నెంత భవదీయభక్తి గలిగిన మాదృశులకుఁ బ్రకృతి సంబంధంబు విడువ దంతర్యామిని నీ వెఱుంగని యది లేదు, దీని తెఱం గెఱింగింపవే' యనవుడు, ననుకంపాతిశయంబునఁ దచ్ఛాందసంబునకు మందస్మితంబు సేసి మందరధరుం డిట్లనియె. 15

టీ. తలపోసి = పైఁ జెప్పిన ట్లాలోచించి, ది...క్ - దినదినప్రవర్ధమాన = దానాఁటికి వృద్ధియగుచున్న, తనయా తనుగ్లానిక్ = కూఁతుయొక్క శరీర కృశత్వమునకు, అత్యంతదుఃఖితుం డై=మిక్కిలి దుఃఖించినవాఁడై, తత్కారణంబు=ఆ విరహహేతువును, ఎఱుంగక = తెలియక, వలదు అని, మౌగ్ధ్యంబునన్=మూఢభావముచేత, వారించి = నివారించి, చూచి, అంతకంతకున్ = అప్పటకప్పటికి, అగ్గలంబగుడున్ = విరహము దుస్సహము కాఁగా, గుడికిం జని = స్వామికోవెల కేగి, పూ......నన్ - పూజాంతిమ = పూజాంత్యమగు, నమస్కరణానంతరంబునన్ = నమస్కారమైన పిమ్మట, తన మనోనిర్వేదనంబు = తన మనఃఖేదమును, అన్నగరివెన్నునకున్=ఆ శ్రీవిల్లిపుత్తూరులోని మన్నారుస్వామికి, విన్నవింపన్ = విజ్ఞాపనము చేయుటకు, పునర్నమస్కృతిఁజేసి = మరల వెఱఁగి, దేవా=ఓ స్వామీ, దేవరదాసి యగు=దేవరవారి దాసురాలగు, మదీయపుత్త్రి = నాకూఁతురు, ఏమిగుఱించియో = ఏ ఫలమును గూర్చియో, (విరించిగుఱించి తపంబుసేసె నని భారతప్రయోగము. కలిమిఁజేసి యిది కర్మప్రవచనీయార్థక మగుదేశ్యపదము), విచిత్రంబగు = వింతయైన, వ్రతచర్యన్ = నియమాచరణముచేత, గాత్రశోషంబు = శరీరశోషణమును, చేయుచున్నది = కావించుచున్నది,

వల దన్న వినదు. అపుత్త్రకుండ నగునాకున్=పుత్త్రులులేని నాకు, పుత్త్రియైనను బుత్త్రకుండైనను తాన=కూఁతురేనియు గొడుకేనియుఁ దానే, ఏనేమి సేయుదున్ = నేనేమి యాచరింతును, మఱి = ఇంకను, తన తపశ్చర్య తెఱంగు = తాను దపముచేసెడు రీతి, మాతపశ్చర్య తెఱంగుకాదు, (విలక్షణతప మనుట), ఏము=మేము, భ...క్కన్-భవద్దివస=దేవరవారి దినముయొక్క, (హరివాసర మనుట), భవజ్జనిదివస = దేవరవార లవతరించిన జయంతుల దినములయొక్క, రాత్రులం దక్కన్ = రాత్రులయందేకాక, గ...లు - గణరాత్ర = పెక్కురాత్రులయందు, జాగరంబులు = నిద్రలేకుండుటలు, ఎఱుంగము (విరహాతిశయమున నామెకు రాత్రులయందు నిద్ర లే దనుట, ఈరీతిగానే ముందఱను తెలియఁదగును). ఏము బిసబీజాక్షవలయంబులు దక్క = మేము తామర పూసలమాలికలు దక్క, (ఇది భాగవతలక్షణము. 'యే కంఠలగ్నతులసీ నలినాక్షమాలా, యే బాహుమూలపరిచిహ్నితశంఖచక్రాః, యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుండ్రా, స్తే వైష్ణవా భువనమాశు పవిత్రయంతి' యని యున్నది.) బిసవలయంబు లెఱుఁగము = తామరతూఁడుల మాలిక లెఱుంగము (తాపోపశమనమున కామె ధరించె ననుట), ఏము ప్రసాదకుసుమంబుఁ జెవిఁ జెరువుటఁదక్క=మేము ప్రసాదలబ్ధమగుపూవుఁ గర్ణమందుఁ జెక్కుకొనుటేకాని, అవి గప్పుకొన నందు శయనింప నెఱుంగము = పూలు మేనఁ గప్పుకొనుటను బూలపైఁ బవ్వళించుట నెఱుంగము. (ఆమె యట్లుసేసె ననుట), ఏము చెంబులన్ భవతీర్థంబు గ్రోలినన్ = మేము పానపాత్రములచేత దేవరవారి యభిషేకతీర్థంబు పానముసేసినను, తా నంగంబులు దడిపికొనున్ = తాను శరీరము దడుపుకొనును, (తాపశాంతి కనుట), ఏము = మేము, చాంద్రాయణంబులన్ = చాంద్రాయణము లనియెడు వ్రతములయందు, చంద్రవృద్ధిబడిన్ = చందురు వృద్ధి వెంటను, కడియెక్కించినన్ = అన్నకబళము వృద్ధిఁజేసిన, తాన్ డించున్ = తాను తగ్గించును, (విరహాతిశయముచే ననుట), ఏము = మేము, నిదిధ్యాసనిశ్వాసనిరోధము సేసినన్ = బ్రహ్మధ్యానమందు యోగము నవలంబించి శ్వాస నిరోధింప, తాన్=తాను, తద్ధ్యానదశన్=ఆబ్రహ్మధ్యానదశయందు, వెలికి నిగుడించున్=బహిర్గతములఁజేయును, (తాపమోపలేక నిట్టూర్పు నిగుడించు ననుట), ఏము = మేము, చిన్ముద్రకై, హృదయంబునన్=ఎదయందు, కేలు = హస్తమును, చేర్చినన్=ఉంచిన, తాన్=తాను, కపోలంబునన్=చెక్కిటియందు, చేర్చున్ = ఉంచును, (చింతచేత ననుట), ఏము, వల్కలోత్తరీయంబులు = నారచీరలు, వహించినన్ = తాల్చిన, తాన్, కిసలయోత్తరీయంబులు=తలిరాకుఁజీరలు, వహించున్=ధరించును, (తాపశాంతి కనుట), ఏము, సితపక్షనూత్నేందున్=శుక్లపక్షంబునందలి క్రొన్నెలను కీర్తించినన్ = కొనియాడిన, తాన్, పూర్ణేందున్=నిండుచందురుని, ఉపాలంభించున్ = దూషించును. (ఉద్దీపకుఁ డగుటచేత ననుట), ఇట్లుగాన్ = ఈరీతిగా, ప్రవర్తిల్లుచున్నయది, ఇది యేటిఁపంబు,

ఉన్మాదంబు కానోపున్ = వెఱ్ఱియైయుండవచ్చును, ఎంత భవదీయభక్తి గలిగినన్ = మీయందు భక్తి యెంతయుండినను, మాదృశులకున్ = మావంటివారికి, ప్రకృతిసంబంధంబు = మాయాసంబంధము, (తన యాదిమమకార మనుట), విడువదు = వదలదు, అంతర్యామివి నీవెఱుంగనియది లేదు = సర్వాంతర్యామి వగు నీకుఁ దెలియనిది లేదు, దీని తెఱంగు = ఈపడుచు నడవడి, ఎఱింగింపవే = తెలియఁజేయవే, అనవుడున్ = అనఁగా, అనుకంపాతిశయంబునన్ = దయాతిశయముచేత, తచ్ఛాందసంబునకున్ = ఆవిష్ణుచిత్తుని వైదికత్వమునకు, మందస్మితంబుసేసి = చిఱునగవు నవ్వి, మందరధరుండు = గట్టుదాల్పువేల్పు, ఇట్లనియెన్ = ఈవక్ష్యమాణక్రమముగాఁ బలికెను.

ఆశ్వాసాంతము

ఉ. కంధరనీలవర్ణ ! మధుకైటభనాగసువర్ణ ! యోగిహృ
ద్గ్రంథిభిదోత్థభోగివనితాస్వనవచ్ఛ్వసనస్రవచ్ఛిర
స్సంధివసన్నిశాపతిరసస్రుతిదుగ్ధపయోధివీచికా
మంధరకేళికాదర ! సమాశ్రితపఙ్క్తిశిరోధిసోదరా ! 153

టీ. కం...ర్ణ - కంధర = జలధరమువలె, నీల = నల్లనైన, వర్ణ = మై వన్నెగలవాఁడా, మ...ర్ణ - మధుకైటభ = మధుకైటభ రాక్షసు లనెడు, నాగ = పాములకు, సువర్ణ = గరుత్మంతుఁడగువాఁడా, యోగి...దర - యోగి = అష్టాంగయోగములుగల మునులయొక్క, హృద్గ్రంథి = హృదయగ్రంథియొక్క, భిదా = భేదించుటచేత, ఉత్థ = ఎగసినట్టి, భోగివనితా = ఆఁడుబాముయొక్క, (కుండలినీశక్తి 'శక్తిః కుండలినీనామ బిసతంతునిభా శుభా' యని వామకేశ్వరమహాతంత్రము). స్వనవత్ = ధ్వనిగల్గిన, శ్వసన = నిట్టూర్పుచేత, స్రవత్ = స్రవించుచున్న, శిరస్సంధి = కపాలమందు, వసత్ = వసించుచున్న, నిశాపతిరస = అమృతముయొక్క, స్రుతి = స్రావ మనెడు, దుగ్ధపయోధి = పాలకడలియొక్క, వీచికా = అలలయొక్క, అమంధర = అలసముగాని, కేళికా = క్రీడయందు, ఆదర, ఆదరణముగలవాఁడా, సమాశ్రిత = ఆశ్రయించిన, పఙ్క్తిశిరోధి = పఙ్క్తికంఠుఁడగు రావణునియొక్క, సోదరా = తోఁబుట్టువగు విభీషణుఁడు గలవాఁడా!

[1] క. కరధృత దరారి వితరణ 159

(ఇది పూర్వాశ్వాసాంతమున వచ్చిన పద్యము గనుక నిక్కడ వ్రాయ లేదు.)

తోటకవృత్తము.

ద్రుహిణాండకరండకధూర్వహగ
ర్భ హరార్భకదర్భరపక్వతః

---

1. క. ప్రపదానిశసతిచర్యా, త్రిపదానన పర్యనాక దేవాద్యమర, ద్విపదాన వాహితోదిత, విపులాత్మ భవాభవారి విశ్రుతనామా !

కుహనార్భక వార్భృతశౌనిరిహా
రిహిరణ్మయహర్మ్యచరిష్ణుపదా. 160

టీ. ద్రు...ర్భ - ద్రుహిణాండకరండక = బ్రహ్మాండ కటాహములయొక్క, ధూర్వహ=భారము వహించిన, గర్భ=కడుపుగలవాఁడా, కు...క-కుమారార్భక=కుమార స్వామియొక్క, దుర్భర = భరింపఁగూడని, పక్వ = పరిపక్వమైన, తపః = తపముచేత, కుహనార్భక = కపటబాలుఁడవై యవతరించినవాఁడా, వా...దా-వార్భృతశౌనిరి - వాః = ఉదకములచేత, భృత=నిండిన, శౌనిః = స్వామి పుష్కరిణియందు, హారి = ఒప్పుచున్న, హిరణ్మయహర్మ్య = స్వర్ణమయ మంటపమందు, చరిష్ణు = సంచరించెడు, పదా = పాదములు గలవాఁడా.

మ. ఇది యంధ్రోక్తి యథార్థనామయవనాసృక్పూర్ణ కెంబావివా
రిదపద్ధత్యవరోధి వప్రవలయశ్రేణీవిఘాతక్రియా
స్పద సేనాగ్రద కృష్ణరాయమహిభృత్సంజ్ఞాస్మదాముక్తమా
ల్యద నాశ్వాసము పంచమం బమరు హృద్యంబైనపద్యంబులన్. 161

టీ. ఇది=ఈగ్రంథము, ఆంధ్రోక్తి = ఆంధ్రభాషచేత, యథార్థనామ=అన్వర్థ నామముగల, యవనాసృక్ = మ్లేచ్ఛరక్తముచేత, పూర్ణ = నింపఁబడిన, కెంబావి = కెంబావి యను పట్టణముయొక్క, (దీనికే యాంధ్రోక్తి యథార్థనామము), వారిద పద్ధతి = మేఘమార్గమును, అవరోధి=అడ్డగించుచున్న, వప్రవలయ = వలయములవంటి కోటలయొక్క, శ్రేణి=పఙ్క్తులయొక్క, విఘాత = పడఁగొట్టుటయొక్క, క్రియా= కార్యమునకు, ఆస్పద = కారణమగు, సేనా = దండునకు, అగ్రద=అగ్రేసరుఁడైన, కృష్ణరాయమహిభృత్సంజ్ఞ = కృష్ణరాయ భూపాలుఁ డను పేరు గల, అస్మత్ = నాయొక్క, ఆముక్తమాల్యదన్ = ఆముక్తమాల్యద ప్రబంధమునందు, హృద్యం బైన = మనోహరము లగునట్టి, పద్యంబులన్ = పద్యములచేతను, పంచమంబు = ఐద వది యగు, ఆశ్వాసము, అమరున్ = ఒప్పును.

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తి మంత్రోపాసనా సమాసాదితాఖండ సాహితీ ధురీణుండు నాత్రేయ గోత్ర పవిత్రుండును వావిళ్లవంశపయోరాశి రాకాసుధా కరుండునగు రామస్వామిశాస్త్రిచేత ననేక పూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యా లోచించి రచియింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యదావ్యాఖ్యానము నందుఁ బంచమాశ్వాసము.

శ్రీ ర స్తు

ఆ ము క్త మా ల్య ద

స వ్యా ఖ్యా న ము

ష ష్ఠా శ్వా స ము

క. శ్రీకారికృపార్ద్రేక్షణ !
వైకుంఠ! యకుంఠభక్త।వరద! పదాబ్జా
స్తోకమరందాయితగం
గా! కాకోదరనగోద।యస్థపతంగా ! 1

టీ. శ్రీ...ణ-శ్రీకారి=లక్ష్మీకరమగు, కృపా=దయచేత, ఆర్ద్ర=తడిసిన, ఈక్షణ=దృష్టిగలవాఁడా, వైకుంఠ=వికుంఠాదేవి కుమారుఁడా, అ...ద - అకుంఠ = భంగము లేనియట్లు, భక్త = భక్తులకొఱకు, వరద = వరము లొసంగెడువాఁడా, పదా...గా - పదాబ్జ = పాదకమలమునకు, అస్తోక = సమృద్ధమైన, మరందాయిత = మకరందమువలె నుండెడు, గంగా = గంగానదిగలవాఁడా, కాకోదరనగ=శేషశైల మనియెడు, ఉదయ=ఉదయపర్వతమందు, స్థ = ఉన్నట్టి, పతంగా = సూర్యుండైన వాఁడా !

వ. అవధరింపు మనంతర వృత్తాంతంబు. 2

మా ల దా స రి

చ. కలఁ డొకరుండు పేరుకొనఁ।గాని కులంబు మదీయభక్తుఁ, డి
య్యిల మును వాఁడు వామనత।నే[1]వసియించిన పుణ్యభూమి యం
దుల కొకయోజనత్రయపు।దూరపుటూర వసించి, బ్రాహ్మవే
ళలఁ జనుదెంచి పాడు మము।లాలప మంగళనామకైశికిన్. 3

టీ. పే...బు-పేరుకొనఁగాని = చెప్పరాని, కులంబు = కులమందలి, మదీయ=నాదగు, భక్తుఁడు, ఒకరుండు = ఒక్కఁడు, కలఁడు = ఉండెను, వాఁడు = అతఁడు, మును = తొల్లి, వామనతన్ = వామనావతారమునందు, ఏన్ = నేను, వ...కున్ -

1. వసియింపనౌ పుణ్యభూమి నందులకు—పాఠాం.

వసియించిన=నివసించినట్టి, పుణ్యభూమియందులకున్=దివ్యదేశప్రాంతమునకు, (ఆ దివ్య దేశము తిరుక్కురుంగుడి యనుట) ఒకయోజనత్రయపుదూరపుటూరన్=ఒక మూఁడు యోజనములదూరము గల యూరియందు, వసించి = నివసించి, బ్రాహ్మవేళలన్ = బ్రాహ్మముహూర్తములయందు, (తెల్లవాఱ నాల్గు గడియలు గల దనఁగా ననుట) చను దెంచి=వచ్చి, మంగళనామకైశికిన్=మంగళనామకైశికి యను రాగముచేత, లాలసన్= కోరికతో, మమున్=మమ్ము, పాడున్=గానముసేయును.

తా. పంచమకులమందుఁ బుట్టిన మాభక్తుఁ డొకఁడు గలఁడు. అతఁడు తొల్లి నేను వామనావతారముచేత వసించిన దివ్యదేశమునకు మూఁ డామడలదూరమం దొక గ్రామమందు వసించి ప్రభాతసమయములయందు మంగళకైశికి రాగముచేత మమ్ము గానము సేయుచుండును.

వ. అహరహంబు నమ్మహాత్ముండు. 4

ఆహరహంబు = ప్రత్యహము - ప్రతిదినము.

క. జాత్యుచితచరిత్రమ మ
తిప్రీత్యర్థం బూఁది తనదు హృదయము శుచితా
నిత్యంబుగఁ దత్తనుసాం
గత్యము మసిపాత మానికంబై యొదుఁగున్. 5

టీ. జా...మ-జాత్యుచిత=తనజాతికిఁ దగినట్టి, చరిత్రమ=నడవడియే, మతిప్రీ త్యర్థంబు = మానసతోషముకొఱకు, ఊఁది = వహించి, ('శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్' అను గీతావాక్యము ననుసరించి యనుట.) తనదు హృద యము=తనసంబంధి యగునంతరంగము, శు...గన్-శుచితా=పరిశుద్ధత్వమునందు, నిత్యం బుగన్=స్థిరమగుచుండఁగా, త...ము-తత్తను = ఆచండాల శరీరముయొక్క, సాంగ త్యము = సంగమ మనెడు, మసిపాత = మసిగుడ్డయందలి, మానికంబై = మాణిక్యమై, ఒదుఁగున్=ఒదిఁగి యుండును.

తా. ఆతఁడు మద్భక్తుఁడైనను మాకు వర్ణాశ్రమాచారములయందుఁ బ్రీతి గావున నది యెఱిఁగి తా నొక యాధిక్యమునకుఁ బోక, తన కులోచితాచారమందే నిలిచి, తన హృదయము నిత్యపరిశుద్ధమై, యాచండాల శరీరసాంగత్య మనెడు మసిగుడ్డను గట్టిన మాణిక్యమువలె నుండును. వాక్యార్థగత నిదర్శన.

సీ. చమురైన తోల్కుబుసంబు [1]టెంకియును ని
త్తళి శంఖ చక్ర కుండలము లమర

1. టెక్కియను=ఒకవిధమగు కుళ్ళాయి, దక్కియును = చర్మవాద్యవిశేషము.

దివెదారికొమ్ముఁదోꕀల్తిత్తియు జోడమ్ము
మెడమీఁది మొగలాకుꕀగొడుగుఁ దనర
మత్పాదరక్షయు ꕀ మావు పెన్నెఱకఁ గు
ట్టిన యోటి తిపిరిదంꕀడెయును మెఱయఁ
చిటితాళములు సంక ꕀ పుటిక నొక్కొకమాటు
గతిరయంబునఁ దాఁకి ꕀ కలసి మొరయ

తే. వలుఁద వనమాలకంటెయు ꕀ మలినతనువుఁ
బట్టితిరుమన్ను బెదరుఁగెం ꕀ పుట్టుఁ జూపు
బసుపుఁబొడితోలు పల్లంబు ꕀ నెసక మెసఁగ
వచ్చు సేవింప సురియాళు ꕀ వైష్ణవుండు. 6

టీ. (1) చమురైన = చమురంటిన, తోల్కుబుసంబు = చర్మకూర్పాసము, (తోలు చొక్కా యనుట). టెంకియును=కుళ్లాయియును, ఇ...లు-ఇత్తళి = ఆరకూట మయములగు, శంఖచక్రకుండలములు = శంఖచక్రముల చెవులపోఁగులు, అమరన్ = ఒప్పుచుండఁగా. (2) దివెదారికొమ్మున్=భజనమున్నగువానిలో ననేక దీపము లుంచెడు దీపస్తంభమును (గరుడగంబము), తోల్తిత్తియున్=చర్మపుఁ దిత్తియును, జోడమ్ము = ధనుస్సునఁ జేర్పక చేతిలో పొడిచెడు బాణమును, ('చాపానపేక్షిత శరమొప్పుజోడ' మ్మన యని దేశ్యనామార్థకోశము. "సీ. చాపానపేక్షియౌ శరమొప్పుచుండు జేయమ్మంచ నంగ జోడమ్మనంగ" ఆం. భా. ౨, ౨౧3. బోడమ్మని యనేకపుస్తకపాఠము, అప్పుడు ములుకులేని బోడి బాణ మని యర్థము.) మె...గున్ - మెడమీఁది = అంసముమీఁద నున్న, మొగలాకుగొడుగు = కేతకీపత్త్రములఁ గూర్చినఛత్త్రమును, తనరన్=ప్రకాశింపఁగా, (మొగలాకనుచోట మొగలి+ఆకు-పరిమిత్యర్థకము పరమగునపుడును వలె నాక్వాదులును పరమగు నపుడును నిత్యసంధి), (3) మత్పాదరక్షయున్ = మాపాదుకయును, మా...కన్ - మావు=గుఱ్ఱముయొక్క, పెన్=నిడుదయగు, ఎఱకన్ = వెండ్రుకలో [పెన్నెఱకన్ అనుపాఠమున - పెన్ను+ఎఱక - మెడమీఁది వెండ్రుకలచేత అనియు, పెన్నెఱక - అనుపాఠమున పెను+ఎఱక - పెద్దవెండ్రుక అనియు నర్థములు.] కు...ను-కుట్టిన = కూర్చినట్టి, ఓటి = ఓదువాసిన, తిపిరిదండెయును = సొరకాయదండెయుఁ, ఒకవిధమగు చిన్నవీణె.) మెఱయన్ = ప్రకాశించుచుండఁగా, (4) చిటితాళములు= చిఱుతాళములు, చంకపుటికన్ = చంకనున్నభవనాసిని, ఒక్కొకమాటు = ఒక్కొక్కతూరి, గతిరయంబునన్=గమనవేగముచేత, తాఁకి=తగిలి, కలసి=ఏకమై, మొరయన్ = ధ్వనిచేయఁగా, (5) వ...యున్-వలుఁద = వట్రువయగు, వనమాలకంటెయున్ =

తులసిపూసలపేరును, (తులసికంఠనుట), మలినతనువున్=మాసిన శరీరమును, (దేహాభిమానిగాఁ డనుట), పట్టెతిరుమన్ను=పట్టెలుగా స్ఫుటమైన శ్రీమృత్తికయును, బెదరు కెంపుట్టు చూపున్ = బెదరుచు నెఱ్ఱనైయున్న చూడ్కియు, (ఎఱ్ఱనిబెదరుఁజూపు లనుట) పసుపుఁబొడితోలుపల్లంబున్=పసుపుఁ బట్టించిన తుఱుచ యగు చర్మపుఁ జన్నిదమును. (పసుపుఁ బొడితోడి వలువయు నని యొక పాఠము), ఎసకమెసఁగన్=ఒప్పుచుండఁగా, సురియాళు వైష్ణవుండు=ఆ మాలదాసరి, సేవింపవచ్చున్ = సేవార్థమై వచ్చుచుండును. (ఉరియాళనియుం బాఠము కలదు. ఆపక్షమున నవలంబించిన యని యర్థము.) "సీ. పరఁగుఁ జండాలుండు సురియాళువనఁగను మాల దంచనఁగను మాలఁ డనఁగ." ఆం. భా. ౨, ౧౮౯.

శా. గండాభోగముల న్ముదశ్రులహరుల్గప్ప న్నుతుల్పాడి యా
దండ [1]న్వ్రేగులు డించి భక్తిజనితోద్యత్తాండవం బాడు నా
చండాలేతరశీలుఁ డుత్పులకితుండై చాండాలిక న్మీటుచున్
గుండు ల్నీరుగ నెండ గాలి పసి తాఁకుం జూడ కాప్రాహ్ణమున్.7

టీ. ఆ చండాలేతరశీలుఁడు = చండాలురకంటె నితరులగు సజ్జనులయొక్క శీలమువంటి శీలము గల యతఁడు, ("శ్వపచోఽపి మహీపాల విష్ణుభక్తో ద్విజాధికః, విష్ణుభక్తివిహీనస్తు ద్విజోఽపి శ్వపచాధమః' అన్నట్లనుట.) గండాభోగములన్ - గండ=చెక్కిళులయొక్క, ఆభోగములన్ = పరిపూర్ణత్వములయందు, ('ఆభోగః పరిపూర్ణతా' అని నిఘంటువు-అనఁగా అంతట ననుట), ము...ల్-ముదశ్రు=ఆనందబాష్పములయొక్క, లహరుల్=ప్రవాహములు, కప్పన్=ఆచ్ఛాదించుచుండఁగా, నుతుల్పాడి=కీర్తనలుపాడి, ఆదండన్ = ఆసమీపమందు, వ్రేగులు = తన బరువులు, డించి=దించి, ఉత్పులకితుండై=గగుర్పాటుగలవాఁడై, గుండుల్=పాషాణములు, నీరుగన్ = గానశక్తిచేతఁ గరఁగి నీరగునట్లు, చాండాలికన్=తన వీణను, ('చాండాలికా తు కండోలవీణా చండాలవల్లకీ' అని నిఘంటువు.) మీటుచున్ = వాయించుచును, ఎం...కున్-ఎండ=ఆతపముయొక్కయు, పసి=ఆఁకలి యొక్కయు, తాఁకున్=వేధను, చూడక=లక్ష్యము సేయక, ఆప్రాహ్ణమున్=అపరాహ్ణమగు దనుక, భ...బు-భక్తిజనిత=భక్తిచేతఁబొడమిన, ఉద్యత్=లెస్సైన, తాండవంబు = నాట్యమును, ఆడున్=ఆడును. (ఆప్రాహ్ణ మను చోటఁ బ్రాహ్ణ మనఁగా నహస్సులో మూఁడవ భాగ మని అనఁగా పదిగడియల ప్రొద్దెక్కువఱకని కొంద ఱందురు.)

1. ...వ్రేగు లడంచి...

తా. జాతిచేతఁ జండాలుఁడైనను నగ్రవర్ణములవారి శీలమువంటి శీలముగల యామాలదాసరి ప్రతిదినమును దనబరువుల నాచెంత దింపి, యెండను, గాలిని, నాఁకలిని గణింపక మధ్యాహ్న మగుదనుక నొడ లంతయుఁ గగుర్పాటు నొందుచుండఁగా, రాలు గరఁగునట్లు, చండాలవీణను మీటుచు, నాస్తోత్రములు పాడి, భక్త్యుద్రేకమునఁ దాండవమాడును.

తే. అట్లు దడవుగఁ గొల్చి సాష్టాంగ మెఱఁగి
గర్భమంటపిఁ గడిగిన కలఁకజలము
లోని తాతొట్టి నిండి కాలువగఁ జాఁగి
గుడి వెడలి వచ్చునది శూద్రుఁ డిడఁగఁ గ్రోలి. ౮

టీ. అట్లు=ఆప్రకారము, తడవుగన్=చాలసేపు, కొల్చి=సేవచేసి, సాష్టాంగము= కర చరణ వక్షో లలాట భుజములతోఁ గూడునట్లు, ఎఱఁగి=నమస్కరించి, గర్భమంటపిన్=గర్భగృహమును, క...ము-కడిగిన = క్షాళనముఁ జేసిన, కలఁకజలము = కలుషోదకము, లోని=లోపలనున్న, తాతొట్టి=తాలితొట్టి, నిండి=పూర్ణమై, కాలువగన్=కుల్యగాను, చాఁగి=ప్రవహించి, గుడి వెడలివచ్చునది = గుడినుండి వెలికి పాఱివచ్చుచున్న జలమును, శూద్రుఁడు=నాలవజాతివాఁడు, ఇడఁగన్=ఒసఁగఁగా, క్రోలి=పానముఁజేసి.

తా. ఇట్లు చాలసేపు సేవించి నమస్కరించి గర్భగృహముఁ గడిగిన సమ్మార్జనోదకము లోపలి తొట్టి వెలువడి బైటికి రాఁగాఁ, దాను పంచమకులీనుఁడు గావున, నాయుదకము నంటక శూద్రుని నొక్కని యాచించి, యతనిచేతఁ దెప్పించుకొని పానముచేసి యని ముందటి కన్వయించును.

ఉ. ఆతఁడు ముఖ్యజాతిఁ గని నంతన పాయుచు నెండ గాలి నెం
తో తడవుం బ్రసాద విని యోగము వార్చి వసించుచుం ద్రివ
ర్ణేతరజాతి మెచ్చి దయ నిడ్డ ప్రసాదము దండెసాఁచి శ్ర
ద్ధాతిశయంబునన్ వినతి నంది భుజించుఁ గొనుం దదంబువున్. ౯

టీ. అతఁడు=ఆ దాసరి, ముఖ్యజాతిన్ = శ్రేష్ఠజాతిగలవానిని, (బ్రాహ్మణాదుల ననుట), కనినంతన = చూచినమాత్రనే, పాయుచున్=తొలఁగుచును, ఎండన్ = ఆతపమందును, గాలిన్ = విసరుగాలిలోను, ఎంతో తడవున్ = ఎంతో సేపు, (చిరకాల మనుట), ప్రసాద=ప్రసాదముయొక్క, వినియోగము=పంచిపెట్టుటను, వార్చి=నిరీక్షించి, (ఉ: 'ఇంతననేల యేను భుజగేశ్వరురాకయ వార్చినాఁడ నాఁకంతవు నంతకుం గుడువ నాఁకలి నీటులు ద్రావఁ దృష్ణ యొక్కింతయుఁ లే'దనియును; తే. 'అనిన నీరాక వార్చి

మహాశతోఁడ, నున్న విప్రునికోర్కి నీ వాక్యభంగి' ననియును, 'అనఘ నారాక వార్చి నీవధికనిష్ఠ, నిట్టు లున్కికిఁ గారణం బేమికోర్కి' యనియును; ఇత్యాది శాంతిపర్వ ప్రయోగము లుండుట నిచ్చట గొంద ఱపేక్షార్థక మని చెప్పుదురు.) వసించున్ = నివసించుచు; త్రివర్ణేతరజాతి-త్రివర్ణ=బ్రహ్మ క్షత్త్రియ వైశ్యులకంటె, ఇతర=అన్యుఁడైన, జాతి=శూద్రజాతి గలవాఁడు, మెచ్చి=హర్షించి, దయన్ = తనయందలి కృపచేత, ఇడ్డ=ఒసఁగిన, ప్రసాదమున్, దండెసాఁచి=చేతనున్న దండెసాచి, శ్రద్ధాతిశయంబునన్=అత్యాసక్తితోడను, వినతిన్=వినయముతోడను, అంది=అందుకొని, భుజించున్=సాపడును, తదంబువున్ = వానిచే నొసఁగఁబడిన తీర్థమును, కొనున్ = గ్రహించును.

తా. ఆతఁడు గర్వ మించుకేని లేనివాఁడును, బ్రసాదాదులయం దత్యంతశ్రద్ధ గలవాఁడును నగుట విప్రులను గాంచి తొలఁగుచు చాలవఱకు వేచి, యే శూద్రుఁడో యొసఁగిన ప్రసాదము భక్తితో భుజించి తీర్థము గ్రోలును.

వ. ఇట్లు దన [1]దివాకీర్తిజని నగు పరమార్తి నైచ్యంబు సకలజన శోచ్యంబుగా గుడి [2]లాఁపరా తూపరాణి కడ నిలిచి బహిరావరణ ప్రదక్షిణంబ కావించి ప్రొద్దెక్క నిజపక్కణంబునకుం బోవుచుండు నిట్లుండి యొక్కనాఁడు.

టీ. ఇట్లు=ఈరీతిగా, త...నిన్-తనయొక్క, దివాకీర్తిజనిన్ = నికృష్టమగు పంచమజన్మముచేత, ('చండాలప్లవమాతఙ్గ-దివాకీర్తిజనంగమాః' అని యమరము.) అ...బు - అగు = కల్గినట్టి, పరమార్తి = అధికమగు నార్తిపల్లనైన, నైచ్యంబు = నీచభావము, (జాత్యుచిత వినమ్రభావ మనుట), స...గాన్-సకలజన = ఎల్లవారలకు, శోచ్యంబుగాన్=క్లేశార్హముగాఁగను, (ఇతనిఁ జూచి యందఱు జాలింబడి కనికరింతు రనుట), గు...డన్ - గుడి = కోవెలయొక్క, లాఁపరా = చదరమగు పలకతాలుగల, తూపరాణికడన్ = జలదారిదాపున, నిలిచి=నిలుచుండి, కొలిచి=సేవించి, బహిరావరణ ప్రదక్షిణంబ కావించి = బహిఃప్రాకారమున కావల వలగొని, (తాను బంచముఁ డగుటచేత గుడిలోపలికిఁ జనండనుట), ప్రొద్దెక్కన్ = ప్రొద్దుపోఁగా, ని...కున్-నిజ=స్వకీయమగు, పక్కణంబునకున్ = పల్లెకు, ('పక్కణశ్శబరాలయః' అని నిఘంటువు.) పోవుచుండున్ = చనుచుండును, ఇట్లుండి = ఈరీతి వచ్చుచుం బోవుచుండి, ఒక్కనాఁడు = ఒక్కదివసంబున, లాఁపరా తూపరాణి - ('సీ. తూపురాణపు టమ్ము తూమొప్పరము జలదారి యనంగను దనరును జల, గీ. నిర్గమము తన్ముఖంబున నీటితోడ వచ్చు తృణములఁ జొరనీనిపలకపేరు, లాఁపరా యంచు జనులు పల్కఁగను వెలయు.' ఆంధ్రభాషార్ణవము.)

1. దివాకీర్తిజనీనంబగు. 2. మోపల.

క. అర్ధమరే యద్దాసరి
యద్దండ బిడాలగాహితాలయకృకవా
కూద్దండరవము విని చను
ప్రొద్దాయె నటంచుఁ బాడఁ బోవుచుఁ ద్రోవన్. 11

టీ. అర్ధమరేయి=అర్ధరాత్రమునందు, అద్దాసరి=మాలదాసరి, అద్దండన్ = ఆ సమీపమందు, బి...ము - బిడాల = పిల్లిచేతను, ('ఓతు ర్బిడాలో మార్జాలః' అని నిఘంటువు.) గాహిత = ప్రవేశింపఁబడిన, ఆలయ = ఇంటియందలి, (కోళ్ళగుడిసె యనుట.) కృకవాకు = కోళ్ళయొక్క, ఉద్దండ = అధికమైన, రవము=రవళిని, విని = ఆకర్ణించి, చనుప్రొద్దు = తాను నిత్యముం బోయెడు సమయము, ఆయె నటంచున్ = అయ్యెననుకొని, పాడఁబోవుచున్ = గానము సేయ నేఁగుచును, త్రోవన్ = మార్గమందు, తరువాతి కన్వయము.

తా. అర్ధరాత్రసమయమందుఁ గుక్కుటాలయములోనికిఁ బిల్లి చొఱఁగా వెఱచి కూఁత లిడినఁ దాను విని వేఁకువ కోడికూఁత లని తలంచి, తాను నిత్యముగాఁ బాడ నేఁగెడు సమయ మాయె నని బయలుదేఱి పోవుచు మార్గమందు. ఇది ముందటి కన్వయ మగును.

ఆ. మఱలుఁదీఁగె మెట్టి యిరు లన్న నో యని
యెడు తమిస్రఁ గాడుపడి పొలంబు
లెల్లఁ దిరిగి తూర్పు దెల్ల నౌతఱి నొక్క
శూన్యగహనవాటిఁ జొచ్చి చనుచు. 12

టీ. ఆ దాసరి మఱలుఁదీఁగెన్ = మఱ్ఱుమాతంగి తీఁగను (దీనిం ద్రొక్కినవారు దారి తప్పుదురు) మెట్టి = త్రొక్కి, ఇరు లన్నన్ = చీకటు లని పిలువఁగానే, ఓ యనియెడు=ఓ యని పలికెడునట్టి, (కటికచీకటి యనుట, అతిశయోక్తి), తమిస్రన్= చీకటి రాత్రియందు ('తమిస్రా తామసీరాత్రిః' అని యమరము.) కాడుపడి = త్రోవతప్పి (దిగ్భ్రమ చెంది), పొలంబులెల్లన్ = పొలములన్నియు, తిరిగి=దిమ్మదిరిగి, తూర్పు=ప్రాగ్దిశ, తెల్లనౌతఱిన్ = తెల్లఁబడుసమయమందు, (ప్రభాతసమయ మనుట), ఒక్క శూన్యగహనవాటిన్=ఒక్క నిర్మానుష్యపుటడవిప్రదేశమందు, చొచ్చి = ప్రవేశించి, చనుచున్ = పోవుచు.

సీ. ఇడిసిన యిడుపులయెడలఁ బొత్రె నుత్త
రేను గసింద కోరింద పొదలఁ

గెడసిన [1]గరిసెలక్రింద లాఁగలఁ గ్రుస్సి
యదవకాఁపురముండు ‡ నాఖుతతుల
సగముదుమ్మునఁ బూడి ‡ చిగిరింత వామూయఁ
బెరిఁగిన నూతిపాఁ‡తఱ బొంటియలఁ
జీమలు ప్రాలీడ్వఁ ‡ జివికిన వెలుఁగుప
ట్టునఁ బండి యెండి క్రుం‡గిన గునుకులఁ
తే. బెండదొగ్గళ్లలోఁ గదు‡పంటి శ్మశ్రు
చలనములఁ గ్రుక్కు జీర్ణోతు‡వులఁ బొలంబు
దుండిగల మళ్ల యూరులఁ ‡ [2]దూలి రాదు
చిక్కు నేతాల పాడలు‡పీమఁ జనుచు. 13

టీ. ఇ...లన్-ఇడిసిన=విరిగిన, ఇదుపుల యెడలన్=గోడలయందు, పా...లన్-పాట్రేను=చిటిరేఁగుచెట్లయొక్కయు, ఉత్తరేను=అపామార్గములయొక్కయు, కసింద=కాసమర్దములయొక్కయు, కోరింద=కోరింద చెట్లయొక్కయు, పొదలన్=పొదరులచేత, కె...దన్ - కెడసిన=క్రిందికొఱిగినట్టి, గరిసెలక్రిందన్=గాదెబొట్టలక్రిందను, లాఁగలన్=బొక్కలయందు, క్రుస్సి=కృశించి, అదవకాఁపురముండు = అస్థిరనివాసమున్నట్టి, ఆఖుతతులన్=మూషకములగుంపులచేత, సగము=అర్ధభాగము, దుమ్మునన్=గాలిదువ్వచేత, పూడి=పూడ్వఁబడి, చిగిరింత=చిగిరింతగడ్డి, వామూయన్=మొగముమూయఁగా, పె...లన్-పెరిఁగిన = ఎదిగినట్టి, నూతి=చేఁదుడు బావులయొక్కయు, పాఁతఱ = పాఁతఱల యొక్కయు, బొంటియలన్=బొందలచేత, (నూతి పాఁతఱగుంటలు సగముపూడి యవి మొదలు గడమచిగిరింత బలసియున్న దనుట), చీమలు=పిపీలికలు, ప్రాలు=బియ్యమును, ఈడ్వన్=ఆకర్షించుకొనిపోఁగా, చి...నన్-చివికిన = జీర్ణమయినట్టి, వెలుగుపట్టునన్=దొడ్డికంబలపట్టున, పండి=(గునుకుధాన్యము) పక్వమై, ఎండి=శుష్కించి, క్రుం...లన్-క్రుంగిన=అడఁగిపోయిన, గునుకులన్=గునుకుఁగసవుచేత, పెంటదొగ్గళ్లలోన్ = పెంటల మీఁది దొగ్గలిచెట్లయందు, కదుపంటి = కడుపు వెన్నున నంటుకొని, (అశనములేక నక నకలాడు ననుట), శ్మ...లన్-శ్మశ్రు=మీసములయొక్క, చలనములన్ = కదలుటల చేత, క్రు...లన్-క్రుక్కు = అడఁగియున్న, జీర్ణోతువులన్ = ముసలిపిల్లులచేతను, ('తద్బృందేశ్మశ్రుపుంముఖే, ఓతుర్బిడాలో మార్జాలః,' అనియు నిఘంటువు.) పొ...లన్-పొలంబు = పొలముయొక్క, దుండిగల = దుండిగపుఁజెట్లచేతను, మళ్ల=వరిమళ్ల

1. గరిసెలక్రింద నాఁకటఁ గ్రుస్సి. 2. ధూళిదగద; దూళిరగడు.

యొక్క, బొరులన్ = బొరుగసవు గంటలచేతను (కృషిలేకయుండుటచేఁ బొలము లందు దుండిగములును, వరిమళ్ళయందు వీరణపుగంటలును మొలిచిన వనుట), తూలి = నేలకు వ్రాలి, రాడుచిక్కు = నిట్రాడుమాత్రము మిగులునట్లున్న, ఏతాలన్ = ఏతముల చేతను, పాడయిసీమన్ = పాడుపడిన ప్రదేశమందు (సూచము మాత్రము గనుపడుచు జలయంత్రములు దుమ్మునఁ బూడిపోయిన పాడుభూమి యనుట), చనుచున్ = పోవుచును. స్వభావోక్తి.

క. అపమార్గత నరుగుచు మా
ర్గపు ధామార్గవపుఁ గంటకంబులఁ గాళ్ళన్
విపరీతత నూడ్చుచు నే
రుపున న్బల్లేరు లీడ్చి త్రోయుచుఁ జనుచున్. 14

టీ. అపమార్గతన్=తప్పుదారిలో, అరుగుచున్=పోవుచు, మా...లన్-మార్గపు= తానుబోయెడిమార్గమందలి, ధామార్గవపు=ఉత్తరేనిచెట్లసంబంధులగు, ('అపామార్గశ్శైఖరికో ధామార్గవ మయూరకా' యని నిఘంటువు.) కంటకంబులన్=ముండ్లను, కాళ్ళన్ = కాళ్లనుండి, విపరీతతన్=ప్రతిలోమముగా, ఊడ్చుచున్=పోరాల్చుచు, నేరుపునన్ = ఉపాయముచేత, పల్లేరు=పల్లేరుగాయలముండ్లను, ఊడ్చి = ఊడలాగి, త్రోయుచున్, చనుచున్ = పోవుచును.

తా. ఆమాలదాసరి దారితప్పి నడచుచు, నుత్తరేనిముండ్లు కాళ్ళ కంటుకొనఁగా వానిని బ్రతిలోమముగాఁ దుడిచివైచుచుఁ, బల్లేరుగాయలు గ్రుచ్చుకొనఁగా వానిని మెలఁకువతోఁ దొలఁగించుకొనుచుఁ బోవుచుండెను.

శా. కాంచె న్వైష్ణవుఁ డర్ధయోజన జటాఘాటోత్థశాఖోపశా
ఖాంచర్ఝాటచరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛదో
దంచత్కీటకృత వ్రణచ్ఛలన లిప్యాపాది తాధ్వన్యని
స్సంచారాత్తమహాఘ లోపమఘలస్థాయి ద్వటక్ష్మాజమున్. 15

టీ. వైష్ణవుఁడు=ఆభాగవతుఁడు, అర్ధయోజన=రెండుపరుగుల నిడివిగల, జటా= ఊడలయొక్క, ఘాటా=పైభాగపుఁ బ్రక్కలనుండి, ఉత్థ=మొలచినట్టి, శాఖా=కొమ్మల యొక్కయు, ఉపశాఖా=ప్రక్క కొమ్మలయొక్కయు, అంచత్=ఒప్పుచున్న, ఝాట= గుంపులయందు, చరత్=సంచరించుచున్న, మరుత్=వాయువుయొక్క, రయ=వేగముచేత, దవీయః=దవ్వుగా, ప్రేషిత=చిమ్మఁబడినట్టియు, ఉద్యత్=ఎగురుచున్నట్టియు, ఛద=ఆకుల యందు, ఉదంచత్=స్ఫుటములగుచున్న, కీట=పురుగులచేత, కృత=చేయఁబడిన, వ్రణ=

బొందలనియెడు, ఛలన=వ్యాజముగల, లిపి=అక్షరములచేత,ఆపాదిత=సంపాదింపఁబడిన, అధ్వన్య=మార్గస్థులయొక్క, నిస్సంచార=సంచారభావముచేత, ఆత్త=పొందఁబడిన, మహా ఫల-మహాత్=శ్రేష్ఠమైన, ఫల=పుణ్యఫలములోడ, ఉపమ = సామ్యముగల, ఫల = పండ్ల చేతను,స్ఫాయత్=వృద్ధిఁబొందుచున్న,వటక్ష్మాజమున్=మఱ్ఱిచెట్టును,కాంచెన్=చూచెను.

తా. ఆభాగవతుఁ డామార్గమందు ఱెండుకోసుల నిడివిగల యూడలు దిగి యూడలయందే యనేక శాఖోపశాఖలు గలిగి, యాశాఖలయందలి యాకులమీఁదఁ బురుగులు దొలిచిన బొందలలోఁ గూడ నవి పీడి వాయువశముచేత దూరముగాఁ గొట్టుకొనివచ్చి యెగురుచుండఁగా, నావృక్ష మచ్చట బ్రహ్మరక్ష స్సున్నది, యీత్రోవను రావల దని, మార్గస్థులకుఁ దెలియుటకు నాయాకు లనెడు తాబులమీఁదఁ బురుగులచేఁ దొలువఁబడిన గీఁత లనియెడు నక్షరములు వ్రాసి పంపుచున్నదో యన్నట్లును, దానివలన మార్గస్థు లా మార్గమున సంచరింపకుండుటంజేసి, మహాపుణ్యఫలముచేఁ గలిగె ననుటకు సమానముగా గొప్పలగు పండ్లచేత నొప్పుచున్న యొక్క పెద్దమఱ్ఱిచెట్టును జూచెను. సాపహ్నవోత్ప్రేక్షాలంకారము.

ఆ. కాంచి యాతఁ డొక్క - కాలి[1]త్రోవయు నంతఁ
గాంచి యందుఁ దెరువుఁ - గాంచినదియ
పరమలబ్ధి గాఁగఁ - ద్వరితంపుగతి నవ్వ
టావనీజ మంత - నంతఁ గదిసి. 16

టీ. కాంచి = అవృక్షమునట్లు చూచి, అతఁడు=ఆభక్తుఁడు, అంతన్=అంతట, ఒక్క కాలిత్రోవయున్=ఒక కాలిమార్గమునుగూడ, కాంచి=చూచి,అందున్=ఆపాడు పడిన సీమయందు, తెరువుఁగాంచినదియ=మార్గము లభించుటయే, పరమలబ్ధి గాఁగన్ = పరమలాభముగా, త్వరితంపుగతిన్ = శీఘ్రగమనముచేత, అవ్వటావనీజము = ఆ మఱ్ఱి చెట్టును, అంతనంతన్=అంతటంతటను, కదిసి=చేరవచ్చి. తర్వాతిపద్యములో నన్వయము.

సీ. [2]ఎఱ్ఱనీటి బొండఁబొఱ్ఱబులువోలె మెదడెల్ల
జుఱ్ఱి వైచిన డొల్లు - పుఱ్ఱెగములు
నెఱచి గీఱన జీర - లేర్పడఁ దుదముట్టఁ
జీఁకిన నులిపచ్చి - కీకసములు
దొనదొనమను నీఁగె - తుట్టెల రూ పేఱు
పఱక క్రొంపలను వ్రేకలెడు గరుసులు

1. డొంకయు. 2. ఎడనీటి బొండ్లాలవడువున. (శ. ర. పా.)

ధూళ్ళ మక్కెక్కి మంగళ్ళతిప్పలు రేఁగు
వడువున గాలి నాఁడెడు వెఱకలుఁ
తే. దునిసిన నరాంగకములఁ బొత్తులను గమిచి
పోక యొండొంటితోఁ [1]బిఱుసీఁకులాడు
శ్వాపదంబులుఁ, బదహతిఁ వ్రస్సి వలచు
వరుగు దఱచగు ముఱుత్రోవఁ నరిగె యెదుట. 17

టీ. ఎ...లన్ - ఎలనీటి = లేఁతనీరుగల, బొండలంబులువోలెన్ = టెంకాయ బొండ్లములవలెనే, మెదడెల్లన్ = మస్తిష్కమంతయు, జొట్టి=పీల్చి, పైచిరన్ = పరిహరింపఁగా, డొల్లు = దొరలాడుచున్న, పుఱ్ఱెగములున్ = నరకపాలసమూహములును, (ఎళనీరు త్రావి పాఱవైచిన టెంకాయ బొండ్లములవలెనే తలకాయల మెదడు జొట్టివేయఁగా నాపుఱ్ఱెలు డొల్లుచున్న వనుట), ఎఱచి గీఱిన తీరలు=మాంసము గీచుకొన్న గీఱలు, ఏర్పడన్=కనుపడునట్లు, తుదముట్టన్=కడవెడలునట్లు, చీఁకిన = చప్పరించిన, ను...లు-నులిపచ్చి=కొంచెముపచ్చిగల, కీకసములు=ఎముకలను ('కీకసం కుల మస్థిచ' అని నిఘంటువు.) దొనదొనమను = దొనదొన మనుసరికొను చప్పుడుగల, ఈఁగెఱుట్టెలన్ = మక్షికారాసులచేత, రూపేఱుపడక=రూపము దెలియరాక, క్రంపలను=కంప వెలుగుల యందు, వ్రేలెడు = వ్రేలాడుచున్న, గరుసులు = పచ్చిచర్మములును, ధూళ్లన్ = దుమ్ములచేతను, మక్కెక్కి = మక్కుడువారి, మం...లు - మంగళ్ళ=క్షురకులయొక్క, తిప్పలు = (వెండ్రుకల) పెంటలు, రేఁగువడువునన్ = రేఁగినట్లు, గాలిన్=వాయువుచేత, ఆ...లు - ఆడెడు = చలించుచున్న, వెఱకలు = వెండ్రుకలును, తు...లన్ - తునిసిన = ఖండింపఁబడిన, నర=మానవులయొక్క, అంగకములన్ = అవయవములను, పొత్తులను = కూడ, కమిచి = కబళించి, పోక = ఆవల జరుగక, ఒండొంటితోన్ = పరస్పరమును, పిఱువీఁకులాడు = వాదులాడుచున్న, శ్వాపదంబులున్ = దుష్టమృగవిశేషంబులును, పదహతిన్ = కాలితన్నుచేత, వ్రస్సి=వ్రయ్యలై, వ...గు-వలచు=కంపుగొట్టుచున్న, వరుగు = మాంసపువరుగును, (వరు గనఁగా గృధ్రవిశేషము లనియుఁ జెప్పవచ్చును), తఱచగు = దట్టముగాఁ గలిగిన, ముఱుత్రోవన్ = మాంసములు ముఱిగియున్న దుర్గంధమార్గమున, అరిగి=పోయి, ఎదుటన్ = ముందఱ. తరువాతి కన్వయము.

తా. ఆబ్రహ్మరక్షస్సనేకులను బట్టి చంపుచుండుం గాన నాప్రదేశమందు మెదడు జుఱ్ఱివైచిన కపాలములును, శల్యములు మాంసములోడ నోటఁగఱచి పండ్లగీటి

1. బోరి పీకులాడు.

తిని పాఱవేసినయవియును, శరీరములు చర్మము లొలిచి కంపలమీఁద వేయఁగా నీఁగలు మూఁగి రూపు గానరా కుండునవియును, బహుకాలముగా ననేకులఁ జంపుటచేత వారి తలవెండ్రుకలు కుప్పలై పడియుండి ధూళిచేతఁ గొంత బ్రుంగుడువడి గాలిచేత మంగళ్ళపెంటలు లేఁగినట్లు లేఁగుచుండు నవియును, దునిఁగిపోయినమానవావయవముల నవ్వల నివ్వలఁ గదలించి దుష్టమృగములు పీఁకులాడుచుండునవియును, గాళ్ళఁదన్ని బ్రద్దలుచేసి యెండవేసిన వరుగులును గలిగి, యిట్టిబీభత్సరసాస్పదంబైన యా ముఱు మార్గమున నతఁ డరుగుచుండెను.

సీ. ముంగాళ్లఁ జాఁగి పై ముచ్చుఁజూపులు పర్వ
బొమికలెత్తుచుఁ బాఱి పోవు శునులఁ
బలలతోరణములు పట్టి బిట్టగయ శా
ఖా[1]ధూళి నెగయు కం కముల రొదల
నడ్డంబు దిరిగి [2]త లాహతిఁ బడి రొండి
హస్తంబు లిడి యంగ లార్చుకపుల
దబ్బాటుమై నొక్క [3]డలు సూపి యవి మాయ
నడఁగ వేతెడఁ జూపు వ్యాపృతులను
తే. [4]నెవ్వఁడో యొక్కఁ డున్నవాఁ డిందు, వాఁడు
నరుఁడు గాఁ, డింధనాధికా హారణమునకు
వేళయును గాదు, పొలగాలి వీచెఁ, దెరువు
నెడ, ననుచు జాలిగొని సంశ యించువేళ. 18

టీ. ముంగాళ్లన్ = ముందఱికాళ్లచేత, చాఁగి=చాఁగిలిపడి, పైన్=ఉపరిప్రదేశమున, ముచ్చుఁజూపులు = దొంగచూపులు, పర్వన్ = వ్యాపింపఁగా, బొమికలు= శల్యములను, ఎత్తుచున్ = ఎత్తుకొనుచు, [5]పా...లన్ - పాఱిపోవు=పరుగులిడుచున్న, శునులన్ = కుక్కలచేతను, పలలతోరణములు=మాంసపుఁదోరెములను, పట్టి=కఱచుకొని,

1. ఘూళి. 2. కరా. 3. దలఁజూపి. 4. గని యెవఁడో యొక్కరుం డిందుగలఁడు వాఁడు. 5. 'పాఱిపోవుశునులన్ = పలాయనమగుచున్న యాఁడుఁగుక్కలను శును లేమి? మగవిరావా? రావు. వీనికి చోరవయు జిత్తును ఎక్కువ కావున ఇవి ముందు వచ్చును. శుని - స్త్రీలింగము, శ్వానము - పుంలింగము' అని, వే. టీ. ఇకారాంత పుంలింగమైన 'శుని' శబ్దము కలదు. "శుని. ఇ. పుం. కుక్క" - శ. ర. "శునిః = A dog" - ఆప్టే.

బిట్టు = పెల్లుగా, ఎగయన్ = ఎగసిపోవఁగా, శాఖాధూతిన్ = కొమ్మలు గదలుటచేత, ఎ...లన్ - ఎగయుఁ=పుట్టుచున్న, కంకముల = రాపులుఁగులయొక్క, ('లోహపృష్ఠస్తు కంకస్స్యాత్' అని నిఘంటువు.) రొదలన్ = శబ్దములచేతను, అడ్డంబు తిరిగి=అబ్రహ్మ రతమ్మున కడ్డాలు వచ్చి, తఁగాహతిన్ = అటుచేతిప్రేటును, పడి = పొంది, (దెబ్బ దిని యనుట), రొండిన్ = కటిప్రదేశమందు, హస్తంబులు ఇడి=చేతులిడుకొని, అంగ లార్చు = మిడుకుచున్న, కపులన్ = కోఁతులచేతను, దబ్బాటుమైన్ = హఠాత్కార ముగా, ఒక్కెడలు చూపి = ఒక్కదిక్కు గానుపించి, అవి=ఆప్రదేశములు, మాయన్ = టక్కుచేత, అడఁగన్=కనఁబడకపోఁగా, వేఱెడన్ = మఱియొక్కదిక్కును, చూపుఁ గనఁబఱచుచున్న, వ్యాపృతులను = వ్యాపారములచేతను, ఇందున్=ఈప్రదేశమందు, ఎవ్వఁడోయొక్కఁడున్నవాఁడు, వాఁడు, నరుఁడు గాఁడు = మానవుఁడు గాఁడు, ఇం...ళున్ - ఇంధన = శుష్కములు, ఆదిక = మొదలుగాఁగలవన్యవస్తువులయొక్క, ఆహరణమునకున్ = తెచ్చుటకును, వేళయును గాదు=సమయంబును గాదు, పొలగాలి= మాంసపుగాలి, వీచెన్=విసరెను, తెరువున్ = మార్గంబును, ఎడవు=దవ్వు, అనుచున్= అని తలఁచుచు, జాలిగొని = వెతఁగూరి, సంశయించువేళన్ = సందియపడునప్పుడు. తరువాతి పద్యములో నన్వయము. స్వభావోక్త్యనుమానాలంకారములు.

సీ. మృతమర్త్యు రెంటాన । నిడ్డఁ జాలక నెత్రు
  రంజిల్లు పెనుపొట్ట । ముంజివానిఁ
బల్లచీమల వక్ర । భల్లాతకియుఁబోలె
  నెట్టు¹దుప్పటి నొప్పు । కట్టువాని
వ్యత్యస్త హస్తిమ । స్తాభఁ బాయఁగు గడ్డ
  మును దంష్ట్రికలుఁ బొల్పు । మొగమువానిఁ
గడుఁదుర్ల నిష్ఠురస్ఫుట్ట । గతిఁ ²జోఁగలోఁ బొంచు
  రత మించు కపిలకూ । ర్చంబువాని
తే. నెఱుకుఁదెరువరిఁ గన శాఖ । లెక్క జాలు
ప్రేవుజందెంబుఁ గసరి పైఁ । బెట్టువాని
వ్రేలు డగుబొజ్జ గల బూర । కాలివానిఁ
జెంబుతలవాని నవటుకకచంబువాని, 19

1. త్రుప్పట, దుప్పుల. 2. జొంగ.

టీ. మృతమర్త్యుఁన్ = చచ్చినమానవుని, రెంటూనన్ = కౌపీనముగా, ఇడన్ = పెట్టుకొనఁగా, చాలక=పొదవుసాలక, నెత్తురంజిల్లు = రక్తమంటియున్న, పెనుపొట్ట = పెద్దకడుపునందలి, ముంజివానిన్ = కటిసూత్రముగలవానిని, (శవమును గౌపీనముగాఁ బెట్టుకొన్న నది పొదవుసాలక యీడ్చియీడ్చి మొలత్రాటిలోఁ దోఁపుకొనఁగా దాని నెత్తురు పొట్టకంటె ననుట), పల్లచీమలన్ = బాఁపనచీమలచేఁత, వక్రభల్లాతకియుంబోలెన్=వంకరజీడిచెట్టువలె, ఎఱ్ఱనుప్పుటిన్ = రక్తవర్ణముగల దుప్పటిచేతను, ఒ...నిన్- ఒప్పు = ఒప్పుచున్న, కట్టవానిన్ = నల్లనిమేనుగలవానిని, వ్య...భన్-వ్యత్యస్త = క్రిందుమీఁదయిన, హస్తి=ఏనుంగుయొక్క, మస్త = తలయొక్క, అభన్=రీతివంటి రీతిచేతను, పాయ అగు=పాయయైన, గడ్డము, దంష్ట్రికలున్ = కోఱలును, పొల్చు= మెఱయుచున్న, మొగమువానిన్=ముఖముగలవానిని, (కుంభికుంభస్థలము తలక్రిందుఁ జేసిన నాకుంభస్థలములవలెఁ బాయవడ్డ గడ్డము నాదంతి దంతములవంటి కోఱలును గలిగి యున్న వనుట), క...లిన్ - కడుఁదుర్ల=కణుఁదురీఁగెలయొక్క, నిడు=నిడుదయైన, తుట్టెగతిన్=గుంపువలె, చోఁగలోన్=గుంతలో, (చొంగులో ననుట), పాండురత = తెల్లఁదనము, మిం...నిన్ - మించు = అతిశయించుచున్న, కపిల=కడార వర్ణముగల, కూర్చంబువానిన్ = భ్రూమధ్యదేశముగలవానిని, ('కూర్చమస్త్రీ భ్రువోర్మధ్యమ్' అని నిఘంటువు.) ఎఱుకన్ తెఱవరిన్ = తిండికోఱకు మార్గస్థుని, కనన్ = చూచుటకొఱకు, శాఖలెక్కన్ = కొమ్మలనెక్కఁగా, జాఱు = జాఱిపోవుచున్న, ప్రేవుజుంటెంబున్=ప్రేగులజన్నిదమును, కసరి=గద్దించుకొని, పైఁ బెట్టువానిన్=భుజము మీఁదికి ద్రోచికొనువానిని, ప్రేలుడగు = ప్రేలాడుచున్న, బొజ్జగల = బొజ్జగలిగిన, బూరకాలివానిన్ = ఏనుఁగుకాళ్ళవానిని, చెంబుతలవానిన్ = చెంబువలె నున్ననై బట్ట గట్టిన శిరముగలవానిని, అవటుకచంబువానిన్-అవటు=మచ్చెనగుంటయందు, ('అవటుర్ఘాటా కృకాటికా' అని నిఘంటువు.) కచంబువానిన్ = జుట్టుగలవానిని, (కర్త్రి) పదక్రియాపదము లేపద్యమందు లేవు గావునఁ గుళికము. ('క్వచి త్కుళికసంఖ్యా దావక్రియాహీన కృద్భవేత్' అని యథర్వణోక్తి.)

తె. కండకన్నులవాని, నాఁ § కటను బందు
 తిట్ల బేతాళికల సారెఁ § దిట్టువాని,
 నగగరిమవాని, నన్వర్థ § నాముఁ, గుంభ
 జాను వనుపొక్క ద్విజనిశా § చరునిఁ గనియె. 20

టీ. కండకన్నులవానిన్ = కండపెరిఁగిన కన్నులు గలవానిని, ఆఁకటను=ఆఁకటి చేతను, ('ఔపవిభక్తికనామ్నామత్వం స్యాత్సప్తమీతృతీయార్థే' అను సూత్రము

చేత నర్థము.) బందుతెట్లన్ = బూతుఁదిట్టులచేత, చేతాళికలన్ = ఆఁదుదయ్యాలను, సారెన్ = పల్మఱును, తిట్టువానిన్ = తిట్టుచుండెడువానిని, నగగరిమవానిన్-నగ=పర్వతము యొక్క, గరిమవానిన్ = గురుత్వమువంటి గురుత్వముగలవానిని, (కొండంతవాఁడనుట), అన్వర్థనామున్ = సార్థకనామధేయముగలవానిని, కుంభజానుపు అన్ = కుంభజానువను పేరుగల, (కుంభజాను వనఁ గుండలవంటి మోకాళ్లు గలవాఁ డనుట); ఒక్క = ఒక్కఁ డైన, ద్విజనిశాచరునిన్ = బ్రహ్మరాక్షసుని, కనియెన్ = చూచెను.

ఉ. వాఁడును గంటిఁ బోకు మని (వ్రాలె మహీరుహపాళి నుగ్గుగా
వీఁడును మున్ను రే పగటి (వేళకు మానిసి యాట-, బోరిలో
వాఁడిమిఁ గొంతకాల మిల (వ్రాలుట, లావరి యాట, నిల్చి యా
వాఁడిశరంబుచే నడువ, (వాఁ డది ద్రుంపుడు, వీఁడు నుద్ధతిన్. 21

టీ. వాఁడును = ఆబ్రహ్మరాక్షసుఁడును, కంటిన్ = చూచితిని, పోకుము అని = పోవకు మని, మహీరుహపాళి = చెట్లమొత్తము, నుగ్గుగాన్ = చూర్ణమగునట్లు, వ్రాలెన్ = దుమికెను, వీఁడును = ఈదాసరియును, మున్ను = పూర్వమందు, రేపగటివేళకున్ = రాత్రి యొక్కపగటియొక్కసమయమునకు, మానిసియాటన్ = తగినమనుష్యుఁడౌటచేత, పోరిలోన్ = యుద్ధమునందు, వాఁడిమిన్ = పరాక్రమముచేత, కొంతకాలము = కొన్నాళ్లు, ఇలవ్రాలుటన్ = భూమియందుఁ బ్రసిద్ధిపొందినవాఁ డగుటచేతను, లావరి యాటన్ = బలముగలవాఁడౌటచేతను, నిల్చి = ఎదిరించి, ఆవాఁడిశరంబుచేన్ = మున్ను దాను దెచ్చిన జోడ మ్మనియెడు బాణముచేత ('సంస్కృతపదేన పరిమిత మాంధ్రపదం కర్మధారయో భవతి' అను సూత్రముచేత, మఱియు 'నాంధ్రం షడ్వర్ణ పర్యంతం సంస్కృ తేన సమస్యతే' అను నథర్వణోక్తిచేతను 'వాఁడిమయూఖము ల్గలుగువాఁ డపరాంబుధిఁ జేరె... నేటికి న్రాఁడు కచుండు, అను వాగనుశాసనప్రయోగముచేతను సాధువు) అడు వన్ = కొట్టఁగా, వాఁడు = ఆరక్కసుఁడు, అది = బాణమును, ('ఇతరత్రచ ద్వితీయా తస్యాః ప్రథమాచ జడపదానాంస్యా' త్తనుసూత్రముచేత ద్వితీయకుఁ బ్రథమ.) త్రుంపు డున్ = విఱిచివేయఁగా, వీఁడును = ఈదాసరియును, ఉద్ధతిన్ = గర్వములో. తరువాతి పద్యములో నన్వయము.

సీ. తెగిచిన నడుగులు (దెమలక తొమ్మప్ప
లించి యవ్వలికిఁ[1]గే (డించి దాఁటి
చఱచిన వంచించి (చరమభాగమునకై
తిరిగి, [2]తత్క్రియ కగు (దృష్టి నిలిపి

1. జండించి. 2. తత్క్రియకును.

పైఁబడ్డఁ జనుమఱ ౹ పట్ల[1]కొడ్డుకయుండు
పిడికిళ్ల బలిమి లోఁ ౹ బడక నిలిచి
చౌరఁజూడఁ గ్రుంగి ము ౹ ష్టులబిగి కోటగాఁ
జౌరవీక తిరిగెడు ౹ చోన తిరిగి
తే. యసుర వధసాధనము రోయు ౹ నపుడు గ్రుద్ది
తాచి తిరిగినఁ గృతముష్టి ౹ దండ నిలిచి
[2]యెడకోలఁది వెనుక నడుమొయ్య ౹ నడిచి యడిచి
మత్పదస్మృతి యాత్మ నే ౹ మఱక యతఁడు. 22

టీ. తిగిచినన్=ఆరాక్షసుఁడు తన్నుఁబడలాగినను, అడుగులుదెమలక=తనయడుగులుగదలక, ఱొమ్ము=వక్షఃస్థలము, అప్పళించి = ఆస్ఫాలించి, అవ్వలికిన్ = ఆవలికి, కేడించి = తొలఁగి, దాఁటి = లంఘించి, చఱచినన్ = ఆరాక్షసుఁ డఱచేతవ్రేసినను, వంచించి=కికురించి, చరమభాగమునకై=వెనుకదిక్కునకై, తిరిగి=మరలి, తల్క్రియకగు=మఱలఁజఱచుటకైన, దృష్టి = చూపు, నిలిపి, పైఁబడ్డన్ = ఆయసుర తనపైఁబడి రాఁగా, చనుమఱపట్లకున్ = ఱొమ్ము మీఁదికి, ఒడ్డుకయుండు = కొనియుండెడు, పిడికిళ్ళబలిమిన్=ముష్టిబలముచేత, లోఁబడక = లోఁగువగాక, నిలిచి, చౌరఁజూడన్ = ఆయసురచొచ్చిరాఁబోఁగా, క్రుంగి = తాను వంగి, ముష్టులబిగి = పిడికిళ్ళబిగువే, కోటగాన్=వప్రముగా, చౌరవీక = చొరవ యీయక, తిరిగెడుచోన = ఆయసురతిరిగెడుచోటనే, తిరిగి, అసుర = ఆరక్కసుఁడు, వధసాధనము = తన్నుఁజంపెడునుపాయమును, రోయునపుడు=వెదకునప్పుడు, గ్రుద్ది = పిడికిటఁబొడిచి, తాఁచి=తన్ని, తిరిగినన్= వాఁడు తిరుగఁగానే, కృత=అమర్పఁబడిన, ముష్టి=పిడికిటియొక్క, దండన్ = ప్రాపున, నిలిచి, ఎడకోలఁది = సందుచిక్కినకొలఁదియు, వెనుక = వానివీఁపును, నడుము=మధ్యదేశమును, ఒయ్యన్ = క్రమముగా, అడచియడిచి = కొట్టికొట్టి, ('వెనుకనడుగొయ్య నడచినడచి' అనియును పాఠము గాని యప్పుడు వెనుకకుఁబోయియనుట) మత్పదస్మృతి=మాపాదానుచింతనమును, ఆత్మన్ = బుద్ధియందు, ఏమఱక = మఱచిపోక, అతఁడు = ఆదాసరి, (ఇది కర్తృపదము), (అసుర యనుచోట 'స్త్రీత్వ బహుత్వే సురాదే రసమాసే' అను సూత్రముచేత నది సురాదిగణపతితమైన నేకవచనమందు స్త్రీత్వము. 'కం. చంపునొకో యక్కట తా, రింపం దలఁచునొకొ లఘుచరిత్రంబులకుం, బంపఁ గదంగునొకో శం, కింపం డేక కఱకుటసుర గీ డొనరింపన్.' అని నిర్వచనోత్తరరామాయణ ప్రయోగము.)

1. కొడ్డుచునుండు. 2. యెక్కొలఁది వెన్కనడ నొయ్యనడిచి యడిచి.

తే. [1] త్రోఁచి పోఁజూడఁ దనరాక్షసీచయంబు
నెల్లఁ జీరిన డిగ్గి వా రేగుదేరఁ
బోయె నదె వాఁడు రారె రారే యటంచుఁ
బాఁటి వారును దారును బట్టికొనుఁడు. 23

టీ. త్రోఁచిపోఁజూడఁగన్ = ఆదాసరితట్టివైచిపోవ నుద్యోగింపఁగా, తనరాక్షసీచయంబు నెల్లన్ = తనరాక్షసస్త్రీలనందఱను, చీరినన్=పిలువఁగా, డిగ్గి=చెట్టు దిగి, వారేగుదేరన్ = వారు రాఁగా, వాఁడు = ఆమనుష్యుఁడు, పోయెనదె=అదిగోపోయెను, రారె రారే అటంచున్ = రండురండనుచు, ('ఏదోతౌ వ్యతిరేకా దపిసంప్రార్థనపరా క్రియాణాం స్త' అనుసూత్రముచేత వ్యతిరేకరూపము. మీఁది యేకారము సంప్రార్థనపరము.) పాటి=ఉటికి, వారును=ఆయాఁడు రక్కసులును, తాను = కుంభజానుఁడును, పట్టికొనుడున్ = ఆదాసరిని బట్టుకోఁగానే.

క. [2] పెంబోతద్దాసరి య
ప్డుం బదహతులను గపోణిపోటుల నిరుమై
లం బొడుచుచుఁ బెనఁగుచుఁ బో
వం బట్టి వటంబుఁ జేర్చి వాఁ డిట్లనియెన్. 24

టీ. పెంబోతు=పెనుబోతగు, (బలసినవాఁడనుట; బందోతని కొందఱందురు.) అద్దాసరి=ఆదాసుఁడు, అప్డున్=అప్పుడును, ('పోశ్చతదాద్యర్థవాచకేషుతౌ' అను సూత్రముచేతఁ బువర్ణోపరివిద్యమానమగు నుత్వమునకు లోపంబును 'తద్రుతంచ బిందుస్స్యాత్' అని చెప్పఁబడిన సూత్రముచేత ప్రథమాసమశబ్దముమీఁద సముచ్చయార్థక మగు ద్రుతంబునకుఁ బూర్ణబిందువును వచ్చినది.) పదహతులను=కాలితన్నులచేతను, కపోణిపోటులన్ = మోఁచేతిపోటులచేతను, ఇరుమైలన్ = రెండుప్రక్కలయందును, పొడుచుచున్ = పెనఁగుచు, పోవన్ = పోవఁగా, పట్టి = ఆదాసరిని బట్టుకొని, వటంబుఁజేర్చి = మఱ్ఱిచెట్టుదాపునఁజేరిచి, వాఁడు=ఆయసుర, ఇట్లనియెన్.

తా. ఆదాసరి బలవంతుఁ డగుటచేత నారక్కసునిఁ దనకాళ్లతోఁ దన్నుచు మోఁచేతులతో నాతనిప్రక్కలఁ బొడుచుచుఁ బెనఁగులాడుచుఁ బోవుచుండెను. అట్లయ్యు నారక్కసుఁ డాతనిఁ బట్టుకొని మఱ్ఱిచెట్టుకడఁ జేర్చి యాతనితో నిట్లు పలికెను.

శా. సారాస్వాదనఁ బ్రాణపంచకము తృష్ణం బాసి సంతర్పణ
స్ఫూరింబోనఁకిఁ ద్రుంచి పొంగెదు [3] భవన్మాంసాస్రధారోష్మ మిం

1. తాఁచి. 2. బందోతద్దాసరి. 3. భవన్మాంసంబు ధారోష్మ.

పారం గ్రోలి పిశాచి నీదు కఱకుట్లందీ నదస్తాలకాం
తారాంతర్నృకపాలకుండవిగళన్మైరేయముం [1]గ్రోలెదన్. 25

టీ. సారాస్వాదనన్ = నీ క్రొవ్వుఁజవిచూచుటచేత, ప్రాణపంచకము = నాపంచ ప్రాణములును, తృష్ణన్=దప్పిని, పాసి=విడిచి, సంతర్పణన్=తృప్తిచేత, మూరిఁబోన్= సంతోషింపఁగా, (క. 'మదిలోన నన్నుఁ దలఁచుచు, బదరీఫలమాత్ర హవ్యభాగము నలు నం, దొదవించి తేనియును న, భ్యుదయము నే నొంది మూరిఁ బోవని చెపుమా.' అనియును; గీ. 'గాడ్పుమురిపెంపు నెందును గల్గియెల్ల, వారిమనసులు వేడ్కల మూరిఁ బోయె' ననియును, హరివంశమునం దెఱ్ఱాప్రగడగారిప్రయోగము.) అసిన్=కత్తిచేత, త్రుంచి=ఖండించి, పొం...ము-పొంగెడు=పొంగుచున్న, భవ...ము-భవత్ ముద = నీబోడికలయొక్క, అస్రధారోష్మము=వెచ్చనిరక్తధారను, ఇంపారన్ = ఇష్టముదీఱు నట్లు, గ్రోలి=పానముఁజేసి, పిశాచి = ఈయాఁడుపిశాచము, నీదు = నీసంబంధియగు, కఱకుట్లు = కడ్డితోఁగుట్టికాల్చిన మాంసఖండములను, అందీన్ = అందియియ్యఁగా (క. 'నమ్మము కైదువ మోఁపగు, జమ్మి వెసం బ్రాఁకి విడిచి చాపము నా కం, దిమ్మనుడు సేయఁనది లే, కమ్ముగ్గుం దమ్మహీజ మలసత నెక్కెన్.' అని విరాటపర్వమునందును; క. 'ఇతఁడు మదీయ పురోహితుఁ, డితనికిఁ దగనెల్ల పనులు నెఱిఁగిం చిపుడే, ధృత రాష్ట్రకడకుఁ బనుపుఁడు, చతురవచన రచనఁగఱపి సంప్రీతి మెయిన్ ?' అని యుద్యోగ పర్వమందు సోమయాజిగారును ప్రయోగించినారుగాన నీక్త్వార్థకయిత్వసంధి సాధువు.) అ...మున్-అదః=ఈ, తాల కాంతార = తాటితోఁపుయొక్క, అంతః=లోపలనున్న, నృ = నరులయొక్క, కపాల = పుఱియ లనియెడు, కుండ = కుండలనుండి, విగళత్= జాఱుచున్న, మైరేయమున్ = మద్యమును, గ్రోలెదన్=త్రాగెదను, నృకపాలకుండ - పరిణామాలంకారము.

క. నన్నింత లయించినఖలు
నిన్నున్ ఋజువిధి వధింతుగనే యని యార్పుల్
మిన్నందఁగ బుస కొట్టుచు
నన్నీచుఁడు పొగరు వెడలు గనవ్యక్తోక్తిన్. 26

టీ. నన్నున్=నన్ను, ఇంత అలయించిన=ఇంతకష్ట పెట్టిన, ఖలున్=దుష్టుఁడైన, నిన్నున్=నిన్ను, ఋజువిధిన్ = మృదువైనరీతిచేత, వధింతునే = చంపుదునా, (చంప ననుట), అని=అనుచు, ఆర్పుల్ = బొబ్బరింతలు, మిన్నందఁగన్=ఆకసమంటఁగా, బుస

1. త్రాగెదన్.

నిట్టుచున్=నిట్టూర్పు విడుచుచు, అన్నిచుఁడు=ఆరాక్షసుఁడు, పొ...క్తిన్-పొగరు వెడలు=మదము బయల్పడునట్టి, అవ్యక్తోక్తిన్=ఉన్మత్తభాషణముచేతను.

తే. అసియుఁ బాత్రియుఁ దేఁ బంచి యాంత్రవల్లిఁ
గోలగగ్గర ద్రోయ నక్కుజముతోడ
నొరగి రక్కసుతో దైన్యవిరహితముగ
ధర్మ మెఱిఁగించుసూక్తి నాతండు పలికె. 67

టీ. అసియున్ = ఖడ్గమును, పాత్రియున్ = రక్తముఁబట్టుటకుఁ బాత్రమును, తేన్=తెచ్చుటకై, పంచి=ఆజ్ఞాపించి, ఆంత్రవల్లిన్=తీఁగెవంటిప్రేగుచేత, గోలగగ్గర ద్రోయన్ = కాళ్ళకుఁద్రాడు తగిలించి యెద్దును మూటకట్టుగాగట్టి పడవేయునట్లుగా పడవేసి, (గీ. ఎద్దులను గాళ్లగట్టి క్రిందవేయుటొప్పఁ గోలగగ్గర యనఁగ...' ఆంధ్రభాషార్ణవము.) అక్కుజముతోడన్=ఆమఱ్ఱిచెట్టుతో, ఒరగి, రక్కసునితోన్=రాక్షసునితో, దైన్యవిరహితముగన్=విన్నఁబాటులేనివిధమున, ధ...క్తిన్-ధర్మ మెఱిఁగించు=ధర్మపద్ధతిని దెలిపెడు, సూక్తిన్ = మంచిమాటచేత, ఆతండు = ఆహరిదాసుఁడు, పలికెన్ = వచించెను.

తా. ఆసురియాళుని బ్రహ్మరాక్షసుఁడుకట్టి, మఱ్ఱిచెట్టున గానింపఁగా, నతండు ధైర్యముతో నారాక్షసునిం జూచి యి ట్లనియెను.

చ. విను మొకమాట రాత్రిచర ! వేగిర మేటికి నీ జయింతురే
యనిమిషులైన ? భాజనగతాన్నమ నే నిఁక నెందుఁ బోయెదన్
బెనఁగక ప్రాణరక్షణ ముపేక్ష యొనర్చుట పాప మిందుకై
కనలకు నాకు మేనియెడఁ గాంక్షయు లే దిది పోవు టే యురున్.

టీ. రాత్రిచర=ఓరక్కసుఁడా, ఒక్కమాట వినుము, వేగిర మేటికిన్=వేగమేల, అనిమిషులైనన్=దేవతలేని, నీన్ జయింతురే=నిన్ను జయింపఁగలరా, (గెల్వలే రనుట), నేన్=నేను, భా...ము-భాజనగత=కంచములోకివచ్చిన, అన్నము = అశనమనే, నేను, ఇఁకన్ = ఇఁకమీఁద, ఎందుఁబోయెదన్ = ఎచ్చటికిఁ బోఁగలను (భావిక్రియ) పెనఁగక, ప్రాణరక్షణము = స్వజీవసంరక్షణము, ఉపేక్షయొనర్చుట=ఉపేక్షించుట, పాపము. ('హంతు మభ్యాగతం శత్రుం యశ్శక్త్యా న నివారయేత్, స ఆత్మఘ్న ఇతి ఖ్యాతో రౌరవం నరకం వ్రజేత్' అనియున్నది.) ఇందుకై=ఈపనికై, (ఇందనునది యేత దర్థకమగు దేశ్యపదము గావున దీనిమీఁదఁ జతుర్థీవిభక్త్యర్థకమగు కైవర్ణమువచ్చెను, కావుననే యిందుమీఁద నిందుచేత మొదలగునవి కలుగును.) కనలకు = అలుగకుము,

నాఁడె, మేనియెడన్ = శరీరముపట్ల, కాంక్షయున్ = అపేక్షయు, లేదు, ఇది= ఈమేను, పోవుటే=నశించుటే, ఉరున్=మేలగును.

ఆ. హీనజన్మ మఱుట ॥ యెవ్వఁడే నొకప్రాణి
సంతసిలుట ముక్తి ॥ పొంత గనుట
మేలెకాదె శిబియ ॥ మేల్బంతిగాఁడె న
శ్వరపుదేహ మమ్మి ॥ పరము గొనుట. 29

టీ. హీనజన్మము = చండాలజన్మము, అఱుట = పోవుటయును, ఎవ్వఁడేన్ = ఎవ్వఁడైనను, ఒక ప్రాణి = ఒక పురుషుఁడు, (ఏనిశబ్దమున కికారలోపము), సంతసిలుట= సంతోషించుటయు, ముక్తిపొంత = మోక్షసమీపమును, కనుట=పొందుటయు, మేలె కాదె=మంచిదేకదా, న...ము-నశ్వరపు = శాశ్వతముగాని, దేహము=తన శరీరమును, అమ్మి=వెలపుచ్చి, పరముగొనుట = మోక్షము గ్రహించుటయందు, శిబియ = శిబిచక్రవర్తియే, మేల్బంతిగాఁడె = మార్గప్రదర్శకుఁడుగాఁడా? (అగు ననుట.)

చ. తెవు లయినం, గ్రహం బయినఁ, ॥ దే లయినం, గర మైన, నాత్మ పెం
దెవు లయిన, న్జలం బయినఁ, ॥ దెక్కలియైన, మృగాగ్నులైన, మే
ల్తవు లయిన, న్వ్రణం బయినఁ, ॥ ద్రాఁ చయిన, న్బిడుఁగైనఁ, [1]దీర్చుపే
లవ తను పూర కే చెడ కిల న్గృశు నొక్కనిఁ బ్రోచు టొప్పదే

టీ. తెవులయినన్ = వ్యాధిమేనియు, గ్రహంబయినన్ = పిశాచమేనియు, తేలయినన్ = వృశ్చికమేనియు, గరమయినన్ = విషమేనియు, ఆత్మ పెందెవులయినన్=పెద్దమనోవ్యాధియేనియు, జలంబయినన్ = ఉదకమేనియు, తెక్కలియైనన్ = చోరుఁడేనియు, మృగాగ్నులైనన్=మృగములేనియు నగ్నియేనియు, మేల్తవులయినన్ = స్త్రీధనవ్యాసంగమైనను, వ్రణంబయినన్=పుండేనియు, (రణంబు = యుద్ధము) ద్రాఁచయినన్=సర్పమేనియు, పిడుఁగైనన్=అశనియేనియు, ఊరకే=వ్యర్థముగానే, చెడక = చెడిపోక, ఇలన్ = భూమియందు, కృశున్=ఆఁకలిచే గృశించిన, ఒక్కనిన్ = ఒక పురుషుని, ప్రోచుట = పోషించుట, ఒప్పదే = తగదా, (ఒప్పు ననుట.)

తా. రోగాదులచేత నీతనువు నశింపకుండ నాఁకలిగొన్న యొక్కనికిఁ దృప్తిగా నిచ్చుట మంచిదికదా యని యాతఁ డనెను.

వ. అది యట్లుండె నింకొక్క హితంబు సెప్పెద, నదియును బ్రాణ
భయంబున నాడు కార్యవశంపు మాటగాఁ దెలియక మాధ్యస్థ్యంబ

1. దీర్చుచేలవు తనుపూరకే-పాఠాంతరము.

కాఁ దెలిసి వినుము. వినకున్న భూతహితంబుఁ గోరి యుచ్చరించు మాట కీశ్వరుండైన మెచ్చుఁగదా ? వ్యాఘ్ర సింహ వరాహ వృక జంబుకాది శరారువులయం దొక్క తిర్యక్కవు గావు; దేవయోనివి, నీకును మాకుంబలెఁ గర చరణ ముఖాపఘనంబులు గలవు; మాటలను మాయట్ల యకర్తవ్యకర్తవ్యతావిచారంబులు సమానంబ, హా మఱచి యంటి; స్థావరంబులకంటెఁ గీటాదులకు, వానికంటె మఱి మృగాదులకు, వానికంటె మఱి పశు పతంగాదులకు, వానికంటెను మాకును, మాకంటెను మీకును, గరచరణ. కళేబరాది పాటవం బెక్కుడు, విజ్ఞానంబును ఘనం, బిట్టి నీ కేకాంత కుత్సావహంబగు బీభత్స [1]పథ్యాపథ్య భక్ష్యాభక్ష్య పేయాపేయవివేకంబులు లేకునికి యుక్తమే, రుచి గాదు శుచిగా దీసురాహారం బిదియు సకల దురితావతంస యగు హింస నొనగూడునది, హింస పరలోకంబునం గదా బాధకంబు, పరలోకంబు ప్రాణాంతంబునంగదా చిరస్థిరప్రాణుల మగు మా కేల హింసాభయం బన వలదు; ప్రాణభయంబు మనుష్యుల మగుమాకు నేఁడైన, మీకు మఱునాఁడైన నవలి నాఁడైనఁ దుద యుగాంతంబునందైన నిడుపు గుఱుచల నెప్పుడుఁదప్ప దంత వర్త్వంబునకుఁ దారతమ్యం బేమి? మున్నీటనైనను మునుంగుట సరి యగుటఁ బర్వతంబునకుం బరమాణువునకు నేమి యంతరంబు, మీఁదు విచారింప వలవదే, తపోలబ్ధవరాదులం బూర్వంబునం గీర్వాణుల గర్వం బడంచి పెచ్చిన హిరణ్యకశిపు దశముఖాదులు శతసహస్ర సంఖ్యాక సంవత్సరంబులు జీవించియుం బంచత్వంబుఁ బొంది తాము మున్ను జయించిన జముచేతనే చిక్కరే? యిక్కడికి మీరు ప్రబలులరైన నక్కడికి వాఁడు ప్రబలుండు, సకలభూత తారతమ్యంబును నిజ నిజస్థానవిశేషంబునన వచ్చు, నచ్చండాంశు సుతుని వీట మేర దప్పిన మాకుం దప్పనియట్ల బాధ మీకుం దప్పదు, మీరు నాసీరిముఖ బర్హిర్ముఖులు జాతిఁ దలపోయ భ్రాంతెఁట్లయ్యుం బరంబున మీరు వారు బాధ్యబాధకతల నొందు చున్నా రీతైజసం బగు తారతమ్యంబునకుం దపస్సత్త్వంబులు హేతువులు, వాని

1. వధ్యావధ్య.

కావ్యాహృతులు హేతువులు, వ్యాహృతులం గ్రతువుల చరుపురో
డాశాహుతులభుక్తులం బవిత్రులై యమర్త్యతమీకంటె నతిదీర్ఘ
కాలంబు వారు జీవించెద రప్పావనతఁ జూచికదా సదా చతుర్ముఖాం
శజుం డగు సుధాంశుండు గరంగి సకలరసముల కవధి యగు సుధా
రసంబున నాప్యాయనం బొనరించుచున్నవాఁ డేతదర్థంబు మా
కుచ్చరింపరాదుగాని [1]వేదంబు ప్రథమకళ యనలుండు త్రావు నని
చెప్పు, మఱియు నాయాకళ లాయావేల్పులకుం గ్రమంబునం
జెప్పు, నింత విచారించి రుచించినట్లు నడుపు మనినఁ గహకహ నవ్వి
యద్ద్రోహారికి సురద్రోహి యిట్లనియె. 31

టీ. అనియట్లుండెన్ = అనీతిమార్గము నుడివెను, ఇంకొక్కహితంబు సెప్పెదన్ = మఱియొక హితము వచించెదను, అదియును = ఆమాటయును, ప్రాణభయంబునన్ = ప్రాణభీతిచేత, ఆ...గాన్-ఆడు = వచించెదు, కార్యవశంపు = పనిగడపుకొనుటకైన, మాట కాన్ = పలుకుగా, తెలియక = తలంచక, మాధ్యస్థ్యంబ కాఁ దెలిసి=మధ్యస్థపు మాటగానె తెలిసి, వినుము = ఆలకింపుము, వినకున్నన్ = నీవు వినకుండినను, భూతహితంబుఁగోరి = లోకోపకార మపేక్షించి, ఉచ్చరించు మాటకున్=వచించెడు పలుకునకు, ఈశ్వరుండైనన్ = పరమాత్ముఁడైనను, మెచ్చున్ కదా = హర్షించునుగదా, వ్యాఘ్రసింహవరాహవృకజంబుకాది=పులి సింగము పంది తోఁడేలు నక్క మొదలగు, శరారువులయందున్ = ఘాతుకజంతువులయందు, ఒక్కతిర్యక్కవు కావు=ఒకతిర్యగ్జంతువవుగావు, దేవయోనివి = దేవతలలో నొక భేదమైనవాఁడవు, ('విద్యాధరోఽప్సరో యక్ష రక్షోగంధర్వకిన్నరాః, పిశాచో గుహ్యకస్సిద్ధో భూతోఽమీ దేవయోనయః'అని యమరము. అనఁగా, రక్షఃపిశాచములును దేవయోనులే యనుట.) నీకును మాకుంబలెన్ = నీకును మాకువలెనే, క...లు-కరచరణముఖ = కాలుసేతులు మొదలగు, అవయవంబులు= అవయవములు ('అంగం ప్రతీకోఽవయవోఽపఘనోఽథ కళేబరే' యని యమరము.) కలవు=ఉన్నవి, మాటలును మాయట్ల = సంభాషణము నుమావలెనే, అ...లు-అకర్తవ్య కర్తవ్యతా=చేయరాని చేయవచ్చిన పనులగుటయొక్క, విచారంబులు=ఆలోచనములు, సమానంబ=సమమే, హా = అహాహా, మఱచియుంటి = మఱచిపోయి యిట్లు పలికితిని, స్థావరంబులకంటెన్ = వృక్షాదిస్థావరంబులకంటెను, కీటాదులకున్ = పురుగులు మొదలగువానికిని, వానికంటెన్ = ఆకీటకాదులకంటె, మఱి = అధికముగా, మృగాదులకున్ = మృగములు మొదలగువానికిని, వానికంటెన్ = ఆమృగాదులకంటె, మఱి

1. వేదంబు ప్రథమకళ యనల మని చెప్పు.

పశుపతంగాదులకున్=పశుపక్ష్యాదులకును, వానికంటెను=ఆపక్ష్యాదులకంటెను; మాకును, మాకంటె మీకును, కరచరణకళేబరాది పాటవంబు = ఇంద్రియశరీరాది పటుత్వము, ఎక్కుడు = అధికము, విజ్ఞానంబును = విజ్ఞానంబును, ఘనంబు=అధికము, ఇట్టి నీకు, ఏ...బు-ఏకాంత=ముఖ్యముగ, కుత్సా=నిందకు, ఆవహంబగు=సంపాదకమైన, ('కుత్సా నిందా చ గర్హణే' అని యమరము.) బీ...లు-బీభత్స=రోఁతయైన, పథ్యాపథ్య=హితాహితములయొక్కయు, (వధ్యావధ్య యనుపాఠమునఁ జంపఁదగిన చంపఁదగని యని యర్థము), భక్ష్యాభక్ష్య=తినఁదగినవియుఁ, తినరానివియును అయినట్టివానియొక్కయు, పేయాపేయ = త్రాగఁదగిన త్రాగరానివానియొక్కయు, వివేకంబులు = జ్ఞానములు, లేకునికి=లేకుండుట, యుక్తమే=తగునా, (తగ దనుట) ఈదురాహారంబు = ఈదుర్భోజనము, రుచిగాదు=చవిగాదు, శుచిగాదు=పవిత్రముగాదు, ఇదియుం = ఈదురాహారమును, సకలదురితావతంసయగు=సమస్తపాపశేఖరమైన, హింసన్ = హింసించుట చేత, ఒనగూడునది=సంభవించునట్టిది, హింస=అట్లుహింసించుట, పరలోకంబునఁగదా = లోకాంతరంబునంగదా, బాధకంబు = బాధకము, పరలోకము = అట్టి లోకాంతరము, ప్రాణాంతంబునంగదా, = ప్రాణావసానమైనప్పుడుగదా, చిర = బహుకాలము, స్థిర = తిరముగానుండునట్టి, ప్రాణులమగు = ప్రాణములుగలమాకు, ఏలహింసాభయం బనవలదు= హింసలవలనవచ్చెడు వెఱపేలయనఁగూడదు, ప్రాణభయంబు=ప్రాణభీతి, మనుష్యులమగు మాకున్, నేఁడైనన్ = నేఁడుగలిగిన, మీకున్ మఱునాఁడైనన్, ఆవలినాఁడైనన్ = ఆమఱునాఁడైనను, తుదన్ = చివరను, యుగాంతంబునందైనన్ = యుగప్రళయమప్పుడేనియును, నిడుపుగుఱుచలన్ = దీర్ఘహ్రస్వకాలముగా, ఎప్పుడున్ తప్పదు, అంతవత్త్వంబునకున్ = చావుగలుగుటకు, తారతమ్యంబేమి=కాలముయొక్క హెచ్చుతగ్గులేమి, మున్నీటనైనన్ = సముద్రమందైనను, ('మువ్వన్నె ముప్పిద్దు మున్నీరు ముక్కాఁక ముచ్చిచ్చనఁగఁ గబ్బములను మఱియు, నిరువంక యిరువెస యిరుగెడ యిరువాఁగు ద్విగువేకవచనాంత మగుచుఁ దనరు.' అనుటచే నేకవచనాంత ద్విగుసమాసము.) మునుంగుట సరియగుటన్=మునిఁగిపోవుట సమానముగావున, పర్వతంబునకున్ = కొండకును, పరమాణువునకున్ = దృగ్గోచరముకాని నలుసునకును, ఏమియంతరంబు=ఏమిభేదము, ('కో మజ్జతోరణుకులాచలయోర్విశేషః' అన్నట్లు సముద్రమందుఁ బర్వతమేనియుఁ బరమాణువేనియు మునుఁగు ననుట.) మీఁదు=ముందఱకలుగునది, విచారింపవలవదే = ఆలోచింపవలదా, తపః = తపములచేత, లబ్ధ = పొందఁబడిన, వరాదులన్=వరములు మొదలగువానిచేత, పూర్వంబునన్ = తొల్లిటికాలమందు, గీ...బు-గీర్వాణుల=దేవతలయొక్క, గర్వంబు=పొగరు, అడంచి, హెచ్చిన=అతిశయించిన,

హి...లు - హిరణ్యకశిపు, దశముఖ=రావణాసురుఁడు, ఆదులు=మొదలగువారు, శ...లు - శతసహస్రసంఖ్యాక=నూఱువేలులెక్కగల, వత్సరంబులు=ఏండ్లు, జీవించియుఁ=బ్రదికియుండియును, పంచత్వంబుఁ బొంది = మృతినొంది, తారు మున్ను జయించిన=తాము పూర్వముజయించినట్టి, జము చేతనే చిక్కరే=యముని చేతనే పట్టుపడరా, ('ఈ జముఁ డనునది సంస్కృతభవ ప్రాకృత తత్సమము. 'జడామోనుఖసమాదయాః ప్రాకృత తత్సమా' యనియును; సీ. 'జడయను జముఁడను శబ్దము సంస్కృత ప్రాకృత సమమై ప్రశస్తిఁగాంచు'నన్నట్లనుట.) ఇక్కడఁ దకుఁ=ఈలోకమునకు, మీరు, ప్రబలుల రైనన్=బలవంతులరైనను, అక్కడికిన్=ఆలోకమునకు, వాఁడు = ఆయముఁడు, ప్రబలుఁడు=బలవంతుఁడు,స...లను-సకలభూత=సమస్తభూతములయొక్క,తారతమ్యంబును=ఎక్కువదక్కువలును, ని...న - నిజనిజ = తమతమ, స్థానవిశేషంబునన = స్థానబలము చేతనే, వచ్చున్=వచ్చును, అ...టన్-అచ్చండాంశుసుతుని=ఆయుష్ణకరుని కుమారుఁ డగు యమునియొక్క, వీటన్ = పట్టణమందు, మేర దప్పినన్ = దురాచారముఁ జేసిన మాకుం దప్పనియట్ల = మనుష్యులమగుమాకును దప్పనట్లుగానే, బాధ = నరకయాతన, మీకున్ తప్పదు=మీకునుదప్పదు, (పాపఫల మందఱకు నొక్కటే యనుట), మీరున్=రాక్షసులైనమీరును, ఆసౌరిముఖబర్హిర్ముఖులు = ఆయముఁడు మొదలగు దేవతలు, జాతిఁదలపోయన్=జాతిని విచారింపఁగా, భ్రాతలు=అన్నదమ్ములు, అట్లయ్యున్, పరంబునన్ = పరలోకమునందు, మీరువారును, బాధ్యబాధకతలన్=బాధ్యబాధకభావములను, ఒందుచున్నారు, (మీరు బాధింపఁబడువారును వారు బాధించెడువారు ననుట), ఈతైజసంబగు=ఈతేజస్సంబంధియగు, తారతమ్యంబునకున్ = హెచ్చుతగ్గులకు, తమ సత్త్వంబులు=తమ సత్త్వగుణములు, హేతువులు=వరుసగాఁ గారణములు, వానికిన్ = అట్టి తమస్సత్త్వగుణంబులకు, ఆహృతులు=ఆహారములు, హేతువులు = కారణములు, వ్యాహృతులన్ = భూర్భువరాదిమంత్రములచేత, క్రతువులన్ = యజ్ఞములయందు, చ...లన్ - చరు = అన్నముయొక్క, పురోడాశ = హవిస్సుయొక్క, ఆహుతుల = హవనములయొక్క, భుక్తులన్ = భుజించుటచేత, పవిత్రులై = పావనులై, అమర్త్యతన్=చావులేకుండుటచేత, మీకంటెన్, అతిదీర్ఘకాలంబు = మిక్కిలి నిడుపైన కాలము, వారు = ఆదేవతలు, జీవించెదరు = బ్రదికెదరు, అపావనత = అపవిత్రత్వమును, చూచితిరదా = ఈక్షించితిమేకదా, సదా = నిరంతరమును, చతుర్ముఖాంశజుండగు=బ్రహ్మాంశసంభూతుఁడైన, సుధాంశుఁడు = అమృతకరుండగు చంద్రుఁడు, కరంగి = తాను గరఁగి. సకలరసములకున్ = సకల మాధుర్యములకు, అవధియగు = పరమావధియగు, సుధారసంబునన్=తన యమృతరసముచేత, ఆప్యాయనంబు=తృప్తిని, పినరించు

చున్నవాఁడు = చేయుచున్నవాఁడు, ఏతదర్థంబు = ఈయర్థము, మాకున్ ఉచ్చరింపన్ రాదు కాని=మాకుఁ జెప్పఁగూడదుగాని, వేదంబు=శ్రుతి, ప్రథమకళ=చంద్రుని ప్రథమ కళను, అనలుండును=అగ్ని, త్రావు నని = పానముసేయు నని, చెప్పన్ = ప్రతిపాదించుచు, మఱియున్ = ఇంకను, ఆయాకళలు, ఆయావేల్పులకున్ = ఆయాదేవతలకు, క్రమంబునన్=వరుసగా, చెప్పన్, ఇంత=నేఁజెప్పిన యీయాయావదర్థమును, విచారించి = ఆలోచించి, రుచించినట్ల=నీకింపగునట్లె, నుడువు మనినన్=వర్తిల్లు మనఁగా, కహ కహ, (ఇది యనుకరణశబ్దము) నవ్వి=హసించి, ఆద్దోహారికిన్=ఆ మాలదాసరికి, సురద్రోహి = బ్రహ్మరాక్షసుఁడు, ఇట్లనియె.

క. చంపకు చదువుల మేము ప
ఠింపనిశాస్త్రములె? మాపఠింపని శ్రుతులే?
యింప వవి నమ్మవేఁ 'బ్రథ
మాం పిబతే వహ్ని' యనెడు మాటవుఁ గాదే. 32

టీ. చదువులన్=చదువులచేత, చంపకుము = బాధింపకుము, మేము, పఠింపని, చదువని, ('భవతి క్రియాపదానాం త్రివిధానామించుగాగమ' అను సూత్రముచేతఁ బఠించుచు, నని రాఁగా, 'వ్యతిరేకాదౌ భావినిచాత్స్యా' త్తను సూత్రముచేత సాచువర్ణకమున కత్వమువచ్చి, యా చవర్ణకమునకు 'వ్యతిరేకాదికేచచోఽపస్స్యా' త్తను సూత్రముచేతఁ బత్వమును దానిపైఁ 'బ్రతిషేధవాచినాం ని' యను సూత్రముచేత నివర్ణకమును వచ్చెను.) శాస్త్రములె=చదువులా, (అన్నియు మేము చదివితి మనుట) మా...లే-మా= మాయొక్క, పఠింపనిశ్రుతులే=చదువని వేదములా (ప్రథమార్థమందు షష్ఠి. 'సీ. తెల్లంబు గాదొ మీకెల్ల సుయోధను చేసిన కుటిల విచేష్టితములు', అని యుద్యోగపర్వము.) అవి = ఆవేదశాస్త్రములు, ఇంపవు = మాకు రుచింపవు, (ఇంచు అనుటకు మధుర మగు అని యర్థము. దీనికి ఆ. 'జిహ్వ మరలఁ బడఁగఁ జిలుకల కగ్నిశ, వించె సురలు చెవుల కించునట్టి, పలుకు వాని కొసఁగిరి' అని యానుశాసనికపర్వప్రయోగము. కావుననే యించువిల్కాఁ డని తియ్యవిల్తునకుఁ జెప్పుదురు; దీనికి వ్యతిరేకార్థమందు నా పత్వము వచ్చెను.) నమ్మవేన్=నమ్మవేని, [ప్రథమాంపిబతేవహ్నిః - ప్రథమాం పిబతేవహ్ని ర్ద్వితీయాం పిబతే రవి రిత్యాదివచనము.] ('లోపో నమ ఆదికే విసర్గస్య' అను సూత్రముచేత విసర్గలోపము.) అనెడు=అనునట్టి, (ఇది 'అనుకృతేఽస్తివాక్యంతు' అను సూత్రానుసరణముగా ననుకరణము.) మాటవున్, కాదే = అటుగాదా.

మ. నిలు మోహో మము వారిభాషిత లనుచున్ నీవంటి వారల్సుధా
శు లపూతాశులుగా రటంచి ప్రతిపక్షోన్మహాంశము న్గోలు మున్

జ్వలనుం డం టిం క నొండు ని న్నడి గెదర్ ॥ సర్వాశిగాఁడా? యతం
డిలఁ దన్యాయ్యయమ చాలు మారు నఘ మే?॥వృద్ధానుచారంబిఁకన్.

టీ. నిలుము = నిలఁవుము, ('కం. నిలువుము పిలువుము కొలువుము, గెలువుము విడువు మనఁగాఁ దగిన బహుశబ్దం, బుఁకుం దృతీయ వర్ణము, దొలఁగిన దోషంబు లేదు తుహినాంశుధరా.' అని యడిదము సూరయ కవిసంశయవిచ్ఛేదంబునం జెప్పి వీనికి నుదాహరణంబులఁ జెప్పినాఁడు.) ఓహో = పరిహాసార్థకము, మమున్ = మమ్మును, వారిభ్రాత లనుచున్=ఆదేవతల తోఁబుట్టువు లనుచును, నీవు అంటి=నీవు చెప్పితివి, వారల్=ఆదేవతలు, సుధాశులు = అమృతాశనులు, అపూతాశులుకారు=అపవిత్రాహారులు గారు, అటఁటి = అలాగంటివి, ప్ర...మున్ - ప్రతిపత్ = పాడ్యమినాటి, సోమాంశమున్ = చంద్రకళను, జ్వలనుండు = అగ్ని, మున్ = మున్నుగాను, క్రోలు నఁటి=పానము చేయుచునంటివి, ఇఁకన్ = ఇంకను, ('నిత్యమనుత్తమపురుషక్రియాస్వితి' యను సూత్రముచేత నిత్యసంధి,) ఒండు = ఒక సంగతి, ని న్నడి గెదన్, అతండు=ఆ యగ్నిహోత్రుఁడు, సర్వాశిగాఁడా = సర్వభక్షకుఁడుగాఁడా, ఇలన్ = భూమియందు, తన్యాయ్యయమే=అన్యాయమే, మారున్, చాలున్ = ఆచారము (పర్యాప్త మనియును జెప్పవచ్చును) ఇఁకన్ = ఇంకను, వృద్ధానుచారంబు = పెద్దల ననుసరించి నడుచుట, అఘమే=పాపమా, (కా దనుట.)

తే. హరికి సఖుఁడును రథమును ॥ నగుగరుడుఁడు
దొరకినమృతంబు సురలకు ॥ మరల నిచ్చి
యహులు కూడుగ వరమున ॥ నడిగి కొనఁడె?
యమృత మైనను జవుల జాత్యన్న సమమె? 34

టీ. హరికిన్=విష్ణునకు, సఖుఁడును = చెలికాఁడును, రథమును = వాహనమును, ('నాగాంతకో విష్ణురథః' అని యమరము.) అగు=అయినట్టి, గరుడుఁడు=గరుత్మానుఁడు, దొ...బు-దొరకిన = తనకు లబ్ధమైన, అమృతంబు = సుధను, సురలకున్ = దేవతలకు, మరల నిచ్చి=క్రమ్మఱనొసంగి, అహులు=సర్పములు, కూడుగన్ = తనకాహారముగా, వరమునన్=వరముచేత, అడిగి=యాచించి, కొనఁడె = గ్రహింపఁడా, అమృతమైనను = సుధ యేనియు, చవులన్=రుచులచేత, జా...మె - జాత్యన్న=తమ తమ జాత్యుచితాహారమునకు, సమమె=సరియగునా. (కా దనుట.) అర్థాంతరన్యాసము.

చ. నిదురయుఁ గూడఁ బోఁ జదివి ॥ నే నిటఁ గన్నదియేమి యెవ్వఁడీ
చదువుల యర్థవాదపుమృషల్ విని తేల్పెడు నీవు మాయెడం

జదువుల మాటలాడి కనఁగఁజాల వొకానొక మెచ్చు నొక్కఁ డీ
చదివినకూర వింతచవి క చాలఁగఁ దెమ్మను మెచ్చు తక్కఁగన్. 35

టీ. నిదురయున్ = నిద్రయును, కూడున్ = అన్నమును, పోన్=పోవునట్లు, చదివి = పఠించి, నేను, ఇటన్=ఇచ్చటను, కన్నది = పొందినది, ఏమి=ఏమి గలదు? ఎవ్వఁడు = ఏపురుషుఁడు, ఈ...ల్ - ఈచదువుల = ఈశాస్త్రములయొక్క, అర్థవాదపు=అర్థవాదసంబంధులగు, మృషల్ = కల్లమాటలు, విని = ఆకర్ణించి, వేల్పుదున్ = వేలుపోవును, (ఎవ్వఁడును వేలోవఁ డనుట), ఈవు = నీవు, మాయెడన్ = మాపట్లను, చదువుల మాటలాడి = శాస్త్రార్థప్రసంగముచేసి, ఒక్కఁడు = ఒక్కటి, ఈ...ర - ఈ చదివిన = పఠించిన, (చదిపిన యన్న పాఠమున నెరిచిన యని యర్థము) కూర=శాకము, వింతచవి = క్రొత్తరుచిగలది, చాలఁగఁదెమ్ము = చాలునంతతే, అను = ఇట్లనియెదు, మెచ్చు=శ్లాఘ, తక్కఁగన్ = వినా, ఒకానొక మెచ్చున్=ఒకానొక్కఁడైన శ్లాఘను, కనఁజాలవు = పొందఁజాలవు.

తా. ఈశాస్త్రప్రసంగముల వలన నేమి ప్రయోజనము లేదు. దీనికి వేలు పోవువాఁ డెవ్వండును లేఁడు. ఈ చదివినకూర క్రొత్త రుచి గలది; యా కూరనే మఱియు నింత పెట్టుమందును. నీ కీ చదువులచేత నావలన నంతకంటె నే మేలును గలుగదు. నీ వెన్ని చదివినను నిన్ను వధింపక విడువను-వ్యాఘాతాలంకారము.

వ. అని గీష్పతి మతం బవలంబించి నిజాలాప హేళనపరుం డైన రక్కసు కుతర్కోక్తులకుం గృష్ణస్మరణంబు సేసి, యిందులఁ బొందుపడు ప్రత్యుత్తరంబుల వీనిఁ గెలఁకిన బుద్ధిక్షోభంబుగా నింతకంటె నేమి యబద్ధంబులు వినంబడునో, మీఁదఁ గార్యంబు గల మాకు దీనిఁ గాదనం బని లే దని యందంబుఁ గూడుకొని ఛందోనువర్తనపరుం డై నీచసంస్మృతికి రోసి, తన్ముఖోల్లాసంబునకు శబ్దచ్ఛలంబున నంతర్గతంబున సుగతు నిడుకొని నీవు సర్వజ్ఞుండ వేను నరుఁడ, హీనకులుండ, ననభ్యస్తశాస్త్రుండ, నీ కుత్తరంబీ శక్తుండ నే, మద్వచనస్ఖాలిత్యంబులు సహించి దయచేసి నమ్మి మత్ప్రార్థనంబు గావింపుము. 36

టీ. అని=ఇట్లని, గీ...బు-గీష్పతి = బృహస్పతియొక్క, మతంబు=మతమును, అవలంబించి, ని...డు-నిజ = స్వకీయములగు, ఆలాప = పల్కులయొక్క, హేళన = పరిహసించుటయందు, పరుండు ఐన = ఆసక్తుఁడైన, ర...కున్ - రక్కసు=రాక్షసుని

యొక్క, కుశఙ్క = కుశంకలయొక్క, ఉక్తులకున్=మాటలకు, కృష్ణస్మరణంబుసేసి = కృష్ణకృష్ణ యనుకొని, ఇందులకున్ = ఈ నీతర్కములకు, పొం...న్ - పొందుపడు= సమాధానకరములగు, ప్రత్యుత్తరంబులన్ = బదులుమాటలచేత, వీనిన్ కెలఁకినన్=వీనిఁ గెరలించినను, బుద్ధిక్షోభంబుగాన్ = మనఃక్లేశమగునట్లు, ఇంతకంటెన్ = విన్నదాని కంటెను, ఏమియబద్ధంబులు = ఏమివినరానివి, వినఁబడునో, మీఁదన్ = తరువాతను, కార్యంబు గలమాకున్ = భగవత్సేవ యనుపనిగలిగినమాకు, దీనిన్ = వీఁడుచెప్పిన యీమాటను, కాదనం బని లే దని = కా దనుట కక్కఱ లేదని, అందంబుఁగూడు కొని=ఉల్లాసముఁదెచ్చుకొని, ఛందోవర్తనపరుండై - ఛందః = వానియిష్టముయొక్క, అనువర్తన=అనుసరించివర్తించుటయందు, పరుండై = ఆసక్తుఁడై, నీచసంస్మృతికిన్ = హీనస్మరణమునకు, రోసి = ఏవగించి, తన్ముఖోల్లాసంబునన్ = వానిముఖప్రీతికొఱకు, శబ్దచ్ఛలంబునన్ = శబ్దవ్యాజముచేత, అంతర్గతంబునన్ = మనస్సునందు, సుగతునిదు కొని=బుద్ధదేవు నునిచికొని, నీవు సర్వజ్ఞుండవు=నీవన్నియుం నెఱింగినవాఁడవు, ('సర్వజ్ఞ శబ్దమున కర్థాంతరము బుద్ధుఁ డనుట.) ఏను = నేను, నరుండ = మనుష్యుఁడను, హీన కులుండన్ = నీచజాతివాఁడను, అ...డన్ - అనభ్యస్త = అభ్యసింపఁబడని, శాస్త్రుం డన్=శాస్త్రములు గలవాఁడను, నీ కుత్తరంబీ శక్తుండనే=నీకుఁ బ్రత్యుత్తరమిచ్చుటకు సమర్థుఁడనా? (కా ననుట). మత్ = నాయొక్క, వచః=పలుకులయందలి, స్ఖాలిత్యం బులు=తప్పులను, సహించి = సైరించి, దయచేసి = కృపయునిచి, నమ్మి = విశ్వసించి, మత్ప్రార్థనంబు = నావేఁడుకోలును, కావింపుము.=చేయుము.

శా. ప్రఖ్యాతుం డవు దైత్యులందు మును పాపై నొక్క నీకా యశో
భిఖ్యన్నేనును జేర్తు మే యొసఁగుఁ దప్పింపన్వ్రతం బొక్కఁడే
ముఖ్యం బై యొనరింతు దాని సఫలంబు న్జేయఁగా లేవుగా
'సఖ్యం సాప్తపదీన' మన్న మిథస్సాంగత్య మూహించుచున్. 37

టీ. మునుపు = మొదలనే, దైత్యులందున్ = రక్కసులయందు, ప్రఖ్యాతుం డవు=ప్రసిద్ధుఁడవు, ఆపైన్=అందుమీఁద, ఒక్క = ఒక్కఁడైన, ఆ యశోభిఖ్యన్ = కీర్తికాంతిని, ('అభిఖ్యానామశోభయోః' అని యమరము.) నేను, నీకున్, చేర్తున్= సంపాదింతును, మే యొసఁగున్ = నాశరీరము నీ కిచ్చుటను, తప్పింపన్ = తప్పింపఁ జేయను, వ్రతంబొక్కఁడే=ఒక్కవ్రతమే, ముఖ్యంబువై=ముఖ్యముగాఁగలిగి,('అప్సరో నికురుంబ మాటలు పాటలు, నై వినోదింపఁగ నమరగణము' అనియును, ద్వాదశదినము లాతఁడు గారవింపంగ వర్తించి పండ్రెండువత్సరముల, ప్రాయమై రాజ్యసంప్రాప్తికి నేతెంచి యర్కుని యుదయంబు నస్తమయము, నగుచోట్ల పొలిమేర లైన' అను నీ

మొదలగు శాంతిపర్వప్రయోగములును; కం. 'కాచికొని వచ్చి తగవా, నేచిన యట్ల చట నచట నిలిపితి మునినా, థా చేటును భంగంబును, నై చిత్తము శోకమునకు నగ్గం బయ్యెన్.' అని మాసలపర్వప్రయోగంబును గలిమించేసి అగుధాతువునకు కలిమి అర్థముగాఁ జెప్పవలయును.) ఒనరింతున్ = చేయుదును, దానిన్=ఆవ్రతమును, సఖ్యం సాప్తపదీనమ్ అను=సఖ్యంసాప్తపదీనంస్యాత్తనువాక్యప్రకారము, (ఏడడుగులులోడ నడిచిన స్నేహము గలుగు ననుట) మ...ము-మన = మనయొక్క, మిత్రసాంగత్యము= ఒండొరులచెలిమిని, ఊహించుచున్ = తలంచుచును, సఫలంబున్=ఫలముతోఁగూడిన దానిఁగా, చేయఁగాలేవుగా=చేయలేవా. అనిప్రార్థన.

తా. మన మిరువురము చెలికాండ్ర మగుటవలన నావ్రతము సఫలము చేయు మని వానిని గోరుకొనెను. 38

వ. అది యెద్దియం టేని.

క. ఈకుఱుఁగటి యీకురుఁగుడి
వైకుంఠునిఁ బాడి వత్తు వ్రతముగఁ దత్సే
వాకృతి కడపట నశనము
నీ కౌదు న్ముఖ్య మిదియ నేఁ డగుతుదకున్. 39

టీ. ఈ...నిన్ - ఈ కుఱుఁగటి = సమీపమందలి, ఈకురుఁగుడి = ఈతిరుక్కురుంగుడియొక్క, వైకుంఠునిన్ = వెన్నుని, వ్రతముగన్ = నియమముగా, పాడి వత్తున్=గానముచేసివచ్చుచుందును, త...తిన్ - తత్సేవా = ఆకొలువనియెడు కృతి= కార్యముయొక్క, కడపటన్ = అంతమునందు, అశనము నీకున్ ఔదున్=నీ కాహార మగుదును, నేఁడగుతుదకున్=నేఁటితుదకు, ఇదియ=ఇట్లగుటయే, ముఖ్యము=శ్రేష్ఠము, వ్రతముగ కడపటనగునశనము, నీ కౌదు ననిపాఠాంతరముగల దట్లేని, తత్సేవే=ఆభగవంతునికొలువే, కడపటన్ = అంత్యమందు, అగున్ = అగును.

ఉ. అంచు నతండు వల్క దరహాసతఁ జెక్కిలిఁ గొట్టి లెస్స పం
డించితి వోయి దాసరి వనిం దెరువాటులు గొట్టికొట్టి మే
న్వొంచి విరక్తి దాసరివి నిన్నఁగదా యయినాఁడ వీవమున్
గొంచెముఁ జేసి త్రాడ్గొఱెకికొఁ దల పోసెదు మెచ్చితి న్నినున్.

టీ. అంచున్=ఇట్లనుచు, అతండు=ఆదాసుఁడు, పల్కన్=చెప్పఁగా, దరహాసతన్=చిఱునగవుగలుగుటచేతను, చెక్కిలిఁగొట్టి = చెంపపైఁగొట్టి (చిఱునగవునఁ జెంప మీఁద మెల్లనఁగొట్టె ననుట) ఓయిదాసరి, లెస్సపండించితివి = చక్కఁగాఁబొంకముఁ జేసితివి, వనిన్ = అడవియందు, తెరువాటులుగొట్టికొట్టి = త్రోవదొంగతనములు

చేసి, మేనొంచి = శరీరముఁ బెంచుకొని, విరక్తిన్ = వైరాగ్యముచేత, నిన్నఁగదా = నిన్న టిదినమునఁ జేకదా, దాసరివయినాఁడవు, ఈమమ్మున్ =ఇట్టి మమ్మును, కొంచెముఁజేసి= తగ్గువఱచి, త్రాడ్గొటికికొన్ = ఉచ్చుగొయికొనుటకును, (తప్పించుకొనిపోవుటకనుట, త్రాడనుపదంబున డువర్ణముమీఁది యుత్వమునకు లోపము వచ్చినది) తలపోసెదు = ఆలోచించెదవు, నిన్నున్ = నిన్ను, మెచ్చితిన్ = మెచ్చుకొంటిని, (ఇట్లు పరిహాసించె ననుట.)

శా. ఏరాజ్యంబునరుండు నోరికడివో ♦ నీబోధ మాలించు నిం
కేరాజ్యంబునరుండు బాసకయి మే ♦ నీఁ దాన యేతెంచుఁ దీ
పార న్నేఁ జననీమియు న్మగిడి నీ ♦ వారామియుం దెల్ల మే
లా రంతు ల్పలుపల్కు లంత్యకుల! యేలా చింత లేలా వగల్. 41

టీ. ఏ...దు-ఏరాజ్యంబు = ఏదేశమందలి, నరుండు=ప్రాణి, నోరికడి పోన్= నోటి కందినకబళము పోవునట్లు, ఈబోధము = ఈయుపదేశమును, ఆలించున్=వినును. (ఎవ్వఁడును వినఁ డనుట) ఇంకన్ =మఱియును, ఏరాజ్యంబునరుండు=ఏసీమపురుషుఁడు, బాసకయి = తనప్రమాణము (చెప్పినమాట) నిలుపుకొనుటకై, మేను = శరీరమును, ఈన్ = ఇచ్చుటకు, తాన = తనకుఁదానే, ఏతెంచున్ = వచ్చును, (ప్రమాణముఁ జేసితినే యని యెవ్వండును రాఁ డనుట) తీపారన్ = రుచిమీఱఁగా, (ప్రీతిచేత ననుట) నేన్ = నేను, చననీమియున్ = పోనియ్యకుండుటయును, మగిడి = తిరిగి, నీవు, ఆ రామియున్ = ఆరాకుండుటయును, తెల్లము = స్పష్టము, అంత్యకుల = చండాలుఁడా, ఏలా రంతుల్ = రచ్చ లేమిటికి, పలుపల్కులు = పెక్కుమాటలు, ఏలా, చింతలు ఏలా = విచారములేల, వగల్ ఏలా = దుఃఖములేల.

తా. ఏదేశమందైనను దన నోటి కందిన యాహారమును విడిచెడువాఁడును లేఁడు, బాసయిచ్చి వచ్చితి నని తనశరీర మొక్కని కాహారముగా నొసఁగినవాఁడును లేఁడు, కావున నిన్ను విడుచుటయు లేదు, నీవు మరల వచ్చుటయును లేదు. చండాలుఁడా! నీ మాట నమ్ముదునా, యింక నీ యఱపులతోడను విచారములతోడ నధిక ప్రసంగములతోడను దుక్కులతోడను బ్రయోజనము లేదుసుమా!

తే. అనినఁ జెవి మూసి నారాయణా యటంచు
నతఁడు నను నమ్మవేఁ బితృతతి యొక్క
శపథమున నమ్ము మని వాఁడు ♦ సమ్మతింప
వేనవే ల్సత్యములు పల్కి ♦ వినకయున్న. 42

టీ. అనినన్ = ఇట్లనఁగా, చెవిన్ = కర్ణమును, మూసి = ఆచ్ఛాదించుకొని, నారాయణా యటంచున్, ఆదురుక్తి విన్నపాపము పోవుటకై నారాయణ స్మరణ చేసి, అతఁడు = ఆదాసుఁడు, పిశితాశి = ఓరాక్షసుఁడా, ననున్ నమ్మవేన్ = నన్ను నమ్మనిచో, ఒక్కశపథమునన్ = ఒకప్రమాణముచేత, నమ్ముము అని = విశ్వసింపుమని, వాఁడు, సమ్మతింపన్ = ఒప్పికొనునట్లు, వేనవేల్ సత్యములు = వేలకొలఁది సత్యములు, పల్కి = వచించి, వినకయున్నన్ = వాఁ డంగీకరింపకుండఁగా.

ఉ. ఎవ్వనిచూడ్కిఁ జేసి జనియించు జగంబు వసించు నిజ్జగం
బెవ్వనియందు డిందు మఱి యెవ్వనియం దిది యట్టి విష్ణుతో
నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకి నౌదు నేఁడ నే
నెవ్విధినైన ని న్గదియనేని యన న్విని బంధ మూడ్చినన్. 43

టీ. నేఁడ = నేటిదినమే, నేన్=ఏను, ఎవ్విధినైనన్=ఏచొప్పుననేనియును, నిన్ కదియనేని = నిన్నుఁజేర రాకపోతినా, ఎవ్వనిచూడ్కిఁజేసి=ఏపురుషుని వీక్షణము చేత, జగంబు = జగత్తు (అంత్యహల్లోపమై జగం బని యయ్యె), జనియించున్ = కల్గునో, ఎవ్వనియందున్ = ఏపురుషునియందు, ఇజ్జగంబు = ఈజగము, వసించున్ = నిలుచునో, ఇది = ఈజగము, మఱి = పిమ్మటను, ఎవ్వనియందున్=ఏపురుషునియందు, డిందున్ = లీనమగునో, అ...తోన్ - అట్టి = తాదృశుఁడైన, విష్ణుతోన్=వాసుదేవునితో, ఇవ్వలన్ = ఈవలను, ఒక్కవేల్పున్=మఱియొకదేవతను, గణియించిన = సరిగా లెక్కఁబెట్టిన, పాతకి నౌదున్ = పాపముగలవాఁడనౌదును, (విష్ణునితో మఱియొక దైవము సమాన మని చెప్పుటకంటె నధిక మగు పాపము లే దనుట) అనన్ = ఇట్లనఁగా, విని = ఆలకించి, బంధమూడ్చినన్ = కట్టువిప్పఁగానే,

తా. నేటిదినమే నిన్ను నే నేప్రకారముగానైనఁ జేర రాకపోతినేని విష్ణునితోడ సరియగు నొక దేవుఁడున్నాఁ డని చెప్పెడు వాని పాపమునఁ బోఁగలవాఁడ నని యాదాసుఁడు ప్రమాణముఁ జేయఁగా, నా రక్కసుఁడు మాఱు పల్కక కట్టు విడిచెను. ఈపద్యములో నీపద్యమును పోల్చి చూడుఁడు: "ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై, యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం, బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁదానయైనవాఁ, డెవ్వఁడు వానినాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్." భాగ. ౮ ఆ. ౭౩.

చ. అతఁడు తదల్పపాపఫల మందుట సుంకము దీఱె పోయి త
చ్ఛతదళపత్త్రనేత్రునకుఁ జాఁగిలి మ్రొక్కి .రణద్విపంచియై

స్తుతికలితప్రబంధములఁ । జొక్కఁగఁ బాడి యసత్యభీభర
ద్రుతగతి వచ్చి రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తి నిట్లనున్. 44

టీ. అతఁడు=ఆదాసుఁడు, త...ము-తదల్ప = అకొంచెమైన, పాప = పాపము యొక్క, ఫలముఅందుట = ఫలమునుబొందుటయనెడు, సుంకము = అభ్యంతరము, (బంధింపఁబడినఫల మనుట) తీర్చి = చెల్లించుకొని పోయి, తచ్ఛతదళపత్రనేత్రునకున్ = ఆకమలదళనయనుఁడగు తిరుక్కురుంగుడిస్వామికి, చాఁగిలిమ్రొక్కి=దండవత్ప్రణామముఁ జేసి, రణద్విపంచియై - రణత్ = మ్రోయుచున్న, విపంచియై=వీణగలవాఁడై, స్తు...లన్ - స్తుతి = నుతులతోడను, కలిత = కూడుకొన్న, ప్రబంధములన్=గ్రంథములచే, చొక్కఁగన్ = స్వామిసంతోషించునట్లు, పరవశమొందునట్లు, పాడి=గానముఁ జేసి, అ...తిన్ - అసత్యభీభర = అప్రమాణ భయాతిశయముచేత, ద్రుత = వేగముగల, ('లఘుక్షిప్రమరం ద్రుతమ్' అని యమరము.) గతిన్=గమనముచేత, వచ్చి, రాత్రిచరుతోన్=అరక్కసునితో, వ్రతపూర్తి = వ్రతపూరణముచేత, గత=పోయిన, ఆర్తి = పీడచేత, ఇట్లనున్=ఈ ప్రకార మనును.

ఉ. నీచెఱఁ బాసి పోయి రజనీచర చక్రి భజింప ముక్తిపొం
దేచెర యేచెఱం దవుల । నే నిఁక నుండఁగఁ జూడు పంచుచో
నేచరణంబు లేయుదర । మేయుర మేశిర మేకరంబు లీ
వాచరణంబు లాయుదర । మాయుర మాశిర మాకరంబులున్. 45

టీ. రజనీచర = ఓయిరేద్రిమ్మరీ, నీచెఱన్ = నీనిర్బంధమును, పాసి = విడిచి, పోయి = చని, చక్రిన్ = స్వామిని, భజింపన్ = సేవింపఁగా, ముక్తి = మోక్షము యొక్క, పొందు = స్నేహము, ఏచెర = హెచ్చునురా, ఏన్ = నేను, ఇఁకన్=ఇఁక మీఁద, ఏచెఱన్=ఏనిర్బంధమందును, తవులన్=చిక్కుపడను, పంచుచోన్=నన్నుఁ బనుచునప్పుడు, ఏచరణంబులు = ఏపాదములో, ఏయుదరము=ఏకడుపో, ఏయురము= ఏవక్షస్స్థలమో, ఏశిరము = ఏశిరస్సో, ఏకరంబులు = ఏహస్తములో, ఆచరణంబులు, ఆయుదరము, ఆయురము, ఆశిరము, ఆకరంబులున్, ఈవు = నీవు, ఉండఁగన్ చూడు= సరిగానుండఁ జూచికొనుము. వృత్త్యనుప్రాసము.

తా. నీ చెఱ వదలి పోయి స్వామిసేవఁ జేసి యెల్ల బంధములు వదలి వచ్చి వాఁడను, నీవు నన్నుఁ బంపు నప్పుడే కాళ్లకడుపు నేవక్ష మేశిర మేహస్తములు గలిగియుంటినో, యాకాళ్ల మొదలగునవి యిప్పు డుండఁ జూచికొమ్మని చెప్పెను.

తే. అనినఁ దత్సత్యమునకు నేత్రాంబు లురలఁ
బ్రమద పులకితగాత్రుఁ డై । పాలు టసుర

యినుని మధ్యందినపుటెండ తనదు పెద్ద
బట్టతల మించఁ బ్లవు జేరఁ బాఱుతెంచి. 46

టీ. అనినన్ = ఇట్లనఁగా, తత్సత్యమునకున్-తత్ = ఆదాసరియొక్క, సత్యమునకున్ = నిక్కవమునకు, నేత్రాంబులు = ఆనందబాష్పములు, ఉరలన్ = స్రవింపఁగా, ప్ర...డు-ప్రమద = సంతోషముచేత, పులకిత = గగురుపాటిన, గాత్రుఁడై = శరీరముగలవాఁడై, పాఱఁటసుర = బ్రహ్మరాక్షసుఁడు, (తే. 'పాఱుఁదల్లుఁడుతమ్ముఁడ న్పదములోలి, దగు సమాసములైన డుత్వములు వాయు, నల్లువాండ్రనఁ బాఱువాండ్రనఁగఁ దమ్ముఁ, గుఱ్ఱ లనఁ దెన్గుపదములు గొన్ని యిట్లు' అని యడిదము సూరయగారు కవిసంశయవిచ్ఛేదంబునఁ జెప్పిరిగావున నిది సంగతమయ్యె) ఇ...డ-ఇనుని = సూర్యుని యొక్క, మధ్యందినపుటెండ = మధ్యాహ్న సంబంధియైన యెండ, త...లన్-తనదు = తనసంబంధియగు, పెద్దబట్టతలన్ = బట్టతలయందు, మించన్ = తళతళమెఱయుచుండఁగా, ప్లవున్ = ఆసురిమాలని, ('చండాలప్లవమాతంగ దివాకీర్తిజనంగమాః' యని యమరము.) చేరన్ = సమీపించునట్లు, పాఱుతెంచి = పఱువెత్తి వచ్చి.

ఉ. కొండయుఁబోలె భక్తి వలఁ గొంచునె వాఁడు నిజద్రుమభ్రమీ
హిండన వ్రాలుపాకలపు యేనుఁగుఁబోలె నొస ల్తదంఘ్రులం
దుండ రొదన్ మహాగిరులు హోరనఁ బ్రస్తుతి వ్రాలి దంష్ట్రికా
దండము లెత్తి పట్టినపదం బొకఁడొక్కఁడ నెత్తిఁ జేర్చుచున్. 47

టీ. వాఁడు = ఆరాక్షసుఁడు, కొండయుఁబోలెన్ = పర్వతమువలె, భక్తిన్ = భక్తిచేత, వలఁగొంచునె = ప్రదక్షిణముసేయుచునె, ని...నన్-నిజ = తన్నుఁగట్టిన, ద్రుమ = వృక్షముయొక్క, భ్రమీ = చుట్టు తిరుగుటయొక్క, హిండనన్ = ఆవృత్తిచేత, వ్రా...లెన్-వ్రాలు = పడునట్టి, పాకలపు = పాకల మను రోగముగల, (ఆ రోగము వచ్చినప్పుడు మదముచేత శిరస్సు పగులునందుకు. 'గజరోగస్తుపాకల'యని నిఘంటువు) ఏనుఁగుఁబోలెన్ = గజమువలెనే, నొసల్ = ఆ రాక్షసుని లలాటము, తదంఘ్రులందున్ = ఆ దాసుని పాదములయందు, ఉండన్ = తగిలియుండునట్లు, రొదన్ = తనకంఠధ్వనిచేత, మహాగిరులు = పెద్దకొండలు, హోరనన్ = ప్రతిధ్వనియియ్యఁగా, ప్రస్తుతి = స్తోత్రము చేతను, వ్రాలి = ప్రణామముచేసి, దంష్ట్రికాదండము = దండములవంటి నిడుకోఱలు, ఎత్తి = మీఁదికెత్తి, పట్టిన = తానుబట్టుకొన్న, పదంబు = ఆదాసరి పాదమును, ఒకఁడొక్కఁడ = ఏకైకముగా, నెత్తిన్ = తనశిరమునందు, చేర్చుచున్ = ఉంచుకొనుచు.

తా. కొండవంటి శరీరముగల యారక్కసుఁడు హరిదాసునకుఁ బ్రదక్షిణము సేయుచుఁ దనమ్రోఁతచేత నద్రులు మాఱ్మోయఁగాఁ బ్రస్తుతిసేయుచు నా దాసరి

పాదముల వ్రాలఁగా, నేనుఁగు తనకట్టు కంబముచుట్టు తిరిగి బృంహితధ్వనితో నేలవ్రాలిన ట్లుండెను, మఱియు నా బ్రహ్మరాక్షసుఁ డాసురియాళువైష్ణవుని పాద మొక్కఁ డొక్కఁడె మెల్లన నెత్తి భక్తిచేత నెత్తిమీఁదఁ బెట్టుకొనెను.

శా. ఈసర్వంసహ దేవదానవమహీ ॥ భృన్మౌనివాచాతప
 శ్శ్రీసర్వస్వము నేతదన్యకృతులం ॥ జెప్పంబడు న్ఘోర మా
 నీసత్యం బురరీకృతాంత మిల నేం ॥ తే వృద్ధనై మంటి నే
 నాసత్యం బిఁక నిన్నుఁబోలెఁ గృతసం॥ధా ధూర్వహు ల్లేమికిన్. 48

టీ. ఈసర్వంసహన్=ఈభూమియందు, దే...మున్-దేవ=వేల్పులయొక్కయు, దానవ = రక్కసులయొక్కయు, మహీభృత్ = పుడమిఱేండ్రయొక్కయు, మౌని = జడదారులయొక్కయు, వాచాతపః = వచనరూప తపస్సులయొక్కయు, శ్రీ = సంపదలయొక్క, సర్వస్వమున్ = అంతయుఁను, ఏ...లన్-ఏతత్ = ఈ శరీరదానవాక్యముకంటె, అన్య = ఇతరములైన, కృతులన్ = కార్యములయందు, చెప్పంబడున్= వచింపఁబడును, (దేవాదులంద ఱితరవిషయములందు సత్యములు చెల్లించుకొనిరేకాక యిట్లు మేనువిడుచుటకై నెఱవేర్చుకొన రనుట) ఘోరమా=భయంకరమైన, ('ఘోరం భీమం భయానక'మ్మని యమరము.) నీసత్యము=నీఋతము, ఉరరీకృతాంతము - ఉరరీకృత = అంగీకృతమగు, అంతము=అవధిగలది, (రాద్ధాంత మనుట) ఇలన్ = భూమియందు, నేను, ఎంతేన్ = మిక్కిలియు, వృద్ధనై = పెద్దవాఁడనై, (తే. 'ఉత్తమజ్ఞానవృద్ధునా నుండెనేని, బాలుఁడయ్యును బూజ్యుండు బ్రాహ్మణుండు' అని సభాపర్వంబునను, ఆ. 'దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ, మాటవినడు దురభిమానఘనుఁ'డని యుద్యోగపర్వంబునను; చ. 'అవినయబుద్ధి వై హరికి నర్ఘ్య మయోగ్యమ యంటివీవు మూ, ర్ఖవు శిశుపాల యింతఁ బలుక న్వలసె న్సభలోన'నని సభాపర్వంబునను; ఉ. 'ఆదిఁ దొడంగి మూఁడుకృతు లంధ్రకవిత్వ విశారదుండు వి, ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్,' అని విరాటపర్వంబునను బ్రయోగంబులుండుటం జేసి వృద్ధ సాధువయ్యె.) మంటిని = బ్రతికితిని, ఇఁకన్ = ఇంతటినుండి, నిన్నున్ పోలెన్ = నీవలెను, కృ...కిన్-కృత=చేయఁబడిన, సంధా = ప్రమాణముయొక్క, ధూర్వహుల్=భారము నిర్వహించుకొనువారు, లేమికిన్=లేకుండుటకు, నా సత్యంబు= నా ప్రమాణము, (నేను బ్రమాణముఁ జేసెద ననుట.) వ్యతిరేకాలంకారము.

తా. దేవతలయందును, రాక్షసులయందును, మునులు రాజులు మొదలగువారియందును నీసత్యము లేదు; నీసత్యమే సిద్ధాంతము. దీనికి నేను బెద్దవాఁడను గావున నీతో సమానులగు సత్యవంతులు లే రని ప్రమాణముఁ జేసెదను.

చ. ఇతరులు నీకు నీడె మఱి యీధృతి నీస్మృతి నీఋతేరిత
స్థితగతి నీమురారిపద సేవన [1]జీవనవన్మతిన్ సమా
దృతకలగాన [2]సింధు లహరీ ప్లవన ప్లవభావ భాగురు
శ్రుతి తతబద్ధతుంబికిఁ గురుంగుడినంబికృపావలంబికిన్. 49

టీ. సమాదృత=ఆదరింపఁబడిన, కల=అవ్యక్తమధురమగు, గాన=పాట యనెడు, సింధు=నదియొక్క ('సింధుర్నాసరితిస్త్రియామ్' అని యమరము,) లహరీ = ప్రవాహమునందు, ప్లవన=తేలుటయందు, (విహరత్ అను పాఠమున విహరించుచున్న యని యర్థము). ప్లవభావ=తెప్పయాటను, ('ఉడుపంతు ప్లవః కోల' అని యమరము.) భాక్=పొందిన, ఉరు=అధికమైన, శ్రుతి=సుతిచే, తత=దండెయందు, ('తతంవీణాదికంవాద్య' మ్మని యమరము.) బద్ధ=కట్టఁబడిన, తుంబికిన్ = సొరకాయగలిగినట్టియు, కురుంగుడి=కురుంగుడి యను నామధేయము గల దివ్యదేశమందలి, నంబి=నంబి యను తిరునామము గల స్వామియొక్క; కృపా=దయను, అవలంబికిన్=అవలంబించినయట్టి, నీకున్, ఈ ధృతిన్=ఈ ధైర్యముచేతను, ఈస్మృతిన్=ఈ జ్ఞానముచేతను, ఈ ఋతేరిత=ఈ సత్యవాక్యముయొక్క, (సత్యంతథ్యమృతం సమ్యక్' అని యమరము.) స్థిత=నిలుకడయైన, గతిన్=ప్రాప్తిచేతను, ఈమురారిపదసేవన=ఈ శ్రీకృష్ణపాదసేవచేత, జీవనవత్=బ్రతుకు గల (సేవనవత్తనుపాఠమున భగవత్సేవానిత్యసంబంధముగల యనుట) మతిన్ = బుద్ధిచేతను, మఱి యితరులు=మఱి యన్యులు, ఈడె=సమానమా, (ఎవ్వరును సమానులు గారనుట.) వ్యతిరేకాలంకారము.

తా. జలప్రవాహములయందీఁతకాయలు తేల్చునట్లే, గానరసప్రవాహమందు మునుఁగకుండ నీ వీణకాయయుఁ దేల్చును. కడమ సుగమము.

తే. అనిన నాతనిఁ గౌఁగిట నునిచి పలికె
వ్రత మొనర్పించి తని భాగవతవతంస
మోయి రజనీచరేంద్ర నీయొక్క కృపారి
టాతుమునఁ జేసి ధన్యుఁడనైతి నసఘ ౫౦

టీ. అనినన్=ఇట్లనఁగా, భాగవతవతంసము = ఆపరమభాగవతుఁ డగు దాసరి, వ్రతము=తన గానవ్రతమును, ఒనర్పించితి అని=నీవునావ్రతము నెఱవేర్పించితి వని చెప్పుచు, ఆతనిన్=ఆరక్కసుని, కౌఁగిటన్ ఉనిచి = ఆలింగనముచేసికొని, పలికెన్ = వచించెను, ఓయిరజనీచరేంద్ర=ఓరాక్షసశ్రేష్ఠుఁడా, నీ...వన్-నీ=నీయొక్క, ఉరు=

1. సేవన. 2. విహరత్.

అధికమగు, కృపా=దయతోడి, కటాక్షమునన్ చేసి=క్రేఁగంటిచూపుచేత, అనఘ = ఓయి పాపరహితుఁడా, ధన్యుఁడనైతిన్ = కృతార్థుఁడ నైతిని.

ఉ. బాసలు బండికండ్లు మఱి ప్రాణభయంబున లక్షసేసినం
గ్రాసము కృచ్ఛ్రలబ్ధ ముడుపంగ వసమే యిది నీక చెల్లె నో
భూసురవంశపుణ్యజన పుణ్యజనాంకము తావకీనమే
పో సమకూరెడిం గులముపొత్తున దైత్యులకెల్ల నంకతన్. 51

టీ. బాసలు=ప్రమాణములు, బండికండ్లు = చక్రములవంటివి (లేదా బాసలు బండికండ్లన్నది, తాయిరప్పు, త్రాష్ట తగుళ్లను వానివలె నాడెడుమాట) మఱి = అధికముగా, ప్రాణభయంబునన్=ప్రాణభీతిచేత, లక్షసేసినన్=నూఱువేలు చేసినను, కృచ్ఛ్రలబ్ధము = ప్రయాసముచేత వచ్చినట్టి, ('స్యాత్కష్టం కృచ్ఛ్రమాభీలమ్' యని యమరము.) గ్రాసము=ఆహారమును, ఉడుపన్ = విడుచుటకు, వసమే=వశమా (శక్యముగాదనుట), ఇది=ఇట్లు విడుచుట, నీక చెల్లెన్ = నీకే యొప్పెను, ఓ భూసురవంశ్యపుణ్యజన=ఓ బ్రాహ్మణవంశమునఁబుట్టిన పుణ్యాత్ముఁడా, లేక, ఓ బ్రహ్మరాక్షసుఁడా, ('యాతుధానః పుణ్యజనః' యని నిఘంటువున్నది కావునఁ బుణ్యజనశబ్దమునకు రాక్షసుఁడు నర్థమగును) పుణ్యజనాంకము = పుణ్యజనుఁడనెడు బిరుదు, తావకీనమే పో = నీసంబంధియైనదే, కులము పొత్తునన్ = కులసామ్యముచేత, దైత్యులకెల్లన్ = రక్కసులకెల్లను అంకతన్ = నామధేయ మగుటచేత, సమకూరెడిన్ = కలుగుచున్నది.

తా. నీవింత పుణ్యాత్ముఁడవుగావునఁ బుణ్యజనుఁడనుబిరుదు నీకే చెల్లెను, ఇంతియ కాక, నీకులమువా రగుటవలన రాక్షసుల కందఱకును నీకు వచ్చిన పుణ్యజననామమే వచ్చె నని భూషించెను. నిరుక్త్యలంకారోత్థాపితమైన యుత్ప్రేక్ష.

చ. కడుపు మహాక్షుధ న్నకనకంబడ నన్గృతకృత్యుఁ జేయఁ బో
విడిచితి వేము జాత్యముగ వేధవిధించినకూడు మాకు నీ
యెడ నొకకీడు కల్గ దిఁక నే మనిన న్మఱి నీకు నానసూ
బడలిక దీఱ నిత్తనువుఁ బారణసేయుము మైత్రి గల్గినన్. 52

టీ. కడుపు=నీయుదరము, మహాక్షుధన్ = పేరాఁకలిచేతను, నకనకంబడన్= సొటసొటలఁబోవఁగా, (ఇవి జాతి సాధారణభాషలు) నన్=నన్ను, కృతకృత్యున్ = కృతార్థునిఁగా, చేయన్=ఒనరించుటకు, పోవిడిచితివి = విడిచిపెట్టితివి, వేము=మేము, మాకున్, జాత్యముగన్=జాత్యుచితముగా, వేధ=బ్రహ్మదేవుండు, విధించిన=నిర్ణయించిన, కూడు=ఆహారము, (మాకు మానవులమైన మేమే యాహారమనుట). ఈయెడన్=

ఈకార్యమునందు, ఒకకీడు కల్గదు = మీ కొకదోషమును లేదు, ఇఁక నే మనినన్ = ఇంతట నీవేమేనియుఁజెప్పినను, మఱినీకు నాన సూ = మఱినీకు నొట్టుసుమా, మైత్రి గల్గినన్ = నాయందు స్నేహముండెనేని, బడలికదీఱన్ = నీశ్రమదీఱునట్లు, ఇత్తనువున్ = ఈనాదేహమును, పారణముసేయుము = భుజింపుము.

క. ఈమాట న్బొరపొచ్చెము
లేమికి నీశ్వరుఁడ కరి నిలింపవిరోధీ
నామెయి మేదోమయ దృ
ప్తామిషములు మెసవు మన్న నతఁ డను నార్తిన్. 53

టీ. నిలింపవిరోధీ = ఓయి రాక్షసుఁడా, ఈమాటన్ = ఈవాక్యమందు, పొరపొచ్చెము=కపటము, లేమికిన్ = లేకుండుటకు, ఈశ్వరుండు=అంతర్యామియగు పరమాత్ముఁడే, కరి=సాక్షి, నా...లు - నామెయి=నాశరీరమందలి, మేదోమయ=మెదడుగల, దృప్త = క్రొవ్వియున్న, ఆమిషములు = మాంసములను, మెసవుము=మెక్కుము. అన్నన్ = అనిచెప్పఁగా, అతఁడు = ఆరాక్షసుఁడు, ఆర్తిన్ = జాలిచేత, అనున్ = ప్రత్యుత్తర మిచ్చెను.

శా. ఎట్టా యి ట్టగునయ్య పల్కఁ దయలే కిన్నాళ్లు నీకూడె యీ
పొట్టం బెట్టి మహాఘలబ్ధిదనువుం బోషించి యెన్నాళ్ళ కే
నెట్టే నొక్కతపస్వి యొక్కవ్రతి రాఁడే చూడఁడే తత్కృపన్
బుట్టు న్నీఁగెద దీని నా నొదవి యో పుణ్యాత్మ యె ట్లంటివే. 54

టీ. ఎట్టా = ఎట్లు, (ప్రశ్నార్థకము) ఇట్టు = ఈప్రకారము, దయలేక=కృపమాలి, పల్కనగునయ్య = పల్కవచ్చునటయ్యా, ఇన్నాళ్లును = జరిగినంతకాలమును, ఈకూడె = ఈమనుష్యమాంసాహారమే, ఈపొట్టంబెట్టి = ఈనింద్యమైన డొక్కలోఁబెట్టుకొని, మ...బ్ధిన్ - మహాఘ = మహాపాపముచేత, లబ్ధిన్=ప్రాప్తించిన దానిచేత, తనువున్=శరీరమును, పోషించి = పెంచుకొని, ఎన్నాళ్లకేనిన్=ఎన్నిదినములకైనను, ఎట్టేని = ఏరీతిగానైనను, ఒక తపస్వి = ఒక తపసి, ఒక్కవ్రతి = ఒకనియమముగలవాఁడు, రాఁడే=రాఁడా, చూడఁడే = వీక్షింపఁడా, (ఇవి వ్యతిరేక ప్రశ్నార్థకములు) తత్కృపన్ = వానిదయచేత, పుట్టున్ దీనిన్ = ఈజన్మమును, నీఁగెదన్ నాన్=పాపికొనియెద నని తలఁచుచుండఁగా, ఒదవి = అట్లు లభించి, ఓపుణ్యాత్మ = ఓయి పుణ్యాత్ముఁడా, ఎట్లంటివే = ఏవిధముగా నంటివి.

తా. ఇదివఱలోఁ గలకాలము నీ మానవ మాంసమే యాహారముగాఁ గొనుచుండి మేను పెంచుకొని, యెన్నఁటికైన నొక్క సన్యాసియైన రాఁడా, యొక్క

భర్తుఁడైన రాఁడా, నన్నుచూడఁడా, యాయనదయచేత నీపాపపుజన్మముఁ బోఁగొట్టుకొందు నని యున్నందులకు నీ వట్లువచ్చియు నే మంటివి ?

క. మీవంటి భాగవతులుం
బావనులుగఁ జేయ రేని § మఱిగతి యేదీ
మావంటివారి కిఁక మా
యేవము వెనుకటిది చూడ § కీక్షింపు కృపన్. 55

టీ. మీవంటి భాగవతులు, పావనులు కన్ = పవిత్రులగునట్లుగాను, చేయ రేని=చేయకుండిన, ఈమావంటివారికిన్, మఱిగతి=గత్యంతరము, ఏదీ=ఏదీ? ఇఁకన్= ఇంతటను, వెనుకటిది = పూర్వము గలిగిన, మాయేవము = మాహేయమును, (అకృత్యమనుట) చూడక = ఆలోచింపక, కృపన్ = దయచేత, ఈక్షింపుము = చూడుమా.

తే. స్వధితియైనను ద్విజుఁ దిన్న § శస్త్రమైన
సరియకాఁ గాంచనము చేయుఁ § బరుసవేది
యీయసాధారణన్యాయ § మెన్నవలదె
మాదృశులచోటఁ గదియు భ § వాదృశులకు. 56

టీ. పరుసవేది = స్పర్శవేధి యనియెడు సిద్ధరసము, స్వధితి ఐనను=గొడ్డలియైనను, ('ద్వయోఃకుఠారస్స్వధితి' అని యమరము.) ద్వి...నన్ - ద్విజు = విప్రుని, తిన్న = సంహరించిన, శస్త్రమైనన్ = ఆయుధమైనను, సరియకాన్=సమానముగానే, కాంచనమచేయున్=బంగారే చేయును, (స్పర్శవేధి యినుమును బంగారముచేయుట ప్రసిద్ధము) మాదృశులచోటన్=మావంటివారియెడల, క...కున్-కదియున్=చేరవచ్చునట్టి, భవాదృశులకున్ = మీవంటివారికి, ఈయసాధారణన్యాయము=ఈవిశేషన్యాయమును, ఎన్నవలదె = గణింపవలదా? అనఁగా గణింపవలయు ననుట.

తా. పరుసవేది యినుమును సువర్ణముగ జేసినట్లే మీరు మమ్ముఁ బవిత్రులను జేయవలయును. దృష్టాంతాలంకారము.

తే. అనిన దేహార్పణము నొల్ల § కార్తిఁ బలుకు
కృపణత కతఁ డభిప్రాయ § మెద్ది యనిన
నిత్తుఁ దను వంట యనుకంప § యే మదాత్మ
కసటుఁ బాపుటయే యనుకంప గాక. 57

టీ. అనినన్ = ఈరీతిఁ బలుకఁగా, దేహార్పణమున్ = శరీరము నిచ్చుటను, ఒల్లక=ఇచ్చగింపక, ప...కున్ - పలుకు=ఆరక్కసుండు పచించునట్టి, కృపణతకున్ = దైన్యమునకు, అతఁడు = ఆదాసరి, అభిప్రాయము = రాక్షసుఁడ వైననీతాత్పర్యము,

ఎద్ది యనినన్ = ఏది యనఁగా, మదాత్మ=నాయాత్మయొక్క, కసటున్ = బ్రహ్మరక్షస్త్వరూపమగు మాలిన్యమును, పాపుటయే = పోఁగొట్టుటయే, అనుకంప కాక = దయగాని, ('కృపాదయానుకంపాస్యాత్' అని యమరము.) తనువు=శరీరమును, ఇత్తునంట= ఇచ్చెద ననుట, అనుకంపయే = కనికరమా, (కా దనుట).

తా. దేహసమర్పణము నొల్లక జాలిఁబడి వేఁడుకొన్న యారక్కసునిఁ గాంచి; యాదాసరి నీయభిప్రాయ మే మని యడుగఁగా, వాఁడు నా బ్రహ్మరక్షస్త్వము వదల్చుటయే దయగాక శరీర మిచ్చెద ననుట దయగా దని చెప్పెను.

శా. ఘంటాకర్ణుని మించుకర్మమొకో నాకర్మంబు మౌనీంద్రులం
దుంటల్సేయఁడె మాన్పి యీఁడె భగవంతుం డట్టి శ్రీ యట్టి శ్రీ
కంటె న్భాగవతుండు మించ నొసఁగం డే గా లేఁడె యామేలు నా
కంటింప న్మఱి రాదె పూజనము గాదా ప్రాణిమే ల్చక్రికిన్. 58

టీ. నాకర్మంబు = నేఁజేసినచెడ్డపని, ఘంటాకర్ణునిన్ = ఘంటాకర్ణుఁడనువాని, మిం...కొ-మించు = అతిశయించెడు, కర్మమొకొ=కర్మమే మోకా, మౌనీంద్రులన్ = మునిశ్రేష్ఠులను, తుంటల్సేయఁడె=(వాఁడు)నఱికివేయలేదా, భగవంతుండు=షడ్గుణైశ్వర్యసంపన్నుఁ డగు శ్రియఃపతి, మాన్పి = ఆ పాపము నుడిపి, అట్టి శ్రీ = అట్టిసంపదను, ఈఁడె = ఈయఁడా, (మోక్షపదవి నిచ్చె ననుట) అట్టి శ్రీకంటెన్=అటువంటిసంపదకంటెను, మించన్ = అధికమగునట్లు, భాగవతుండు=ఆభగవద్దాసుఁడు, ఒసఁగంగాన్ లేఁడె=ఇయ్యలేఁడా, మఱి=ఇంకను, ఆమేలు = అట్టియుపకారమును, నాకున్, అంటింపన్రాదె = కలుగునట్లుచేయఁగూడదా, ప్రాణిమేలు = ప్రాణికొఱ కగునుపకారము, చక్రికిన్=శ్రియఃపతికి, పూజనముగాదా=పూజించుటగాదా, ('సంతోషంజనయేత్ప్రాజ్ఞ స్తదేవేశ్వరపూజనమ్' అన్నట్లుగా జనులకు సంతోషముఁజేయుటే యీశ్వరునిఁ బూజించుట యనుట. దీనికి, 'జనస్యాశయమాలక్ష్య యో యథా పరితుష్యతి, తం తథైవానువర్తేత పరారాధన పండిత' యని అష్టాంగహృదయందుఁ బ్రమాణాంతరము గలదు.)

తా. ఘంటాకర్ణునికంటె నే నెక్కుడగు పాపము సేయలేవనియును, శ్రియఃపతి యాతనిపాతకము లడంచి చెప్పనలవిగానియట్టి మహోన్నతపదవి నొసంగలేదా, యాభగవంతునికంటె నెక్కుడుగా భాగవతులు నొసంగలేరా, యట్టి యుపకారము నీవు నాకుఁ జేయఁగూడదా, యొకప్రాణికి మేలు సేయుటయే పరమేశ్వరునిఁ బూజించుట కాదా, కావున నన్ను రక్షింపు మని యా రాక్షసుఁడు వేఁడికొనెను.

వ. అనిన విని మాతంగుం డాతెఱం గేతెఱంగైన సంగతం బగు ననిన
నాతం డే నొక్క బ్రహ్మరాక్షసుండఁ గుంభజానుపంజ్ఞుఁడ నుగ్ర

కర్ముండ నై యీన్యగ్రోధం బాశ్రయించి వంచనం బథికపంచజన
చర్వణంబు సేయుచుండుదు. పూర్వంబున సోమశర్మ యనుభూబ
ర్హిర్ముఖుండఁ బ్రాగ్జని ద్విజుండఁ గాన దయనీయుండన యొక్క
దుష్కర్మంబున నిట్లైతి నీవు కైటభారిం బాడిన నేఁటి పాటఫలంబు
సజలంబుగా నా కిచ్చితేని బీభత్సకుత్సార్హం బగు నీజన్మంబు వేఁగు,
నీకు నార్తరక్షణంబున నగు సుకృతం బనంతంబు సిద్ధించు, నత్యంత
ధర్మసాధనం బగు నిమ్మేను నిల్లుసేరు ననిన, (నమ్మేని) మాటలకుఁ గల
కల నవ్వి యవిష్ణుదాసుం డి ట్లనియె. 59

టీ. అనినన్ విని=ఇట్లనఁగా నాలించి, మాతంగుండు=ఆసురియాళు, ఆతెఱంగు=ఆరీతి, (బ్రహ్మరక్షస్స్వనివృత్తి యనుట) ఏతెఱంగైనన్=ఏవిధమైనను, (ఏమి చేయఁగా ననుట) సంగతం బగు ననినన్ = అనుకూలించు ననఁగా, ఆతండు, ఏనొక్కబ్రహ్మరాక్షసుండన్, కుంభజానుసంజ్ఞుండన్=కుంభజాను వను పేరుగలవాఁడను, ఉగ్రకర్ముండనై - ఉగ్ర = ఘోరములగు, కర్ముండనై = కృత్యములు గలవాఁడనై, ఈన్యగ్రోధంబాశ్రయించి=ఈమఱ్ఱిచెట్టునఁజేరికొని, వంచనన్ = మోసముచేత, ప...ఖు-పథిక=మార్గస్థులగు, పంచజన = మనుష్యులయొక్క, చర్వణంబు = నమలుటను, చేయుచుండుదున్ = కావించుచుందును; (మనుష్యులను భక్షించుచుందు ననుట) పూర్వంబునన్=పూర్వకాలమందు, (ఈబ్రహ్మరాక్షసుఁడను గాకము న్ననుట) సోమశర్మయను = సోమశర్మ యను పేరుగల, భూబర్హిర్ముఖుండన్ = భూమిసురుండను, ప్రాగ్జనిద్విజుండఁ గానన్ = పూర్వజన్మమున బ్రాహ్మణుఁడను గావున, దయనీయుండన = దయసేయఁదగినవాఁడనే, ఒక్కదుష్కర్మంబునన్ = ఒక దుష్కార్యముచేత, ఇట్లైతిన్ = ఈవిధముగా నైతిని, నీవు, కైటభారిన్ = శ్రియఃపతిని, పాడిన = గానముచేసిన, నే...ఖు-నేటి=ఈదినము యొక్క, పాటఫలంబు = గానఫలము, సజలంబు గాన్ = ఉదకధారాపూర్వకంబుగా, నాకున్ ఇచ్చితేని = నాకు నొసంగితివా, బీభత్స కుత్సార్హంబగు-బీభత్స=రోఁతకును, కుత్స = నిందకును, అర్హంబగు = తగినట్టి, ఈజన్మంబు = ఈబ్రహ్మరాక్షసజన్మంబు, వేఁగున్=కడతేరును, నీకును, ఆర్తరక్షణంబునన్ అగు = దీనసంరక్షణచేత గలిగెడు, సుకృతంబు = పుణ్యము, అనంతంబు = మితిలేనిదై, సిద్ధించున్ = ఒనఁగూడును, అత్యంత = మేరమీఱిన, ధర్మ = ధర్మమునకు, సాధనం బగు = ఉపాయమగు, ఇమ్మేనున్ = ఈనీశరీరమును, ('శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' అని ప్రమాణము.) ఇల్లుసేరు ననినన్ = నీయిల్లుసేరు ననఁగా, అమ్మేనిమాటలకున్ = ఆశరీరముకొఱకగు మాట

లకు, కలకల (ఇది యనుకరణ శబ్దము) నవ్వి = పరిహసించి, ఆవిష్ణుదాసుఁడు=ఆభాగ వతుఁడు, ఇట్లనియెన్ = ఈవక్ష్యమాణ క్రమముగాఁ జెప్పెను.

తా. శరీరము నీయిల్లు సేరు నని రక్కసుఁ డనియెఁ గావున, తన శరీరముం దపేక్ష లేని యాదాసుఁ డందులకు నవ్వెను. కడమ సులభము.

క. ఇటువంటివి యిట కెక్కుడు
  నిట దిగుడువి యొంద నెన్ని యే నిదియును నొ
  క్కటి యొకనాఁటిద కా దొక
  త్రుటి గీతఫలంబు నొసఁగు దునె యిమ్మెయికిన్. 60

టీ. ఇటువంటివి = ఇట్టి శరీరములును, ఇట కెక్కుడువి=ఇంతకధికములగు శరీరములును, ఇట దిగుడువి = ఇంతకుఁ దక్కువగు తనువులును, ఎన్నియేని = ఎన్నియైనను, ఒందన్=పొందను, (అనేక తనువులు దాల్చియున్నా ననుట) ఇదియును=ఈదేహము, ఒక్కటి = ఇదివఱకుఁ జెందినవానిలో నొకటి, ఇమ్మెయికిన్=ఈశరీరమునకై, ఒకనాఁటిదకాదు = ఒకనాఁటి పాటఫలమేకాదు, ఒకత్రుటి = ఒక చిటిక వేయునంతకాలము యొక్క, గీతఫలంబున్ = గానఫలమును, ఒసఁగుదునె = ఇత్తునా, ఇయ్య ననుట.

తా. ఇటువంటి శరీరములు నింతకు మించినవియును దక్కువైనవియు ననేకము లెత్తియున్నాఁడను గావున, నాశరీరములలో నిది యొక్కటేకాని, దీనికొఱకు నా పాటఫల మొక్కనాఁటిదే కాదుగదా యొక్క వ్రేల్మిడి ఫలమైన నియ్య నని చెప్పెను.

సీ. దిక్పాలతను వెత్తి తిరిపంపుఁదనుఁ దోన
    యెన్నిమార్లెత్త మిాఁదయేను నీవు ?
  మాతంగతను వెత్తి మశకంపుఁదనుఁ దోన
    యెన్నిమార్లెత్తమిాఁదయేను నీవు ?
  కేసరితను వెత్తి కీటంపుఁదనుఁ దోన
    యెన్నిమార్లెత్త మిాఁదయేను నీవు ?
  ధరణీశతను వెత్తి దాస్యంపుఁదనుఁ దోన
    యెన్నిమార్లెత్త మిాఁదయేను నీవు ?
తే. సోమయాజుల మెన్నిమాఁర్లాము శ్వపచ
  ఖగకులుల మెన్నిమాఱులు గాము పాము
  గాములమ యెన్నిమాఱులు గాము వెండి
  కంసరిపుభక్తుల మొకండె కాము గాని. 61

టీ. కం...ము-కంసరిపు=కృష్ణునికి, భక్తులము = సేవకులము, ఒకండె=ఒక్కఁడే కాముగాని, ఈ యేనును=ఈ నేనును, ఈవు=నీవును, ది...వు-దిక్పాల = ఇంద్రాద్యష్ట దిక్పాలకులయొక్క, తనువు=శరీరమును, ఎత్తి=తాల్చి, తోన = వెంటనే, తి...నుక్-తిరిపంపు = భిక్ష మెత్తెడు, తనుక్ = శరీరమును, ఎన్నిమార్లు=ఎన్నిపర్యాయములు, ఎత్తము=ధరింపము, (ఇంద్రాదులమై సంపద లనుభవించియుఁ బుణ్యక్షయము కాఁగానే మరల భిక్షుకులమై నీవును నేనును బెక్కుమాఱులు భూమిపైఁ బుట్టితి మనుట) ('తోన యెన్నిమార్లెత్త మీయేనునీవు' అనునర్థమునే తక్కిన మూఁడుపాదంబులందును గ్రహించునది) మా...వు - మాతంగ=ఏనుంగుయొక్క, తనువు = శరీరమును, ఎత్తి, మశకంపుఁ దనుక్ = దోమశరీరమును, (కడమ సుగమము) కేసరితనువు = సింహశరీరమును, ఎత్తి, కీటంపుఁ దనుక్=పురుగురూపమును (కడమ సుగమము), ధరణీశతనువు=రాజశరీరమును, ఎత్తి, దాస్యంపుఁదనుక్ = బానిసరూపును (కడమ సుగమము), సోమయాజులము=యజ్ఞములను జేసినవారము, ఎన్నిమార్లాము = ఎన్నిమాఱులు గాలేదు, (అనేక పర్యాయములైతి మనుట) శ్వపచ = శునకమాంసభక్షకులము, ఖగకులులము=పక్షిజాతులము, ఎన్నిమాఱులుగాము = ఎన్నిపర్యాయములైయుండలేదు. పాముగాములము=సర్పములును పిశాచములను, (గా మన్నది గ్రహశబ్దభవము) ఎన్నిమాఱులుగాము = ఎన్నిపర్యాయములై యుండలేదు.

తా. నీవును నేనును దిక్పాలాద్యనేకజన్మము లెత్తినామేకాని, యేజన్మమందేని విష్ణుభక్తిగలవారము గాము, కావున మరల మరల నాజన్మములు వచ్చుచుండెను, విష్ణుభక్తి గలిగిన పిదప జన్మము లేదు. వ్యతిరేకాలంకారము.

ఆ. [1]ఊఁతనీరు చెలఁది ౹ నేఁత మూటాయిటి
దూది యెండపసుపు ౹ తోఁట్టియక్క
రంబు మేను దీని ౹ రహిఁ బుణ్య మమ్ముట
కప్పురంబు వెట్టి ౹ యుప్పు గొనుట. 12

టీ. మేను=శరీరము, (ఊఁత యనఁగా, అడుగున లావుగను పైని సన్నముగను నుండునట్లు రెండువైపుల మూఁతలేకుండఁగ వెదురుపేళ్లతో నల్లిన మత్స్యగ్రహణ సాధనము, "గీ.ఊఁత యలజళ్ళఁ జెఱువుల నుండరాక, కార్మొసళ్లు నెగళ్లను గవులువిడిచి, తరలి చెంతలనూలిగుంతలవసించె."వేం.పంచ.౧.ఆ.౨౮౮. "సీ.వలమునజాలంబుపరఁగు...తద్భేదమొప్పు నూఁతన..."ఆంధ్రభాషార్ణవము. ౧. ౧౫౮.)ఊఁతనీరు=ఊఁతలోనిలుచు నీరు (ఊఁతలో నీరు నిలువదు కనుక మిక్కిలి క్షణిక మని భావము.) చెలఁదినేఁత=సాలెపుర్వు

1. పూఁతనీరు, ఈఁతనీరు.

నేసిన నేఁతతోఁ గట్టిన, మూట, ఆఱుటిదూది=ఎండకాలము గాలిలోఁ బెట్టినదూది(బూరుగు దూది యని కొందఱు) ఎండపసుపు = ఎండలో నునిచిన పసుపు, (ఎండలో నునిచిన పసుపునకు వర్ణము చెడు ననుట; మఱియును సాయంప్రాతఃకాలములయందు నెండలో నునిచినవస్తు వాక్షణము మాత్రము పచ్చగా నుండు నావల నుండదు గాన నా వర్ణమని కొంద ఱందురు) తొట్టియక్కరంబు=బోసినోఁటివాఁ డుచ్చరించిన యక్షరము, (పురుఁగు దొల్చిన యక్షర మని కొంద ఱందురు) (అనఁగా మేను వీనివలెనే శాశ్వతముగాక నష్ట మగు ననుట] దీనిరహిన్=దీనిప్రకాశమునుగూర్చి, (కర్మప్రవచనీయకము లేకయే కేవల ద్వితీయమీఁద నాయర్థము వచ్చును. అందులకు, ఆ. 'అరుగుదెంచి యన్నయడుగులఁ గడు సార్త, నాద మదరఁ బ్రెళ్ళి నాథుఁ బనవి, యేడ్చుచున్న నల్లయెత్తి యమ్ముద్దియఁ, దడవి కన్ను నీరు దుడిచి యతఁడు.' అని యుత్తరరామాయణమునందు సోమయాజి ప్రయోగమును మఱికొన్నియుం గలవు.) పుణ్య మమ్ముట=పుణ్యము విక్రయముచేయుట, కప్పురంబు = కర్పూరమును, పెట్టి=ఇచ్చి, ఉప్పు=లవణమును, కొనుట=గ్రహించుటయే,

తా. ఈ యస్థిర మగు శరీరముకొఱకుఁ దన పుణ్యమును వ్యయముచేయుట కర్పూర మమ్మి యుప్పుగొనుటయే యగును. రూపకనిదర్శనముల సంసృష్టి.

వ. అనిన దనుజుం డి ట్లనియె. 63

క. సంగీతఫలంబునఁ గో
 సంగీ సగమైన దయపొసఁగ నీవే మీన్
 మ్రింగిన గ్రుక్కన్వారిధి
 కిం గొఱఁతయె కొదయె విష్ణుకీర్తన కనినన్. 64

టీ. గోసంగీ=ఓగోసంగిదాసరీ, (మాతంగదాసుఁ డనుట) ("సీ. గోసంగి మాదిగ గూబరి యన, మాతంగుఁడగు..."ఆంధ్రభాషార్ణవము. ౧. ౨౮౯.) సంగీతఫలంబునన్ = పేఁటిగానఫలమందు, సగమైనన్ = అర్ధభాగమైనను, దయపొసఁగన్ = దయయొప్ప నట్లుగా, ఈవే = ఇయ్యవే, (వ్యతిరేకార్థకముమీఁద నేకారమువచ్చిన సంప్రార్థనపర క్రియ) మీన్=మీనము, మ్రింగిన=ఆహారించిన, గ్రుక్కన్=గ్రుక్కెడునీటిచేత, వారిధి కిన్=సముద్రమునకు, కొఱఁతయె = తక్కువగునా, విష్ణుకీర్తనకున్, కొదయె = నీకుఁ దక్కువగునా, (సముద్రమున కుదకము దఱుగనియట్లు నీకు హరికీర్తన తఱుగ దనుట.) అనినన్ = ఇట్లనఁగా. ప్రతివస్తూపమ.

శా. ఏలా నొంచె దదేయ మిట్లడిగి యెంతే బాస మేనంబలం
 బో లీలావటుగీతకీర్తనఫలంబో నీయెడ న్మున్న పా

తాళప్రశ్నలు మాని మేన్గొనుము బేతాళచ్ఛలోక్తిన్ రుషం
దూలింపందలఁతేని పుట్టు మఱి నూఁతుల్ద్రివ్వ బేతాళముల్. 65

టీ. ఆదేయము=ఇయ్యఁగూడనిదానిని, ఇట్లు అడిగి=ఈరీతిని యాచించి, ఏలానొంచెదు=ఏలనొప్పించెదవు, మున్ను = మున్ను, నీయెడన్=నీపట్ల, ఎంతే = ఎంతయును, బాస=నాప్రమాణము, మేనన్ పలంబో=దేహమందలిమాంసమో, లీ...బో-లీలావటు=మాయాబ్రహ్మచారియగు వామనునియొక్క, గీత=గానముసేయఁబడిన, కీర్తన=కీర్తనలయొక్క, ఫలంబో=ఫలమో, (మున్ను నేను శరీర మిచ్చెద నని ప్రమాణముఁ జేసితినే కాని గానఫల మిచ్చెద నని చేయలే దనుట) పాతాళ ప్రశ్నలు=అగాధప్రశ్నములను, (పాతాళమం దిప్పు డే మున్న దని యడిగిన ట్లనుట) మాని=విడిచి, మేన్గొనుము=నాశరీరమును గ్రహింపుము, బేతాళ ఛలోక్తిన్ - బేతాళ = మీ బేతాళజాతిసంబంధియగు, ఛలోక్తిన్=దంభపుమాటచేత, రుషన్=రోషముచేత,(నాకు రోషము పుట్టించి యనుట) తూలింపన్ = తూలఁజేయుటకు, తలఁతేని = తలఁచినట్లాయెనా, మఱి = ఇంకను, నూతుల్ త్రవ్వన్=కూపములు త్రవ్వఁగా, (ఇంక నిట్టి ప్రశ్నలు సేయఁగా ననుట) బేతాళముల్=మఱికొన్ని బేతాళగ్రహములు, పుట్టును = ఉత్పత్తియగును, ('బావి త్రవ్వఁ బోఁగా భూతము బయలుదేఱెను' అన్నసామెతయర్థము నిక్కడఁ జెప్పినాఁడు. మఱియును 'తూలింపం దలఁతేని బుద్ధిమఱి నూఁతుల్ద్రివ్వ నాతాళముల్' అని కొందఱు పాఠాంతరముగాఁ జెప్పి దానికిఁ దాటిచెట్ల ప్రమాణమున బావులు ద్రవ్వవలయు నని యెడు బుద్ధివంటి వని యర్థము చేయుదురు.)

తా. ఇఁక బాతాళప్రశ్నలు మాని, నేను చేసిన ప్రమాణ ప్రకారము నాశరీరమును భక్షింపుము, తడవుఁజేసి నన్నలఁతపెట్టవలదు నని తలంచి మఱియుఁ ద్రవ్వితివా మఱికొన్ని బేతాళములు వచ్చి నన్ను భక్షించుఁ గావున, మనమాటచొప్పున నీవే భక్షింపు మని చెప్పెను. లోకోక్త్యంగమగు విషమాలంకారవిశేషము.

వ. అనిన సాలకటంకటేయుండు చాలఁ గటకటంబడి కార్యేచ్ఛం గన్నీరు గ్రుక్కుకొని కటకటా! కైటభారి కనుంగులగు డింగరీలు దయాళువులు గావలవదే? తొల్లి దర్శన ప్రవర్తకుం డై వైయాసికంబు లగు సూత్రంబులు వివరించి విష్టరశ్రవు నద్వైతవైశిష్ట్యంబుఁ బ్రతిష్ఠించిన లక్ష్మణాఖ్య యోగీంద్రుండు చిరకాలసేవ సంతుష్టుండై నిజదేశికుండగు పూర్ణాహ్వయుం డనధికారుల కీకుమని విధియుక్తంబుగాఁ దనకుఁ బ్రసాదించిన గీతాచరమార్థంబుఁ గృపాతరంగితుం డై రంగేశ

ధామ దామోదరనామ చామీకరగోపురం బెక్కి యుచ్చైస్స్వ
నంబున నుచ్చరించిన గురుం డలిగిన, దేవా! దేవరయాజ్ఞ మీఱక యే
నొక్కరుండ రౌరవంబునం బడకుండుట మేలో? భాగవతపరిషత్తు
నకుఁ బరమపద మగపడుట మేలో? యని వితర్కించి నీ వుచ్చరిం
చుటగా నుచ్చరించితి నని తదభినందితుం డయ్యె, నతండ నిజచ్ఛాత్ర
సత్త్రంబునకుఁ బ్రత్యహంబును గల్యంబునమూల్యం బొల్లక గవ్యంబు
సమర్పించి వేఁడిన వల్లవీవల్లవులకుఁ బరమపదంబుఁ బ్రసాదించె,
నతండ బంధముక్తుం డయ్యు నవతారాంతరంబునఁ గాలాంతరం
బున సంకుచితజ్ఞాను లై విషయపరు లగు నరులకుం బరమునందలి
తీపాదవ సుందరజామాతృ నామంబున నర్చిరాదిగతి విశదీకరించె,
నతండ యిటమీఁద యాదగిరిటెంకణంబు పాషండసంకులంబుగా
వచ్చినఁ దచ్ఛ్యుతికి శఠకోపసమాఖ్య సంభవించి నీరంధ్ర వాదం
బున నంధ్రాదివిషయ విద్వజ్జనంబుల నధోక్షజవిషయవాదభిక్ష
వేఁడి దిగ్విజయంబు సేసి గరుడకుధర గుహాకంఠ నృకంఠీరవంబు
కుహనాత్రిదండిమై బ్రుసీ [1]కుసుంభాంబరాంభఃకుండిక లొసంగ నంగీ
కృతాంతిమాశ్రముం డై ఫణిప కణభు గతపాద బాదరాయణ
కపిల జైమిని శాసనంబులు మఠ మహానస మహీసురులు మున్నుగా
నెంతేవాసి నంతేవాసులకుఁ దెలివి పఱుపం బరమహంసానుష్ఠాన
పరకాష్ఠ యై పదయుగ ప్రపన్న భువనప్రపంచపంచజనహృదయ
భవనంబులం బద్మాపద్మాక్షులు పల్లేర్లు దుడిచి [2]పాడెక్క భక్తి బోధించి
భూతలంబుఁ బావనంబు సేయఁగలవాఁడు, మఱియు హయవదన
పదారాధకుం డై వేంకటేశుం డను నింకొక్క మనీషి మధుమథన
మదప్రతిపాదకం బగు ప్రబంధశతంబు రచించి శిలోంఛవర్తనంబునం
దపంబు సేయం దనకు జరచ్ఛదన శాకదానంబు నగస్త్యోర్వీరుహం
బునకు నిర్వాణం బొసంగం గలం డిట్టి యేష్యంబులు మదీయ
దివ్యబోధంబున నెఱిఁగియుండు నేతాదృశం బగు త్రైకాలిక జ్ఞానంబు
కలిమి నిమ్మేను మాననీయంబుగా యంటేని యది జాత్యంబుదక్కఁ
దపస్సత్యశమదమాది లబ్ధంబు గాదు; నిషాది భవిష్యదర్థంబులఁ

1. కౌసుంభరాంభఃకుండిక. 2. పాదెక్క.

జెప్పుచున్నది, అది శుచియే? కౌశికంబు డబ్బాటిగబ్బులుఁగు గౌళి కనుంబెంటి పైఁడికంటి లోనగుతిర్యక్కులు భావిప్రయోజనసూచకంబు లై యున్నయవి యవి తపస్సులే? యట్ల మావిజ్ఞానంబును నెట్లనిన, నాస్తిక్యంబువలన శాస్త్రంబులెడ నధీతిబోధంబులు దక్క నాచరణప్రచారంబులు లేమి ధర్మంబు దూరం బది నిమిత్తంబుగా నిత్తెఱం గెఱుంగక భవోత్తారకంబు గాదు, కావునఁ గలుషరహితకాయంబునంగాని కల్యాణంబు లబ్ధంబుగాదు, కాఁబట్టి యివ్విరూపవిగ్రహం బనుగ్రహంబున నుడిపి కృతార్థుఁ జేయు మని పాదంబుల వ్రాలి పాటం బాతికపాలేని యీవే యనిన, నతండదియును నీలే నన్నఁ, బోని మ్మీప్రభాతసమయంబునఁ బాడిన చరమగీతంబైన నిచ్చి ప్రసన్నుం డగు నన్నవిపన్నుం జేయు మని లేవకున్నం, బరమదయార్ద్రుండై, 'యట్ల కానిమ్ము లె'మ్మని యతని లేవ నెత్తి, యత్తను ప్రాప్తిప్రకారంబు సవిస్తరంబుగాఁ జెప్పు మనిన నవధరింపు మని యప్పాలదిండి దుఃఖార్తుం డై యి ట్లనియె. 67

టీ. అనినన్ = ఇట్లనఁగా, [1]సాలకటంకటేయుండు = సాలకటంకటా వంశస్థుఁడగు నారాక్షసుఁడు, చాలన్ కటకటంబడి=మిక్కిలి దుఃఖించి, కార్యేచ్ఛన్=ప్రయోజనాభిలాషచేత, కన్నీరు, గ్రుక్కుకొని=అడఁచుకొని, కటకటా=అయ్యయ్యో, కైటభారికిన్=శ్రీపతికి, అనుంగులగు=హితులగు, డింగరీలు=దాసులు, లేకభక్తులు. (డింగరీఁడు-సం. డింగరః. క. డింగర. "ద్వి. మీబంట మీకూడ మీడంగరీఁడ," బసవపు. ౪ఆ ౧౦౨౧. పంక్తి.)దయాళువులు=కృపగలవారు, కావలవదే=కావలదా, తొల్లి=పూర్వమందు, దర్శనప్రవర్తకుండై=మతనిర్వాహకుఁడై, వైయాసికంబులగు = వ్యాసప్రోక్తంబులగు, సూత్రంబులు=వేదాంతసూత్రములు, వివరించి = వ్యాఖ్యాన మొనరించి, వి...బు-విష్టరశ్రవున్=నారాయణునియొక్క, అద్వైతవైశిష్ట్యంబు=విశిష్టాద్వైతమును, ప్ర...డు-ప్రతిష్ఠించిన=సిద్ధాంతముఁ జేసినట్టి (సూక్ష్మచిదచిద్విశిష్టబ్రహ్మము జగత్కారణ మనియు, స్థూలచిదచిద్విశిష్టబ్రహ్మము కార్య మని యనుట), లక్ష్మణాఖ్యయోగీంద్రుండు = రామానుజా

---

1. ఈసాలకటంకట హేతిప్రహేతు లను నాదిమ రాక్షసులలో నొకఁడైన హేతికిఁ గుమారుఁ డగు విద్యుత్కేశునకు భార్యయును సుకేశుఁ డను రాక్షసునకుఁ దల్లియు సంధ్య యనుదానికిఁ గూఁతురు నైనది.—ఈకథ శ్రీమద్రామాయణోత్తరకాండమునందుఁ బ్రసిద్ధము.

చార్య లనెడు యోగిశ్రేష్ఠుఁడు, (ఎంబెరుమానారు లనుట), చిరకాలసేవన్=బహుకాల శుశ్రూషచేత, సంతుష్టుండై, నిజ = తనయొక్క, దేశికుఁడు = ఆచార్యుఁడు, అగు పూర్ణాహ్వయుండు = ఐన పెరియనంబిగా రనియెడు ద్రవిడ నామముగల పూర్ణాచార్యులు, అనధికారులకున్ = యోగ్యతలేనివారికి, ఈకుము అని=ఇయ్యకు మని, విధియుక్తముగాన్ = శాస్త్రోక్తప్రకారముగా, తనకున్, ప్రసాదించినన్ = అనుగ్రహింపఁగా, గీతాచరమార్థంబు=భగవద్గీతాచరమశ్లోకార్థము, కృపాతరంగితుండై - కృపా = దయచేత, తరంగితుండై = సంజాతతరంగములుగలవాఁడై, రం...బు-రంగేశ=శ్రీరంగనాయకులయొక్క, ధామ=కోవెలయందలి, దామోదరనామ = దామోదర మనుపేరుగల, చామీకర=స్వర్ణమయమగు, గోపురంబు, ఎక్కి, ఉచ్చైస్స్వనంబునన్=గంభీరకంఠనాదముచేత, ఉచ్చరించి=పలికి, (తిరుమంత్రద్వయ చరమార్థములను గోపురమెక్కి చాటినాఁడనుట) గురుండు=తమ యాచార్యులగుపూర్ణాహ్వయులు, అలిగినన్=కోపింపఁగా, దేవా=స్వామీ, దేవరయాజ్ఞ మీఱక = దేవరవారియాజ్ఞనుల్లంఘింపక, ఏ నొక్కరుండ=నే నొక్కఁడనే, రౌరవంబునన్=నరకమునందు, పడకుండుట = కూలకుండుట, మేలో=మంచిదో, భాగవతపరిషత్తునకున్=భాగవతసమూహమునకు, పరమపదంబు = మోక్షస్థానము, అగపడుట=లభించుట, మేలో=మంచిదో, అని=యిట్లని, వితర్కించి=తలపోసి, నీ వుచ్చరించుటగాన్ = మీరే యుపదేశించినట్టుగా, ఉచ్చరించితిని = చెప్పితినని, తదభినందితుండయ్యెన్-తత్ = ఆ పెరియనంబిగారిచేత, అభినందితుండయ్యెన్ = మెప్పించుకొనియెను; అతండ = ఆరామానుజగురుఁడే, ని...కున్-నిజ=తనయొక్క, ఛాత్ర=శిష్యులయొక్క, ('ఛాత్రాంతే వాసినౌ శిష్యే' అని యమరము.) సత్రంబులకున్ = రామానుజకూటములకు, ('సత్రమాచ్ఛాదనే యజ్ఞే సదాదానే వనేపిచ' అని విశ్వము.) ప్రత్యహంబును=ప్రతిదినమును, కల్యంబునన్ = ఱేపకడనె, ('ప్రత్యూషో హర్ముఖం కల్య' అని యమరము.) మూల్యంబు = వెలను, ('మూల్యంవస్నో౽ప్యవక్రయః' అని యమరము.) ఒల్లక = ఇచ్ఛగింపక, గవ్యంబు = గోసంబంధియైన పాలు పెరుఁగు నేయి, సమర్పించి వేఁడినన్ = యాచింపఁగా, వల్లవీవల్లవులకున్=గోపికాగోపకులకు, పరమపదంబున్, ప్రసాదించెన్ = కృపనొసఁగెను, అతండ = ఆయుండ యవరులే, బ...య్యున్=బంధ=కర్మబంధమువలన, ముక్తుండయ్యున్=విడువఁబడినవాఁడైనను, అవతారాంతరంబునన్=మఱియొక యవతారమందు, కాలాంతరంబునన్= మఱియొక కాలమందు, సం...లై-సంకుచిత = తక్కువపడిన, జ్ఞానులై = ఎఱుకగలవారై, విషయపరులు = శబ్దాదివిషయాసక్తులు, అగునరులకున్ = ఐనమానవులకు, పరమునందలి=మోక్షమునందలి, తీపు=రుచి, ఒదవన్ = పుట్టునట్లుగా, సుం...నన్ -

సుందరజామాత్ర=సుందరజామాతృఁ (అందగాఁడైనయల్లుఁ) డనియెడు, నామంబునన్= నామధేయముచేత, అర్చిరాదిగతి=అర్చిరాదిమార్గగమనము, ('ముక్తులగువారు సూర్య మండలమును భేదించుకొని పోవు మార్గప్రకారము ననుట) విశదీకరించెన్ = తేటపఱ చెను, అతండ=ఆ యెంబెరుమానారే, ఇటమీఁదన్=భవిష్యత్కాలమందు, యాదవగిరి టెంకణంబు=యాదవాచలప్రాంతము, (తిరునారాయణపురప్రాంత మనుట), పా...బు పాషండ=వేదబాహ్యులచేతను, సంకులంబు=సంకరము, కావచ్చినన్, తచ్చ్యుతికిన్- తత్=ఆ పాషండులయొక్క, చ్యుతికిన్=నాశమునకు, శఠకోపసమాఖ్యన్=శఠకోపులను నామధేయముచేత, సంభవించి=అవతారమెత్తి, నీరంధ్రవాదంబునన్=ఎడతెగనిప్రసం గముచేత, అం...లన్ - అంధ్రాదివిషయ = ఆంధ్రదేశము మొదలగుదేశములందలి, విద్వజ్జనంబులన్ = విద్వాంసులను, అ...క్షన్ - అధోక్షజవిషయ = భగవద్విషయ మగు, వాద = ప్రసంగ మనియెడు, భిక్షన్ = భిక్షను, వేఁడి = అడిగి, దిగ్విజయంబు సేసి = దిక్కులను గెలిచి, గ...దన్ - గరుడకుధర = గరుడాచలముయొక్క, గుహ యందున్, (అహోబిలమనుట), అ...బు - అకుంఠ = అప్రతిహతుఁడైన, నృకంఠీర వంబు = నరసింహస్వామి, కుహనాత్రిదండి ఐ = కపటసన్న్యాసియై, బ్రు...లు - బ్రుసీ = జపాసనమును, ('వ్రతినామాసనం బ్రుసీ' అని యమరము.) కుసుంభాంబర= కాషాయమును, అంభఃకుండికలు = కమండలువును, ('కౌసుంభరాంభకుండికలు' అను పాఠమున రాంభ మనఁగా వేణుదండ మని యర్థము; కడమ సుగమము) ఒసంగన్ = ఇయ్యఁగా, అం...దు ఐ - అంగీకృత = గ్రహింపఁబడిన, అంతిమ = కడపటిదైన, ఆశ్రముండై = యత్యాశ్రమముగలవాఁడై, ఫ...లు-ఫణిప = శేషునియొక్కయు, (అష్టాధ్యాయీమహాభాష్యకర్త) కణభుక్ = కణాదునియొక్కయు (వైశేషికశాస్త్ర కర్త), అక్షపాద = గౌతమమునియొక్కయు (న్యాయశాస్త్రకర్త), బాదరాయణ = వేదవ్యాసునియొక్కయు, కపిల = కపిలునియొక్కయు (సాంఖ్యశాస్త్ర ప్రవర్తకుఁడు), జైమిని = జైమినియొక్కయు (పూర్వమీమాంసాశాస్త్రకర్త), శాసనంబులు = విధులు, (వీరిమతము లనుట), మ...లు - మత = తమమతముయొక్క, మహానస = బానస మందలి, మహీసురులు = బ్రాహ్మణులు, (పాచకు లనుట.), మున్నుగాన్=మొదలుగా, ఎంతేవాసిన్ = మిక్కిలి చక్కఁగా, అంతేవాసులకున్ = శిష్యులకు, తెలివిపఱుపన్= బోధించుటకై, ప...ష్ఠ ఐ - పరమహంస = యతీశ్వరులయొక్క, అనుష్ఠాన=ఆచార మునకు, పరకాష్ఠ ఐ = పరమావధియై, ప...లన్ - పదయుగ = తమపదద్వంద్వమునకు, ప్రసన్న = ప్రపత్తిఁ జేసినట్టి, భువన = లోకములయొక్క, ప్రపంచ = లోకమందలి, పంచజన=నరులయొక్క, ('పంచజనాః పురుషాః పూరుషా నరాః' యని యమరము.)

హృదయ = మనస్సులనియెడు, భవనంబులన్ = గృహములయందు, పద్మాపద్మాక్షులు= శ్రీశ్రీపతులు, పల్లేర్లు = కామక్రోధాదు లనియెడు కంటకములను, తుడిచి = ఊడ్చి వైచి, పాడు = శూన్యములగువానిని, ఎక్కన్ = ప్రవేశింపఁగా, ('పాదెక్కను, అని పాఠాంతరము. అట్లైనఁ బాదుకొనఁగా నని యర్థము.) భక్తిబోధించి=భక్తినుపదేశించి, భూతలంబున్ = భూప్రదేశమును, పావనంబుసేయంగలవాఁడు = పవిత్రముఁ జేయఁ గలఁడు, మఱియున్ = ఇంకను, హయవదన = హయగ్రీవస్వామియొక్క, పద = పాదములయొక్క, ఆరాధకుండై = పూజించెడువాఁడై, వేంకటేశుండను=వేంకటేశా పరనామముగల వేదాంతదేశికుఁ డనుట. ఇంకొక్కమనీషి=మఱియొక్క విద్వాంసుఁడు, మ...బు - మధుమథన = మధుసూదనుఁడగు శ్రీపతియొక్క, మత = మతముయొక్క, (శ్రీమన్నారాయణుఁడే పరతత్త్వ మని యనుట) ప్రతిపాదకంబు,. ప్రబంధశతంబు = నూఱుప్రబంధములను, రచించి=ఏర్పఱిచి, శిలోంఛవర్తనంబునన్ = శిలోంఛవృత్తులచే జీవించుటచేతను, (శిలోంఛము లనునవి ప్రత్యేకవృత్తు లనవలయును. శిల మనఁగా నియమగృహోపాదానము; ఉంఛ మనఁగా రాలిన నీవారాదులను గ్రహించునది), తపంబుసేయన్ = తపస్సుచేయుచుండఁగా, తనకున్=ఆవేదాంతదేశికునకు, జ...బు- జరచ్ఛదన = ముదురాకులనియెడు, శాకదానంబుసేయు, అగస్త్యోర్వీరుహంబునకున్ = అగిసెమ్రానికి, (ఇచ్చట నలరొక్కోర్వీరుహంబున కని కొంద ఱనుచు దానికి ముల్లుచ్చిత చెట్టని చెప్పికొంద్రు.) నిర్వాణంబు=పరమసుఖము(మోక్షము)ను, ఒసంగంగలండు=కృప సేయఁగలఁడు, ఇట్టియేవ్యంబులు = భవిష్యదర్థంబులు, మ...నన్ - మదీయ = నాసంబంధియగు, దివ్యబోధంబునన్ = దివ్యజ్ఞానముచేత, ఎఱింగియుండుదున్ = తెలిసికొనియుందును, ఏతాదృశంబు = ఇటువంటిది అగు, త్రై...మిన్ - త్రైకాలిక = భూతభవిష్యద్వర్తమానకాలత్రయసంబంధియగు, జ్ఞానంబు = తెలివియొక్క,కలిమిన్ = ఉనికిచేత, ఇమ్మేను = ఈ శరీరము, మాననీయంబుగదా = పూజ్యమేకదా, అంటేని= అంటివా, అది=అజ్ఞానము, జాత్యంబుదక్కన్ = జాతిప్రయుక్తముగాని, తపస్సత్య శమదమాది లబ్ధంబు - తపః = తపమును, సత్య = నిక్కమును, (సత్త్వమనికొందఱు) శమ = మనోనిగ్రహమును, దమ = బహిరింద్రియనిగ్రహమును, ఆది = మొదలగు వానిచేత, లబ్ధంబు = పొందఁబడినది, కాదు, విషాది = ఎఱుకుది, భవిష్యదర్థంబులన్ = కాఁగలకార్యములను, చెప్పుచున్నది = వచించుచున్నది, అది = అగద్దె చెప్పునది, కుఱియె = పవిత్రురాలా, (కాదనుట), కౌశికంబు = గూబయు, డబ్బు = ఒకానొక శకునపక్షి, ఆటి = ఒకజాతిబాతు (ఆడేలు లేక ఒకజాతిచేఁప.) గబ్బులుఁగు = కుక్క క్షమ (ఆదశకొండి.పిగిని గఁకఁలోఁదెచ్చి యమ్మదరుగాన గబ్బులుఁ గని పేరు వచ్చెను.

"సీ...కుక్కుభంబు గబ్బులుఁగు గంపపులుఁ గనఁగ, వఱలు..." ఆంధ్రభాషార్ణవము. ౨. ౯౭.) గౌళి = బల్లి, కనుంబెంటి = బెలుఁగుపిట్ట (ఇది కాఁగల ప్రయోజనమును సూచించు నొకానొకపక్షి.) పైఁడికంటి = బంగారురంగువంటి రంగుగల నేత్రములుగల యొకపక్షి విశేషము. లోనగు = మొదలైన, తిర్యక్కులు = తిర్యగ్జంతువులు, భా...లు- భావిప్రయోజన = ముందటిపనులకు, సూచకంబులై = తెలియఁజేయునవియై, ఉన్నయవి = ఉన్నవి, అవి = ఆకాశికాదులు, తపస్విలే = తపస్సంపన్నములా, మావిజ్ఞానంబును = మావిజ్ఞానమును, అట్ల = ఆప్రకారమే, ఎట్లనినన్ = అది యేప్రకారమనఁగా, నాస్తిక్యంబువలనన్ = నమ్మకములేకుండుటవలన, శాస్త్రంబులెడన్ = శాస్త్రములపట్ల, అధీతిబోధంబులు = చదువుట తెలియుటలు, తక్కన్ = తప్ప, ఆ...లు - ఆచరణ= ఆచరించుటయు, ప్రచారంబులు = ఆచరింపఁజేయుటలును, లేమిన్ = లేకుండుటచేత, ధర్మంబు, దూరంబు = మాఱు లేదు, అది నిమిత్తంబుగాన్ = అదికారణముగా, ఇత్తెఱంగు ఎఱుంగక = ఈమార్గముఁదెలియక, భవ ఉత్తారకంబు = సంసారోద్ధారంబు, కాదు, కావునన్ = కాఁబట్టి, క...ని - కలుష = పాపముచేత, రహిత = విడువఁబడిన, కాయంబునం గాని = శరీరముచేతఁగాని, కల్యాణంబు = మోక్ష శుభము, లబ్ధంబు గాదు = లభింపదు, కావునన్ = కాఁబట్టి, ఇ...బు - ఇవ్వికారూప = ఈవికృతరూపముగల, విగ్రహంబు = నాశరీరమును, అనుగ్రహంబునన్ = ప్రసాదముచేత, ఉడిపి = పోఁగొట్టి, కృతార్థున్ చేయుం మని = ధన్యునిం జేయుమని, పాదంబులన్ వ్రాలి = పాదాక్రాంతుఁడై, పాటన్ = గానమందు, పాతికపాలేని = పాదాంశమైనను, ఈవే అనినన్ = ఇయ్యవే యనఁగా, అతండు = ఆదాసరి, అదియును = ఆ పాతికపాలైనను, ఈలేను అన్నన్ = ఇయ్యలే ననఁగా, పోనిమ్ము = పోనీ, ఈప్రభాత సమయంబునన్ = నేఁటిప్రాతఃకాలమందు, పా...నన్ - పాడిన = గానముసేసిన, చరమగీతంబైనన్ = కడపటిపాటయైనను, ఇచ్చి = ఒసంగి, ప్రపన్నుండన్ = శరణాగతుఁడను, అగుదన్ను, ఆవిపన్నుం జేయుమని = ఆపదలేనివానిఁగాఁజేయుమని, లేవకున్నన్ = పాదములపైనుండిలేవకుండిన, ప...దు ఐ-పరమదయా=ఉత్కృష్టదయచేత, ఆర్ద్రుఁడై = చల్లనివాఁడై, అట్ల కానిమ్ము, లెమ్మని, అతనిన్ = ఆరాక్షసుని, లేవనెత్తి. అ...బున్ = అత్తను = ఆరాక్షసశరీరముయొక్క, ప్రాప్తి = వచ్చుటయొక్క, ప్రకారంబున్ = రీతిని, సవిస్తరంబుగాన్, చెప్ప మనినన్, ఆపొలదిండి = ఆమాంసభక్షకుండగు రాక్షసుఁడు, దుఃఖార్తుం డై = దుఃఖపీడితుండై, అవధరింపు మని, ఇట్లనియె.

* * * * * *

ఉ. ఉండుదుఁ జోళభూమి నొకయూరఁ గళల్పదునాల్గు నేర్చి వా
క్చండిమఁ జర్చఁ గెల్తు ఘట[1]శాసుల శ్రోతులఁ దప్పు వట్టుదున్
[2]ఖండల ముష్టి విప్పఁ గని నవ్వుదు వెండి ప్రయోక్తల న్సుధీ
మండలిగ్రాంథికత్వ మవమానముసేయుదు జల్పవాది నై. 67

టీ. చోళభూమిన్ = చోళదేశమందు, ఒకయూరన్=ఒకగ్రామమందు, ఉండుదున్=నివసింతును, కళల్=విద్యలు, పదునాల్గు = చతుర్దశసంఖ్యాకములగువానిని, ('అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః, పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతా శ్చతుర్దశ' అనియును, అంగము లాఱనుటకు, 'శిక్షా వ్యాకరణం కల్పో నిరుక్తం జ్యోతిషం తథా, ఛందశ్చేతి షడంగాని' అనియు ప్రమాణము.) నేర్చి, ఘటశాసులన్ = తార్కికులను, (ఘటశాస్త్రులనను పాఠమున నిదేయర్థము), వాక్చండిమ = వాక్ప్రచండత్వముయొక్క, చర్చన్ = ఆక్షేపముచేత, గెల్తున్=జయింతును, శ్రోతులన్ = యాగతంత్రజ్ఞులను, తప్పువట్టుదున్ = స్ఖాలిత్యములుపట్టుదును, వెండి = మఱియును, ప్రయోక్తలన్ = షోడశకర్మాధికారులను, ఖం...ష్టి-ఖండల = ఖండకారికలయొక్క, ముష్టి=సంచికను, విప్పన్ = విప్పఁగా, కని=చూచి, నవ్వుదున్=పరిహాసింతును, సు...ము-సుధీ = విద్వాంసులయొక్క, మండల = సమూహముయొక్క, గ్రాంథికత్వము = గ్రంథనిపుణతను, జల్పవాదినై = జయేచ్ఛచేత కథలను వాదించువాఁడనై, అవమానముసేయుదును.

వ. ఇన్నడవడిం బ్రభిన్నగండం బగు వేదండంబునుంబోలె మదాంధుండ
నై యల్పవిద్యాలబ్ధి నిడువ ముడువ వేసరని వీసంబుగల రెడ్డియుం
బోలె నచ్చదువె పరబ్రహ్మం బై పెద్దలఁ జెనికి యోడియు సరియైతి
ననియును సరిపోయి జయించితి ననియు నబద్ధంబు లాడి చిల్లరప్రభు
వులం భ్రమియించుచుండి దీక్షితులం జూచి యియ్యఁ వోడమి
ద్రవ్యభిక్షార్థినై మథురకుం బోయి యప్పురంబున. 68

---

*ఇంతవఱకు షష్ఠాశ్వాస మనియు నిఁకనుండి సప్తమాశ్వాస మనియుఁ గొన్ని ప్రతులందుమాత్రమే కలదు. (కాని ప్రథమాశ్వాసము 89, ద్వితీయాశ్వాసము 101, తృతీయము 93, చతుర్థము 289, పంచమము 160, ఉండఁగా 65, 73 పద్యములతో రెండాశ్వాసములు రచింపబడిన వనుటకన్న నివి 139 ను గలిసి యేకాశ్వాస మనుటయే యుక్తము.

ఇచ్చటఁ గొన్ని ప్రక్షిప్తపద్యములు గలవు. వానిని ఆశ్వాసాంతమునఁ గనందగు. 1. శాస్త్రుల. 2. ఖండల ముష్టి విప్రుఁగని నవ్వుదు వెండిప్రియోక్తులన్.

టీ. ఇన్నడవడిన్ = ఈనడకచేత, ప్రభిన్నగండంబు - ప్రభిన్న=మదముకాఱుచున్న, గండంబు = చెక్కులు గలది, అగు, వేదండంబునుంబోలె=ఏనుంగువలె, మదాంధుండనై = మదముచేత మత్తుఁడనై, అ...బ్ధిన్-అల్పవిద్యా = కొంచెపువిద్యయొక్క, లబ్ధిన్ = ప్రాప్తిచేత, విడువన్=మాఁటవిచ్చుటకును, ముడువన్=మరలమాఁటఁగట్టుటకును, వేసరని = విసువని, వీసంబు = వీసముకాసులుకల, రెడ్డియుంబోలెన్ = రెడ్డివానివలెనే, అచ్చదువె = సాకు వచ్చియున్న యాచదువే, పరబ్రహ్మంబై=చాలగొప్పదై, పెద్దలన్ = వృద్ధులను, చెనకి = ప్రసంగమునకుఁ గదలించి, ఓడియున్=అపజయముఁ బొందియు, సరియైతి ననియున్=సమముగాఁ బ్రసంగించితి ననియు, సరిపోయి=వారితో సరియై, జయించితి ననియున్ = గెల్చితి ననియును, అబద్ధంబులాడి=దబ్బరలాడి, చిల్లర ప్రభువులను, భ్రమియింపఁజేయుచుండి, దీక్షితులం జూచి = ఆహితాగ్నులనుగాంచి, ఇయక్ష=యజ్ఞముఁ జేయవలయునను నిచ్ఛ, (యష్టు మిచ్ఛా ఇయక్షా-అని వ్యుత్పత్తి,) పొడమి = అంకురించి, ద్రవ్యభిక్షార్థినై = ద్రవ్యభిక్షను గోరినవాఁడనై, మధురకున్) మధురాపట్టణమునకు, పోయి, అప్పురంబునన్ = ఆమధురాపట్టణమందు.

సీ. బహివద్ధద్విజున కల్పపుఁ బాచితం బిడి
   పసిఁడికై తా వానిబంతిఁ గుడిచి
కలసి వణిక్పురోథలతోడఁ బుణ్యాహ
   ముల బియ్యములకు నై మొత్తులాడి
శశి రవి గ్రహ జపస్నానాదికము లెల్ల
   దొరలవాకిండ్ల కేవొద్ద యిచ్చి
[1]పచ్చిట్టితో ల్బట్టి చుచ్చాల మెట్లంది
   కొనఁ దాన యూరెల్ల గుత్తవట్టి
తే. దర్భపోటులఁ దిని లేనితలుల మైత్రి
నంటి పితృశేషము భుజించి యదియు నెడల
నక్కవాడల నఱకూళ్లు మెక్కి మీఁద
వీనిశేఖర మొకతులాత్రివజ్యము కొని. ౬౯

టీ. బ...కున్ - బహివద్ధ=వెలివేయఁబడిన, ద్విజునకున్ = విప్రునకు, అ...బు - అల్పపు = కొంచెమయిన, పాచితంబు = ప్రాయశ్చిత్తమును, ఇడి = పెట్టి, పసిఁడికై=ధనముకొఱకు, తాన్=తాను, వానిబంతిన్ = వాని పఙ్క్తియందు, కుడిచి =

1. పచ్చిట్టిలోల్పట్టి చిచ్చుల.

భుజించి, వ...దన్ - వణిక్=కోమట్లయొక్క, పురోధలతోడన్ = పురోహితులతో, కలసి = చేరుకొని, పు...కై - పుణ్యాహముల = కోమటిండ్ల పుణ్యాహవాచనముల యొక్క, బియ్యములకున్=తండులముకొఱకు, మొత్తులాడి=కలహించి, శ...లువెల్లన్- శశి = చంద్రునియొక్కయు, రవి = సూర్యునియొక్కయు, గ్రహ = గ్రహణముల యందుఁ జేయునట్టి, జప=జపములు, స్నాన = స్నానములు, ఆదికములెల్లన్ = మొద లగునవి యెల్ల, దొరలవాకిండ్లకే = ప్రభుద్వారములకే, దొడ్డ యిచ్చి = కొల్లయిచ్చి, (దానములకొఱకై తాను జేసిన నవగ్రహజపము మొదలగునవి ధనికుల వాకిండ్లనే ధారఁబోసె ననుట), ప...లు-పచ్చి = ఆర్ద్రమగు, ఇఱ్ఱితోలు=కృష్ణాజినమును, బట్టె, చుచ్చాలమెట్లు=ఎనుము మేఁక ఆవు వీని వరుసలను, అందికొనన్ = దానముపట్టుటకై, తాన=తానే, ఊరెల్లన్ = ఆపట్టణమెల్లను, గుత్తపట్టి = గుత్తచేసి, (పచ్చిఱ్ఱితోల్పట్టి చిచ్చుల నని పాఠాంతరము. అట్టయిన పచ్చి జింకతోళ్ళం గ్రహించి వేసవికాలములయం దనియర్థము.), దర్భపోటులన్=నిమంత్రణములయందు, తిని=భక్షించి, లేనికఱులన్=ఆ బ్రాహ్మణార్థములు లేని కాలములయందు, మైత్రిన్ = స్నేహముచేత, అంటి = చేరి, పితృశేషము = తద్దినపుఁగూడు, భుజించి = మెసవి, అదియున్ = ఆపితృశేషమును, ఎడలన్=దొరకక పోఁగా, అక్కవాడలన్ = పూఁటకూలియిం డ్లుండు వీథులయందు, అఱకూళ్లు=చాలిచాలని యర్ధాశనములను, మెక్కి=తిని, మీఁదన్ = అనంతరమందు, వీని=ఈకార్యముయొక్క, శేఖరము = శిరోభూషణ మగు, ఒక...ము-ఒక=ఒకటియైన, తులా = తులాభారముయొక్క, ఆర్త్విజ్యము = ఋత్విగ్భావము (తులాభార దాన మనుట), కొని = గ్రహించి.

తా. ఈపైనిచెప్పినవన్నియును పాపహేతువులు గాన నింద్యము లయిన నర్థాతురత్వమును బట్టి యన్నియుం జేసియుండెను.

ఉ. ఇట్టొనగూర్చి వైశ్యునకు నిచ్చి చన న్మఱి పుచ్చి చౌకము
ల్వెట్టుచు వడ్డి లెక్క లటు వెట్టుచు ధారణవాసికై కొదల్
పెట్టుచు వాఁడు రేఁగి మఱి పెట్టుదుఁ బెట్ట ననంగ మిట్టఁ గూ
వెట్టుదు నిట్టు పోరఁ గని పెట్టుక యొక్కరుఁ డుండి వెండియున్. 70

టీ. ఇట్టు=ఈప్రకారము, ఒనగూర్చి=కూడఁబెట్టి, వైశ్యునకున్ = కోమటికి, ఇచ్చి=వడ్డికిచ్చి, చనన్ = మరల నూరికిఁ బోవుటకై, మఱి=పిమ్మట, పుచ్చి=తీసికొని, చౌకముల్=ఉద్దలు, (నాలుగేసి యనుట) పెట్టుచున్=ఇడుచు, వడ్డి లెక్కలు, అటు పెట్టుచున్=ఆప్రకారము వేయుచును, ధారణవాసికై=బియ్యము మొదలగువాని ధర వారడికై, కొదలెప్పెట్టుచున్ = తక్కువలు సేయుచు, వాఁడు=ఆకోమటి, రేఁగి=చెల

కేఁగి, మఱి=పిమ్మటను, పెట్టుదుర్ పెట్టుదుమనంగన్ = ఇత్తునుకాయను అనిచెప్పఁగా, మిట్టన్ = రచ్చమిట్టయందు, కూపెట్టుదురు = కూఁతలుపెట్టుచుందురు, ఇట్టుపోరన్= ఇట్లు పోరుచుండఁగా, ఒక్కరుఁడు = ఒకమానిసి, కనిపెట్టుకయుండి = కాచుకొని యుండి, వెండియున్ = మరలను.

తా. ఇట్లు కూడఁబెట్టిన ధనము కోమటికి వడ్డికిచ్చి నే నమ్మిన బియ్యము మొద లగు వాని ధర వారడికొఱకును జిల్లరవడ్డికొఱకును బీకులాడి రచ్చలలోఁ జెప్పుకొను చుండఁగా, నొక్క దొంగ కనిపెట్టుకొని యుండెను. స్వభావోక్తి.

సీ. వెలివాడఁ బనిక్రొత్తకమలకవా ల్గొని నూనె
యిడి తంగెడాకుగకట్టెడు తహతహ
కూర్చంబు గొరిగించుకొని యుష్ణతోయంపు
టంగడిఁ దలయంటుకాడి తడవు
వంటపూఁటింటి కెప్పంటికంటెను బాలు
పెరుఁగు నే కూర లంపెడు తెగువలు
సంబెళ విదలించి తాంబూలదళ పూగ
నివహంబుఁ జాలంగ నించు నుబ్బు
తే. బ్రహ్మచారిభుజంబు మాత్రకు సడింపుఁ
బ్రాలు నాలికి మేలుచీరలు గొనియెడు
సంభ్రమంబును బెఱపాంథజనులఁ బయన
మడుగు ప్రశ్నంబులను మత్ప్రియాణ మెఱేఁగి. 71

టీ. (1) వెలివాడన్=చండాలవాటికయందు, పని=పనితనముగల, క్రొత్తమలక వాల్ = క్రొత్తపాదరక్షలు, కొని = వెలచేసి, నూనెయిడి = నూనెఁబూసి, తంగెడాకు, కట్టెడు = ఆపాదరక్షలకుఁగట్టునట్టి, తహతహ = త్వరపాటును, (2) కూర్చంబు=కను బొమలసందు, ('కూర్చమస్త్రీభ్రువోర్మధ్యమ్' అని నిఘంటువు.) గొరిగించుకొని=క్షౌరముఁ జేయించుకొని, (సొగసునకుఁ గనుబొమలసందుమాత్రమే గొరిగించుకొనె ననుట,) ఉష్ణ తోయంపు = వేడినీరమ్మెడు, అంగడిన్ = దుకాణమందు, తలయంటుకాడి=అభ్యం గము సమయముదైన, (తలయంటుకాఁడు అనుపాఠమున నభ్యంగముఁ జేసికొని తిరి గెడు,) తడవు = ఆలస్యమును, (3) వంటపూఁటి=వంటఁజేసిపెట్టెడు పెద్దమ్మయొక్క, ఇంటికిన్ = గృహమునకు, ఎప్పటికంటెను = పూర్వముకంటెను, పాలు పెరుఁగు నే కూరలు=పాలును, పెరుఁగును, నేయిని, శాకములును, అంపెడు=పంపునట్టి, తెగువలు= ఔదార్యములను, (4) సంబెళ = వక్కాకుపెట్టె, విదలించి = విప్పి, తాంబూలదళ =

తమ్ములపాకులయొక్క, పూగ = పోకలయొక్క, నివహంబుల్ = సమూహమును, చాలంగన్ = చాలునట్లు, నించు = నిండించునట్టి, ఉబ్బు = ఉత్సాహమును, (5) బ్రహ్మచారి = శిష్యునియొక్క, భుజంబు = మూఁపుననున్న, మాత్రపుట్ = ఆసిమి సంచికి, పడింపుఁబ్రాలు = దంపుడుబియ్యమును, ఆలికిన్=భార్యకుఁగాను, మేలుచీరలు= మంచిమంచి కోకలను, కొనియెదు = గ్రహించెడి, సంభ్రమంబు = చిడిముడిపాటును, (6) పెఱ = ఇతరులగు, పాంథజనులన్ = మార్గస్థులను, పయనమడుగు = ప్రయాణ మెప్పు డని యడిగెడు, ప్రశ్నంబులను = ప్రశ్నలచేతను, మత్ప్రయాణము=నాపయనము, ఎఱిఁగి = తెలిసికొని.

తా. పైనిచెప్పినప్రకారము ప్రయాణసన్నాహము కాఁగా దొంగ లెన్నఁగాఁ దెలిసికొనియుండెను.

క. హత్తుకొని యొక్కకొందఱు
నత్తెరువుం గట్టఁ బనిచి యందఱు క్రియఁ దాఁ
దిత్తియొకటి గొని తే మఱి
యుత్తర ముత్తర మటంచు నొకప్రొద్దుకడన్. 72

టీ. హత్తుకొని = వెంబడించికొని, ఒక్కకొందఱున్ = మఱికొందఱిన్, ఆత్తెరువున్ = ఆమార్గమును, కట్టఁబనిచి = అఱికట్టఁబంపి, అందఱుక్రియన్=అందఱివలెనే, తాన్ = ఆదొంగ, తిత్తి = సంచి, ఒకటిగొని=ఒక్కటి తీసికొనివచ్చుచు, మఱి = అనంతరమందు, ఉత్తరముత్తరమటంచున్=పోవలసినదుత్తరదిశయని, ఒకప్రొద్దుకడన్ = ఒకప్రొద్దువేళను.

తే. లేచి పోవంగఁ దత్తఱ మేచి తోడి
వారు సన నేను ముడిమోపు వటునకెత్తి
పోవ వాఁ డిందు రం డని త్రోవ యడవిఁ
బెట్టి యొకవాఁగు డిగ నీల వెట్టుటయును. 73

టీ. లేచిపోవంగన్=లేచిపోవుచుండఁగా, తత్తఱ మేచి=త్వరపాటతిశయించి, తోడివారు చనన్ = తోడిమార్గస్థులుపోఁగా, నేను, ముడిమోపు=మూటబరువు. వటునకెత్తి = బ్రహ్మచారికెత్తి, పోవన్ = పోవుచుండఁగా, వాఁడు = ఆచోరుఁడు, ఇందు రం డని = ఇటురం డనుచు, త్రోవ = మార్గమును, అడవిఁబెట్టి = అడవిలోఁబెట్టి, ఒక వాఁగు డిగన్ = ఒక వంక దిగఁగానే, ఈలవెట్టుటయును = ఈలవేయఁగానే, (జార చోరు లీలవెట్టుట వారిసంజ్ఞ.)

క. అఱచేతి వ్రాలు గనున
త్తఱిఁ బడె నొకయంపకట్టె దానికి నిలువం
బిఱుబిట్టున ఱాలు వడెం
దెఱపియుఁ గనలేక సాతు దిరుగంబడియెన్. 74

టీ. అఱచేతివ్రాలు = అఱచేతిగీఱలు, కనునత్తఱిన్ = చూచెదుకాలమందు, (అరుణోదయకాల మనుట.) ఒక యంపకట్టె = అంపకోల, పడెన్ = వ్రాలెను, దానికిన్=ఆయంపకట్టకు, నిలువన్ = మార్గమునడువక నిలువఁగా, బిఱుబిట్టునన్=బిరుసు బిరుసుగా, ఱాలువడెన్=పాషాణములు పడెను, సాతు = పథికసమూహము, తెఱపియున్=పోవుటకుసందును, కనలేక=తెలియక, తిరుగంబడియెన్ = వెనుదిరిగెను. స్వభావోక్తి.

*

మహాస్రగ్ధర

కవిసె న్గల్పాంతజంతు గ్రసనభృశబుభు క్షాత్వరత్ర్యక్షపార్శ్వ
ప్లవమానోత్పాతభూత ప్రకరపటిమ హా లాహలస్పర్ధి హేతి
చ్ఛవి రేఖానేక రాహూ చ్చలితరవులు రక్షశ్చమూజిత్పులింద
ప్లవబృందంబుల్వనిన్బల్వడిఁబొడుపొడుమన్పల్కులుస్సల్కులున్రాన్.

టీ. కల్పా...మన్-కల్పాంత=ప్రళయకాలమందు, ('క్షయఃకల్పాంత ఇత్యపి.' అని యమరము.) జంతు=ప్రాణులయొక్క, గ్రసన=భక్షణమందు, భృశ=మిక్కిలియగు, బుభుక్షా=ఆఁకలియొక్క, ('భోక్తు మిచ్ఛా బుభుక్షా',) త్వర=వేగము గలిగిన, త్ర్యక్ష=ఫాలాక్షునియొక్క, పార్శ్వ = ప్రక్కలయందు, ప్లవమాన = పరువులెత్తుచున్న, ఉత్పాత = భయంకరములైన యుల్కాదులతోఁ గూడిన, భూత=భూతములయొక్క, ప్రకర = సమూహముయొక్క, పటిమన్=సామర్థ్యమువంటి సామర్థ్యముతో, హాలాహల = కాలకూటముతోడ, స్పర్ధి = కలహించెడు, హేతి = ఆయుధములయొక్క, ఛవి = కాంతులయొక్క, రేఖా = పఙ్క్తు లనియెడు, అనేక=పెక్కులైన, రాహు = రాహుగ్రహములచేత, ఉచ్చలిత = చలింపఁజేయఁబడిన, రవులు = సూర్యుఁడు గలిగి నట్టి, రక్షశ్చమూ = రాక్షససేనను, జిత్ = జయించుచున్న, పులింద = కిరాతకుల యొక్కయు, ప్లవ=చండాలురయొక్కయు, బృందంబుల్ = సమూహములు, వనిన్ = అడవియందు, బల్వడిన్ = మిక్కిలివేగముగా, పొడుపొడు మన్=పొడుపొడు మని

---

*వ. అంత.

యెదు, (ఇది యామ్రేడిత ప్రార్థనార్థకము), పల్కులున్=మాటలును, ములుకులున్ = బాణములును, రాన్=రాఁగా, కవిసెన్ = చుట్టుకొనెను.

తా. ప్రళయకాలరుద్రుని సూరెలఁ బొఱలెంచుచున్న మహాభూతములవలెఁ బటిమ గలిగి, యనేక రాహువులనెదు బుద్ధిచే సూర్యుఁడు భయంపడునట్టి యాయుధ కాంతులు కాలకూటమును మీఱుచుండఁగా, ననేక కిరాతకులును చండాలురును గుంపులు గూడుకొని వాఁడితూపు లేయుచుఁ బొడుపొడు మని పల్కుచు నలుదిక్కులఁ గ్రమ్ముకొనిరి.

వ. ఇట్లు చెట్లు వెడలి విండ్లు వంచుకొని ముంచుకొను నన్నల్లప్రజం
జూచి హల్లకల్లోలం బై విఱుగంబడు నెడ. 76

టీ. ఇట్లు=ఈప్రకారము, చెట్లువెడలి = అడవిలోనుండి వెడలివచ్చి, విండ్లు = ధనువులను, వంచుకొని=ఎక్కువెట్టుకొని, ముంచుకొనుచున్న=మీఁదఁబడుచున్న అన్నల్ల ప్రజన్ = ఆ కిరాతసంఘమును చూచి ('క. ఏలలఁ బాడుచుఁ దగవిలు, గోలలఁగొని నల్లప్రజలు గుములై నడువన్' అని వేంకటనాథుని పంచతంత్రము. ౨. ౧౯౫.) హల్లకల్లోలంబై=పెద్దరంతై, విఱుగంబడు నెడన్ = విఱిగిపోవునప్పుడు.

సీ. పసలేదు నిలరోయి ♦ పాతకులా రని
దేవాయుధంబులు ♦ లూఁపువారు
పైఁడిబాసముఁ జెట్లఁ ♦ బడవైచి [1]దుడ్డుపె
ట్లకుఁ బాఱుచునె యొలె ♦ ల్వైచువారు
బరువు డించి కటారి ♦ పరుఁజించి నిల్పి యిం
దెందు వచ్చెద రని ♦ యెదురువారు
వస్త్రంబుఁ గొండు దేవర యోయి యిది చన్నఁ
బ స్తని దయపుట్టఁ ♦ బలుకువారు
తే. కలవి మామూఁక నిప్పింతుఁ ♦ దొలఁగుఁ డొకటి
యాఁడుదానిఁ జేనంటకుఁ ♦ డనుచుఁ బెద్ద
తనము నభిమానమును దెంపు ♦ కనఁగఁ బలికి
నిలిపి దోఁపిచ్చువారు నై ♦ తొలఁగి రపుడు. 77

టీ. (1) పసలేదు = పలుమంది లేరు, (దొంగలు గొంచె మనుట.) పాతకులార = ద్రోహులార, నిలరోయి=నిలువుఁడోయి. అని, దేవాయుధంబులు=శాపములు-

1. దుడ్డుఁ బెట్లకుఁ బాఱుచును యొడల్ దాచువారు.

లిట్లు (పాషాణములును దుంటకట్టెలును. ఇక్కడ దేవశబ్దమునకు యజ్ఞమని యర్థము చేసి దాని యా యంధములు దారుమయములుగాను పాషాణమయములుగా నుండును గనుక ఱాలును దుంటకట్టెలు ననవచ్చును.-ఈ వ్యాఖ్యాపాటవము సరికాదు.), ఱూవువారు = విసరువారును, (2) పైఁడిబొసఁగుల్ = బంగారు మొదలగునది, (పైఁడిబొస మనునది సానుదుమాట), చెట్లన్ = వృక్షములయందు, పఱవైచి=పాఱవైచి, దుద్దు, పెట్లకున్ = దుద్దుకట్టెలదెబ్బలకు, పాఁచుచునె = పరువిడుచునే, ఒలెల్=వస్త్రములను, వైచువారు = పాఱవేయువారును, (3) బరువు = తామెత్తుకొన్నబరువును, డించి = దిగువ దించి, కటారి పరుఁజించి=కటారి యమర్చుకొని, నిల్చి, ఇం దెందు వచ్చెదరని, ఎదురువారు = ఎదిరించెదువారును, (4) వస్త్రంబుల్ కొండు=ఈబట్టను దీసికొనుఁడు, ఇది = ఈమాట, దేవరతోయి = దేవతతోయి, చన్నన్=ఇదిపోయినట్లాయెనా, పస్తు = ఉపవాసముండవలసివచ్చును, అని, దయపుట్టన్ = దయగలుగునట్లు, పలుకువారు = మాటలాడెదువారును, (5) మా మూఁకన్ = మాగుంపునందు, కలవి=కలిగిన వస్తువులు, ఇప్పింతుర్ = ఈఁజేసెదను, తొలఁగుఁడు = తొలఁగిపొండు, ఒకటి = ఒక మాట వినుఁడు, ఆఁడుదానిన్ = స్త్రీని, చేసంటకుఁడు=చేతఁ దాఁకవలదు, అనుచున్= ఇట్లని, పెద్దతనముల్ = (ఆగుంపులోఁ దమకుఁగల యధికార మనుట) అభిమానములు, (స్త్రీలయెడలఁ గల పరు వనుట), తెంపు = తెగువ, సొమ్ములు పోయినఁ బోవుఁగాక స్త్రీలను దాఁకకున్న మంచి దని తలంచుట), కనఁగన్ = తెలియునట్లు, పలికి = చెప్పి, నిలిపి = గుంపును నిలువఁజేసి, దోఁపుఇచ్చువారునై = చూఱనొసఁగువారై, తొలఁగిరి= విముఖులైరి, అపుడు.

సీ. తోడువింటివాఁడు చనన్త్రోవఁ బోవక యెదు
      ర్పడువాండ్రఁ దోడిబడఁ బదరి పొడిచి
   పిసుఁ గీక పెనఁగినఁ బెద్ద నొంపక యెత్తిఁ
      బాఱించి చేఁ గలపాటి *నాఁచి
   యాయితంబై చించు కరిగెడువాఁ డేటు
      లవి మీఱి చన్న వెఱ దవులు టుడిగి
   పొదవు చే లేకయ పుటపుటయును నైన
      వాని శోధింప నవ్వలికిఁ బనిచి
తే. పొదలఁ దూఱిన నీఁటిచా పుల వెడల్చి
   కట్టుబట్టలు గొని ప్రాఁత బట్ట దయను

* దోఁచి, చేఁగలవానినాఁచి,

గోఁచులకు నిచ్చి గనపరాశులు నిగిడ్చి
చెప్పుటట్టలు శోధించి కసిగలు విప్పి. 78

టీ. (1) తొడువింటివాఁడు = అం దొడిగిన విల్లుగలవాఁడు, చన్నోవన్ = పోయెడుత్రోవను, పోవక = ఏగక, ఎదు వాండ్రన్ = ఎదురైనవారిని, తొడిఁబడన్ = లెస్సగా, పదరి = తిట్టి, పొడిచి (2) పిసుఁగు = పీసుఁగు, (లోభి యనుట.), ఈక = తనసొమ్మియ్యక, పెనఁగినన్ = పెన ఁడఁగా, (వానిని) పెద్ద = మెండుగాను, నొంపక = నొప్పింపక, ఎత్తున్ = నెత్తుర , పాటించి = కాయునట్లు పొడిచి, చేకలపాటి = చేతనున్నమాత్రము సొమ్ము, ఁచి = అపహరించి, (3) ఆయితంబై = ఆయత్తపడినవాఁడై, చించుక = గుంపును చించుకొని, అరిగెడువాఁడు = పోవుచున్న వాఁడు, ఆవి యేటులు = ఆదొంగల ప్రహారములను, మీటి = అతిక్రమించి, చన్నన్ = పోయినను, వెకదవులుట = వెఁబడించుట, ఉడిగి = మాని, (మార్గస్థుఁ డెవ్వండేని గుంపుఁ జించుకొనిపోఁగా దొంగలు వానిఁ దఱుమ రనుట.), (4) పొదవు ('పొదువు' అని యొకరు.) = ద్రవ్యము, చేలేకయ = చేతలేకయే, పుటపుట యును నైన వానిన్ = బలిసినవానైనవాని, శోధింపన్ = వానిదాఁపున సొమ్ములు చూచుటకు, అవ్వలికిన్ = అవలికి, పనిచి = పంపి (బలముగలవాఁడు గుంపులో నున్న వాని నవ్వలికి దొంగలు పంపి రనుట), (5) పొదలఁదూఱినన్ = కొందఱు పొదలలోఁ దూఱఁగా, ఈఁటెచాపులన్ = ఆపొదలమీఁదికిఁ బొడిచెద మని ఈఁటెలు చాచుటలచేత, వెడల్చి = వారిని బయలికి రప్పించి, కట్టుఁబట్టలు = కట్టుకొన్న వస్త్రములు సైతము, కొని = గ్రహించి, ప్రాఁతబట్ట = జీర్ణవస్త్రమును, దయను = దయచేత, గోఁచులకున్ = కౌపీనములకుఁగా, ఇచ్చి = ఒసఁగి, *గనపరాశులు = గన్నేరాకులవంటి యమ్ములయలుఁగులను, నిగుడ్చి = లోపలదూర్చి, చెప్పుటట్టలు = పాదరక్షలయట్టలు, శోధించి = వెదకి, సిగలు = జుట్టు, విప్పి, (మార్గస్థులు చెప్పుటట్టల సందులను, సిగలయందును సొమ్ములు దాఁచియున్నా రని దొంగలు వానినెల్ల శోధించి రనుట.) స్వభావోక్తి.

వ. ఇట్లు పాటచ్చరులు పెచ్చువెరిఁగి విచ్చలవిడి నుచ్చావచంబు లగు
సార్థంబు నర్థంబు లపహరించు సంకులంబున. 79

టీ. ఇట్లు = ఈవిధముగా, పాటచ్చరులు = చోరులు, ('ప్రతిరోధిపరాస్కందిపాటచ్చర మలిమ్లుచా' అని యమరము.) పెచ్చువెరిఁగి = చెలరేఁగి, విచ్చలవిడిన్ = స్వేచ్ఛచేత, ఉచ్చావచంబులగు = అనేకవిధములగు, ('ఉచ్చావచం నైకభేద' మ్మని

* గనవరాశులు; గనిపరాశులు. (కనపరాశులు అని బ్రా.)

యమరము.) సార్థంబు = బాటసారులయొక్క, అర్థంబులు = ధనములు,అపహరించు = దోఁచుకొనెడు, సంకులంబునన్ = సందడిగనుండు.

సీ. కటినుండి చనుమఱు గడిగాఁగ బిగియించి
కట్టిన నిడు నీలి కాసె మెఱయఁ
బిల్లిగడ్డము మించఁ బెరిఁగి మీసలు కుక్షి
గోళంబుమీఁద నుయ్యాల లూఁగ
బూది బ్రుంగిన మొగంబున పడిఁగట్టు మై
నపుమైల ప్రాఁజాఁదు నాఁ జెలంగఁ
జిటిప్రేలి పూసపై ఘటియిల్లు వెడపట్టు
చిమ్ముల సురియ డా ల్ముమ్మరముగ
తే. నూరనుండియుఁ గనుపెట్టుకుండువాఁడు
తప్పిపో నన్ను దబ్బాటు దాఁ బొడగని
యట్టివేళఁ గాకశ్మశ్రు వనెడు నొకప్ర
చండ చండాల చోరభటుండు తఱిమి. 80

టీ. (1) కటినుండి = పిఱుఁదుదగ్గఱనుంచి, చనుమఱు = ఱొమ్ము, గడిగాఁగన్ = హద్దుగా, బిగియించి = బిగించి, కట్టిన, నిడు = పొడువైన, నీలికాసె = నీలిదట్టి, మెఱయన్ = ప్రకాశింపఁగా, (2) పిల్లిగడ్డము = పిల్లిగడ్డమువంటి తనగడ్డమును, మించన్ = అతిశయించునట్లు, మీసలు = మీసాలు, పెరిఁగి, కుక్షిగోళంబుమీఁదన్ = గుండ్రని కడుపు మీఁద, ఉయ్యాలలూఁగన్ = డోలాయమానము లగుచుండఁగా, (3) బూదిన్ = తానుబూసికొన్నబూడిదచేత, బ్రుంగిన = కప్పఁబడిన, మొగంబునన్ = ముఖమందు, పడిఁగట్టు = పడియఁగట్టిన, మైనపుమైల = మధూచ్ఛిష్టమాలిన్యము (మడ్డి), ప్రాఁచాఁదునాన్ = ప్రాఁతచాఁదు చుక్క యనునట్లు, చెలంగన్ = ఒప్పఁగా, ('పడియఁగట్టిన మైనపుమడ్డిని చాఁదుచుక్కవలెఁ బెట్టుకొన్నాఁ డనుట.), (4) చిటిప్రేలి = కనిష్ఠికాంగుళియొక్క, పూసపైన్ = కనుపుమీఁద, ఘటియిల్లు = సంగతమైన, వెడపట్టు = దసిలిగాఁబట్టుటయొక్క, చిమ్ముల = విసరుటలు గల, సురియ = సురకత్తియొక్క, డాల్ = కాంతి, ముమ్మరము కన్ = అతిశయిల్లఁగా (5) ఊరనుండియున్ = నేవ వెడలిన గ్రామమునుండియును, కనుపెట్టుకుండువాఁడు = వేచియున్నవాఁడు, తప్పి పోన్ = తప్పించుకొనిపోఁగా, నన్ను, దబ్బాటు = అదాటున, (హఠాత్కారముగా ననుట), తాన్ = ఆమొదలిచోరుఁడు, పొడగని = గుఱుతు చూచి, అట్టివేళన్ = ఆ సమయమందు, కాకశ్మశ్రు వనెడు = కాకశ్మశ్రు వను పేరుగల, ఒక = ఒక్కఁడైన,

ప్రచండ = మిక్కిలియుద్దండులైన, చండాల = మాలలైన, చోర = దొంగయగు, భటుండు = బంటు, తఱిమి = వెంబడించి. స్వభావోక్తి, ఉత్ప్రేక్ష, ఉపమ.

చ. తన వటు డించి యేగునుకఁగాఁ సురెఁ గొంకులఁ దార్చి కూలుదు
న్నివిడిన బొజ్జపై మిగులు నిద్దపు దోవతి దట్టి డొల్లి రాఁ
దివిచి పెనంగ వల్లువముఁ ద్రెంచి యనంతుని గంట్ల కూనపుం
జెవులుగ గౌదకట్టు [1]కసెచేరుల టెక్కియు దోఁపునొల్చి పోన్. 81

టీ. తన = నాకు జతయగు, వటున్ = బ్రహ్మచారిని, డించి = డిగ్గవిడిచి, ఏన్ = నేను, గునుకఁగాన్ = పరుగెత్తఁగా, సురెన్ = వానికత్తిని, కొంకులన్ = పాదాను సంధులయందు, తార్చి = అంటవ్రేసి, (క్రొంకులఁ గూర్చి యని కొందఱంద్రు), కూలుదున్ = క్రిందఁబడఁగానే, నివిడిన = నిగిడినట్టి, (పై కుబికినట్టి యనుట), బొజ్జపైన్ = ఉబ్బుకడుపుమీఁద, మిగులు = వ్యాపించియున్న, (ముల్లెయున్న దని తెలియునట్లుబ్బు కొనియున్న దనుట). నిద్దపు = స్నిగ్ధమగు, దోవతి = దోవతియొక్క, దట్టి = కట్టును, డొల్లి రాన్ = జాఱివచ్చునట్లు, తివిచి = ఈడ్చి, పెనంగన్ = నేను పెనఁగులాడఁగా. వల్లువము = వరహాలముల్లె, త్రెంచి = తెగఁగోసికొని, అనంతుని గంట్లకున్ = కుట్టుపోఁగులకుఁ బైగా నున్న గణుపులవఱకు, ('నాగుఁబడిగపోఁగులుగల దొందలవఱకనియును చెప్ప వచ్చును.) కూనపున్ = తెగిపోయినట్టి, చెవులుగన్ = చెవులు గలుగునట్లుగా, (చెవులు తెగునట్లుగాఁ బోఁగులు తెంపినాఁ డనుట.) గౌదకట్టు = చెంపలను మూసికట్టిన కట్టు. ("గీ. చెంపలను మూసి కట్టుట చెలఁగు గౌద, కట్టనంగను......"ఆంధ్రభాషార్ణవము. 3-32,") కసెచేరుల = బొందెచేరులుగల, టెక్కియున్ = కుల్లాయియు, దోఁపు నొల్చి = దోఁచుకొని, పోన్ = పోవుచుండఁగా. స్వభావోక్తి.

క. నోరెసని నుండ కే నో
రోరి యకట మా సమీప వూరనె మనియున్
దూరము వోయితివే సొ
మ్మేరీతిని నీకు దక్కునే కానీరా. 82

టీ. నోరెసనిన్ = నోటికసిచేత, ఉండక = ఊరకుండక, ఏను = నేను, ఓరోరి, (ఇది నీచసంబుద్ధి), అకట = అయ్యో, మా = మాయొక్క, సమీపపు = దాఁపున నున్న, ఊరనే = గ్రామమందే, (తములపాకు మొదలగు పదములకువలె పుగాగమము) మనియున్ = బ్రదికియుండియు, దూరమువోయితివే = దూరమేగితివా, సొమ్ము = ధనము, ఏరీతి = ఏవిధముచేతనైనను, నీకు దక్కునే = నీకు దల్చియుండునా, కానీరా = కానిమ్మురా.

1. గల.

తే. [1]అనిన లాఁతుగఁ గోల్పోవఁ గ నతఁడు రడ్డి
రాజుఁ గను నని కొదయుఁ దీర్పంగ మగుడి
యంతఁ బరియును బైప్రజఁ గలికి పాఱి
పోవ వాఁడును వెడపోట్లఁ బొడిచి చనియె. ౮౩

టీ. అనిన్ = ఇట్లనఁగా, లాఁతుగన్=అధికముగా, కోల్పోవఁగన్=పోఁగొట్టుకొన్నందున, అతఁడు=ఆబాపఁడు, రడ్డిన్=పటేలును, అనఁగా గ్రామాధికారిని, రాజున్ = ప్రభువును, కనువని=చూచు నని, కొదయున్=కొఱఁతయును, తీర్పంగన్ = తీర్చుటకై, (చంపుటకై యనుట.) మగుడి=మరలివచ్చి, అంతన్ =అంతలో, పరియును=తనతోడిగుంపును, పైప్రజకున్=పైఁగావచ్చెడువారికి, అలికి=భయపడి, పాఱిపోవన్=పరువెత్తఁగా, వాఁడును=ఆకాళశ్మశ్రుండును, వెడపోట్లు=తప్పుపోట్లు, పొడిచి, చనియెన్=పోయెను.

ఉ. అంతటఁ బొంతఁ బెన్నెరవునం దరుదెంచు పిఱిందిమంది మ
త్కాంత సహోదరుండును నొకం డరుదెంచుచు సాతు పడ్డ వృ
త్తాంత మెఱింగి నన్నరసి తాఁ గని యార్తి నొకండు దా నలి
క్రాంతుని నన్నుఁ గావట దిసంతులు గొట్టుచు మోచు కేగుచోన్.

టీ. అంతటన్=తదనంతరము, పొంతన్ = సమీపమందు, పెన్నెరవునందున్ = రాజమార్గమందు, అరుదెంచు = వచ్చుచున్న, పిఱిందిమందిన్ = వెనుకటిప్రజయందు, మత్కాంత సహోదరుండును = నాభార్యతోఁడఁబుట్టినవాఁడును, ఒకండు = ఒకపురుషుండు, అరుదెంచుచున్ = వచ్చుచును, సాతు = సార్థము, (పథికసమూహ మనుట.), పడ్డ=పొందిన, వృత్తాంతము=వార్తను, ఎఱింగి = తెలిసి, నన్నరసి=నన్ను విచారించి, తాన్=తాను, కని=చూచి, ఆర్తిన్ = దుఃఖముచేత, తా నొకండును=నామఱఁది యొక్కఁడే, అలిక్రాంతునిన్ = మిక్కిలిబడలియున్న, నన్ను, కావటన్=కావటిబుట్టయందు, మోచుక = మోచికొని, దిసంతులుగొట్టుచున్ = నానేరములు పరిహాసముగా నెన్నుచు, (మఱఁదిగావున దుఃఖమందును దన యవివేకమునకుఁ బరిహసించె ననుట), ఏగుచోన్=పోవుచుండఁగా.

తా. అంతట సమీపమందలి పెద్దబాటను వచ్చెడు కొంతమందిలోఁ గలిసినా యిల్లాలి తోఁబుట్టినవాఁడు వచ్చుచుండి, త్రోవను దోఁపు వడిన ప్రజవార్త విని నన్ను విచారించి వచ్చి చూచి వగచి మిగులఁ బడలియున్న నన్నుఁ గావటిలో నునిచికొని తా నొక్కఁడును మోచికొనుచు నన్ను నేరము లెన్నుచుఁ బోయెను.

---

1. అనిన నలఁతిగఁ గోల్పోవ యతఁడురెడ్డి, రాజుఁగను నని కొదయుఁ దీర్పంగ మగిడి. (వ్రా. ము. పాఠము.)

సీ. కొంగవా ల్నఱుకు లంగుళులఁ బట్టుక జబ్బ
లంటఁ గుట్టిడ వెజ్జు నరయువారు
తలఁ బడ్డగుదియ దెబ్బలఁ బాఁత మసి యిడి
యంబలి గం జిండ్ల నడుగువారు
తమసేగిఁ జెప్పుకో దయమీఱ విని చీరఁ
జించిచ్చువారి దీవించువారు
నొలివడ్డ నెపమునఁ గలలేని సిరిఁ జెప్పి
చుట్టలపై దాడి వెట్టువారు
తే. నైన పాంథులచేతఁ గ్రందైన యూళ్ల
జాడగా నిటఁ దెచ్చియిన్నిడ డించి
పాఱు నీ రానఁ బోవ నొవ్వారి మగిడి
వచ్చునాలోన నీ రూపు వచ్చె నాకు. 85

టీ. (1) కొంగవాల్=కొంగవాలుగావంకలైన, నఱుకులు=గాయములు, (కొంగవా లనఁగా మాలవాని చేతి కత్తి. కం. 'సురియాఁకు చేతికత్తికి, నరులందఱు పేరుపెట్టినారు ధరిత్రి, న్మరి కొంగవాలనంగను, దిరుమలపై నుండు దేవదేవ ముకుందా' అని దేశ్యనామార్థకోశమందుఁ జెప్పఁబడియున్నది: కాన, నట్లైన, కొంగవాల్=ఆకత్తిచేతనైన, నఱుకులు = గాయము లని చెప్పనది.) అంగుళులన్ = వ్రేళ్లచేత, పట్టుక = బిగఁబట్టుకొని, జబ్బలను = తుంట్లను, అంటన్ = కదిసికొనునట్లు, కుట్టుఇడన్ = కుట్టుటకై వెజ్జున్=వైద్యుని, అరయువారు = వెదకెదువారును, (2) తలన్ = శిరమునందు, పడ్డ= పడినట్టి, గుదియ = దుడ్డుకఱ్ఱలయొక్క, దెబ్బలన్ = గాయములయందు, పాఁతమసి యిడి = గుడ్డకాల్చినమసి యదిమి, అంబలి, గంజి, ఇండ్లన్ = ఇంటింటను, అడుగువారు=యాచించువారును, (3) తమసేగి = తమకుఁగలిగినకీడును, చెప్పుకోన్=తెలియఁజేసికొనఁగా, దయ=కృప, మీఱన్ = అతిశయించునట్లు, విని = ఆకర్ణించి, చీరన్ = వస్త్రమును, చించిచ్చువారిన్ = చించియొసంగెడువారిని, (చించిచ్చు, 'చించియిచ్చు, క్త్వార్థకఇత్తునకుసంధి.) దీవించువారు=ఆశీర్వదించెడివారును, (4) ఒలివడ్డ=దోఁపిడిపడిన, నెపమునన్ = వ్యాజముచేత, కల = కలిగినదియు, లేని = లేనట్టియు, సిరిన్ = తమసంపదను, చెప్పి, చుట్టలపైన్ = బంధుస్వ[?]మీఁద, దాడివెట్టువారు = దండువెడలెడువారును, (తాము దోఁపుడుపోయినసాకుచే కొంచెము పోయినను గొప్పగాఁ జెప్పుకొనుచుఁ జుట్టాల యిండ్లమీఁదికిభోజన వస్త్రాదులకుఁ బోయి రనుట), ఐన = ఈరీతి గలిగిన, పాంథులచేతన్ = దోఁచఁబడినమార్గస్థులచేత, క్రందైన = సందడిగల, ఊళ్ల

ఊరఁగాన్ = గ్రామములమీఁదుగా, ఇటఁదెచ్చి = నామఱఁది నన్నిక్కడికిఁ దెచ్చి, ఇఱ్ఱిదర్ డించి=ఈమఱ్ఱిచెట్టునీడను గావడి దించి, పాఱు=ప్రవహించెడు, నీరు=ఉదకమును, ఆనఁబోవన్ = పానముసేయఁబోఁగా, నొవ్వారి=నొప్పిఘనమై, మగిడివచ్చునాలోనన్=తిరిగి వచ్చునంతలోనే, ఈరూపు=ఈ బ్రహ్మరాక్షసరూపము, నాకున్, వచ్చెను.

వ. కయ్యంబునఁ బాఱఁబాఱఁ గాయంబు గాయంబు సేసి వెఱవేఁకిఁగొలిపిన కాకశ్మశ్రునామధేయచండాలు కరాళవేషంబు కన్నులం గట్టినట్లుండఁ గడఁగనుట నిట్టి కరాళవేషంబు గలిగెఁ గైశికిగాన ఫలదానంబునదీని మానుపవే! అనిన నతం డేను ఫలంబెఱుంగ, ఫలంబుపరమేశముఖోల్లాసంబ యాజ్ఞాకైంకర్యంబులకు ననుమతి కైంకర్యంబులకు ఫలపరిమాణ గణన ప్రపన్నుల కెక్కడియది? కాన బంధకం బగుట ఫలం బింతంత యందుఁ గొంతఁ గొమ్మన వెఱతు భగవంతుండ రక్షించు నూఱడిలు మన్న నవ్వారిమాట నోరన యుండ నతండు. 86

టీ. కయ్యంబునన్ = మున్ను చోరులకును పథికులకును గలిగిన జగడమునందు, పాఱన్ పాఱన్=మిక్కిలి పరువెత్తఁగా, కాయంబు = నాశరీరమును, గాయంబుసేసి= రక్తసిక్తముఁజేసి, వెఱవేఁకి = భయజ్వరమును, కొలిపిన = కలుగఁజేసిన, కాకశ్మశ్రునామధేయ చండాలు = కాకశ్మశ్రుఁ డను పేరుగల మాలనియొక్క, కరాళవేషంబు= భయంకరాకారము, కన్నులం గట్టిన ట్లుండన్ = ప్రత్యక్షముగాఁ బొడఁగట్టినట్లుండఁగా, కడన్ కనుటన్ = పంచత్వముం బొందుటచేత, ఇట్టికరాళవేషంబు = ఈవిధమైన బీభత్సరూపము, కలిగెన్ = నాకు సంభవించెను. (అంత్యకాలమం దాచండాలునిరూపమే స్మరణకు వచ్చెను గావునఁ దదనుగుణముగా నిట్టిరూపము వచ్చె ననుట), కైశికిగానఫల దానంబునన్ - కైశికిగాన = మంగళకైశికిగానముయొక్క, ఫలదానంబునన్ = ఫలము నాకొసఁగుటచేత, దీనిన్ = ఈవికృతాకారమును, మానుపవే= పోఁగొట్టవే, అనినన్ = ఇట్లనఁగా, అతండు = ఆభగవద్దాసుఁడు, ఏను = నేను, ఫలం బెఱుంగన్ = గానఫలము నెఱుఁగను, ఫలంబు = ఆఫలము, పరమేశ = శ్రీపతియొక్క, ముఖోల్లాసంబ = ముఖోల్లాసమే, ఆజ్ఞాకైంకర్యంబులకున్ = వేదశాస్త్రములచేత విధింపఁబడినకైంకర్యములకు (సంధ్యావందనాదుల కనుట), అనుమతికైంకర్యంబులకున్ = భృత్యుఁడు సేయుకి[illegible]ాది కైంకర్యములకును, ఫలపరిమాణ=ఫలపరిమితియొక్క, గణన = లెక్కపెట్టుట, ప్రపన్నులకున్ = భగవద్దాసులకు, ఎక్కడియది = ఏదది, కానన్ = కాఁబట్టి, బంధకం బగుటన్=ఆగణనము బాధకారణంబు గావున (పునర్జననహేతు వనుట.) ఫలంబు = ఆగానఫలము, ఇంతంత=ఇంతయంతయని

యును; అందుఁ = ఆగానఫలమందు, కొంత = కొంతభాగమును, కొమ్ముఅనన్ వెఱతుఁ = గ్రహింపు మనుటకు భయంపడుదును, భగవంతుఁడ = శ్రీపతియే, రక్షించుఁ = కాచును, ఊఱడిలుము అన్నన్ = స్వస్థచిత్తుండవు కమ్మనఁగా, అన్నోరిమాట = అనోటిమాట, నోరన యుండఁ = నోటనే యుండగా, (అంతశీఘ్రముగా ననుట), అతండు = ఆబ్రహ్మరాక్షసుఁడు.

సీ. స్నిగ్ధ త్రిభాగ ముం । డిత శిరశ్శిఖతోడ
హిమధవళోపవీ । తములతోడఁ
బుణ్యషడ్ద్వితయోర్ధ్వ । పుండ్రవల్లులతోడఁ
దులసికాబ్జస్రగా । వళులతోడఁ
గౌపీన కటిసూత్ర । కాషాయయుగితోడ
జలపూర్ణ శుభకమం । డలువుతోడఁ
బాణిస్థదివ్యప్ర । బంధసంపుటితోడ
నుత్తరవాక్పూర్వ । కోక్తితోడఁ
తే. బసిఁడిజిగితోడ బ్రహ్మవ । ర్చసము వొల్చు
భాగవతలక్ష్మితో ధూమ । పటలి పుండి
వెడలు శిఖవోలె నమ్మేను । వెడలి చూడఁ
జూడ వైష్ణవుఁడై నిల్చె । సోమశర్మ. 87

టీ. (1) స్నిగ్ధ = నిద్దమైనట్టియు, త్రిభాగ = మూఁడు పాళ్లయందు, ముండిత = భద్రాకరణముఁ జేయఁబడిన, శిరః = శిరమునందలి, శిఖతోడన్ = జుట్టుతోడను. (శిరస్సుమూఁడు భాగముల క్షౌరమునై యొక్క భాగమందు శిఖయుఁ నుండె ననుట), హిమ = మంచువలెనే, ధవళ = తెల్లనగు, ఉపవీతములతోడన్ = జన్నిదములతోడను, (2) పుణ్య = పవిత్రములగు, షడ్ద్వితయ = పండ్రెండైన, ఊర్ధ్వపుండ్రవల్లులతోడన్ = లతలవంటి యూర్ధ్వపుండ్రములతోడను, తులసికా = తులసిపూసలయొక్కయు, అబ్జ = తామరపూసలయొక్కయు, స్రక్ = మాలికలయొక్కయు, ఆవళులతోడన్ = సమూహములతోడను, కౌపీన = గోవణములతోడను, కటిసూత్ర = మొలత్రాటితోడను, కాషాయయుగితోడన్ = రెండుకాషాయవస్త్రములతోడను, (ఇది ద్వంద్వసమాసమును 'సర్వోద్వంద్వో విభాషయైకద్భవతి' అన్నట్లేకవచనాంతము. కాషాయయుగళితో నని యుం గొంద ఱందురు), జల = తీర్థముచేత, పూర్ణ = నిండిన, శుభ = మంగళమైన, కమండలువుతోడన్ = పాత్రతోడను, పాణిస్థ = హస్తమందున్న, దివ్యప్రబంధ = ద్రావిడవేదముయొక్క, సంపుటితోడన్ = పుస్తకముతోడను, (సంపుటములో నని కొందఱు) ఉత్తరవాక్ = వ్యాయమందలి

యుత్తరవాక్యమే, పూర్వక = పూర్వముగాఁగల, ఉక్తితోడన్ = సంభాషణముతోడ, (ద్వయానుసంధానముఁ జేయుచున్నాఁ డనుట, ఇచ్చట నుత్తరవాక్యమనఁగఁ బరమ సదాచారాధ్యయనసమృద్ధి, పొల్చు=ఒప్పుచున్న, బ్రహ్మవర్చసముఁ బ్రోచు నని కొంద ఱందురు) అట్లైన, బ్రహ్మవర్చసమున్ = బ్రహ్మవర్చస్సును, పొల్చు=ఒప్పుచుండెడి, భాగవతలక్ష్మితోన్ = భాగవతకాంతితోడను, ధూమపటలినుండి = పొగగుంపువలన, వెడలు = బహిర్గతుఁడగు, శిఖవోలెన్ = జ్వాలవలెను, అమ్మేను = ఆ రాక్షసశరీరము నుండి, వెడలి=వెలువడి, చూడఁజూడన్=చూడఁగాఁజూడఁగా, సోమశర్మ, వైష్ణవుఁడై= విష్ణుభక్తుఁడై, నిల్చెన్=నిలిచెను. స్వభావోక్తి. ఉపమ.

వ. ఇట్లు భాగవతపరిచయప్రభావంబున బ్రాహ్మణ్యంబె కాక భాగవత శ్రీయునుం గలిగి యుప్పు చింది యినుమడియగుచందంబునం బరమ హర్షభరితుం డై స్వరూపానురూపంబుగా నతనికిఁ బూజఁగావించి.

టీ. ఇట్లు=ఈప్రకారము, భాగవత = భగవద్దాసునియొక్క, పరిచయ = గుఱుతెఱుకయొక్క, ప్రభావంబునన్ = మహిమచేతను, బ్రాహ్మణ్యంబె కాక = విప్రత్వమే కాక, భాగవత శ్రీయునున్=భాగవతసంపదయును, కలిగి, ఉప్పు చింది, ఇనుమడియగు చందంబునన్ = ద్విగుణితమగునట్లు, (బ్రాహ్మణ్యము వైష్ణవత్వముచేత రెట్టించెననుట). పరమహర్ష=పరమానందముచేత, భరితుండై=పరిపూర్ణుఁడై, స్వరూపానురూపంబుగాన్= సంప్రదాయమునకుఁ దగినట్టుగా, అతనికిన్=ఆనంబాడువా నను భాగవతునకు, పూజన్= సపర్యను, కావించి = ఒనరించి, ఉపమాలంకారము.

సీ. జయ దురుత్తరణసంసరణాబ్ధిదళనీర
జయజయ గాయకసార్వభౌమ
జయ శౌరిగాథారసజ్ఞపుణ్యరసజ్ఞ
జయజయ తత్త్వసంశయలవిత్ర
జయ *జనార్వాచీనజనిసంగవంచక
జయజయ దేశికచరణశరణ
జయ యుక్తవాక్ప్రీతిసాత్మ్యనీతదేహ
జయజయ భగవదాజ్ఞాస్థితిస్థ
తే. జయ సకలజంతుసమచిత్తజనదయార్ద్ర
జయ ముకుందాన్యదేవస్తుతిశ్రవణబధిర

---

* జయార్వాచీన.

జయ చతుర్ద్వయభక్తిలక్షణచితాంగ
జయ మురారిప్రపన్నాంఘ్రిజలజమధుప. 89

టీ. (1) దురుత్తరణ=తరింపశక్యముగాని, సంసరణ = సంసార మనియెడి, అబ్జదళ=తామరాకునందలి, నీర=ఉదక మైనవాఁడా, (తామరాకుపై నీరు దాని నంటకుండినట్లు నీవు సంసారమందుఁ దగుల వనుట), జయ = జయ మగుఁగాక, గాయక సార్వభౌమ = కీర్తనాపరులకుఁ జక్రవర్తివైనవాఁడా, జయజయ, (2) శౌరి=శ్రీపతియొక్క, గాథా = కథలయొక్క, రస=సారస్యమును, జ్ఞ=తెలిసిన, పుణ్య = పవిత్రమగు, రసజ్ఞ= జిహ్వగలవాఁడా, జయ, ('నీనాలుక భగవద్గుణకథన మధుర రసమును దెలిసిన దనుట), తత్త్వసంశయ = పరబ్రహ్మ మేదో యను సంశయమునకు, లవిత్ర = కొడవలి వైనవాఁడా, ('తత్త్వశబ్దము పంచవింశతి తత్త్వములకు నన్వయింపవచ్చును, అట్టివాని సందేహనివర్తకుఁ డనుట.), జయజయ, (3) జన=జనులయందు, అర్వాచీన=తక్కువగు, జని=జన్మముయొక్క, ('జనిరుత్పత్తిరుద్భవః' అని యమరము.) సంగ=సాంగత్యముచేత, వంచక=మోసముసేయువాఁడా, (మహిమ గూఢముచేసి జాలిని బ్రకటించువాఁ డనుట. మఱియుం జనులకు నీచజన్మములు రాకుండఁ జేసెడివాఁడ వనుట. జయజయార్వాచీనజనిసంగవంచక యనుపాఠమున, ఇఁకను వచ్చుజన్మముల సంబంధములేనివాఁ డని యర్థము.) జయ, దేశిక = ఆచార్యులయొక్క, చరణ = శ్రీపాదములే, శరణ = రక్షకముగాఁ గలవాఁడా, ('శరణం గృహరక్షిత్రోః' అని యమరము.) జయజయ, (4) ఉక్త=పలుకఁబడిన, వాక్=మాటయొక్క, ప్రతిష్ఠా=నిలుకడచేత, తృణీకృత=తృణప్రాయముగాఁ జేయఁబడిన, దేహ = నిజశరీరముగలవాఁడా, (సత్యమందు బుద్ధి యునిచి దేహాభిలాష లేనివాఁ డనుట.), జయ, భగవత్=భగవంతునియొక్క, ఆజ్ఞా=ఆనతిని, కృతి=చేయుట యందు, స్థ=స్థిరపడినవాఁడా, (5) సకల=సమస్తములైన, జంతు=ప్రాణులయందును, సమ=సరియైన, చిత్త = హృదయముగలవాఁడా, జయ, దయార్ద్ర=దయచేతఁ జల్లనివాఁడా, (6) జయ, ముకుంద = మోక్షప్రదుఁడగు నారాయణునికంటె, అన్య = ఇతరుఁడగు,దేవః అస్తి=దేవుఁడున్నాఁ డనెడు, శాస్త్ర=శాస్త్రమందు, బధిర=చెవిటివాఁడా, (విష్ణునికంటె నన్యదైవము గల దను చదువు వినఁ డనుట), జయ, (7) చతుర్ద్వయ = ఎనిమిదివిధములైన, భక్తిలక్షణ = భక్తిచిహ్నములచేత, చిత = వృద్ధియయిన, అంగ= దేహముగలవాఁడా, (ఇచట భక్తి యెనిమిది విధము లనుటకుఁ బ్రమాణము. 'మద్భక్తజనవాత్సల్యం పూజాయాం చానుమోదనం, స్వయ మభ్యర్చనం చైవ మదర్థే దంభవర్జనం, మత్కథాశ్రవణే భక్తిః సర్వనేత్రాంగ విక్రియా, మమానుస్మరణం నిత్యం యచ్చ మా ముపజీవతి, భక్తిరష్టవిధా హ్యేషా యస్మిన్ మ్లేచ్ఛేఽపి వర్తతే, స విప్రేంద్ర

స్పచ శ్రీమాన్ నయలిప్స చ వండితః' అని యున్నది), జయ, (8) మురారి=మురాసురమర్దనుం డగు శ్రీపతియొక్క, ప్రసన్న=ప్రపత్తిచేసిన భక్తులయొక్క, అంఘ్రిజలజ=పాదపద్మములకు, మధుప=భృంగమవైనవాఁడా, జయ. గీతి చివరిపాదమున రూపకము.

వ. అని ప్రస్తుతించి ప్రదక్షిణంబు గావించి పునర్భవభయంబున భవన భార్యాప్రముఖ సుఖవిముఖుం డై బదరీవనాదిపురుషోత్తమాధిష్ఠిత పుణ్యభూములఁ బౌనఃపున్యంబుగం దీర్థయాత్ర జరించుచుఁ బరమ నిర్వృతిం బొందె నిప్పుణ్యకథ వహనసమయంబునఁ గుహనావరాహంబువలన మహీమహిళ మదీయ పూజోపచితోపచారంబుల విశేషఫలదంబు గానంబ యన విని వైష్ణవియుం దాఁ గావునఁ దదాకలన కుతూహలంబునం గూఁతురై నీ కొదవి యవారవాంబును విప్రలంభదంభేరితాగాధగాథార్థసమేతగీతరసంబునం బ్రొద్దుపుచ్చుట గాని వేఱొండుగా దేమి తపంబుసేయుచున్నదియో యం టింత కంటెఁ బరమతపం బున్నదే? యన్నియును మేలయ్యెడు, శ్రీరంగంబునకు రంగేశుని సేవింపఁ దోడుకొనిపోయి రమ్మనుటయుఁ, బ్రసాదమ్మని ప్రణామమ్ము సేసి పసిండిపల్లకి నబ్బాలికారత్నంబు నునిచి పరిచారికా శతంబును భాగవతపరిషత్తునుం గొలువఁ బ్రయాణ పర్యాయంబులఁ బరమానురాగంబునం బోయి. 90

టీ. అని=ఇట్లని, ప్రస్తుతించి=కొనియాడి, ప్రదక్షిణంబు గావించి = వలగొని, పునర్భవభయంబునన్=మరలజన్మములుగలుగుననుభయముచేత, భవన=ఇల్లును, భార్యా=ఇల్లాలును, ప్రముఖ=మొదలగు, సుఖ=సుఖములవలన, విముఖుండై=పరాఙ్ముఖుండై, బదరీవనాది = బదరికారణ్యము మొదలైన, పురుషోత్తమాధిష్ఠిత-పురుషోత్తమ = నారాయణునిచేత, అధిష్ఠిత = నెలకొనఁబడిన, పుణ్యభూములన్ = దివ్యదేశములయందు, పౌనఃపున్యంబుగన్ = మాటిమాటికి, తీర్థయాత్రఁజరించుచున్ = తీర్థయాత్రలయందు సంచరించుచును, పరమనిర్వృతిన్=పరమసుఖమైన మోక్షమును, పొందెను=ప్రాపించెను, ఇప్పుణ్యకథ = ఈపవిత్రచరిత్ర, వహనసమయంబునన్ = వరాహావతారమై వహించినప్పుడు, కుహనావరాహంబువలనన్ = మాయావరాహమువలన, (వరాహావతారుఁడే యనుట), మహీమహిళ = భూకాంత, మదీయ=నాసంబంధములగు, పూజా=పూజలయందు, ఉపచిత=వృద్ధిఁబొందిన, ఉపచారంబులన్ = కైంకర్యములయందు, విశేషఫలదంబు = హెచ్చుఫలము నొసంగునది, గానంబ అనన్ = గానమే యనఁగా, విని=ఆకర్ణించి, తాన్=ఆభూకాంత, వైష్ణవియున్ = విష్ణుసంబంధినియును, కావునన్ =

కాఁబట్టి, తత్ ఆకలన=ఆగానముసేయుటయందలి, కుతూహలంబునన్ = వేడుకచేత, కూఁతురై=పుత్త్రికయై, నీ కొదవి=నీకుఁ గన్న డి, అహరహంబును=ప్రతిదినమును, విప్రలంభ = వియోగ మనియెడు, దంభ = వ్యాజముచేత, ఈరిత = పలుకఁబడిన, అగాధ= గంభీరములైన, గాథా = కథలయొక్క, ర్థ=అర్థముతోడ, సమేత = కూడియున్న, గీతరసంబునన్ = గానరసముచేత, ప్రొద్దుపుచ్చుటగాని = కాలక్షేపముసేయుటగాక, వేఱొండుగాదు = మఱియొకటిగాదు, ఏవిధంబు సేయుచున్నదియో యంటి = ఏమి తప మాచరించుచున్నదో యంటివి, ఇంత లేక = ఇట్లు గానము సేయుచుండుట కంటెను, పరమతపం బున్నదే = హెచ్చుతప స్సున్నదా, (లే దనుట), అన్నియును= యావత్కార్యములును, మేలయ్యెడున్ = మంచి వగును, శ్రీరంగంబునకున్ = శ్రీరంగస్థలంబునకు, రంగేశుసేవింపన్ = శ్రీరంగనాయకుని సేవించుటకై, తోడుకొని= ఆయమను దోడ్కొని పోయి, ర మ్మనుటయున్ = పోయిరమ్మనఁగా, ప్రసాదమ్మని = మహాప్రసాద మని, ప్రణామమ్ముచేసి = నమస్కరించి, పసిఁడిపల్లకిన్ = కనకాందోళిక యందు, అబ్బాలికారత్నంబున్ = ఆగోదాదేవిని, ఉనిచి = ఇడికొని, పరిచారికా శతంబును = అనేకపరిచారికలును, భాగవతపరిషత్తును = భగవద్భక్తసమూహంబును, కొలువన్=భజింపఁగా, ప్రయాణపర్యాయంబులన్ = పయనంపువరుసలచేత, పరమానురాగంబునన్=పరమానందముచేత, పోయి=(ఆవిష్ణుచిత్తుఁడు) వెడలి.

తా. ఆ నంబాడువాను చరిత్రము పూర్వము వరాహావతారమున విష్ణుదేవుఁడు భూదేవికిఁ జెప్పఁగా, గానకైంకర్య మధికఫలదం బని, యట్లు, పాడుటకై యా భూమియె యీచూడికుడుత్తనాంచా రాయెను. ఈయమను శ్రీరంగనాయకుని సేవార్థమై తీసికొని పొమ్మని వడపెరుంగోయిలుడయవరు చెప్పఁగా నా విష్ణుచిత్తుం డట్ల బంగరు పల్లకిలో గోదాదేవి నటకుఁ గొనిపోయెను.

గోదాదేవి శ్రీరంగేశుని సేవించుట

మ. చని కాంచె న్విరజాభిధాంతర వపుస్సహ్యోద్భవాతీరనం
దనవాటీ వలయద్రుమావలి దళాంతర్దృశ్య వాపాళి భం
జన చాంపేయసుమాయమాన విషమస్స్వర్ణావృతివ్రాత ర
శ్మి నభస్స్పృక్ఛిఖరాళి దీపకలికాశృంగంబు శ్రీరంగమున్. 91

టీ. చని = ఆవిష్ణుచిత్తుం డరిగి, విరజా = విరజానది యనెడు, అభిధాంతర = మఱియొకపేరుగల, వపుః = దేహముగల, సహ్యోద్భవా - సహ్య = సహ్యపర్వతము వలన, ఉద్భవా = ఉదయించిన కావేరీనదియొక్క, ('కావేరీ విరజా సేయమ్' అని ప్రమాణము.) తీర=దరియందలి, నందనవాటీ=వనవీథియొక్క, వలయ=మండలమందలి,

ద్రుమ=వృక్షములయొక్క, ఆవళి=సమూహముయొక్క, దళ=ఆకులయొక్క, అంతః=సందులనుండి, దృశ్య = చూడఁదగినట్టియు, పాప=దోషము లనియెడు, అళి=తేఁటులయొక్క, భంజన=భంగపఱుచుటయందు, చాంపేయ = సంపెఁగలయొక్క, సుమాయమాన=పువ్వులవలె నుండెడు, విషమ = బేసి యగు సప్తసంఖ్యాకములైన, స్వర్ణావృతి=సువర్ణప్రాకారములయొక్క, వ్రాత = సమూహమునందలి, రశ్మి = కాంతులచేత, నభస్స్పృక్=ఆకాశము నొరయుచున్న, శిఖ=శిఖరములయొక్క, అళి=పఙ్క్తి లనియెడు, దీపకళికా=మొగ్గలవంటి దివ్వెలయొక్క, శృంగంబుల్=కొనలు గలిగిన, శ్రీరంగమున్=శ్రీరంగస్థలమును, కాంచెన్ = చూచెను.

తా. విరజానామాంతరముగల దేహముచేత నొప్పుచున్న కావేరీతీరమందు దట్టములగు వనములయందలి తరువుల యాకులసందులఁ గానవచ్చుచున్న యేడుబంగారు ప్రాకారముల కాంతులు పాపము లనియెడు తుమ్మెదలకుఁ దలదిమ్ము పుట్టించి పాఱఁదోలెడు సంపంగిపూలవలె నుండెను, పైశిఖరములు దీపకళికలవలె మెఱయుచు మిన్నంటియుండెను. ఉపమాతిశయోక్తిరూపకములు.

క. చోళీహల్లకచితకచ
పాళీ పాళీభవ ద్విపంచీస్వనభృం
గాళీ కవేరదుహితృ మ
రాళీధ్వను లెసఁగుగాడ్పు వ్రతివడ యుడిపెన్. 92

టీ. చోళీ = చోళదేశస్త్రీలయొక్క, హల్లక = ఎఱ్ఱకలువలతోడ, చిత=కూర్పఁబడిన, కచ = కొప్పుములయొక్క, పాళీ=సమూహములకు, పాళీభవత్ = పఙ్క్తిగట్టునట్టియు, విపంచీ = వీణెలయొక్క, స్వన = నాదమువంటిరాదముగల, భృంగ = తేఁటులయొక్క, ఆళి = సమూహములయొక్క, కవేరదుహితృ = కావేరియందలి, మరాళీ=హంసికలయొక్కయు, ధ్వనులు=కంఠనాదములు, ఎసఁగు=వీతెంచునట్టి,గాడ్పు=వాయువు, వ్రతి = నియమవంతుఁడగు నావిష్ణుచిత్తునియొక్క, వడ=మార్గాయాసమును, ఉడిపెన్=పోఁగొట్టెను.

తే. ఆతఁ డఘమర్షణస్నాన మమ్మరుద్వృ
ధాంబువుల నాడి మాధ్యాహ్నికాదిఁ దీర్చి
స్నాతయు నలంకృతయు నౌ తనయను దోడు
కొనుచు వైష్ణవపరిషత్తుఁ గొలువ నరిగి. 93

టీ. ఆతఁడు = ఆవిష్ణుచిత్తుఁడు, అమ్మరుద్వృధాంబువులన్=ఆకావేరీ తీర్థములయందు, అఘమర్షణస్నానమాడి = అఘమర్షణసూక్తములను చెప్పుచు స్నానముచేసి, మాధ్యాహ్నికాదిన్ = మాధ్యాహ్నికబ్రహ్మయజ్ఞానుష్ఠానములును, తీర్చి=నిర్వర్తించి

స్నాతయర్ = స్నానముఁ జేసిన యట్టిదియు, అలంకృతయర్ = సర్వాలంకార శోభితురాలును, భూః=అగునట్టి ('వాయిః ర్వ్యక్రతమా' అనుసూత్రముచేత నిది వక్రత మము.) తనయను=తనకుమారికను, తోః:గొనుచుర్=వెంటఁబెట్టుకొనుచు, వైష్ణవ=విష్ణు భక్తులయొక్క, పరిషత్తు=సమూహము, సేవన్=సేవింపఁగా, అరిగి=పోయి.

సీ. చరణంపు సరిపణి మొరపంబు విన్న [1]దం
  తులతోనె యెదురు నింతులకుఁ దొలఁగి
యిడినట్టి మణిముష్టి గృహముల యారతి కెంపు
  టాళ్లనే కలయ వాకిళ్లఁ జల్లి
ప్రసవాది తావికిఁ బ్రతిగృహేశార్థభ
  క్ష్యపువల్లునకె పోకె శ్వాస ముడిపి
నృత్తగీతోత్థశా రిస్తుతి కీర శా
  రిజయట్ల యర్థోర రీకృతి విని
తే. వలభి రత్నాంశువులఁ గట్టు తెలుపు చిత్ర
మగుట కోర్వక దిగదిగ నరిగి ధాన్య
మడిగెడు విరక్తభాగవ తాళివలన
వెల్లదీవియపోని య వ్వీడు సొచ్చి. 94

టీ. (1) చరణంపు=స్త్రీలపాదములయందలి, సరిపణి=భూషణవిశేషముయొక్క, మొరపంబు=ధ్వనిని, విన్నన్ = వినఁగానే, దంతులతోన = ఏనుఁగులతోడనే, ఎదురు=తమకెదురుపడెడు, ఇంతులకున్ = స్త్రీలకు, తొలఁగి = ఓరసిల్లి, (స్త్రీలపాదభూషణ రవము వినఁగానే యందలి యక్షయపాత్రపరులగు వైష్ణవు లేనుంగులకుఁ దొలఁగినట్లే యాస్త్రీలకుఁ దొలఁగుదు రనుట. శ్రీరంగమం దేనుఁగులును గల వనుట.), (2) ఇడినట్టి=తమకు నిచ్చినట్టి, మణిముష్టి = మాణిక్యభిక్ష, గృహముల=ఆగృహస్థులయొక్క, ఆరతి= నీరాజనములయందలి, కెంపుటాళ్లనే = రత్నములయందే, కలయన్ = కలియునట్లు, వాకిళ్లన్ = వారి ద్వారములయందు, చల్లి = పారఁజల్లి, (వీరు పేద లని యైశ్వర్య వంతులగు నచ్చటి గృహస్థులు వీరు వాకిండ్లయం దుండఁగానే వీరికి రత్నభిక్షఁ బెట్టఁగా వైరాగ్యమువలన నవి యొల్లక మరల వారు వీరికి రతనాలయారతి సమర్పించెడు పళ్లెర ములలోనే కలియఁబోయుదురుగాక; తండులములుదక్క మణియొకటి యంట రనుట.), (3) ప్రసవాది = పుష్పము మొదలగువానియొక్క, తావికిన్=పరిమళమునకు, ప్రతి గృహేశార్థ=ప్రతి తిరుమాళిగల పెరుమాళ్లకొఱకైన, భక్ష్యపు=పణ్యారముల సంబంధి

1. దంతులకట్ల.

యగు, వల్పునకెపోలెన్ = వాసనకువలె, శ్వాస ముడిపి=ఉచ్ఛ్వాసమును జాలించి, (అభిక్షుకులు పుష్పాదులయం దాసక్తి కూ? దని యందులకును, తిరుపణ్యారములు స్వామి కారగింపు గాకమునుపు మూర్కొన్న నపచార మగు నని యావాసనకును బోకుండఁ దమ శ్వాసమును బిగఁబట్టుదు ర. ఎ.), (౪) నృత్త=నాట్యములయందును, గీత=పాటలయందును, ఉత్థ=కలిగిన, శౌరి=శ్రీహరియొక్క, స్తుతి = వినుతిని, కీర = చిలుకలవలనను, శారి = గోరువంకవలనను, జనుః = పుట్టినదానివలెనే, అర్ధోరరీకృతిన్ = అర్ధాంగీకారము చేత, విని = ఆకర్ణించి, (ఆయః క్షయపాత్రపరులు విరక్తులుగావున నృత్త గానాదులయందు నాసక్తిలేకయుఁ గీరశారికాదిభాషలనువలెనే యందు భగవన్నామ ముండుటవలన దాని నర్ధాంగీకారముగా విందు రనుట.), (౫) వలభి=చూరుకమ్మియందలి, రత్న=రతనములయొక్క, అంశువులన్ = కాంతులచేతను, కట్టు=తాము ధరించుకొన్న, తెలుపు = ధవళవస్త్రము, చిత్రమగుటకున్ = చిత్రవర్ణమౌటకు, ఓర్వక = సహింపక, దిగదిగనరిగి = బిసబిసఁబోయి, ధాన్యము = తండులమును, అడిగెడు=యాచించునట్టి, విరక్త=విరక్తులగు, భాగవతాళివలనన్ = భగవద్భక్తసమూహమువలన, వెల్లదీవియ పోని = శ్వేతద్వీపమువలె నున్న, ఆవీడు = ఆశ్రీరంగస్థలము, చొచ్చి = ప్రవేశించి, (ఆ శ్రీరంగమందు భిక్షమెత్తెడు భాగవతులు శ్వేతద్వీపమునుండి యవతరించిన నిత్యసూరులేకాక మనుష్యులు గాని యింద్రాది దేవతలుగాని కారు. ఇందులకుఁ బ్రమాణము. శ్లో. 'దివివిషతిమానుషస్సచలితద్విభూషత్యసౌ, శితర్విషతిసర్వదా వివిధయిష్యతేతేనచ; ముముక్షిషతితత్త్వగత్యవగతేస్స నిస్సంశయం, నిని ల్యిషతి సర్వదా సచరిరంగభిక్షూవలిః' అని శ్రీపరాశరభట్టరుశ్రీసూక్తికలదు. దీనికి సరియగు తెనుఁగు మదీయము. చ. 'నరుఁ డమరత్వ మాయమరనాథతయాతఁ డతండు నెప్పుడున్, గిరిశతఁ గొంక కాతఁడును గీర్వ్యవలీశతయాతఁ డెంతయున్, మురిప మెలర్ప ముక్తతయు ముక్తుఁడు నిత్యత నిత్యుఁడు న్నిరం, తరమును రంగభిక్షుకతఁ దప్పక కోరుదు రోలి నాత్మలన్.'). ఉపమా సంకీర్ణ తుల్యయోగితము, ఉదాత్తమును.

ఉ. గోపురకందరాళికడ ♦ కు న్శశిపుష్కరిణీకణార్ద్రసం
తాపహరానిలంబులు వి ♦ తానరణన్మణికింకిణీకలా
లాపముల న్సుఖంపడుగ ♦ నాఁకటఁ జొచ్చి యకాండగానా
చాపలస్పృన్మరుద్గణముఁ ♦ జండఁ డదల్చెదు లోనివాకిటన్. 95

టీ. గో...కున్-గోపురకందరాళి = దరులవంటిగోపురములపఙ్క్తియొక్క, కదకున్ = తుదవఱకు, శశిపుష్కరిణీ=చంద్రపుష్కరిణి యందలి, కణ = జలబిందువులచేత, ఆర్ద్ర=తడిసినట్టియు, సంతాపహర=సేదదేర్చెడు, అనిలంబులు = వాయువులు, వితాన=

మేలుకట్ల యందలి; రణత్=మ్రోయుచున్న, మణికింకిణీ=రతనంపుమువ్వలయొక్క, కల=జిలిబిలియగు, ఆలాపముల్=ధ్వను లనియెడు పలుకులచేత, సుఖం బడుగన్ = కుశల ప్రశ్నముసేయఁగా, ఆఁటిఁజొచ్చి=ఆయుప్రాకారములయందుఁబ్రవేశించి, ఆకాండ = ఆసమయమందు ('కాండోఽస్త్రీ దండ బాణార్వవర్గావసర వారిషు' అని నిఘంటువు.) గాహనా=ప్రవేశించుటయందె, చాపలకృత్=త్వరపడుచున్న, మరుద్గణముల్=దేవతాసమూహమును, చండుఁడు=చండుఁడను ద్వారపాలకుఁడు, అదల్చెడు=రావల దని యదలించు చున్నట్టి, లోనివాకిటన్=సప్తమ గోపురద్వారమందు. వ్యస్తరూపకము.

తా. విష్ణుచిత్తుం దరిగెడు నవసరంబున దేవతలు సేవింప వచ్చిన నది వారికి నసమయం బని యా దేవతలను జండుఁ డను ద్వారపాలకుం డదలించుచు లోపలికి రాకుండఁ జేయునట్టి సమస్తప్రాకారద్వారమందుఁ జేరె నని భావము. కడమ సులభము.

ఉ. వేత్రముఁ గేలఁ బూని మణి ౹ వేది కుధంబుపయి న్సితాంబురు
  జ్నేత్రుని ముద్రవ్రేల్మెఱయ ౹ నిశ్చలు లై యిరుమై మనాఙ్నమ
  ద్గాత్రుల దంతివక్త్రులశ౹తంబు వినీతి భజింప నొప్పు త
  త్సూత్రవతీశు వందనము౹తోఁ గని యాతఁడు భక్తి సేయఁగన్. 96

టీ. వేత్రముల్=బెత్తమును, కేలన్=హస్తమందు, పూని=వహించి, మణివేది = రత్నంపుటరుంగునందలి, కుధంబుపయిన్ = లివాచీమీఁదను, సితాంబురుట్=పుండరీకములవంటి, నేత్రుని=కన్నులుగల శ్రీపతియొక్క, ముద్రవ్రేల్=ముద్రతోడి యుంగరముగలయంగుళము, మెఱయన్ = ప్రకాశింపఁగా, నిశ్చలులై=చలింపనివారై, ఇరుమైన్=ఉభయపార్శ్వములయందు, మనాక్=ఇంచుకంత. ('కించిదీషన్మనాగల్పే' అని యమరము.) నమత్=నమ్రములగు, గాత్రుల=దేహములు గలవారగు, దంతివక్త్రుల=గజముఖులయొక్క, శతంబు=నూఱు, (నూఱ్వురుగజముఖు లనుట.), వినీతి=వినయముచేత, భజింపన్=సేవించుచుండఁగా, ఒప్పు=మెఱయుచున్న, తత్=అప్రసిద్ధుఁడగు, సూత్రవతీశున్ = సూత్రవతీదేవినాథుఁడగువిష్వక్సేనుని, (విష్వక్సేనుండు గజముఖశతముచేఁ బరివేష్టింపఁబడుటకుఁ బ్రమాణము. 'యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతం, విఘ్నన్నిఘ్నంతి సతతం విష్వక్సేనం తమాశ్రయే' అని గలదు) వందనముతోఁ గని=నమఃపూర్వకముగాఁ గాంచి, ఆతఁడు = ఆవిష్వక్సేనుఁడు, భక్తిసేయఁగన్=కొలువఁగా.

తే. అవిదితపురందరాయుధం ౹ బై సకనక
  శిఖరియునుబోలె నెఱకల౹జిగులు దెస౹
  నింగి నీరెండఁ గాయ వేదాంగు వినత
  సుతుని నతిఁ గాంచి మగుడఁ బ్రణతిఁ ముఃగాంచి. 97

టీ. అవిదిత = ఎఱుఁగఁబడని, పురందరాయుధంబైన = వజ్రివజ్రముగలయట్టి, కనకశిఖరియునుబోలెన్ = మేరుపర్వతమువలెనే, (ఇంద్రునిచేత ఱెక్కలు వ్రక్కలింపఁ బడని బంగరుకొండవలె నున్నాఁ డనుట.) ఎఱకల=పక్షములయొక్క, జిగులు = కాంతులు, దెసలన్=దిశలయందును, నింగిన్=ఆకాశమందును, ఈరెండగాయన్ = చల్లని యెండ గాయుచుండఁగాఁ (కాంతు లాతపమువలె నుండె ననుట.) వేదాంగున్=ఛందోమయుండైన, ('కాంతస్తే పురుషోత్తమః ఫణిపతిశ్శయ్యాసనం వాహనం వేదాత్మా విహగేశ్వరో యవనికా మాయా జగన్మోహినీ' అని ప్రమాణము.) వినతసుతుని=వైనతేయుండగు గరుత్మంతుని, నతిన్=నమస్కారముచేత, కాంచి=చూచి, మగుడన్=మరల, తల్+నతి యున్ = ఆవైనతేయుని నమస్కారమును, కాంచి = పొంది. ఉత్ప్రేక్ష.

వ. అతనిచే విజ్ఞాపనంబు చేయించి యనుమతిం గాంచి చతుర్భుజులు
జలధరశ్యాములు శతపత్త్రలోచనులు చపలాపిశంగవసనులు వన
మాలికాబద్ధబాహుమధ్యులు నైన మధుమథన ప్రతిబింబంబులుం
బోని పారిపార్శ్వకులఁ బరాంకుశ ప్రభృతిముక్తుల సేవించుచుఁ దద
భినందితులై చని మహావకాశంబును మణిమయస్తంభ సంభృతంబును
శాతకుంభకుంభశోభితశేఖరంబును నై చిత్రనేత్రవితాన లంబమాన
నానాప్రసూనదామముక్తాగుళుచ్ఛచ్ఛచామరంబును నుద్వేల
కాలాగరుధూపధూపితంబు నగు మహావిమానమధ్య విధుకాంతవితర్ది
కాతలంబునఁ జరణముఖతత్ప్రతీకాధిష్ఠిత ధర్మాదిసూరి పరిషదాత్మ
కంబును దేజోమయంబును నగు విపులవిమలపీఠంబునఁ బరిమళాలోల
రోలంబజాలం బగు నంబురుహంబు జాంబూనదత్విడుత్తమర్ణవిస్తీర్ణ
కర్ణికోపరివీథి నూథస్యపాథోనిధానంబునకుఁ బ్రథమహేతుభూతం
బగు భూతతన్మాత్రయుంబోలెఁ బారద స్ఫటిక పటీరపాండురుచి
పుండరీకంబుల పసకు పసనుసక లెసకొల్పు మిసిమి గల భోగిభోగ
భాగంబునకుం బరభాగంబు మిగులఁ దదాత్మకంబ యగు నుపబర్హం
బున మహార్హకేయూరమణి కర్బురం బగు కూర్పరం బూని మననపర
మునిమనోరాగరస మార్జనంజేసి మిగుల నరుణిమ వహించెనో యనఁ
జాలు కెంగేలు కపోలంబునం గదియం ద్రిదశతరు కుసుమ కంచు
కిత కంచుకికంచుకాత్మకం బగు దుకూల నిచోళంబున నొత్తిగిలి
యున్నవానిం, గరిం గఱకఱిం బెట్టి బిట్టు తనచేతి చక్రంబునం

దేగిన నక్రంబు పూజ్యం బగు సాయుజ్యంబు నొందెనో యన
నుపరి పరిదృశ్యమాన గండస్థలస్థ మణిమకరకుండల ప్రతిబింబరుచి
డంబరంబునం బరగు సౌందర్య మకరంద నిష్యంది యగు ముఖార
విందంబున నందం బగువాని, నిర్నిమిషదృష్టి నెట్టుకొని చూచుతఱి
నీలావదాతయు తెప్ప వట్టు తఱి బిట్టదుర్కొను కలధౌత గౌర
గౌర మహామహాగపూరంబున మునింగి దుర్నిరీక్ష్యయు నగు నిజ
రుచిరమూర్తివలనఁ దనదు సాకార నిరాకారతలు వారికిఁ జూపు
రూపున దీపించువాని:, గళత్రంబు లగు శ్యామాచ్ఛాయలచేతఁ
బ్రేముడిం బొదువంబడిన యట్లు కప్పులుఁ దొంగలులు నగు పక్ష్మకాలి
కల నొప్పు సోమ సూర్యాత్మకంబు లగు వెడంద నిడువాలు కొట్టుసెరల
కన్నులం గెందమ్మితేఁకుల వెదచల్లువాని, మంకెనవిరిబింకంబు నింకించు
నధరశోణిమనెపంబున వెలుంగు ముఖజనితవాయుతాశనుతోఁ దత్సఖుం
డగు గంధవహుం గూర్ప నిక్క నన నొక్కింత నిక్కి చొక్కంపుఁ
బొటములఁ జూపట్టి తిలకుసుమ విలస నాపహాసి యగు నాస భాస
మానుం డగువాని, నుదరజాత శ్వేదధామతామరసంబుఁ గనుంగొని
మహదాశ్రయంబు గనిన పూర్ణిమాశశాంకుం డనుశంక నాతనికి నాకు
వైరంబు మాన్పు మని తత్సహోదరి గావున రత్నకాంచనంబులు
లంచంబులుగా నివేదించి యనుగులొత్తు నిందిరకు వరముం బడియున్న
రాహువనం గేయూర కటక మణి ముద్రికాంకితం బగు దీర్ఘబాహా
పరిఘంబు కటితటోత్సంగంబున మెఱయువాని, నురస్స్థలన్యస్త నిస్తు
లాస్తోకకౌస్తుభ గభస్తి మండలంబున నిండోలగం బుండు పుండరీక
నికేతన తనుచ్ఛాయ యన నచ్ఛాచ్ఛంబగు శ్రీవత్సంబున లోచనోత్స
వంబుఁ గావించువాని, విజితమృగనాభినాభి సౌరభ్యంబునకు నెగయు
నుత్తుంగ భృంగమాలిక యన మెఱయు నసితపేశలతులసీపలాశ
దామంబున నభిరామ కోమలాలంకృతి యగువానిఁ, గపట కరటి
విరోధి యై యసుర యుసుఱుం గొని మగుడ మనుజాంగంబు నంగీక
రించునెడఁ దలంపం బడమి నట్లన యుండె నన బడుగు బడుగగు
నడుముపస: గను నొడిక మగువాని, ఘన జఘన చర మేతర ధరాధరా
ధిత్యకాతలంబునం గాంచన కాంచికామణిమకుట గగనమణి కాయు

నీరెండమెండనం బరఁగు మెఱుంగు పీతాంబరంబునం బొదువంబడి దానిసన్నఁదనంబునఁ దనున్నఁదనంబు వెలుపలం దోఁపఁ గనక పుష్యరాగంపుఁ దెరవాఱు వైదూర్యమణిస్తంభయుగంబునుంబోలెఁ గించిదామీలితనీలిమం బగు నూరుయుగళంబువానిఁ ద్రైవిక్రమం బగు విగ్రహంబుతో నాగ్రహంబున మీఁదికిం జాఁచుతఱిఁ జంక్రమణ రయంబునం దగిలివచ్చిన మణిమయ స్వర్భువనజాంబూనదప్రాకారవలయం బనం దీండ్రించు నుద్దండ గండపెండెరంబునం బొడము నఖండ ప్రభామండలంబునం బరిహిండితంబు లై మఱ్ఱిపండుల వడువుగల మడమలబెడంగుపడి భావినిజకమఠావతార సూచకంబులుంబోలెఁ గొదమతామేళ్ల మేళ్లనగు మీఁగాళ్లతోఁ గోకనద మృదూదరంబు లమర మెఱుఁగుఁ జుక్కల జిగి మొక్కపఱుచు నఖ చక్రవాళ చంద్రికల భక్తజన మనస్తమోవిదళనంబుఁ గావించుచు, హలకులిశ కలశ కమల మకరాంకుశాంకితంబులై లక్ష్మీకుచకుంకుమాంకలన నరుణారుణంబు లగు చరణంబులం దాపత్రయాపహరణంబు సేయువాని, నారాయణుం బురాణపురుషుఁ బురుషోత్తముఁ బ్రణతార్తిహరు వాసుదేవు హృషీకేశు నీశనుతు విభీషణ వరదు ననంగజనకు రంగరమణుం గాంచి సహాసమాగత భాగవత పరిషత్సమేతంబుగాఁ దానుం దనుజాతయుం బ్రమద భయ భక్తిరస మగ్నులై జయజయశబ్దంబులతో సర్వాంగాలింగిత క్షోణీతలంబులగు నమస్కారంబులు గావించి నిలిచి నిటలతటఘటితాంజలి యై యిట్లని నుతియించె. 98

టీ. అతనిచేఁ = ఆవైనతేయునిచేత, విజ్ఞాపనంబు సేయించి = శ్రీరంగనాయకునకుఁ దన రాక విన్నపంబు సేయించి, అనుమతిం గాంచి = సెలవును బొంది, చతుర్భుజులు = నాలుగు భుజములుగలవారును, జలధర = మేఘమువలెనే, శ్యాములు = నీలచ్ఛాయగలవారును, శతపత్త్ర = తామరలవంటి, లోచనులు = కన్నులుగలవారును, చపలా = మెఱుపులవలెనే, పిశంగ = పచ్చనైన, వసనులు = వస్త్రములు గలవారును, (పీతాంబరు లనుట), వనమాలికా = తులసీవనమాలికలతోడ, బద్ధ = కూర్పఁబడిన, బాహుమధ్యులును = వక్షస్స్థలములు గలవారును, ఐన = అయినట్టి, మధుమథన = మధుసూదనుఁడైన శ్రీహరియొక్క, ప్రతిబింబంబులుంబోని = ప్రతిబింబములవంటి, పారిపార్శ్వకుల = పార్శ్వవర్తులగునట్టి, పరాంకుశ = నమ్మాళ్వారులు, ప్రభృతి = మొదలగు, ముక్తులన్ = ముక్తాత్ములను,

సేవించుచుఁ = భజించుచును, తదభినందితులై = వారిచేత నాదరింపఁబడినవారై, చని = ఆవలనరిగి, మహావకాశంబును = మహావిశాలమైనదియును, మణిమయ = రత్నవికారములైన, స్తంభ = స్తంభములచేత, సంభృతంబును = భరింపఁబడినదియును, శాతకుంభకుంభ = బంగరు కలశములచేత, శోభిత = అలంకృతములైన, శిఖరంబును = శిఖరములు గలదియును, ఐ = అయినదై, చిత్ర = వింతవన్నెలుగల, నేత్ర = వస్త్రములచేత నైన, ('స్యాజ్జటాంశుకయోర్నేత్రమ్' అని యమరము) వితాన = మేలుకట్లయందు, ('అస్త్రీవితానముల్లోచః' అని నిఘంటువు.) లంబమాన = వ్రేలుచున్న, నానా = అనేకవిధములగు, ప్రసూనదామ = విరిసరులును, ముక్తాగుళుచ్ఛ = ముత్తెముల గుత్తులును, అచ్ఛచామరంబును = తెల్లని జల్లులుగలదియును, ఉద్వేల = మేరమీఱిన, కాలాగరు = కృష్ణాగరువుయొక్క, ధూప = ధూపముచేత, ధూపితంబును = ధూపింపఁబడినదియును, అగు = అవునట్టి, మహావిమానమధ్య = మహా గర్భగృహమధ్యమందలి, విధుకాంత = చంద్రకాంతశిలలచేఁ జేయఁబడిన, వితర్దికాతలంబునఁ = వేదికాస్థలమందు, చరణముఖ = పాదములు మొదలగు, తత్తత్ప్రతీక = ఆయాయవయవములయందు, అధిష్ఠిత = ఉంపఁబడిన, ధర్మాది = ధర్మవర్మప్రముఖులగు, సూరి = నిత్యసూరులయొక్క, పరిషదాత్మకంబును = సమాజస్వరూపమైనట్టిదియు, తేజోమయంబును = ప్రకాశస్వరూపమైనట్టిదియును, అగు = అవునట్టి, విపుల = పఱపైనట్టియు, విమల = నిర్మలమగునట్టి, పీఠంబునఁ = సింహాసనమందు, పరిమళ = క్రొత్తావులకొఱకు, ఆలోల = సంచరించుచున్న, రోలంబ = తుమ్మెదలయొక్క, ('ఇందిందిరశ్చంచరీకో రోలంబో బంభరోఽపి చ' అని యమరము.) జాలంబగు = సమూహముగల, అంబురుహంబు = కమలముయొక్క, జాంబూనదత్విట్ = బంగరురంగునకు, ఉత్తమర్ణ = అప్పుసంగాదునట్టియు, విస్తీర్ణ = వెడలుపైన, కర్ణికోపరివీథిఁ = మిద్దియపైదెసయందు, ఊధస్యపాథోనిధానంబునఁ = క్షీరవారిరాశి, (ఊధస్య మనఁగాఁ బొదుఁగువలనఁ బుట్టినది గావున క్షీర మనుట, ఈశబ్దము మానవజాతియందు స్తన్యమువలె నుండును.) ప్రథమహేతుభూతంబగు = ఆదికారణమైన, భూతతన్మాత్రయంబో లేక = ఆదిభూతమువలెనే, (సూక్ష్మావస్థ గల క్షీరమువలె ననుట), పారద = పాదరసముయొక్కయు, ('రసస్సూతశ్చ పారదే' అని యమరము.) స్ఫటిక = మణులయొక్కయు, పటీర = శ్రీగంధముయొక్కయు, పాండురుచి = చలివెలుంగుయొక్కయు, (చంద్రుఁ డనుట), పుండరీకంబుల = తెలివిరిదమ్ములయొక్క, పసఁ = మేలిమికి, (ధావళ్యమున కనుట.) మసమసకలు = మాలిన్యమును, ఎసకొల్పు = ఆపాదించుచున్న, మిసిమి గల = కాంతిగలయట్టి, భోగిభోగ - భోగి = శేషుని యొక్క, భోగ = శరీరముయొక్క, ('భోగస్సుఖే ధనే చాహిశరీరఫణయోర్మతః' అని

నిఘంటువు.) భాగంబునకున్ = ప్రదేశమునకు, పరభాగంబు = గుణోత్కర్షము, ('పరభాగో గుణోత్కర్షః' అని నిఘంటువు.) మిగులన్=అతిశయించునట్లు, తదాత్మకంబయగు=ఆశేషశరీరమయమగు, ఉపబర్హంబునన్ = తలగడయందు, ('ఉపధానంతూపబర్హః' అని నిఘంటువు.) (మఱియు శేషుఁడే యుపధాన మగుటకు, శ్లో. 'నివాసశయ్యాసనపాదుకాంశుకోపధాన వర్షాతపవారణాదిభిః, శరీరభేదైస్తవ శేషతాంగతో యథోచితం శేష ఇతీర్యతేజనైః' అనియాళవందారుశ్రీసూక్తిప్రమాణము.) మహార్హ=మిక్కిలియుచిత మగు, కేయూర=బాహుపురియందలి, మణి=రత్నములచేత, కర్బురంబగు=చిత్రవర్ణమైన, కూర్పరంబు=మోచేతిని, ('స్యాత్కఫోణిస్తుకూర్పరః' అని నిఘంటువు.) ఊని=ఊఁదుకొని. మననపర=ధ్యానపరులైన, ముని = మునులయొక్క, మనః=మనస్సులయందలి, రాగరస = అనురాగరసముయొక్క, మార్జనంజేసి=తుడుచుటచేత, (మునిమానసములకు విరక్తి గలుగఁజేసె ననుట.) మిగులన్=అధికమగునట్లు, అరుణిమ=ఎఱ్ఱఁదనమును, వహించెనో యనన్ = తాల్చెనో యనుటకు, చాలు=తగిన, కెంగేలు=ఎఱ్ఱని హస్తము, కపోలంబునన్=చెక్కుటియందు. కదియన్=సమీపింపఁగా, (దింప క్రింద శ్రీహస్తముఁ బెట్టుకొన్నా రనుట.) త్రిదశతరు = కల్పవృక్షములయొక్క, కుసుమ = పువ్వులచేత, కంచుకిత=కప్పఁబడిన, కంచుకి=శేషునియొక్క, కంచుకాత్మకంబగు=కుబుసమేయైనట్టి, దుకూలనిచోళంబునన్-దుకూల=వలిపెమైన, నిచోళంబునన్=పలువయందు, (పడకదుప్పటి యనుట.) ఒత్తిగిలియున్నవానిన్=ఒంటిప్రక్కను బవ్వళించియున్నట్టియు, కరిన్=గజేంద్రుని, కటకటం బెట్టి=బాధపెట్టి, బిట్టు=కఠినముగాను, తనచేతిచక్రంబునన్=సుదర్శనముచేత, తెగిన = ఖండితంబైన, నక్రంబు = మకరము, పూజ్యంబగు=పూజింపఁదగిన, సాయుజ్యంబున్ = భగవద్దివ్యమంగళవిగ్రహ సాంగత్యమును, పిందెనో యనన్=పొందెనోయనునట్లు, ఉపరి = మీఁదిభాగమందు, పరిదృశ్యమాన = లెస్సగా కానవచ్చుచున్న, గండస్థల=చెక్కుటియందు, స్థ=ఉన్నట్టి, మణి = రత్నఖచితమైన, మకరకుండల=మకరాకారమగుకర్ణభూషణముయొక్క, ప్రతిబింబరుచి=ప్రతిఫలనకాంతులయొక్క, డంబరంబునన్ = ఆధిక్యముచేత, పరమసౌందర్య = మిన్నయగుచెన్నెదు, మకరంద=పూఁదేనియను, నిష్యంది యగు = కురియుచున్న, ముఖారవిందంబునన్=మోముఁదామరచేతను. అందంబగువానిన్=సుందరుఁడగునట్టియు, నిర్నిమిషదృష్టి = ఱెప్పవాల్పనిచూడ్కిచేతను, నెట్టుకొని = ప్రయాసపడి, (కథంచనార్థకము.) చూచుతఱిన్=సేవించునప్పుడు, నీలావదాతయున్ = నల్లనితెల్లని వర్ణము గలిగినదియును, ఱెప్పవట్టుతఱిన్ = ఱెప్పవాల్పుగలిగి చూచునప్పుడు, బిట్టు = అధికముగాను, ఎదుర్కొను=నేత్రములకెదురయ్యెడు, కలధౌత=రజతమువలె, గౌరగౌర =

మిక్కిలి తెల్లనైన, మహత్=అధికమైన, మహః=తేజముయొక్క, ('తేజోధామమహో విభా' అని నిఘంటువు.) పూరంబునన్=ప్రవాహమందు, మునింగి = ఆచ్ఛాదింపఁబడి, దుర్నిరీక్ష్యయయ్యున్=చూడ శక్యము గానిదియు, అగు = అవునట్టి, నిజ=స్వకీయమగు, రుచిర = మనోహరమైన, మూర్తివలనన్=దివ్యమంగళవిగ్రహమువలన, తనదు = తన, సాకార నిరాకారతలు = ఆకారములోఁ గూడియుండుటయును నాకారము లేకుండుట యును, వారికిన్ = సేవించువారికి, చూపురూపునన్=కనఁబడిచెదురీతిచేతను, దీపించు వానిన్=వెలుంగుచున్నట్టియు, కళత్రంబులగు=చంద్రసూర్యులభార్యలయిన, శ్యామా=రాత్రిచేత, ఛాయచేత=ఛాయాదేవిచేత, (రాత్రియు నలుపు, చాయ గావున నా యమయు నలు పనుట.) ప్రేముడిన్=ప్రేమముచేత, పొదువంబడినయట్లు=ఆలింగనము చేయఁబడినట్లు, కప్పులు=నల్లనివియు, తొంగలులున్ = దీర్ఘములయినవియు, అగు = అవునట్టి, పక్ష్మ=ఱెప్పలయొక్క, కాలికలన్ = నైల్యములచేత, ఒప్పు = సుందరమగు చున్న, సోమసూర్యాత్మకంబు లగు=చంద్రసూర్యమయములగు, వెడంద=విశాలములును, నిడువాలు = దీర్ఘములైన, ఎఱ్ఱసిరల=రక్తరేఖలుగల, కన్నులన్ = నేత్రములచేత, కెందమ్మిఱేకులన్ = ఎఱ్ఱదామరపూఱేకులను, వెదచల్లువానిన్ = వ్యాపింపఁజేయుచున్న వాని, (స్వామికిఁ జంద్రుఁ డొక్కనయనంబును సూర్యుఁ డొక్కనయనంబు నగుటచేత వారివుర భార్యలయిన రాత్రియును ఛాయాదేవియును వచ్చి తమ నల్లనికాంతులు గానవచ్చునట్లు వారి నాలింగనముఁ జేసికొని విడువకయుండినట్లు నల్లని తొంగలి ఱెప్ప లొప్పె ననుట), మంకెనవిరి=బంధూకపుష్పముయొక్క, బింకంబున్=గర్వమును, ఇంకించు=ఇవురఁజేసెడు, అధర = వాతెఱయొక్క, శోణిమ=అరుణకాంతి యనెడు, నెపంబునన్ = వ్యాజముచేత, వెలుంగు=తేజరిల్లుచున్న, ము...లోన్-ముఖ=నెమ్మోము వలన, జనిత = ఉత్పన్నుఁడగు, హుతాశనులోన్=అగ్నిహోత్రములో (ముఖమువలన నింద్రుండు నగ్నియుఁ బుట్టుట శ్రుతిప్రసిద్ధము), తత్సఖుండగు=అయ్యగ్గిచెలియైన, గంధవహున్ గూర్పన్=వాయువునుగలుపుటకై, నిక్కె నవన్ = నిక్కెనదో యనునట్లు, ఒక్కింత=ఇంచుకంత, నిక్కు, చొక్కంపు=సుందరములైన, పొటమలన్=పుటములచేత, చూపట్టి = దర్శనీయమై, తిలకుసుమవిలసనాపహాసి యగు=నువ్వుబువ్వునవ్వును నవ్వునట్టి, నాసన్ = ముక్కుచేత, భాసమానుం డగువానిన్ = ప్రకాశించుచున్నట్టియు, (కొంచెము నిక్కిన ముక్కుపుటములలోనుండి నిట్టూర్పులు వెడలు ననుట.) ఉదరజాత=నాభియందుఁ బుట్టిన, శ్వేత = తెల్లనగు, ధామ=కాంతి గల, తామరసంబున్ = కమలమును, కనుంగొని = చూచి, మహదాశ్రయంబు గనిన = మహదాశ్రయమునుబొందిన, ('నీచాశ్రయోనకర్తవ్యః కర్తవ్యోమహదాశ్రయః' అన్న ట్లనుట.) పూర్ణిమాశశాంకుం

దనుశంకన్ = పున్నమనాఁటిచందురుం దనుసందియంబున, (తెల్లని నాభీకమలము చంద్రునివలె నుండె ననుట), అతనికిన్ = ఆచంద్రునికి, నాతన్=రాహువున కనుట. వైరంబుమాన్పు మని=పగలేకుండఁజేయుమని, తత్సహోదరిగావునన్=ఆచంద్రునికిఁ దోఁబుట్టువగుటంజేసి, రత్నకాంచనంబులు = మణికనకములు, లంచంబులుగా నివేదించి = ఉపాయనములుగా సమర్పించి, అడుగులొత్తు = స్వామిపాదము లొత్తుచున్న, ఇందిరకున్ = శ్రీదేవికి (దీనికిఁ దత్సహోదరి యనునది విశేషణము), వరమఁబడియున్న = ప్రాణాచారముపడియున్న, రాహు వనన్ = రాహుగ్రహ మనునట్లు (చంద్రుఁడు తొల్లిదుర్బలుఁడై యుండి మహదాశ్రయముఁ జేసికపిదపఁ దనకుఁ జేటు గలుగు నని యులికి రాహుగ్రహ మిట్లు చేసిన ట్లుండె ననుట). కేయూర = భుజకీర్తులచేతను, కటక=కడియములచేతను, మణిముద్రికా = రతనంపుముద్దుటుంగరములచేతను, అంకితంబగు=చిహ్నితమైన, దీర్ఘబాహుపరిఘంబు=పరిఘాయుధమువంటి దీర్ఘభుజము, కటితటోత్సంగంబునన్=పిఱుంద ప్రక్కమీఁదను, మెఱయువానిన్=ప్రకాశించుచున్నట్టియు, ఉరస్స్థల=వక్షస్స్థలమందు, న్యస్త=ఉనుపఁబడిన, నిస్తుల=సరిలేని, అస్తోక = స్థూలమగు, కౌస్తుభ = కౌస్తుభమణియొక్క, గభస్తి=కాంతులయొక్క, మండలంబునన్=సమూహమందు, ('మండలంచక్రవాళకమ్' అని యమరము.) నిండోలగం బుందు = నిండుసభ దీఱిన, పుండరీకనికేతన = కమలనివాసి యగులక్ష్మీదేవియొక్క, తనుచ్ఛాయ యనన్= దేహకాంతియో యనునట్లు, అచ్ఛాచ్ఛంబగు=మిక్కిలిస్వచ్ఛమగు, శ్రీవత్సంబునన్ = శ్రీవత్స మనుమచ్చచేత, లోచనోత్సవంబుఁ గావించువానిన్ = కన్నులపండువుచేయునట్టియు, విజిత=గెలువఁబడిన, మృగనాభి=కస్తూరిగల, నాభి=బొడ్డుయొక్క, సౌరభ్యంబునకున్=నెత్తావికి, నెగయుఁ=వచ్చుచున్న, (ఎఱఁగు నని పాఠాంతర మట్లేని వాలుచున్న),ఉత్తుంగ=తఱచైన, భృంగమాలిక యనన్=తుమ్మెదలవరుస యనఁగా, మెఱయు= తనరుచున్న, అసిత=నల్లనైన, పేశల = లేఁత యగు, తులసీపలాశ = తిరుతుళాయిదళములయొక్క, దామంబునన్=వనమాలికచేత, అభిరామ=సుందర మగు, కోమల=మృదువైన, అలంకృతియగువానిన్=అలంకారముగలయట్టియు (ఆకృతియగువాని నని కొందఱందురు.), కపటకరటివిరోధియై = మాయాసింహమై, అసుర=హిరణ్యకశిపునియొక్క, ఉసుఱుకొని=ప్రాణాపహారముఁజేసి. మగుడన్ = మరల, మనుజాంగంబున్=మానవాకారమును, అంగీకరించునెడన్=గ్రహియించునప్పుడు, తలంపంబడమిన్=జ్ఞప్తిరాకుండుటచేత, అట్లన యుండె ననన్=ఆప్రకారమే యుండె ననునట్లు, బడుగుబడుగగు = మిక్కిలిసూక్ష్మమగు, నడుముపసన్-నడుము=మధ్యముయొక్క, పసన్=మేలిమిచేత, కడున్=మిక్కిలి, ఒడికమగువానిన్=శృంగారమైనట్టివానిని, ఘన=గొప్పైన, జఘన =

పిలుఁదనియెడు, చరమేతరధరాధర=ఉదయపర్వతముయొక్క, అధిత్యకాతలంబునన్ = ఊర్ధ్వప్రదేశమందు, ('పతత్యకాద్రేరాసన్నా భూమిరూర్ధ్వమధిత్యకా' అని యమరము.) కాంచనకాంచికా=బంగారు మొలనూలియందలి, మణిమకుట=మణిశ్రేష్ఠ మనియెడు, గగనమణి=సూర్యుఁడు, కాయు = వ్యాపింపఁజేయు ఈరెండమెండు అనన్ = బాలాతపాతిశయ మనునట్లు, పరఁగు=ఒప్పుచున్న, మెఱుంగు=కాంతివిశిష్టమైన, పీతాంబరంబునన్=కట్టుబంగరుపుట్టముచేత, పొదువంబడి=ఆచ్ఛాదింపంబడి, దాని=ఆవస్త్రముయొక్క, సన్నఁదనంబునన్=వలిపెదనముచేత, తనునున్నఁదనంబు = తొడదోయినునుపు, ('పరుషాసరళేచైవ సమానేనుముతోభవేత్, అద్రుత్సారసావందు పట్టికూర్చి విభక్తిషు, తనేచకుత్రచిదతోవికారాచ్ఛాపికేచన' అనునథర్వణోక్తిచేత నుమాగమము.) వెలుపలం దోఁపన్ = బయటఁగానరాఁగా, కనకపుష్యరాగంపు - (=కనకపుష్యరాగము లనుమణులయొక్క; లేక, కనక = బంగారుయొక్కయు, పుష్యరాగము లనుమణులయొక్కయు,) కనక = బంగారుయొక్కయు, పుష్యరాగంపు = పుష్యరాగములయొక్కయు సంబంధముగల, తెరవాఱు = తెరలుగలిగిన; లేక తెరవాఱు = నూలిపోఁగులు పైఁడిరిగినట్లుండు, వైదూర్యమణి=వైదూర్యరత్నవికారములగు, స్తంభ=స్తంభములయొక్క, యుగంబునుంబోలె=జతవలెనే,

ఆ. 'పగలు గొందిఁ గానఁబడెను బిడాలంబు, కన్నువోలె వెలుఁగు గల్గి నూలు,
తిరుగునట్లు సూఁదఁ దెరవాఱు వైదూర్య,రత్నమున కిది ప్రయత్న మమరు.'

అని వైదూర్యలక్షణము. కించిదామీలిత = కొంచెము గప్పఁబడిన, నీలిమంబగు = నైల్యముగల, ఊరుయుగళంబువానిన్ = తొడదోయిగలయట్టియు, త్రైవిక్రమంబగు= త్రివిక్రమావతారసంబంధియగు, విగ్రహంబులోన్ = నెమ్మేనితోడ, ఆగ్రహంబునన్ = కోపముచేత, మీఁదికిన్ చాఁచుతఱిన్ = గగనంబునకుఁ బ్రసరింపఁ జేయునప్పుడు, చంక్రమణరయంబునన్ = ప్రసరణవేగముచేత, తగిలి వచ్చిన = చుట్టివచ్చిన, మణిమయ=రత్నవికారమైన, స్వర్భువన=స్వర్గలోకమందలి, జాంబూనద ప్రాకారవలయంబనన్=వలయమువంటి బంగారుకోట యనునట్లు, తీండ్రించు = మెఱయుచున్న, ఉద్దండ = అధికమైన, గండపెండెరంబునన్ = పాదకటకమందు, పొడము=పుట్టునట్టి, అఖండ=ఎడతెగని, ప్రభా = కాంతులయొక్క, మండలంబున్ = సమూహముచేత, పరిపిండితంబులై = కూర్పఁబడినవై, మఱ్ఱిపండువన్నువుగల=వటఫలసౌందర్యము గలిగినట్టి, మడమలన్=పార్ష్ణిభాగములచేత, బెడంగువడి=ప్రకాశించి, భావి=కాఁగల, నిజ = స్వకీయమైన, కమఠావతార = కూర్మావతారమునకు, సూచకంబులుఁబోలె=సూచకములవలెనే, కొదమతామేళ్ళ=లేఁతతాఁబేళ్ళయొక్క (తాఁబేలు తామేలనియును గలదు), మేళ్ళన్ = మేలులను, నగు = హసించెడు, మీఁగాళ్ళలోన్ = ప్రపదంబులతోడ,

కోకనద=ఎఱ్ఱగలువలవలెనే, ('రక్తోత్పలం కోకనదనమ్' అని యమరము.) మృదు=కోమలములైన, ఉదరంబులు=గర్భములు (అఱకాళ్లనుట.), అమరన్=ఒప్పఁగా, మెఱుఁగుఁ జుక్కల = ప్రకాశముగల నక్షత్రములయొక్క, జిగి = కాంతిని, మొక్కపఱుచు = భంగపఱుచునట్టి, నఖ=గోళ్లయొక్క, చక్రవాళ=మండలములయొక్క, చంద్రికలన్= వెన్నెలలచేత, భక్తజనమనః = భక్తులమనస్సులయందలి, తమః = శోక మను చీఁకటి యొక్క, ('రాహుధ్వాంతే గుణేశోకే తమశ్శబ్దాఽభిధీయతే, అని నిఘంటువు.) విదళనంబున్=ఛేదనమును, కావించుచున్=చేయుచును, హలకులిశకలశకమలమకరాంకుశ = హలకులిశాదిరత్నరేఖలచేత, అంకితంబులై=చిహ్నితములై, లక్ష్మీకుచకుంకుమాకలనన్= కలుములజవరాలి పాలిండ్ల చెందిరంపుఁబూఁతచేత, అరుణారుణంబు లగు = తఱుచు కెంజాయ గల, చరణంబులన్ = శ్రీపాదములచేత, (శ్రీదేవి స్వామిపాదములను దన యక్కునఁ జేర్చుకొనిన నవి మిగులఁ గెంపెక్కె ననుట.), తాపత్రయాపహరణంబు సేయువారిన్ = ఆధ్యాత్మికాధిదైవికాధిభౌతికములను తాపత్రయమును రూపుమాపునట్టి, నారాయణున్, పురాణపురుషున్, పురుషోత్తమున్, ప్రణతార్తిహరున్, వాసుదేవున్, హృషీకేశున్, ఈశనుతున్, విభీషణవరదున్, అనంగజనకున్, రంగరమణున్= ఏవంవిధ నామధేయములు గల శ్రీరంగనాయకస్వామిని, కాంచి=దర్శనముచేసి, సహసమాగత=తనతోడవచ్చిన, భాగవత = భగవద్భక్తులయొక్క, పరిషత్సమేతంబుగాన్= సమాజముతోఁగూడ, తానున్ = ఆ విష్ణుచిత్తుండును, తనుజాతయున్ = కొమార్తె యగు చూడికుడుత్తనాంచారును, ప్రమదభయభక్తిరసమగ్నులై, జయజయశబ్దంబులతోన్ = జయజయమనువాక్కులతో, సర్వాంగ ఆలింగిత = సర్వావయవములచేత స్పృశింపఁబడ్డ, క్షోణితలంబులగు=భూతలములుగల, నమస్కారంబులు, కావించి నిలిచి నిటలతట=లలాటప్రదేశమందు, ఘటిత=కూర్పఁబడిన, అంజలియై = దోసిలిగలవాఁడై, ఇట్లని=ఈవక్ష్యమాణక్రమముగా, స్తుతియించెన్=వినుతించెను. (ఆ విష్ణుచిత్తుఁ డనుట.)

తే. విధిగృహాక్షయవిత్త సేవధికి శరణు
చిరకృతేక్ష్వాకుపుణ్యరాశికిని బ్రణతి
ధనపతి భ్రాతృకుల దేవతకు జోహారు
నతమృడాదిక సుమనస్సునకు నమస్సు. 99

టీ. విధి = చతుర్ముఖునియొక్క, గృహ=ఇంటియందు, అక్షయ=నాశములేని, విత్త=ధనమునకు, సేవధికిన్=నిక్షేపమయిననీకు, శరణు=నమస్కారము, (శ్రీరంగనాయకులు బ్రహ్మగృహమందలి తిరువారాధన యని ప్రసిద్ధము.) చిర=తడవుగాను, కృత= చేయఁబడిన, ఇక్ష్వాకు = ఇక్ష్వాకుమహారాజుయొక్క, పుణ్య = సుకృతములయొక్క,

రాశికిని = ప్రోవైననీకు, ప్రణుతి = వందనము (తరువాత ఇక్ష్వాకుమహారాజునకుఁ దపః ఫలమై తోఁచితి వనుట), ధనపతి=కుబేరునకు, భ్రాతృ=తమ్ముఁడైన విభీషణునకు, కుల దేవతవు=కులదైవమైననీకు, జోహారు=జోహారు (పిమ్మట శ్రీరాములవలన విభీషణు నకు వచ్చితి వనుట) నత = నమ్రులైన, మృడాదిక=శివుఁడు మొదలగు, ('గిరిశో గిరీశో మృడః' అని యమరము.) సుమస్సునకున్ = దేవతలు గలవానికి, ('సుపర్వాణస్సు మనసః' అని యమరము.) నమస్సు = నమస్కారము.

తే. కొలుతు సర్వేశు సర్వాత్మ § కుని ననంతు
నప్రకాశు నభేద్యు § సమస్తలోక
సముదయాధారు నణుసమూ § హములకును న
ణీయు నిన్ను ననాధారు § నిత్యు సత్యు. 100

టీ. సర్వేశున్ = సర్వప్రపంచనాథుఁడైనట్టియు, సర్వాత్మకునిన్=సర్వాంతర్యామి యైనట్టియు, అనంతున్ = అంతరహితుఁ డయినట్టియు, అప్రకాశున్ = చక్షువులు గోచరుఁడయినట్టియు, అభేద్యున్=ఇయత్తా పరిమాణ విశిష్టుఁ డని తెలియ శక్యుఁడుగానియట్టియు, సమస్తలోక = సర్వలోకములయొక్క, సముదయ=వృద్ధికి, ఆధారున్ = మూలాధారమైనట్టియు, అణుసమూహములకును = సూక్ష్మవస్తురాసులకంటె, అణీయున్=పరమాణుస్వరూపుఁడైనట్టియు, నిత్యున్, అనాధారున్, సత్యున్, నిన్నున్, కొలుతున్=సేవింతును. ఇక్కడ చెప్పిన అణీయస్త్వాదులు శ్రుతిప్రసిద్ధములు.

క. నారాయణు భూ ప్రభృతిక
గౌరవవద్వస్తువితతి § కంటె మిగిలి పెం
పారు గరిష్ఠత గల పర
పూరుషు శరణంబువేఁడి § పొగడెద నిన్నున్. 101

టీ. నారాయణున్=(నరసమూహము నారము. దానికి అయన మనియును, అది అయనముగాఁ గలవాఁ డనియును, వ్యుత్పత్తిద్వయము చేయుటచేత) ఆధారత్వాధేయత్వములు గల యట్టివానిని, భూ = భూమి, ప్రభృతిక = మొదలుగాఁగల, గౌరవవత్=గరిమముగల, వస్తువితతికంటెన్=భూతసమూహముకంటెను, మిగిలి=అతిశయించి, పెంపారు = వృద్ధియగుచున్న, గరిష్ఠత గల=అతిగురుత్వము గలిగిన, పరపూరుషున్ = పరమపురుషుఁడ వైన, నిన్నున్, శరణంబు వేఁడి, పొగడెదన్=కొనియాడెదను.

తే. అజశివాదిక మగునీస § మస్తజగము
నెందుఁ బ్రభవించు వర్తించు § డిందునట్టి

మహిమ కిక్కైన నిత్యు సమస్తభూత
మయుఁ బరులకంటెఁ బరు మహామహునిఁ గొలుతు. 102

టీ. అజ = బ్రహ్మయు, శివ = శూలియుఁ, ఆదిక మగు=మొదలుగాఁగల యట్టి, ఈసమస్తజగమున్ = జగమెల్లను, ఎందున్ = ఎచ్చటను, ప్రభవించున్ = పుట్టునో, వర్తించున్ = సంచరించునో, డిందున్ = లీనమగునో, అట్టిమహిమకున్ = ఆమహత్త్వమునకు, ఇక్కైన=స్థానమైనట్టి, నిత్యున్=శాశ్వతుఁ డగువాని (అజశివాదు లశాశ్వతు లనుట), సమస్తభూతమయున్=సర్వభూతాత్మకుఁ డగువానిని, పరులకంటెన్=ప్రకృతిజీవులకంటెను, పరున్ = విలక్షణుఁ డగువానిని, మహామహునిన్=మహాతేజోరూపుఁ డైన నిన్ను, కొలుతున్=సేవింతును.

సీ. పరపురుషునికంటెఁ బరుఁడు నాఁ జనువానిఁ
బరమాత్ము ముక్తికై పరమయోగి
పరిషత్తుచే సదా భావింపఁబడువాని
నెవ్వనియందుఁ బ్రాకృతము లైన
సత్త్వాదిగుణముల సందడి లే దట్టి
విమలుని సర్వభూతములకంటె
నాద్యుఁడు శుద్ధుండు నగువాని విభుఁ గళా
కాష్ఠానిమేషాది కాలసూత్ర
తే. మయిన యెవ్వాని శక్తి యింద్రియవితతికి
గోచరము గాదె నిర్లేపుఁడై చెలఁగుట
నతి విశుద్ధుఁడు దా నయ్యు నౌపచార
వృత్తిఁ బరమేశుఁ డగు నిన్ను విష్ణుఁ దలఁతు. 103

టీ. పరపురుషునికంటెన్ = జీవునికంటెను, పరుఁడు నాన్=అన్యుఁడు, చను వానిన్=చెల్లునట్టివానిని, ('ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః' అను గీతా వాక్యప్రకార మనుట.) పరమాత్మున్, ముక్తికై=మోక్షముకొఱకు, పరమయోగిపరిషత్తు చేన్ = మహాయోగిసమాజముచేత, సదా = ఎల్లప్పుడును, భావింపఁబడువానిన్ = ధ్యానింపఁబడువానిని, ఎవ్వనియందున్=ఏవానియందు, ప్రాకృతములైన=ప్రకృతిసంబంధు లైన, సత్త్వాదిగుణముల=సత్త్వరజస్తమోగుణములయొక్క, సందడి=సంపర్కము, లేదు=లేకుండునో, (సత్త్వాదయో న సంతీశే యత్ర చ ప్రాకృతా గుణాః' యను సంహితా వచనముచొప్పున ననుట) అట్టి, విమలుని=నిర్మలుఁడగువాని, సర్వభూతములకంటెన్=

ఆకాశాదిసకలభూతములకంటె, ఆద్యుఁడు = మొదలివాఁడును, శుద్ధుండునగువానిన్, విభున్ = వ్యాపకుఁడగువానిని, కళాకాష్ఠానిమేషాది = కళలు కాష్ఠలు నిమిషములు మొదలగు, కాల = కాలమునకు, సూత్రమయిన = నడపునదియైనట్టి, ఎవ్వానిశక్తి = ఎవనిసామర్థ్యము, ఇంద్రియవితతికిన్ = ఇంద్రియసమూహమునకు, గోచరముగాదో = కనఁబడదో, నిర్లేపుఁడై = అంటనివాఁడై, వెలుఁగుటన్ = ప్రకాశించుటచేత, తాన్ = తాను, అతివిశుద్ధుఁడైనను, ఔపచారవృత్తిన్ = ఉపచారవ్యాపారముచేత, పరమేశ్వరుఁడగు విష్ణున్, నిన్నున్, తలఁతున్.

వ. అని పరస్వరూప సురసేవ్య భవ్య దివ్యావతారలీలలం బ్రస్తుతించినఁ గౌస్తుభాభరణుండు కరుణాతరంగితంబు లగు నపాంగంబుల నమ్మునిం గనుంగొని కుశలప్రశ్నంబుఁ గావించి కంకణాలంకార క్రేంకారంబు లంకురింపఁ బదపంకజంబులకుఁ గుసుమాంజలులు సమర్పించు సకల సీమంతినీసీమంత ముక్తామణి యగు నాముక్తమాల్యదరూపు నెల ప్రాయంబు సాభిప్రాయంబుగాఁ జూచి తనలోన. 104

టీ. అని = ఈప్రకారము, పరస్వరూప = నిత్యముక్తసేవ్యమైన పరస్వరూపముయొక్కయు, సురసేవ్య = వేల్పులచే భజింపఁదగిన, భవ్య = మంగళకరము లగు, దివ్యావతార = దివ్యావతారములయొక్క, లీలలన్ = విలాసములను, (లేక) ('లీలా విలాస క్రియయోః' అని నిఘంటువు.) ప్రస్తుతించినన్ = నుతింపఁగా, కౌస్తుభాభరణుండు = శ్రీరంగనాయకుఁడు, కరుణాతరంగితంబు లగు = కృపాతరంగయుక్తములగు, అపాంగంబులన్ = క్రీఁగంటిచూపులచేత, అమ్మునిన్ = ఆ పెరియాళ్వారులను, కనుంగొని = కటాక్షించి, కుశలప్రశ్నంబుఁ గావించి = క్షేమమా యని యడిగి, కంకణాలంకార = కంకణభూషణములయొక్క, క్రేంకారంబులు = నాదములు, అంకురింపన్ = మొలతేరఁగా, పదపంకజంబులకున్ = తమ తిరువడిత్తామరలకును, కుసుమాంజలులు = పుష్పాంజలులను, సమర్పించు = సమర్పించుచున్న, సకలసీమంతినీ = సర్వకాంతలయొక్క, సీమంత = పాపటలకు, ముక్తామణి యగు = ముత్తెమైన, ఆముక్తమాల్యద = చూడికుడుత్తనాంచారుయొక్క, రూపున్ = రూపమును, ఎల ప్రాయంబున్ = లేఁతవయస్సును, సాభిప్రాయంబుగాన్ = అభిప్రాయము గలిగినట్లుగాను, చూచి = వీక్షించి, తనలోనన్ = ఆత్మగతంబున.

సీ. దీనిచూపెడు రెక్కఁ దీ గానె కాసిఁపట్టి
కిని బోర బిరుదు టెక్కెంబు గలిగె

దీనికౌ నల్లాడఁ గానెకా గర్వించి
యుర్విఁ జైత్రునకుఁ గాలూఁదఁ గలిగె
దీనిపాలిం డ్లుబ్బఁ గానెకా రతిచేతి
కిన్నెరమ్రోఁతకు వన్నె గలిగె
దీనిమో మొప్పారఁ గానెకా వాణి రా
యంచలేమకుఁ గులాయంబు గలిగె
తే. దీనిపెన్నెఱు లేపారఁ గానెకా ప్ర
పోషితమయూరికి విరాళి పొందు గలిగె
దీనియడుగులు రంజిల్లఁ గానెకా పి
పాసఁ బడుతేఁటులకు మెట్ట పంట గలిగె. 105

టీ. (1) దీని = ఈయాముక్తమాల్యదయొక్క, చూపు = దృష్టి, ఎదురెక్కఁ గానెకా = పైకివ్యాపింపఁగానేకదా, సిరిపట్టికిని = మన్మథునికి, పోరన్ = యుద్ధమునందు, బిరుదుటెక్కెంబు = బిరుదైనధ్వజము, కలిగెను. (ఈకన్యక మీనలోచన యనియును, మన్మథుఁడు మీనకేతనుఁ డనియు ననుట.) (2) దీని = ఈమె, కౌను = నడుము, అల్లాడఁ గానెకా = చలించుచుండగానేకదా, గర్వించి = మదించి, ఉర్విన్ = భూమియందు, చైత్రునకున్ = వసంతమాసమునకు, కాలూఁదఁగలిగెన్ = పాదము నిలుపుకోఁగలిగెను. (మధ్యము లతవలె నుండె ననియును లతాదులవలననే వసంతునికిఁ గీర్తి గలుగు ననుట.) (3) దీని, పాలిండ్లు = చన్నులు, ఉబ్బఁగానెకా = వృద్ధిఁబొందఁగానేకదా, రతిచేతి = రతీదేవిహస్తమున నున్న, కిన్నెరమ్రోఁతకున్ = కిన్నెరనాదమునకు, వన్నె కలిగెన్ = ప్రశస్తిగలిగినది. (పాలిండ్లకుఁ గిన్నెరకాయలకు సామ్యమునకు 'పైపూఁతరుచిగాని ప్రతియె కిన్నెరకాయ, లరిదిమేరువు తలయంపి నిడిన' అని వసుచరిత్రము.) (4) దీని, మోము = ముఖము, ఒప్పారఁగానెకా = ప్రకాశింపఁగానేకదా, వాణి = సరస్వతియొక్క, రాయంచలేమకున్ = రాజహంసికకు (సరస్వతికి హంసిక వాహన మనుట), కులాయంబు గలిగెన్ = నివాస మొదవెను. ('కులాయో నీడమస్త్రియామ్' అని నిఘంటువు.) (హంసకుఁ బద్మము నివాస మనియు నాయమ పద్మముఖి యనియు ననుట.) (5) దీని, పెన్నెఱులు = నిడుగుఱులు, ఏపారఁగానెకా = బలిష్ఠములుకాఁగానేగదా, ప్రపోషితమయూరికిన్ = పెంపుడు నెమిలికి, విరాళిపొందు గలిగెన్ = మోహసంగతి గలిగెను. (వెండ్రుకలు మేఘమువలె నుండె ననియు మేఘమునకు నెమిలి సంతసించు ననుటయు) (6) దీని, అడుగులు = పాదములు, రంజిల్లఁగానెకా = వికసిల్లఁగానేకదా, పిపాసఁబడు=

నీరువట్టుగల, తేఁటులకుఁ = మధుకరములకు, మెట్టపంట గలిగెన్. (పాదములు మెట్ట దామరవలె నుండె ననియు తుమ్మెదల కత్తమ్ములు నెమ్మి యొదవించు ననుటయు.) ఈ పద్యమందు విషయినిగరణాలంకారము.

తే. అనుచు నువ్విళులూరు మురారి తమక
మాఁప లే కాత్మ దివ్యశుద్ధాంతసీమ
కన్నెలఁతఁ దార్చి యొక్కమాయావధూటి
నట్లు కావించి వారున్న దనియ యుండ. 106

టీ. అనుచున్ = ఇట్లు తలంచుచు, ఉవ్విళులూరు = కోరికలుగోరు, మురారి = శ్రీరంగనాయకుఁడు, తమకము = మోహమును, ఆఁపలేక = నిలుపలేక, ఆత్మ = తన యొక్క, దివ్య = శ్రేష్ఠమైన, శుద్ధాంత = అంతఃపురముయొక్క, ('శుద్ధాంతశ్చావరోధశ్చ' అని నిఘంటువు.) సీమకున్ = ప్రదేశమునకు, అన్నెలఁతన్ = ఆచూడికుడుత్తనాంచారును, తార్చి = ప్రవేశపెట్టి, ఒక్కమాయావధూటిన్ = ఒకమాయచెలఁతను, అట్లు = ఆయాముక్తమాల్యదవలెనే, కావించి = చేసి, వారు = ఆవిష్ణుచిత్తుఁడు మొదలగువారు, ఉన్నదనియ = ఆయమ యక్కడనే యున్న దనియే, ఉండన్ = ఉండఁగా.

వ. పూజకులచేఁ బాదతీర్థప్రసాదపరివేష్టనంబు లిప్పించి విడిది కనిపిన
గుడివెడలి శాంబరీతనుసంభవం బాలకిం బెట్టి గృహంబునకుం జని
పంజరంబు సడలించి యచ్చంచలాక్షిం గానక. 107

టీ. పూజకులచేన్ = నంబులచేత, పాదతీర్థప్రసాద = శ్రీపాదతీర్థప్రసాదములును, పరివేష్టనంబులు = పరివట్టములు (ద్వంద్వాంతమందు బహువచనము.), ఇప్పించి = ఒసఁగించి, విడిదికిన్ = బసకు, అనిపినన్ = పంపఁగా, గుడివెడలి = కోవెలనుండి బయలుదేరి, శాంబరీతనుసంభవన్ = మాయాపుత్త్రికను, పాలకిన్ = పల్లకియందు, పెట్టి = ఉనిచికొని, గృహంబునకుం జని = తిరుమాళిగకుఁ బోయి, పంజరంబు సడలించి = పల్లకి గవిసెనఁదీసి, అచ్చంచలాక్షిన్ = ఆ చపలాక్షిని, కానక.

శా. *అబ్రహ్మణ్యము లోన వైచుకొనె నన్యాయంబున న్మత్సుతం
దా బ్రహ్మాదుల మేర నిల్పియుఁ బ్రభుత్వం బూఁదియుం †ద్రోతురే
యీ బ్రక్కం ద్విజుఁ జూడ రయ్య సభవా శ్రీరంగభర్తంచు దుః
ఖాబ్రాశిం బడి‡బాష్పకంఠుఁడు సముద్యద్గోపలాలుండునై. 108

టీ. అబ్రహ్మణ్యము = మొఱ్ఱో, ('అబ్రహ్మణ్యమవధ్యోక్తౌ' అని నిఘంటువు.) (అబ్రహ్మణ్య మను పాఠమున నా రంగనాయకు లనుట. 'బ్రహ్మణ్యోదేవకీపుత్త్రః' యని

* అబ్రహ్మణ్య. † దోఁతురే. ‡ బాష్పలోచనుఁడు సమ్యగ్గోపలాలుండు.

యున్నది.). ఈ రంగభర్త=ఈ శ్రీరంగనాథుఁడు, తాన్=తాను, బ్రహ్మాదుల=బ్రహ్మ మొదలగువారియొక్క, మేర=మర్యాదను, నిల్పియున్=ప్రతిష్ఠాపించియును, ప్రభుత్వంబు ఊఁదియున్=దొరతనముఁ దాల్చియును, మఱ్ఱెతన్=నాకూఁతును, అన్యాయంబునన్=ధర్మేతరవృత్తిచేత, లోనవైచుకొనెన్=లోపలవేసికొనెను, త్రోతురే=ననువిసర్జింతురా? (ఇచ్చట దోఁతురే యని పాఠాంతర మట్లేని దోఁచుకొందురా యని యర్థము), సభవారు = సభ్యులు, ఈబ్రక్కన్ = ఈ పేదవాఁడైన, ద్విజున్=బ్రాహ్మణుని, చూడరయ్యా=కనరయ్యా, అంచున్, దుఃఖ+అప్+రాశిన్=దుఃఖసముద్రమందు, పడి, బాష్పకంఠుఁడు=డగ్గుత్తికగలవాఁడును, సముద్యత్=పైకిలేచుచున్న, దోఃపలాలుండునై=కరపల్లవములు గలవాఁడును, నై ('పలాలః పల్లవస్సమా' అని నిఘంటువు.)

శా. ఎంతే వేడుకయైనఁ బెండ్లగుట కీనే దేహము న్బ్రాణముల్
సంతానంబు నిశాంతము న్ధనము సస్యంబు ల్పశుశ్రేణు లే
కాంతస్వస్వజనార్చనంబునకె కాదా కూర్చుటే మీ కయో
వింతే యీ బుడు తెంత నన్గుఱుచ గావింపం దను న్మెత్తురే. 109

టీ. ఎంతవేడుక యైనన్=తనకు మిక్కిలి ప్రియమైనచో, పెండ్లగుటకున్ = వివాహమగుటకు, ఈనే = ఈచిన్నదాని నియ్యనా (ఇత్తు ననుట), దేహమున్, ప్రాణమున్, సంతానంబున్, నిశాంతమున్ = గృహమును, ధనము, సస్యంబుల్=ధాన్యములును, పశుశ్రేణులు = పసరములు, ఏన్ = నేను, కూర్చుటే=సంపాదించుటే, ఏ..క - ఏకాంత = ముఖ్యమగునట్లు, స్వ=తనయొక్క, స్వజన=తనభక్తులయొక్క, అర్చనంబుకె=పూజనమునకే, కాదా=అవు ననుట, మీకు, అయో=అయ్యో! వింతే = ఇది యాశ్చర్యమా? ఈ బుడుతెంత=ఈ చిన్నది యనఁగా నెంత, నన్గుఱుచకావింపన్ = నన్నుఁ దక్కువపఱుపఁగా, తనున్=తన్ను, మెత్తురే=హర్షింతురా? (మెచ్చ రనుట).

తా. తన కంత వేడుక గలిగిన నేను నా కూఁతు నిచ్చి పెండ్లి చేయనా? దేహాది పశుపర్యంతము సమస్తద్రవ్యములు తనకొఱకుఁ దన భక్తులకొఱకే కదా సంపాదించుట! నా కూఁతు రనఁగా నెంత? నన్నమర్యాద చేసిన దనకు మెప్పవునా? యని విష్ణుచిత్తుఁడు చెప్పెను.

చ. శివుఁడు విరించి వాసవుఁడుఁ జెప్ప నశక్తులు గొల్చినట్టి వా
రవుట నిరంకుశుండ నని యక్కట పాడిఁ దొఱంగఁ జెల్లునే?
భువనము లెల్ల నీ వయినఁ బొంత దయానిధి యమ్మ లేదె? భా
గవతులు లేరె? నా కొఱకుఁగా వహియించుకొనంగఁ గేశవా!

టీ. శివుఁడు=శంభుఁడును, విరించి=బ్రహ్మయును, వాసవుఁడుర్=దేవేంద్రుఁడును, కొల్చినట్టివారవుటర్=సేవించినవారగుటచేతను (సేవకు లనుట), చెప్పనశక్తులు=మనవి సేయశక్తులుగారు, నిరంకుశుండ వని = అడ్డములేనివాఁడవని, అక్కట=అయ్యో ! పాడిర్ = మర్యాదను, తొఱంగఁజెల్లునే = విడువవచ్చునా ? భువనములెల్లర్ = లోకములన్నియు, నీవి = నీ సంబంధములైనవి, అయినర్ = అయొనేనియు (లోకము లన్నియు, నీవి గావున నీపక్షముగాఁ జెప్పెనేనియు ననుట), పొంతర్=నీసమీపమందు, దయానిధి = అక్కటికంపుఁబ్రోవైన, అమ్మ = మాతల్లియైన లక్ష్మీదేవి, లేదె = సాక్షిగా లేదా (ఉన్న దనుట), ('ఇందిరా లోకమాతా' అని నిఘంటువు. మాతా చ కమలాదేవీ పితాదేవో జనార్దనః, అనునది ప్రమాణము.) కేశవా = బ్రహ్మరుద్ర జననకారణ మగు శరీరముగల స్వామీ! నాకొఱకుర్. కార్ = నాకొఱకై, వహించుకొనంగర్=పైని వేసికొనిచెప్పుటకు, భాగవతులు లేరె=శ్రీవైష్ణవులు లేరా ? (ఉన్నా రనుట). లక్ష్మీ దేవియు భాగవతులును పురుషకారపరు లని ప్రమాణము.)

ఉ. నెట్టన యల్ల లచ్చి యలనీళయు భూసతి యుండ నీకు నీ
నెట్టిక సీలపై మనసు నిల్చుట కేమనవచ్చు? వెఱ్ఱి యా
నట్టుగఁ బేద నన్నుఁ బరిహాసము సేఁతకుఁ దక్క వింతచూ
పెట్టిది? దిద్దు నెవ్వఁ డిల నేఱులవంకలు వారిడొంకలున్. 111

టీ. నెట్టన=సిద్ధముగా, అల్లలచ్చి = ఆలక్ష్మీదేవియు, అలనీళయు=అనీళాదేవియు, భూసతి = భూదేవియు, ఉండర్ = ఉండఁగా, నీకుర్, ఈ నెట్టికసీలపైర్=కుప్పూప వాస వ్రతముగల యీ కన్యకమీఁద, కుతికంటుసీలలయంతటిచిన్నది, మనసు నిల్పు టకుర్, ఏమనవచ్చుర్, పేదర్ = బక్కవాఁడగు, నన్నుర్, వెఱ్ఱి యానట్టుగర్ = పిచ్చివాఁడగునట్లు, పరిహాసము సేఁతకుఁ దక్కర్=గేలిసేయుటకే కాని, వింతచూపు= నూతనదృష్టి, ఎట్టిది=మీకేలాగుది, ఇలర్=భూమియందు, ఏఱులవంకలు=నదులవక్ర త్వములును, వారిడొంకలుర్ = ఉదకముల మార్గములును, ఎవ్వఁడు, దిద్దుర్=చక్కఁ దీర్చును (ఎవ్వఁడును దీర్పఁ డనుట. నీవెఱ్ఱితన మానదీవక్రత్వము మొదలగువాని వంటి దనుట), ప్రబలు లగువారి నడకలను దిద్దుట దుర్ఘట మని చెప్పవచ్చును.

వ. అని యిట్లు ధరణీసురుం డదవెట్ట భాగవతక్షోభంబునకు భువనభర్తయు
భయంపడి తచ్ఛాందసంబునకు గేలిసేయు చున్నవాఁ డను భావం
బతనికిఁ దోఁప మకరకుండలమండితంబు లగుగండదర్పణంబులం జిఱు
నవ్వొలర్ప ని ట్లనియె. 112

టీ. అని యిట్లు=ఈప్రకారముగా, ధరణీసురుండు=విష్ణుచిత్తుండు, అదవెట్టర్= మొఱపెట్టఁగా, భాగవతక్షోభంబునకుర్ = భగవద్భక్తుని దుఃఖమునకు, భువనభర్త

యన్=లోకరక్షకుం డగు శ్రీరంగనాథుండును, భయంపడి = జడిసి, తచ్ఛాందసంబున నన్=ఆవిష్ణుచిత్తుని యుపయోగములేనిమాటలకు, గేలిసేయుచున్నవాఁ డను భావంబు= పరిహాసముచేయుచున్నవాఁ డను తాత్పర్యము, అతనికిన్ తోఁపన్=ఆవిష్ణుచిత్తునకుఁ దోఁచునట్లు, మకరకుండలమండితంబులగు=నక్రాకారకర్ణవేష్టములచేత నలంకృతములగు, గండదర్పణంబులన్ = చెక్కుటద్దములయందు, చిఱునవ్వేలర్పన్=మందహాస మంకురింపఁగా, ఇట్లనియెను.

చ. ముది మదిఁ దప్పితోయి మునిముఖ్య! భవత్తనయ న్గృహంబునన్
బదిలము చేసివచ్చి మఱి బట్టబయ ల్వెడదూఱు దూఱెదా
సదన మిఁకొక్కమా టరసి చంచలలోచనఁ గానకున్నఁ [1]బో
రెదు మఱి కాని బుద్ధివిపరీతతఁ బొందక పోయి చూడుమా. 113

టీ. ఓయి మునిముఖ్య! ముది మదిఁదప్పి = ముసలితనముచే మతిస్థిరముపోయి, భవత్తనయన్=నీకూఁతును, గృహంబునన్=ఇంటిలోన,పదిలముచేసి=భద్రముచేసి, వచ్చి, మఱి=ఇఁకను, బట్టబయల్=బహిరంగమందు, వెడదూఱు=వట్టినింద, దూఱెదు=నిందింతువా, ఆసదనము=ఆనీయింటను, ఇంకొక్కమా టరసి=ఇంకొక్కసారి వెదకి, చంచలలోచనన్=ఆచలాపక్షిని, కానకున్నన్=చూడకుంటివా, మఱి=పిమ్మట, పోరెదు కాని=వాదింతువుగాని, బుద్ధిన్=నీమదియందు, విపరీతతఁబొందక = మఱియొక్కరీతిగాక, పోయి=చని, చూడుమా = వీక్షింపుమీ.

తే. [2]అనిన నాతండ్రి యిట్లని యనియె నేమె
ఱుంగ మేయార్తిఁ గడుపు చల్లంగఁ బలికి
కరుణచేసితి విజయివి గమ్మటంచు
బాష్పజల మాఁగి యింటికిఁ బరువువాఱె. 114

టీ. అనినన్=ఇట్లనఁగా, ఆతండ్రి=ఆముని, ఇట్లని యనియెన్=ఇట్లనివచించెను. ఏయార్తిన్=ఏదుఃఖమును, ఏమెఱుంగము=మే మెఱుఁగము, కడుపుచల్లంగన్ = కడుపు చల్లఁబడునట్లు, పలికి=వచించి, కరుణచేసితి=దయ చేసితివి,విజయివిగమ్ము=విజయవంతుఁడవు గమ్ము (ఇది మంగళాశాసనము.) అటంచున్, బాష్పజలము=కన్నీరు, ఆఁగి=నిల్పుకొని, ఇంటికిన్ = తన బసకు, పరువువాఱె = పరుగెత్తె.

---

1. దూరెదు-అని పాఠాంతరము. నిందార్థమున దూఱుశబ్దము అలఘురేఫగలది. కాని సర్వలక్షణసారసంగ్రహము, చిన్నయ సూరినిఘంటువు,ఆంధ్రభాషార్ణవము లుభయ రేఫల నంగీకరించియున్నవి. 2. అనిన నోతండ్రి యూఱెనే యూఱెనేమె, ఱుంగమే.

ఆ. మ్రొక్కినట్టి తనయఽమూర్ధంబు మూర్కొని
ప్రమదబాష్ప ముఽరల బ్రాహ్మణుండు
చేత వెన్ను నిమిరి నాతల్లి నినుఁ గంటిఁ
గా యటంచు నింటిఽకడ వసింప. 115

టీ. మ్రొక్కినట్టి = తనకుదండము సమర్పించునట్టి, తనయ=కూఁతుయొక్క, మూర్ధంబు=శిరమును, మూర్కొని=ఆఘ్రాణించి, ప్రమదబాష్పము=ఆనందబాష్పము, ఉరులన్ = స్రవింపఁగా, బ్రాహ్మణుండు = విష్ణుచిత్తుఁడు, చేతన్=తన హస్తముచేత, వెన్ను=ఆయమవీఁపును, నిమిరి = తడవి, నాతల్లి, నినున్, కంటిఁగా, అటంచున్, ఇంటికడన్ = తనబసయొద్ద, వసింపన్ = నివసించియుండఁగా.

తే. రంగపతి బ్రహ్మ రుద్రుల బ్రాహ్మి గౌరిఁ
దనకు నక్కన్య నడిగింపఁ బనుపుటయును
వారు సేనేశసహితు లై వచ్చుటయును
విష్ణుచిత్తుండు సంభ్రమాఽన్వితుఁడు నగుచు. 116

టీ. రంగపతి = రంగనాయకుఁడు, బ్రహ్మరుద్రులన్, బ్రాహ్మిన్ = సరస్వతిని, గౌరిన్, తనకున్ = రంగనాయకునకు, అక్కన్యన్, అడిగింపన్, పనుపన్=పంపఁగా, వారు, సేనేశసహితులై=విష్వక్సేనునితోఁ గూడినవారై, వచ్చుటయును = రాఁగా, విష్ణుచిత్తుండు, సంభ్రమ అన్వితుఁడు నగుచున్=సంతోషములోఁ గూడినవాఁడగుచు.

వ. విష్వక్సేనపూర్వకంబుగా వినయంబున వచ్చినవారికి నాతిథ్యంబు లొసంగి యుచితాసనంబుల నాసీనులై యున్న వారియాగమన ప్రయోజనం బడిగి తెలిసి ప్రమదరసభరితాంతరంగుం డై యిట్లనియె.

టీ. సులభము.

క. ధన్యుఁడ నైతిం దన కీ
కన్యక నీఁగాంచి భృగువు గౌరవముఁ బయో
ధిన్యాయము నొదవె నిటె
నన్యాయం బే ? చమూపఽహార విధులారా. 118

టీ. చమూపహారవిధులారా = విష్వక్సేన శివ బ్రహ్మలారా ! తనకున్, ఈకన్యకను = ఈచిన్నపడుచును, ఈఁగాంచి = ఇయ్యఁగని, ధన్యుఁడ నైతిన్, భృగువుగౌరవమున్ = భృగుమహాముని గురుత్వమును, పయోధిన్యాయమున్=సముద్రన్యాయమును, ఒదవెన్=ఉదయించెను. ('భృగోః ఖ్యాత్యాం సముత్పన్నా శ్రీః పూర్వ ముదధేః పున' యని శ్రీవిష్ణుపురాణవాక్యము ప్రమాణముగా 'భార్గవీ లోకజననీ క్షీరసాగరకన్యకా'

యని యమరమునఁ గలదు కావునఁ దొల్లి లక్ష్మినొసంగిన భృగూదధులగౌరవము సాకుఁ గలిగె ననుట). ఇటేని = ఇట్లడిగిపుచ్చుకొనుటేని, అన్యాయంబే=అన్యాయముగాదా.

క. వినుఁ డీఁదగు సంబంధపు
టెనయిక్కఁ గని మోచి తెచ్చి ౹ యిచ్చె ననరె చు
ల్కని నరులు గాన మాపుర
మునకు న్విజయంబు సేయఁ ౹ బుత్త్రిక నిత్తున్. 119

టీ. వినుఁడు=ఆకర్ణింపుఁడు. ఈఁదగున్ = ఇయ్యఁదగును, చుల్కనినరులు = తేలికయగు జనులు, సంబంధపు టెనయిక్కన్=వియ్యపుఁబొందికను, కని=చూచి, మోచి తెచ్చి=మోసికొని తెచ్చి, ఇచ్చె ననరె=ఒసఁగె ననరా? కానన్=కాఁబట్టి, మాపురమునకున్ = మాశ్రీవిల్లిపుత్తూరికి, విజయంబు సేయన్=వేంచేసినయెడల, పుత్త్రికనిత్తున్= కొమార్తె నొసఁగుదును.

తే. ప్రభుతఁ బరమేశ్వరుం డైనఁ ౹ బత్ప్రపన్న
జనమున కొసంగు మీకు నీఁచనవు శౌరి
తానె కట్టిన భూమికఁ ౹ దాల్చు మాకు
ఘనత యిది మమ్ముఁ జేయుట ౹ తనదు ఘనత. 120

టీ. శౌరి = ఆశ్రీపతి, ప్రభుతన్ = ప్రాభవముచేత, పరమేశ్వరుండైనన్ = సర్వాధికుఁడైనను, పత్ = పాదములయందు, ప్రపన్న = ప్రపత్తిచేసినట్టి, జనమునకున్ = జనులకు, మీకున్, ఈచనవు = ఈమచ్చికను, ఒసఁగున్=ఇచ్చును. (మీరు చెప్పిన విధ ననుట.) తానె కట్టిన=తానే కలుగఁజేసిన, భూమికన్=శ్వశురవేషమును తాల్చు = ధరించునట్టి, మాకున్, ఇది, ఘనత=గొప్పతనము, మమ్మున్ చేయుట = మమ్మిట్లు గొప్పపఱుచుట, తనదుఘనత = తనకు గౌరవము.

తే. అనినఁ జని విన్నవింప దయారసార్ద్ర
చిత్తుఁడై విశ్వభర్త పక్షిప్రధాన
కౌపవాహ్యంబు నెక్కి బ్రహ్మాదిసురలు
బలసి తమతత్తడుల నెక్కి ౹ కొలిచి రాఁగ. 121

టీ. అనినన్ = ఇట్లనఁగా, చని = వారు మరలఁబోయి, విన్నవింపన్=మనవి చేయఁగా, దయారస = కృపారసముచేత, ఆర్ద్ర = తడుపఁబడిన, చిత్తుఁడై = చిత్తము గలవాఁడై, విశ్వభర్త = ఆరంగపతి, పక్షిప్రధానక=గరుత్మద్రూపమైన, ఔపవాహ్యంబున్ = లీలావాహనమును, ఎక్కి, బ్రహ్మాదిసురలు, బలసి = పరివేష్టించి, తమ తత్తడులన్ = తమవాహనములను, ఎక్కి, కొలిచి = సేవించి, రాఁగన్ = వచ్చుచుండఁగా.

క. నాసీరుఁ డగుచు సూత్రవ
తీసఖుఁ డుడువీథిఁ బౌఁజు తీర్చిన ప్రజభూ
[1]షాసి శతకోటి శతకో
టీ సవితృప్రభలు దిశల దెప్పర మలమన్. 122

టీ. సూత్రవతీసఖుండు=సూత్రవతీదేవి విభుఁ డయిన విష్వక్సేనుఁడు, నాసీరుఁ డగుచున్ = సేనమొగమగుచు ('సేనాముఖంతు నాసీర' యని యమరము.) ఉడు వీథిన్ = నక్షత్రవీథియందు, పౌఁజు తీర్చిన = వ్యూహముపన్నినట్టి, ప్రజ = జనము యొక్క, భూషా = భూషణములయొక్కయు, అసి=ఖడ్గములయొక్కయు, శతకోటి= వజ్రాయుధముయొక్క, శతకోటీ = నూఱుకోట్లసంఖ్యగల, సవితృ=సూర్యులయొక్క, ప్రభలు=వెలుంగులవంటి వెలుంగులు, దిశలన్=దిక్కులయందు, దెప్పరము=అధికముగా, అలమన్=వ్యాపింపఁగా.

వ. శ్రీవిల్లిపుత్తూరికిం జని విశ్వకర్మ మణిమయంబుగాఁ గట్టిన విడిది పట్టున విడిసి యయ్యాదిమవరుండు దివ్యాప్సరసలు హారిద్రాదికస్నానీయ మంగళద్రవ్యమండనం బొనర్పఁ బెండిలికొడుకై దివ్యవాదిత్రంబులు నారదాది దివ్యముని గానంబులు వెలయం గలధౌత ధవళ దివ్య ధారాధరంబులు గురియు సుధాధారల నభిషిక్తుండై ముక్తావళి కౌస్తుభాముక్తకంబుకంధరుండును గేయూరకంకణాలంకృతుండును మకరకుండల మకుటాదిభూషావిభూషితుండును దివ్యాంగరాగ రూషితుండును బీతాంబరసంవీతుండును దులసీకల్పితప్రసవస్ర గాశ్రితోరస్కుండు నై యుండు నంత నక్కడ నటకుమునుప గృహ ప్రవేశంబుసేసి సంభ్రమాయత్తుం డగు విష్ణుచిత్తు ప్రయత్నంబున. 123

టీ. శ్రీవిల్లిపుత్తూరికిం జని, విశ్వకర్మ, మణిమయంబుగాన్, కట్టిన, విడిదిపట్టున, విడిసి = ప్రవేశించి, అయ్యాదిమవరుండు = ఆమొదలిపెండ్లికొడుకైన శ్రీపతి, దివ్యా ప్సరసలు = వేల్పుటచ్చరలు, హారిద్రాదిక = పసుపుమొదలగు, స్నానీయ = స్నానము కొఱకైన, మంగళద్రవ్య=శుభవస్తువులతోడి, మండనంబు=అలంకారము, ఒనర్పన్ = చేయఁగా, పెండిలికొడుకై, దివ్యవాదిత్రంబులు = దేవదుందుభులు, నారదాది దివ్య మునిగానంబులు, వెలయన్ = ప్రకటము[illegible]గా, కలధౌత = వెండివలెనే, ధవళ = తెల్లనైన, దివ్యధారాధరంబులు = దేవ[illegible]మేఘములు, కురియు = వర్షించుచున్న, సుధాధారలన్=అమృతధారలచేత, అభిషిక్తుండై=అభిషేకింపఁబడినవాఁడై, ఆముక్తా

1. షాసితవాలిచేన్......దెప్పరపఱుపన్.

వళీ=ముత్తెపుసరాలతోఁడి, కౌస్తుభ = కౌస్తుభ రత్నముచేతను, ఆముక్త = విడువఁబడనీ, కంబుకంధరుండును = శంఖమువంటి కంఠముగలవాఁడును, కేయూర = భుజకీర్తుల చేతను, కంకణ=కడియములచేతను, అలంకృతుఁడును=అలంకరింపఁబడినవాఁడును, మకర కుండల = మకరాకృతిగల పోఁగులు, మకుట=కిరీటము, ఆది=మొదలుగాఁగల, భూషా= భూషణములచేత, విభూషితుండును=మిక్కిలి భూషింపఁబడినవాఁడును, దివ్యాంగరాగ= దివ్యచందనముచేత, రూషితుండును = అలందఁబడినవాఁడును, పీతాంబరసంవీతుండు = బంగరు పట్టుపుట్టంబుఁ గట్టుకొన్నవాఁడును, తులసీ=తిరుత్తుళాయియొక్కయు, కల్పతరు ప్రసవ = కల్పవృక్షపుష్పములయొక్కయు, ('స్యాదుత్పత్తౌ ఫలేపుష్పే ప్రసవో గర్భ మోచనే' అని నిఘంటువు.) స్రక్=మాలికలచేత,ఆశ్రిత=పొందఁబడిన,ఉరస్కుండునై= వక్షముగలవాఁడై, ఉండునంతఁ=ఉండునంతట, అక్కడ=ఆయమ్మవారియొద్ద, ఆటకు మునుప=అంతకుమునుపే, గృహప్రవేశంబుసేసి=తమయిల్లుసేరి, సంభ్రమాయత్తుండగు= ప్రేమాధీనుఁడగుచున్న, విష్ణుచిత్తు=పెరియాళ్వారుయొక్క, ప్రయత్నంబున.

క. శర్వాణీ వాణీ ముఖ
గీర్వాణీకోటి జానకీరఘుకులరా
ట్పూర్వాచరిత వివాహా
ఖర్వ సుగీతములు పాడఁగా విభవమునన్. 124

టీ. శర్వాణీ=పార్వతియుఁ, ('శర్వాణీ సర్వమంగళా' అని యమరము.) వాణీ= సరస్వతియు, ముఖ = మొదలగు, గీర్వాణీ=దేవతాస్త్రీలయొక్క, కోటి=సమూహము, జానకీరఘుకులరాట్=సీతారాములయొక్క, పూర్వాచరిత=తొల్లి చేయఁబడిన, వివాహ= కల్యాణమందలి, అఖర్వ=అతిశయములయిన, సుగీతములు=పాటలు, పాడఁగాన్=గానము సేయఁగా, విభవమునన్=వైభవముతో.

తే. నెమ్మి నేకావళియు స్రగ్విణియును జామ
రంబు లిరుగెడ నిడ హారిద్రాద్రవమునఁ
బెట్టిరి నలుంగు లక్కన్యఁ బెండ్లికూఁతుఁ
జేయు ఋషిపత్ను లర్థి నాశీర్యుతముగ. 125

టీ. నెమ్మిన్=మైత్రిచేతను, ఏకావళియున్=మున్ను చెప్పఁబడిన చెలికత్తియలైన యేకావళియును, స్రగ్విణియును, ఇరుగెడన్ = ఉభయపార్శ్వములయందు (ఇది యేకవచనాంత ద్విగుసమాసము), చామరంబులు=వీఁచోఁపులు, ఇడన్=సమర్పింపఁగా, హారిద్రాద్రవమునన్ = పసుపునీటిచేత, అర్థిన్=ఆసక్తిచేత, అక్కన్యన్=ఆయాముక్త మాల్యదాకన్యకను, పెండ్లికూఁతుఁజేయు, ఋషిపత్నులు=ఋషిభార్యలు, ఆశీర్యుతము గాన్ = దీవనలతోడను, నలుంగులుపెట్టిరి = ఉద్వర్తనము లాచరించిరి.

తే. అట్లు వైవాహికపుదీక్ష యమరఁ గమ్మ
నూనెఁ దలయంటి నెఱులు గందానఁ బులుమ
స్వర్ణమణికుంభహిమవారి జలక మాడి
నట్టి జగదీశ్వరికి వేల్పుటబలయోర్తు. 126

టీ. అట్లు=ఆప్రకారము, వైవాహికపుదీక్ష=వివాహసంబంధదీక్ష, అమరన్ = ఒప్పునట్లు, కమ్మనూనెన్ = సుగంధతైలముచేత, తలయంటి = శిరోభ్యంగముఁజేసి, నెఱులు=ఆకురులు, గందానన్=శ్రీచందనముచేత, పులుమన్=పులుమఁగా, స్వర్ణమణి=బంగరురతనాల వికారములగు, కుంభ=కలశములయందలి, హిమవారిన్=పన్నీటిచేత, జలకమాడినట్టి=మంగళస్నానమొనర్చినట్టి, జగదీశ్వరికిన్=ఆయమ్మకు, వేల్పుటబలయోర్తు = ఒక్క దేవతాస్త్రీ (యని ముందటి కన్వయము.)

క. తడి యొత్తి సన్నవలిపం
బిడి మణిపీఠస్థయైన యింతి మెఱుఁగు పె
న్నిడుదకురు లార్చి ధూపం
బిడెఁ దుఱుము ఘటించె నొకమృగేక్షణ నెమ్మిన్. 127

టీ. తడియొత్తి=తడిఁ దుడిచి, సన్నవలిపంబిడి = సన్నచీరఁగట్టించి, మణిపీఠస్థయైన=రత్నపీఠమందుఁ గూరుచున్న, ఇంతి = ఆముక్తమాల్యదయొక్క, మెఱుఁగు = మెఱుఁగారుచున్న; పెన్నిడుదకురులు = మిక్కిలి వాలికలగుకురులు, ఆర్చి = తేమ యార్చి, ధూపంబిడెన్ = ధూపమువేసెను. ఒక మృగేక్షణ=మఱియొక్క కురంగలోచన, నెమ్మిన్=మైత్రిచేత, తుఱుము ఘటించెన్=కొప్పుఁబెట్టెను.

సీ. యావకద్రవమున నరుణాంఘ్రినఖపఙ్క్తు
లభ్యక్తములు సేసె నతివ యోర్తు
నయకల వ్రేళ్లమట్టియలుఁ బిల్లాండ్లిడి
పాయవట్టముఁ బెట్టెఁ బడఁతి యోర్తు
నెఱికవట్టి పసిండినీటిప్రాఁత చెఱంగు
వెలిపట్టు రహిఁ గట్టె వెలఁది యోర్తు
కటిసీమఁ గనకమేఖలఁ జేర్చి హారహా
రములు గీలించెఁ గంఠమున నోర్తు

తే. కటకములు హస్తసరము లంగదము లంగు
ళీయకములును బాహువల్లికల వ్రేళ్ల

నిలిపి తాటంకనాసామణుల నమర్చి
చొనిపె సీమంతవీథిఁ జేర్చుక్క యోర్తు. 128

టీ. (1) అలివవయోర్తు=మఱియొకదేవకన్యక, యావకద్రవమునన్=లత్తుకనీటి చేత,అరుణ=మునుపే యెఱ్ఱనైయున్న, అంఘ్రినఖపఙ్క్తులు=అడుగుగోళ్లచాళ్లు, అభ్యక్తములుసేసెన్ = తడిపెను. (2) ఒకటె = మఱియొకయంగన, నయకల = నాణెము గల, వ్రేళ్లన్ = పాదాంగుళులయందు మట్టియలును, పిల్లాండ్లును, (స్త్రీలుకాలి రెండవ వ్రేల ధరించు నాభరణవిశేషమునకు మట్టియ యనియు, నాల్గవ వ్రేల ధరించు దానికి పిల్లాఁడి యనియుఁ బేర్లు.) ఇడి, పడఁతియోర్తు = మఱియొకయామె, పాయవట్టము=పాదభూషణ విశేషమును (పాగడము లనవచ్చును) పెట్టెన్=ఉనిచెను. (3) కాటికవెట్టి=కుచ్చిళ్లుకట్టి, పసిండిసీటివ్రాఁతచెఱంగు = బంగారు సరిగచేతఁ జిత్రించి యున్న చెఱఁగుగల, వెలిపట్టు = తెల్లపట్టుచీర, రహిన్ = పొలుపుగాను, వెలఁది యోర్తు = మఱియొక్కకాంత, కట్టెను. (4) ఓర్తు = మఱియొక్క, పొలఁతుక, కటిసీమన్ = నడుముమీఁద, కనకమేఖలన్ = బంగారుగంటల యొడ్డాణమును, చేర్చి = అలంకరించి, కంఠమునన్, తారహారములు = ముత్తెపుఁబేరులు, కీలించెన్ = ఉనిచెను. (5) ఓర్తు = మఱియొక్కత, కటకములు=కంకణములు, హస్తసరములు=చేసరపణులు, అంగదములు=భుజకీర్తులును, అంగుళీయకంబులు=ఉంగరములును,బాహువల్లికలవ్రేళ్లన్= వరుసగా బాహువులయందును, వ్రేళ్ళయందును, నిలిపి, తాటంకనాసామణులన్=కమ్మలు ముక్కరముత్తెమును, అమర్చి = పొసఁగించి, సీమంతవీథిన్ = పాపటత్రోవయందు, చేర్చుక్క = ముక్తాభూషణమును, చొనిపెన్ = ఉనిచెను.

క. కలికి తెలిగన్నుఁగవఁ గ
జ్జలరేఖలు దీర్చి మేనఁ గస్తూరి సారంగమదం
బలఁది లలామక మిడి చెం
గలువలు క్రొవ్వేదకు వేటొకర్తు ఘటించెన్. 129

టీ. కలికి = ఆపెండ్లికూఁతుయొక్క, తెలిగన్నుఁగవన్ = ధవళాక్షిద్వంద్వమందు, కజ్జలరేఖలు = కాటుకరేఖలు, తీర్చి=దిద్ది, మేనన్=శరీరమందు, సారంగమదంబు=కస్తూరి, అలఁది = పూసి, లలామకము = చేర్చుక్క (బొట్టుమీఁద శిరమున నుంచుకొనెడు భూషణమైనదాని. ('ప్రభ్రష్టకం శిఖాలంబి పురోన్యస్తం లలామకమ్.' అని యమరము), ఇడి=ఉంచి, వేఱొకర్తు=మఱియొక నాతి, క్రొవ్వేదకున్=క్రొమ్ముడికి, చెంగలువలు=ఎఱ్ఱగలువపువ్వులు, ఘటించెన్ = కూర్చెను.

వ. ఇట్లలంకృతయైయుండ లగ్నం బాసన్నంబయ్యె నని విన్నవించుటయుఁ బన్నగశయనుండు మార్తాండమండలంబులు పండ్రెండును

దివియలై వెలుంగఁ దారకలగుంపు జగజంపుగా శతపత్రశత్రుం డాతపత్త్రత యంగీకరింప సింధుపతి సౌగంధికదళోపహారసహితం బుగా విపణిఁ గలయంపిఁ జిలికింపఁ బ్రకృతికాంత క్రంత సురకాంతలం గూడుకొని సంతరింప హుతవహుం డగరుధూపంబు రేపఁ బర్జన్యుం డుల్లడయిడఁ బ్రాచీనపాఠంబులు పాఠకౌఘంబు లయి బిరుదప్రబంధంబులు పఠియింప విధినందన సనందనాదులు సంగీత మాంగల్యంబున నంతరంగంబున కింపొసంగ విహంగపుంగవుండు మత్తమాతంగంబై ఖచితమణికల్యాణం బగు పల్యాణం బంగీకరింప నప్రాకృతవైభవంబునం జని పరమసంభ్రమంబున భాగవతవతంసంబు భక్తికలితబహుప్రణామపూర్వకంబుగా నెదుర్కొన నెక్కిరింత డిగ్గి విష్వక్సేను కరం బవలంబించి కక్ష్యాంతరంబులం జంచలాక్షులు గడుగు నడుగుల జలంబులకుం బయిపయిం బడి గీర్వాణ సిద్ధసంఘంబు లహంపూర్వికం నుర్వినిర్వారిగా నూర్చికొని ప్రాశింపఁ బ్రవే శించి తదీయ నిర్దిష్టం బగు జాంబూనదపీఠంబున నుపవిష్టుం డై యతండు వెండియు బంగారుభృంగారుకంబులఁ గనకభాజననిక్షిప్తంబు లగు కౌశేయపేశలపరిసలిలంబులు కడిగి షోడశోపచారసహితం బును సపరిష్కృతియంబు నగు మధుపర్కంబు నొసంగం గొని యయ్యా ళ్వారు దేవేరియుం దానును ధారవోయ నా కన్యకారత్నంబుఁ 130
బరిగ్రహించె ననంతరంబ.

టీ. ఇట్లు = ఈప్రకారము, అలంకృత యైయుండఁగ = అలంకరింపఁబడినదై యుండఁగా, లగ్నంబు = వివాహముహూర్తము, ఆసన్నం బయ్యె ననిఁ=సమీపించె నని, విన్నవించుటయుఁ = విన్నపము సేయఁగానే, పన్నగశయనుండు = శేషశాయియగు రంగనాథుఁడు, మార్తాండమండలంబులు పండ్రెండును = ద్వాదశాదిత్యమండలంబులు, దివియలై వెలుంగఁగ = దివ్వటీలయి వెలుఁగఁగా, తారకలగుంపు = నక్షత్రసమూహము, జగజంపుగాఁ = కుచ్చులుకాఁగా (గొడుగుచుట్టు నుండునవి), శతపత్త్రశత్రుండు = కమలవైరియైనచంద్రుఁడు, ఆతపత్త్రత నంగీకరింపఁ = ఛత్రముకాఁగా, సింధుపతి= సముద్రుండు, సౌగంధికదళోపహారసహితంబుగాఁ=ఎఱ్ఱగలువపేకుల కానుకతోఁగూడ, విపణిఁ = అంగడివీథియందు, కలయంపిఁ = కల్లాపిని, చిలికింపఁ = చల్లింపఁగా, ప్రకృతికాంత = మాయ యనునాతి, సురకాంతలం గూడుకొని = దేవతాస్త్రీలం గలిసి కొని, క్రంత = సమీపప్రదేశము, సంతరింపఁ = సవరణపఱుపఁగా, హుతవహుండు=

అగ్నిదేవుఁడు, అగరుధూపంబు, రేపన్ = ఎగయింపఁగా, పర్జన్యుండు = వర్షదేవుఁడు, ఉల్లద యిరన్ = ఉల్లాధముఁబట్టఁగా, ప్రాచీనపాఠంబులు = ప్రాఁజదువులు (వేదము లనుట), పాఠకౌఘంబులయి = వందిమాగధసంఘములై, బిరుదప్రబంధంబులు=బిరుదుఁ గైవారములు, పఠింపన్ = చదువఁగా, విధినందన = నారదుండు, సనందన = సనంద నుండు, ఆదులు = మొదలగువారు, సంగీతమాంగల్యంబునన్=సంగీతమంగళత్వముచేత, అంతరంగంబునకున్ = మనస్సునకు, ఇంపొసంగన్ = మాధుర్యమొనర్పఁగా, విహంగ పుంగవుండు = గరుత్మంతుఁడును, మత్తమాతంగంబై = మదపుటేనుఁగై, ఖచిత = కూర్పఁబడిన, మణి=రత్నములును, కల్యాణంబగు = బంగారుగలిగినట్టి, ('వసు చంద్రం చార్జునం చ కల్యాణం భూరిగైరిక' మ్మని నిఘంటువు.) పల్యాణంబు=పల్లమును (చౌడో లనుట), అంగీకరింపన్ = వహింపఁగా, అప్రాకృత=లోకవిలక్షణమైన, వైభవంబునన్= సంపదచేత, చని = వేంచేసి, పరమసంభ్రమంబునన్ = పరమానందముచేత, భాగవత వతంసంబు=భాగవతోత్తముఁడగు భట్టనాథుఁడు, భక్తి=భక్తితోడ, కలిత=కూడు కొన్న, బహుప్రణామపూర్వకంబుగాన్=అనేకనమస్కారపూర్వకముగా, ఎదుర్కొనన్ = ఎదురుకోలునకురాఁగా, ఎక్కిరింత డిగ్గి=వాహనమును దిగి, విష్వక్సేనుకరం బవలంబించి= విష్వక్సేనుని కైదండ గ్రహించి, కక్ష్యాంతరంబులన్ = ద్వారాంతరాళములయందు, చంచలాక్షులు = సువాసినులు, కడుగు=ప్రక్షాళనము చేసెడు, అడుగుల=శ్రీపాదముల యొక్క, జలంబులకున్ = తీర్థములకు, పయిపయింబడి = మీఁదమీఁదఁబడి, గీర్వాణ= వేల్పులయొక్క, సిద్ధ=సిద్ధులయొక్క, సంఘంబులు=గుంపులు, అహంపూర్వికన్=ఓహరి సాహరిచేత, ఉర్వి=భూమి, నిర్వారిగాన్=నిర్జలమగునట్లుగా, ఊర్చికొని=మూటుకొని, ప్రాశింపన్ = పానముసేయఁగా, ప్రవేశించి=చొచ్చి, తదీయ = ఆభట్టనాథసంబంధుల చేత, నిర్దిష్టంబగు = నిర్ణయింపఁబడిన, జాంబూనదపీఠంబునన్ = బంగరుపీఁటయందు, ఉపవిష్టుండై = కూరుచున్నవాఁడై, అతండు, వెండియున్=మరల, బంగారుభృంగారు కంబులన్ = బంగరుగిండ్లచేత, కనకభాజన = పసిఁడిపళ్ళెరంబునందు, నిక్షిప్తంబులగు= ఉనుపఁబడిన, కుశేశయ=తామరపూలవలెనే, పేశల=మృదువులైన, పదకిసలయంబులు = అడుగుఁజిగురులు, కడిగి = ప్రక్షాళనముఁజేసి, షోడశోపచారసహితంబును = ఆవాహ నాసన పాద్యార్ఘ్యాచమనీయ స్నానవస్త్రయజ్ఞోపవీతగంధపుష్పధూపదీపనైవేద్యతాంబూ లోత్తర నీరాజన మంత్రపుష్పాత్మకము-ప షోడశోపచారములతోఁ గూడినట్టియు, సపరి ష్క్రియంబునగు = అలంకారసహితమైనట్టి, మధుపర్కంబున్ = గుడయుక్తదధిని, ఒసంగన్ = సమర్పింపఁగా, కొని = గ్రహియించి, అయ్యాళ్వారు = ఆభట్టనాథుఁడు, దేవేరియున్ = ధర్మపత్నియు, తానును, ధారవోయన్ = ధారాదత్తముసేయఁగా,

ఆ కన్యకారత్నంబున్ = ఆ కన్యారత్నమగు నాముక్తమాల్యదను, పరిగ్రహించెన్ = పాణిగ్రహణముసేసెను, అనంతరంబ = పదంపడి.

మ. కలధౌతద్రవ చిత్రము ల్మెఱయ ముక్తాస్యూత మౌ మేచకాం
చలపుం బెండెఱ వారి లగ్నము సమాసన్నంబుగా వేల్పుఁబె
ద్దలు వంపన్ గుడజీరకంబులు సముద్యత్ప్రీతి నన్యోన్య మం
జులహస్తంబుల నుంచి రర్థిఁ గనుమించు ల్చిట్టుము ట్టాడఁగన్.

టీ. కలధౌతద్రవ = బంగారునీటిచేతనైన, ('కలధౌతంరౌప్యహేమ్నో' అని నిఘంటువు.) చిత్రముల్ = వింతపనులు, మెఱయన్ = ప్రకాశింపఁగా, ముక్తా = ముత్తెములతోడ, స్యూతమౌ = కూర్పఁబడిన, మేచక = నల్లనగు, అంచలపు = అంచులుగల, పెండెఱ = పెద్దతెఱదుప్పటి, వారి = పట్టి, లగ్నము = ముహూర్తము, సమాసన్నంబుగాన్ = మిగులదగ్గఱఁగా, వేల్పుఁబెద్దలు = బ్రహ్మాదిసురశ్రేష్ఠులు, వంపన్ = క్రిందికొన వంచియుండఁగా, గుడజీరకంబులు = బెల్లమును జీలకఱ్ఱయు, సముద్యత్ప్రీతిన్ = అగ్గలంపుఁ బ్రేమమిడిచేత, అర్థిన్ = ఆసక్తిచేత, కనుమించుల్ = నేత్రధావళ్యములు, చిట్టుముట్టాడఁగన్ = సందడింపఁగా, అన్యోన్య = ఒండొరులయొక్క, మంజుల = సుందరము లగు, హస్తంబులన్ = కరములయందు, ఉంచిరి = ఉనిచిరి.

చ. మఱి వనమాలి చూడమునఁ మానిని ముత్తెపుఁబ్రాలు వోయుచో
మెఱయుఁ దదంగుళీకిసలయమేళనఁ జక్రి చెమర్ప రాలె మై
నఱిముఱి ఘర్మబిందువులు నమ్మణులు న్మొగులందునుండి డా
ల్గిఱిగొన జాఱు ధారలబలె న్వడగండ్లబలె న్గనుంగొనన్. 152

టీ. మఱి = పిమ్మట, మానిని = ఆపెండ్లికూఁతురు, వనమాలిచూడమునన్ = స్వామి శిరమందు, ముత్తెపుఁబ్రాలువోయుచున్ = ముత్తెములతలఁబ్రాలుపోయునప్పుడు, తదంగుళీకిసల - తత్ = ఆయమయొక్క, అంగుళీకిసల = చిగుళ్లవంటి వ్రేళ్లయొక్క, మేళనన్ = కూడుకొనుటచేత, చక్రి = స్వామి, చెమర్పన్ = చెమరింపఁగా, మైన్ = స్వామి శరీరమందు, అఱిముఱి = తఱుచైన, ఘర్మబిందువులున్ = చెమ్మటచినుకులును, రాలెను = క్రిందఁబడెను, అమ్మణులున్ = ఆ ముత్తెములును, మొగులందునుండి = మేఘములలోనుండి, డాల్గిఱిగొనన్ = కాంతి వ్యాపించుచుండఁగా, జాఱు = స్రవించుచున్న, ధారలబలెన్ = వర్షధారలవలెను, వడగండ్లబలెన్ = కరకములవలెను, కనుంగొనన్ = చూడఁగా, మెఱయున్ = ప్రకాశించును.

తా. స్వామి శరీరము నీలమేఘమువలె నున్నది. అదిచెమర్చి చెమట చినుకులు రాలఁగా నవి వానచినుకులవలెను, దచఁబ్రాలముత్తెములు వడగండ్లవలె నున్నవి. ఉపమ.

తే. ఇంతి దోయిట సేసఁబ్రా లెత్తుచోట
గుబ్బపాలిండ్లక్రేవ గ్ర క్కునఁ మురారి
కన్ను వేయుటఁ గల లజ్జ గదుర బాహు
లెత్తక కరాగ్రములన పై కెగురఁజల్లె. 133

టీ. ఇంతి = ఆనాతి, దోయిటన్ = అంజలిచేత, సేసఁబ్రాలు = తలఁబ్రాలు, ఎత్తుచోటన్ = ఎత్తునప్పుడు, మురారి = రంగనాథుఁడు, గుబ్బపాలిండ్లక్రేవన్ = ఉదుటుగలకుచములదిక్కున, గ్రక్కునన్ = శీఘ్రముగా, కన్నువేయుటన్ = కన్ను వేసిచూచుటను, కని = తాను జూచి, లజ్జగదురన్ = సిగ్గులయఁగా, బాహులెత్తక = చేతులుపైకెత్తక, కరాగ్రములన=కొనచేతులలోనే, పైకిన్=స్వామిపైకి, ఎగరఁజల్లెన్.

క. గళమునఁ గట్టెను హరి మం
గళసూత్రము పులక లతివ గాత్రముఁ బొదువన్
నెలఁతయుఁ బతియును గరముల
నలవఱిచిరి కంకణంబు లన్యోన్యంబున్. 134

టీ. హరి, అతివగాత్రమున్ = ఆయింతినెమ్మేనిని, పులకలు = రోమాంచములు, పొదువన్ = వ్యాపింపఁగా, గళమునన్ = కంఠమందు, మంగళసూత్రముఁ గట్టెను, నెలఁతయున్, పతియును, అన్యోన్యంబున్ = ఒండొరులకు, కంకణంబులు = ప్రతిసరములు (చెమటనీటిబిందువులు), కరములన్=హస్తములయందు, అలవఱిచిరి=అమర్చిరి. అసంగత్యలంకారము.

సీ. లలనచే నిష్ఠతో లాజలు వేల్పించి
 శార్ఙ్గి మెట్టించెను సప్తపదులు
తెలివఁ గూడి యరుంధ తీదర్శనముఁ జేసె
 బ్రహ్మరుద్రాది గీ ర్వాణకోటి
యర్పించు నుడుగర లనుకంపఁ గైకొని
 యనిచె బ్రసాదభా జనులఁ జేసి
[1]యాత్మపట్టణమున కతివైభవంబున
 నతివఁదోడ్కొని విజయంబుచేసి
తే. సహ్యకన్యాతటోద్యాన చందనద్రు
కుంజముల నీలకుంతలఁ గుస్తరించి

1. నతివైభవంబున నాత్మపట్టణమున, కతివఁ దోడ్కొనివిజయంబుసేసి.

కంతుసామ్రాజ్య మేలించి కరుణఁ జిత్త
మొలయ జగములఁ బాలించు చున్నవాఁడు. 135

టీ. (1) లలనచేతన్ = ఆయింతిచేత, నిష్ఠతోడన్, లాజలు వేల్పించి = లాజహోమముఁ జేయించి, శార్ఙ్గి = స్వామి, సప్తపదులు, మెట్టించెను = త్రొక్కించెను, (2) తెలివిన్, కూడి, అరుంధతీదర్శనముఁ జేసెన్, (3) బ్రహ్మరుద్రాదిగీర్వాణకోటి, అర్పించు = సమర్పించునట్టి, ఉడుగరలు = బహుమానములను, అనుకంపన్ = కృప చేత, కైకొని, ప్రసాదభాజనులఁ జేసి = అనుగ్రహపాత్రులనుజేసి, అనిచెన్ = పంపెను, (4) ఆత్మపట్టణమునకున్ = శ్రీరంగమునకు, అతివైభవంబునన్ అతివన్ తోడ్కొని, విజయంబుచేసి = వేంచేసి, (5) సహ్యకన్యా = కావేరీనదియొక్క, తట = దరుల యందలి, ఉద్యాన = శృంగారవనములందలి, చందనద్రు = శ్రీగంధవృక్షములయొక్క, కుంజములన్ = పొదరిండ్లయందు, నీలకుంతలన్ = ఆముక్తమాల్యదను, కుస్తరించి = లాలించి, కంతుసామ్రాజ్యము = రతిపతిసామ్రాజ్యమును, ఏలించి = పరిపాలింపఁజేసి, (సురత క్రీడకుఁ బ్రవేశింపఁజేసినాఁ డనుట.) చిత్తము, కరుణన్ = దయచేతను, ఒలయన్ = నిండఁగా, జగములన్ = లోకములను, పాలించుచున్నవాఁడు = ఏలుచున్నవాఁడు.

ఉ. స్కందసరస్తటీరమణ కందర చందన కుందవాటికా
మందసమీరలోల వన మాలిక! నిర్మలదివ్యవిగ్రహా
స్పందివిభాధరీకృత న భస్స్ఫుటకాళిక! వల్లవాంగనా
బృందమనోభిమాన ధృతి భేదన! పేశల వంశవాదనా! 136

టీ. స్కందసరః = స్వామిపుష్కరిణియొక్క, తటీ = దరియందలి, రమణ = మనోహరమగు, కందర = గుహలయందలియు, ('దరీతుకందరోవాస్త్రీ' అని యమరము.) చందన = హరిచందనవృక్షముయొక్క, కుంద = మొల్లలయొక్క, వాటికా = శ్రేణుల యందలియు, మందసమీర = మందమారుతముచేత, లోల = కదలుచున్న, వనమాలికా = తులసీవనమాల గలిగినవాఁడా, నిర్మల = స్వచ్ఛమైన, విగ్రహ = శరీరముయొక్క, అస్పంది = చలింపని, విభా = కాంతిచేత, అధరీకృత = క్రిందుచేయఁబడిన, నభః = ఆకాశముయొక్క, స్ఫుట = వ్యక్తమైన, కాళిక = నలుపుగలవాఁడా, వల్లవాంగనా = గోపికల యొక్క, బృంద = గుంపుయొక్క, మనః = మనస్సులయందలి, అభిమాన = ఈలువులను, ధృతి = ధైర్యములను, భేదన = భేదించెడువాఁడా, పేశల = మృదువైన, వంశ = పిల్లఁగ్రోవియొక్క, వాదనా = వాయించుటగలవాఁడా. (ఈపద్యమునందు స్కందపదము మొదలుగాఁ గాళికపదమువఱ కొక్కసమాసముగాను, పిదప వల్లవాంగనా శబ్దము మొదలుగాఁ దుదవఱ కొక్కసమాసముగాను గొందఱు చెప్పుదురు.)

క. అరిధారాఖండితమరు
దరిసంఘ! విహంగవాహనా! యుదరమహాం
బురుహపుటభరిత మధుశం
బరభరజలమానుషాయమాణద్రుహిణా! 137

టీ. అ...ఘ - అరి = చక్రముయొక్క, ధారా = అంచులచేత, ఖండిత = త్రుంపఁబడిన, మరుదరిసంఘ = రాక్షస సమూహముగలవాఁడా, విహంగవాహనా = గరుడవాహనా, ఉ...ణా - ఉదర = నాభియందలి, మహాంబురుహ = పెందామర యొక్క, పుట = దొప్పయందు, భరిత = నిండింపఁబడిన, మధు=మకరందమనియెడు, శంబర = ఉదకముయొక్క, భర = అతిశయమందు, జలమానుషాయమాణ = నీరు పాపవలె నున్న, ద్రుహిణా = బ్రహ్మముగలవాఁడా. ఉపమ.

స్రగ్విణి. వాలినిర్భేదనా! వారిజాతేక్షణా!
శైలకన్యాస్తుతా! శార్ఙ్గచంచద్భుజా!
ఫాలదృక్పద్మభూపాకభేదిస్ఫుర
న్మౌళిమాణిక్యరుఙ్మండితాంఘ్రిద్వయా! 138

టీ. వాలినిర్భేదనా=వాలిని సంహరించినవాఁడా, వారిజాతేక్షణా=తామరలవంటి కన్నులుగలవాఁడా, శైలకన్యాస్తుతా = పార్వతీదేవిచే స్తుతింపఁబడువాఁడా, శార్ఙ్గచంచద్భుజా - చంచత్ = కదలుచున్న, శార్ఙ్గ = ధనుస్సును, భుజా=భుజమందుఁగల వాఁడా, ఫాల......ద్వయా - ఫాలదృక్ = శివునియొక్కయు, పద్మభూ = బ్రహ్మ యొక్కయు, పాకభేది = ఇంద్రునియొక్కయు, స్ఫురత్ = ఒప్పుచున్న, మౌళి = కిరీటములయందలి, మాణిక్య = రత్నములయొక్క, రుక్ = కాంతిచేత, మండిత = అలంకరింపఁబడిన, అంఘ్రిద్వయా = అడుగులు కలవాఁడా, అని సంబోధనము.

[1]మ. ఇది నైరాయునయావనావనిధవాహీనాభ్రచుంబిస్ఫుర
ద్విదితాఖిల మణీగృహాళి దళనోద్వేలోగ్రహాస్తివ్రజో

.ఇది పూ. ము.న నాశ్వాసాంతము.

1. మ. ఇది సింహాచలదంభకేసరిపదాభీష్టార్చనా పుణ్యల
బ్ధ దురుట్టంకణపొట్టునూరివిజయస్తంభోపలోట్టంకితాం
క గృధాష్టాక్షరకృష్ణరాయ ధరణీకాంతాస్త్రదాముక్తమా
ల్యద నాశ్వాసవరంబు నాఱవది హృద్యంబై మహిం బొల్పగున్.

టీ. ఇది, సింహాచల = సింహాచలమందలి, దంభకేసరి=నృసింహస్వామియొక్క, పదాభీష్టార్చనా = ఇష్టమైన పాదపూజలయొక్క, పుణ్యా=పుణ్యముచేత, లబ్ధ=పొందఁ

ద్యదనీకాగ్రగకృష్ణరాయమహిభృత్సంజ్ఞాస్మ దాముక్తమా
ల్యద నాశ్వాసవరేణ్యమాఱవది హృద్యంబైన పద్యంబులన్. 139

ఇది=ఈగ్రంథము, సైరా...ల్యదన్ - సైరామన = సైరామనపురమందలి, యావన అవనిధవ = తురకరాజుయొక్క, అహీన=గొప్పదగు, అభ్రచుంబి=ఆకాశము నంటుచున్న, స్ఫురత్ = కాంతివంతమైన, విదిత=ప్రసిద్ధమైన, అఖిల=దుస్సాధ్యమైన, మణీగృహ = రత్నమయగృహములయొక్క, ఆళి=వరుసలయొక్క, దళన=భేదించుట యందు, ఉద్వేల=అధికమైన, ఉగ్ర=భయంకరములయిన, హాస్తివ్రజ=ఏనుఁగులగుంపు చేత, ఉద్యత్=కదలుచున్న, అనీక=సేనయొక్క, అగ్రగ=మొనయందు నడచుచున్న, కృష్ణరాయమహిభృత్ = కృష్ణరాయ లనెడి, సంజ్ఞ = పేరుగలిగిన, అస్మత్ = నా యొక్క, ఆముక్తమాల్యదన్ = ఆముక్తమాల్యద యను గ్రంథమునందు, హృద్యంబు ఐన పద్యంబులన్ = మనోహరమైన పద్యములతోఁ గూడినట్టిది, (అగు) ఆశ్వాసవరే ణ్యము=ఉత్తమమైన ఆశ్వాసము, ఆఱవది. (చూ. ప్రక్షిప్తభాగము).

గద్యము. ఇది శ్రీదక్షిణామూర్తిమంత్రోపాసనా సమాసాదితాఖండ సాహితీ ధురీ ణుండు నాత్రేయగోత్రపవిత్రుండును వావిళ్లవంశపయోరాశిరాకాసుధాకరుండు నగు రామస్వామిశాస్త్రిచేత ననేక పూర్వవ్యాఖ్యానాభిప్రాయంబులఁ బర్యా లోచించి రచియింపఁబడిన రుచిసమాఖ్యానం బగు నాముక్తమాల్యదా వ్యాఖ్యా నంబునందు సర్వంబును షష్ఠాశ్వాసము.

ఆముక్తమాల్యద, సవ్యాఖ్యానము

సమాప్తము.

బడిన, దురుట్టంకణ = ఉట్టంకింపశక్యముగాని, (ఎన్నరాని యనుట), పొట్నూరి, విజయ స్తంభ = స్తంభముయొక్క, ఉపల = శిలయందు, ఉట్టంకిత = చెక్కఁబడినట్టి, అంక= గుఱుతుచేత, దృఢ = దిట్టములైన, అష్టాక్షర=ఎనిమిది యక్కరములుగల, కృష్ణరాయ ధరణీకాంత=కృష్ణరాయధరణీకాంతుఁ డను, అస్మదాముక్తమాల్యదన్=నాయాముక్త మాల్యదయందు, ఆశ్వాసవరంబు, ఆఱవదియున్, హృద్యంబై, మహిన్ = భూమి యందు, పొల్పగున్ = ప్రకాశించును.

ప్రక్షిప్తభాగము

కొన్ని పుస్తకములలో దాసరి యడుగఁగా నతనితో బ్రహ్మరాక్షసుఁడు తన వృత్తాంతము చెప్పఁదొడంగునంతవఱకు నాఱవయాశ్వాసము సమాప్తముగాను, తక్కిన పద్యము లేడవ యాశ్వాసముగా నున్నవి. అయినను, పూర్వవ్యాఖ్యాత లెవరు నా యాశ్వాసాంతపద్యముల కర్థము వ్రాయమిం జేసియు, అవి శబ్దదోషములును, యతి దోషములును, కలవియగుటం జేసియు, నీగ్రంథ మాఱాశ్వాసములే యని స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది కనుక నారీతినే ముద్రింపఁబడియె. అయినను, ఆ పద్యముల నిటఁ బొందుపఱుచుచున్నారము.

(571-వ పుట చూడుఁడు)

మ. అజచౌర్యాపహృతాత్తతారసముదాయాభీరకాంతామణీ
వ్రజగోరాజిమనఃప్రమోదకర తత్స్వాత్మావిప్తరూపానురూ
పజని ప్రాభవ ప్రాభవోదరకనద్బాణాగ్నివృత్తి ప్రకో
పజలాసారసరోజబాంధవ శశిప్రాంచద్విశాలాంబకా !

ఉత్సాహ.—

నలముఖాది చక్రవర్తినాథనపసమర్పితా
త్యలఘుమకుట ముఖ్యహాద్యుపాయనాయనావిరా
జిల సురారిహారణ నిజవశీకృతాఖిలాండ ధ
ర్మలగుణా ! యమేయరూపరంజితార్యపోషణా !

[1]మ ఇది నైరామనయావనావనిధవాహీనాభ్రచుంబిస్ఫుర
ద్విదితాఖిల మణీగృహాళి దళనోద్వేలోగ్రహస్తివ్రజో
ద్యదనీకాగ్రగకృష్ణరాయమహీభృత్సంజ్ఞాస్మదాముక్తమా
ల్యద నాశ్వాసవరేణ్యమాఱవది హృద్యంబైన పద్యంబులన్.

* (ఇచ్చటనుండి సప్తమాశ్వాసము ప్రారంభము.)

క. శ్రీమదుమాసురుభాంగక, సామజహరనక్రదళనచక్ర సదాళీ
క్షేమంకర చరణాంబుజ, హైమోజ్జ్వలవాస ! వేంకటాచలరమణా!

వ. అవధరింపు మప్పాలసుదిండి దుఃఖార్తుం డై యిట్లనియె.

---

1. పూర్వముద్రణములో షష్ఠాశ్వాసాంతమున చతుర్థాశ్వాసాంతపద్యమే 'నాలవది' యన్నమాట 'నాఱవది' యని మార్పుచేసి చేర్పఁబడియున్నది. ఇది సరి కా దని యూహించి యీప్రక్షిప్త మనఁబడునదియే షష్ఠాశ్వాసాంత మగు నని యిట వ్యాఖ్యానింపఁబడినది.

ఆముక్తమాల్యదయందలి గద్యపద్యముల

అకారాది సూచిక

గద్యపద్యములు.	పుట.
అ	
అంకితమో యన	14
అంగన నిలిచిన	432
అంచితహార	51
అంచునతందు	549
అంజ సమాన	95
అంటలు గట్టి	173
అండజగామిని	431
అంతటఁ బొంతఁ	582
అందుండుర్	64
అందు నరస	24
అందులో నొక	152
అందులో నొకమేటి	283
అంబరవాసు లగ్ని	345
అంభోధికన్యకా	38
అంభోధివసన	25
అక్కటరాధ	458
అక్కమలాక్షుఁ	459
అక్షరపక్షపాతమున	387
అజశివాదిక	603
అట్టిమంత్రివర్గంబు	375
అట్టిపరమేశ్వరు	208
అట్టిమురారి	465
అట్టిమోహాత్ర	193
అట్టివసంత	509
అట్టివేసవిబెడి	127

గద్యపద్యములు.	పుట.
అట్టిసమయం	125
అట్లుదడవుగ	525
అట్లుప్రత్యక్ష	228
అట్లువైవాహికపు	615
అడరుగళాస్ర	5
అడవులుగడిదేశ	395
అడుగున బండి	56
అడుగుననుండి	79
అతఁడుచిఱుత	262
అతఁడుతదల్ప	551
అతఁడు మృగశక్తి	281
అతఁడు రాజ్యంబు	265
అతనిచే విజ్ఞాపనంబు	594
అతనికియదు	20
అతనిపని	174
అతిజలమబ్ధి	303
అతివపూర్ణేందు	510
అతివృష్టిస్మను	116
అతులప్రేమ	497
అదియట్లుండె	540
అదియెద్దియంటేని	549
అదియొండె	465
అద్దమరే	527
అద్ధావాగ్విబుధ	220
అధరసుధ	500
అనభిజాతు	373

గద్యపద్యములు.	పుట.
అనయమునంద	301
అనయమురాగ	425
అనవుడునల్ల	185
అనిగీష్పతిమతము	547
అనితలంచి	138
అనినంజేయెత్తి	171
అనినఁగేళి	200
అనినఁ జనివిన్నవింప	612
అనినఁజెవిమూసి	550
అనినఁదత్సత్య	552
అనినఁదద్భక్తి	143
అనినదనుజుండు	563
అనినదేహార్పణము	558
అనిననతండు	172
అనినసాతని	555
అనినమరాళి	455
అనినమాఱు	144
అనినవలాఁతుగఁ	582
అనినవదవద	141
అనినవారలు	466
అనినవినిమాతంగుండు	559
అనిన సాలకటంక	564
అనినన్ స్రగ్విణి	456
అనిననాతండ్రి	610
అనినుతియింపఁగా	243
అని పరస్వరూప	605
అనిపలికి	279
అనిపలుకు	280
అనిప్రస్తుతించి	588
అనిమిష	83
అనిమిషముని	444
అనిమేలంబుసేసికొని	457
అనియలుకు	282
అనియిట్లుత్రపా	450
అనియిట్లుధరణీ	609
అనియిష్ట	10
అనియొంటిపాటునం	460
అని విన్నవించినఁ	38
అనివిన్నవించిన	369
అనుచునుద్విజులూరి	607
అనుచువెడలి	181
అనుటయుఁజెల	452
అన్యాయంబున	175
అపమార్గత	529
అపుడపళ్కు	316
అప్పలుకులువిని	285
అప్పుడనోన్యన్య	343
అప్పుడిచ్చకులగు	266
అప్పుల్వారిధిచేత	344
అప్పెనువేసవి	131
అబ్రహ్మణ్యము	607
అభినవకువలయ	457
అభిరతి	34
అమ్మహీవల్లభుండు	111
అమ్మహీసుర	65
అయనిష్ఠుర్	349
అయ్యిందువదన	438
అరిధారాఖండిత	622
అరుణాంశుండు	480
అర్కమండలి	356
అఱచేతివ్రాలు	576
అలజలరాశి	317
అలపన్నిద్దఱు	9
అలపర్జన్యుఁడు	299
అలపర్జన్యుఁడు	290
అలమలయాది	336

గద్యపద్యములు.	పుట.
అలరుఁబురంబు	59
అలరెఁబ్రియాళి	500
అలసతఁబరున్న	179
అలుకతమన్న	466
అలుకర్ణఘోటక	36
అళిగరుదంచలా	332
అళులేతద్వద	499
అవధరింపు	150
అవధరింపు	218
అవధరింపుము	416
అవధరింపుము	521
అవభృథాప్లుతో	182
అవమతిఁబితృఘ్ను	177
అవనిసపుడు	485
అవిదితపురందరా	593
అశ్రాంతజంగమా	263
అసియుఁబాత్రియు	539
అసురేంద్రాళయ	234
అస్వస్థతస్థుఁడోడి	279
అహారహంబు	522
అహితుఁడువేఁడిన	391
ఆ	
ఆకేశిధ్వజా	164
ఆజ్ఞవలయున్నృపతి	372
ఆటవికవశ్యకలన	380
ఆతఁడఘమర్షణ	590
ఆతఁడు ముఖ్య	525
ఆతనువుల	442
ఆతిథ్యము	151
ఆత్మకానిమేన	190
ఆత్మవత్సర్వ	442
ఆదినారాయ	156
ఆనతిఁబడి	144

గద్యపద్యములు.	పుట.
ఆనవలాయలంతి	440
ఆనిష్ఠానిధి	70
ఆనృసింహ	26
ఆపాలుగూటనే	380
ఆపురసాధ	83
ఆభావనాత్రయంబు	201
ఆభిచారఘున	401
ఆయతభుజైక	421
ఆయతయుష్మదాకృతి	241
ఆయతికాని	377
ఆయీశ్వర	24
ఆయొదనునొక్క	285
ఆరాజుమహిషి	267
ఆర్వెఁగఁదీర్వెఁగ	456
ఆలుపతిభక్తి	406
ఆశీవచః	53
ఆవనజాక్షి	515
ఆవిభునవంత	27
ఆవేశంబతి	219
ఆసపదుదురె	189
ఆసుధాధామ	19
ఆస్థితాహీంద్ర	216
ఇ	
ఇంతరెన్నాళ్ల	176
ఇంగిలీకంబుర్ణ	224
ఇంతి దోయిట	620
ఇందమంతటి	90
ఇందుకులావతంస	106
ఇటువంటివి	561
ఇట్టిరూపకోటు	206
ఇట్టొనఁగూర్చి	573
ఇట్లలంకృతయై	616
ఇట్లు చెట్లువెడలి	577

గద్యపద్యములు.	పుట.
ఇట్లుజయించి	284
ఇట్లుతనదివాకీర్తి	526
ఇట్లుపాటచ్చరులు	579
ఇట్లు భాగవత	586
ఇట్లుశరత్సమయ	359
ఇట్లుసాంద్ర	330
ఇట్లెదుర్కొని	244
ఇడిసినయిడుపుల	527
ఇతనికథ	263
ఇతరులఁనీరు	555
ఇత్తెఱంగున	71
ఇత్తెఱంగున	470
ఇదికర్ణాట	73
ఇదిసైరామన	622
ఇదిపాత్రప్రమారేశ్వర	217
ఇదిభూమండన	149
ఇదియంధ్రోక్తి	520
ఇదిసింహాచల	414
ఇనరశ్ముల్లవ	295
ఇన్నదవడిన్	571
ఇప్పింతురాత్మ	382
ఇలఁగలవస్తు	436
ఇలఁబాదద్వయి	96
ఇలకుంగల్గిన	296
ఇలకుడికిచుట్టి	291
ఇలకుక్ ప్రేఁగుగ	340
ఇలవసుధాసమత్వము	337
ఇలుగలసైన	459
ఇల్లిల్లు దిరుగ	322
ఈ	
ఈకుఱఁగటి	549
ఈమాటన్బొరపొచ్చెము	557
ఈవేళబలియు	178
ఈసర్వంసహా	554
ఉ	
ఉండుదుఁ జోళభూమి	571
ఉండునప్రాణులు	205
ఉదుటుగుబ్బలు	80
ఉన్నట్లయుండ	136
ఉపరిస్థజన	92
ఉమియఁగఁ దన్ను	102
ఉరవడిఁబోరికై	100
ఉరవాచాగంబు	385
ఉరుశక్తిక్ మధు	492
ఉర్విఁగాదంబినుల	290
ఉఱుముని	318
ఉలుపాల్పట్టిన	259
ఉవిదనిద్దంపు	437
ఉవిదయానీదు	280
ఊ	
ఊఁతనీరుచెలఁది	562
ఊదుకొనఁబడుమధూళిక	502
ఊరీకృతపాండవ	216
ఎ	
ఎంతకుఁదెచ్చెనే	463
ఎంతేవేడుకయైన	608
ఎక్కడిరాజ్యవైభవము	136
ఎచ్చోఁగజఘోట	398
ఎట్టాయిట్టగునయ్య	557
ఎడపకమున్నుమింటిపయి	294
ఎదురేఁగి	63
ఎన్నఁదులావు	184
ఎన్నినుఁగూర్తు	13
ఎప్పుడు వారిఁగని	226
ఎఱుఁగనగుక్	387
ఎఱుఁగరుగా	454

గద్యపద్యములు.	పుట.	గద్యపద్యములు.	పుట.
ఎలగోలుజల్లు	298	కడిఁదివిలుచేఁది	424
ఎలనీటిదొండలంబు	530	కదుపుమహోత్సుధఱ	556
ఎలసియెశ్రాద్ధు	467	కతిపయోక్తుల	152
ఎలమియుఁగాంత	230	కదళిగభీర	70
ఎవ్వఁడీసర్వ	282	కదళిదివియించె	434
ఎవ్వనిచూడ్కిఁజేసి	551	కనివినతుం డై	278
ఎవ్వరునట్లపో	451	కనుఁగవఁ దన్ను	423
ఎసఁగుకట్టావి	123	కనుఁగొని విస్మయం	418
ఏ		కన్నొకటి	387
ఏనవిద్యవలన	189	కపిలగవిసర్పిఁ	472
ఏపట్టున విసువక	371	కమలదళేక్షణ	427
ఏరాజ్యంబు నరుండు	550	కయ్యంబున	585
ఏలానొంచెద	563	కరధృతదరారి	413
ఏవీటసతుల	75	కరముపొగరెక్కి	331
ఒ		కర్కశుఁడంట	287
ఒకచిమురుఱసస్య	297	కర్తభుక్తికొఱకు	207
ఒకటికిరోయకుంటఁ	384	కలఁడొకరుండు	521
ఒకనాఁడామ్రాంతు	416	కలధౌతద్రవచిత్ర	619
ఒకమఱిబుద్దగింత	233	కలమపుబెండుగల్	62
ఒక్కనాఁడతండు	366	కలయఁగ వారిదేవతలు	355
ఒక్కనాఁడు	260	కలయన్నీల	46
ఒక్కనివిరివికి	375	కలశపాథోరాశి	17
ఒదవెడుజవ్వనంబు	429	కలసియొకకొంత	223
ఒల్లఁబొమ్మన్న	448	కలికితెలిగన్నుఁగవ	616
ఒసఁగి రగస్త్రాళి	353	కపటవటుఁడించి	581
ఓ		కవిసింగల్పొంత	576
ఓహారిసాహారిం	300	కాంచియాతఁడొక్క	530
క, ఖ		కాంచెనైవ్వష్ణవుఁ దర్థ	529
కంజహితాస్తోదయ	346	కాకోదరాహితుల	310
కండకన్నులవాని	534	కాద్రవేయులు	78
కంధరనీలవర్ణ	519	కానఁదటిచ్ఛల	137
కచపక్తఫణి	33	కామినిమేఘరంజి	510
కటిసుండి	580	కార్యమొక్కఁడు	381

గద్యపద్యములు.	పుట.
కాలునిదున్న	320
కావునవట్లైన	365
కినిసి వలఁతేఁడు	475
కుండలిద్వీప	414
కుందరదాగ్ర	471
కుంభజుఁడు	338
కుడుపున నొకకడి	383
కుప్పసముల్	479
కుముదసరస్తట	512
కురిసినక్రింది	494
కుసుమములెల్ల	485
కూరిమిఁ గృష్ణరాయ	32
కృతపయఃపాన	292
కెరలుప్రవంతిపై	338
కేకివ్రజంబె	306
కేవలశరీర	269
కొంగవాల్	583
కొండయుంబోలె	553
కొనిపోయిధర్మ	419
కొలనఁగరి	352
కొలుతు సర్వేశు	603
కొలువై బహు	139
కోరకితనారికేళ	45
క్రేపుఁదలఁచి	351
క్రౌంచమొలకొన్ని	355
క్షమఁ గుఱుమన్నె	396
క్షితిపాలకృష్టిఁ	240
క్ష్మావళారక్త	483
ఖండితపూగీ	473
ఖనటత్పయోధి	3

గ, ఘ

గద్యపద్యములు.	పుట.
గండద్వంద్వగళత్	342
గండాభోగములన్	524
గగనమునీరుబుగ్గ	68
గగనరంగస్థలంబున	303
గగనలక్ష్మినిజోరు	343
గజఘోటస్యంద	360
గడినృపులరాయ	397
గడివాఁడుచెడుగొ	400
గబ్బునమక్షికంబయి	165
గళమునఁగట్టె	620
గిరులఘట	313
గిఱికొనుగోపురా	86
గురుగుంజెంచలి	328
గురుదక్షిణ	183
గుహాపుష్కరిణీ	39
గూండ్లకై శాలి	346
గృహసమ్మార్జనమో	142
గొడుగులగాలి	324
గోపురకందరాళి	592
గ్రక్కునఁదనపూర్వ	370
గ్రక్కునక్ ప్రత్యుత్పన్న	462
గ్రామగ్రామంబున	130
గ్రావాళింగేతకీ	312
గ్రీష్మసమయవిరుత్సాహ	274
ఘంటాకర్ణుని	559
ఘనగతశంప	84
ఘనమగు నాఁకురాలి	501
ఘనవృష్టికతన	309
ఘనసౌధాళి	81
ఘనుఁడై లిప్తక్షితీశా	20
ఘుణగణవిహరణ	333
ఘోరాపారమహౌఘ	242

చ, ఛ

గద్యపద్యములు.	పుట.
చంచలనేత్ర	513
చంపకు చదువుల	545

గద్యపద్యములు.	పుట.
చంపిధార్మికుండు	407
చక్రస్తనప్రకాశము	358
చదివియధర్మభీరు	374
చనికాంచెక్	589
చమురైనతోల్కుబుసంబు	522
చరణంపుసరపణి	591
చలమునసింగిణీ	95
ఛాలదళంబుగా	57
చిగురుఁబికాళికిన్	507
చిగురుఁబోట్లపు	225
చిత్రము కృష్ణరాయ	31
చిరసముపాత్రితాగ్ని	99
చిలువసుధా	481
చెందునెఱసంజ	317
చెదవిఱిగి	164
చెలువగర్భగృహప్రద	473
చెలువముదాల్చి	446
చేయునది రాజ్యమఁట	409
చోళీహల్లక	590
ఛిద్రప్రహారి	179
జ	
జగదుద్గలిక్తిని	154
జనకాఖ్యాఖిల	162
జనవరతపము	176
జనిసాహస్ర	193
జన్మములుచేసి	360
జయజయదానవ	228
జయదురుత్తరణ	586
జలచరకిటి	72
జలజదళస్థ	339
జలధరముప్వతో	315
జలపూరప్లవమాన	232
జలవసుధాంబర	191

గద్యపద్యములు.	పుట.
జాత్యుచితచరిత్రమ	522
జుఱుజుఱుకున	167
త	
తక్కుముమిగుల	374
తద్జ్ఞమండలి	402
తటిదుత్సారిత	318
తడితలడిగ్గిముంప	316
తడియొత్తిసన్న	615
తతతనువురాహు	307
తల్పితామహుఁడైన	362
తదనంతరంబ	483
తనకువఁదఱు	450
తనతోయంబినరక్షు	292
తనయుంపరంబునం	487
తనరాష్ట్రము	175
తనరెబలిభుక్తరులు	326
తనసౌందర్యము	445
తనిమంబచ్చ	308
తనునంటన్	448
తనుభృశ దమనజ	408
తనుమధ్యవళీ	432
తనువుఁగొమ్ము	166
తమతండ్రిశ్రీశదత్త	439
తరణిఖరకిరణ	115
తరుణత్వత్సుత	242
తరుణశైవాల	79
తరుణితనుకాంతి	437
తరుణులకౌఁగిటన్	495
తరుణులుదోహదాన	495
తరుణుల్దల్లి	127
తలఁబడ	54
తలఁపోసి	516
తలిరుంగైదువు	467

గద్యపద్యములు.	పుట.
తళుకొత్తున్భుజకీర్తి	428
తానవంబుగ	397
తానుసురమాని	441
తామరసాప్తతామ్ర	469
తారుణ్యాలిగ	129
తారెట్లట్లుగా	430
తెగిచిననడుగులు	535
తీలగుకంతువెంబడిన	126
తునియలు	28
తులలేరుండు	158
తెచ్చియొకవైష్ణవుఁడు	366
తెలినులివెచ్చ	68
తెలియఁగవచ్చె	474
తెలిసికనుదెఱచి	464
తెలుఁగదేల	14
తెవులయినం	540
తోడఁబడనమ్మ	122
తోడఁబడవిషయా	364
తోడువింటివాఁడు	578
తోలఁగెను	27
తోలితోలివచ్చు	293
తోలుదోల్త	29
తోల్లిజామదగ్న్య	159
తోఁటఁబగలుండి	130
త్రోచిపోఁజూడఁ	537
త్రివిధోత్పాత	393

ద, ధ

గద్యపద్యములు.	పుట.
దండపారుష్యంబు	392
దంభాపేత	101
దరులకడివండు	343
దలమగుచంద్ర	91
దవధూమంపు	114
దవులఁజల్లని	325
దానత్యాగ	109
దానముద్విజరక్షణ	406
దిక్పాలతనువెత్తి	561
దిగ్గియనంచతూఁడు	493
దినములవెంబడిం	294
దివిజద్రుప్రసవంబు	462
దివిజద్వేషి	229
దీనిచూపెదురెక్కఁ	605
దుగ్ధాంభోధి	413
దుర్గములాప్తద్విజవర	372
దేవా యిట్లని	281
దేశవైశాల్య	385
దోర్ధూర్ధృత	148
ద్యుమణికరాళి	304
ద్రవిడకుటుంబినుల్	53
ద్రవిణమునొవ్వ	390
ద్రుహిణజ	148
ద్రుహిణాండకరండ	519
ద్వారంబుసొచ్చి	276
ద్విజతఁగాంచియు	491
ద్విద్వయోపాయ	104
ధనధాన్య	171
ధనముఖ్యము	376
ధన్యుఁడనైతి	671
ధరణినసాధ్య	378
ధరణిపుఁ డెందు	395
ధరపైనీతఁడు	443
ధూళియడఁగిన	311
ధృతరఘూత్తమ(పా.వృతరఘూత్తమ)	429

న

గద్యపద్యములు.	పుట.
నఖముఖోజ్ఝిత	453
నటనపరకేళి	314
నన్నింతలయించిన	538

గద్యపద్యములు.	పుట.
నరనాథపాంచభౌతిని	191
నరనాథయారాజ్య	187
నరపతిపల్కె	169
నరవర యిటు	212
నల్లఁగ్రోలనిచ్చి	365
నవవయస్సీధు	424
నాఁడుమనమున్న	461
నాకేటికి నిక్షేపము	367
నానావిధపాదపముల	408
నానిశిఖవంట	322
నారాయణభూ	603
నావిన్నవింప	40
నావుడువార	183
నాసాచంపకర్ణ	426
నాసీరుఁడగుచు	613
నింగిటు	99
నింగియత్తఱి	348
నిండోలగంబు	15
నిజభుజాక్రీత	22
నిడుదమధూళి	493
నిత్యంబుర్వీ ప్రతి	151
నిదురయుఁగూడదు	546
నిమిషంబోత్పన్నల	185
నిర్ఝరప్రబల	111
నిలుమోహో	545
నీచెఱుఁబాసి	552
నీతిందానతలంచి	375
నీయిచ్చయొ	143
నీరంధ్రకుసుమధారా	227

గద్యపద్యములు.	పుట.
నీ: శేషణుఁడ	335
నీలమేఘము	10
నీవేమంటివి	153
నీ నేమంటివి	284
నుతి వాఁడునాఁచు	117
నృప కృతార్థుండ	213
నృపులపదహాలరేఖల	102
నెట్టన యల్ల లచ్చి	609
నెమ్మినేకావళి	614
నెలఁతనుచకుంభ	513
నేఁడుమహామతి	141
నైపుణిఁజందనాద్రి	486
నోరిసనినుండకే	581
న్యాయార్జితవిత్తంబున	67
ప, ఫ	
పంకమడుగంటి	353
పంగమైనను	282
పగదపుఁజాయ	44
పగయుం వగయుం	177
పగవెలిఁగని	382
పడమరవెట్ట	114
పద్మాస్యపురి	88
పద్మాస్యప్రతిదిన	470
పన్నిటితోఁగదం	133
పరపురుషునికంటె	604
పరలోకసుఖ	180
పరిఖుందర్పుర	78
పరిచక్రసురభి	132
పరుషాతపతప్తంబగు	353

గద్యపద్యములు.	పుట.
పలపలవేగ	163
పలికితుత్వేప్రిష్టో.	12
పలుకులువేయుం	391
పవల్లెదీర్ఘికా	124
పవిధారాపతనంబు	237
పసలేదు	577
పసిఁడిగచ్చుమర	276
పాటలవసుంధరారుహ	111
పాటీరగిరివన	107
పాత్రభూతు	405
పాథోధిజల	42
పాలుగలవాఁడు	173
పితృదేవక్రియలకు	406
పిడికెఁడుకొను	8
పిడుగులకల్కి	324
పుట్టవెదలి	296
పుత్త్రియుఁడా	516
పునుఁగుందావి	69
పురియేగించి	223
పురోహిత	213
పులిమలడిగి	178
పులుమఖశాలి	165
పూఁతనీరుచెలఁది (పా. ఊఁతనీరు)	562
పూచినమావుల్	491
పూజలకుచేఁ	607
పూజాదంభములర్	512
పూనిముకుందునాజ్ఞ	5
పెంబోతద్దాసరి	237
పెళపెళమబ్బు	305

గద్యపద్యములు.	పుట.
పైనవిలంబు	93
పొత్తమిటుసేయ	15
పొలమరులందు	166
పొలయుంగాడ్పులు	60
పోనిందన్నవయస్య	452
పోరానిపట్ల	399
పోవంబోలు	390
ప్రఖ్యాతుండవు	548
ప్రజ లవసిచన్న	385
ప్రణిధిస్వపుర	407
ప్రతతప్రాంత	98
ప్రతతోర్ధ్వాధర	9
ప్రతికుసుమకల్పమునఁ	515
ప్రతిదినమునిట్లు	473
ప్రతినవలదువైరి	399
ప్రబలరాజాధి	38
ప్రభాతంబునం	275
ప్రభుతఁబరమేశ్వరుం	612
ప్రభువులరిగిరి	260
ప్రళయారోత్కర	445
ప్రాణికోటికెల్ల	196
ప్రాతర్వేళల	119
ప్రాశించిననీరంతయు	352
ప్రియపరిరంభణ	476
ఫలశలాటులు	496
ఫీట్కారప్రవదప్ర	447

బ, భ

బంధురరథాంగ	40
బద్ధాంజలిపుటు	181

గద్యపద్యములు.	పుట.
బలద్విడ్వినిర్దిష్ట	72
బలమదమత్త	22
బలశివహల్లక	56
బలిదైత్యేయ	235
బలిమింద్రుంపుఁగ	219
బలుసెకనించువిల్లు	302
బహివర్ద్దద్విజా	572
బాలార్కాంశు	71
బాసలుబండికండ్లు	556
బాహుజాంఘ్రిజ	377
బెదరిచేరనిబలియుండి	392
బోటిగట్టినచెంగల్వ	472
భండారములోవాయ	383
భక్తిఁద్రోవకు	145
భరితనిజాంబు	115
భాండాగార	376
భువినరక్షైరవ	350
భూపల్లభుఁ	275
భ్రమరగీతిక	511
మ	
మణియష్టిఁగేలి	329
మదగంధ	103
మదనస్యందనతా	482
మధువుఁగాంతల	498
మనకనురక్తి	58
మనమునకెద్ది	200
మనమునకొందుకొందు	399
మనయానిమివంశం	190
మనుదండధరాదులు	410
మరుదాధమలయాహి	489
మరులుఁదీఁగె	527
మర్దితకాళియ	39
మఱియుఁగోరిన	182
మఱియు నతని రాజ్యంబు	361
మఱియు నప్పురంధ్రి	267
మఱియు నీరహస్యంబు	270
మఱియు బ్రహ్మచర్యాదు	197
మఱి వనమాలి	619
మలఁచిపయోజ	41
మలయకటకోటజ	478
మలయతరు	478
మలయపుగాలి	61
మాత్రసంచి	133
మిగులదామని	301
మిలిగదవర్గ	231
మీటగుమీలనెల్ల	118
మీనోడివిన	180
మీపాడిన	441
మీపెద్దలు	367
మీపెద్దలుకూర్చిన	369
మీరెవ్వరనుటయు	464
మీవంటిభాగవతులు	558
ముంగాళ్ళఁజాఁగి	532
ముడివిప్ప	97
ముదిమదిఁదప్పి	610
మునుదనసీమ	378
మునుపనవల్ దమిఁ	438
మునునాచెప్పిన	201

గద్యపద్యములు.	పుట.
మనుపేచంద్రజలంబు	477
మునుమున్నెల్లప్పుడు	234
మున్నెన్నిన్నిన	206
ముల్లుదలకొసని	366
మృగమదాలేపమును	481
మృతమర్త్య	533
మెండుమీఱిన	120
మేకొనితాఁచినం	498
మేలగుఘోటక	381
మొగిలుమైచీఁకటులు	310
మొగిలఁవిరియెండ	349
మొదలనాముక్త	474
మొదలనుపేంద్రుఁడై	444
మొదలబెయొరుదల	378
మొదలఁబెనిచి	373
మౌనిక్రోధవిధూత	94
మ్రొక్కినట్టికనయ	611
య	
యమనియమాది	147
యాదవసార్వభౌమ	7
యామునాచార్య	261
యూపకద్రవమున	615
యోగసామ్రాజ్యంబు	363
ర	
రంగపతి బ్రహ్మ	611
రయమునవృష్టికై	326
రవిఁజూచి	319
రవియనుదివ్వెఁ	85
రవిశశిముఖర	333

గద్యపద్యములు.	పుట.
రాజమరాళ	330
రాణింపఁబల్కి	401
రాష్ట్రమెరయింపు	400
రాష్ట్రవర్ధన	371
రేవుల్ మావు	389
ల	
లలనచే నిమ్మతో	620
లలనమృదు	427
లలనోపరి	437
లలితోద్యాన	41
లాలన నారఝుల	386
లావుగలయట్టి	145
లేఁగాఁడిఁగ	433
లేచి పోవంగఁ	575
లేలెమ్మనుటయుం	180
వ	
వకుళాలంకృత	215
వచ్చురిపు	170
వనజజరుద్రా	269
వనజలివరాహ	288
వనధిగమనజ	289
వపురుపభోగ్య	191
వరుఖులడి	321
వర్గత్రయపరత	138
వలరాజుకుటుంబము	435
వలగబెదర	170
వసరుల్వెల్వడి	327
వసుధంబుత్త్రాదిక	364
వసుధలాసెట్టి	434

గద్యపద్యములు.	పుట.
వాఁడిఁబోదలు	382
వాఁడునుగంటి	535
వాతెఱలొంటి	419
వా దపహత	158
వాదమొనరించి	139
వాదులమటంచు	279
వానికిఁబురూర	19
వానివంశంబు	20
వారించినీరు	183
వారిమిగిలి	383
వారిరువురు	163
వాటికకన్నులం	463
వాలినిర్భేదవా	622
వింగడంబై నట్టి	267
వింగడమైన	417
విజ్ఞానమున	196
విడుఁడనిపీడు	186
విడువక మీ గానము	452
వితరణఖని	21
విద్వద్వందితుఁ	156
విధిగృహాఞయ	602
విని శద్గ్రంథార్థము	135
వినియొసెలల్	135
విపుఁ డీఁదగు	612
వినుకేశిధ్వజ	187
వినుజనేశ్వర	194
వినుమొకమాట	539
వినువర్గ సమత	408
వినువార త్రయ	388

గద్యపద్యములు.	పుట.
విన్నవించుటయు	167
విరహితలిమీఁది	430
విల్లిపుత్తూరిలో	141
విల్లుం దానుచు	379
విశదపయోజపుం	345
విశేషించియు నపూర్వ	379
విశ్వకర్మయుం	244
విష్వక్సేనపూర్వ	611
వీఁడెదరున	384
వీడెంపుఁబలుకెంపు	49
వీరనృసింహుఁడు	26
వీరుద్ద్రుమిథున	487
వృతరఘూత్తమ	429
వృషశైలఝుర	363
వృష్టితటినిడ్డ	354
పెదమొదవు	351
పెట్టిశైవంబు	263
వెలఁదియానీదంత	86
వెలఁదికటిపేర	433
వెలఁదికలితాప	511
వెలయించునట్టి	409
వెలివాడఁబని	574
వెలుతురసలంటి	357
వేత్రములఁగేలఁ	593
వేదవేద్యమైన	220
వేవినమేదపై	52
వ్రతిహంతృతాత్త	506
శ	
శంఖసామ్యంబు	426

95832

వావిళ్ల రామస్వామిశాస్త్రులు గారి ఇతర రచనలు

అల్లసాని పెద్దనామాత్య ప్రణీత

మను చరిత్రము

రుచి సమానంబగు వ్యాఖ్య,
ప్రతి పదటీకాతాత్పర్య సహితము
(శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి విశిష్ట పీఠికా
సమన్వితము)
ధర. రూ. 150/-

ద్వాదశోపనిషత్తులు

ఆంధ్ర వచనము

వేదాంత గ్రంథములలో ఉపనిషత్తులు ప్రముఖ స్థాన మాక్రమించి యున్నవి. అట్టి ఉపనిషత్తులను ప్రతివారును సులభముగా గ్రహించుటకై వచన రూపములో యీ గ్రంథము వ్రాయబడినది. ఇందు. 1. ఈశ, 2. కేన, 3. కఠ, 4. ప్రశ్న, 5. ముండక, 6. మాండూక్య, 7. తైత్తిరీయ, 8. ఐతరేయ, 9. ఛాందోగ్య, 10. బృహదారణ్యకములు ప్రసిద్ధమైనవి. ఇవిగాక ఆదిశంకరులు భాష్యము గావించిన శ్వేతాశ్వతరోపనిషత్తు, నృసింహతాపిన్యుపనిషత్తుకూడా యిందు గలదు.

ధర. రూ. 120/-